తగదీ ప్రయాణం!

వర్షాలతో గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కోసింగి గెడ్డ ఉప్పొంగడంతో డుంబ్రిగుడ గిరిజనులు నిత్యావసర సరకులు తీసుకుని పీకల్లోతు నీటిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గెడ్డ దాటి ఇంటికి తీసుకెళ్తున్న చిత్రమిది. - డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

తప్పదీ సాహసం

కాలువలో పిల్లలను దాటిస్తున్న స్థానిక యువకుడు బాబి

గూడెంకొత్తవీధి మండలం జి.తీములబంద గ్రామంలోని గిరిజన బాలలు గ్రామానికి అవతలవైపు ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే కాలువ దాటాల్సి ఉంది. గురువారం చిన్నారులు ఆ కాలువ దాటేందుకు భయాందోళన చెందగా.. స్థానిక యువకుడు బాబి అందులో దిగి వారిని వాగు దాటించారు. పట్టు జారితే ప్రమాదమని తెలిసినా.. పిల్లలను బడికి పంపించేందుకు సాహసం చేయాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు.
- గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

జలదిగ్బంధంలో గండిపోశమ్మ గుడి

అమ్మవారి పాదాలను తాకిన వరద

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. గురువారం సాయంత్రానికి రెండు అడుగుల మేర నీటిమట్టం పెరగడంతో అమ్మవారి పాదాలను వరద తాకింది. అప్రమత్తమైన ఆలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మీకుమార్ అమ్మవారికి చెందిన సామగ్రిని పురుషోత్తపట్నం తరలించారు. ఆలయాన్ని ఆనుకుని ఉన్న దుకాణాలను స్థానికులు ఖాళీ చేశారు. రాత్రికి నీటిమట్టం ఇంకా పెరిగితే దర్శనాలను నిలిపివేయడంపై నిర్ణయం తీసుకుంటామని ఈఓ చెప్పారు. డి.రావిలంక - దండంగి గ్రామాల మధ్య రహదారిపైకి నీరు చేరింది. దండంగి పరిసర ప్రాంతాల నుంచి పురుషోత్తపట్నం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. సీతపల్లి వాగుకు గోదావరి పోటెత్తింది. - దేవీపట్నం, న్యూస్‌టుడే

ఆలయ మండపంలోకి చేరిన గోదావరి వరద

చదవాలని ఉంది సారూ..

గురుకులాలు, ఆశ్రమాల్లో సీట్ల కొరత

అరకులోయ, న్యూస్‌టుడే

చదువు జీవితాన్ని మారుస్తుందని గిరిజనుల్లోనూ నమ్మకం పెరిగింది. అందుకే గతానికి భిన్నంగా గిరిజన విద్యార్థులు చదువుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ ఆశ్రమాల్లో డిమాండ్‌కు సరిపడా సీట్లు లేకపోవటంతో తల్లిదండ్రులు, పిల్లల కలలు కల్లలవుతున్నాయి. విద్యార్థులు రోజూ పాఠశాలలకు వెళ్లి, వచ్చే పరిస్థితులు మన్యంలోని చాలా గ్రామాల్లో లేవు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని వసతులున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చేర్చడంపై ఆసక్తి చూపిస్తున్నారు. కానీ తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా సీట్లు అందుబాటులో లేక పిల్లలతో కలిసి పాఠశాలల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

జిల్లాలో సుమారు 140 వరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కొన్నింట్లోనే సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. దీంతో అలాంటి చోట్ల డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. అరకులోయ మండలం రవ్వలగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలోనే ఈ ఏడాది ఆరో తరగతిలో 200 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. ఇంకా చాలామంది చేరడానికి ముందుకొచ్చినా తగిన వసతి లేని కారణంగా అధికారులు నిరాకరించాల్సి వచ్చింది. ఈ పాఠశాల రోడ్డు పక్కన ఉండటం.. కావాల్సిన అన్ని వసతులు ఉండటమే డిమాండ్‌కు కారణం.

★ అరకులోయ నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలు కేవలం 10 మాత్రమే ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో కేవలం 500 మందికి మాత్రమే ఏటా ప్రవేశాలు లభిస్తున్నాయి. ఆరో తరగతిలో చేరడానికి వేల సంఖ్యలో విద్యార్థులు పోటీపడుతున్నారు. దీంతో వందమందిలో అయిదు నుంచి పది మందికి మాత్రమే అవకాశం లభిస్తోంది. కొందరు తల్లిదండ్రులు ఏకంగా సిఫార్సు లేఖలు పట్టుకుని గురుకులాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. డిమాండ్ ఎంతగా పెరుగుతున్నా జిల్లా అధికారులు గత పదేళ్లలో నూతనంగా ఒక్క గురుకుల పాఠశాలనూ ప్రారంభించలేదు. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా సీట్ల సంఖ్య పెంచకపోతే ఎలాగని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో గురుకుల సీట్లు పెంచాలని గత ఏడాది స్వాక్షాత్తు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఉన్నతాధికారులను అభ్యర్థించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేదు. విద్యార్థుల సంఖ్య పెంచితే సౌకర్యాలు సరిపోవనేది ఉన్నతాధికారుల వాదన. సౌకర్యాలు పెంచటానికి గురుకుల పాఠశాలల ఉన్నతాధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సమన్వయకర్తలుగా ఉంటున్న ప్రిన్సిపల్స్ వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టటం లేదని పలువురి వాదన.

ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థినులు

★ ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రజనిని వివరణ కోరగా.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ముఖ్యంగా బాలికల ఆశ్రమ పాఠశాలలను అదనంగా మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

డుంబ్రిగుడలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయం

ఏకలవ్యకు బాలారిష్టాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: హుకుంపేటలో ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయ ప్రారంభానికి అడ్డంకులు తొలగడం లేదు. సుమారు 11 ఏళ్లుగా సొంత భవనాలకు నోచుకోలేక గిరిజన విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పటికీ అరకులోయలోనే పాఠశాల కొనసాగుతోంది. పాఠశాల నిర్మాణానికి భూములిచ్చిన బాధిత గిరిజనులు ఉపాధి కల్పించాలని ఆందోళన చేపడుతున్నారు. ఉన్నతాధికారులు ఒకరికే ఉపాధి కల్పించి.. మిగిలిన బాధితులను విస్మరించారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఈనెల 15 నుంచి పాఠశాలను డుంబ్రిగుడలోనే కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. భవనాల్లో చిన్నపాటి పనులు చేయాల్సి ఉంది. ఇటీవల ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బాధితులు పనులను అడ్డగించడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ బాధితులతో మాట్లాడి హామీ ఇచ్చారు. తమకు ఉపాధి కల్పించకుండా భవనాన్ని ప్రారంభించకూడదని వారు పనులను అడ్డుకుంటున్నారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు బాధితులతో మాట్లాడినా పరిష్కారం కాకపోవడం, ఏకలవ్య విద్యాలయ ఉన్నతాధికారులు బాధితులకు ఉపాధి కల్పించడంపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు ఉపాధి కల్పించి, పాఠశాల ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అల్లూరి స్మారకం.. అభివృద్ధికి దూరం!

నేడు మన్యం వీరుడి జయంతి

కొయ్యూరు, న్యూస్‌టుడే

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక ఉద్యానాల అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. పాలకులు, నేతలు.. అల్లూరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు వచ్చి హామీలు ఇచ్చి వెళ్లడం తప్పితే వాటిని నెరవేర్చిన దాఖలాలు లేవు. గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. అల్లూరి నడయాడిన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం అల్లూరి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం

మంప, రాజేంద్రపాలెంలలో అల్లూరి స్మారక ఉద్యానాల అభివృద్ధికి గతంలో అప్పటి రాజ్యసభ సభ్యుడు సురేష్ ప్రభు రూ. 50 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. మంపలో 2022 మే 7న అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో 18 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాజేంద్రపాలెంలో అల్లూరి అనుచరులైన గాం గంటన్నదొర, మల్లుదొర, పండుపడాల్ విగ్రహాలను అప్పటి ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ఆవిష్కరించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు తప్పితే ఎక్కడా పనులు చేయలేదు. అల్లూరి సమావేశాలకు స్థావరంగా ఏర్పాటు చేసుకున్న మంప సమీపంలోని ఉర్ల కొండ గృహ అభివృద్ధి జాడే లేదు. వల్సంపేట జలపాతం వద్ద రోప్‌వే ఏర్పాటు చేస్తామన్నారు తప్ప ఏమీ చేయలేదు. మంపలోని ఉద్యానానికి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మెరుగులు అద్దారు. చెరువును సుందరంగా తయారు చేసి.. దాని మధ్యలో అల్లూరి ధ్యానం చేస్తున్నట్లు విగ్రహం ఏర్పాటు చేశారు. రాజేంద్రపాలెం ఉద్యానం కళాహీనంగా దర్శనమిస్తోంది.

అభివృద్ధికి నోచుకోని రాజేంద్రపాలెం ఉద్యానం

జయంతి నిర్వహణకు ఏర్పాట్లు

అల్లూరి జయంతిని మంప, రాజేంద్రపాలెంలో శుక్రవారం అధికారికంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఎస్.ఎల్.వి.ప్రసాద్, ఎంపీడీఓ ప్రసాదరావు తెలిపారు. మరోవైపు వివిధ పార్టీల నేతలు సైతం ఘనంగా వేడుకలు నిర్వహించడానికి ఆయా పార్టీల కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.

వరదలపై అత్యవసర సమావేశం రేపు

ఎటపాక, న్యూస్‌టుడే: గోదావరి, శబరి వరదలపై శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దారు సుబ్బారావు చెప్పారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

1 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. సుమారు 10 వేలమంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

పట్టు పట్టి.. జీపును నెట్టి!

జీపును ముందుకు తోస్తున్న ప్రయాణికులు

వర్షాలకు మన్యంలోని రహదారులు బురదమయంగా మారాయి. అడుగు తీసి అడుగేయలేని విధంగా తయారయ్యాయి. అనంతగిరి మండలంలోని మారుమూల గోమంగిపాడు గ్రామస్థులు జీపులో గురువారం హుకుంపేట ప్రాంతానికి బయలుదేరారు. గ్రామ రహదారి మొత్తం పూర్తిగా బురదమయం కావటంతో కొంతదూరం వచ్చాక జీపు బురదలో కూరుకుపోయింది. ఎంతకీ కదలకపోవటంతో జీపులో ఉన్న మహిళలు, పురుషులంతా కలిసి కొంతదూరం వరకు తోసుకుంటూ వచ్చాక గానీ వాహనం ముందుకు కదల్లేదు. వర్షాలు పడిన ప్రతిసారీ పరిస్థితి ఇలాగే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని కోరుతున్నారు. - అనంతగిరి, న్యూస్‌టుడే

ఆగస్టునాటికి అందుబాటులోకి హోంస్టేలు

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, న్యూస్‌టుడే: ఆగస్టు నెలాఖరునాటికి హోంస్టేల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి టూరిజం కమిటీ సభ్యులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హోంస్టేల కోసం గుర్తించిన గృహాల్లో కనీస వసతులు సమకూర్చాలని సూచించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులతో మండలస్థాయి టూరిజం కమిటీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో హోం స్టేల ఏర్పాట్లపై సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వర్చువల్‌గా పాల్గొన్నారు. జిల్లా పర్యాటక అధికారి జి.దాసు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, సీపీఓ పి.వి.ఎల్.ప్రసాద్, ఏపీఎఫ్‌డీసీ డీఎం జి.కృష్ణబాబు హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

పథకాలు వివరిస్తున్న కిడారి శ్రావణ్, దొన్నుదొర, నాయకులు

హుకుంపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర పేర్కొన్నారు. కొట్నాపల్లిలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వివరించారు. వారు మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. మహిళలు, యువత, రైతులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. తెదేపా నాయకులు శెట్టి లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

అరకులోయ, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. అరకు రైల్వేస్టేషన్‌లో ఆగిన కిరండూల్ పాసింజర్‌లో ప్రయాణికుల లగేజీలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఒడిశాలో పండిస్తున్న గంజాయిని అల్లూరి జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. దీన్ని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో రైల్వేస్టేషన్లు, బస్ కాంప్లెక్స్‌లు, ఇతర రవాణా మార్గాల్లో తనిఖీలను విస్తృతం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. గిరిజన యువత గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పాడేరు డీఎస్పీ షెహబాజ్ అహ్మద్, సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కిరండూల్ పాసింజర్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ షెహబాజ్ అహ్మద్

సీలేరులో నీటినిల్వలు

సీలేరు జలాశయాలు కళకళ

సీలేరు, న్యూస్‌టుడే: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాల్లో నీటిమట్టాలు స్వల్పంగా పెరిగాయి. ఎగువప్రాంతాల నుంచి వస్తున్న నీటి నిల్వలతో ఇవి కళకళలాడుతున్నాయి. గురువారం నాటికి జోలాపుట్టు జలాశయానికి 8,936 క్యూసెక్కులు, బలిమెలకు 19,439, సీలేరుకు 1655, డొంకరాయికి 4030 క్యూసెక్కుల నీటి నిల్వలు వచ్చి చేరుతున్నాయి. గత 24 గంటల్లో 250 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో 28.91 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, ఇందులో ఏపీ వాటాగా 16.07 టీఎంసీలు ఉన్నాయి. గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో కలిపి 6.67 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో 22.74 టీఎంసీల నిల్వలున్నట్లు జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్ మేరకు కాంప్లెక్స్‌లో రోజుకు నాలుగు నుంచి అయిదు మిలియన్ యూనిట్ల వరకూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

జలాశయాల్లో నీటిమట్టాలు (3వ తేదీ సాయంత్రం నాటికి)

జలాశయం	సామర్థ్యం (అడుగుల్లో)	ప్రస్తుతం (అడుగుల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
జోలాపుట్టు	2750	2728.50	8936	3366
బలిమెల	1516	1457.10	19429	4798
గుంటవాడ	1360	1352.10	1655	1228
డొంకరాయి	1037	997.10	4030	3866

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, చిత్రంలో డీఈఓ బ్రహ్మాజీరావు, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరావునాయుడు తదితరులు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో విద్యార్థుల ఆరోగ్యంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచినా విద్యార్థులు మరణిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలలు మరణిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యకార్డులపై ఉపాధ్యాయులు, వైద్యాధికారులకు అవగాహన ఉండటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. తరగతి ఉపాధ్యాయుడు, వైద్యాధికారి, సూపర్‌వైజర్ అధికారులు ఆర్.బి.ఎస్.కె. పుస్తకంలో సంతకం చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండోవిడత దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.సింహాచలం, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారి విశ్వేశ్వరరావునాయుడు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు రజని, డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.లక్ష్మి, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.ఎన్.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

పాపికొండల యాత్రకు పచ్చజెండా

గండిపోశమ్మ ఆలయం వద్ద పర్యాటక బోట్లు

దేవీపట్నం, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో రెండు రోజులపాటు నిలిచిపోయిన పాపికొండల విహారయాత్రను శుక్రవారం నుంచి పునఃప్రారంభించేందుకు జలవనరుల శాఖ అధికారులు పచ్చజెండా ఊపారు. గోదావరిలో నీటిమట్టం పెరగడంతో బుధ, గురువారాల్లో గండిపోశమ్మ ఆలయం నుంచి పాపికొండల విహారయాత్రను నిలిపివేసిన విషయం తెలిసిందే. వర్షం తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం నుంచి పర్యాటక బోట్లకు అనుమతిచ్చినట్లు ఏఈ భాస్కర్ చెప్పారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం 27.4 మీటర్లుగా ఉందన్నారు. వరద మరింత పెరిగి నీటిమట్టం 30 మీటర్లకు చేరితే విహారయాత్రను పూర్తిగా నిలిపివేస్తామన్నారు.

పోచవరంలో నేటి నుంచి..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోచవరం రేవు నుంచి శుక్రవారం యథావిధిగా పాపికొండల పర్యాటకం కొనసాగుతుందని స్థానిక కంట్రోల్ రూమ్ మేనేజర్ రాజేశ్ తెలిపారు. వర్షాల కారణంగా రెండు రోజులపాటు బోట్లను నిలిపివేసినట్లు చెప్పారు. వర్షాలు తగ్గి మామూలు వాతావరణం ఏర్పడటంతో పర్యాటక బోట్లను పోలవరం సందర్శనకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: భారీవర్షాలకు ఏవోబీలోని డుడుమ జలాశయం నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరాయి. గురువారం నుంచి రెండు గేట్ల ద్వారా మొత్తం 1200 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డుడుమ జలాశయంలో నీటిమట్టం 2585.5 అడుగులకు చేరింది. వరద ఉద్ధృతి తగ్గేవరకు నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు వర్గాలు తెలిపాయి.

వీఎంఆర్‌డీఏ.. నాణ్యత ఏమాయే

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని శతకకారుడు వేమన చెప్పారు. అదేవిధంగా రహదారులందు.. మేము నిర్మించే రహదారులు వేరయా అన్నట్టుగా ఉంది విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) తీరు. పైపై పూతలా తారుపరిచేసి రహదారి వేసేశామంటూ గుత్తేదారు మాయ చేసినా.. కొరడా ఝుళిపించకుండా కాలయాపన చేస్తోంది. 'ప్రభుత్వ పనులేగా.. నిధులు మింగేయొచ్చు. ఎలా పనులు చేసినా అడిగేవారే ఉండరు' అన్నట్లు గుత్తేదారులు వ్యవహరిస్తుంటే.. కిమ్మనకుండా ఉండిపోతోంది.

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

గత ప్రభుత్వ హయాంలో విశాఖవాసులకు ఇళ్లు ఇచ్చేందుకు అనకాపల్లి మండలం కుంచంగిలో భారీగా ల్యాండ్‌పూలింగ్ చేశారు. భూములిచ్చిన సాగుదారులకు ఎకరాకు 18 సెంట్ల చొప్పున సర్వే నంబర్ 318, 322, 334, 335 లో ప్లాట్లు కేటాయించారు. ఈ లేఅవుట్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నది అప్పట్లో ఒప్పందం. ఇందుకోసం గతేడాది డిసెంబర్‌లో ఈ లేఅవుట్‌లో బీటీ రోడ్డు వేసేందుకు వీఎంఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. రూ. 3.28 కోట్లకు టెండర్ దక్కించుకున్న గుత్తేదారు సంస్థ రెండు నెలల క్రితం రోడ్ల నిర్మాణం పూర్తి చేసింది. కనీసం రెండు నెలలు పూర్తవ్వకుండానే లేఅవుట్‌లో వేసిన రోడ్లు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ తారు పెచ్చులూడి గుంతలు ఏర్పడుతున్నాయి. నాలుగు కారులు తిరిగితే చాలు.. ఈ రహదారుల రూపురేఖలు ఉండవు. అంత డొల్లగా నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో గుత్తేదారు నాసిరకంగా రోడ్లు వేసి చేతులు దులిపేసుకుంటున్నారు.

రెండు నెలలకే ఆనవాళ్లు లేని రోడ్డు

కుంచంగి లేఅవుట్‌లోని రోడ్డు ఛిద్రమైందిలా

★ నిబంధనల ప్రకారం ఇక్కడ రోడ్డు వేసేందుకు మొదట గ్రావెల్, సిమెంట్ మిక్స్‌తో గ్రావెల్, క్రషర్, తర్వాత మెటల్‌వేసి చివరితో తారు పోయాలి. కానీ.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అలా ఏం కనిపించడం లేదు. మట్టిరోడ్డుపై పలుచగా తారు పోసి గుత్తేదారు చేతులు దులుపుకొన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. చిన్న వాహనం రోడ్డుపైవెళ్లినా.. దారి బీటలు తేరి తారు పైకి లేచి గోతులు ఏర్పడుతున్నాయి. రోడ్లు వేసే సమయంలో నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు జరుగుతున్నాయా.. లేదా అనేది పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులదే. ఇద్దరు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారని వీఎంఆర్‌డీఏ చెబుతుండటం గమనార్హం. మరి అంత పర్యవేక్షణ ఉంటే రోడ్డు వేసిన రెండు నెలలకే రోడ్లు ఎలా పాడయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గోతులకు మరమ్మతులు చేయిస్తారా? లేక పనులపై విచారణ చేయించి.. గుత్తేదారుపై చర్యలు తీసుకుంటుందా అనేది తేలాల్సి ఉంది.

పైపూతగా వేసిన తారు

★ దీనిపై వీఎంఆర్‌డీఏ ఈఈ రాంబాబుతో మాట్లాడగా.. కుంచంగి లేఅవుట్‌లో బీటీ రోడ్డుపై గుంతలను గుర్తించాం. బిల్లులు కూడా ఆపాం. గుత్తేదారుకు నోటీసులు ఇచ్చాం. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తాం' అని తెలిపారు.

పథకాలు అందని వారుంటే చెప్పండి: ఎమ్మెల్యే

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వారికి మరింత జవాబుదారీతనంగా ఉండేందుకే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం రాజవొమ్మంగిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండీ పథకాలు అందని వారుంటే చెప్పాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ప్రమాదాల్లో గాయపడిన వారిని పరామర్శించారు. ఎంపీపీ సావిత్రి, జీసీసీ డైరెక్టర్ సునీత, నాయకులు పెద్దిరాజు, తాతారావు, మోహన్‌కుమార్, సత్యనారాయణ, చిన్నారావు, మధు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రహదారి నిర్మించాలని వినతి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: జె. అన్నవరం - ఏలేశ్వరం రహదారి నిర్మించాలని కోరుతూ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబులు గురువారం ఎమ్మెల్యే శిరీషాదేవికి వినతిపత్రం అందజేశారు. రాజవొమ్మంగి వచ్చిన ఎమ్మెల్యేను గిరిజన సంఘ నాయకులు కలిసి రహదారి దుస్థితిని వివరించారు.

పాడేరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తెదేపా నాయకులు

ఇంటింటికీ వివరించండి

పాడేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం పాడేరులో 11 మండలాల క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, నేతలు రమేష్‌నాయుడు, కొట్టగుళ్లి సుబ్బారావు, కాంతమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్, పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించడంతోపాటు పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి. రమణ అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినం సందర్భంగా గురువారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్, పాలిథిన్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు లీలాపావని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమణ

షెడ్ల నిర్మాణానికి సామగ్రి వితరణ

పాఠశాల నిర్మాణానికి సామగ్రి అందజేస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు, న్యూస్‌టుడే: అల్లివాగులో పాఠశాలకు షెడ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రిని జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్ ఖాన్ గురువారం అందజేశారు. తెదేపా నాయకులు జహంగీర్, రామారావు, రమణ, సల్మాన్ రాజు పాల్గొన్నారు.

పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి

రంపచోడవరం: స్థానిక ఎస్టీఆర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ ప్రియాంక, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఇటీవల 3, 4, 5 తరగతులను మరో పాఠశాలలో విలీనం చేశారని పేర్కొన్నారు. అమరావతి నుంచి వచ్చిన విద్యాశాఖ రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జునరావు, సంధ్య, కోటేశ్వరరావు గురువారం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. 3, 4, 5 తరగతులను 1.5 కి.మీ. దూరంలో ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడం వల్ల ఇబ్బందులను వివరించారు. భాగ్యలక్ష్మి, గురుప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా కమిటీ సభ్యులను కోరుతున్న ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ ప్రియాంక, తల్లిదండ్రులు

కొత్తపల్లి పాఠశాలకు విద్యుత్తు సౌకర్యం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు విద్యుత్తు సదుపాయం సమకూరింది. ఈ బడికి ఆరేళ్ల క్రితం వరకు విద్యుత్తు కనెక్షన్ ఉండేది. పాఠశాలకు పవర్ వైర్లు దొంగలపాలవ్వడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యపై స్థానిక ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. విద్యుత్తు అధికారులకు వినతులు అందజేశారు. ఏపీఈపీడీసీఎల్ చింతపల్లి ఈఈ ప్రభాకరరావు స్పందించి వైర్లు ఏర్పాటు చేసి కనెక్షన్ పునరుద్ధరించారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

గూడెంకొత్తవీధి: వర్షాల నేపథ్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు తప్పక చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. రింతాడలో గురువారం పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

మోతుగూడెం: స్థానిక ఫిల్టర్ హౌస్ పరిధిలోని నాలుగు ట్యాంకులను శుభ్రం చేయించే పనులకు జెన్‌కో సివిల్ అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులకు నీటి సరఫరా నిలిపివేశారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: తాగునీటి పథకాలకు తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ పేర్కొన్నారు. సాగర పంచాయతీ కేంద్రంలో తాగునీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. వర్షాలతో తాగునీరు కలుషితంగా మారే ముప్పు ఉందన్నారు. సాగర పంచాయతీ కార్యదర్శి షేక్‌వలీ, అధికారులు పాల్గొన్నారు.

70 శాతం హాజరుంటే కుట్టుమిషన్లు

మోతుగూడెం, న్యూస్‌టుడే: బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మోతుగూడెంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌దొర, సర్పంచి సీత, కార్యదర్శి మోహన్‌రావు గురువారం సందర్శించారు. ఈ కేంద్రానికి 25 కుట్టు మిషన్లు మంజూరు కాగా 90 మంది మహిళలు రెండు విడతల్లో శిక్షణ పొందుతున్నారు. వారితో మాట్లాడుతూ ఎంతవరకు నేర్చుకున్నారని ఆరా తీశారు. మూడు నెలల్లో 70 శాతం హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు ఎంపీడీవో చెప్పారు.

అడ్డంగా దోచేందుకు.. 'అడుగు'పెట్టారు!!

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగర పరిధిలో పచ్చదనం పెంపునకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏటా రూ.లక్షల ఖర్చు చేస్తున్నా... ఆ పనులపై పెద్దగా పర్యవేక్షణ లేకపోవడంతో చాలా వరకు నిధులు వృథా అవుతున్నాయి. ఈ క్రమంలో ఆక్రమార్కులతో కొందరు అధికారులు చేతులు కలుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

★ మట్టిపోసే ప్రక్రియలోనూ మతలబే
★ అధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారుకు ప్రయోజనం

గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పోసిన మట్టి

రూ.36 లక్షలతో: నగరంలోని పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ స్థలంలోని మొక్కల పెరుగుదలకు వీలుగా అడుగు మేర నాణ్యమైన మట్టి పోయడం, బోరు, ఇతర పనులు చేపట్టడానికి రూ.36 లక్షలతో టెండర్ పిలిచారు. ఈ పని ఉద్యానవన విభాగానికి చెందినది. అయినా జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ఉద్యానవన విభాగ నిబంధనల మేరకు చేయించాలి. ఇద్దరు గుత్తేదారులు పని దక్కించుకోవడానికి టెండర్లు దాఖలు చేశారు. అందులో ఒకరికి పనులు దక్కాయి. ప్రతిపాదించిన మొత్తం నిధుల్లో 33 శాతం తక్కువకు...అంటే రూ.24.12లక్షలకు గుత్తేదారు పనులు దక్కించుకోవడం గమనార్హం.

పరిశీలన ఎక్కడ: మొక్కల పెరుగుదలకు అనువైన మట్టిని పోశారా..? లేదా..? అనే అంశాన్ని ఉద్యానవన విభాగం పరిశీలించకపోవడం గమనార్హం. గుత్త సంస్థ, ఉద్యానవన విభాగ సిబ్బంది మధ్య సత్సంబంధాలు ఉండటంతో నాణ్యమైన మట్టి స్థానంలో రోడ్ల పక్కన దొరికే కంకర మట్టి పోసినా... బిల్లుల అనుమతికి దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు.

పైపైనే చల్లారు: టెండర్ దక్కించుకున్న వారు మూడు ప్రాంతాలకు ఆరు లారీల్లో మాత్రమే మట్టి తీసుకొచ్చి చల్లారు. అడుగు మేర వేయాల్సిన మట్టిని, అంగుళం ఎత్తులో వేసి వదిలేశారు. మిగిలిన పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు ఆదేశిస్తున్నా... ఆ గుత్తేదారు పట్టించుకోకుండా, బిల్లుల కోసం వైకాపా ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి చేస్తుండటం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారంలో ఇంజినీరింగ్ అధికారులు ఎక్కడా తప్పునకు దొరక్కుండా, ఓ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మరో నోటీసు జారీ చేసి పనిని పూర్తిగా రద్దు చేయడంతో పాటు, గుత్త సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టే అవకాశం ఉన్నా... అధికారులు మాత్రం సమయం చూసి బిల్లులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత వర్షాలకు పాతమట్టి, పోసిన మట్టి కలిసిపోయిందని గుత్తేదారు అంచనా వేస్తూ... జాప్యం చేస్తున్నారు.

వర్షానికి పైపైన మట్టి కొట్టుకుపోగా.. కనిపిస్తున్న పాతమట్టి

నివేదిక కోరతాం: 'టెండర్‌లో నిబంధనల ప్రకారం అడుగు మేర మట్టి వేయకుండా పనులు ఆపేయడంతో నోటీసు జారీ చేశా. ప్రస్తుతం పోసిన మట్టి ఎంత ఎత్తు ఉందో లెక్క తీసి, నివేదిక సిద్ధం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం' అని జీవీఎంసీ సహాయ ఇంజినీర్ ఉష పేర్కొన్నారు.

పాలిథిన్ వాడితే కఠిన చర్యలు

అరకులోయ, న్యూస్‌టుడే: దుకాణాల్లో పాలిథిన్ వాడినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. నో ప్లాస్టిక్ డే ని పురస్కరించుకొని గురువారం సర్పంచి దాసు బాబుతో కలిసి అరకులోయలోని దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించామన్నారు. పర్యాటకంగా ప్రాధాన్యమున్న అరకులోయవాసులు పాలిథిన్ విక్రయాలు, వాడకానికి దూరంగా ఉండి మార్గదర్శకంగా నిలవాలని పేర్కొన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే చెత్త వేయాలన్నారు. అరకులోయలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

దుకాణదారుడితో మాట్లాడుతున్న డీపీవో చంద్రశేఖర్, సర్పంచి దాసుబాబు

గిరిజన చట్టాల నిర్వీర్యం

చింతపల్లి, న్యూస్‌టుడే: పెసా, గ్రామసభల అనుమతి లేకుండా అదానీ కంపెనీకి హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలను ఎలా అప్పగిస్తారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. పెదకోట హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 51 జీవో కాపీ ప్రతులను గురువారం చింతపల్లిలో దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులను కాపాడాల్సింది పోయి వాటిని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. సత్యనారాయణ, చిన్నమ్మి, రాజు, దివ్య పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో మెరుగైన సేవలందించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య అన్నారు. చింతపల్లి డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేసిన శ్రీనివాస్‌కు అచ్యుతాపురం బదిలీ అయ్యింది. ఈయన స్థానంలో మాకవరపాలెం నుంచి సీతామహాలక్ష్మిని నియమించారు. బదిలీపై వెళుతున్న శ్రీనివాసరావును గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు. సర్పంచి పుష్పలత, పంచాయతీ కార్యదర్శులు, వెంకటరావు, లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య తదితరులు

ఉప ఎంపీడీవోగా మహేష్

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జీకేవీధి ఉప ఎంపీడీవోగా మహేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉప ఎంపీడీవోగా పనిచేస్తున్న పాపారావును పార్వతీపురం మన్యం జిల్లాకు అధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా చోడవరంలో పనిచేస్తున్న మహేష్‌ను నియమించడంతో గురువారం ఆయన ఎంపీడీవో ఉమామహేశ్వరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీడీవో సహా, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

సిల్వర్‌ఓక్ సాగుపై ఆరా

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు అందించిన సిల్వర్ ఓక్ మొక్కల పరిస్థితిపై ఉద్యానశాఖ సంయుక్త కమిషనర్ శివరామప్రసాద్ ఆరా తీశారు. డ్వామా పీడీ, ఉపాధి హామీ పథకం అధికారులతో కలిసి తాంగులగుడ గ్రామంలో గురువారం పర్యటించారు. సిల్వర్‌ఓక్ తోటలను పరిశీలించారు. ఒక్కో రైతుకు అందించిన 700 మొక్కల ఎదుగుదల, అంతర పంట, కాఫీ, మిరియాల సాగు చేస్తున్నారా అని ఆరా తీశారు. ఉపాధిహామీ పథకం అధికారులు పవన్‌కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తాంగులగుడలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఉద్యానశాఖ సంయుక్త కమిషనర్, ఉపాధిహామీ పథకం అధికారులు

గోదావరి, శబరికి పెరుగుతున్న వరద

కూనవరం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో శబరి, గోదావరి నదుల్లో నీటిమట్టం పెరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షాలకు శబరి నదికి కొత్త నీరు ఎక్కువగా వచ్చి చేరుతోంది. ఎరుపు రంగులో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న శబరిని సందర్శకులు వంతెన మీదుగా వీక్షిస్తున్నారు. పోలవరం ఆనకట్ట బ్యాక్ వాటర్ ప్రభావంతో నిండుగా ఉన్న నదులకు కొత్తనీరు చేరడంతో మరింత శోభాయమానంగా మారాయి. వరద ముంపు గ్రామాల్లో అలజడి మొదలైంది. కొందరు సామగ్రిని ఎగువ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కూనవరంలో శబరి, గోదావరి సంగమం వద్ద వరద ఉద్ధృతి

రహదారి నిర్మాణానికి నిధుల మంజూరు

చింతూరు, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో వినాయకపురం నుంచి ఇర్కంపేట రహదారికి రూ. 71.64 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలైన మారుమూల గ్రామాల్లో రహదారులు లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ శాఖ ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. అటవీ శాఖ నుంచి అనుమతుల కోసం ప్రభుత్వం విడిగా రూ. 9.52 లక్షలు ప్రత్యేకంగా కేటాయించింది.

అందుబాటులోకి పార్సిల్ కేంద్రం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెంలో ఆర్టీసీ పార్సిల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ చెప్పారు. పాత పోస్టాఫీసు ఎదురుగా ఉన్న మందుల దుకాణంలో ఈ సేవలు అందించనున్నామన్నారు.

REAL ESTATE
HOUSE FOR SALE
GENERAL
విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

పోషకాహారంతో వ్యాధులు దూరం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత పాటిస్తూ పోషకాహారం తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని రేఖపల్లి ఆసుపత్రి వైద్యాధికారి అనీల్ సూచించారు. వడ్డిగూడెంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటైంది. రోగులను పరీక్షించి మందులిచ్చారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. బాలింతలు, గర్భిణులు కూరగాయలు, ఆకుకూరలతోపాటు వేడిగా ఆహారం, పాలు, పండ్లు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది మంగ, అనూషా, వరప్రసాద్, ఏసు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో మందులిస్తున్న వైద్య సిబ్బంది

చరవాణి తీస్తుండగా కాటేసిన పాము

నర్సీపట్నం తరలించేలోగా ప్రాణాలొదిలిన గిరిజనుడు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి మండలం అంజలీ శనివారం పంచాయతీ పాలమామిడి గ్రామంలో గిరిజన యువకుడు పాముకాటుతో గురువారం మరణించాడు. కుటుంబసభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. జి.మాడుగుల మండలం పెదబయలు గ్రామానికి చెందిన గెమ్మెలి వాసు(40) పాలమామిడి గ్రామానికి చెందిన గిరిజన యువతిని వివాహం చేసుకుని గ్రామంలోనే ఉంటున్నాడు. బుధవారం రాత్రి తన సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టాడు. తెల్లవారుజామున ఛార్జింగ్ పెట్టిన ఫోన్ తీయబోతుండగా అక్కడే ఉన్న కట్లపాము కాటేసింది. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పామును చంపేశారు. పాముకాటుకు గురైన వాసును తాజంగి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మూడు కిలోమీటర్ల దూరం డోలీమోతపై, అక్కడినుంచి కొంత దూరం ద్విచక్రవాహనంపై ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ సిబ్బంది వైద్యం అందించినప్పటికీ.. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యంకోసం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించాలని సిబ్బంది సూచించారు. ఆసుపత్రికి తరలిస్తుండగానే వాసు మృతిచెందాడు. ఇతడికి భార్య వలసి, ముగ్గురు పిల్లలున్నారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల తమ గ్రామానికి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు రావడం లేదని, సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు.

వాసు (పాత చిత్రం)

హతమైన విషసర్పం

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ సమీపంలోని బొర్రిగుడ వద్ద రైల్వేట్రాక్‌పై ఓ యువకుడి మృతదేహం అనుమానాస్పద స్థితిలో గురువారం లభ్యమైంది. అరకు రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు అందించిన వివరాల ప్రకారం.. కొత్త బొర్రిగుడ గ్రామానికి చెందిన కిల్లో రత్నల్‌కుమార్ (34) మతిస్థిమితం లేకుండా ఇంట్లోనే ఉండేవాడు. గురువారం తెల్లవారుజాము నుంచి ఇతడు కనిపించలేదు. వెంటనే కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించగా.. రైల్వేట్రాక్‌పై మృతదేహం లభ్యమైందన్నారు. ప్రమాదవశాత్తు రత్నల్‌కుమార్‌ని గూడ్స్‌రైలు ఢీకొని ఉండొచ్చని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హెచ్చరిక సూచికల ఏర్పాటు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఎర్రబొమ్మలు, గొందిపాకలు పంచాయతీల మధ్య ఉన్న ఎర్రవరం, ఎర్నాపల్లి వాగుల వద్ద రెవెన్యూ అధికారులు గురువారం ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాల కారణంగా ఈ గ్రామాల వద్ద నున్న కొండవాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వాగును గిరిజనులు దాటకుండా అక్కడ ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని తహసీల్దారు రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. దీంతో వీఆర్వో, వీఆర్ఏలు చర్యలు చేపట్టారు.

ఎర్నాపల్లి వాగు వద్ద గిరిజనులు, రెవెన్యూ ఉద్యోగులు

చింతపల్లిలో క్రైస్తవుల ర్యాలీ

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో గురువారం క్రైస్తవ సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. భారతీయ క్రైస్తవ దినోత్సవం సందర్భంగా పలు సంఘాల సభ్యులు శాంతి ర్యాలీ చేశారు. వివిధ సంఘాల సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	72
లైవ్	103	92
డ్రెస్డ్	149	154
స్కిన్‌లెస్	170	164

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346 రంపచోడవరం: 94908 77172

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ?: ముంచంగిపుట్టులో గిరిజన సహకార సంస్థ గోదాము వర్షాలకు నీరుకారుతోంది. – రాజేంద్రకుమార్, స్థానికుడు, ✔: కొత్త భవనాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. – కుమారస్వామి, మేనేజర్, జీసీసీఎం సొసైటీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: ?: పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న రహదారిలో గోతులు పడ్డాయి. రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. – ఐ.రమణ, రంపచోడవరం, ✔: గోతులు పూడ్చించి రహదారి బాగు చేయిస్తాం. – ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ?: మారేడుమిల్లి నుంచి గుజ్జుమామిడివలస వెళ్లే రహదారిలో కల్వర్టు కొండవాగు ప్రవాహానికి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. – బూసారపు అబ్బాయిరెడ్డి, జీఎంవలస, ✔: కల్వర్టును పరిశీలించి మరమ్మతుకు చర్యలు చేపడతాం. – శ్రీనివాసవిశ్వనాథ్ ఎంపీడీవో

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ?: రాజవొమ్మంగి కన్నయ్యమ్మ పేట నుంచి ఆశ్రమ పాఠశాల, తహసీల్దార్, జీసీసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర కార్యాలయాలకు వెళ్లే మార్గం రాళ్లు పైకి తేలి అధ్వానంగా ఉంది. –ప్రసాద్. రాజవొమ్మంగి, ✔: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –ఎల్. యాదగిరీశ్వరరావు. ఎంపీడీవో. రాజవొమ్మంగి

మోతుగూడెం, న్యూస్‌టుడే: ?: స్థానిక గిరిజన కాలనీలో సిమెంటు రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. – ఎస్కే జిక్రియా, కాలనీ వాసి, ✔: మోతుగూడెం పర్యటనకు వచ్చిన ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ దృష్టికి స్థానికులు సమస్యలను తీసుకువచ్చారు. కాలువలు నిర్మిస్తామని పీవో హామీ ఇచ్చారు. – మోహనరావు, పంచాయతీ కార్యదర్శి

ఎత్తిపోతలు.. ఉత్తిమాటలు

రంపచోడవరం, న్యూస్‌టుడే

రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో 'ఎత్తిపోతల పథకం' మరమ్మతులకుగురై 400 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని గిరిజన రైతులకు సాగునీటిని అందించి వ్యవసాయాభివృద్ధిని సాధించేందుకు 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఏపీఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం ద్వారా పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేసింది. దీని ద్వారా 400 ఎకరాల్లో 80మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

కాలిపోయిన మోటార్లు

ప్రస్తుతం స్కీమ్ వద్ద ఉన్న రెండు మోటార్లు కాలిపోయి మరమ్మతులకు గురవడంతో మూడేళ్ల నుంచి రైతులకు పొలాలకు సాగునీరు నిలిచిపోయింది. దీంతో వర్షాభావంతో ప్రస్తుత ఖరీఫ్‌లో వరి పంటలను వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రబీ సీజన్‌లో రెండో పంట వేయాల్సి ఉన్నప్పటికి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురవడంతో పంటలు వేసుకోలేని పరిస్థితులు దాపురించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం పంపింగ్ స్కీమ్‌లో మోటార్లకు మరమ్మతులు చేయించి సాగునీటికి కల్పించాలని పలుమార్లు ఐటీడీఏ గ్రీవెన్సులో పీవోకు విన్నవించామని అయితే రేపు మాపు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

మరమ్మతులు చేయించాలి..

ఎత్తిపోతల పథకం మూడేళ్లగా మోటార్లు కాలిపోయింది. దీంతో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఐటీడీఏ గ్రీవెన్సులో పీవోకు పలుమార్లు విన్నవించాం. ఇంతవరకు బాగు చేయలేదు.
–బందం పోతన్నదొర, గిరిజన రైతు

రెండో పంటకు నోచుకోవడంలేదు

గ్రామంలో ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురవడంతో ప్రస్తుతం వర్షాధారంతో ఖరీఫ్‌లో పంటలను సాగు చేసుకొంటున్నాం. రబీ సీజన్‌లో రెండో పంట వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం.
– కంగల శ్రీనివాసరావు, గిరిజన రైతు

సదరం ధ్రువపత్రాలకు దరఖాస్తుల స్వీకరణ

అడ్డతీగల: సదరం ధ్రువపత్రాల మంజూరు కోరుతూ దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో విజయ గురువారం చెప్పారు. ఈ నెలాఖరు వరకు మీసేవా, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేయవచ్చన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసవిశ్వనాథ్ చెప్పారు. ఎంపీపీ లలితకుమారి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

చోరీల నియంత్రణకు ముమ్మర గస్తీ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులో దొంగతనాల నియంత్రణకు గస్తీ ముమ్మరం చేశామని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత రోడ్లపై సంచరించరాదని చెప్పారు. ఇటీవల జరిగిన చోరీల దృష్ట్యా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

అ వీ ఇ వీ

చికిత్స పొందుతూ మహిళ మృతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: తాళ్లపాలెంకు చెందిన గిరిజన మహిళ పారా శ్రీలక్ష్మి (30) మెదడు సంబంధ వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందింది. మూడు రోజుల కిందట ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా గురువారం అంబులెన్సులో స్వగ్రామానికి తీసుకువచ్చారు. తెదేపా కార్యకర్తగా, మహిళా సంఘం సభ్యురాలిగా శ్రీలక్ష్మి చురుగ్గా పనిచేసే వారని ఆమె సేవలను ఎమ్మెల్యే శిరీషాదేవి కొనియాడారు. మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, నాయకులు విజయభాస్కర్, సురేష్, బాపిరాజు, అనంతమోహన్, సిరంజపదేవి తదితరులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బకాయిలు చెల్లించరూ..

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి కళాజాత ప్రదర్శనల బిల్లుల బకాయిలు చెల్లించాలని మన్యంలోని కళాజాత కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు గురువారం కోరారు. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో జన్మభూమి, గ్రామదర్శిని కార్యక్రమాలపై కళాజాత ప్రదర్శనలతో అవగాహన కల్పించామన్నారు. తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో కళాకారులకు బిల్లుల చెల్లింపు నిలిపివేశారని పేర్కొన్నారు.

ఆరోగ్య సహాయకులు లేక ఇబ్బందులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సహాయకులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం స్పందించి వీరిని నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం(జీవీఎస్‌యూ) ప్రధాన కార్యదర్శి బి.మాధరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మరణాలను అరికట్టాలన్నారు. ఈనెల 1న బందవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మర్రి లక్ష్మి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కిషోర్, డివిజన్ అధ్యక్షులు బాబూజీ, మండలాధ్యక్షులు అనిల్ పాల్గొన్నారు.

సరిపడా విత్తనాలివ్వాలి

కొయ్యూరు: రైతులందరికీ సరిపడా వరి విత్తనాలను అందించాలని రాజేంద్రపాలెం పెసా కమిటీ కార్యదర్శి జి.చిన్నారావు, ఉపాధ్యక్షుడు కె.స్వామినాయుడు గురువారం కోరారు. ఎన్ని ఎకరాల పొలం ఉన్నప్పటికీ ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే అందించారన్నారు. విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఐదు కోతుల మృతి

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో విద్యుత్తు షాక్‌తో ఐదు కోతులు మృతి చెందాయి. వర్షాలకు విద్యుత్తు వైర్లపై చెట్టుకొమ్మలు పడ్డాయి. ఆ సమయంలో చెట్టుపై తలదాచుకున్న ఐదు కోతులు మృత్యువాత పడ్డాయి. వర్షం పడుతుండటంతో కోతులు తమ పిల్లలు తడిచిపోకుండా ఒడిలో పెట్టుకుని ఉండగా ప్రమాదానికి గురయ్యాయి. పారిశుద్ధ్య సిబ్బందితో సర్పంచి దుర్జో కోతులకు దహనసంస్కారాలు నిర్వహించారు.

గిరిజన సంఘ మహాసభ 6న

చింతూరు, న్యూస్‌టుడే: గిరిజన సంఘం మహాసభను ఈ నెల 6న లక్కవరంలో నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి నగేశ్ చెప్పారు. తులసిపాకలో గురువారం నాయకులు మడకం చిన్నయ్య, కారం సుబ్బారావు తదితరులతో సమావేశమయ్యారు.

పరికరాలు మూలకు.. చన్నీళ్లే దిక్కు!

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు చన్నీళ్ల స్నానమే దిక్కవుతోంది. గత ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ బడులను ఆధునికీకరించామని గొప్పలు చెప్పుకొన్నా క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులున్నాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వేడి నీళ్ల పరికరాలను ఏర్పాటు చేశారు. తర్వాత ఇవి మరమ్మతుకు గురయ్యాయి. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇవి మూలకు చేరాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతూ చల్లని నీటితో విద్యార్థులు స్నానాలు చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి పరికరాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

పచ్చదనం.. పూజకూ వినియోగం

జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి పంచాయతీ నిట్టమామిడి గ్రామంలో చిద్గగనానంద మహర్షుల ఆలయం వద్ద తమలపాకు పాదు అల్లుకుని ఆకట్టుకుంటోంది. ఆలయానికి పచ్చదనాన్ని పంచుతూ.. పూజకూ ఉపయోగపడుతోంది. ఇవి పూజకు మాత్రమేనని, మరే ఇతర పనులకు వినియోగించకూడదని ఆలయ నిర్వాహకులు ఎస్.వి.రమణ తెలిపారు. – జి.మాడుగుల, న్యూస్‌టుడే

తుప్పల్లో సూచిక

సూచిక.. పట్టించుకోక!

ప్రధాన రహదారుల్లో సూచికబోర్డులు నిరుపయోగంగా మారాయి. అనంతగిరి మండలంలో సుమారు 80 బోర్డులను రహదారులు భవనాల శాఖ అధికారులు గతంలో ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డులో ఇవన్నీ తుప్పల్లోనే దర్శనమిస్తున్నాయి కొన్ని బోర్డులు కనిపించకుండా పోయాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకుండా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

దుకాణాలు నిర్మించరూ..

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో గిరిజనులు చిరు వ్యాపారాలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత దుకాణాలు లేక అవస్థలకు గురవుతున్నారు. వర్షాకాలంలో చిరిగిపోయిన టార్పాలిన్లతో షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో జలవిహారిని ఆధునికీకరించారు. చిరు వ్యాపారులకు దుకాణ సముదాయాలు మాత్రం నిర్మించలేదు. దీనిపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి దుకాణ సముదాయాలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

టార్పాలిన్లతో ఏర్పాటుచేసిన దుకాణాలు

వీడని వర్షం... అవస్థల్లో గిరిజనం

రాళ్లగెడ్డలో..

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మన్యంలో భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం బాబుసాల పంచాయతీలోని కాండ్రింగివలస గ్రామానికి వెళ్లే మార్గంలో గెడ్డ ఉప్పొంగి ప్రవహించటంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జడిగుడ, బాబుసాల, గున్నసెలమ, గాదెలపుట్టు, దముకులాడీ, ఏడుకొండలబండ, గాజులబంద గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కుంబిడిసింగి పంచాయతీ రాళ్ల గెడ్డ రహదారి పైనుంచి నీరు ప్రవహిస్తోంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అడ్డతీగల, న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడ్డతీగల - వై.రామవరం మార్గంలో మల్లవరం మామిళ్ల, దుప్పులపాలెం కూడలి మధ్య భారీ వృక్షం గురువారం నేలకొరిగింది. రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అన్నవరం, న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం: కుంజావారిగూడెం వాగులు ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలు స్తంభించాయి. వర్షాలు తగ్గుముఖం పట్టినా వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో 620 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు గురువారం తెలిపారు. ముంచంగిపుట్టు మండలంలో అత్యధికంగా 80.2 మి.మీ, హుకుంపేట మండలంలో 46.8, పెదబయలు 41.2, మారేడుమిల్లిలో 39.4, జి.మాడుగులలో 37.4, వై.రామవరంలో 36.4, చింతూరులో 34.6, అడ్డతీగలలో 36.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

కాండ్రింగివలస సమీపంలో ఉప్పొంగిన గెడ్డలో ద్విచక్రవాహనం దాటిస్తున్న ఉపాధ్యాయులు

బూరుగువాడ వాగు ఉద్ధృతి

బొడ్లంక వద్ద పెళ్లిరేవు వాగు ప్రవాహం ఇలా..

కొండ వాగులకు వరదొచ్చె.. రాకపోకలు నిలిచె!

మారేడుమిల్లి నుంచి బొడ్లంక వెళ్లే రహదారిలో ఆకుమామిడికోట, బొడ్లంక సమీపంలోని పెళ్లిరేవు వాగులతోపాటు సున్నంపాడు నుంచి నూరుపూడి వెళ్లే రహదారిలో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వీటిపై కాజ్‌వేలు ఉండటంతో కొద్దిపాటి వర్షానికే మునిగిపోతున్నాయి. కాజ్‌వేల మీదుగా గిరిజనులు రాకపోకలు సాగిస్తూ గతంలో పలువురు గల్లంతయ్యారు. వాగులపై కాజ్‌వేల స్థానంలో వంతెనలు నిర్మించాలన్న డిమాండ్లు ఎప్పట్నుంచో ఉన్నాయి. ఆకుమామిడికోట, బొడ్లంక వద్ద ఉన్న కొండవాగులపై వంతెనలు నిర్మిస్తే మారేడుమిల్లి మండలంతో పాటు, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని వందలాది గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. – మారేడుమిల్లి, న్యూస్‌టుడే

శ్రమదానంతో సమస్యకు పరిష్కారం

వారంతా ఉపాధి హామీ శ్రామికులు. తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలో నెలకొన్న సమస్యను శ్రమదానంతో పరిష్కరించుకున్నారు. మొద్దులగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణ చిన్నపాటి వర్షానికే నీరు బయటకు వెళ్లకుండా చిత్తడిగా మారుతోంది. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో పరిష్కారానికి వారే నడుం బిగించారు. తాము పనిచేసే చెరువులో తవ్విన మట్టిని రెండు ట్రక్కుల్లో పాఠశాల వద్దకు చేర్చారు. అందరూ కలిసి మట్టితో ఆవరణను మెరక చేయడంతో సమస్య పరిష్కారమైంది.
– న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం

పాఠశాల బయట మట్టిని తొలగిస్తున్న గ్రామస్థులు

పోషకాహారంతో ఆరోగ్యం

హుకుంపేట, న్యూస్‌టుడే: గర్భిణులు పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ పేర్కొన్నారు. మండలంలోని కులపాడు, గడుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం హుకుంపేట ఆసుపత్రిని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

గడుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని ఇన్‌ఛార్జి వైద్యాధికారి విశ్వేశ్వరరావునాయుడు అన్నారు. గురువారం తన కార్యాలయంలో జిల్లా వైద్య విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు చేయాలని పేర్కొన్నారు. ప్రసవ తేదీకి వారం రోజుల ముందు ఆసుపత్రులు లేదా గర్భిణుల వసతిగృహాలకు తరలించాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.కిరణ్‌కుమార్, ఇమ్యునైజేషన్ అధికారి కమల కుమారి, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి స్త్రీవైద్య నిపుణులు డాక్టర్ పి.సృజన పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావునాయుడు

భాజపా బలోపేతానికి కృషి

కూనవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోనూ భాజపా బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి పిలుపునిచ్చారు. టేకులబోరులో గురువారం కూనవరం, వీఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎటపాక మండలం గౌమ్ముకొత్తగూడెం, చలంపాలెం, కె.నారాయణపురం, అయ్యవారిపేట, నల్లకుటం, కుసుమనపల్లి గ్రామాలకు చెందిన పలువురు భాజపాలో చేరగా వారికి పార్టీ కండువాలు వేశారు. జిల్లా ఇన్‌ఛార్జి గంగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు నోముల రామారావు, వెంకయ్య, ప్రసాద్, దుర్గారావు, పెరమయ్య, రమణారెడ్డి, సుప్రజ, దారయ్య పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న శాంతకుమారి

ఆక్రమణల తొలగింపు వేగవంతం చేయాలి

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు, రాజేంద్రపాలెం, సింగవరం, కాకరపాడులలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు వేగవంతం చేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ మొట్టడం రాజుబాబు, రాజేంద్రపాలెం పెసా కమిటీ కార్యదర్శి జి.చిన్నారావు, ఉపాధ్యక్షుడు కె.స్వామినాయుడులు వేర్వేరు ప్రకటనల్లో కోరారు. హైకోర్టు ఆదేశాలను సత్వరమే అమలు చేయాలన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

రాజవొమ్మంగి: యూటీఎఫ్ సభ్యులు ఆగస్టు పదో తేదీలోగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారావు, శ్రీను సూచించారు. సభ్యత్వ నమోదును ప్రారంభించారు. బొజ్జియ్య, రమణ, వెంకటలక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

వాగుల్లో చేపల వేట

ముంచంగిపుట్టు గ్రామీణం, హుకుంపేట, న్యూస్‌టుడే: కుండపోత వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. డుడుమ జలాశయం గేట్లు ఎత్తిన నేపథ్యంలో గిరిజనులకు భారీ చేపలు చిక్కుతున్నాయి. గురువారం ఒనకఢిల్లీ సంతలో భారీ చేపలు విక్రయానికొచ్చాయి. ఒక్కో చేప 12 నుంచి 15 కేజీల బరువు ఉంది. కిలో రూ.200కు విక్రయించారు. హుకుంపేటలోని రాళ్లగెడ్డ, లివిటిగెడ్డ, చీడిపుట్టు, దిగుడుపుట్టు గెడ్డల వద్ద గిరిజనులు చేపలు పడుతున్నారు. గెడ్డలు పొంగటంతో చేపలు అధికంగా దొరుకుతున్నాయి.

ఒనకఢిల్లీ వారపు సంతకు వచ్చిన భారీచేపలు

చిడిపుట్టు గెడ్డ వద్ద వలలతో చేపలు పడుతున్న గిరిజనులు

పేదల అభ్యున్నతే లక్ష్యం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టిందని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ అన్నారు. గురువారం కించాయిపుట్టు పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వనబసింగి పంచాయతీలోని కొత్తూరు గ్రామంలో తెదేపా నాయకులు జగ్రత్రాయ్, సర్పంచి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బలరామ్, బాబూజీ, శంకర్ పాల్గొన్నారు.

సీలేరు సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు సుబ్బారావు

సీలేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.బలరాం అన్నారు. గురువారం సీలేరులో తెదేపా మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. మండల పార్టీ పరిశీలకుడు తుడుము సుబ్బారావుతోబాటు బలరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాడేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాము, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, నాయకులు సన్యాసిరావు, తిరుమలరావు, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీలేరు పట్టణ తెదేపా అధ్యక్షుడిగా ఎస్.కె.నాగూర్, ధారకొండ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోతురాజు కృష్ణారావును ఎన్నుకున్నారు.

చింతూరు, న్యూస్‌టుడే: తెదేపా చింతూరు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జిలుగా ఓబిళ్లనేని నర్సింహారావుచౌదరి, పొదిలి రామారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ప్రజల్లో సుఖసంతోషాలను నింపిందని తెదేపా మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనపై రూపొందించి కరపత్రాలను చింతూరులో ఇంటింటికి వెళ్లి అందజేశారు. నాయకులు శ్రీరామ్, సత్యావతి, వెంకటేశ్వరరావు, సురేశ్‌కుమార్‌చౌదరి, తమ్మయ్య పాల్గొన్నారు.

చింతూరులో..

అక్రమ నిర్మాణాలపై చర్యలకు డిమాండు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో బినామీల పేరుతో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేయడం, రిసార్టులు నిర్వహించడం చేస్తున్నారని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు శాంతిరాజు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండు చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీని గురువారం కలిసి వినతులు అందజేశారు.

సబ్‌కలెక్టర్ కల్పశ్రీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ప్రణాళికాయుతంగా చదివితే ఉత్తమ ఫలితాలు

జడ్డంగిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికాయుతంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జడ్డంగి ఎస్సై చినబాబు విద్యార్థులకు సూచించారు. జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'తోపాటు బాలిక, మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పెదబయలు/గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సోదరభావంతో మెలగాలని, దేశభక్తి కలిగి ఉండాలని పెదబయలు ఎస్సై కొల్లి రమణ అన్నారు. గురువారం సీతగుంట పంచాయతీ లకేయిపుట్టు ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కలిగించారు. బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయని చెప్పారు. పోక్సో చట్టాన్ని వివరించారు. ర్యాగింగ్ చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. బాలికలు అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్లు 112, 100, 1930, 1972లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.



లకేయిపుట్టులో మాట్లాడుతున్న ఎస్సై రమణ

(c) eenadu

వారధి..హతవిధి..

పది రోజుల కిందట రాత్రివేళ లారీ ఢీకొట్టడంతో వారధి రక్షణ గోడ కొంతమేర ధ్వంసమైంది. నిత్యం వందల వాహనాలు తిరిగే ఈ వంతెనపై దెబ్బతిన్న గోడను త్వరితగతిన బాగు చేయాలి. కానీ పోలీసులు స్టాపర్లు పెట్టి వదిలేశారు. రక్షణ గోడను త్వరగా బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. –ఈనాడు, అమరావతి

త్వరలో భూసేకరణ మార్కింగ్

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: గుంటూరు- వినుకొండ జాతీయ రహదారి 544డి విస్తరణలో భాగంగా త్వరలో భూసేకరణ మార్కింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు దిల్లీ నుంచి జాతీయ రహదారుల అథారిటీ వారు 3ఏ నోటిఫికేషన్ విడుదల చేశారు. గుంటూరు నుంచి వినుకొండ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును ట్రాఫిక్ దృష్ట్యా నాలుగు వరుసలుగా విస్తరించనున్న విషయం తెలిసిందే. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇందుకు ఎంత భూమి అవసరమో గుర్తించి మార్కింగ్ వేసి, అనంతరం ఎక్కడెక్కడ భూమి కావాలో ఆ ప్రాంత రైతులకు నోటీసులు ఇవ్వనున్నారు. జాతీయ రహదారుల అథారిటీ అధికారులు వచ్చాక భూసేకరణ మార్కింగ్ చేపడతామని జేసీ సూరజ్ గనోరే తెలిపారు.

భూ సమీకరణపై గ్రామసభలు నేడు

తాడికొండ: భూ సమీకరణపై శుక్రవారం తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి గ్రామాల్లో సభలు జరగనున్నాయి. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలు స్వీకరిస్తారు. భూ సమీకరణపై అవగాహన కల్పించనున్నారు.

కాలువలకు 5,938 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు గురువారం 5,938 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

సీఎం వెంట నడుస్తాం.. రాజధానికి భూములిస్తాం

అంగీకారం తెలిపిన మూడు గ్రామాల రైతులు

అమరావతి, తాడికొండ, న్యూస్‌టుడే: మహానగరంగా రాజధాని అమరావతి విస్తరణతో తమ ప్రాంత అభివృద్ధి ఎల్లలు దాటుతుందని.. అందులో భాగస్వాములమై దార్శనికుడికి అండగా నిలుస్తామని తాడికొండ మండలంలోని పాములపాడు, బేజాత్పురం, రావెల గ్రామాల రైతులు పేర్కొన్నారు. రాజధాని అవసరాల కోసం చేపట్టిన రెండో విడత భూ సమీకరణలో భాగంగా గురువారం గ్రామసభలు నిర్వహించారు. మా పిల్లల భవిష్యత్తు కోసం ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. తాత ముత్తాతల నుంచి వస్తున్న భూములను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నామని..తమ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో ఆయన వెంట నడుస్తామన్నారు. భూములు తీసుకున్న తరువాత ఇక్కడ ఏ ప్రాంతంలో ఏమేం నెలకొల్పుతారో తెలియజేయాలని కోరారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి

నాకు అరెకరం పొలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా. కౌలు రూ.30 వేలు ఇస్తామంటున్నారు. కుటుంబ పోషణకు సరిపోదు. చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. - **వలేటి పేరయ్య, రావెల**

ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వండి

భూములు త్యాగం చేసిన వారి పిల్లలకు భవిష్యత్తులో ఇక్కడ ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం కల్పించాలి. రాజధాని అభివృద్ధి చెందితే మా పిల్లలు ఉద్యోగాల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లనవసరం ఉండదన్న ఆశతో మా కుటుంబానికి ఉన్న 15 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. - **చుండు శ్రీనాథ్, బేజాత్పురం**

మెగా సిటీగా అభివృద్ధి చేయాలన్నది సీఎం ఆలోచన

అభివృద్ధి కోసం త్యాగాలకు సిద్ధంగా కావాలి. రాజధానిని మెగా సిటీగా అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన. అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడానగరం, ఐటీ వంటివి రాక వల్ల ఎంతో అభివృద్ధి జరుగుతుందనేది గుర్తించాలి. రాజధానిలో నెలకొల్పిన విద్యాసంస్థలకు ఇంకా భూమి అవసరమని అడుగుతున్నారు. అవి విస్తరిస్తే మన బిడ్డల భవిష్యత్తు బాగుంటుంది. మెజారిటీ రైతుల అభిప్రాయం మేరకే భూములు తీసుకుంటారు. - **తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే**

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. వారి అంగీకారంతోనే ప్రభుత్వం ముందుకెళ్తుంది. రెవెన్యూ సమస్యలను డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి వచ్చి పరిష్కరించాకే భూములు తీసుకుంటారు. - **శ్రీనివాసరావు, ఆర్డీవో, గుంటూరు**

అడుగుకో లీకు.. ఎన్నాళ్లీ సాకు..!

కట్టడి చేయడంలో నెలల తరబడి నిర్లక్ష్యం
జీఎంసీ నీటి సరఫరా వ్యవస్థ దుస్థితిదీ

సాకేతపురంలో తుప్పు పట్టి...

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే నగరపాలక సంస్థ (గుంటూరు)

● గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన మంచినీటి పైపులైన్ల పొడవు 96 కిలోమీటర్లు... ● అనుసంధానంగా ఉన్న పైపులైన్ల పొడవు 1,013 కిలోమీటర్లు... వీటిల్లో చాలావరకు మురుగునీటి కాలువల్లోంచి వెళ్తున్నాయి.. పలుచోట్ల లీకేజీలున్నాయి...

ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉంది.. ఓవైపు వర్షాలు.. మరోవైపు మురుగునీటి కాలువల్లోంచి వెళ్తున్న పైపులైన్లకు వివిధ ప్రాంతాల్లో లీకేజీలు.. వెరసి తాగునీరు కలుషితమవుతోంది.

ప్రజారోగ్యంపై ప్రభావం: తాగునీరు కలుషితమై 2018లో పదిమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. గతేడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. శారదాకాలనీ, శ్రీనగర్, పాతగుంటూరు ప్రాంతాల్లో అప్పట్లో ఎక్కువ కేసులొచ్చాయి.

పర్యవేక్షణకూ అవస్థే: నగరంలో ఉన్న 42 రిజర్వాయర్ల వద్ద 168 మంది వాల్వ్‌ఆపరేటర్లు ఉన్నట్టు అధికారులు చెబుతున్నా.. ఒక్కోచోట నలుగురు చొప్పున పర్యవేక్షిస్తున్నారు. ఒక్కొక్కరు రెండ్రోజుల చొప్పున పని చేయాల్సి రావడం మరో ఇబ్బంది. పర్యవేక్షణ లోపానికి ఏఈల కొరత కూడా కారణమే.

గుంటూరు-నాయుడుపేట ప్రధాన రహదారి పక్కన ఇదీ పరిస్థితి..

లీకేజీలున్న ప్రాంతాలివే..

నగరంలోని శారదాకాలనీ, సంజీవయ్యనగర్, సీతానగరంలో పైపులైన్ల లీకేజీల సమస్య ఎక్కువగా ఉంది. పలకలూరు రోడ్డు, కేవీపీ కాలనీ, హెచ్‌ఎల్‌ఆర్ టు స్తంభాలగరువు, వసంతరాయపురం, రింగురోడ్డులో విద్యానగర్ పరిసరాల్లోనూ ఇదే సమస్య. నెహ్రూనగర్‌లోనూ సమస్య ఉండగా.. ఇటీవల బాగు చేశారు.

ముఖ్య కారణాలు ఇలా..

రిజర్వాయర్ల మధ్య ప్రధాన పైపులైను వ్యవస్థను కొన్నిచోట్ల ఆధునికీకరించినా.. సరఫరా వ్యవస్థలోని పాత పైపులైన్లు చాలాచోట్ల పగుళ్లిచ్చాయి. మురుగునీటి కాలువల్లోంచి వెళ్తుండడంతో మురుగునీరు చేరుతోంది. డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్ల అభివృద్ధి పేరుతో తవ్వుతున్నప్పుడు పైపులు పగిలినా సరిచేయడం లేదు. పైపులైన్లకు మోటార్లు బిగించడంతో లీకుల ద్వారా మంచినీటిలోకి మురుగు చేరుతోంది.

కట్టడిలో జాప్యమెందుకు..?

మేజర్ పైపులైన్ల లీకేజీలు అరికట్టాలంటే సరఫరాను రెండుమూడ్రోజులు నిలిపేయాలి. ఈ కారణం చూపించి మరమ్మతులు చేయడం లేదు. నీటి సరఫరా లేని వేళల్లో సరఫరా పైపులైన్లు బాగు చేయడానికి అవకాశం ఉన్నా.. ఆ దిశగా ప్రయత్నించడం లేదు.

రైల్లో 'ఈగల్' బృందం తనిఖీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన 'ఈగల్' బృందం గురువారం రైల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించింది. ఒడిశా నుంచి తెనాలి మీదుగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకున్నప్పుడు అక్కడ ఈగల్ బృంద సభ్యులు ఆ రైలు ఎక్కారు. ప్రతి బోగీలోనూ అనుమానాస్పద వ్యక్తులు, లగేజీ తనిఖీ చేసుకుంటూ సాయంత్రం 5 గంటల సమయంలో తెనాలి రైల్వే స్టేషన్‌లో దిగారు. ఒక బ్యాగులో గంజాయి ఆనవాలతో తయారైనట్లు అనుమానిస్తున్న చాక్లెట్లను కనుగొని బ్యాగును గుర్తించి జీఆర్‌పీ విభాగానికి పంపారు. ఆ చాక్లెట్లను పరీక్షించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఒడిశా నుంచి రాష్ట్రానికి గంజాయి రవాణా అవుతోందనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, గుంటూరు దిశ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానిత చాక్లెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాం

- డెంగీ, అతిసారం కట్టడికి ప్రత్యేక కార్యాచరణ
- 'ఈనాడు'తో డీఎంహెచ్‌ఓ కె.విజయలక్ష్మి

ఈనాడు – అమరావతి

జిల్లాలో అక్కడక్కడా డెంగీ, అతిసారం కేసులు నమోదవుతున్నాయి. వాటిని ప్రాథమిక స్థాయిలో కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలను ఆమె 'ఈనాడు'కు వివరించారు.

● మలేరియా ప్రభావం పెద్దగా లేదు. అర్బన్‌లో డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గతేడాది ఇదే సమయానికి వందకుపైగా కేసులుండగా.. ఈ ఏడాది 44 కేసులొచ్చాయి. డెంగీ ప్రబలకుండా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ప్రతీ పీహెచ్‌సీకి ఓ ఎంపీహెచ్ఏను పర్యవేక్షణకు నియమించాం. ఆయన ప్రతిరోజూ జ్వరం, మలేరియా, టైఫాయిడ్, డెంగీ కేసులు నమోదైతే వెంటనే సర్వే చేసి కట్టడికి చర్యలు చేపట్టేలా ఆదేశాలిచ్చాం.

● జూన్ నుంచి అక్టోబర్ వరకు వ్యాధుల కాలం. అన్ని ఆసుపత్రుల్లోనూ ఎపిడమిక్ డ్రగ్స్ నిల్వలు పుష్కలంగా ఉంచాం. అత్యవసర కొనుగోళ్లకూ హెచ్‌డీఎస్ నిధులున్నాయి. కొన్నిచోట్ల ఆసుపత్రి భవనాలు అసంపూర్తిగా ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

కె.విజయలక్ష్మి

● తెనాలి, గుంటూరు ఆసుపత్రులతోపాటు పల్నాడు, బాపట్ల సహా వివిధ ప్రాంతాల్లో రోజుకు 10 నుంచి 15 వరకు అతిసారం కేసులు నమోదవుతుండడం సహజమే. ఒకే ప్రాంతం నుంచి ఎక్కువగా రోగులు ఉంటే 'ఎపిడమిక్'గా తీసుకుంటాం. ● విలేజ్ హెల్త్ సెంటర్లలో సీహెచ్‌ఓల ద్వారా ప్రతి బుధవారం తాగునీటి ట్యాంకుల వద్ద నీటి నమూనాలు సేకరించి పరీక్ష చేయిస్తున్నాం. కలుషిత ఆనవాళ్లుంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరఫరా నిలిపివేయించి, క్లోరినేషన్ చేయిస్తున్నాం. ● ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నారు. మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్న నీటి నాణ్యతను పరీక్షించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చాం. ● అన్ని ఆరోగ్య కేంద్రాల్లో రోగ నిర్ధారణ కిట్లు ఉన్నాయి. ఎవరైనా ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. జులై 30 వరకు డెంగీ నిరోధక మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం.

ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యేదెప్పుడో?

గుంటూరు వైద్యం: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3 బదిలీల కౌన్సెలింగ్ గురువారం అర్ధరాత్రి కూడా కొనసాగుతూనే ఉంది. గత నెల 30 నుంచి ప్రారంభించిన ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ప్రతిరోజూ తెల్లవారుజాము వరకూ అధికారులు, సిబ్బంది పని చేస్తూనే ఉన్నారు. ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఏళ్ల తరబడి లూప్ లైన్లో పని చేస్తున్న భార్యాభర్తలకు ప్రాధాన్యం ఇవ్వలేదని కొందరు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. మరికొంతమంది సీనియారిటీ ప్రకారం జాబితాలో తప్పులు దొర్లాయని అభ్యంతరం తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీకి అర్హులైన వారు 900 మందికి పైగా ఉన్నారు. ఈ విషయం ముందుగానే తెలుసు. పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి కొంతమంది అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై పిలిపించుకుని వారి సహాయం కూడా తీసుకుని ఉంటే బదిలీల ప్రక్రియ కొంతవరకైనా సులభంగా జరిగి ఉండేదని పలువురు తెలుపుతున్నారు. కేవలం డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందిపైనే ఆధారపడినందు వల్లే వాళ్లు రాత్రింబవళ్లు పనిచేయాల్సి వస్తోంది.

రేవులకు వేలం నిర్వహిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ

సిండికేట్ కనుసన్నల్లోనే వేలం

నామమాత్ర ధరలకు రేవులు కైవసం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కృష్ణానది తీర ప్రాంతంలో రేవుల నిర్వహణ సిండికేట్ కనుసన్నల్లోనే కొనసాగుతోంది. జిల్లాపరిషత్తు కార్యాలయంలో రేవుల వేలం ప్రక్రియను జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ గురువారం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జడ్పీ కార్యాలయంలో గుత్తేదారులు మాట్లాడుకుని సిండికేట్‌కి అనుకూలంగా కూడబలుక్కున్నారు. ఆయా రేవులకు జడ్పీ అధికారులు నిర్ణయించిన ప్రాథమిక ధరకు కొంత మొత్తం పెంచి రేవులను దక్కించుకున్నారు. స్థానికేతరులు ఎవరూ సీల్డ్ టెండర్లు వేయకుండా స్థానిక నాయకులతో చెప్పించడంతో వారు వేలంలో పాల్గొనలేదు. దీంతో అచ్చంపేట మండలం చింతపల్లి (పడవ) రేవును రూ.2.20 లక్షలకు, గింజుపల్లి రేవును రూ.3.50 లక్షలకు, అమరావతి మండలం దిడుగు (పడవ) రేవును రూ.6 లక్షలకు పాట పాడిన గుత్తేదారుల పేరుతో ఖరారు చేశారు. మాదిపాడు బల్లకట్టు రేవుకు గుత్తేదారులు సీల్డ్ టెండర్లు వేయకుండా.. నేరుగా బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దాంతో ఈ రేవుకు వేలం ఖరారు చేయకుండా జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు వాయిదా వేసినట్లు సమాచారం. మాచవరం మండలం గోవిందాపురం బల్లకట్టు, కొల్లిపర మండలం వల్లభాపురం రేవుల వేలంలో గుత్తేదారులు పాల్గొనలేదు. వారంతా సిండికేటై చింతపల్లి, గింజుపల్లి, దిడుగు రేవులను తక్కువ ధరకే సొంతం చేసుకోవడంతో జడ్పీ ఆదాయానికి గండి పడింది. వేలంలో ధర పెంచకుండా ముందస్తుగా మాట్లాడుకుని అమలు చేశారు.

మచ్చు పేరిట కుచ్చుటోపీ

మిర్చి యార్డులో దోపిడీ

ఈనాడు – అమరావతి

మచ్చు పేరిట మిర్చి రైతులు దోపిడీకి గురవుతున్నారు. వ్యాపారులు ఎంత చెప్పితే.. ఎవరికీ ఫిర్యాదు చేయలేక వారు మిన్నకుండిపోతున్నారు. ఏటా రూ. 10 వేల కోట్ల లావాదేవీలు నడిచే చోట నిత్యం జరుగుతున్న తంతు ఇది. గుంటూరు యార్డులో మిర్చి కొనుగోలు చేసిన రోజే రైతులకు డబ్బులు ఇస్తుండడంతో మనరాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి రైతులు సరకు తెస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు మచ్చు పేరిట మాయాజాలం చేస్తున్నారు. ఎవరైనా రైతులు అభ్యంతరం చెబితే సరకులో నాణ్యత లేదని సాకులు చెప్పడం, కొనుగోళ్లలో జాప్యం చేయడం, కాయల్లో తేమ శాతం ఎక్కువగా ఉందని ఆరబెట్టాలంటూ తూకాలను వాయిదా వేయడం పరిపాటిగా మారింది.

నాణ్యత చూడాలనే సాకుతో...: రైతులు యార్డులో కమీషన్ ఏజెంటు దుకాణంలో మిర్చిని దింపిన తరువాత దిగుమతి వ్యాపారుల తరఫున గుమస్తాలు బస్తాలు కోసి నాణ్యత చూస్తారు. వ్యాపారికి చూపించాలన్న పేరుతో మిరపకాయల లాట్‌ను అనుసరించి కిలో నుంచి మూడు కిలోల వరకు తీసుకెళ్తున్నారు. ఈ మిర్చిని గుమస్తాలు, ముఠాకూలీలు కలిసి కొన్ని దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మచ్చు తీయడానికి యార్డులో అనుమతి లేదు. అడ్డుకోవాల్సిన కమీషన్ ఏజెంట్లు కొందరు ప్రోత్సహించడం వల్లనే ఈ దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోంది. ● ప్రస్తుతం రోజుకు 30 వేల నుంచి 40 వేల బస్తాలు యార్డుకు వస్తున్నాయి. లాట్‌కు కిలో నుంచి 3 కిలోల వరకు మచ్చు తీస్తుండడంతో ఆ మేరకు రైతులు నష్టపోతున్నారు. రైతు వంద బస్తాలు తీసుకొచ్చి రెండు లాట్‌లుగా పెట్టుకుంటే కనీసం 5 కిలోల వరకు మచ్చుకాయల రూపంలో సగటున రూ. 500 వరకు నష్టపోతున్నాడు. యార్డు యంత్రాంగం, వ్యాపారులు, ముఠాకూలీలు, గుమస్తాలు.. ఇలా అందరూ రైతుపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నా.. దోపిడీకి అడ్డుకట్ట పడడం లేదు. యార్డులో సీసీ కెమెరాలు ఉన్నా.. ఉపయోగం లేని పరిస్థితి. ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నా.. ఈ విషయం అధికారులకు పట్టడం లేదు. ● మచ్చుకాయల కొనుగోలుకు ఇటీవల చిలకలూరిపేట బైపాస్ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ప్రత్యేకంగా కొన్ని దుకాణాలు వెలిశాయి.

సేకరించిన మచ్చుకాయలు

ఇలా చేస్తే.... ● సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ మచ్చు తీసినట్లు గుర్తించిన వెంటనే సదరు కమీషన్ ఏజెంట్‌తోపాటు ఎగుమతి వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి. ● యార్డు నుంచి వెలుపలికి వెళ్లే గేట్లలో గట్టి నిఘా పెట్టాలి. ● మచ్చుకాయలు పేరిట రైతులను ముఖ్యపెట్టే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలి. ● యార్డు బయట మచ్చుకాయలు కొనుగోలు చేసే దుకాణాలను మూయించాలి. ● మచ్చుకాయలు తీసుకెళుతూ పట్టుబడినవారిని కొన్నాళ్లు యార్డుకు రాకుండా చూడటం వంటి చర్యలు చేపట్టాలి.

రేషన్ పంపిణీ బహుబాగు!

☛ ఈ నెలలో 40.95 శాతం పూర్తి ☛ ఎండీయూల కంటే దుకాణాల ద్వారానే సులభతరం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదలకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సరకులను గత ప్రభుత్వం ఎండీయూల ద్వారా త్వరితగతిన ఇంటి వద్దనే అందిస్తామని చెప్పి లబ్ధిదారులను వీధుల్లో నిలబెట్టి పంపిణీ చేసింది. అంతేకాకుండా ఎండీయూల ద్వారా భారీగా రేషన్ బియ్యం పక్కదారి పట్టింది. దీని వెనుక అప్పట్లో వైకాపా నాయకులు కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసి.. లబ్ధిదారులకు సకాలంలో వారికి అనుకూలమైన సమయాల్లో రేషన్ సరకులను అందించాలని కూటమి సర్కారు డిపోల ద్వారా పంపిణీని గత నెలలోనే ప్రారంభించింది. దీనికి లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జులైలోనూ సరకుల పంపిణీ ప్రక్రియ వేగంగా జరుగుతోంది.

పంపిణీ గణాంకాలిలా..
చౌకధరల దుకాణాలు: 972
బియ్యం కార్డులు: 5,89,531
ఎండీయూల ద్వారా
ఏప్రిల్ : 24.07%, మే: 22.80%
చౌకధరల దుకాణాల ద్వారా
జూన్: 37.60%, జులై: 40.95%

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే...

గత వైకాపా సర్కారు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరకులు పంపిణీ చేస్తామని చెప్పి వీధి చివరన వాహనం నిలిపి పంపిణీ చేసింది. వృద్ధులు, దివ్యాంగులు కూడా అక్కడకు వచ్చి తీసుకోవాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ ప్రారంభించాక 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు నేరుగా డీలర్లే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని సూచించింది. ఒకటో తేదీకి ముందుగానే వారి ఇళ్లకెళ్లి సరకులు ఇవ్వాలని సూచించటంతో చాలావరకు 1వ తేదీ నాటికే పూర్తి చేశారు. జులై 1 నుంచి మిగిలిన కార్డుదారులకు దుకాణాల వద్ద పంపిణీ ప్రారంభించారు. కార్డుదారులు వారికి అనుకూలమైన సమయాల్లో వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నారు.

పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ: రాయితీ బియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పంపిణీ చేసిన సరకుల వివరాలను ఆన్‌లైన్‌లో అధికారులు పరిశీలిస్తున్నారు. ఆకస్మికంగా దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. 15వ తేదీ వరకు పంపిణీ ప్రక్రియను సజావుగా సాగేలా సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లతో సమీక్షిస్తున్నారు. ఎక్కడైనా అవాంతరాలు ఏర్పడితే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు.

సాగుహక్కు పత్రాలు తీసుకోండి

కౌలు రైతులకు వ్యవసాయాధికారుల సూచన

మంగళగిరి, న్యూస్‌టుడే: కౌలు రైతులు తప్పనిసరిగా భూమి సాగుహక్కు పత్రాలు తీసుకోవాలని, దీని ద్వారానే పంట నమోదు జరుగుతుందని.. నష్టం జరిగినప్పుడు కౌలు రైతు పేరు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి సచివాలయంలో గురువారం రైతులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో వివిధ పంటల సాగు పద్ధతులపై రైతులతో ఆయన చర్చించారు. ప్రభుత్వం అందించే రాయితీలు, యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా పొందాలనే అంశానికి సంబంధించి సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు వినియోగించాలని కోరారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రైతుల ఖాతాలకు రూ.20 వేలు జమ చేయనున్నదని తెలిపారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ ధాన్యాన్ని భద్రపర్చుకునేందుకు వ్యవసాయశాఖ ద్వారా పట్టాలు ఇవ్వాలని కోరారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శైలజారాణి, దీపిక, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

గోశాల సందర్శన.. పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీసత్య శిర్డీ సాయిబాబా మందిరానికి సంబంధించిన గోమాత-గోశాలను రాజశేఖర్, డిల్లీరావు పరిశీలించారు. నిర్వాహకుడు పాతూరి శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాటికి రాజశేఖర్ ఆహారాన్ని అందజేశారు.

గోశాలలో ఆవులను పరిశీలిస్తున్న రాజశేఖర్, డిల్లీరావు

ప్రమాదం చెప్పి రాదు!

రాజధాని ప్రాంతంలో కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. హైకోర్టు, ఐఏఎస్, ఐపీఎస్‌ల నివాస భవనాల నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లే ఈ మార్గం దెబ్బతిన్న చోట రక్షణ ఏర్పాట్లుగానీ, హెచ్చరిక బోర్డులుగానీ ఏర్పాటు చేయలేదు. వేగంగా వచ్చే వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదానికి గురయ్యే పరిస్థితి. - **ఈనాడు, అమరావతి**

కోతకు గురైన సీడ్‌యాక్సెస్ రోడ్డు

జడ్పీటీసీ సభ్యుల హాజరుపై ఉత్కంఠ

సర్వసభ్య సమావేశం నేడు

జిల్లాపరిషత్తు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ సభ్యుల హాజరుపై ఉత్కంఠ నెలకొంది. గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనుంది. గత మార్చి 15న జరిగిన సమావేశానికి వైకాపా జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరవడంతో కోరం లేక వాయిదా వేశారు. ఆ తర్వాత సమావేశం ఏర్పాటుచేసినా.. కొందరు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యుల విజ్ఞప్తి మేరకు జడ్పీ సీఈవో సమావేశాన్ని వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 వార్షిక జడ్పీ బడ్జెట్‌ని సర్వసభ్య సమావేశం ఆమోదించలేదు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వానికి బడ్జెట్‌ని పంపడంతో ప్రభుత్వం ఆమోదించింది. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు వీలు కుదిరింది.

సభ్యులకు అజెండా ప్రతులు: జిల్లాలో 54 మంది జడ్పీటీసీ స్థానాలు ఉంటే.. శావల్యాపురం జడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి (తెదేపా) మినహా మిగిలిన వారంతా వైకాపాకు చెందినవారే. సాధారణ ఎన్నికలు-2024కు ముందు జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెదేపాలో చేరారు. అప్పటి నుంచి వైకాపాకు చెందిన ఎక్కువ మంది ఛైర్‌పర్సన్‌తో విభేదించి జడ్పీ సర్వసభ్య, స్థాయి సంఘాల సమావేశాలకు గైర్హాజరవుతూ బడ్జెట్ ఆమోదించకుండా మోకాలడ్డుతున్నారనే విమర్శలున్నాయి. సాధారణ ఎన్నికల్లో తెదేపా ఆధ్వర్యంలోని కూటమి పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుపొందారు. ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఏపీ పీఆర్ చట్టం ప్రకారం వరుసగా మూడు సమావేశాలకు గైర్హాజరైతే జడ్పీటీసీ సభ్యులపై అనర్హత వేటు పడే అవకాశముంది. దాంతో జడ్పీటీసీ సభ్యుల ఇళ్లకు వెళ్లి సమావేశం అజెండా ప్రతులను సిబ్బంది అందజేశారు. తమకు సమావేశం గురించి తెలియజేయలేదని ఎవరూ ఆరోపించకుండా ఉండేందుకే జడ్పీ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. సమావేశం అజెండాలో జడ్పీ బడ్జెట్‌తో పాటు 13 శాఖలకు చోటు కల్పించారు. అయితే జడ్పీటీసీ సభ్యుల హాజరుపైనే అందరి దృష్టి ఉంది.

HINDU COLLEGE OF PHARMACY
(Affiliated to Acharya Nagarjuna University and Recognized by Pharmacy Council of India, UGC 2(f) & 12(B)-New Delhi, Certified by ISO-9001-2015
B++ NAAC
Amaravathi Road, GUNTUR-522 002 (A.P.)
FACULTY RECRUITMENT
Applications are invited from qualified, experienced, dynamic and motivated faculty members for the posts of **ASST. PROFESSORS, ASSOCIATE PROFESSORS and PROFESSORS** with specialization in **PHARMACEUTICAL CHEMISTRY, PHARMACEUTICAL ANALYSIS, PHARMACEUTICS, PHARMACOLOGY, PHARMACEUTICAL REGULATORY AFFAIRS, AND PHARMACY PRACTICE, AI / ML on or before 15-07-2025.** B.Pharmacy Qualified candidates are required for the post of Lecturer for D. Pharmacy course.
NON- TEACHING RECRUITMENT
Applications are invited from qualified, experienced, members for the posts **Accountants, Lab Technicians, Supervisors, Computer Operators, Lab Attenders.**
Qualification & Experience as per PCI Norms
Salary: Deserving candidates will be given attractive remuneration commensurate with qualification & experience.
Interested candidates may contact immediately by sending detailed CV to our E-Mail: **hcopgnt@gmail.com** on or before **15-07-2025.**
College Office: 0863-2221935, 9912342122, Principal: 9849127290, OSD: 9849546292
Jupudi Ranga Raju, Chairman
Dr. S. Madhusudana Rao, Secretary & Correspondent

(c) eenadu

లారీలన్నింటికీ ఒకే విధానం అమలు చేయాలి

గోరంట్ల శివారు అమరావతి రోడ్డులో నిరసన తెలుపుతున్న ఇసుక లారీ యజమానుల సంఘం నాయకులు

గోరంట్ల(గుంటూరు), న్యూస్‌టుడే: ఇసుక సరఫరా చేసే లారీలన్నింటికీ ఒకే విధానాన్ని అమలు చేయాలని ఇసుక లారీ యజమానుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గోరంట్ల అమరావతి రోడ్డులో గుంటూరు ఇసుక లారీ సంఘం ఆధ్వర్యంలో లారీలను నిలుపుదల చేసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు శ్రీనివాసరావు, శామ్యూల్ మాట్లాడారు. ప్రభుత్వం ఉచిత విధానాన్ని అమలు చేసే క్రమంలో అదనపు లోడ్‌తో తోలకం చేయాలని చెప్పిన రవాణా శాఖ అధికారులు.. గత నెల రోజుల నుంచి అదనపు టన్నేజ్ తోలకాలు చేపడితే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి లారీ నుంచి నెలనెలా మామూళ్లు గుంజారన్నారు. ఇప్పుడు టన్నేజ్ ఎక్కువగా తోలవద్దని చెబుతున్నారని, అందుకు తాము సమ్మతమేనని, అదే విధానాన్ని అన్ని వాహనాలకు వర్తింపజేయాలని కోరుతున్నామన్నారు. లోడింగ్‌లో ఎటువంటి జాప్యం లేదన్నారు. ఇసుక క్వారీలో లోడింగ్ చేసినందుకు.. క్వారీ తరఫున లారీలకు ఒక ధర, తెలిసిన వాహనాలకు ఒకరకంగా, ఇసుక లారీలకు ఎక్కువ తీసుకుంటున్నారన్నారు. తొమ్మిది నెలలుగా ఉచిత ఇసుక విధానం విజయవంతానికి లారీ యజమానులంతా కృషి చేస్తే.. ఇప్పుడు నిబంధనలు విధిస్తున్నారన్నారు. యజమానులు అత్యంత దారుణమైన పరిస్థితిలో ఉన్నారన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఇసుక సరఫరా చేసే లారీలను నిలుపుదల చేస్తామని, ఇతర జిల్లాల నుంచి వాహనాలను కూడా గుంటూరులోకి రానివ్వబోమన్నారు. నిరసన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సంఘ నాయకులు డేగల ప్రదీప్, తన్నీరు శివ, ఎస్.వి.ఆర్.సి.రామకృష్ణ, వెనిగళ్ల శ్రీనివాసరావు, వెంపా నాగేశ్వరరావు, బోయపాటి రవితేజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అన్నదాతలకు మేలు

మోరంపూడి వద్ద అరటిలో అంతరపంటగా వేసిన బీర

దుగ్గిరాల, న్యూస్‌టుడే

వ్యవసాయంలో విజయం సాధించాలంటే భూమిని సరిగ్గా నిర్వహించాలి. ఇతర వనరులనూ సమర్థంగా వినియోగించుకోవాలి. దీనికి ఒక ప్రత్యామ్నాయ మార్గం అంతరపంటలు. ఏక కాలంలో భూమిలో రెండు, మూడు పంటలు నాటే అంతరపంటల విధానం రైతులకు మేలు చేస్తుందని దుగ్గిరాల ఉద్యానాధికారి శ్రీనిత్య చెప్పారు. అంతర పంటల సాగు గురించి ఆమె వివరించారు.

పరిగణనలోకి తీసుకోవాల్సినవి.. ★ ఒకే సమూహానికి చెందిన పంటలు పండించకూడదు. ★ ఒకటి దీర్ఘకాలిక, మరొకటి స్వల్ప కాలిక పంట అయి ఉండాలి.

★ తృణ ధాన్యాలు-చిక్కుళ్లు, తృణధాన్యాలు-కూరగాయలు ఇలా ఉండాలి. లేదా ఇతర కలయికలు ఉండొచ్చు.

ప్రయోజనాలు ఏమిటంటే..

❖ తక్కువ పంట కాలం ఉన్న మొక్కలు త్వరగా కోతకు వచ్చేస్తాయి. ఎక్కువ కాలం పెరిగే మొక్కలు ఎక్కువ విస్తీర్ణం, పోషకాలను కలిగి ఉంటాయి. ❖ ఖర్చులు తగ్గుతాయి. ఒక పంట కోసం వేసిన బలం మరో పంటకూ ఉపయోగపడుతుంది. ❖ పురుగుమందుల వాడకం కోసం అయ్యే ఖర్చు తగ్గుతుంది. పర్యావరణం సురక్షితంగా ఉంటుంది. ❖ నీరు వంటి ఇతర వనరులు సమర్థంగా వినియోగించుకోవచ్చు. వృథా తగ్గుతుంది. ❖ అధిక సూర్యకాంతి, ఇతర ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి రక్షణ ఉంటుంది. ❖ వేర్వేరు పంటల వల్ల భూమి మరింత సారవంతమవుతుంది. ❖ కలుపు మొక్కలు పెరగడం, వృద్ధి చెందడం తగ్గుతుంది.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల జాబితా విడుదల నేడు

పట్నంబజారు: వాణిజ్యపన్నులశాఖలో బదిలీల ప్రక్రియ శుక్రవారం పూర్తి కానుంది. గుంటూరు-1, 2 డివిజన్లతోపాటు నెల్లూరు పరిధిలోని ఆ శాఖ ఉద్యోగులు గత నెల 15న బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. నిబంధనల ప్రకారం గత నెల 20న బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. గడువును ఈ నెల 4 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. జోన్ పరిధిలో 15 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 42 మంది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు, 15 మంది జీఎస్టీవోలు, 10మంది సీనియర్ అసిస్టెంట్లు, ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు బదిలీ కానున్నారు. అడ్మినిస్ట్రేషన్ గ్రేడ్ ఆధారంగా డిప్యూటీ కమిషనర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లను బదిలీ చేయనున్నారు. ఐదేళ్లు ఒకేచోట పని చేసిన వారిని, గతంలో జోన్-2 (కృష్ణా, గోదావరి జిల్లాలు) పరిధిలోకి వెళ్లిన జీఎస్టీవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం కలగనుంది.

‘నిందితుడు జగన్.. ఫిర్యాదుదారుని ఇంటికెలా పిలుస్తారు’

కాకుమాను, వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: సింగయ్య మృతి కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న మాజీ సీఎం జగన్...ఫిర్యాదుదారు మేరీని ఇంటికి పిలిపించుకుని ఎలా మాట్లాడతారని లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ప్రశ్నించారు. కాకుమానులో ఆయన గురువారం మాట్లాడారు. ఇది చట్టరీత్యా నేరమని. ఈ విషయంలో ఆయన్ను వెంటనే అరెస్టు చేయవచ్చన్నారు. ఆదుకున్న పోలీసులపైనే అనుమానం అనే విధంగా జగన్ సింగయ్య భార్యతో చెప్పించేలా చేస్తున్నారన్నారు. వివేకా హత్య కేసులో కూడా తొలుత విజయసాయిరెడ్డి లాంటి వారితో గుండెపోటు అని జగన్ చెప్పించారన్నారు. అలాంటిది సింగయ్య భార్యతో చెప్పించడం పెద్ద విషయమేమీ కాదన్నారు. సింగయ్య భార్య మాట్లాడుతున్న సమయంలో పక్కనే ప్రత్తిపాడు వైకాపా సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ప్రాంప్టింగ్ అందించడం అందరూ చూశారన్నారు. బెట్టింగులు పెట్టి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఇంటికి వెళ్లి మరీ జగన్ విగ్రహావిష్కరణ చేశారు. దళిత కార్యకర్త కారు కింద పడి మృతి చెందితే వారి ఇంటికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. దీన్నిబట్టి దళితులను జగన్ ఎలా చూస్తున్నారో అర్థం అవుతుందన్నారు. వట్టిచెరుకూరులో మాణిక్యరావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం లేని మనిషని, కారు కింద కుక్కపడినా, కోడి పడినా మనం కారు ఆపుతామని..సొంత పార్టీ కార్యకర్త ఆయన కారు కింద పడి చనిపోయినా కనీసం ఆ కుటుంబాన్ని ఓదార్చలేదన్నారు.

10 వరకు జీవాలకు నట్టల నివారణ మందు

జీవాలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న సహాయ సంచాలకులు డా.సుగన్యరావు

ప్రత్తిపాడు, మేడికొండూరు, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించడం వల్ల వాటి శరీరంలోని అంతర పరాన్నజీవులతో సంభవించే రోగాలను నివారించవచ్చని ప్రత్తిపాడు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డా.సుగన్యరావు చెప్పారు. నట్టల నివారణ మందు తాగించడంతో జీవాల్లో కలిగే ప్రయోజనాల గురించి ఆయన వివరించారు. జీవాలు వివిధ ఆహారాలు తినడంతో పేగులో ఏలద్దెపురుగు, లివర్ పురుగు, గండె పురుగు లాంటివి చేరి వాటి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. అవి తిన్న ఆహారం పురుగులు తినడంతో జీవాలు బక్కచిక్కి అనారోగ్యం బారిన పడి మృతి చెందే అవకాశం ఉంది. ఈ మందు తాగించడం వలన ఆ పురుగులు నశించి జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి. వాటికి పుట్టే పిల్లలు బలంగా, బరువుతో పెరుగుతాయి. జులై 10వ తేదీ వరకు నట్టల నివారణ మందును ఉచితంగా జీవాలకు తాగిస్తాం. గొర్రెలు, మేకలను వైద్యశాలకు తీసుకొస్తే తాగిస్తాం. లేకపోతే జీవాల వద్దకు వెళ్లి తాగిస్తాం. పశుసంవర్ధక శాఖ తరఫున ఏడాదిలో మూడు నెలలకోసారి నాలుగు దఫాలు ఉచితంగా మందు తాగిస్తామని సుగన్యరావు తెలిపారు.

రైతేరాజు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: మిరపలో నల్లతామర, కాయ కుళ్లు, బొబ్బర తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడి, నికరాదాయం ఇచ్చే రకాలు తెలపండి.

- వై.సుబ్బారావు, ప్రత్తిపాడు

శాస్త్రవేత్త సమాధానం: **ఎల్‌సీఏ 625:** వెద పెట్టుకోవడానికి ఈ విత్తన రకం బాగా ఉపయోగపడుతుంది. నారుపోసుకుని కూడా సాగు చేసుకోవచ్చు. కాయలు 2-3 నెలలు నిల్వ చేసినా కూడా రంగు కోల్పోవు. ఘాటు కూడా అధికం. కాయకుళ్లు తట్టుకుంటుంది. మధ్యస్థకాల పరిమితి రకం.

ఎల్‌సీఏ 643: ఇది నల్లతామరను తట్టుకుంటుంది. బొబ్బర తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. కాయలు ఎండాక కొంచెం ముడతతో బాడిగ రకంలా ఉంటాయి. పచ్చి, ఎండుమిర్చికి ఈ రకం అనువైనది.

ఎల్‌సీఏ 657: బొబ్బర తెగులును తట్టుకుంటుంది. మొక్కలు ఎత్తుగా, దృఢంగా నిటారైన కొమ్మలతో ఉంటాయి. బలమైన వేరు వ్యవస్థ ఉంటుంది. అధిక ఘాటు, మంచి రంగు ఉంటాయి.

ఎల్‌సీఏ 680: వెద పెట్టుకోవడానికి, నాటుకోవడానికి అనుకూలం. బొబ్బర తెగులును తట్టుకుంటుంది. మధ్యస్థ ఘాటును, అధిక రంగును ఈ రకం కలిగి ఉంటుంది.

ఎల్‌సీఏ 684: బొబ్బర తెగులును బాగా తట్టుకుంటుంది. వెదకు, నాట్లకు కూడా అనుకూలం. అధికరంగు, అధిక ఘాటు కలిగి ఉంటుంది. ఈ రకంలో నీటిపారుదల కింద ఎకరానికి 25 క్వింటాళ్లు, వర్షాధారం కింద ఎకరానికి 19 క్వింటాళ్ల వరకు ఎండు మిర్చి దిగుబడి పొందొచ్చు. రైతులు వీటిని సాగు చేసుకుని అధిక, నికరాదాయం పొందొచ్చు.

ఇతర వివరాల కోసం: 9989809554, 9440592982 నంబర్లను సంప్రదించవచ్చు.

- డాక్టర్ ఎం.నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త -న్యూస్‌టుడే, కలెక్టరేట్(గుంటూరు)

విత్తన మొలక శాతం గమనించండిలా..!

పొన్నూరు, న్యూస్‌టుడే: పంట విత్తే ముందు రైతులు తప్పనిసరిగా మొలక శాతం తెలుసుకోవాలని పొన్నూరు వ్యవసాయ శాఖాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. మొలక శాతం తెలుసుకోకుండా విత్తితే ఒక్కొక్కసారి మొలకలు

సరిగా రాక విత్తనం ఖర్చు వృథా అవుతుంది. మళ్లీ విత్తేందుకు అదను మించిపోతుంది. వరి విత్తనాల్లో కనీసం 80 శాతానికి పైగా మొలకలు రావాలి. విత్తనాల మొలక శాతం చూసేందుకు ఒక మందపాటి వస్త్రాన్ని తీసుకోవాలి. దానిని నీటితో తడిపి బల్లపై పరచాలి. దీనిపై వంద విత్తనాలను పలుచగా పరచాలి. దీనిపై నీటితో తడిపిన మరో మందపాటి వస్త్రాన్ని కప్పాలి. వాటిని చాపమాదిరిగా చుట్టి ఒక పాత్రలో ఏటవాలుగా పెట్టాలి. తడి ఆరిపోకుండా అప్పుడప్పుడు నీటిని చల్లుతుండాలి. మొలక శాతం తెలుసుకునేందుకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. మూడు, నాలుగు రోజుల నుంచి విత్తనాలు మొలుస్తాయి. ఎన్ని మొలకలొచ్చాయో లెక్కించాలి. వాటిలో 80 శాతం విత్తనాలు మొలకెత్తితే నాణ్యత గల వాటిగా గుర్తించవచ్చు.

‘రెండో విడత భూసమీకరణ విరమించుకోవాలి’

మంగళగిరి, న్యూస్‌టుడే: రాజధానికి రెండోసారి చేపట్టిన భూసమీకరణ విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరింది. మంగళగిరి మండలం కాజలో గురువారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ గతంలో రాజధానికి భూసమీకరణ కింద 33 వేల ఎకరాలను ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇందుకుగాను రైతులకు ఇచ్చిన ప్లాట్లు నేటికీ అభివృద్ధి చేయలేదన్నారు. తాజాగా మరో భూసమీకరణకు ప్రభుత్వం సిద్ధం కావడంపై అభ్యంతరం తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజధాని రైతు సంఘం నాయకులు కొర్రపాటి ఈశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఈదా ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహునికి బంగారు తిరునామం బహూకరణ

ఈవో సునీల్‌కుమార్‌కు తిరునామం అందజేస్తున్న భాగ్యశ్రీ, చిత్రంలో అర్చకులు రఘు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహ స్వామికి అలంకరించేందుకు విజయవాడకు చెందిన భక్తులు మండ శ్రీనివాస్, భాగ్యశ్రీ దంపతులు 24.990 గ్రాముల బంగారు తిరునామాన్ని బహూకరించారు. ఆలయంలో గురువారం ఈవో కోగంటి సునీల్‌కుమార్‌కు తిరునామాన్ని అందజేశారు. దీని విలువ రూ.2.40 లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు.

ఎనిమిది మండలాల్లో స్వల్ప వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. పెదనందిపాడులో 9.4, కాకుమాను 7.2, వట్టిచెరుకూరు 2.4, గుంటూరు పశ్చిమ 2, పొన్నూరు 1.8, ఫిరంగిపురం 1.6, గుంటూరు తూర్పులో 1.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

త్రికోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.82,05,746

నరసరావుపేట, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించామని ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు తెలిపారు. 126 రోజులకు హుండీ లెక్కింపు చేపట్టగా రూ.82,05,746 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కొండపైన రూ.74,54,621, కొండ దిగువన రూ.1,72,385, అన్నదానానికి విరాళాల రూపంలో రూ.5,78,740 ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీలో 28.500 గ్రాముల బంగారం, 562.500 గ్రాముల వెండి, మలేషియా కరెన్సీ ఒకటి, బంగ్లాదేశ్ కరెన్సీ 12 నోట్లు, సింగపూర్ డాలర్లు రెండు, అమెరికా డాలర్లు 48 లభించినట్లు చెప్పారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, GUNTUR DIVISION
E-procurement Tender Notice
NIT No.02 to 06/EE/APEWIDC/2025-26, Dated 03.07.2025
Downloading commencement on 06.07.2025 and closing date may be viewed in e-procurement.gov.in
Short Tenders are invited for Civil works 05 Nos i.e Providing repairs to Shopping complexes in various places in Guntur District Estimate cost ranging from Rs.1.50 Lakhs to 16.50 Lakhs
Further details may be viewed at http://tender.apeprocurement.gov.in contact No. 7730915196 / 9032963647.
Note: Changes/amendments if any will only be communicated through above e-procurement platform.
Sd/- Executive Engineer, APEWIDC, Guntur.

పాత కక్షల నేపథ్యంలో వైకాపా సర్పంచిపై దాడి

దాడి ఘటనలో దృశ్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: పాత కక్షలు నేపథ్యంలో తెదేపా కార్యకర్తలు వైకాపా నేత, మన్నవ సర్పంచిపై దాడి చేసిన ఘటన పొన్నూరు మండల పరిధిలోని కట్టెంపూడి శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మన్నవ సర్పంచి, వైకాపా నేత బొనిగల నాగమల్లేశ్వరరావు, తెదేపా నేతల మధ్య పాత కక్షలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సర్పంచి ఆయన అనుచరులు తెదేపా మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావుపై కత్తులు, కర్రలతో దాడి చేశారు. ఆ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో నెల రోజుల పాటు చికిత్స పొందారు. వైకాపా నేతల ఒత్తిడితో అప్పటి పోలీసులు తెదేపా నేతలపై అనేక అక్రమ కేసులు పెట్టారు. ఈ క్రమంలో పట్టణ శివారులో టీ తాగాడానికి వచ్చిన నాగమల్లేశ్వరరావుపై తెదేపా కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. దాడిలో ఆయన తీవ్రంగా గాయపడడంతో స్థానికులు పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు.. అక్కడి నుంచి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. దాడి ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై కిరణ్‌బాబు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తెనాలి డీఎస్పీ జనార్ధనరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యం

కరపత్రం అందజేస్తున్న పంచుమర్తి అనురాధ, అబద్ధయ్య, శ్రీనివాసరావు

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి పదో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలకు కట్టుబడి తొలి ఏడాదిలో ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందించనున్నారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. గత వైకాపా పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై గత పాలకులు బురద జల్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, తితిదే పాలకవర్గ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెదేపా నాయకులు పోతినేని శ్రీనివాసరావు, పడవల మహేష్, గుత్తికొండ ధనుంజయరావు, షేక్ రియాజ్, వంగర హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	38,018
అమ్మకాలు:	40,612
నిల్వ:	7,525

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	9,500-13,000
నంబర్ 5	10,000-13,200
341	10,000-13,500
4884	10,000-12,200
సూపర్ 10	9,700-12,400

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-13,800
బాడిగ	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000-12,400
ఆర్మూర్	9,700-11,200

ఏసీ కామన్ వెరైటీ

334	9,500-12,800
నంబర్ 5	10,000-13,300
341	10,000-13,400

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-13,500
బాడిగ	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	4,500-7,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

ప్లాస్టిక్ వ్యాపారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మంత్రి భరత్‌ను కలిసిన జయకుమార్, కోటేశ్వరరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్ భరోసా ఇచ్చారని నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుడివాడ జయకుమార్ చెప్పారు. గురువారం ఆయన విజయవాడలో మంత్రిని కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తనను మంత్రి అభినందించారని జయకుమార్ చెప్పారు. అసోసియేషన్‌కు ప్రభుత్వం నూతన భవంతిని నిర్మించి, నిరుద్యోగ యువతకు ప్లాస్టిక్ టెక్నాలజీలో మెలకువల్ని నేర్పించి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూటా ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధ్యాపకుల సంఘం(నూటా) ఎన్నికకు ఈనెల 9న పోలింగ్ నిర్వహించనున్నారు. గురువారం నామినేషన్‌లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఆచార్య సుమంత్‌కుమార్, ఆచార్య బ్రహ్మాజీ, ఉపాధ్యక్ష పదవికి సుబ్బారావు, కార్యదర్శికి ఆచార్య త్రిమూర్తి రావు, ఆచార్య జగదీష్‌నాయక్, సంయుక్త కార్యదర్శి పదవికి ఆచార్య రామచంద్రన్, కోశాధికారి పదవికి ఆచార్య జగదీష్ నాయక్, లింగరాజు, సైన్స్ కళాశాల ప్రతినిధులుగా డాక్టర్ సుధాకర్, లావణ్య, ఆర్ట్స్ కళాశాల ప్రతినిధులుగా ఆచార్య అశోక్ కుమార్, ఆచార్య తులసీదాస్ నామినేషన్‌లు దాఖలు చేశారు. సుమంత్‌కుమార్ వర్గం నుంచి జగదీష్ నాయక్ ఒక్కరే రెండు పదవులకు నామినేషన్ దాఖలు చేశారు. ఆచార్య బ్రహ్మాజీ వర్గం నుంచి అన్ని పదవులకు నామినేషన్‌లు వేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్‌ల ఉపసంహరణ ప్రక్రియ ముగియనుందని ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్ చెప్పారు.

ప్రభుత్వ భూములపై ప్రైవేటు వ్యక్తుల కన్ను

తక్కువ ధరకు దక్కించుకోవడానికి యత్నం

తాడేపల్లి, న్యూస్‌టుడే: రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తక్కువ ధరకు చేజిక్కించుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు పావులు కదుపుతున్నారు. తాడేపల్లిలోని ఐటీసీ వద్ద స్థిరాస్తి వ్యాపారులు విల్లాల నిర్మాణానికి రైతుల నుంచి భూమిని తీసుకున్నారు. వీటికి రోడ్డు కోసం సర్వే నెంబరు 255, 275-1ఎ, 302, 316-1లో 2.04 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన ఆదేశాలతో తాడేపల్లి తహసీల్దారు సదరు భూములను మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు చేసేందుకు దరఖాస్తు వచ్చినట్లు ఏ1 నోటీసులో ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు ఉన్నవారు 15 రోజుల్లోగా తెలియజేయాలని జూన్ 18న నోటీసు జారీ చేశారు. కొంతమంది రైతులు ఆ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తహసీల్దారుకు పత్రాలిచ్చారు. ఆ ప్రాంతంలో అధికారికంగా 2.04 ఎకరాలు ఉందని చెబుతున్నా ఇంకా నాలుగు ఎకరాల వరకు ప్రభుత్వభూమి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. స్థిరాస్తి వ్యాపారి అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే బంధువు కావడంతో దస్త్రాలు చకచకా కదులుతున్నాయన్న ఆరోపణలున్నాయి. రాజధాని అమరావతికి సమీపంలో ఉండటం, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో భూముల విలువ రూ.కోట్లలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమిని తక్కువ ధరకు స్థిరాస్తి వ్యాపారులు కొట్టేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై తాడేపల్లి తహసీల్దారు సీతారామయ్యను వివరణ కోరగా జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం నోటీసు పెట్టామన్నారు. 25 మంది రైతులు అభ్యంతరాలు ఇచ్చారన్నారు. రైతుల అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని జిల్లా యంత్రాంగానికి నివేదిస్తామని చెప్పారు. భూమిని ప్రభుత్వ ధరకు కేటాయించే అంశం జిల్లా యంత్రాంగం పరిధిలో ఉండదని, నివేదిక ప్రభుత్వానికి పంపితే అక్కడ నిర్ణయం తీసుకుంటారని వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 100, రిటైల్ ధర - 122, చికెన్ విత్‌స్కిన్ - 177, చికెన్ స్కిన్‌లెస్ - 201.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95 రిటైల్ ధర 117 చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

వేతనాలిచ్చి ఆదుకోండి



యోగా చేస్తూ నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద పార్కింగ్ ప్రదేశంలో యోగా ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. యోగా చేస్తూ ఆందోళన నిర్వహించారు. ‘మూడేళ్లుగా రాష్ట్రంలోని 907 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1,056 మందిమి యోగా టీచర్లుగా పనిచేస్తున్నాం. ఆయుష్, విద్యా శాఖ నుంచి వెలువడిన జీవో ద్వారా పాఠశాలల్లో చేరాం. విద్యార్థులకు యోగా, ధ్యానం అంశాల్లో శిక్షణ ఇచ్చాం. అప్పటి నుంచి సరిగా వేతనాలు లేకపోయినా పనిచేస్తూ వచ్చాం. మాకు వేతనాలిచ్చి ఆదుకోవాలి’ అని వారు కోరారు. పోలీసులు వారికి నచ్చజెప్పి విద్యాభవన్‌లో వినతిపత్రం అందించాలని పంపించారు.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. ... సంప్రదించండి: 87907 41166.

TO LET
COMMERCIAL
గుంటూరు, ఆఫీసుకు, 1st ఫ్లోర్ ... 1600 S.Ft. ... ✆: 98864 99979, 94926 01716 & 96525 56678.

PEOPLE CARE
OLD AGE HOME
రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. ... ✆ 96062 76677, 82474 49036.

REAL ESTATE
HOUSE FOR SALE
GENERAL
... ✆ 98774 58888.

JOBS
Wanted Experienced Accountant to work on Tally ERP for an interior industry in Narasaraopet, Work timings from 9AM to 6.30 PM. 83310 29045.
Wanted Telecallers Male/Female to work in auto nagar, Guntur. from 9.30 AM to 6.30 PM @ 13,500 PM Contact 83310 29045.
Wanted Part Time Lady Graduate Teachers. Time: 1.00 P.M. to 8.00 P.M. & For Study Hours: 4.00 P.M. to 8.00 P.M. Sri Satya Sai Ideal School, Chowdra, Guntur-3. ✆: 0863-2222114, 2241837.
... ✆: 63090 65666.
... 9959021122/ 9959031122.
... 98123 34678.
... ✆: 77999 77855.

MARKETING/ SALES
Wanted – Public Relations Officer (PRO) for Dental Clinic in Guntur. (M/F). Role: Patient interaction, community outreach, event coordination, and clinic promotion. Contact: 9440303206.

FACULTY/ TEACHERS
Naveena High School, Guntur require qualified Teachers for Maths & Science, English & Social Combinations and Lady P.E.T. 99923 58368.

గమనిక
[illegible]

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

తెనాలి

•తెనాలి •పొన్నూరు

జాతీయ కమిటీకి ఎంపిక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరం, నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి తమ కళాశాల విద్యార్థులు రోహిత్, హిమజ, పూజిత ఎంపికైనట్లు ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. కళాశాలలో గురువారం విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. భార్గవి, సునీల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 2000

అత్యల్పం: 1200

సగటు: 1600

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

డయల్ యువర్ కమిషనర్ నేడు

ఈనాడు మీతోడు

తెనాలి పురపాలక సంఘం పరిధిలోని సమస్యలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరగనుంది. తాగునీరు, పారిశుద్ధ్యం, గుంతల రోడ్లు, వీధి శునకాలు, మురుగు కాలువ పూడిక తీత, వీధి దీపాల నిర్వహణ తదితర సమస్యలపై స్పందించేందుకు కమిషనర్ వల్లూరు మహాలక్ష్మీపతిరావు అందుబాటులో ఉంటారు. ప్రజలు ఫోన్ నంబరుకు నేరుగా తెలియజేస్తే ఆయన స్పందిస్తారు. - **న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

98499 07270
80085 73127

తేదీ: శుక్రవారం (4-7-2025)

సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 వరకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేపట్టాలి. - **ఎ.శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ బాగు చేయిస్తాం. - **జంగం అపర్ణ, సహాయ ఇంజినీరు** ? రైలుపేటలోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **ఎన్.నాగమణి, స్థానికురాలు** ✔ వ్యర్థాలు తొలగిస్తాం. - **శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి - న్యూస్‌టుడే, పొన్నూరు,**

? పట్టణంలోని రామలింగేశ్వరపేట సత్యనారాయణ వీధిలో ఉన్న కొబ్బరి చెట్ల కాయలను తొలగించకపోవడం వల్ల గత నెల 21న వచ్చిన గాలికి అవి విద్యుత్తు తీగలపై పడి తెగిపోయాయి. సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశారు. ఇంకా పలు చోట్ల ఉన్నాయి. మరో సారి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. - **సాయిరాం, స్థానికుడు** ✔ సమస్య పరిష్కరిస్తాం. - **బి.అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగం డీఈ**

స్పందనకు వందనం

★ మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని 29వ వార్డులో పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించారు.

★ తెనాలి పట్టణ నాజరుపేటలో రోడ్డు వెంట వ్యర్థాలు రోజులుగా పడి ఉన్నాయని స్థానికులు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలపగా, స్పందించిన సిబ్బంది వాటిని తరలించారు.

- **న్యూస్‌టుడే, పొన్నూరు, తెనాలి టౌన్**

సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన క్యాన్సర్ ఫ్రీ రహిత సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకమని తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక శారద ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద వ్యాధి రాక ముందు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. 150 మంది మహిళలకు అల్ట్రా స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించారు. తెనాలి, కొల్లిపర మండలాల ఏపీఎంలు జయశ్రీ, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్‌ల దినోత్సవం

తెనాలి టౌన్: అంతర్జాతీయ మోటారు సైకిల్ మెకానిక్‌ల దినోత్సవాన్ని తెనాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ మెకానిక్‌లను సత్కరించారు. తొలుత పట్టణ వహాబ్ చౌక్‌లో పతాక ఆవిష్కరణ చేసి, వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. కరిముల్లా, వెంకటేశ్వరరావు, సంపత్, డేవిడ్, ఖాసిం, గోపి, రాము, రాజారెడ్డి పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలతో 'మమ'

గృహ నిర్మాణ సంస్థలో ఇన్‌ఛార్జులే దిక్కు

నిర్మాణాలపై ప్రతికూల ప్రభావం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాలోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయాల్లో ఏఈ పోస్టులు సకాలంలో భర్తీ చేయక పోవడంతో ఆ ప్రభావం ఇళ్ల నిర్మాణాలపై పడి పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడి ప్రభుత్వ లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో డొల్లతనం, నిర్మాణ సామగ్రి మాయం వంటివి బహిర్గతమయ్యాయి. కూటమి ప్రభుత్వం సత్వరం ఖాళీ పోస్టులు భర్తీ చేసి నిర్మాణ పనులు పరుగు పెట్టించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

✧ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం 1 కింద గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాకు 69,171 ఇళ్లు మంజూరు కాగా 26,538 పూర్తయ్యాయి. ఇంకా 42,633 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. వీటి నిర్మాణంలో కీలకమైన గృహ నిర్మాణ సంస్థ ఏఈ, డీఈఈ ఖాళీ పోస్టులు భర్తీ చేయలేదు. వీటి బాధ్యతలను వర్క్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించి మండల ఇన్‌ఛార్జి హోదా కట్టబెట్టింది. ఇప్పటికే ఉన్న డీఈఈలకు ఇతర నియోజకవర్గాల ఖాళీ డీఈఈ బాధ్యతలు అప్పగించింది.

✧ జిల్లాలోని తెనాలి, తెనాలి రూరల్, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి, తాడేపల్లి రూరల్, పత్తిపాడు, జీఎంసీ, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, తుళ్లూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ, కాకుమాను ఏఈ పోస్టుల భర్తీ చేయకపోవడంతో వర్క్ ఇన్‌స్పెక్టర్లను మండల ఇన్‌ఛార్జిలుగా నియమించి వదిలేశారు.

✧ పొన్నూరు, పెదకాకాని, దుగ్గిరాల, వట్టిచెరుకూరు, గుంటూరు తూర్పు, పశ్చిమకు ఏఈలు కొనసాగుతున్నారు. పొన్నూరు పట్టణ ఏఈకి పొన్నూరు రూరల్, దుగ్గిరాల ఏఈకి మంగళగిరి రూరల్ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

తెనాలి డివిజన్ గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

తెనాలి డీఈఈకి మంగళగిరి డీఈఈ ఇన్‌ఛార్జి, పెదకాకాని ఏఈకి పొన్నూరు డీఈఈ ఇన్‌ఛార్జి, పత్తిపాడు డీఈఈకి తాడికొండ ఇన్‌ఛార్జి, గుంటూరు తూర్పు డీఈఈకి, పశ్చిమ డీఈఈ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

✧ దీనిపై జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులను సంప్రదించగా.. వార్డు సచివాలయాల ఇంజినీర్లు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారని, ప్లానింగ్ సెక్రటరీలు ప్లానింగ్ విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొందరు లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్నట్లు వివరించారు. లేఅవుట్లలోని గృహ నిర్మాణ సంస్థ గోదాముల్లో నిర్మాణ సామగ్రి భద్రంగా ఉంచి అవసరమైన వారికి అందజేస్తున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో ఊహారాణి

చేబ్రోలు, న్యూస్‌టుడే: బ్యాంకుల్లో పొదుపు చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడం సాధ్యమని ఎంపీడీవో ఊహారాణి సూచించారు. ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బ్యాంకు ఖాతాదారుల చైతన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సంపాదనలో 20 శాతం బ్యాంకులో పొదుపు చేయడం మంచిదని చెప్పారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఖాతాదారు కచ్చితమైన లావాదేవీలు నిర్వహిస్తే బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు క్షేత్ర స్థాయి అధికారి సంధ్య, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఉమాదేవి, సంస్థ డైరెక్టర్ సాల్మన్ రాజు, సభ్యులు వెంకటేశ్వరరావు, బాజీ, వెలుగు ఏపీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రగతి.. సంక్షేమం

తెనాలిలో స్థానికుల సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం రెండింటినీ సమన్వయంతో ప్రజామోదంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్సీ, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన తెనాలి పట్టణంలోని 24, 25 వార్డులు, మండలంలోని కటెవరం గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. స్థానికులు తెలిపిన వివిధ సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక పాలన చేసిందని చెప్పారు. ప్రజా వ్యతిరేకతతో ఆ పార్టీ 11 సీట్లే సాధించినా.. ఆలోచన తీరు మారలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సూపర్-6 పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొల్లిపర, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం చివలూరు గ్రామంలో పర్యటించారు. రూ. 4 వేల పింఛన్ పెంపు, తల్లికి వందనం నిధులు జమ చేశామన్నారు. బలహీన వర్గాలకు ఉచిత విద్యుత్తు ఇచ్చిన ఘనత తెదేపా దేనని గుర్తుచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించారు. తెదేపా నాయకులు భీమవరపు కోటిరెడ్డి, ఆళ్ల వీరారెడ్డి, కంచర్ల అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఏఐ ప్రముఖ పాత్ర

విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్యతో ఏపీఎస్‌ఎస్‌డీసీ మాజీ సీఈవో గంటా సుబ్బారావు, ఉపకులపతి పి.నాగభూషణ్

పొన్నూరు, న్యూస్‌టుడే: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తులో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఏపీఎస్‌ఎస్‌డీసీ మాజీ సీఈవో గంటా సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ఏఐ ఫోకస్డ్ యూనివర్సిటీ' అంశంపై అన్ని విభాగాల డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక యుగంలో ఏఐ ప్రాముఖ్యత పెరుగుతుందని వెల్లడించారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

తెనాలి టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో న్యాయవాది విజయలక్ష్మి మహిళా రక్షణ చట్టాలు, పని ప్రదేశంలో వేధింపులు తలెత్తితే ఫిర్యాదులు చేయాల్సిన తీరు తదితర అంశాలను సిబ్బందికి వివరించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ పర్యవేక్షించారు.

సహకార సంఘాల్లో వనమహోత్సవం

మొక్క నాటుతున్న విద్యార్థులు, అధికారులు

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో చేపట్టిన వనమహోత్సవ వేడుకలు ఉద్యోగులు, విద్యార్థులతో ఆహ్లాదంగా సాగాయి. జీడీసీసీ బ్యాంకు ఏజీఎం ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు షేక్ బాజిబాబా, టి.ప్రవీణ్, కొల్లిపర, తూములూరు, అత్తోట పీఏసీఎస్ సీఈవో జి.శివనాగిరెడ్డి, విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో కెమెరాలు స్వాధీనం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ గంగానమ్మపేటలోని దుకాణం నుంచి రెండు కెమెరాలను చోరీ చేసింది అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిగా.. ఇరు పక్షాలు రాజీకి వచ్చారని గురువారం రెండో పట్టణ పోలీసులు వివరించారు. కెమెరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు కాలేదన్నారు.

నీటి నమూనాల సేకరణ

తెనాలి టౌన్: డయేరియా కేసులు నమోదు అవుతున్న క్రమంలో ముందస్తు జాగ్రత్తగా తెనాలి మండలం కొలకలూరు, ఇతర గ్రామాల్లో గురువారం నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం సేకరించారు. ఎంపీడీవో దీప్తి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైపులైను మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

పొన్నూరు, న్యూస్ టుడే : వల్లభరావుపాలెం ప్రధాన రహదారిలో తాగునీటి పైపులైన్‌కు లీకు ఏర్పడి మంచినీరు పోతున్నాయని ఈ నెల 2న 'ఈనాడు'లో 'తాగునీరు వృథా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

పొన్నూరు, న్యూస్‌టుడే : ఎస్‌పీపీ రోడ్డులోని కల్వర్టు వద్ద వ్యర్థాలు పేరుకుని మురుగు కదలక దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం జరిగిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో కమిషనర్ ఎం.రమేష్‌బాబుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ స్పందించి గురువారం పారిశుద్ధ్య కార్మికులతో వాటిని తీయించారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ప్రయాణం.. నరకం..

పట్టణ పరిధిలోని 8వ వార్డు నుంచి కొండమూది రోడ్డుకు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా పాలనలో రహదారి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**

మూత్రశాల ఇలా...స్వచ్ఛత ఎలా?

తెనాలి పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లతో నిత్యం రద్దీగా ఉండే కొత్తపేటలో, బాలురోన్నత పాఠశాల మార్గంలో పురపాలక సంఘం ఏర్పాటు చేసిన మూత్రశాల తీరు దుర్భరంగా ఉంది. పగిలిన బేసిన్లు, పైపులు, పైనుంచి కిందపడిన భారీ చెట్ల కొమ్మలతో అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

- **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

రోడ్డుపై మురుగు.. పట్టించుకోరూ?

మున్సిపల్ మురుగు వ్యర్థాలను కంపోస్టు యార్డుకు తరలించే ట్రాక్టర్లు, ఇతర వాహనాల నుంచి మురుగు జారి తెనాలి బుర్రిపాలెం రోడ్డుపై ఇలా తయారైంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన విభాగం స్వయంగా విభాగంపై ఇలా అధ్వానంగా మార్చడంపై ప్రజలు పెదవి విప్పుతున్నారు. రాకపోకల సమయంలో దుర్వాసన వస్తుందని వాహన చోదకులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ప్రమాదకరంగా స్తంభం

పెదకాకాని నుంచి వెనిగండ్లకు వెళ్లే రోడ్డులో లూథర్‌గిరికాలనీ వద్ద మలుపులో ఓ ప్రైవేటు టెలికాం సంస్థ ఈ స్తంభం ఏర్పాటు చేసింది. మలుపు వద్ద రోడ్డు అంచు చివరలో అడ్డుగా స్తంభం ఉండడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రులు పలువురు గాయాలబారిన పడిన ఘటనలున్నాయని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పెదకాకాని**

సమ్మెలో భాగస్వాములు కావాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కార్పొరేట్ దిగ్గజాలు కోసం 40 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చిన కేంద్రం చర్యలను నిరసిస్తూ 9న జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు భాగస్వాములు కావాలని ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం తెనాలి ఎల్ఐసీ కార్యాలయంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. జాయింట్ సెక్రటరీ వి.వి.కె.సురేష్, ఉపాధ్యక్షుడు జానీ, తెనాలి శాఖ కార్యదర్శి కోళ్లపూడి రాజు, అధ్యక్షుడు వినయ్ కుమార్, నరసింహారావు, పూర్ణనారాయణ, పాలడుగు రాజశేఖర్, ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ కార్యదర్శి కిషోర్ కుమార్, పక్కన సురేష్

పెదకాకాని, న్యూస్‌టుడే : ఈ నెల 9న కార్మికులు నిర్వహించే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ తెలిపారు. పెదకాకానిలోని సుందరయ్య కాలనీలోని సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశానికి ఎస్‌కే బోస్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో శ్రామిక మహిళలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కె.బాబూప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన శ్రామిక మహిళ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

బహిరంగంగా చెత్త వేయొద్దు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రోడ్ల వెంట కొబ్బరి బొండాలు వేయొద్దని మున్సిపల్ కమిషనర్ మహాలక్ష్మీపతిరావు వ్యాపారులను ఆదేశించారు. పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కొబ్బరి బొండాల వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపోస్టు యార్డులో బిగించిన కొబ్బరి బొండాల పీచు తయారీ యంత్రం అందుబాటులోకి వచ్చాక అక్కడికి తెచ్చి వేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఏసీపీ శివన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ ఏసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ మహాలక్ష్మీపతిరావు

★ నిబంధనల ప్రకారం పట్టణంలో భవన నిర్మాణ పనులు చేపట్టేలా ప్లానింగ్ సెక్రటరీలు చూడాలని మున్సిపల్ కమిషనర్ మహాలక్ష్మీపతిరావు సూచించారు. గురువారం వారితో కార్యక్రమంలో ఏసీపీ వాణి, టీపీవో సాంబశివరావు పాల్గొన్నారు.

★ కాలువలు శుభ్రం చేయట్లేదని, చెత్త సేకరించట్లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక హెచ్చరించారు. ఆమె పదో వార్డులోని పారిశుద్ధ్య పనులు పరిశీలించారు.

వసతి గృహం నుంచి రైల్వే స్టేషన్‌కు చేరిన విద్యార్థులు



విద్యార్థులను వార్డెన్‌కు అప్పగిస్తున్న రైల్వే ఎస్సై

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పాఠశాలకు వెళుతున్నామని తెనాలి ఎస్సీ బాలుర వసతి గృహం నుంచి గురువారం బయటకు వచ్చిన విద్యార్థులు కిషోర్‌బాబు, అభిరామ్, జితేంద్ర పాఠశాలకు వెళ్లకుండా తెనాలి రైల్వే స్టేషన్‌కు చేరారు. అక్కడే తిరుగుతున్న విద్యార్థులను గమనించిన రైల్వే పోలీసులు విచారిస్తే తాము వసతి గృహం నుంచి వచ్చామని చెప్పారు. దీంతో రైల్వే ఎస్సై వెంకటాద్రి, వసతి గృహ వార్డెన్‌ను పిలిపించి విద్యార్థులను అప్పగించారు.

విద్యుత్తు అంతరాయం నివారణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం నివారణ, నిరంతర విద్యుత్తు అందించే లక్ష్యంతో పాత లైన్ల మరమ్మతులు, ఇతర పనులు జరుగుతున్నాయి. ఇందు కోసం రూ.30 లక్షలను వెచ్చిస్తున్నారు. ఈ పనులను గురువారం విద్యుత్తు విభాగ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు సీహెచ్.రమేష్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. స్థానికులు, రైతులు తెలిపిన సమస్యల పరిష్కారాలకు హామీ ఇచ్చారు. జిల్లా డీఈఈ ఉదయ్, తెనాలి డీఈ అశోక్‌కుమార్, ఏఈ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం : 06-11-1948

మరణం : 02-07-2025

కీ॥శే॥ డా॥ మందలపు వెంకట సుబ్బారావు గారు

ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు, తెనాలి

మీ పవిత్ర ఆత్మకు శాంతి
చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

ఇట్లు : కుటుంబసభ్యులు

బడిలో... తొలి అడుగు..

నిడుబ్రోలు హైస్కూల్ విద్యార్థులు

పొన్నూరు, న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో విద్యా వ్యవస్థ గాడి తప్పింది. విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని గత వైకాపా పాలకులు గొప్పలు చెప్పారు. పాఠశాలల నిర్వహణ కోసం గత వైకాపా సకాలంలో నిధులు మంజూరు చేయలేదు. దీంతో వివిధ రకాల సమస్యలతో ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను గాడిలో పెడుతున్నారు. పాఠశాలల్లో వివిధ రకాల వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన నిధులు నుంచి 50 శాతం మేర ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

విద్యార్థుల సంఖ్య	నిధుల కేటాయింపు
100	రూ.25 వేలు
100-250	రూ.37.5 వేలు
250-1000	రూ.50 వేలు

20 శాతం కేటాయింపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఎటువంటి ఆర్భాటాలు లేకుండా మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ నెల 10న మెగా తల్లిదండ్రులు నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలకు మంజూరు చేసిన నిధుల నుంచి 20 శాతం ఖర్చు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి దోహద పడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

★ పాఠశాలల సంఖ్య : 1074
★ నిధులు మంజూరైన పాఠశాలలు : 958
★ నిధుల కేటాయింపు : 251.25 లక్షలు
★ తొలి విడత నిధుల మంజూరు : 125.62 లక్షలు

❖ దీనిపై సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ పద్మావతిని న్యూస్‌టుడే వివరణ కోరగా పాఠశాల నిర్వహణ నిధులను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు మేరకు నిధులు ఖర్చు చేయాలని వెల్లడించారు.

నేత్ర వైద్యుడు మృతి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన నేత్ర వైద్యుడు మందలపు వెంకట సుబ్బారావు (77) గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పలువురు పుర ప్రజలు నివాళులర్పించారు.

బంధువుల మధ్య ఘర్షణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ చెంచుపేట డొంక రోడ్డులో బంధువుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడినట్లు గురువారం తమకు ఫిర్యాదు అందిందని త్రీ టౌన్ పోలీసులకు తెలిపారు.

(c) eenadu

మందిర్ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న ముద్దన రాఘవయ్య

రూ.లక్ష విరాళం అందజేత

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడులోని శిరిడీ సాయిబాబా మందిర్‌కు చెందిన అన్నపూర్ణాలయ అభివృద్ధి నిమిత్తం గురువారం పారిశ్రామికవేత్త ముద్దనరాఘవయ్య, నగరాజకుమారి దంపతులు రూ.లక్ష విరాళాన్ని మందిర్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మందిర్ కమిటీ గౌరవాధ్యక్షుడు శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు సురేష్, సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో ప్రధాన రహదారిపై తాగునీటి పైపు లైను వాల్వుకు తరచూ లీకు ఏర్పడుతోంది. వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. **- బాబూరావు, తుళ్లూరు.**
✔ పంచాయతీ సిబ్బందిని పంపి తాగునీటి వాల్వుకు మరమ్మతులు చేయిస్తాం. **-ఆర్.రమణ, పంచాయతీ కార్యదర్శి, తుళ్లూరు.**

? ఐనవోలు గ్రామంలోని సైడు కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. దోమలు బెడదతో ఇబ్బంది పడుతున్నాం. **- వీరయ్య, ఐనవోలు గ్రామం.** ✔ పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాల్వలను శుభ్రం చేయించి దోమల మందు చల్లిస్తాం. **- సాంబిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఐనవోలు.** –న్యూస్‌టుడే, తుళ్లూరు

అస్తవ్యస్త తీగలు సరిచేశారు

ఈనాడు స్పందన

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ జెండా చెట్టు సెంటర్ వీధిలో విద్యుత్తు స్తంభంపై కుప్పలుగా తీగలు, కేబుల్‌వైర్లు అమర్చారు. ఈదురు గాలులకు తీగలు ఊగినప్పుడల్లా చుట్టుపక్కల ఇళ్లలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. నిప్పురవ్వలు సైతం వస్తున్నాయి. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఈనాడులో వెతలు తీర్చండి మహాప్రభో శీర్షికతో ఈనెల 3న కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ నాగమల్లేశ్వరరావు గ్రామంలోని విద్యుత్తు స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్తు, కేబుల్ వైర్లు తొలగించి ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా..

» అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత గుర్తింపుతోనే పోషకాహారం పంపిణీ

లబ్ధిదారుని ముఖ ఆధారిత గుర్తింపు ఫొటో తీస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టి పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పోషకాహారం, సరకులు పక్కదారి పట్టకుండా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ ఆధారిత గుర్తింపునకు సంబంధించి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై పోషకాహారం, బాల సంజీవని కిట్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల ముఖ గుర్తింపు తీసుకుని పంపిణీ చేయనున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 226 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారు.

◆ వైకాపా ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌లు లోపాలమయంగా ఉండడంతో కేంద్రాల్లో సరకులు పక్కదారి పడుతుండేవి. ఈవిషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం పోషకాహారం లబ్ధిదారులకు పక్కాగా అందేలా కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వెళ్లేలా ప్రోత్సహించడంతోపాటు పోషకాహారం పక్కదారి పట్టకుండా ఇటీవల బాల సంజీవని యాప్ 2.0 తీసుకువచ్చింది. రోజూ ఉదయం, సాయంత్రం ముఖ హాజరు తప్పనిసరి చేసింది. ఎంత మంది కేంద్రాలకు వచ్చారో చరవాణి ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి పోషణ ట్రాకర్ పేరుతో మరో ముఖ ఆధారిత యాప్ అమల్లోకి తీసుకొచ్చింది. ఇకపై అంగన్‌వాడీ కార్యకర్తలు బాల సంజీవని యాప్, పోషణ ట్రాకర్ రెండింటిలోనూ వివరాలు నమోదు చేసి ఈకేవైసీ, ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నారు. దీంతో పోషకాహం ఎంత మేరకు పంపిణీ జరిగిందో.. పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు: ప్రత్తిపాడు
మండలాలు: 5
అంగన్‌వాడీ కేంద్రాలు: 226
చిన్నారులు: 2265 (3 నుంచి ఆరేళ్ల వరకు)
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు: 4569
గర్భిణులు: 833
బాలింతలు : 654

● లబ్ధిదారులు సహకరించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, సరకులు లబ్ధిదారులకు ఇచ్చేందుకు వారి ముఖ ఆధారిత హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. లబ్ధిదారులు సహకరించి సరకులు, పోషకాహారాన్ని కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలి.
- జి.విజయలక్ష్మి, సీడీపీవో, ప్రత్తిపాడు.

కాకుమానులో పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తాం

కాకుమాను: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాకుమానులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కాకుమాను, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం, పెదనందిపాడులో పాల్గొన్నారు. కాకుమానులో పొగాకు నిల్వ చేసేందుకు గిడ్డంగిని పరిశీలించారు. రైతుల నుంచి పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆర్థికపరమైన అవసరం లేదన్నారు. గుంటూరు సమీపంలోని చుట్టుగుంట వద్ద ఇప్పటికే కొనుగోలు ప్రారంభించామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో గిడ్డంగిల సమస్య కారణంగా కొనుగోలు ఆలస్యమైందన్నారు. ఆయనన్న బీజీ రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు కూడా పొగాకు చెక్క, కట్టె సమయంలో నల్లటి ఆకును ముంచి ఆకులో కలపవద్దన్నారు. దాని వలన అసలు పూర్తిగా కొనుగోలు నిలిచి పోయే ప్రమాదం ఉంటుందన్నారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును, సీఎం సహాయ నిధి రూ.1.50 లక్షల చెక్కును అందజేశారు. ★ పెదనందిపాడులో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా పాలనలో అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అమరావతిని మూడు ముక్కలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరారు.

చెరువులు బాగు చేయించండి.. చెరువుల్లో నీరు దుర్వాసన వస్తుందని.. పరిసరాలను శుభ్రం చేయించాలని పెదనందిపాడు, నాగులపాడు వాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన పెదనందిపాడు చెరువును పరిశీలించారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఎంపీడీవోలకు ఫోన్ చేసి చెరువులు శుభ్రం చేయించాలని నిధులు అవసరమైతే తనకు చెప్పాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండే వారికి ప్రాధాన్యం.. వట్టిచెరుకూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే వారికి ప్రాధాన్యం ఇస్తామని, పార్టీ ముసుగులో ఉండి నాయకులపై అవాకులు, చెవాకులు పేలిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు వాహిని పొడిగింపు పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

వైకాపా నాయకులు ప్రజల ముందుకు ఎలా వెళతారు.. తిక్కిరెడ్డిపాలెంలో ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్ రెడ్డి భారీగా అప్పులు చేశారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇవ్వలేదని, రోడ్ల గుంతలను కూడా పూడ్చలేదని విమర్శించారు. వైకాపా నాయకులు ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్లారని ప్రశ్నించారు.

న్యాయ అక్షరాస్యత, సామాజిక అవగాహన

దుగ్గిరాల, న్యూస్‌టుడే: గుంటూరులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాల విద్యార్థులు గురువారం కంఠంరాజుకొండూరు దళిత కాలనీ గోవిందయ్య హైస్కూలులో న్యాయ అక్షరాస్యత, సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ కళాశాల విద్యార్థి కడియం కుష్వంత్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. సమాచారహక్కుచట్టం, సైబర్ నేరాలు, వ్యక్తుల సమాచారాన్ని ఎలా చౌర్యం చేస్తున్నారు? వాటిని ఎలా కాపాడుకోవాలి? ఇలా పలు చట్టాలపై న్యాయ విద్యార్థులు వివరించారు. హైస్కూలు కరస్పాండెంట్ డాక్టర్ పోలవరపు రాఘవరావు, న్యాయకళాశాల ప్రిన్సిపల్ చిట్టినేని సుధాకర్‌బాబు, స్కూలు ప్రిన్సిపల్ లంకా రవీంద్రబాబు, కల్పన, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయకళాశాల విద్యార్థులు, కరస్పాండెంట్ రాఘవరావు

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామారావు అన్నారు. స్థానిక తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి. రమణ, రమేష్‌బాబు, జె.రామారావు, రమేష్, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, చంద్రరావు, సుధీర్, శంకరయ్య, రాజేంద్ర, భువనేశ్వరి, లక్ష్మి, శివపార్వతి, సరళా దేవి, రాణి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కార్మికుడి దుర్మరణం

మేడికొండూరు, న్యూస్‌టుడే: కారు ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలేనికి చెందిన షేక్ నాగూర్(45) భవన నిర్మాణ కార్మికుడు. శుక్రవారం పనికి వెళ్లేందుకు తోటి కార్మికుడు షేక్ మస్తాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో ఆయిల్ కొట్టించుకునేందుకు పేరేచర్ల శివారు ఆర్టీ మైలురోడ్డు సెంటర్ వద్దకు వచ్చారు. మస్తాన్ ఆయిల్ కోసం బంకులోకి వెళ్లాడు. నాగూర్ అక్కడే రోడ్డు పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో పేరేచర్ల నుంచి గుంటూరు వైపు అతివేగంగా వెళ్తున్న కారు నాగూర్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. అతనికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడే కుప్పకూలి మరణించాడు. మృతుడి భార్య మదర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక డ్రైవ్

తుళ్లూరు, న్యూస్‌టుడే: వర్షాలు మొదలవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నామని తుళ్లూరు ఎంపీడీవో కె.శిల్ప తెలిపారు. వర్షం నీరు కాల్వల్లో నిల్వ ఉండకుండా బయటకు పోయే లా డ్రెయిన్లలో పూడిక తీయిస్తున్నామని చెప్పారు. గురువారం వెలగపూడి, పెదపరిమి గ్రామాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, వెలగపూడి పంచాయతీ కార్యదర్శి రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు పింఛను ఇవ్వండి

టూ వీలర్స్ దినోత్సవంలో మెకానిక్‌లు

మంగళగిరి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ టూవీలర్స్ మెకానిక్‌ల దినోత్సవం పురస్కరించుకుని మంగళగిరిలో శ్రామికుల టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మెకానిక్‌లలో అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు అందజేయాలన్నారు. రాయితీపై రుణాలు ఇవ్వాలని, వృత్తి పరికరాలు అందించాలన్నారు. ఆధునిక వాహనాలు మార్కెట్లోకి ప్రవేశిస్తున్నందున నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కోరారు. మంగళగిరిలో సామాజిక భవనం ఏర్పాటుకు 10 సెంట్లు స్థలాన్ని కేటాయించాలన్నారు. రెండు, మూడు, నాలుగు చక్రాల మెకానిక్‌లను ఒకేతాటిపైకి తీసుకొచ్చి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరుతున్నట్లు తెలిపారు. షేక్ సలీమ్, బాపనపల్లి వాసు, తిరువీధుల వెంకట సుబ్బారావు, ప్రభాకరరావు, పఠాన్ గౌస్, వీరాంజనేయులు, అజయ్, శివశంకరబాబు, నాగరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. మేరికపూడి, మునగపాడు, పొనుగుపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదని తెలిపారు. **దుగ్గిరాల:** లైన్ల మరమ్మతుల నిమిత్తం గొడవర్రు, వీర్లపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ వసంతరావు గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దుకు డిమాండ్

మంగళగిరి, న్యూస్‌టుడే: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యాన స్థానిక జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు గురువారం మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. మంగళగిరి జేఏసీ కన్వీనర్ మహమ్మద్ ఈసూఫ్, సభ్యులు అబ్దుల్ రషీద్, అబ్దుల్ అజీమ్, బాబావలి, మహమ్మద్ దౌలా, ఫక్రుద్దీన్, నిజాముద్దీన్ తదితరులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

భక్తుల అవసరాలతో వ్యాపారం

కంఠంరాజుకొండూరు ఆలయ పరిసరాల్లో పెరుగుతున్న ధోరణి

దుగ్గిరాల, న్యూస్‌టుడే:

తోటల్లో ఇలా ఏర్పాట్లు

కంఠంరాజుకొండూరు మహంకాళి ఆలయ పరిసరాలు వ్యాపార కేంద్రంగా మారుతున్నాయి. సపోటా తోటలు దీనికి ఆవాసాలవుతున్నాయి. భక్తుల సంఖ్య పెరగడం, తోటలను వినియోగించుకునే వారూ అధికమవడం దీనికి కారణమవుతోంది. కంఠంరాజుకొండూరులోని మహంకాళి అమ్మవారి ఆలయానికి ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు వస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల గుండెల్లో అమ్మవారు కొలువై ఉన్నారు. దుగ్గిరాల మండలం నుంచే కాకుండా తెనాలి, గుంటూరు, విజయవాడ, మంగళగిరి తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ఇక్కడకు వస్తుంటారు. ప్రతి ఆదివారం సగటున 5 వేల మంది అమ్మవారిని దర్శించుకుంటుంటారు.

అమ్మవారి ఆలయ పరిసరాల్లో ఎక్కువగా సపోటా తోటలున్నాయి. అమ్మవారి దర్శనం చేసుకుని భక్తులు ఇక్కడ సేదదీరుతుంటారు. చెట్ల నీడ చల్లగా ఉంటుంది కాబట్టి సాయంత్రం వరకూ ఉండి వెళుతుంటారు. భక్తుల అవసరాన్ని గమనించి మొదట్లో ఆలయం సమీపంలో ఒక రైతు సపోట తోట శుభ్రం చేసి.. తివాచీలు వంటివి వేసి మనిషికి కొంత చొప్పున వసూలు చేసేవారు. ఆలయం పక్కనే తోటలో అలా ఒక్కటే గార్డెన్ ఉండేది. ఇప్పుడు అవి పది అయ్యాయి. రైతుల స్థానంలో వ్యాపారులు వచ్చేశారు. తోటలను లీజుకు తీసుకోవడం, కుటుంబానికి ఇంత అని వసూలు చేయడం అంతా వ్యాపార దృక్పథంతో సాగిపోతోంది.

అన్ని వసతులూ సమకూర్చి..

అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువగా మేక, గొర్రె, కోళ్లు వంటివి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. పొంగళ్లు చేసుకోవడానికి, జంతువుల మాంసాన్ని వండుకోవడానికి గిన్నెలు, గ్యాస్ సిలెండర్, తాగునీరు, మసాలా దినుసులు, బియ్యం, మసాలాను గ్రైండర్ చేసి ఇవ్వడం, బెంచీలు, కుర్చీలు, పట్టాలు తదితరాలన్నీ ఇక్కడ అందుబాటులో ఉంటాయి. సామగ్రి అద్దెకు ఇస్తుంటారు. కావాల్సిన వారికి భోజనం చేసిన ఆకులు తీసేయడానికి, వంట చేసేందుకూ మనుషులను ఏర్పాటు చేస్తున్నారు. అలా సౌకర్యాలు కల్పిస్తూ భక్తులను ఆకర్షించేలా కొత్తగా రిసార్టుల పేరుతో కొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా కొన్ని తోటల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇన్ని వసతులు ఉండడంతో పుట్టినరోజు వేడుకలు, పార్టీలూ చేసుకుంటున్నారు. కొన్ని తోటల్లో మద్యం తాగడానికీ అవకాశం ఇస్తున్నారు. ఇది కొంత ఇబ్బంది పెట్టే పరిస్థితనే చెప్పాలి. భక్తుల ఉల్లాసాన్నీ, ఉత్సాహాన్నీ పూర్తిగా నగదుగా మార్చుకునేలా కొందరు వ్యాపారకోణాన్ని కనబరుస్తున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

మాట్లాడుతున్న సీడీపీవో అనూరాధ

మేడికొండూరు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు నిరోధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని సీడీపీవో అనూరాధ తెలిపారు. మండలంలోని మేడికొండూరు, తురకపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం క్రాఫ్ ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యానేరం..వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉన్నాయని తెలిపారు. మేడికొండూరు సెక్టార్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సునీత మాట్లాడారు. అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రాఫ్ట్ కోఆర్డినేటర్ వెంకట్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, శ్రీనివాసరావు, వీధి నాటక కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కోయవారిపాలెం సమీపంలో గురువారం రాత్రి గుంటూరు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. కొండేపాడు గ్రామానికి చెందిన దాసరి నరేంద్ర ప్రత్తిపాడు నుంచి ద్విచక్ర వాహనంపై కొండేపాడు వెళ్తుండగా, గేదె అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడ్డారు. తలకు గాయమై రక్తస్రావమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అంబులెన్సులో గుంటూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి నాలుగో రోజుకు చేరింది. కార్మికులు నోట్లో చెట్ల ఆకులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు వీవీ జవహర్‌లాల్, దుర్గారావు, బాలాజీ, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘అగస్టిన్‌కు న్యాయం చేస్తాం’

కాకుమాను, న్యూస్‌టుడే : కొమ్మూరుకు చెందిన నక్కల అగస్టిన్‌బాబు గట్టి నాయకుడు. ఆయన పార్టీ కోసం ఎంతో కష్టపడిన వ్యక్తి అని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమానులో తెదేపా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగస్టిన్‌బాబు భార్యకు ప్రత్తిపాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇచ్చేందుకు అందరం ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఆ పదవి అగస్టిన్‌కు ఇవ్వాలని కొల్లా వీరయ్య చౌదరి కూడా తనతో గట్టిగానే వాదించారన్నారు. అయితే పొత్తులో భాగంగా యార్డు ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించాల్సి వచ్చిందన్నారు. అగస్టిన్‌కు అన్యాయం జరిగిన మాట వాస్తవమన్నారు. దానిపై మంత్రి నారా లోకేశ్ స్పందించి మాట్లాడారన్నారు. అగస్టిన్ లాంటి యువ నాయకుడిని ఎలా ఆదుకోవాలో తెలుసునని లోకేశ్‌బాబు చెప్పారన్నారు.

అనుమతి ఉన్న మందులే విక్రయించండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: అనుమతులేని కంపెనీల మందులు, బయో ఉత్పత్తులు అమ్మవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయ్‌బాబు చెప్పారు. మండలంలో విత్తన, ఎరువులు, పురుగుమందులు విక్రయించే డీలర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. అమ్మిన ప్రతి దానికీ బిల్లు ఇవ్వాలని చెప్పారు. వస్తువు మీద ఎంత ధర ఉంటే దానికే అమ్మాలని, అంతకు మించి ధర కూడదని తెలిపారు. నిర్ణీతం సమయం కాగానే లైసెన్స్‌లు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. కర్షకులకు అనవసరంగా మందులు అంటగట్టే ప్రక్రియ ఉంటే చర్యలు తప్పవన్నారు.

‘పేదల కడుపు కొట్టిన జగన్’

అన్న క్యాంటీన్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, స్థలదాత కుటుంబ సభ్యుడు తదితరులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత వైకాపా ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి మూసివేసి పేదల కడుపు కొట్టారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించనున్న అన్నక్యాంటీన్‌కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. అన్న క్యాంటీన్‌కు నావంతు రూ.50వేల సాయం అందిస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. కొందరు పార్టీ నాయకులు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. దాదాపు రూ.9 లక్షల వరకు ఇస్తామని ప్రకటించారు. శంకుస్థాపన పూజ నిర్వహించిన అర్చకుడు పూర్ణచంద్రరావు అన్న క్యాంటీన్‌కు రూ.10వేలు, రాజధాని నిర్మాణానికి రూ.లక్ష సాయం అందిస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యే అభినందించారు. దాతలు ప్రకటించిన విరాళాలను నమోదు చేసుకుని.. సీఎం చంద్రబాబుకు ఈ మొత్తం సాయం అందజేద్దామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్థల దాత బోలే పరమేశ్వరుడు మనవడు ప్రవీణ్ కుమార్‌ను ఎమ్మెల్యే ప్రశంసించారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



పనులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు పేర్కొన్నారు. ఫిరంగిపురం, గొల్లపాలెం గ్రామాల్లో గురువారం చెత్త సేకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తతో సంపద సృష్టి కేంద్రం పనితీరు గురించి ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు చేశారు. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదిదరులు పాల్గొన్నారు.

పంట కాల్వ విషయమై ఫిర్యాదు

శృంగారపురం(దుగ్గిరాల), న్యూస్‌టుడే: శృంగారపురం వద్ద పొలాల్లో గతంలో ఉన్న పంట కాల్వను ఆ గ్రామ మాజీ సర్పంచి మొవ్వా చంద్రశేఖరరావు పూడ్చేస్తున్నారని, దీని వల్ల చేలల్లో నీరు ముందుకు పోయే అవకాశం లేదని చిలువూరుకు చెందిన రైతు సాంబశివరావు ఆరోపించారు. ఇదే విషయమై తహసీల్దార్ సునీతకు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రశేఖరరావు మాట్లాడుతూ తాను తెలుగుదేశం నాయకుడినని గత వైకాపా ప్రభుత్వ హయాంలో తన చేలో నుంచి పంట కాల్వ తీశారని చెప్పారు. తాను తహసీల్దార్‌కు కూడా ఇదే చెప్పానని, సర్వే చేసి చూసుకోవాలని కూడా అన్నానని చంద్రశేఖరరావు చెప్పారు.

టిప్పర్ బోల్తా

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల-ఈమని దారిలో గురువారం సాయంత్రం టిప్పర్ బోల్తా కొట్టింది. కొత్తగా వేస్తున్న రోడ్డుకు గ్రావెల్ తెచ్చిన లారీ రహదారి అంచు వరకూ వచ్చింది. అక్కడ గతంలో ఉన్న వంతెన గోడ కూలిపోవడంతో గుంతలో పడి లారీ బోల్తాపడింది. ఎవరికీ ప్రమాదం లేదు. ఇదే పరిస్థితి నిత్యం ఆ మార్గాన వెళ్లే వందలాది ఇతర వాహనాలకు రాకుండా అక్కడ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఆటోలు, బస్సులు వంటివి పడితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు భయం వ్యక్తం చేస్తున్నారు.

నగదు జమ చేయని వారిపై కేసు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ ఖాతాదారులకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు చేసిన ఉద్యోగులు ఆ నగదును తిరిగి సంస్థకు జమ చేయకపోవడంపై మేనేజర్ కాలాబత్తుల సుధీర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ముహమ్మద్ అలీపఠాన్, గగ్గులోతు నరసింహనాయక్, శెట్టి కిషోర్‌బాబు, భవనాసి సుమంత్, ఉస్తాల వంశీ అనే లోన్ రికవరీ అధికారులు దాదాపుగా రూ.5.30 లక్షలకు సంస్థను మోసగించారని ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
దేవదాయ ధర్మదాయ శాఖ
భూముల టెండర్ కమ్ బహిరంగ కౌలు వేలం ప్రకటన
శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం
బాహుబలేంద్రుని గూడెం గ్రామము, గన్నవరం (మం), కృష్ణా జిల్లా

శ్రీ స్వామివారి దేవస్థానమునకు చెంది సర్వహక్కు భుక్తములు కలిగి గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కొలనుకొండ గ్రామములో వున్న ఈ క్రింది తెలిపిన భూమి కొలనుకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తేది: 10-07-2025 ఉ॥ 10:00 గం॥లకు దేవదాయ అధికారుల సమక్షములో వేలంపాట జరుగును.

భూమి వివరములు

వ. నెం.	భూమి వున్న గ్రామం	ఆర్.యస్ నెం.	విస్తీర్ణం	ధరావత్తు	స్వభావం	కాలపరిమితి
1	కొలనుకొండ	50/1ఎ	3-27	40,000	మాగాణి	2025-2026 నుండి 2027-2028 వరకు 3 సం॥లు

వేలంపాట షరతులు:-

1. ఈ వేలంపాట హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో దేవస్థానం ఈఓ గారిచే నిర్వహించబడును. 2. దేవస్థానమునకు బకాయి ఉన్నవారు గానీ వారి వారసులు గానీ, ఇతర ఎట్టి లావాదేవీలు ఉన్నవారు గానీ పాటలో పాల్గొనరాదు. 3. ప్రతి పాటదారు తన ఆర్థిక స్థితిగతులు తెలుపు పత్రములు అనగా ఆస్తి ఒరిజినల్ దస్తావేజులు/ టైటిల్ డీడ్ పాస్ పుస్తకములు హామీగా పెట్టి నిర్ణయించిన ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. 1 యకరము భూమికి తక్కువ కాకుండా హామీ పత్రము ఇవ్వవలెను. 4. పాటలో పాల్గొనదలచిన వారు పాటకు ముందుగా రూ.40,000/- ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను. 5. హెచ్చుపాటదారు పాట పాడుకొన్న మొత్తము సొమ్మును పాట ముగిసిన వెంటనే చెల్లించవలెను. (ముందస్తు క్యాష్ చెల్లింపు) 6. అట్లు చెల్లించనియెడల ఆ ధరావత్తును దేవస్థానమునకు ఫర్‌ఫీట్ చేసుకొని మరల తిరిగి పాట పెట్టబడును. 7. మిగతా పాట షరతులు పాట కాలమునందు తెలియపరచబడును.

ఇట్లు
యమ్. తేజ
కార్యనిర్వహణాధికారి

సెల్: 98908 57961

(c) eenadu

గుంటూరు తూర్పు

వాహనదారుల నుంచి రూ. 1.71 లక్షల జరిమానా వసూలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నగరంలో ప్రయాణిస్తున్న వాహనదారులపై గురువారం లాలాపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. హిమని సెంటర్లో సి.ఐ. శివప్రసాద్‌తోపాటు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రికార్డులు లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులపై 37 కేసులు నమోదు చేసి, అపరాధ రుసుంగా రూ. 1.71 లక్షలు వసూలు చేసినట్లు తూర్పు విభాగపు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.లో) టమాట 34, వంగ 24, బెండ 23, పచ్చిమిర్చి 34, కాకర 30, క్యారెట్ 41, క్యాబేజీ 21, బీర 20, దొండ 36, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 34, దోస 15, పొట్ల 18, చామదుంప 28, మునగ 10, గోంగూర 8, తోటకూర 15, చుక్కకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 37, కంద 34, క్యాప్సికం 70, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 64, సొర 12, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

● ఆర్టీసీ కాలనీ సాయిబాబాగుడి రోడ్డు పైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకు ఆటంకంగా ఉందని నర్సిరెడ్డి 'మేమున్నాం... మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించి తరలించారు. ● గణేష్‌రావుపేట మూడోలైన్‌లో చెత్తకుప్పలు అలాగే వదిలేయడం వల్ల వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికుడు ఇమ్రాన్ 'మేమున్నాం... మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాక్టర్ పంపి చెత్తకుప్పలు తీయించి తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

శంకర్‌విలాస్ పైవంతెన పనులు వేగవంతం

న్యూస్‌టుడే - నెహ్రూనగర్

బ్రాడీపేట వైపు 21వ పిల్లర్ పనులు ప్రారంభం

శంకర్‌విలాస్ పైవంతెన నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. కొద్ది రోజుల కిందట తూర్పు పరిధిలో పిల్లరు నిర్మాణ పనులు ప్రారంభించగా తాజాగా పశ్చిమ పరిధి లోనూ పనులు మొదలయ్యాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా పైవంతెన మీదుగా పూర్తిగా రాకపోకలను నిలిపేయాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ నగర ప్రజలకు ఎంతో కీలమైన మార్గం కావడంతో పోలీసులు సాధ్యమైనంతవరకు వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడడానికి ప్రయత్నిస్తున్నారు. తూర్పు పరిధిలో 1వ నంబర్ పిల్లర్ నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో ఏంటీబీ కూడలి నుంచి ఉల్ఫూహాలు మీదుగా పైవంతెన మీదకు వాహనాలు వెళ్లడానికి ప్రత్యేకంగా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయించారు. అరండల్‌పేట వైపు నుంచి పైవంతెన మీదుగా వచ్చే వాహనాలను జీజీహెచ్ వద్ద పనులు జరుగుతున్న ప్రాంతం పక్కనే ఇనుప బారికేడ్లు పెట్టి పంపిస్తున్నారు. గుంటూరు పశ్చిమవైపు 21వ పిల్లర్ పనులు మొదలవ్వడంతో బ్రాడీపేట వైపు వంతెన దిగువ ప్రాంతంలో ఉన్న గోడలు తొలగించి ఇనప బారికేడ్లు అడ్డు పెట్టి అక్కడి నుంచి బ్రాడీపేట 3వ వీధి వైపు వాహనాలను మళ్లించారు. త్వరలో 20వ నంబరు పిల్లరు పనులు మొదలవుతాయి. దీంతో తూర్పువైపు నుంచి వచ్చే వాహనాలు బ్రాడీపేట 3వ వీధి నుంచి 4వ వీధి మీదుగా ప్రయాణించేలా చర్యలు తీసుకున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను, ట్రాఫిక్ మళ్లింపును తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ రమేష్ పరిశీలించారు. సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బ్రాడీపేట వైపు పనులు ప్రారంభమవ్వడంతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా పైవంతెన మీదుగా వాహనాలు వెళ్లటానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసులకు సహకరించాలని కోరారు. పైవంతెన మీదుగా కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు అతివేగంగా వెళ్లకూడదని తెలిపారు.

వాహనాల మళ్లింపును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, సీఐ అశోక్‌కుమార్

ఎంటీబీ నుంచి వచ్చే వాహనాలకు అప్రోచ్ రోడ్డు మీదుగా శంకర్‌విలాస్ పైవంతెన వైపు మళ్లింపు

విద్యార్థులను చితకబాదుతారా?

మాట్లాడుతున్న యశ్వంత్, పక్కన సాయి, అమర్నాథ్

గుంటూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: విద్యార్థులను చితకబాదిన కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి యశ్వంత్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో కలిసి మాట్లాడారు. మంగళగిరి సమీపంలోని ఓ కళాశాలలో స్లిప్ టెస్టు రాయలేదని 15 మంది ఇంటర్ విద్యార్థులను విచక్షణ రహితంగా చితకబాదారని ఆరోపించారు. అర్థం కాకపోతే ఒకటికి రెండుసార్లు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు... విద్యార్థులను వాతలు పడేలా కొడతారా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఇంటర్‌బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సాయి, అమర్నాథ్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

వాకింగ్ ట్రాక్ అభివృద్ధి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ నడక అలవాటు చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సూచించారు. అందుకోసం వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నల్లచెరువు వాకింగ్‌ట్రాక్‌ను ఆయన గురువారం పరిశీలించారు. వాకర్స్‌తో మాట్లాడారు. వాకింగ్ ట్రాక్ పరిస్థితి ఎలా ఉంది? ఏమేం సౌకర్యాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. ఈ ట్రాక్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. పచ్చదనం, పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మినీ లారీ ట్రాన్స్‌పోర్టు రోడ్డును ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ రోడ్డు వెడల్పు 40 అడుగులే ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, దీనిని 60 అడుగులుగా విస్తరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జ్యోతి, తెదేపా నాయకులు షమీద్, మాలకొండయ్య, శ్రీనివాసరావు, ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మెకానిక్ డే వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. కేక్ కోసి కార్మికులకు తినిపించారు.

దేశ పురోగతికి వినూత్న ఆవిష్కరణలే కీలకం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: దేశ ఆర్థిక పురోగతికి వినూత్న ఆవిష్కరణలే కీలకమని అందుకు తగ్గట్టుగా అధ్యాపకులు.. విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని కర్ణాటకలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, వాధ్వానీ ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ సభ్యులు డాక్టర్ సుబ్రహ కేశవ్ పేర్కొన్నారు. గురువారం చౌడవరం ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఐడియా, డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆవిష్కరణాత్మక ఆలోచనలు, అభివృద్ధి చెందిన డిజైన్ పద్ధతులు, స్టార్టప్ వ్యాపారాల ప్రారంభానికి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర తదతరులు పాల్గొన్నారు.

రూ.10 ఉంటేనే రైల్వే స్టేషన్‌కు వెళ్లాలి

పార్కింగ్ ఫీజు పేరుతో బాదుడు

గుంటూరు రైల్వే: మీ వద్ద కనీసం రూ.10 ఉంటేనే వాహనంపై గుంటూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లాలిన పరిస్థితి నెలకొంది. గుంటూరు తూర్పు వైపు రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్దకు ఏ వాహనం వెళ్లాలన్నా ముందుగానే రుసుం వసూలు చేస్తున్నారు. అధికారులు రోడ్డు కూడా ఇస్తున్నారు. వెంటనే వస్తామన్నా వదలడంలేదు. రైలు వెళ్లిపోతుందేమోనని లోపలికి వెళ్లాలనే తొందరలో నిబంధనలు ఏమిటి అని ప్రశ్నించకుండానే అడిగిన మొత్తం చెల్లించి లోపలికి వెళ్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న గుత్తేదారు ప్రతినిధులు ముందుగానే ఫీజు వసూలు చేస్తుండడం గమనార్హం.

ఐదు నిమిషాలు ఉచితం: గుత్తేదారు.. వాహనదారుల వద్ద ఫీజు వసూలు చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. లోపలికి ప్రతి వాహనం ఆ మార్గం నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే వాహనం రాగానే రూ.10 వసూలు చేసి రశీదు ఇస్తున్నారు. వాస్తవానికి రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వరకు వెళ్లి తిరిగి ఐదు నిమిషాల్లో వచ్చే వాహనాలకు ఎలాంటి రుసుం వసూలు చేయకూడదని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అందుకు సంబంధించిన బోర్డును గుత్తేదారు ఏర్పాటు చేశారు. ఉచితం అని తెలియజేసే నిబంధనను అందరికీ బాగా కనిపించకుండా చాలా చిన్న అక్షరాలతో రాసి ఉంచారు. దీనిని ఎవరూ గమనించడంలేదు. ఎవరైనా తెలిసి అడిగినా ముందుగా రుసుం చెల్లించాల్సిందేనని, అక్కడి సిబ్బంది వాదనకు దిగుతున్నారు. అక్కడే ఉంటే రైలు వెళ్లిపోతుందేమోనని ఆందోళనతో అడిగినంత ఇచ్చి వెళ్తున్నారు. స్టేషన్ లోపలికి వాహనం వెళ్లే సమయంలో రశీదు ఇవ్వాలి. అందులో సమయం నమోదవుతుంది. తిరిగి వచ్చే సమయంలో ఐదు నిమిషాల లోపు ఉంటే ఎటువంటి రుసుం వసూలు చేయకూడదు. అంతకుమించి ఎక్కువగా ఉంటే మొదట 10 నిమిషాలకు రూ.10 ఆ తర్వాత ప్రతి 15 నిమిషాలకు రూ. 15 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ నిబంధన సక్రమంగా అమలు చేయడంలేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయడంలేదని సంబంధిత రైల్వే ఉద్యోగులు తెలుపుతుండడం గమనార్హం. 139కి కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచిస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

రహదారులపై చెత్త వేస్తే అపరాధరుసుం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. గురువారం కమిషనర్ పాతగుంటూరు, సుద్దపల్లిడొంక, బాలాజీనగర్, పొన్నూరురోడ్డు, కేవీపీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు బృందాలుగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. రహదారులు, కాలువల్లో చెత్త వేయకుండా అడ్డుకోవాలని సూచించారు. జాతీయ రహదారి వెంట కొబ్బరి బొండాలు, నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై అపరాధరుసుం విధించాలని ఆదేశించారు. కార్మికులు ఉదయం ఇంటింటి చెత్త సేకరించి, మధ్యాహ్నం మురుగుకాలువలు శుభ్రం చేయాలన్నారు.

పారిశుద్ధ్యం పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరంలో నాకాబందీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో గురువారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో కొత్తపేట, పాతగుంటూరు, లాలాపేట, నగరంపాలెం, అరండల్‌పేట, పట్టాభిపురం పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాజ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, లాలాపేట, చుట్టుగుంట, లక్ష్మీపురం, అమరావతిరోడ్డు తదితర ప్రధాన కూడళ్లలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పెద్ద సంఖ్యలో సిబ్బందితో రహదారులపై ఉండటంతో నగరవాసులు కొంత ఆందోళన చెందారు. వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పోలీసులకు చిక్కకుండా వెనక్కి తిరిగి వెళ్లే ప్రయత్నాలు చేశారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్న వాళ్లు, పత్రాలు లేనివాళ్లు, డ్రైవింగ్ లైసెన్సు, శిరస్త్రాణం లేనివారిపై సుమారు 300కుపైగా కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఏఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు అజీజ్, అరవింద్, శివాజీరాజు, రమేష్, భానోదయ, శ్రీనివాసరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నాజ్‌సెంటర్‌లో వాహనాల తనిఖీలు

విచారణ వాయిదా

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఓ విద్యార్థి వేధిస్తున్నాడంటూ సర్వజనాసుపత్రిలో పారామెడికల్ కోర్సు అభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థినులు జిల్లా పాలనాధికారికి నేరుగా ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం విచారణకు హాజరుకావాల్సిందిగా ముందుగానే వారికి రాతపూర్వకంగా సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో కమిటీ సభ్యులు విచారణను వాయిదా వేశారు.

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

ఎన్టీఆర్ ఐలాండ్ సెంటర్ నుంచి మాయ బజారు సెంటర్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దాని చుట్టూ రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. పాతబస్టాండు సెంటర్ నుంచి ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించటంతో వాహనదారులు ఇటువైపుగా రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రదేశంలో అధికసంఖ్యలో ఇళ్లున్నాయి. చుట్టుపక్కల నిత్యం విద్యార్థులు ఆటలాడుతుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - న్యూస్‌టుడే, పట్నంబజారు

అడ్డంగా వేస్తే రాకపోకలు ఎలా?

కొత్తపేటలోని బోసుబొమ్మ కూడలి నుంచి వస్త్ర దుకాణాలకు వెళ్లే మార్గంలో రహదారిపై అడ్డంగా కంకర రాళ్లు, ఇసుకను కుప్పలుగా వేసి వదిలేయంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఇటుగా ఆలయాలు, హోల్‌సేల్ ఔషధ దుకాణాలు, వస్త్ర వ్యాపార సముదాయాలు ఉండటంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రధాన రోడ్డుపై అడ్డంగా ఇసుక, కంకర వేయడంతో వాటిపై ప్రయాణించే సమయంలో వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వాపోతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

పైపు తగిలి పడిపోతున్నారు

జిన్నాటవర్ సెంటర్లో ఇటీవల పైపులైను పనులు చేశారు. ఈ క్రమంలో హిమని కూడలి నుంచి నగరపాలక సంస్థకు వెళ్లే మార్గంలో ఓ భారీ పైపును బయటకు వదిలిపెట్టారు. చుట్టూ రక్షణ చర్యలు తీసుకోలేదు. ఇటుగా నగరపాలకసంస్థ కార్యాలయానికి, కూరగాయల మార్కెట్‌కు, పండ్లమార్కెట్ తదితర ప్రాంతాలకు జనం పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీగా ఉండే రహదారిపై భారీపైపును అలా వదిలేయడంతో అటుగా వెళ్తున్నవారి కాళ్లకు తగిలి పడిపోతున్నారని పాదచారులు వాపోతున్నారు. రాత్రివేళల్లో మరింత ప్రమాదకరంగా మారింది. - న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

రాకపోకలకు అడ్డుగా ఉన్న పైపు

ఎల్ఐసీలో ఖాళీలు భర్తీ చేయండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వరంగ ఎల్ఐసీని బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం విడనాడాలని సౌత్ సెంట్రల్‌జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం అరండల్‌పేటలోని కార్యాలయంలో మాట్లాడారు. ఎల్ఐసీలో వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వెంటనే భర్తీ చేయాలన్నారు. జులై 9న సార్వత్రిక సమ్మెలో అసోసియేషన్ కూడా భాగస్వామిగా ఉందని తెలిపారు. నాయకులు వీవీకే సురేష్, శ్రీనివాస్, సైదులు, వెంకట్రావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో విభాగాల వారీగా కోర్టు కేసుల పరిష్కారంపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ విభాగాల వారీగా ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆయా సంస్థలు, వ్యక్తులు ఫైల్ చేసిన కోర్టు కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. కేసుల్లో నగరపాలకసంస్థ నుంచి తీసుకోవాల్సిన చర్యల్లో లోపం ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి గురువారం కేసుల పురోగతిపై సమీక్ష చేస్తామని, రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు, ప్యారావారీ రిమార్క్స్ వంటివి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, డీసీలు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

మాట్లాడుతున్న డీఎస్పీ అరవింద్

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాల గురించి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ అరవింద్ సూచించారు. గురువారం స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా సంస్థ (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం అధ్యక్షత వహించారు. డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ షేర్ మార్కెట్, లోన్‌యాప్స్, వివిధ ఉపాధి రంగాల్లో జరిగే మోసాల గురించి తెలుసుకోవాలని.. వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఇలాంటి మోసాల గురించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం చెప్పాలన్నారు. విద్యార్థులు మద్యం, పొగాకు, గంజాయి వంటివాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ కేసులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.సీతారామయ్య, జె.శివజ్యోతి, సీహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నజీర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాల్యాద్రి, వెంకట్రావు, అంజిబాబు, సద్గుణరావు, దీవెనరావు

వేతనాల పెంపునకు సహకరించండి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచేందుకు సహకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి మాల్యాద్రి కోరారు. గురువారం ఎమ్మెల్యే నసీర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వెంకట్రావు, అంజిబాబు, సద్గుణరావు, దీవెనరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

ఎస్వీఆర్‌కు నివాళి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: ఎస్వీ రంగారావు ఏ పాత్రనైనా అవలీలగా పోషించి మెప్పించారని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఎస్వీ రంగారావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో మకుటం లేని మహారాజు ఎస్వీఆర్ అని, ఆయన సినీ పరిశ్రమకు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు.

ఆఖరి మజిలీలోనూ అవస్థలే

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. డొంకరోడ్డు, ఏటుకూరురోడ్డు, సుద్దపల్లిడొంకరోడ్డు ప్రాంతాల్లోని శ్మశానవాటికల మాదిరిగా ఇక్కడ సౌకర్యాలు సమకూరలేదు. శిథిలావస్థకు చేరిన బెంచీలు, కర్మకాండలు చేసుకొనేందుకు తగిన వసతులు లేక అధిక శాతం మంది నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేటు సత్రాలను ఆశ్రయిస్తున్నారు. పదేళ్ల కిందట ఇక్కడి శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు అప్పట్లో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వాటిక ముందు భాగంలో శివపార్వతుల విగ్రహాలతో ద్వారం ఏర్పాటు, చుట్టూ గోడ, కర్మకాండలు చేసుకొనే వారికి సౌకర్యం ఉండేలా రెండు గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల లేమి సాకుతో వాటిని సగంలో ఆపేశారు. ఇక్కడ నిత్యం 6 నుంచి 7 వరకు మృతదేహాల దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అంత్యక్రియల అనంతరం తలస్నానాలు చేసేందుకు నీటి సౌకర్యం లేదు. అందుబాటులో ఉన్న బావిలో నీరు పాచి పట్టి ఉంది. కొందరు చేసేది లేక ఆ బావి నీటినే వినియోగిస్తున్నారు. దీనివల్ల చర్మవ్యాధులు సోకుతున్నాయి. అస్తికలను శ్మశానవాటికలోనే ఉంచి, రైతుబజారు సెంటర్లో ఉన్న ప్రైవేటు సత్రాల్లో కర్మకాండలు చేసుకొంటున్నారు. దీంతో కొందరు ప్రైవేటు సత్రాల నిర్వాహకులు అద్దె, వంట సామగ్రి, టెంట్ల ఏర్పాటు, పని వారికి జీతాలు, విద్యుత్ ఛార్జీల పేరుతో హెచ్చు మొత్తాల్లో వసూళ్లు చేస్తున్నారు. ఒకవైపు సన్నిహితులను పోగొట్టుకుని దుఃఖంతో బాధపడుతుంటే.. మరోవైపు సత్రాల నిర్వాహకులు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని కొంతమంది ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి హిందూ శ్మశాన వాటికలోనే కర్మకాండలు చేసుకొనేలా సౌకర్యాలు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

హిందూ శ్మశాన వాటికలో ఇటీవల కూల్చేసిన ద్వారం ముందు భాగం

నిలువ నీడ లేదు!

పట్నంబజారు, న్యూస్‌టుడే

నగర ప్రధాన రహదారుల్లో బస్సు షెల్టర్ల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. బస్టాండు సెంటర్, ఏటుకూరురోడ్డు, మార్కెట్ సెంటర్, కాకాని రోడ్డు, హిందూ కాలేజీ సెంటర్లల్లో బస్సు షెల్టర్లు పాడై నెలలు గడుస్తున్నా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. బస్సుల రాక కోసం ఎదురుచూసే ప్రయాణికులు రోడ్లపై నిలబడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనాలు ఢీకొని గాయాలపాలవుతున్నారు. కాకానిరోడ్డులోని బస్సు షెల్లర్‌లో బల్లలు, టైల్స్ పాడై ఏడాది కావస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని బస్సు షెల్టర్ మందుబాబులకు నిలయంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వేస్టేషన్‌కు వచ్చే వారు ఆటోల కోసం రోడ్లపై నిలబడుతున్నారు. బస్టాండు సెంటర్‌లో రెండేళ్ల కిందట గాలి వానకు షెల్టర్ పక్కకు వాలింది. అప్పట్నుంచి ఆ ప్రాంతంలో కొత్తది నిర్మించలేదు.

కాకాని రోడ్డులోని బస్సు షెల్టర్‌లో పాడైన టైల్స్

ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్లోని బస్సు షెల్టర్‌లో మందుబాబులు

ఏసుక్రీస్తు చూపిన బాట అనుసరణీయం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో తోటివారికి సాయం చేస్తూ ముందుకు సాగాలని డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో గురువారం ఏపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్కా చంద్రపాల్ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్‌డే వేడుకలు నిర్వహించారు. తొలుత పలువురు కేక్ కట్ చేసి క్రిస్టియన్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిలకా విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐక్యంగా ఉండి క్రైస్తవత్వాన్ని కాపాడుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాచకొండ జాన్‌బాబు, చర్చి ఫాదర్లు కె.జ్యోతి రాజు, సతీష్‌బాబు, ఎ. జాన్సన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు

ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ రిజర్వేషన్ అమలు చేయాలి

ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్

సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్‌చౌదరి

పట్నంబజారు, న్యూస్‌టుడే: దేశంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కరీం ఆధ్వర్యంలో గురువారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న పేపర్ లీక్‌లను అరికట్టాలన్నారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. గతేడాది నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కరీం మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి. పక్కన అరుణ్‌కుమార్, హనుమంతరావు, లక్ష్మణరావు, కిశోర్, సత్యనారాయణ,

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, హనుమంతరావు, వివిధ సంఘాల నాయకులు కిశోర్, బాషా, సత్యనారాయణ, శ్రీనివాసరావు, మాల్యాద్రి, అంజిబాబు, శివాజీ, రంగారెడ్డి, జగన్నాథం, రాంప్రసాద్, చైతన్య, శ్రీను, రామారావు, డేగల వెంకటేశ్వరరావు, వలి, ఖాసిం, రమణ, సలీమ్, యశ్వంత్ పాల్గొన్నారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ



కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 34, వంగ 34, బెండ 24, పచ్చిమిర్చి 34, కాకర 45, బీర 36, క్యాబేజి 21, క్యారెట్ 41, దొండ 36, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 34, దోస 15, సొర 15, పొట్లకాయ 18, అరటికాయ 7, చామదుంప 28, బీట్‌రూట్ 37, కీరదోసకాయ 39, బీన్స్ 84, క్యాప్సికమ్ 74, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 30, అల్లం 58, వెల్లుల్లి 110.
- న్యూస్‌టుడే, పట్టాభిపురం

గవర్నర్, మంత్రితో మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా భేటీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఏపీ, తెలంగాణ సంయుక్త రాష్ట్రాల జనరల్ ఆఫీసర్-కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా గురువారం అమరావతిలో పర్యటించారు. గవర్నర్, విద్యాశాఖమంత్రి, పలువురు అధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి మాజీ సైనికుల సంక్షేమం, ఏపీ భద్రతలో సైనిక సహకారం వంటి అంశాలపై సంభాషించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ప్రత్యేకంగా సమావేశమై సైనిక పాఠశాలల స్థాపన, పనితీరుపై చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌తో పాలనలో సంక్షేమం, డీజీపీ హరీష్ కుమార్‌గుప్తాతో శాంతి భద్రతలు, నిఘా సమాచారం తదితర అంశాలపై చర్చించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి.

జ్ఞాపిక అందిస్తున్న మంత్రి నారా లోకేశ్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

స్పందనకు వందనం

చెత్త తొలగింపు: రైలుపేటలోని ప్రధాన వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు.

కాలువల్లో పూడికతీత: మస్తాన్‌దర్గా వెనుక వీధుల్లోని కాలువలో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

పార్కింగ్ ఫీజు పేరుతో బాదుడు

రైల్వే స్టేషన్‌కు వాహనంపై వెళ్తే రూ.10 వసూలు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే

మీ వద్ద కనీసం రూ.10 ఉంటేనే వాహనంపై గుంటూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుంటూరు తూర్పు వైపు రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్దకు ఏ వాహనం వెళ్లాలన్నా ముందుగానే రుసుం వసూలు చేస్తున్నారు. అధికారికంగా రసీదు కూడా ఇస్తున్నారు. వెంటనే వస్తామన్నా వదలడంలేదు. రైలు వెళ్లిపోతుందేమోనని లోపలికి వెళ్లాలనే తొందరలో నిబంధనలు ఏమిటి? అని ప్రశ్నించకుండానే అడిగిన మొత్తం చెల్లించి లోపలికి వెళ్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుంటున్న గుత్తేదారు ప్రతినిధులు ముందుగానే ఫీజు వసూలు చేస్తుండడం గమనార్హం.

ఐదు నిమిషాలు ఉచితం

గుత్తేదారు.. వాహనదారుల వద్ద ఫీజు వసూలు చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. లోపలికి వెళ్లే ప్రతి వాహనం ఆ మార్గం నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అక్కడికి వాహనం రాగానే రూ.10 వసూలు చేసి రసీదు ఇస్తున్నారు. వాస్తవానికి రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వరకు వెళ్లి తిరిగి ఐదు నిమిషాల్లో వచ్చే వాహనాలకు ఎలాంటి రుసుం వసూలు చేయకూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అందుకు సంబంధించిన బోర్డును గుత్తేదారు ఏర్పాటు చేశారు. ఉచితం అని తెలియజేసే నిబంధనను అందరికీ బాగా కనిపించకుండా చాలా చిన్న అక్షరాలతో రాసి ఉంచారు. దీనిని ఎవరూ గమనించడంలేదు. ఎవరైనా తెలిసి అడిగినా ముందుగా రుసుం చెల్లించాల్సిందేనని, అక్కడి సిబ్బంది వాదనకు దిగుతున్నారు. అక్కడే ఉంటే రైలు వెళ్లిపోతుందేమోనని ఆందోళనతో అడిగినంత ఇచ్చి వెళ్లిపోతున్నారు. స్టేషన్ లోపలికి వాహనం వెళ్లే సమయంలో రసీదు ఇవ్వాలి. అందులో సమయం నమోదవుతోంది. తిరిగి వచ్చే సమయంలో ఐదు నిమిషాలు లోపు ఉంటే ఎటువంటి రుసుం వసూలు చేయకూడదు. అంతకంటే ఎక్కువగా ఉంటే మొదటి 10 నిమిషాలకు రూ.10 ఆ తర్వాత ప్రతి 15 నిమిషాలకు రూ.15 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ నిబంధన సక్రమంగా అమలు చేయడంలేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయడంలేదని సంబంధిత రైల్వే ఉద్యోగులు తెలుపుతుండడం గమనార్హం. 139కి కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచిస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

డీఎంఈ కార్యాలయంలో హాజరుకండి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో పని చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్లను శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల కార్యాలయానికి రావాల్సిందిగా సూచించారు. జీజీహెచ్‌లో నర్సులకు విధుల కేటాయింపు తదితర విషయాలపై తరచుగా ఫిర్యాదులు అందుతుండడంతో ఉన్నతాధికారులు నేరుగా వారితో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

విచారణ వాయిదా

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఓ విద్యార్థి వేధిస్తున్నాడంటూ సర్వజనాసుపత్రిలో పారా మెడికల్ కోర్సు అభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థినులు జిల్లా పాలనాధికారికి నేరుగా ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం విచారణకు హాజరుకావాల్సిందిగా ముందుగానే వారికి రాతపూర్వకంగా సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో కమిటీ సభ్యులు విచారణను వాయిదా వేశారు.

వేడుకగా 'హరిహర వీరమల్లు' ట్రైలర్ విడుదల

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: హరిహర వీరమల్లు చలనచిత్రం ట్రైలర్‌ను రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి నాయబ్ కమాల్, జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఆధ్వర్యంలో భాస్కర్ థియేటర్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అభిమానులు భారీగా సంబరాలు జరిపారు. పవన్ కల్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కేకు కోసి బాణసంచా కాల్చుతూ పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా పవన్ కల్యాణ్ అభిమాన సంఘ నాయకులు బండ్రెడ్డి చందు తదితరులు పాల్గొన్నారు.


కేకు కోస్తున్న నాయబ్ కమాల్, ఆళ్ల హరి తదితరులు

అవగాహన.. సాధనతోనే విజయం

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: సిలబస్‌పై అవగాహనతో పాటు నిరంతర సాధనతోనే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ఒకేషనల్ గైడెన్స్, ఎంప్లాయ్‌మెంట్ అధికారి జె.భరద్వాజ్ అన్నారు. జేకేసీ కళాశాల విస్తృతి విభాగం, ప్రాంగణ ఎంపికల విభాగాల ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు స్టెప్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా స్టెప్ మేనేజర్ రాధిక ఆర్ఆర్‌బీ, ఏపీపీఎస్సీ తదితర పరీక్షలకు సిద్ధమయ్యే తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.గోపీచంద్, విస్తృతి వైస్‌ఛైర్మన్ పి.నాగసుశీల, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ వై.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గోపీచంద్

సాగుకు ముందు భూసార పరీక్షలు కీలకం

గోరంట్ల, న్యూస్‌టుడే: పంట సాగు చేసే ముందు భూసార పరీక్షలు నిర్వహించడం కీలకమని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యార్థులకు గురువారం జొన్నలగడ్డ గ్రామంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల భూమిలో పోషకాల లోపాలు తెలుస్తాయన్నారు. లోపాలుంటే 25 శాతం ఎక్కువ ఎరువులు, భూమిలో అధిక పోషకాలుంటే 25 శాతం తక్కువ ఎరువులు వేసుకోవాలన్నారు. జొన్నలగడ్డ మాజీ ఉప సర్పంచి వంగా నవీన్‌రెడ్డి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ విధానం వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త గంగాదేవి

నగరంలో నాకాబందీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో గురువారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో కొత్తపేట, పాతగుంటూరు, లాలాపేట, నగరంపాలెం, అరండల్‌పేట, పట్టాభిపురం పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాజ్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, లాలాపేట, చుట్టుగుంట, లక్ష్మీపురం, అమరావతిరోడ్డు తదితర ప్రధాన కూడళ్లలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పెద్దసంఖ్యలో సిబ్బందితో రహదారులపై ఉండటంతో నగరవాసులు కొంత ఆందోళన చెందారు. వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పోలీసులను చూసి వెనక్కి తిరిగి వెళ్లే ప్రయత్నాలు చేశారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్నవాళ్లు, పత్రాలు లేని వాళ్లు, డ్రైవింగ్ లైసెన్సు, శిరస్త్రాణం లేనివారిపై సుమారు 300కుపైగా కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఏఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు అజీజ్, అరవింద్, శివాజీరాజు, రమేష్, భానోదయ, శ్రీనివాసరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బ్రాడీపేటలో బస్సులు, ఆటోలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రమేష్

మంచి నడవడికతో బంగారు భవిత

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకుంటే బంగారు భవిత లభిస్తుందని జిల్లా యువజన సేవలు, స్టెప్ సీఈవో ఆర్.చంద్రముని అన్నారు. గ్రామీణ గుంటూరు మండలం పెదపలకలూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకత్వం అవగాహన సదస్సు గురువారం జరిగింది. కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు డాక్టర్ వీర రామారావు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా స్టెప్ విభాగం కార్యాలయ మేనేజర్ బి.రాధిక, సిబ్బంది, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా స్టెప్ సీఈవో చంద్రముని

వైభవంగా వార్షికోత్సవం

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: వికాస్‌నగర్‌లోని శ్రీషిర్డీ సాయి మందిరం 26వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, లక్ష్మీగణపతి, నవగ్రహ, సుదర్శన హోమాలు వేదపండితులు శాస్త్రోక్తంగా చేశారు.

హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని బాలాజీ కల్యాణ మండపంలో అఖిల భారత చేనేత, హస్తకళ వస్త్ర ప్రదర్శనను ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య గురువారం ప్రారంభించారు. నిర్వాహకుడు ఆర్.ప్రసాదరావు మాట్లాడుతూ శ్రీకళాభారతి చేనేత, హస్తకళా మేళా పేరున నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో పలు రాష్ట్రాల భారతీయ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళాఖండాలు, సంప్రదాయ ఆహార విశేషాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు తదితరులు ప్రసంగించారు.

ప్రదర్శన ప్రారంభిస్తున్న మస్తానయ్య తదితరులు

రహదారులపై చెత్త వేస్తే అపరాధరుసుం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. గురువారం కమిషనర్ పాతగుంటూరు, సుద్దపల్లిడొంక, బాలాజీనగర్, పొన్నూరు రోడ్డు, కేవీపీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు బృందాలుగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. రహదారులు, కాలువల్లో చెత్త వేయకుండా అడ్డుకోవాలని సూచించారు. జాతీయ రహదారి వెంట కొబ్బరిబొండాలు, నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై అపరాధరుసుం విధించాలని ఆదేశించారు. కార్మికులు ఉదయం ఇంటింటి చెత్త సేకరించి, మధ్యాహ్నం మురుగుకాలువలు శుభ్రం చేయాలన్నారు.

పారిశుద్ధ్యం పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

నగరంలో విభాగాల వారీగా కోర్టు కేసుల పరిష్కారంపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ విభాగాల వారీగా ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆయా సంస్థలు, వ్యక్తులు ఫైల్ చేసిన కోర్టు కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. కేసుల్లో నగరపాలకసంస్థ నుంచి తీసుకోవాల్సిన చర్యల్లో లోపం ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి గురువారం కేసుల పురోగతిపై సమీక్ష చేస్తామని, రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు, ప్యారావారీ రిమార్క్స్ వంటివి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, డీసీలు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కంపెనీలతో విద్యుత్తు ఒప్పందాలు పునఃసమీక్షించాలి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: దశాబ్ద కాలంగా అదానీ, శిర్డీ సాయి లాంటి ప్రైవేటు కంపెనీలతో చేస్తున్న విద్యుత్తు ఒప్పందాలపై పునఃసమీక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు అన్నారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో రామన్నపేటలోని కార్యాలయంలో 'విద్యుత్తు కుంభకోణాలు.. వినియోగదారులపై భారాలు' అంశంపై గురువారం చర్చాగోష్ఠి జరిగింది. బాబూరావు మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన సంస్థలు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, స్మార్ట్ మీటర్లు తిరస్కరించాలన్నారు. అదానీతో చేసుకున్న సెకి ఒప్పందంతో రానున్న పాతికేళ్లలో రాష్ట్ర ప్రజలపై రూ.1.20 లక్షల కోట్ల భారం మోపుతుందని, శిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ చేపట్టిన ఒప్పందాల వల్ల వేల కోట్లు ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. వీటిపై అధికార, ప్రతిపక్షాలు స్పందించాలన్నారు. లోపభూయిష్టమైన విద్యుత్తు ఒప్పందాలను ఉపసంహరించుకునేలా పౌర సమాజం ఉద్యమించాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, సామాజిక విశ్లేషకుడు టి.ధనుంజయరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, విశ్రాంత అదనపు ఎస్పీ చలపతిరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

'బీసీల రక్షణ చట్టం అమలు చేసేదెన్నడు?'

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: బీసీలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. నగరంలోని చుట్టుగుంట సెంటర్లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి నేతలు బీసీ రక్షణ చట్టం తెస్తామన్న ఎన్నికల హామీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తక్షణమే రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకురాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కోలా అశోక్, నాయకులు రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, దొంత బ్రహ్మం, యేటి కోటేశ్వరరావు, ప్రసన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర యువజన నాయకుడు కుమ్మర క్రాంతికుమార్

నాగమల్లేశ్వరరావుకు వైకాపా నేతల పరామర్శ

గోరంట్ల, న్యూస్‌టుడే: దాడి ఘటనలో గాయపడిన మన్నవ గ్రామ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావును వైకాపా నేతలు గురువారం రాత్రి రమేష్ ఆసుపత్రిలో పరామర్శించారు. నాగమల్లేశ్వరరావుపై తెదేపా నాయకులు దాడికి పాల్పడ్డారని వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు. కర్రలు, రాడ్డులతో దాడి చేయడంతో నాగమల్లేశ్వరరావు అక్కడే కుప్పకూలిపోయారని, దీంతో ఆయన్ను ఆసుపత్రికి తరలించారన్నారు. తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు వివరించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు అంబటి మురళి, బాలవజ్రబాబు, గులాం రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయండి

పట్నంబజారు: దేశంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కరీం ఆధ్వర్యంలో గురువారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న పేపర్ లీక్‌లను అరికట్టాలన్నారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. గతేడాది నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కరీం మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వరుణ్‌చౌదరి

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: టీజేపీఎస్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వన మహోత్సవం పురస్కరించుకొని గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ బాధ్యతగా మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ యు.రవికుమార్, వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ, వాసుదేవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న కామేశ్వరశాస్త్రి, అనితాదేవి

మీటర్ రీడింగ్ తీస్తామని.. గొలుసు దోపిడీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మీటర్ రీడింగ్ తీస్తామని, మంచినీళ్లు ఇవ్వమని ఒక వృద్ధురాలిని నమ్మించి ఆమెను తోసేసి దొంగ దోపిడీకి పాల్పడ్డాడు. వికాస్‌నగర్ అయిదో లైనులో వృద్ధురాలు చిట్టెమ్మ నివాసం ఉంటున్నారు. గురువారం ఒక వ్యక్తి వచ్చి మీటర్ రీడింగ్ తీస్తామని చెప్పాడు. రీడింగ్ ఈనెల తీశారని ఆమె బదులిచ్చారు. అయితే మంచినీళ్లు ఇవ్వమని దొంగ కోరాడు. ఆమె మంచినీళ్లు తీసుకొచ్చేందుకు వెళ్తుండగా వెనుక నుంచి చిట్టెమ్మను మంచం పైకి తోసేసి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకుని పారిపోయాడు. దీంతో ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి పోసి.. మాయ చేసి..

సైడ్ బరమ్స్‌లో కక్కుర్తి

న్యూస్‌టుడే, పట్టాభిపురం

నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న అడ్డరోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. సిమెంటు రోడ్లు నిర్మించబోయే ముందే డ్రెయిన్లు ఏర్పాటు చేయడంతో పాటు కొంత మేరకు జాగా వదిలి మొక్కలు నాటిస్తే పచ్చదనం పరిఢవిల్లుతుంది. ఆ దిశగా నగరపాలక అధికారులు అసలు ఆలోచన చేయడం లేదు. అభివృద్ధి పనులు హడావుడిగా చేయించడం, బిల్లులిచ్చే విషయంలో కమీషన్లకు కక్కుర్తి పడడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక రోడ్డు నిర్మించబోయే ముందే అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేసే సమయంలోనే సైడు బరమ్స్‌కు ఏ మట్టి నింపుతారు, డస్ట్ పోస్తారా.. అనేది స్పష్టత ఉండడం లేదు. టెండర్ దగ్గర నుంచి ఏదో ఒక కొర్రీ పెట్టడం, కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు కొందరు మితిమీరిన జోక్యం చేసుకోవడంతో లోపభూయిష్టంగానూ పనులు సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెలుతున్నాయి.

✦ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం మార్గం గతంలో తారు రోడ్డు. కొంత మేరకు గుంతలు పడ్డాయి. ఆ రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారనుకున్నా.. పూర్తిగా నిర్మించకుండా కుదించారు. రెండు వైపులా కోత పెట్టడమే కాకుండా పొడవు కూడా తగ్గించారు. సైడ్ బరమ్స్‌కు డస్ట్ పోస్తున్నారా.. అంటే అదీ లేదు. డ్రెయిన్ల నిర్మాణానికి వేరే ప్రాంతంలో తవ్విన రాళ్లు, రప్పలతో కూడిన నాసిరకం మట్టిని పోసి చేతులు దులిపేసుకుంటున్నారు. ఈవిధంగా చేయడం వల్ల వర్షం పడితే సిమెంటు రోడ్డు కూడా బురదమయం అవుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇలాంటప్పుడు అభివృద్ధి చేసి ప్రయోజనం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా చేపట్టబోయే పనుల్లో పాలకులు, అధికారులు అంచనాలు రూపొందించే సమయంలోనే ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని కోరుతున్నారు.

✦ కుందుల రోడ్డు నుంచి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే రహదారిలోనూ సైడ్ బెరమ్స్ కొంత మేరకు రాళ్లతో నింపి వదిలేశారు. ఈ రహదారికి రెండు వైపులా పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

సైడ్ బరమ్స్ నింపేందుకు తోలిన మట్టి కుప్పలు

'నిందితుడైన జగన్.. ఫిర్యాదిని కలవడం నేరం'

అరండల్‌పేట, న్యూస్‌టుడే: 'వైకాపా అధినేత జగన్ కారు కిందపడి సింగయ్య మృతి చెందారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న జగన్.. మృతుడి భార్య, ఫిర్యాది లూర్దు మేరీని కలవడం నేరం'.. అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. అమరావతి రోడ్డులోని జనసేన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఫిర్యాదిని కలవడమంటే.. వారిని కేసు నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేయడమే. సింగయ్య మృతి చెందిన వెంటనే రూ.10 లక్షల పరిహారాన్ని వైకాపా నేతలు అందించడం చూస్తుంటే.. జగన్ నేరం ఒప్పుకున్నట్లే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో నిష్పక్షపాతంగా పాలన సాగిస్తుంటే.. వైకాపా కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది.. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూడడం దారుణం. సింగయ్యను జగన్ అనుచరులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లనందునే మృతి చెందారు. జగన్‌ను కలిసిన తర్వాత సింగయ్య భార్య లూర్దు మేరీ.. వ్యాఖ్యలు చూస్తుంటే కుట్ర కోణం ఉందనిపిస్తోంది. బాధితులను మాజీ సీఎం తన నివాసానికి పిలవడం, అంబులెన్స్‌లపై దుష్ప్రచారం చేసేలా లూర్దు మేరీ వ్యాఖ్యలు చేయడం నేరంగా భావించి వారిద్దరిపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం'.. అని వెల్లడించారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు చందు సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు, కార్యదర్శి చట్టాల త్రినాథ్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, బిట్రగుంట మల్లిక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పక్కన మాణిక్యాలరావు, సాంబశివరావు తదితరులు

(c) eenadu

రాష్ట్ర రహదారులకు రాజసం

63.7 కి.మీ మేర పనులకు రూ.37.8 కోట్లు

ఈనాడు, అమరావతి

రహదారి	కి.మీ	రూ.కోట్లు
తిరుపూరు-రాజవరం	4	7.8
నూజివీడు-మైలవరం	13.4	6
రామానగరం-నడకుదురు	10.8	5
సింగారపాలెం-బంటుమిల్లి	8.8	4
ముదినేపల్లి-గుడ్లవల్లేరు	3.7	2.5
గుడివాడ బైపాస్	3.7	2.5
చెవిటికల్లు-వత్సవాయి	5	2
నందిగామ-జొన్నలగడ్డ	5.7	2
మధిర-కంచికచర్ల	1.4	1
విజయవాడ-నూజివీడు	1.6	2
కందులపాడు-గంగినేని	1.7	1.5
మచిలీపట్నం-కమ్మవారిచెరువు	3.7	1.5
మొత్తం	63.7	37.8

వైకాపా పాలనలో ఛిన్నాభిన్నమైన రహదారుల రూపురేఖలు కూటమి సర్కారు మారుస్తోంది. పల్లె పండగ ద్వారా ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో సీసీ రహదారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధ్వానంగా ఉన్న రాష్ట్ర హైవేలను సైతం గాడిన పెడుతున్నారు. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు లేక కునారిల్లుతున్న 12 రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది.

ఆ 12 రోడ్లకు మంచి రోజులే...

ఉమ్మడి జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం డివిజన్ల పరిధిలో 12 రాష్ట్ర హైవేల అభివృద్ధికి ప్రభుత్వం రూ.37.8 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 63.7 కి.మీ మేర రహదారులను బాగు చేయనున్నారు. అత్యధికంగా నూజివీడు-మైలవరం రహదారి 13.4, రామానగరం-నడకుదురు, 10.4 కి.మీ, సింగారపాలెం-బంటుమిల్లి 8.8 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నారు. అత్యల్పంగా విజయవాడ-నూజివీడు 1.6, కందులపాడు- గంగినేని 1.7 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నారు. ఇందులో చెవిటికల్లు-వత్సవాయి, నందిగామ-జొన్నలగడ్డ, మదిర-కంచికచర్ల, విజయవాడ-నూజివీడు, కందులపాడు-గంగినేని రహదారులకు పాలన, సాంకేతిక అనుమతులు రాగా ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. జులై 10న టెండర్లు తెరిచి గుత్తేదారులను సైతం ఎంపిక చేస్తారు. మిగిలిన 7 రహదారులకు పాలన అనుమతులు రాగా సాంకేతిక అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించారు.

గత పాలకుల పాపమే...

నిధులు మంజూరు చేసిన రహదారులు ప్రస్తుతం దారుణంగా ఉన్నాయి. గత ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా వేయలేదు. దీంతో పూర్తిగా ఛిద్రమయ్యాయి. అప్పుడే మరమ్మతులు చేస్తే రూ.15-20 కోట్లతో పనులు పూర్తయ్యేవి. ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో ఇప్పుడు అంచనా వ్యయం తడిసిమోపెడైంది. పైగా ఇన్నేళ్ల పాటు ప్రజలు ఆయా రోడ్లపై నరకం అనుభవించారు. వర్షం పడితే గుంతలే కనిపించక పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. కొన్ని రోడ్లు మూడు, నాలుగు కి.మీల అభివృద్ధికే రూ.కోట్ల నిధులు అవసరమయ్యాయంటే ఏ స్థాయిలో ఛిద్రమయ్యాయో తెలుస్తోంది. రహదారి పనుల ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా మొదలుపెడతామని ఆర్అండ్‌బీ ఎస్ఈ భాస్కరరావు తెలిపారు.

స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రణాళికలు సిద్ధం

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర-2047 సాధించే దిశగా జిల్లాలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) విజయానంద్‌కు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల కలెక్టర్లతో సీఎస్ గురువారం నిర్వహించిన వీసీకి కలెక్టర్ బాలాజీతో పాటు జేసీ గీతాంజలిశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు, దార్శనిక ప్రణాళిక, యూనిట్ కార్యాలయాలు తదితరాలను సీఎస్‌కు వివరించారు. జిల్లాకు చెందిన శాసన సభ్యులతో చర్చించామని, ఈ నెల 6న తొలి దశ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. పేదరికం లేని సమాజం కోసం పీ-4 కార్యక్రమ అమలుకు చేస్తున్న కృషిని వివరించారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందజేస్తున్నట్టు తెలపడంతో సీఎస్ కలెక్టర్‌ను అభినందించారు.

వీసీలో కలెక్టర్ బాలాజీ, జేసీ

వదిలేస్తే ముప్పేగా.. తరలిస్తే తప్పునుగా!

కేదారేశ్వరపేట మార్కెట్‌తో సింగ్‌నగర్ వంతెనపై భారం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

విజయవాడలోని కీలకమైన సింగ్‌నగర్ వంతెన కట్టి 30 ఏళ్లవుతోంది. దీని సామర్థ్యం తగ్గుతున్న ఈ సమయంలో సాధారణ వాహనాలతో పాటు కేదారేశ్వరపేట మార్కెట్‌కు నిత్యం వచ్చే వందల వాహనాలు భారీ లోడ్‌తో రాకపోకలు సాగిస్తుండటం ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. వందల టన్నుల సరకు తీసుకుని వచ్చే కంటైనర్ల దెబ్బకు సింగ్‌నగర్ వంతెన నుంచి.. మార్కెట్ వరకూ తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. గతంలోనూ ఇలాగే ఈ భారీ వాహనాల దెబ్బకు సమస్యలు పెరిగిపోవడంతో వాహనదారులు, స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు స్పందించి భారీ వాహనాలు రాకుండా రహదారిపై గడ్డర్లు పెట్టారు. కానీ అప్పటి వైకాపా పాలకుల మద్దతుతో గడ్డర్లను కోసేసి మరీ కొందరు పక్కన పడేశారు.

☛ కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను ఇక్కడి నుంచి నున్నకు తరలించాలంటూ అటు వ్యాపారులతో పాటు, స్థానికులు, వాహనదారులు ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నారు. నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీలో భారీ కంటైనర్ వాహనాలు రావడంతో ఎదురయ్యే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిత్యం ఉద్యోగాలు, విద్యా సంస్థలకు ఈ మార్గంలోనే వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కేదారేశ్వరపేటలో రహదారి మొత్తాన్ని ఆక్రమించి పండ్ల వ్యాపారాలు, దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టేశారు. ఈ దుకాణాలన్నీ కొందరు వైకాపా వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నగరానికి ట్రాఫిక్ అవస్థలు లేకుండా 23 ఎకరాల్లో నున్నలో పండ్ల మార్కెట్‌ను విశాలంగా ఏర్పాటు చేశారు. అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. బైపాస్ పక్కనే ఈ మార్కెట్ ఉండడంతో.. నేరుగా వచ్చి మార్కెట్‌లోకి ఎంత పెద్ద వాహనాలైనా వెళ్లిపోవచ్చు. విశాలమైన రహదారులు, పార్కింగ్ సదుపాయం కూడా నున్న మార్కెట్‌లో ఉంది. అయినా కేవలం ఓ పది మంది స్వార్థం కోసం మార్కెట్‌ను ఇక్కడి నుంచి వెళ్లకుండా ఏళ్ల తరబడి అడ్డుకుంటున్నారు.

సింగ్‌నగర్ వంతెనపై నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ

ఇంకెన్నాళ్లు ఇక్కడే ఉంచుతారు..

సింగ్‌నగర్ వంతెన మీదుగా మార్కెట్‌లోకి 50 నుంచి 60 టన్నుల వరకు భారీ కంటైనర్ లారీలు వస్తున్నాయి. ఈ దెబ్బకు ఏళ్లనాటిదైన సింగ్‌నగర్ వంతెనకు ప్రమాదం తప్పని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రోజుకు కనీసం 200 వాహనాలకు పైగా కేదారేశ్వరపేట మార్కెట్‌కే వస్తుంటాయి. ఇది మధ్య, పశ్చిమ రెండు నియోజకవర్గాలను కలిపే ప్రాంతం కావడంతో.. ఉపాధ్యాయులు, కళాశాలలతో పాటు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. మార్కెట్‌ను దాటి వెళ్లడమంటే.. పద్మవ్యూహాన్ని ఛేదించడమే అవుతోంది. ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ భారీ వాహనాలకు సంబంధించి ఇప్పటికే ప్రమాదాలు సైతం పెరిగాయి. ఇటీవల ఓ చిరు వ్యాపారి వీటి చక్రాల కిందపడి చనిపోవడంతో కేసు నమోదైంది. కనీసం ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి.. మార్కెట్‌ను నున్నకు తరలించే ప్రయత్నం చేస్తే అన్ని వర్గాలకూ ఊరట లభిస్తుంది.

పండ్ల మార్కెట్‌కు వస్తున్న భారీ కంటైనర్

జగన్ చిత్రాల తొలగింపు

అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం, మోపిదేవి - న్యూస్‌టుడే: అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఉన్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ వై.ఎస్.ఆర్ పేరును ఎట్టకేలకు అధికారులు గురువారం తొలగించారు. 'వద్దన్నా మారరే.. తగదన్నా మార్పురే' శీర్షికన గురువారం ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అవనిగడ్డలోని ఆక్వా పంట పరిశోధనా కేంద్రం, వ్యవసాయ సబ్‌డివిజన్ కార్యాలయ భవనంపై ఉన్న డాక్టర్ వై.ఎస్.ఆర్ పేరుతో పాటు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని తొలగించారు. ✦ మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి రైతుసేవా కేంద్రం -2పై ఉన్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను తొలగించి రంగులు దిద్దారు.

ఈనాడు స్పందన

కాలువలకు 5,938 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు గురువారం 5,938 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

అడుగులోతు గుంతే.. అడగకుంటే అంతే!

కానూరు గ్రామానికి సమీపంలో..

పెట్రోలు బంకు సమీపంలో..

విజయవాడ బందరు రోడ్డు నుంచి కానూరుకు వెళ్లే ప్రధాన రహదారి మృత్యు మార్గంగా మారింది. అడుగు లోతుండే గుంతలు రహదారిపై చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. కొద్దిరోజుల కిందట తాతినేని కత్యారావు అనే 30 ఏళ్ల మర్చంట్ నేవీ ఉద్యోగి తెల్లవారుజామునే ఈ రహదారిపై వెళ్తుండగా ఆర్‌సీఎం చర్చి సెంటర్ ఎదురుగా ఉన్న భారీ గుంతలో ద్విచక్ర వాహనం పడి అదుపు తప్పింది. ఆయన రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరుసటిరోజు చనిపోయారు. ఈ ఘటన జరిగిన తర్వాత కూడా అధికారుల్లో చలనం లేదు. కామయ్యతోపు నుంచి కానూరు వరకూ వెళ్లే ఈ రహదారిపై ఉండే గుంతల్లో నిత్యం ద్విచక్ర వాహనాలు పడి అనేక మంది ప్రమాదాల బారినపడుతూనే ఉన్నారు. ఆ గుంతలను పూడ్చినా.. చాలావరకూ ప్రమాదాలను అరికట్టొచ్చు. అయినా మరమ్మతులు కూడా చేయకుండా నెలల తరబడి అలాగే వదిలేశారు. – న్యూస్‌టుడే, కానూరు

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

నన్ను బయటకు తీసుకువస్తే
రెట్టింపు డబ్బులు ఇస్తా..

ఏజెంట్లతో అద్విక ఎండీ ఆదిత్య

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ ఎండీ ఆదిత్య ఇంకా ఏజెంట్లను మభ్య పెడుతూనే ఉన్నాడు. గురువారం విచారణ సందర్భంగా ఆదిత్యను కొంతమంది ఏజెంట్లు కలిశారు. మమ్మల్ని ఎందుకు మోసం చేశావనీ.. మమ్మల్ని నమ్మి పెట్టుబడి పెట్టిన వారంతా.. మా ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారని ఏజెంట్లు అందరూ ఆదిత్యను ప్రశ్నించారు. తనని ఈ కేసు నుంచి బయటకు తీసుకువస్తే... తాను రాగానే అందరి డబ్బులు తిరిగి ఇచ్చేస్తాననీ, తనను తక్కువ అంచనా వేయకండని ఆదిత్య వారితో చెప్పినట్లు సమాచారం. ప్రసుత్తం తన దగ్గర డబ్బు అంతా బ్లాక్ అయిందనీ.. అందరూ కలిసి డబ్బులు వేసుకుని తనను బయటకు తేవాలని తెలిపాడు. బయటకు రాగానే డబ్బులు ఇవ్వడంతోపాటు ఇప్పుడు జరిగిన వ్యాపారం కంటే రెట్టింపు వ్యాపారం ఇస్తానని చెప్పడంతో ఏజెంట్లు అందరూ షాక్ అయ్యారు. మరోవైపు ఏజెంట్లతో ఎంత నగదు కట్టించారనే వివరాలన్నీ సేకరించారు. దీంతో వారి ద్వారా చెల్లించిన వారి సంఖ్య దాదాపు కొలిక్కి వచ్చింది. అయితే కొంతమంది పెట్టుబడిదారులు నేరుగా ఆదిత్యకు నగదు చెల్లించారు. వారి వివరాలు తెలియరాలేదు. గురువారం మరో నలుగురు ఫిర్యాదు చేశారు. దీంతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినవారి సంఖ్య 100 దాటింది.

కౌలు రైతులకు చేయూత

వడివడిగా సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ

ఉమ్మడి జిల్లాలో గత 2 నెలల కార్డులు..

జిల్లా	లక్ష్యం	పంపిణీ
కృష్ణా	70,000	34,540
ఎన్టీఆర్	56,000	26,278
మొత్తం	1,26,000	60,818

కౌలు రైతులకు ఆర్థిక భరోసా, ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు ముందంజలో ఉన్నారు. నిబంధనలు కఠినతరంగా ఉన్నా రెండు నెలల్లోనే దాదాపు 48 శాతం వరకు కార్డులు అందించారు. ఆగస్టులోగా పూర్తి స్థాయిలో పంపిణీ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇప్పటికే 60వేల మందికి పైగా.. గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.17లక్షల కౌలు రైతులకే సీసీఆర్‌సీలు కార్డు ఇచ్చారు. ఈ సారి లక్ష్యం 1.26లక్షలకు పెంచారు. ఇప్పటి వరకు 60వేలకు పైగా జారీ చేశారు. కార్డుల పంపిణీలో చాలా జిల్లాల్లో 30 శాతం కూడా పూర్తికాలేదు. కార్డుల పంపిణీలో రాష్ట్రంలోనే రెండు జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు ఖరీఫ్‌లో రుణ లక్ష్యం భారీగా పెంచారు. రూ.900 కోట్ల వరకు ఇస్తున్నారు. దీంతో ఎక్కువ మందికి కౌలు రుణ సాయంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందనున్నాయి.

అవగాహనతో మార్పు.. నిబంధనల ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలంటే భూయజమాని తాను భూమి సదరు రైతుకు కౌలుకు ఇచ్చినట్లు సాగుహక్కు అంగీకార పత్రం ఇవ్వాలి. దీనికి ప్రారంభంలో భూమిపై తాము హక్కులు కోల్పోతామన్న అపోహతో అంగీకార పత్రం ఇచ్చేవారు కాదు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో గ్రామాల్లో సభలు నిర్వహించి చాలా వరకు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో చాలా మంది రైతులు అంగీకరిస్తున్నారు.

ఇంకా మారాలి.. ఇంకా చాలా ప్రాంతాల్లో రైతులు అంగీకారం తెలపడం లేదు. కౌలు రైతుకు పత్రం ఇస్తే ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము, రాయితీలు, రుణాలు, నష్టపరిహారాలు ఇలా అన్నీ కౌలు రైతుకు వెళ్లిపోతాయన్న ఉద్దేశంతో అంగీకార పత్రం ఇవ్వకుండా ప్రయోజనాలన్నీ వారే పొందుతున్నారు. దీంతో పెట్టుబడి పెట్టిన కౌలు రైతు నష్టాలతో ఉసూరుమంటున్నారు. యజమాని అంగీకారంతో ప్రమేయం లేకుండా తాము సాగు చేస్తున్న పొలాలకు సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చే విధానంపై దృష్టి సారించాలని కౌలు రైతులు కోరుతున్నారు. – ఈనాడు, అమరావతి

జాతీయ లోక్‌అదాలత్ రేపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో ఈ నెల 5న శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎ.సత్యానంద్ తెలిపారు. సివిల్, రోడ్డు ప్రమాద కేసులు, ఫ్యామిలీ కోర్టు విషయాలు, వాణిజ్య వివాదాలు, రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారు. దీని నిమిత్తం 13 న్యాయమూర్తులతో 13 బెంచిలను ఏర్పాటు చేశారు. ప్రతి బెంచిలో న్యాయమూర్తితో పాటు ఒక న్యాయవాది, ఒక సోషల్ వర్కర్ ఉంటారు. వీరు ఆయా కేసులను విచారించి పరిష్కరిస్తారు.

గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ

దొంగలు తొలగించిన గడియ

కార్యాలయంలో పరిశీలిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

స్టాంపులు	డినామినేషన్	పోయింది	విలువ రూ.
నాన్ జ్యుడిషియల్ స్టాంపులు	రూ.50	3,600	1,80,000
” ”	100	900	90,000
స్పెషల్ అడ్‌హెసివ్ లేబుళ్లు	రూ.50	12,508	6,25,400
” ”	100	4,609	4,60,900

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ జరగడం కలకలం రేపింది. బుధవారం విధులు ముగిసిన అనంతరం ఇక్కడి సిబ్బంది ఎప్పటిలాగే కార్యాలయానికి తాళాలు వేసుకుని వెళ్లగా, గురువారం ఉదయం వచ్చేటప్పటికి కార్యాలయం ప్రధాన ద్వారం గడియ, బయటి గదిలోని బీరువా పగులగొట్టి కనిపించాయి. రూ.వంద విలువైన స్టాంపు పేపర్ల బండిల్‌తో పాటు సాధారణ స్టాంపులు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు వారు గుర్తించారు. వేలిముద్రలు పడకుండా వేసుకున్న గ్లోవ్‌లను నిందితులు అక్కడే పడేసి వెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీం సాయంతో దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరూ కొనవద్దు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: గన్నవరం కార్యాలయంలో చోరీ అయిన స్టాంపు పేపర్ల విలువ మొత్తం రూ.13,56,300 అని జిల్లా రిజిస్ట్రార్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. చోరీకి గురైన నెంబర్లున్న స్టాంపు పేపర్లను ఎవరూ కొనుగోలు చేయవద్దని సూచించారు. ఆ స్టాంపులను గమనిస్తే పోలీసులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తెలియజేయాలని కోరారు. చోరీ అయిన రూ.50 విలువైన స్టాంపులు కోడ్‌నంబర్లు బిఏ748201 నుంచి బిఏ751000 వరకు, బిఏ751201 నుంచి బిఏ752000 వరకు, రూ.100 విలువైన స్టాంపులు డిఇ815701 నుంచి డిఇ816000 వరకు, డిడి827401 నుంచి డిడి828000 వరకు చోరీకి గురైనట్లు వెల్లడించారు.

చంద్రిక అపార్ట్‌మెంట్ల బాధితులు కోకొల్లలు!

వెలుగులోకి వంశీ అనుచరుడి ఆగడాలు

ఈనాడు, అమరావతి: గన్నవరంలోని చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులు ఒక్కొక్కరుగా ముందుకొస్తున్నారు. తాము పూర్తిగా డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నాక కూడా వాటిని ఇప్పటి వరకూ తమకు దక్కకుండా చేశారంటూ.. రెరాలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు ఫిర్యాదు చేయగా, మరికొందరు గురువారం చేసినట్లు తెలిసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో.. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి కీలక అనుచరుడిగా ఉన్న గుర్రం నాని ఈ అపార్ట్‌మెంట్ల వ్యవహారంలోకి అడ్డంగా దూరారు. వాస్తవంగా.. చంద్రిక అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని రాకీ అవెన్యూస్ అనే సంస్థ ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించింది. అప్పట్లో 700 వరకు ప్లాట్లతో ఫేజ్01లో నిర్మాణం చేపట్టినప్పుడు కొనేందుకు చాలామంది ముందుకొచ్చారు. పనులు ప్రారంభించాక.. 50 శాతం కొనుగోళ్లు ముందే పూర్తి చేశారు. కొనుగోలుదారుల నుంచి ఒప్పందాలు చేసుకుని డబ్బులు కూడా తీసుకున్నారు. ఆ తర్వాత రాకీ అవెన్యూస్ సంస్థ చాలా వరకు నిర్మాణం చేపట్టాక.. ఆర్థిక లావాదేవీల విషయంలో కొద్దిగా ఇబ్బందులు పడటంతో.. అప్పట్లో అధికారంలో ఉన్న వంశీ అండతో.. అతని అనుచరుడు హస్తగతం చేసుకున్నాడు. అప్పటి నుంచి రాకీ అవెన్యూస్ సంస్థ కొనుగోలుదారులకు అందుబాటులో లేదు. గుర్రం నాని దెబ్బకు కొనుగోలుదారులు అల్లాడిపోతున్నారు. ఆరంభంలో తాము కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం.. డబ్బులు చెల్లించినా, తమకు ప్లాట్లను కేటాయించకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ బాధితులు ఫిర్యాదులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తమకు న్యాయం జరగలేదని వాపోతున్నారు. ప్రస్తుతం కూటమి సర్కారు కొలువుదీరడంతో.. బాధితులు ఒక్కొక్కరుగా ముందుకొస్తున్నారు. ఆరు, ఏడేళ్ల కిందట రిజిస్ట్రేషన్లు చేసుకున్న వాళ్లకు కూడా ప్లాట్లను కేటాయించడం లేదంటూ ఫిర్యాదు చేస్తున్నారు.

ఫేజ్ 02లోనూ అక్రమాలు

చంద్రిక అయోధ్య అపార్ట్‌మెంట్లలో ఫేజ్ 02 కింద కూడా చాలామంది నుంచి అసలు నిర్మాణాలే ఆరంభించకుండా వసూళ్లు చేసి.. వారిని సైతం మోసం చేసినట్లు తెలుస్తోంది. ఈ బాధితులు సైతం ప్రస్తుతం రెరాలో ఫిర్యాదులు చేస్తున్నారు.

(c) eenadu

సస్యరక్షణ.. యాజమాన్య పద్ధతులతో మేలు

ఫోన్‌ఇన్‌లో ఘంటసాల ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియలలిత

ఘంటసాల, న్యూస్‌టుడే

రైతులు సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్) ప్రధాన శాస్త్రవేత్త వి. సత్యప్రియలలిత అన్నారు. ఇటీవల నిర్వహించిన 'ఈనాడు.. మీతోడు' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా రైతుల నుంచి విశేష స్పందన లభించింది. శాస్త్రవేత్త రైతుల సందేహాలను నివృత్తి చేశారు. తెగుళ్లు, సేద్య విభాగాల శాస్త్రవేత్తలు కె.లహరి, జె.పద్మావతి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఈనాడు మీతోడు

రైతుల సందేహాలకు సమాధానాలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియలలిత, నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్తలు లహరి, పద్మావతి

వరిలో తుంగ నివారణ

వరి వెదజల్లే పద్ధతిలో తుంగ నివారణకు విత్తిన 15-20 రోజులకు లేదా కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు ఎకరానికి 800 మి.లీ. బెంటజోన్ 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పుల్లవిరుపు, కణుపుల గడ్డి నివారణకు విత్తిన 15-20 రోజులకు ఫినాక్సిప్రాప్ ఇథైల్ 7 శాతం ద్రావకం ఎకరానికి 200-250 మి.లీ. 200లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎరువుల యాజమాన్యంనకు.. నత్రజని మొదటిసారి విత్తిన 15 రోజులకు, రెండోసారి పిలక దశలో, మూడో సారి చిరు పొట్ట దశలో వేసుకోవాలి. ఏ సాగులోనైనా భాస్వరం ఎరువును ఆఖరి దుక్కి లేదా దమ్ములో వేయాలి. పొటాష్ ఆఖరి దుక్కిలో సగం, మిగిలిన సగ భాగం చిరుపొట్ట దశలో వేయాలి. నత్రజని ఎరువులు మాగాణి వరి కంటే వెద పద్ధతిలో దాదాపు 25 శాతం ఎక్కువ వేసుకోవాలి.

ఇనుప, జింకు ధాతు లోపాలు...

వరిలో ఇనుప ధాతు లోపం నివారణకు 20 గ్రా. అన్నభేది, 2 గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లోపం ఎక్కువ ఉంటే 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింకు లోప నివారణకు వరి పండించే భూముల్లో ప్రతి 3 పైర్లకు ఒకసారి ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. భాస్వరం, జింకు సల్ఫేట్ ఎరువులు వేసేటప్పుడు వాటి మధ్య కనీసం 2-3 రోజుల వ్యవధి ఉండాలి. పైరుపై తుప్పు మచ్చలు కనబడి మొక్క గిడసబారినప్పుడు జింకు లోపంగా పరిగణించి లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

చౌడు భూముల యాజమాన్యం

పచ్చిరొట్ట ఎరువైన జీలుగను కలియదున్నడం లేదా పశువుల ఎరువు ఎకరానికి 1.2 టన్నులు వేయడం లేదా వరిగడ్డి కలియదున్నుకోవాలి. పొటాష్ ఎరువును వేసుకోవాలి. జింకులోప నివారణకు.. లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్, ఊడ్చిన 15 నుంచి 20 రోజులకు 5 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. నారును ఒత్తుగా నాటుకోవడం, చౌడును తట్టుకునే ఎంసీఎం-100, ఎంసీఎం-103, ఎంసీఎం-125, ఎంటీయూ -1061, ఎంటీయూ 1293 రకాలు సాగు చేసుకోవాలి.

మినుములో బంగారు తీగ సమస్య

తొలకరిలో పొలంలోని బంగారు తీగను పూత రాక ముందు దున్నాలి. లేదా పారాక్వాట్ మందుతో నివారించాలి. పైరు విత్తిన వెంటనే ఎకరానికి 1.5 లీ. పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకాన్ని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లిన వెంటనే, 200 లీ. నీటిని పిచికారీ చేస్తే 60 నుంచి 70 శాతం వరకు బంగారు తీగను నిర్మూలించవచ్చు. పైరు విత్తిన 20 రోజులకు ఇమాజితాపిర్ 10 శాతం ద్రావకం ఎకరానికి 200 మి.లీ., 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి పెరిగితే మొక్కజొన్న, జొన్న, సజ్జ పంటలను సాగు చేసుకోవాలి.

నారుమడి బాగుండాలంటే...

వరి నారుమడిలో ఊద నిర్మూలనకు విత్తిన 14 రోజులకు సైహలోఫాప్ పి బ్యూటైల్ 10 శాతం ద్రావకం 400 మి.లీ.... 200 లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. అన్ని రకాల కలుపు జాతుల నివారణకు బిస్‌పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 80 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సేంద్రియ సాగులో ఎరువుల వినియోగం

పచ్చిరొట్ట పెంచి కలియదున్నినప్పుడు బాగా చివికిన పశువుల ఎరువును ఎకరానికి 4 టన్నులు ఊడ్పు ముందు వేయాలి. అజోస్పైరిల్లమ్, పీఎస్‌బీ మనియషూర్‌బీ 2 కిలోలు ఎకరానికి 100 కిలోల పశువుల ఎరువుతో కలిపి నాట్ల సమయంలో వేసుకోవాలి. 200 కిలోల వేపచెక్కను దుబ్బుచేసే అంకురం దశలో వేయాలి. ఎకరానికి ద్రవ జీవామృతం 200 లీ. నేలలో కలిసేలా 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పిలక దశలో వేసుకోవాలి. 30 రోజుల వ్యవధిలో పంచగవ్య 3 శాతం, లేదా 5 శాతం ఆవు మూత్రం పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు..

ముందుగా పొలం నుంచి మురుగు నీటిని తీసివేయాలి. కాండం కుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి కాండం మొదలు తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

రైతేరాజు

మొక్కజొన్నలో కలుపు తొలగింపు

విత్తిన 2-3 రోజుల్లోపు అట్రజిన్ కలుపు మందు ఎకరానికి 1200 గ్రా. 200 లీ.నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. 15-18 రోజులకు గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు ఎకరానికి 115 మి.లీ. టెంబోట్రియాన్‌ను 400 గ్రా. అట్రజిన్‌తో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాకు కలుపు నివారణకు 2.4 డీసోడియం సాల్ట్ ఎకరానికి 500 గ్రా. 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తుంగ ఎక్కువగా ఉంటే హాలో సల్ఫ్యూరాన్ మిథైల్ 40 గ్రా. ఎకరానికి 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సన్న, అధిక దిగుబడినిచ్చే వరి రకాలు

బీపీటీ 5204కి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి కలిగిన రకాలు ఎంటీయూ -1224 (పంట కాలం 135-140 రోజులు), ఎంసీఎం -103 (పంట కాలం 140 రోజులు). అధిక దిగుబడినిచ్చే వరి రకాలు ఖరీఫ్‌లో ఎంటీయూ -1318 (పంట కాలం 150 రోజులు), ఎంటీయూ - 1262 (పంట కాలం 155 రోజులు), దాళ్వాలో ఎంటీయూ -1121 (పంట కాలం 121-125 రోజులు), ఎంటీయూ -1153 (పంట కాలం 120 రోజులు), ఎంటీయూ -1293 (పంట కాలం 120 రోజులు)

మినుములో కాండం గజ్జి తెగులు

వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. కిలో విత్తనానికి మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. 2 కిలోల ట్రైకోడెర్మాను 80 కిలోల మాగిన పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండితో కలిపి విత్తుకునే సమయంలో తగినంత తేమ ఉన్నప్పుడు వేయడం వల్ల నేల నుంచి సంక్రమించే అన్ని రకాల శిలీంధ్ర తెగుళ్ల నుంచి రక్షణ కలుగుతుంది. తెగులు సోకిన ప్రాంతం నుంచి వ్యాధి చెందకుండా జాగ్రత్త పడాలి. హెక్సాకొనజోల్ 2 మి.లీ. ద్రావణం లీటరు నీటికి కలిపి తెగులు సోకిన ప్రాంతంలో నేల తడిసేలా పిచికారీ చేయాలి.

గుడ్లవల్లేరు పంచాయతీలో నిధుల గోల్‌మాల్

● లెక్కలు తనిఖీ చేస్తున్న సిబ్బంది ● గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారుల వైఫల్యమే....

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే

మేజర్ పంచాయతీ గుడ్లవల్లేరులో నిధుల గోల్‌మాల్ వ్యవహారం కలకలం రేపుతోంది. గత కొన్నేళ్లుగా ఇంటి పన్నుల రూపేణా పంచాయతీకి జమ కావాల్సిన నిధులు పక్కదారి పట్టడంతో సిబ్బంది రహస్యంగా లెక్కలు ఆరా తీస్తున్నారు. దాదాపు ఏటా ఇంటిపన్ను రూపేణా రూ.80 లక్షల ఆదాయం వస్తుంది. వీటిని బిల్ కలెక్టర్లు పంచాయతీ ఖాతాలో ఖజానాలో జమ చేస్తారు. వసూళ్లు కాని వాటిని ఎరియర్స్‌గా చూపుతారు. వీటిపై ఈవో, ఆపై ఈవోపీఆర్డీ, తర్వాత ఎంపీడీవో, ఆనక డీఎల్పీవోలు పర్యవేక్షించాలి. ప్రతి ఏటా ఆడిటింగ్ జరిపి పక్కాగా లెక్క తేలుస్తారు. కానీ ఈ ప్రక్రియను అపహాస్యం చేస్తూ పంచాయతీలో లక్షల్లో ఎరియర్స్ పేరుకుపోయాయి. చర్యలు తీసుకోకపోవడంతో బిల్ కలెక్టర్ల అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2019 నుంచి పంచాయతీలో

లెక్కలు సరిచూస్తున్న సిబ్బంది

శాశ్వత ఉద్యోగిగా వ్యవహరించిన వ్యక్తి కేంద్రంగా అవినీతి చోటు చేసుకుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అతడి హయాంలో ఒక ఏడాదిలో దాదాపు రూ.7 లక్షల వరకూ ఇంటి పన్నులు పక్కదారి పట్టినట్లు భావిస్తున్నారు. ఈ లెక్కన గత ఐదారేళ్లుగా దాదాపు రూ.35 లక్షలకు పైబడే పక్కదారి పట్టినట్లు అనుమానిస్తున్నారు. గత ఐదేళ్లుగా పాలకవర్గం లేకపోవడం కూడా ఈ అవినీతికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎంపీడీవోలు పంచాయతీ ప్రత్యేకాధికారులుగా ఉన్నా దీనిపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం.

☛ పంచాయతీలో ఇతర ఆదాయ మార్గాల ద్వారా ఇంకెంత అవినీతి జరిగిందోనన్న సందేహాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఏటా రూ.50 లక్షలకు పైబడి పారిశుద్ధ్యం, మంచి నీటి నిర్వహణ పనుల్ని టెండర్ల ద్వారా కేటాయిస్తున్నారు. వీధి దీపాలు, పైప్‌లైన్ మరమ్మతులు, ఇతర ఖర్చుల పేరిట ఎంతెంత స్వాహా చేశారోనని ఆరోపిస్తున్నారు. వీటన్నింటి పైనా ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని జనం డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలో సిబ్బందే ఇంటి పన్నుల లెక్కలు తీయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పంచాయతీ ఈవో నరసింహారావును వివరణ కోరగా ఎరియర్స్‌పై అనుమానాలు రావడంతో సిబ్బంది, విశ్రాంత ఉద్యోగితోనూ ఇంటిపన్నుల రికార్డులు, బిల్లులను తనిఖీ చేయిస్తున్నామన్నారు. కొంత పక్కదారి పట్టిన మాట వాస్తవమేనని, ఎంత అనేది రెండు రోజుల్లో వెల్లడికానున్నది చెప్పారు.

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

పోతేపల్లి(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మండల పరిధి పోతేపల్లిలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. రైల్వే స్థలంలో డ్రెయిన్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేస్తున్నామన్నారు. పోర్టు ఆధారిత రైల్ కం రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి పోతేపల్లిలోని రైతులతో సమస్యలున్నాయని, రెవెన్యూ అధికారులతో చర్చించి త్వరలోనే అన్నదాతలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జ్యుయలరీ పార్కులో కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారితో కలిసి రోల్డ్ గోల్డ్ పని చేసి ముచ్చటించారు. మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె నాని, తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు కాగిత వెంకటేశ్వరరావు, కాటం మధుసూదనరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోల్డుగోల్డ్ కార్మికునిగా పని చేస్తున్న మంత్రి రవీంద్ర

విమానాశ్రయ పరిసరాల్లో పచ్చదనం పెంచండి

కేసరపల్లి(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో పచ్చదనం పరిఢవిల్లేలా తీసుకోవాల్సిన అన్ని చర్యలు సత్వరమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం కేసరపల్లిలో విమానాశ్రయం నుంచి బుడమేరు వంతెన వరకు చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. . అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులతో కలిసి విమానాశ్రయ, హైవే పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొక్కలు విరివిగా పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలు చేపడతామన్నారు. హైవే పైవంతెనలపై పగుళ్లు, గుంతలకు మరమ్మతులు చేపట్టి, వీధిదీపాలు వెలిగేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన జాతీయ రహదారిగా చెన్నై-కోల్‌కతా హైవేను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో అమరావతి అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, జాతీయ రహదారి పీడీ విద్యాసాగర్, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో హైవే పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర అధికారులు

మగువలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి

గూడూరు, న్యూస్‌టుడే : ఎన్నికల్లో చెప్పినవన్నీ చేస్తున్నాం.. చెప్పనవి కూడా చేస్తామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి మండల పరిధిలోని తరకటూరులో పర్యటించి మాట్లాడారు. ఇటు సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అటు అభివృద్ధిని కూడా సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వస్తుందన్నారు. మగువలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహ స్వామి, సర్పంచి చిన్నం వెంకట రమణ, కూటమి నాయకులు కాసగాని శ్రీనివాసరావు, గోపి నాగబాబు, ఎస్‌ఏ బేగ్, కాట్రగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి పర్యటనలో ఎమ్మెల్యే, ఆర్టీసీ ఛైర్మన్, నాయకులు

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95 రిటైల్ ధర 117 చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, 110, 121 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ(హైదరాబాద్), న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఏటా మాదిరి వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందికి '2023 ప్రతిభా పురస్కారాలు' ప్రకటించింది. ఎలనాగ(కవిత), డా.ప్రభల జానకి(విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి(చిత్రలేఖనం), సంపత్‌రెడ్డి(శిల్పం), పేరిణి రమేష్‌లాల్(నృత్యం), హరిప్రియ(సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి (పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ(నాటకం), కడకంచి పాపయ్య(జానపద కళారంగం), ధూళిపాళ మహాదేవమణి(అవధానం), ఆచార్య కె.మలయవాసిని (ఉత్తమ రచయిత్రి), డా.శాంతి నారాయణ(నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు గురువారం ప్రకటనలో తెలిపారు. త్వరలోనే విశ్వవిద్యాలయంలో అవార్డుతో పాటు ఒక్కొక్కరికి రూ.20,116 అందజేస్తామని చెప్పారు.

తీసుకున్న నగలెన్నో చెప్పు

బంగారంతో ఉడాయించిన వ్యాపారిని విచారిస్తున్న పోలీసులు

విద్యాధరపురం: పాతబస్తీలో కొనుగోలుదారులకు ఆభరణాలు చూపించి తెస్తానని చెప్పి ఉడాయించిన వ్యాపారి ఏనుగుల వినోద్‌ను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని గురువారం విచారించారు. పాతబస్తీ శివాలయం వీధిలో వేణుగోపాల్ బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వినోద్ వచ్చి వేణుగోపాల్ వద్ద రూ.50లక్షల విలువైన 655గ్రాముల ఆభరణాలు తీసుకెళ్లారు. వాటిని తిరిగి ఇవ్వకుండా దుకాణం మూసి వెళ్లడంతో వేణుగోపాల్ పోలీసులను ఆశ్రయించారు. ప్రత్యేక బృందాలు గాలిస్తున్న విషయం తెలుసుకున్న వినోద్ న్యాయవాది సహాయంతో వన్‌టౌన్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఎంత మంది నుంచి బంగారం తీసుకున్నారు, ఆ నగలు ఏమిచేశారు, ఎక్కడ దాచారు తదితర అంశాలపై పోలీసులు విచారించారు. నిందితుడి ఫోన్ నంబర్లు, తిరిగిన ప్రదేశాలు, ఇతర అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

గన్నవరం కోర్టుకు వంశీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం గన్నవరం కోర్టు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తాజాగా బెయిల్‌పై విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదలైన ఆయన పలు కేసుల్లో ష్యూరిటీలు సమర్పించేందుకు స్థానిక కోర్టు, స్టేషన్‌కు న్యాయవాదులతో కలిసి వచ్చారు. వంశీ వెంట ఆయన సతీమణి, పలువురు అనుచరులు ఉన్నారు.

కోర్టు వద్ద న్యాయవాదులు, అనుచరులతో మాజీ ఎమ్మెల్యే వంశీ

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన NIT NO.06/EE/2025-26, Dt: 01-07-2025
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి 1) కొండ పైన టాయిలెట్స్, రిపేర్లు 2) కొండ పైన కెమికల్ ట్రీట్ మెంట్ 3) ఆర్థిక సంవత్సరం 2025-26 సందర్భముగా కొండ క్రింద సివిల్ మెయింట్ నెన్స్ 4) కొనుగోలు కొరకు ఆరు సీట్ల బ్యాటరీ వెహికల్ (2వ పర్యాయము) 5) సి.సి టి.వి ఎ.యమ్.సి రెండు సంవత్సరముల కాలమునకు పనులు చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తికలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments department సీ.నెం. 1, 2 & 3 వర్క్స్ నందు మరియు సీ.నెం. 4 & 5 ప్రొడక్ట్స్ నందు దర్శించవచ్చును. టెండర్లు డౌను లోడు ది:05-07-2025 మ॥ 3.00 గం॥ల నుండి ది:19-07-2025 ఉ॥ 11.00 గం॥ల వరకు. టెండరు దాఖలు చేయు చివరి తేది:19-07-2025 మ॥ 3.00 గం॥ల వరకు మరియు దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి కొండ పైన ఘాట్ రోడ్ వద్ద Tensile షెడ్ వేయుటకు మరియు దేవస్థానము నందు కొండ పైన మరియు కొండ క్రింద రెగ్యులర్ మరియు దసరా మహోత్సవములు-2025 సందర్భముగా వివిధ సివిల్, ఎలక్ట్రికల్, వాటర్, ట్రాన్స్‌పోర్ట్, గార్డెన్ మొ॥లగు పనులకు గాను సీల్డ్ కొటేషన్లు స్వీకరించబడును. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోన్:0866-2423800 ద్వారా సంప్రదించగలరు.
ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

OFFICE OF THE EXECUTIVE ENGINEER AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, KRISHNA, MACHILIPATNAM.

'E' Procurement Short Tender Notice

Short Tender Notice.No.03/DB/EE/APEWIDC/2025-26. Dated 03.07.2025.

Tenders are Invited for Major and Minor Repairs to BC and ST Hostels, ST Community Hall and Existing leaky Proof to arrest leakage at Polytechnic College Works 4 Nos. **(Vide NIT. Nos.12 to 15)** of APEWIDC., Division In Krishna District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' procurement market place I.e., www.apeprocurement.gov.in.

Bld Document Downloading Start Date from : 05.07.2025.
Bld Document Downloading End Date: 14.07.2025 up to 3.00 PM.
Bid Submission Closing Date : 14.07.2025 up to 4.00 PM.
Bld Opening Date : 14.07.2025 @ 5.00 PM.

Sd/- **Executive Engineer**
APEWIDC, Krishna, Machillpatnam.

మహిళలు, చిన్నారుల భద్రతకు భరోసా

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఒంటరి మహిళలు, అభాగ్యులైన చిన్నారుల భవిష్యత్తు, భద్రతకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. గురువారం హనుమాన్ జంక్షన్ జ్యోతి నగర్‌లోని శక్తిసదన్‌ను సందర్శించారు. అక్కడి సేవలను స్వయంగా పరిశీలించారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని పునరావాస కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు శైలజ తెలిపారు. ప్రైవేటు సంస్థలు, దాతలు, ఎన్జీఓల భాగస్వామ్యంతో నడుస్తున్న వీటికి గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల బిల్లులు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి విడతగా రెండేళ్ల బిల్లులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. శక్తి సదన్‌ల ద్వారా మహిళలు, యువతులు విద్య, స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చన్నారు.

శక్తి సదన్‌లో మహిళలు, చిన్నారులతో రాయపాటి శైలజ

ఉద్యోగం నుంచి తొలగించారని.. యజమాని కారు చోరీ

నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకున్న మాచవరం పోలీసులు

గుణదల(పటమట), న్యూస్‌టుడే : తనను ఉద్యోగం నుంచి తొలగించారని యాజమానిపై కక్ష పెంచుకున్న పాత డ్రైవర్.. మూడేళ్ల తర్వాత తన వద్ద ఉన్న అదనపు తాళంతో అతని కారు చోరీ చేశాడు. మాచవరం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కారును, నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ మండలం ప్రసాదంపాడుకు చెందిన ఆంథోనీ కుమార్.. గతంలో మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన రామకృష్ణ ప్రసాద్ వద్ద డ్రైవర్‌గా పని చేశాడు. కారు యజమానికి ఆంథోనీ కుమార్ ప్రవర్తన నచ్చకపోవడంతో మూడేళ్ల కిందట అతడిని ఉద్యోగం నుంచి తొలగించి అబ్దుల్‌ఖాన్ అనే డ్రైవర్‌ను పెట్టుకున్నారు. ఆంథోనీ మానేసిన సమయంలో కారు అదనపు తాళం తన వద్దే ఉంచుకున్నాడు. అబ్దుల్‌ఖాన్ బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ వద్దకు రాగా.. సెల్లార్‌లోని పార్కింగ్‌లో ఉన్న కారు కనిపించలేదు. యాజమాని రామకృష్ణ ప్రసాద్ సూచన మేరకు అబ్దుల్‌ఖాన్ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ పరిశీలించి కారును చోరీ చేసింది ఆంథోనీగా గుర్తించారు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో అతని ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి రామవరప్పాడులో కారుతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మూడేళ్ల కిందట తనను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారన్న కోపంతోనే కారును చోరీ చేసినట్టు నిందితుడు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్ వీరంగం

పటమట, న్యూస్‌టుడే: ఓ ఇంటిని ఖాళీ చేయించేందుకు పెనమలూరుకు చెందిన రౌడీషీటర్ కొక్కిలగడ్డ జాన్‌బాబు వీరంగం సృష్టించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆచార్య ఎంజీ నగర్‌లో కృష్ణారావుకు చెందిన నివాసంలో కోట సామ్రాజ్యం నాలుగేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. ఇల్లు ఖాళీ చేసే విషయంలో వారి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో రౌడీషీటర్ జాన్‌బాబు.. 10 మంది అనుచరులు కలిసి సామ్రాజ్యం అద్దెకు ఉంటున్న ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. ఇంట్లో వస్తువులన్నీ ధ్వంసం చేసి కొన్ని వస్తువులు బయట పడేశారు. సామ్రాజ్యం పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో టాస్క్ పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతానికి కేసు నమోదు కాలేదు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రహదారి దాటుతుండగా అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టగా వ్యక్తి మృతిచెందిన సంఘటన ఇది. గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు చెందిన పేర్ని దుర్గారావు(47) చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి పెయ్యేరులో రహదారి దాటుతుండగా అదే సమయంలో సింగరాయపాలెం నుంచి ముదినేపల్లి వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుడి కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

FLAT FOR SALE

అశోక్‌నగర్ బందరు రోడ్డుకి అతి సమీపమున పప్పుల మిల్లు బస్టాప్ నందు నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 73829 81107.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని అనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

57 ఎ॥ మెగా గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ @ కాజా టోల్‌గేట్ NRI's వారు డెవలప్ చేస్తున్న వెంచర్‌లో ప్లాటు బుకింగ్ 3 ల॥ 183- 400 చ॥లు ప్లాట్లు, క్లబ్ హౌజ్‌తో. ✆ 9502230091.

విజయవాడకు చేరువలో పామర్రు దగ్గర 4.5 లక్షలకు, 100 చ॥గ॥ ★ నందిగామ హైవే ఆనుకొని గ॥ 8999 రూ॥. కొండపల్లి హైవే అనుకొని గ॥ 9999 రూ॥. Plots అమ్మకమునకు కలవు. ✆ 93982 13364.

TO LET

సూర్యారావుపేట ప్రకాశం రోడ్‌లో నందన స్కిన్‌కేర్ ఎదురుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో 2 సింగిల్ బెడ్‌రూమ్ పోర్షన్స్ 1st ఫ్లోర్‌లో 1 సింగిల్ బెడ్‌రూమ్ ఫ్యామిలీస్‌కి మాత్రమే అద్దెకు. ✆ 91609 12102.

విజయవాడ లబ్బీపేటలో 3000 చ.అ.ల విస్తీర్ణం గల హాస్టల్ (2000 చ.అ.) & ఆఫీస్ (1000 చ.అ.) అద్దెకు కలదు. ✆ 94944 92633.

JOBS

Wanted Female Counsellors & Telecallers for Abroad Education Consultancy. Min. Exp- 2 Yrs. Good Communication Skills. Good Salary+ Incentives. Labbipet, Vijayawada. Ph: 8121396789.

Wanted Experienced Teacher to teach Hindi subject (6th to 10th Class) TCMA EM High School, 1 town, VJA. ✆ 94401 26237, 93986 69578.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శ్రీ సాయి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ & డెవలపర్స్ తాడేపల్లి వారి వినుకొండ దగ్గర్లో 22 ఎ॥ ఎర్రచందనం, మహాగని వెంచర్‌లో ప్లాట్లు అమ్ముటకు ఏజెంట్స్ కావలెను. ✆ 80081 93109, 95050 93432.

లబ్బీపేటలోని ప్రముఖ కాలేజీలో పనిచెయ్యడానికి అనుభవజ్ఞులైన కౌన్సెలర్లు, క్లాస్ ఇంఛార్జ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియూ హాస్టల్ వార్డెన్లు కావలెను. వయసు: 25-40. జీతం: 12K-15K. 91542 10069.

Study Power (Education Loans) నందు పనిచేయుటకు Staff మరియు కమిషన్ based Agents కావలెను. ✆ 9963878710.

క్లాస్ ఇన్‌ఛార్జెస్ (M), జీ: 12K, హాస్టల్ వార్డెన్స్ (M), జీ:10K, వ: 25-45, అనుభవం గల వారు కావలెను. గౌతమ్ డిగ్రీ కాలేజ్, మోడ్రన్ సూ. మార్కెట్ ఎదురు, బెంజ్ సర్కిల్. ✆ 88971 72345.

SECURITY GUARDS

హనుమాన్‌జంక్షన్ దగ్గర ఆరుగొలనులో పనిచేయుటకు 3 సం॥లు అనుభవం గల సెక్యూరిటీ ఆఫీసర్ (45 సం॥లోపు) కావలెను. జీతం: 25,000/- Ex ఆర్మీ, సివిలియన్ సంప్ర: 95737 01777.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

యోగాను ఒలింపిక్ క్రీడల్లో చేర్చాలి

జేసీకి ఆహ్వాన పత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : యోగాను ఒలింపిక్ క్రీడల్లో చేర్చేలా ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ యోగాసన స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉయ్యూరులో ఈ నెల 19న జరిగే జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొనాలని కోరుతూ గురువారం జేసీ గీతాంజలిశర్మను కలిసి ఆహ్వాన పత్రం అందించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంఘ జిల్లా కార్యదర్శి బెనర్జీ, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10న సమావేశం

పెడన, న్యూస్‌టుడే : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10న మెగా టీచర్స్, పేరెంట్స్ 2.0 సమావేశం జరుగుతుందని ఎంఈవో వైవీ హరినాథ్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తోన్న విద్యా సంస్కరణలపై అవగాహన, 2047 నాటికి వికసిత ఏపీ లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఇందులో అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు. తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపించాలని ఇప్పటికే హెచ్‌ఎంలను ఆదేశించామన్నారు. ఆ రోజున క్రీడా, సాంస్కృతిక పోటీలు కూడా జరుగుతాయని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

◆ బందరు బైపాస్ రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు గుంతలు పూడ్చించారు. సమస్య పరిష్కరించారు.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

? చేవెంద్ర రక్షిత చెరువులో తూడు, గుర్రపు డెక్క పేరుకుంది. తాగునీటి అవసరాలకు ఈ చెరువును ఉయోగించడం సాధ్యం కావడం లేదు. **- గ్రామస్థులు**

✔ ఆ చెరువును మరమ్మతులు చేయించాలంటే రూ.2 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. సమీపంలోని తొమ్మిది ఎకరాల ప్రభుత్వ స్థలంలో కొత్తగా రక్షిత చెరువు తవ్వాలని గ్రామస్థులు ఆలోచన చేస్తున్నారు. **- ఫరహా తుల్లా, గ్రామ కార్యదర్శి** – న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

ప్రతిపాదనలకే పరిమితం.. అభివృద్ధి ప్రశ్నార్థకం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

నగరంలోని చేపల మార్కెట్ అభివృద్ధికి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు చేయడమే కానీ అమలుకు నోచుకోవడం లేదు. గత వైకాపా ప్రభుత్వం మోడరన్ మార్కెట్‌గా చేస్తామని, అందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని చెబుతూ ఐదేళ్లు గడిపేసింది. కానీ పట్టించుకున్న దాఖలాలే లేవు. దీంతో మార్కెట్ ప్రాంగణంలోని వివిధ దుకాణాలు క్రమేపీ శిథిలావస్థకు చేరడంతో దుకాణదారులు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. మిగిలిన వారు చేసేది లేక అలాగే కొనసాగుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో దుకాణదారులతో పాటు వినియోగదారులూ అవస్థలు పడాల్సి వస్తోంది.

పాడైపోయి అలంకారంగా మారిన దుకాణాలు

దుకాణాలు 100 (చేపలు)
మాంసం 30
ఎండు చేపలు 18

ఫ్లోరింగ్ దెబ్బతింది

చేపల విక్రయాలకు గతంలోనే భవనాలు నిర్మించారు. కానీ మాంసం, ఎండు చేపల మార్కెట్‌ల్లో దుకాణాలు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లుగా తయారయ్యాయి. మాంసం మార్కెట్‌లో పదుల సంఖ్యలో దుకాణాలు ఉండగా చాలా మంది ఖాళీ చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఎండు చేపల మార్కెట్‌లో కూడా ఇదే పరిస్థితి. దుకాణాల కోసం నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరాయి. ఫ్లోరింగ్ సైతం దెబ్బతింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. మాంసం, ఎండు చేపలు, నాటుకోళ్లు తదితరాలు అన్నీ ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అందుకే నగరవాసులతో పాటు పరిసర మండలాలకు చెందిన ప్రజలు ప్రతి రోజూ ఇక్కడకు వస్తుంటారు.

రోడ్ల పక్కన విక్రయాలు

దుకాణాలు పాడైపోవడంతో వినియోగదారులు సక్రమంగా రావడం లేదని, దీంతో రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుంటున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఏళ్లు గడిచిపోతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో చాలామంది దుకాణాలు వదిలేసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల పక్కన విక్రయించుకుంటున్నారు. మార్కెట్‌లో తిష్ఠ వేసిన సమస్యలతో పడుతున్న ఇబ్బందులను దుకాణదారులు ఇటీవల మంత్రి కొల్లు రవీంద్ర వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు. పట్టించుకోకపోతే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు

గతంలో మత్స్య శాఖ ద్వారా చేపల మార్కెట్ల అభివృద్ధికి నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం అటు మత్స్య శాఖ, ఇటు నగరపాలక సంస్థ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మార్కెట్‌లో ఇప్పటి వరకు ఏవైనా అభివృద్ధి పనులు జరిగాయంటే తెదేపా హయాంలోనేనని దుకాణదారులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని మార్కెట్‌ను అభివృద్ధి చేస్తుందన్న ఆశతో పలువురు ఎదురు చూస్తున్నారు.

ధర వరలు

టమాట 37, వంగ 30, బెండ 30, పచ్చిమిర్చి 34, కాకర 44, క్యాబేజీ 22, క్యారెట్ 40, దొండ 35, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 27, గోరు చిక్కుడు 34, దోస 18, సొర 10, 8, అరటికాయ 8, 7, చిక్కుళ్లు 50, బీర 24, చామదుంప 30, మునగ 10/08, కంద 60, బీట్‌రూట్ 28, కీరదోస 40, బీన్స్ 85, క్యాప్సికం 80, అలసందలు 40, చిలకడదుంప 36, కొత్తిమీర 16/08, పుదీనా 15/5 శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తిని ఫోన్ 91823 61295లో సంప్రదించవచ్చు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

సినిమాలు

రేవతి : జురాసిక్ వరల్డ్
మినీ రేవతి: మార్గన్
సిరికృష్ణ: కుబేర
సిరి వెంకట్: తమ్ముడు
- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

ఆషాఢ సారె సమర్పణ

ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : ఆషాఢ మాసం సందర్భంగా బంటుమిల్లిలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీకనక దుర్గమ్మ వారికి సారె సమర్పించారు. గణేష్ ఆలయం నుంచి కనక దుర్గమ్మ వారి గుడి వరకు ఊరేగింపుగా తరలి వెళ్లారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త గరికపాటి కూనారావు వారికి ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

5 నుంచి బీఎల్వోలకు శిక్షణ

పెడన, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని 217 పోలింగ్ కేంద్రాల బీఎల్వోలకు ఈ నెల 5 నుంచి 11 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ కె.అనిల్ కుమార్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం చట్టాలు, మొబైల్ యాప్, ఇంటింటా సర్వేలో పాటించాల్సిన నిబంధనలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న శిక్షణలో రోజుకు 50 మంది వంతున పాల్గొంటారన్నారు.

పాఠశాలల్లోని ఖాళీల భర్తీకి వినతి

కలెక్టరేట్ ఏవో రాధికకు వినతిపత్రం అందిస్తూ..

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీలు త్వరితగతిన భర్తీ చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలపై డీఈవో పీవీజే రామారావుతో పాటు కలెక్టరేట్ ఏవో రాధికను కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ షౌకత్ హుస్సేన్, బి.కనకారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

డీఈవోకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్టీయూ నాయకులు గురువారం డీఈవో పీవీజే రామారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పది పరీక్షలు, మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బందికి రావాల్సిన వేతన బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. బదిలీ అయిన వారి వివరాలను త్వరితగతిన నవీకరించి జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ఇమ్మానుయేల్, డి.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యూవీ కృష్ణమూర్తి, ఆర్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం.. సంక్షేమానికి ప్రాధాన్యం

కూడూరు : ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

బందరు 39వ డివిజన్‌లో..

పెడన, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కూడూరులో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్- 6 పథకాల హామీని నెరవేర్చుతున్నామన్నారు. తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : నగరంలోని 39వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా శిక్షకరణ సాధికారత రాష్ట్ర కన్వీనర్ అక్కుమహంతి రాజా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. 45వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్ మహిళలతో మాట్లాడి కరపత్రాలు పంపిణీ చేశారు.

చెరుకుమిల్లిలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తూ..

కృత్తివెన్ను, న్యూస్‌టుడే : చెరుకుమిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఒడుగు తులసీరావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థినులు

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే ఆరోగ్య విషయాలపై అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. వైద్య శాఖ, రెడ్ రిబ్బన్ క్లబ్, దివ్య డయాగ్నస్టిక్ సెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యాన గురువారం లేడి యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. రక్తదానంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రిన్సిపల్ పి.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి లంకిశెట్టి హరిబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎక్కడ పడితే అక్కడ మద్యం కొనరాదు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల్లోనే మద్యం వినియోగించాలని బంటుమిల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు, పార్టీలు, వేడుకల్లో మద్యం తక్కువ ధరకు వస్తుందని ఎక్కడ పడితే అక్కడ కొనుగోలు చేయవద్దన్నారు. నకిలీ మద్యంతో ఆరోగ్యానికి హాని ఉంటుందని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తుల వద్ద మద్యం తీసుకోవద్దని చెప్పారు.

గాడితప్పిన పనితీరు.. మారరా మీరు?

న్యూస్‌టుడే, పెడన

పెడన మండలంలో వ్యవసాయ శాఖ పనితీరు గాడి తప్పింది. పాడి పంటలు, ప్రజల జీవనాధారమైన మండలంలో రైతులకు ప్రభుత్వ పథకాలను అందించడంలో ఈ శాఖ అధికారులు వెనుక పడుతున్నారు. స్థానిక మార్కెట్ కమిటీలో ఉన్న మండల వ్యవసాయ కార్యాలయంతో పాటు మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల్లో అన్నదాతలకు అధికారులు అందుబాటులో ఉండడం లేదని కొంతకాలంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

పెనుమల్లి : పని వేళల్లో మూతపడిన రైతు సేవా కేంద్రం

వెలుగుచూసిన భారీ స్వాహా

ఉమ్మడి కృష్ణా జిల్లాలో గతేడాది నిధుల స్వాహా మండలంలోని ఈ శాఖలోనే వెలుగు చూసింది. మిగ్‌చాంగ్ తుపాన్‌కు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ దాదాపు రూ.45 లక్షలను కాజేశారు. దీనికి బాధ్యుల్ని చేస్తూ అప్పటి ఏవో శ్రీనివాసరావు, ఇరువురు వీఏఏలను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కంప్యూటర్‌లో రైతుల జాబితాలను మార్చేసి బోగస్ పేర్లతో స్వాహా చేశారని విచారణలో తెలింది. అంతకముందు ఉరివి వీఏఏ విత్తనాలు అమ్మగా వచ్చిన సొమ్ము రూ.5 లక్షల వరకు స్వాహా చేశారు.

అందుబాటులో ఉండని ఉద్యోగులు

ఏవో శ్రీనివాసరావు సస్పెన్షన్ తర్వాత మచిలీపట్నం ల్యాబ్ ఏవో నూరున్నీసాను ఇన్‌ఛార్జిగా నియమించారు. అయితే ఆమె రైతులకు అందుబాటులో ఉండడం లేదని విమర్శలు వచ్చాయి. కేంద్ర బృందం గత నెలలో పెడనలో పర్యటించినా ఆమె పాల్గొనలేదు. దీంతో ఏఈవో స్థాయి అధికారి మార్గదర్శకం చేశారు. దీనిపై కేంద్ర బృందం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మొత్తం 17 రైతు సేవా కేంద్రాలకు 14 మంది వీఏఏలు ఉండగా అప్పుడప్పుడు మాత్రమే కన్పిస్తున్నారని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. అన్నదాత సుఖీభవ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

డీలర్ల నుంచి వసూళ్లు

మండలంలో 25 మంది ఎరువులు, విత్తనాల డీలర్లు ఉండగా ఖరీఫ్, రబీలో రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తాన్ని వివిధ స్థాయిలో పంపకాలు చేపడుతున్నట్లు తెలిసింది. దీనికి పెడన కేంద్రంగా కొంతమంది వ్యక్తులు దళారులుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. సదరు డీలర్లు నిబంధనలకు తిలోదకాలిస్తోన్నా చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా విత్తనాల నుంచి ఎరువులు, పురుగు మందుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

మెరుగైన సేవలు అందిస్తాం

వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. రైతులకు సాగులో సలహాలు సూచనలిస్తూ సేవలు అందిస్తాం. **- సజ్జా జెన్నీ, ఏవో**

ప్రమాణాలు పెంచండి.. ఆదర్శంగా నిలపండి

మోడల్ పాఠశాలలో చిన్నారుల సామర్థ్యం పరీక్షిస్తున్న ఎంఈవో

పెడన: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో వైవీ హరినాథ్ అన్నారు. స్థానిక 2వ వార్డు మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. ప్రవేశాలను మరింత పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు వేసవి సెలవుల అనంతరం పాఠశాలలకు వస్తున్న నేపథ్యంలో తిరిగి చదువులపై దృష్టి సారించేలా చైతన్య పర్చాలన్నారు. హెచ్ఎం మోకా వెంకటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

భోజనం రుచి చూస్తున్న ఎంపీడీవో

గూడూరు, న్యూస్‌టుడే : బోధన ఎలా ఉంది...భోజనం బావుందా? అంటూ ఎంపీడీవో అనూహ్య విద్యార్థులను ఆరా తీశారు. మండల పరిధిలోని మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను హెచ్ఎం చింతా మురళీకృష్ణ ఎంపీడీవోకి వివరించారు.

రక్షణ గోడ లేక.. ఇబ్బందులు తప్పక..

చిట్టిగూడూరులోని చెరువు చుట్టూ ఉన్న ప్రధాన రహదారి కోతకు గురవడంతో గ్రామస్థులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించినా రక్షణ గోడ ఏర్పాటు చేయక పోవడంతో రహదారి క్రమేపీ కోతకు గురవుతోంది. వైకాపా హయాంలోనే ఈ సమస్యను పలుమార్లు అప్పటి పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న వారే కరవయ్యారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు చెరువులో దిగే పశువుల రాకపోకలతో రహదారి అంచులన్నీ చెరువులో కలిసి పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గూడూరు**

దారి.. అధ్వానంగా మారి

బంటుమిల్లిలోని క్రిస్టియన్ శ్మశాన వాటికకు వెళ్లే దారి వ్యర్థాలతో నిండి అధ్వానంగా తయారైంది. సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో అక్కడ వరకు కూడా వెళ్లకుండా పలువురు వ్యర్థాలను ఈ మార్గంలో వేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు పడటంతో బురదమయంగా మారిన రోడ్డులో రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బంటుమిల్లి**

పట్టాభిరామ్‌కు ఘన నివాళి

పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక ప్రముఖులు

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డా.బీవీ పట్టాభిరామ్‌కు స్థానిక ప్రముఖులు నివాళులర్పించారు. ఇంగ్లీష్‌పాలెంలోని మైండ్ కేర్ కౌన్సెలింగ్, శిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ విడియాల చక్రవర్తి ఆధ్వర్యాన పట్టాభిరామ్ సంతాప సభను గురువారం నిర్వహించారు. ఈ మేరకు పట్టాభి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, పోతురాజు, మల్లికార్జున్, సుశీల్‌కుమార్, కాంత్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకొనే దిశగా యువత చైతన్యవంతులు కావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో గురువారం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.విజయ కుమారి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ నాలుగో ఏడాది విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు ప్రతినిధులు రాంప్రకాష్, ఆర్‌వీ హనుమంతరావు తదితరులు ఉపాధి అవకాశాలకు సంబంధించిన రాత పరీక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ వివేక్‌తేజ, కేయూ క్యాంపస్ బ్రాంచ్ మేనేజర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాంప్ నిర్మాణానికి భూమిపూజ

శంకుస్థాపన చేస్తున్న సత్యనారాయణ, గ్రామస్థులు

ఒన్నారెకానూరు (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : మండల పరిధి గణపబత్తుల కానూరులోని కొత్త గృహాల వద్ద పంట కాలువలో ర్యాంప్ నిర్మాణానికి తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌ఛార్జి దివి మహేష్, చెక్క ఏడుకొండలు, బొమ్మిడి పెద ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వీఆర్వోల బదిలీ

వీఆర్వోలను సత్కరిస్తున్న తహసీల్దార్

పెడన: పెడన మండలంలోని వివిధ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న అయిదుగురు వీఆర్వోలు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1లుగా పదోన్నతులు పొంది బదిలీ అయ్యారు. పట్టణంలోని 6,7,8 సచివాలయాల వీఆర్వోలు నాగాంజనేయులు, బేబీ, మణికంఠలు కాకర్లమూడి, పురిటిగడ్డ, ఎస్ఎన్ గొల్లపాలేనికి బదిలీపై వెళ్లారు. మడక వీఆర్వో శ్రావణ రమ్య చోడవరానికి, పుల్లపాడు వీఆర్వో శివపార్వతి గుడ్లవల్లేరు మండలం వేమవరానికి బదిలీ అయ్యారు. ఆయా వీఆర్వోలను తహసీల్దార్ అనిల్ కుమార్, రీసర్వే డీటీ సల్మా, ఆర్ఐ విజయలక్ష్మి సత్కరించారు.

రైతులకు అందుబాటులో యూరియా

కొమాళ్లపూడి(కృత్తివెన్ను), న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కొమాళ్లపూడి సహకార బ్యాంకులో యూరియా అందుబాటులో ఉందని బ్యాంకు సిబ్బంది గురువారం తెలిపారు. యూరియా కావాల్సిన రైతులంతా ఆధార్ కార్డు తీసుకెళ్లి తెచ్చుకోవాలని వారు సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అసంపూర్తి నిర్మాణం

వైకాపా హయాంలో నాడు- నేడు పథకంలో భాగంగా ప్రారంభించిన నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచాయి. స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం పై అంతస్థులో పనులు ప్రారంభించారు. అవి పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తోంది. నిలిచిన పనులను కూటమి ప్రభుత్వం అయినా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బంటుమిల్లి**

వృథాగా పోతున్న నీరు..జనాలకు అవస్థలు

నగరంలోని వలంద పాలెం వసతి గృహం సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న పైపులైన్ వాల్వ్ నుంచి తాగునీరు వృథాగా పోతుంది. కొన్ని రోజులుగా ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో శివారు ప్రాంతాలకు సక్రమంగా నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దానికి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

సమస్యలు పరిష్కారం చేస్తామని నాయకుల ప్రతిజ్ఞ

కృత్తివెన్ను, న్యూస్‌టుడే : మండలంలోని ఉపాధ్యాయులు యూటీఎఫ్ మండల శాఖ ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఇందులో మండల అధ్యక్షుడిగా సానా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఉండి పురుషోత్తం, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యూటీఎఫ్ ప్రతిజ్ఞ చేశారు. వీరాస్వామి, నాగరాజు, శ్రీనివాసరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి
కట్టా బాబురావు D.No.29/360-A చింతగుంటపాలెం, మచిలీపట్నం సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్-2021/1995 ఇంటి దస్తావేజులు ఇంటి నుండి ఫోటోస్టాట్ కొరకు వెళుతుండగా దారిలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు తెలుపగలరు.
సెల్: 92924 07783

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ఐకమత్యంతో అడుగులు వేయాలి

ఉయ్యూరు: ఐకమత్యంతో అడుగులేస్తే ఏదైనా సాధించొచ్చని, అలాగే ఒకరి కష్టాన్ని అందరూ పంచుకుంటే ఆనందంగా ఉంటుందని ఉయ్యూరు ఏరియా టూ వీలర్స్ మెకానిక్‌ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అక్బర్ బాషా అన్నారు. ప్రపంచ టూ వీలర్ మెకానిక్‌ల దినోత్సవాన్ని ఉయ్యూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శిరీష మానసిక వికలాంగుల పిల్లల మధ్య మెకానిక్ ప్రతినిధులు కేక్ కోశారు. ఆ కేంద్రానికి నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో అతిథిగా హాజరైన సంఘ న్యాయ సలహాదారులు బెల్లపు సురేష్ మాట్లాడుతూ మెకానిక్‌లు సాంకేతిక మార్పుల్ని గ్రహించి, అందులో నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇటీవల ఆకస్మికంగా మరణించిన ఓ మెకానిక్ కుటుంబానికి సంఘం తరఫున రూ.30వేలు అందజేశారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు జగన్నాథరావు అధ్యక్షత వహించారు.

ఆక్రమణల అడ్డుకట్టకు చర్యలు

శిబిరం ఏర్పాటు చేసిన సిబ్బంది

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కోడూరుపాడు గ్రామ పంచాయతీ పరిధి రీసర్వే నంబరు 139లోని పెద్దికుంట చెరువులో తాజాగా ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. 44.60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుని పలువురు ఆక్రమించుకుని సాగుభూమిగా మార్చేశారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో కొన్ని నెలల కిందట పంచాయతీ, రెవెన్యూ అధికార్లు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశారు. అయినా కబ్జాదారు కొన్ని రోజులుగా వరి సాగుకు సమాయత్తమయ్యారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు గురువారం పంచాయతీ, రెవెన్యూ అధికారులు చెరువులోనే టెంటు వేసుకుని కర్షకులు, ఎవరూ రాకుండా పహారాకాశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

❖ యనమలకుదురు శివపార్వతీనగర్‌లో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ సమస్యపై స్పందించిన కమిషనర్ షేక్ సబ్బర్ సిబ్బందిని పంపి చెత్త తీయించారు.

❖ కానూరు కమలమ్మ బజారులో కొన్ని రోజులుగా మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయమై స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, యనమలకుదురు (కానూరు)

? ఈడుపుగల్లు కుమ్మరిపాలెం జాతీయ రహదారిపై నారాయణ కళాశాల ఎదురుగా కాలువలు పూడిపోయి మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. - ఎం.చంద్ర, కంకిపాడు

✔ సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతాం. - సీహెచ్.కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి - కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే

స్తంభాలు సరిచేశారు

కాటూరు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కాటూరు సమీపంలోని పొలాల్లో కరెంటు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు పడతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'ఏ నిమిషానికి.. ఏది కూలునో' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి స్తంభాలను సరిచేశారు. దీంతో రైతుల్లో ఆందోళన తొలగింది.

రాకపోకలకు చర్యలు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కాటూరు రోడ్డులో ట్రాఫిక్ సమస్యపై బుధవారం 'ఈనాడు'లో 'కాటూరు రోడ్డులో కాలు కదపలేం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉయ్యూరు పట్టణ పోలీసులు స్పందించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా కాటూరు రోడ్డులో సెంట్రల్ పార్కింగ్‌ను తొలగిస్తున్నట్లు రోడ్డు మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు నేతృత్వంలో పట్టణ ఎస్ఐ విశ్వనాథ్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. దీంతో గురువారం ఉదయం నుంచి ఆ రహదారి విశాలంగా మారింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు ప్రయాణించాయి.

రక్షణకు చేటు.. ముంపునకు చోటు!

బుడమేరు కట్టల బలోపేతంపై కొరవడిన పర్యవేక్షణ

కంకిపాడు, న్యూస్‌టుడే

బుడమేరు పేరు చెప్పగానే ఐదు గ్రామాల ప్రజలు ప్రధానంగా రైతులు భయపడే పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది సెప్టెంబరులో వచ్చిన వరదలకు వేలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. వారం రోజుల పాటు ఇళ్లు నీటిలో నానాయి. పశువులకూ గణనీయంగా నష్టం జరిగింది. ఇంత జరిగినా బుడమేరు రక్షణ కట్టలపై దృష్టి సారించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గండ్లు పడి ఏడు నెలలైనా పూడ్చకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

10 కిలోమీటర్ల పరిధిలో..

బుడమేరు వేల్పూరు నుంచి మాదిరుమాక వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర విస్తరించింది. ఈ మధ్యలో ఉన్న ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో 50 శాతం సాగు భూమిపై వరద ప్రభావం అధికంగా ఉంటుంది. ఉత్తరం, దక్షిణం రక్షణ కట్టలకు మొత్తం ఏడు చోట్ల గండ్లు పడ్డాయి. వీటిలో రెండింటిని ఇటీవల పూడ్చారు.

నిర్వహణ లోపం.. గ్రామస్థులకు శాపం

బుడమేరు కట్టల రక్షణకు ముందు చూపుతో ఏర్పాట్లు చేపట్టాలని 1917నాటి ఆర్ఓఆర్, డ్రెయినేజి బోర్డ్ చట్టం, ఫీల్డ్ మెజర్మెంట్ బుక్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టడానికి వీలుగా కట్టలపై లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు ఉండాలి. ప్రస్తుతం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో మూసుకుపోయి బురద మయంగా మారాయి. అడుగు భాగంలో 60 అడుగులు, పైభాగంలో 30 అడుగుల వెడల్పుతో ఉండాలి. 10-15 అడుగులకే పరిమితమైంది. కట్టలకు సమానంతరంగా ఉన్న ఖాళీ ప్రదేశం 50 అడుగుల వరకు ఆక్రమణకు గురైంది. గండి పడితే పూడ్చడానికి ఉన్న మట్టి దిబ్బలు కనుమరుగయ్యాయి.

ఉప్పలూరు-మంతెన మధ్యన పడిన గండి

మంతెన గ్రామ పరిధిలో కోతకు గురైన కట్ట

ఇప్పటికైనా కళ్లు తెరవాలి

రక్షణ కట్టల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని 100 ఏళ్ల కిందట చేసిన చట్టాన్ని ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలి. బలోపేతానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. లేకుంటే గత ఏడాదిలో ఎదురైన ముంపు బెడద ఎదురయ్యే ప్రమాదం ఉంది. వేల్పూరు నుంచి మాదిరుమాక వరకు పూర్తి స్థాయిలో బుడమేరు కట్టల రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

43 సంవత్సరాలుగా... ✆ 81252 65651 0866 2471617, 2477470
○ ఆటలు ○ పాటలు ○ రోబోటిక్స్ ○ డ్రోన్ తయారీ ○ 3డి ప్రింటింగ్
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలనీ దగ్గర, విజయవాడ-7.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వీరపల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్తు మరమ్మతుల కారణంగా ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ ఏఈ తెలిపారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన అవసరం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: యువతకు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ ఎంతో అవసరమని ఇన్ఫోసిస్ టెక్నాలజీ రిసోర్స్ సెంటర్(ఐటీఆర్‌సీ) సీఈవో రిజ్వాన్ ఖాన్ అన్నారు. ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐటీ స్కిల్స్‌లో శిక్షణలో భాగంగా గురువారం ఆయన పలు అంశాలను, వాటి భవిష్యత్తు ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఒకేషనల్ కోఆర్డినేటర్ కె.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామాలు.. సమస్యల నిలయాలు

కట్టుబడిపాలెం, ముదిరాజ్‌పాలెంలో దుస్థితి

న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

అధికారంలోకి వచ్చే వరకే అవి చేస్తాం.. ఇవి చేస్తాం అంటూ ఐదేళ్లకోసారి ఓట్ల కోసం వచ్చే నాయకులు మారుతున్నారు. కానీ తమ తలరాతలు మారడం లేదని మారుమూల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో ఏళ్లుగా కనీసం తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడం లేదని, పక్కా డ్రెయిన్లు లేక వీధులు మురుగు కూపాలుగా మారాయని గన్నవరం మండలంలోని కట్టుబడిపాలెం, ముదిరాజ్‌పాలెం వాసులు వాపోతున్నారు. ప్రభుత్వ ఖనిజ సంపదకు గన్నవరంలో నిలయమైన కొండపావులూరు పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాలెం, ముదిరాజ్‌పాలెం గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు రెండు వేల పైచిలుకు జనాభా ఉన్న రెండు పల్లెల్లో సరైన తాగునీటి వసతి లేదు. మరోవైపు పక్కా డ్రెయిన్లు, అంతర్గత రహదారులు లేవు. కిలోమీటరన్నర దూరంలో పోలవరం కట్ట సమీపంలోని చేతిపంపు నీటినే ఇరుగ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కేవలం ఓట్ల కోసం, శుభకార్యాలకు రావడమే తప్ప అభివృద్ధి పనులకు ఏ ఒక్క ప్రజా ప్రతినిధి గ్రామాల వైపు కన్నెత్తి చూడటంలేదు. సమస్యలు పరిష్కరించాలని అధికారుల వద్దకు తీసుకెళ్తామని ఎవరన్నా నోరెత్తితే తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా మారుమూల గ్రామాలైన కట్టుబడిపాలెం, ముదిరాజ్‌పాలెం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బురదమయంగా ముదిరాజ్‌పాలెం ప్రధాన రహదారి

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

గన్నవరం గ్రామీణం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం మండలం అల్లాపురంలో గురువారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన యార్లగడ్డ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాసితులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

మాజీ సర్పంచి మృతికి సంతాపం

పొట్టిపాడు (గన్నవరం గ్రామీణం): ఉంగుటూరు మండలం పొట్టిపాడుకు చెందిన తెదేపా నాయకుడు, మాజీ సర్పంచి గుడ్డేటి సుధాకర్ మృతికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సంతాపం తెలిపారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుధాకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించారు. సుధాకర్‌కు నివాళి అర్పించిన ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

కానూరు, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి అలవడతాయని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సర్గింగ్ సైలానీ అన్నారు. గురువారం వీవీఐటీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఉత్తమ అవార్డుల అందజేత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవీఐటీ ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ స్థాయిలో థాల్ సైనిక్ క్యాంపులో పాల్గొని అనేక స్వర్ణ పతకాలు సాధించారన్నారు. అనంతరం మెకానికల్ చివరి సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ కేడెట్ కె.సాయివరుణ్‌కు ఉత్తమ కేడెట్‌గా అవార్డు అందించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎం.దాదుర్యానాయక్‌కు ఉత్తమ ఎన్‌సీసీ అసోసియేట్ అధికారి పురస్కారం అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు, కాకినాడ గ్రూపు కమాండర్ కల్నల్ రితిన్ మోహన్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేడెట్లను అభినందిస్తున్న సైలాని, కొండపల్లి శివాజీబాబు

నట్టల నివారణ మందుల పంపిణీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా మేకలు, గొర్రెలకు నట్టల నివారణకు వీలుగా పశువైద్యశాఖ తరఫున నివారణ మందులు పంపిణీ చేపట్టినట్లు ఏడీఏ ప్రమీలారాణి తెలిపారు. మల్లవల్లిలో గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీవాల ఆరోగ్యం, ఎదుగుదలకు వర్షాకాలంలో తప్పనిసరిగా నట్టల నివారణకు మందులు వాడాలన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 13,556 జీవాలకు మందులు సరఫరా చేశామన్నారు. మల్లవల్లి పశుగణ సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

మాకాలకు ఎమ్మెల్యే అభినందన

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే: చెన్నైలో జాతీయ స్థాయి సహజ వైద్యుడు అవార్డు అందుకున్న ఇండియన్ ఓం ఛైర్మన్ మాకాల సత్యనారాయణ.. ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌ను గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎమ్మెల్యే అభినందించారు. ప్రధాని మోదీ ఫిట్‌నెస్ మంత్ర కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేసినందుకు, అవార్డు రావడం అభినందనీయమని ప్రశంసించారు.

సాగు సందడి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలంలో ఖరీఫ్ వరి సాగు పనులు ప్రారంభమయ్యాయి. మెట్ట ప్రాంతంలో ఇప్పటికే బోర్ల కింద నారుమళ్లను సిద్ధం చేసిన రైతులు గురువారం నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. డెల్టా ప్రాంతంలో ఇటీవలే ఏలూరు కాలువకు నీరు విడుదల చేయడం, వర్షాలు పడుతుండటంతో నారుమళ్లు పోసే పనులు ముమ్మరమయ్యాయి.

సుపరిపాలనతో ప్రజల్లో సంతోషం

ఉప్పలూరులో నాయకుల ఇంటింటి ప్రచారం

కంకిపాడులో..

కాటూరులో తోపుడు బళ్లు, మూడు చక్రాల సైకిల్ వద్ద ఎమ్మెల్యే బోడే ప్రసాద్, దండమూడి చౌదరి తదితరులు

కాటూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం, రహదారులను అభివృద్ధి చేయడంతో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కాటూరులో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక బీసీ కాలనీలో పర్యటించారు. అక్కడ పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయించి, మురుగు, ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. అనంతరం తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అందించిన రూ.60వేలతో ముదునూరు గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి ఆర్థిక సాయం, ఇద్దరికి తోపుడు బళ్లు, ఒకరికి మూడు చక్రాల సైకిల్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొడాలి ఆశాజ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు సజ్జా అనూష, నాయకులు మొవ్వా జ్ఞానశేఖర్, వేమూరి శ్రీనివాసరావు, పాలడుగు సత్యనారాయణ, తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలూరు (కంకిపాడు): మండలంలోని ఉప్పలూరులో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య, తెదేపా నాయకులు సుదిమళ్ల రవీంద్ర, చలసాని రాధాకృష్ణ, పడవల మధుసూదనరావు, చలవాది రాజాగురవయ్య తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు.

కంకిపాడు గ్రామీణం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై కంకిపాడులో తెదేపా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకుడు యలమంచిలి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

పెనమలూరులో కరపత్రాల అందజేత

కానూరు, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు నేతృత్వంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం కానూరులో గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి, కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు.

పెనమలూరు, న్యూస్‌టుడే: ప్రజలకు గౌరవ ప్రద జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌లు పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం పెనమలూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోటకూర భాస్కర్, షేక్ సుభాని, యలమంచిలి ప్రసాద్, గూడవల్లి పూర్ణ, వెలివెల సతీష్, చిగురుపాటి శ్రీనివాస్, అన్నవరపు నాగరాజు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్ మండలం వీరవల్లిలో ..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: నిజమైన ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇది నిరూపితమైందని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా ప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం వీరవల్లిలో ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన పనుల వివరాలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. ఉపసర్పంచి లంక అజయ్, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, నాయకులు కలపాల శ్రీధర్, పిల్లా రామారావు, మండాది రవీంద్ర, వడ్లపూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తెపై దాడి: వ్యక్తిపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే: తల్లీకుమార్తెపై దాడి చేసిన వ్యక్తిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు. . వణుకూరుకు చెందిన మహిళ గతంలో గంగూరులో ఉండేవారు. ఆమెకు అక్కడ ఖాజా అలీ పాషా అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. గత నెల 30న రాత్రి 11 గంటల సమయంలో పాషా మద్యం తాగి వణుకూరులోని మహిళ ఇంటికి వచ్చాడు. వచ్చీరాగానే ఆమె కుమార్తెపై దాడికి చేశాడు. అడ్డుకోబోయిన మహిళపై కూడా దాడి చేశాడు. దీనిపై బాధితురాలు గురువారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనమలూరులో వెల్డర్‌పై..

పెనమలూరు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వెల్డర్‌పై దాడిచేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చింతా శ్రీను మచిలీపట్నం నివాసి. అతడు కొంతకాలంగా విజయవాడ ఆటోనగర్‌లో ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. గత నెల 30వ తేదీ రాత్రి తన స్నేహితుడు మణి అనే వ్యక్తిని కలవడానికి సనత్‌నగర్ వెళుతుండగా.. పరిచయస్థులైన బురిడి, ఎస్ఎస్ అనే వ్యక్తులు తారసపడ్డారు. అకారణంగా శ్రీనుతో వారు వాగ్వాదానికి దిగి కర్రలతో దాడిచేసి కొట్టారు. శ్రీను తల, చేతులకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతు బాధితుడు గురువారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులైన బురిడి, ఎస్ఎస్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి రూ.8 వేల జరిమానా

కాటూరు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం కాటూరు చెందిన కొడాలి రాజ్యలక్ష్మి అనే మహిళపై నాలుగేళ్ల కిందట ఆమె బంధువు సురేష్ ఇటుక రాయితో దాడి చేశాడు. దీనిపై అప్పట్లో రాజ్యలక్ష్మి ఉయ్యూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, విజయవాడ నాలుగో ఏసీఎంఎం న్యాయస్థానంలో హాజరుపరచగా.. విచారణ అనంతరం నిందితుడికి రూ.8 వేల జరిమానా చెల్లించాలని లేని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పినట్లు ఉయ్యూరు గ్రామీణ ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

రహదారుణం.. డ్రెయిన్లు అధ్వానం

బాపులపాడు మండలం కె.సీతారాంపురంలో పారిశుద్ధ్యం అత్యంత అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా డ్రైనేజీల నిర్వహణ ఘోరంగా ఉండటంతో పలు అంతర్గత రహదారుల వెంబడి మురుగు ప్రవాహానికి వీలుగా కచ్చా కాలువలు కూడా లేకపోవడంతో నీరంతా రోడ్లపైకి వస్తోంది. దీంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. మరోపక్క జంక్షన్ బైపాస్ నుంచి గ్రామంలోకి ఎస్సీ కాలనీ మీదుగా వచ్చే ప్రధాన రహదారి మట్టి రోడ్డు కంటే దారుణంగా ఉండటంతో రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది. దీనిపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా అధికార్లు పట్టించుకోవడంలేదు. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికార్లు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. - హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

ఘనంగా చండీ వారాహి యజ్ఞం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం చండీ వారాహి మాత యజ్ఞం నిర్వహించారు. అమ్మవారి నవరాత్రులు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. చివరి రోజు అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యుల ఆధ్వర్యంలో యజ్ఞం పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధర్మకర్త కుటుంబం తరపున కాకాని అరుణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నవరాత్రులు

గన్నవరం గ్రామీణం: పాతగన్నవరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో వారాహి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుడు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు దాతలు ప్రసాద వితరణ చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నగదు అందజేస్తున్న డీజీఎం శ్రీనివాస్

హనుమాన్ జంక్షన్: కోడూరుపాడులో పునర్నిర్మిస్తున్న గంగానమ్మ గుడికి అంపాపురం పతంజలి పామాయిల్ కర్మాగారం తరపున రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం కర్మాగారం కార్యాలయంలో డీజీఎం శ్రీనివాస్ ఈ మొత్తాన్ని, గుడి నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే ఆలయ ప్రతిష్ఠ నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు.

సత్యసాయి ప్రేమ రథం శోభాయాత్ర

పెనమలూరు, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకొని పెనమలూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రేమ రథం శోభాయాత్ర వైభవంగా జరిగింది. యాత్రను కృష్ణా జిల్లా శ్రీసత్యసాయి సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ ప్రారంభించారు. విశేష పూజలు, భజనల అనంతరం శోభాయాత్ర పెనమలూరు నుంచి ప్రారంభమైంది. పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథాన్ని చిన్నారులు కోలాటాలతో అనుసరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల నుంచి యనమలకుదురు వరకు సాగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు జిల్లా, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు.

నిర్వహిస్తున్న భక్తులు

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు తమిళనాడు రాష్ట్రం చెన్నై నగర వాస్తవ్యులు బాడిశ మల్లిఖార్జునరావు గారి కుమారుడు బాడిశ వికాస్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి సహా యాజమానులు అయిన ఎన్.టి.ఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులైన 1) కోడూరి గౌతమ్ గారి భార్య కోడూరి హరిత గారు, 2) సంకా దుర్గా ప్రసాదరావు గారి కుమారుడు సంకా పూర్ణ ప్రభాకర్ గుప్తా గారు, 3) తమ్మిశెట్టి రామకృష్ణరావు గారి కుమారుడు రవికుమార్, 4) తమ్మిశెట్టి రామకృష్ణరావు గారి కుమారుడు తమ్మిశెట్టి వెంకట సూర్య ప్రకాష్ గారు 5) చిట్లూరి వెంకటేశ్వరావు గారి కుమారుడు చిట్లూరి నాగ శ్రీనివాసరావు గారు, 6)కసగర్ల కృష్ణమూర్తి గారి భార్య కసగర్ల సుందరి గారు, వీరి తరుపున జి.పి ఏజెంట్: తమ్మిశెట్టి వెంకట సూర్య ప్రకాష్ గారు మరియు గుంటూరు జిల్లా సత్తెనపల్లి వాస్తవ్యులు అయిన 7) దేవి శెట్టి రామస్వామి గారి కుమారుడు దేవిశెట్టి సుధీర్ గారు, 8)దేవిశెట్టి శ్రీకాంత్ గారి భార్య దేవిశెట్టి భవానీ గార్ల వద్ద నుండి కొనుగోలు చేయుటకు వారితో విక్రయ ఖరారు చేసికొని రిజిష్టరు విక్రయ దస్తావేజును పొందుటకు సిద్ధంగా యున్నారు.సదరు విక్రయదారులు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని విజయవాడ కాపురస్తులు తోట రామారావు గారి భార్య తోట వెంకట లక్ష్మి గారి వద్ద నుండి ది.07-06-2016వ తేదిన క్రయము పొంది సున్న సబ్ రిజిష్టారు ఆఫీసులో దస్తావేజు నెం:1859/2016రు గా రిజిష్టరు చేయించుకొని వారి స్వాధీన హక్కు భుక్తములలో కలిగి యుండి మరియు వారిలో 4వ వారి పేరన పట్టాదారు పాసు పుస్తకం, భూమి యాజమాన్య హక్కు పత్రం కలిగి వున్నాటువంటి ఈ దిగువ షెడ్యూలు ఆస్తి విక్రయంపై ఎవరికైన అభ్యంతరము గాని, కోర్టు అటాచ్‌మెంట్స్, క్లెయిమ్‌లు గాని వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేది లగాయితు 10 రోజుల లోగా ఈ దిగువ తెలిపిన అడ్రసునకు రిజిష్టరు పోస్టు ద్వారా తిరుగు రశీదులో పంపగలరు. అట్లు గడువు దాటిన దరిమిలా వచ్చు అభ్యంతరములు నా క్లయింటు ను బైండు చేయజాలవని తెలియజేయడమైనది

షెడ్యూలు:-ఎన్టీఆర్ జిల్లా, సున్న సబ్ రిజిస్ట్రారు యిలాకా, విజయవాడ రూరల్ మండలం సున్న గ్రామ శివారు బోడపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన సున్న గ్రామ డి.నెం 455రు, దరిమిలా రీసర్వే కాబడిన రీత్యా ప్రస్తుత ఆర్.యస్ నెం:798/3ఎర్లు, దాఖలా యం.0-31సెంట్లు శేరి మెరక భూమికి హద్దులు: తూర్పు: నిద్రపాటి కమలమ్మ వగైరాల భూమి, దక్షిణం:అ.100 -0,వెడల్పుగల రోడ్డు, పడమర: త్రిపురమల్లు అనిల్ కుమార్, నిర్మల గారల భూమి, ఉత్తరం: చాకలి రాముడు గారు ఇతరులకు విక్రయించిన భూమి యీ హద్దులు మధ్య గల యం.0.31సెంట్లుకు యావత్ యీజ్ మెంటు హక్కులతో సహా.

ఇట్లు:- Y. Srinivasa Reddy, Advocate, D.No.29-36-37, F.F-9,2nd floor, Ammana Estates,Seshadri sastry street, Governorpet, Vijayawada-520002.Ph:9948084905.

Date.03/07/2025, Vijayawada.

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ఎస్వీ రంగారావు జయంతి

ఎస్వీ రంగారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పామర్రు: మహానటుడు ఎస్వీ రంగారావు జయంతిని గురువారం స్థానిక వరిష్ఠ పౌరుల సంక్షేమ సంఘ కార్యాలయంలో ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం, వరిష్ఠ పౌరుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. వరిష్ఠ పౌరుల సంక్షేమ సంఘ కార్యదర్శి ఆదినారాయణ మూర్తి, కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ, సంఘ సభ్యులతో కలిసి ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కళారంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారుడు గూడూరు సీతారామాంజనేయులును సన్మానించారు.

శాకంబరీదేవిగా ఆదిలక్ష్మీ కామేశ్వరి అమ్మవారు

కూడేరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కూడేరులోని ఆదిలక్ష్మీ కామేశ్వరీ అమ్మవారు భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. కావూరి వంశీయుల ఇలవేల్పు అయిన ఈ ఆలయంలో అమ్మవారికి ఆ వంశీయుల సహకారంతో శాకంబరీ ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డీఈగా నారాయణరావు

అవనిగడ్డ: స్థానిక గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇన్‌ఛార్జి డీఈగా పెనమలూరు డీఈ నారాయణరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సత్యనారాయణ జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన గురువారం ఉదయం అదనపు బాధ్యతలు స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మనం వనం ఫౌండేషన్ సేవలు అభినందనీయమని యలమర్రు గ్రామస్థులు పేర్కొన్నారు. మండల పరిధి యలమర్రులో అనారోగ్యంతో బాధపడుతున్న

నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మనం వనం సభ్యులు

2 కుటుంబాలకు మనం వనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం ఆ సంస్థ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు అందజేశారు. చిరువోలు రాజేష్, కంభం డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో అవస్థలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే

అవనిగడ్డ రహదారులు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) సబ్ డివిజన్‌లో డీఈ ఒక్కరే సబ్ డివిజన్ పర్యవేక్షించే పరిస్థితి ఏర్పడింది. కనీసం కార్యాలయంలో ఒక అటెండర్ ఉండగా, ఇటీవల మరో సీనియర్ అసిస్టెంటు విధులలో చేరారు. ముగ్గురు ఏఈలు, ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, అతిథి గృహం వాచ్‌మెన్ పోస్టులు సుమారు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. నాగాయలంక, కోడూరు, చల్లపల్లి సెక్షన్‌కు ఒక్కొక్కరు చొప్పున ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉంది. ఈ ఆరుగురు లేకపోవడంతో వారి పనులు కూడా డీఈనే పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయానికి అనుబంధంగా ఉన్న అతిథి గృహం నిర్వహణకు అటెండర్ పోస్టు ఉండగా ఆ పోస్టులో పనిచేస్తున్న వ్యక్తి రిటైరు కాగా కొత్తవారిని నియమించలేదు.

☆☆ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మొత్తం ఆరుగురు పర్యవేక్షకులు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఉండటంతో సీడీపీవో, ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆరుగురు సూపర్‌వైజర్లు పర్యవేక్షించే బాధ్యతలు ఇరువురు చేయడం వలన పర్యవేక్షణ కుంటుపడే

అవనిగడ్డ ఐసీడీఎస్ కార్యాలయం

పరిస్థితి ఏర్పడింది. రెండేళ్లుగా ముగ్గురు మాత్రమే ఉండగా, ఏడాది క్రితం ఒకరు సస్పెండ్ అయ్యారు. ఇటీవల బదిలీల్లో ఒకరు వెళ్లిపోవడంతో ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌లు పర్యవేక్షించడం కష్టంగా మారింది. ఈ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు

తోట్లవల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలు.. బోర్లలో నీరు సమృద్ధిగా ఉండడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. మండలంలో సుమారు 8500 ఎకరాల్లో వరి సాగుకు రైతులు సిద్ధమైనట్లు వ్యవసాయ అధికారులు తెలియజేశారు. - న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రహదారి నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రూ.3.16 కోట్లతో 6 కిలోమీటర్ల పొడవున తారు రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. గురువారం స్థానిక బస్ డిపో సమీపం నుంచి ఏఎస్‌ఆర్ కల్యాణ మండపం వరకు రూ.76 లక్షలతో 1,040 మీటర్ల పొడవుగల తారు రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఇప్పటికే నియోజకవర్గంలో రూ.32.24 కోట్లతో 46.785 కిలోమీటర్ల మేర 522 సిమెంటు రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. అవనిగడ్డ మండలంలో రూ.5.94 కోట్లతో 111 సీసీ రహదార్లు, అవనిగడ్డ గ్రామంలో 3.6 కిలో మీటర్ల మేర 36 సీసీ రహదార్లు నిర్మించినట్లు వివరించారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, ఎంపీపీ తుంగల సుమతి, ఎంపీడీవో మరియాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు

స్థానికులకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి

గుడివాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని, ఇప్పటి వరకూ సంక్షేమంపై దృష్టి సారించామని, ఇక నుంచి అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక 1, 36 వార్డుల్లో 'సుపరిపాలన తొలి అడుగు'లో భాగంగా గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈసందర్భంగా నాగవరప్పాడు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏడాదిలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, పట్టణ తెదేపా అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, తెదేపా నేతలు లింగం ప్రసాద్, చేకూరు జగన్ మోహన్ రావు, పండ్రాజు సాంబశివరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, కడియాల గణేష్, గుడివాడ జోన్స్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని గురువారం గుడ్లవల్లేరులో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రవికుమార్, మోహన్‌రావు, వెంకట్రావ్, సుబ్బారావుచౌదరి, కొల రాధాకృష్ణమూర్తి, నాయుడు, రంగ బాబు, నరసింహారావు పాల్గొన్నారు.

కరపత్రాలు ఇస్తున్న నాయకులు

అభివృద్ధి లక్ష్యంగా కూటమి పాలన

పెదపారుపూడి: గుర్విందగుంటలో ఎమ్మెల్యే వర్లను సన్మానిస్తూ...

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు శివారు చాట్లవానిపురంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు.

గోపువానిపాలెం(పమిడిముక్కల), న్యూస్‌టుడే: తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలు వారికి వివరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన గోపువానిపాలెంలో పర్యటించి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు.

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని గుర్విందగుంట, మహేశ్వరపురం, దూళ్లవానిగూడెం గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరయ్యారు. గ్రామాల్లో అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

'బాలుడి ఆచూకీ కనిపెట్టండి'

సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించారని మండల పరిధి యలమర్రుకు చెందిన ఓ బాలుడు ఇల్లు వదలి పారిపోయిన విషయమై ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా స్పందించారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని బాలుడి ఆచూకీ కనిపెట్టాలని ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పల్లెనిద్రలో సీఐ ఈశ్వరరావు

మోపిదేవి, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని చల్లపల్లి సీఐ ఈశ్వరరావు పేర్కొన్నారు. పల్లెనిద్రలో భాగంగా వెంకటాపురంలో బుధవారం రాత్రి ఆయన బస చేశారు. గ్రామస్థులతో మాట్లాడారు. కొత్త వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

అణగారిన వర్గాల కోసం పోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు

గుడివాడ, న్యూస్‌టుడే: సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జగన్నాధపురంలోని విడిది ఫంక్షన్ హాలులో గురువారం సీపీఐ పార్టీ గుడివాడ నియోజకవర్గ మహాసభలు ఘనంగా నిర్వహించారు. 146 కోట్ల జనాభా సంపదను భాజపా అల్పసంఖ్యాకులైన కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఈనెల 8, 9 తేదీలలో గన్నవరంలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేతలు అడ్డాడ ప్రసాద్, ప్రభాష్ బాబు, చింతలూరి సత్యనారాయణ, ఎండీ.సాదిక్, డి.వెంకట నరసింహారావు, పి.రంగారావు, పి.శేషు, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగు నీరు విడుదల

నీటిని విడుదల చేస్తున్న నాయకులు

నాగాయలంక, న్యూస్‌టుడే: మండలంలోని వక్కపట్ల వారిపాలెం రెగ్యులేటర్ నుంచి నాగాయలంక సౌత్, సెంట్రల్ కాలువలకు 130 క్యూసెక్కుల సాగు, తాగు నీరును గురువారం డీసీ ఛైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, వైస్ ఛైర్మన్ కొక్కిలిగడ్డ నరసింహారావు, ఇరిగేషన్ ఏఈ పి.రవితేజ, మండల తెదేపా అధ్యక్షులు మెండు లక్ష్మణరావు విడుదల చేశారు. ఉప్పల ప్రసాద్, రేమాల మురళి, ముప్పరాజు సందీప్ పాల్గొన్నారు.

కాలువ ఇలా.. నీరు పారేదెలా..?

తోట్లవల్లూరు మండలంలో వందలాది ఎకరాలకు సాగు నీరు అందించే ప్రధాన పంట కాలువ తూటికాడ, గుర్రపుడెక్కతో నిండింది. కంకిపాడు లాకుల నుంచి వచ్చే పంట కాలువలో గుర్రపుడెక్క దట్టంగా పెరగడంతో నీరు ముందుకు పారడం కష్టంగా మారుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వాటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

ప్రయాణం.. ప్రమాదకరం..

మొవ్వ మండలం చినముత్తేవిలోని గేదెల కోడు ముదురు కాలువపై నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థలోకి చేరింది. వంతెనపై ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా మరో మార్గం లేక రాకపోకలు సాగిస్తున్నామని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెన కూడా కూలిపోకముందే నిధులు కేటాయించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చినముత్తేవి(కూచిపూడి)

అక్రమంగా ఆస్తి రాయించుకున్నాడని ఫిర్యాదు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: తన కుమారుడు అక్రమంగా అతని కూతురు పేరున ఆస్తి రాయించుకున్నాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్లవారిపాలెంకు చెందిన వల్లభనేని వెంకటేశ్వరరావుకు 10 సెంట్ల స్థలం ఉంది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమారుల్లో ఒకరు మృతి చెందారు. మరో కుమారుడు వి.ప్రభుదాస్ 10 సెంట్ల భూమిని అతని కుమార్తె పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని. . ప్రభుదాస్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అవినాష్ తెలిపారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో వివిధ కారణాలతో అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న బాధితులు 33 మందికి రూ.21,29,215 ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు

అంగలూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని అంగలూరు డైట్ కళాశాలలో ఈ నెల 9న జిల్లాస్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని హైస్కూళ్లలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, నివారణపై చిత్రలేఖనం, లింగ సమానత్వంపై వ్యాసరచన పోటీలను పాఠశాల, కాంప్లెక్స్, మండల స్థాయిల్లో నిర్వహించాలన్నారు. మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను జూలై 9న డైట్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపాలని సూచించారు.

'లైసెన్స్‌డ్ దుకాణాల నుంచే మద్యం కొనండి'

అవనిగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు స్థానిక సీఐ గిరిజా సత్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేస్తే ప్రమాదకరమని హెచ్చరించారు. అవి నకిలీవి కావచ్చని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అభినందనీయం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చౌదరిబాబు

ఘంటసాల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతంలో కూచిపూడి సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని తెదేపా మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు అన్నారు. గురువారం కొడాలి ప్రసన్నాంజేయస్వామి కల్యాణ మండపంలో కూచిపూడికి చెందిన రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు శివప్రసాద్, లిల్లీపాల్, కోనేరి ప్రియా, శ్వేత, పవన్‌లు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ అధ్యక్షురాలు తుమ్మల వరలక్ష్మి, వైద్యాలయం ప్రతినిధులు హనుమకుమార్, సాయి పాల్గొన్నారు.

మురుగు నీటి నివారణకు చర్యలు తీసుకోండి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో మురుగు నీరు రోడ్ల పైకి రాకుండా పురపాలక సంఘ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గుడివాడ పురపాలక సంఘ కమిషనర్ సింహాద్రి మనోహర్ సూచించారు. ఈసందర్భంగా 20వ వార్డులోని బ్యాంకు కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాలలో గురువారం పురపాలక అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఆర్టీసీ కాలనీలో, చౌదరిపేటలో రోడ్డు మీద పారుతున్న మురుగు నీరు, పెరిగిన చెట్లు, పొదలు తక్షణం తొలగించాలన్నారు. బ్యాంకు కాలనీలో నుంచి వచ్చే డ్రైన్‌ను జాతీయ రహదారి వారితో మాట్లాడి ప్రధాన డ్రైన్‌తో అనుసంధానం చేయాలన్నారు. సహాయ కమిషనర్ పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో రోడ్డు పైకి మురుగు నీరు వచ్చిందని కమిషనర్ మనోహర్‌కు చూపుతున్న స్థానికులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కలెక్టర్ దృష్టికి పాఠశాల సమస్య

కూచిపూడి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం నాడు - నేడు అంటూ పాఠశాలలను భ్రష్టు పట్టించిందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విమర్శించారు. మొవ్వ మండలం పెదపూడిలో యూపీ మోడల్ పాఠశాల ఈ ఏడాది 9వ తరగతి వరకూ పెంచి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. స్లాబు పెచ్చులు ఊడి మీద పడుతున్నాయని, తరగతి గదిలో కూర్చోవాలంటే భయమేస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి.. కలెక్టరుకు ఫోన్ చేసి పాఠశాల విద్యార్థుల సమస్యను వివరించారు. అక్కడి పరిస్థితులను ఫోన్‌లో ఫొటోలు తీసి పంపారు. స్పందించిన కలెక్టరు డి.కె.బాలాజీ విద్యాశాఖ అధికారులతో సంప్రదించి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తెదేపా మండల అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, కార్యదర్శి వీరంకి తులసీదాసు, మాజీ సర్పంచి తాతా ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో మోడల్ ఉన్నత పాఠశాలలో నెర్రలిచ్చిన గోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

మహిళల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మహిళల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రబాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పేర్కొన్నారు. తోట్లవల్లూరులో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని రాజేంద్రబాబు, గురుమూర్తి సందర్శించారు. శిక్షణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఫోన్ ద్వారా మహిళలతో మాట్లాడారు. మూడు నెలల శిక్షణ అనంతరం రూ.10 వేలు విలువైన కుట్టు మిషన్‌ను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ ఎంతో దోహదపడుతోందన్నారు. ఎంపీడీవో రవికాంత్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మహిళలతో రాజేంద్రబాబు, గురుమూర్తి

భారత ఖోఖో సంఘ కార్యనిర్వాహక సభ్యునిగా మడకా

ప్రసాద్

గుడివాడ, న్యూస్‌టుడే: భారత ఖోఖో సంఘం కార్యనిర్వాహక సభ్యునిగా గుడివాడ పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దిల్లీలో జరిగిన ఎన్నికలలో ఆయనను ఎన్నుకున్నారు. ప్రసాద్‌ను రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టిఎస్ఆర్‌కె.ప్రసాద్, ఎమ్.సీతారామిరెడ్డిలు, కృష్ణా జిల్లా ఖోఖో సంఘం ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంఘ నేత మద్దినేని ప్రసాద్ అభినందించారు.

కోటేశ్వరరావు సేవలు ఎనలేనివి

పామర్రు, న్యూస్‌టుడే: బరిగెల కోటేశ్వరరావు చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శీలం నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కోటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ప్రముఖ వైద్యుడు సురేష్ చంద్రారెడ్డి పార్టీ నాయకులతో కలిసి కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఒ.గంగాధరప్రసాద్, బరిగెల భీమేశ్వరరావు, దునుకు రఘునాథరావు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి, తదితరులు

మెకానిక్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి

పామర్రు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన మెకానిక్‌లను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని మెకానిక్‌ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పామర్తి రామాంజనేయులు అన్నారు. గురువారం మెకానిక్స్ డే సందర్భంగా పామర్రులో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. వాహన మరమ్మతులకు ఉపయోగించే పనిముట్లను సబ్సిడీపై అందించాలన్నారు. మెకానిక్‌లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు. సంఘ సభ్యులు ప్రసాద్, శ్రీను, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న మెకానిక్‌లు

డ్రెయినేజీలో పూడికతీత

పామర్రు, న్యూస్‌టుడే: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చాట్లవానిపురానికి చెందిన ప్రజలు గ్రామంలో డ్రెయినేజీలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే కుమార్‌రాజా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గురువారం గ్రామ పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభాకరరావుకు విషయాన్ని తెలియజేశారు. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించారు.

నిర్మాణ పనుల పరిశీలన

ఘంటసాల, న్యూస్‌టుడే: మండల పరిషత్ నిధులు రూ.4.50 లక్షలతో కొడాలిలో నూతన డ్రైనేజీ నిర్మాణాన్ని మచిలీపట్నం డివిజన్ పంచాయతీ అధికారి రాజవుల్లా గురువారం పరిశీలించారు. ఆయన్ను కొడాలి సచివాలయంలో సత్కరించారు. ఉప సర్పంచి తుమ్మల శంకరరావు, ఈవోలు నాగమణి, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

పంపిణీకి సిద్ధం చేసిన పోషకాహారం ప్యాకెట్లు

గుడివాడ, న్యూస్‌టుడే: గర్భిణులకు సరైన పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందని గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరా దేవి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని 50 మంది గర్భిణులకు క్లబ్ ప్రెసిడెంట్ వై.నాగేశ్వరరావు సహకారంతో పోషకాహారం ప్యాకెట్లు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.సుగుణవతి, క్లబ్ కార్యదర్శి ఎం.రమణమూర్తి, రెడ్డియ్య చౌదరి, సుబ్రమణ్యేశ్వరరావు, కె.బి.జి.తిలక్, సాగిరాజు ఉదయ భాస్కరరాజు, రమాదేవి పాల్గొన్నారు.

రాత్రిపూట పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలో నైట్ శానిటేషన్ ప్రారంభిస్తున్నామని పట్టణంలోని వ్యాపారులందరూ సహకరించాలని పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ కోరారు. స్థానిక కౌన్సిల్ హాలులో పట్టణంలోని వ్యాపారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో గురువారం సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు రోడ్లపై చెత్త వేయకుండా వ్యాన్‌కు అందించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వర్తక సంఘాల సమావేశంలో కమిషనర్ సింహాద్రి మనోహర్

మట్టి తవ్వకాల గుర్తింపు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మోదుమూడి ఆయకట్టు ప్రాంతంలో మట్టి తవ్వకాలను గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు తమపొలాల్లో మెరక ప్రాంతాన్ని తవ్వి పల్లపు ప్రాంతాల్లో వేయడం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.

5 నుంచి బీఎల్వోలకు శిక్షణ

పెడన, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని 217 పోలింగ్ కేంద్రాల బీఎల్వోలకు ఈ నెల 5 నుంచి 11 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ కె.అనిల్ కుమార్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం చట్టాలు, మొబైల్ యాప్, ఇంటింటా సర్వేలో పాటించాల్సిన నిబంధనలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు.

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం జులై 4, 2025

వదిలేస్తే ముప్పేగా.. తరలిస్తే తప్పనుగా!

కేదారేశ్వరపేట మార్కెట్‌తో సింగ్‌నగర్ వంతెనపై భారం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

సింగ్‌నగర్ వంతెనపై నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ

విజయవాడలోని కీలకమైన సింగ్‌నగర్ వంతెన కట్టి 30 ఏళ్లవుతోంది. దీని సామర్థ్యం తగ్గుతున్న ఈ సమయంలో సాధారణ వాహనాలతో పాటు కేదారేశ్వరపేట మార్కెట్‌కు నిత్యం వచ్చే వందల వాహనాలు భారీ లోడ్‌తో రాకపోకలు సాగిస్తుండడం ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. వందల టన్నుల సరకు తీసుకుని వచ్చే కంటైనర్ల దెబ్బకు సింగ్‌నగర్ వంతెన నుంచి.. మార్కెట్ వరకూ తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. గతంలోనూ ఇలాగే ఈ భారీ వాహనాల దెబ్బకు సమస్యలు పెరిగిపోవడంతో వాహనదారులు, స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు స్పందించి భారీ వాహనాలు రాకుండా రహదారిపై గడ్డర్లను పాతారు. కానీ అప్పటి వైకాపా పాలకుల మద్దతుతో గడ్డర్లను కోసేసి మరీ కొందరు పక్కన పడేశారు.

☛ కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను ఇక్కడి నుంచి నున్నకు తరలించాలంటూ అటు వ్యాపారులతో పాటు, స్థానికులు, వాహనదారులు ఏళ్ల తరబడి కోరుతున్నారు. నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీలో భారీ కంటైనర్ వాహనాలు రావడంతో ఎదురయ్యే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిత్యం ఉద్యోగాలు, విద్యా సంస్థలకు ఈ మార్గంలోనే వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కేదారేశ్వరపేటలో రహదారి మొత్తాన్ని ఆక్రమించి పండ్ల వ్యాపారులు దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టేశారు. ఈ దుకాణాలన్నీ కొందరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నగరానికి ట్రాఫిక్ అవస్థలు లేకుండా 23 ఎకరాల్లో నున్నలో పండ్ల మార్కెట్‌ను విశాలంగా ఏర్పాటు చేశారు. అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. బైపాస్ పక్కనే ఈ మార్కెట్ ఉండడంతో.. నేరుగా వచ్చి మార్కెట్‌లోకి ఎంత పెద్ద వాహనాలైనా వెళ్లిపోవచ్చు. విశాలమైన రహదారులు, పార్కింగ్ సదుపాయం కూడా నున్న మార్కెట్‌లో ఉంది. అయినా కేవలం ఓ పది మంది స్వార్థం కోసం మార్కెట్‌ను ఇక్కడి నుంచి వెళ్లకుండా ఏళ్ల తరబడి అడ్డుకుంటున్నారు.

పండ్ల మార్కెట్‌కు వస్తున్న భారీ కంటైనర్

ఇంకెన్నాళ్లు ఇక్కడే ఉంచుతారు..

సింగ్‌నగర్ వంతెన మీదుగా మార్కెట్‌లోకి 50 నుంచి 60 టన్నుల వరకు భారీ కంటైనర్ లారీలు వస్తున్నాయి. ఈ దెబ్బకు ఏక్షణంలోనైనా సింగ్‌నగర్ వంతెనకు ప్రమాదం తప్పని పరిస్థితి ఉందనే ఆందోళన చాలాకాలంగా ఉంది. రోజుకు కనీసం 200 వాహనాలకు పైగా కేదారేశ్వరపేట మార్కెట్‌కే వస్తుంటాయి. ఇది మధ్య, పశ్చిమ రెండు నియోజకవర్గాలు కలిసే ప్రాంతం కావడంతో.. ఆసుపత్రులు, కళాశాలలతో పాటు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకూ ఇదే ప్రధాన మార్గం. మార్కెట్‌ను దాటి వెళ్లడమంటే.. పద్మవ్యూహాన్ని ఛేదించడమే అవుతోంది. ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ భారీ వాహనాలు నగరంలోకి వస్తుండడంతో ప్రమాదాలు సైతం పెరిగాయి. ఇటీవల ఓ చిరు వ్యాపారి వీటి చక్రాల కిందపడి చనిపోవడంతో కేసు నమోదైంది. కనీసం ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి.. మార్కెట్‌ను నున్నకు తరలించే ప్రయత్నం చేస్తే అన్ని వర్గాలకూ ఊరట లభిస్తుంది.

వారధి.. హతవిధి..

పది రోజుల కిందట రాత్రివేళ లారీ ఢీకొట్టడంతో వారధి రక్షణ గోడ కొంతమేర ధ్వంసమైంది. నిత్యం వందల వాహనాలు తిరిగే ఈ వంతెనపై దెబ్బతిన్న గోడను తాత్కాలికంగా బాగు చేయాలి. కానీ పోలీసులు స్టాపర్లు పెట్టి వదిలేశారు. రక్షణ గోడను త్వరగా బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. –ఈనాడు, అమరావతి

దొంగ బిల్లు.. దర్జాగా చెల్లు..!

☛ జి.కొండూరు మండలంలో 2024-25లో ఏప్రిల్-జూన్ వరకు కాలువల్లో పూడిక తీత పనులు జరిగాయి. వీటిల్లో ఓ కాలువ పని చేయించిన క్షేత్ర సహాయకుడితో బిల్లులు పెట్టారు. అదే పనిని మరో క్షేత్ర సహాయకుడు బిల్లులు పెట్టారు. అధికారులు పరిశీలించి బిల్లులు చెల్లించట్లేదు ఉన్నా ఇద్దరికీ డబ్బులు ఇచ్చేశారు. దీంతో ఒక పనికే రెండు బిల్లులు ఇచ్చినట్లయింది. ఇదే తరహాలో దాదాపు 20 కాలువలకు అడ్డగోలుగా బిల్లులు చేశారు. ఇలా రూ.58లక్షలు మింగేశారు.

☛ మండలంలోని చాలా ప్రాంతాల్లో క్షేత్రసహాయకులు ఉద్యోగులనే ఉపాధి శ్రామికులుగా చేశారు. వీరిలో కొందరు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులకు హాజరు వేసి వేతనాలు రప్పించేశారు. వారికి కాస్తో కూస్తో ముట్టజెప్పి ఐదేళ్లలో రూ.లక్షల్లో దండుకున్నారు.

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో నాయకుల అండతో సిబ్బంది, అధికారులు చేసిన అక్రమాల వ్యవహారాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. జి.కొండూరు మండలం ఉపాధి పనుల్లో రూ.3కోట్ల వరకు ఉపాధి హామీ నిధులు దోచేశారు. ఒకే పనికి రెండు బిల్లులు పెట్టిన ఉద్యోగులను ఉపాధి శ్రామికులుగా చూపించినా..పనులు చేయకుండానే చేసినట్లు మాయ చేసిన పట్టించుకున్న నాథుడు లేడు. కళ్లు మూసుకుని బిల్లులు చేసేశారు.

వైకాపా పాలనలో రూ.3 కోట్లు స్వాహా

మూడు నెలల్లో సర్దేశారు.. మండలంలో దాదాపు 25వేల జాబ్‌కార్డులు ఉండగా వేతనాలకు రూ.15.21 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌గా రూ.5.1కోట్లు కేటాయించారు. మార్చి నుంచి జూన్ వరకు దాదాపు 80 శాతం ఉపాధి పనులు జరుగుతాయి. మట్టి పనులు, కాలువలు, చెరువుల్లో పూడికతీత, పంట కుంటలు తవ్వడం, డొంక రహదారుల నిర్మాణాలు చేపట్టారు. గతేడాది ఈ సమయంలో సార్వత్రిక ఎన్నికల ముందు కావడం..ప్రభుత్వం మారే అవకాశాలు ఉండడంతో మండలంలోని కొందరు వైకాపా నాయకులు, క్షేత్రసహాయకులు, కొందరు అధికారులు కుమ్మక్కై మళ్లీ అవకాశం రాదన్నట్లు దోపిడీకి తెర తీశారు.

రెండు మూడు రెట్లు అధికంగా.. క్షేత్ర స్థాయిలో చేసిన పనుల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా రికార్డుల్లో నమోదు చేశారు. ఉదాహరణకు ఒక కాలువలో 20 మీటర్లు

పూడిక తీసి 100 మీటర్లు చేసినట్లు నమోదు చేశారు. చెరువుల్లో పూడికలు, డొంక దారుల నిర్మాణంలోనూ చేసిన పనికి బిల్లులకు పొంతన లేదు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులు చేయకుండానే చేసినట్లు చూపించి మాయ చేశారు. ఇలా మండలంలో దాదాపు 80శాతం పైగా పనుల్లో ఇదే తంతు. అధికారులకు విషయం తెలిసినా పరిశీలించకుండా వాటాలు తీసుకుని బిల్లులు చేసేశారు. గతేడాది రూ.3కోట్లు అక్రమాలు జరిగినట్లు తేలింది. తాజాగా జరిగిన సామాజిక తనిఖీల్లో అక్రమాలు తెలుసుకున్న అధికారులు విస్తుపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రాము తెలిపారు.

వయసు 24.. నేరాలు 40

కరుడుగట్టిన అంతర్ జిల్లా నేరస్థుడి పట్టివేత

స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : బాల్యం నుంచే దొంగతనాలు మొదలెట్టాడు. 24 ఏళ్ల వయసుకే 40 నేరాలు చేశాడు. పలు జిల్లాల పోలీసులను ఉరుకులు పెట్టించాడు. ఎవరికీ చిక్కకుండా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. చివరికి చిన్న క్లూతో దొరికిపోయాడు. అతడి నుంచి 60 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ఉయ్యాల రాజేష్ (24) కుటుంబం విజయవాడ, వాంబేకాలనీలో ఉంటోంది. అతడు 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పుడే దొంగతనాలు చేయడంతో మూడు సార్లు బాలుర పరిశీలనా గృహంలో ఉంచారు. బయటకు వచ్చినా తీరు మారలేదు. కూలి పనులు చేస్తూ.. చోరీలు చేసేవాడు. 2024, సెప్టెంబరులో మధురానగర్‌లో ఒక తమిళ కుటుంబం ఇంట్లో రూ.11 లక్షలు దోచాడు. జైలుకు వెళ్లి జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చాడు.

నడిచే వెళతాడు... రాజేష్‌కు బండి నడపడం రాదు. ఎంత దూరమైనా నడిచే వెళతాడు. రాత్రి వేళ బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, ఫుట్‌పాత్‌లపై పడుకుంటాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో లేచి నడుచుకుంటూ వెళతాడు. రైల్వేలైను వెంబడి, కాలువ గట్ల వెంట వెళుతూ.. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. పెద్ద పెద్ద గోడలను 5 సెకన్లలోనే ఎక్కేస్తాడు. ఇలా మధురానగర్‌లో 5 నేరాలు చేసి 94 గ్రాముల బంగారం చోరీ చేశాడు. పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేటల్లో మొత్తం 12 నేరాలు చేశాడు. దోచిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస నేరాలు జరుగుతుండటంతో నిఘా పెంచారు. నేరస్థలంలో కొన్ని వేలిముద్రలు దొరికాయి. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. పేర్లు నమోదు చేసుకునే సమయంలో ఓ యువకుడు పారిపోయాడు. అతడి పేరు రాజేష్ అని తెలిసింది. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి విచారించారు. సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టారు. మాచవరం స్టేషన్ పరిధిలో ఒక చోట కనిపించి, అంతలోనే మాయమయ్యాడు. ఒక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి.. రెడ్‌హ్యాండెడ్‌గా అతడిని పట్టుకున్నారు. విజయవాడ పరిధిలోని 6 కేసుల్లో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని ఏసీపీ దామోదర్ అభినందించారు.

అడుగులోతు గుంతే.. అడగకుంటే అంతే!

కానూరు గ్రామానికి సమీపంలో..

పెట్రోలు బంకు సమీపంలో..

విజయవాడ బందరు రోడ్డు నుంచి కానూరుకు వెళ్లే ప్రధాన రహదారి మృత్యు మార్గంగా మారింది. అడుగు లోతుండే గుంతలు రహదారిపై చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. కొద్దిరోజుల కిందట తాతినేని కత్యారావు అనే 30 ఏళ్ల మర్చంట్ నేవీ ఉద్యోగి తెల్లవారుజామునే ఈ రహదారిపై వెళ్తుండగా ఆర్‌సీఎం చర్చి సెంటర్ ఎదురుగా ఉన్న భారీ గుంతలో ద్విచక్ర వాహనం పడి అదుపు తప్పింది. ఆయన రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరుసటిరోజు చనిపోయారు. ఈ ఘటన జరిగిన తర్వాత కూడా అధికారుల్లో చలనం లేదు. కామయ్యతోపు నుంచి కానూరు వరకూ వెళ్లే ఈ రహదారిపై ఉండే గుంతల్లో నిత్యం ద్విచక్ర వాహనాలు పడి అనేక మంది ప్రమాదాల బారినపడుతూనే ఉన్నారు. ఆ గుంతలను పూడ్చినా.. చాలావరకూ ప్రమాదాలను అరికట్టొచ్చు. అయినా మరమ్మతులు కూడా చేయకుండా నెలల తరబడి అలాగే వదిలేశారు.

– న్యూస్‌టుడే, కానూరు

నన్ను బయటకు తీసుకువస్తే

రెట్టింపు డబ్బులు ఇస్తా..

ఏజెంట్లతో అద్విక ఎండీ ఆదిత్య

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ ఎండీ ఆదిత్య ఇంకా ఏజెంట్లను మభ్య పెడుతూనే ఉన్నాడు. గురువారం విచారణ సందర్భంగా ఆదిత్యను కొంతమంది ఏజెంట్లు కలిశారు. మమ్మల్ని ఎందుకు మోసం చేశావనీ.. మమ్మల్ని నమ్మి పెట్టుబడి పెట్టిన వారంతా.. మా ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారని ఏజెంట్లు అందరూ ఆదిత్యను ప్రశ్నించారు. తనని ఈ కేసు నుంచి బయటకు తీసుకువస్తే... తాను రాగానే అందరి డబ్బులు తిరిగి ఇచ్చేస్తాననీ, తనను తక్కువ అంచనా వేయకండని ఆదిత్య వారితో చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం తన దగ్గర డబ్బు అంతా బ్లాక్ అయిందనీ.. అందరూ కలిసి డబ్బులు వేసుకుని తనను బయటకు తేవాలని తెలిపాడు. బయటకు రాగానే డబ్బులు ఇవ్వడంతోపాటు ఇప్పుడు జరిగిన వ్యాపారం కంటే రెట్టింపు వ్యాపారం ఇస్తానని వారితో తెలపడంతో ఏజెంట్లు అందరూ షాక్ అయ్యారు. మరోవైపు ఏజెంట్లతో ఎంత నగదు కట్టించారనే వివరాలన్నీ సేకరించారు. దీంతో వారి ద్వారా చెల్లించిన వారి సంఖ్య దాదాపు కొలిక్కి వచ్చింది. అయితే కొంతమంది పెట్టుబడిదారులు నేరుగా ఆదిత్యకు నగదు చెల్లించారు. వారి వివరాలు తెలియరాలేదు. గురువారం మరో నలుగురు ఫిర్యాదు చేశారు. దీంతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినవారి సంఖ్య 100 దాటింది.

కౌలు రైతులకు చేయూత

వడివడిగా సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ

కౌలు రైతులకు ఆర్థిక భరోసా, ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు ముందంజలో ఉన్నారు. నిబంధనలు కఠినతరంగా ఉన్నా రెండు నెలల్లోనే దాదాపు 48 శాతం వరకు కార్డులు అందించారు. ఆగస్టులోగా పూర్తి స్థాయిలో పంపిణీ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గత 2 నెలల కార్డులు..

జిల్లా	లక్ష్యం	పంపిణీ
కృష్ణా	70,000	34,540
ఎన్టీఆర్	56,000	26,278
మొత్తం	1,26,000	60,818

ఇప్పటికే 60వేల మందికి పైగా.. గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.17లక్షల కౌలు రైతులకే సీసీఆర్‌సీలు కార్డు ఇచ్చారు. ఈ సారి లక్ష్యం 1.26లక్షలకు పెంచారు. ఇప్పటి వరకు 60వేలకు పైగా జారీ చేశారు. కార్డుల పంపిణీలో చాలా జిల్లాల్లో 30 శాతం కూడా పూర్తికాలేదు. కార్డుల పంపిణీలో రాష్ట్రంలోనే రెండు జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు ఖరీఫ్‌లో రుణ లక్ష్యం భారీగా పెంచారు. రూ.900 కోట్ల వరకు ఇస్తున్నారు. దీంతో ఎక్కువ మందికి కౌలు రుణ సాయంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందనున్నాయి.

అవగాహనతో మార్పు.. నిబంధనల ప్రకారం సీసీఆర్‌సీ

కార్డులు జారీ చేయాలంటే భూయజమాని తాను భూమి సదరు రైతుకు కౌలుకు ఇచ్చినట్లు సాగుహక్కు అంగీకార పత్రం ఇవ్వాలి. దీనికి ప్రారంభంలో భూమిపై తాము హక్కులు కోల్పోతామన్న అపోహతో అంగీకార పత్రం ఇచ్చేవారు కాదు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో గ్రామాల్లో సభలు నిర్వహించి చాలా వరకు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో చాలా మంది రైతులు అంగీకరిస్తున్నారు.

ఇంకా మారాలి.. ఇంకా చాలా ప్రాంతాల్లో రైతులు అంగీకారం తెలపడం లేదు. కౌలు రైతుకు పత్రం ఇస్తే ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము, రాయితీలు, రుణాలు, నష్టపరిహారాలు ఇలా అన్నీ కౌలు రైతుకు వెళ్లిపోతాయన్న ఉద్దేశంతో అంగీకార పత్రం ఇవ్వకుండా ప్రయోజనాలన్నీ వారే పొందుతున్నారు. దీంతో పెట్టుబడి పెట్టిన కౌలు రైతు నష్టాలతో ఉసూరుమంటున్నారు. యజమాని అంగీకారంతో ప్రమేయం లేకుండా తాము సాగు చేస్తున్న పొలాలకు సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చే విధానంపై దృష్టి సారించాలని కౌలు రైతులు కోరుతున్నారు. – ఈనాడు, అమరావతి

కాలువలకు 5,938 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు గురువారం 5,938 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

పట్టిసీమ నీటి విడుదల: పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా పోలవరం కుడి కాలువలోకి గోదావరి జలాలను విడుదల చేశారు. గురువారం విడుదల చేసిన ఈ నీరు.. ప్రకాశం బ్యారేజీకి చేరడానికి సుమారు 5 రోజులు పడుతుంది.

భావితరాల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి భరోసా


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

కంచికచర్ల, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో రాష్ట్ర అభివృద్ధి పడకేసిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. కంచికచర్ల మోడల్ కాలనీలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్య క్రమంలో నెరవేర్చుతూ.. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పింఛను పెంచి పేదలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. పాఠశాలలు ప్రారంభమైన రోజునే 'తల్లికి వందనం' ద్వారా విద్యార్థులకు నగదు సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల ద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గించామన్నారు. మరోవైపు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ.. భావితరాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తున్నారన్నారు. కాలనీలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు, మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరగా, త్వరలోనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, తెదేపా మండల అధ్యక్షుడు కోగంటి బాబు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

జాతీయ లోక్‌అదాలత్ రేపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో ఈ నెల 5న శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎ.సత్యానంద్ తెలిపారు. సివిల్, రోడ్డు ప్రమాద కేసులు, ఫ్యామిలీ కోర్టు విషయాలు, వాణిజ్య వివాదాలు, రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారు. దీని నిమిత్తం 13 న్యాయమూర్తులతో 13 బెంచిలను ఏర్పాటు చేశారు. ప్రతి బెంచిలో న్యాయమూర్తితో పాటు ఒక న్యాయవాది, ఒక సోషల్ వర్కర్ ఉంటారు. వీరు ఆయా కేసులను విచారించి పరిష్కరిస్తారు.

పన్ను కట్టాలని వీళ్లు.. కట్టేది లేదని వాళ్లు

నగరపాలక సంస్థ, దుర్గగుడి మధ్య వివాదం

న్యూస్‌టుడే, విజయవాడ నగరపాలక సంస్థ

విజయవాడ దుర్గగుడి, నగరపాలక సంస్థ మధ్య ఆస్తిపన్ను వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. దుర్గగుడి నుంచి తమకు రూ.కోట్లలో ఆస్తిపన్ను బకాయిలు రావాలని, కానీ అటునుంచి ఎలాంటి స్పందనా ఉండడం లేదంటూ నగరపాలక సంస్థ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో దుర్గగుడికి రెండు ఆస్తులున్నాయి. వాటిపై ఈ ఏడాది మార్చి వరకు రూ.2.33 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఏప్రిల్ 2025 నుంచి కూడా ఆస్తి పన్ను బకాయి చెల్లించాలి. మధ్య నియోజకవర్గంలోనూ మరో మూడు విలువైన ఆస్తులున్నాయి. వాటిపైనా ఇప్పటివరకూ రూ.1.94 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటిని వెంటనే చెల్లించాలంటూ ఆలయ ఈవో, నగరపాలిక అధికారుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతున్నాయి. హిందూ ధార్మిక సంస్థలకు మినహాయింపు ఉండగా ఈ పన్నులు ఎలా వేస్తారంటూ దేవస్థానం అధికారులంటున్నారు. పైగా.. న్యాయస్థానాల తీర్పుల మేరకు.. తాము చెల్లించాల్సిన అవసరం లేదని తేల్చి చెబుతుండగా.. అదేం కుదరదు చెల్లించాల్సిందేనని వీళ్లు పట్టుబడుతున్నారు. తాజాగా నగరపాలక సంస్థ కౌన్సిల్‌లోనూ దీనిపై చర్చ జరిగింది. ✧ 2017-25 మధ్య కాలంలో మాకు రూ.4.27 కోట్ల బకాయిలు ఆలయం నుంచి వివిధ పన్నుల కింద రావాలని నగరపాలిక అధికారులు తాజాగా జాబితా విడుదల చేశారు. ఏటా దసరా, భవానీ దీక్షల వేడుకల వేళ పెద్దఎత్తున భక్తులు వస్తుండడంతో వారికి సదుపాయాల కల్పనలో నగరపాలక సంస్థ కూడా భాగస్వామ్యమవుతోంది. చెప్పుల స్టాండ్లు, క్లోక్‌రూంలు నిర్వహిస్తారు. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేందుకు ఒప్పంద సిబ్బందిని గుత్తేదారుల ద్వారా తీసుకుంటారు. దీనికోసం ఏటా రూ.లక్షల్లో నగరపాలక సంస్థకు వ్యయం అవుతోందని, దేవస్థానం నుంచి తమకు అవి చెల్లించడం లేదని పేర్కొంటున్నారు.

గతంలోనూ గగ్గోలు..

గతంలోనూ ఇలాగే బకాయిలు పేరుకుపోయాయంటూ గగ్గోలు పెట్టడంతో జిల్లా అధికారులు ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాల్సి వచ్చింది. 2024 దసరా ఉత్సవాలకు నగరపాలక సంస్థ రూ.14.85 లక్షలు వెచ్చించగా.. ఆ మొత్తాన్ని దేవస్థానం చెల్లించింది. 2024 భవానీ దీక్షల విరమణ సందర్భంగా వెచ్చించిన రూ.5.38 లక్షలు మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదని నగరపాలిక అధికారులంటున్నారు. మరోవైపు దుర్గగుడి అధికారులు మాత్రం.. దసరాను అధికారికంగా రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించాక, ఆయా ప్రభుత్వ విభాగాలు వారి సొంత నిధులతోనే ఏర్పాట్లు చేయాల్సి ఉండగా.. ఎవరికి వారు బిల్లులు పెట్టి తమ నుంచి వసూళ్లు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

చెల్లించాల్సిందే

కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయిలను చెల్లించాలంటూ తాజాగా ఈవో దృష్టికి తీసుకెళ్లాం. గతంలో సక్రమంగానే చెల్లించేవారు. ఇప్పుడు మాత్రం న్యాయస్థానం తీర్పు ఉందంటూ చెల్లించడం లేదు. మా నిబంధనల ప్రకారం ఎలాంటి మినహాయింపు లేదు. వారూ బకాయిలు చెల్లించాల్సిందే.

– జి.సృజన, డీసీఆర్

(c) eenadu

సస్యరక్షణ.. యాజమాన్య పద్ధతులతో మేలు

ఫోన్‌ఇన్‌లో ఘంటసాల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియలలిత

ఘంటసాల, న్యూస్‌టుడే

రైతులు సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్) ప్రధాన శాస్త్రవేత్త వి. సత్యప్రియలలిత అన్నారు. ఇటీవల నిర్వహించిన 'ఈనాడు.. మీతోడు' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా రైతుల నుంచి విశేష స్పందన లభించింది. శాస్త్రవేత్త రైతుల సందేహాలను నివృత్తి చేశారు. తెగుళ్ల, సేద్య విభాగాల శాస్త్రవేత్తలు కె.లహరి, జె.పద్మావతి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఈనాడు మీతోడు

రైతుల సందేహాలకు సమాధానాలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియలలిత, నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్తలు లహరి, పద్మావతి

వరిలో తుంగ నివారణ

వరి వెదజల్లే పద్ధతిలో తుంగ నివారణకు విత్తిన 15-20 రోజులకు లేదా కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు ఎకరానికి 800 మి.లీ. బెంటజోన్ 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పుల్లవిరుపు, కణుపుల గడ్డి నివారణకు విత్తిన 15-20 రోజులకు ఫినాక్సీప్రాప్ ఇథైల్ 7 శాతం ద్రావకం ఎకరానికి 200-250 మి.లీ. 200లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎరువుల యాజమాన్యంనకు.. నత్రజని మొదటిసారి విత్తిన 15 రోజులకు, రెండోసారి పిలక దశలో, మూడో సారి చిరు పొట్ట దశలో వేసుకోవాలి. ఏ సాగులోనైనా భాస్వరం ఎరువును ఆఖరి దుక్కి లేదా దమ్ములో వేయాలి. పొటాష్ ఆఖరి దుక్కిలో సగం, మిగిలిన సగ భాగం చిరుపొట్ట దశలో వేయాలి. నత్రజని ఎరువులు మాగాణి వరి కంటే వెద పద్ధతిలో దాదాపు 25 శాతం ఎక్కువ వేసుకోవాలి.

ఇనుప, జింకు ధాతు లోపాలు...

వరిలో ఇనుప ధాతు లోపం నివారణకు 20 గ్రా. అన్నబేధి, 2 గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లోపం ఎక్కువ ఉంటే 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింకు లోప నివారణకు వరి పండించే భూముల్లో ప్రతి 3 పైర్లకు ఒకసారి ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. భాస్వరం, జింకు సల్ఫేట్ ఎరువులు వేసేటప్పుడు వాటి మధ్య కనీసం 2-3 రోజుల వ్యవధి ఉండాలి. పైరుపై తుప్పు మచ్చలు కనబడి మొక్క గిడసబారినప్పుడు జింకు లోపంగా పరిగణించి లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

చౌడు భూముల యాజమాన్యం

పచ్చిరొట్ట ఎరువైన జీలుగను కలియదున్నడం లేదా పశువుల ఎరువు ఎకరానికి 1.2 టన్నులు వేయడం లేదా వరిగడ్డి కలియదున్నుకోవాలి. పొటాష్ ఎరువును వేసుకోవాలి. జింకులోప నివారణకు.. లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్, ఊడ్చిన 15 నుంచి 20 రోజులకు 5 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. నారును ఒత్తుగా నాటుకోవడం, చౌడును తట్టుకునే ఎంసీఎం-100, ఎంసీఎం-103, ఎంసీఎం-125, ఎంటీయూ -1061, ఎంటీయూ 1293 రకాలు సాగు చేసుకోవాలి.

మినుములో బంగారు తీగ సమస్య

తొలకరిలో పొలంలోని బంగారు తీగను పూత రాక ముందు దున్నాలి. లేదా పారాక్వాట్ మందుతో నివారించాలి. పైరు విత్తిన వెంటనే ఎకరానికి 1.5 లీ. పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకాన్ని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లిన వెంటనే, 200 లీ. నీటిని పిచికారీ చేస్తే 60 నుంచి 70 శాతం వరకు బంగారు తీగను నిర్మూలించవచ్చు. పైరు విత్తిన 20 రోజులకు ఇమాజితాపిర్ 10 శాతం ద్రావకం ఎకరానికి 200 మి.లీ., 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి పెరిగితే మొక్కజొన్న, జొన్న, సజ్జ పంటలను సాగు చేసుకోవాలి.

నారుమడి బాగుండాలంటే...

వరి నారుమడిలో ఊద నిర్మూలనకు విత్తిన 14 రోజులకు సైహాలోఫాప్ పి బ్యూటైల్ 10 శాతం ద్రావకం 400 మి.లీ.... 200 లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. అన్ని రకాల కలుపు జాతుల నివారణకు బిస్‌పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 80 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సేంద్రియ సాగులో ఎరువుల వినియోగం

పచ్చిరొట్ట పెంచి కలియదున్నినప్పుడు బాగా చివికిన పశువుల ఎరువును ఎకరానికి 4 టన్నులు ఊడ్పు ముందు వేయాలి. అజోస్పైరిల్లమ్, పీఎస్‌బీ మనియఫూర్‌బీ 2 కిలోలు ఎకరానికి 100 కిలోల పశువుల ఎరువుతో కలిపి నాట్ల సమయంలో వేసుకోవాలి. 200 కిలోల వేపచెక్కను దుబ్బుచేసే అంకురం దశలో వేయాలి. ఎకరానికి ద్రవ జీవామృతం 200 లీ. నేలలో కలిసేలా 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పిలక దశలో వేసుకోవాలి. 30 రోజుల వ్యవధిలో పంచగవ్య 3 శాతం, లేదా 5 శాతం ఆవు మూత్రం పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు..

ముందుగా పొలం నుంచి మురుగు నీటిని తీసివేయాలి. కాండం కుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి కాండం మొదలు తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

మొక్కజొన్నలో కలుపు తొలగింపు

విత్తిన 2-3 రోజుల్లోపు అట్రజిన్ కలుపు మందు ఎకరానికి 1200 గ్రా. 200 లీ.నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. 15-18 రోజులకు గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు ఎకరానికి 115 మి.లీ. టెంబోట్రియాన్‌ను 400 గ్రా. అట్రజిన్‌తో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాకు కలుపు నివారణకు 2.4 డీసోడియం సాల్ట్ ఎకరానికి 500 గ్రా. 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తుంగ ఎక్కువగా ఉంటే హాలో సల్ఫ్యూరాన్ మిథైల్ 40 గ్రా. ఎకరానికి 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సన్న, అధిక దిగుబడినిచ్చే వరి రకాలు

బీపీటీ 5204కి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి కలిగిన రకాలు ఎంటీయూ -1224 (పంట కాలం 135-140 రోజులు), ఎంసీఎం -103 (పంట కాలం 140 రోజులు). అధిక దిగుబడినిచ్చే వరి రకాలు ఖరీఫ్‌లో ఎంటీయూ -1318 (పంట కాలం 150 రోజులు), ఎంటీయూ - 1262 (పంట కాలం 155 రోజులు), దాళ్వాలో ఎంటీయూ -1121 (పంట కాలం 121-125 రోజులు), ఎంటీయూ -1153 (పంట కాలం 120 రోజులు), ఎంటీయూ -1293 (పంట కాలం 120 రోజులు)

మినుములో కాండం గజ్జి తెగులు

వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. కిలో విత్తనానికి మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. 2 కిలోల ట్రైకోడెర్మాను 80 కిలోల మాగిన పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండితో కలిపి విత్తుకునే సమయంలో తగినంత తేమ ఉన్నప్పుడు వేయడం వల్ల నేల నుంచి సంక్రమించే అన్ని రకాల శిలీంధ్ర తెగుళ్ల నుంచి రక్షణ కలుగుతుంది. తెగులు సోకిన ప్రాంతం నుంచి వ్యాధి చెందకుండా జాగ్రత్త పడాలి. హెక్సాకొనజోల్ 2 మి.లీ. ద్రావణం లీటరు నీటికి కలిపి తెగులు సోకిన ప్రాంతంలో నేల తడిసేలా పిచికారీ చేయాలి.

మేము సైతం... వీవీఐపీ బందోబస్తుకు..

తొలిసారిగా వీవీఐపీ ట్రాఫిక్ డైరెక్షన్‌కు మహిళా కానిస్టేబుల్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

వీవీఐపీ బందోబస్తు అంటే కత్తిమీద సామే. ఎప్పుడు ఏం జరుగుతుందోనని వళ్లంతా కళ్లు చేసుకుని బందోబస్తు నిర్వహించాలి. ఇక వీవీఐపీ కాన్వాయ్ వస్తుంటే పైలట్ వాహనం నుంచి వీవీఐపీ వాహనం వరకు డ్రైవర్లందరికీ సరైన సమయంలో రూట్ డైరెక్షన్స్ ఇవ్వాలి. మరో వైపు వీవీఐపీకి సెల్యూట్ చేయాలి. తీవ్రమైన ఒత్తిడితో కూడుకున్న ఈ పనులను మేము సైతం సులువుగా చేసేస్తామంటున్నారు విజయవాడ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుళ్లు. విజయవాడ నగరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్‌కు ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ శ్రీదేవి తొలిసారిగా రూట్ డైరెక్షన్‌తో పాటు వీవీఐపీ సెల్యూట్ చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. రొటీన్‌కు భిన్నంగా ఈ సారి ప్రకాశం బ్యారేజీ వద్ద పురుష కానిస్టేబుల్ స్థానంలో వీవీఐపీ రూట్ సెల్యూట్‌కు మహిళా కానిస్టేబుల్‌ను తొలిసారిగా ఉపయోగించారు. కుప్పం పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన చంద్రబాబు.. రోడ్డు మార్గంలో ఉండవల్లిలోని తన నివాసానికి వెళుతున్నారు. ఈ సమయంలో ప్రకాశం బ్యారేజీ వద్ద కానిస్టేబుల్ శ్రీదేవి వీవీఐపీ సెల్యూట్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. బెజవాడ మహిళాశక్తిని చాటి చెప్పింది.

వీవీఐపీ సెల్యూట్ చేస్తున్న కానిస్టేబుల్ శ్రీదేవి

రాష్ట్రంలో డబుల్ కాదు.. నాలుగు ఇంజిన్ల సర్కార్ నడుస్తోంది

మంత్రి కొలుసు పార్థసారథి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ కాదని.. నాలుగు ఇంజిన్ల సర్కారు అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, భాజపా.. నాలుగు ఇంజిన్లు అని వివరించారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు-2025కు సంబంధించిన గోడప్రతులను విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్లో గురువారం ఆవిష్కరించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి ప్రభుత్వంతో రూ.9.50 లక్షల కోట్లు ఎంఓయూ కుదుర్చుకోగా.. ఇప్పటికే రూ.6.30 లక్షల కోట్లతో తమ సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలియజేశారు. ఆయా సంస్థలు 2027, 2028లో ఉత్పత్తులు విడుదల చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మైనింగ్, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పర్యాటకానికి పారిశ్రామిక హోదా కల్పించడం వల్ల బ్యాంకర్లు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఏపీ ఛాంబర్స్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానాలు పరిశ్రమలు నెలకొల్పే వరకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. జిల్లాకు మరింత మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకాస కోఛైర్మన్‌గా పాము శ్రీనివాసరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐకాస కోఛైర్మన్‌గా ఏపీటీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎస్ఏ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ.. శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేసింది.

ఐకాస ఛైర్మన్ విద్యాసాగర్‌తో శ్రీనివాసరావు

ఏడాదిన్నరగా.. ఖాళీగా ఇంట్లోనే ఉంటున్నాం

విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థుల ఆందోళన

ఈనాడు, అమరావతి: విదేశాల్లో వైద్య విద్యను చదివిన తర్వాత నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్‌ను సైతం పూర్తి చేసినా తమకు రిజిస్ట్రేషన్లు చేసి, శాశ్వత గుర్తింపు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలంటూ.. విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. తాము గత ఏడాదిన్నర నుంచి ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ) కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు ఇప్పటికైనా న్యాయం చేయాలని.. విశ్వవిద్యాలయం గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. రష్యా, ఫిలిప్పైన్స్, కజకిస్థాన్, నేపాల్, ఉక్రెయిన్ సహా ఏడు దేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన 1536 మంది విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారిందని, తమ ఆవేదనను అర్థం చేసుకోవాలంటూ వేడుకున్నారు. తాము విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి, ఆ తర్వాత ఏపీఎంసీ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఏడాది ఇంటర్న్‌షిప్‌ను కూడా పూర్తిచేసినా శాశ్వత రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో గత ఏడాదిన్నరగా ఇళ్లకే పరిమితమైపోయామని వాపోయారు. వైద్య విద్యార్థులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏబీవీపీ, వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం లోపలికి వెళ్లే వాహనాలను అడ్డుకుంటూ ఆందోళనను తీవ్రం చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థి సంఘాల నేతలను వాహనాల్లో ఎక్కించి అక్కడి నుంచి తరలించారు.

ఎత్తిపోతల పునరుద్ధరణకు శ్రీకారం!

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: వేదాద్రి-కంచల ఎత్తిపోతల మరమ్మతులను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం అర్ధ రాత్రి వరకు పర్యవేక్షించారు. వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతల పునరుద్ధరణ నిమిత్తం 12 గంటల పాటు తెదేపా నాయకులతో కలిసి ఆయా పనులను పర్యవేక్షించారు. [illegible] 2019 నుంచి విద్యుత్తు బకాయిలు రూ.21 కోట్లు ఉన్నాయి. [illegible]

వేదాద్రి ఎత్తిపోతల పనులను పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు

[illegible]

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో) [illegible]

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్లు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

తీసుకున్న నగలెన్నో చెప్పు

బంగారంతో ఉడాయించిన వ్యాపారిని విచారిస్తున్న పోలీసులు

విద్యాధరపురం: [illegible] వీధిలో వేణుగోపాల్ బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వినోద్ వచ్చి వేణుగోపాల్ వద్ద రూ.50లక్షల విలువైన 655 గ్రాముల ఆభరణాలు తీసుకెళ్లారు. వాటిని తిరిగి ఇవ్వకుండా దుకాణం మూసి వెళ్లడంతో వేణుగోపాల్ పోలీసులను ఆశ్రయించారు. ప్రత్యేక బృందాలు గాలిస్తున్న విషయం తెలుసుకున్న వినోద్ న్యాయవాది సహాయంతో వన్‌టౌన్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఎంత మంది నుంచి బంగారం తీసుకున్నారు, ఆ నగలు ఏమిచేశారు, ఎక్కడ దాచారు తదితర అంశాలపై పోలీసులు విచారించారు. నిందితుడి ఫోన్ నంబర్లు, తిరిగిన ప్రదేశాలు, ఇతర అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

రౌడీషీటర్ వీరంగం

పటమట, న్యూస్‌టుడే: ఓ ఇంటిని ఖాళీ చేయించేందుకు పెనమలూరుకు చెందిన రౌడీషీటర్ కొక్కిలగడ్డ జాన్‌బాబు వీరంగం సృష్టించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆచార్య ఎంజీ నగర్‌లో కృష్ణారావుకు చెందిన నివాసంలో కోట సామ్రాజ్యం నాలుగేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. ఇల్లు ఖాళీ చేసే విషయంలో వారి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో రౌడీషీటర్ జాన్‌బాబు.. 10 మంది అనుచరులు కలిసి సామ్రాజ్యం అద్దెకు ఉంటున్న ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. ఇంట్లో వస్తువులన్నీ ధ్వంసం చేసి కొన్ని వస్తువులు బయట పడేశారు. సామ్రాజ్యం పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో టాస్క్ పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతానికి కేసు నమోదు కాలేదు.

పంజాబ్ & సింధ్ బ్యాంక్
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
జోనల్ ఆఫీస్: #54-14-4సి/1, ఆర్‌కె గల్లేరియా, 4వ ఫ్లోర్, శ్రీనివాసనగర్, బ్యాంక్ కాలనీ, విజయవాడ-520008.
E-mail: zo.vijayawada@psb.co.in
దిగువ పేర్కొన్న వారికోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము.
1) విజయవాడలోని జోనల్ ఆఫీస్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఫిజియోథెరపిస్ట్ నియామకం కొరకు
2) విజయవాడలోని జోనల్ ఆఫీస్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన మెడికల్ కన్సల్టెంట్ నియామకం కొరకు
వివరాల కోసం https://punjabandsindbank.co.in బ్యాంక్ వెబ్‌సైట్ నందు సందర్శించండి.
-జోనల్ మేనేజర్

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన NIT NO.06/EE/2025-26, Dt: 01-07-2025
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి 1) కొండ పైన టాయిలెట్స్, రిపేర్లు 2) కొండ పైన కెమికల్ ట్రీట్ మెంట్ 3) ఆర్థిక సంవత్సరం 2025-26 సందర్భముగా కొండ క్రింద సివిల్ మెయింట్ నెన్స్ 4) కొనుగోలు కొరకు ఆరు సీట్ల బ్యాటరీ వెహికల్ (2వ పర్యాయము) 5) సి.సి టి.వి ఎ.యమ్.సి రెండు సంవత్సరముల కాలమునకు పనులు చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తికలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments department సి.నెం. 1, 2 & 3 వర్క్స్ నందు మరియు సి.నెం. 4 & 5 ప్రొడక్ట్స్ నందు దర్శించవచ్చును. టెండర్లు డౌను లోడు ది:05-07-2025 మ॥ 3.00 గం॥ల నుండి ది:19-07-2025 ఉ॥ 11.00 గం॥ల వరకు. టెండరు దాఖలు చేయు చివరి తేది:19-07-2025 మ॥ 3.00 గం॥ల వరకు మరియు దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి కొండ పైన ఘాట్ రోడ్ వద్ద Tensile షెడ్ వేయుటకు మరియు దేవస్థానము నందు కొండ పైన మరియు కొండ క్రింద రెగ్యులర్ మరియు దసరా మహోత్సవములు-2025 సందర్భముగా వివిధ సివిల్, ఎలక్ట్రికల్, వాటర్, ట్రాన్స్‌పోర్ట్, గార్డెన్ మొ॥లగు పనులకు గాను సీల్డ్ కొటేషన్లు స్వీకరించబడును. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోన్: 0866-2423800 ద్వారా సంప్రదించగలరు.
ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

వెంటపడుతున్నాడని.. మట్టుబెట్టారు

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

వివరాలు వెల్లడిస్తున్న సీఐ గిరిబాబు, పక్కన ఏసీపీ ప్రసాదరావు, ఎస్సై కృష్ణ, వెనుక నిందితులు

తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తమ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే ఆక్రోశం ఒకరి హత్యకు దారితీసింది. ఎ.కొండూరు మండలం కొత్త రేపూడి సమీపంలోని ఓ మామిడి తోటలో రెడ్డిగూడెం మండలం పాత మద్దులపర్వ గ్రామస్థుడైన తాపీ మేస్త్రీ కోట రామారావు(రాము) హత్యకు గురైన సంగతి తెల్సిందే. ఇందులో ఏ1, ఏ2 నిందితులైన ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరానికి చెందిన ఆదూరి చార్లెస్, రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామస్థురాలు బత్తుల కుమారిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో హత్యకు గల కారణాలను సీఐ వివరించారు.

ముందస్తు పథకం ప్రకారమే

చార్లెస్‌కు.. కుమారికి ఎప్పటినుంచో వివాహేతర సంబంధం ఉంది. తాపీ మేస్త్రీ అయిన రాముకు కూలీ పనుల వద్ద కుమారితో పరిచయం ఏర్పడింది. దీంతో తన కోరిక తీర్చాలని గత కొన్ని నెలలుగా రాము ఆమె వెంటపడి వేధిస్తున్నాడు. ఈ విషయం చార్లెస్‌కు తెలిసింది. ఇద్దరు కలిసి రాముని హతమార్చి తమకు అడ్డు తొలగించుకోవాలని పథకం వేశారు. ఆ మేరకు గత జూన్ 26న రామును తీసుకుని కుమారి కొత్తరేపూడిలోని చింతరెడ్డి రఘుపతిరెడ్డికి చెందిన మామిడి తోటకు చేరుకుంది. ముందస్తు పథకం మేరకు వారిద్దరు ఏకాంతంగా ఉండగా చార్లెస్ కర్రతో రాము తలపై బలంగా కొట్టాడు.. అతను చనిపోయాడని నిర్ధారించుకున్న నిందితులిద్దరూ తమకేమీ తెలియనట్లు వెళ్లిపోయారు. 29వ తేదీ ఉదయం మామిడి తోటలో మృతదేహం వెలుగు చూడగా పోలీసులు విచారణ చేపట్టారు. అదే సమయంలో గత నెల 26వ నుంచి అదృశ్యమైన రాము కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా.. మామిడి తోటలో మృతదేహం ఉందని అందిన సమాచారంతో అక్కడకు చేరుకుని అతడిదేనని గుర్తించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై 29వ తేదీన ఎ.కొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు దర్యాప్తులో వివాహేతర సంబంధం ఉన్న చార్లెస్, కుమారి అతడిని హతమార్చినట్లు తేలింది. నిందితులను తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించడంతో నూజివీడు ఉపకారాగారానికి తరలించినట్లు సీఐ తెలిపారు.

పోలవరం-బనకచర్లపై బహిరంగ చర్చకు సిద్ధం

మాట్లాడుతున్న భవానీప్రసాద్. పక్కన లక్ష్మీనారాయణ

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, గాంధీనగర్ : 'పోలవరం-బనకచర్ల పథకం అత్యంత లోపభూయిష్టమైంది. అవాంఛనీయమైంది కావడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన "ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు"ను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తిరుగు తపాలాలో వెనక్కి పంపింది. ఈ పరిణామం మాకు ఆశ్చర్యం కలిగించలేదు' అని ఆలోచనపరుల వేదిక సభ్యులు అక్కినేని భవానీప్రసాద్, టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ అంశంపై వారు గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి.. 'ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ ఏబీ వెంకటేశ్వరరావు, కంభంపాటి పాపారావుతో కలిపి పత్రికా సమావేశంలో వివరించాం. దీనిపై భిన్నాభిప్రాయాలు ఉన్నవారు స్వేచ్ఛగా హేతుబద్ధంగా వ్యక్తపరచవచ్చు. కానీ తెదేపా అధికారిక యూట్యూబ్ ఛానల్ చైతన్యరథం ఒక చర్చను నిర్వాహించి ఏబీ వెంకటేశ్వరరావును లక్ష్యంగా చేసుకుని కించపరుస్తూ మాట్లాడి వారి స్థాయిని, నైజాన్ని, దిగజారుడుతనాన్ని బయటపెట్టుకున్నారు' ఆ ఛానల్ నిర్వాహకులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. మేం వ్యక్తం చేసిన అభిప్రాయాలపై బహిరంగ చర్చకు సిద్ధం. రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న పెండింగ్ ప్రాజెక్టులైన తెలుగుగంగ, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రవంతి, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణం కూడా రాజకీయ సంకల్పంతో పోలవరం పూర్తి చేస్తున్నట్లు చేపట్టాలి. రెండేళ్లలో నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులు తక్షణం చేయాలని కోరుతున్నాం' అని తెలిపారు.

తగ్గుతున్న వానల తీవ్రత

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో వానల తీవ్రత తగ్గుతోంది. గురువారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. తిరువూరు 14.8 మి.మీ., గంపలగూడెం 6.4, విస్సన్నపేట 4.4, ఎ.కొండూరు 3.6, మైలవరం 2.4, వీరులపాడు 2.2, ఇబ్రహీంపట్నం 2, రెడ్డిగూడెం 1.4, కంచికచర్ల, చందర్లపాడు 1, జగ్గయ్యపేట, నందిగామ 0.8, వత్సవాయి, పెనుగంచిప్రోలు 0.6 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. జి.కొండూరు, విజయవాడ గ్రామీణ మండలాలు, విజయవాడ నగరంలో వర్ష ఛాయలు లేవు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు. ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

FLAT FOR SALE

అశోక్‌నగర్ బందరు రోడ్డుకి అతి సమీపమున పప్పుల మిల్లు బస్టాప్ నందు నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 73829 81107.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

57 ఎ॥ మెగా గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ @ కాజా టోల్‌గేట్ NRI's వారు డెవలప్ చేస్తున్న వెంచర్‌లో ప్లాటు బుకింగ్ 3 ల॥ 183- 400 చ॥లు ప్లాట్లు, క్లబ్ హౌజ్‌తో. ✆ 9502230091.

విజయవాడకు చేరువలో పాముర్రు దగ్గర 4.5 లక్షలకు, 100 చ॥గ॥ ★ నందిగామ హైవే ఆనుకొని గ॥ 8999 రూ॥. కొండపల్లి హైవే ఆనుకొని గ॥ 9999 రూ॥. Plots అమ్మకమునకు కలవు. ✆ 93982 13364.

TO LET

సూర్యారావుపేట ప్రకాశం రోడ్‌లో నందన స్కిన్‌కేర్ ఎదురుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో 2 సింగిల్ బెడ్‌రూమ్ పోర్షన్స్ 1st ఫ్లోర్‌లో 1 సింగిల్ బెడ్‌రూమ్ ఫ్యామిలీస్‌కి మాత్రమే అద్దెకు. ✆ 91609 12102.

విజయవాడ లబ్బీపేటలో 3000 చ.అ.ల విస్తీర్ణం గల హాస్టల్ (2000 చ.అ.) & ఆఫీస్ (1000 చ.అ.) అద్దెకు కలదు. ✆ 94944 92633.

JOBS

Wanted Female Counsellors & Telecallers for Abroad Education Consultancy. Min. Exp- 2 Yrs. Good Communication Skills. Good Salary+ Incentives. Labbipet, Vijayawada. Ph: 8121396789.

Wanted Experienced Teacher to teach Hindi subject (6th to 10th Class) TCMA EM High School, 1 town, VJA. ✆ 94401 26237, 93986 69578.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శ్రీ సాయి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ & డవలపర్స్ తాడేపల్లి వారి వినుకొండ దగ్గర్లో 22 ఎ॥ ఎర్రచందనం, మహాగని వెంచర్‌లో ప్లాట్లు అమ్ముటకు ఏజెంట్స్ కావలెను. ✆ 80081 93109, 95050 93432.

లబ్బీపేటలోని ప్రముఖ కాలేజీలో పనిచెయ్యడానికి అనుభవజ్ఞులైన కౌన్సెలర్లు, క్లాస్ ఇంచార్జ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియూ హాస్టల్ వార్డెన్లు కావలెను. వయసుః 25-40. జీతంః 12K-15K. 91542 10069.

Study Power (Education Loans) నందు పనిచేయుటకు Staff మరియు కమిషన్ based Agents కావలెను. ✆ 9963878710.

క్లాస్ ఇన్‌చార్జెస్ (M), జీ: 12K, హాస్టల్ వార్డెన్స్ (M), జీ:10K, వ: 25-45, అనుభవం గల వారు కావలెను. గౌతమ్ డిగ్రీ కాలేజ్, మోడ్రన్ సూ. మార్కెట్ ఎదురు, బెంజ్ సర్కిల్. ✆ 88971 72345.

SECURITY GUARDS

హనుమాన్‌జంక్షన్ దగ్గర ఆరుగొలనులో పనిచేయుటకు 3 సం॥లు అనుభవం గల సెక్యూరిటీ ఆఫీసర్ (45 సం॥లోపు) కావలెను. జీతం: 25,000/- Ex ఆర్మీ, సివిలియన్ సంప్ర: 95737 01777.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు 9985095965

? బృందావనం కాలనీలో వీధి లైట్లు వెలగడం లేదని పలు మార్లు పురపాలిక సిబ్బందికి ఫిర్యాదు చేశాం. రాత్రి సమయాల్లో పిల్లలు ట్యూషన్లకు వెళ్లి వస్తున్నారు. ఆ సమయాల్లో పాముల బెడదతో ఇబ్బందిగా ఉంది. **-శ్రీరాములు, స్థానికులు**

✔ రెండు రోజుల కిందట సమస్యను పరిష్కరించాం. మరోసారి సిబ్బందిని పంపి సమస్యను గుర్తించి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం. **-వాసు, వీధి దీపాల పర్యవేక్షకుడు**

? తుమ్మలపాలెం వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. కొన్ని రోజుల నుంచి పంచాయతీ సిబ్బంది వీటిని తొలగించడం లేదు. **- సాంబశివరావు, స్థానికుడు**

✔ పరిశీలించి సిబ్బందిని పంపి తొలగింపజేస్తాం. కార్యదర్శి ప్రసాద్. **–న్యూస్‌టుడే, కొండపల్లి, ఇబ్రహీంపట్నంగ్రామీణం**

? గొల్లపూడి కోయపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. చెత్త, వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోతున్నాయి. **-భార్గవ్, కోయపేట**

✔ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం **-కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ –న్యూస్‌టుడే, గొల్లపూడి**

స్పందనకు వందనం

వెల్లటూరులోని ప్రధాన కచ్చా కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు న్యూస్‌టుడే దృష్టికి తీసుకుని రాగా సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన మంగళవారం ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్యదర్శి పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు** ✤ **స్థా**నిక పంచాయతీలోని చిన ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే రహదారిలోని డ్రెయినేజీలో మురుగునీటి పారుదల సమస్యపై స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు తెలియజేయగా గురువారం సిబ్బందితో శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం** ✤ పట్టణంలోని 11వ వార్డులోని డ్రెయినేజీలో పూడికతో మురుగు నీరు పారుదల లేక అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో పూడిక లేకుండా తొలగింపజేశారు. ✤ పట్టణంలోని 18వ వార్డులో రేగు చెట్టు కూడలిలోని డ్రెయినేజీలో పూడిక ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారికి తెలుపగా ఆయన స్పందించి పూడికను తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, తిరువూరు**

ఎత్తిపోతల పథకం నూతన కమిటీ ఎన్నిక

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరులో గురువారం రాత్రి చెరుకు వెంకటరెడ్డి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకు నరసారెడ్డి(బాబు), ఉపాధ్యక్షుడిగా వజ్రాల ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గూడెల్లి రాఘవరావు, మరో 10 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎత్తిపోతల పథకంలో ఆయకట్టు 382 ఎకరాలు ఉందని, సాగునీరు సజావుగా అందేలా కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో భోగినేని రాజగోపాలరావు, పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా పని చేసిన కె.రాజమణి సాధారణ బదిలీలో వెళ్తూ బడికి అవసరమైన కంప్యూటర్‌ను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం.జీ.వి.రామకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ సయ్యద్ అక్బర్‌పాషా, విద్యాసాగర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాపై బెదిరింపులు ఆపాలి

తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై బెదిరింపులు ఆపాలని కోరుతూ గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సదరు కార్మికులు ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత నెల రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికే కొన్ని పురపాలికల్లో సమ్మె చేస్తుండగా, ఈ నెల 10 తర్వాత మరికొన్ని నగర పంచాయతీల్లో సమ్మె చేస్తారని తెలిసి ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్‌కే.బాజీ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కట్లేరుపై వంతెన నిర్మాణానికి పాలనామోదం

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరుపై హైలెవెల్ వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి రూ.30 కోట్లు మంజూరుకు పరిపాలనా ఆమోదం లభించిందని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. తిరువూరులోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయింపు దస్త్రం ఆర్థికశాఖ వద్దకు చేరిందన్నారు. అక్కడి నుంచి నిధుల కేటాయింపు త్వరలో ప్రకటిస్తారని, సెప్టెంబరు లోపు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ ఏడాది అక్టోబరులో కట్లేరుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభమై వచ్చే ఏడాది వేసవి నాటికి పూర్తవుతుందన్నారు.

వాగుల నిండా.. వ్యర్థాల కొండ

★ డంపింగ్ సమస్యతో పూడుతున్న వాగులు

★ జలప్రవాహానికి అవాంతరాలు ఏర్పడతాయని ఆందోళన

మైలవరంలో ఇలా..	
పంచాయతీలో వార్డులు	20
చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లు	5
రోజు సేకరిస్తున్న వ్యర్థాలు	15 నుంచి 20 టన్నులు
ఎరువు తయారీకి వినియోగం	నెలకు మూణ్నాలుగు టన్నులు
వాగుల్లోకి తరలుతున్నది	వందల టన్నులు

మైలవరం, న్యూస్‌టుడే

రోజు రోజుకీ పేరుకుంటున్న వ్యర్థాలు వాగుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మేజర్ పంచాయతీ మైలవరంలో ప్రత్యేక డంపింగ్‌యార్డు లేక సేకరించిన చెత్త తరలింపునకు నానా తిప్పలు పడుతుంటే, సంపద తయారీ కేంద్రం సామర్థ్యం ఒక రోజు సేకరణకే సరిపోతోంది. వాగుల అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ పేరుకున్న గుట్టలు బయటపడుతుంటే అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పూరగుట్ట వాగులో పేరుకున్న చెత్త..

ప్రత్యామ్నాయం దొరక్క

నియోజకవర్గ కేంద్రంలో 25 వేల జనాభా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వచ్ఛతపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. నివాసాల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలను నిత్యం ట్రాక్టర్లు, రిక్షాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. అందులో భాగంగా పదేళ్ల కిందటి వరకు స్థానిక చిన్నచెరువు ఎదురుగా ఉన్న స్థలానికి తరలించారు. క్రమేపీ గుట్టలుగా పేరుకుని, బైపాస్‌ను సైతం ముంచెత్తడంతో స్థానికుల అభ్యంతరాలతో తిరిగి వైకుంఠధామం సమీపం వాగులో పారబోయడం ప్రారంభించారు. సగం వాగును చెత్త మింగేయడంతో ప్రత్యామ్నాయ స్థలం దొరక్క ఐదేళ్ల కిందట పూరగుట్ట సమీపంలో వాగు అంచునే డంపింగ్‌కేంద్రంగా మార్చేశారు.

మునిగిపోతాయని ఆవేదన

ఇటీవల వాగుల్లో పూడిక, పిచ్చిచెట్ల తొలగింపు చర్యలు చేపట్టగా ఎక్కడ చూసినా వ్యర్థాలే బయటపడుతున్నాయి. వైకుంఠధామం పక్కన ఏకంగా సగం వాగు పూడుకుపోయింది. పూరగుట్ట వాగు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. వరదల సమయంలో ప్రవాహలకు అడ్డుపడే వ్యర్థాలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

పరిపాటిగా మారింది

వ్యర్థాలతో సంపద తయారు చేయాలన్నా అందుకు పరిస్థితులు అనుకూలించడంలేదు. సంపద తయారీకేంద్రంలో నిర్మించిన పిట్లలో కేవలం రెండ్రోజుల్లో సేకరిస్తున్న చెత్తతోనే నిండిపోతోంది. దాని నుంచి వానపాముల ఎరువు తయారీకి దాదాపు 3 నెలల సమయం పడుతుంది. ఈ లోగా వచ్చేదంతా తిరిగి వాగుల్లో పోయడమే పరిపాటిగా మారింది. వందల టన్నుల వ్యర్థాలను నిల్వ చేయగలిగిన ప్రాంతాలను ఎంపిక చేయడం ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని చెబుతున్నారు.

కృష్ణా జలాల సరఫరాపై సమీక్ష

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గానికి కృష్ణా జలాల సరఫరాపై గురువారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మోహిద్దీన్, ఈఈ రామ్‌దాస్, డీఈ శంకర్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ సుధాకర్, ఈఈ స్వామినాయుడు, డీఈ కృష్ణబాబు, పురపాలిక కమిషనర్ మనోజ పాల్గొని పనుల నిర్వహణపై చర్చించారు. అనంతరం మండలంలోని జి.కొత్తూరుకు చెందిన బంకా రాంబాబుకు కిడ్నీ శస్త్రచికిత్సకు రూ. లక్ష, పట్టణంలోని పాత తిరువూరుకు చెందిన బి.చరితసాయి అనే బాలికకు చెవి శస్త్రచికిత్స నిమిత్తం రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీలను ఎమ్మెల్యే అందజేశారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని తన కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా నియోజకవర్గ స్థాయి కార్యాచరణ ప్రణాళికపై ఎమ్మెల్యే అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ ఎం.హనుమంతరావు, ఎంపీడీవో సీహెచ్.రవిబాబు

సమ్మె విజయవంతానికి పిలుపు

గొల్లపూడి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 9న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. గొల్లపూడిలోని పౌరసరఫరాల శాఖ గోదాములోని ముఠాకార్మికులతో ఆయన గురువారం సమావేశమయ్యారు.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుపై విచారణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని గోపాలపురం వద్ద భూ సమస్యపై రెడ్డిగూడేనికి చెందిన చిన్నం సత్యనారాయణ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం భూ రికార్డుల అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ టి.త్రివిక్రమరావు, తిరువూరు ఆర్డీవో కె.మాధురి తనిఖీలు చేశారు. అనంతరం ముప్పనపల్లి గ్రామంలో 22ఏ ఫైల్ గురించి భూమిని ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సునీలాదేవి, డిజిటల్ సర్వేయర్ సారంగపాణి, విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో కె.మాధురి, టి.త్రివిక్రమరావు తదితరులు

స్పందించారు..గుంతలు పూడ్చారు

గోతుల్లో చిప్స్ పోసి చదును చేస్తున్న ట్రాక్టర్

విజయవాడ- విస్సన్నపేట ఆర్‌అండ్‌బీ రహదారి..కొత్తరెడ్డిగూడెం గ్రామంలో భారీ గుంతలు పడి వర్షం నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై జూన్ 24న 'గోతుల మయం... రక్షణ దూరం' శీర్షికన చిత్రవార్తతో పాటు తారు రోడ్డుపై గోతుల సమస్య గురించి వరుస కథనాలకు అధికారులు స్పందించారు. ఆయా గుంతలను చిప్స్‌తో పూడ్చించి సమస్య తాత్కాలికంగా పరిష్కరించగలిగారు. రెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు, ఉపసర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు), తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డిలు పనులు పర్యవేక్షించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

ప్రచారం నిర్వహిస్తున్న సచివాలయం, పురపాలిక సిబ్బంది

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ముప్పుపై అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కొండపల్లి పురపాలికలోని ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. .ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు గురించి అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా అవగాహన లేమితో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, బాటిల్స్, ఇతర ఉత్పత్తుల వాడకం ఎక్కువైందన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వీయ నిషేదం చేసుకోవడంతో పాటు ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్ కంపోస్టింగ్ గురించి తెలుసుకోవాలని ప్రధాన వీధుల్లో ప్రదర్శనను చేశారు. అనంతరం రింగురోడ్డులో ఉన్న చిరు వ్యాపారులకు జూట్, గుడ్డ సంచుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పురపాలిక పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరులో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై సచివాలయ ఉద్యోగులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని దుకాణాల వద్దకు వెళ్లి వస్తువు విక్రయాలకు, రవాణాకు ప్లాస్టిక్ సంచులు వినియోగించవద్దని సూచించారు. ప్రజలు కూడా వస్త్రంతో కుట్టించిన సంచులు వస్తు రవాణాకు వినియోగించి ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు ఎలినేని చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంసిద్ధత కార్యక్రమాల తనిఖీ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల(ఎన్‌ఎస్)లో అమలు చేస్తున్న సంసిద్ధత కార్యక్రమాలను మానిటరింగ్ అధికారి, డైట్ అధ్యాపకుడు ఎస్.జోజిబాబు గురువారం తనిఖీ చేసినట్లు ఎంఈవో ఎ.శ్యామసుందరరావు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, విద్యామిత్ర కిట్ల పంపిణీ, భోజన పథకం, పదో తరగతిలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలపై ఆయన వివరాలు తీసుకున్నారు. మూడు బడుల నిర్వహణపై జోజిబాబు సంతృప్తి వ్యక్తంచేశారు. బాలురు ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.శంకరరావు పాల్గొన్నారు.

చూసి వెళ్లాలి..లేకుంటే పడిపోతారు

మండలంలోని రోలుపడిలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తోంది. రోజూ ఏదో వాహనం అందులో పడి చోదకులు గాయాలపాలవుతున్నారు. ఇటీవల ఒకరు పడి దెబ్బలు తగలడంతో మరో వాహనంపై ఆస్పత్రికి తరలించినట్లు స్థానికుడైన మేడా విజయ్ కుమార్ తెలిపారు. గ్రామంలోని చెరువు కట్టకు (బుర్రతూము) ఎదురుగా రోడ్డుపై ఉన్న గుంత వద్ద ప్రమాదాల నివారణకు స్థానికులు పిచ్చి మొక్కలు అడ్డుగా పెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చించి ప్రమాదాలు నియంత్రించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రోలుపడి(తిరువూరు)**

ఆక్రమించక ముందే బాగు చేయండి

మూలపాడు వాటర్ ట్యాంకు వద్ద ఉన్న పాత పశు చికిత్స కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పశు పోషకులు విజ్ఞప్తిచేస్తున్నారు. గతంలో గ్రామానికి చెందిన పశువులకు ఈ భవనంలోనే చికిత్సలు అందిచేవారు. అనంతరం జాతీయ రహదారికి అటు వైపుగా ఉన్న త్రిలోచనాపురంలో పశువైద్యశాల నిర్మించడంతో అక్కడే పశువులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ భవనం క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది. గ్రామంలోనే కొందరు భవనంతో పాటు స్థలాన్ని కూడా ఆక్రమించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు మరమ్మతులు నిర్వహించి కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మూలపాడు(ఇబ్రహీంపట్నంగ్రామీణం)**

అధ్వానం..అటు వెళ్లలేం

కవులూరు కట్టుబడిపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. దీంతో కవులూరు గ్రామస్థులు కట్టుబడిపాలెం మీదుగా మండల కేంద్రం జి.కొండూరు చేరుకోవాలంటే నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి మధ్యలో ఎన్‌సీఎల్ లైట్ వెయిట్ బ్రిక్స్ పరిశ్రమ ఉండడంతో భారీ వాహనాలు బ్రిక్స్ కోసం నిత్యం ఇటుగా ప్రయాణించడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. చినుకు పడితే గుంతల నిండా నీరు నిలిచి లోతు తెలియకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి అభివృద్ధి పై దృష్టి సారించాలని వాహనచోదకులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కమిటీ వారికి విరాళం అందిస్తున్న దాతలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలేరు ఒడ్డున పునర్నిర్మాణంలో ఉన్న మఠం శివాలయానికి దాతలు గురువారం విరాళం అందించారు. సన్నే నాగేశ్వరరావు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సంయుక్తంగా రూ.4,11,116 విరాళాన్ని మఠం శివాలయ కమిటీ వారికి అందించారు.

తిరుపతమ్మ ఆలయానికి ..

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విజయవాడ నగరం విజయనగర్ కాలనీ గుణదలకు చెందిన రావూరి సుబ్బారావు, అల్లూరమ్మ దంపతులు గురువారం తిరుపతమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కొండపల్లి: అమరవీరుల త్యాగాలకు గుర్తుగా నిర్వహించుకునే మొహర్రంను కొండపల్లి హజ్రత్ బోడ్లేసావలి దర్గా వద్ద గురువారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. దీక్షా పరులు నిప్పుల గుండాలను పీర్లను చేతబూని దాటారు. మత పెద్దలు అల్తాఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రకటన

నా క్లయింట్ స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా విజయవాడ వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. ఇబ్రహీంపట్నం గ్రామ కాపురస్తురాలు శ్రీ గుండిమెడ యోగానంద నరసింహారావు గారి భార్య శ్రీమతి గుండిమెడ మాధవి గారు ఇబ్రహీంపట్నం గ్రామంలోని రీ సర్వే నెం.220/3A1, 220/3A2 నందలి చ.గ.106.28 లను రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు నెం. 964/2007 క్రింద కొనుగోలు చేసినారని అటులనే సదరు సర్వే నెంబర్ల నందు శ్రీమతి గుండిమెడ కోటేశ్వరమ్మ గారు దస్తావేజు నెం.734/2011 క్రింద చ.గ.10.68 లను కొనుగోలు చేసినారని తదుపరి అందున ఒక బిల్డింగ్ నిర్మాణం చేసినారని తదుపరి శ్రీమతి గుండిమెడ కోటేశ్వరమ్మ గారు ది. 27-01-2018న ఇంటెస్టేట్‌గా మరణించారని, వారి మరణాంతరం వారి కుటుంబ సభ్యులైన శ్రీమతి గుండిమెడ మాధవి, పరిటాల శివలీల, నాగులవంచ శేషమ్మ, గుండిమెడ యోగానంద నరసింహారావు, గుండిమెడ నారాయణరావు, కొడమంచిలి మహాలక్ష్మి గార్లు సదరు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తి అనుభవించుచున్నారని తదుపరి సదరు షెడ్యూల్ స్థిరాస్తిని వారి నుండి కొనుగోలు చేయుటకు శ్రీ కోడూరు బుద్ధయ్య గారి భార్య శ్రీమతి కోడూరు వజ్రం గారు ఖరారుపడి సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు నా బ్యాంకు వారిని ఋణము మంజూరు చేయమని కోరుచున్నారు. కావున సదరు దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు గాని క్లయిములు గాని చట్ట ప్రకారం చెల్లగిన అభ్యంతరములు గాని ఉన్నయెడల నాకు 7 దినములలోగా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తెలియజేయవలెను. లేనిచో సదరు ఆస్తి నిర్వివాదమైనదని భావించి సదరు ఆస్తిని తనఖాగా ఉంచుకొని నా క్లయింట్ బ్యాంకువారు ఋణము మంజూరు చేయుదురు. తదుపరి వచ్చు క్లయిములుగాని లేక అభ్యంతరములుగాని లా ప్రకారం చెల్లవు మరియు నా క్లయింట్ బ్యాంకు వారిని బైండ్ చేయజాలవు.

షెడ్యూలు: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా కొండపల్లి పురపాలక సంఘం పరిధిలోని ఇబ్రహీంపట్నం గ్రామ రీ సర్వే నెం. 220/3A1, 220/3A2 నందలి చ.గ. 116-96 స్థలము మరియు అందలి బిల్డింగ్ నకు **హద్దులు:- తూర్పు:** అ. 33-0 వెడల్పు గల బజారు, **దక్షిణం:** ప్లాట్ నెం.19 రు దాఖలా ఆస్తి, **పడమర:** ప్లాట్ నెం.13 రు దాఖలా ఆస్తి, ఉత్తరం: జాయింటు దారి.

ఇట్లు

పాదర్తి పూర్ణచంద్రరావు, అడ్వకేట్

F.F-1, L R K టవర్స్, రామాలయం వీధి, కృష్ణలంక, విజయవాడ-13. ✆ 98482 30004.

ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గొర్రెలకు నట్టల మందు తాగిస్తున్న జిల్లా జేడీ హనుమంతరావు

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రారంభమవ్వగానే గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు కచ్చితంగా తాగించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ ఎం.హనుమంతరావు సూచించారు. మండలంలోని రామచంద్రాపురంలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన సందర్శించి జీవాలకు నట్టల మందు తాగించారు. జులై 10 వరకు ప్రభుత్వం నిర్వహించే ఉచిత శిబిరాలను జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటక శివారెడ్డి, ఏడీఏహెచ్ డాక్టర్ కె.రామారావు, పశువైద్యాధికారి భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేల, గానుగపాడు(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని మల్లేల, గానుగపాడులో గురువారం మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందు తాగించినట్లు పశువైద్యాధికారులు డి.అభిలాష్, టి.శ్వేత తెలిపారు. వీఏఎస్ ఎం.గోపాలకృష్ణ, వీఎల్వో బి.విజయ్, ఏవీహెచ్ కె.వీ.రామారావు పాల్గొన్నారు.

'కేసులతో నిర్బంధిస్తే మరింత ఉద్యమిస్తాం'

మైలవరం, న్యూస్‌టుడే: ప్రజల తరఫున పోరాడుతున్న సీపీఎం నాయకులను కేసులతో నిర్బంధిస్తే, ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందన్న సంగతిని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు సీపీఎంపై నిర్బంధం చేయలేదన్నారు. మంగళవారం నిరసన కార్యక్రమం నుంచి మండల కార్యదర్శి సుధాకర్‌ను స్టేషన్‌కు తరలించి, సాయంత్రం వరకు అక్కడే ఉంచి కేసు బనాయించారని వాపోయారు. అక్రమ కేసులు పెట్టి బెదిరించడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదని, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, కేసును తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుధాకర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తాం

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాయనపాడు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రైల్వే, రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. రాయనపాడు వద్ద రైల్వే గేటు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఆర్వోబీ నిర్మించాలనే కొన్నేళ్లుగా ప్రతిపాదన ఉంది. శాంతినగర్ వద్ద నుంచి చెరువు కట్ట వరకు వంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

కూటమి పాలనతో అందరికీ సంక్షేమం

తిరువూరు సుగాలీ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన తెదేపా నాయకులు

మైలవరం మండలం వెల్వడంలో..

కవులూరులో..

రెడ్డిగూడెంలో..

కొండపల్లిలో

న్యూస్‌టుడే బృందం: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువయ్యాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిరువూరు పట్టణంలోని 9వ వార్డు సుగాలీ కాలనీలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటా కూటమి ప్రభుత్వం ఏడాదిగా అమలు చేసిన హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామాల్లోని తెదేపా నాయకుల, కార్యకర్తలు కూడా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

గొల్లపూడిలో

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

అవీ ఇవీ

రెడ్డిగూడెం: నాగులూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఈవో పి.రమేష్‌బాబు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

తిరువూరు: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎం పి.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బదిలీయైన ఉపాధ్యాయులు ఈడే భరతకుమారి, ప్రియదర్శిని, సావిత్రి, నరేంద్ర, పద్మావతి, శారదను సత్కరించారు. సదరు ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు చేసిన కృషిని ప్రశంసించారు.

వృద్ధుడి నేత్ర దానం

కొత్తపల్లి(గంపలగూడెం): కొత్తపల్లికి చెందిన బొమ్మారెడ్డి మాధవరెడ్డి(74) మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ నేత్రాలయానికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు అతని నేత్రాలు దానం చేసేందుకు అంగీకరించారు.

ఆస్తి కోసమే అంతమొందించాడు..?

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరులో మంగళవారం ఉమ్మడి హైమావతి అనే మహిళ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు మొదటి నుంచి అనుమానిస్తున్న వ్యక్తే నిందితుడని జి.కొండూరు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. మృతురాలుకి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో చిన్నకుమారుడు, చిన్నకుమార్తె వివాహం అనంతరం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. పెద్ద కుమార్తె వివాహం తర్వాత మూలపాడు గ్రామంలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు పరిటాల గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు కొడుకు(మనువడు)ఉమ్మడి వేణు ఆస్తి కోసం హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలిందని, ఆస్తి కోసమే ఈ అఘాయిత్యానికి చేసినట్లు నిందితుడు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. విచారణ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

మహాత్మా జ్యోతిబా ఫులే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల

కొండపల్లి- ఎన్టీఆర్ జిల్లా తేది: 04-07-2025

షార్ట్ టెండర్ ప్రకటన

ఎన్టీఆర్ జిల్లాలో గల MJP AP వెనుకబడిన తరగతుల పాఠశాలలైన మైలవరం (కొండపల్లి), జగ్గయ్యపేట(వత్సవాయి)లకు 2025-2026 సంవత్సరమునకు 1) కూరగాయలు 2) వివిధ రకాల పండ్లు 3) కోడిగుడ్లు 4) చికెన్ (స్కిన్ లెస్ - VENCOB)లను సప్లై చేయుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.

టెండర్ ఫారములు ది.04-07-2025 నుండి 10-07-2025 సాయంత్రం 5.00 గంటల వరకు మైలవరం (కొండపల్లి) స్కూలులో లభ్యమగును, ధరావత్తు సొమ్ము టెండరుకు సంబంధించిన పూర్తి వివరములు టెండర్ ఫారం నందు పొందుపరచడమైనది.

పూర్తి చేసిన సీల్డ్ టెండరు ఫారములు ది.10-07-2025 సాయంత్రం 5.00 గంటల వరకు మైలవరం (కొండపల్లి) గురుకుల పాఠశాల యందు ఉంచిన టెండరు బాక్సులలో వేయవలెను. ది.11-07-2025న మధ్యాహ్నం 3-00 గంటలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయము, విజయవాడ నందు జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులు, హాజరైన టెండరుదారులు సమక్షంలో టెండరు బాక్సులు తెరచి నెగోషియేషన్ జరిపి టెండర్లు ఖరారు చేయబడును. టెండరు జరుగు తేది మార్పు చేయుటకు లేదా రద్దు చేయుటకు శ్రీయుత జాయింట్ కలెక్టర్, ఛైర్మన్ D.P.C. విజయవాడ వారికి పూర్తి అధికారం కలదు.

ఇతర వివరములకు ఈ క్రింది వారిని సంప్రదించగలరు.

ఇట్లు: **కె. రామమోహనరావు,** కన్వీనర్ & ప్రిన్సిపాల్

MJP AP BCWR స్కూల్ (బాలుర)

మైలవరం (కొండపల్లి), ఎన్టీఆర్ జిల్లా. ఫోన్ నెంబర్ : 85559 08091

(c) eenadu

విజయవాడ తూర్పు

సీఎంవోహెచ్ అర్జునరావు బాధ్యతల స్వీకరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ నూతన చీఫ్ మెడికల్ అధికారి(సీఎంవోహెచ్)గా కె.అర్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అధికారిగా కొంతకాలం పనిచేశారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ అధికారిగా ఉన్న గోపాలకృష్ణనాయక్ ఇక నుంచి యథావిధిగా సహాయవైద్య అధికారిగా విధులు నిర్వహించనున్నారు.

డీజీపీని కలిసిన ఎంపీ శివనాథ్

పటమట, న్యూస్‌టుడే: డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) గురువారం మంగళగిరి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ గుప్తాను.. శివనాథ్ సత్కరించి కొండపల్లి బొమ్మను బహూకరించారు. అనంతరం ఇద్దరూ రాష్ట్రంలోని శాంతి భద్రతలపై చర్చించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

❖ మూడో డివిజన్ గంగిరెడ్డుల దిబ్బ వైఎస్ఆర్ కాలనీలో భూగర్భ డ్రెయినేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి రాబర్ట్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షితులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు.

❖ మూడో డివిజన్ రామవరప్పాడు రింగ్ సెంటర్‌లోని ఇంద్రలోక్ కాంప్లెక్స్ వీధిలో 3-13/46 విద్యుత్ స్తంభానికున్న దీపం కొంత కాలంగా వెలగడం లేదని స్థానిక నివాసి దుర్గాప్రసాద్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేశారు.

❖ మూడో డివిజన్ కరెన్సీనగర్ ప్రధాన వీధిలో చెట్ల కొమ్మలు పడేస్తున్నారని స్థానిక నివాసి క్రాంతి కుమార్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా శానిటరీ అధికారి ఆంథోనీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో కొమ్మలను తీసివేయించారు.

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ప్రకృతి వ్యవసాయ డీపీఎంగా శంకర్ నాయక్

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లా ప్రకృతి వ్యవసాయ (ఏపీ సీఎన్ఎఫ్) విభాగ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)గా వై. శంకర్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ జి. లక్ష్మీశను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అన్నమయ్య జిల్లాలో ఏడీఏగా పని చేస్తూ 45 రోజుల క్రితం ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో అదనపు డీపీఎంగా పని చేస్తున్నారు. మొన్నటి వరకు డీపీఎంగా ఉన్న విజయకుమారి.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణిగా నియమితులయ్యారు.

ట్రాఫిక్ చిక్కులు.. ప్రజలకు చుక్కలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువయ్యింది. 21 డివిజన్లలో మొగల్రాజపురం, లబ్బీపేట, పటమట, కరెన్సీనగర్, గురునానక్ కాలనీ ప్రాంతాల్లో వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న కాలనీల్లో 4.47 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు విస్తరించడంతో నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు నిత్యం అవసరాల నిమిత్తం వస్తుంటారు. విద్యార్థులు కళాశాలకు వస్తారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలా రోజూ వేలాది మంది రావడంతో ఏ రహదారి చూసినా రద్దీగా ఉంటోంది. దీనికితోడు రహదారిపై అడ్డగోలు ఆక్రమణలు, మరోవైపు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత క్లిష్టతరంగా మారింది.

వాటర్ ట్యాంక్ రోడ్డులో రద్దీ

రహదారులే పార్కింగ్ ప్రదేశాలు

నగరంలోని వాణిజ్య సముదాయాల్లో సెల్లార్లు ఏర్పాటు చేయకపోవడంతో దుకాణాలకు వచ్చి వెళ్లేవారు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను రహదారిపైనే నిలుపుతున్నారు. టిక్కిల్, పీవీపీ మాల్, పటమట సబ్ రిజిస్ట్రార్, ఆదాయ పన్ను కార్యాలయాలు, రెవెన్యూ కాలనీలోని వివిధ అంతర్గత రహదారుల్లో ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారు. పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు పాదచారులు భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సంస్థలు కొన్నింటికి సెల్లార్లు ఉన్నా.. కొంతమంది ఉన్నా వాహనాలను అనుమతించడం లేదు. వాటర్ ట్యాంక్ రోడ్డులో గురువారం ఉదయం వేళ నగరపాలక సంస్థ సిబ్బంది నరికిన కొమ్మలను ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు నిలిచిపోతున్నాయి. పక్కన వెళ్దామంటే పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు అడ్డంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

టిక్కిల్ రోడ్డులో వాహనాల పార్కింగ్

43 సంవత్సరాలుగా... ✆ 81252 65651
0866 2471617, 2477470
○ ఆటలు ○ పాటలు ○ రోబోటిక్స్
○ డ్రోన్ తయారీ ○ 3డి ప్రింటింగ్
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలని ఎదురుగా, విజయవాడ-7.

నృసింహునికి బంగారు తిరునామం బహూకరణ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామికి అలంకరించేందుకు విజయవాడకు చెందిన భక్తులు మండు శ్రీనివాస్, భాగ్యశ్రీ దంపతులు 24.990 గ్రాముల బంగారు తిరునామాన్ని బహూకరించారు. ఆలయంలో గురువారం ఈవో కోగంటి సునీల్‌కుమార్‌కు తిరునామాన్ని అందజేశారు. దీని విలువ రూ.2.40 లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు.

ఈవో సునీల్‌కుమార్‌కు తిరునామం అందజేస్తున్న భాగ్యశ్రీ, చిత్రంలో అర్చకులు రఘు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థల నిర్వాహకులు అగ్నిప్రమాదాల నివారణపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారులు తెలిపారు. సింగ్‌నగర్ పరిధిలోని పలు వ్యాపార సంస్థలు, పాఠశాలలను గురువారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి పరికరాలు పరిశీలించారు. ఆయా సంస్థల సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కలిగించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్షంగా డెమో ఇచ్చారు. డీఎఫ్‌వో మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

'స్మార్టు స్ట్రీట్' పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు వెంట నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్‌యూఎల్ఎం) 2.0 కింద 'స్మార్టు స్ట్రీట్'ను పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ యూసీడీ ప్రాజెక్టు అధికారి పి.వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు టౌన్ వెండింగ్ కమిటీ తీర్మానించినట్లు ప్రకటించారు. వీధి వ్యాపారుల జీవనోపాధితో పాటు, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు వీలుగా 'స్మార్టు స్ట్రీట్'లో గూడ్స్ అండ్ సర్వీసెస్‌కు సంబంధించిన 40 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హుల ఎంపిక కోసం ఈనెల 7వ తేదీ నుంచి 17 వరకు నగరపాలక సంస్థ, టౌన్ వెండింగ్ కమిటీ(టీవీసీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు వీధి వ్యాపారులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు, నేరుగా హాజరు కావాలని కోరారు. 18 ఏళ్లు పైబడిన వీధి వ్యాపారులు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అర్హులు. ఇప్పటికే వారు నగరపాలక సంస్థలో నమోదై ఉండాలి. తమ ఆధార్, రేషన్, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, 3 ఫొటోలతో యూసీడీ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి.

నగర సుందరీకరణను దెబ్బతీస్తే చర్యలు

సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర సుందరీకరణకు భంగం కలిగించే వారిపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగరంలోని ప్రకాశం బ్యారేజ్, పాతబస్తీ, బందరురోడ్డు, బెంజిసర్కిల్, రామవరప్పాడురింగ్ రోడ్డు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పలు రహదారులపై అడ్డగోలుగా భవన నిర్మాణాల వ్యర్థాలు వేస్తున్నారని, వీధుల్లో ఇబ్బందికరమైన రీతిలో కేబుల్ వేలాడదీస్తున్నారని తెలిపారు. అటువంటి చర్యలు నగర సుందరీకరణకు భంగం వాటిల్లేలా ఉంటున్నాయని అన్నారు. అందుకు కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు సచివాలయ సెక్రటరీలు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యర్థాలు తొలగించేలా చూడాలని, బాధ్యులపై తగు చర్యలకు సిఫార్సు చేయాలని అన్నారు. వివిధ ప్రాంతాల్లో పాడైపోయిన డివైడర్లు, ఫుట్‌పాత్‌లు, రహదారులపై గుంతలను గుర్తించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల సంతృప్తి

పటమట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని, సర్కారు పనితీరుపై అందరూ సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం 12వ డివిజన్ లోని అశోక్‌నగర్, రఘు గార్డెన్స్ రోడ్డులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబ సాధికార సారథి(కేఎస్ఎస్)గా ఉన్న ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తెదేపా నాయకులను ప్రజలు వారి కుటుంబ సభ్యులు మాదిరిగా ఇంట్లోకి ఆహ్వానిస్తూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, నాయకులు యలమంచిలి రవీంద్ర, మహ్మద్ ఖాలీక్, యార్లగడ్డ సుబ్బారావు, బోడపాటి శ్రీనివాసరావు, తుమ్మల శేషబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజా జీవనం ప్రశాంతంగా సాగుతున్నట్లుగా తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన రాణిగారితోట 18వ డివిజన్ 199వ బూత్ పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు ఇస్తున్న పథకాలు, వారి ఇబ్బందులను తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. రాణిగారితోటకు ప్రధాన సమస్యగా ఉన్న ట్రంక్ లైన్ డ్రైనేజీ పనులు ప్రారంభించారని, త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

లాభదాయక సాగుతోనే రైతులకు ఆర్థిక భరోసా

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అధిక దిగుబడి, తక్కువ కాలంలోనే పంట చేతికొచ్చే లాభదాయకమైన సాగు చేయాలని త్రిపుర ఫారెస్ట్ కన్జర్వేటర్, ఎన్‌సీఈ డైరెక్టర్ వి.ప్రసాదరావు సూచించారు. గురువారం నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న ఓ హోటల్లో అగార్-ఉడ్ మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రసాదరావు మాట్లాడుతూ ఈశాన్య ప్రాంతాల్లో విస్తారంగా అగార్ ఉడ్ సాగు చేస్తారని, గత పదేళ్ల నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లోనూ మొదలైందని తెలిపారు. దీనిని ఆయుర్వేదం, సౌందర్య పోషణ, ఔషధాల తయారీలోనూ వినియోగిస్తారన్నారు. వీటి సాగు చేయడం వల్ల రైతులు అత్యధిక ఆదాయం పొందొచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సాగును ప్రోత్సహిస్తోందన్నారు. మందిర సంస్థ ఛైర్మన్ జీవీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాదరావు, పక్కన శేషగిరి

'మెగా పీటీఎం 2.0' నిర్వహించాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10న మెగా పీటీఎం 2.0(పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా డీవైఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు.

ఆస్తి పన్ను సరిచేయండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని భవనాలు, ఖాళీ స్థలాలను గుర్తించి పన్నుల చెల్లింపు, విధింపు ప్రక్రియ పరిశీలించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన ఆదేశించారు. గురువారం ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి వారికి తగు సూచనలు చేశారు. నగరంలో ఖాళీ స్థలాలపై వీఎల్‌టీ చెల్లింపులను పరిశీలించాలన్నారు. ఖాళీ స్థలాల్లో ఇంటి నిర్మాణం జరిగిన పక్షంలో వీఎల్‌టీని ఆస్తి పన్నుగా మార్చాలని సూచించారు. నగరపాలక సంస్థ ప్రస్తుతం జారీ చేస్తున్న డిమాండ్ నోటీసులకు అనుగుణంగా ఇంటి పన్నుల విధింపు ప్రక్రియ లేనిపక్షంలో తిరిగి సరిచేయాలని అన్నారు. భవనాలపై అదనపు అంతస్తులు, గదులు నిర్మించిన పక్షంలో వాటిని గుర్తించి పన్నుల విధింపు పరిధిలోకి తేవాలని అన్నారు. ఇందుకు సంబంధించిన సర్వే ప్రక్రియను అడ్మిన్ సెక్రటరీలు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, బి.శ్రీనివాసరావు, ఏయూబీ. శర్మ, ఆర్ఐలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారని.. యజమాని కారు చోరీ

గుణదల(పటమట), న్యూస్‌టుడే : తనను ఉద్యోగం నుంచి తొలగించారని యజమానిపై కక్ష పెంచుకున్న పాత డ్రైవర్.. మూడేళ్ల తర్వాత తన వద్ద ఉన్న అదనపు తాళంతో అతని కారు చోరీ చేశాడు. మాచవరం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కారును, నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ మండలం ప్రసాదంపాడుకు చెందిన ఆంథోనీ కుమార్.. గతంలో మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన రామకృష్ణ ప్రసాద్ వద్ద డ్రైవర్‌గా పని చేశాడు. కారు యజమానికి ఆంథోనీ కుమార్ ప్రవర్తన నచ్చకపోవడంతో మూడేళ్ల కిందట అతడిని ఉద్యోగం నుంచి తొలగించి అబ్దుల్‌ఖాన్ అనే డ్రైవర్‌ను పెట్టుకున్నారు. ఆంథోనీ మానేసిన సమయంలో కారు అదనపు తాళం తన వద్దే ఉంచుకున్నాడు. అబ్దుల్‌ఖాన్ బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ వద్దకు రాగా.. సెల్లార్‌లోని పార్కింగ్‌లో ఉన్న కారు కనిపించలేదు. యజమాని రామకృష్ణ ప్రసాద్ సూచన మేరకు అబ్దుల్‌ఖాన్ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ పరిశీలించి కారును చోరీ చేసింది ఆంథోనీగా గుర్తించారు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో అతని ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి రామవరప్పాడులో కారుతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మూడేళ్ల కిందట తనను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారన్న కోపంతోనే కారును చోరీ చేసినట్టు నిందితుడు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పవర్ చూపించి.. పతకాలు సాధించి..

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై గురి పెట్టిన చంద్రిక

న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

నగరంలో పాతరాజరాజేశ్వరి పేటకు చెందిన బొల్లినేని చంద్రిక(30) పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతున్నారు. వివాహమై ఓ పాపకు తల్లిగా ఉంటూనే భర్త ప్రోత్సాహంతో నిత్యం సాధన చేస్తూ పతకాలు సాధిస్తున్నారు. ఈ క్రమంలో వెన్నుకు గాయమైనప్పటికీ గత నెల 22 నుంచి 30వ తేదీ వరకు కర్ణాటకలోని దావణగిరిలో జరిగిన జాతీయ సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తలపడి ఓవరాల్ రజత పతకం కైవసం చేసుకున్నారు.

కొనసాగుతున్న విజయపరంపర..

ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం ఫగ్వారలోని ఎల్‌పీయూలో జరిగిన జాతీయ క్లాసికల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఓవరాల్ కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ★ 2012లో హైదరాబాద్‌లో జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి-84 కేజీల కేటగిరీలో ఓవరాల్ పసిడి పతకం కైవసం చేసుకున్నారు. దీంతో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ లూర్ధురెడ్డి ప్రోత్సహించారు. పౌష్టికాహారం కోసం నెలకు రూ.1,000 చొప్పున ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నారు. చంద్రికకు శిక్షణనిచ్చేందుకు కళాశాలలోనే ఓ శిక్షకుడిని నియమించారు. ★ 2016లో జంషెడ్‌పూర్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో తొలిసారిగా బరిలోకి దిగి-84 కేజీల కేటగిరీలోను, 2017లో దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు. 2018లో రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్ జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో 85 కేజీల శరీర బరువు ఉన్న చంద్రిక.. 84+ కేజీల కేటగిరీలో కాంస్య పతకంతో రాణించారు. 2019 మార్చిలో ఆస్ట్రేలియాలో జరిగిన పోటీల్లో పసిడి పతకం అందుకున్నారు. ★ 2022లో అనకాపల్లిలో జరిగిన సౌత్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో 84+ కేటగిరీలో 460 కేజీల బరువెత్తి రజత పతకం సొంతం చేసుకున్నారు. ★ పలు పోటీల్లో ఎక్కువ పసిడి పతకాలు కైవసం చేసుకోవడంతో పాటు 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' టైటిల్స్ సొంతం చేసుకున్నారు. ★ గత ఏడాది మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ క్లాసికల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, ఆగస్టులో కోల్‌కతాలో జరిగిన జాతీయ సీనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, డిసెంబరులో న్యూదిల్లీలో జరిగిన ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఓవరాల్ పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. ప్రపంచ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నానని బొల్లినేని చంద్రిక తెలిపారు.

21న విద్యుత్తు ఉద్యోగుల 'చలో విజయవాడ'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యుత్తు ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీన 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు బి.రామలింగారెడ్డి, మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం వారు ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై అనేక ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా.. పరిష్కారం కావడం లేదని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు.

రమేష్ కుమార్ కుటుంబానికి కేంద్ర మంత్రి పరామర్శ

కృష్ణలంక, న్యూస్‌టుడే: గత నెల 9వ తేదీన మృతి చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిశెట్టి రమేష్ కుమార్ కుటుంబాన్ని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి రామ్‌దాస్ అథావలే గురువారం పరామర్శించారు. కృష్ణలంక 22వ డివిజన్ గంగానమ్మగుడి వీధిలో ఉన్న రమేష్ కుమార్ నివాసానికి వెళ్లి.. రమేష్ చిత్రపటానికి నివాళులర్పించారు. రమేష్‌కుమార్ సతీమణి సాయి ప్రత్యూష, తల్లిదండ్రులు నరసింహారావు, కనకదుర్గలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రమేష్ కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలే

గవర్నర్‌ను కలిసిన ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ

ఈనాడు, అమరావతి: గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ రాజ్‌భవన్‌లో గురువారం కలిశారు. వర్సిటీ ప్రగతి, తాజా పరిస్థితిని వీసీ ఆయనకు వివరించారు. ఈ ఏడాది నిర్వహించాల్సిన స్నాతకోత్సవ తేదీ ఖరారు, ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సొంత ప్రాంగణం, అమరావతిలో వైద్యకళాశాల నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపు ప్రతిపాదనపైనా చర్చించారు. నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులైన ఎం.జయచంద్ర నాయుడు, ఎస్.సురేష్‌బాబు, వై.సాయికిషోర్, జి.సుబ్బారావు, కె.మాధవి, సీహెచ్ సుధాకర్, టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డిలను గవర్నర్‌కు వీసీ పరిచయం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యాటర్ల విజృంభణ

❖ ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ మల్టీ డే క్రికెట్ టోర్నీ

అభినవ్ (139 నాటౌట్)

రోహిత్ (84)

లేఖాజ్‌రెడ్డి (70)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మూలపాడులోని ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో గురువారం ప్రారంభమైన ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ అంతర్ జిల్లాల మల్టీ డే క్రికెట్ టోర్నీలో తొలి రోజే ప్రకాశం జట్టు బ్యాటర్లు విజృంభించారు. సీపీ మైదానంలో ప్రకాశం, కృష్ణా జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు.. తొలి రోజు ఆట నిలిపే సమయానికి 83 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 388 పరుగులతో కొనసాగుతోంది. జట్టులో ఎం.అభినవ్(139 నాటౌట్), పీవీ పవన్‌కుమార్(73 నాటౌట్) క్రీజ్‌లో నిలవగా.. గుత్తా రోహిత్(84), ఎం.లేఖాజ్‌రెడ్డి (70) రాణించారు. ప్రత్యర్థి బౌలర్ వై.ప్రమోద్(3/57) మెరిశాడు. డీవీఆర్ మైదానంలో ప్రారంభమైన మరో మ్యాచ్‌లో గుంటూరు, పశ్చిమ గోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు 54 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. జట్టులో బి.మునీష్‌వర్మ(87) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు ఎ.ప్రణయ్‌కుమార్(3/46), సీహెచ్ సిద్ధార్థ(3/18) మెరిశారు. అనంతరం తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 30 ఓవర్లలో వికెట్‌ను కోల్పోకుండా 121 పరుగులతో కొనసాగుతోంది. జట్టులో కె.మహీప్‌కుమార్(68), ఎం.వంశీ(52)లు నాటౌట్‌గా నిలిచారు.

పీవీ పవన్‌కుమార్ (73 నాటౌట్)

6న రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక నలంద విద్యా నికేతన్‌లో ఈ నెల 6వ తేదీన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ నిర్వహిస్తామని ది విజయవాడ చెస్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్ తెలిపారు. ఈ పోటీలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు తలపడతారని పేర్కొన్నారు. ఈ పోటీలు అండర్-6, 8, 10, 12, 14, 16 కేటగిరీల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరుగుతాయని వివరించారు. తొలి అయిదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు బహూకరిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని 16 ఏళ్ల లోపు గల పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 90303 08811 నంబరును సంప్రదించాలన్నారు.

జాతీయ చదరంగ పోటీలో సత్తా

ట్రోఫీ, ప్రశంసా పత్రంతో కార్తీక్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన కూచిభొట్ల వెంకట కృష్ణకార్తీక్ ప్రత్యేక విభిన్న ప్రతిభావంతుల 5వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటి విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు విజయనగరంలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో 15 రాష్ట్రాలకు చెందిన 101 మంది క్రీడాకారులు తలపడ్డారు. వీరిలో సుమారు 25 మంది వీల్‌ఛైర్ క్రీడాకారులు పాల్గొనడం విశేషం. మొత్తం తొమ్మిది రౌండ్ల పాటు జరిగిన ఈ పోటీలో కార్తీక్.. ఏడు రౌండ్లు విజేతగా, రెండు రౌండ్లు డ్రా చేసుకోవడంతో మొత్తం ఎనిమిది పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచాడు. విజేతగా నిలిచిన కార్తీక్, కోచ్ ఎస్కే ఖాసీంను పలువురు అభినందించారు.

దుర్గమ్మకు వెండి పట్టీల బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన హెచ్ శశికళ 255గ్రాముల బరువు ఉన్న వెండి పట్టీల జతను గురువారం బహూకరించారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. తొలుత వెండి పట్టీలు అమ్మవారి చెంత ఉంచి పూజ చేయించిన తరువాత ఈవో శీనానాయక్‌కు అందజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే భవిత

మాట్లాడుతున్న ఈగల్ ఐజీ రవికృష్ణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఈగల్ ఐజీ రవికృష్ణ పిలుపునిచ్చారు. 'డ్రగ్స్ వాడకం.. దుష్పరిణామాల'పై గురువారం ఆంధ్ర లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భయంకర వ్యసనంగా మారిందన్నారు. దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందన్నారు. ఈగల్ ఎస్పీ నగేష్ మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియా.. ప్రధానంగా యువతను టార్గెట్ చేసుకుందని తెలిపారు. డీసీపీ సరిత మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడిక, అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ మల్లవరపు బాలలత, వైస్ ప్రిన్సిపల్ జి.కిరణ్‌కుమార్, రెక్టార్ ఫాదర్ పీఆర్ జాన్, ఫాదర్లు బొల్లినేని బాలా, మెల్చియర్, సురేష్, రాయప్ప, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉప్పు, శాఖ వీధిలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రాజు ఆధ్వర్యంలో వివిధ మతాల పెద్దలతో గురువారం 'సురక్ష డిజిటల్' కార్యక్రమం నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని మసీదులు, చర్చులు, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఏమైనా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఆలయాలపై దాడి జరిగిన వెంటనే వారిని గుర్తించి పట్టుకోవచ్చని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు అన్ని ప్రార్థన మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే జగ్గయ్యపేట, మండలంలోని గ్రామాల్లో సుమారు 511 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. దీనికి మతపెద్దలు స్పందించి త్వరలోనే అన్ని ప్రార్థన మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. పోలీస్ సిబ్బంది, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ఇన్‌ఛార్జి డీవైఈవోపై విచారణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం ఇన్‌ఛార్జి డీవైఈవో డి.సాంబశివరావుపై విజయవాడ డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) నిర్మలారాణి విచారణ నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఎంఈవోగా పనిచేస్తున్న సాంబశివరావు నందిగామ, తిరువూరు ఇన్‌ఛార్జి డీవైఈవోగా పనిచేస్తున్నారు. ఆయన స్థానిక కార్యాలయంలో అందుబాటులో ఉండకుండా, సంతకాల కోసం విజయవాడకు వెళ్లాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశంతో నిర్మలారాణి విచారణ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీపీ కిషోర్, పీఆర్టీయూ, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు రెగ్యులర్ డీవైఈవోను నియమించాలని వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఇన్‌ఛార్జి డీవైఈవో మార్చాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

❖ కంచికచర్ల ఆర్టీసీ కాలనీలో కమ్యూనిటీ భవనం సమీపంలో వీధి దీపం వెలగడం లేదని కాలనీకి చెందిన రమణారావు చేసిన ఫిర్యాదుకు విద్యుత్ శాఖ ఏఈ దిబ్బయ్య స్పందించి కొత్త దీపం వేయించారు.
❖ గండేపల్లి బీసీ కాలనీలో కుళాయి ట్యాప్ విరిగిపోవడంతో తాగునీరు వృథాగా పోతుందని కాలనీకి చెందిన జోగారావు ఫిర్యాదు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ ట్యాప్ మార్చారు. ❖ పేరకలపాడు ఎస్సీ కాలనీలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని కాలనీకి చెందిన సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ జలీల్ స్పందించి, సిబ్బందితో చెత్త తీయించారు. - న్యూస్‌టుడే, వీరులపాడు

గొయ్యికి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక సీఎం రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న గొయ్యికి పురపాలక సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ సమస్యపై గత నెల 28న 'ఈనాడు'లో రోడ్డు మలుపులో ప్రమాదకర గొయ్యి' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు స్పందించి.. మరమ్మతులు చేయించారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు సాధించాలి

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి సెక్టార్ వారీగా స్థూల ఆదాయాన్ని పెంచే విధానాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హాజరై మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్ వంటి వ్యవసాయ ఆధారిత రంగాల అభివృద్ధి ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ విభాగాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లక్ష్యాలను సాధించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో జి.నితిన్, ఎంఆర్‌వో మనోహర్, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పలకరించి.. పైర్లు చిగురించి!

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ ఖరీఫ్‌లో వరుణ దేవుడు కరుణించాడు. జూన్ మొదటి వారంలోనే రైతులు పొలాలు దున్ని సాగుకు శ్రీకారం చుట్టారు. పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము విత్తనాలు వేశారు. తరువాత కొద్ది రోజుల పాటు బెట్ట కారణంగా అవి మొలకెత్తక ఆందోళన చెందారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆయా పైర్లకు జీవం పోశాయి. వంగ, బెండ తదితర కూరగాయ తోటలకు చినుకులు ఉపకరించాయి. వైరా, కట్టలేరుకు ముందుగానే వరద చేరింది. ప్రస్తుతానికి నియోజకవర్గంలో పత్తి 2559 హెక్టార్లు, మొక్కజొన్న

వంగ మొక్కలు

666, పెసర 544, మినుము 270 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. ఈ నెలాఖరుకు విస్తీర్ణం పెరగనుంది. జోర్లు పదునుకు కొందరు రైతులు పొలాల్లో ఎరువులు చల్లుతున్నారు. సొసైటీల్లో రాయితీపై యూరియా, డీఏపీ తదితర ఎరువులను అందుబాటులో ఉంచారు. వర్షాలకు భూమిలో తేమశాతం ఉండటంతో మొక్కజొన్న తదితర పంటలకు ఎరువులు వేస్తున్నారు. కలుపుతీత పనుల్లో కూలీలు నిమగ్నమయ్యారు. మునేరు, నల్లవాగు, కాచి వాగులకు నిండుగా నీరొస్తే ఈ ఖరీఫ్‌లో సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు.

మాగల్లు సొసైటీకి వచ్చిన ఎరువులు

కాఫీ, టీలకే పరిమితమా..!

మండల పరిషత్తు సమావేశం నిర్వహణపై సభ్యుల ఆగ్రహం

మాట్లాడుతున్న సర్పంచి కోటేశ్వరరావు, వేదికపై ఎంపీపీ రమాదేవి, జడ్పీటీసీ బాబు

నందిగామ, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం కేవలం సభ్యులకు కాఫీ, టీలు, బిస్కెట్లు ఇవ్వడానికే సరిపోతుందని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులు తరచూ సమావేశాలకు గైర్హాజరు అవుతుండటంతో తాము వచ్చినా ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు అప్పా పిచ్చయ్య, ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య, సర్పంచి మేడా కోటేశ్వరరావు మాట్లాడుతూ తాము ప్రస్తావిస్తున్న సమస్యలను విని పరిష్కరించేందుకు అధికారులు ఉండట్లేదన్నారు. గత రెండు సమావేశాలుగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ సాగు చేసేందుకు 1061 వరి విత్తనాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అందుబాటులోకి తేవాలని సర్పంచి కోటేశ్వరరావు కోరారు. అలాగే ధాన్యం బకాయిలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు(బాబు), మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు ఆకుల హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

నందిగామ, న్యూస్‌టుడే: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 4 నుంచి పురపాలక సంఘ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారు గోపాల్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో కలిసి గురువారం మున్సిపల్ కమిషనర్ లోవరాజుకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం రక్షిత మంచినీటి ట్యాంకుల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కార్మికుల వేతనం నెలకు రూ. 26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. విజయవాడలో 4న నిర్వహించే ధర్నాలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మిక సంఘ అధ్యక్షుడు పరిమి రవి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కోశాధికారి కండెల శ్రీను, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ లోవరాజుకు సమ్మె నోటీసు అందజేస్తున్న గోపాల్, కార్మికులు

జాతీయస్థాయి సమావేశంలో జగ్గయ్యపేట ఛైర్మన్

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రం గురుగ్రామ్‌లో గురువారం నుంచి నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి మున్సిపల్ ఛైర్మన్ల సమావేశంలో జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. 'సంవిధాన్ కే ప్రజాస్వామ్యం, జాతీయ నిర్మాణాల్లో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించారు. హరియాణా సీఎం నయబ్‌సింగ్ సైని దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఛైర్మన్లను ఆహ్వానించారు. కార్యక్రమంలో రంగాపురం రాఘవేంద్రకు 21వ శతాబ్ద భారత నిర్మాణంలో మున్సిపల్ సంస్థల పాత్ర, వికసిత్ భారత్ - 2047 లక్ష్య సాధనలో వాటి సహకారం అనే అంశంపై చర్చించేందుకు అవకాశం కల్పించారు. రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట మున్సిపాలిటీలో శానిటేషన్, పచ్చదనం, మున్సిపల్ ఖాళీ స్థలాల వినియోగం, మురుగునీటి నిర్వాహణ తదితర కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న రాఘవేంద్ర

తక్కువ ధరకు వర్మీకంపోస్టు అందించేలా ప్రణాళికలు

కంచికచర్ల, న్యూస్‌టుడే: వర్మీ కంపోస్టు ఎరువులను రైతులకు తక్కువ ధరకు అందించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మండలంలో గురువారం ఆయన పర్యటించారు. కీసర-గండేపల్లి రహదారిలో కాలువలు లేకపోవడంతో మురుగు, వర్షపు నీరు రహదారిపై నిలుస్తోందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా. . వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కంచికచర్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ విధానాన్ని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 286 గ్రామ పంచాయతీల్లో 264 సంపద కేంద్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కంచికచర్ల కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

కాలుష్యం నుంచి భూములను కాపాడాలని వినతి

పరిటాల (కంచికచర్ల), న్యూస్‌టుడే: తమ భూములను సాగుకు పనికిరాకుండా చేస్తున్న క్వారీ యజమానుల ఆగడాలను అరికట్టి, తమకు న్యాయం చేయాలని పరిటాల రైతులు కలెక్టర్ జి.లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. గురువారం మండల పర్యటన ముగించుకొని తిరిగి వెళ్తున్న కలెక్టర్‌ను జాతీయ రహదారిపై పరిటాల వద్ద రైతులు ఆపి వారి సమస్యలు విన్నవించారు. గ్రామ సమీపంలోని క్వారీ యజమానులు నిబంధనలు పాటించకపోవడంతో కొన్నేళ్లుగా తమ భూములు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. పంటలు పండటం లేదని వాపోయారు. ప్రధాన సాగునీటి వనరులుగా ఉన్న ఎన్నెస్పీ కాలువ, కాచేటి వాగులను ఆక్రమించి రహదారి నిర్మించారని ఆరోపించారు. పరిశీలించి, తగు న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. నిబంధనలు పాటించని క్వారీ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కె.బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నీటి సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ శివారు అనాసాగరానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు చలమల కృష్ణ.. నీటి సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. శనగపాడు సప్లై ఛానల్ నీటి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన రాజీనామా విషయం చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రామంలో పార్టీ కోసం కష్టపడిన తమను అధికారంలోకి వచ్చాక, ముఖ్య నాయకులు పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ సంచుల వినియోగంతో పర్యావరణానికి హాని

నందిగామ, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగంతో పర్యావరణానికి నష్టం కలుగుతుందని పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. నందిగామలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్‌ల రహిత దినం సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్‌తో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత ఆరోగ్యకర సమాజాన్ని అందించేందుకు వ్యాపారులు సహకరించాలని కోరారు. దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయించిన, వినియోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న దుర్గాప్రసాద్

కూటమితోనే అభివృద్ధి.. సంక్షేమం

కాకానినగర్‌లో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతి బాటలో నడుస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని కాకానినగర్‌లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కాకానినగర్‌లో ఉన్న నాలుగు ఇనుప స్తంభాల వల్ల ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. వెంటనే ఎలక్ట్రికల్ ఏడీ, ఏఈలను పిలిపించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు వేయాలని ఆదేశించారు. మైనేని రాధాకృష్ణ, మనోహర్, భోజరాజు, భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

❖ చిల్లకల్లు గ్రామంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందరికి సరిగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు.

చందర్లపాడు, న్యూస్‌టుడే: చందర్లపాడు, తుర్లపాడు గ్రామాల్లో తెదేపా నాయకులు గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి ఏడాది పాలనలో చేపట్టిన పనులు, అమలు చేసిన హామీలను వివరించారు. వీరబాబు, మేకల సుధాకర్, చినప్రభు పాల్గొన్నారు.

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ సూపర్-6 పథకాల అమలుపై ప్రజలు సంతోషంగా ఉన్నారని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తెలిపారు. గురువారం రాత్రి అడవిరావులపాడు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సజ్జా అజయ్, బండారు రోశయ్య, మరియదాసు, నరసింహారావు పాల్గొన్నారు.

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని జుజ్జూరు గ్రామంలో గురువారం నిర్వహించారు. కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

తుర్లపాడులో..

జుజ్జూరులో..

ఏకీకృత సర్వీసు రూల్స్ అమల్లోకి తేవాలి: ఎస్టీయూ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏకీకృత సర్వీసు రూల్స్‌ను అమల్లోకి తెచ్చి.. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీపీ కిషోర్ కోరారు. గురువారం నందిగామ, అడవిరావులపాడు, లింగాలపాడు, చెర్వుకొమ్ముపాలెం, పెద్దవరం, చందాపురం, ఐతవరం గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖలో ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య మాట్లాడుతూ మండల విద్యాధికారుల వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. వీసం శ్రీధర్, మేకపోతుల రామకృష్ణ, ఏకే జిలాని తదితరులు పాల్గొన్నారు.

లింగాలపాడులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు ప్రచారం మండల పరిధి గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ టీవీఎల్ నరసింహారావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీహరి మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించి.. ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్స్, సంపాదిత సెలవులు, మెడికల్ బిల్లు, ఆర్థిక బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. రాజేంద్ర, జె.వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ పోలీసుస్టేషన్‌లో కొన్నేళ్ల పాటు పనిచేసి వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఆరుగురు కానిస్టేబుళ్లను సీఐ వైవీవీఎల్ నాయుడు సన్మానించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం వారికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు.

మహాత్మా జ్యోతిబా ఫులే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల
కొండపల్లి- ఎన్టీఆర్ జిల్లా తేది: 04-07-2025

షార్ట్ టెండర్ ప్రకటన

ఎన్టీఆర్ జిల్లాలో గల MJP AP వెనుకబడిన తరగతుల పాఠశాలలైన మైలవరం (కొండపల్లి), జగ్గయ్యపేట(వత్సవాయి)లకు 2025-2026 సంవత్సరమునకు 1) కూరగాయలు 2) వివిధ రకాల పండ్లు 3) కోడిగుడ్లు 4) చికెన్ (స్కిన్ లెస్ - VENCOB)లను సప్లై చేయుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.

టెండర్ ఫారములు ది.04-07-2025 నుండి 10-07-2025 సాయంత్రం 5.00 గంటల వరకు మైలవరం (కొండపల్లి) స్కూలులో లభ్యమగును, ధరావత్తు సొమ్ము టెండరుకు సంబంధించిన పూర్తి వివరములు టెండరు ఫారం నందు పొందుపరచడమైనది.

పూర్తి చేసిన సీల్డ్ టెండరు ఫారములు ది.10-07-2025 సాయంత్రం 5.00 గంటల వరకు మైలవరం (కొండపల్లి) గురుకుల పాఠశాల యందు ఉంచిన టెండరు బాక్స్‌లలో వేయవలెను. ది.11-07-2025న మధ్యాహ్నం 3-00 గంటలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయము, విజయవాడ నందు జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులు, హాజరైన టెండరు దారులు సమక్షంలో టెండరు బాక్స్‌లు తెరచి నెగోషియేషన్ జరిపి టెండర్లు ఖరారు చేయబడును. టెండరు జరుగు తేది మార్పు చేయుటకు లేదా రద్దు చేయుటకు శ్రీయుత జాయింట్ కలెక్టర్, ఛైర్మన్ D.P.C. విజయవాడ వారికి పూర్తి అధికారం కలదు.

ఇతర వివరములకు ఈ క్రింది వారిని సంప్రదించగలరు.
ఇట్లు: **కె. రామమోహనరావు,** కన్వీనర్ & ప్రిన్సిపాల్
MJP AP BCWR స్కూల్ (బాలురు)
మైలవరం (కొండపల్లి), ఎన్టీఆర్ జిల్లా. ఫోన్ నెంబర్ : 85559 08091

5న జాతీయ లోక్ అదాలత్

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నందిగామలో ఈ నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక జిల్లా 16వ అదనపు న్యాయమూర్తి కోర్టు న్యాయాధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఏడీజే కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న అన్ని రకాల కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి లక్ష్మీప్రసన్న, జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి షేక్ రియాజ్, సీఐలు వైవీవీఎల్ నాయుడు, చవాన్, ఏపీపీ మణికంఠ, అడిషినల్ పీపీ కాట్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏడీజే శ్రీనివాసరావు

సేవా సమితి సభ్యుడు, ఎస్ఐలపై కేసు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ శ్రీఆంజనేయస్వామి, ఆనందసాయి ఆలయంలో అక్రమాలకు పాల్పడిన శిర్డీ ఆనందసాయి సేవా సమితి సభ్యుడు నకిరికంటి శ్రీనివాసరావు, వారి అనుచరులకు సహకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ బీవీ రామారావులపై.. జగ్గయ్యపేట పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరిపై జగ్గయ్యపేట కోర్టులో గండికోట శ్రవణ్‌కుమార్ అనే న్యాయవాది గత ఏడాది పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జగ్గయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢ సారె

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులోని లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి అదే గ్రామానికి చెందిన భక్త బృందం గురువారం ఆషాఢ సారె సమర్పించింది. అమ్మవారి ప్రతిమతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని సారె సమర్పించారు.

సారె తీసుకొస్తున్న మహిళలు

వారాహి అమ్మవారికి అభిషేకం

నందిగామ గ్రామీణం: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామ శివారు అనాసాగరం కాదంబరి శ్యామక ఆశ్రమంలో గురువారం అమ్మవారికి పసుపుతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆశ్రమ మాతాజీ శ్రీదేవి హారతి ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలేరు ఒడ్డున పునర్నిర్మాణంలో ఉన్న మఠం శివాలయానికి దాతలు గురువారం విరాళం అందించారు. సన్నే నాగేశ్వరరావు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సంయుక్తంగా రూ.4,11,116 విరాళాన్ని మఠం శివాలయ కమిటీ వారికి అందించారు.

కమిటీ వారికి విరాళం అందజేస్తున్న దాతలు

తిరుపతమ్మ ఆలయానికి ..

పెనుగంచిప్రోలు: విజయవాడ నగరం విజయనగర్ కాలనీ గుణదలకు చెందిన రావూరి సుబ్బారావు, అల్లూరమ్మ దంపతులు గురువారం తిరుపతమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను అమ్మవారి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు మన్నెం నరసయ్య, బద్దుల కృష్ణ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

వత్సవాయి, పెనుగంచిప్రోలు: కార్మికుల హక్కులను రక్షించుకునే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల తెలిపారు. గురువారం మండల సీఐటీయూ ఆధ్వర్యంలో వత్సవాయిలో పలు కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. మండల సీఐటీయూ కార్యదర్శి బి.రాము, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న కమల

కలప నిందితుల అరెస్టు

కంచికచర్ల, న్యూస్‌టుడే: అక్రమంగా కలప నరికిన కేసులో ఏడుగురు నిందితులకు నందిగామ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై బోనగిరి రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. పేరకలపాడు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఈ నెల 2న దొనబండ సమీపంలో మూతబడిన ఉమా హాలిడే ఇన్స్ రిసార్ట్‌లో ఉన్న కలపను అక్రమంగా నరికారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఏడుగురు నిందితులతో పాటు కలపతో రవాణాకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో పట్టుబడిన నిందితులు వైకాపాలో క్రియాశీలకంగా వ్యవహరించే వారని స్థానికులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీకి చెందిన వివాహిత అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అర్జున్ తెలిపారు. గత రెండు రోజులు క్రితం తన భార్య ఇద్దరు చిన్నపిల్లలను వదిలేసి ఇంటి నుంచి వెళ్లిపోయిందని.. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని భర్త పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన గుంజి హనుమంతరావుపై అదే గ్రామానికి చెందిన ఓర్సు దుర్గారావు దాడి చేసిన నేపథ్యంలో.. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అర్జున్ తెలిపారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
టౌన్ బ్రాంచి, నందిగామ, యన్‌టిఆర్ జిల్లా.

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (నెం. 3 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, టౌన్ బ్రాంచి, నందిగామ, కృష్ణా జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము రూ.8,30,091/- (అక్షరాల ఎనిమిదిలక్షల ముప్పైవేల తొంబైఒక్క రూపాయలు మాత్రమే) మరియు ది.26-02-2025 నుండి చెల్లించవలసిన వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత: శ్రీ నలబోతు కృష్ణ సుమంత్, తండ్రి: నరసింహరావు, వెంకటాపురం గ్రామం, పెనుగంచిప్రోలు (మం), యన్‌టిఆర్ జిల్లా-521190. (హెచ్‌యల్ అకౌంట్ నెం:62407554559. సురక్ష: 62407557538) వీరిని కోరుతూ ది:25-02-2025 వ తేదీన డిమాండు నోటీసును జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్థిని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు ఈ రోజున సింబాలిక్ స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు/ తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్థితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జీకి మొత్తం బకాయి రూ.8,30,091/- మరియు ది.26-02-2025 నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్థిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరము

యన్‌టిఆర్ జిల్లా, నందిగామ మండలం, నందిగామ గ్రామం, ఆర్‌యస్ నెంబర్లు: 634/1, 657/3, శ్రీ హనుమాన్ టవర్స్, 3వ అంతస్థు, ఫ్లాట్ నెం.402, ప్లింత్ ఏరియా 985 చ॥అడుగులు, కామన్ & పార్కింగ్ 105 చ॥అడుగులతోపాటు మొత్తం విస్తీర్ణం 1359.6 చ॥గ॥లలోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగము 37.1/2 చ॥గ॥లు కలిగిన ఆర్‌సిసి భవనము శ్రీ నలబోతు కృష్ణ సుమంత్, తండ్రి: నరసింహరావు గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.1229/2015, తేది:18-03-2015 నందిగామ జెయస్ఆర్ఒ, కృష్ణా జిల్లా.

అపార్ట్‌మెంట్ హద్దులు: తూర్పు: బజారు, దక్షిణం: బజారు, పడమర: గాదెల నరసింహారావు మొ॥లగు వారి ఇంటి స్థలం, ఉత్తరం: కుచ్చు నరసయ్య గారి ఇల్లు.

ఫ్లాట్ నెం.402 హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై

తేది : 30-06-2025 అధీకృత అధికారి
ప్రదేశం: నందిగామ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విజయవాడ పశ్చిమ

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థల నిర్వాహకులు అగ్నిప్రమాదాల నివారణపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారులు తెలిపారు. సింగ్‌నగర్ పరిధిలోని పలు వ్యాపార సంస్థలు, పాఠశాలలను గురువారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి పరికరాలు పరిశీలించారు. ఆయా సంస్థల సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కలిగించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్షంగా డెమో ఇచ్చారు. డీఎఫ్‌వో మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంవోహెచ్‌గా అర్జునరావు బాధ్యతల స్వీకరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ నూతన చీఫ్ మెడికల్ అధికారి(సీఎంవోహెచ్)గా కె.అర్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఇక్కడ బదిలీపై వచ్చారు. గతంలో నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అధికారిగా కొంతకాలం పనిచేశారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ అధికారిగా ఉన్న గోపాలకృష్ణ నాయక్ ఇక నుంచి యథావిధిగా సహాయవైద్య అధికారిగా విధులు నిర్వహించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? ఊర్మిళానగర్ పార్క్‌రోడ్డులో కుక్కల స్వైర విహారం అధికంగా ఉంది. -రమేష్, స్థానికుడు ✔ పరిశీలించి కుక్కలను పట్టేందుకు చర్యలు తీసుకుంటాం. -సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి

? కబేలా ప్రాంతంలో రెండు రోజులుగా మంచినీటి సరఫరా చేయడం లేదు. -గురుమూర్తి, స్థానికుడు

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

? కబేలా సాయిబాబా ఆలయం వెనుక వీధిలో రాత్రుల్లో మందు బాబుల హంగామా అధికంగా ఉంది. -కృష్ణ, స్థానికుడు

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

? పాలఫ్యాక్టరీ సమీపంలోని బస్టాప్ వద్ద పక్కకాలువలో పూడిక తీయడం లేదు. -చంద్రరావు, స్థానికుడు

✔ పరిశీలించి పూడిక తీయిస్తాం.

? చిట్టినగర్ కేబుల్‌రావు 2వ లైన్‌లో రోడ్డుపై మురుగు పొంగిపొర్లుతోంది. -శరత్‌కుమార్, స్థానికుడు

✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. -వెంకటగోపాల్, స్థానిక శానిటరీ అధికారి -విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

❖ భవానీపురం శివాలయం వీధిలో కుక్కల స్వైర విహారం అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై గురువారం వార్త ప్రచురితమైంది. స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు కుక్కలను పట్టారు.

❖ భవానీపురం పోలీసు స్టేషన్ వెనుక వీధిలో అర్ధరాత్రుల్లో ద్విచక్రవాహనాలు దొంగతనం అవుతున్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పోలీసులు గస్తీని పెంచారు.

❖ విద్యాధరపురం చెరువు సెంటర్ ఆర్టీసీరోడ్డులో పక్కకాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

❖ పూర్ణానందంపేట ఐదోలైన్‌లో పూడిక తీయక దుర్వాసన వస్తోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. - విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

శిలాఫలకం మార్చి.. గ్రహణం పట్టించి..!

వించిపేటలో అసంపూర్తిగా రైతుబజార్ నిర్మాణం
కూటమి ప్రభుత్వంపై ఆశలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గంలో పాతబస్తీ వాసులకు ఏళ్లుగా రైతుబజార్ కల నెరవేరడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2014-2019 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం పాతబస్తీ, సామారంగంచౌకీ కూడలి, కొత్తపేట, నెహ్రూబొమ్మ కూడలి, చిట్టినగర్, పాలఫ్యాక్టరీ, వించిపేట, తదితర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా రైతుబజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2017 డిసెంబర్ 11న రూ.39.40లక్షల అంచనా వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ శంకుస్థాపన చేశారు. 2019 ఎన్నికల నాటికే 95శాతం మేర పనులు చేశారు. చివరి దశ పనులు పూర్తి చేసి దుకాణాలను ప్రారంభించాలని భావించారు. ఈలోగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

స్వరూపం మారిన రైతుబజార్ భవనం

రూపురేఖలు మార్చేసిన వైకాపా..

2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవనం రూపురేఖల్ని మార్చేసింది. కొవిడ్ అనంతరం అప్పుడు మంత్రిగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు భవనంపై భాగంలో వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేసి రైతుబజార్ ఏర్పాటులో జాప్యం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏర్పాటు ముందుకు సాగడం లేదు. తెదేపా గుర్తులేవి ఉండకూడదనే ఉద్దేశ్యంతో శిలాఫలకం కూల్చేసి కొత్తగా వైకాపా హయాంలో ఏర్పాటు అయినట్లు శిలాఫలకాన్ని వేసి నిర్మాణం అంతా వైకాపా సారథ్యంలో జరిగినట్లు రాయించారు. భవన నిర్మాణంలోనూ మార్పులు చేశారు. భవనంలో కింద భాగంలో రైతుబజార్ ఏర్పాటు, మొదటి అంతస్తులో మీ-సేవా, ఈ-సేవా కేంద్రాలు, మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెదేపా ప్రభుత్వం భావించింది. వాటన్నింటిని వైకాపా సర్కార్ తుంగలో తొక్కింది.

రైతుబజార్ వివరాలు..
ప్రయోజనం: 45 వేల మందికి
డివిజన్‌లు: 51, 53, 54, 55, 56, 46, 47, 48, 49, 50
పనుల పూర్తి: 95 శాతం
దుకాణాల సంఖ్య: 15

అందుబాటులోకి తెస్తే మేలు..

2024 ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణం చేయడంతో, పాతబస్తీ వాసులకు రైతుబజార్‌పై ఆశలు చిగురించాయి. ఎమ్మెల్యే సుజనా చౌదరి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి రైతుబజార్ నిర్మాణ పనులు పూర్తిచేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, నాయకులు

పథకాలు రాకుంటే వచ్చేలా చూస్తాం

చిట్టినగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందజేస్తున్నామని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా అన్నారు. 48వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు బెవర జోగేశ్వరరావు ఆధ్వర్యంలో చిట్టినగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచిందని, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, ఇతర సమస్యలు ఇంటింటికీ వెళ్లి తెలుసుకుంటున్నామని చెప్పారు. ఎవరికైనా పథకాలు రాకపోతే, వారికి వచ్చే విధంగా చూస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రభుదాస్, పేరాబత్తుల రమణ, బంగారయ్య, బోయల కృష్ణ, నాగూర్, నాగమణి, సీత, తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి పాఠశాలలో వసతుల కల్పన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం స్మార్త, వేదపాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఈవో శీనానాయక్ అన్నారు. పోరంకిలోని దేవస్థానం పాఠశాలను ఈవో గురువారం తనిఖీ చేశారు. ఆర్వో ప్లాంట్, కిటికీలు, పిచ్చిమొక్కల తొలిగింపు, స్లాబు, మరుగుదొడ్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ షణ్ముఖశాస్త్రి, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ప్రిన్సిపల్ షణ్ముఖశాస్త్రి

వైభవంగా అమ్మవారికి ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు పెద్ద సంఖ్యలో మహిళలు గురువారం సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, పట్టువస్త్రాలు, మిఠాయిలు, పొంగళ్లను సంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. గుంటూరు, మంగళగిరి, గుడివాడ, పోరంకి, గవర్నరుపేట, భవానీపురం, చిట్టినగర్ ప్రాంతాల నుంచి మహిళలు బృందాలుగా ఏర్పడి సారె తెచ్చి అమ్మవారికి సమర్పించారు. దేవస్థానం సిబ్బంది వారికి ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. సామూహిక వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలను అందజేశారు.

కళావేదిక వద్ద ఊరేగింపుగా వచ్చిన మహిళలు

చిత్రసీమలో ఎస్వీఆర్ స్థానం సుస్థిరం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: తెలుగు చలన చిత్రసీమలో ఎస్వీఆర్ స్థానం సుస్థిరమని జనసేన ప్రచార కమిటీ కోఆర్డినేటర్ తిరుపతి సురేష్ అన్నారు. ఎస్వీఆర్ జయంతిని పురస్కరించుకుని కబేళా సెంటరు సమీపంలోని జనసేన కార్యాలయంలో గురువారం రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ పౌరాణిక, జానపద చిత్రాల్లో తనదైన శైలీలో నటించి కళాభిమానుల మనసు దోచుకున్న వ్యక్తి ఎస్వీఆర్ అని కొనియాడారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు అనూష, రాజేష్, ఆదిత్యారెడ్డి, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఎస్వీ రంగారావు విగ్రహానికి నివాళులర్పించిన కళాభిమానులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: తెలుగు చిత్రసీమలో మహానటుడు ఎస్వీ రంగారావు అని నటీ, నట, నాట్య వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడు హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్, ఎస్వీఆర్ సేవాసంస్థ సంయుక్తంగా తుమ్మలపల్లి కళా క్షేత్రం ప్రాంగణంలోని ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నరసింహారావు, హరగోపాల్, మల్లేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

‘స్మార్టు స్ట్రీట్’ పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు

వీధి వ్యాపారులకు దుకాణాల కేటాయింపు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భవానీపురం ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు వెంట నేషనల్ అర్బన్ లైవ్లీవుడ్ మిషన్-(ఎన్‌యూఎల్‌ఎం) 2.0 కింద ‘స్మార్టు స్ట్రీట్’ను పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ యూసీడీ ప్రాజెక్టు అధికారి పి.వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు టౌన్ వెండింగ్ కమిటీ తీర్మానించినట్లు ప్రకటించారు. వీధి వ్యాపారుల జీవనోపాధితో పాటు, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు వీలుగా ‘స్మార్టు స్ట్రీట్’లో గూడ్స్ అండ్ సర్వీసెస్‌కు సంబంధించిన 40 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హుల ఎంపిక కోసం ఈనెల 7వ తేదీ నుంచి 17 వరకు నగరపాలక సంస్థ, టౌన్ వెండింగ్ కమిటీ(టీవీసీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు వీధి వ్యాపారులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు, నేరుగా హాజరు కావాలని కోరారు. 18 ఏళ్లు పైబడిన వీధి వ్యాపారులు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అర్హులు. ఇప్పటికే వారు నగరపాలక సంస్థలో నమోదై ఉండాలి. తమ ఆధార్, రేషన్, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, 3 ఫొటోలతో యూసీడీ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి.

‘మెగా పీటీఎం 2.0’ నిర్వహించాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10న మెగా పీటీఎం 2.0(పేరెంట్స్, టీచర్స్ సమావేశం) నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా డీవైఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు.

క్షయపై అవగాహన అవసరం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని, అప్పుడే దాని నివారణ సాధ్యమవుతుందని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తపేట యూపీహెచ్‌సీలో క్షయవ్యాధిపై అవగాహన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.సల్మాఖాతూన్, టీబీ హెల్త్ విజిటర్ లలితకుమారి, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలుపాల్గొన్నారు.

అవగాహన పత్రం ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వరరావు

దుకాణదారులకు న్యాయం చేయాలి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: దుర్గాఘాట్ దుకాణదారుల అంశంలో ఆలయ ఈఓ కె.శీనానాయక్ పెద్ద మనస్సుతో వ్యవహరించి హాకర్లకు న్యాయం చేయాలని తెదేపా సీనియర్ నేత పిళ్లా సుదర్శన్‌రావు అన్నారు. పాతబస్తీలోని కొమలవిలాస్ సెంటర్ తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమస్యను ఆలయ ఈఓకు విన్నవించామని, ఆయన కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నేతలు మద్దెల హరి, మాదగాని శ్యామల, కనకాలు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంక్షేమ భవనానికి లిఫ్టు

భవానీపురం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పశ్చిమ శాసనసభ్యుడు సుజనాచౌదరి నిలబెట్టుకున్నారని శ్రీకామాక్షి స్వర్ణకార సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.భావన్నారాయణ పేర్కొన్నారు. వన్‌టౌన్‌లోని శ్రీ కామాక్షి స్వర్ణకార సంక్షేమ సంఘానికి చెందిన నాలుగు అంతస్తుల భవనానికి రూ.10లక్షలతో లిఫ్టును సుజనాచౌదరి ఏర్పాటు చేయించారని తెలిపారు. సంఘంలో 8వేల మంది సభ్యులు ఉన్నారని, భవనానికి లిఫ్టు లేకపోవటంతో ఇబ్బందిగా మారిందని సుజనాచౌదరిని కోరగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు.

న్యాయం చేయాలని నిరసన

విద్యాధరపురం, న్యూస్‌టుడే: జోజినగర్ కరెంట్ ఆఫీసు రోడ్డులో నివాసముంటున్న 42 మందిని ఖాళీ చేయాలని బెదిరించడానికి వ్యతిరేకంగా ప్లాట్ల యజమానులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. 24 ఏళ్ల క్రితం ప్లాట్లు కొని ఇళ్లు కట్టుకున్నప్పుడు అడగని వాళ్లు ఇప్పుడు స్థలం తమదని బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. ఈప్రాంతంలో స్థలం యజమాని ఒకే స్థలాన్ని ఇద్దరు, ముగ్గురికి అమ్మిన ఘటనలు ఉన్నాయని, 2001లో రెండు ఎకరాల్లో వెంచర్ వేయగా తాము కొన్నామని, ఇప్పుడు కొందరు రాజకీయ పార్టీల పేర్లు చెప్పి తమను బెదిరిస్తున్నారని వాపోయారు.

ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గగుడిలో క్లీనింగ్ విభాగంలో పనిచేసే తాడిశెట్టి రామారావు(45) కనిపించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఉప్పరపాలెంకు చెందిన రామారావు క్లీనింగ్ పనుల నిమిత్తం అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా జున్ 1న దుర్గగుడిలో చేరారు. రాత్రి వేళల్లో భార్యభర్తలు మల్లికార్జున మహామండపం మూడో అంతస్తులో ఉంటున్నారు. జూన్ 15న ఉప్పరపాలెం వెళ్లాలనుకున్న రామారావు డ్యూటీకి వెళ్లారు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో విచారించిన అనంతరం భార్య శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

నగర సుందరీకరణను దెబ్బతీస్తే చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర సుందరీకరణకు భంగం కలిగించే వారిపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగరంలోని ప్రకాశం బ్యారేజ్, పాతబస్తీ, బందరురోడ్డు, బెంజిసర్కిల్, రామవరప్పాడురింగ్ రోడ్డు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పలు రహదారులపై అడ్డగోలుగా భవన నిర్మాణాల వ్యర్థాలు వేస్తున్నారని, వీధుల్లో ఇబ్బందికరమైన రీతిలో కేబుల్ వేలాడదీస్తున్నారని తెలిపారు. అటువంటి చర్యలు నగర సుందరీకరణకు భంగం వాటిల్లేలా ఉంటున్నాయని అన్నారు. అందుకు కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు సచివాలయ సెక్రటరీలు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యర్థాలు తొలగించేలా చూడాలని, బాధ్యులపై తగు చర్యలకు సిఫార్సు చేయాలని అన్నారు. వివిధ ప్రాంతాల్లో పాడైపోయిన డివైడర్లు, పుట్‌పాత్‌లు, రహదారులపై గుంతలను గుర్తించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

దాత మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు రశీదు అందజేస్తున్న ఈవో శీనానాయక్

అన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు రూ.1,01,000 విరాళాన్ని గురువారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శీనానాయక్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆస్తి పన్ను సరిచేయండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని భవనాలు, ఖాళీ స్థలాలను గుర్తించి పన్నుల చెల్లింపు, విధింపు ప్రక్రియ పరిశీలించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన ఆదేశించారు. గురువారం ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి వారికి తగు సూచనలు చేశారు. నగరంలో ఖాళీ స్థలాలపై వీఎల్‌టీ చెల్లింపులను పరిశీలించాలన్నారు. ఖాళీ స్థలాల్లో ఇంటి నిర్మాణం జరిగిన పక్షంలో వీఎల్‌టీని ఆస్తి పన్నుగా మార్చాలని సూచించారు. నగరపాలక సంస్థ ప్రస్తుతం జారీ చేస్తున్న డిమాండ్ నోటీసులకు అనుగుణంగా ఇంటి పన్నుల విధింపు ప్రక్రియ లేనిపక్షంలో తిరిగి సరిచేయాలని అన్నారు. భవనాలపై అదనపు అంతస్తులు, గదులు నిర్మించిన పక్షంలో వాటిని గుర్తించి పన్నుల విధింపు పరిధిలోకి తేవాలని అన్నారు. ఇందుకు సంబంధించిన సర్వే ప్రక్రియను అడ్మిన్ సెక్రటరీలు క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, బి.శ్రీనివాసరావు, ఏయూబీ. శర్మ, ఆర్‌ఐలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు వెండి పట్టీల బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన హెచ్ శశికళ 255గ్రాములు బరువు ఉన్న వెండి పట్టీల జతను గురువారం బహూకరించారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. తొలుత వెండి పట్టీలు అమ్మవారి చెంత ఉంచి పూజ చేయించిన తరువాత ఈవో శీనానాయక్‌కు అందజేశారు.

ముక్కకాదు.. పిక్కచాలు..!

- వాహనాల వెంట పడుతున్న కుక్కలు
- నిత్య ఘటనలతో ప్రజల బెంబేలు

భవానీపురం, న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రహదారులపై కుక్కలు స్వైరవిహారం చేస్తూ పాదచారులు, వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. పదుల సంఖ్యలో కుక్కలు గుంపుగా చేరి చిన్నారులు, మహిళలు, వృద్ధులపైకి ఎగబడి గాయపరుస్తున్నాయి. తరచూ చోటుచేసుకుంటున్న ఘటనలతో జనం రోడ్లపైకి రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా పాఠశాలలు ఉన్న ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. జక్కంపూడి వైఎస్ఆర్‌కాలనీలో ఇటీవల పలువురిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అందులో చిన్నారులు గాయపడ్డారు. భవానీపురం హెచ్‌బీకాలనీ ప్రాంతంలోనూ ఇటీవల చిన్నారులు గాయపడ్డారు. ఇలా ఎక్కడో ఒకచోట కుక్కకాటులు నిత్యకృత్యమయ్యాయి.

హెచ్‌బీకాలనీలో రహదారిపై వాహనాల మధ్య గుంపుగా కుక్కలు

ఇటీవల కుక్కల దాడిలో ఓ చిన్నారి కాలుకు గాయం

దృష్టి సారించని అధికారులు..

కుక్కల బెడద ఉందని నిత్యం నగరపాలక సంస్థలోని ఫిర్యాదుల విభాగానికి బాధితులు తరచూ సమస్యలు నివేదిస్తున్నారు. అయినప్పటికీ నగరపాలక సంస్థ అధికారుల నుంచి సరైన స్పందన ఉండటం లేదు. ఏదైనా ముఖ్య కార్యక్రమాలు, ప్రముఖులు వచ్చిన సమయంలో మాత్రమే సిబ్బంది వచ్చి కుక్కలను పట్టుకుని వెళ్తున్నారు. మిగిలిన సమయంలో మిన్నకుండిపోతున్నారు. వాస్తవానికి కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేసి వాటి సంతతిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉన్నా, ఆ ప్రక్రియ సక్రమంగా అమలు జరగటం లేదు. దీంతో కుక్కల సంతతి పెరిగిపోతోంది. ముఖ్యంగా రాత్రి విధులు ముగించుకుని నివాసాలకు వెళ్లే ఉద్యోగుల వాహనాల వెంట పరుగులు తీస్తూ హడలెత్తిస్తున్నాయి. ఇటీవల అనేక మంది ద్విచక్రవాహనదారులు కుక్క కాట్లకు గురయ్యారు. కుక్కలు వెంటపడుతున్నాయనే ఉద్దేశ్యంతో కొందరు వాహన చోదకులు వేగంగా వెళ్లి అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గాయపడిన వారు ఆసుపత్రిలో చూపించుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు చక్కటి ఏకరూప దుస్తులు ధరించి క్రమశిక్షణతో చదువుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ అన్నారు. 49వ డివిజన్ చిట్టినగర్‌లోని మట్టా లాజరస్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేత కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాలలు తెరవగానే పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, ఏకరూప దుస్తులు అందించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతుందన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతి గదులు, తాగునీరు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్, పక్కన ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు

పరిశోధకులకు ప్రామాణిక గ్రంథం ‘ఏఐ’

చిట్టినగర్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పేరుతో రచించిన పుస్తకం అధ్యాపకులకు, పరిశోధకులకు ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతుందని ప్రచురణకర్త, వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్.రామారావు అన్నారు. కొత్తపేటలోని కళాశాల కార్యాలయంలో కేబీఎన్ పబ్లికేషన్స్ ప్రచురించిన ‘ఏఐ’ పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఇప్పటి వరకు వారి సిలబస్‌కు అనుగుణంగా అధ్యయన గ్రంథం రాలేదని, ఆ కొరత ఈ పుస్తకం తీరుస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి మాట్లాడుతూ ఆధునిక ఏఐ సిద్ధాంతాలు, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్ వంటి ప్రధాన అంశాలు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉన్నాయన్నారు. కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకుల్లో రచన, పరిశోధన నైపుణ్యాలను పెంచే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు నాగేంద్రకుమార్, రీసెర్చ్ విభాగం డైరెక్టర్ కిరణకుమార్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ పుస్తకావిష్కరణలో వీజీఎస్ అధినేత రామారావు, కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నాగేంద్రకుమార్, ప్రిన్సిపల్ కృష్ణవేణి

ఎల్‌ఓసీ పత్రాల అందజేత

భవానీపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను గురువారం అందజేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న భవానీపురానికి చెందిన సౌజన్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2లక్షలు, కడుపులో గడ్డతో బాధపడుతున్న 55వ డివిజన్‌కు చెందిన షేక్.మెహరున్నీసాకు రూ.5.32లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కూటమి నాయకులు అడ్డూరి శ్రీరాం, ఎంఎస్‌బేగ్, రామయ్య, తిరుపతి అనూష, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పత్రాన్ని ఇస్తున్న నాయకులు

దుర్గగుడిలో బ్యాగు చోరీపై కేసు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గగుడిలో దర్శనానికి వచ్చి క్లోక్ రూమ్‌లో భద్రపరచిన బ్యాగు చోరీకి గురి కావడంపై వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జూన్ 30న వంశీకృష్ణ అనే వ్యక్తి బ్యాగును భద్రపరచి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి బ్యాగు కనిపించకపోవడం, నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈలోగా బ్యాగ్‌లో ఉన్న ఫోను, రూ.5వేలు నగదు, పవర్ బ్యాంకు ఉన్నాయని చెప్పగా నిర్వాహకులు నగదు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. బాధితుడు అంగీకరించడంతో ఆసమయంలో విధుల్లో ఉన్న గున్నపురెడ్డి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంట వ్యవధిలో పడిపోయిన ఫోన్ అప్పగింత

విద్యాధరపురం: ఆటోలో ప్రయాణిస్తున్న యువకుడి జేబు నుంచి పడిపోయిన ఫోన్‌ను గంట వ్యవధిలో గుర్తించిన వన్‌టౌన్ పోలీసులు బాధితుడికి అప్పగించారు. గురువారం మంగళగిరికి చెందిన రియాన్ అహ్మద్ ఆటోలో వన్‌టౌన్ వస్తుండగా వినాయకుడి గుడి సమీపంలో ఫోను జారి పడిపోయింది. ఈవిషయాన్ని ఆటో దిగిన వెంటనే గమనించిన రియన్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ద్వారా ఫోన్ పడిపోయిన ప్రదేశాన్ని గుర్తించి రియన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

కాల్వలో చెత్త తొలగింపు

స్పందనకు వందనం

సీతారాంపురం, న్యూస్‌టుడే : దేవీనగర్ ఆరో లైన్‌లో డీఆర్‌డబ్ల్యూఏ నం: 681 వద్ద సైడు కాల్వలో చెత్త పేరుకుపోయింది. మురుగునీరు నిలిచి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం అందించారు. దీనిపై ఈ నెల 2వ తేదీన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. వీఎంసీ ఏఎంహెచ్‌వో సి.హెచ్.బాబూ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందితో కాల్వలో చెత్త తొలగింపజేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పాయకాపురం: పాయకాపురం చెరువు కూడలిలో రాత్రివేళ కొందరు రోడ్డుపై కూర్చుని మద్యం తాగుతున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై గురువారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన నున్న పోలీసులు పలువురు ఆకతాయిల్ని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ★ వాంబేకాలనీ హెచ్ బ్లాక్ వద్ద రోడ్డుపై కొందరు చెత్త పడేస్తున్నారు. దీనిపై వచ్చిన వార్తకు పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. కార్మికులతో చెత్త తరలించారు.

? 24వ డివిజన్ కడియాలవారి వీధిలో ఇటీవల రోడ్డు వేశారు. కానీ మ్యాన్ హోల్‌ను రోడ్డుకు సమాంతరంగా సరి చేయలేదు. ద్విచక్ర వాహన చోదకులు గుంతలో పడి గాయాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలి. **- సురేష్, స్థానికుడు**

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. **- దుర్గా భవాని, ఏఈ, వీఎంసీ.** - న్యూస్‌టుడే, సీతారాంపురం

ఏడాది పాలనపై ప్రజాదరణ

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని తెదేపా నాయకులు గురువారం అజిత్‌సింగ్‌నగర్, ఇందిరా నాయక్ నగర్‌లో ప్రారంభించారు. డివిజన్ తెదేపా కార్యాలయం నుంచి బయలుదేరారు. ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలు తెదేపా యాప్‌లో నమోదు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి రామారావు, ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి ఎరుబోతు రామారావు, తట్టవర్తి ఆనంద్, బొమ్మిశెట్టి రమేష్, దావులూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంవోహెచ్‌గా అర్జునరావు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ నూతన చీఫ్ మెడికల్ అధికారి(సీఎంవోహెచ్)గా కె.అర్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ అధికారిగా ఉన్న గోపాలకృష్ణనాయక్ సహాయవైద్య అధికారిగా విధులు నిర్వహించనున్నారు.

చుట్టూ తటాకం.. మురుగు ఆవాసం
దోమలు, పాములతో ప్రజల బెంబేలు

మధురానగర్, అజిత్‌సింగ్‌నగర్, సీతారాంపురం, న్యూస్‌టుడే

న్యూస్‌టుడే పరిశీలన

విజయవాడ మధ్య నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య ఖాళీ స్థలాలు... మురుగు, వర్షపు నీటితో నిండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోయాయి. దోమలు స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. విష పురుగులతో బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

★ 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావుబుచ్చయ్యకాలనీల్లో దాదాపు 70 వరకు స్థలాలు ఖాళీగా ఉన్నాయి. పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. చెరువులను తలపిస్తున్నాయి. దోమలు తాకిడికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సీతారాంపురం : చలమలవారి వీధిలో..

అజిత్‌సింగ్‌నగర్.. గుండపు రమణమ్మ వీధిలో ఇళ్ల మధ్య తటాకం..

దావుబుచ్చయ్య కాలనీలో చిట్టడివిలా పెరిగిన పిచ్చి మొక్కలు

★ 24వ డివిజన్‌లోని నేతాజీ వీధి, చలమల వారి వీధి, 25వ డివిజన్‌లోని రైవస్ కాలువ గట్టు ప్రాంతంలో పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోయాయి. 26వ డివిజన్‌లోని వీరన్న వీధిలోని ఖాళీ స్థలం వల్ల చుట్టుపక్కల వారు ఇబ్బంది పడుతున్నారు.

★ అజిత్‌సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరి పేట, నందమూరి నగర్, వాంబే కాలనీలో చాలా మంది స్థలాలు కొనుగోలు చేసి, అభివృద్ధి చేయకుండా వదిలేశారు. అవి రోడ్డు కంటే పల్లంలో ఉండటంతో వాన నీరు నిలుస్తోంది.

★ భారతమాత కాలనీ గుండపు రమణమ్మ వీధి 10వ లైనులో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. డ్రైనేజీ కంటే లోతట్టు ఖాళీ స్థలాల సంఖ్య 20కి పైగానే ఉన్నాయి. మురుగు, దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. పందులు, కుక్కల సంచారంతో హడలిపోతున్నారు.

★ నందమూరి నగర్, 8వ లైన్‌లో 300 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ 30కి పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొన్నింటికి పహరీ కట్టి వదిలేశారు. నీరు బయటకు వెళ్లకుండా నిల్వ ఉంటున్నాయి. పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క మొలిచింది.

అధికారుల చర్యలేవీ?

ఖాళీస్థలాల్లో మురుగు నీరు, పిచ్చిమొక్కలు పెరగకుండా చూడాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ అధికారులదే. యజమానులకు నోటీసులు ఇవ్వాలి. గడువు లోపు స్పందించకపోతే.. అధికారులే అపరిశుభ్రతను తొలగించాలి. దీనికి అయిన ఖర్చును సదరు యజమాని నుంచి వసూలు చేయాలి. కానీ అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆయా స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుంటే మేలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ధర వరలు

రైతుబజారుల్లో కూరగాయల ధరలు.. వంకాయలు-30, టమాటా-36, బెండ-30, పచ్చిమిర్చి-34, కాకర-44, బీర-24/34, క్యాబేజి-22, క్యారెట్-28/40, దొండ-34, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-27, గోరు చిక్కుళ్లు-34, దోస-18, సొర-10/12, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, ఆకు కూరలు (కట్ట)-3, కంద-60, బీట్‌రూట్-28, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10, జాలం మామిడి-20/25 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

ప్రకృతి వ్యవసాయ డీపీఎంగా శంకర్‌నాయక్

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లా ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్ఎఫ్) విభాగ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)గా వై.శంకర్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ జి.లక్ష్మీశను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అన్నమయ్య జిల్లాలో ఏడీఏగా పని చేస్తూ 45 రోజుల క్రితం ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో అదనపు డీపీఎంగా పని చేస్తున్నారు. మొన్నటి వరకు డీపీఎంగా ఉన్న విజయకుమారి.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణిగా నియమితులయ్యారు. దీంతో శంకర్ నాయక్‌కు డీపీఎంగా అవకాశం లభించింది.

ముత్యాలమ్మకు వారాహి అలంకరణ

కస్తూరిబాయిపేట (సీతారాంపురం): కస్తూరిబాయి పేటలోని శ్రీముత్యాలమ్మ తల్లి దేవాలయంలో వారాహి నవరాత్రుల సందర్భంగా గురు, శుక్రవారాలు ముత్యాలమ్మ తల్లి వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీముత్యాలమ్మ తల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇంటింటికీ రెట్టింపు సంక్షేమం

కార్మికపురం (సీతారాంపురం): సుపరిపాలన ద్వారా ఇంటింటికీ రెట్టింపు సంక్షేమం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక 25వ డివిజన్ కార్మికపురంలో గురువారం 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగారు. డ్రైనేజీ, రోడ్లు, టిడ్కో ఇళ్లు, మంచినీటి కొళాయి, వినికిడి సమస్య ఉన్న వారికి వినికిడి యంత్రాలు, ఇతర సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆయన సూచించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయన్నారు. ఈ మంచి ప్రభుత్వం నూరేళ్లు చల్లగా ఉండాలని కోరుకుంటున్నామని మహిళలు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది హారతులిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మలపెంట శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు మాచర్ల గోపీనాథ్, మాచర్ల పావని, డివిజన్ ఇన్‌ఛార్జి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సాయిబాబు, విజయకృష్ణ సూపర్ బజార్ డైరెక్టర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ

గవర్నర్‌తో సమావేశమైన వీసీ తదితరులు

ఈనాడు, అమరావతి: గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ రాజ్‌భవన్‌లో గురువారం కలిశారు. వర్సిటీ ప్రగతి, తాజా పరిస్థితిని వీసీ ఆయనకు వివరించారు. ఈ ఏడాది నిర్వహించాల్సిన స్నాతకోత్సవ తేదీ ఖరారు, ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సొంత ప్రాంగణం, అమరావతిలో వైద్యకళాశాల నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపు ప్రతిపాదనపైనా చర్చించారు. నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులైన ఎం.జయచంద్రనాయుడు, ఎస్.సురేష్‌బాబు, వై.సాయికిషోర్, జి.సుబ్బారావు, కె.మాధవి, సీహెచ్ సుధాకర్, టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డిలను గవర్నర్‌కు వీసీ పరిచయం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ అభిమానుల సందడి

కేకులు తినిపించుకుంటున్న అభిమానులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : హరిహర వీరమల్లు ట్రైలర్ విడుదల సందర్భంగా చిరంజీవి, పవన్ కల్యాణ్ అభిమానులు సందడి చేశారు. గురువారం గాంధీనగర్‌లోని జి3 థియేటర్ వద్ద నిర్వహించిన వేడుకల్లో తెలుగు రాష్ట్రాల రాధా, రంగా మిత్రమండలి అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాస్, తెదేపా యువ నాయకుడు బొండా సిద్ధార్థ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కేకు కోసి అభిమానులకు పంచిపెట్టారు. ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పవన్ కల్యాణ్ తొలిసారిగా నటించిన ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకులు ఎస్.కృష్ణప్రసాద్, ఎల్.శ్యామ్‌ప్రసాద్, ఇ.సుగుణబాబు, కె.రాకేష్‌నాథ్, పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం

మొక్కల మీద నిలబడి నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో భాగంగా గురువారం ధర్నాచౌక్‌లో ఇంజినీరింగ్ కార్మికులు మొక్కలపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి మంత్రివర్గ ఉపసంఘం వేస్తున్నామని.. అందులో ఇంజినీరింగ్ కార్మికుల జీతాలపై కూడా చర్చిస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. కార్మికుల సమస్యలు ప్రజలకు తెలియజేసేందుకు నగరంలో రోజుకో బూస్టర్ల దగ్గర నిరసనలు తెలుపుతున్నామని చెప్పారు. శుక్రవారం ధర్నాచౌక్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ నగర అధ్యక్షుడు జ్యోతిబసు, స్టీఫెన్‌బాబు, దుర్గారావు, శ్రీను, సైదులు, చిన్న, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

వృద్ధురాలి నుంచి ప్రభుత్వ పనితీరు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా చంద్రబాబు పని చేస్తున్నారని, నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా తాను కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 61వ డివిజన్ ప్రకాష్‌నగర్, 64వ డివిజన్ కండ్రిక ప్రాంతాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రజలు డ్రెయిన్లు, పారిశుద్ధ్య సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటిని కూడా పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పనితీరు బాగుందని అందరూ ప్రశంసిస్తున్నారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. తెదేపా నాయకులు ఆకుల సూర్యప్రకాష్, దాసరి దుర్గారావు, దాసరి కనకారావు, పొలిశెట్టి అమ్మారావు, చింతల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చప్టాలు ఇంకెప్పుడు వేస్తారు..?

పాయకాపురం రవీంద్ర థియేటర్ ఎదురుగా సాయిబాబా ఆలయం పక్కనే ఉన్న డ్రెయిన్‌పై చప్టాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేషన్‌లో జరిగిన స్పందనలో ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు నూతన చప్టాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే వేరే చోట పని చేయాలని ఆదేశాలు రావడంతో తీసుకువచ్చిన చప్టాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాదారులకు ఇవి తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వాటిని డ్రెయిన్‌పై ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

కుంగిన సిమెంటు రోడ్డు

స్థానిక 25వ డివిజన్, కోటిలింగాలవారి వీధిలోని సిమెంటు రోడ్డు మధ్యలో కుంగిపోయింది. ఏలూరు రోడ్డు నుంచి కోటిలింగాలవారి రోడ్డులోకి తిరిగిన కొద్ది దూరంలోనే గుంత ఏర్పడింది. ద్విచక్రవాహన చోదకులు అదుపుతప్పుతున్నారు. ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సీతారాంపురం**

మురుగు తోడేశారు..!

వాంబే కాలనీ 'జీ' బ్లాక్‌లోని ఖాళీ స్థలంలో వర్షం నీరు నిల్వ ఉంటోంది. చుట్టుపక్కల ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల వ్యాప్తితో నిద్రపట్టడం లేదని వాపోతున్నారు. 'న్యూస్‌టుడే' ఈ సమస్యను నగర పాలక సంస్థ ఏఈ సతీష్ దృష్టికి తీసుకెళ్లగా.. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. సిబ్బందితో మురుగు నీరు తోడించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

స్పందనకు వందనం

రూ.13 లక్షలతో సీసీ రోడ్డు

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి.. జోడు గుర్రాల్లా పరిగెడుతోందని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. గురువారం సూర్యారావుపేటలోని ఇజ్జాడ వారి వీధిలో రూ.13 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వ పాలనలో ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరతాయన్నారు. కార్యక్రమంలో కోటి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, సూర్యారావుపేట**

25 మందికి జరిమానా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా 2, 4 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల అధికారులు.. మద్యం తాగి వాహనాలు నడిపిన 25 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. అయిదుగురికి రూ.15వేలు, 20 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్ బాబు తీర్పు చెప్పారు.

21న 'చలో విజయవాడ'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యుత్తు ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీన 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు బి.రామలింగారెడ్డి, మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం వారు ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై అనేక ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా.. పరిష్కారం కావడం లేదని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు తెలంగాణ తరహాలో జీతాలు చెల్లించాలని, నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీని ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడతామని అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే 21న 'చలో విజయవాడ'కు పిలుపునిస్తామని వెల్లడించారు. ఇందులో భాగంగా ఆ రోజు రామవరప్పాడు రింగ్ నుంచి విద్యుత్తు సౌధా వరకు ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.

'మెగా పీటీఎం 2.0' నిర్వహించాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10న మెగా పీటీఎం 2.0(పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా డీవైఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు.

తండ్రీకుమారులపై కేసు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఆఫీస్‌రోడ్డులో బుధవారం ఉదయం సచివాలయ ఉద్యోగిని అర్చనపై దాడి చేసిన తండ్రి కుమారులపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. 98వ సచివాలయ ఉద్యోగిని అర్చన ఒక భవనం కొలతలు తీస్తుండగా భవన యజమాని రంగనాయకులు అతని కుమారుడు యతిరాజ్ నిఖిత్ ఆమెను అడ్డుకుని దుర్భాషలాడారు. ఈ క్రమంలో నిఖిత్ ఆమెపై దాడి చేసి చెంపపై కొట్టారు. దీనిపై అర్చన గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు తండ్రి, కొడుకులపై కేసు నమోదు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వార్డు సచివాలయ భవనం ప్రారంభం

భవనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి

చుట్టుగుంట, న్యూస్‌టుడే: చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద పునర్నిర్మించిన 28వ వార్డు సచివాలయ భవనాన్ని గురువారం 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి. డివిజన్ ఇన్‌ఛార్జి వల్లభనేని సతీష్ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సచివాలయ పరిధిలోని ప్రజలు అందిపుచ్చుకోవాలన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, ప్రధాన కార్యదర్శి కారంపూడి సత్య, విజయకృష్ణ సూపర్ బజార్ డైరెక్టర్ కడియం ప్రకాష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు పరామర్శ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: విదేశాల్లో చదివిన వైద్య విద్యార్థులకు గుర్తింపు ఇవ్వకుండా.. ప్రశ్నించిన వారిపై పోలీసులు అమానుషంగా దాడిచేయడం సరికాదని వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులను అరెస్టు చేసి సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్‌గ్రౌండ్‌కు తరలించారు. వారిని దేవినేని తదితరులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. పోలీసుల దాడుల్లో పలువురు గాయపడ్డారని వారు నడవలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వైకాపా రాష్ట్ర స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు పానుగంటి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కోమల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని వాంబే కాలనీ యూపీహెచ్‌సీ డాక్టర్ నరేంద్ర నాయక్ అన్నారు. గురువారం వాంబే కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ అనేది అంటు వ్యాధి అని. . గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. దీనిపై సరైన అవగాహన లేకపోవడం వలన చాలామంది వ్యాధి బారినపడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వ్యాధిగ్రస్థులు పోషకాహార లోపం కలిగి ఉంటారని, చికిత్స సమయంలో పని చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడతారని కేంద్ర ప్రభుత్వం రూ.6000 ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. టీబీ యూనిట్ రాజీవ్‌నగర్ సిబ్బంది, యూపీహెచ్‌సీ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

వృద్ధాశ్రమాల నిర్వాహకులకు ముగిసిన కార్యశాల

ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వృద్ధాశ్రమ, హోం కేర్ సెంటర్ నిర్వాహకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గవర్నర్‌పేటలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న వృద్ధాశ్రమ, హోమ్ కేర్ సెంటర్ నిర్వాహకుల కార్యశాల గురువారంతో ముగిసింది. హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సహకారంతో ఈ కార్యశాల నిర్వహించారు. దీంట్లో వృద్ధుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవలు తదితర అంశాల గురించి వివరించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని పలు సంస్థల నుంచి 40 మంది పాల్గొన్నారు. వారికి వృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు వి.కామరాజు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. మోతుకూరి వెంకటేశ్వరరావు, టి.రవికుమార్, జాస్తి విజయ్ భూషణ్, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, నాగూర్‌వలి తదితరులు

సీతారాంపురం, న్యూస్‌టుడే : తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రాష్ట్ర మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఏపీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు కోరారు. సీతారాంపురం పింగళి వెంకయ్య వీధిలోని యూనియన్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను యథాతథంగా అమలు చేయాలని కోరారు. చట్టబద్ధమైన పని పద్ధతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు ప్రవేశంపై నిషేధం ఎత్తివేయాలన్నారు. మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తొలగించాలని, ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీలను, వ్యాక్సినేషన్ ప్లాంట్లను పునరుద్ధరించాలని, నకిలీ మందులు తయారు చేస్తున్న కంపెనీల యాజమాన్యాలకు చర్యలు తీసుకోవాలని, పదవీ విరమణ కార్మికులకు కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,910, 8 గంటల పని విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సమ్మెకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఆర్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.నాగూర్‌వలి, కార్యదర్శి సి.హెచ్.మహేష్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

'కొల్లేరు' హామీలు అమలు చేయాల్సిందే

మాట్లాడుతున్న శ్రీనివాసరావు. వేదికపై కేశవరావు తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కొల్లేరు ప్రజల మెడపై కత్తిలా వేలాడుతున్న జీవో నంబరు 120ని రద్దుచేసి పర్యావరణాన్ని, ప్రజల జీవనోపాధిని కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం బాలోత్సవ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో 5వ కాంటూరు పరిధిలోని చేపల చెరువులను ధ్వంసం చేశారని, లక్షలాది మంది ప్రజల జీవితాలను నాశనం చేశారని పేర్కొన్నారు. దీనివల్ల వేలాది మంది జీవనోపాధి నిమిత్తం దూర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీల్లో ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. కొల్లేరులో రెగ్యులేటర్లు నిర్మిస్తామని, దానిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, ఉపాధి కల్పిస్తామని వేలాది కోట్లు విడుదల చేసినా.. ఆ నిధులతో ఉపాధి కల్పన జరగలేదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా.. కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు నామమాత్రంగా ప్రజాభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. ఎకోసెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు తెలియపరిచి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, కె.శ్రీనివాస్, దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడదాం'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం గవర్నర్‌పేటలో ముఠా కార్మికుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్‌కోడ్లను తీసుకొచ్చారని విమర్శించారు. బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ముఠా కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కె.దుర్గారావు, ఎం.బ్రహ్మయ్య, సిహెచ్.నరసింహులు, జి.వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి సర్క్యులర్ పునరుద్ధరణపై హర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జలవనరుల శాఖలో వివిధ హోదాల్లో పని చేసే వారికి సహాయ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి కల్పించే సర్క్యులర్ పునరుద్ధరణకు కృషి చేసిన ఆ శాఖ ఎన్జీవో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సి.హెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పొట్నూరి రమేష్, ఆర్.సి.హెచ్.కృష్ణారెడ్డిలకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

శారదా డిగ్రీ కళాశాల
BRTS రోడ్ దగ్గర, గాంధీనగర్,
విజయవాడ. Ph: 2430406
అడ్మిషన్లు జరుగుచున్నవి

(c) eenadu

ఈనాడు అనకాపల్లి
శుక్రవారం 4 జులై 2025

అడ్డరోడ్డు చేరడం అంత తేలిక్కాదు!

కోటవురట్లలో వాగును తలపిస్తున్న ప్రధాన రహదారి

నర్సీపట్నం-అడ్డరోడ్డు మార్గం వాహనదారుల పాలిట యమగండంలా తయారైంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకమైన ప్రమాదం పొంచి ఉంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి కోటవురట్ల మండల పరిషత్తు కార్యాలయం ఎదుట రోడ్డుపై నీరు వాగును తలపిస్తోంది. దీంతో ఎక్కడ పడిపోతామోనని ద్విచక్రవాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇక్కడ జాగ్రత్తగా బండి నడుపుతూ ముందుకెళ్తే ద్విచక్రవాహనదారులకు ఇంకో సవాల్ సిద్ధంగా ఉంది. జల్లూరు వద్ద వరాహనదిపై నిర్మించిన వంతెన రహదారి బురదతో అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉండే ఈ వంతెనను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిచేసి.. అటూ, ఇటూ అప్రోచ్ రోడ్లు వేశారు.

వంతెన దగ్గర బురదతో అధ్వానంగా..

అప్రోచ్ మార్గంపై తారు వేయకపోవడంతో చాలా మంది ఇక్కడ జారిపడుతున్నారు.

– కోటవురట్ల, న్యూస్‌టుడే

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూచౌక్(అనకాపల్లి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ అప్పారావునాయుడు కోరారు. అర్హులైన ఉపాధ్యాయులు http:///nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వీఎంఆర్‌డీఏ.. నాణ్యత ఏమాయే

రెండు నెలలకే ఆనవాళ్లు లేని రోడ్డు

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని శతకకారుడు వేమన చెప్పారు. అదేవిధంగా రహదారులందు.. మేము నిర్మించే రహదారులు వేరయా అన్నట్టుగా ఉంది విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) తీరు. పైపై పూతలా తారుపరిచేసి రహదారి వేసేశామంటూ గుత్తేదారు మాయ చేసినా.. కొరడా ఝుళిపించకుండా కాలయాపన చేస్తోంది. 'ప్రభుత్వ పనులేగా.. నిధులు మింగేయెచ్చు. ఎలా పనులు చేసినా అడిగేవారే ఉండరు' అన్నట్లు గుత్తేదారులు వ్యవహరిస్తుంటే.. కిమ్మనకుండా ఉండిపోతోంది.

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

గత ప్రభుత్వ హయాంలో విశాఖవాసులకు ఇళ్లు ఇచ్చేందుకు అనకాపల్లి మండలం కుంచంగిలో భారీగా ల్యాండ్‌పూలింగ్ చేశారు. భూములిచ్చిన సాగుదారులకు ఎకరాకు 18 సెంట్ల చొప్పున సర్వే నంబర్ 318, 322, 334, 335 లో ప్లాట్లు కేటాయించారు. ఈ లేఅవుట్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నది అప్పట్లో ఒప్పందం. ఇందుకోసం గతేఏడాది డిసెంబర్‌లో ఈ లేఅవుట్‌లో బీటీ రోడ్డు వేసేందుకు వీఎంఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. రూ. 3.28 కోట్లకు టెండర్ దక్కించుకున్న గుత్తేదారు సంస్థ రెండు నెలల క్రితం రోడ్ల నిర్మాణం పూర్తి చేసింది. కనీసం రెండు నెలలు పూర్తవ్వకుండానే లేఅవుట్‌లో వేసిన రోడ్లు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ తారు పెచ్చులూడి గుంతలు ఏర్పడుతున్నాయి. నాలుగు

కుంచంగి లేఅవుట్‌లోని రోడ్డు ఛిద్రమైందిలా

కారులు తిరిగితే చాలు.. ఈ రహదారుల రూపురేఖలు ఉండవు. అంత డొల్లగా నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో గుత్తేదారు నాసిరకంగా రోడ్లు వేసి చేతులు దులిపేసుకుంటున్నారు.

★ నిబంధనల ప్రకారం ఇక్కడ రోడ్డు వేసేందుకు మొదట గ్రావెల్, సిమెంట్ మిక్స్‌తో గ్రావెల్, క్రషర్, తర్వాత మెటల్‌వేసి చివరితో తారు పోయాలి. కానీ.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అలా ఏం కనిపించడం లేదు. మట్టిరోడ్డుపై పలుచగా తారు పోసి గుత్తేదారు చేతులు దులుపుకొన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. చిన్న వాహనం రోడ్డుపైవెళ్లినా.. దారి

పైపూతగా వేసిన తారు

బీటలు తేరి తారు పైకి లేచి గోతులు ఏర్పడుతున్నాయి. రోడ్లు వేసే సమయంలో నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు జరుగుతున్నాయా.. లేదా అనేది పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులదే. ఇద్దరు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారని వీఎంఆర్‌డీఏ చెబుతుండటం గమనార్హం. మరి అంత పర్యవేక్షణ ఉంటే రోడ్డు వేసిన రెండు నెలలకే రోడ్లు ఎలా పాడయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గోతులకు మరమ్మతులు చేయిస్తారా? లేక పనులపై విచారణ చేయించి.. గుత్తేదారుపై చర్యలు తీసుకుంటుందా అనేది తేలాల్సి ఉంది.

★ దీనిపై వీఎంఆర్‌డీఏ ఈఈ రాంబాబుతో మాట్లాడగా.. 'కుంచంగి లేఅవుట్‌లో బీటీ రోడ్డుపై గుంతలను గుర్తించాం. బిల్లులు కూడా ఆపాం. గుత్తేదారుకు నోటీసులు ఇచ్చాం. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తాం' అని తెలిపారు.

తడబడితే తంటా..

ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని జాగ్రత్తగా బురదలో నడుస్తూ వస్తున్న వీరంతా దేవరాపల్లి మండలం చింతలపూడి శివారు నేరళ్లపూడి ప్రాథమిక పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు. పిల్లల చెయ్యి పట్టుకుని ముందు నడుస్తున్నది ఆ పాఠశాల ఉపాధ్యాయుడు. నేరళ్లపూడి పాఠశాల భవనం శిథిలమవడంతో గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలను దగ్గరలోని బోడిగరువు గ్రామానికి మార్చారు. ఈ పాఠశాలలో ఈ రెండు గ్రామాలతోపాటు అనంతగిరి, దేవరాపల్లి మండలాలకు చెందిన కొట్టంగూడ, తట్టపూడి, మదనగరువు, కళ్యాణగుమ్మి తదితర గిరిజన గ్రామాలకు చెందిన 31 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బోడిగరువు పిల్లలు మినహా ఇద్దరు ఉపాధ్యాయులు సహా మిగతా పిల్లలంతా పాఠశాలకు నడిచి రావలసిందే. వీరు వచ్చే మార్గం జారుడు మట్టితో కూడుకున్నది కావడంతో వర్షం పడితే చాలు... పాఠశాలకు చేరడానికి పెద్ద సాహసమే చెయ్యాల్సి వస్తోంది. పాఠశాలకు వెళ్లేటపుడు, తిరిగి వచ్చేటపుడు ఉపాధ్యాయుల్లో ఒకరు ముందు.. మరొకరు వెనుక ఉండి పిల్లల చేతులు పట్టుకుని జారిపడకుండా జాగ్రత్తగా నడిపించుకుంటూ వెళ్తున్నారు.

– దేవరాపల్లి, న్యూస్‌టుడే

బాలలకు ఆరోగ్యం.. అన్నింటా మహాభాగ్యం

పాఠశాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమానికి (ఆర్‌బీఎస్‌కే) శ్రీకారం చుట్టారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలల్లో వైద్య

బడిలో విద్యార్థినికి రక్త పరీక్ష

పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను పీహెచ్‌సీలకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల విద్యార్థులందరికీ అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు.

★ బాల్యంలోనే వ్యాధులను గుర్తించి ఆరోగ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ ఏడాది మరింత పటిష్ఠంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. వీరంతా పాఠశాలల్లో ప్రతి గురు, శనివారాల్లో పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయడంతోపాటు వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోనున్నారు. జ్వరం, జలుబు దగ్గు ఉన్నట్లయితే మందులు ఇస్తారు. అవసరమైతే సమీపంలోని పీహెచ్‌సీలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తారు. అత్యవసరమైన వారికి జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తారు

ఆరోగ్య కార్డుల్లోనూ నమోదు

పాఠశాలల్లో పరీక్షల అనంతరం వైద్య సిబ్బంది విద్యారుల సమాచారమంతా ఆరోగ్య కార్డుల్లో నమోదు చేస్తారు. జిల్లాలో 1,440 విద్యాలయాల్లో 1,17,604 మంది విద్యార్థులు, 1,905 అంగన్‌వాడీల్లో 86,397 మంది విద్యార్థులున్నట్లు గుర్తించారు. ముందుగానే సమస్యను గుర్తించి చికిత్స అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ఈస్తర్ రాణి పేర్కొన్నారు.

ఆరంభం అట్టహాసం.. ఆచరణ అపహాస్యం!

నర్సీపట్నం అర్బన్, చోడవరం, న్యూస్‌టుడే

ఈ-వ్యర్థాల సేకరణ అపహాస్యంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో నర్సీపట్నం, చోడవరాల్లో తొలుత ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని ఏప్రిల్ 19న అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజు నర్సీపట్నంలో 556 కేజీల ఈ-వ్యర్థాలను స్థానికులు సేకరణ కేంద్రానికి తీసుకువచ్చి అందజేశారు. పాడైన టీవీలు, మిక్సీలు, కంప్యూటర్ మౌస్‌లు, సెల్‌ఫోన్ ఛార్జర్లు వీటిలో ఉన్నాయి. సిబ్బంది కేంద్రం వద్ద ఉండి ఎవరు ఏమిచ్చారో పుస్తకంలో నమోదు చేసుకుని తీసుకున్నారు. మరుసటి రోజు నుంచి ఈ కేంద్రాలు తెరచుకోలేదు. సిబ్బంది జాడే లేదు. వార్డు సచివాయాల్లో వ్యర్థాలను తీసుకుంటారని అధికారులు చెబుతున్నా.. ప్రచారం లేక పౌరులు సచివాలయాల వరకు వెళ్లడం లేదు. సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది కొందరు పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి చెత్తను సేకరించేటప్పుడు ఈ-వ్యర్థాలు కనిపిస్తే విడిగా తీసుకువచ్చి సచివాలయంలో అందజేయాలని సూచిస్తున్నారు. ఇలా సేకరించినవైనా ఒక్కో సచివాలయంలో పది నుంచి పదిహేను కేజీలకు మించి ఉండదు.

★ **చోడవరం పట్టణంలో** ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని కలెక్టర్ విజయకృష్ణన్, సంయుక్త కలెక్టర్ జాహ్నవి, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తదితరులు ప్రారంభించారు. ఆ రోజు కొన్ని ఈ-వ్యర్థాలను కేంద్రంలో అందజేశారు. ఆ మరుసటి రోజు నుంచే సేకరణ అటకెక్కింది.

★ ఈ-వ్యర్థాల్లో కాడ్మియం, క్రోమియం, లెడ్, ప్లాస్టిక్ వంటి వాటిని సేకరించి సంపద సృష్టించాలని ప్రభుత్వ ఆశయం. ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు ఈ-వ్యర్థాలు ఉంటున్నాయి. చాలామంది వీటిని బయట పారేయలేక ఇంట్లో అటకపై పడేస్తున్నారు. ఇలాంటి వాటిని రీసైక్లింగ్ చేయవచ్చు. ఈ-వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే బాధ్యత ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రక్రియ కార్యరూపం రూపదాల్చాల్సి ఉంది.

★ విజయవాడలో ఇప్పటికే ఒక దఫా జరిగిన సమావేశానికి మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. విధివిధానాల రూపకల్పన, ఒప్పందాలు పూర్తి కావాల్సి ఉందని సమాచారం. సచివాలయాల సిబ్బంది సేకరించిన ఈ-వ్యర్థాలను ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సమీకరించి తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర పేర్కొన్నారు. ఈ-వ్యర్థాలు ఉంటే సచివాలయాల్లో అందజేయవచ్చన్నారు.

చోడవరంలో ఖాళీగా కౌంటర్... నర్సీపట్నంలో ఈ-వ్యర్థాల సేకరణ ఇంతే

వైద్య పరీక్షలతో విద్యార్థుల్లో లోపాల గుర్తింపు

కశింకోట, న్యూస్‌టుడే: ముందస్తు వైద్యపరీక్షల ద్వారా విద్యార్థుల్లో లోపాలు గుర్తించి వారికి సత్వర చికిత్స అందించడమే మిషన్ వాత్సల్య పథకం లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.హైమవతి అన్నారు. కశింకోట బాలసదనంలో జిల్లా సత్వర చికిత్సా కేంద్రం ప్రత్యేక వైద్యులతో స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక, జనన, పోషకాహార లోపాలు, వ్యాధులు, అభివృద్ధిలో జాప్యం వంటి సమస్యలు పిల్లలలో గుర్తించి సత్వర చిక్సితలు అందిస్తామన్నారు. లోపాలు గుర్తించిన పిల్లలను రాష్ట్రీయ బాల స్వస్థ్యా కేంద్రాలకు సిఫార్సుచేసి చికిత్స అందిస్తామన్నారు. 40 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.ఎస్తేర్ రాణి, బాలసదనం సూపరింటెండెంట్ సీహెచ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

కశింకోటలో విద్యార్థులతో వైద్యాధికారులు, సిబ్బంది

జిల్లాలో 411 మిల్లీ మీటర్ల వర్షపాతం

అనకాపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. జిల్లా అంతటా కలిసి 411 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తొమ్మిది మండలాల్లో దుక్కుకు పైగా వర్షం కురిసిందని పరిశోధన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి మండలంలో అత్యధికంగా 45.4 మి.మీ., మునగపాక, నక్కపల్లి, పరవాడలలో 24.8 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలోని నర్సీపట్నం, నాతవరం, రోలుగుంట, గొలుగొండ, మాకవరపాలెంలలో 20 మి.మీ.కి పైగా వర్షం పడిందన్నారు.

నకిలీ మద్యం తయారీ ముఠా గుట్టురట్టు

ఎలమంచిలి, పరవాడ, న్యూస్‌టుడే: కంపెనీ బ్రాండ్లను తలపించేలా అక్రమ మద్యం తయారు చేసి విక్రయిస్తున్న ముఠాను గురువారం ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ పి.తేజో వెంకట కుమార్ పరవాడలో పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి మద్యం తయారీకి

వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ తేజోవెంకట కుమార్

ఉపయోగించే రసాయనాలు, యంత్రాలు, సీసాలు, మూతలు, స్టిక్కర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎలమంచిలి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పరవాడకు చెందిన ఎలమంచిలి వెంకటేశ్వరరావు, మాకవరపాలెంకు చెందిన రుత్తల రాములు.. పరవాడ వెన్నెలపాలెం న్యూకాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుని మద్యం తయారీని ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి స్పూరియస్ స్పిరిట్‌ను కొనుగోలు చేసి వాటిలో కెరామిల్ రంగు కలిపి మద్యం తయారు చేస్తున్నారు. కంపెనీ లాంటి మద్యం సీసాలు కొనుగోలు చేసి వాటికి ఎక్కువ అమ్మకాలు జరిగే బ్రాండ్ లేబుల్స్ అంటించారు. వీటికి ఒక ప్రత్యేక యంత్రం సాయంతో మూతలు బిగిస్తున్నారు. ఇలా పరవాడలో తయారు చేసిన నకిలీ మద్యాన్ని

నిందితులు తయారు చేసిన మద్యం సీసా

అచ్యుతాపురంలో మద్యం గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారు. అచ్చం కంపెనీ బ్రాండ్‌లా కనిపించే ఈ సీసాలపై కంపెనీ పేరు, ధర, తయారీ తేదీ ఇలా అన్ని ముద్రించి ఉన్నాయి.

ప్రాణాలకే ముప్పు : నిందితులు హైదరాబాద్‌కి చెందిన మరో వ్యక్తి సాయంతో అక్కడి నుంచి అవసరమైన రసాయనాలు, సామగ్రి తెచ్చుకుని పరవాడలో నకిలీ మద్యం తయారు చేస్తున్నారని తమ విచారణలో తేలిందని సీఐ చెప్పారు. మూతలు బిగించే యంత్రాన్ని అక్కడి నుంచే రూ. 25 వేలకు కొనుగోలు చేసి రప్పించారన్నారు. వీరు మద్యం తయారీకి వాడే రసాయనం చాలా ప్రమాదకరమైనదని, ఇది తాగితే చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. లీటరు రసాయనం రూ. 100కి కొనుగోలు చేస్తున్నారని, దీంతో 6 క్వార్టర్ బాటిళ్ల మద్యం తయారుచేస్తున్నారని పేర్కొన్నారు.

ఉక్కు భూముల్లో జపాన్ ప్రతినిధుల పరిశీలన

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని సంబంధిత కంపెనీ ప్రతినిధులు గురువారం మరోసారి పరిశీలించారు. రెండు రోజుల క్రితం వచ్చిన బృందానికి కొనసాగింపుగా మరో బృందం ఇక్కడకు వచ్చింది. జపాన్‌కు చెందిన వ్యక్తులు నక్కపల్లికి రాగా.. రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశ్రమ నిమిత్తం భూములు కేటాయించిన ప్రాంతానికి తీసుకెళ్లారు. చందనాడ, మూలపర్ర, డీఎల్‌పురం ప్రాంతాల్లో వీరు పర్యటించారు. ఆ మేరకు భూములతో పాటు, పోర్టు కోసం కేటాయించిన తీరం, ఇక్కడి వాతావరణ పరిస్థితులు పరిశీలించారు. తాము పర్యటించిన ప్రాంతాల్లో కొన్ని ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. పలు విషయాలపై మాట్లాడి తెలుసుకుని వెనుదిరిగారు.

భూములను పరిశీలిస్తున్న ప్రతినిధులు

మహిళలను వ్యాపారవేత్తలు చేయడమే ధ్యేయం

కలెక్టర్ విజయ కృష్ణన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం గ్రామీణాభివృద్ధి సంస్థ, సూక్ష్మ రుణాల ప్రణాళిక అమలుపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పది రోజుల్లో గ్రౌండింగ్ చేయాలన్నారు. లబ్ధిదారుల ధ్రువీకరణకు గ్రామస్థాయి సమావేశాల్లో పాల్గొనడానికి లైన్ విభాగాల క్షేత్రస్థాయి కార్యకర్తలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. డిజిటలైజేషన్‌లో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యుల బయోమెట్రిక్ ఆధారంగా లబ్ధి చేకూరుతుందన్నారు. దీంతో ఎటువంటి అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. ఆర్థిక చేరిక, సూక్ష్మ సంస్థలకు మద్దతు, స్థిరమైన జీవనోపాధి ప్రోత్సహించడం ఈ ప్రణాళిక లక్ష్యమన్నారు. సభ్యులకు నిర్వహించే గ్రామస్థాయి సమావేశాలకు గ్రామ సంస్థ సహాయకుడు, కమ్యూనిటీ కోఆర్డినేటర్‌తో పాటు వ్యవసాయ, పశువైద్య, మత్స్యకార సహాయకులు, రైతు సాధికార సంస్థ నుంచి కార్యనిర్వాహకుడు, గ్రామస్థాయి కార్యనిర్వాహకుడు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు. సంబంధిత రంగాల్లో లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా వేర్వేరు సమయాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంచుకున్న జీవనోపాధి ఎంపికలపై చర్చించాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, వివిధ శాఖల అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు.. మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

(c) eenadu

కష్టపడే కార్యకర్తలకు తెదేపాలో గుర్తింపు

రాంబిల్లి, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసే కార్యకర్తలను తెదేపా ఎప్పుడూ గుర్తిస్తుందని, అందరూ పార్టీ కోసం పనిచేయాలని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు కోరారు. లాలంకోడూరులో గురువారం తెదేపా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని తదితరులు మాట్లాడారు. ముందుగా లాలం భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాలం భరత్, ప్రధాన కార్యదర్శిగా కరెడ్ల ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సూరాడ అప్పలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అండిబోయిన బాబూరావు, చిన్ని నారాయణరావు, కార్యదర్శులుగా శీరా వెంకటరావు, ఉరుకుటి రమేష్, చెల్లూరి నూకన్న, కోశాధికారిగా బద్ది ఈశ్వరరావు ఎన్నికయ్యారు. నాయకులు దూళి రంగనాయకులు, రాజాన రమేశ్‌కుమార్, కె.రఘురాజు, బి.రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చలపతిరావు, తాతయ్యబాబు, నాగేశ్వరరావు

అడ్డంగా దోచేందుకు.. 'అడుగు'పెట్టారు!!

★ మట్టిపోసే ప్రక్రియలోనూ మతలబే
★ అధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారుకు ప్రయోజనం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగర పరిధిలో పచ్చదనం పెంపునకు జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా... ఆయా పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలా వరకు నిధులు వృథా అవుతున్నాయి. ఈ క్రమంలో అక్రమార్కులతో కొందరు అధికారులు చేతులు కలుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పోసిన మట్టి

రూ.36 లక్షలతో: నగరంలోని పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ స్థలంలోని మూడు చోట్ల మొక్కలు పెరగడానికి వీలుగా **అడుగు మేర నాణ్యమైన మట్టి** పోయడం, బోరు, ఇతర పనులు చేపట్టడానికి రూ.36 లక్షలతో టెండర్ పిలిచారు. ఈ పని ఉద్యానవన విభాగానికి చెందినది. అయినా జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ఉద్యానవన విభాగ నిబంధనల మేరకు చేయించాలి. ఇద్దరు గుత్తేదారులు పని దక్కించుకోవడానికి టెండర్లు దాఖలు చేశారు. అందులో ఒకరికి పనులు దక్కాయి. ప్రతిపాదించిన మొత్తం నిధుల్లో 33 శాతం తక్కువకు...అంటే రూ.24.12లక్షలకు గుత్తేదారు పనులు దక్కించుకోవడం గమనార్హం.

పరిశీలన ఎక్కడ: మొక్కల పెరుగుదలకు అనుమైన మట్టిని పోశారా..? లేదా..? అనే అంశాన్ని ఉద్యానవన విభాగం పరిశీలించకపోవడం గమనార్హం. గుత్త సంస్థకు, ఉద్యానవన పొరుగు సేవల సిబ్బందికి మధ్య సత్సంబంధాలు ఉండటంతో నాణ్యమైన మట్టి స్థానంలో రాళ్లతో కూడిన కంకర మట్టి పోసినా... బిల్లుల అనుమతికి దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు.

నివేదిక కోరతాం: 'టెండర్‌లో నిబంధనల ప్రకారం అడుగు మేర మట్టి వేయకుండా పనులు ఆపేయడంతో నోటీసు జారీ చేశాం. ప్రస్తుతం పోసిన మట్టి ఎంత ఎత్తులో ఉందో లెక్క కట్టి, నివేదిక సిద్ధం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం' అని జీవీఎంసీ సహాయ ఇంజినీర్ ఉష పేర్కొన్నారు.

పైపైనే చల్లారు: టెండర్ దక్కించుకున్న వారు మూడు ప్రాంతాలకు ఆరు లారీల్లో మాత్రమే మట్టి తీసుకొచ్చి చల్లారు. అడుగు మేర వేయాల్సిన మట్టిని, అంగుళం ఎత్తులో వేసి వదిలేశారు. మిగిలిన పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు ఆదేశిస్తున్నా... ఆ గుత్తేదారు పట్టించుకోకుండా, బిల్లుల కోసం వైకాపా ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి చేస్తుండటం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారంలో ఇంజినీరింగ్ అధికారులు ఎక్కడా తప్పునకు దొరక్కుండా, ఓ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మరో నోటీసు జారీ చేసి పనిని పూర్తిగా రద్దు చేయడంతో పాటు, గుత్త సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టే అవకాశం ఉన్నా... అధికారులు మాత్రం సమయం చూసి బిల్లులు చేసేందుకే ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత వర్షాలకు పాతమట్టి, పోసిన మట్టి కలిసిపోతుందని గుత్తేదారు అంచనా వేస్తూ.. జాప్యం చేస్తున్నారు.

వర్షానికి పైపైన మట్టి కొట్టుకుపోగా.. కనిపిస్తున్న పాతమట్టి

విగ్రహం చుట్టూ సుందరీకరణ పనులు

అల్లూరి కాంస్య విగ్రహావిష్కరణ నేడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లి పెద్ద మదుం వద్ద అల్లూరి కాంస్య విగ్రహాన్ని సభాపతి అయ్యన్నపాత్రుడు గురువారం ఆవిష్కరించనున్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, ఎంపీలు సీఎం రమేశ్, కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ముఖ్య అతిథులు హాజరుకానున్నారు. సభాపతి అయ్యన్న గురువారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. క్షత్రియ పరిషత్తు అధ్యక్షుడు సూర్యబంగార్రాజు మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు, సుందరీకరణ పనులకు రూ.25 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. విగ్రహం ఎదుట ఫౌంటెయిన్, వెనుక 50 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. క్షత్రియ పరిషత్తు కోశాధికారి నాగేంద్రరాజు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారాగారంలో వ్యసన విముక్తి కేంద్రం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారం ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యసన విముక్తి కేంద్రాన్ని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్ గురువారం ప్రారంభించారు. మత్తు పదార్థాలకు బానిసలైన ఖైదీలను వ్యసన విముక్తులను చేసేందుకు ఇక్కడ చికిత్స అందిస్తారు. నిద్ర పట్టకపోవడం, మత్తు సమస్యల నుంచి బయటపడేలా చేస్తారు. కారాగారంలో ఎక్కువ శాతం ఖైదీలు గంజాయి, మద్యం బానిసలుగా మారి నేరాలకు పాల్పడిన వారే. ఇప్పటివరకు వారిని కేజీహెచ్‌లోని మానసిక వైద్యులయానికి తీసుకువెళ్లి చికిత్స చేయించేవారు. గత ఏడాది హోంమంత్రి అనిత కేంద్ర కారాగారాన్ని సందర్శించినప్పుడు వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రితో మాట్లాడతామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం ఏర్పాటు కావడంతో ఖైదీలకు ఇక్కడే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. డీఐజీ రవికిరణ్, కారాగార పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

5న జాతీయ లోక్‌అదాలత్

విశాఖలీగల్, న్యూస్‌టుడే : ఈనెల 5న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రాజు గురువారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ వివాదాలు, రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, కార్మిక, కుటుంబ వివాదాలు (విడాకులు మినహా) రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

ఉక్కులో తగ్గిపోతున్న ఉద్యోగుల సంఖ్య

ప్రస్తుతం ఉన్నది 10,377 మందే..

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కొద్ది రోజులుగా కొనసాగుతున్న స్వచ్ఛంద, ఉద్యోగ విరమణల నేపథ్యంలో విశాఖ ఉక్కులో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య 10,377కు చేరింది. వారిలో అధికారులు 3131, కార్మికులు 7246 మంది ఉన్నారు. దీనికితోడు 2025 చివరి నాటికి 5002 మంది ఉద్యోగ విరమణతో బయటకు వెళ్లిపోనున్నారు. అనారోగ్య సమస్యలు, మృతి తదితర కారణాలతో సుమారు 2వేలకు పైగా ఉద్యోగులు తగ్గిపోయారు. జులై, 2025 నాటికి 10,377 ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. 2026లో 1438మంది, 2027లో 1411 మంది, 2028లో 1357 మంది, 2029లో 997 మంది, 2030లో 626 మంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. 2010లో 17,830 మంది ఉద్యోగులు ఉండేవారు. ప్రస్తుతం కర్మాగారంలో బ్లాస్ట్ ఫర్నేస్-3 నడుపుతున్నా అందుకు తగినంత మంది ఉద్యోగులు లేకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన నెలకొంది. అందుకు తగినట్లుగా ఉద్యోగుల నియామకం చేపడితే ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం కర్మాగారం మంచి ఫలితాలు సాధించగలదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా కృషిచేయాలని ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల మండల పరిషత్తు కార్యాలయాన్ని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ సుభద్ర గురువారం సందర్శించారు. కార్యాలయానికి వచ్చిన ఆమె సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్తు ద్వారా చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈఓఆర్డీ రఘురాం, సిబ్బంది ఛైర్‌పర్సన్‌ను శాలువా కప్పి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే డి.వి.సూర్యనారాయణరాజు, ఉప ఎంపీపీ దత్తుడు సీతబాబురాజు, ఉప సర్పంచి కిల్లాడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు మండలంలో సమస్యలను ఆమెకు వివరించారు.

అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

పరిశ్రమలకు అనుగుణంగా పాలిటెక్నిక్‌లో మార్పులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్‌నుద్దేశించి ప్రసంగిస్తున్న ఏయూ ఆర్జేడీ రామచంద్రరావు, వేదికపై డాక్టర్ రామకృష్ణ, సత్యనారాయణమూర్తి తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రానున్న విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల పాఠ్య ప్రణాళికలో సవరణలకు సంబంధించిన కార్యశాలను దసపల్లా హోటల్‌లో గురువారం నిర్వహించారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సాంకేతిక విద్యాశాఖ సంయుక్త డైరెక్టర్ పద్మారావు వర్చువల్‌గా ప్రారంభించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ జి.వి.రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామీణ, కార్పొరేట్ విద్య ప్రమాణాల సామరస్యతను తెలియజేయాల్సిన అవసరాన్ని వివరించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వి.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పాఠ్యాంశాలకు సంబంధించిన తొమ్మిది దశల సవరణలను తెలియజేశారు. అకడమిక్ సంయుక్త కార్యదర్శి ఎ.రవికుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాలను రూపొందించాలని కోరారు. శిక్షణ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టు వర్క్స్, ఇంటర్న్‌షిప్, కేస్ స్టడీస్, పరిశ్రమ శిక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 62 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు కోరారు. మండలంలోని కొత్తతలారివానిపాలెం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయ దృష్టికి తీసుకురావాలని పిల్లలకు సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో డీవీఏపీయూ సమావేశం

అనకాపల్లి (గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ (డీవీఏపీయూ) సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సమావేశం ప్రారంభం కానుంది. కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరైన జిల్లా అభివృద్ధిపై చర్చించనున్నారు.

నేటి నుంచి మత్తు వైద్యుల సదస్సు

ప్రారంభమైన కార్యశాల

విశాఖపట్నం, న్యూస్‌టుడే : మత్తు వైద్యశాస్త్రంలో అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్స విధానాలపై గురువారం కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యశాలను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజీ (ఐఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. కేజీహెచ్‌తో పాటు నాలుగు ప్రైవేటు ఆసుపత్రుల్లో సీపీఆర్ విధానాలతో పాటు మత్తు వైద్యం, ఆధునిక పద్ధతుల్ని వివరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పలువురు మత్తు వైద్య నిపుణులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐఎస్ఏ రాష్ట్ర సంఘం 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 4 నుంచి 6 వరకు పీఎంపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో దక్షిణ భారతదేశ స్థాయి వైద్యుల సదస్సు నిర్వహించనున్నారు. ఏడు రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది మత్తు వైద్య నిపుణులు హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక ప్రతినిధులు, వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వి.రవి, డాక్టర్ కె.కూర్మనాథ్, డాక్టర్ వి.కుచేలుబాబు, డాక్టర్ మదన్‌రెడ్డి, డాక్టర్ అపరంజి తదితరులు పాల్గొన్నారు.

కార్యశాలను ప్రారంభిస్తున్న ఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, నిర్వాహక ప్రతినిధులు డాక్టర్ కూర్మనాథ్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రవి తదితరులు

పూర్వవిద్యార్థికి ఆర్థిక సాయం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట రాజీవ్ గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థికి విద్యార్థులు, ఉపాధ్యాయులు మేమున్నాం అంటూ భరోసా ఇస్తూ ఆర్థికసాయం అందించారు. ప్రమాదంలో కాలు కోల్పోయిన పూర్వవిద్యార్థి పి.వినోద్‌కుమార్‌కు కృత్రిమ కాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సమస్య తెలుసుకున్న విద్యార్థులు రూ.72 వేలు సమీకరించగా, అధ్యాపకులు రూ.11 వేలు, ప్రిన్సిపల్ బి.ఉమాశంకర్ రూ. 25 వేలు.. కలిసి మొత్తం రూ.1.08 లక్షల చెక్కును గురువారం విద్యార్థికి స్వగృహంలో అందజేశారు. ధైర్యం కోల్పోవద్దని, కళాశాల విద్యార్థులు, సిబ్బంది వెంట ఉంటారని భరోసా ఇచ్చారు.

వినోద్ కుమార్‌కు చెక్కు ఇస్తున్న ప్రిన్సిపల్ ఉమాశంకర్

'స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్' చేతికి వైజాగ్ జట్టు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) పోటీల్లో తలపడే వైజాగ్ జట్టును స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం కొనుగోలు చేసిందని సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ క్రీడాకారుల్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.మోహిత్‌సాయికుమార్, వైస్‌ప్రెసిడెంట్ బి.బన్సిధర్ తెలిపారు.

గీతంలో ఎంవీవీఎస్ మూర్తి జయంతి

స్మృతి వనం వద్ద గీతం అధ్యక్షుడు శ్రీభరత్ తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గీతం విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎంపీ దివంగత డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి జయంతి గురువారం వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, స్మృతి వనం వద్ద గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, ప్రొ-వీసీలు ఆచార్య వై.గౌతమ్‌రావు, డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ఆచార్య డి.గుణశేఖరన్, సలహాదారు ఆచార్య గొల్లు సూర్యనారాయణ, తెదేపా జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలు కళాశాలల డైరెక్టర్లు, సిబ్బంది నివాళులర్పించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ డాక్టర్ మూర్తి గీతం వంటి విద్యా సంస్థను ఉన్నత సరస్వతీ పీఠంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Creta 2022 Run 72000 Diesel * TATA Punch 2022 Run 7000 Petrol Owner Dirven for Sale. ✆ 9849113313, 8333859555.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

HEALTH & CARE

మందు మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు విశాఖపట్నం : హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావుల మదుం జంక్షన్ వద్ద. ప్రతినెల 5, 19 తేదీల్లో మందులు.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I Sethi Sobha W/o. Sethi Vijay, Previously called as Sobha Setti residing at 44-7-1/24/49, Alluri Seetharamaraju Nagar, Thatichetlapalem, Visakhapatnam-530016. A.P. Now changed my name from Sobha Setti (Old Name) to Sethi Sobha (New Name) Henceforth I will be called as Sethi Sobha for all Purposes.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar+ G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

MVP COLONY

We have beautiful House Villa at Pedawaltair, Near Visakha Eye Hospital build 197 S.Y. Land Construction 2,900 Sq. Feet. North Facing with Interiors and Cupboards. Ph.: 8500337456.

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవే ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

ANANDAPURAM

ఆనందపురం పూలమార్కెట్ సమీపంలో గొట్టిపల్లి ఊరుని ఆనుకొని పంచాయతీ లేఅవుట్ B.T. రోడ్డు, కరెంటు, కాంపౌండ్ వాల్ మొ|| సౌకర్యాలతో 100 గజాలు 11 లక్షలు మాత్రమే. 9652635807.

PENDURTHI

పెందుర్తి జుత్తాడ మరియు రాజయ్యపేటలలో వుడా LRS కలిగిన స్థలములు మరియు నూతన గృహములు అమ్మకానికి కలవు. ✆ 9032038026, 8309303120.

GENERAL

Prime Site 72 & 54 Cents at Dabbanda Near Simhachalam 18km from RTC Complex, Vizag. Contact: 8333859555, 9440320255.

LEASE/ RENT

GENERAL

Parawada Main Road 1700 Sft. each Floor under Construction for Long Lease. Suitable for Banks/ Showrooms etc. 9849261662.

JOBS

Wanted Marketing Manager, 5 Year Experience in MS (ERW), Iron Coil Pipes, Best Pay & High Incentives Cont : 9666341234.

Wanted Godown Boy and Accountant with Tally, Minimum Experience @ Dabagardens, Vizag. Ph: 9885721646.

Delivery Boys Wanted Visiting Card Co. - Vizag Salary 13K - 15K + Petrol Speak Telugu, Hindi. Call : 9887840205.

Wanted Office Assistant Female with knowledge of Cash, minimum Accounts and Computer knowledge. 8.30 AM to 6 PM. Contact: 9393003003.

Wanted Marketing Executives & Courier Pick-up Boys for International Couriers Vizag. ✆ 9963946991, 9966052040.

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth, M/F, Part/ Full excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

JOB OPPORTUNITY
Our Esteem Org. The following jobs to work for our upcoming new branches at Visakhapatnam.
❖ CHIEF ADMINISTRATIVE OFFICERS: Posts-6
Qlf: Retd. Managers in any Dept. & Sector.
Monthly package: 1,25,000/- PM
❖ TEAM LEADERS: Posts-12
Qlf: Min. 1 year Exp. in any Organisation.
Age: 30 yrs & above
Monthly Package: 80,000/-
❖ CUSTOMER SUPPORTING MANAGERS: Posts-15
Qlf: 1 Year exp. in any Business sector.
Age: 30 years & above
Monthly Package: 60,000/-
Note: 1. Appoint immediately
2. Interviews at Board Room
On: 4th & 5th- JULY
Con: M.B.N. SATYANARAYANA
A.S.R. NAGAR-VIZAG.
Ph: 9848197936

బ్రాంచ్ మేనేజర్ & అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ (విజయనగరం & విశాఖపట్నం) కనీసం 3 సం||లు బ్యాంకింగ్/ NBFC/ ఇన్సూరెన్స్/ చిట్ ఫండ్స్ మొ|| అనుభవం కలవారు కావలెను. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులకు అవకాశం కలదు. ఆకర్షణీయమైన జీతంతో పాటు ఇన్సెంటివ్స్ + PF + T.A., హెల్త్ ఇన్సూరెన్స్ కలవు. వర్చువల్ ఇంటర్వ్యూ (ZOOM) 4,5 & 6 జూలై 2025 ఉ|| 10 గం|| నుండి సా|| 5 గం|| వరకు. మీ Resume Whatsapp చేయగలరు. ఫోన్: 97057 09977.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలికాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

Study Power (Education Loans) నందు పనిచేయుటకు Staff మరియు కమీషన్ based Agents కావలెను. ✆ 8977731868.

ప్రైవేటు బ్యాంకులో పనిచేయుటకు క్లర్క్స్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, BDM, CRMS కావలెను. జీతం: 18K, స్పాట్ జాయినింగ్ ✆ 7995439539.

ఫైనాన్స్ రంగంలో అనుభవం గల వైజాగ్ బ్రాంచ్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను (Age: 40 yrs.) & వైజాగ్ సిటీ, అనకాపల్లి, గాజువాక, చోడవరం ఏరియాలలో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను & ఆఫీస్ స్టాఫ్ (Male) Age: 35, (కంప్యూటర్ నాలెడ్జ్) పనిచేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్స్+ TA ఇవ్వబడును. రాఘవ ఆటో ఫైనాన్షియర్స్, దొండపర్తి, వైజాగ్. ✆ 7680880513, 9100902198.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ (M/F) కావలెను. జగదాంబ ఏరియాలో పనిచేయుటకు. జీతము: 14,000/- & ఇతర సదుపాయాలు కలవు. ✆ 8179552684, 9966682926.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కొబ్బరి రైతులకు రాయితీలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కొబ్బరి రైతులు ఆర్‌అండ్‌ఆర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొబ్బరి అభివృద్ధి బోర్డు అధికారి హనుమంతు గౌడ సూచించారు. ఉద్యాన అధికారులతో కలిసి గుడివాడలోని కొబ్బరి తోటలను గురువారం పరిశీలించారు. కొబ్బరిలో తెగుళ్ల నివారణ, దెబ్బతిన్న కొబ్బరి మొక్కలు తిరిగి నాటడం, పలు మొక్కలకు పునర్జీవనంపై రైతులకు సూచనలిచ్చారు. ఈ పథకం ద్వారా గుడివాడలో రైతులు రాయితీలు పొందుతున్నట్లు తెలిపారు. సర్పంచి ధూళి శ్రీను బాబు, మాజీ సర్పంచి నల్లపరాజు వెంకటరాజు, ఉప సర్పంచి రామకృష్ణ రాజు, ఉద్యాన శాఖాధికారి సాయి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న కొబ్బరి అభివృద్ధి బోర్డు అధికారి హనుమంతు గౌడ

చీటీల పేరుతో కుచ్చుటోపీ.. ముగ్గురి అరెస్టు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చీటీల పేరుతో ప్రజలను మోసగించి రూ.కోట్లు కాజేసిన ప్రధాన నిందితురాలితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి గురువారం చోడవరం కోర్టులో హాజరుపరిచారు. దీనికి సంబంధించిన డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితులైన చౌడువాడ శివారు గరుగుబిల్లికి చెందిన పెద్దిరెడ్డి పద్మజతోపాటు (45) ఆమె కుమారుడు సాయి(28), కొత్తూరు బాపనయ్య(42)ను గురువారం అరెస్టు చేశారు. ఈ ముగ్గురిపై అదే గ్రామానికి చెందిన గొలగాన మురళి గత నెల 29న కె.కోటపాడు పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పద్మజ తన కుమారుడితో గురుగుబిల్లిలో నివాసముంటూ ఏడేళ్ల కిందట చీటీల వ్యాపారాన్ని ప్రారంభించింది. ఇందులో క్రమంగా దాదాపు 300 మంది వరకు సభ్యులుగా చేరారు. వారి నుంచి వసూలు చేసిన సొమ్ముతో తమతో పాటు ఉంటున్న బాపనయ్య, తన కుమారుడి పేరుతో కూడా పలు ఆస్తులను కూడబెట్టారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి సుమారు రూ. 1.5 కోట్ల విలువ చేసే ఆస్తులు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు.

మ్యూల్ ఖాతాల సరఫరా నిందితులు..

విశాఖపట్నం: తక్షణ లోన్ యాప్‌ల కోసం మ్యూల్ బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు విశాఖ సైబర్ క్రైం పోలీసులు గురువారం తెలిపారు. ఇటీవల మ్యూల్ ఖాతాల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న కశింకోటకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి ద్వారా రాబట్టిన సమాచారం మేరకు విశాఖ సైబర్ క్రైం పోలీసులు సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు బెంగళూర్‌లో ఓ ముఠాపై దాడులు నిర్వహించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్‌కు చెందిన 13 మంది నిందితులను అదుపులోకి తీసుకుని విశాఖలో రిమాండ్‌కు తరలించారు. 57 చరవాణులు, 137 ఖాతాలు, 11 ల్యాప్‌టాప్‌లు, 132 ఏటీఎం కార్డులు, 4 సీసీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ సిగరెట్ల విక్రయం కేసులో..

నకిలీ సిగరెట్ల విక్రయం, సరఫరాకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'ఇంపీరియల్ టుబాకో కంపెనీ' (ఐటీసీ) సంస్థ గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్, కింగ్స్ తదితర సిగరెట్లను పలువురు డీలర్ల ద్వారా పాన్ దుకాణాలకు సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో రుషికొండ ఐటీ హిల్స్ రోడ్డులో దుకాణం నడుపుతున్న ఎండాడకు చెందిన రాజు ఐటీసీ బ్రాండ్ సిగరెట్ల మధ్య నకిలీవి పెట్టి విక్రయిస్తున్నట్లు సంస్థకు సమాచారం అందింది. ఆయా ప్రతినిధులు బుధవారం దుకాణం వద్దకు వెళ్లి తనిఖీలు చేయగా కొన్ని నకిలీ సిగరెట్ ప్యాకెట్లు లభించాయి. నగరంలోని శంకరమఠం ప్రాంతానికి చెందిన వెంకటరమణ, కోటేశ్వరగుప్త అనే ఇద్దరు వ్యక్తులు తనకు సరఫరా చేస్తున్నారని చెప్పడంతో వారి వద్దకు వెళ్లగా 280 నకిలీ ప్యాకెట్లు దొరికాయి. ఇదే సమయంలో పీఎంపాలెంకు చెందిన పొట్నూరు శివను పట్టుకున్నారు. వీరిని పీఎంపాలెం పోలీసులకు అప్పగించడంతో ఎస్సై రాము కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఐటీసీ సంస్థ గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్ ప్యాకెట్‌ను దుకాణాదారులకు రూ.280కి అందిస్తోందని.. కొందరు నకిలీవి తయారు చేసి ప్యాకెట్ రూ.80 చొప్పున సరఫరా చేస్తున్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

బెట్టింగ్‌లకు బానిసై ఆత్మహత్య

విశాఖపట్నం: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరిలోవ హెడ్‌కానిస్టేబుల్ చంద్రరావు కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా బలిజిపేట మండలం గలావిల్లి గ్రామానికి చెందిన జోల రాము (35) ఏడేళ్ల క్రితం విశాఖ నగరానికి వలస వచ్చాడు. రామాటాకీస్ ప్రాంతంలోని పాతవస్తువుల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో బంధువులు, స్నేహితులు హితబోధ చేసి ఎండాడ ప్రాంతంలో కాపురం పెట్టించారు. కొన్ని రోజులు మామూలుగా ఉన్న రాము తిరిగి వాటికి బానిసై మరిన్ని అప్పులు చేశాడు. భార్య లావణ్య బుధవారం ఇద్దరు కుమారుల్ని తీసుకుని సొంతూరులో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. అప్పుల బాధ తాళలేక బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాను హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి..

పాయకరావుపేట (గ్రామీణం: సీతారాంపురం శివారు మామిడితోటలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు చెట్టు కొమ్మకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పశువుల కాపరి ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నక్కపల్లి ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచినట్లు చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	72
లైవ్	103	92
డ్రెస్‌డ్	149	154
స్కిన్‌లెస్	170	164

(c) eenadu

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **సోలోబోయ్,** రామచంద్ర: **మారన్,** శ్రీసత్య: **3డబ్ల్యూబీ** సత్యనారాయణ స్క్రీన్-1: **కన్నప్ప,** స్క్రీన్-2: **జురాసిక్ వరల్డ్,** వెంకటేశ్వర: **చంద్రేశ్వర,** పర్తిసాయి: **కుబేర,** షిర్డిసాయి: **తమ్ముడు,** **అచ్యుతాపురం:** స్క్రీన్-1: **కుబేర** స్క్రీన్-2: **కన్నప్ప**

గల్లంతైన యువకుడి ఆచూకీకి గాలించాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చేపలవేటకు వెళ్లి పూడిమడక వద్ద సముద్ర తీరంలో గల్లంతైన యువకుడు చోడపల్లి యర్రయ్య ఆచూకీ కోసం ప్రభుత్వం గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యకార కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపల తాతయ్య డిమాండ్ చేశారు. పూడిమడకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మత్స్యకార యువకుడు గల్లంతైనా అధికార యంత్రాంగం ఎటువంటి గాలింపు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. హెలికాప్టర్, తీర రక్షణ దళం, నేవి సిబ్బందితో గాలించాలని కోరారు.

వేగంతోపాటు నాణ్యత తప్పనిసరి

అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయడంతోపాటు నాణ్యతలో రాజీపడవద్దని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశించారు. అచ్యుతాపురం కూడలిలో నిర్మాణంలో ఉన్న పైవంతెన పనులను గురువారం పరిశీలించారు. పనులు అనుకున్న సమయానికంటే ముందే పూర్తిచేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈఈ విద్యాసాగర్, డీఈ, రాధాకృష్ణ, ఏఈ, పద్మజ పాల్గొన్నారు.

అవీ ఇవీ

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని కందిపూడి, ఈదటం, పెదరామభద్రపురం, చినదర్సాపురం, పాల్తేరు, అంకంపేట గ్రామాల్లో శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదన్నారు.

పలు గ్రామాల్లో నేడు..

కోటవురట్ల, న్యూస్‌టుడే: మండలంలోని రాజుపేట, జగ్గంపేట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ అప్పారావు గురువారం తెలిపారు.

అచ్యుతాపురం: కొండకర్ల కూడలి, యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ తెలిపారు.

కశింకోటలో రక్తదాన శిబిరం నేడు

కశింకోట, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామ రాజు జయంతిని పురస్కరించుకుని కశింకోటలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏపీజీవీబీ బ్యాంకు మేడపై ఉదయం 6 గంటల నుంచి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కోటవురట్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. రామచంద్రపాలెం, బాపిరాజు కొత్తపల్లిలలో గురువారం తడి, పొడి చెత్త సేకరించారు. సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈఓఆర్డీ రఘురాం, పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వరూ..

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెదగుమ్ములూరు రెవెన్యూ పరిధిలో దళితులకు ఇచ్చిన డి పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు కోరారు. భూములు పొందిన దళిత రైతులతో కలిసి గురువారం మాట్లాడారు. 2005లో అప్పటి ప్రభుత్వం 23 మంది నిరుపేదలకు 20 ఎకరాల డిపట్టా భూములు ఇచ్చారన్నారు. ఇందులో కొంత మందికి పాసుపుస్తకాలు ఇవ్వాల్సి ఉందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణ, రైతులు భాస్కర్, అప్పారావు, కృష్ణ, రాజమ్మ పాల్గొన్నారు.

సకాలంలో వరి విత్తనాల పంపిణీ

నక్కపల్లి: కూటమి ప్రభుత్వ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని 'పేట' మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ అన్నారు. దేవవరంలో గురువారం రైతులకు ఆయన వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఉద్దండపురంలో కూటమి నాయకులు విత్తనాల పంపిణీ ప్రారంభించారు. మాజీ సర్పంచులు పొడగట్ల రమణ, పేకేటి రాజారావు పాల్గొన్నారు.

విత్తనాలు అందిస్తున్న సత్యనారాయణ

యూరియా సరఫరా నిలుపుదల

మునగపాక, న్యూస్‌టుడే: సర్వర్ పనిచేయలేదని పీఏసీఎస్ సిబ్బంది రెండు రోజులుగా యూరియా సరఫరా నిలుపు చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు సరఫరా చేయక పోవడంపై వీరంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరకు తోటలకు ఎరువులు వేయడానికి ఇదే అదును అని రైతులు బొడ్డేడ సోమరాజు, కాండ్రేగుల వెంకటి అన్నారు.

సాంకేతికతపై అవగాహన సదస్సు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జైపూర్ మాలవ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. డైట్ కళాశాలలో గురువారం నిర్వహించిన సదస్సులో బ్లాక్ చైన్ సాంకేతికత, డిజైన్ థింకింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ వైకుంఠరావు పాల్గొన్నారు.

తీరనున్న సాగునీటి కష్టాలు..

భూమి కాలువకు మహర్దశ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి అభివృద్ధి చెందని సాగునీటి కాలువకు మంచిరోజులు వచ్చాయి. కిలోమీటర్ల మేర పూడిక తొలగుతోంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూడికతీత అనంతరం కాలువ

పాయకరావుపేట నుంచి ఉద్దండపురం వరకు దాదాపు 12 కిలోమీటర్ల మేర ఉన్న తాండవ భూమి ఛానల్ ద్వారా రెండు మండలాల్లో కలిపి సుమారు 1500 ఎకరాలకుపైగా పంటభూములుండగా, నక్కపల్లి మండలం దేవవరం, ఒడ్డిమెట్ట, గొడిచెర్ల, ఉద్దండపురం గ్రామాల్లో వెయ్యి ఎకరాల వరకు ఉంది. కొన్నేళ్లుగా ఈ కాలువలో పూడిక, తుప్పలు పెరిగిపోయాయి. వైకాపా పాలనలో నిధుల లేమితో దీన్ని పూర్తిగా విస్మరించారు. ఫలితంగా సీజన్‌లో సరిగా నీరందక రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్న సమయంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గెడ్డం బుజ్జి తీసుకున్న నిర్ణయంతో రైతాంగానికి మంచిరోజులు వచ్చాయి. ఆయన తన సొంత నిధులతో కాలువ మొత్తాన్ని శుభ్రం చేయించడానికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు రెండు వారాల క్రితం కూటమి నాయకులు, రైతులతో కలిసి ఉద్దండపురం వద్ద యంత్రంతో పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి కాలువ శుభ్రం చేసే పనులు నిరంతరాయంగా సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికి ఏడు కిలోమీటర్ల మేర పూడిక, తుప్పలు తొలగించారు. మరో రెండు వారాల పాటు పనులు సాగనున్నాయి. దాదాపు రూ.పది లక్షలకు పైగా ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇదంతా పూర్తయితే సాగునీటి కష్టాలు గట్టెక్కనున్నాయి. ఇప్పటికే చేసిన పనులతో కాలువ కొత్త రూపు సంతరించుకోగా, అన్నదాతల్లో ఆనందం నెలకొంది.

ఇచ్చిన మాటకోసం

ఈ సాగునీటి కాలువను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. దీంతో వందల మంది రైతులు సాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించింది. దీనిలో భాగంగానే రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో అప్పట్లోనే దీన్ని బాగు చేయిస్తానని మాట ఇచ్చాం. దీని ప్రకారం సొంత ఖర్చుతో ఇప్పుడు పనులు చేయిస్తున్నాను. త్వరలోనే ఇదంతా పూర్తవుతుంది.

– గెడ్డం బుజ్జి, జనసేన, నియోజకవర్గ ఇన్‌ఛార్జి

కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు

విశాఖ రహదారిలో ఏర్పాటు చేసిన భవనం

ఆపరేషన్ అనంతరం బోనులో కుక్కలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లిలో కుక్కల బెడద తగ్గనుంది. ఇంతకాలం ఇక్కడి కుక్కలను పట్టుకొని విశాఖ తీసుకువెళ్లి అక్కడ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసి ఇక్కడకు తీసుకువచ్చేవారు. కుక్కలకు ఆపరేషన్ చేసే సౌకర్యం విశాఖలోనే ఉండేది. దీంతో నెలకు ఒకసారి కూడా కుక్కలను తీసుకువెళ్లడం సాధ్యమయ్యేది కాదు. ఇటీవల ఎక్కడ చూసినా పట్టణంలో వీటి బెడద ఎక్కువైంది. వాటిని పట్టుకోవాలని రోజూ ఏదో ఒక ప్రాంతం నుంచి జోనల్ అధికారులకు ఫోన్లు వస్తూనే ఉంటాయి. దీంతో ఇక్కడే కు.ని శస్త్రచికిత్సలు చేయాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. నిరుపయోగంగా ఉన్న జంతువధ శాలను ఇందుకోసం కేటాయించారు. పట్టణంలోని కుక్కలను పట్టుకొని ఇక్కడకు తీసుకువస్తున్నారు. వీటిని భద్రపరిచేందుకు పది బోనులు ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి రెండు రోజులకోసారి శస్త్రచికిత్సలు చేసే బృందం వస్తుంది. శస్త్రచికిత్సలు చేసిన తర్వాత నాలుగు రోజులు ఇక్కడే పరిశీలనలో ఉంచుతున్నారు. అంతవరకు ఆహారం, నీరు అందిస్తున్నారు. ఆరోగ్యం బాగుపడిన తర్వాత ఎక్కడ పట్టుకున్నారో అక్కడే తిరిగి విడిచిపెడుతున్నారు. దీనివలన భవిష్యత్తులో కుక్కల సంతతి వృద్ధి చెందదని అధికారులు తెలిపారు.

కార్యాలయాలకు చేరేదెలా..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం అనకాపల్లిలో తహసీల్దార్, ఎంపీడీవో, డీఆర్‌డీఏ, సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఒకేచోట ఉన్నాయి. ఈ కార్యాలయాలకు పనుల మీద వచ్చేవారు పనిచేస్తున్న సిబ్బంది వెళ్లే మార్గం వర్షం వస్తే నీటితో నిండిపోతోంది. రహదారి సదుపాయం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎంతో కాలం నుంచి వేధిస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపక ఇబ్బందులు నెలకొంటున్నాయి. ప్రధానమైన నాలుగు కార్యాలయాలకు వచ్చే వారితో ఇక్కడ నిత్యం జనసందడి ఉంటుంది. వీరంతా వర్షం వస్తే నీటిలో కార్యాలయాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రహదారి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా తాగునీటి పథకం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎల్‌పురం గ్రామంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ కాలనీ వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించిన సంపు అసంపూర్తిగా దర్శనమిస్తోంది. పోలవరం కాలువ ఆవల సుమారు మూడు వేల మందికి గత వైకాపా ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఇక్కడ కాలనీ వాసులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడం విస్మరించింది. దీంతోపాటు తాగునీటి ట్యాంకుల నుంచి నిర్మించి పైపులు అమర్చడం మర్చిపోవడంతో పూర్తి స్థాయిలో నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అటవీ ప్రాంతం కావడంతో నీటి కోసం స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు సుమారు రూ.20 లక్షలతో సంపు నిర్మాణం చేపట్టారు. దీనికి పైపులైన్ల పనులు చేయాల్సి ఉంది. నిధులు మంజూరులో జాప్యం జరగడంతో కూటమి ప్రభుత్వం పూర్తి చేసేందుకు దృష్టి సారించింది. పైపు లైన్ ఏర్పాటు చేస్తే తప్ప నీటి సరఫరా జరిగే పరిస్థితి లేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫణివర్మను వివరణ కోరగా సకాలంలో మిగిలిన పనులు చేసి కాలనీవాసులకు తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

ఈ భవనాలు.. నిర్లక్ష్యానికి ఆనవాళ్లు

కొత్తూరులో విలేజ్ క్లినిక్ భవనం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా అసంపూర్తి భవనాలు నిలుస్తున్నాయి. వైకాపా పాలనలో హడావుడిగా ప్రభుత్వ స్థలాల్లో భవనాల పనులు ప్రారంభించినా పూర్తి చేయలేదు. ఏటికొప్పాక, లైనుకొత్తూరు, బయ్యవరంలో రైతు సేవా కేంద్రాలు మధ్యలోనే నిలిచిపోయాయి. విలేజ్ క్లినిక్‌ల పనులు ముందుకు సాగడం లేదు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ సోమశేఖర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నిధులు మంజూరైతే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

కీటకాలకు ఆవాసంగా పాత భవనం

కొప్పాక పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీటకాలకు ఆవాసంగా మారింది. గతంలో వైద్యులు, ఏఎన్ఎంలు రోగులకు ఈ కేంద్రంలో నిత్యం వైద్య సేవలు అందించేవారు. భవనం శిథిలమవడంతో నిరుపయోగంగా వదిలేశారు. దీంతో కేంద్రం ఆవరణ తీగజాతి, పిచ్చిమొక్కలతో నిండిపోయి కీటకాలు, విష సర్పాలకు ఆవాసంగా మారింది. జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఈ స్థలాన్ని వినియోగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి గ్రామీణం

అధ్వానంగా ఆరోగ్య కేంద్రం పరిసరాలు

రామావతారంలో జగన్నాథస్వామి

కశింకోటలో..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా గురువారం అనకాపల్లి పట్టణంలో గురువారం స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంద్రజ్యుమ్న హాలు వద్ద నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, ఈఓ మురళీ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట, మునగపాక, న్యూస్‌టుడే: కశింకోట వేణుగోపాలస్వామి దేవస్థానం ఆవరణలో కొలువైన జగన్నాథస్వామి గురువారం రామావతారంలో పూజలందుకున్నారు. అర్చకులు మారుతీ వెంకటచార్యులు, గోప అప్పలాచారి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. అనకాపల్లికి చెందిన ఈలపాట కళాకారులు విజయ్‌బాబు ఈలపాటతో పాడిన అన్నమయ్య కీర్తనలు, భక్తిగీతాలు అందరిని అలరించాయి. మునగపాక, నాగులాపల్లిలలో జగన్నాథస్వామిని రామావతారంలో అలంకరించారు. అర్చకులు సోమేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ శివారు గణేష్‌నగర్‌లో గురువారం వరసిద్ధి వినాయక ఆలయ 4వ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వైభవంగా మరిడిమాంబ పండగ

రాంబిల్లి, న్యూస్‌టుడే: వెంకటాపురంలో మరిడిమాంబ పండగ గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, సర్పంచి కిల్లాడ తాతబ్బాయి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన రహదారిపై విద్యుద్దీపాలను సుందరంగా అలంకరించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం

అనకాపల్లిలో పథకాలను వివరిస్తున్న బుద్ధ

అనకాపల్లి/గ్రామీణం/పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని పలువురు తెదేపా నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తెదేపా నాయకులు చేపట్టారు. స్థానిక నెయ్యిలవీధి, మండలంలోని చింతనిప్పుల అగ్రహారంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర ప్రచారం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు పరమేశ్వరి ఉద్యానవనం, పీలా వెంకటరెడ్డి నాయుడు వీధుల్లో, తెదేపా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దాడి రత్నాకర్ పట్టణంలోని కస్పావీధిలో పర్యటించారు ★ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లోకేశ్ ప్రజాశక్తి ఫౌండేషన్ గోడపత్రికలను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్రలు గురువారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షులు చదరం తులసీరామ్ పాల్గొన్నారు. 84వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఎలమంచిలి: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. నాయకులు గొంతిన వెంకట్ హరీష్, గొర్లె నానాజీ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో కరపత్రాలు పంచుతున్న ప్రగడ

తెదేపా మహిళా అధ్యక్షుల నియామకం

నక్కపల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు మండలాల తెదేపా శాఖలకు మహిళా అధ్యక్షులను మంత్రి అనిత గురువారం నియమించారు. సారిపల్లిపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఈ మేరకు వివరాలను కార్యాలయ ప్రతినిధులు వెల్లడించారు. నియోజకవర్గ అధ్యక్షురాలిగా మల్లపురెడ్డి రమాకుమారి, నక్కపల్లికి షేక్ ఫాతిమున్నీసా బేగం, ఎస్.రాయవరానికి కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, కోటవురట్లకు పైల రామలక్ష్మిని ఎంపిక చేశారు. ఆ మేరకు వీరిని నాలుగు మండలాల ముఖ్య నాయకులు అభినందించారు.

మహిళా అధ్యక్షులను అభినందిస్తున్న పార్టీ నాయకులు

తెదేపా పరిశీలకుడిగా రాజాన

అచ్యుతాపురం: విశాఖ తూర్పు నియోజకవర్గ తెదేపా పరిశీలకుడిగా తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన గురువారం ఆ నియోజకవర్గంలో పర్యటించి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిశారు.

ద్విచక్ర మెకానిక్‌లను ఆదుకోవాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన మెకానిక్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని మండలానికి చెందిన మెకానిక్ సంఘం నాయకులు కోరారు. ప్రపంచ మోటార్ మెకానిక్ దినోత్సవాన్ని నక్కపల్లిలో గురువారం నిర్వహించారు. ఈమేరకు వీరంతా స్థానికంగా ర్యాలీ చేపట్టారు. కార్మికులకు ఉచిత ప్రమాద బీమా అమలు చేయాలని, 55 ఏళ్లు దాటిన వారికి పింఛను ఇప్పించాలని, కార్యక్రమంలో బొడ్డా ప్రసాద్, కురందాసు అప్పలరాజు, మదీనా, గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న మెకానిక్‌లు

అవగాహనతోనే వ్యాధులు దూరం

మాట్లాడుతున్న ఎంఈఓ రజని, వైద్యాధికారిణి శ్రావ్య

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అవగాహనతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యాధికారిణి శ్రావ్య, ఎంఈఓ రజని సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలను లార్వా దశలోనే నాశనం చేస్తే జ్వరాలను అదుపు చేయవచ్చన్నారు. స్వచ్ఛమైన నీరు తీసుకుంటే ఆరోగ్యానికి మంచి జరుగుతుందన్నారు. ప్రిన్సిపల్ పి.మధు, వైద్య సిబ్బంది సన్యాసిరావు, లండా అప్పలకొండ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

252 మందికి నేత్ర పరీక్షలు

మునగపాక, న్యూస్‌టుడే: నాగులాపల్లిలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల జనసేన అధికార ప్రతినిధి సుందరపు సతీష్ జన్మదినం సందర్భంగా మాజీ సర్పంచి యల్లపు వెంకట భాస్కరరావు ఈ శిబిరం ఏర్పాటు చేయించారు. ఆప్తమాలజిస్ట్ టి.సత్యవతి 252 మంది రోగులను పరీక్షించారు. మునగపాకలో కాండ్రేగుల సంధ్య గృహంలో వృద్ధులకు సతీష్ చేతులమీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. జనసేన నాయకులు బొడ్డేడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నసమారాధన చేశారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: మాజీ వైస్ ఎంపీపీ పిట్టా శ్రీను ఆధ్వర్యంలో కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాథలకు ఆహార సామగ్రి, నిత్యావసర సరకులు అందించారు. జనసేన నాయకులు ఊడి బాబులు, బెజవాడ మణికంత, లంకరాజు పాల్గొన్నారు.

రాంబిల్లి: వెంకటాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కూటమి నాయకులు సతీష్‌కుమార్‌తో కేక్ కోయించారు. నాయకులు రాజాన సన్యాసినాయుడు, పంచకర్ల ప్రసాద్, మోటూరి శ్రీవేణి, జనపరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునగపాకలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న సతీష్

రవాణా రంగం కార్మికులను ఆదుకోవాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము కోరారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను అన్నివర్గాల ప్రజలు కార్మికులు విజయవంతం చేయాలని కోరుతూ అచ్యుతాపురంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. నాయకులు సోమునాయుడు, కర్రి నాయుడు, ఆనంద్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వం కొత్తలేబర్ కోడ్‌లను మార్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ కోరారు. ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఎలమంచిలిలో గోడప్రతులు ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ఆటో కార్మికులు, సీఐటీయూ నాయకుల ర్యాలీ

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి, న్యూస్‌టుడే ?: బాలాజీరావుపేటలోని మురుగు కాలువలో చెత్త, మురుగు పేరుకుపోయింది. – **దాడి బుజ్జి,** ✓: కాల్వలు శుభ్రం చేయిస్తాం. – **రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్**

పాయకరావుపేట, న్యూస్‌టుడే ?: పాయకరావుపేటలోని సీతారామస్వామి కోవెల సమీపంలో డ్రైనేజీలో మురుగు తొలగించాలి. దుర్వాసన వస్తోంది. కాలువ శుభ్రం చేయించాలి. – **జి.రాజు, స్థానికుడు,** ✓: డ్రైనేజీలో పూడిక తీయిస్తాం. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – **ఎం.లవరాజు, ఈవో**

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే ?: రింగురోడ్డులోని రహదారి పక్కగా వ్యర్థాలు పడేస్తున్నారు. దీనివల్ల దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించగలరు. – **రాధాకృష్ణ, అనకాపల్లి,** ✓: వ్యర్థాలను తొలగించి ఇక్కడ వేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. – **రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్.**

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే ?: లైనుకొత్తూరు పంచాయతీ శివారు సోమన్నపాలెం నుంచి మర్రిమంద వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి కింద మురుగునీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – **వెంకట్, స్థానికుడు,** ✓: మురుగునీరు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. – **సోమునాయుడు, పంచాయతీ కార్యదర్శి, లైనుకొత్తూరు**

రోగులకు తీరిన నీటి సమస్య

స్పందనకు వందనం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నీటి సమస్య తీరింది. ట్యాంక్‌కు మరమ్మతులు చేయించారు. గత నెల 7న 'ఈనాడు'లో 'ఏడాదికే ఎన్ని తిప్పలో' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వైద్య విధానపరిషత్ అధికారులు స్పందించారు. 24 గంటలు రోగులకు నీరు అందేలా ఏర్పాట్లు చేశారు. ఆసుపత్రిలో రోగుల కష్టాలు తీరాయి.

కల్తీ మద్యం తయారీ ఆందోళనకరం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కల్తీ మద్యం తయారిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రొంగలి లక్ష్మి డిమాండ్ చేశారు. నాసిరకమైన మద్యాన్ని ప్రజలకు అందిస్తూ వారి ప్రాణాలతో వ్యాపారం చేయడం అత్యంత దారుణమైన విషయమని, దీనిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోరారు. అచ్యుతాపురం కేంద్రంగా మద్యాన్ని కల్తీ చేయడం, మరో రకమైన మద్యంలో కలుపుతూ అక్రమ వ్యాపారం చేయడం ఆందోళనకరమన్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులే కల్తీ మద్యాన్ని వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యంలో నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని లేకుంటే దుకాణాల ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఐద్వా మండల అధ్యక్షురాలు నారాణమ్మ, త్రిమూర్తులు, కాసులమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కార్యదర్శి లక్ష్మి

ఆసుపత్రికి వీల్‌ఛైర్ల అందజేత

ఆసుపత్రికి వీల్‌ఛైర్‌లు అందజేస్తున్న దాత

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం మూడు వీల్‌ఛైర్‌లు, ఐదు బీపీ పరికరాలు, నెబులైజర్‌లను అనకాపల్లికి చెందిన ఆడారి జగన్నాథరావు ఆర్థిక సాయంతో ఆయన కుమారుడు రాజా బుధవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ డీడీ నాయుడు, ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతికుమారి. తాడి రామకృష్ణ, గొర్లి శేఖర్ పాల్గొన్నారు

భూముల స్వాధీనం ఆపాలని వినతి

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేటలో నూకాలమ్మ మాన్యం భూములను ఏపీఐఐసీ అధికారులు స్వాధీనం చేసుకోకుండా కొద్ది రోజుల పాటు ఆపించాలని గ్రామానికి చెందిన మత్స్యకార నాయకులు విన్నవించారు. వీరంతా తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు ఆర్.నరసింహమూర్తిని కలిశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని.. అనుమతిస్తే ఆగుతామని, లేకుంటే ముందుకెళతామని తహసీల్దారు వెల్లడించారు. పిక్కి సత్తియ్య, పిక్కి రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

కశింకోట, న్యూస్‌టుడే: కష్టపడేవారు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెదేపా బీసీ సెల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెదపాటి కళ్యాణి అన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జన్మదినం పురస్కరించుకొని వేగి పవన్ ఆధ్వర్యంలో పది ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ఎం.గౌరీకి రూ.అయిదు వేలు, బి.దీపిక, ఆర్.సాహిత్యకు రూ.మూడు వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. గ్రామానికి చెందిన గుళ్లపల్లి శ్రీనివాసరావు సొంత నిధులతో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని ఎం.ఎస్.స్వర్ణకుమారి, డీఎస్‌ఓ డి.కాళిదాసు పాల్గొన్నారు.

LOST OF PASSPORT

I, **Balireddi Prema Sekhar,** S/o Ramana, residing at D.No. 7-7, Butchiyyapeta (Vi), Kasimkota (Md), Anakapalli (Dist) have lost my Passport **(Passport No.: X9997695)** while we were shifting another house at above mentioned address **on 15-10-2024**
If found, kindly return it to the above address or contact me at
86885 38738

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం శ్రీకన్య ఆడి1: సోలో బాయ్, కన్నప్ప, సితారే జమీన్‌పర్, ఆడి2: మార్గన్, కుబేర్, ఆడి3: తమ్ముడు, ఆడి4: జురాసిక్ వరల్డ్, ఎఫ్1 ది మూవీ, బంగార్రాజు: మార్గన్, రాజు: కన్నప్ప, చోడవరం శ్రీసాయిలక్ష్మి: తమ్ముడు, సాయిలక్ష్మి: కన్నప్ప, పూర్ణ: కుబేర

గరిష్ఠ స్థాయికి పెద్దేరు నీటి మట్టం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయం నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరింది. గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.40 మీటర్లకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై స్పిల్ వేటు గేటు ద్వారా సుమారుగా 100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలోకి 250 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

వరి విత్తనాల పంపిణీ

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలానికి 647 క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించారని వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి చెప్పారు. ఇప్పటివరకు 471 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అగ్రి ల్యాబ్‌లో మొలక శాతం పరీక్షించిన తర్వాతే సరఫరా చేస్తున్నామన్నారు. రైతులు సంచి తెరవకుండా వంద గింజలు మొలక కట్టుకోవాలని సూచించారు. 80 శాతం కంటే తక్కువ మొలక లొస్తే ట్యాగ్ ఉన్న సంచితో తీసుకెళ్లి రైతు సేవా కేంద్రంలో అందజేస్తే పది రోజుల్లోగా మరో విత్తన సంచి అందజేస్తామన్నారు.

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం కలప డిపోలోని అటవీశాఖ నర్సరీ ద్వారా 40 వేల సరుగుడు మొక్కలను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు అటవీ సెక్షన్ అధికారి రామాంజయ తెలిపారు. ఇప్పటివరకు 33 వేల మొక్కలు అందజేశామన్నారు. మిగతావి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు.

నీళ్ల ట్యాంకులను గాలికొదిలేశారు

పాత కొట్నాబిల్లి, అజేయపురం గిరిజన గ్రామాల్లో తాగునీటి పథకాలు పూర్తయినా నేటికి ప్రారంభిచలేదు. వీటిని ప్రారంభించి గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చూడటంలో సంబంధిత శాఖాధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీంతో కొత్త నీటి పథకాలున్నా స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.
– న్యూస్‌టుడే, రావికమతం

పాత కొట్నాబిల్లిలో..

అజేయపురంలో..

✦ టి.అర్జాపురం శివారు పాత కొట్నాబిల్లి గ్రామంలో 270 మంది వరకు నివాసం ఉంటున్నారు. ఇక్కడ గతంలో కట్టిన మినీ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దాదాపుగా కూలిపోయే స్థితిలో ఉండటంతో నీటిని పూర్తిగా నింపట్లేదు. కొద్ది మేరకు లోపల శుభ్రం చేయకపోవడంతో నీరు తాగలేని పరిస్థితి ఉంది. జల్‌జీవన్ మిషన్‌లో రూ.16.90 లక్షలతో 10వేల లీటర్ల సామర్థ్యమున్న మినీ ట్యాంకును కొత్తగా కట్టించారు. ఇంటింటా తాగునీటి సరఫరాకు పైపులైన్, కుళాయిలు ఏర్పాటు ఇప్పటికే పూర్తయ్యాయి. ట్యాంకు నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా దాన్ని వాడుకలోకి తీసుకురాలేదు. ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని చెప్పి వదిలేశారు. చీమలపాడు శివారు అజేయపురంలోని ట్యాంకుది కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ నివసించే వారంతా పీవీటీజీ తెగకు చెందిన ఆదివాసీలు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇక్కడ కూడా రూ.16.80 లక్షలతో 10 వేల లీటర్ల ట్యాంకు నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు మొదలు పెట్టి మూడేళ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి చేయలేదు. ట్యాంకు నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో తాగునీటి సమస్యపై ఆదివాసీ మహిళలు ఖాళీ బిందెలతో పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. ఎట్టకేలకు ఇటీవల ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. దీన్ని కూడా వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. అధికారులు దృష్టి సారించి వీటిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరకొర వసతులు.. శిక్షణకు చిక్కులు

కె.కోటపాడు మండల కుట్టు మిషన్లు

దేవరాపల్లి, న్యూస్‌టుడే

దేవరాపల్లిలోని కుట్టు శిక్షణ కేంద్రంలో మౌలిక సదుపాయాలు లేక మహిళలు అవస్థలు పడుతున్నారు. తాగడానికి నీళ్లు లేక, వర్షానికి పైకప్పు కారిపోవడం, అందరికీ ఒకటే మరుగుదొడ్డి తదితర సమస్యలు వేధిస్తున్నాయి. దీనికితోడు ఇరుకు గది కావడంతో పూర్తి స్థాయిలో కుట్టు యంత్రాలు కూడా అమర్చలేని పరిస్థితి. కె.కోటపాడు మండలానికి చెందిన కుట్టు మిషన్లు ఈ గదిలోనే ఉంచేశారు.

✦ **రూ. లక్షల్లో వ్యయం:** ఈ శిక్షణ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్షల్లో ఖర్చు చేస్తోంది. శిక్షణ బాధ్యతని కొన్ని సంస్థలకు అప్పగించింది. శిక్షణకు వచ్చిన వారిలో 75 శాతం హాజరు కలిగిన వారికి ధ్రువపత్రంతో పాటు కుట్టు యంత్రాన్ని ఉచితంగా అందజేస్తారు. ఇందుకోసం ఒక్కో మహిళకు సుమారు రూ.22 వేలు వెచ్చిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మౌలిక సదుపాయం కలిగిన విశాలమైన భవనం ఉండాలి. కానీ పాడుబడిన ప్రభుత్వ భవనంలో మొక్కుబడిగా శిక్షణ సాగుతోందని పలువురు మహిళలు చెబుతున్నారు.

దేవరాపల్లిలోని శిక్షణా కేంద్రంలో ఇదీ పరిస్థితి..

✦ **ప్రయాస తప్ప పెద్దగా ఉపయోగంలేదు:** మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. ఆటోకి రోజూ రూ.50 ఖర్చు అవుతోంది. ఉదయం 9 గంటలకు వచ్చి కూర్చున్నా మిషను ఖాళీగా ఉంటుందనే నమ్మకం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దకపోతే ఇక్కడికి వచ్చినా ప్రయోజనం ఏముంటుంది. – సుశీల, తెనుగుపూడి

✦ **తడిసిపోయి సరిగా పనిచెయ్యలేదు:** భవనం కారిపోతోంది. కుట్టు మిషన్లు తడిసిపోవడంతో సరిగా పనిచేయడం లేదు. దుస్తులు కట్ చెయ్యడానికి బల్లల సదుపాయం లేక కిందనే కూర్చుని కత్తిరిస్తున్నాం. – వరలక్ష్మి, బోయిలకింతాడ

✦ **సమస్యలున్నట్లు నా దృష్టికి వచ్చింది:** ఈ శిక్షణ కేంద్రంలో సమస్యలున్నట్లు నా దృష్టికి వచ్చింది. వాటన్నింటనీ పరిష్కరిస్తాం. శిక్షణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తాం. – పెంటోజీరావు, ఉమ్మడి విశాఖ జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్

ఉదయం, మధ్యాహ్నం తరగతులు: మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. బీసీ కార్పొరేషన్ సహకారంతో వీటిని మండల కేంద్రాల్లో నెలకొల్పింది. దేవరాపల్లిలోని పూర్వ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గత నెల 8న ప్రారంభించారు. ఒక శిక్షకురాలితో పాటు ఒక సహాయకురాలిని నియమించారు. తొలిదశలో ప్రతిరోజు 80 మంది ఉదయం సాయంత్రం బ్యాచ్‌ల వారీగా శిక్షణకు హాజరయ్యేవారు. కేంద్రంలో సరిపడినన్ని యంత్రాలు ఉన్నా.. చోటు లేక కేవలం 24 మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో ఉదయం పూట వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండటంతో కొంతమంది ఖాళీగా ఉండిపోతున్నారు.

విద్యార్థుల్లేకుంటే పాఠశాలల కొనసాగింపు కష్టం

మాకవరపాలెం: పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను కొనసాగించడం కష్టమని ఎంఈవో మూర్తి పేర్కొన్నారు. శెట్టిపాలెం శివారు వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాలతో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో సమావేశమయ్యారు. అందరం కలిసి ప్రవేశాలను పెంచేందుకు కృషి చేద్దామన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా భీమబోయినపాలెం ప్రాథమిక పాఠశాలలో వైద్య సిబ్బంది విద్యార్థుల ఎత్తు, బరువును నమోదు చేశారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేయనున్నట్లు ఎంఈవో చెప్పారు. ఉపాధ్యాయుడు ప్రసన్నకుమార్, వైద్య సిబ్బంది సుధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక భవనం మంజూరుకు హామీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని మెకానిక్‌లకు సామాజిక భవనం నిర్మాణానికి అవసరమైన భూమిని జోగునాథునిపాలెంలో కేటాయిస్తామని సభాపతి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. జాతీయ మెకానిక్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వరసిద్ధి వినాయక బైకు వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులంతా గురువారం అయ్యన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. విజయదుర్గా మెకానిక్‌ల సంక్షేమ సంఘ సభ్యులు పట్టణంలో బైకు ర్యాలీ చేశారు.

ఉప తహసీల్దారుగా శ్రీరామమూర్తి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండల ఉప తహసీల్దారుగా శ్రీరామమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మురళీధర్ మునగపాక మండలానికి బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన డీటీని వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నర్సీపట్నం, న్యూస్‌టుడే: బలిఘట్టం, పెద బొడ్డేపల్లి ప్రాంతాల్లో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ అప్పారావు చెప్పారు. శ్రీరామ్‌నగర్, ఇందిరా కాలనీ, రామారావు కాలనీ, బీసీ కాలనీ, ఏఎస్ఆర్ నగర్, పాత లక్ష్మీపురం, బలిఘట్టం, భైయిపురెడ్డిపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

రావికమతం: రావికమతం- రాజాం 33 కె.వి లైన్‌లో శుక్రవారం చెట్టు కొమ్మలు నరికివేత చేపడుతున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు చెప్పారు.

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట, న్యూస్‌టుడే: రోలుగుంటలో అక్రమంగా నిర్వహిస్తున్న రాళ్ల క్వారీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. రోలుగుంటలో సుమారు 16క్వారీలను అక్రమంగా నిర్వహిస్తున్నారు. వీటిపై గనుల శాఖ విజిలెన్స్ అధికారులు గతంలో తనిఖీలు చేపట్టి నివేదిక అందజేశారన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు రోలుగుంట మండల సమావేశం

రోలుగుంట, న్యూస్‌టుడే: రోలుగుంట మండల పరిషత్ సమావేశం ఈ నెల 4న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులంతా హాజరు కావాలన్నారు.

అందుబాటులోకి పార్సిల్ కేంద్రం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మండల ప్రజలకు ఆర్టీసీ పార్సిల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ గురువారం చెప్పారు. పాత పోస్టాఫీసు ఎదురుగా ఉన్న మందుల దుకాణంలో పార్సిల్ సేవలతోపాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు టికెట్లు పొందవచ్చన్నారు.

పిడుగుపాటుతో పాడి గేదెల మృతి

కృష్ణదేవిపేట: పాత కృష్ణదేవిపేటలో గురువారం ఉదయం పిడుగుపాటుకు పాడి గేదెలు మృతి చెందాయి. రైతులు చింతల గిరిబాబు, గల్ల అప్పారావుకు చెందిన గేదెలు మృతి చెందగా.. విషయాన్ని పశువైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లారు.

తల్లికి వందనంపై చిత్రలేఖన పోటీలు

బుచ్చెయ్యపేట: తురకలపూడి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం తల్లికి వందనంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చూపారు. విజేతలకు త్వరలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రలేఖ, సహ ఉపాధ్యాయులు టి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: చోడవరం ప్రాంతం నుంచి నగరానికి వచ్చి భిక్షాటన చేసుకుంటున్న ఓ వృద్ధురాలిని ద్వారకా పోలీసులు ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. సీఐ రమణ తెలిపిన వివరాలు ఇలా.. చోడవరం మండలం దుడ్డుపాలేనికి చెందిన పల్లా ఈశ్వరమ్మ(75) కొద్ది రోజుల క్రితం నగరానికి వచ్చేసింది. అప్పటి నుంచి ద్వారకానగర్ బ్రిడ్జి సమీపంలో భిక్షాటన చేసుకుంటూ విభాగినిపై నిద్రిస్తోంది. గమనించిన పోలీసులు వృద్ధురాలి వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గురువారం వారికి అప్పగించారు.

కూలక ముందే మేల్కోండి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి-విశాఖపట్నం ఆర్అండ్‌బీ రోడ్డులో కృష్ణారాయుడు పేట కూడలిలో కల్వర్టుపై స్లాబు కుంగిపోయింది. ప్రమాదకరంగా దర్శనమిస్తున్న ఈ కల్వర్టు ఏ క్షణంలో కూలిపోతుందో అని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఇదే ప్రధాన రోడ్డు కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దీనిపై నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా జీవీఎంసీ, ఆర్అండ్‌బీ శాఖలు ఒకరిపై ఒకరు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పూర్తిగా కూలిపోక ముందే సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇదీ కల్వర్టు పరిస్థితి

పెద్ద చెరువు కాలువను బాగు చేయండి: సభాపతి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లి పెద్దచెరువు కాలువకు అవసరమైన మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టి సాగు భూములకు నీరందేలా చర్యలు చేపట్టాలని సభాపతి అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు.

ఈఈ బాలసూర్యానికి సూచనలు ఇస్తున్న సభాపతి అయ్యన్న

కాలువ పూడుకుపోయి సాగునీరందని విషయాన్ని ఆయకట్టు రైతులు సభాపతి దృష్టికి తీసుకురాగా గురువారం అధికారులతో కలిసి కాలువను పరిశీలించారు. పూడిక తీసేందుకు రూ. రెండు లక్షలు అవసరమని జలవనరుల శాఖ ఈఈ బాలసూర్యం చెప్పారు. నిధులు విడుదల చేయిస్తానని అయ్యన్న హామీ ఇచ్చారు. కల్వర్టులో పూడిక తొలగించాలని ఆర్అండ్‌బీ అధికారులను సూచించారు. కల్వర్టు పునర్నిర్మాణానికి రూ.38 లక్షలు అవసరమని ఆర్అండ్‌బీ ఏఈఈ నాయుడు చెప్పారు. ఈ పని వేసవిలో పెట్టుకోవాలి. తాత్కాలికంగా నీరొచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. కాలువ ఆక్రమణలుంటే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు సూచించారు.

అల్లూరి జయంతికి ఏర్పాట్లు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలకు సభాపతి అయ్యన్న, మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రధాన రహదారిలో పారిశుద్ధ్యం మెరుగుకు పంచాయతీలు చర్యలు చేపట్టాయి. ఎంపీడీవో మేరీ రోజీ ఆదేశాల మేరకు కొత్తమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, చోద్యం, లింగంపేట, ఏఎల్‌పురం పంచాయతీల కార్యదర్శులు యంత్రాలతో వ్యర్థాలను ఊరికి దూరంగా తరలించి రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించారు. కృష్ణదేవిపేటలోని నందనవనంలో డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, కృష్ణదేవిపేట, గొలుగొంది ఎస్సైలు తారకేశ్వరరావు, రామారావు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సిబ్బందికి సూచించారు.

నందనవనంలో వేదికను తనిఖీ చేస్తున్న పోలీసులు

అలంకారంగా శవాగారం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: చోడవరం నుంచి సింహాద్రిపురం వెళ్లేదారిలో తామరచెరువు శ్మశానవాటిక వద్ద నిర్మించిన శవాగారం వృథాగా ఉంది. ఏపీఎంఐడీసీ నిధులు రూ.38లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పలు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఇన్‌ఛార్జి వైద్యాధికారి దినేష్ మాట్లాడుతూ ఫేస్-3 విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో కేంద్రం ప్రారంభించలేదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

తామరచెరువు శ్మశానవాటిక వద్ద నిర్మించిన భవనం

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

పాడేరు: జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని ఇన్‌ఛార్జి వైద్యాధికారి విశ్వేశ్వరరావునాయుడు అన్నారు. గురువారం తన కార్యాలయంలో జిల్లా వైద్య విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు చేయాలని పేర్కొన్నారు. ప్రసవ తేదీకి వారం రోజుల ముందు ఆసుపత్రులు లేదా గర్భిణుల వసతిగృహాలకు తరలించాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.కిరణ్‌కుమార్, ఇమ్యునైజేషన్ అధికారి కమల కుమారి, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ప్రసూతి నిపుణులు డాక్టర్ పి.స్వప్న పాల్గొన్నారు.

నిరసనలో సీపీఎం నాయకులు

హైడ్రో ప్రాజెక్టు అనుమతుల్ని రద్దు చేయాలి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: రైవాడ జలాశయ జీవనాడికి ముప్పు కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండు చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేవరాపల్లి నాలుగురోడ్ల ప్రధాన కూడలిలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర, సత్యనారాయుడు, దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం ఆదర్శ పాఠశాలలో చేరిన బాలలతో అధికారులు

ఉపాధ్యాయుల చొరవతో పెరిగిన ప్రవేశాలు

నాతవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషి ఫలించింది. నాతవరంలోని ఆదర్శ పాఠశాలలో గతేడాది 34 మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది కొత్తగా 50 మంది చేరారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి మెరుగైన విద్యా బోధన చేస్తామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. దీంతో నాలుగు రోజుల్లో పదుల సంఖ్యలో ప్రవేశాలు వచ్చాయని ప్రధానోపాధ్యాయుడు కె.వరహాలబాబు చెప్పారు.

ప్రజల్లోకి సుపరిపాలన

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపెంట, ములకలాపల్లిలో గురువారం జరిగిన 'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ఆదాయ వనరుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అనేక ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటూ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. హామీల్లో భాగంగా మూడు పథకాలు ఇప్పటికే అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆర్.వెంకటరావు, మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడునాయుడు, జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కొత్తపెంటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని మర్రివలస, కన్నంపేట, మమ్మవరం, కొత్తకోట గ్రామాల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు రాజాన కొండనాయుడు చెప్పారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు హాజరవుతారని చెప్పారు. తెదేపా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మండల పార్టీ అధ్యక్షుడు కొండనాయుడు తెలిపారు.

మాడుగుల గ్రామీణం: ఒమ్మలి, జంపెన, పొంగలిపాక గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును తెలుసుకున్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి పుప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చీడికాడ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జేబీపురం కెనరా బ్యాంకు శాఖ మేనేజర్ కూర్మారావు కోరారు. దేశంలో కెనరా బ్యాంకు ఏర్పాటై. 120 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం చీడికాడ మండలం జేబీపురం శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు.

మాడుగుల గ్రామీణం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం ఉంటామని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

జేబీపురం పాఠశాలలో మొక్కలు నాటుతున్న కెనరా బ్యాంకు మేనేజర్ కూర్మారావు తదితరులు

రావికమతం: రావికమతంలో మెయిన్ రోడ్డు పక్కన గుట్టలుగా ఉన్న చెత్త కుప్పలను తరలించే పనులు చేపట్టారు. గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డు లేకపోవడంతో సేకరించిన చెత్తను ఆర్ఈసీ రోడ్డులో వ్యవసాయశాఖ కార్యాలయం పక్కన గుట్టలుగా వేస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సత్యవతి అన్నారు.

నర్సీపట్నం, న్యూస్‌టుడే: బలిఘట్టం జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా గురువారం ర్యాలీ చేశారు. పాలిథిన్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

బురద దారి.. బాధలే మరి!

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు బురదమయంగా మారాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలు లోతట్టుగా ఉండడంతో వర్షం నీరంతా అక్కడకు చేరుతోంది. బురద దారిలో నడవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలోని అర్జునగిరిలో గురువారం పసలమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. పశువులను ముస్తాబు చేసి అమ్మవారి పుట్ట వద్దకు తీసుకెళ్లారు.

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని చినపాచిల గ్రామదేవత మరిడిమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. సాసుబిల్లి చినపుడు కుటుంబీకులు ఆధ్వర్యంలో ఈ అమ్మవారి పండగను జరిపిస్తుంటారు. పదేళ్ల తర్వాత అమ్మవారి పండగ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: జి.కోడూరులో తలుపులమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. డప్పుల వాయిద్యాలతో భక్తులు గరగలు ఊరేగించారు.

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం గ్రామంలో గురువారం మరిడిమాంబ పండగ వైభవంగా జరిగింది. అయిదేళ్లకోసారి వచ్చే పండగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చోడవరంలో క్యూలో వెళ్తున్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

మాకవరపాలెం, న్యూస్‌టుడే: వజ్రగడ శివారు తమ్మయ్యపాలెంలో కాలువలు లేకపోవడంతో నివాసాల్లో వాడిన నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. కొన్ని వీధుల్లో కాలువల నిర్మాణం చేపట్టి మట్టిని తవ్వి గుత్తేదారులు రహదారులపైనే వదిలేశారు. – **అప్పలనాయుడు, తమ్మయ్యపాలెం**, ✔: సమస్య పరిష్కరిస్తాం. రహదారులపై మురుగు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. రహదారులపై వేసిన మట్టిని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – **ఈఓపీఆర్డీ సీతామహాలక్ష్మి**

రోలుగుంట, న్యూస్‌టుడే: కల్యాణకొత్తూరుకి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఫ్యూజ్ బాక్సు భూమికి కేవలం మూడు అడుగులు ఎత్తులో మాత్రమే అమర్చారు. దీనికితోడు ఎలాంటి రక్షణ కవచం లేదు. – **అప్పారావు, కె.కొత్తూరు, అడ్డసరం పంచాయతీ** ✔: చాలాకాలంగా రోలుగుంటకు పూర్తిస్థాయి ఏఈ లేరు. సమస్యల పరిష్కారానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులతో చర్చించి ఈ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం. – **యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ**

స్పందనకు వందనం

గుజ్జుమానుపాకల సమీపంలోని బొడ్డేరులో ఇసుక తవ్వకాల వల్ల వంతెన పునాదులు బలహీనపడుతున్నాయని 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 3న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ర.భ.శా. అధికారులు ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టారు. – **న్యూస్‌టుడే, గొలుగొండ**

బడిలో ఒకే విద్యార్థి

రోలుగుంట, న్యూస్‌టుడే: అడ్డసరం శివారు కె.కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో కేవలం ఒకే విద్యార్థితో నడుస్తోంది. గతేడాది అయిదుగురు విద్యార్థులుండగా వారంతా ఇక్కడి నుంచి ఉన్నత చదువుల కోసం మరో ప్రాంతానికి వెళ్లిపోవడంతో.. ప్రస్తుతం కేవలం ఒక్క విద్యార్థితోనే నడిపిస్తున్నారు. ఈ గ్రామంలో వందకు పైగా జనాభా ఉండగా 1, 2 తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు. గ్రామంలో బడి ఈడు పిల్లలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పాఠశాల కోసం పురాతన గదితో కలిపి రెండు భవనాలున్నాయి. ఇందులో ఒక భవనాన్ని తాత్కాలికంగా అంగన్‌వాడీ కేంద్రానికి వినియోగిస్తున్నారు.

ధర్నాలో మున్సిపల్ కార్మికులు

సబ్ కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగం కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ సబ్ కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలంటూ నినాదాలు చేశారు. అప్పలనాయుడు, మురళి, నాగేంద్ర, దుర్గ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

చోడవరం పట్టణం: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం కార్మికులు ధర్నా చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ మార్చి నుంచి బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకపోతే 9తేదీన సమ్మె చేపడతామని ఎంఈఓ లక్ష్మణరావుకు వినతిపత్రం అందించారు.

ఎంఈఓ లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న గూనూరు వరలక్ష్మి, సభ్యులు

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1- **జురాసిక్ వరల్డ్** (మార్నింగ్, ఫస్ట్ షో), **కన్నప్ప** (మ్యాట్నీ, సెకండ్ షో) స్క్రీన్-2 - **తమ్ముడు**

రవీంద్రభారతి పాఠశాల జప్తు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ద్వారకానగర్ రవీంద్రభారతి పాఠశాలను గురువారం జప్తు చేసినట్లు కార్మిక రాజ్య బీమా సంస్థ రికవరీ అధికారి జి.వేణుమాధవ్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం తమ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో పాఠశాల భవనాన్ని అభిజిత్ కుమార్ తదితరులు జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సంస్థ తప్పకుండా తమ ఉద్యోగులకు చెల్లించాలని ఈఎస్ఐ బకాయిలు వెంటనే జమ చేయాలని సూచించారు.

వేపగుంట- పినగాడి మధ్య 60 అడుగుల రోడ్డు

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తి మండలం వేపగుంట నుంచి పినగాడి వరకు ధ్వంసమైన రహదారి స్థానంలో 60 అడుగుల వెడల్పుతో నూతన రహదారి నిర్మించడానికి ఆమోదం లభించిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అర్బన్, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసేలా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా రహదారి నిర్మిస్తాయని పేర్కొన్నారు. వేపగుంట నుంచి లక్ష్మీపురం రైలు పైవంతెన వరకు రూ.1.40 కోట్ల జీవీఎంసీ నిధులతో, వంతెన నుంచి పినగాడి కూడలి వరకు వీఎంఆర్‌డీఏ నిధులతో రహదారి నిర్మాణం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: ప్రహ్లాదపురం సింహాద్రి ఆసుపత్రి సమీపంలో 49ఎ/11/1 వీధి దీపం వెలగడం లేదు. రాత్రుళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – రమణమూర్తి, ప్రహ్లాదపురం ✓: వీధి దీపానికి మరమ్మతులు చేయించి వెలిగేలా చేస్తాం. – హరగోపాల్, వీధి దీపాల నిర్వహణ అధికారి

అవీ ఇవీ

దారుల్లో గోతులు.. రాకపోకలకు కష్టాలు..!

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ పరిధి లక్ష్మీనగర్, కిశోర్‌లేఅవుట్ కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సుమారు అయిదు వేల మంది జనాభా నివాసం ఉండే కాలనీల్లో పలు బహుళ అంతస్తు భవనాలు, వ్యక్తిగత గృహాలు ఉన్నాయి. మరిన్ని నూతన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయినా కనీస మౌలిక వసతులు సమకూరడం లేదని నివాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యూజీడీ పనుల కోసం రోడ్లను తవ్వేయడంతో, ఎక్కడికక్కడ అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేయడంతో... రాత్రి సమయంలో ప్రయాణించే వారు జారి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి.. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కిశోర్ లేఅవుట్‌లో...

వీఎంఆర్‌డీఏ అధికారుల తీరుపై రైతుల నిరసన

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని వివాదాస్పద వీఎంఆర్‌డీఏ 144 ఎకరాల భూముల విషయంలో అధికారుల తీరును వ్యతిరేకిస్తూ రైతులు గురువారం నిరసనకు దిగారు. ఇక్కడ భూముల్లో రైతులు మొక్కలు నాటుకుంటుంటే వీఎంఆర్‌డీఏ సిబ్బంది అడ్డు చెప్పడమే కాకుండా మొక్కలు వేసిన రైతులపై పెందుర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల తీరును ఖండిస్తూ పెద్దఎత్తున రైతులు వివాదాస్పద భూముల్లోకి వచ్చి నిరసన తెలిపారు. వివాదాన్ని పరిష్కరిస్తామని అధికారులు ప్రకటించడం తప్ప ఏ రోజు రైతులతో సమావేశం నిర్వహించలేదన్నారు. ఏ ఉద్దేశంతో ఇక్కడ భూములను చదును చేశారని నిలదీశారు. కొందరు రైతు పెద్దలు మాట్లాడుతూ ఈ భూముల విషయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని ఈ స్థలాల్లోకి రైతులు మినహా ఏ ఒక్కరూ వెళ్లకూడదంటూ ఆర్డర్ తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ దౌర్జన్యంగా అధికారులు వస్తున్నారన్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనువాసరావు, రాపర్తి కన్నా, ముమ్మన దేముడు, గ్రామ పెద్దలు ముత్యానాయుడు, గంట్ల దేముడు, సాలాపు రమణ, వార్డు జనసేన మహిళా అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి తదితరులు పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు.

వుడా వివాదాస్పద భూముల్లో నిరసన తెలుపుతున్న రైతులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం, అంతకాపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, పెద గొల్లలపాలెం, అసకపల్లి, ఇరువాడ, గొట్టివాడ, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలి భీమవరం, అడ్డూరు, పంచాయతీల పరిధిలో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌పై అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: చోడవరం మండలం అడ్డూరు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించనున్న వీఎంఆర్‌డీఏ ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌పై సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ కల్పించనున్న వసతులు, ఆన్‌లైన్ బిడ్డింగ్, అనుమతులపై ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ చైతన్య అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ చైతన్య

బాలికలకు దుస్తుల అందజేత

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే : పెందుర్తి మండలం రాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్లస్ టూ కళాశాల విద్యార్థినులకు నగరంలోని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ చేతుల మీదుగా గురువారం ఏకరూప దుస్తులు అందించారు. వెంకటరమణ గురువు బొబ్బిలి శ్రీరామ్మూర్తి 75వ జన్మదినం సందర్భంగా ఒక్కో విద్యార్థినికి రెండు జతల దుస్తులు సమకూర్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు వెంకటరావు, రాము, కె.జయప్రసాద్, సీతాపతి, చక్రవర్తి, శ్రీదేవి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు, గురువులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అమృతపురంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. సబ్బవరం మండలం అమృతపురంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబ్జీ హాజరై మాట్లాడారు. వైకాపా హయాంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినప్పటికీ సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. వచ్చే రెండు నెలల్లో అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి వంటి పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికుడు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు, గండి వంశీదీప్, గండి దేముడు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, కొటాన అప్పారావు, రేసుపూడి రమణ కోరాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: ఏడాది కూటమి పాలన పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం గురువారం పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో జరిగింది. జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో గ్రామ తెదేపా అధ్యక్షుడు డి.శ్రీధర్, నాయకులు ఎ.బంగారయ్య, డి.సారథి, ఎ.శ్రీను, ఆర్.సురేశ్, కె.రాజు, సీహెచ్.రాంబాబు తదితరులు ఇంటింటికీ వెళ్లారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు అందజేశారు. పార్టీశ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాంపురం ప్రచారంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

బంటాకాలనీలో పోలీసుల తనిఖీలు

కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో పెందుర్తి పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయాన్నే ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పెద్దసంఖ్యలో కాలనీకి చేరుకుని ఇళ్లు, దుకాణాలు, వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరాలు నియంత్రణకు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పోలీసులకు ఏవిధంగా సహకరించాలనే విషయాలను కాలనీవాసులకు సీఐ సతీశ్‌కుమార్ వివరించారు.

గ్రామాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సబ్బవరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047ను పురస్కరించుకుని సబ్బవరం మండలం మొగలిపురంలో గురువారం తడి - పొడి చెత్త నిర్వహణపై గ్రామస్థులకు ఎంపీడీవో పి.పద్మజ అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసే గ్రీన్ అంబాసిడర్లకు ఎలా ఇవ్వాలో వివరించారు. అనంతరం సంపద తయారీ కేంద్రం, మంచినీటి ట్యాంకును పరిశీలించారు. క్లోరినేషన్ విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీధి కాలువలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలకడం వంటివి చేయడం వల్ల వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చైతన్య, పంచాయతీ కార్యదర్శి రజని, అంగటి నానాజీ, తమరాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పద్మజ

రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అనేక మేలు జరుగుతోందని, సబ్బవరం మండలం గొట్టివాడ సర్పంచి సాలాపు మీన పేర్కొన్నారు. అన్నదాతలకు రాయితీ విత్తనాలను కిలో రూ.10 చొప్పున అందేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు కావాల్సిన వరి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు ప్రశాంతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బొండా సత్యారావు, సాలాపు వెంకటేశ్వరరావు, చెరువు కమిటీ అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, బొండా శివ, బగ్గ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందజేస్తున్న గొట్టివాడ సర్పంచి సాలాపు మీన

నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడలో నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్‌స్టేషన్ కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ కల్తీ మద్యం దందాపై సమగ్ర విచారణ చేసి దాని వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులను ఎత్తివేయాలని, మద్యాన్ని నియంత్రించాలని కోరారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా ప్రతినిధులు

ఏయూ, ఎన్ఎస్‌టీఎల్ సంయుక్త పరిశోధనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు పనిచేసే దిశగా ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు చర్చించారు. ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో గురువారం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, ఏయూ అధికారులతో ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు వి.ఎఫ్.సాజి, వి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాలరావు సమావేశమయ్యారు. ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగంతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలోని పలు విభాగాలతో సంయుక్తంగా కలిసి పని చేయడంతోపాటు త్వరలో ఒక సాంకేతిక సమ్మేళనం (కాంక్లేవ్) నిర్వహించడంపై సమాలోచనలు జరిపారు. ఎంటెక్ నావెల్ ఆర్కిటెక్చర్(సాయంత్రం కోర్సులో) ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, సిబ్బందికి భాగస్వామ్యం కల్పించాలని ప్రతిపాదించారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఔట్‌రీచ్ డీన్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, అధికారులతో ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు

అనాటమీ మ్యూజియానికి గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్ర వైద్యకళాశాల అనాటమీ విభాగం మ్యూజియానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్ మ్యూజియమ్స్ అండ్ సైన్స్ సెంటర్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది. మ్యూజియంలో ఉన్న స్పెసిమెన్లను ఇప్పటికే విదేశాలకు తీసుకెళ్లి, అవగాహన కార్యక్రమాలు ముగిసిన తర్వాత మళ్లీ వెనక్కి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిశోర్ తెలిపారు.

ఖడ్గమృగం పుర్రె

ఆటోల దొంగల అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆటోలు, బ్యాటరీలు చోరీ చేస్తున్న దొంగలను అరెస్టు చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు తెలిపారు. భీమవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా పేరికిగూడెం గ్రామానికి చెందిన పి.నాగరాజు విశాఖపట్నంలో ఉంటున్నాడు. ఇతను భీమవరం రెండో పట్టణంలోని రెండు చోట్ల ఆటోలను అపహరించాడు. దీనిపై డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సీఐ జి.కాళీచరణ్ దర్యాప్తు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి జాతీయ రహదారిపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఇదే తరహాలో మిగిలిన జిల్లాల్లోనూ ఎక్కడైనా ఆటోలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు ఉన్నాయా అని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆరా తీశారు. అక్కడి నుంచి కూడా దొంగిలించిన ఆటోలను జాతీయ రహదారి మీదుగా విశాఖ వెళ్లినట్లు తేలింది. దాంతో సీసీ కెమెరా ఫుటేజీలో ఉన్న దొంగ కోసం గాలించగా నాగరాజుగా తేలింది. ఇతనిపై మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో గతంలో డీసీ షీట్ ఉండటంతో విచారణ వేగవంతం చేశారు. భీమవరం, ఆకివీడు, అమలాపురం, విశాఖ, మండవల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.17 లక్షల విలువైన 13 ఆటోలను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆటోలను ఓ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

అతని గురించి గాలిస్తుండగా ఇటీవల పెనుమంట్రలో ఆటో అపహరణ సమయంలో త్రుటిలో పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. జిల్లాలోనే ఉంటున్నాడని చరవాణి లొకేషన్ ఆధారంగా గాలించగా తాడేపల్లిగూడెంలోని ఓ లాడ్జిలో బస చేసినట్లు గుర్తించి పట్టుకున్నారు. వివాహానికి ముందు నుంచి దొంగతనాలకు అలవాటు పడిన నాగరాజుకు అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన పి.గణేష్ సహకరించడంతో అతన్ని కూడా అరెస్టు చేశారు.

కేసుల వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ భీమారావు

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: బడి ఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో నరవలోని జామియా ఇస్లామియా అష్రఫుల్ ఎడ్యుకేషన్ సొసైటీ, గవరపాలెం, గొరపల్లి ఎంపీపీ పాఠశాలల పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీల్లో చదువుకునే పిల్లల తల్లితండ్రులకు సూచించి 65 మందిని వివిధ పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌సీవో జి.శ్రీనివాసరావు, అదనపు ఏఎంవో జి.లక్ష్మి, సీఆర్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నరవలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ప్రతినిధులు

ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల స్థితిగతులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరా తీశారు. గురువారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టు పనులు, ఆలస్యానికి గల కారణాలపై అధికారులతో మాట్లాడారు. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టు పనులపై పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్.రవితో చర్చించారు. ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

ఫార్మాలో భద్రతకు మాక్‌డ్రిల్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్ ఫార్మా సంస్థ యూనిట్-3లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్.రావు, హెచ్‌ఆర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చావ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రొడక్షన్ బ్లాకులోని స్ప్రేడ్రయ్యర్ వద్ద పేలుడు సంభవిస్తే భద్రత తదితర సిబ్బంది ఏవిధంగా స్పందించాలి...ఎలా ప్రమాదాన్ని అదుపు చేయాలి.. సహాయక చర్యలు ఏవిధంగా చేపట్టాలి... గాయపడిన వారిని బయటికి తీసుకురావడం, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తరలించడం తదితర విన్యాసాలు ప్రదర్శించారు. హెచ్‌ఆర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడేపూడి రామకృష్ణ, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న శివశంకర్‌రెడ్డి తదితరులు

బాక్సింగ్‌లో 'రైల్వే మహిళల' ప్రతిభ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : అఖిల భారత మహిళల బాక్సింగ్ పోటీల్లో భారత రైల్వే బాక్సింగ్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన పోటీలు గురువారం ముగిశాయి. మహిళా బాక్సర్లు జ్యోతి, ఎన్‌బీ.చాను, ప్రచీ, శశిచోప్రా, లాషుయాదవ్, పాథన్, మంజురాణి, నేహా తదితరులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చూపిన వారిలో వివిధ రైల్వే జోన్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి

పరవాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. లంకెలపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అర్జున్, కోటేశ్వరరావు, రామారావు, మూర్తి పాల్గొన్నారు. 77వ వార్డులో జరిగి కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

లంకెలపాలెంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

సర్వర్ మొరాయింపుతో అవస్థలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : సర్వర్ మొరాయిస్తుండటంతో రేషన్ సరకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీంతో కార్డుదారులు గంటల కొద్దీ డిపోల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 610 డిపోల పరిధితో పాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల డిపోల్లో ఇంచుమించు ఒకే సమయంలో సరకుల పంపిణీ జరుగుతోంది. దీంతో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుత రద్దీకి అనుగుణంగా సర్వర్ల సామర్థ్యం పెంచకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువారం నగరంలోని పలు డిపోల వద్ద కార్డుదారుల సరకుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి... ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్డుదారులు కోరుతున్నారు.

పందిమెట్ట ప్రాంతంలోని డిపో వద్ద కార్డుదారులు

గొల్లపేటలో చేతిబోరు ప్రారంభం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం సమీపంలోని గొల్లపేట గ్రామంలో జీవీఎంసీ నిధులు వెచ్చించి చేతిబోరు ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

మూర్తి సేవలు నిరుపమానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెదేపా సీనియర్ నేత, మాజీ ఎంపీ, దివంగత ఎంవీవీఎస్.మూర్తి అందించిన సేవలు నిరుపమానమని విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. గురువారం నగర పార్టీ కార్యాలయంలో మూర్తి జయంతి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కేప.నాయుడు, పొలమరశెట్టి శ్రీనివాసరావు, కోరాడ రాజబాబు, సుజాత, ముత్యాలనాయుడు, గాయత్రీ ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ

పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్తివానిపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: సత్తివానిపాలెం ఎస్‌టీబీఎల్ సీతారామాగార్డెన్స్ కాలనీలోని రామాలయం ప్రాంగణంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వారాహి దేవికి సహస్ర దీపాలంకరణ, సామూహిక కుంకుమార్చనలు జరిపారు. శుక్రవారం చక్రార్చన, మూలమంత్ర హవనం, 5న తిరువీధి ఉత్సవం, అభిషేకం, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనాలతో వేడుకలు ముగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

వారాహి అమ్మవారికి పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో కొలువైన వారాహి అమ్మవారి సన్నిధిలో గుప్త నవరాత్రులు సంప్రదాయంగా జరుగుతున్నాయి. అర్చకులు గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు.

ఆధ్యాత్మికం

6న మరిడిమాంబ పండగ

వరలక్ష్మీనగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: వరలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం మరిడిమాంబ(పశువులమ్మ) అమ్మవారి పండుగను ఈనెల 6న ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మూడు రోజుల పాటు జరిపే ఉత్సవాల్లో తొలిరోజు శుక్రవారం గణపతి పూజ, 108 కలశాలతో అభిషేకం, సాయంత్రం మంత్రపుష్ప నీరాజనం, 5న సహస్ర కుంకుమార్చన, సాయంత్రం దీపారాధన, 6న అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, సాయత్రం పురవీధుల్లో ఊరేగింపు, రాత్రి అనుపోత్సవం ఉంటుందన్నారు.

రామావతారంలో జగన్నాథుడు

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

(c) eenadu

వైకాపా నాయకుడి దుశ్చర్య

కె.కె.అగ్రహారంలో రహదారి ఆక్రమణ

ఎస్సీకాలనీకి వెళ్లే రహదారిలో ఇంటి నిర్మాణానికి వేసిన పునాది

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : బుక్కరాయసముద్రం మండల పరిధిలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన కె. కె. అగ్రహారం గ్రామంలో ఓ వైకాపా నాయకుడు రహదారిని ఆక్రమించాడు. ఇతను పీర్ల చావిడి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. తన స్థలంతో పాటు 300 కుటుంబాలు నివాసం ఉంటున్న ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని కబ్జా చేసి పునాది వేశాడు. ఇంత జరుగుతున్నా గ్రామంలో ఎవరూ అతన్ని ప్రశ్నించే సాహసం చేయడం లేదు. దీంతో ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు చేసుకుంటున్నాడు. ప్రస్తుతం గృహం పునాది దశలో ఉన్నందున పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి... నిర్మాణం చేపట్టకుండా నిలువరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కబ్జా విషయంగా ఎంపీడీవో సాల్మన్‌రాజ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గ్రామాన్ని సందర్శించి.. రహదారి ఆక్రమణకు గురైందని తేలితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శాంతినారాయణకు పురస్కారం



శాంతినారాయణ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: అనంత జిల్లాకు చెందిన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ శాంతినారాయణ తెలంగాణలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. వివిధ రంగాలకు చెందిన 12 మంది ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. నవల/కథా రచనల విభాగంలో శాంతినారాయణ ఎంపికయ్యారు. ఈ విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆయన ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ఆయన ఇనుపగజ్జెలతల్లి, పల్లేరుముళ్లు, పెన్నేటిమలుపులు, నాగలకట్ట సుద్దులు వంటి ఎన్నో రచనలు చేశారు. ఉపాధ్యాయుడిగా, జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా, డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేసి పదవీవిరమణ చేశారు. యువ రచయితలను ప్రోత్సహించడానికి విమల శాంతి సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. ఈ మేరకు అభ్యుదయ రచయితల సంఘం, ఉమ్మడిశెట్టి సాహిత్య ట్రస్టు, జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, సాహిత్య భారతి, స్పందన సాహితీ స్రవంతి, మానవత, ఉమర్ అలీషా సాహిత్య సంస్థ, తెలుగు భాషా సంరక్షణ సమితి, తపన సాహిత్య వేదిక తదితర సంస్థలు శాంతినారాయణకు శుభాకాంక్షలు తెలిపాయి.

ఓబుళాపురం గనుల్లో రక్షణ కరవు!

- రూ.30 కోట్లు విలువైన ఖనిజం దొంగలపాలు
- సీబీఐ సీజ్ చేసిన యంత్రాలపైనా కన్ను

నిందితులు అపహరించడానికి యత్నించిన హిటాచి వాహనం

రాయదుర్గం, డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: ఓబుళాపురం ఇనుప గనుల్లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజంతో పాటు యంత్రాలకూ రక్షణ లేకుండా పోతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓబుళాపురం గనుల్లో సీజ్ అయిన సుమారు లక్ష టన్నుల విలువైన ఖనిజాన్ని అప్పటి ప్రజాప్రతినిధి అండతో అమ్మేసుకున్నారు. ఐదేళ్లపాటు నిరంతరం సాగిన ఖనిజం చోరీని పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారు. తెదేపా నాయకులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖనిజం చోరీకి గురికావడం వాస్తవమేనని తేల్చారు. తర్వాత అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. సీబీఐ సీజ్ చేసిన టిప్పర్లు, పొక్లెయిన్లు, ఇతర వాహనాలను అక్కడికక్కడ తక్కుగా మార్చి కర్ణాటకలో అమ్మేసుకుంటున్నారు. తాజాగా బళ్లారికి చెందిన ముఠా సభ్యులు తుక్కుగా మారుస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

దొంగ చేతికి తాళాలిచ్చినట్లు..

ఓఎంసీలో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారనే అభియోగంతో సీబీఐ అక్కడున్న ఇనుప ఖనిజంతో పాటు యంత్రాలను 2011లో సీజ్ చేసింది. అప్పటి ప్రభుత్వ నిర్వాకం కారణంగా సీజ్ చేసిన వాటికి ఓఎంసీ కంపెనీ సిబ్బందినే కాపలాగా పెట్టారు. దీంతో దొంగ చేతికి తాళాలిచ్చినట్లు అయింది. గతంలో ఓఎంసీలో పనిచేసిన వ్యక్తి వైకాపా ప్రజాప్రతినిధిగా ఉండటంతో స్థానిక నాయకులు రెచ్చిపోయారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో టిప్పర్ల ద్వారా ఖనిజాన్ని ఫ్యాక్టరీలకు తరలించి జేబులు నింపుకొన్నారు.

పట్టించుకోని పోలీసులు

ఖనిజం, యంత్రాలు చోరీకి గురవుతున్నాయయని ఓఎంసీ కేసులో సాక్షిగా ఉన్న టప్పాల్ శ్యాంప్రసాద్ వైకాపా హయాంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరకు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఫిర్యాదుపై నిర్లక్ష్యం చేసిన అప్పటి సీఐ, ఎస్ఐపై కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం వచ్చినా పోలీసుల్లో మార్పు కనిపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విడిభాగాలు చేస్తుండగా.. ఏడుగురి అరెస్టు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: డి. హీరేహాళ్ మండలంలోని వివాదాస్పద ఓబుళాపురం ఇనుప గనుల ప్రాంతంలో సీబీఐ సీజ్ చేసిన హిటాచి యంత్రాన్ని ధ్వంసం చేసి అపహరణకు యత్నించిన ఏడుగురు పట్టుబడ్డారు. గురువారం రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో సీబీఐ ముడి ఇనుప ఖనిజంతో పాటు తవ్వేందుకు వినియోగించిన పలు యంత్రాలను సీజ్ చేసి.. అక్కడే నిల్వ ఉంచింది. ఈ క్రమంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా సండూరు తాలూకా కురేకుప్ప గ్రామానికి చెందిన మారుతి, వీరేశ్, గాదిలింగప్ప, గణేశ్, బసవరాజు, ఉమాపతి, దొడ్డ బసప్ప కలిసి ఈనెల 2న హిటాచి యంత్రాన్ని గ్యాస్ కట్టర్లతో విడిభాగాలుగా మారుస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనాస్థలానికి చేరుకుని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ముఠా సభ్యులు యంత్రాల విడిభాగాలు తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ముఠాలోని వీరేశ్, ఉచ్చప్ప, ప్రకాశ్ పరారీలో ఉన్నారని. పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐ వివరించారు. బొలెరో వాహనం, ఆటో, గ్యాస్ సిలిండర్లు, కట్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

సీజనల్ వ్యాధులు ఎదుర్కోవడమెలా?

న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం): ప్రస్తుతం వాతావరణ మార్పులతో పాటు తాగునీరు కలుషితంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసారం తదితర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి? ఒకవేళ సోకినా ఆయా ప్రభుత్వ వైద్యశాలల్లో ఎలాంటి సేవలు అందిస్తారు. వైద్యపరీక్షలు, అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా.. తదితర అంశాలను మీరు తెలుసుకోవాలని అనుకుంటున్నారా.. అయితే మీకు 'ఈనాడు-మీతోడు' చక్కటి అవకాశం కల్పించనుంది. **అనంతపురం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈ.బి.దేవితో** ఫోన్‌లో నేరుగా మాట్లాడి.. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. సూచనలు, సలహాలు స్వీకరించవచ్చు. మీరు చేయాల్సిందల్లా కింద పేర్కొన్న నిర్ణీత తేదీన ఫోన్ నంబరుకు కాల్ చేయడమే..!

- ఫోన్ చేయాల్సిన తేదీ: 04-07-2025 (నేడే)
- సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
- నంబర్లు : 80085 73008, 08554-277434

భారీ యంత్రం తరలింపు ప్రహసనం..

చెన్నై నుంచి హైదరాబాద్‌లోని ఓ రసాయన పరిశ్రమకు భారీ యంత్రాన్ని రెండు ట్రైలర్ల మీద తరలిస్తున్నారు. ఉదయం నుంచి ప్రయాణ బడలికతో అలసిన డ్రైవరు.. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాప్తాడు వద్ద ఆపేశాడు. భారీ యంత్రం లోపలే ఇనుప చువ్వల మధ్యనే కాసేపు మంచం వేసుకొని కునుకు తీశాడు. అటువైపు వెళ్తున్నవారు ఈ భారీ యంత్రాన్ని ఆసక్తికరంగా తిలకించారు.

- ఈనాడు అనంతపురం

సగం ధరకే కొత్త బైక్ !

- హైదరాబాద్‌లో పాతవి కొనుగోలు చేసి విక్రయం
- వెలుగులోకి వచ్చిన నయా దందా

తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌లో రికవరీ చేసిన ద్విచక్రవాహనాలు

ఈనాడు, అనంతపురం- న్యూస్‌టుడే, తాడిపత్రి : సగం ధరకే కొత్త బైక్‌లు విక్రయిస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టించిన కేటుగాళ్ల గుట్టు బట్టబయలైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మందిని మోసం చేసిన ముఠా సభ్యుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు . హైదరాబాద్‌కు చెందిన ముఠా జీరో డౌన్ పేమెంట్స్ విధానంలో వివిధ సంస్థలకు చెందిన బైకులను షోరూమ్‌ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. బైక్ కొంటున్న సమయంలో నకిలీ ఆధార్, పాన్ కార్డులతోపాటు తప్పుడు వివరాలు సమర్పిస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీల్లో పనిచేస్తున్న కొందరితో కుమ్మక్కై రుణాలు సైతం పొందుతున్నారు. ఒకటి, రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత బైక్ దొంగతనం జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. తర్వాత ఆ బైక్‌లను వివిధ మార్గాల్లో అనంతపురం జిల్లాకు తీసుకొచ్చి తప్పుడు పత్రాలతో విక్రయిస్తున్నారు. ఇక్కడున్న కొందరు మధ్యవర్తులను భాగస్వాములుగా చేసుకుని స్థానికులకు పెద్దమొత్తంలో బైక్‌లు అంటగట్టినట్లు తెలుస్తోంది. తక్కువ ధరకే కొత్త బైక్‌లు వస్తుండటంతో చాలామంది ముందు వెనుకా చూడకుండా కొనుగోలు చేశారు. ఇలా హైదరాబాద్‌కు చెందిన ముఠా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 2 వేల బైక్‌లు విక్రయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ముఠాతో సంబంధం ఉన్న ఆరుగురిని అనంతపురం పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఈ స్కాంకు పాల్పడుతున్న కొందరిని గుర్తించారు. మిగిలిన వారికోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

నంబరు ప్లేట్లు మార్చేసి..

అనంతపురం జిల్లాలో కొందరికి కొత్త బుల్లెట్ కంపెనీ బైక్‌ను రూ.45 వేలకు, వెయ్యి కిలోమీటర్లు కూడా తిరగని స్కూటీలను రూ.30 వేలకే విక్రయించారు. ఇంకా రిజిస్ట్రేషన్ కాని బైక్‌లను సైతం సెకండ్ హ్యాండ్ పేరుతో అమ్మేశారు. కొనే వారికి అనుమానం రాకుండా ఓఎల్ఎక్స్‌లోని పాత బైక్ నంబర్లను సేకరించి కొత్తవాటిని అతికించేశారు. అత్యవసరంగా డబ్బులు కావాలనో.. వేరే ఊరికి బదిలీపై వెళ్తున్నానని మాయమాటలు చెప్పి అమాయకులకు బైక్‌లను అంటగట్టారు. ఇలా ఒక్క తాడిపత్రిలో 100కు పైగా బైక్‌లు అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. అనంతపురం, తాడిపత్రి ప్రాంతాల్లో ఇప్పటివరకు 100కు పైగా ద్విచక్ర వాహనాలను రికవరీ చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

ఆక్రమించి కొన్ని..అనుమతుల్లేక ఇంకొన్ని

- తాడిపత్రిలో పలు అక్రమ నిర్మాణాలు
- సర్వేతో నిగ్గుతేల్చిన మున్సిపల్ అధికారులు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, తాడిపత్రి: గత ప్రభుత్వ హయాంలో తాడిపత్రి మున్సిపాలిటీ కేంద్రంగా వైకాపా నాయకులు సాగించిన అక్రమాల చిట్టా ఒక్కొక్కటిగా బయటకొస్తోంది. అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు ఆయన అనుచరులు చేపట్టిన నిర్మాణాలు అక్రమమే అని అధికారుల విచారణలో తేలింది. అనుమతులు లేకుండా కొన్ని, మున్సిపల్ స్థలాలను ఆక్రమించి మరి కొన్ని నిర్మించినట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలో కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు ఆయన అనుచరులు ఫయాజ్‌బాషా, రమేష్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డికి నోటీసులు ఇచ్చారు.

నిబంధనలకు పాతరేసి..

నవరంగ్ టాకీస్ వీధిలో సర్వే నంబర్ 530-ఏలో అంబటి జయప్రద, అంబటి రాఘవేంద్రరెడ్డి పేరుపై 433.24 చదరపు అడుగుల స్థలంలో ఇంటి నిర్మాణానికి 2021లో దరఖాస్తు చేసుకున్నారు. డీమ్డ్ ప్లాన్ ఆమోదం పొంది నిర్మాణం చేపట్టారు. ప్లాన్‌లో పొందుపరిచినట్లు కాకుండా 840.76 చదరపు అడుగుల్లో నిర్మాణం సాగించారు. నిబంధనలకు విరుద్ధంగా 5 అంతస్తులు నిర్మించారు. రాఘవేంద్రరెడ్డికి పలుమార్లు నోటీసులు అందించగా కోర్టును ఆశ్రయించారు. మున్సిపాలిటీలో అప్పీల్ చేసుకోవాలని కోర్టు సూచించింది. ఈమేరకు కమిటీని నియమించారు.

అనుమతి లేకుండా అంతస్తులు

నసీరుద్దీన్ కాలనీ సర్వే నంబరు 551లో హీరాపురం ఫయాజ్‌బాషా, ఆయన భార్య హీరాపురం అయేషా పేరుతో ఉన్న 746.40 చదరపు అడుగుల స్థలంలో ఇంటి నిర్మాణానికి 2022లో దరఖాస్తు చేసుకున్నారు. 1387.33 చదరపు అడుగుల్లో భవన నిర్మాణం చేపట్టారు. అనుమతులు లేకుండానే 4, 5 అంతస్తులు నిర్మించారు. ఇందులో 3 సెంట్లు ఆక్రమించినట్లు అధికారులు గుర్తించి నోటీసులు అందించారు. దీంతో ఫయాజ్‌బాషా కోర్టును ఆశ్రయించారు. కౌన్సిల్‌కు అప్పీల్ చేసుకోవాలని న్యాయస్థానం సూచించింది. ఈక్రమంలో కమిటీని ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణం అక్రమమే అని తేల్చారు.

కొనుగోలు ఒకలా.. రిజిస్ట్రేషన్ మరోలా..



భగత్‌సింగ్‌నగర్‌లో 639, 640, 641 సర్వే నంబర్లలోని లేఅవుట్‌లో 2, 16 ప్లాట్లలో 10 సెంట్ల స్థలాన్ని కేతిరెడ్డి పెద్దారెడ్డి.. తన భార్య రమాదేవి పేరున కొనుగోలు చేశారు. డాక్యుమెంట్‌లో మాత్రం 12 సెంట్లుగా నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొన్న స్థలంలో ఇంటి నిర్మాణానికి 2021లో ప్లాన్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. అనుమతులు రాకుండానే నిర్మాణం చేపట్టారు. అప్పట్లో అధికార పార్టీ ఎమ్మెల్యే కావడంతో అధికారులు సైతం వదిలేశారు. ఇటీవల అధికారులు సర్వే చేయగా.. తూర్పున 14.50 అడుగులు, పడమర వైపు 2.0 అడుగులు ఆక్రమించి ఇల్లు నిర్మించినట్లు తేలింది.

రోడ్డును కబ్జా చేసి..

బుగ్గయ్య కాంపౌండ్ వీధిలోని సర్వే నంబర్లు 608-పి, 609-ఏలో వైకాపా నాయకుడు రమేష్‌రెడ్డి ఇంటిని నిర్మించారు. లేఅవుట్‌లో అతని ఇంటి ముందు 33 అడుగుల రహదారి ఉంది. పది అడుగుల పైనే రోడ్డును ఆక్రమించి ఇల్లు, ప్రహరీ నిర్మించారు. అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించుకోవాలని సూచించారు. దీంతో ప్రహరీ మాత్రమే తొలగించారు. ప్రస్తుతం రమేష్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు.

తల, మొండెం వేరుచేసి.. దారుణహత్య



విశ్వనాథ్

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలో విశ్వనాథ్ (43) దారుణ హత్యకు గురయ్యాడు. కొడవళ్లతో నరికి తల, మొండెం వేరుచేశారు. తలను దూరంగా విసిరేశారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన మూడు రోజుల కిందట ముదిగుబ్బలోని కదిరి రోడ్డులో ఉన్న బైపాస్ సమీప గుట్టలో జరిగింది. ఛిద్రమైన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. తనకల్లు మండలంలోని యర్రగుంటపల్లికి చెందిన బుగిడే రామప్ప కుమారుడు విశ్వనాథ్ వ్యవసాయం చేసుకునేవాడు. 20 ఏళ్ల కిందట ఓబుళదేవరచెరువు మండలంలోని గాజుకుంటపల్లికి చెందిన శ్యామలతో వివాహం జరిగింది. వీరు కొన్ని రోజులు అత్తింట్లో ఉన్నారు. ఆ తర్వాత కదిరిలోని శివాలయం వీధిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. విశ్వనాథ్ మొదట టైలర్‌గా పని చేసేవాడు. తర్వాత కదిరి సమీపంలో రెండెకరాల భూమిని లీజుకు తీసుకుని ప్రస్తుతం టమాటా పంట సాగు చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో భార్యతో చెప్పి ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లాడు. అతణ్ని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, ముదిగుబ్బ టౌన్ సీఐ శివరాముడు ఘటనా స్థలిని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. విశ్వనాథ్‌కు భార్య, ఇంటర్ చదువుతున్న కుమార్తె చైతన్య, 9వ తరగతి చదువుతున్న కుమారుడు సాయి ఉన్నారు. వీరిద్దరూ కడపలో చదువుతున్నారు.

పదిరోజుల కిందట స్కూటీ కొనుగోలు

ఓబుళదేవరచెరువు మండలంలోని హోండా షోరూమ్‌లో విశ్వనాథ్ పదిరోజుల కిందట స్కూటీ కొనుగోలు చేశారు. హత్య జరిగిన ప్రాంతంలో ద్విచక్ర వాహనం ఉంది. అందులో ఆస్తికి సంబంధించిన పత్రాలు ఉన్నాయి. హత్యకు ఆస్తి తగాదాలా? అక్రమ సంబంధమా.. ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్కేయూ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీ నియమించింది. ఈ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ప్రభుత్వ నామినీగా రాయపూర్‌లోని ఐఐఎం డైరెక్టర్ రామ్‌కుమార్ కాకాని, వర్సిటీ పాలకమండలి నామినీగా గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి శివప్రసాద్, యూజీసీ నామినీగా లఖ్‌నవూ విశ్వవిద్యాలయం వీసీ అలోక్‌కుమార్‌రాయ్ నియమితులయ్యారు. గతేడాది జులై 18న ఆచార్య అనిత ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆమె ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన అభ్యర్థిని గవర్నర్ ఉపకులపతిగా నియమిస్తారు. ఈ పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది. వర్సిటీకి చెందిన విశ్రాంత ఆచార్యులతోపాటు ప్రస్తుతం పని చేస్తున్న పలువురు పోటీ పడుతున్నారు.

కరవుసీమకు పరిశ్రమల కవచం!

యువతకు ఉపాధి, ప్రాంతాల అభివృద్ధికి దోహదం

ఈనాడు, పుట్టపర్తి -హిందూపురం, న్యూస్‌టుడే: కరవుకు పర్యాయంగా మారిన ఉమ్మడి అనంత జిల్లాకు పరిశ్రమల రాక వరుస కట్టడంతో ఈ ప్రాంత ప్రగతి కొత్త పుంతలు తొక్కనుంది. వేలాది మంది యువతకు ఉపాధి అందుబాటులోకి రావడంతోపాటు పరిసర ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తెదేపా సర్కారు 2017లో పెనుకొండకు కియా పరిశ్రమ తీసుకురావడంతో ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. 2015లో గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్, బెల్ ఏర్పాటు రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయి. వైకాపా ప్రభుత్వం వచ్చాక పరిశ్రమల ఏర్పాటుకు అకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో ఐదేళ్లలో ఒక్క ఫ్యాక్టరీ ఏర్పాటు కాలేదు. ఏడాది కిందట కూటమి ప్రభుత్వం రావడంతో పలు పరిశ్రమల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది.

పెట్టుబడుల వరద..

ఉమ్మడి అనంత జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీటి వనరులు, మెరుగైన రవాణా సదుపాయాలు, బెంగళూరు మహానగరానికి దగ్గరగా ఉండటం... తదితర అంశాలు కలిసొస్తుండటంతో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

★ అనంతపురం జిల్లా రాప్తాడు సమీపాన తెదేపా హయాంలో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తరువాత వైకాపా ప్రభుత్వంలో స్థానిక నాయకులు కొందరు బెదిరింపులకు దిగడంతో సదరు పరిశ్రమ తెలంగాణాకు తరలివెళ్లింది. ప్రస్తుతం రేమాండ్ వస్త్ర పరిశ్రమ 26.87 ఎకరాల్లో రూ.330 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈమేరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాదాపు 3 వేల మందికి ఉపాధి లభించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

★ కళ్యాణదుర్గం సమీపంలోని తిమ్మసముద్రం వద్ద 121 ఎకరాల్లో జీవీప్రా సంస్థ రూ.11,500 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి దక్కనుంది.

ఆటోమొబైల్, సోలార్..

★ శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి వద్ద 24 ఎకరాల్లో ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్, చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద 24 ఎకరాల్లో ఏరోస్పేస్ యూనిట్లను మరో రూ.650 కోట్లతో ఏర్పాటు చేయనుంది. రేమాండ్ సంస్థ మూడు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాదాపు రూ.1000 కోట్లతో 6,500 మందికి ప్రత్యక్షంగా, మరో 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

★ మడకశిరలోని ఆర్.అనంతపురం గ్రామ సమీపంలోని ఏపీఐఐసీ భూముల్లో భారత్ ఫోర్జ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు 1,000 ఎకరాలు కేటాయించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.2,400 కోట్లు పెట్టేందుకు కంపెనీ సిద్ధంగా ఉంది. దీనివల్ల 1,500 మందికి ఉపాధి దక్కనుంది.

★ మడకశిర మండలం కళ్లుమర్రి, బుల్లసముద్రం, తడకలపల్లి, హరేసముద్రం పంచాయతీల పరిధిలో దాదాపు 5 వేల ఎకరాల్లో రూ.7,500 కోట్లతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం నవయుగ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకుంది. దీనివల్ల 2 వేలమందికి పైగా ఉపాధి లభించనుంది.

10న హెచ్చెల్సీకి నీరు విడుదల

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు (టీబీ హెచ్చెల్సీ) ఈనెల 10న నీరు విడుదల చేయనున్నారు. అదే రోజే కర్ణాటక పరిధిలోని హెచ్చెల్సీ ఆయకట్టుకు వదలనున్నారు. ఇప్పటికే టీబీ బోర్డుకు అక్కడి అధికారులు ఇండెంట్ ఇచ్చారు. తొలుత ఈనెల 15 నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే తుంగభద్ర నుంచి దిగువకు జలాలను వదిలేసిన సంగతి తెలిసిందే. గురువారం సైతం 20 క్రస్ట్ గేట్ల ద్వారా 60వేల క్యూసెక్కుల దాకా నదిలోకి వదిలేశారు. ఈక్రమంలోనే హెచ్చెల్సీ ప్రధాన కాలువకు ఐదు రోజుల ముందే నీటిని తీసుకోవాలని నిర్ణయించారు.

వాటా 18.396 టీఎంసీలు

క్రస్ట్ గేట్ల భద్రత, మరమ్మతుల కారణంగా పూర్తి స్థాయిలో నిల్వ చేయడం లేదు. 80 టీఎంసీలకు మించి నిల్వ ఉంచే పరిస్థితి లేదని ఇప్పటికే బోర్డు అధికారులు తెగేసి చెప్పారు. అందుకే డ్యాం నుంచి దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం తుంగభద్రలో 78.239 టీఎంసీలు ఉన్నాయి. గురువారం 26,718 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రానున్న రెండు రోజుల్లో 70వేల నుంచి 80వేల క్యూసెక్కులు దాకా డ్యాంలోకి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉంది. బుధవారం రాత్రి తుంగ డ్యాం నుంచి ఏకంగా 60వేల క్యూసెక్కులు దిగువకు వదిలేశారు. ఈదఫా 120 టీఎంసీలు లభ్యం అవుతాయని అంచనా వేశారు. హెచ్చెల్సీ వాటాగా 18.396 టీఎంసీలు కేటాయించారు. మరో వైపు ప్రధాన కాలువ 137.702 కి.మీ. వద్ద యూటీ పైకప్పులు పూర్తి అయ్యాయి. దీంతో నీటి విడుదలకు ఆటంకం ఉండదని భావిస్తున్నారు.

(c) eenadu

జగన్ అరాచకం సృష్టిస్తున్నాడు: మంత్రి పయ్యావుల

మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలన ద్వారా రాష్ట్రంలో ప్రశాంతత, అభివృద్ధి, భరోసా ఇస్తుంటే.. జగన్ తన పర్యటనల ద్వారా అరాచకం, అశాంతిని సృష్టిస్తున్నారని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ మండలం మోపిడి గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. పరామర్శ పేరుతో ఆయన చేస్తున్న పర్యటనల ద్వారా అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. దానికి నిదర్శనం ఇటీవల వైకాపా శ్రేణులు మహిళలపై దాడులు చేయడం, తన వాహనం కింద మనిషి పడినా పట్టించుకోకపోవడమేనన్నారు. గత వైకాపా పాలనలో రాష్ట్రంలో 95 కేంద్ర ప్రభుత్వ పథకాలను నిలిపి వేశారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత రూ.13 వేల కోట్లు ఖర్చు పెట్టి 75 పథకాలను పునరుద్ధరించామన్నారు. రాష్ట్రంలో వంద శాతం భారత రాజ్యాంగానికి అనుగుణంగానే పాలన సాగుతోందని వివరించారు. సమావేశంలో ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పురుషోత్తం, నాయకులు రంగా, గురుప్రసాద్, గోవిందు, వెంకటేశ్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలో క్యాజువాలిటీ ఏర్పాటుకు చర్యలు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో క్యాజువాలిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా క్యాంటీన్‌కు కేటాయించిన భవనంలో ఉన్న మంచాలు, ఇతర సామగ్రిని తొలగించి అందులో పనులు గురువారం ప్రారంభించారు. ఇప్పటికే పది పడకలను వాటి పక్కనే పది ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు ఏర్పాటు చేశారు. గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేయటానికి సమయం పడుతుండటంతో మొదటగా సిలిండర్లు అందుబాటులో ఉంచుకుని రోగులకు వైద్య సేవలు అందించనున్నారు. రోగుల పర్యవేక్షణకు నలుగురు సీఎంవోలతో పాటు సిబ్బందిని నియమించారు. వీరంతా షిఫ్టుల వారీగా పనిచేయనున్నారు.

నూతనంగా ఏర్పాటు చేసిన పడకలు

కుళ్లాయిస్వామి దర్శనం.. భక్తులకు దుర్లభం

రోజురోజుకీ పెరుగుతున్న రద్దీ ➠ నేడు చిన్న సరిగెత్తు

ఆలయం ఎదుట అగ్నిగుండం వద్ద మొక్కులు చెల్లించుకుంటూ..

నార్పల, న్యూస్‌టుడే : గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు పోటెత్తారు. దేవాదాయశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం స్వామి దర్శనం కోసం ఒకే క్యూలైన్ ఏర్పాటు చేయడంతో రద్దీని కట్టడి చేయలేని పరిస్థితి కనిపించింది. పురుషులకు, మహిళలకు ఒకే వరుస ఉండటంతో ఇబ్బందులు తలెత్తాయి. కిలోమీటరు మేరకు భక్తుల వరుస కొనసాగింది. కోనేరు బావి నుంచి ఆలయం వరకు పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో వేల సంఖ్యలో వస్తున్న భక్తులను నిలువరించలేకపోయారు. ఇసుకేస్తే రాలనంతంగా భక్తుల రద్దీ కనిపించింది.

స్వామి దర్శనానికి గంటల సమయం

స్వామి దర్శనానికి మూడు, నాలుగు గంటల సమయం పట్టింది. చాలా మంది తమ ఇష్టదైవం కుళ్లాయిస్వామి పీర్లను దర్శించుకోకుండానే అగ్నిగుండానికి మొక్కులు చెల్లించి నిరాశగా వెనుదిరిగారు. విడిదినంలోనే పరిస్థితి ఇలా ఉందంటే శుక్రవారం స్వామికి అత్యంత ఇష్టమైన చిన్నసరిగెత్తు ఉండటంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.

- పోలీసులు, దేవాదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయకుంటే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనిపై డీఎస్పీ వెంకటేశులును వివరణ కోరగా గురువారం 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో భక్తుల రద్దీ పెరిగిందన్నారు. చిన్నసరిగెత్తు రోజున 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

కిక్కిరిసిన భక్తజనం

టోల్‌గేట్ పేరిట దోపిడీ

బుక్కరాయసముద్రం: గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకోవడానికి భక్తుల రాక రోజురోజుకీ పెరుగుతోంది. ఈక్రమంలో వివిధ రకాల వాహనాల్లో వచ్చే భక్తులకు టోల్‌గేట్ రుసుం పేరుతో గుత్తేదారులు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నాడు. నిబంధనల ప్రకారం ఆటోలకు రూ.30, నాలుగు చక్రాల వాహనాలకు రూ.100, ఆరు చక్రాల వాహనాలకు రూ.130 వసూలు చేయాలి. పంచాయతీ సీలు లేకుండానే అధిక ధర టోకెన్లు ముద్రించి భక్తులను దోచుకుంటున్నారు. ఆటోలకు రూ.50 వసూలు చేస్తున్నారు. నాలుగు చక్రాలు, ఆరు చక్రాల వాహనాలకు సైతం రూ.20 అదనంగా రుసుం వసూలు చేస్తున్నారు. దీనికితోడు వాహనాల రుసుం చెల్లించే ధరల పట్టిక ను ఎక్కడా ప్రదర్శించడం లేదు. ఈ విషయంపై ఈవోఆర్డీ శైలజారాణిని వివరణ కోరగా నిర్ణయించిన ధరకే రుసుం వసూలు చేసేలా గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

పంచాయతీ సీల్ లేకుండానే రూ.50 టోకెన్

ప్రకటనలో ఒకటి.. విక్రయంలో మరొకటి!

వ్యాపార సంస్థకు జరిమానా

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: ప్రకటనలో ఒక రకమైన వస్తువును చూపి, విక్రయంలో మరొకటి పంపిణీ చేసిన వ్యాపార సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ రూ.50 వేల జరిమానా విధించింది. కేసు పూర్వపరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి పట్టణానికి చెందిన రాఘవరెడ్డి మార్చి 2023న ఆన్‌లైన్‌లో ఆజియో సంస్థకు డబ్బు చెల్లించి జీన్స్ ప్యాంటును రూ.12,999కు కొనుగోలు చేశాడు. పార్శిల్ వచ్చిన తర్వాత వస్తువును చూసిన బాధితుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. ఆన్‌లైన్‌లో చూపిన ప్యాంటు కాకుండా చౌక రకం ప్యాంటును పంపడంతో విక్రయ సంస్థకు ఫోన్ చేశాడు. స్పందించకపోవడంతో మెయిల్ చేశాడు. సంస్థ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కమిషన్ ఫిర్యాదును కేసుగా స్వీకరించి ఇరువర్గాల వాదనలను పరిశీలించింది. వినియోగదారుడి ఆరోపణలు రుజువు కావడంతో విక్రయ సంస్థ ప్యాంటు ధర రూ.12,999కు 8 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, మనోవేదనకు రూ.50 వేలు, న్యాయ ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎంసీల్లో ఐదుగురికి షోకాజ్ నోటీసులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు సంబంధించి 2022 జనవరిలో జరిగిన వారపు సంతలో ఏసీబీ దాడులు చేశారు. అప్పట్లో సంతల నుంచి వచ్చిన ఆదాయం మొత్తాన్ని, రశీదులను పరిశీలించగా, రూ.30 వేలు అదనంగా సొమ్ము ఉన్నట్లు ఏసీబీ అధికారులు అప్పట్లో గుర్తించి కేసు నమోదు చేశారు. వారిలో విశ్రాంత మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కేశవకుమార్ (కళ్యాణదుర్గం), నాగేంద్ర (కదిరి), గేడర్ వేణుగోపాల్ (రిటైర్డ్), అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ సుశీల (శింగనమల)కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరంతా పదిహేను రోజుల్లో వివరణ ఇవ్వాలని ఎక్స్ అఫిషియో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తలనీలాల వేలంలో రూ.25.7 లక్షల ఆదాయం

నార్పల, న్యూస్‌టుడే: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ప్రాంగణంలో తలనీలాల పోగు చేసుకునే హక్కు కోసం బహిరంగ వేలంలో రూ.25.7 లక్షల ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. గురువారం నిర్వహించిన వేలంలో అనంతపురానికి చెందిన రవీంద్రారెడ్డి అందరికంటే ఎక్కువ పాడి వేలం దక్కించుకున్నారు. ఏడాదిపాటు ఆలయ ప్రాంగణంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కు గుత్తేదారుడికి ఉంటుందని అధికారులు తెలిపారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇన్‌స్పైర్ మనక్ అవార్డు కోసం ప్రాజెక్టులు తయారు చేసి, వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని డీఈవో ప్రసాద్‌బాబు, సైన్స్‌సెంటర్ అధికారి బాలమురళీకృష్ణ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఇన్‌స్పైర్- 2025-26 సైన్స్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని ఆయన తెలియజేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ప్రతి తరగతి నుంచి కనీసం ఒక ప్రాజెక్టు రూపొందించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సైన్స్, గణితం ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు రూ.10వేలు కేంద్రం ప్రభుత్వం నగదు పురస్కారం అందజేస్తుందన్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై ఆందోళన

కలెక్టరేట్ ఆవరణలో యూజేఏసీ నాయకుల నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని ఐక్య సంయుక్త కార్యాచరణ కమిటీ (యూజేఏసీ) డిమాండ్ చేసింది. దేశవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం యుజేఏసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సంయుక్త సారథ్యంలో అనంత కలెక్టర్ కార్యాలయం ముందు, ఆవరణలో నిరసన తెలిపారు. జేఏసీ కన్వీనర్ సి.జాఫర్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం సవరించడం అశాస్త్రీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు తీరని అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర ఉద్యమం చేస్తామన్నారు. ఆ తర్వాత డీఆర్‌ఓ మాలోలకు వినతి అందజేశారు. ఈ నిరసనలో నగర మేయర్ వసీం, నదీమ్ అహమ్మద్, అల్లీపీరా, మెహబూబ్ రాజా, రిజ్వాన్, సైపుల్లా బేగ్, జావెద్, యాసిర్, నవాజ్, హాజీపీరా, బంగారు బాషా, వలి, జిలాన్, జాకీర్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో వైద్యసేవలు అధ్వానం

అధికారులపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మాలోల, తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు ఆశించిన మేర లభించలేదు. ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నెల రోజుల్లోపు సేవల్లో సంతృప్తి స్థాయి పెరగాలి. బాధ్యత, అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎందుకు చొరవ చూపడం లేదు'.. అని కలెక్టర్ వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్త పరిచారు. క్షేత్రస్థాయిలో అనేక లోపాలు, నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. గురువారం తన కార్యాలయంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ, సర్వజన ఆస్పత్రి, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల పనితీరుపై సమీక్ష జరిపారు. ఆరోగ్యశాఖ పనితీరు చాలా మెరుగు పడాలి. పీహెచ్‌సీల్లో వైద్యులు ఆశించిన మేర సేవలు అందించలేదని ఐవీఆర్‌ఎస్ ద్వారా వెల్లడైందన్నారు. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్య తప్పదని కలెక్టర్ హెచ్చరించారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది విధిగా విధుల్లో ఉండాలి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలాచేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇక నుంచి తాను విస్తృత తనిఖీలు చేస్తామన్నారు. సర్వజన ఆస్పత్రి, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లోనూ అసంతృప్తి ఉంది. ఇక్కడి సేవలు, పరిసరాలు సరిగా లేవన్నారు. జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మాలోల, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీసీహెచ్‌ఎస్ డేవిడ్, సర్వజన ఆస్పత్రి పర్యవేక్షకుడు ఆత్మారామ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ షారోన్ సోనియా, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాస నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయి పెరగాలి

అన్ని ప్రభుత్వ శాఖల్లో సంక్షేమ పథకాలు, సేవలపై సంతృప్తి స్థాయి పెరిగేలా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా సమీక్షలో సంక్షేమ పథకాలు, ఐవీఆర్‌ఎస్ తీరును వివరించారు.

బెట్టింగ్ భూతానికి పట్టుచీరల వ్యాపారి బలి

అప్పులు తీర్చలేక నిప్పంటించుకొని ఆత్మహత్య

జగదీశ్

ధర్మవరం, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్ ఆడి అప్పులు తీర్చలేక ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పట్టు చీరల వ్యాపారి జగదీశ్ (32) ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతణ్ని మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. జగదీశ్ క్రికెట్ బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లో లక్షల రూపాయలు పోగొట్టుకోవడంతో పలుచోట్ల అప్పులు చేశాడు. అతని వ్యవహార శైలి నచ్చక భార్య అంజలి మూడు నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఒంటికి నిప్పంటించుకొని జగదీష్ ఆత్మహత్య చేసుకున్నాడని రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. మృతుడి తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విశతకంతో చెలరేగిన జ్ఞానేశ్వర్..

గెలుపు బాటలో చిత్తూరు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సీఆర్ జ్ఞానేశ్వర్ (266) ద్విశతకంతో కదం తొక్కడంతో సౌత్ జోన్ అంతర్ జిల్లా సీనియర్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టుపై 516 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. గురువారం అనంత క్రికెట్ మైదానంలో ఉదయం 194/0 ఓవర్ నైట్ స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు 129.3 ఓవర్లలో 641 పరుగుల వద్ద తెరపడింది. సీఆర్ జ్ఞానేశ్వర్ 30 బౌండరీలు, ఆరు సిక్సర్లతో 266 పరుగులు చేయడం విశేషం. ఈ టోర్నీలో ఇదే తొలి ద్విశతకం కావడం గమనార్హం. బ్యాటర్లు శశాంక్ (117), ధరణి కుమార్ (65), పృథ్వీరాజ్ (65), అశిష్‌రెడ్డి (42)లు జ్ఞానేశ్వర్‌కు సహకారం అందించి భారీ స్కోరుకు తోడ్పాటు అందించారు. రెండో ఇన్నింగ్స్‌లో చిత్తూరు బౌలర్లు చెలరేగితే కడపకు ఓటమి ఖరారవుతుంది. మరో పోటీలో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరుపై 241 పరుగులు చేయగా.. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 42.5 ఓవర్లలో 191 పరుగులకే కుప్పకూలింది. కర్నూలు జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 50 పరుగుల ఆధిక్యత లభించింది. కర్నూలు బ్యాటరు సంజయ్ నాయుడు (106) ఒంటరి పోరు కొనసాగించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన కర్నూలు జట్టు ఆటముగిసే సమయానికి 38 ఓవర్లలో 138 పరుగులు చేసింది. చివరిరోజు టీ విరామం వరకు కర్నూలు బ్యాటర్లు పోరాడితే మ్యాచ్ డ్రా కావడానికి అవకాశం ఉంటుంది. రెండోరౌండ్ పోటీల్లో ఒక మ్యాచ్ డ్రా దిశగా, మరో పోటీ ఫలితం తేలే విధంగా కొనసాగుతున్నాయి.

సీఆర్ జ్ఞానేశ్వర్ (266) సంజయ్‌నాయుడు పి.సుబ్రహ్మణ్యం (121)

సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా 1995, 1996 ఎస్సై బ్యాచ్‌లకు చెందినవారు. గతంలో నాలుగో పట్టణ సీఐగా పనిచేసిన సాయినాథ్, ఎస్పీ కార్యాలయంలో డీటీఆర్బీ సీఐగా పనిచేస్తున్న విజయభాస్కర్‌గౌడ్, పోలీసు కంట్రోల్ రూంలో పనిచేస్తున్న దేవానంద్‌లతో పాటు పీటీసీలో పనిచేస్తున్న ఆదినారాయణ, మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సత్యబాబు, సత్యసాయి జిల్లాలో చేస్తున్న కె.రాఘవన్, బి.మోహన్‌లు ఉద్యోగోన్నతి పొందినవారిలో ఉన్నారు.

40 బుల్లెట్ వాహనాల స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని ప్రధాన కూడళ్లలో శబ్ద కాలుష్యానికి కారణమైన ద్విచక్ర వాహనాల పట్టివేతకు ట్రాఫిక్ పోలీసులు గురువారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గడియార స్తంభం, సప్తగిరి, శ్రీకంఠం, కళ్యాణదుర్గం, రుద్రంపేట, సూర్యనగర్ సర్కిళ్లలో తనిఖీ నిర్వహించగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను కలిగిన 40 బుల్లెట్ వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషనుకు తరలించారు. వాహన యజమానులకు జరిమానా విధించారు. సీఐ వెంకటేశ్‌నాయక్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రజాశాంతికి భంగం కలిగే విధంగా సైలెన్సర్లు బిగించుకుని ఇష్టారాజ్యంగా తిరిగితే సహించబోమన్నారు. అధిక శబ్దాన్ని విడుదల చేసే సైలెన్సర్ల వల్ల గుండెజబ్బులు ఉన్నవారు తీవ్ర ప్రభావానికి గురవుతారన్నారు. ఇలాంటి చర్యలు పదే పదే జరిగితే చట్టపరంగా ముందుకు వెళ్తామని సీఐ హెచ్చరించారు.

చెత్త విషయంలో ఇరువర్గాల ఘర్షణ

● ఒకరి మృతి ● తొమ్మిది మందికి గాయాలు

మృతిచెందిన శంకరయ్య

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలం ఇరువెందుల గ్రామంలో గురువారం చెత్త విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో శంకరయ్య(55) మృతిచెందగా, తొమ్మిది మందికి గాయాలయ్యాయి. సీఐ కౌలుట్లయ్య అందించిన వివరాల మేరకు ఇరువెందుల గ్రామంలో బాలగంగిరెడ్డి, ప్రభాకర్ కుటుంబాలకు చెందిన మహిళలు ఇంటి వద్ద చెత్త విషయంలో ఘర్షణ పడ్డారు. ఈవిషయంలో భర్తలు జోక్యం చేసుకున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య రాళ్లు, కట్టెలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో బాలగంగిరెడ్డి వర్గానికి చెందిన శంకరయ్య మధ్యలోకి వెళ్లారు. ఆ తోపులాటలో కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఒక వర్గానికి చెందిన ప్రభాకర్, శ్రీనివాసులు, త్రినాథ్, రమేశ్, నాగేంద్ర గాయపడ్డారు. మరో వర్గంలో బాలగంగిరెడ్డి, పెద్దిరాజు, నాగేంద్ర, అమ్ములన్న గాయపడ్డారు. బాధితులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి గ్రామ సమీపంలో రైలుకిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు సుమారు 30 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి రైలు కింద పడ్డాడని రైలు లోకోపైలట్ సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, తెలుపు, సిమెంట్ రంగు చొక్కా వేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. విచారణ అనంతరం మృతుడి వివరాలు వెల్లడిస్తామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

JOBS

ప్రముఖ E-Kart's, వారి అనుబంధ సంస్థలలో ... 10th, డిగ్రీ, జీతం 18000 నుండి ... 79756 91563.

Mechanical Engineer: B.Tech in Mechanical Engineering with 2 to 3 years experience - 01 Post, Electrical Engineer: B.Tech in Electrical Engineering with 2 to 3 years Experience - 01 Post, Mechanical Supervisor: Diploma in Mechanical Engineering with 2 to 3 years Experience - 01 Post, ITI Fitters: ITI in Fitter Grade with 3 to 5 years of Experience - 02 Posts, Boiler Operators: Boiler 2nd Class Certificate issued by A.P.T.G with 1 or 2 years of Experience - 01 Post. (Sapthagir Camphor Pvt Ltd, ATP) Apply to accountsatp@sclgroup.in

MARKETING/ SALES

ATP టౌన్‌లో ... 9666958268.

గమనిక

ఈనాడు Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

వివరాలకు : 8008709784

HEFT ENERGY CONCEPT TO COMPLETION

WALK-IN DRIVE M/s HEFT ENERGY PRIVATE LIMITED

Join one of the fastest-growing companies in Renewable Energy Sector We are conducting walk-in interviews for the following roles:

Positions: Technicians

Date & Time: 05-07-2025 to 06-07-2025, Time: 9.00 AM to 05.00 PM

Venue: Alexander Hotels, No.11-120, Sapthagiri Circle, OPP. To Municipal Corporation office, Anantapur, AP – 515001.

Eligibility

- Qualification: ITI - Fitter, Electrician, Rigger & Mechanical Experience: 1–5 years – Preferable from Wind Sector, Engineering & Construction. ITI / Diploma – Freshers
- Experienced Technicians (Non-Qualified) Minimum 3 Years experience in Wind, Engineering & Construction.
- Helper – Experienced in construction Sector – Minimum 3 yrs

Bring updated resume, Present employer salary slips, Aadhar Card, PAN Card, Passport Size photo, Academic & Experience Certificates.

Note: "Male Candidates Only"

Contact: 9344997784, 9626499837

Email: hr@heft-energy.com

WANTED

Front Office Executives, PRO's, Marketing Executives, Telecallers

CHIRANJEEVI REDDY INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY FOR WOMEN

RACHANAPALLI, BELLARY ROAD, ANANTA PUR

CALL: 9666886027 & 9666886029

CHIRANJEEVI REDDY INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY FOR WOMEN (All Courses approved by AICTE New Delhi.)

WE'RE HIRING

We're seeking talented and passionate women to join our faculty and staff. Send your resume and cover letter to careercrit@gmail.com. This opportunity is open to women candidates only, as part of our commitment to creating a women-centric academic environment.

POSITIONS: Principal, Vice Principal, CSE (Asst. Prof.), ECE (Asst. Prof.), MBA (Assoc. Prof.), Physics, Chemistry, English, Librarian

Qualification and Salary as per AICTE Norms

Rachanapalli, Bellary Road, Anantapur - 515004

CONTACT: 9666886027 & 9666886029

స్వదేశీ ఆగమన శుభాకాంక్షలు

Dr. B.RAMA MOHAN - Smt. B.UMA MAHESWARI

FOUNDER DIVYASREE HOSPITAL, M.D, DNB (SENIOR PHYSICIAN & CARDIOLOGIST)

Dr. Joshua Caleb.K MBBS, DNB (General Medicine) DNB (Neurology) Senior Consultant Neurologist

Dr. Krishna V.P MBBS, MD.DM (Gastroenterology, SGPGI) Senior Consultant Gastroenterologist

జెకె దివ్యశ్రీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్

పాత దివ్యశ్రీ హాస్పిటల్, 10/226, ఆదిమూర్తి నగర్, అనంతపురం

ఫోన్: 08554 - 274322

✆ 9494628787, 9859872872

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : అనంతపురం

..., రైల్వే స్టేషన్ దగ్గర, ... అనంతపురం-515001.

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేదీ: 21-07-2025, ఉ॥ 11.45 గం.ల నుండి మ॥ 12.45 గం.ల వరకు

27	29.90 సెంట్లు	9.00 సెంట్లు	0.05	0.020	139

రిజర్వు ధర: రూ. 58,50,000/- ధరావత్తు సొమ్ము: రూ. 5,85,000/-

www.canarabank.com ... ఫోన్ నెం: 9441977370.

https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేదీ: 03-07-2025, ప్రదేశం: అనంతపురం

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం

లేఅవుట్లను పరిశీలిస్తున్న పీడీ శైలజ

కుందుర్పి, న్యూస్‌టుడే: వివిధ పథకాల కింద గృహ నిర్మాణ సంస్థ ద్వారా అర్ధాంతరంగా ఆగిపోయిన ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందించనున్నట్లు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ పేర్కొన్నారు. గురువారం కుందుర్పిలో ఆగిపోయిన జగనన్న కాలనీల లేఅవుట్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీలో పూర్తి కానీ ఇంట్లో నివసిస్తున్న గంగమ్మ అనే వృద్ధురాలిని పరామర్శించారు. లబ్ధిదారులకు వెంటనే నోటీసులు జారీ చేసి, నిర్మాణాలు పూర్తి చేయించాలని మండల ఏఈ మారుతీప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపీడీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పాపంపల్లిలో తాగునీటి కష్టాలు

కళ్యాణదుర్గం (గ్రామీణం): మండలంలోని పాపంపల్లిలో జల్‌జీవన్ మిషన్ కింద పనులు చేసినా ప్రయోజనం లేకపోయింది. శ్రీరామిరెడ్డి నీటి పథకానికి సంబంధించి పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చారు. ప్రస్తుతం నీరు రావడం లేదు. పంచాయతీకి సంబంధించి రెండు బోరుబావులు ఉన్నాయి. ప్రధానరోడ్డు పక్కనే ఉన్న కొన్ని నివాసాలకు పంచాయతీ నీరందడం లేదు. ఒకరిద్దరు పంచాయతీ బోరుబావికి స్టార్టర్ పెట్టిన అమర్చిన తీగలను వారం రోజుల కిందట కత్తిరించి బోరుబావిలో వేయడంతో నీరు రావడం లేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో పరిస్థితి ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో దనుంజయనాథ్‌ను వివరణ కోరగా.. పరిశీలించి, అధికారులు, ప్రజలతో చర్చించి నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'బకాయిల విడుదలకు డిమాండ్'

నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగులో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో నంబరు 77ను రద్దు చేయాలన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన నగదు రాకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. పలు సమస్యలపై ఈనెల 11న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయనున్నట్లు వివరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆంజనేయులు, వెంకట్‌నాయక్, మంజునాథ్, మౌళి, మౌనిక, ఐశ్వర్య, నవీన్, పవన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు ఆరోగ్య భద్రత

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల్లో చదివే ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రవేశపెట్టింది. ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న సిబ్బంది ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారి వివరాలతో ప్రత్యేక కార్డులు సైతం ఇవ్వనున్నట్లు వైద్యులు

అందరికీ వైద్య పరీక్షలు

చెబుతున్నారు. పరీక్షల్లో అనారోగ్య సమస్యలున్నట్లు బయటపడితే అవసరమైన చికిత్సతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. పౌష్టికాహార లోపంతో పాటు ఇతర వ్యక్తిగత సమస్యలను తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేజీబీవీలు, ఉన్నత పాఠశాల్లో కౌమార బాలికల ఆరోగ్యంపై వివరాలు సేకరించి వారికి తగినట్లు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. రక్తహీనత, ఐరన్, అలసట వంటి లోపాలు ఉన్నట్లు గుర్తించిన వెంటనే అవసరమైన మందులు అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

నియోజకవర్గంలో విద్యార్థుల వివరాలు (2.7.2025 నాటికి I నుంచి పదో తరగతి వరకు)

మండలం పేరు	పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు
రాయదుర్గం	87	14,906
గుమ్మఘట్ట	64	7,896
బొమ్మనహాళ్	50	9,296
డి.హీరేహాళ్	54	9,317
కణేకల్లు	67	7,967

ఆరోగ్య ప్రగతి కార్డులు..

పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి వివరాలన్నీ ఆరోగ్య ప్రగతి కార్డులో నమోదు చేయనున్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ మందికి పంపిణీ చేయకపోవడంతో పుస్తకాల్లో నమోదు చేశారు. అయితే

విద్యార్థి బరువు చూస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల వివరాలతో పాటు ఆరోగ్య సమాచారం జోడించి ప్రత్యేక కార్డులు ఏర్పాటు చేయనున్నారు.

మూడ్రోజుల్లో పూర్తి చేస్తాం

ప్రతి పాఠశాల్లో చదివే విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎత్తు, బరువుతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలుంటే మందులు అందిస్తున్నాం. మూడు రోజుల్లో పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఆరోగ్య సిబ్బందితో కలిసి పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. -డా.హజార్‌భాన్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: కుందుర్పి మండలంలోని శీగలపల్లి నుంచి కొల్లాపల్లి వరకు మట్టిరోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- గ్రామస్థులు**

సమాధానం: రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేయిస్తాం. **- లక్ష్మీశంకర్, ఎంపీడీవో**

సమస్య: మహంతపురంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించాలి. **- కెంచలింగ**

సమాధానం: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నీటి సరఫరా ఆగిపోవడంతో సమస్య నెలకొంది. త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తాం. **- శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ**

- న్యూస్‌టుడే, కుందుర్పి

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఉరవకొండ: మహిళల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ మండలం మోపిడిలో జరిగిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికార యంత్రాంగం, స్థానిక నాయకులతో కలిసి మంత్రి ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఏడాదిలో తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, గుంతలేని రహదారుల నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అక్కడి మహిళలు తాగునీటి, పొలం రస్తా, విద్యుత్తు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగరాజు, నాయకులు మేకల రంగనాథ్‌చౌదరి, గురుప్రసాద్, కేశన్న, మండల కన్వీనరు ధనుంజయ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: తెదేపాతోనే రాయదుర్గం పట్టణాభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని 3వ వార్డులో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో సాధించిన పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేశారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రజాప్రతినిధులు, నాయకులు రైతులు, వ్యాపారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. పట్టణ శివారు లేఅవుట్లలో పేదల బలహీనతను సొమ్ము చేసుకుని ఒక్కో నాయకుడు 20 నుంచి 50 దాకా నకిలీ పట్టాలు సృష్టించి దండుకున్నారని తెలిపారు. ఏడాదిలో సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని వివరించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, కౌన్సిలర్ ప్రశాంతి, కృష్ణమూర్తి, హనుమంతు, జిలానీబాషా, మహబూబ్‌బాషా, జ్యోతి, సుమలత, ధనార్జున, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: ఆదిగానపల్లి గ్రామ సమీపంలో పత్తి పొలంలో పనులు చేస్తున్న కూలీలతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముచ్చటించారు. మండలంలోని కణేకల్లు, యర్రగుంట, మాల్యం, తదితర గ్రామాల్లో తెదేపా నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, ఆనందరాజు, రమేశ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

శెట్టూరు: గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులతో సంక్షోభంలోకి నెట్టగా.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని అయ్యగార్లపల్లి, కనుకూరు, అనుంపల్లి గ్రామాల్లో గురువారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణదుర్గంలో మంత్రిగా ఉషశ్రీ, ఎంపీగా తలారి రంగయ్య ఉన్నా.. చేయాల్సిన అభివృద్ధిని మరిచి మహాళ్ళు, దందాలు చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాదిలోనే అమలు చేశారని కొనియాడారు. ఈనెల 5న బీటీపీ కాలువ పనులు పునః ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, డైరెక్టర్లు సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శెట్టూరు: అయ్యగార్లపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సురేంద్రబాబు

గత ఐదేళ్లలో హెచ్చెల్సీ నిర్వహణ అధ్వానం

కణేకల్లు, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల పాలనలో హెచ్చెల్సీ నిర్వహణ అధ్వానంగా ఉందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం కణేకల్లు మండలంలోని యర్రగుంట సమీపంలో 137 కి.మీ. వద్ద యూటీ నిర్మాణ పనులను తెదేపా నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెచ్చెల్సీ డీఈ దివాకర్‌రెడ్డితో వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 10న హెచ్చెల్సీకి నీరు విడుదల చేయనున్న దృష్ట్యా కర్ణాటక అధికారులు తుంగభద్ర బోర్డుకు కోరిన నేపథ్యంలో పనులన్నీ పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. గత పాలకుల నిర్లక్ష్యానికి జలాశయం క్రెస్ట్ గేటు కొట్టుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని గేటుకు నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా రూ.కోటితో యుద్ధప్రాతిపదికన పనులు చేయించినట్లు తెలిపారు. ఈ ఏడాది అత్యవసర పనులకు రూ.35 కోట్లు నిధులు మంజూరు చేయడంతో యూటీ, వంతెనలు, లైనింగ్ పనులు శరవేగంగా కొనసాగుతూ కొత్త రూపు సంతరించుకుంటోందని చెప్పారు. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనందరాజు, ఆది, సుదర్శన, వన్నూరెడ్డి, రమేశ్, చాంద్‌బాషా, ఎర్రిస్వామిరెడ్డి, వన్నూరుస్వామి, జేకం నరేంద్రమారుతి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద హెచ్చెల్సీ బ్రాంచి కాలువ కల్వర్టుకు నిర్మించిన సైడ్‌వాల్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఉంతకల్లు రైతులు పొలాలకు వెళ్లే వారు బ్రాంచి కాలువపై ఉన్న రస్తాపై ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల్లో నిత్యం వెళ్తుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో బోల్తా పడతామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. దీనిపై హెచ్చెల్సీ ఏఈఈ అల్తాఫ్‌ను వివరణ కోరగా.. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, బొమ్మనహాళ్**

రీసర్వేతో ఇబ్బందులు తొలగించాలని ధర్నా

నిరసన తెలుపుతున్న కౌలు రైతులు

వజ్రకరూరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: తాము 30 ఏళ్లుగా కాశీవిశ్వేశ్వర స్వామి, సుంకులమ్మ ఆలయాలకు చెందిన 100 ఎకరాల పొలాన్ని కౌలుకు చేసుకుంటుండగా.. రీసర్వేలో ఆ పొలాలకు సంబంధించిన ఖాతాల కేటాయింపులో సమస్య రావడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వజ్రకరూరు మండలం పొట్టిపాడుకు చెందిన కౌలు రైతులు వాపోయారు. గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గతంలో ఆ భూముల ఆధారంగా కౌలు గుర్తింపు కార్డులు పొందామన్నారు. అయితే రీసర్వేతో ఏర్పడిన సమస్య వల్ల ప్రస్తుతం గుర్తింపు కార్డుల జారీకి అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. దీనిని జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి, సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సౌర ప్రాజెక్టు ఏర్పాటుకు సహకరించండి: ఆర్డీవో

కంబదూరు, న్యూస్‌టుడే: సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూముల అవసరం ఉందని, రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించాలని ఆర్డీవో వసంత్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చెన్నంపల్లిలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు ఏర్పడటం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు తెలిపారు. కంపెనీకి సంబంధించి అంగీకార పత్రాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచి ముత్యాలమ్మ, ఎన్‌టీపీసీ ఏజీఎం శివకుమార్, బాలాజీ, తహసీల్దారు బాలకిషన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బోర్డుల ఏర్పాటు

ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం నంబర్లు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండులో ప్లాట్‌ఫాం నంబర్లు, ఆయా చోట్ల గ్రామాల పేర్లు కలిగిన బోర్డులు ఏర్పాటు చేశారు. మే 27న కలెక్టర్ వినోద్ కుమార్ కళ్యాణదుర్గం వచ్చిన సందర్భంగా పలువురితో సమస్యలు తెలుసుకున్నారు. ఆయా మార్గాలకు వెళ్లే బస్సులు ప్లాట్‌ఫాంలో నిలబడేలా చర్యలు తీసుకోవడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

చౌక బియ్యం పట్టివేత

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ మండలం లింగమ్మనహళ్లి గేటు సమీపంలో కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ ఎస్.జమల్‌బాషా తెలిపారు. గురువారం జిల్లా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటకకు చెందిన డ్రైవరు తిప్పేస, బళ్లారికి చెందిన వాహన యజమాని సురేశ్ సుమారు 43.60 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని, నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు, సీఎస్‌డీటీ సురేశ్‌బాబు వివరించారు.

రాయితీపై దాణా పంపిణీ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పశుపోషణకు ప్రభుత్వం రాయితీపై దాణా అందజేస్తోందని పశువైద్యాధికారి మంజునాథ్ తెలిపారు. గురువారం ముద్దినాయనపల్లి పశువైద్యశాల వద్ద రైతులకు దాణా పంపిణీ చేశారు. తెదేపా పంచాయతీ కన్వీనర్ మోహన్, మార్కెట్ యార్డు సభ్యుడు బలరాం తదితరులు పాల్గొన్నారు

ప్రాంతీయ ముఖ్య ఉపాధ్యక్షుడి ఎంపిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: కార్మిక పరిషత్ ప్రాంతీయ ముఖ్య ఉపాధ్యక్షుడిగా వజ్రకరూరు మండలం ప్యాపిలికి చెందిన ఎర్రిస్వామి ఎంపికైనట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవాంజనేయులు గురువారం తెలిపారు. ఉరవకొండ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. సంఘం తనకు కల్పించిన అవకాశంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం డిపో అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వెంకటేశ్ అభినందనలు తెలిపారు.

ఆర్డీటీ పరిరక్షణకు పాటుపడదాం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఆర్డీటీని రక్షించుకోవడానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆ సంస్థ పరిరక్షణ ఐకాస కన్వీనర్ సాకే హరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అక్కమ్మ ఆలయ ఆవరణలో వివిధ ప్రజా, కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి రావాల్సిన నిధులను అడ్డుకోవడం దారుణమన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం సంస్థ సేవలు మరువలేనివన్నారు. పార్టీలకు అతీతంగా ఆర్డీటీని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఓబయ్య, కొల్లాపురప్ప, అక్కులప్ప, నారాయణ, హనుమంతరాయుడు, బాబు, చెలిమప్ప తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని డి.కొండాపురంలో గురువారం 120 సంకర జాతి పశువులకు థైలేరియాసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఇది ప్రాణాంతకమైన వ్యాధి కావడంతో పాడి రైతును ఆర్థికంగా దెబ్బ తిస్తుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా టీకాలను సరఫరా చేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక పైపులైన్

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం ఇంద్రావతిలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి జల్‌జీవన్ మిషన్ కింద రూ.16 లక్షలతో మోపిడి నుంచి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులను అధికార యంత్రాంగం చేపట్టింది. గురువారం గ్రామ మాజీ సర్పంచులు వెంకటేశ్, ఓబులేశు పైపులైన్ తవ్వే పనులు ప్రారంభించారు. మంత్రి కేశవ్ సహకారంతో పీఏబీఆర్ నుంచి వచ్చే నీటిని గ్రామానికి తీసుకెళ్లడమే పైపులైన్ ప్రధాన ఉద్దేశమన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

రహదారి పక్కన బోల్తా పడిన కారు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: అదుపు తప్పి కారు బోల్తా పడటంతో ఐదుగురు ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఈ సంఘటన గొడశలపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఉపాధ్యాయులు తెలిపిన మేరకు వివరాలిలా.. డి.హీరేహాళ్ మండలం గొడశలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విధులు ముగించుకుని సాయంత్రం అనంతపురానికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో గొడశలపల్లి - ఎల్బీ నగర్ గ్రామాల మధ్య బెళగడ్డి తోట దగ్గర కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే క్షతగాత్రులను గొడశలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

రాయితీ వేరుసెనగ కొనుగోలు.. దుకాణం జప్తు

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాయితీ వేరుసెనగను కొనుగోలు చేసిన దుకాణ యజమానిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉరవకొండ ఏవో రామకృష్ణుడు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని గవిమఠం దారిలోని శివ బాలాజీ అగ్రి ట్రేడర్స్‌లో గురువారం సాయంత్రం కూడేరు మండలం శివరాంపేటకు చెందిన ఓ రైతు రాయితీ వేరుసెనగ కాయలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దుకాణాన్ని పరిశీలించిన వ్యవసాయ సిబ్బంది 25 బస్తాల్లో ఉన్నట్లు నిర్ధారించారు. ఏవో, రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చేలోగా యజమాని దుకాణాన్ని మూతవేసి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో దుకాణాన్ని అధికారులు జప్తు చేశారు. ఏఈవోలు వెంకటరమణ, శిరీశ్, వీఆర్వో షేక్షావలి, హెడ్‌కానిస్టేబుల్ అంజయ్య పాల్గొన్నారు.

గొర్రెలు మృత్యువాత

బెళుగుప్ప: రసాయన ద్రావకం కలిపిన నీరు తాగి గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన మండలంలోని కోనంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, నాగమ్మ, రామాంజనేయులు, గాంధీ తమ జీవాలను మేత కోసం గ్రామ సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లారు. ఓ తోటలో బోరు వద్ద ఉన్న తొట్టెలో పురుగుల మందు కలిపిన నీళ్లను తాగడంతో 15 గొర్రెలు మృతిచెందాయి. దీంతో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఉరవకొండ, న్యూస్‌టుడే: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోపిడి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ నీటులో ప్రతిభ చాటిన విద్యార్థిని మౌనికకు బెంగళూరుకు చెందిన హారమన్ సిటీ అధినేత నెట్టెం రవి మంత్రి చేతుల మీదుగా రూ.50 వేలు చెక్కు అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు రాతపుస్తకాలు, అట్టలు పంపిణీ చేశారు. రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత నర్రా కేశన్న డాక్టర్ నర్రా చైతన్య జ్ఞాపకార్థం పదిలో మొదటి స్థానం రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు అందజేశారు.

తహసీల్దారును నియమించాలని నిరసన

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలానికి శాశ్వత తహసీల్దారు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేశవరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. గురువారం శాశ్వత తహసీల్దారును నియమించాలని కోరుతూ కార్యాలయానికి తలుపులు వేసి ధర్నా చేశారు. ఏడాదిగా ఇన్‌ఛార్జి అధికారే కొనసాగుతున్నారన్నారు. చిన్న పనులకు కూడా మూడు, నాలుగు రోజులు వేచి ఉండాల్సి వస్తోందన్నారు. దీనిని జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి, నియమించాలని డిమాండు చేశారు.

గ్రంథాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పన్నుల వివరాలను గ్రంథాలయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పాఠకులకు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం.. రోగుల అవస్థలు

రాయదుర్గం పట్టణంలోని వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రిలో గురువారం ఉదయం 10 గంటలైనా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఎదురుచూడాల్సి వచ్చింది. వివిధ గ్రామాల నుంచి సుమారు 60 మంది రోగులు పేర్లను నమోదు చేసుకుని వరుసలో ఉన్నారు. వైద్యులు లేక ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. చంటి పిల్లలు, వృద్ధులు, రోగులు కూర్చొనేందుకు వసతులు లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. ఈ విషయమై సూపరింటెండెంట్ మెర్సి జ్ఞాన సుధను వివరణ కోరగా.. వైద్యులు సకాలంలో చికిత్సలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం**

కల్వర్టులు లేక.. ప్రమాదాలు

విడపనకల్లు మండలం జనార్దనపల్లి నుంచి వజ్రకరూరు మండలం చాబాలకు వెళ్లే దారిలో రెండు చోట్ల కల్వర్టులు నిర్మించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు బాగా ఉండడంతో వాహనాలు వేగంగా వస్తుంటాయి. కల్వర్టులు లేని విషయం దగ్గరకు వచ్చే వరకు వాహనదారులకు కనిపించక, వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టులు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ నాగభూషణను వివరణ కోరగా.. పరిశీలించి నిర్మాణాలకు ప్రతిపాదిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, విడపనకల్లు (ఉరవకొండ)**

విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారిణి చల్లా శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య సేవలందించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ఆసుపత్రిలో కాన్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ఎస్‌వో కమలమ్మ, సీహెచ్‌వో ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

శెట్టూరు: సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

శెట్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని యాటకల్లు ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయినా ఉపాధ్యాయులు అపర్ణ, విరూపాక్షి, సంపత్, గురాజీ, పర్సప్ప, శివ, స్వర్ణరేఖలను గురువారం హెచ్‌ఎం చంద్రమౌళి ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి చేసిన సేవలు కొనియాడారు.

గుమ్మగట్ట: మండలంలోని గౌనికుంట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు శైలజ బదిలీ కావడంతో హెచ్‌ఎం కారుమంచి ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు సత్కరించారు.

ఉరవకొండ: ఉరవకొండ ఎస్ఎల్ఎన్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి పలువురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. గురువారం వారిని హెచ్‌ఎం నిర్మల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు గోపాల్, భాస్కర్, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, పార్వతి, రుషేంద్రస్వామి, శివప్రసాద్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గుంతకల్లు

●గుంతకల్లు ●శింగనమల ●తాడిపత్రి

కసాపురంలో గోశాల నిర్మాణం

గోశాల పనులు పరిశీలిస్తున్న దాత పరమేశ్వర్‌సింగ్

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం ఆలయంలో దాత సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న గోశాలను దాత పరమేశ్వర్‌సింగ్ గురువారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన పరమేశ్వరసింగ్ దాదాపు రూ.కోటితో గోశాల నిర్మాణం కోసం సహకారం అందిస్తామని తెలియజేయడంతో ఆలయానికి చెందిన భూమిలో పనులు జరిపిస్తున్నారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం

మాట్లాడుతున్న ఆర్‌బీప ప్రెసిడెంట్ బిషప్ సురేశ్, జార్జిపాల్ తదితరులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో ఎఫ్‌సీఐ గోదాం దగ్గర ఇండియన్ క్రిస్టియన్ చర్చిలో పాస్టర్ల అంతర్జాతీయ (క్రైస్తవ) దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆర్‌బీప ప్రెసిడెంట్ బిషప్ సురేశ్, కృష్ణసాయి కార్యదర్శి జార్జ్‌పాల్, సహాయ కార్యదర్శి జ్యోతిరాజ్, కోశాధికారి డెవిడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బిషప్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

కూటమి ప్రభుత్వంతో సంక్షేమ పాలన

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, యువనాయకుడు గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, న్యూస్‌టుడే : జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సంక్షోభంలో కినెడితే చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే సంక్షేమం వైపు దూసుకెళ్తోందని గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం అనుంపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

యాడికి, న్యూస్‌టుడే : మండలంలోని తెదేపా బూత్ కన్వీనర్లకు గురువారం మండల కన్వీనర్ రుద్రమనాయుడు కరపత్రాలు పంపిణీ అందజేశారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ప్రతి బూత్ కన్వీనర్ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, విజయాలు, ప్రజలకు అందించిన పథకాలను వివరించాలన్నారు. తెదేపా నాయకులు బొట్టుశేఖర్, విక్రమ్, మధురాజు, మహమ్మద్, హాజీమస్తాన్,నాగేంద్రపాల్గొన్నారు.

తాడిపత్రి : రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కృషి చేస్తోందని తెదేపా కౌన్సిలర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. నందలపాడులో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో పలువురు తెదేపా కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల సరఫరాకు ఆపసోపాలు

● అధికారులే గుత్తేదారులు
● ప్రతినెలా తప్పని తిప్పలు

గుత్తి, తాడిపత్రి, శింగనమల, పామిడి, న్యూస్‌టుడే : చౌకడిపోలకు నిత్యావసర సరకులను సరఫరా చేసేందుకు గుత్తేదారులు కరవయ్యారు. దీంతో అధికారులే ప్రతినెలా సరకులను చౌకదుకాణాలకు ప్రైవేట్ వాహనాలను సమకూర్చుకుంటూ సరఫరా చేస్తున్నారు. ఫలితంగా సరకు రవాణా అస్తవ్యస్తంగా మారింది. స్టాకిస్టులు పనిభారంతో అవస్థ పడుతున్నారు. ఒక వైపు స్టోర్లకు అలాట్‌మెంట్ ఇవ్వాలి. మరోవైపు సరకులను తరలించాలి. సరకు చేరిందాలేదా అనేదీ పరిశీలించాల్సి ఉంటుంది. ● గుత్తి, శింగనమల, రాయలచెరువు ఎంఎల్ఎస్ పాయింట్లకు నిత్యావసర సరకుల రవాణాకు గుత్తేదారులు లేక తలనొప్పిగా మారింది. ప్రధానంగా గుత్తి నుంచి పామిడి, పెద్దవడుగూరు, గార్లదిన్నె, గుంతకల్లు, పుట్లూరు మండలాల్లోని పలు గ్రామాల చౌకదుకాణాలకు సరకులు సరఫరా చేయాల్సి ఉంది.

గుత్తి స్టాక్ పాయింట్ బియ్యం బస్తాలతో వాహనం

ఏడాది నుంచి అధికారులే అన్నీ

శింగనమల ఎంఎల్ఎస్ నుంచి నార్పల, గార్లదిన్నె, శింగనమల, అనంతపురం ఎంఎల్ఎస్ నుంచి బుక్కరాయసముద్రం, తాడిపత్రి పాయింట్ నుంచి పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు మండలాలకు చౌకదుకాణాలకు సరకులను చేరవేస్తున్నారు. రాయలచెరువు పాయింట్ నుంచి యాడికి రాయలచెరువు సరకులు సరఫరా చేస్తున్నారు. సుమారు ఏడాది నుంచి అధికారులే సరకులను సరఫరా చేస్తూ బిల్లులు పెట్టుకుంటున్నారు.

పాత వారే కొనసాగింపు

జిల్లాలోని రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ, కణేకల్లు, కంబదూరు, కళ్యాణదుర్గం ఆత్మకూరు తదితర ఎంఎల్ఎస్ పాయింట్లకు పాతగుత్తేదారులే కొనసాగుతున్నారు ప్రభుత్వం కిలోమీటరు లెక్కన క్వింటాకు రూ.19.50 చెల్లిస్తోంది. ఇటీవల పౌరసరఫరాలశాఖ అధికారులు సరకు రవాణాకు టెండర్లు నిర్వహించగా గుత్తేదారులు సిండికేట్‌గా మారి సింగిల్ టెండర్లు వేశారు. దీంతో అధికారులు టెండర్లను ఆమోదించలేదు. ● మరోసారి టెండర్లు నిర్వహించాలని వారు యోచిస్తున్నారు. గుత్తేదారులకు సొంత వాహనాలు ఉండి, వారే నేరుగా టెండర్లలో పాల్గొనాల్సి ఉంది. ప్రస్తుతం గుత్తేదారుల కాల పరిమితి ముగిసినా వారినే కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈవిషయమై సంబంధిత అధికారులు మాట్లాడుతూ త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. గుత్తేదారులేని ప్రాంతాలకు, గడువు ముగిసిన ప్రాంతాలకు టెండర్లు నిర్వహిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులో రామస్వామి ఆలయం ఏరియాలో కొన్ని విద్యుత్తు స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు వెలుగటం లేదు. **- విశ్వనాథ్**

సమాధానం: పరిశీలించి వీధి దీపాలు వేయిస్తాం. **- సుదర్శన, ఏఈ, గుంతకల్లు**

– న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

సమస్య : పెరవలి గ్రామ పొలాల్లో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- శ్రీరామ్‌కుమార్, పెరవలి

సమాధానం : స్థానిక విద్యుత్తు లైన్‌మెన్‌కు సమస్యను తెలియజేసి వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. **- విజయ్‌కుమార్, ఏఈ, విద్యుత్తు శాఖ, శింగనమల**

సమస్య : శింగనమల మండలంలోని పోతురాజుకాల్వలో మురుగు సమస్య నెలకొంది.

- పరశురాం, పోతురాజుకాల్వ

సమాధానం : సమస్యను గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి వెంటనే పరిష్కరిస్తాం. **- భాస్కర్, ఎమ్పీడీవో, శింగనమల**

– న్యూస్‌టుడే శింగనమల

సమస్య : తాడిపత్రిలోని నందలపాడు కాలనీలో పెద్దపప్పూరు రోడ్డు పక్కలో భారీగా చెత్త పడేస్తున్నారు.

- చిన్నకుళ్లాయప్ప, వాహనదారుడు

సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం.

- నాగేంద్ర, మున్సిపల్ ఏఈ

సమస్య : తాడిపత్రిలోని పాతకోట, ఓంశాంతి నగర్ మీదుగా పోయే ప్రధాన మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది.

- రమాదేవి, స్థానికురాలు

సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం.

- నాగేంద్ర, మున్సిపల్ ఏఈ

– న్యూస్‌టుడే తాడిపత్రి

వాహనదారుడికి చోదక పత్రం తప్పనిసరి

దుకాణదారులకు మొక్కుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వాహనచోదక పత్రం, బీమా (డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు) తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం మైనర్ బాలురు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణాశాఖాధికారులు యువతకు అవగాహన కల్పించాలన్నారు. అందరూ వాహనచోదక పత్రం తీసుకొనేలా చైతన్య పరచాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే వారికి వాహన చోదక పత్రం ఉంటేనే వేతనాలు ఇస్తామన్నారు.

దుకాణాలకు సకాలంలో అద్దెలు చెల్లించాలి

తాడిపత్రిలోని పురపాలిక దుకాణాలకు సకాలంలో అద్దెలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పురపాలక ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పురపాలికలో అభివృద్ధి పనులు, కార్మికులకు వేతనాలు అందించేందుకు ఇబ్బందిగా ఉందన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి చేయండి

ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఎంపీ నిధులు కేటాయించి మండల అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎంపీపీ వీరభద్రయ్య ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. అనంతపురంలోని ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుత్తి మండలానికి ఎంపీ నిధులతో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. చాలా గ్రామాల్లో వివిధ సమస్యలు నెలకొన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పూలకుంట, ధర్మాపురం, పి.ఎర్రగుడి, గొందిపల్లి, ఊటకల్లు తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా శిథిలమయ్యాయని, వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్‌అలీ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

దీక్షలో ఇంజినీరింగ్ కార్మికులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో మున్సిపల్ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికులు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. ఐకాస నాయకులు, కార్మికులు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జీవో నంబరు 7ను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఐకాస నాయకులు చేపట్టిన నిరహార దీక్ష గురువారం 15వ రోజుకు చేరింది.

ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి,గుత్తిఆర్.ఎస్.లలో గురువారం ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు తమ పాఠశాలలను బంద్ చేశారు. అధికారుల వేధింపులకు వ్యతిరేకంగా వారు పాఠశాలలను మూసివేసి నిరసన తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు అతిగా స్పందించడం తగదన్నారు. త్రీమెన్ కమిటీల పేరుతో తమను ఇబ్బందిపెట్టడం అన్యాయమన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రంగారావు, వేదమూర్తి, బాటు తదితరులు పాల్గొన్నారు.

మాయం చేసిన సొమ్ము అందజేత

యాడికి, న్యూస్‌టుడే : ఓ మహిళ బ్యాంకు ఖాతా నుంచి నగదును మాయం చేసిన మాజీ వాలంటీరు ఎట్టకేలకు డబ్బును బాధితురాలికి చెల్లించాడు. యాడికిలోని వడ్డే జయమ్మ ఆధార్ నంబరుతో వేలి ముద్ర వేయించుకుని రూ.10 వేలను తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. జనాభా లెక్కలంటూ ఆధార్ తీసుకోవడం, చరవాణికి నగదు తీసుకున్నట్లు సమాచారం రావడంతో అనుమానం వచ్చి బాధితురాలు ఆరా తీశారు. నగదు తీసినట్లు తేలడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. సమాచారం తెలుసుకున్న మాజీ వాలంటీరు జయమ్మ బంధువుల చరవాణికి రూ.పది వేలను ట్రాన్స్‌ఫర్ చేయడంతో సమస్య పరిష్కారమైంది.

దారంతా గుంతలు

మండలంలోని తెలికి, చింతలచెరువు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్దవడుగూరు నుంచి మేడిమాకులపల్లికి వెళ్లే వరకు సుమారు ఐదు కి.మీటర్ల రహదారి గుంతలతో దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే పెద్దవడుగూరు

భక్తులకు నీటి కష్టాలు

గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదు. భక్తులు కాళ్లు శుభ్రం చేసుకునేందుకు నీటి వసతి లేదు. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే తొండపాడు (గుత్తి గ్రామీణం)

కదలని మురుగుతో తిప్పలు

మండలకేంద్రంలోని రామకోటి కాలనీలోని పలు వీధుల్లో రహదారులపై మురుగు నిలుస్తోంది. మురుగు కాలువలు లేకపోవడంతో రోజుల తరబడి ఇళ్ల ముంగిట నిల్వ ఉంటోంది. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారులు మడుగును తలపిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు ప్రబలుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీటి కాలువలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి మహేశ్వరరెడ్డిని వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే పెద్దపప్పూరు

మరమ్మతులు మరిచారు!

తాడిపత్రిలోని టైలర్స్ కాలనీలో ప్రధాన రహదారిపై వైకాపా అధికారంలో అప్పటి నాయకులు భూగర్భ మురుగునీటి పైపులైన్ మార్చేందుకు సుమారు 20 మీటర్ల సీసీరోడ్డు పగలకొట్టారు. ఇప్పటి వరకు రోడ్డును బాగు చేయలేదు. పుట్లూరు రోడ్డులోకి వచ్చే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనిపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా త్వరలో సీసీరోడ్డు వేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే తాడిపత్రి

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నియంత్రణపై నిరంతరం అప్రమత్తత అవసరమని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం వడియంపేట గ్రామ శివారులో ఉన్న సప్తగిరి క్యాంపర్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహించి, కార్మికులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారులు రాధాకృష్ణ, మురళీకృష్ణ, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు హరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకాన్ని నిర్మూలిద్దాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పొగాకు వాడకాన్ని సమూలముగా నిర్మూలిస్తేనే ప్రజారోగ్యం బాగుపడుతుందని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీరాములు పిలుపునిచ్చారు. గురువారం బుక్కరాయసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొగాకు నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హామీలు నెరవేర్చండి: సీపీఐ

ప్రసంగిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

గార్లదిన్నె, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. గార్లదిన్నెలో గురువారం మండల కార్యదర్శి వన్నూరుస్వామి అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, రైతుసంఘం నాయకుడు చిన్నప్పయాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు శ్రీనాథ్‌చౌదరి, మండల కార్యదర్శి రాముడు తదితరులు హాజరయ్యారు ఈసందర్భంగా జాఫర్ మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే గ్రామస్థాయిలో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామన్నారు.

నవోదయ గురుకులానికి ఎంపిక

పెద్దవడుగూరు: పెద్దవడుగూరులోని జడ్పీఉన్నత పాఠశాలలో చదువుతున్న అమిరూన్ ఆరో తరగతిలో ప్రవేశానికి గాను నవోదయ గురుకులానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకరబాబు తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నదస్తగిరి, రిజ్వానా దంపతుల కుమారుడు అమిరూన్ ఇక్కడి పాఠశాలలో చదువుతూ నవోదయ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోగా అందులో వందమార్కులకు 90మార్కులు సాధించాడు. పాఠశాల యాజమాన్యంతోపాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్థులు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొప్పల కొండ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోవిందు రెడ్డి, ఉపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి బదిలీ కావడంతో గురువారం గ్రామస్థులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు పుల్లన్న, వెంకటరాముడు, ఆదినారాయణ, వెంకటేశ్, ఓబులేసు, చౌడన్న, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా రాముడు

రాముడు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రం గార్లదిన్నెలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ఆధ్వర్యంలో గురువారం సీపీఐ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ముకుందాపురం రాముడు, సహాయ కార్యదర్శులుగా వన్నూరు స్వామి, రామకృష్ణ; కౌన్సిల్ సభ్యులుగా 21మందిని, కార్యవర్గ సభ్యులుగా 9మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్ చౌదరి, రామంజి, మధు, చౌడప్ప, శర్మాష్ వలి, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కమిటీల ఏర్పాటుకు కసరత్తు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : తెదేపా మండల నూతన కమిటీలు అధిష్ఠానం ఆదేశాల మేరకే నియమిస్తామని మండల పరిశీలకుడు హరిప్రసాద్ తెలిపారు. గార్లదిన్నెలో గురువారం నిర్వహించిన మండల నూతన కమిటీ ఏర్పాటు సమావేశంలో పరిశీలకుడు హరిప్రసాద్‌తో పాటు మండల మాజీ అధ్యక్షుడు ముంటిమడుగు శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్ పాండు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుర్రం ఆదినారాయణ, బూదేడు, ముంటిమడుగు ఎంపీటీసీ సభ్యులు విశ్వనాథ్, సురేంద్రనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. * నూతన మండల కన్వీనర్ కోసం దాదాపు 18 మంది పోటీలో ఉండటానికి దరఖాస్తులు అందజేశారు. అన్నింటినీ అధిష్ఠానానికి పంపి నూతన మండల కన్వీనర్, కో-కన్వీనర్‌ను నియమించనున్నట్లు హరిప్రసాద్ తెలిపారు.

శింగనమల మండల కన్వీనర్‌కు తీవ్ర పోటీ

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : శింగనమల నియోజకవర్గంలోని మండల కన్వీనర్ల నియామకం కోసం రెండ్రోజులుగా కసరత్తు ముమ్మరం చేశారు. ముందు రోజు మరోసారి వర్గ విభేదాలు బయటపడిన విషయం తెలిసిందే. రెండోరోజు గురువారం అనంతపురం రహదారుల, భవనాలశాఖ అతిథి గృహంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆధ్వర్యంలో శింగనమల, పుట్లూరు, యల్లనూరు మండలాల కన్వీనర్లకు నియామకానికి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి, రాష్ట్ర నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్ బాబు, ఇతర నాయకులంతా హాజరయ్యారు. పోలీసుల బందోబస్తుతో ఎవరినీ లోపలికి అనుమతించకుండా కట్టుదిట్టం చేశారు. కన్వీనర్ల నియామకంపై చర్చించి, దరఖాస్తులు తీసుకున్నారు. శింగనమల మండల కన్వీనర్ పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. శింగనమలకు 17 మంది, పుట్లూరుకు ఇద్దరు చొప్పున దరఖాస్తులు ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే శ్రావణి సమస్యలు చెప్పమంటున్నారు.. చేస్తామని చెబుతున్నారు.. ఆచరించడం లేదని నాయకులు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు.

రీసర్వే తప్పులు సరిచేస్తాం

శింగనమల, న్యూస్‌టుడే : రీ సర్వేలో చోటు చేసుకొన్న తప్పులు సరి చేసి రైతుల భూములకు హక్కులు కల్పిస్తామని డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ పేర్కొన్నారు. శింగనమల మండలం లోలూరు, ఆకులేడు గ్రామాల్లో గురువారం రీ సర్వే వల్ల తలెత్తిన ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి రైతులతో సమస్యను అడిగి తెలుసుకొన్నారు. తహసీల్దారు శేషారెడ్డి, రీ సర్వేయర్ ఉప తహసీల్దారు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆగుతూ... సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

ఈనెల 30 లోపు పూర్తవ్వాలని లక్ష్యం

జగనన్న కాలనీలో ఒకటో లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో దోనిముక్కల రోడ్డు ప్రాంతం, జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా కనిపించడం లేదు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను ఈనెల 30 లోపల పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్థానిక గృహనిర్మాణశాఖ అధికారులకు ఆదేశాలు రావడంతో అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని నిర్మాణాలు ఆగుతూ.. మరికొన్ని సాగుతూ కనిపిస్తున్నాయి.

ఏ లేఅవుట్‌కెళ్లినా పరిస్థితి అధ్వానం

● గత ప్రభుత్వం ఇంటికి రూ.1.80 లక్షల మాత్రమే బిల్లు ఇచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని బీసీ, ఎస్సీల లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు ఇవ్వడానికి అంగీకరించింది. అయినా చాలా మంది లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో నిర్మాణాలు ముందుకు సాగటం లేదు. హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ● జగనన్న కాలనీల్లో 6086 వరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 3421 వరకు ఇళ్లు మంజూరు చేశారు. పది లేఅవుట్లలో 1271 మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. పునాది స్థాయిలో 1683 నిర్మాణాలు, లెంటల్ లెవెల్‌లో 69, రూఫ్ లెవెల్‌లో 163, స్లాబ్ పూర్తయినవి 26, గుంతల తవ్వకున్నవి 61 వరకు ఉన్నాయి. ఇదంతా అధికారులకు తలనొప్పిగా మారింది. ● పదో లేవుట్‌లో 1413 ఇళ్లగాను 514 పూర్తవ్వగా 6వ లేవుట్‌లో 403 ఉంటే పూర్తయినవి 191 వరకు ఉన్నాయి. 3వ లేవుట్‌లో 276 గాను 97 పూర్తయ్యాయి. 9వ లేవుట్‌లో 383 గాను 143 ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి.

పనుల్లో వేగం పెంచుతున్నాం

ఇళ్ల నిర్మాణాలను వేగం పెంచాలని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈనెల 30వ తేదీ లోపల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరవుతాయని చెబుతున్నాం.

- సాయి నవీన్, ఏఈ, హౌసింగ్

కుళ్లాయిస్వామికి నిత్యపూజా నివేదన

పాత గుంతకల్లులో



పూజలందుకున్న కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, న్యూస్‌టుడే : గూగూడు కుళ్లాయిస్వామి పీర్లకు గురువారం నిత్యపూజా నివేదనను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ప్రైవేట్ పాఠశాలలకు బంద్ ప్రకటించడంతో స్వామి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో గూగూడు వీధులు కిక్కిరిసి పోయాయి.

గుంతకల్లు పట్టణం: గుంతకల్లులో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రంను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొనున్నారు. పాత గుంతకల్లు, మిల్లు ఏరియా, పోర్టర్‌లైను, 60 అడుగుల రోడ్డు, సత్యనారాయణ పేట, భాగ్యనగర్, తదితర చోట్ల పలు చావిడిలో పీర్లు కొలువుదీరాయి. ఈ ఆదివారం రాత్రి చక్కెర చదవింపులు, పానకాలు, సోమవారం పీర్లు జలధికి వెళ్తాయని నిర్వాహకులు తెలిపారు.

పెద్దపప్పూరు: మండలకేంద్రంలో చావిడిలో పీర్ల స్వాములను కొలువు దీర్చారు. కుల మతాలకు అతీతంగా భక్తులు పాల్గొని పీర్ల స్వాములను దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు, పెద్దసరిగెత్తు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెద్దవడుగూరు : మండలంలోని పలు గ్రామాలతోపాటు పెద్దవడుగూరులో మొహర్రాన్ని పురస్కరించుకొని పీర్లు కొలువుదీరాయి. ఇప్పటికే అగ్నిగుండం ఏర్పాటు చేశారు.

వ్యాపారవేత్తలుగా రాణించాలి

గుంతకల్లు పట్టణం: వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకుంటే వ్యాపార వేత్తలుగా రాణిస్తారని ప్రిన్సిపల్ లక్ష్మయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్‌పై గురువారం ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు.

వంటమనిషి కావలెను

ఇంటియందు పనిచేయుటకు వంటమనిషి కావలెను. గుంతకల్లు టౌన్ నందు 6 మెంబర్స్ ఉన్న ఇంటిలో వంట చేయుటకు ఆడ వంటమనిషి కావలెను. బ్రాహ్మణ, వైశ్య, లింగాయిత సామాజిక వర్గానికి ప్రాధాన్యము ఇవ్వబడును. మంచి జీతం ఇవ్వబడును. సంప్రదించండి

8179506127

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

9 నుంచి గురుపౌర్ణమి వేడుకలు

అనంత సాంస్కృతికం: గురుపౌర్ణమి పురస్కరించుకుని నగరంలోని చెరువుకట్టపై సాయినాథ ఆలయంలో ఈనెల 9 నుంచి రెండు రోజులపాటు పలు ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయని శిర్డీ సాయినాథ్ సేవాసంఘం అధ్యక్షుడు పి. విజయనాథ్ తెలిపారు. బుధవారం ఆరుగంటల నుంచి పలు పూజల అనంతరం సాయంత్రం సాయినాథుడి గ్రామోత్సవం జరుగుతుంది. సాయినృత్య కోలాటం బృందం వారిచే ప్రత్యేక కోలాట నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. 10న గురువారం ఉదయం ఏడు గంటలకు రుద్రాభిషేకంతో ఉత్సవం ప్రారంభమై 10 గంటలకు సామూహిక సాయిసత్య వ్రతాలు, నారాయణ సేవ, సాయంత్రం పల్లకీసేవ, ఊంజల్‌సేవ జరుగుతాయన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం

అశోక్‌నగర్ : బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి పేర్కొన్నారు. గురువారం బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని బీసీ వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, వసతి గృహాలు ప్రారంభం కావడంతో ఎప్పటికప్పుడు సంక్షేమ అధికారులు తగు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ఇతరత్రాలు అందివ్వాలన్నారు. నీటి ట్యాంకులు, పరిసరాలు అన్నీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సంక్షేమ అధికారులు వసతి గృహాల్లో విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వసతి గృహాల మరమ్మతుల కోసం రూ.3.67 కోట్లు మంజూరు కావడంతో పనులను పర్యవేక్షించాలన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాల అమలు

సామూహిక సీమంతాల్లో గర్భిణులకు పూలు, పండ్లు అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, మహిళలు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : పార్టీలను చూసి పథకాలు ఇచ్చే ప్రభుత్వం కాదని, పార్టీలకు అతీతంగా పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు. సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం రెండోరోజు అనంతపురం గ్రామీణం తాటిచెర్ల బీసీ కాలనీలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకోగా మా ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం అందిందని, ఒకటో తేదీన ఇంటికొచ్చి రూ.4 వేలు పింఛన్ అందిస్తున్నారని ప్రజలంతా ఎమ్మెల్యేతో సంతోషం వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తొలగించిన రేషన్ కార్డులు, పింఛన్లు త్వరలో మంజూరు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు.

మురుగు కదిలితే ఒట్టు!

దయనీయంగా హెచ్చెల్సీ దక్షిణ కాలువ

హెచ్చెల్సీ దక్షిణ కాలువపై ఉన్న డ్రైనేజీలో కదలని మురుగు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: హెచ్చెల్సీ-ఎమ్వీఆర్ దక్షిణ కాలువపై నిర్మించిన డ్రైనేజీ కాలువలో మురుగు పూర్తిగా స్తంభించింది. ఎక్కడి మురుగు అక్కడే నిలబడిపోయింది. దీని పక్కనే అపరిశుభ్రత తాండవిస్తోంది. ముక్కుపుటాలదిరే దుర్వాసన వెదజల్లుతోంది. అయినా సరే.. అనంత నగరపాలక సంస్థ అటువైపు కన్నెత్తి చూడలేదు. ఇక్కడి ప్రధాన రహదారిపై పక్కనే డ్రైనేజీ కాలువ పైకప్పు కూలిపోయింది. ప్రమాదానికి నిదర్శనంగా మారింది. ఈ బాగోతం అనంత నగరం గుత్తి రోడ్డు నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే ప్రధాన రహదారిలోనే నెలకుంది. ఎమ్వీఆర్ దక్షిణ కాలువపై డ్రైనేజీ దుస్థితిని చూసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కాలువకు నీటి ప్రవాహం కొనసాగిన సమయంలో డ్రైనేజీ పొంగిపొర్లి మురుగంతా తాగునీటిలో కలుషితమయ్యే అవకాశం లేకపోలేదు. ఒకే ప్రాంతంలో మూడు రకాల సమస్యలు నెలకొన్నాయి. డ్రైనేజీ కాలువలో మురుగు కదలకపోవడం, దీని పక్కనే చెత్తాచెదారంతో కంపు కొట్టడం, అదే డ్రైనేజీపై ఏర్పాటు చేసిన పైకప్పు పలకలు కుప్పకూలడం జరిగింది. సత్వరమే వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కూలిపోయిన డ్రైనేజీ పైకప్పు

పలకలు లేక అధ్వానం

బళ్లారిరోడ్డు : నగరంలోని ఆరో రోడ్డు ప్రాంతంలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. మరమ్మతుకు చేరి కాలువపై పలకలు లేక మురుగు అస్తవ్యస్తంగా పారుతోంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. ముక్కుమూసుకొని వెళ్లే పరిస్థితి ఉంది. దోమలు వ్యాప్తి రోగాలు వస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేసి, కాలువలపై పైకప్పులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరు నియామకం

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం డివిజన్ ఇన్‌ఛార్జి ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరుగా చిత్తూరు జిల్లా ఏసీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు ఇక్కడ అసిస్టెంట్ కంట్రోలరుగా విధులు నిర్వర్తించిన కల్యాణ చక్రవర్తి కాకినాడకు బదిలీపై వెళ్లారు. పూర్తిస్థాయి ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరును త్వరలో నియమించనున్నారు.

తపాలా జీవిత బీమా ఏజెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అరవిందనగర్, న్యూస్‌టుడే: తపాలా శాఖ అనంతపురం డివిజన్లో తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్‌గా పని చేయుటకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. దరఖాస్తు నమూనా అనంతపురం తపాలాశాఖ ఎస్పీ కార్యాలయం, డివిజన్లో ఏ పోస్టాఫీసులో అయినా పొందవచ్చని ఆ శాఖ అనంతపురం డివిజన్ ఎస్పీ ఆదినారాయణ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి బయోడేటా, వయసు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, అనుభవ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 10 లోపు అనంతపురం పోస్టల్ డివిజన్ ఎస్పీ కార్యాలయానికి పంపించాలని కోరారు.

ఊరేగింపులో పాతూరు మకానం పీర్లు

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు

అనంత సాంస్కృతికం: నగరంలో మొహర్రం సందర్భంగా పీర్లకు పలుచోట్ల గురువారం రాత్రి చిన్నసరిగెత్తు కార్యక్రమాలు జరిగాయి. పాతూరు మకాన్‌లో అయిదు పీర్లలో హజరత్ అలీ, ఇమామే ఖాసీం పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. ముచ్చల మకానంలో ఏడు పీర్లలో మౌలాలి, జంగ్లీ సాహెబ్ పీర్లను పాతూరు ప్రాంతమంతా ఊరేగించారు. హౌసింగ్ బోర్డు సమీపాన నవోదయ కాలనీలో ఈనెల 10 నుంచి 17 వరకు మొహర్రం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు నేడు భూమి పూజ

రాప్తాడు: రాప్తాడు మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో అన్నక్యాంటీన్ నిర్మించేందుకు శుక్రవారం ఎమ్మెల్యే పరిటాల సునీత భూమి పూజ చేయనున్నారు. ప్రతి పేదవాడికి తక్కువ ధరకే అన్నం పెట్టేందుకు దీన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

పచ్చని చెట్లు నరకొద్దు : డీఎఫ్‌వో

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : మొహర్రం పర్వదినం సందర్భంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున చెట్లు నరికి కాలుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేశ్ అప్పావు తెలిపారు. ఎండిపోయిన చెట్లు, మొద్దులు మాత్రమే కాల్చుకోవాలన్నారు. అంతేగానీ పచ్చని చెట్లు మాత్రమే ఎట్టి పరిస్థితుల్లో నరకొద్దని ఆయన తెలియజేశారు.

భార్యపై హత్యాయత్నం.. కేసు నమోదు

అనంత నేరవార్తలు: నగరంలోని భవానీ నగర్‌కు చెందిన మునీంద్ర, తన భార్య జయలక్ష్మిపై బుధవారం చున్నీతో మెడకు బిగించి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో భార్య తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వీరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతుండేవి. బాధితురాలి ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

చక్రంలో చున్నీ ఇరుక్కొని ప్రమాదం

పెనుకొండ, న్యూస్‌టుడే: హిందూపురం నుంచి అనంతపురానికి వెళుతున్న ద్విచక్రవాహనం చక్రంలో చున్నీ ఇరుక్కుని కిందపడటంతో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం గుట్టూరు శివారులో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు హిందూపురానికి చెందిన ఉపాధ్యాయురాలు ప్రేమజ్యోతి, భర్త బాలకృష్ణతో కలిసి అనంతపురం వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను 108వాహనంలో పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

అదుపుతప్పి కారు బోల్తా

ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఐదుగురు ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఈ సంఘటన గొడశలపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఉపాధ్యాయులు తెలిపిన మేరకు వివరాలిలా.. డి.హీరేహాళ్ మండలం గొడశలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విధులు ముగించుకుని సాయంత్రం అనంతపురానికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో గొడశలపల్లి - ఎల్బీనగర్ గ్రామాల మధ్య బెళగడ్డి తోట దగ్గర కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే క్షతగాత్రులను గొడశలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

30 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపారయ్యా

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ప్రశంస

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : 30 ఏళ్ల విద్యుత్తు సమస్యను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ పరిష్కారం చూపారని అనంతపురం గ్రామీణం చంద్రబాబు కొట్టాల కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతపురం గ్రామీణం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు కొట్టాలలో తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, పరిశీలకుడు లక్ష్మీనారాయణ, ఇతర నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించిన సమయంలో విద్యుత్తు సమస్యను ఎమ్మెల్యే వద్ద మహిళలు మొరపెట్టుకున్నారు. ఇళ్లకు ఆనుకుని విద్యుత్తు నియంత్రికలు, లైన్లు ఉన్నాయని, లైన్లను మార్చాలని కోరారు. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపించారని, ఆయన చేసిన మంచి పనిని జీవితాంతం మరిచిపోలేమని మహిళలు ఎమ్మెల్యేను ప్రశంసించారు.

చంద్రబాబు కొట్టాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, బుగ్గయ్యచౌదరి

కొత్త కమిటీలు ఏర్పాటుకు కసరత్తు: అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో తెదేపా ఆధ్వర్యంలో కొత్త కమిటీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గురువారం అనంతపురంలో పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, పోతులయ్యలతో కలిసి సమావేశం నిర్వహించారు. నూతన కమిటీలపై చర్చించారు. డివిజన్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, నగర కమిటీల ఏర్పాటు కసరత్తు తుది దశకు చేరుకుందన్నారు.

మాట్లాడుతున్న సాకే లక్ష్మీనరసింహ, సరిపూటి రమణ, రాజారావు, తదితరులు

'వసీం.. నోరు జారొద్దు'

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నావు. నోరు అదుపులో పెట్టుకోవాలని తెదేపా నాయకులు హెచ్చరించారు. ఈనెల 2న మేయర్ వసీం చేసిన వ్యాఖ్యలపై నాయకులు స్పందించారు. గురువారం అనంతపురం అర్బన్ కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ రాజారావు, కార్పొరేటర్ బాలాంజనేయులు, తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అనంతవెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం అవినీతితోనే అనంతపురం నగర ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికే అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో రూ.118 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

లక్ష్మీనగర్: 9849771687
అరవింద్‌నగర్: 8008573004
రాప్తాడు: 6304766286

సమస్య: శారదానగర్ దాటిన అనంతరం ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్ పక్కవీధిలో రెండో స్తంభానికి వీధి లైటు 15 రోజుల నుంచి వెలగ లేదు. **- పి.వి.రమణ**

సమాధానం: వెంటనే వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

సమస్య: రహమత్ నగర్ నుంచి రాంనగర్‌కు వెళ్లే రైల్వేవంతెన కింద మురుగు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- రామమోహన్**

సమాధానం: కాలువలో ఉన్న మట్టిని తొలగించి మురుగు సక్రమంగా వెళ్లేలా చేస్తాం.

(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, ఎంహెచ్‌ఓ రంగస్వామి సమాధానాలు ఇచ్చారు.) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

సమస్య: ఎస్కేయూ నుంచి సమతాగ్రాం వరకూ లైట్లు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంటుంది. **- మధుసూదన్, ఆకుతోటపల్లి**

సమాధానం: ఇటీవల టెండర్లు పూర్తయ్యాయి. లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- నరసయ్య, ఏఈ, జాతీయ రహదారులశాఖ .** – న్యూస్‌టుడే: ఎస్కేయూ

తలకెక్కని శిరస్త్రాణం

ద్విచక్ర వాహన చోదకులే కాకుండా వెనుక కూర్చున్న వారూ శిరస్త్రాణం ధరించాలని నిబంధనలు తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే చోదకులే ఈ నిబంధన పాటించడం లేదు. తనిఖీ, పర్యవేక్షణ లేక కొంత మంది వాహనదారులు శిరస్త్రాణం పెట్టుకోకుండానే ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఏకంగా ముగ్గురేసి ప్రయాణం సాగిస్తున్నా అడిగేవారు లేరు. కొంతమంది శిరస్త్రాణం ఉన్నా తలకు పెట్టుకోవడం లేదు. వీరందరికీ చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై నిబంధనల ఉల్లంఘనకు నిదర్శనం ఈ చిత్రం. **- ఈనాడు, అనంతపురం**

గొలుసు దుకాణాలపై తక్షణ చర్యలు చేపట్టండి

అశోక్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో విస్తరిస్తున్న మద్యం గొలుసు దుకాణాలు, మద్యం అక్రమ విక్రయాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ సంఘాలు గురువారం నగరంలోని ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు సంతోష్‌కుమార్, పద్మావతిలు మాట్లాడుతూ.. గొలుసు దుకాణాలు నడుస్తున్నా అధికారులు మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసులు గొలుసు వ్యాపారానికి సహకారం అందిస్తున్నారన్నారు.

నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు

రథయాత్రకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించండి

అనంతపురం డీఎస్పీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: అనంతపురం పట్టణంలో ఈ నెల 5న రథయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై ఇస్కాన్ దేవాలయ ప్రతినిధులతో చర్చించాలని హైకోర్టు ఆదేశించింది. రథయాత్ర, మొహర్రం ఊరేగింపు అదే రోజు ఉండటంతో రెండు కార్యక్రమాలు సజావుగా సాగేందుకు ఈ ఉత్తర్వులిస్తున్నట్లు పేర్కొంది. చర్చల్లో పురోగతిని శుక్రవారం తమకు చెప్పాలని సూచించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులిచ్చింది. రథయాత్ర నిర్వహించుకునేందుకు ఇస్కాన్ ప్రతినిధులకు సింగిల్ జడ్జి ఉత్తర్వులివ్వగా.. దీనిపై పోలీసులు గురువారం అప్పీల్ చేశారు. వారి తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 'ఇస్కాన్ ప్రతిపాదించిన రథయాత్ర మార్గం కొంత భాగం మసీదును, మసీదులున్న ప్రాంతం నుంచి వెళుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలను డీఎస్పీతో చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది' అని అన్నారు. ఇస్కాన్ ప్రతినిధుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రథయాత్రకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

5న నగరంలో జగన్నాథ రథయాత్ర

తపోవనం, న్యూస్‌టుడే: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 5న జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ఛైర్మన్ దామోదర గౌరంగదాస్ తెలిపారు. తొలుత ఈ రథయాత్ర రెండు రోజులపాటు నిర్వహించాలని భావించారు. వివిధ కారణాల వల్ల కేవలం 5న మాత్రమే రథయాత్ర, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు లలితకళా పరిషత్తులో స్వామికి అభిషేకం, అర్చన, మధ్యాహ్నం 2.30 గంటలకు రథయాత్ర మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి ప్రారంభమవుతుంది. సప్తగిరి కూడలి, గడియారస్తంభం, రాజు రోడ్డు, శ్రీకంఠం కూడలి, పాతవూరు, ఐరన్ వంతెన మీదుగా లలిత కళాపరిషత్తుకు చేరుతుంది. రాత్రి 7 గంటలకు సత్యగోపీనాథ్ ప్రవచనాలు చేస్తారు. కార్యక్రమానికి సినీనటుడు సుమన్ అతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

తల్లి పేరుపై ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

బహుమతులు అందుకున్న యువతతో ముఖ్య అతిథులు

తపోవనం: తల్లి పేరు మీద ప్రతి ఒక్కరూ ప్రత్యేక రోజుల్లో ఒక మొక్కనాటి సంరక్షించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూముల్లో మొక్కలు నాటి హరిత వనాలను తీర్చిదిద్దాలని సూచించారు. మై భారత్ కార్యాలయంలో ఏక్ పేడ్ మాకే నామ్‌పై యువతకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రగతి పథం యువజన సంఘం, ఎస్ఆర్ ఎడ్యుకేషన్‌సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు యువతీయువకులు పాల్గొని బహుమతులు అందుకున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

అనంత నేరవార్తలు: అనంతపురం నగరంలోని పాతూరు రాజాజీ స్ట్రీట్‌కు చెందిన ఉమా ఇంట్లో చోరీ జరిగింది. గత నెలలో ఆమె ఇంట్లో బీరువాలో ఉన్న 8 తులాల బంగారు నగలను కాజేశారు. ఇటీవల యజమాని గమనించడంతో చోరీ విషయం బయటకు వచ్చింది. బాధితురాలు తన ఇంట్లో పనిచేస్తున్న పని మనిషిపైనే అనుమానం వ్యక్తం చేస్తూ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది.

కార్మికులపై కనికరం చూపండి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: చాలీచాలని వేతనంతో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై కాస్త కనికరం చూపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి కోరారు. గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు విన్నవించారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగుల్లో అందరి కంటే అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారన్నారు. ఇచ్చేది తక్కువ వేతనం అయినా పలు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్ గౌడ్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్వీఐటీకి స్వయం ప్రతిపత్తి హోదా

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించడం గర్వకారణమని కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు చేతుల మీదుగా అటానమస్ ధ్రువపత్రాన్ని ఆ కళాశాల యాజమాన్యానికి అందజేశారు. కళాశాల అభివృద్ధికి వీసీ పలు సూచనలు అందజేశారు. అటానమస్ స్థాయికి తగినట్లు కళాశాల నిర్వహించాలని, మరింత అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైస్‌ఛైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంతరెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచడానికి ఈ హోదా తోడ్పడుతుందన్నారు.

స్వయం ప్రతిపత్తి హోదా ప్రతులు అందజేస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

పవన్ కల్యాణ్ అభిమానుల సందడి

కమలానగర్: రాష్ట్రఉప ముఖ్యమంత్రి, హీరో పవన్ కల్యాణ్ నటించిన చిత్రం హరిహర వీరమల్లు టీజర్ విడుదల సందర్భంగా అనంతపురం నగరంలో అభిమానులు సందడి చేశారు. వీ మెగా థియేటర్ వద్ద అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి భవాని రవికుమార్, చంద్రమౌళి, హుసేన్ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకులు!

రెండేళ్లుగా నిలిచిన సరఫరా

రుద్రంపేట, న్యూస్‌టుడే: పంచాయతీ పరిధిలోని రుద్రంపేట గ్రామీణంలో ఐదు వేల లీటర్ల సామర్థ్యం ఉన్న 12 నీటి ట్యాంకుల ద్వారా సత్యసాయి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం రుద్రంపేట- ఆలమూరు ప్రధాన రహదారి నాలుగు వరుసల రోడ్డు నిర్మించేటప్పుడు భూమిలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులు దాదాపుగా రెండు కి.మీటర్ల మేర ధ్వంసమయ్యాయి. వాటి కారణంగా నీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. రహదారులు భవనాలశాఖ అధికారులు పైపులైన్ మరమ్మతులు చేపట్టలేదు. తెదేపా అధికారంలోకి వచ్చాక రహదారి పనులు పూర్తి చేసింది కానీ పైపులైన్ పనులు అలాగే వదిలేసింది. 12 ట్యాంకులు ఉండగా ఆరింటిలో సత్యసాయి తాగునీరు సరఫరా జరుగుతోంది. మిగతా 6 ఖాళీగా ఉన్నాయి. సమస్య పరిష్కరించి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సత్యసాయి తాగునీటి ట్యాంక్

కొనుగోలు చేస్తున్నాం



సత్యసాయి వాటర్ ప్రాజెక్టు ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు నిలిచిపోవడంతో సొంత డబ్బులతో తాగునీరు కొనుగోలు చేస్తున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని మాకు నీరు ఇప్పించండి. **- అక్కమ్మ**

పట్టించుకోవడం లేదు

స్తంభించిన నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. సత్యసాయి నీరు తాగుతున్నప్పుడు ఆరోగ్యంగా ఉండే వాళ్లం. **- నాగభూషణ**

అవీ.. ఇవీ.. అన్నీ..

ఆక్రమణలు తొలగించండి

రాప్తాడు: రాప్తాడు మండలంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ జయలక్ష్మి, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ హేమావతి, తహసీల్దార్ విజయకుమారి వివిధ శాఖాధికారులు హాజరయ్యారు. గొందిరెడ్డిపల్లి సర్పంచి శీనా మాట్లాడుతూ... చెరువు కింద ఉన్న సాగునీటి కాలువను గ్రామంలో కొందరు ఆక్రమణకు గురిచేశారని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాప్తాడు మైనార్టీ కాలనీలో వర్షాలు కురిసినప్పుడు నీరు వెళ్లే కాలువలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో నివాసాలు ముంపునకు గురవుతున్నాయన్నారు.

నేత్రానందంగా వారాహి నవరాత్రులు

అనంత సాంస్కృతికం: వారాహిమాత నవరాత్రుల ఉత్సవాలు నగరంలో గురువారం రాత్రి నిర్వహించారు. కొత్తూరు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శ్వేత వర్ణ వారాహిగా అలంకరించి పూజలు చేశారు. మహిళామండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి ఆధ్వర్యంలో వారాహి కవచం, అష్టోత్తరం, వారాహి స్తుతి, ద్వాదశ నామస్తోత్రం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు చేపట్టారు. బుడ్డప్పనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో భవానీప్రసాద్ అర్చక బృందం ధూమ్ర వారాహి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఏడు శనివారాల వ్రతానికి ఏర్పాట్లు పూర్తి

అనంత సాంస్కృతికం: ఆర్ఎఫ్ రోడ్డు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో ఈనెల 5 శనివారం నుంచి ఏడు శనివారాల వ్రతం జరుగుతుందని ఆలయ సేవాసమితి తెలిపింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట రమణారెడ్డి, కొండయ్య, ఆలూరు ఏఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ..విశేష పుష్పాలంకరణ చేపడతామన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి..

అనంతపురం విద్య: విద్యాహక్కు చట్టాన్ని నీరుగారుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. డీఈవో ప్రసాద్‌బాబుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వి మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచితంగా ప్రవేశాలు కల్పించాలి. కానీ కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులతో ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగా : మార్గన్, **గౌరి, త్రివేణి :** కన్నప్ప, **ఎస్వీ సినిమా, నీలిమ :** తమ్ముడు, **గౌతమి :** జురాసిక్ వరల్డ్, **గాయత్రి :** 3 బీహెచ్‌కే, **తరంగిణి :** సోలో భాయ్, **శాంతి :** కుబేర, **సుధా :** షో టైం.

రోడ్డు మీదే వంటావార్పు

అనంత నగరపాలక: రోడ్డు మీదే వంటావార్పు కార్యక్రమం చేపట్టి నగరపాలక ఇంజినీరింగ్ కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నగరపాలక ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారంతో 14వ రోజుకు చేరుకుంది. నగరపాలక కార్యాలయం ముందు వంట చేసుకున్నారు. అక్కడే కూర్చొని భోజనం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంజినీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేశ్, నేతలు జగదీష్, రవి శంకర్‌రెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

చట్టంతో మాకు పనేంటి!

- అనుమతులు పొందని వైకాపా కార్యాలయం
- కేఎంసీ ఆధీనంలోని భవనంలోనే సమావేశం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: చట్టంతో తమకు పని లేదనేలా వైకాపా నేతలు మరోసారి వ్యవహరించారు. అనుమతులు లేని కార్యాలయ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి తమ పెద ధోరణిని చెప్పకనే చెప్పారు. ఆ పార్టీ అధికారంలో ఉండగా కడప నగర శివారు రామాంజనేయపురంలో జిల్లా కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. నిర్మాణానికి గాను ఎలాంటి అనుమతులు పొందలేదు. ఈ విషయం గతేడాది జూన్‌లో వెలుగులోకి రావడంతో సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు. భవనాన్ని పరిశీలించి దాదాపు అయిదు ఆక్షేపణలు వ్యక్తం చేస్తూ భవన నిర్మాణానికి షార్ట్‌ఫాల్ నోటీసు జారీ చేశారు. అనంతరం ఆక్షేపణల పరిష్కారానికి తగిన పత్రాలు అందజేసి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఆ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు.

సమావేశంలో గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న వైకాపా నాయకులు

● **వెల్లువెత్తుతున్న విమర్శలు:** అనుమతులు లేని సదరు భవనంలో వైకాపా నేతలు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, సుధ, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, రమేశ్ యాదవ్, మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాషా, రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితో పాటు అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇంకా ప్రారంభం కాని.. అనుమతులే లేని భవనంలో ఇంత పెద్ద సమావేశం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై నగర పాలక ప్రణాళికాధికారి రమణను వివరణ కోరగా.. సదరు భవనం నగర పాలక ప్రణాళిక విభాగం పరిధిలో ఉందన్నారు. గతంలో ఇచ్చిన షార్ట్‌ఫాల్ నోటీసులకు ఇప్పటి వరకు ఆ పార్టీ నాయకులు సమాధానం ఇవ్వకపోవడంతో ప్లాన్ అప్రూవ్ కాలేదన్నారు. ప్లాన్ అప్రూవల్ లేని నిర్మాణాలను వాటి యజమానులు వినియోగంలోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

ప్రారంభానికి నోచని వైకాపా జిల్లా కార్యాలయం వద్ద నేతల వాహనాలు

పెన్నా లోయ పరిసర ప్రాంతాల్లో పవన్ కల్యాణ్‌పై చిత్రీకరించిన గుర్రపు స్వారీ దృశ్యం

వీరమల్లులో మన గండికోట

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ట్రైలర్ గురువారం విడుదలైంది. ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో చిత్రీకరించినట్లు అందులో చూపారు. స్థానిక మాధవ రాయస్వామి దేవాలయంలో శివాలయం గుడి సెట్టింగ్ ఏర్పాటు చేసి ప్రముఖ సినీ నటుడు సత్యరాజ్‌పై కొన్ని దృశ్యాలు చిత్రీకరించారు. పెన్నాలోయ పరిసర ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ గుర్రంపై స్వారీ చేస్తూ వెళ్తున్న దృశ్యాలు ప్రత్యేకంగా నిలిచాయి. పర్యాటక కేంద్రంలో సినిమాను చిత్రీకరించడంపై ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హరి హర వీరమల్లుకు క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించగా, మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటించగా ఎం.ఎం.కిరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం ఈ నెల 24న థియేటర్లలో విడుదల కానుంది.

మాధవ రాయస్వామి దేవాలయంలో చిత్రీకరించిన ఓ సన్నివేశంలో నటుడు సత్యరాజ్

బతుకంతా కుట్రపూరిత చరిత్ర

- యుక్తవయసులో ఉగ్రవాదం వైపు అడుగులు
- పతుల వెంట నడిచిన సతులు
- దశాబ్దాల తర్వాత దొరికిన నాగులు

రాయచోటి, న్యూస్‌టుడే: యుక్త వయస్సులో ఉగ్రవాద కార్యకలాపాలపై మక్కువ పెంచుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నడుస్తున్న ఐసీఎస్, అల్ ఉమా సంస్థలతో పరిచయాలు పెంచుకున్నారు. నూనూగు మీసాల దశలోనే వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఆ తర్వాత రాష్ట్రం కాని రాష్ట్రం వచ్చారు. అనామకుల్లా నటించారు. బతుకుదెరువు కోసం చిరు వ్యాపారం చేస్తున్న వారిలా ఊరూరా తిరిగారు. పేదింటి యువతులను వివాహమాడారు. వారూ తమ తప్పులకు సహకరించేలా మలుచుకున్నారు. ఆ తర్వాతా తమ కార్యకలాపాలు కొనసాగించారు. దశాబ్దాల తర్వాత వారి పాపం పండింది. బతుకంతా కుట్రపూరితంగా నడిపి చివరికి పోలీసులకు దొరికిపోయారు. ఈ ఉదంతంతో ప్రశాంతతకు మారుపేరైన రాయచోటి పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. దేశంలో కొన్ని ప్రధాన నగరాలు, రైలు మార్గాలను పేల్చి వేసేందుకు కుట్రలు పన్నిన ఉగ్రవాదులు తమ మధ్యనే ఉన్నారని తెలుసుకుని ఆందోళన చెందారు. ఉగ్ర నాగులను పోలీసులు పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

● అబూబకర్ సిద్దిఖీ, మహ్మద్ అలీలది తమిళనాడు. వీరు కోయంబత్తూరు, ఎగ్మోర్, బెంగళూరు రామేశ్వరం ప్రాంతాల్లో వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. తమిళనాడులోని నాగూర్, మైలాడ్, చెన్నై చింత్రాద్రిపేట, మధురై తిరుమంగళం, వేలూరు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. 1999లో చెన్నై ఎగ్మోర్‌లో చోటుచేసుకున్న బాంబు పేలుళ్లు, అదే ఏడాదిలో రైలులో పేలుడు పదార్థాలను తరలిస్తూ పోలీసులకు పట్టుపడ్డారు. ఈ కేసుల విచారణ కొనసాగుతుండగానే రాయచోటి వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు.

అమ్మో.. ఇంట్లోనే పేలి ఉంటేనో!: అబూబకర్ సిద్దిఖీ పేలుడు పదార్థాల తయారీలో సిద్ధహస్తుడు. నిత్యం జన సంచారం ఉండే, పాఠశాల ఎదుట గల రెండు అంతస్తుల భవనంలో అద్దెకు ఉంటున్నారు. ఇక్కడే భారీ ఎత్తున పేలుడు పదార్థాలను నిల్వ చేశారు. వాటితో బాంబులు తయారు చేసి దేశంలో ఉగ్ర సంస్థలకు అవసరమైన ప్రాంతాలకు చేరవేస్తూ వచ్చారు. పోలీసులు, ఐబీ అధికారుల తనిఖీ సమయంలో ఇంట్లోని వస్తువులు, సామగ్రి, అత్యాధునిక పరికరాలు లభించాయి. ఇతనికి సోదరుడిగా భావిస్తున్న మహ్మద్‌అలీ నివాసంలో పేలుడుకు ఉపయోగించే తీగలు, ఇతర సామగ్రి దొరికాయి. భారీగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు, తయారు చేసిన బకెట్, సూట్‌కేసు బాంబులు ఏదేని ప్రమాదంతో పేలి ఉంటే పట్టణంలో ఊహకు అందని విషాదమే నెలకొనేదని స్థానికులు ఇప్పుడు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్.. చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పోలీసు అధికారులు

● **నిర్వీర్యం చేసిన పోలీసులు...:** ఉగ్రవాదుల ఇళ్లలో లభించిన సూట్‌కేసు, బకెట్ బాంబులను డీఎస్పీ కార్యాలయానికి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో గురువారం ఉదయం నిర్వీర్యం చేశారు. లోతైన గొయ్యి తీసి అందులో సూట్‌కేసులు ఉంచి పైభాగంలో ఇసుక సంచులు పేర్చి పేల్చారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము ఎగిసి పడింది. ఈ ప్రక్రియనంతటినీ కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ రామనాథ్ హెగ్డే, డీఎస్పీలు కృష్ణమోహన్, మహేంద్ర పర్యవేక్షించారు.

● **ఆర్డీఎక్స్, చరవాణుల స్వాధీనం:** అబూబకర్ సిద్దిఖీ ఇంట్లో గురువారం సాయంత్రం కూడా తనిఖీలు నిర్వహించారు. చరవాణులతో పాటు ఆర్డీఎక్స్ పేలుడు పదార్థాలను గుర్తించారు. వీటితో పాటు వాకీటాకీలు, రేడియోలు, రిమోట్‌లు వంటి పరికరాలతో పాటు పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు.

పాపం పసివాళ్లు..

ఉగ్రవాదులకు పదేళ్లలోపు సంతానం నలుగురున్నారు. వీరంతా లోకం పోకడ ఎరుగని చిన్నారులు. తమ తల్లిదండ్రుల ఉగ్ర కార్యకలాపాలేవీ పట్టవు. ఇతరులతో ఆడుతూ పాడుతూ ఉండేవారు. కన్నవారి కార్యకలాపాలతో ఈ చిన్నారులు ఇప్పుడు వారికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. గురువారం రాయచోటి కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకొచ్చిన తమ తల్లులను చూసేందుకు నలుగురు పిల్లలు తమ బంధువులతో కలిసి వచ్చారు. పోలీసుల అదుపులో తల్లులు.. దూరంగా చెన్నైలో తండ్రులు ఉండిపోయారు. పోలీసు వాహనంలో జైలుకు తరలి వెళ్తున్న తల్లులను చూస్తూ పిల్లలు రోడ్డు పైనే ఉండిపోయారు.

రాయచోటిలోని కోర్టు ఎదుట బంధువులతో చిన్నారులు

కారాగారంలో ప్రత్యేక బ్యారక్...

మహిళలను కడప జైలుకు తరలిస్తున్న పోలీసులు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: రాయచోటిలో అరెస్టైన ఇద్దరు ఉగ్రవాదుల భార్యలను రిమాండ్ నిమిత్తం కడప ప్రత్యేక మహిళా కారాగారానికి కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య గురువారం సాయంత్రం తీసుకొచ్చారు. వీరిద్దరిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచారు. అక్కడ ఇరవై నాలుగు గంటల పాటు కట్టుదిట్టమైన నిఘా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఉగ్రవాదుల భార్యలను ప్రత్యేక మహిళా కారాగారంలో ఉంచడం ఇదే మొదటిసారి.

గుట్ట లోగుట్టు ఎవరికెరుక!

- ఓ విశ్రాంత ఉద్యోగి కంత్రీ పనులు
- పట్టా పేరుతో ఊరుమ్మడి స్థలానికి ఎసరు

వీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: అతను ఓ ప్రభుత్వ ఉద్యోగి. ఉన్నత స్థాయిలో విధులు నిర్వహించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందారు. రెవెన్యూ చట్టాల్లోని లొసుగులు తెలుసున్నారు. ఆపై భూముల వ్యవహారాల్లో ఆరితేరారు. గ్రామస్థులు తమ పశువుల మేతకు ఉపయోగించుకునే పచ్చని గుట్టపై కన్నేశారు. తనకు తెలిసిన మార్గాల్లో పత్రాలు సృష్టించి డీకేటీ పట్టా పొందారు. ఇప్పుడు గుట్టను ధ్వంసం చేసి చదును చేసే పనులు ప్రారంభించారు.

పొంతల చెరువు సమీపంలోని గుట్ట

గత ప్రభుత్వంలో అనుమతులు

పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ పొంతలచెరువు విద్యుత్తు ఉప కేంద్రం ఎదురుగా చెన్నై- హైదరాబాద్ జాతీయ రహదారి వెళ్తుంటుంది. ఆ సమీపంలోని హంద్రీ- నీవా కాలువను ఆనుకుని సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో గుట్ట ఉంటుంది. ఎల్లప్పుడూ పచ్చగా ఉండటంతో ఇక్కడ ఆవువారిపల్లె, విద్యానగర్, పొంతలచెరువు, క్రిష్టారెడ్డిగారిపల్లె తదితర గ్రామాల ప్రజలు మూగ జీవాలను మేపుకొంటుంటారు. ఈ గుట్టపై అవువారిపల్లెకు చెందిన విశ్రాంత ఉద్యోగి కన్ను పడింది. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల పేర్లపై డీకేటీ పట్టాలు పొందారు. వీటిని గతంలో ప్రభుత్వం రద్దు చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మళ్లీ చక్రం తిప్పారు. ఉన్నత స్థాయి నుంచి 2023లో అనుమతులు తెచ్చుకున్నారు. అనంతరం పట్టాదారు పాసుపుస్తకాలు పొంది, ఆన్‌లైన్‌లో 1బీ అడంగల్‌లో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు.

పాసుపుస్తకాల జారీపై విమర్శలు

ఒకే కుటుంబంలోని వ్యక్తుల పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేసి 1బీ అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థులందరికీ ఉపయోగపడే గుట్టకు పట్టాలు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూగ జీవాల మేతకు ఉపయోగపడుతున్న భూములను ధ్వంసం చేస్తుండటంపై ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ.. గుట్టకు ఇచ్చిన పట్టాలపై విచారణ చేయిస్తామన్నారు. అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని.. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అతివకే ఊరి స్వచ్ఛ బాధ్యత

- సంపద సృష్టి కేంద్రాల అప్పగింత యోచన
- ప్రయోగాత్మకంగా రెండు పంచాయతీల్లో అమలు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: ఇల్లు చూసి ఇల్లాలిని చూడు అనేది నానుడి. గృహాన్ని చక్కదిద్దుకోవడంలో ఇల్లాలిది బృహత్తర బాధ్యత మరి. ఈ కోవలోనే పల్లెల పరిశుభ్రతలో మహిళలను భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంపద సృష్టి కేంద్రాల ద్వారా చెత్త నుంచి ఆదాయాన్ని రాబట్టే దిశగా కూటమి పాలకులు ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. వాటి నిర్వహణ బాధ్యతను అతివలకు అప్పగించడం ద్వారా మరిన్ని సత్ఫలితాలు సాధించేందుకు సంకల్పించారు. ఇందుకుగాను ప్రతి జిల్లా నుంచి రెండు పంచాయతీలను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.

● **మూలకు నెట్టిన వైకాపా:** వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో అప్పటి తెదేపా ప్రభుత్వం 2014- 19 మధ్య కాలంలో సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేసింది. పంచాయతీల్లో షెడ్లు నిర్మించి క్లాప్ మిత్రలు, షెడ్ మిత్రలను నియమించింది. అనంతరం గద్దెనెక్కిన వైకాపా ఈ వ్యవస్థను నిర్లక్ష్యం చేసింది. తిరిగి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సదరు కేంద్రాలపై దృష్టి పెట్టింది. అసంపూర్తి పనులు పూర్తి చేసి వ్యవస్థను గాడిలో పెట్టింది.

● **నిర్వహణ పక్కాగా సాగేలా:** సంపద సృష్టి కేంద్రాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఎస్‌హెచ్‌జీలకు అప్పగించనున్నారు. ఈ సంఘాల సభ్యులు క్లాప్‌మిత్రలను సమన్వయం చేసుకుంటూ వ్యర్థాల తరలింపు పక్కాగా సాగేలా పర్యవేక్షిస్తారు. కేంద్రాల నిర్వహణ, ఆదాయం సృష్టిపై వీరు దృష్టి పెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని రాజంపేట మండలం కూచువారిపల్లె, కలకడ పంచాయతీల్లోని సంపద సృష్టి కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే మిగిలిన చోట్లా అమలు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

సంపద సృష్టి కేంద్రం

- జిల్లాలోని మండలాలు: 30
- గ్రామ పంచాయతీలు: 501
- మొత్తం సంపద సృష్టి కేంద్రాలు: 461
- నిర్మాణంలో ఉన్న వాటి సంఖ్య: 40
- నియమితులైన క్లాప్ మిత్రలు: 1,293

ఉద్యోగమిస్తే యజమానికి ప్రోత్సాహం

- ఉపాధి అవకాశాలు పెంచేలా ఈఎల్ఐ పథకం
- అమలుతో కార్మికులు, నిర్వాహకులకు ప్రయోజనం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్ఐ) పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఇటీవల ఆమోదం తెలిపిందని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో అమలు చేయనుందని భవిష్య నిధి(పీఎఫ్) కమిషనర్-1 రవితేజ కుమార్ రెడ్డి తెలిపారు. కడపలోని కార్యాలయంలో 'ఈనాడు- ఈటీవీ'తో ఆయన బుధవారం మాట్లాడారు. ఇవీ ముఖ్యాంశాలు...

భవిష్య నిధి (పీఎఫ్) కమిషనర్-1 రవితేజ కుమార్‌రెడ్డి

● ఈఎల్ఐ పథకం ద్వారా మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి రూ. 15,000 వరకు రెండు విడతల్లో ప్రోత్సాహక రూపంలో అందుతుంది. ● నిరంతరం ఉపాధి కల్పించే ప్రాతిపదికన నియమించుకున్న యాజమాన్యాలకు ప్రతి అదనపు ఉద్యోగి కోసం రెండేళ్ల పాటు నెలకు రూ. 3,000 వరకు ప్రోత్సాహకంగా జమ అవుతుంది. ● 2025 ఆగస్టు 1 నుంచి 2027 జులై 31 మధ్య కాలంలో చేరిన ఉద్యోగులకే వర్తిస్తుంది. ● ప్రోత్సాహకాలను ఉద్యోగుల ఖాతాల్లోనే నేరుగా కేంద్రం జమ చేస్తుంది. ● ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునేందుకు రాయలసీమ జిల్లాల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని కంపెనీలు తమ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్యను పెంచుకోవాలి. ● ఈఎల్ఐ పథకం అమలుతో అటు ఉద్యోగికి, ఇటు యాజమాన్యాలకు ప్రయోజనం ఉంటుంది. ● పూర్తి స్థాయి విధి విధానాలు త్వరలో వెలువడనున్నాయని.. ఆ తర్వాత ప్రైవేట్ కంపెనీల యాజమాన్యాలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

వసూళ్ల ఆసుపత్రులకు జరిమానాలు

రాయచోటి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్డు ఉన్న రోగుల నుంచి ఎటువంటి నగదు తీసుకోకుండా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ క్రమశిక్షణ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్ మాట్లాడుతూ.. కొన్ని ఆసుపత్రుల యాజమాన్యంపై వచ్చిన ఫిర్యాదులను వివరించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారి వద్ద నుంచి అమరావతి ఆసుపత్రి యాజమాన్యం రూ. 2,500, బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి రూ. 16 వేలు, దేశాయ్ ఆసుపత్రి నగదు తీసుకున్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకంలో ఆసుపత్రుల యాజమాన్యం రక్తపరీక్ష, సీటీ స్కాన్ తదితర సేవలకు ఎటువంటి నగదును తీసుకోరాదని తెలిపారు. రోగులను మానవతా దృక్పథంతో చూడాలని, కనీస అవసరాలైన తాగునీరు, ఇతర సదుపాయాలు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రుల యాజమాన్యం తీసుకున్న నగదులో 50 శాతం జరిమానాగా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్, ఆసుపత్రుల నిర్వాహకులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

సమావేశంలో కలెక్టర్ శ్రీధర్.. పక్కన జేసీ ఆదర్శ రాజేంద్రన్

విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

విశ్వవిద్యాలయం అంతా ఓ బూటకం

చెన్నూరు, న్యూస్‌టుడే: సీవోఏ నుంచి అనుమతులు లేకుండా బూటకపు విశ్వవిద్యాలయాన్ని నడిపి వైకాపా ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమాడిందని వైఎస్సార్ ఆర్కిటెక్ట్ యూనివర్సిటీ విద్యార్థులు విమర్శించారు. అధికారులు, పాలకుల తీరుకు నిరసనగా చెన్నూరు మండల పరిధిలోని యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ధర్నా చేశారు. అయిదేళ్ల క్రితం కోర్సులో చేరి పూర్తి చేసినప్పటికీ లైసెన్స్ పత్రాలు అందజేయడంలో విశ్వవిద్యాలయం విఫలమైందన్నారు. నిబంధనలు పాటించకుండా వైకాపా హయాంలో ఏర్పాటు చేయడంతో ఈ సమస్య తలెత్తిందని విమర్శించారు. యూనివర్సిటీ భవనాలకు ప్రభుత్వం అద్దె చెల్లింస్తోందని.. తమ నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని.. అయినా వీసీ, గుత్తేదారు మధ్య విబేధాలతో వసతులు కల్పించకపోవడంతో తాము నష్టపోతున్నట్లు వాపోయారు. అధ్యాపకులు లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా కొందరికి పాఠాలు బోధిస్తున్నారని దుయ్యబట్టారు. మరికొందరిని ఫీల్డ్ వర్క్ పేరిట ఇంటికి పంపేయడం బాధాకరమన్నారు. వీసీ విశ్వనాథ్ స్పందించి పక్షం రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

చల్లంగ చూడాలని బోనాలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: వర్షాలు సమృద్ధిగా కురవాలని.. పాడి పంటలు పండాలని.. అందరినీ చల్లంగా చూడాలని కోరుతూ తిమ్మసముద్రం కమ్మపల్లి, లగిశెట్టిపల్లి వాసులు ఏపూరమ్మకు గురువారం బోనాలు సమర్పించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

బోనాలతో ఆలయంలో భక్తులు

కసాయి తల్లి, ప్రియుడికి జీవిత ఖైదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తమకు అడ్డుగా ఉందనే అక్కసుతో ఓ చిన్నారిని ప్రియుడితో కలిసి తల్లే హత్య చేసింది. ఈ కేసులో ఆ ఇద్దరికీ జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి పీవీఎస్.సూర్యనారాయణమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ జయనారాయణరెడ్డి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఐరాలకు చెందిన బోయకొండ భార్య శాంత వేడుకల్లో నృత్యం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన శ్రీనివాసులుతో వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ 2017 ఆగస్టులో పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద నృత్యం చేసేందుకు వెళ్లారు. శాంత వెంట ఆమె ఏడాదిన్నర కుమార్తె శివానీ కూడా ఉంది. అక్కడ నృత్యం చేసేందుకు చిన్నారి అడ్డుగా ఉందని శాంత, శ్రీనివాసులు భావించారు. ఆమెను గొంతు నులిమి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో మదనపల్లెకు తీసుకొచ్చి సందిరెడ్డిపల్లె వద్ద పొదల్లో పడేసి వెళ్లారు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్పటి రూరల్ సీఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిన్నారి హత్యకు గురైనట్లు గుర్తించి విచారణ చేశారు. తల్లి శాంత, ఆమె ప్రియుడు శ్రీనివాసులే హత్య చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో చిన్నారిని గొంతు నులిమి చంపినట్లు అంగీకరించారు. ఘటన చోటు చేసుకున్న ప్రాంతం పుంగనూరు మండలం పరిధిలోకి రావడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు. అప్పటి పుంగనూరు సీఐ సాయినాథ్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు పూర్వపరాలు విన్న న్యాయమూర్తి నిందితులైన శాంత, శ్రీనివాసులుకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. 6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మాండవ్య నదిలో ఇసుక తోడేళ్లు

- తవ్వకాలతో కల్వర్టుకు ఎసరు
- అయినా పట్టించుకోని అధికారులు

రాగిమానుదిన్నెపల్లె సమీపంలోని మాండవ్య నదిలో ఇసుక తవ్వకాలు

వీరబల్లి, న్యూస్‌టుడే: సహజ సిద్ధమైన ఇసుకను కొందరు అంగడి సరకుగా మారుస్తున్నారు. ఇసుకాసురుల అవతారమెత్తి నదులు, వాగుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. వంతెనల సమీపంలోనూ గోతులు పెడుతూ ప్రకృతి మాతకు మానని గాయాలను చేస్తున్నారు. భావితరాలకు భద్రత లేకుండా చేస్తున్నారు. నదులను తోడేసి తాము నల్లధనం పోగేసుకుంటున్నారు.

● **భవిష్యత్తులో ప్రమాదం తప్పదు:** వీరబల్లి మండలం సంగంవారిపల్లి మీదుగా మాండవ్య నది ప్రవహిస్తుంటుంది. సమీపంలోని రాగిమానుదిన్నెపల్లె వద్ద కల్వర్టు నిర్మాణం ఉంది. ఇక్కడ నాణ్యమైన ఇసుక లభిస్తుంది. దీనిపై ఇసుకాసురులు కన్నేశారు. ఆ సమీపంలోనే వంతెన విషయాన్ని విస్మరించి పెద్ద ఎత్తున తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిసి నదికి వరద వస్తే కల్వర్టు తెగిపోయే ప్రమాదం ఉంది. అదే సంభవిస్తే ఇటుగా రాకపోకలకు అంతరాయం తప్పదు. నిబంధనల ప్రకారం వంతెనలు, కల్వర్టుల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తూ రాయచోటి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. తవ్వకాలపై తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ.. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

రేపు జాతీయ లోక్ అదాలత్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షురాలు, ప్రధాన జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి వివాదాలు, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్ ఉంటుందని.. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచించారు.

(c) eenadu

జాతీయ లోక్ అదాలత్ రేపు

మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్‌కుమార్

రాజంపేట, న్యూస్‌టుడే : స్థానిక న్యాయ స్థానం ఆవరణంలో ఈ నెల 5న నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజంపేట మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక న్యాయస్థానంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలకు లోక్‌అదాలత్ ఓ చక్కటి వేదికని, దాన్ని ఇరు పక్షాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని కోసం పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని, ఇరు వర్గాలకు లోక్ అదాలత్ ప్రయోజనాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి టి.కేశవ, జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.రాజన్‌ఉదయ్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

● 11న కల్యాణోత్సవం

సౌమ్యనాథస్వామి మూలవిరాట్టు

నందలూరు, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీసౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలను జులై 4 నుంచి 13వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తెలిపారు. జులై 4వ తేదీన అంకురార్పణ, 5న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి యాలి వాహనంపై స్వామి వారి ఊరేగింపు, 6వ తేదీ ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, 7న పల్లకీ సేవ, రాత్రి సింహ వాహనం, 8న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హనుమంత వాహనం, 9న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనం, 11న ఉదయం 10 గంటకు శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవం, రాత్రి గజ వాహనం, 12న ఉదయం 8 గంటలకు రథోత్సవం, రాత్రి అశ్వవాహనంపై ఊరేగింపు, 13వ తేదీ ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14వ తేదీ సాయంత్ర 6 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. రోజూ టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కల్యాణం రోజున రూ.500 చెల్లించి ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి: డీఏవో

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో వేరుసెనగ రైతులు అదను దాటుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అన్నారు. మదనపల్లె ఏడీఏ కార్యాలయంలో గురువారం వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... ఈసారి ఖరీఫ్ సాగుకు వర్షం సహకరించనందున సాగు విస్తీర్ణం పూర్తిగా పడిపోయిందన్నారు. జిల్లాలో 42,852 హెక్టార్లలో వేరుసెనగ సాగు కావాల్సి ఉండగా, కేవలం 1,608 హెక్టార్లలో సాగైందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ పంటలపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. త్వరలోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో 97 శాతం ఈకేవైసీ పూర్తి చేశామని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పంటమార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేపట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. రైతులు సంఘంగా ఏర్పడినట్లైతే రూ.10 లక్షలు రుణం పొందవచ్చన్నారు. ఇందులో 80 శాతం వరకు రాయితీ సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం గ్రామీణ మండలం అంకిశెట్టిపల్లె సమీపంలో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయాన్ని డీఏవో పరిశీలించారు. కార్యక్రమంలో మదనపల్లె ఏడీఏ రమేశ్, డీపీఎం వెంకట్ మోహన్, ఏవో నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో శివ నారాయణ, పక్కన ఏడీఏ రమేశ్

జీవిత బీమా... భవితకు ధీమా

● కేంద్ర ప్రభుత్వ పథకాలతో బాధితులకు లబ్ధి

● అందుకుంటే.. అద్భుత ఆర్థిక ప్రయోజనాలు

\- న్యూస్‌టుడే, వాల్మీకిపురం

కేంద్ర ప్రభుత్వం, బీమా సంస్థలు ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు వారి భవితకు, ఆర్థిక భద్రతకు ఎంతగానో దోహదపడుతున్నాయి. అనేక రకాల బీమా పథకాలు బాధితులకు సాంత్వన కల్గిస్తుండగా అవగాహన లేని వారు ఎంతో నష్టపోతున్నారు. ప్రజలు ఆయా బీమా పథకాలను సద్వినియోగం చేసుకుంటే ఆ కుటుంబాలకు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఒనగూరుతాయి. కుటుంబ యజమాని మరణించినా బాధిత కుటుంబం వీధిన పడకుండా, సజావుగా జీవనం సాగించడంతో పాటు వారి పిల్లలను సైతం చదివించుకోవడానికి ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వీటిపై ప్రచారం చేపట్టడంతో సామాన్యులు కూడా ఇప్పుడిప్పుడే లబ్ధిపొందుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వాలంటీర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ (విడ్స్), ప్రభుత్వ బ్యాంకులతో అనుసంధానమై రాష్ట్ర పరిధిలోని ప్రతి మండలంలో ఒక కౌన్సిలర్‌ను నియమించి గ్రామాలకు పంపించి, అక్కడ ఉన్న రైతులు, ప్రజలు, మహిళా సంఘాలు, యువత తదితరులతో సమావేశాలను నిర్వహించి, పథకాలపై వారికి అవగాహన కల్పిస్తోంది. కౌన్సిలర్లే ప్రజలకు బీమా చేయించడంతో పాటు పథకాలను సైతం ప్రజల వద్దకు చేరుస్తున్నారు. పథకాల ప్రయోజనాలు, బీమా చేయించడం వల్ల కుటుంబానికి కలిగే విస్తృత ప్రయోజనాలను ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రజలు కూడా ఆయా పథకాలను కౌన్సిలర్లు, బ్యాంకులు, తపాలా అధికారుల సహకారంతో సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఆర్థిక భద్రత వందశాతం ప్రజలకు చేకూరే అవకాశాలు ఈ పథకాలు కల్పిస్తున్నాయి.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షల బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

రూ.వేయితో రూ.10 లక్షలు

★ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ : 18 నుంచి 50 సంవత్సరాలలోపు వారు అర్హులు. ఏటా రూ.1000 చెల్లించి బీమా చేయించుకోవాలి. సహజ మరణం జరిగినా, ప్రమాద మరణమైనా బీమా కింద బాధితుడికి రూ.10 లక్షలు చెల్లిస్తారు.

★ వాల్మీకిపురం మండలానికి చెందిన నిరుపేద రైతు కూలి లక్ష్మీదేవి తన కుమారుడి పేరుతో రూ.వేయి చెల్లించి ప్రమాద బీమా చేయించింది. ప్రమాదవశాత్తు కుమారుడు మహేష్ బాబు మరణించడంతో బ్యాంకు అధికారులు రూ.10 లక్షల బీమా నగదును బాధితురాలికి అందించారు.

★ **రూ.20తో ప్రధాన మంత్రి సురక్ష :** 18 నుంచి 70 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. బీమా చేయించుకున్న వారికి ప్రమాదం జరిగి మరణిస్తే రూ.2 లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ.లక్ష చెల్లిస్తారు. ఈ పథకంలో చేరడానికి ఏడాదికి రూ.20 చెల్లించాలి. ఇలా ఏటా రూ.20 చెల్లించి లబ్ధిదారుడు రెన్యూవల్ చేసుకోవాలి.

★ **రూ.436తో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి :** 18 నుంచి 50 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులు. సహజ మరణం పొందితే రూ.2 లక్షలు చెల్లిస్తారు. రూ.436 చెల్లించి బీమా చేసుకోవాలి. ఏటా అంతే ప్రీమియంతో రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.

★ **అటల్ పింఛను :** 18 నుంచి 40 సంవత్సరాలలోపు వారు అర్హులు. ప్రతి నెలా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రూ.1000 నుంచి రూ.5 వేలు పింఛను పొందదలిచిన వారు వారి స్థాయి బట్టి పింఛను ప్రణాళికను ఎంపిక చేసుకోవచ్చు, వీరికి (చందాదారుడు) నిర్ణీత వయస్సు 60 సంవత్సరాలు చేరుకోగానే నెలవారీ పింఛను మొత్తం రూ.1000 నుంచి రూ.5 వేలు బీమా కంపెనీలు చెల్లిస్తాయి. చందాదారుడు 59 సంవత్సరాలు పూర్తయ్యే వరకు మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

క్షేత్రస్థాయిలో అందరికీ అవగాహన

నిత్యం గ్రామాల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు బీమాపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా తెలియని వారుంటే ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ (విడ్స్) సంస్థ చక్కటి అవకాశాలు కల్పిస్తోంది. సంస్థ కౌన్సిలర్లు ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నారు. బ్యాంకు అధికారులు, మహిళా సంఘాలు, ఉపాధి హామీ సిబ్బందితో కలిసి వారు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తుంటారు.

\- ప్రమీల, విడ్స్ సంస్థ కౌన్సిలర్

ఆసుపత్రి రక్తనిధి కేంద్రానికి కాంపోనెంట్ యంత్రం

● ఈనాడు వరుస కథనాలపై స్పందించిన ప్రభుత్వం

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తంలోని సెల్స్ వేరు చేసే యంత్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్స్ కోసం ప్రైవేటు రక్తనిధి కేంద్రానికి వెళ్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు రక్తనిధి కేంద్రం వారు ఎక్కువ మొత్తంలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాగే ఆసుపత్రిలో రక్తం నిలువ చేసే శీతల యంత్రం చెడిపోవడంతో రక్తనిల్వకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. దీనిపై 'ఈనాడు'లో మార్చి 19న 'రక్తనిధి.. ఖర్చు చేసే దారేదీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందులో రక్తనిధి కేంద్రం నిధులు రూ.40 లక్షలకు పైగా బ్యాంకు ఖాతాలో నిధులు ఉన్నాయని వాటిని వినియోగించి రక్తనిధి కేంద్రానికి అవసరమైన పరికరాలు కొనుగోలు చేయవచ్చునని తెలియజేస్తూ కథనంలో వివరించడం జరిగింది. అలాగే ఆసుపత్రిలో సెల్స్ వేరు చేసే కాంపోనెంట్ యంత్రం లేకపోవడంతో ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తోందన్న కథనాన్ని ఈనాడులో ప్రచురించడంతో దీనిపై స్పందించిన ప్రభుత్వం మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఏపీ అవసరాలు ఉన్నాయని తెలుసుకుని రూ.32 లక్షలు విలువ చేసే కాంపోనెంట్ యంత్రాన్ని పంపారు. దీని ద్వారా ఒక ప్యాకెట్ రక్తం ముగ్గురికి వినియోగించే సెల్, ప్లాస్మా వేరు చేసి వినియోగించుకోవచ్చు. ఆసుపత్రిలో ఈ యంత్రం ఏర్పాటైతే రోగులు ప్రైవేటుకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతానికి యంత్రం వచ్చినప్పటికీ దానికి అవసరమయ్యే అనుమతులు రావాల్సి ఉందని, ఈ యంత్రం ఏర్పాటుకు ఆసుపత్రిలో ఓ విభాగాన్ని కూడా ఆసుపత్రి అధికారులు ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి తెలిపారు. రక్తనిధి కేంద్రానికి అవసరమైన పరికరాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ మంజూరైతే ఈ యంత్రాన్ని సంబంధిత అధికారులు ఏర్పాటు చేస్తారన్నారు. యంత్రం అందుబాటులోకి వస్తే రోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.

ఆసుపత్రికి వచ్చిన కాంపోనెంట్ యంత్రం ఇదే

ఇద్దరు క్షేత్ర సహాయకుల సస్పెన్షన్

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె మండలం ముష్టూరు, కొండయ్యగారిపల్లె క్షేత్ర సహాయకులు శంకర, వినీత్‌లను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉపాధి ఏపీవో రమేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఇద్దరు క్షేత్ర సహాయకులు ఉపాధి పనుల్లో కూలీలను పెంచడం లేదని ఇదే విషయమై పలుమార్లు హెచ్చరించినా పనితీరులో నిర్లక్ష్యం వహించడంతో పీడీ వెంకటరత్నం నివేదిక తెప్పించుకుని ఆ ఇద్దరినీ సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

ఉదయం ఆరుకే చెత్త సేకరణ మొదలవ్వాలి : కలెక్టర్

రాయచోటి, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటలకే ఇంటింటి చెత్త సేకరణ పనులు చేపట్టి పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రోజూ ఉదయం 6 గంటల నుంచే ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త సేకరణకు సమయం ఎంత కేటాయిస్తున్నారు.. మూడు చక్రాల సైకిల్ ఎన్ని ఉన్నాయి.. శానిటేషన్ సిబ్బందికి జీతభత్యాల ఎప్పటి వరకు ఇచ్చారు.. 15 ఆర్థిక సంఘం నిధులు ఎంత ఉన్నాయి.. తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి రవీంద్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాయణరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పొన్నేరువాళ్లపల్లె గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. కనీస వసతుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఇంటి పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, విద్యుత్తు ఆదా చేసి ఆదాయాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ రాధమ్మ, ఎంపీడీఓ రామచంద్ర, కార్యదర్శి రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: విక్రయదారులు, కొనుగోలుదారులకు సంబంధించిన పత్రాలను క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే భూముల రిజిస్ట్రేషన్లు చేయాలని జిల్లా రిజిస్ట్రార్ ఏవీఆర్ మూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్లాట్‌బుకింగ్‌కు సంబంధించి పత్రాలుచ ఆన్‌లైన్‌కు సంబంధించిన వివరాలు, స్టాంపుల విక్రయాల దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్లాట్ బుకింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. దీంతో భూక్రయ విక్రయదారులకు అనుకూలమైన సమయాన్ని ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు వీలుంటుందన్నారు. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.100కు సంబంధించిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంక్షలు ఉన్న భూములను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

దస్త్రాలు తనిఖీ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఏవీఆర్ మూర్తి

జూనియర్ లెక్చరర్లకు తీరని అన్యాయం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉద్యోగోన్నతి కల్పించడంతో జూనియర్ లెక్చరర్లకు తీరని అన్యాయం జరిగిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురవయ్య అన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయం విజయవాడలో బుధవారం రాత్రి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. జూనియర్ లెక్చరర్లుగా డైరెక్టు రిక్రూట్‌మెంట్ అయిన 290 మందికి నిబంధనలు పక్కన పెట్టి ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతి కల్పించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాఠశాల సహాయకుల నుంచి ఉన్నతిపై జూనియర్ లెక్చరర్లుగా ఉన్నతి పొందారని ఆయన పేర్కొన్నారు. వీరందరకీ ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని ఆయన విన్నవించారు.

భవన నిర్మాణ కార్మికుడి హత్య!

● భార్యే చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు ● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో గురువారం రాత్రి వెలుగుచూసింది. మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ రెడ్డిగానిపల్లెకు చెందిన వీరభద్ర కుమారుడు చంద్రశేఖర్ (46) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తాడు. ఇతని మొదటి భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోవడంతో రమాదేవిని రెండో వివాహం చేసుకున్నాడు. ఇతనికి దీక్షిత (9), చైతన్యకుమార్ (5) పిల్లలు. చంద్రశేఖర్ తరచూ మద్యం తాగి వస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయం రమాదేవి ఎవరికీ చెప్పకుండా ఉండిపోయింది. గురువారం రాత్రి చుట్టుపక్కలవారు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కళా వెంకటరమణ, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చంద్రశేఖర్ నోటి నుంచి రక్తం వస్తుండటంతో పాటు శరీరంపై రక్తపు మరకలున్నాయి. ఇతను బుధవారం రాత్రి చనిపోయి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు మహేష్‌కుమార్ భార్య రమాదేవి కొట్టి చంపేసి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనికి తోడు రమాదేవి పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేస్తున్నామని శవపరీక్ష నివేదిక ఆధారంగా మార్పు చేస్తామని సీఐ తెలిపారు.

అన్నమయ్య జలాశయం పునర్నిర్మాణం చేయాలి

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : రాజంపేట మండలం బాదనగడ్డపై నిర్మించిన అన్నమయ్య జలాశయం మట్టికట్ట 2021 నవంబరు 19న తెగిపోవడంతో వచ్చిన వరద ప్రళయానికి రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల ప్రజలు ఆస్తి, ప్రాణ, పశు సంపద, ఇలా సర్వం కోల్పోయారు. నాటి ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం కారణంగా వరద బాధితులను సకాలంలో ఆదుకోకపోవడం వల్ల ఇప్పటికీ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజంపేట కాంగ్రెస్ నాయకులతో కలిసి అన్నమయ్య జలాశయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జలాశయం మట్టికట్ట తెగిపోయి నాలుగేళ్లు కావస్తున్నా ఇంత వరకూ తిరిగి నిర్మించాలన్న ఆలోచన వైకాపా, తెదేపాకు లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇరు పార్టీలు అధికారంలోకి వస్తే వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చాయని, అధికారంలోకి వచ్చిన పార్టీ ఎలాంటి పనులు చేయలేదని దుయ్యబట్టారు. జలాశయం నిర్మించడంతోపాటు వరదల కారణంగా దెబ్బతిన్న గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్నమయ్య జలాశయం నిర్మిస్తే రాజంపేట పట్టణంలోని 80 వేల మందికి తాగు నీటికి ఇబ్బంది ఉండదని, రాజంపేట పుల్లంపేట మండలాలకు సాగు నీరందించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పూల భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి అలీఖాన్, డీసీసీ కార్యదర్శి అమీర్ బాషా, నాయకులు షేక్ సలీం, జశ్వంత్, విష్ణు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

వరదలకు తెగిపోయిన అన్నమయ్య జలాశయాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వన రక్షకుడిపై ఎలుగుబంటి దాడి

ఒంటిమిట్ట: మండలంలోని దాసర్లదొడ్డి అటవీ బీటు జలరేవులకోన కాటమయ్య గుండం సమీపంలో విధులు నిర్వహిస్తున్న వన రక్షకుడు వెంకటయ్యపై గురువారం ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. పత్రపల్లికి చెందిన వెంకటయ్య అటవీ ప్రాంతంలోని బేస్‌క్యాంపులో పని చేస్తున్నారు. గురువారం అడవిలో గాలింపు చేస్తుండగా ముళ్లపొదల నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి ఆయనపైకి దూసుకొచ్చి దాడి చేసింది. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో వన సంరక్షకులు అక్కడికి చేరుకొని ఎలుగుబంటిని అక్కడి నుంచి తరిమేశారు. ఒంటిమిట్టలో ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. వెంకటయ్యను జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్, ఎఫ్ఆర్వో బాలసుబ్రహ్మణ్యం పరామర్శించారు.

పెరిగిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఛార్జీలు

సీటీఎం (మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఛార్జీలు పెంచుతూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో నూతన ఛార్జీలు అమలులోకి వచ్చాయి. మదనపల్లె మీదుగా వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు సంబంధించిన ఛార్జీల వివరాలను స్టేషన్ మాస్టర్ కరుణాకర్ వివరించారు. ప్యాసింజర్ రైళ్లల్లో ప్రస్తుతం ఉన్న ఛార్జీలు పెరగలేదని చెప్పారు. మదనపల్లె నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు సంబంధించి పాత, పెరిగిన ఛార్జీల వివరాలను వెల్లడించారు.

మదనపల్లె నుంచి పలు ప్రాంతాలకు రైలు ఛార్జీలు

స్టేషన్‌లు	ఛార్జీ (పాతది)	ప్రస్తుతం (రూ॥లలో)	రైలు
తిరుపతి	60	60	ఎక్స్‌ప్రెస్
నెల్లూరు	95	100	,,
ఒంగోలు	130	135	,,
విజయవాడ	165	170	,,
నర్సాపురం	200	205	,,
పాకాల	60	60	సూపర్‌ఫాస్ట్
తిరువణమలై	105	110	,,
మధురై	230	240	,,
మహబూబ్‌నగర్	170	175	,,
కర్నూలు	140	140	,,
కాచీగూడ	200	205	,,
నిజామాబాద్	230	245	,,
అమరావతి (మహారాష్ట్ర)	330	345	,,
రాయచూర్	130	130	ఎక్స్‌ప్రెస్
షోలాపూర్	195	200	,,
పూణై	250	260	,,
కళ్యాణ్	285	295	,,
ముంబయి (సీఎస్ఎంటీ)	290	305	,,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్,
కడప నగరం, కడప జిల్లా

ఖాళీ స్థలములు లీజు లైసెన్స్ హక్కునకు ఇ-టెండర్ మరియు సీల్డు టెండర్ (కం) బహిరంగ వేలం ప్రకటన

కడప నగరంలో నాగరాజుపల్లె (పాత బస్టాండ్ ప్రక్కన) వున్న శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప నగరంలో నాగరాజుపల్లె సర్వే నెంబరు 5లో గల 2 (రెండు) ప్లాట్స్ 1. ప్లాట్-A విస్తీర్ణం : (37.09 సెంట్స్ / 1,795 Sq.Yards), 2. ప్లాట్-B విస్తీర్ణం: (38.22 సెంట్స్ / 1,850 Sq.Yards). ఖాళీ స్థలములు 11 సంవత్సరముల కాలపరిమితి లీజు హక్కులను పొందుటకు షెడ్యూలు ప్రకారము ఇ-టెండరు, సీల్డు టెండరు (కం) బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ టెండర్ దాఖలు చేయుటకు ఆఖరు తేదీ: **17.07.2025 ఉదయం గం॥ 10.00లకు.** మరిన్ని వివరములకు www.eprocurement.gov.in ను సందర్శించగలరు. సీల్డు టెండర్లు సోమ. 14.07.2025 ఉదయం గం॥ 10.00 నుండి బుధ. 16.07.2025 సాయంత్రం గం॥ 5.00 లోపల ప్రతి షెడ్యూలుకు రూ.5,000.00 చెల్లించి శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి చారిటీస్ ఆఫీసు నందు 2 (రెండు) ప్లాట్స్‌కు వేరు వేరు దరఖాస్తు ఫారాలు పొందగలరు. పూర్తిచేసిన సీల్డు టెండరు గురు. 17.07.2025 ఉదయం గం॥ 10.00లకు సదరు ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము వద్ద టెండరు బాక్సు నందు వేయవలెను. బహిరంగ వేలము గురు. తేదీ: 17.07.2025 ఉదయం గం॥ 10.00లకు శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము నందు జరుగును. ఇతర వివరములకు సెల్ : +91 83318 90511 ను సంప్రదించగలరు.

వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు మరియు సెక్రటరీ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప.
ఆఫీస్ అడ్రసు : ఫ్లాట్ నెం. 301, 3rd ఫ్లోర్, డోర్ నెం. 20/999-9-3-5, జొన్నలగడ్డ హైట్స్, కో-ఆపరేటివ్ కాలనీ, Near ACB Office, కడప - 516001.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India A Government of India Undertaking
అసెట్ రికవరీ బ్రాంచి- తిరుపతి
1వ అంతస్తు, ఎస్‌వి క్యాంపస్ శాఖ, ఎస్‌వి విశ్వవిదాలయ పాలనా భవనం వెనుక, ఎస్‌వి విశ్వవిద్యాలయ శాఖ, ఇ-మెయిల్: arb.tirupathi@unionbankofindia.bank, ఫోన్: 8328565422.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద హామీగల స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల నోటీసు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ [illegible]

ఇ వేలం తేదీ, సమయం: 30-7-2025, మ.12.00 గం. నుండి సా.5.00 గం.వరకు.
(10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో)

[illegible]

రిజర్వు ధర: రూ. 34,00,000/- ధరావతు: రూ.3,40,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.35,000/-

[illegible]

https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx https://baanknet.com

తేదీ: 2.07.2025 ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంస్థాగత ఎన్నికల్లో తెదేపా సత్తా చాటాలి

ములకలచెరువు, న్యూస్‌టుడే: రానున్న సంస్థాగత ఎన్నికల్లో తంబళ్లపల్లెలో తెదేపా సత్తా చాటాలని రాష్ట్ర ఎన్విరాన్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దినేష్‌రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి ఆయన నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోము శేఖర్, మండల పరిశీలకుడు రెడ్డెప్పతో కలిసి కన్నెమడుగులో పర్యటించారు. ప్రతి కార్యకర్త ఐకమత్యంతో పనిచేసి రాబోయే సంస్థాగత ఎన్నికల్లో తెదేపా జెండా రెపరెపలాడించాలన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం దినేష్‌రెడ్డి, పరిశీలకులను గ్రామాధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నాయకులు శీనా, పురుషోత్తం, భూమిరెడ్డి, శంకర్‌రెడ్డి, సోము పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహ ధ్వంసంపై బాస్ ఆందోళన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని అంకిశెట్టిపల్లె సమీపంలో బుద్ధుని కొండపై కొలువైన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి చట్ట పరిధిలో శిక్షించాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, బౌద్ధ ఉపాసక పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకు గురువారం బాస్ ఆధ్వర్యంలో బెంగళూరు రోడ్డు కాలనీ గేటు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. దీనికి వామపక్ష పార్టీలు, బహుజనసేన మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. నిందితులు బుద్ధుడి తలనరికి రాక్షసానందం పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుద్ధుని కొండను మానవ వికాస కేంద్రంగా, ఆధ్యాత్మిక చైతన్య కేంద్రంగా రూపొందించాలన్న సంకల్పంతో బుద్ధ, అంబేడ్కర్ సమాజ్ ట్రస్టు ఎన్నో వ్యయ, ప్రయాసల కోర్చి కొండపై ఒక్కొక్కటిగా నిర్మాణాలు చేస్తుంటే కొంత మంది ఉన్మాదులు ధ్వంసానికి పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో తథాగతుని మూడు విగ్రహాలను ధ్వంసం చేశారని, ఇప్పుడు మరో విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. ఈ ఘటనపై మదనపల్లె రూరల్ పోలీసు స్టేషన్ సీఐ, డీఎస్పీలకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదన్నారు. అంకిశెట్టిపల్లె మాజీ సర్పంచి, అతని సన్నిహితులను విచారణ చేస్తే దోషులు బయటపడతారన్నారు. పోలీసులు ఈ ఘటనపై చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి వామపక్ష పార్టీ నాయకులు శ్రీనివాసులు, కృష్ణప్ప మద్దతు తెలిపి నిరసన దీక్షలో కూర్చొన్నారు. అలాగే బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు బుద్ధుని కొండపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేవీ రమణ, ఎం. మోహన్, ఎన్.రమణ, బయన్న, జీవీ రమణ, కృష్ణ, జనార్దన్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బాస్ నాయకులు

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

TO LET

COMMERCIAL

కడప పాతబస్టాండు YMB ఎన్‌క్లేవ్, Big C పైన, 1st ఫ్లోర్, 3000 చ॥ అ॥ గల బిల్డింగ్ (స్ట్రాంగ్‌రూం) బ్యాంకులకు, హాస్పిటల్స్‌కు, ఆఫీసులకు బాడుగకు కలదు. Contact: 9701824212.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626 8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్, కడప నందు పనిచేయుటకు X-RAY & C-ARM టెక్నిషియన్స్ కావలెను. Contact: 98490 40153.

SBI **లైఫ్** కడప బ్రాంచ్ నందు అడ్వైజర్‌గా మరియు సేల్స్ ఆఫీసర్ ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆ పైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్ర: 9491111140.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

వేడుకగా అర్జున తపస్సు మాను

తపస్సు మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

కలకడ, న్యూస్‌టుడే : మహల్ క్రాసులో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం అర్జున తపస్సు మాను వేడుకగా జరిగింది. అర్జున వేషధారి తపస్సు మాను ఎక్కుతూ మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ ఎక్కాడు. మానుపైన కూర్చొని పండ్లు, ఫలహారాలు భక్తులకు చల్లారు. భక్తులు గొడుగులతో పండ్లు, ఫలహారాలు, విబూది పండ్లు పట్టుకోవడం జరిగింది. నిర్వాహకుడు మదనమోహన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అనీమియా పక్షోత్సవాలు

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి ఎస్టీ కాలనీలో మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఘనంగా సికిల్‌సెల్ అనీమియా పక్షోత్సవాలు నిర్వహించారు. గురువారం జిల్లా వైద్య విద్యాధికారి రఫీ, టీబీ విభాగ పర్యవేక్షకులు నాగిరెడ్డి పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాసవర్మ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఎస్టీ కాలనీలోని 40 సంవత్సరాలలోపు వారంతా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది నాగిరెడ్డి, పర్యవేక్షకులు సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి ఎస్టీ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మదనపల్లె విద్య: మదనపల్లె పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు ఉండటంతో శుక్రవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు గంట పాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.గంగాధరం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మదనపల్లెలోని విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

ఉద్యోగులకు సత్కారం

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తూ జమ్మలమడుగు డిపో ఇన్‌ఛార్జి డీఎంగా బదిలీ అయిన సుబ్బమ్మ, రాయచోటి డిపో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తూ పీలేరుకు బదిలీపై వచ్చిన ధనంజయులును గురువారం పీలేరు డిపో ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బమ్మ, ధనంజయులు మాట్లాడుతూ... ప్రజలకు సౌకర్యంగా బస్సులు నడుపుతామని ప్రయాణికులు తెలిపిన సమస్యలను తక్షణం పరిష్కరిస్తామన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

బి.కొత్తకోట: ఆస్తిపన్ను బకాయిల వసూళ్లపై దృష్టిని కేంద్రీకరించాలని బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనరు జీవీ పల్లవి అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనరు వివిధ పథకాల పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.95 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ.30 లక్షలు మాత్రమే చెల్లింపులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచడానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రాబట్టాలని కోరారు. బకాయిదారులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు.

బృందావనాలతో ఆదాయం

గుర్రంకొండ, న్యూస్‌టుడే: పంచాయతీలు నిర్వహిస్తున్న సంపద కేంద్రాలపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బృందావనాలు బలోపేతం చేస్తే పంచాయతీలకు ఆదాయం వస్తుందనీ, పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగవుతుందన్నారు. మురుగు కాల్వల్లో చెత్తా చెదారం లేకుండా చేసి, మురుగు నిల్వ లేకుండా చూడాల్సిన అవసరముందన్నారు. వర్షాకాలం అయినందున దోమల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు రోగాలబారిన పడకుండా చేయాలంటే పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైకాపా మోసం... కూటమిపై భరోసా

● రావాల్సిన బిల్లులు రూ.9.78 కోట్లు ● నేతల హామీపై లబ్ధిదారుల ఆశలు

పీలేరు ఎన్టీఆర్ కాలనీలో జరిగిన నిర్మాణాలు

పీలేరు, న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వ హయాంలో పీలేరు నియోజకవర్గంలో 2014-19 మధ్య మంజూరైన ప్రభుత్వ ఇళ్లకు వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నాళ్లు బిల్లులు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టారు. పీలేరు మండలం తిరుపతి మార్గం, కాకులారంపల్లె పంచాయతీ గంగమ్మదేవత ఆలయం వద్ద లబ్ధిదారులు నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించలేదు. పైపెచ్చు అప్పట్లో గృహ నిర్మాణశాఖ ఛైర్మన్ పదవిలో ఉన్న ప్రస్తుత పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వేసిన శంకుస్థాపన శిలా ఫలకాలను కూడా వైకాపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. దీంతో లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పలేదు.

చంద్రబాబు హామీ : సార్వత్రిక ఎన్నికల పర్యటనలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పాత గృహాల బిల్లులు చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి లబ్ధిదారులు కూడా పెండింగ్ ఉన్న నిర్మాణాలను కూడా పూర్తి చేసే పనులు చేస్తున్నారు. తెదేపా వచ్చిన తర్వాత గృహనిర్మాణశాఖ అధికారులు కాలనీల్లో పర్యటించి జరిగిన నిర్మాణాలను కొలతలు తీసి బిల్లుల చెల్లింపునకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు.

★ పీలేరు పంచాయతీ తిరుపతి మార్గం ఎన్టీఆర్ కాలనీలో పీలేరు ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యాక కాలనీవాసులకు కొత్త బోరు తవ్వించడంతో పాటు మోటారు ఏర్పాటు చేసి కాలనీ మొత్తం గొట్టాలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇళ్లకు నీటి సౌకర్యం కల్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకుని లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

నియోజకవర్గంలో చెల్లించాల్సిన బిల్లుల వివరాలు

మండలం	ఇళ్లు	పెండింగ్ బిల్లులు (రూ.లక్షల్లో)
గుర్రంకొండ	637	రూ.171.46
కంభంవారిపల్లె	772	రూ.199.94
కలకడ	278	రూ.71.29
కలికిరి	436	రూ.105.31
పీలేరు	1,114	రూ.283.36
వాల్మీకిపురం	597	రూ.147.31
మొత్తం	3,834	రూ.978.46

ప్రతిపాదనలు వెళ్లాయి

నియోజకవర్గంలో లబ్ధిదారులు నిర్మించిన ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపునకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాల్లో కూడా నిధుల విషయం ప్రస్తావించాం. పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి కూడా నిధులు మంజూరవుతాయని తెలిపారు. లబ్ధిదారులు అధైర్యపడాల్సిన పరిస్థితి లేదు. కాలనీల్లో మౌలిక వసతులు విద్యుత్తు, సిమెంటు దారులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

- రమణయ్య, డీఈ, గృహనిర్మాణశాఖ, పీలేరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

☛ మండలంలోని బండకాడపల్లె వద్ద పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడి సమస్యపై గ్రామస్థులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ జూన్ 18న 'ఈనాడు'లో సమస్యను ప్రచురించడంతో ఎంపీడీవో తాజ్‌మస్రూర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికులు చర్యలు చేపట్టారు.

☛ అమ్మచెరువుమిట్ట ఇందిరమ్మ కాలనీలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలో మురుగు ప్రవహిస్తుండటంపై స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై గత నెల 18న 'మేమున్నాం... మీకుతోడుగా'లో ప్రచురించడంతో అధికారులు స్పందించారు.

☛ బస్‌షెల్టర్ చుట్టూ చెత్తదిబ్బలను పంచాయతీ అధికారులు తొలగింపు చర్యలు తీసుకున్నారు. మండలంలోని తట్టివారిపల్లె గ్రామ సమీపంలో చెత్తదిబ్బలు పేరుకుపోవడంపై స్థానికులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు ఫిర్యాదు చేయడంతో గత నెల 18న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో కార్యదర్శి రవి స్పందించి చర్యలు చేపట్టారు.

☛ కృష్ణాపురం గ్రామంలో చెత్తదిబ్బలను ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులు చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుండటంతో గ్రామీణులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జూన్ 18న 'ఈనాడు'లో సమస్యను ప్రచురించడంతో అధికారులు స్పందించారు.

- న్యూస్‌టుడే, బి.కొత్తకోట

☛ బి.కొత్తకోట జ్యోతి బస్టాండులోని ఎండిపోయిన చెట్ల కొమ్మలను గురువారం తొలగించారు. 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షికన గత నెల 26న ఈనాడులో ప్రచురితమైన కథనంపై నగర పంచాయతీ కమిషనరు జీవీ పల్లవి స్పందించారు. ఏ క్షణమైనా పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న కొమ్మలను నగర పంచాయతీ కార్మికులచే తీయించడంతో ప్రయాణికులు ఊరట చెందారు.

☛ బి.కొత్తకోట రంగసముద్రం రోడ్డులోని మురుగు కాలువ పూడిపోవడంపై గత నెల 26న 'మేమున్నాం.. మీకుతోడుగా'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన శానిటరీ సూపర్‌వైజర్ బాబురెడ్డి నాయక్ పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

రామసముద్రం, న్యూస్‌టుడే: భక్తి శ్రద్ధలతో మొహర్రం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. గురువారం హిందూ, ముస్లిం సోదరులు రామసముద్రంలోని దిగువపేట, ఎగువపేట, తిరుమలరెడ్డిపల్లె, ఆర్.నడింపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో పీర్ల చావిళ్లలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను ఊరేగిస్తూ ఇంటింటా చక్కెర, బెల్లం, శనగపప్పు చదివింపులు చేశారు. పానకం కుండలను పీర్లకు చదివించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో శుక్రవారం పీర్ల ఊరేగింపు జరుగనుంది. నిర్వాహకులు ప్రత్యేక అలంకరణ చేశారు. హిందు-ముస్లిం సోదరులు ఐకమత్యంతో ఏటా భక్తి శ్రద్ధలతో మొహర్రం జరుపుకొంటారు. ఇందులో భాగంగా 8వ రోజున జరిగే తంతును తిలకించడానికి తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తారు. ఇందులో భాగంగా గ్రామంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామని గ్రామ పెద్దలు బషీర్, వలస వెంకట రమణ, చాంద్‌బాషా, రాజన్న, రమేష్‌బాబు తెలిపారు.

రామసముద్రంలో కొలువుతీరిన పీర్లు

మలుపు... మృత్యు పిలుపు

రామసముద్రం-ముళబాగల్ రోడ్డులోని మలుపులు మృత్యు పిలుపులుగా మారాయి. అంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న మలుపులో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుట్టపాళ్యం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఏడాది క్రితం కారు ఢీకొని మృత్యువాత పడ్డాడు. రామసముద్రానికి చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదానికి గురై దివ్యాంగుడిగా మారారు. గుట్టపాళ్యం వద్ద మలుపులోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆర్అండ్‌బీ ఏఈ బుర్రయ్య దృష్టికి తీసుకెళ్లగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, రామసముద్రం

గతుకుల దారి... జాగ్రత్త బాటసారి

పీలేరు-తిరుపతి జాతీయ రహదారి ఎర్రగుంటపల్లె బస్టాపు నుంచి పులిచెర్ల మండలానికి వెళ్లే తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. 2012లో అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసేందుకు తిరుపతి రోడ్డు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం పీలేరు మండల సరిహద్దు వరకు తారు రోడ్డు చక్కెరవాండ్లపల్లె వరకు వేయించారు. మరమ్మతులు లేనందున వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచి కురవపల్లె, బెస్తపల్లె, బసిరెడ్డిగారిపల్లె వద్ద రోడ్డు దెబ్బతిని గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రారంభంలో పీలేరు నుంచి పులిచెర్లకు ఆర్టీసీ బస్సులు నడిపినా తర్వాత రాబడి లేదని నిలిపివేశారు. - న్యూస్‌టుడే, పీలేరు

సూచిక... రక్షణకు వేదిక

రహదారులపై ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదం ఎక్కడ జరిగినా అందరి మదిలో మెదిలే నెంబరు 108. ఈ నంబరే కాదు జాతీయ రహదారిపై ప్రమాదం ఎక్కడ జరిగినా 1033కి ఫోన్ చేయడం ద్వారా అత్యవసర వైద్య సహాయం పొందవచ్చని అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై పలుచోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కలికిరి సమీపంలో ఏర్పాటైన సూచికను చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, కలికిరి

నీరు ఆగేదెలా... అరక సాగేదెలా!

పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఉప్పరపల్లె నుంచి వర్షాకాలంలో పారుతున్న పింఛా నదిపై పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ పరిధిలో నిర్మించిన చెక్‌డ్యాం కుడివైపున ఉన్న రక్షణ గోడ కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నదిలో నీరు వచ్చి చెక్‌డ్యాంలో నిలిచినా పక్కన రక్షణ గోడ దెబ్బతినడంతో వృథాగా దిగువకు వెళ్లి సుండుపల్లె మండల శివారులోని పింఛానది ప్రాజెక్టులో చేరుతోంది. చెక్‌డ్యాంలో నీరుంటేనే బోరుబావుల్లో నీరుంటాయి. గత ప్రభుత్వం చెక్‌డ్యాం మరమ్మతులను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా వాటిని పూర్తిస్థాయిలో బాగు చేసి తోటలు ఎండిపోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

సంక్షేమ రథసారథి సీఎం చంద్రబాబు

రామాలయం వీధిలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణాభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన ఛైర్‌పర్సన్ మనూజతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సైదాపేటలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే 6వ వార్డు గొల్లపల్లె రామాలయం వీధిలో రూ.14 లక్షలు అంచనా వ్యయంతో శుద్ధినీటి కేంద్రం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టడానికి కౌన్సిల్ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పరంగా తాను పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రమీల, డీఈఈ శ్రావణి పాల్గొన్నారు.

★ 5, 6 వార్డుల్లో : పురపాలక సంఘం పరిధిలోని 5, 6 వార్డుల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే ప్రతి ఇంటిలో పంచుతూ వార్డుల్లో పర్యటించారు. కార్యక్రమంలో ప్రభుత్వశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రజలు సమస్యలు చెప్పినప్పుడు అధికారులు విధిగా వాటిని నమోదు చేసుకుని పరిష్కరించడానికి కృషి చేయాల్సి ఉంటుందన్నారు. హాజరుకాని పక్షంలో వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం రెవెన్యూశాఖ అధికారులు లేకపోవడంతో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ములకలచెరువు, న్యూస్‌టుడే: రాష్ట్ర సంక్షేమ రథసారథి సీఎం చంద్రబాబు అని తంబళ్లపల్లె తెదేపా ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ములకలచెరువులోని వినాయకనగర్, త్యాగరాజు కాలనీల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అదే విధంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత పాలకులు తంబళ్లపల్లెను దోచుకున్నారని, కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాలను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సీడ్ మల్లికార్జున నాయుడు, గుత్తికొండ త్యాగరాజు, సురేష్, కేవీ రమణ, మౌలా, జనార్దన్ రెడ్డి, విజయ్‌కుమార్, రెడ్డెప్ప, పాస్టర్ శీనా, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

సుపరిపాలనను వివరిస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి, నాయకులు

వైద్య బృందం ప్రత్యేక సర్వే

పీలేరు గ్రామీణ: దీర్ఘకాలిక, అసంక్రమిత వ్యాధులపై వైద్య బృందం సర్వే నిర్వహించింది. రేగళ్లు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా శ్వాసకోస వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, గుండె జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి సలహాలు సూచనలు ఇస్తామని కడప రిమ్స్ వైద్య బృందం సభ్యులు తెలిపారు.

విగ్రహ ధ్వంసంపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు: మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీలోని బుద్ధుని కొండపై ఉన్న విగ్రహం ధ్వంసంపై మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ గురువారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా అంకిశెట్టిపల్లె వీఆర్వో నారాయణ వద్ద నుంచి ఫిర్యాదు తీసుకుని గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహం ధ్వంసం చేసినట్లు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటన జరగడంతో దానిని కూడా పరిగణలోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. కొండపైకి వెళ్లి ధ్వంసమైన విగ్రహంతో పాటు మరో విగ్రహాన్ని పరిశీలించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి...

మదనపల్లె గ్రామీణ: గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ... మండలంలోని వేంపల్లె సమీపంలోని బుద్ధుడి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారని, దీనిపై ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఖండిస్తోందన్నారు. ఈ దుర్ఘటనకు పాల్పడినకు వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వమే బుద్ధుడి విగ్రహాన్ని స్థాపించి, భద్రత కల్పించాలని కోరుతున్నామన్నారు.

వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవు : ఎమ్మెల్యే

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అధిక వడ్డీ వసూళ్లకు పాల్పడేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. గురువారం ఆయన మదనపల్లెలో అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య చేసుకున్న బొజ్జ రాజేంద్రప్రసాద్ అలియాస్ కోళ్ల రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలో అధిక వడ్డీలతో పేద ప్రజల ఆస్తులు, ప్రాణాలు బలి తీసుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు తప్పవని అన్నారు. రూ.2 కంటే ఎక్కువ వడ్డీలు తీసుకుంటున్న వారిపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో కాల్‌మనీ కేసులు ఎక్కువ అవుతున్నాయని పోలీసు అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మీ, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, నాగమణి, మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

★ అధిక వడ్డీలు చెల్లించలేక రియల్‌ఎస్టేట్ వ్యాపారి బొజ్జ రాజేంద్రప్రసాద్ ఆత్మహత్య చేసుకోవడంతో బాధితులు పలువురు లబోదిబో మంటున్నారు. ఆయనకు అప్పులిచ్చిన వారు ఆసుపత్రికి వచ్చి తమ డబ్బు పరిస్థితి ఏంటని చర్చించుకున్నారు. రాజేంద్రప్రసాద్ పెద్ద సంఖ్యలో అప్పులు తీసుకుని, మరికొందరికి తాను అప్పులు ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఆయన మృతదేహానికి శవపరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

తాత్కాలికంగా విధులకు హాజరైన కార్మికులు

మదనపల్లె పట్టణం: సమస్యలు పరిష్కారం కోరుతూ పురపాలక సంఘం కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేస్తున్న ఇంజినీరింగ్ విభాగంలోని పొరుగు సేవల కార్మికులు గురువారం తాత్కాలికంగా విధులకు హాజరయ్యారు. గత సోమవారం అర్ధరాత్రి నుంచి పట్టణంలో తాగునీటి సరఫరా, వీధి దీపాలు నిర్వహణ ఆపేసి నిరసనను తీవ్రం చేశారు. దీంతో కమిషనర్ ప్రమీల బుధవారం ఐకాస నాయకులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా విధులకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 5వ తేదీ వరకు విధులు నిర్వహిస్తామని ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ముందుకు వెళ్తామని చెప్పారు. గురువారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.

నారీ... అవగాహనతో పాలనలో జయభేరి

మహిళా సర్పంచులకు ప్రత్యేక శిక్షణ

గ్రామాభివృద్ధికి కొంగొత్త అడుగులు

కలికిరిలో మహిళా సర్పంచులతో డీఎల్‌పీవో నాగరాజ, ఎంపీడీవో భానుమూర్తిరావు, రిసోర్స్ పర్సన్లు అధికారులు

కలికిరి, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. నాయకత్వంలోనూ ముందుండి గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నారు. పంచాయతీల్లో సుపరిపాలన అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. విధుల నిర్వహణలో వారికి అవసరమైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది.

★ మదనపల్లె డివిజన్ పరిధిలోని మదనపల్లె, తంబళ్లపల్లె, కలికిరి, కలకడ, కేవీపల్లె, పీలేరు, కలకడ మండలాల్లోని వంద మంది మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణ ముగిసింది. సర్పంచుల విధులు, బాధ్యతలు, పంచాయతీ చట్టాలు, ఆర్థిక వనరులు, గ్రామాభివృద్ధికి రూపొందించే ప్రణాళికలు తదితర అంశాలపై నిపుణులతో అవగాహన కల్పించారు. సర్పంచులు శిక్షణతో తెలుసుకొన్న అంశాలు వారి మాటల్లోనే..

కొత్త విషయాలు నేర్చుకున్నా

గ్రామ పంచాయతీ ప్రథమ పౌరురాలిగా నిర్వహించాల్సిన కొత్త విషయాలెన్నో శిక్షణ ద్వారా తెలుసుకొన్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీకి అందించే నిధులు, వాటితో పంచాయతీ అభివృద్ధితో పాటు ఆదాయ వనరులు సమకూరే వాటి గురించి వివరించారు. గ్రామాభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తా.

- లీలావతి, మహల్‌రాజుపల్లె, కంభంవారిపల్లె మండలం

బాధ్యతలు తెలిశాయి

పంచాయతీ సర్పంచిగా నా బాధ్యతలేంటో తెలిశాయి. ఇంట్లో ఉండి కుటుంబం, పిల్లలకే పరిమితం కాకుండా ప్రజలకు సేవ చేసుకునేందుకు గొప్ప అవకాశం వచ్చింది. సర్పంచిగా అవగాహనతో ముందడుగు వేస్తే గ్రామాల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దవచ్చు. నిపుణుల సలహాలు పాలనలో మాకెంతో ఉపయోగపడతాయి.

- అరుణకుమారి, సర్పంచి, మొర్రంకిందపల్లె, కలికిరి మండలం

మహిళల పాత్ర కీలకం

మహిళా సర్పంచులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచి పాత్ర ఎంత కీలకమైనదో తెలియజేశారు. మా హక్కులు, బాధ్యతలతో పాటు సమావేశాలు, సభలు ఎలా నిర్వహించాలి. వచ్చిన నిధులను ఏ విధంగా ఖర్చు చేయాలి అనేది తెలిసింది.

- జాహీదా, సర్పంచి, టి.చంద్రావారిపల్లె

ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మదనపల్లె మండలంలో గురువారం జరిగింది. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన హరీష్ కుమారుడు చైతన్య (20) డ్రైవింగ్ నేర్చుకునేందుకు మదనపల్లెకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మొలకలదిన్నె క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ఆటోలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ప్రమాదకరంగా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు

రోడ్డుకు పక్కన సూచిక బోర్డు లేకుండా చేస్తున్న పనులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : ఓబులవారిపల్లెలో చేస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ పనుల వద్ద నిబంధనలు ఏ మాత్రం పాటించడంలేదు. నిత్యం ప్రజలు ప్రయాణించే రోడ్డు పక్కన హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణించే వారు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు పక్కనే లోతుగా గుంతలు తీశారు. రాత్రి అయితే చీకటిలో ఏమీ కనపడట్లేదు. కనీసం ఒక లైట్ కూడా ఏర్పాటు చేయలేదు. రైల్వేఅండర్ బ్రిడ్జ్ పనుల వద్ద నిబంధనలు పాటించేలా చూడాలని, వీధి దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

36 జీవోను వర్తింపజేయాలని డిమాండ్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : పురపాలక శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు జీవో నం:36 వర్తింపజేయాలని ఆ విభాగం కార్మికులు గురువారం స్థానిక ఎల్లీవ్ కాలనీలోని నీటి ట్యాంకు వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మికులు అల్లర్, శంకరయ్య, చెన్నయ్య, దేవా, రమేశ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

రోడ్డు ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలేవీ?

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : ప్రమాదాలకు పెట్టింది పేరు రెడ్డిపల్లె చెరువు కట్ట. ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని నివారించేందుకు రహదారి సిబ్బంది రోడ్డుకు మధ్యలో సూచిక స్తంభాలు ఏర్పాటు చేశారు. నెల రోజులు గడవక ముందే వాటిని వాహనాలు ఢీకొనడంతో దెబ్బతిన్నాయి. జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. చెరువు కట్ట ప్రాంతంలో మలుపు ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో చెరువు కట్టపై 25 ప్రమాదాలు జరిగాయి. 10 మంది మృతి చెందారు. 8 మందికి గాయాలయ్యాయి. ఇక్కడ ప్రమాదం జరిగితే ప్రాణాలతో బయట పడటం కష్టమే. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేయడం.. ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవడం చేయకపోతే అనేక మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

రహదారిపై ఏర్పాటు చేసిన సూచిక స్తంభాల దుస్థితి

మూలకు చేరిన చెత్త వాహనాలు

• రూ.లక్షల ప్రభుత్వ నిధులు వృథా

శిథిలావస్థలో వాహనాలు

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిధులతో ఏది కొనుగోలు చేసినా అది ప్రజాధనమే.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా చేసినప్పుడే పెట్టిన ఖర్చుకు సార్థకత ఉంటుంది. కానీ రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వస్తువులు మూన్నాళ్ల ముచ్చటగా ఉపయోగించి మూలన పడేస్తే ప్రజా ధనం వృథా అయినట్లే. రాజంపేట పురపాలక సంఘంలో విద్యుత్తు చెత్త వాహనాల విషయంలో ఇదే జరిగింది.

★ గత ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట రాజంపేట పురపాలికకు రెండేళ్ల కిందట సుమారు 15 విద్యుత్తు చెత్త వాహనాలు వచ్చాయి. వీటికి బ్యాటరీ ద్వారా ఛార్జింగ్ చేసుకుంటే సరిపోతుంది. కానీ వీటిని తెచ్చిన రోజే రెండు వాహనాలు పని చేయలేదు. ఉన్న వాటితోనే కాలం గడుపుతూ వచ్చారు. అవి కూడా ఛార్జింగ్ పెట్టే పరికరాలు పోయి, బ్యాటరీలు దెబ్బతిని పూర్తిగా 15 వాహనాలను ఎక్కడపడితే అక్కడ మూలకు తోసేశారు. వీటికి చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశముంది. పుర అధికారులు కూడా వీటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇవి వినియోగంలోకి వస్తే చిన్ని చిన్న వీధుల్లోకి కూడా సులభంగా వెళ్లగలవు... చెత్త సేకరణ సాగుతుంది. ఈ దిశలో అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతులు చేయిస్తాం

పురపాలకలో మూలనపడిన విద్యుత్తు చెత్త వాహనాలకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. చాలా రోజుల కిందట మూలకు చేరాయి. మెకానిక్‌ని పిలిపించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. **- జి.శ్రీనివాసులు, పురపాలక కమిషనర్, రాజంపేట**

నీటి వృథా.. ఎవరికీ పట్టదా?

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : రాయచోటి పట్టణ వాసులకు ప్రధాన నీటి వనరు వెలిగల్లు జలాశయం. పట్టణ ప్రజల అవసరాలకు రోజూ సుమారు 2 కోట్ల లీటర్ల తాగు నీరు అవసరం. అయితే ప్రస్తుతం వెలిగల్లు జలాశయం నుంచి 90 లక్షల లీటర్ల నీరు మాత్రమే పట్టణానికి సరఫరా చేస్తున్నారు. అసలే పట్టణ అవసరాలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదు. వారం, పది రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. జరుగుతున్న నీటి సరఫరాలో సుమారు 30 శాతంమేర నీరు వృథాగా పోతోంది. పైపులైన్లు పగిలిపోవడం, వాల్వుల నుంచి లీకేజీల కారణంగా రోజూ వేల లీటర్ల నీరు వృథా అవుతోంది. లీకేజీలను సిబ్బంది సకాలంలో మరమ్మతులు చేయడం లేదు. చేసినా మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. నీటి వృథాను అరికట్టాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ వాసుబాబును వివరణ కోరగా.. పట్టణంలో పైపులైన్ లీకేజీలను అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సరఫరా మెరుగు పరుస్తామన్నారు.

గాలివీడు రోడ్డు మార్గంలో పైపులైన్ లీకేజీ కారణంగా వృథాగా పోతున్న తాగునీరు

ఆదుకున్న రక్త దాతలు

సుండుపల్లి : మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి గర్భ సంచి శస్త్ర చికిత్స చేస్తుండటంతో ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం సత్యకుమార్ యువసేన వ్యవస్థాపకుడు రెడ్డెప్ప శంకర్‌కు తెలిసింది. ఆయన తమ సభ్యులైన సత్యనారాయణ, వెంకటరమణలకు తెలిపారు. వారు రాయచోటి టీపీ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తమిచ్చి ఆదుకున్నారు.

కోచింగ్ సెంటర్లపై విచారణ

పుల్లంపేట : నవోదయ కోచింగ్ సెంటర్లను విచారించి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో జయశ్రీ పేర్కొన్నారు. గురువారం స్థానిక కోచింగ్ సెంటర్లపై వచ్చిన ఫిర్యాదులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించారు. దీనికి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎంఈఓ-1 చక్రధర్‌రాజు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. రాజంపేట : 9441872651 రాయచోటి : 9703622242 రైల్వేకోడూరు : 9703572572

చెత్త తొలగింపు

చిన్నమండెం, న్యూస్‌టుడే : చిన్నమండెంలోని పాత మసీదుకు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త నిల్వలను పొక్లెయిన్‌తో శుభ్రం చేశారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక గురువారం చెత్త సమస్య వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన కార్యదర్శి పద్మావతమ్మ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది పొక్లెయిన్‌తో చెత్తను ట్రాక్టర్లలో నింపి గ్రామం బయటకు తరలించారు. పరిసరాలను శుభ్రం చేసి.. బ్లీచింగ్ చల్లారు.

నిరాశ పరిచిన వర్షం

సుండుపల్లి, న్యూస్‌టుడే : మండలంలో బుధవారం సాయంత్రం తీవ్ర గాలులు వీచాయి. మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప వర్షం కురిసింది. సుండుపల్లి వర్షపాతంలో 9 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో గాలుల దాటికి తోతాపురి మామిడి కాయలు నేల రాలాయి తప్ప వర్షం మాత్రం కురవలేదు. మంచి వర్షం వస్తుందని ఆశించిన అన్నదాతలు నిరాశ చెందారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

రాయచోటి, న్యూస్‌టుడే : ప్రపంచ శాంతి కపోతం గౌతమ బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన పైశాచిక మూర్ఖులను శిక్షించాలని కోరుతూ గురువారం ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలియచేశారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మదనపల్లి రూరల్ మండలం అంకిశెట్టిపల్లి వద్ద బుద్ధిని కొండపై గతంలోనూ మూడు పర్యాయాలు బుద్ధ విగ్రహాలను ధ్వంసం చేశారని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుని నిందితులను శిక్షించాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతయ్య, ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఎం జిల్లా నాయకుడు రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దేశ వ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

రాజంపేట, న్యూస్‌టుడే : ప్రజలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గాలి చంద్రయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ర.భ. శాఖ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదను సంపన్నులకు దోచిపెట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం దారుణమని, దాని కారణంగా కార్మిక రంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమ్మెకు కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

గాలివీడు, న్యూస్‌టుడే : ఆరోగ్య సూత్రాలు పాటించాలని గాలివీడు పీహెచ్‌సీ వైద్యాధికారి పి. మహమ్మద్‌రఫీక్ ప్రజలకు సూచించారు. గురువారం అరవీడు పంచాయతీ పెద్దమాసపల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని కాచి వడగట్టి తాగాలన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రుల్లో దోమ తెరలు ఉపయోగించాలన్నారు. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. పరిసరాలను శుభ్రం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రకళ, పర్యవేక్షకురాలు రమతులసి, బాలయ్య, ఆరోగ్య కార్యకర్త మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు రఫీక్

5 నుంచి సిద్ధేశ్వర, చెన్నకేశవుల బ్రహ్మోత్సవాలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల స్వగ్రామం తాళ్లపాక గ్రామంలోని సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. గ్రామస్థులు ఇప్పటికే ఉత్సవాలు బాగా నిర్వహించాలని టీటీడీ ఈఓ, జేఈఓలకు వినతి పత్రాలు ఇవ్వడం, రెండుసార్లు జేఈఓ తాళ్లపాక గ్రామానికి రావడంతో, ఏర్పాట్లపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేకత వచ్చింది. నగర సంకీర్తనలు అద్భుతంగా చేయాలని, రాజంపేట నుంచి తాళ్లపాక గ్రామం వరకు అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తూ.. వేలాది మంది కవులు, కళాకారులు, కేరళ వాయిద్యాలతో పండగ వలె నిర్వహించాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. ఈ ఉత్సవాలపై ప్రచారం చేయడం, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి ఆలయం

సిద్ధేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు : 5న అంకురార్పణ, 6న ధ్వజారోహణం, హంస వాహనం, 7న పల్లకీ సేవ, చంద్రప్రభ వాహనం, 8న పల్లకీసేవ, చిన్నశేష వాహనం, 9న పల్లకీ సేవ, సింహవాహనం, 10న పల్లకీ సేవ నంది వాహనం, 11న స్వామివారి ఆర్జిత కల్యాణం, 12న పల్లకీ సేవ, 13న పార్వేట ఉత్సవం, 14న వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణ, 15న స్నపన తిరుమంజనం, పుష్పయాగం.

11న చెన్నకేశస్వామి కళ్యాణం : 5న దీక్ష తిరుమంజనం, అంకురార్పణ, 6న ధ్వజారోహణం, శేషవాహనం, 7న పల్లకీ సేవ, హంసవాహనం, 8న పల్లకీ సేవ, సింహ వాహనం, 9న పల్లకీ సేవ, హనుమంత వాహనం, 10 మోహినీ అవతారం, గరుడ వాహనం, 11 స్వామివారి కల్యాణం, 12 రథోత్సవం, 13న అశ్వవాహనం, 14న చక్రస్నానం, ధ్వజావరోహణం, 15న స్నపన తిరుమంజనం, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గొల్లపల్లి గోడు వినేదెవరు?

• దర్జివల్లిలో తాగునీటికి అవస్థలు • పట్టించుకోని అధికారులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో కన్నెల్లగా తిష్టవేసిన ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరవయ్యారు. దవంతరంపల్లె, గొల్లపల్లి, దర్జివల్లి మూడు గ్రామాలకు కేంద్రమైన ప్రధాన రహదారి వారాలుగా కంకరతేలి దెబ్బతింది. మరమ్మతులు చేయకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పనిచేయని చేతిపంపులు

దర్జివల్లిలో తాగునీటి గొట్టపు బావి నుంచి సరఫరా చేస్తున్న నీటిని తాగాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపారు. ఊరికి శివారులో ఉన్న పెన్నానదిలోకి వెళ్లి చెలిమ తీసుకుని అందులో వస్తున్న ఊట నీరు సేకరించి బిందెలతో తెచ్చుకోవాల్సి వస్తోంది. రోజూ బిందె చేతపట్టుకొని పెన్నమ్మ చెంతకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. మరికొందరు ప్రైవేటు వ్యాపారుల నుంచి డబ్బా నీటిని కొంటున్నారు. నిత్యం ఇలా కొనుగోలు చేయాలంటే పేద, మధ్య తరగతి వర్గాలకు ఆర్థికంగా భారమవుతోంది. చేతిపంపులు ఉన్నా పనిచేయడం లేదు. నీటి నిల్వ కోసం కనీసం చిన్నపాటి ట్యాంకు కూడా నిర్మించలేదు. కరెంటు ఉన్న సమయంలోనే నీరు వస్తుంది. విద్యుత్తు లేకపోతే జలాపోక తప్పడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మన బడి 'నాడు-నేడు' రక్షిత జలం కోసం ఏర్పాటు చేసిన ఆర్వో కేంద్రం పనిచేయడం లేదు. తరగతి గదికి కరెంటు కూడా లేదు.

సంపద కేంద్రం నిరుపయోగం

ప్రతి గడప నుంచి తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలను సేకరించి సేంద్రియ ఎరువును తయారు చేయాలని ఘన వ్యర్థ పదార్థాల తయారీ కేంద్రాన్ని రూ.3.20 లక్షలతో నిర్మించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన తొట్టెల్లో కంపచెట్లు పెరిగాయి. ఈ కేంద్రం వినియోగంలో లేదు. గొల్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి గతంలో శాశ్వత భవనాన్ని నిర్మించారు. సిమెంటు కాంక్రీట్ పెచ్చులు రాలుతున్నాయి.

పనిచేయని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఇనుప చువ్వలు బయటపడి ప్రమాదకరంగా మారినా బాగు చేయలేదు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో మరుగు వసతి లేదు.

నదిలో అక్రమ తవ్వకాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో పెన్నానదిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వకాలు చేస్తున్నా అధికారులు కళ్లుండీ చోద్యం చూస్తున్నారు. ఒంటిమిట్టకు 8-10 కి.మీ దూరం ఉండటంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు నడపలేదు. ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో వెళ్లాల్సి వస్తుందని పౌరులు ఆక్రోశిస్తున్నారు.

విద్యార్థినులపై దాడి

చిన్నమండెం, న్యూస్‌టుడే : మండలంలోని బోనమల ప్రాథమిక పాఠశాలలో నలుగురు బాలికలపై అదే గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా అలియాస్ బాబు దాడికి యత్నించాడు. ఈ ఘటనలో బాలికలకు స్వల్పగాయాలయ్యాయి. ఐదో తరగతి విద్యార్థినులు శిల్ప, కుసుమిత, దీపిక, రెడ్డిప్రణీత అటుగా వెళుతున్న మహబూబ్‌బాషాను మారుపేరుతో పిలవడంతో అతను ఆగ్రహించి వారిని తరుముకొంటూ వెంబడించాడు. వారు పాఠశాల గదిలోకి వెళ్లి గడియపెట్టుకోవడంతో తలుపును తన్ని లోనికి వెళ్లి దాడికి యత్నించాడు. ఇంతలో ఉపాధ్యాయుడు అక్కడికి వచ్చి అతనితో గొడవ పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని గాయపడిన పిల్లలను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థులపై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించారు. బాలికలకు అవసరమైన వైద్యం అందించడంతో పాటు సంబంధిత అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఎస్పీకి ఆహ్వానం

నందలూరు, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుని గురువారం ఆర్టీసీ రీజనల్ మాజీ ఛైర్మన్ యద్దుల సుబ్బరాయుడు కలసి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానించారు. కల్యాణం, రథోత్సవం రోజు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎస్పీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వాసుదేవయ్య, రామసుబ్బన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్పీని ఆహ్వానిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

చిన్నమండెం, న్యూస్‌టుడే : మొహర్రం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఏడో రోజు గురువారం సాయంత్రం చిన్నమండెంలో ఇమాంఖాసీం పీర్లను ఊరేగించారు. పెద్ద మకాన్ నుంచి పాత స్టేట్‌బ్యాంకు, కోట వీధి, బ్రాహ్మణ వీధి తదితర ప్రాంతాల్లో ఊరేగింపు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అడుగడుగునా పీర్లకు పలువురు భక్తులు చదివింపులు చేశారు. పెద్ద మకాన్‌లోని గంధం పీరును భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. రాత్రి పది గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బోడిరెడ్డిగారిపల్లెలోనూ మొహర్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాగుతున్నాయి. రోజుకొక కుటుంబం పీర్లకు బాషికాలు సమర్పిస్తున్నారు. రాత్రి వేళ అగ్నిగుండం ఏర్పాటు చేసి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వీరబల్లి : మండలంలో గ్రామాల్లో మొహర్రం ప్రార్థనల్లో భాగంగా గురువారం పీర్లను ప్రత్యేకంగా బాషికాలతో అలంకరించి పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణ సంచా పేల్చుతూ ఊరేగించారు. ఈడిగపల్లి, తురకపల్లి, వంగిమళ్ల, ఓదివీడు, మట్లి, శీతంపేట గ్రామాల్లో ఈ పీర్ల ఊరేగింపు జరిగాయి.

పీర్ల చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు

అరవీడు (గాలివీడు) : మండలంలోని అరవీడు పంచాయతీ కస్పాలో ఏటా మొహర్రం ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు గురువారం పీర్ల చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. సంప్రదాయబద్ధంగా చావిడిలో పీర్లను నిలిపారు. మొహర్రం ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులు చర్చించారు. ఈ నెల 8న ఖవ్వాలీతోపాటు రాత్రి అన్నదానం ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నమండెంలో ఇమాంఖాసీం పీర్ల ఊరేగింపులో భక్తులు

అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు (రాజంపేట గ్రామీణ) : పెనగలూరు మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడి పోస్టును తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి గురువారం తెలిపారు.

నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం

పుల్లంపేట, న్యూస్‌టుడే : నాణ్యమైన విద్యుత్తు అందిస్తామని ఏడీఈ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యుత్తు కార్యాలయంలో పుల్లంపేట, చిట్వేలి విద్యుత్తు సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాయాలు లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని, సమస్య ఏర్పడినా సత్వరం పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు అదనపు లోడుకు ఇచ్చిన అవకాశం ముగిసిందని, ఇకపై అంతా అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు రవినాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : తెదేపా అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలోనే అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం రాజంపేట మండలం డీబీఎన్ పల్లిలో సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సుబ్బనరసయ్య నాయుడు, బాపనయ్యానాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, ఎస్వీ రమణ, సుబ్రహ్మణ్యంనాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివనారాయణ, నాగేశ్వరనాయుడు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : కూటమి ప్రభుత్వ పాలనతోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు దక్కుతున్నాయని కుడా ఛైర్మన్, నియోజకవర్గ తెదేపా బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు అనే కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని శెట్టిగుంట, యానాదిపల్లె, జ్యోతి కాలనీ, కుక్కలదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటరామరాజు, నీలకంఠయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చినట్లు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, కల్లుగీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు కొమరా వెంకటనరసయ్య, మోదగుల పెంచలయ్య పేర్కొన్నారు. ఒంటిమిట్టలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ర్యాలీ చేపట్టి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు నల్లగొండు వెంకటసుబ్బారెడ్డి, పాములు సుబ్రహ్మణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, బాషా, బి.వి.రమణ, కట్టా నారాయణ, షఫీ, రేవిళ్ల బాలమునెయ్య పాల్గొన్నారు.

డీబీఎన్‌పల్లిలో తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, నాయకులు

రైల్వేకోడూరు : కరపత్రం అందిస్తున్న కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, తెదేపా నాయకులు

ఒంటిమిట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న తెదేపా నాయకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

మహిషారూఢా వారాహీదేవిగా బండ్లమ్మ

చందోలు బండ్లమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీవారాహీ అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని 'మహిషారుఢా వారాహీదేవి'గా అలంకరించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

- చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

నల్లమడ వాగు కట్ట పటిష్ఠం

మరమ్మతుల అనంతరం కట్ట

ఈనాడు కథనానికి స్పందన

బాపట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జిల్లెళ్ల మూడి వంతెన నల్లమడ వాగు కుడికట్టను పటిష్ఠం చేశారు. భారీ కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న తీరుపై 'ఈనాడు'లో మే 29న ప్రచురితమైన కథనానికి కలెక్టర్ జె.వెంకటమురళి స్పందించారు. అత్యవసర మరమ్మతులకు జిల్లా మైనింగ్ నిధి నుంచి రూ.9 లక్షలు కేటాయించారు. మురుగు నీటిపారుదల అధికారులు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో వాగులో పూడిక తీయించి.. కోతకు గురైన ప్రాంతంలో కట్టపై మట్టి పోసి యంత్రాలతో పటిష్ఠం చేశారు. భారీ వర్షాలు కురిసినా గండి పడకుండా చర్యలు చేపట్టారు. మధ్యలో వర్షాలు కురిసి పనులకు ఆటంకం కలిగిందని.. వాగు కట్ట పనులు పూర్తి చేసినట్లు జేఈ భరద్వాజ తెలిపారు.

నడిపేదెలా?

గ్రానైట్ పరిశ్రమలో వేధిస్తున్న ముడిరాయి కొరత, నాణ్యత లేమి

మార్టూరు, న్యూస్‌టుడే

ముడిరాయి కొరత.. నాణ్యత లేమి.. విద్యుత్తు ఛార్జీల భారం.. జీఎస్టీతో గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. దీనికితోడు పలకల ఎగుమతుల్లో ట్రేడర్లు సిండికేట్‌గా వ్యవహరించడంతో పరిశ్రమ ముందుకు కదల్లేని దుస్థితికి చేరిందని పారిశ్రామికవర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

బాపట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరుతో పాటు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలాల్లో సుమారు 650 ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటికి అవసరమైన ముడిరాయిని బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని 32 క్వారీల నుంచి తరలిస్తారు. గ్రానైట్ శ్లాబుల తయారీలో నాణ్యత తగ్గడంతో ఎగుమతులు క్షీణించినట్లు పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకప్పటి డంపింగ్ రాళ్లు ప్రస్తుతం పరిశ్రమలకు సరఫరా అవుతున్నాయి. దీనికితోడు డీజిల్ ధరలు పెరగడంతో క్వారీలోని ముడిరాయి, ఫ్యాక్టరీకి తరలించడంలో అధిక భారం పడుతోంది.

సిండికేట్‌గా ట్రేడర్లు

గతంలో క్వారీ నుంచి ముడిరాయిని తరలించి గ్రానైట్ పలకలు తయారుచేసి అడుగుకు రూ.8 చొప్పున మైనింగ్ చెల్లించేవారు. వైకాపా పాలనలో అదికాస్తా రూ.15 చొప్పున చెల్లించేలా పన్ను భారం మోపారు. దీంతో అదనపు భారం పెరిగింది. నాణ్యమైన రాయి లభించక వైట్ లైన్స్, పగుళ్లు వచ్చి కాటా ధరకు పలకలు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో అడుగు రూ.40-60 ధర చొప్పున అమ్మకాలు సాగించిన గ్రానైట్ పలకలను ప్రస్తుతం మార్కెట్ మాయాజాలంతో రూ.35-45 ధరకే విక్రయించక తప్పడంలేదని యజమానులు ఆవేదన చెందుతున్నారు. నాణ్యతపై ఇతర రాష్ట్రాలకు చెందిన ట్రేడర్లు కొర్రీలు వేయడం, స్థానికంగా మార్కెట్‌చేసే వ్యాపారులు లేకపోవడంతో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన గ్రానైట్ ట్రేడర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. వీరి ద్వారానే మన ప్రాంత గ్రానైట్ పలకలు గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, దిల్లీ, కేరళ, హరియాణా, ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. గ్రానైట్ పరిశ్రమ నుంచి నిత్యం 100-150 లారీల శ్లాబులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. వ్యాపారుల ధరల్లో కోత విధించడంతో యజమానులు ఉత్పత్తిని తగ్గించుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది.

పలకలు ఉత్పత్తి చేస్తున్న యంత్రాలు

రాయితీలు కల్పించాలి..

ఒకప్పుడు గ్రానైట్ యూనిట్లు లాభదాయకంగా ఉండటంతో ఇతర వ్యాపార రంగాలవారు బ్యాంకు రుణాలు పొంది, ఈ పరిశ్రమ వైపు వచ్చారు. కొందరు సొంతంగా నిర్వహిస్తుండగా మరి కొందరు అద్దె ప్రాతిపదికన తీసుకొని వేలాది మంది ఇతర రాష్ట్రాల కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల కాలంలో వరుస నష్టాలు చవిచూడటంతో బ్యాంకు వాయిదాలు చెల్లించడం కష్టంగా మారింది. అద్దెకు తీసుకునేవారు అత్యల్ప ధరకు కోరడంతో పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమ అభ్యున్నతికి ప్రత్యేకశ్రద్ధ చూపి, రాయితీలు ఇస్తే కొంతమేర ఊపిరిపీల్చుకుంటుందని గ్రానైట్ వర్గాలు ఎదురు చూస్తున్నాయి.

కూచినపూడిలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

బాపట్లలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఉత్సాహంగా ఇంటింటికి తెదేపా

సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి అనగాని, ఎమ్మెల్యేలు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి తెదేపా కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలం కూచినపూడిలో ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ కింద తొలి విడత సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. పల్లె పండగ కింద గ్రామాల్లో సిమెంటు రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల పట్టణం 13, 14వ వార్డుల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పర్యటించి ప్రజలకు సుపరిపాలన కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ప్రగతిని వివరించారు. వేమూరులో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ల నగదు రూ.4 వేలకు పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. చీరాల మండలం రామకృష్ణాపురంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పర్యటించి ప్రజలను కలిసి సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు.

కృష్ణానదిలో పరిశీలిస్తున్న ఏజీఎం ఫణిరాజ్ సింహ, అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే జైలుకే

భట్టిప్రోలు, కొల్లూరు, న్యూస్‌టుడే : ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిని నేరుగా జైలుకు పంపుతామని, ఉపేక్షించేది లేదని భూగర్భ జల వనరుల శాఖ ఏజీఎం ఫణిరాజ్ సింహ హెచ్చరించారు. మండలంలోని ఓలేరు సమీపంలోని కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి గురువారం ఆయన నదిలో పరిశీలన చేసి.. ఈ హెచ్చరికలు చేశారు. గతంలో ఇసుక అక్రమ తవ్వకాలు, తద్వారా భూగర్భ జలాలు అడుగంటడం, వాటి స్థానాన్ని సముద్ర ఉప్పు నీరు భర్తీ చేయడంతో సాగు, తాగునీటి కొరత తదితర సమస్యలను స్థానికులు అధికారులకు వివరించారు. తమ పరిశీలనలో వెల్లడైన అంశాలను కోర్టుకు నివేదించనున్నట్లు ఏజీఎం తెలిపారు. కార్యక్రమంలో భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక సహాయకురాలు స్నేహ, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎస్సై శివయ్య పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయకుంటే చర్యలు

సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన పక్కా గృహాల నిర్మాణ లక్ష్యం పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటమురళి హెచ్చరించారు. గృహ నిర్మాణంపై ఆ సంస్థ అధికారులతో కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 8,299 గృహాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా 3,687 మాత్రమే నిర్మించడంపై ఏఈలను నిలదీశారు. అధికారులకు ఛార్జి మెమోలు ఇచ్చినా పనితీరులో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో 17వ స్థానం నుంచి 23వ స్థానానికి దిగజార్చారని పీడీ, డీఈలు, ఏఈలపై మండిపడ్డారు. నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

❖ పీజీఆర్ఎస్ అర్జీలు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,046 మంది అర్జీదారుల అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. దివ్యాంగులు, ఎస్టీలకు ప్రతి నెలా నాలుగో శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు అర్జీల స్వీకరణకు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, నోడల్ అధికారి నాగిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ జల శాఖ సహాయ సంచాలకుడిగా సురేష్

బాపట్ల, న్యూస్‌టుడే : భూగర్భ జల శాఖ సహాయ సంచాలకుడిగా జి.సురేష్ నియమితులయ్యారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్లో కలెక్టర్ వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. సురేష్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ఇప్పటి వరకు ఏడీగా పని చేసిన కె.రామబాలాజీ పల్నాడుకు బదిలీ అయ్యారు.

త్వరలో భూసేకరణ మార్కింగ్

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: గుంటూరు- వినుకొండ జాతీయ రహదారి 544డి విస్తరణలో భాగంగా త్వరలో భూసేకరణ మార్కింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు దిల్లీ నుంచి జాతీయ రహదారుల అథారిటీ వారు 3ఏ నోటిఫికేషన్ విడుదల చేశారు. గుంటూరు నుంచి వినుకొండ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును ట్రాఫిక్ దృష్ట్యా నాలుగు వరుసలుగా విస్తరించనున్న విషయం తెలిసిందే. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇందుకు ఎంత భూమి అవసరమో గుర్తించి మార్కింగ్ వేసి, అనంతరం ఎక్కడెక్కడ భూమి కావాలో ఆ ప్రాంత రైతులకు నోటీసులు ఇవ్వనున్నారు. జాతీయ రహదారుల అథారిటీ అధికారులు వచ్చాక భూసేకరణ మార్కింగ్ చేపడతామని జేసీ సూరజ్ గనోరే తెలిపారు.

WALK IN INTERVIEW
ON 05.07.2025(SATURDAY) Bet.10AM TO 2PM
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఒంగోలు, చీరాల, అద్దంకి శాఖల నందు పనిచేయుటకు క్రింది సిబ్బంది కావలెను.
COLLECTION EXECUTIVES
డిగ్రీ కలిగి 28 సం॥లలోపు వయస్సు గల యువకులు సర్టిఫికెట్లు, బయోడేటా దిగువ తెలిపిన చిరునామాకు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. జీతం: రూ.19000/- లు + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. టూవీలర్ ఉన్న వారికి ప్రాధాన్యత. ఆసక్తి గల వారు నేరుగా గాని లేదా మెయిల్ ద్వారా సంప్రదించగలరు
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
డి.నెం.37-1-47, 1వ అంతస్తు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా - 523001, సెల్: 94947 77499
Email : mahesh.p1@shriramfinance.me

జిల్లా ఇన్‌ఛార్జి డీఐఈవోగా జుబేర్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి డీఐఈవోగా జీకే జుబేర్ నియమితులయ్యారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఐఈవోగా పనిచేసిన ఎర్రయ్య ఉద్యోగ విరమణ చేయడంతో జుబేర్ తాత్కాలిక బాధ్యతలు స్వీకరించారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

సభ్యుల హాజరుపై ఉత్కంఠ

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ సభ్యుల హాజరుపై ఉత్కంఠ నెలకొంది. గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనుంది. గత మార్చి 15న జరిగిన సమావేశానికి వైకాపా జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరవడంతో కోరం లేక వాయిదా వేశారు. ఆ తర్వాత సమావేశం ఏర్పాటుచేసినా.. కొందరు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యుల విజ్ఞప్తి మేరకు జడ్పీ సీఈవో సమావేశాన్ని వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 వార్షిక జడ్పీ బడ్జెట్‌ని సర్వసభ్య సమావేశం ఆమోదించలేదు. దాంతో ఏపీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వానికి బడ్జెట్‌ని పంపడంతో ప్రభుత్వం ఆమోదించింది. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు వీలు కుదిరింది.

మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం

రైలులో తనిఖీ చేస్తున్న పోలీసులు, ఆర్పీఎఫ్, ఈగల్ బృంద సభ్యులు

బాపట్ల, న్యూస్‌టుడే : మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. బాపట్ల రైల్వేస్టేషన్లో పోలీసులు, ఆర్పీఎఫ్, ఈగల్, జీఆర్పీ బృందాలు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశాయి. డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షణికానందం కోసం మత్తుకు అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుందన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఆకస్మిక దాడులు చేసి పట్టుకుంటామని చెప్పారు.

85 వేల మందికి జీవనోపాధి కల్పించడమే ధ్యేయం

అద్దంకి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ ఏడాది 85 వేల మందికి జీవనోపాధి కల్పించాలనే ధ్యేయంతో యంత్రాంగం పని చేస్తోందని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. అద్దంకి మండల పరిషత్తు కార్యాలయం వద్ద గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాల బ్యాంకుల మేనేజర్లు, క్షేత్ర సహాయకులు, వెలుగు అధికారులతో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ గతంలో బ్యాంకు యాజమాన్యాలు లబ్ధిదారుల రుణాలు నిర్ణయించేవన్నారు. ప్రస్తుతం దానికి భిన్నంగా పొదుపు మహిళలే తమకు కావాల్సిన రుణాలు అడిగి తీసుకుంటున్నారన్నారు. రెండు నెలల నుంచి వెలుగు, మెప్మాలో అంతర్జాలం ద్వారా పొదుపు మహిళల పేర్లు నమోదు ప్రారంభమైనట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, డీపీఎం లక్ష్మణాచారి, లీడ్ బ్యాంక్ మేనేజరు శివకృష్ణ, అద్దంకి యూబీఐ మేనేజరు నాగేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

సాగు పత్రం.. జారీలో జాప్యం

కౌలు రైతులకు పంట రుణాలు అందడంపై ప్రభావం

“రేపల్లె మండలంలో 6550 మంది కౌలు రైతులకు సాగుపత్రాలు మంజూరు చేయాల్సి ఉండగా నేటి వరకు 1594 అందజేశారు. వేమూరు మండలంలో 5350కి 990, సంతమాగులూరులో 3050 మంది కౌలుదారుల్లో 294 మందికి మాత్రమే జారీ చేశారు. బాపట్ల నియోజకవర్గంలో 13,755 ఇవ్వాల్సి ఉండగా 2600 అందించారు.”

“పాత కార్డుల పునరుద్ధరణ ఈ నెల రెండో వారంలో జరుగుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కొత్తగా వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి సీసీఆర్సీ పోర్టల్‌లో భూమి విస్తీర్ణం వివరాలు కనిపించకపోవటం వంటి సాంకేతిక సమస్యలతో పత్రాల జారీలో జాప్యం జరుగుతోంది.”

బాపట్ల, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. జిల్లాలో మూడొంతుల వరకు కౌలు పద్ధతిలోనే సాగు జరుగుతోంది. కౌలు రైతులకు రాయితీలు, బీమా పరిహారం వర్తించాలంటే సీసీఆర్ కార్డులు (పంట సాగు హక్కు పత్రం) తప్పనిసరి. వీటి మంజూరుకు మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించగా జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది.

బాపట్ల జిల్లాలో 3.79 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంకాగా 1.80 లక్షల మంది రైతులున్నారు. వీరిలో 80 శాతం మంది కౌలు రైతులే. 2025-26 పంట కాలానికి లక్ష సీసీఆర్ కార్డులు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 17,366 ఇచ్చారు. మిగతావి ఎప్పటికి ఇస్తారోనని తెలియక లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్డుల కాల పరిమితి 11 నెలలు. బాపట్ల, చీరాల, అద్దంకి, అమృతలూరు, బల్లికురవ, నిజాంపట్నం, పర్చూరు తదితర మండలాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. పంటకాలం 11 నెలలు కావడంతో సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతులు సరిగ్గా 11వ నెలలో తీసుకున్న మొత్తం వడ్డీతో కలిపి చెల్లిస్తే కొత్తది మంజూరు చేస్తారు. ఆ తరువాత వడ్డీ రాయితీ బ్యాంకు ఖాతాలో జమౌతుంది. కార్డుల జారీలో జాప్యం జరిగితే జులై మొదటి మూడు వారాల్లో తీసుకున్న రైతులకు రాయితీ ప్రయోజనం దక్కటంలేదని వాపోతున్నారు.

పాత కార్డులు పునరుద్ధరిస్తేనే..

గతేడాది కౌలు రైతులకు లక్ష సీసీఆర్ కార్డులు జారీ చేయగా 23 వేల మందికి మాత్రమే బ్యాంకులు, సహకార సొసైటీల నుంచి రూ.42 కోట్ల పంట రుణాలు మంజూరు చేశారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో లక్ష మందికి కార్డులు, రూ.200 కోట్ల పంట రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పాత కార్డుల పునరుద్ధరణ జరిగితేనే లక్ష్యం మేరకు జారీ చేయగలుగుతారు. బ్యాంకులు, సొసైటీల్లో కొత్తగా రుణాలు తీసుకోవటానికి అవకాశం లభిస్తుంది. పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి పంట రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.

వేగంగా పూర్తి చేస్తాం

సీసీఆర్ కార్డుల జారీని వేగవంతం చేస్తాం. దరఖాస్తు చేసుకున్న కౌలు రైతులందరికీ అందిస్తాం. పాత కార్డులు పునరుద్ధరించి, రాయితీ ప్రయోజనాలు దక్కేలా చూస్తాం. పంట రుణాలు మంజూరు చేయిస్తాం.

– రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

శ్రద్ధాంజలి

జననం: 01-04-1952
మరణం: 19-06-2025

కీ॥శే॥ డా॥ కంచర్ల రామయ్య గారు
(ఈనాడు రామయ్య)
వ్యవస్థాపకులు : ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల, కందుకూరు, సీనియర్ పాత్రికేయులు

నిరాడంబరానికి నిలువెత్తు రూపం మీరు.. సహృదయానికి అసలైన రూపం మీరు...
మీ ధృఢ సంకల్పం, కార్యదక్షత మాకు ఆదర్శనీయం... మీ ఆలోచనా ధృక్పథం మాకు స్ఫూర్తి దాయకం..
కుటుంబ పెద్దగా అందరి బాధ్యతలను చేపట్టి మాకు బంగారు భవిష్యత్తు అందించి దైవసన్నిధికి చేరిన
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: శ్రీమతి కంచర్ల ధనలక్ష్మి

కుమారులు - కోడళ్ళు :
డా॥ కంచర్ల విజయ్ శ్రీనివాస్ - ఇంద్రాదేవి
డైరెక్టర్: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి, కందుకూరు.
డా॥ కంచర్ల శ్రీకాంత్ - సరిత
ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు, పొలిటికల్ ఛైర్మన్, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (KADA)
మనుమలు: సాయి శ్రీహాస్, తారక రామ్, అభి కార్తికేయ

పెద్దకర్మ: తేది: 05-07-2025, శనివారం ఉదయం 10.00 గంటల నుండి ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి, కందుకూరు నందు జరుగును. కావున తెలియపరచడమైనది.

(c) eenadu

అందరి సహకారంతో మెరుగైన సేవలు

కలెక్టర్ వెంకట మురళిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వర్లు, డీఈలు, ఏఈలు

బాపట్ల, న్యూస్‌టుడే : అధికారులు, ఉద్యోగుల సహకారంతో కష్టపడి పని చేస్తూ జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్లో వెంకటమురళిని జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు, ఫోరం ఫర్ బాపట్ల ప్రతినిధులు గురువారం కలిసి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తొలి ఏడాది పాలన తనకు ఎంతో సంతృప్తి ఇచ్చిందని, జిల్లా అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించామని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సమన్వయంతో పని చేస్తూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని తెలిపారు. పలు విభాగాల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపామని పేర్కొన్నారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వర్లు, ఫోరం కన్వీనర్ సాయిబాబు, అధికారులు పాల్గొన్నారు.

మాటలతో మభ్యపెడుతున్నారు!

సింథైట్ ఫ్యాక్టరీ కారం కోరుతో గ్రామస్థుల ఇబ్బందులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాం. ఇకపై కారం కోరు గ్రామంలోకి రాదని చెబుతూ యాజమాన్యం ఏటా అధికారులు, గ్రామస్థులను మభ్యపెడుతూనే ఉంది. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని సింథైట్ కర్మాగారం నుంచి వచ్చే కారం కోరు సమస్య పునరావృతమై గ్రామస్థులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ప్రజలు ఊపిరి పీల్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంది. సమస్యపై గత కొన్నేళ్లుగా స్థానికులు పోరాడుతూనే ఉన్నారు. 9 ఏళ్లగా సమస్య పరిష్కరిస్తామని యాజమాన్యం చెబుతున్నా పూర్తి స్థాయి పరిష్కారం లభించడం లేదు. కాలుష్య నియంత్రణ అధికారులు యాజమాన్యాన్ని ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పులేదు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

గత ఏడాది జూన్‌లో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల బృందం గ్రామస్థుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఇకపై కోరు రాదని ఫ్యాక్టరీ యాజమాన్యం లిఖిత పూర్వక వివరణ ఇచ్చింది. అప్పటి కలెక్టర్ కోరు వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. కానీ సమస్య మాత్రం యథాతథంగానే ఉంది. వేసవిలో కోరు తీవ్రత ఎక్కువగా ఉంటోందని గ్రామస్థులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం పరిమితిలోపే ఉత్పత్తులు తయారు చేస్తే ఇబ్బంది ఉండదు. పరిమితికి మించి చేయడం వల్లే సమస్య ఎక్కువ అవుతుందని ఆరోపిస్తున్నారు. హృద్రోగ సమస్య ఉన్న వారి పరిస్థితి దారుణంగా ఉన్నట్లు స్థానికుల తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మేదరమెట్లలోని సింథైట్ కర్మాగారం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

సమస్య మా దృష్టికి వచ్చింది. గతంలోనూ పలుమార్లు యాజమాన్యాన్ని హెచ్చరించాం. వేసవిలో సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. ఫ్యాక్టరీని పరిశీలించి కారం కోరు గ్రామంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకుని అందుకు తగిన ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యానికి సూచిస్తాం.

- రాఘవరెడ్డి, కాలుష్య నియంత్రణ అధికారి

పుల్లరిపాలెం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

బాపట్ల, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారని వేటపాలెం మండలం పుల్లరిపాలెం పంచాయతీ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావుపై కలెక్టర్ జె.వెంకటమురళి గురువారం సస్పెన్షన్ వేటు వేశారు. డీపీవో ప్రభాకర్ గ్రామానికి ఉదయం ఆకస్మిక తనిఖీకి వెళ్లారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరు కాలేదు. రోడ్లపై చెత్త ఎక్కడపడితే అక్కడ పడి ఉండటాన్ని గమనించారు. పంచాయతీ కార్యదర్శి పనితీరుపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. కార్యదర్శి శ్రీనివాసరావును విధుల నుంచి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈవోఆర్డీ శ్రీనివాసరావు సైతం విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేశారు.

సూపర్- 6 అమలుకు ఒత్తిడి చేస్తాం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : సూపర్- 6 పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా వాటిని అమలు చేయకపోగా.. అన్నింటినీ అమలు చేస్తున్నామని చెబుతున్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆరోపించారు. స్థానికంగా గురువారం సూపర్-6 పథకాలను ప్రదర్శించే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు తూమాటి మాధవరావు, వరికూటి అశోక్‌బాబు, పడమటి శ్రీనివాసరావు, ఎంపీపీ లలిత కుమారి పాల్గొన్నారు.

6న జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక

బాపట్ల, న్యూస్‌టుడే : బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ బాలురు, బాలికల జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలను 6న బాపట్ల క్రీడా వికాస కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు.

ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

కనగాలలో పచ్చడి డబ్బా పరిశీలిస్తున్న అధికారి దేవరాజ్

భట్టిప్రోలు, కనగాల (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: దుకాణాల్లో ఏదైనా వస్తువు, ఆహార పదార్థం కొనేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆహార భద్రతాధికారి కె.దేవరాజ్ సూచించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన గురువారం చెరుకుపల్లి, భట్టిప్రోలు మండలాల్లో పర్యటించారు. కనగాలకు చెందిన రామకృష్ణ పది రోజుల కిందట భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన గోలి బాలకృష్ణ నుంచి ఐదు రకాల పావు కిలోల పచ్చడి డబ్బాలు కొన్నాడు. వాటిని రుచి చూడగా పాడైనట్లు గమనించి అధికారులకు ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ వద్ద ఉన్న పచ్చడి డబ్బాలు పరిశీలించిన జిల్లా ఆహార భద్రతాధికారి దాని నమూనాలు సేకరించారు. ఐలవరంలో వ్యాపారి వద్దకెళ్లి అతని వివరణ నమోదు చేశారు. నమూనాలను ప్రయోగశాలకు పంపి.. వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత కీలకం

ప్రదర్శనలో డీఎంహెచ్‌వో విజయమ్మ తదితరులు

బాపట్ల, న్యూస్‌టుడే : డెంగీ, మలేరియా నివారణలో పరిసరాల పరిశుభ్రత కీలకమని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో చేపట్టిన అవగాహన ప్రదర్శనను ఆమె గురువారం ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, నీరు నిల్వ ఉంటే దోమల లార్వాలు పెరిగి సమస్య తీవ్రమవుతుందని పేర్కొన్నారు. దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎబేట్ ద్రావణం చల్లి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

నృసింహుడికి బంగారు తిరునామం బహూకరణ

ఈవో సునీల్‌కుమార్‌కు తిరునామం అందజేస్తున్న భాగ్యశ్రీ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామికి అలంకరించేందుకు విజయవాడకు చెందిన భక్తులు మండు శ్రీనివాస్, భాగ్యశ్రీ దంపతులు 24.990 గ్రాముల బంగారు తిరునామాన్ని బహూకరించారు. ఆలయంలో గురువారం ఈవో కోగంటి సునీల్‌కుమార్‌కు తిరునామాన్ని అందజేశారు. దీని విలువ రూ.2.40 లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు.

సిండికేట్ కనుసన్నల్లోనే వేలం

నామమాత్ర ధరలకు రేవులు కైవసం

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కృష్ణానదీ తీర ప్రాంతంలో రేవుల నిర్వహణ సిండికేట్ కనుసన్నల్లోనే కొనసాగుతోంది. జిల్లాపరిషత్తు కార్యాలయంలో రేవుల వేలం ప్రక్రియను జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ గురువారం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జడ్పీ కార్యాలయంలో గుత్తేదారులు మాట్లాడుకుని సిండికేట్‌కు అనుకూలంగా కూడబలుక్కున్నారు. ఆయా రేవులకు జడ్పీ అధికారులు నిర్ణయించిన ప్రాథమిక ధరకు కొంత మొత్తం పెంచి రేవులను దక్కించుకున్నారు. స్థానికేతరులు ఎవరూ సీల్డ్ టెండర్లు వేయకుండా స్థానిక నాయకులతో చెప్పించడంతో వారు వేలంలో పాల్గొనలేదు. దీంతో అచ్చంపేట మండలం చింతపల్లి (పడవ) రేవును రూ.2.20 లక్షలకు, గింజుపల్లి రేవును రూ.3.50 లక్షలకు, అమరావతి మండలం దిడుగు (పడవ) రేవును రూ.6 లక్షలకు పాట పాడిన గుత్తేదారుల పేరుతో ఖరారు చేశారు. మాదిపాడు బల్లకట్టు రేవుకు గుత్తేదారులు సీల్డ్ టెండర్లు వేయకుండా.. నేరుగా బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దాంతో ఈ రేవుకు వేలం ఖరారు చేయకుండా జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు వాయిదా వేసినట్లు సమాచారం. మాచవరం మండలం గోవిందాపురం బల్లకట్టు, కొల్లిపర మండలం వల్లభాపురం రేవుల వేలంలో గుత్తేదారులు పాల్గొనలేదు. వారంతా సిండికేటై చింతపల్లి, గింజుపల్లి, దిడుగు రేవులను తక్కువ ధరకే సొంతం చేసుకోవడంతో జడ్పీ ఆదాయానికి గండి పడింది. వేలంలో ధర పెంచకుండా ముందస్తుగా మాట్లాడుకుని అమలు చేశారు.

రేవులకు వేలం నిర్వహిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ

సుపరిపాలనే లక్ష్యం

మంగళగిరి,న్యూస్‌టుడే: ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి పదో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలకు కట్టుబడి తొలి ఏడాదిలో ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని ఆమె చెప్పారు.

విధివంచితురాలు.. వినలేరా వేడుకోలు

పిన్నుబోయిన తులశమ్మ

నగరం గ్రామానికి చెందిన పిన్నుబోయిన తులశమ్మ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. భర్త మూడేళ్ల క్రితం కాలం చేశాడు. కుమారుడు ప్రమాదానికి గురై పని చేయలేడు. కుటుంబం ఇలా అయిందన్న బెంగతో కోడలు మంచం పట్టింది. పింఛను తీసుకుంటున్న భర్త మృతితో తులశమ్మకు కష్టాలు తోడయ్యాయి. వితంతువైన ఆమెకు 75 ఏళ్లు. పింఛను అందుకోవడానికి ఇంతకన్నా అర్హత ఏముంటుంది. గత ప్రభుత్వంలోనూ పింఛను రాలేదు. ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. బంధువులు అప్పుడప్పుడు ఉదారంగా ఇస్తున్న బియ్యంతో గంజి కాసుకుంటున్నామని పేర్కొంది. భర్త పింఛను ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నా.. ప్రయోజనం లేదని.. అధికారులు పింఛను ఇప్పించాలని ఆమె వేడుకుంటోంది. **-నగరం, న్యూస్‌టుడే**

నిర్లక్ష్యం అల్లుకుంది.. నిర్మాణం పూర్తికానంటోంది

పనులు నిలిచి నిర్మాణాలకు అల్లుకున్న తీగలు

ఈ చిత్రంలో అసంపూర్తి ఉన్నవి పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్లు. పిట్టలవానిపాలెం- ఖాజీపాలెం ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరేళ్ల క్రితం సర్వశిక్ష అభియాన్ కింద మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు రాగా నిర్మాణం అసంపూర్తిగా అగిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఇక్కడే ఉన్నాయి. విద్యార్థులతో పాటు చిన్నారులు శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్డినే ఉపయోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో రాజారత్నం మాట్లాడుతూ మరుగుదొడ్ల పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. **-ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే**

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

అవగాహన + ప్రణాళిక = భవిత

కంప్యూటర్ సైన్సు ఒక్కటే కాదు.. మిగిలిన వాటికీ అవకాశాలు



చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

విద్యార్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి. కేవలం కంప్యూటర్ సైన్సులో మాత్రమే భవిష్యత్తు ఉందనుకోవడం సరికాదని నిపుణులు పేర్కొంటున్నారు. కోర్ బ్రాంచులు తీసుకున్నా మంచి భవిత ఉంటుందని, ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ అవకాశాలు వీటిల్లోనే ఎక్కువగా ఉంటున్నాయంటున్నారు. ఇతర రంగాల్లో స్థిరపడాలంటే అవగాహనతో ప్రణాళిక రూపొందించుకొని ముందుకెళితే ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఈఏపీసెట్ ఫలితాల ర్యాంకుల ఆధారంగా ఏయే బ్రాంచుల్లో తమకు సీట్లు వస్తాయో విద్యార్థులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చేశారు. త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈక్రమంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రస్తుతం కంప్యూటర్ సైన్సు వైపు మొగ్గు చూపుతున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు మాత్రం కౌన్సెలింగ్ వరకు వేచి చూడకుండా మేనేజ్‌మెంట్ సీట్లలో సీఎస్ఈ బ్రాంచి కోసం ఎగబడుతున్నారు. ఇది కాకపోతే దీనికి అనుబంధంగా ఉంటున్న ఏఐఎంఎల్, డేటా సైన్సు, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి వాటిల్లో ఏదో ఒకటి తీసుకోవడానికి ముందుకొస్తున్నారు. అధిక శాతం సీఎస్ఈకే ఆసక్తి చూపుతున్నారు. నిపుణులు మాత్రం ఆర్థికమాంద్య ప్రభావం, ఐటీ రంగంలో కొలువుల ఎంపిక తగ్గుదల నేపథ్యంలో కోర్ బ్రాంచులపై దృష్టి సారిస్తే మరింత ప్రయోజనంగా ఉంటుందని చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలుండగా వీటిల్లో సుమారు మూడు వేల సీట్లుపైగా ఉన్నాయి. ఇందులో సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ బ్రాంచుల్లో సీట్ల సంఖ్య దాదాపు 2200పైగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే వాటికున్న డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. మెకానికల్, ఈఈఈ, సివిల్ వంటి కోర్ బ్రాంచులకు చెందిన విద్యార్థులకు సైతం సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన నూతన జాతీయ విద్యా విధానంతో ఒకే సమయంలో(ఏక కాలంలో) మేజర్, మైనర్ కోర్సులు చేసుకునే వెసులుబాటు ప్రస్తుతం ఉంది. మెయిన్‌గా కోర్ కోర్సులు తీసుకున్నా మైనర్ కింద ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సు చేయడానికి అవకాశం ఉంది. ఈసీఈలో చేరితే సెమీకండక్టర్, చిప్ తయారీ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈఈఈ విద్యార్థులైతే ఈఎల్ఎస్ఐ, ఎంబెడ్ సిస్టం లాంటి కోర్సులు నేర్చుకోవడంతో మంచి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. సివిల్ ఇంజినీరింగ్ వారు సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవడానికి అవకాశం ఉందనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని వారు సూచిస్తున్నారు.

వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఓలేరుకు చెందిన గద్దె విజయ కుమార్ (22) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి రేపల్లెకు బయలుదేరాడు. 216 జాతీయ రహదారి సమీపంలో భట్టిప్రోలు వైపు నుంచి రేపల్లె వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడగా 108లో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివయ్య తెలిపారు.

ఉరేసుకుని మహిళా కూలీ బలవన్మరణం

అద్దంకి, న్యూస్‌టుడే: తిమ్మాయపాలెం ఇటుక బట్టీల్లో పనిచేసే మహిళా కూలీ బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం ముంద్రువారిపాలేనికి చెందిన డి.మరియకుమారి (33) భర్తతో విభేదించి తొమ్మిదేళ్ల నుంచి వినుకొండ మండలం పెదకంచర్లకు చెందిన కంచర్ల శ్రీనివాసరావుతో సహజీవనం చేస్తున్నారు. ఆమెకు ముగ్గురు సంతానం. పిల్లలను తీసుకొచ్చేందుకు శ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఇంట్లోని దూలానికి ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెను కిందకు దించి అద్దంకి ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నారు.

'నిందితుడైన జగన్.. ఫిర్యాదిని కలవడం నేరం'

మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పక్కన ఉపాధ్యక్షుడు మాణిక్యాలరావు, చందు సాంబశివరావు తదితరులు

అరండల్‌పేట, న్యూస్‌టుడే: 'వైకాపా అధినేత జగన్ కారు కింద పడి సింగయ్య మృతి చెందారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న జగన్.. మృతుడి భార్య, ఫిర్యాది లూర్దు మేరీని కలవడం నేరం'.. అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. అమరావతి రోడ్డులోని జనసేన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఫిర్యాదిని కలవడమంటే.. వారిని కేసు నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేయడమే. సింగయ్య మృతి చెందిన వెంటనే రూ.10 లక్షల పరిహారాన్ని వైకాపా నేతలు అందించడం చూస్తుంటే.. జగన్ నేరం ఒప్పుకున్నట్లే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో నిష్పక్షపాతంగా పాలన సాగిస్తుంటే.. వైకాపా కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ.. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూడడం దారుణం. సింగయ్యను జగన్ అనుచరులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లనందునే మృతి చెందారు. జగన్‌ను కలిసిన తర్వాత సింగయ్య భార్య లూర్దు మేరీ.. వ్యాఖ్యలు చూస్తుంటే కుట్ర కోణం ఉందనిపిస్తుంది. బాధితులను మాజీ సీఎం తన నివాసంలో కలవడం, అంబులెన్స్‌లపై దుష్ప్రచారం చేసేలా లూర్దు మేరీ వ్యాఖ్యలను సైతం నేరంగా భావించి వారిద్దరిపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం'. అని వెల్లడించారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు చందు సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు, కార్యదర్శి చట్టాల త్రినాథ్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, బిట్రగుంట మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యేదెప్పుడో?

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3 బదిలీల కౌన్సెలింగ్ గురువారం అర్ధరాత్రి కూడా కొనసాగుతూనే ఉంది. గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో కూడా కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ప్రతిరోజూ తెల్లవారుజాము వరకూ అధికారులు, సిబ్బంది పని చేస్తూనే ఉన్నారు. ఫిర్యాదులు పరంపర కొనసాగుతూనే ఉంది. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నవారికి ప్రాధాన్యం ఇవ్వలేదని కొందరు గురువారం డీఎంహెచ్‌వోను కలిసి ఫిర్యాదు చేశారు. మరికొంతమంది సీనియారిటీ ప్రకారం జరగడంలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బదిలీకి అర్హులైన వారు 900 మందికి పైగా ఉన్నారు. ఈ విషయం ముందుగానే తెలుసు. పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి కొంతమంది అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై పిలిపించుకుని వారి సహాయం కూడా తీసుకుని ఉంటే బదిలీల ప్రక్రియ కొంతవరకైనా సులభంగా జరిగి ఉండేదని పలువురు తెలుపుతున్నారు. కేవలం డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందిపైనే ఆధారపడినందు వల్లే వాళ్లు రాత్రింబవళ్లు పనిచేయాల్సి వస్తోంది. దీనివల్లే మానవ తప్పిదాలు ఎక్కువగా వచ్చి బదిలీలపై ప్రతిరోజూ ఫిర్యాదులు వస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 100, రిటైల్ ధర - 122, చికెన్ విత్‌స్కిన్ - 177, చికెన్ స్కిన్‌లెస్ - 201.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95 రిటైల్ ధర 117 చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

భూ సమీకరణపై నేడు గ్రామసభలు

తాడికొండ,న్యూస్‌టుడే: భూ సమీకరణపై శుక్రవారం తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి గ్రామాల్లో సభలు జరగనున్నాయి. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలు స్వీకరిస్తారు. భూ సమీకరణపై అవగాహన కల్పించనున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G-3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

TO LET

COMMERCIAL

గుంటూరు, అశోక్‌నగర్, 1వ లైను, టిడిపి ఆఫీస్ దగ్గర, డా|| కళ్యాణ్ బిల్డింగ్ నందు 2వ ఫ్లోర్‌లో 1600 S.Ft. బిల్డింగ్ కమర్షియల్ పర్పస్‌కు అద్దెకు కలదు. ✆: 98854 99979, 94926 01716 & 96525 56678.

JOBS

Wanted Experienced Accountant to work on Tally ERP for an interior industry in Narasaraopet, Work timings from 9AM to 6.30 PM. 83310 29045.

Wanted Telecallers Male/ Female to work in auto nagar, Guntur. from 9.30 AM to 6.30 PM @ 13,500 PM Contact 83310 29045.

Wanted Part Time Lady Graduate Teachers, Time: 1.00 P.M. to 8.00 P.M. & For Study Hours: 4.00 P.M. to 8.00 P.M. Sri Satya Sai Ideal School, Chowtra, Guntur-3. ✆: 0863-2222114, 2241837.

గుంటూరు, లక్ష్మీపురంలోని ఫ్లవర్ స్టోర్ నందు పనిచేయుటకు ఫుల్‌టైమ్ & పార్ట్ టైమ్ డెలివరీ బాయ్స్ కావలెను. 2 వీలర్ తప్పనిసరి. లోకల్స్ వారికి ప్రాధాన్యత. ✆: 63090 65666.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. ఫో+వ +మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

అమరావతి ఇండస్ట్రియల్ స్పేర్స్ పేరేచర్ల ఆఫీస్ నందు పనిచేయుటకు కంప్యూటర్‌లో అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ మరియు సూపర్వైజర్ కావలెను. కాంటాక్ట్: 98123 34678.

కంప్యూటర్ డిజైనర్, ఐపీ కోఆర్డినేటర్, నర్సింగ్ స్టాఫ్, హెల్పర్స్, ల్యాబ్ టెక్నీషియన్ (నైట్ డ్యూటీ) కావలెను. ✆: 77999 77855.

MARKETING/ SALES

Wanted – Public Relations Officer (PRO) for Dental Clinic in Guntur. (M/F). Role: Patient interaction, community outreach, event coordination, and clinic promotion. Contact: 9440303206.

FACULTY/ TEACHERS

Naveena High School, Guntur require qualified Teachers for Maths & Science, English & Social Combinations and Lady P.E.T. 93923 58368.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

సమస్యల పరిష్కారానికి 8న ధర్నాలు

చెరుకుపల్లి న్యూస్‌టుడే : చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 8న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. గురువారం ఆయన చెరుకుపల్లిలో మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 56 కులవృత్తుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయకుండా మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సామాజిక భద్రత చట్టాన్ని తీసుకొచ్చి వృత్తిదారులకు రక్షణ కల్పించాలని, కార్పొరేషన్ల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరుతూ నిర్వహిస్తున్న ధర్నాలో పెద్దసంఖ్యలో చేతి వృత్తిదారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

లాభాల బాటలో నడిచేలా కృషి చేయాలి

సూచనలిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే : రేపల్లె డిపో లాభాల బాటలో పయనించేలా అందరూ కృషి చేయాలని బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం సూచించారు. ఇటీవల నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆమె గురువారం రేపల్లె ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల విశ్రాంతి గదులు, తాగునీటి సదుపాయంతో పాటు అన్ని విభాగాలను పరిశీలించి సూచనలిచ్చారు. డిపో మేనేజరు సుఖవాసి సునీల్‌కుమార్ ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? రేపల్లె మండలం పేటేరు గౌడపాలెం వాకావారి వీధిలో కచ్చాకాలువల సదుపాయం లేక వర్షంనీరు రోడ్డుపై నిలుస్తోంది. - **వెంకటేశ్వర్లు** ✔ వెంటనే కచ్చా కాలువలు తీయించి.. రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. -**దాసరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పేటేరు** – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

? నగరం సినిమాహాలు రహదారిలో మురుగు కాలువ లేక ఇబ్బంది పడుతున్నాం. ఇళ్లల్లో వాడిన వృథా నీళ్లు రోడ్డుపైనే నిలుస్తున్నాయి. -**వెంకటేశ్వరరావు** ✔ చెరుకుపల్లి రహదారి నుంచి పాత తపాలా కార్యాలయం వరకు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశాం. త్వరలో కాలువ నిర్మిస్తాం.- **రామకృష్ణ, సర్పంచి, నగరం** – న్యూస్‌టుడే, నగరం

? చెరుకుపల్లి ఎస్టీకాలనీ చివర రోడ్డు పక్కనే తాగునీటి కొళాయి మూత లేక నీరు వృథాగా పోతోంది. -**శ్రీనివాసరావు, ఆరుంబాక**

✔ సిబ్బందిని పంపి నీటి వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. -**ఈవూరి విజయబాబు, పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి** – న్యూస్‌టుడే, చెరుకుపల్లి గ్రామీణ

నాలుగు వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

రేపల్లె అర్బన్: రేపల్లె 25వ వార్డు రామకోటిపేట రామాలయం రోడ్డులో రాత్రివేళ విద్యుత్తు దీపాలు వెలగక జనం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత నెల 30న మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. దీనికి స్పందించిన పురపాలక సంఘ ఏఈ శామ్యూల్ సిబ్బందిని పంపి నాలుగు కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

తెదేపా మండల నూతన కార్యవర్గం ఎంపిక

వేమూరు: తెదేపా మండల నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ఆనందబాబు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కుచ్చెళ్లపాడు సర్పంచి గాజుల వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షురాలిగా పి.మేరీవర్ధిని, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల రవిప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బోగి అంకమరావు, గోపాలం సుబ్బారావు, పి.కమలాకరరావు, కార్యదర్శులుగా దాసరి వెంకటేశ్వరరావు, షేక్ షరీఫ్, జి.రాజు, కోశాధికారిగా కోగంటి సుధీర్, క్లస్టర్ ఇన్‌చార్జులుగా షేక్ మహ్మద్ హనీఫ్, దాది లక్ష్మణరావును ఎంపిక చేశారు.

తాగునీటి పరీక్షలు తప్పనిసరి

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : గ్రామాల్లో తప్పనిసరిగా తాగునీటి పరీక్షలు చేయించాలని ఎంపీడీవో ఎలీషాబాబు సూచించారు. ఖాజీపాలెం, పిట్టువారిపాలెంలోని సంపద కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికానికి అనువు ఆషాఢమాసం

భట్టిప్రోలు: ఆషాఢమాసం ఆధ్యాత్మికంగా మంచిదని జిల్లా దేవాలయ ప్రముఖ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. అద్దేపల్లి రామాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. 10న వ్యాస పౌర్ణమి సందర్భంగా గురువులను స్మరించుకుంటూ బాలికల కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 5 నుంచి 10 వరకు ధార్మిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పొంతే పన్ సభ్యులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు.. ఆపై ప్రయాణం చిరాకు

✦ భట్టిప్రోలులో ట్రాఫిక్ సమస్య ✦ ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగిస్తే మేలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే

ఎదురుగా వాహనం వస్తే తప్పుకోలేని పరిస్థితి. రెండు భారీ వాహనాలు ఎదురైతే ఆ మార్గంలో ట్రాఫిక్ స్తంభించాల్సిందే. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో గ్రామస్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ.. మండల కేంద్రమైన భట్టిప్రోలులో పరిస్థితి. 40 ఏళ్లుగా ఉన్న రహదారులే నేటికీ శరణ్యమయ్యాయి. ప్రస్తుతం గ్రామంలో 20 వేల జనాభా ఉండటంతో వాహనాలు పెరిగాయి. సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల్లోని వారు వస్తుంటారు. దీనికి తోడు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు గ్రామంలోకి వస్తుండటంతో సమస్య మరింత జటిలమవుతోంది. ఎన్నో ఏళ్లుగా రహదారి విస్తరణకు నోచుకుంటుందని ఆశపడిన గ్రామస్థులకు నిరాశే మిగులుతోంది. గత

మార్కెట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారి ఆక్రమణలు తొలగించేందుకు మూడేళ్ల క్రితం అధికారులు సర్వే చేశారు. స్థానిక రైల్వేగేటు వద్ద నుంచి అద్దేపల్లి వరకు ఆక్రమణలు గుర్తించారు. ఇప్పటి వరకు వాటిని తొలగించక ప్రజలు ట్రాఫిక్ వలయంలో సతమతమవుతున్నారు.

✶ గ్రామంలో భారీ వాహనాలు వస్తే వాటి వెనుకే ప్రయాణించాల్సిన పరిస్థితి. రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారైతే ముందుగానే బయల్దేరాల్సి వస్తోంది. ఇటీవల గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలకు తోడు చెరుకుపల్లి, చీరాల, తెనాలి, పొన్నూరు ప్రాంతాలకు చెందిన ప్రైవేటు కళాశాలల బస్సులు రావడంతో ట్రాఫిక్ ఎక్కువవుతోంది. ముఖ్యంగా స్థానిక చావలి, మార్కెట్టు, రథం, పాత ఆంధ్రా బ్యాంకు కూడళ్లలో సమస్య తీవ్రంగా ఉంటోంది.

సర్వేకే పరిమితమా

ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు నాలుగు రోజులు గ్రామంలో హడావుడి చేసి సర్వే చేశారు. సర్వేను అప్పటి కలెక్టర్ చేయించటంతో ఆక్రమణలు తొలగిస్తారనే నమ్మకం ప్రజలకు కలిగింది. ముఖ్యంగా చావలి కూడలిలో బస్సు మలుపు తిరగలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఆక్రమణలు తొలగించి.. రహదారి విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

వేమూరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణదారులు మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీకే విక్రయించాలని ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు తెలిపారు. వేమూరు ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. మద్యం అక్రమ విక్రయాలపై నమోదైన కేసుల వివరాలను సీఐ రవిని అడిగి తెలుసుకున్నారు.

ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేత

రేపల్లె అర్బన్: రేపల్లె తెదేపా కార్యాలయంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 15 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు, 10 మందికి వినికిడి యంత్రాలు అందజేశారు. నాయకులు శివప్రసాద్, జీవీ నాగేశ్వరరావు, శ్రీధర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలుపుదల

చుండూరు : మండల పరిధిలోని చినపరిమి విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు, ఆరెమండపేట, చినపరిమి గ్రామాలకు సరఫరా ఆపుతున్నట్లు ఏఈ అర్జునరావు తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే... పంట మునుగుతుంది

కొల్లూరు ఛానల్ ద్వారా కొల్లూరు, వేమూరు మండలాల్లోని పంటలకు సాగునీరు అందుతుంది. అయితే ఎగువ భాగంలో సక్రమంగా సాగు నీరు అందించడానికి, దిగువన వృథాగా నీరు పోకుండా చేయడానికి ఛానల్‌పై వద్ద లాకులు ఉన్నాయి. వాటిని నిర్మించి నాలుగు దశాబ్దాలు దాటగా గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. అలానే వదిలేస్తే రెగ్యులేటర్ కూలే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ రవికుమార్‌ను అడుగగా దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని చెప్పారు. **- వేమూరు, న్యూస్‌టుడే**

ఈ రోడ్డుపై చూసుకుని వెళ్లాల్సిందే

తురకపాలెం-వేజెళ్లవారిలంక వెళ్లే మార్గం ఇలా..

రేపల్లె మండలం తురకపాలెం నుంచి వేజెళ్లవారిలంక మీదుగా కారుమూరు వెళ్లే అనుసంధాన రోడ్డు మధ్యలో కొంత భాగం పగిలి ప్రమాదకరంగా మారింది. రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతామోనని భయపడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

కండవాయి... ధర అధికమేనోయ్

చేపల రకాల్లో అనేకం ఉన్నాయి. వాటిలో కండవాయి రకం చేప ఒకటి. వీటిలో ముల్లు ఉండదు. మొత్తం కండ ఉంటుంది. స్థానికంగా కంటే ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఈ రకం చేపలకు గిరాకీ ఉంది. చేపల వేటకు వెళ్లిన బోట్లకు ఇవి ఎక్కువగా పడుతున్నాయి. వాటి ధర కిలో రూ.450 వరకు పలుకుతోంది. ఇవి కేరళ ప్రాంతానికి ఎగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి విదేశాలకు తరలిస్తున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. రోజుకు సగటున హార్బర్ నుంచి టన్నుపైన తరలిస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిజాంపట్నం**

విజన్- 2047 అమలుతో ప్రగతి పయనం

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే : స్వర్ణ ఆంధ్ర- విజన్ 2047 అమలుతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో గురువారం స్వర్ణాంధ్ర విజన్- 2047 రేపల్లె నియోజకవర్గ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో విజన్ 2020 ఆశయం చేసి చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు. రేపల్లె ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయిస్తానని, నియోజకవర్గంలో పర్యాటకం వృద్ధి చేయించి, 100 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళిక, చేరాల్సిన లక్ష్యాల గురించి ఆర్డీవో రామలక్ష్మి వివరించారు. పురపాలక సంఘ ఛైర్మన్ కట్టా మంగ, తహసీల్దార్లు శ్రీనివాసరావు, పద్మావతి, కమిషనర్ సాంబశివరావు, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, వైద్యుడు వెంకటసుబ్బారావు అధికారులు నాంచారయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ధ్యేయమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రూ.35 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ తదితర పనులకు అనగాని శంకుస్థాపన చేశారు.

ప్రజా సేవకులుగా పనిచేయాలి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొమ్మిడి రామకృష్ణ

బాపట్ల, న్యూస్‌టుడే : వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రజా సేవకులుగా పని చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని 13, 14 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెదేపా కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సాధించిన విజయాలు, ప్రజలకు చేసిన లబ్ధిని వివరించారు. సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు. 13వ వార్డు సచివాలయ అడ్మిన్ చంద్రమోహన్‌పై స్థానికులు ఫిర్యాదు చేయటంతో ఆయన్ను పిలిపించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి.. సేవలు అందించాలని ఆదేశించారు. తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, పార్టీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి విన్నకోట ఆనంద్, నేతలు ఆంద్రేయ, శ్రీనివాసకుమార్, నాగేశ్వరరావు, శ్యామ్‌సుందర్, సరోజని, కోటేశ్వరరావు, గిరిజారాణి పాల్గొన్నారు.

నిజాంపట్నం : రాష్ట్రం అభివృద్ధితో పాటు పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర మత్స్యకార బోర్డు డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ పేర్కొన్నారు. పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నిజాంపట్నం పంచాయతీలోని 18 వార్డుల్లో ఆయన ఇంటింటా పర్యటించారు.

వేమూరు : వైకాపా పాలనలో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఎమ్మెల్యే ఆనందబాబు ఆరోపించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం వేమూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజలను ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి

వృద్ధుడికి సుపరిపాలన కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చంద్రబాబు ఇచ్చిన హామీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే పథకం త్వరలో అమల్లోకి వస్తుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, వేమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు జి.పూర్ణకుమారి, విజయబాబు, డీసీ ఛైర్మన్ దండే సుబ్బారావు, తెదేపా నాయకుడు షేక్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నగరం, నిజాంపట్నం : ప్రజలు కోరుకున్న సుపరిపాలన అందివ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సజ్జావారిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి పంచాయతీలో ప్రజలకు ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పథకాలు వివరించారు.

చరిత్ర ఆనవాళ్లకు చెద

న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

మండల కేంద్రం పిట్టలవానిపాలెంలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న జల వనరుల శాఖ అతిథి గృహం కీకారణ్యాన్ని తలపిస్తోంది. తెల్లదొరల హయాంలో సుమారు ఐదు ఎకరాల్లో నిర్మించిన ఈ అతిథి గృహం అప్పటి బ్రిటీష్ పాలకుల దర్పానికి చిహ్నంగా రూపొందింది. గతంలో సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు ఈ బంగ్లాకు వచ్చారు. ప్రస్తుతం అధికారుల నివాసాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో నివాసం ఉండటం లేదు. దీంతో అతిథి గృహానికి గ్రహణం పట్టింది. రూ.80 వేల వరకు విద్యుత్తు బిల్లు బకాయి ఉంది. పంచాయతీకి రూ.20 వేల వరకు పన్నులు చెల్లించాల్సి ఉంది. చాలాకాలం నుంచి ఆవరణ శుభ్రం చేయడం లేదు.

శిథిలావస్థలో అతిథి గృహం

ప్రతిపాదనలు పంపాం

అతిథి గృహం అభివృద్ధి విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. గదుల మరమ్మతులు తదితర పనులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఏసీ గది, ఇతర గదులన్నీ బాగు చేయించడం, శుభ్రత పనులు చేపట్టనున్నాం.

-విజయ్‌బాబు, ఏఈ జల వనరుల శాఖ

బండ్లమ్మకు సారె తీసుకువచ్చిన వెంకటశివన్నారాయణ దంపతులు, మహిళలు

బండ్లమ్మకు సారె సమర్పణ

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ ఆలయంలో ఆషాఢమాసం వారాహీ నవరాత్రి మహోత్సవాల ఎనిమిదో రోజు బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ సతీసమేతంగా పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. బాపట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక హోమం చేశారు.

అవీ ఇవీ

...లంలో సేవలందించాలని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. గురువారం కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గోవాడ, ఇంటూరులో నీటి తీరువా రూ.30 లక్షల చొప్పున బకాయి ఉందని చెప్పారు. రైతులతో మాట్లాడి కౌలు రైతుల కార్డులను పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టండి

చెరుకుపల్లి న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా చేయకుండా నిఘా ఉంచి సమాచారం ఉన్నతాధికారులకు తెలపాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి వీఆర్వోలను, వీఏఏలను ఆదేశించారు. గురువారం ఆమె మండల రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న చెరువులు, పొలాల నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సుందరమ్మ దంపతులను సత్కరిస్తున్న ఆర్డీవో గ్లోరియా

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

కర్లపాలెం, న్యూస్‌టుడే : తహసీల్దారుగా సేవలందించిన సుందరమ్మ తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని బాపట్ల ఆర్డీవో గ్లోరియా పేర్కొన్నారు. కర్లపాలెం తహసీల్దారుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆమెను స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఆమె తెలిపారు. కర్లపాలెం, బాపట్ల, పిట్టలవానిపాలెం తహసీల్దార్లు పాషా, సలీమా, వెంకటేశ్వరరావు, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, డీటీ శ్రీదేవి పాల్గొన్నారు.

వేగంగా కనగాల వంతెన పనులు

కాంక్రీట్ పనులు

మండలంలోని కనగాల వద్ద ధూళిపూడి మార్గంలో వెల్లటూరు ఛానెల్‌పై నూతన వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇక్కడ పాత వంతెనకు ఒక పక్క రక్షణ గోడ లేదు. పైగా మలుపులతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన అధికారులు కొత్త వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు. దీంతో పనులు మొదలుపెట్టి వేగంగా చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వలో కాంక్రీట్ బెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. రెండు రోజుల్లో ఇవి పూర్తవుతాయని, తర్వాత కాల్వకు నీళ్లు వచ్చినా, వర్షాలు పడినా ఇబ్బందులు ఉండవని ఏఈ విద్యాసాగర్ తెలిపారు. గురువారం ఆయన కాల్వ వద్ద పనులను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, కనగాల (చెరుకుపల్లి గ్రామీణ)

కూలీలకు ఉపాధి కల్పన

ఈనాడు కథనానికి స్పందన

పనులు చేస్తున్న కూలీలు

బాపట్ల, న్యూస్‌టుడే : కర్లపాలెం మండలం పేరలిలో భూషయ్య మురుగు కాల్వ అధ్వానంగా ఉంది. గ్రామాల్లో వెయ్యి మందికి పైగా కూలీలు ఉన్నారు. కాల్వలో పూడికతీత పనులు చేపడితే కూలీలకు ఉపాధి లభిస్తుందని 'ఈనాడు'లో గత నెల 10న ప్రచురితమైన కథనానికి డ్వామా పీడీ విజయలక్ష్మి స్పందించారు. కాల్వలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పనులు కూలీలతో చేయించాలని ఆదేశించారు. 150 మంది కూలీలకు ఉపాధి కల్పించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : వేగేశన

బాపట్ల, న్యూస్‌టుడే : అందరి సహకారంతో బాపట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విజన్ కార్యాచరణ ప్రణాళిక కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంపద సృష్టి చేసి.. పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు మార్గ నిర్దేశనంలో పని చేస్తామన్నారు. స్వర్ణాంధ్ర- 2047, వికసిత్ భారత్ ద్వారా రాష్ట్ర బడ్జెట్ రూ.నాలుగు లక్షల కోట్లకు పెరుగుతుందని, ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదుగుతుందన్నారు. పీఎం సూర్యఘర్ కింద ప్రతి ఇంటికి సౌరశక్తి పలకలు అమర్చుతామని, సౌరశక్తిని విద్యుత్తు శక్తిగా మారిస్తే.. ప్రజలపై విద్యుత్తు బిల్లుల భారం ఉండదన్నారు. లబ్ధిదారులకు మూడు కిలోవాట్ల యూనిట్ ఏర్పాటునకు బ్యాంకు రుణాలు ఆరు శాతం వడ్డీకి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలో ఆదా అయ్యే బిల్లుల ద్వారా బ్యాంకు రుణం తీర్చవచ్చన్నారు. సూర్యలంక తీరం బాపట్లకు గొప్ప వరమని, రూ.97.52 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు రెండు నెలల్లో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, తహశీల్దారు సలీమా, పురపాలక కమిషనర్ రఘునాథరరెడ్డి, ఎంపీడీవో బాబూరావు పాల్గొన్నారు.

ఐలవరంలో బడి వీడిన విద్యార్థులపై సర్వే

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : మండలంలోని ఐలవరంలో ఎంఈవో నీలం దేవరాజ్, ఉపాధ్యాయులు కలిసి గురువారం బడి వీడిన విద్యార్థులపై సర్వే చేశారు. గ్రామంలో నలుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. చిన్నారులతో పనులు చేయించవద్దని, తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించి చదివించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహనరావు, సీఆర్‌సీలు కె.సలోమి, కృష్ణారావు, రాజ్యలక్ష్మి, డి.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపల్లెలో వరి గడ్డివాము దగ్ధం

రేపల్లె అర్బన్ : రేపల్లె పదో వార్డులో గురువారం గరికపాటి రమణయ్యకు చెందిన అయిదెకరాల గడ్డివాము దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. విద్యుత్తు స్తంభం పక్కన గడ్డివామి ఏర్పాటు చేయగా తీగలు రాసుకుని రవ్వలు పడి ప్రమాదం జరిగిందని సిబ్బంది చెబుతున్నారు. రూ.75 వేలు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక కేంద్ర అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు.

రైతులకు సకాలంలో సేవలందించండి

అమృతలూరు : ప్రజలు, రైతులు వారి సమస్యల పరిష్కారానికి మీవద్దకు వచ్చిన సమయంలో వారితో మమేకమై మాట్లాడుతూ సకా...

నిరసనలో ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

హామీలు అమలు చేయరా?

రేపల్లె అర్బన్: రేపల్లె పురపాలక సంఘ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. గతేడాది ఇంజినీరింగ్ కార్మికుల 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనం పెంచాలని 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. 4న చలో విజయవాడ కార్యక్రమానికి తరలి రావాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పిలుపుఇచ్చారు. ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ప్రభాకరరావు, రవి, రాఘవేంద్రరావు, శ్రీను, గీత, అనూష పాల్గొన్నారు.

నగరం పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లు

నగరం : పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రం నగరంలో కొత్తగా పనిలో చేరిన పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ఆయన రక్షణ కిట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. అంతర్గత రహదారులు, గృహ పరిసరాల్లో చెత్త, మురుగు లేకుండా పారిశుద్ధ్య కార్మికులు చూడాలని తెలిపారు. సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంతో సచివాలయ సిబ్బంది పని చేయాలని, చెత్తను సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని పారిశుద్ధ్య కార్మికులకు ఆయన సూచించారు.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? రావూరి రోడ్డు నుంచి ప్రసాదుపేట చర్చి వరకు ఉన్న డివైడర్‌లోని స్తంభాలకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు వెలగడం లేదు. **-సుబ్బారావు, స్థానికుడు**

✔ రెండు రోజుల్లో అవసరమైన చోట కొత్త వాటిని ఏర్పాటు చేయిస్తాం **-టి.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, దేశాయిపేట** –న్యూస్‌టుడే, దేశాయిపేట, (వేటపాలెం)

? పెదగంజాం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం నుంచి సముద్రం వైపు రోడ్డులోని వీధి దీపాలు వెలగడం లేదు. **-శ్రీనివాసరావు, స్థానికుడు, పల్లెపాలెం**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. **-కె.కృపారావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, పెదగంజాం** – న్యూస్‌టుడే చినగంజాం

ఏపీఎం బాధ్యతల స్వీకరణ

జె.పంగులూరు న్యూస్‌టుడే: పంగులూరు ఏపీఎం సి.హెచ్.కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి ఏపీఎంగా పనిచేస్తూ బదిలీపై పంగులూరు వచ్చారు. పంగులూరులో పనిచేస్తున్న జ్యోతి ప్రసాద్ అద్దంకి బదిలీపై వెళ్లారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు బలోపేతం చేసేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామని తెలిపారు.

సూర్యఘర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అద్దంకి, న్యూస్‌టుడే : పీఎం సూర్యఘర్ పథకానికి లబ్ధిదారుల్ని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. మండల వెలుగు కార్యాలయం వద్ద గురువారం ఉదయం వెలుగు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇది పూర్తిగా ఉచితం అని, బీసీ, ఓసీలకు మాత్రమే నిర్దేశించిన ధర చెల్లించాలన్నారు. రూ.2.10 లక్షల యూనిట్ విలువ కాగా లబ్ధిదారుడి వాటా రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన సొమ్ము బ్యాంకు రుణంగా ఇస్తారన్నారు. రూ.74 వేల వరకు రాయితీ లభిస్తుందన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి మూడు కిలోవాట్స్ తగ్గకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీని వల్ల భవిష్యత్తులో కరెంటు సమస్య తీరుతుందన్నారు. స్త్రీనిధి డీపీఎం ధర్మేంద్ర, సీసీలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

నాడు బురదగా.. నేడు దివ్యంగా

ఈనాడు కథనానికి స్పందన

స్థానిక గ్రానైట్ క్వారీల వద్ద రహదారి చిన్నపాటి వర్షం కురిస్తే చాలు అధ్వానంగా మారి, ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనాడులో గత నెల 20న 'ప్రయాణం.. ప్రాణసంకటం' అనే శీర్షికన ఫొటో కథనం ప్రచురితమవ్వగా స్పందించిన అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేశారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, బల్లికురవ

గడ్డుకాలం నుంచి.. గంపెడు ఆశల వైపు

కూటమి రాకతో మారిన గుండ్లకమ్మ ప్రాజెక్టు దశ

అద్దంకి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుండ్లకమ్మ జలాశయానికి మంచి రోజులు వచ్చాయి. ప్రాజెక్టు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు కనీసం ప్రాజెక్టు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఫలితంగా రెండేళ్ల క్రితం గేట్లు కొట్టుకుపోయి నీరు, పడవలు, వలలు, సముద్రం పాలవగా దీనిపై ఆధారపడిన ప్రజల జీవనం కష్టంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత మొత్తం 15 గేట్లకు మరమ్మతులు పూర్తి చేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. దీంతో ఒంగోలు పట్టణానికి మంచినీరు, ఆయకట్టు భూములకు సాగునీరు, భూగర్భ జలాలు అభివృద్ధి, రెండు వేలమంది జాలర్లకు జీవనం మెరుగుపడింది. ఈ ప్రాజెక్టు 2003లో రూ.172 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం ప్రారంభించారు.

జలాశయం వద్ద నీరు

2009లో ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.500 కోట్లకు చేరింది.

ప్రజాప్రతినిధుల ప్రత్యేక దృష్టి

గుండ్లకమ్మ జలాశయంపై కూటమి నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షనేతగా ఉన్నసమయంలో జలాశయాన్ని సందర్శించారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బీఎన్ విజయ్‌కుమార్ అనేక పర్యాయాలు పర్యటించారు. ప్రస్తుతం జలాశయంలో 23.05 మీటర్ల ఎత్తులో 2.61 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 28 లక్షల చేపపిల్లల్ని ఇందులో వదిలారు. వీటిని పట్టుకుంటూ జాలర్లు జీవన ప్రమాణాలు పెంచుకుంటున్నారు. పర్యాటక శాఖ ద్వారా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పారు. ఈ విషయమై జలాశయం డీఈ శివనాగరాజు మాట్లాడుతూ రెండు గేట్లు కొట్టుకుపోవడంతో రెండేళ్ల నుంచి జలాశయంలో నీరు నిల్వ తగినంత లేకుండా పోయాయి. ప్రభుత్వ నిర్ణయంతో తిరిగి గేట్లు ఏర్పడ్డాయి. నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. చేప పిల్లల్ని వదిలారు. గత ఖరీఫ్‌లో పంటలకు సాగునీరు అందించాం. ఈ ఏడాది సాగుకు నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత!

వేటపాలెం, న్యూస్‌టుడే

మొదటి ప్లాట్‌ఫాంపై అసంపూర్తి పనులతో మొలిచిన పిచ్చిమొక్కలు

వేటపాలెం రైల్వే స్టేషన్‌లో సమస్యలు వెంటాడుతున్నాయి. విజయవాడ-గుడూరు మధ్య మూడో రైల్వే పట్టాల నిర్మాణ సమయంలో రూ.కోట్లతో స్టేషను భవనంతో పాటు ప్లాట్‌ఫాంలను ఆధునికీకరించారు. అయినా ఇంకా పనులు అసంపూర్తిగానే ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి. మొదటి ప్లాట్‌ఫాం ఉత్తరం, దక్షిణం వైపు కాంక్రీట్ పనులు నిలిచిపోవడంతో వాటిపై పిచ్చిమొక్కలు పెరిగాయి. కొత్తగా వేసిన షెడ్లలో ప్రయాణికులు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయకపోవడంతో రైలు వచ్చే వరకు నిలువ కాళ్లమీద నిల్చోవాల్సిన పరిస్థితి. కాలినడక వంతెన దూరంగా ఉండడంతో అది నిరుపయోగంగానే ఉంది. దానిని బుకింగ్ కార్యాలయం పక్కకు మార్చాలనే వినతిని ఆశాఖాధికారులు పట్టించుకోవడంలేదు. వెయిటింగ్ హాలు ఉన్నా అది శాఖపరమైన వాటి కిందనే వినియోగించుకుంటున్నారు. అంతేకాక విజయవాడ నుంచి వచ్చే అన్ని రైళ్లు రెండో నంబరు ప్లాట్‌ఫాం మీదకు వస్తున్నాయి. వాటిని ఒకటో నంబరుకి తీసుకువస్తే రైలు ఎక్కేవారికి, దిగే వారికి సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

8న మంత్రుల రాక

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి ఆర్టీసీ డిపోనకు ఈనెల 8న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి వస్తున్నారని డిపో మేనేజరు బెల్లం రామ్మోహనరావు తెలిపారు. నూతనంగా రెండు సూపర్ లగ్జరీ, మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు వారు ప్రారంభిస్తారన్నారు. సూపర్ లగ్జరీ బస్సులు హైదరాబాద్‌కు, ఎక్స్‌ప్రెస్ బస్సులు శ్రీశైలానికి నడుపుతామన్నారు. దీంతో పాటు అద్దంకి ఆర్టీసీ బస్‌స్టేషన్, డిపో అభివృద్ధికి తగు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఈ విషయమై బుధవారం జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం పరిశీలించి వెళ్లినట్లు డిపో మేనేజరు తెలిపారు.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జె.పంగులూరు, న్యూస్‌టుడే : పంగులూరులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు శింగారావు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బేళ్లు కట్టేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రైతులకు సూచించారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. జనకవరం వ్యవసాయ పరపతి సంఘం సీఈవో రావూరి లక్ష్మిని అడిగి కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు.

పాఠశాల సందర్శన

మార్టూరు, న్యూస్‌టుడే : మార్టూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఏపీ వినియోగదారుల హక్కుల ఫోరం ప్రొడక్షన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.దీపిక, స్థానిక ఫోరం నాయకుడు కరీముల్లా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జంతుశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న బొల్లాపల్లి ఆశోక్‌కుమార్‌కు నింపాపుర విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించింది. 'బయో డైవర్సిటీ అండ్ కన్జర్వేషన్ ఆఫ్ మాంగ్రోవ్ ఫునా ఎట్ చిప్పలేరు ఇస్తురై' అంశానికి డాక్టరేట్ ప్రకటించారు. ఆమేరకు గురువారం డిగ్రీ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రధానాచార్యులు డాక్టర్ వి.మోహనరావు ద్వారా డాక్టరేట్ అందుకున్నారు.

పేదరికంలేని చీరాలకు సహకారం అవసరం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, కమిషనరు అబ్దుల్ రషీద్

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పేదరికం లేని చీరాలగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. దీనికోసం అధికారులు ముందుగా బంగారు కుటుంబాలను గుర్తించాలని, ఇదే సమయంలో మార్గదర్శులను సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపల్ సమావేశం హాలులో గురువారం పీ4, స్వర్ణాంధ్ర-2047పై జరిగిన కార్యక్రమానికి ఆయన ఛైర్మన్ హోదాలో వచ్చి మాట్లాడారు. ఈ సందర్భంగా బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకొచ్చిన ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు రూ.10వేలు సాయాన్ని కడియం సాయి అనే దివ్యాంగ విద్యార్థికి ఎమ్మెల్యేతో అందజేయించారు. మున్సిపల్ కమిషనరు అబ్దుల్ రషీద్, పంగులూరు ఎంపీడీవో స్వరూపారాణి, చీరాలకు చెందిన చుండూరి రాజేష్, వెంకన్నబాబు బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు తమవంతు సహాయం అందించడానికి ముందుకువచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గం జీడీపీ వృద్ధి రేటు 15శాతం కాగా, వ్యవసాయం, పరిశ్రమల కంటే టూరిజం వృద్ధిరేటు ఆశాజనకంగా ఉందన్నారు. 2029 నాటికి వృద్ధి రేటు మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. తహసీల్దారు గోపికృష్ణ, ఎంపీడీవో శివనారాయణ, మున్సిపల్ డీఈ రఘురాం పలుశాఖాధికారులు పాల్గొన్నారు.

అవినీతి రహిత అభివృద్ధే ధ్యేయం

చీరాల : వైకాపా పాలనలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలిందని కూటమి ఏడాది పాలనలో అవినీతి రహిత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ఎంఎంకొండయ్య పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం రామకృష్ణాపురంలో ఎమ్మెల్యే, నాయకులు పర్యటించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆప్కో ఛైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్ధన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడు ముత్తు సైకిల్‌యాత్ర

చినగంజాం, ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఆక్సిజన్ ఆవశ్యకతను వివరిస్తూ సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తూ చెట్లు పెంచేలా తన వంతు ప్రయత్నంలో భాగంగా 'ర్యాలీ ఫర్ ఆక్సిజన్' చేపట్టినట్లు తమిళనాడుకు చెందిన 28 ఏళ్ల యువకుడు ముత్తుసెల్వన్ తెలిపారు. ఆయ్యన ర్యాలీ గురువారం చినగంజాం, ఇంకొల్లు మండలాలకు చేరింది. చినగంజాం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జె.ప్రభాకరరావుతో కలిసి ఆవరణలో మొక్క నాటారు. ముత్తుసెల్వన్ మాట్లాడుతూ... తమిళనాడులోని కొయ్యంబత్తూరుకు చెందిన తాను ఎంబీఏ చదివి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేశానని, కొవిడ్ రెండో విడత సమయంలో తమిళనాడుతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కూడా ఆక్సిజన్‌కు ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. జనాభాకు తగినంత స్థాయిలో చెట్లు లేనందునే ఆక్సిజన్ కొరత వచ్చిందని భావించి చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి సైకిల్ యాత్ర చేస్తూ తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాలను పర్యటించి అవగాహన కల్పించానన్నారు. 2027 డిసెంబరు నాటికి 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో 8 భాషలు నేర్చుకున్నట్లు చెప్పారు. ఇంకొల్లు రెవెన్యూ సిబ్బంది ఆర్థికసాయం చేశారు. ఇప్పటి వరకు 1,291 రోజులు పర్యటించినట్లు తెలిపారు.

ముత్తుసెల్వన్ మొక్కను నాటగా నీరు పోస్తున్న తహసీల్దారు ప్రభాకరరావు

ఉపాధ్యాయులకు సన్మానం

సత్కారం పొందిన గురువులు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. గత ఏడాది పాఠశాలలో పనిచేసిన టి.ఆదినారాయణ, కె.మధుమూర్తి, ఎన్.రాజశ్రీ, కె.వరియన్‌బాబు, పి.సుధారాణి, బి.లక్ష్మీనారాయణ, ఎ.సుజాత ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు బాలకృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాకమిటీ సభ్యులు బదిలీ అయిన వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

చీరాలలో నటి అనసూయ సందడి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవానికి గురువారం సినీ నటి అనసూయ భరద్వాజ్ విచ్చేసి సందడి చేశారు. ఈమెతో స్వీయ చిత్రాలు తీసుకునేందుకు యువకులు పోటీ పడ్డారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయరూ

2019లో ఏర్పాటు చేసిన శిలాఫలకం

న్యూస్‌టుడే, ఇంకొల్లు

ఇంకొల్లులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఇంకొల్లు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే భూమి పూజ జరిగింది. తెదేపా ప్రభుత్వంలో 2019 వరకు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన అన్న క్యాంటీన్‌లను నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేయాలనే తలంపుతో శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఇంకొల్లులో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. 2019 ఫిబ్రవరి 26న అప్పటి మంత్రి శామ్యూల్ జవహర్‌తో కలిసి బస్టేషన్ పక్కన పంచాయతీ స్థలంలో రూ.40 లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ చేసి, శిలాఫలకం ఏర్పాటు చేశారు. అదేఏడాది ఏప్రిల్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చింది. శాసన సభ్యుడిగా ఏలూరి విజయం సాధించినప్పటికీ అప్పటి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసివేయించిన కారణంగా ఇంకొల్లులో జరగాల్సిన నిర్మాణ పనులు నిలిచాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వీటి నిర్మాణానికి అడ్డంకులు తొలగటంతో వెంటనే తిరిగి పనులు చేపట్టేలా కృషి చేయాలని మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ, శాసన సభ్యుడు ఏలూరికి విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల మధ్య ఇలా.. ఉండేదెలా?

అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని ఇళ్ల మధ్య పిచ్చి చెట్లు చిట్టడవిని తలపిస్తున్నాయి. స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంటున్న నేపథ్యంలో ఖాళీ స్థలాలను అమ్ముకునేందుకు యజమానులు ముందుకు రావటం లేదు. అలాగని ఆయా స్థలాలను శుభ్రం చేయడం లేదు. ఫలితంగా నివాస గృహాల మధ్య దట్టంగా పెరిగిన పిచ్చి చెట్ల కారణంగా విషపురుగులకు నిలయంగా మారాయి. చుట్టుపక్కలవారు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పురపాలక ఏఈ లోకేశ్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల వారికి తాకీదులు ఇవ్వనున్నట్లు తెలిపారు. **- అద్దంకి, న్యూస్‌టుడే**

గుంతల దారి.. ప్రాణాంతకంగా మారి

చెరుకూరు కొత్తపాలెం అడ్డరోడ్డు నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు సుమారు 500మీటర్ల మేర రహదారి ఎక్కడికక్కడ గుంతలు పడగా మరి కొన్ని చోట్ల ఒకవైపు కుంగిపోయింది. మండలంలోని రమణాయపాలెం, చెరుకూరు గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తారు. బుధవారం కురిసిన చిన్నపాటివర్షానికే ఈ రహదారిలోని గుంతల్లో మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచాయి. దీంతో అవి సరిగా కనపడటం లేదని, దీంతో వాహనాలు అదుపుతప్పి పడిపోతాయని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- పర్చూరు, న్యూస్‌టుడే**

కూటమి విజయాలు ప్రజలకు తెలియజేయాలి

చీరాల, న్యూస్‌టుడే: ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు జనసేన కార్యకర్తలు ప్రజలకు వివరించాలని ఆపార్టీ నాయకులు కోరారు. గురువారం జనసేన నియోజకవర్గస్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివరాంప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ పరికరాల బహూకరణ

పాతమాగులూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: పాతమాగులూరు ఏఏ ప్రాథమిక పాఠశాలకు మహమద్ జాఫర్ గురువారం ఎలక్ట్రిక్ పరికరాలు బహూకరించారు. విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడే ఇవి ప్రభుత్వ పాఠశాలకు అందించడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో వి.కోటేశ్వరరావు అన్నారు. సర్పంచి జిర్రా విజయబాబు, జనసేన జిల్లా కార్యదర్శి సి.హెచ్.కృష్ణారావు, తెదేపా నాయకుడు బ్రహ్మారావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు మానవీయ కోణంలో చూడాలి

జె.వంగులూరు న్యూస్‌టుడే: పొగాకు కొనుగోలులో బయ్యర్లు మానవీయ కోణంలో ఆలోచించి రైతులను దగ్గర పొగాకు కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు తల్లపనేని రామారావు, కౌలు రైతు సంఘం నాయకులు రాయిని వినోద్ డిమాండ్ చేశారు. పంగులూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు పరిశీలించారు.

మెకానిక్‌ల దినోత్సవం

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి పట్టణంలో గురువారం మెకానిక్‌ల దినోత్సవం నిర్వహించారు. భవానీ కూడలి నుంచి రామ్‌నగర్ వరకు డీజే. శబ్దాలతో, బాణాసంచా కాల్చుస్తూ మెకానిక్‌లు ఉత్సాహంగా ప్రదర్శన చేపట్టారు. తామంతా ఐకమత్యంగా ఉన్నామని, సమస్యలు ఏదైనా సమష్టిగా సాధించుకుంటామని నేత మాబు తెలిపారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి

వేటపాలెం, న్యూస్‌టుడే: కొణిజేటి చేనేతపురి కాలనీలోని ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

అవీ ఇవీ

5న మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం

కారంచేడు, న్యూస్‌టుడే : మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 5వతేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నేతాజీ గురువారం తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కార్మిక సమ్మె విజయవంతం చేయండి

అద్దంకి, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా ఈనెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నేత కె.రఘుచంద్ అన్నారు. అభ్యుదయనగర్‌లోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చర్చావేదిక జరిగింది. అనంతరం సమ్మెకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

బయో చేతిసంచులు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

అందరి కృషితోనే ప్లాస్టిక్ నిర్మూలన

పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే : ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రోటరీ సహాయ గవర్నర్ రావి అంకమ్మచౌదరి, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదాల సాంబశివరావు కోరారు. గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా కూరగాయల మార్కెట్‌లో చేతిసంచులపై అవగాహన కల్పించి ప్రజలకు పంపిణీ చేశారు. పర్చూరు మండలం ఉప్పుటూరులో హోమియో వైద్యుడు డి.చంద్రశేఖర్ ప్లాస్టిక్ నిర్మూలనపై స్థానిక జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సేవామూర్తులకు సత్కారం

అద్దంకి, న్యూస్‌టుడే : వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సేవా మూర్తులకు సాహితీ కౌముది సంస్థ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. స్థానిక పుట్టంరాజు కళాక్షేత్రం వద్ద జరిగిన కార్యక్రమంలో రక్తదాన ప్రోత్సాహకులు చుండూరి మురళీసుధాకరరావు, రోటరీక్లబ్ పూర్వపు అధ్యక్ష కోశాధికారి చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావును సత్కరించారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

జె.పంగులూరు న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు పీఆర్సీ అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షుడు చేజర్ల చెంచు రామారావు, కంకణాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు తన్నీరు వెంకట్రావు రహమతుల్లా నేతృత్వంలో గురువారం బుదవాడ, ముప్పవరం, కొటపాడు, కొండమూరు, జనకవరం, బైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

పర్చూరు, న్యూస్‌టుడే : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్సై గరికపాటి వెంకటేశ్వరరావు చౌదరి హెచ్చరించారు. గురువారం పర్చూరు శివారు ప్రాంతాలైన వై.జంక్షన్, జాగర్లమూడి రహదారి, ఉప్పుటూరు వంతెన వద్ద బహిరంగ ప్రదేశాలతో పాటు నిరుపయోగంగా ఉన్న శిథిల భవనాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

చీరాల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించి 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం చీరాలలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ, సరెండర్ సెలవు బకాయిలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు వి.ప్రభాకరరావు, చీరాల మండల బాధ్యుడు ఎం.ఏసురత్నం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు శ్రీకారం

విింజనంపాడు తాగునీటి చెరువులో పొక్లెయిన్‌తో తూటికాడ తొలగింపు

యద్దనపూడి, మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన మౌలిక వసుతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు. మురుగు నీటి పారుదల వ్యవస్థ మెరుగుపరచడం, చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు చేపట్టారు. యద్దనపూడి మండలం వింజనంపాడులో కాలువల్లో మురుగు తొలగించారు. గ్రామంలోని తాగునీటి చెరువులో అల్లుకున్న తూటికాడ తొలగించారు. తాగునీరు పాడవకుండా చొరవ చూపారు. మార్టూరు మండలం జొన్నతాళి పంచాయతీలో వీధుల వెంట పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించారు. పూడిపోయిన మురుగు కాలువలు శుభ్రం చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో స్వచ్ఛ గ్రామాలు నెలకొల్పడమే లక్ష్యంగా పంచాయతీ నిధులతో పనులు చేపట్టినట్లు ఆయా గ్రామాల ప్రతినిధులు సాదినేని సుధీర్‌బాబు, శానంపూడి కృష్ణచైతన్య వెల్లడించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నేతలు

యద్దనపూడి, న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి అన్నారు. గురువారం మండలంలోని సూరవరపల్లిలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్థులతో కూటమి ప్రభుత్వ హయాంలో చేపట్టి పనులను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను అందజేశారు. తెదేపా నేతలు పాల్గొన్నారు.

బస్టాండ్‌కు వెళ్లే దారిలో వాహనాలు

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకు వాహనాలు వచ్చే దారిలో కూరగాయల దుకాణాల వారు భారీ వాహనాలు అడ్డుగా పెడుతున్నారు. రాత్రి సమయాల్లో అద్దె బస్సుల్ని బస్‌స్టేషన్ వద్ద నిలపడంతో ఇబ్బందిగా ఉంటుందంటూ ప్రయాణికులు వాపోతున్నారు. తక్షణం భారీ వాహనాల రాకపోకల్ని నియంత్రించాలని వారు కోరుతున్నారు.

దివ్యాంగురాలికి గాయాలు

జె.పంగులూరు, మార్టూరు న్యూస్‌టుడే: త్రిచక్ర వాహనం అదుపుతప్పి దివ్యాంగురాలికి స్వల్ప గాయాలైన ఘటన జాతీయ రహదారిపై ముప్పవరం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. మార్టూరు 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మార్టూరు మండలం ఇసుక దర్శికి చెందిన దివ్యాంగురాలు సుజాత (35) త్రిచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి అద్దంకి వెళ్తున్నారు. ముప్పవరం సమీపంలో త్రిచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను మార్టూరు 108 వాహనంలో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించినట్లు వారు తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పోలేరమ్మ గుడిని సందర్శించిన స్వామీజీలు

అద్దంకి, న్యూస్‌టుడే: అయోధ్య, ముంబయి, ఆంధ్రప్రదేశ్‌లోని పలు పీఠాలకు సంబంధించిన స్వామీజీలు శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, అద్దంకి పోలేరమ్మ, కమరేశ్వరాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వారిని అనుసరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అయోధ్యకు చెందిన డాక్టర్ సూర్యప్రకాష్ సరస్వతి, ముంబయికి చెందిన మహామండేశ్వరి, రాష్ట్రంలోని నారాయణ ప్రత్యంగామహాదేవి ప్రథమ పీఠానికి చెందిన శంకర విశ్వేశ్వరానంద స్వామీజీలు శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, అద్దంకి పోలేరమ్మ. కమరేశ్వరస్వామి , వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ పూజారులు వీరికి స్వాగతం పలికారు. స్వామీజీలు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడాలని సూచించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No. 11/2021
In
O.S. No. 7/2018

దుంపా వెంకటరెడ్డి ...డి. హెచ్. ఆర్.

Vs

పులిచర్ల సుధాకరరెడ్డి ...జె. డి. ఆర్.

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా జె.డి.ఆర్.కు చెందిన ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూల్ ఆస్తిని ఇ.పి. దాఖలా బాకీని వసూలు చేసుకొనుటకు తేది: 31-07-2025న ఉదయం గం|| 10-30 ని||లకు పై కోర్టు వారి ఎదుట కోర్టు వారి ఉత్తర్వుల మేరకు బహిరంగ వేలము జరుపబడును. కావున ఆసక్తి కలిగిన వారు కోర్టు వారి షరతులకు లోబడి పై వేలంలో పాల్గొనగలరు.

ఇ.పి. షెడ్యూలు

ప్రకాశం జిల్లా (Old) ప్రస్తుతం బాపట్ల జిల్లా, నర్సరావుపేట, డి.రి. నర్సరావుపేట సబ్ రిజిస్ట్రేషన్, సంతమాగులూరు మండలం, ఏల్చూరు గ్రామ సర్వే నెంబరు 198/B/30-B/1 ఈ క్రింద హద్దులలో గల Ac. 1-00 భూమి. **తూర్పు:** ఒరుగంటి నర్సిరెడ్డి తండ్రి పెదపిచ్చిరెడ్డి భూమి; **దక్షిణం:** N.S.P. మేజర్ కాలువ; **పడమర:** దొంక; **ఉత్తరం:** పులిచర్ల సామ్రాజ్యం భూమి.

డి.హెచ్.ఆర్. విలువ = రూ. 4,00,000/-
అమీనా (ఫీల్డ్ అసిస్టెంట్) విలువ = రూ. 7,00,000/-
వేలము తేది: 31-07-2025
తదుపరి విచారణ తేది: 07-08-2025
షరా: కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవలెను.
"శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో"

వజ్రాల అంజిరెడ్డి, మారం శ్రీనివాసరావు, తాడికొండ ప్రసాద్‌బాబు
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాదులు

(c) eenadu

ఈనాడు
చిత్తూరు
శుక్రవారం జులై 4, 2025
5

ప్రజలతో మమేకం.. శ్రేణులకు దిశానిర్దేశం

ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, కుప్పం పట్టణం, శాంతిపురం: శాంతిపురం, కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించిన చంద్రబాబు ప్రజలతో మమేకమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 రోజుల పాటు జరిగే కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన జనం నుంచి వినతులు స్వీకరించి.. అర్జీల సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆవిష్కరించారు. మామిడి రైతులతో సమావేశాన్ని నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ◆ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ..

కార్యకర్తలే తెదేపా బలం

తెదేపా బ్రాండ్ ఇమేజ్ కార్యకర్తలే అన్న విషయాన్ని మరవకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తెదేపా ఓడిపోవడానికి వీలు లేదు. రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగేలా నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి సాగించాలని నాయకులకు సూచించారు. శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద గురువారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గడిచిన ఎన్నికల్లో 'సూపర్ సిక్స్' బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ప్రచారంతో మన విజయం సాధించామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర పునర్నిర్మాణానికి చేపడుతున్న కృషిని జనంలోకి సమర్థంగా తీసుకెళ్లాలని సూచించారు.

టాటా నెర్వ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు

ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు..

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నాలుగు మండలాల్లో 30 రోజుల పాటు కార్యక్రమ వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గతంలో పార్టీ పరమైన కార్యక్రమాల్లో కుప్పం మొదటి స్థానంలో ఉండేదని.. ప్రస్తుతం వెనుకబడుతోందన్నారు. సొంత నియోజకవర్గంలో పార్టీ తీరు సరిగా లేకుంటే... రాష్ట్రంలో పార్టీపై ఎలాంటి అభిప్రాయం ఉంటుందో గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

రెండు రోజుల కుప్పం పర్యటన ముగించిన సీఎం చంద్రబాబు

అభివృద్ధి, సంక్షేమంలో రాజకీయాలు వద్దు

అభివృద్ధి, సంక్షేమం అమలులో రాజకీయాలు వద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో ఆదర్శంగా నిలుస్తూ.. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చేసిన మంచి పనులన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి.. తెదేపా గ్రాఫ్‌ను మరింత పెంచాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు, తితిదే సభ్యుడు శాంతారామ్ పాల్గొన్నారు.

పల్ప్ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం..

మామిడి కొనుగోళ్లలో రైతులను ఆదుకోవాల్సిందిగా పల్ప్ పరిశ్రమల ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. శివపురం వద్ద సీఎం స్వగృహంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు, పల్ప్ యూనిట్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి తక్షణం మామిడి కాయలు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 30 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు పని చేస్తున్నాయి. వాటి ద్వారా 6,500 మెట్రిక్ టన్నుల కాయలు కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు 1.12 లక్షల టన్నుల మామిడిని కొనుగోలు చేశారని వివరించారు.

పల్లె పారిశుద్ధ్యానికి ప్రత్యేక కార్యాచరణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: గ్రామాల్లోకి వెళ్లే రహదారులకు ఇరువైపులా చెత్త కుప్పలు కనిపిస్తుంటాయి. ఎన్నో ఏళ్లుగా ఇలాంటి ఈ పరిస్థితి ఉన్నా పంచాయతీ పాలకవర్గాలు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల స్ఫూర్తి నీరుగారే పరిస్థితులు కలుగుతుంది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ.. గ్రామాల్లో వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ (డ్రైవ్) నిర్వహిస్తోంది. లెగసీ వేస్ట్ పేరుతో వ్యర్థాల వివరాలు సేకరించి పంచాయతీరాజ్ 1 (పీఆర్ వన్) యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో కార్యదర్శులు జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి చెత్త వ్యర్థాలు పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు గ్రామాల్లో రహదారుల పక్కన పేడ దిబ్బలు, చెత్త కుప్పల తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు.

పేడదిబ్బల తొలగింపు పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

పునరుత్పాదనకు ప్రణాళిక

మండలాల నుంచి వివరాల సేకరణకు డీపీఆర్‌సీ కేంద్రం ఉద్యోగులతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. వ్యర్థాలు తొలగించాక సమీపంలోని పురపాలక సంఘాలకు తరలించి వాటిని పునరుత్పాదన చేసేలా ప్రణాళిక తెలియజేయాలి. తద్వారా పల్లెల్లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడేందుకు వీలవుతుంది. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు ఈ నెల ఏడో తేదీ లోగా గ్రామాల్లో ఉన్న వ్యర్థాల గుట్టలకు సంబంధించి పొడవు, వెడల్పు వివరాలతో పాటు ఎంత మేర పరిమాణంలో నిల్వలు ఉన్నాయో అంచనా వేసి పీఆర్‌వన్ యాప్‌లో నమోదు చేయాలి. మండలాల్లోని లింక్ రోడ్ల వివరాలను సైతం ఈ యాప్‌లో నమోదు చేయాలి.

దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ అండ

కేంద్ర మంత్రి రాందాస్ అఠావలే

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మంత్రి రాందాస్ అఠావలే అన్నారు. గురువారం స్థానిక పీవీకేఎన్ కళాశాల మైదానంలో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు అలింకో సంస్థ ద్వారా వీల్‌ఛైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిళ్లు, సహాయ పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బుద్ధి మాంద్యం, వికలత్వం కలిగిన వారికి అండగా ప్రభుత్వ సహకారంతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయని, అలాంటి వాటిలో అలింకో సంస్థ ఒకటన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా బాబు, శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్వో మోహన్‌కుమార్, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి బ్యాటరీ సైకిల్ పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి రాందాస్ అఠావలే, చిత్రంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్, చల్లా బాబు

బ్రహ్మోత్సవాలకు ముందస్తు భద్రతా చర్యలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి జరగనున్న నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలపై ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తనిఖీలు చేపట్టారు. గురువారం స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్, లేపాక్షి ఏరియా, బాలాజీనగర్, కల్యాణకట్ట, అఖిలాండం, పీఏసీ-1, సీఆర్వో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక బాలాజీనగర్‌లో బాంబ్‌స్క్వాడ్‌తో ప్రత్యేకంగా తనిఖీలు చేయించారు. ఇతర రాష్ట్రాలవారిని, సరైన గుర్తింపు పత్రాలు లేనివారిని తిరుపతికి తరలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలు, భద్రతపై ఆరాతీశారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడు పాల్గొన్నారు.

ప్రధాన కల్యాణకట్ట వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు, చిత్రంలో పోలీసు అధికారులు

త్వరలో అన్నదాత సుఖీభవ

2.06లక్షల మంది రైతుల ఈకేవైసీ పూర్తి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందజేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఏడాదికి రూ.20 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సాధారణ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయం విదితమే. వైకాపా పాలనలో రూ.13 వేల చొప్పున మంజూరు చేశారు. ఇందులో కేంద్రం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7 వేలు చొప్పున మూడు విడతల్లో అన్నదాతల ఖాతాలకు జమ చేసింది.

జిల్లాలో 3.88లక్షల మంది కర్షకులు ఉండగా.. వారిలో 2,13,629 మంది సన్న, చిన్నకారు రైతులే. అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయడానికి ప్రభుత్వం ఈకేవైసీ ద్వారా అర్హులను గుర్తిస్తోంది. ఇప్పటి వరకు 2,06,814 మంది ఈకేవైసీ ప్రక్రియ పూర్తయింది. 1,995 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉండగా.. మృతులు, ఇతర కారణాలతో 4,820 మంది తిరస్కరణకు గురయ్యారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎంత మొత్తం మంజూరు చేస్తారు, ఎప్పుడు నగదు అందొచ్చు..? అనే అంశాలపై స్పష్టత లేదు.

జాబితా సిద్ధం చేశాం

అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించడానికి రైతులకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. మిగిలిన వారి వివరాలు త్వరలోనే నమోదయ్యేలా చర్యలు చేపట్టాం. అర్హులైన రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

గణనీయంగా పెరిగిన టమాటా ధర

పలమనేరు, న్యూస్‌టుడే: టమాటా ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇంత కాలం ధరలు లేకపోవడంతో పండించిన పంటను రైతులు రోడ్లమీద, పశువులకు ఆహారంగా వేశారు. వారం కిందట 15 కిలోల పెట్టె రూ.70 నుంచి రూ.100 పలకగా... ప్రస్తుతం పలమనేరు మార్కెట్‌లో అదే పెట్టె రూ.450 పలుకుతోంది. గురువారం మార్కెట్‌కు 300 టన్నుల పంట వచ్చింది. స్థానిక సరకు కొనేందుకు తమిళనాడు వ్యాపారులు ఎక్కువగా వస్తున్నారు. విజయవాడ నుంచి కూడా వ్యాపారులు రావడం విశేషం.

భక్తులను బెదిరించి దోపిడీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం కాలినడకన వెళ్లే భక్తులను బెదిరించి వారి నుంచి నగదు దోపిడీ చేసిన ఘటన శ్రీనివాసమంగాపురంలో గురువారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన షోహన్‌సింగ్, రామ్‌లకన్‌సింగ్, మోనూసింగ్‌లు శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వెళ్లేందుకు శ్రీనివాసమంగాపురం చేరుకున్నారు. ఇక్కడి నుంచి శ్రీవారిమెట్టు చేరుకోవడానికి వెళ్తున్న భక్తులను గుర్తుతెలియని దుండగులు బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. తొలుత డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. లేవని చెప్పడంతో ఓ భక్తుడి నుంచి రూ.400 ఫోన్‌పే చేసుకున్నారు. అదే మార్గంలో గుంపులుగా వస్తున్న భక్తులను చూసి దుండగులు పారిపోగా బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్తింటి ఆరళ్లకు వివాహిత బలి

◆ తమ బిడ్డను హత్య చేశారని బంధువుల ఆరోపణ
◆ న్యాయం చేయాలంటూ రోడ్డెక్కి ఆందోళన

తడ, న్యూస్‌టుడే: మెట్టినింట ఆరళ్లకు వివాహిత తట్టుకోలేక బిడ్డలతో పాటు పుట్టింటికి చేరింది. ఆరు నెలలు దాటినా అల్లుడు కూతుర్ని కాపురానికి రమ్మని పిలవలేదు. దీంతో ఆమె తండ్రి స్వయాన ముఖ్యమంత్రికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కుప్పం పోలీసులు సర్దుబాటు చేయగా.. పట్టుమని 20 రోజులు కూడా గడవక ముందే మీ బిడ్డ ఉరేసుకుని చనిపోయిందని కబురు వచ్చింది. చేజేతులా బిడ్డను నరక కూపంలో వదిలి వచ్చామే అన్న వేదనతో ఆమె తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

శిల్ప(పాతచిత్రం)

వివాహేతర సంబంధం.. ఆపై దాడులు

శాంతిపురం మండలం గెస్పల్లికి శిల్ప(24)ను తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని (అక్కంపేట సమీపంలోని) ఎస్టీకాలనీకి చెందిన కార్తీక్ అలియాస్ కాటయ్యకు నాలుగేళ్ల కిందట ఇచ్చి వివాహం జరిపించారు. దంపతులకు హేమశ్రీ(3), హర్ష(2) పిల్లలున్నారు. కార్తీక్ శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల వరకు సజావుగా సాగిన వీరి కాపురంలో తరచూ గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం కోసం అత్త మామల వేధింపులు, భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ శిల్పపై దాడి చేసేవాడు. దాంతో ఆమె పుట్టింటికి వెళ్లడం, పంచాయితీలు, కేసులయ్యాయి. చివరగా అందరూ సర్ది చెప్పి మెట్టినింటికి పంపారు. ఎంతకీ భర్త, అత్త మామల్లో మార్పు రాకపోవడంతో శిల్ప బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న శిల్ప తల్లిదండ్రులు, బంధువులు గురువారం ఉదయానికి పెద్ద ఎత్తున వచ్చారు. తమ బిడ్డను చంపేశారని ఆరోపించారు. ఉరికి వేలాడుతున్న శిల్పను కిందికి దింపనివ్వకుండా అడ్డుకున్నారు. అత్తమామలను తమకు చూపించాలని పట్టుబట్టి జాతీయ రహదారిపై అరగంటకు పైగా రాస్తారోకో చేపట్టారు. వారిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పడంతో రాస్తారోకో విరమించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలిపోతుంటే.. ఆర్పుకోవడమేనా..!

కనిపించని ప్రమాద నివారణ చర్యలు

కొన్ని ఘటనలిలా..

■ గతేడాది రేణిగుంటలోని ఆసుపత్రిలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడున్న పీవోపీ సామగ్రి తగలబడటంతో పొగ పెద్దఎత్తున అలుముకుంది. పైఅంతస్తులో ఉన్న ఇద్దరు పిల్లలు, తండ్రి మృతి చెందారు.

■ తిరుపతి శ్రీగోవిందరాజ స్వామి ఆలయ సమీపంలో గతేడాది లావణ్య ఫొటో ఫ్రేమ్ దుకాణం, బుధవారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో మంటలు అలుముకున్నాయి. ఈ ఘటనల్లో రూ.కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఇరుకు రోడ్డులో జరిగిన ఈ ఘటనతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు.

తిరుపతి (నేరవిభాగం, తితిదే), న్యూస్‌టుడే: భవనాలు.. ఇళ్లలో జరిగే అత్యధిక శాతం అగ్ని ప్రమాదాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమవుతోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేయడం.. బాధితుల ఫిర్యాదు మేరకు ఆస్తినష్టాన్ని అంచనా వేసి నివేదించడంతో తన పనిని సరిపెడుతోంది. తరువాత నిబంధనల మేరకు వైరింగ్ ఏర్పాట్లు జరిగాయా? వినియోగానికి తగ్గట్టుగా తీగల పరిమాణం ఉందా? లేదా? అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు ఉన్నాయా? లేవా? వంటివాటిని పరిశీలించే పరిస్థితి లేదు. కనీసం అవగాహన కల్పించే దిక్కులేకపోవడతో ప్రాణ ఆస్తి నష్టాలు కొనసాగుతున్నాయి.

ఇదేమి నిర్లక్ష్యం గోవిందా

తిరుమల, తిరుపతి, తిరుచానూరు తదితర క్షేత్రాల్లో వందలాది దుకాణాలు నిర్వహిస్తున్నారు. అయితే ఏఒక్క దుకాణం వద్ద అగ్ని నిరోధక పరికరాలు లేవనే చెప్పాలి. అయినా విద్యుత్తు శాఖ అధికారులు దుకాణాలు తనిఖీ చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తితిదే అధికారులు తమ పరిధిలో లేని అంశం అన్నట్లు వ్యవహరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నివారణ చర్యలు తీసుకుంటాం

గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో అగ్నిప్రమాదం జరగడం దురదృష్టకరం. ఇలాంటివి జరగకుండా విజిలెన్స్ విభాగం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. తిరుమల, తిరుపతి, తిరుచానూరు పరిధిలోని ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో అగ్నిమాపక శాఖ అధికారులతో సమీక్షిస్తాం. అగ్ని నిరోధక పరికరాల ఏర్పాటు చర్యలు తీసుకుంటాం.

- మురళీకృష్ణ సీవీఎస్‌వో, తితిదే

వీటిని పరిశీలిస్తున్నారా..

- భవన నిర్మాణ సమయంలో అమర్చిన వైరింగ్‌ను పదేళ్లకోసారి సరిచూసుకుని మార్చుకోవాలి. విద్యుత్తు వినియోగానికి తగ్గట్టుగా లోడింగ్ పెంచుకోకపోవడంతో తీగలు వేడెక్కి కాలిపోతున్నాయి.
- తీగలు పీవీసీ పైపుల్లో.. ప్లాస్టరింగ్ చేసిన గోడల మధ్య ఉండాలి. అప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయినా ఆక్సిజన్ అందక మంటలు వ్యాపించే పరిస్థితి ఉండదు. గోడలపైన, స్విచ్ బోర్డుల వద్ద తీగలు వేలాడితే తీవ్రత తప్పదు.
- మీటర్లు, స్విచ్‌బోర్డుల వద్ద కాలే స్వభావం ఉండే వస్తువులు ఉంచరాదు. ప్రతి ఇంట్లో గ్రౌండ్ ఎర్త్ తప్పనిసరిగా పెట్టుకోవాలి.
- ఇంట్లో పీవోపీ వినియోగాన్ని వీలైనంత తగ్గిస్తే ప్రమాదాల సమయంలో దట్టంగా పొగ అలుముకోదు.
- ఫ్లేమ్ రిటార్డెంట్ లో స్మోక్ కేబుల్ (ఎఫ్ఆర్ఎల్ఎస్) వినియోగంతో ప్రమాదం జరిగినా పొగ, మంటలు పెద్దగా వ్యాపించవు.
- మినీయేచర్ సర్క్యూట్ బ్రేకర్ సిస్టమ్ (ఎంసీబీఎస్) అమర్చుకుంటే లోడింగ్‌కు మించి విద్యుత్తు వినియోగిస్తే వెంటనే ట్రిప్ అయి సరఫరా ఆగిపోతుంది. ప్రమాదాలు జరగవు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేని భక్తులకు పది గంటల్లో, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. బుధవారం శ్రీవారిని 74,510 మంది దర్శించుకోగా రూ.3.97 కోట్ల హుండీ కానుకలు లభించాయి. అలాగే శ్రీవారి ఆలయం ఎదుట ఉన్న ఇత్తడి గేట్లను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

క్యాంపస్ ప్రవేశాల కోసం టేబుళ్ల వద్ద విద్యార్థులు

త్వరలో తొక్కిసలాట ఘటనపై నివేదిక

తిరుపతి (నేరవిభాగం): శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన టికెట్ల పంపిణీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ కమిషన్ ప్రభుత్వానికి సమగ్ర నివేదికను త్వరలో అందజేయనుంది. స్థానిక పద్మావతి పార్కు వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం విశ్రాంత న్యాయమూర్తి డా. సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో న్యాయ విచారణ కమిషన్ వేసింది. ఆరు దశల్లో అధికారులు, బాధిత కుటుంబాలు, భక్తులు, స్థానిక ప్రజల నుంచి కమిషన్ వివరాలు సేకరించింది. ఘటనా స్థలంతోపాటు తిరుమలలోని క్యూలైన్లను పరిశీలించింది. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని కార్యాలయానికి న్యాయమూర్తి విచ్చేశారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ద్వారా సేకరించిన పత్రాలతో నివేదిక సమర్పించనున్నారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

కడాకు రూ.5.19 కోట్లు విడుదల

కుప్పం పట్టణం: కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ(కడా), ఐఐటీ కాన్పూర్ మధ్య జరిగిన మౌఖిక ఒప్పందంలో భాగంగా రూ.5.19 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. రెండో విడత కింద రూ.1.50 కోట్లు వాడుకోవాలని పేర్కొంది.

కరుణించని వరుణుడు.. అడుగంటిన జలాలు

◆ ఎండిపోతున్న మామిడి చెట్లు ◆ రైతుల కన్నీటి వేదన

ఎండిపోతున్న మామిడి చెట్టు

న్యూస్‌టుడే, బంగారుపాళ్యం: ఉమ్మడి జిల్లాలో గత నెలన్నర రోజులుగా చినుకు రాలలేదు. చెరువులు ఎండి బీటలు వారుతున్నాయి. భూమిలో తేమ లేక పోతోంది. ఎండల తీవ్రత అధికం కావడంతో మెట్ట భూముల్లోని మామిడి చెట్లు వేడి తీవ్రతకు ఎండిపోతున్నాయి. ఓవైపు పంట పక్వానికి వచ్చిన మామిడి కాయలను కోసి అమ్ముకోలేక తిప్పలు పడుతుంటే.. గోటి చుట్టుపై రోకటి పోటులా వరుణదేవుడు తమపై కన్నెర్ర చేశాడని మామిడి రైతుల వాపోతున్నారు. గత వారం రోజులుగా నిత్యం సాయంత్రం వేళ ఆకాశం వర్షపు మబ్బులు కమ్మేసి చిరుజల్లులు కురిసి ఊరించి ఉసూరుమంటోంది. ఈ క్రమంలో ఎండిపోతున్న మామిడి చెట్లను చూసి.. చేసేదేమీలేక రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వందలాది మామిడి చెట్లు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. ఖరీఫ్ సీజన్ మొదలైనా వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగుకు సుముఖత చూపడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని వేలాది ఎకరాలు వరి, వాణిజ్య పంటల సాగుకు నోచుకోక బీళ్లుగా ఉన్నాయి.

నానాటికీ దయనీయంగా..

ఉమ్మడి జిల్లాలోని మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎండల తీవ్రత నేపథ్యంలో మామిడి చెట్లలోని కాయలు మాగి నేల రాలిపోతున్నాయి. వాటిని కోసి గుజ్జు పరిశ్రమలకు తరలించడానికి పర్మిట్లు దొరక్క రైతులు పడుతున్న తిప్పలు చెప్పనలవికావు. ఇక ర్యాంపు నిర్వాహకుల తీరు మాటల్లో చెప్పలేనిది. అనుమతి తెచ్చిన వారి కాయలను మాత్రమే టన్ను రూ. 2,500కు కొనుగోలు చేస్తున్నారు. కాయలు తరలించడానికి లారీలు అద్దెకు దొరకడం లేదని సాకులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 45 శాతానికి పైగా కోతలు ముగిశాయి. మిగిలిన పంట కోత ఎప్పుడు ముగుస్తుందా అని రైతులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. కలెక్టరు, ఉద్యాన శాఖ అధికారులు నిత్యం పరిశ్రమలను సందర్శించి మమ అనిపిస్తున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనలతో రైతులకు జరిగిన మేలు శూన్యమని పెదవి విరుస్తున్నారు.

(c) eenadu

గణనాథుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ ఎన్వీ అంజారియాకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ అంజారియా కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో కేవీ సాగరబాబు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. స్వామివారి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు డిప్యూటీ ఈవో అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కుమార్, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది ఉన్నారు.

గత ప్రభుత్వంలో తితిదే బోర్డు అవినీతిమయం

శ్రీవారి ఆలయం ఎదుట భాజపా ఎంపీ లక్ష్మణ్ కుటుంబం, చిత్రంలో తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

తిరుమల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో తితిదే ధర్మకర్తల మండలిని అవినీతిమయం చేశారని భాజపా తెలంగాణ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఎంపీ మాట్లాడుతూ.. తిరుమలలో గత పాలకమండలి, ప్రభుత్వం అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేద మందుల తయారీకి రూ.3.90 కోట్లు పెట్టి నాసిరకం యంత్రాలు కొన్నారని ఆరోపించారు. గతంలో తితిదే అవినీతిపై సీఎం చంద్రబాబుకు లేఖను రాస్తానని చెప్పారు. వెంట తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శివయ్యా.. మోసమయ్యా..!

● సెల్‌ఫోన్లకు రెట్టింపు వసూళ్లు ● కౌంటర్ల వద్ద కనిపించని సూచికలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సెల్‌ఫోన్ కౌంటర్ల వద్ద నిలువునా మోసానికి గురవుతున్నారు. భక్తుల అవసరాల దృష్ట్యా ముక్కంటి ఆలయంలోని బాలజ్ఞానాంబిక, శివయ్య, తిరుమంజన, దక్షిణ గోపురాలతో పాటు మహాద్వారం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అయితే కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది నిర్దేశిత ధరలు కంటే అదనంగా వసూలు చేయడం పట్ల విమర్శలు గుప్పుమంటున్నాయి.

నిలువునా మోసం

కౌంటర్లలో సెల్‌ఫోన్లు పెట్టి రసీదులు తీసుకుంటున్న భక్తులు

సెల్‌ఫోన్ కనీస వస్తువుగా మారిపోయింది. కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే అన్ని ఫోన్లు వినియోగిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు తీసుకువచ్చే సెల్‌ఫోన్లను ఆలయంలోకి అనుమతించరు. అందుకని ప్రవేశ గోపురాల్లో ఉన్న నిర్దేశిత కౌంటర్లలో వీటిని భద్రపరుచుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో ఫోనుకు రూ.5 తీసుకోవాల్సి ఉండగా.. సాధారణ ఫోన్‌కు రూ.10, ఐఫోన్లకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక కుటుంబంలో నలుగురు ఫోన్లతో దర్శనానికి వస్తే రూ.80 చెల్లించాల్సి రావడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. రోజుకు కనీసం 10 వేలకు తక్కువ లేకుండా ఫోన్లను కౌంటర్లలో భద్రపరుస్తున్నారు. రెట్టింపు వసూళ్లతో గుత్తేదారులు ఏటా రూ.1.80 కోట్ల మేర అదనంగా ఆర్జిస్తుండటం గమనార్హం.

సూచికలేక.. రసీదుల్లో రాయక..



వివరాలు నమోదు చేయకుండా పంపిణీ చేస్తున్న రసీదులు

సెల్‌ఫోన్ కౌంటర్లలో పనిచేసే సిబ్బంది భక్తుల నుంచి ఎన్ని సెల్‌ఫోన్లు తీసుకుంటున్నారో.. అందుకు సంబంధించి చెల్లించాల్సిన మొత్తాన్ని విధిగా నమోదు చేయాలి. అయితే ఇక్కడ అలాంటి పరిస్థితులు కన్పించడం లేదు. తీసుకున్న సెల్‌ఫోన్ల సంఖ్య రాస్తారంతే. కౌంటర్ల వద్ద సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో నిర్దేశిత మొత్తం కాకుండా ఎక్కువ వసూలు చేస్తున్నారు. సూచికలు ఏర్పాటు చేసినా [illegible]. శాశ్వతంగా సూచికలు అందుబాటులోకి తెచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

శివయ్య గోపురం కౌంటర్ వద్ద సూచికల్లో ధరల వరకు చెరిపేసిన వైనం

6న కాణిపాకం ఆలయ ఉభయదారుల సమావేశం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్ల పై ఈ నెల ఆరో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో 14 గ్రామాలకు చెందిన ఉభయదారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ఉభయదారులు, ఆలయ అధికారులు విచ్చేసి సలహాలు, సూచనలు అందించాలన్నారు.

నేడు హుండీల లెక్కింపు.. స్వామివారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు. లెక్కింపునకు అధికారులు, సిబ్బంది హాజరుకావాలన్నారు.

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా బాబు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా చిత్తూరు నగరానికి చెందిన డాక్టర్ బాబు నియమితులయ్యారు. ఆయన గతంలో భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఎస్సీ మోర్చా కార్యక్రమాల రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలో జరగనున్న భాజపా జాతీయ నూతన అధ్యక్షుడి ఎన్నికల్లో ఆయన పాల్గొంటారు.

ఎఫ్‌ఆర్వో బాధ్యతల స్వీకరణ

పట్టాభి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అటవీశాఖ పశ్చిమ విభాగం ఎఫ్‌ఆర్వోగా పట్టాభి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎఫ్‌ఆర్వోగా ఉన్న బాలకృష్ణారెడ్డి పెనుగొండ సామాజిక వన విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అత్తిపల్లి నుంచి ఎఫ్‌ఆర్వో పట్టాభి బదిలీ అయ్యారు.

6న శాస్త్రీయ నృత్య పోటీలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: బాలబాలికలకు ఈ నెల 6న శాస్త్రీయ నృత్య ధారావాహిక పోటీలను నిర్వహించనున్నట్లు ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు రాజారత్నం తెలిపారు. చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటలకు జూనియర్లకు, సాయంత్రం నాలుగు గంటలకు సీనియర్లకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి తదుపరి స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపు జాతీయ లోక్‌అదాలత్

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34 బెంచ్‌లు, చిత్తూరులో ఐదు బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు, రెవెన్యూ, బ్యాంకు, బీమా సంస్థలు వివిధ శాఖల అధికారులు, కక్షిదారులు కృషి చేయాలని ఆమె కోరారు.

20న ఐఐటీ స్నాతకోత్సవం

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీ ఏడో స్నాతకోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆచార్య సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది బీటెక్, పీహెచ్‌డీ పూర్తిచేసిన 417 మంది విద్యార్థులకు పట్టాలు అందించనున్నట్లు అందులో పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా కాగ్నిజెంట్ సహ వ్యవస్థాపకులు, క్రియ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ లక్ష్మి నారాయణన్, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్, జెఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్ హాజరు కానున్నారని ప్రకటనలో వివరించారు.

దేశాభివృద్ధిలో కంపెనీ కార్యదర్శుల పాత్ర కీలకం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో కంపెనీ కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉంటుందని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ సదరన్ రీజియన్ స్నాతకోత్సవాన్ని గురువారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. వీసీ ఉమ అతిథిగా విచ్చేసి ఐసీఎస్ఐ సభ్యులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేశారు. అనంతరం ఐసీఎస్ఐ ఉపాధ్యక్షుడు సీఎస్ పవన్ జి.చండక్ మాట్లాడుతూ నూతన సభ్యులు అవకాశాలను సృష్టించుకోవాలని, వృత్తి పట్ల బాధ్యత వహించాలన్నారు. మొత్తం 263 ఐసీఎస్ఐ సభ్యులకు స్నాతకోత్సవ డిగ్రీలను ప్రదానం చేశారు. ఐసీఎస్ఐ సంయుక్త కార్యదర్శి కౌశిక్ బెనర్జీ, ఎస్ఐఆర్‌సీ ఛైర్మన్ మధుసూదన్, కౌన్సిల్ సభ్యులు మోహన్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వీసీ ఉమకు జ్ఞాపిక అందజేస్తున్న ఐసీఎస్ఐ అధికారులు, సభ్యులు

శ్రీవాణి కేంద్రం వద్ద సౌకర్యాలు మెరుగుపర్చండి

దర్శనానంతరం భక్తుల డిమాండు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నిమ్మల మురళీకృష్ణ మరికొందరు భక్తులు తితిదేను కోరారు. గురువారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్న అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కనీస వసతుల లేమిపై ఫిర్యాదు చేశారు. శ్రీవారి దర్శన టికెట్ల జారీ కేంద్రం వద్ద తెల్లవారు జామున 4 గంటల నుంచి వేచిఉంటే ఉదయం 7.30 గంటలకు టికెట్లు జారీ చేస్తారని చెప్పారని, అప్పటివరకు అక్కడ కూర్చునేందుకు కుర్చీలు, బల్లలు, మంచినీళ్లు, ఇతర వసతులు లేవని, డయల్ యువర్ ఈవోకు ఫిర్యాదు చేద్దామన్నా కలవడం లేదని వారు ఆరోపించారు. టికెట్లు కొనుగోలు చేశాక రూ.500, రూ.1000 గదులు ఇవ్వాల్సి ఉండగా రూ.50 గదులు రెండు కేటాయించారని, వాటిలో బొద్దింకలు, బల్లులు ఉన్నాయని వాపోయారు. ఫిర్యాదు చేశాక సిబ్బంది వచ్చి క్లీన్ చేశారని, గదుల కేటాయింపు సిబ్బందిని సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి శ్రీవాణి భక్తులకు సౌకర్యాలు మెరుగుపరిచేలా చొరవచూపాలని కోరారు. మీడియాకు ఫిర్యాదు చేసిన వారిలో వెట్టం శ్రీనివాసరావు, కె.రామగురవయ్య, జి.శంకర శ్రీనివాస్, ఎస్కే షాబిల్ ఉన్నారు.

శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం వద్దకు అన్నప్రసాదాలు తీసుకెళ్తున్న సిబ్బంది

అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవు: తితిదే

శ్రీవారి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న భక్తులు

తితిదేపై అసత్య ఆరోపణలు చేసేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తితిదే హెచ్చరించింది. గురువారం శ్రీవారి దర్శనానికి వచ్చిన ఐదుగురు భక్తులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని వెల్లడించింది. రోజూ ఉదయం 8.30 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేస్తామని, అంతకంటే గంట ముందు మాత్రమే భక్తులను కౌంటర్ వద్దకు అనుమతిస్తున్నట్లు వెల్లడించింది. సదరు భక్తులు వేకువజామున 3.30 గంటలకే వచ్చి టికెట్ల కేటాయింపులో జాప్యం జరిగిందని, అన్నపానీయాలు తితిదే కేటాయించలేదని ఆరోపించడం సరికాదని. సాధారణంగా కౌంటర్ తెరిచే సమయానికి ముందు నుంచి టీ, కాఫీ, పాలు, మజ్జిగ నిరంతరం సరఫరా చేస్తామని వెల్లడించింది. శ్రీవాణి భక్తులు ఎక్కువగా తిరుపతిలోనే వసతి పొంది దర్శనానికి వెళ్తుంటారని, తిరుమలలో డిమాండ్ చేస్తే అందుబాటులో ఉన్నవి కేటాయిస్తున్నట్లు పేర్కొంది. టీబీసీలోని రూ.50 గదులను తనిఖీ చేయగా పరిశుభ్రంగానే ఉన్నాయని, సదరు భక్తులు తితిదేపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించింది. రద్దీ నేపథ్యంలో భక్తులు సంయమనంతో సహకరించాలని సూచించింది.

భక్తుడిచ్చిన సైకిళ్లు.. తుప్పు పట్టాల్సిందేనా?

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి మీద విశ్వాసంతో భక్తులు అనేక రూపాల్లో మొక్కులు చెల్లిస్తుంటారు. వాటిలో నూతన వాహనాలు, సైకిళ్లను తరచూ సమర్పిస్తున్నారు. ఇటీవల ఓ భక్తుడు సైకిళ్లు ఇవ్వగా 10 బ్యాటరీ, 90 మామూలు సైకిళ్లను తిరుపతిలోని తితిదే రవాణాశాఖ జీఎం కార్యాలయానికి తరలించారు. తితిదే ఛైర్మన్ క్యాంపు కార్యాలయ సిబ్బంది ఐదు సైకిళ్లను వాడుతుండగా తక్కిన వాటిని రెండు మాసాలుగా దాచిపెట్టి పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో శ్రీవారి భక్తుడొకరు సైకిళ్లు ఇవ్వగా వాటిని ఎంతకూ పట్టించుకోకపోవడంతో చివరకు వేలం వేయాల్సి వచ్చింది. తితిదే పరిధిలో పలు విద్యాసంస్థలు ఉండగా ఏటా ఆయా కోర్సుల్లో ఉత్తమ మార్కులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు లేదా బాలమందిరం, బధిర పాఠశాల విద్యార్థులకు వాటిని బహుమతిగా ఇస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

తితిదే రవాణా శాఖ జీఎం కార్యాలయం పరిధిలో ఉంచిన సైకిళ్లు

అధికారి ఏమంటున్నారంటే..

బ్యాటరీ, రెండు చక్రాల సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలంటూ తితిదే ఉన్నతాధికారులు, డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు ఇచ్చినా ఎవరూ ముందుకు రాకపోవడంతో గతంలో వేలం వేయాల్సి వచ్చిందని తితిదే రవాణా విభాగం జీఎం శేషారెడ్డి తెలిపారు. ప్రస్తుత అందుబాటులో ఉన్న సైకిళ్లపై ఉన్నతాధికారులతో చర్చించి తితిదే ఉద్యోగులకు లేదా విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ మోసాలపై రేపు బీఎస్‌ఎన్‌ఎల్ అవగాహన

తిరుపతి (విద్య): బీఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్. వెంకోబరావు గురువారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలి.. నిందితులపై ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవచ్చో నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యుత్తు శాఖ ఏఈ తాత్కాలికంగా తొలగింపు

చిత్తూరు(మిట్టూరు): వర్క్ ఆర్డర్లు పరిష్కరించుకోవడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నందుకు చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధి రెడ్డిగుంట సెక్షన్ ఏఈ విశ్వప్రసాద్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే సెక్షన్‌లో పనిచేస్తున్న ఉప-ఇంజినీరు దీపక్‌కు ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఉపాధ్యాయుడికి ఛార్జ్‌మెమో

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతి సమయంలో డీఈవో వరలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గంగాధరనెల్లూరు మండలం అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ విజయ్ కుమార్‌కు.. డీఈవో గురువారం ఛార్జ్‌మెమో జారీ చేశారు. తిరుపతి జిల్లాకు చెందిన సురేష్‌కుమార్, చిత్తూరు జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయగా ఆమె పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే, ఈ ఘటనపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తిరుపతి డీఈవో కుమార్‌ను కమిషనర్ ఆదేశించగా ఆయన నివేదిక అందజేశారు. దీంతో సురేష్‌కుమార్‌ను.. తిరుపతి డీఈవో సస్పెండ్ చేయగా, విజయ్‌కుమార్‌కు ఛార్జ్ మెమో ఇచ్చారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	95
రిటైల్	117
లేయర్	112
బ్రాయిలర్	170
బ్రాయిలర్ స్కిన్ లెస్	193
లేయర్ మాంసం	190

Roc.No.1694/2019/E1. Dt: 03 07.2025

OFFICE OF THE CHITTOOR MUNICIPAL CORPORATION, CHITTOOR DISTRICT

NOTICE INVITING EXPRESSION OF INTEREST

Sealed expression of interest is invited from the experienced and interested Consultants from the experienced and interested Consultants from detailed survey & preparation of detailed project report (DPR i.e. Estimate and Designs) for the following item of work.

1.Providing Water Supply improvement Project i.e.. Source works & Distribution works in Chittoor Municipal Corporation under Urban Infrastructure Development Fund for the year 2024-2025. Last date for submission of application **11.07.2025 i.e Friday by 5.00 PM**

The commissioner, Chittoor Municipal Corporation reserves all rights to cancel, reject or postpone or fixup any special conditions for all the applications without assigning any reasons or these of.

CONDITIONS:

1. Conditions for EOI should be accepted.
2. Experience consultants in similar nature of works shall only be considered.
3. Consultant should be empanelled in any dept in any stage.
4. The DPR should prepare in stipulated period and should get approved by the department.
5. The DPR's shall be prepared as per the guidelines and norms and all the information as per the check list raised by the department.
6. Commissioner, Chittoor Municipal Corporation and Municipal Council has all powers to accept or reject the sealed tenders.
7. The rate quoted by the consultants shall be in percentage (%) of total estimated contract value + GST.

Any other details contact on Engineering section Chittoor Municipal Corporation in working hours

Contact Mobile No: **Commissioner (9849905864)**
Municipal Engineer (9849907886)

Sd/-Commissioner, Chittoor Municipal Corporation

జగన్ పర్యటనకు జన సమీకరణపై సమీక్ష

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: వైకాపా అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి బంగారుపాళ్యంకు ఈనెల 9న రానున్న నేపథ్యంలో కార్యక్రమానికి పెద్దఎత్తున రైతులను సమీకరించాలని, నియోజకవర్గాల సమన్వయకర్తలు బాధ్యత తీసుకోవాలని వైకాపా ప్రాంతీయ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. జగన్ పర్యటపై మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసంలో గురువారం జరిగిన సమీక్షలో ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీమంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందుబాటులో లేడని చంద్రగిరి నియోజకవర్గంలో తెదేపా నాయకులు గూండాల్లా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని భూమన కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. పనపాకం, ముంగిళిపట్టు గ్రామాల్లో ఆయన పర్యటించారు.

సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఆర్‌కే రోజా, నారాయణస్వామి

ప్రభుత్వం మారితే మాకేంటి..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా గ్రామ సచివాలయంపై ఏర్పాటు చేసిన నవరత్నాల లోగోలు తొలగించలేదు. రైతు సేవా కేంద్రాల భవనాలపై అవే నేటికీ దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ భవనాలు నిర్మించింది. వాటిపై నాటి ముఖ్యమంత్రి ఫొటో, నవరత్నాల లోగో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారినా అధికారులు వాటిని తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **- న్యూస్‌టుడే, పుత్తూరు**

శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తామని మోసగించిన దళారీ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తామని చెప్పి ఓ దళారీ భక్తులను మోసగించి నకిలీ టికెట్లు అంటగట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడి వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లకు చెందిన విజయ్ శ్రీవారి దర్శనం కోసం తన స్నేహితుడి సలహాతో బాలాజీ అనే వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించాడు. అతను కోరిన దర్శనం చేయిస్తానని చెప్పి రూ.65 వేలు వసూలు చేశాడు. అనంతరం భక్తుడికి వారి కుటుంబ సభ్యుల పేరుతో తితిదే లోగో కలిగిన నకిలీ తోమాలసేవ, అభిషేకం టికెట్లు, సూట్‌రూమ్ రసీదు పంపాడు. వాటిని అసలు టికెట్లుగా భావించిన భక్తుడు బుధవారం తిరుమలకు చేరుకున్నాడు. గదుల కోసం దళారిని సంప్రదించగా అతను స్పందించకపోవడంతో అనుమానం వచ్చి టికెట్లను తనిఖీ చేయగా నకిలీవని తేలాయి. అనంతరం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేపట్టారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

కేవీబీపురం, న్యూస్‌టుడే: పని ప్రదేశంలో తేనెటీగలు దాడి చేయడంతో 20 మంది ఉపాధి కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని వగత్తూరు ఎస్సీ కాలనీకి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు. . కాలనీకి చెందిన సుమారు 80 మంది ఉపాధి కూలీలు గ్రామ సమీపంలో కందకాలు తవ్వుతున్నారు. ఈ సమయంలో తేనెతెట్టుపై గడ్డపార తగలడంతో ఒక్కసారిగా తేనెటీగల సమూహం కూలీలపై దాడి చేశాయి. అందులో 20 మందిని కుట్టాయి. వారిలో ఆరుగురిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మిగిలిన వారు ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొంది ఇళ్లకు వెళ్లిపోయారు. పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న కూలీలను ఎంపీడీవో మాలతి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారి రామ్‌నాయక్‌కు సూచించారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యాధికారి తెలిపారు.

పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న ఎంపీడీవో మాలతి

కుమార్తె మాట వినకపోవడంతో తల్లి ఆత్మహత్య

సరస్వతి (పాతచిత్రం)

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కుమార్తె.. చెప్పిన మాట వినకుండా పెళ్లైన యువకుడితో వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన తల్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పత్రపల్లెలో గురువారం చోటు చేసుకుంది. సీఐ సుబ్బరాయుడు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు, సరస్వతి(44) దంపతుల కుమార్తె శిల్ప మదనపల్లె మండలం పందివారిపల్లెకు చెందిన బంధువైన దామోదరంతో నెల క్రితం వెళ్లిపోయింది. దామోదరానికి గతంలోనే పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు శిల్పను తీసుకొచ్చి అప్పగించారు. మరోసారి ఈ నెల 1న దామోదరంతో వెళ్లిపోయింది. కుమార్తె చెప్పిన మాట వినకపోవడం.. ప్రేమ పేరుతో మోసపోవడంతో మనస్తాపానికి గురై యువతి తల్లి సరస్వతి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

క్షణాల్లో గోడలెక్కి.. ఉన్నదంతా దోచి..

కరుడుగట్టిన అంతర్ జిల్లా నేరస్థుడి పట్టివేత

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే: బాల్యం నుంచే దొంగతనాలు మొదలెట్టాడు. 24 ఏళ్ల వయసుకే 40 నేరాలు చేశాడు. పలు జిల్లాల పోలీసులను ఉరుకులు పెట్టించాడు. ఎవరికీ చిక్కకుండా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. చివరికి చిన్న క్లూతో దొరికిపోయాడు. అతడి నుంచి 60 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ఉయ్యాల రాజేష్ (24) కుటుంబం విజయవాడ, వాంబేకాలనీలో ఉంటోంది. అతడు 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పుడే దొంగతనాలు చేయడంతో మూడు సార్లు బాలుర పరిశీలనా గృహంలో ఉంచారు. బయటకు వచ్చినా తీరు మారలేదు. కూలి పనులు చేస్తూ.. చోరీలు చేసేవాడు. 2024, సెప్టెంబరులో మధురానగర్‌లో ఒక తమిళ కుటుంబం ఇంట్లో రూ.11 లక్షలు దోచాడు. జైలుకు వెళ్లి జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చాడు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దామోదర్. చిత్రంలో సీఐ శ్రీనివాస్, సిబ్బంది

ఎంత దూరమైనా నడిచే.. రాజేష్‌కు బండి నడపడం రాదు. ఎంత దూరమైనా నడిచే వెళతాడు. రాత్రి వేళ బి.ఆర్.టి.ఎస్.రోడ్డు, ఫుట్‌పాత్‌లపై పడుకుంటాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో లేచి నడుచుకుంటూ వెళతాడు. రైల్వేలైను వెంబడి, కాలువ గట్ల వెంట వెళుతూ.. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. పెద్ద పెద్ద గోడలను 5 సెకన్లలోనే ఎక్కేస్తాడు. ఇలా మధురానగర్‌లో 5 నేరాలు చేసి 94 గ్రాముల బంగారం చోరీ చేశాడు. పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేటల్లో మొత్తం 12 నేరాలు చేశాడు. దోచిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస నేరాలు జరుగుతుండటంతో నిఘా పెంచారు. నేరస్థలంలో కొన్ని వేలిముద్రలు దొరికాయి.

ప్రమాదంతో వెలుగులోకి.. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. పేర్లు నమోదు చేసుకునే సమయంలో ఓ యువకుడు పారిపోయాడు. అతడి పేరు రాజేష్ అని తెలిసింది. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి విచారించారు. సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టారు. మాచవరం స్టేషన్ పరిధిలో ఒక చోట కనిపించి, అంతలోనే మాయమయ్యాడు. ఒక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి.. రెడ్‌హ్యాండెడ్‌గా అతడిని పట్టుకున్నారు. విజయవాడ పరిధిలోని 6 కేసుల్లో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని ఏసీపీ దామోదర్ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

EENADU Classifieds

HEALTH & CARE

NTR వైద్య సేవ ద్వారా ఉచిత ఆపరేషన్లు: మొలలు, హెర్నియా, అపెండిక్స్, విరిగిన ఎముకలు & నరాలు, వెన్నెముక ఆపరేషన్లు, ప్రసవాలు & గర్భసంచి ఆపరేషన్లు, కిడ్నీలో రాళ్ళు, మూత్ర సంబంధిత వ్యాధులు, అన్ని రకాల జ్వరాలు & అత్యవసర చికిత్సలు కలవు. M.S.హాస్పిటల్, తిరుపతి ✆ 98492 84543, 0877-2280779.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని అనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

GENERAL

అతి తక్కువ ధరల్లో, 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి అమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు : ✆ 91145 61456.

తిరుపతి - తిమ్మినాయుడుపాలెం, కాటన్ మిల్, విజయకృష్ణ కాలేజీ దగ్గర 36 x 69.5 అం|| 30 ft రోడ్డు, నార్త్ ఫేస్, LRS అప్రూవ్ ప్లాట్ అమ్మకానికి కలదు. ✆ 96184 00963.

నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే ✆ 95027 74175/ 79959 92114.

తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. వివరములకు సెల్: 95154 83527.

JOBS

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారికి లబ్ధి చేకూర్చడానికి చిత్తూరు జిల్లా నందు పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్. ✆ 77298 93359.

ప్రముఖ మ్యాట్రిమోని ఆఫీస్‌కు ఏదైనా Job లో 2 సం||లు అనుభవం గల స్త్రీలు PRO & Telecaller కావలెను. Q: Any Degree, Sal: 20 (or) 25K, Age: 30+ తిరుపతి. ✆ 80193 05930.

బాలాజీ ఫైనాన్స్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (Male) & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 14,000, Exp: 1 year. నియర్ రామానుజ సర్కిల్, తిరుచానూరు రోడ్డు, తిరుపతి. ✆ 97013 66663, 90005 05067.

WANTED FOR Primary Teachers (Subject: English), Depends upon Skills, Salary: Above 25K, Contact: ✆ 77318 09480.

నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీం లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం : 20K to 25K, Qua: Inter పైన Age: 25 to 40 yrs. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన Cell No: ✆ 91828 98446.

తిరుపతి, MRపల్లి, ధనలక్ష్మీనగర్‌లో D.No: 23-1-102/16 నెంబర్‌లోని బాలాజీ హాస్పిటల్ నందు పనిచేయుటకు స్టాఫ్ నర్సులు, ఆయాలు కావలెను. జీతం: 16,000/-. ✆ 89776 07644.

పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు పంప్ బాయ్స్ కావలెను. జీతం: 12,000 + కమీషన్ ఇవ్వబడును. శ్రీ లక్ష్మీ శ్రీనివాస పెట్రోల్ బంక్, శ్రీకాళహస్తి రోడ్డు. సంప్ర: 80747 37577.

Study Power (Education Loans) నందు పనిచేయుటకు Staff మరియు కమిషన్ based Agents కావలెను. ✆ 9705817817.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

'నీచ రాజకీయాలు చేస్తున్న జగన్'

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: బాధిత కుటుంబాలతో వైకాపా నాయకుడు జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమాయకురాలైన సింగయ్య భార్యను అడ్డుపెట్టుకుని తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని విమర్శించారు. కేసు పక్కదారి పట్టించే కుట్ర చేశారని, అన్నింటినీ గమనిస్తున్న ప్రజలు సరైన సమయంలో వైకాపాకు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

చెర్లోపల్లెలో వీధి దీపాలు వెలగడం లేదనే సమస్యపై అధికారులు స్పందించారు. వెంటనే వాటిని ఏర్పాటు చేశారు. **-న్యూస్‌టుడే, పూతలపట్టు**

తొలగిన వర్షపునీరు

ఈనాడు కథనానికి స్పందన

నెట్టేరిలో తాగునీటి ట్యాంకు వద్ద 'వర్షం వస్తే వాగును తలపించేలా..!' శీర్షికన చిత్ర కథనం గత నెల 28న ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ట్యాంకు వద్ద వర్షం వస్తే నీరు నిలవకుండా మట్టి తోలించారు. **-న్యూస్‌టుడే, నింద్ర**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, యాదమరి: **సమస్య:** మండల కేంద్రంలోని బస్టాప్‌లో ఎండిన చింత చెట్టు కూలనుంది. జనసంచారం ఉండే ఈ ప్రాంతంలో ఇది కూలితే పెద్ద ప్రమాదం జరుగుతుంది. **-స్థానికులు**

సమాధానం: ఎండిన చింతచెట్టు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
-శివరాజు, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, కార్వేటినగరం: **సమస్య:** డైట్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. **-నాగరాజు, స్థానికులు**

సమాధానం: చెత్తకుప్పలు వెంటనే తొలగింపజేస్తాం.
-నాగరత్నం, కార్యదర్శి

న్యూస్‌టుడే, గుడిపాల: **సమస్య:** శ్రీరంగపల్లె ఎగువ ఎస్సీ కాలనీలో కాల్వలు అధ్వానంగా మారాయి.
-మురుగేష్, స్థానికుడు

సమాధానం: కాలువలు శుభ్రం చేయిస్తాం.
-కృష్ణప్రసాద్, ఈవోపీఆర్డీ

న్యూస్‌టుడే, పుత్తూరు: **సమస్య:** స్థానిక చిన్నబ్బనాయుడు కండ్రిగలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **-రమేష్, పుత్తూరు**

సమాధానం: కాలువలు తరచూ శుభ్రం చేయిస్తాం.
-ప్రియాంక, శానిటరీ ఇన్‌స్పెక్టర్

కేంద్ర మంత్రిని సత్కరించిన భాజపా నాయకులు

కలెక్టరేట్: కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న భాజపా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరు పర్యటనకు వచ్చిన కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ మంత్రి రాందాస్ అథవాలేను భాజపా నాయకులు గురువారం స్థానిక ర.భ.శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. దివ్యాంగులకు అలింకో సంస్థ ద్వారా ఉపకరణాల పంపిణీ చేపట్టడం హర్షణీయమని నాయకులు తెలిపారు. సీనియర్ నాయకులు చిట్టిబాబు, కరుణాకర్, షంషేర్, రెడ్డిమస్తాన్ ఉన్నారు. ● మంత్రి రాందాస్ అథవాలేను ర.భ.శాఖ అతిథిగృహంలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ కలిశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీతో పాటు భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు వ్యవసాయ భూమి కేటాయించాలని, ఇతర సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. **గుడిపాల:** కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేను మండల భాజపా నాయకులు చిత్తూరు జడ్పీలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు చిట్టిబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బండి సోమనాథ్, సునీల్, సిద్ధార్థ, శోభన్, మస్తాన్ పాల్గొన్నారు.

ప్రజా వినతుల స్వీకరణ రద్దు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నగరంలో ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించే వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని ఎమ్మెల్యే జగన్మోహన్ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో క్షేత్రస్థాయిలోనే ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ముగిశాక మళ్లీ వినతుల స్వీకరణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఇక అధికారికం

❖ అదనపు లోడు క్రమబద్ధీకరణ ❖ తరలివచ్చిన విద్యుత్తు వినియోగదారులు
❖ చిత్తూరు అర్బన్ డివిజన్‌కు రూ.44.11 లక్షల ఆదాయం

అనుప్పల్లి విద్యుత్తు ఉప కేంద్రం

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీతో ప్రభుత్వం వేసవిలో శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మార్చి ఒకటి నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించింది. జిల్లాలో చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో ఈ పథకానికి వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో ఇప్పటి వరకు 2,245 మంది వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. ఇందుకు సంస్థకు రూ.44.11 లక్షల ఆదాయం సమకూరింది.

సెక్షన్	క్రమబద్ధీకరణ సర్వీసులు	సమకూరిన ఆదాయం (రూ.లక్షల్లో)
చిత్తూరు	1031	20.25
రెడ్డిగుంట	669	13.99
బంగారుపాళ్యం	147	2.31
పైపల్లె	398	7.54

లెక్కింపు ఇలా..

ఇంటి విద్యుత్తు కనెక్షన్ తీసుకునే సమయంలో దీపాలు, ఇతర ఉపకరణాలకు ఎంత విద్యుత్తు వినియోగం అవుతుందో అంచనా వేసి కిలోవాట్లలో లోడ్ లెక్కిస్తారు. ఆ మేరకు డెవలప్‌మెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తారు. ఉదాహరణకు ఒక కిలోవాట్ లోడుతో కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ రుసుము రూ.2 వేలు, దరఖాస్తుకు రూ.50 కలిపి రూ.2,250 చెల్లించాలి. ప్రస్తుతం ప్రకటించిన 50 శాతం రాయితీతో కిలోవాట్‌కు రూ.1,125 వసూలు చేశారు. రెండు కిలోవాట్ల అసలు ధర రూ.4,500, మూడు అయితే రూ.6,750, నాలుగు రూ.9 వేలు, ఐదు అయితే రూ.10,250గా నిర్ధారించారు. అదనపు లోడు క్రమబద్ధీకరణ బట్టి 50 శాతం రాయితీ ఇస్తారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్ల ఏర్పాటు..

పెరిగిన విద్యుత్తు లోడుకు అనుగుణంగా చిత్తూరు నగరంలో ఏడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అదనపు లోడు గుర్తించి ప్రాంతాల వారీగా అదనపు సామర్థ్యం కలిగిన నియంత్రికలు అమర్చారు. కట్టమంచి-దొడ్డిపల్లె వరకు ఏడు కిలోమీటర్ల దూరం రూ.1.50 కోట్లతో కొత్త విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సరఫరాలో అంతరాయాలు, నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు నగరంలో రూ.2 కోట్లతో నూతన ఉప-కేంద్రం(సబ్ స్టేషన్) మంజూరైంది. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేయనున్నారు.

నాణ్యమైన విద్యుత్తుకు అధిక ప్రాధాన్యం

అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. తద్వారా సంస్థకు మంచి ఆదాయం సమకూరింది. పెరిగిన లోడుకు అనుగుణంగా కొత్త లైన్లు, నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నాం.
- మునిచంద్ర, ఈఈ, చిత్తూరు అర్బన్ డివిజన్

చిలకం రామచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం

రామచంద్రారెడ్డి చిత్రపటం వద్ద భాజపా నాయకులు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భాజపా మాజీ అధ్యక్షుడు, దివంగత చిలకం రామచంద్రారెడ్డి నాలుగో వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం చిత్తూరు నగరంలోని భాజపా కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నగరి నుంచి గాలేరు వరకు ఆయన చేసిన పాదయాత్ర చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కొనియాడారు. నాయకులు దొరబాబు, షణ్ముగం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నగరి, న్యూస్‌టుడే: తడుకుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం సత్కరించి వీడ్కోలు పలికామని ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి పేర్కొన్నారు. గతంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన విజయభాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు మురుగేశన్, శివకుమార్, కేశవులును సత్కరించామన్నారు.

ఇలా శిథిలం అవ్వాల్సిందేనా..?

గ్రామాల్లో వ్యర్థాలను సేకరించి పంచాయతీల సంపద పెంపొందించేందుకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ-ఆటోలు పంపిణీ చేశారు. ఆపై అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. దీంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 20కు పైగా ఈ-ఆటోలు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ నిరుపయోగంగా ఉన్న వాటిని ఆయా పంచాయతీలకు తరలించారు. వీటిలో నాలుగు నేటికీ కార్యాలయ ఆవరణలోనే నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, బంగారుపాళ్యం**

తాగునీటి తిప్పలు తప్పేనా..?

చవరంబాకం మిట్ట దళితవాడలో వీధులకు తాగునీరు సరఫరా అయ్యే మోటారును కరెంటు ఉన్న సమయంలో ఆన్ చేయని కారణంగా తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఇక్కడి తాగునీటి మోటారుకు వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా అయ్యే సమయంలో త్రీఫేజ్ కరెంటు సరఫరా అవుతోంది. మిగిలిన సమయంలో గృహాలకు సింగిల్ ఫేజ్ కరెంటు సరఫరా అవుతోంది. సరఫరాలో సమయం మారినా ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతుల నిమిత్తం వ్యవసాయ కరెంటు సరఫరాలో అప్పుడప్పుడు సమయం మార్చి ఇస్తుంటారు. అలాంటి రోజుల్లో ఏమరుపాటుగా ఉండి మోటారు వేయకుంటే ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

-న్యూస్‌టుడే, నింద్ర

మూణ్నాళ్లకే మూలకు..

ఎన్నికలకు ముందు అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న మున్సిపల్ భవనాన్ని హడావుడిగా ప్రారంభించారు. గతంలో పంచాయతీ కార్యాలయాన్ని మున్సిపాలిటీ భవనంగా వినియోగించారు. ఈ నేపథ్యంలో నూతన భవనంలోని వాష్‌రూంలలో ఏర్పాటు చేసిన పైపులు కొన్ని మూలకు చేరగా.. తలుపులు మరమ్మతుకు గురయ్యాయి. వాటిని బాగుచేయాలన్న ధ్యాస అధికారులకు లేకపోవడం గమనార్హం.
- న్యూస్‌టుడే, పుత్తూరు

హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మామిడి రైతులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ నెల తొమ్మిదో తేదీన బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు రానున్నారని పార్టీ నాయకులు తెలిపారు. ఆయన రాక కోసం చిత్తూరు-పలమనేరు హైవే సమీప పలు స్థలాలను హెలిప్యాడ్ ఏర్పాటుకు గురువారం పరిశీలించారు. ఐదు స్థలాలు గుర్తించి వాటిలో అనువైన దాన్ని ఎంపిక చేసి అధికారులకు నివేదిస్తామని నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రులు ఆర్కే రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు కరుణాకర్‌రెడ్డి, సునీల్‌కుమార్, లలితకుమారి, నాయకులు దేవానందరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విధ్వంసం నుంచి వికాసం వైపు'

నగరి: ఎం.కొత్తూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, నాయకులు

పాలసముద్రం: మహిళలకు కరపత్రాలు అందిస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు, పార్టీ అధ్యక్షుడు రాజేంద్రన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా గురువారం 5, 6వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఏడాది కాలంలో సాధించిన విజయాలను వివరించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తెదేపా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, నియోజకవర్గ పరిశీలకులు మారుతి, నాయకులు సురేంద్రకుమార్ పాల్గొన్నారు. **నగరి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఎం.కొత్తూరులో పాల్గొన్నారు. నగరి మండలంలో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, సంక్షేమ పథకాల కోసం రూ.200 కోట్లు ఖర్చు చేశామన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి పేదవాడికి విద్య ఉచితం చేసి, ఉన్నత స్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు బోధిస్తోందన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఇతర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తెదేపా మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, కార్యదర్శి వేణు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.మీర, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామమూర్తి నాయుడు, నాయకులు వరదరాజులు, నారాయణస్వామినాయుడు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం పాల్గొన్నారు. **పాలసముద్రం:** తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాజేంద్రన్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ బీసీ కాలనీలో ఇంటింటికీ కరపత్రాలు అందించారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి వాసునాయుడు, పంచాయతీ అధ్యక్షుడు రాఘవ, కార్యదర్శి వెంకటేశులు నాయుడు, వాసుయాదవ్, రామచంద్ర, విజయకుమార్, మాజీ ఎంపీపీ మీనామోహన్, సర్పంచ్ హరిరాజు, తంగరాజు పాల్గొన్నారు. **పెనుమూరు:** తెదేపా మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో చిప్పారపల్లె పంచాయతీ గొబ్బిళ్ళమిట్టలో కరపత్రాలు పంచారు. జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, కలిగిరి కొండ మాజీ ఛైర్మన్ ఈశ్వర్ ప్రసాద్, రాజగోపాల్ నాయుడు, శ్రీనివాస చౌదరి పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** తెదేపా మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు.. ముద్దికుప్పం పంచాయతీలోని గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు. కుమార్, బాబు, హేమాద్రియాదవ్, చిన్నబ్బరాజు, వెంకటాచలం పాల్గొన్నారు.

చిత్తూరు: ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్మోహన్

నగర సుందరీకరణకు చర్యలు

జిగ్మా ఎన్విరాన్‌మెంట్ సొల్యూషన్స్ ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగర సుందరీకరణకు ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక లెనిన్‌నగర్‌లోని నగరపాలక కంపోస్టుయార్డులో కొనసాగుతున్న బయోమైనింగ్ పనుల్ని ఆయన పరిశీలించారు. జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. కంపోస్టుయార్డులో ఉన్న 1.20 లక్షల టన్నుల వ్యర్థాలను శుభ్రం చేసే పనుల్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలోని పురపాలక, నగరపాలక సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతంలో గ్రామ కమిటీలే కీలకం

మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

కార్వేటినగరం, న్యూస్‌టుడే: గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో గ్రామ కమిటీల పాత్ర కీలకమని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. కార్వేటినగరంలో నూతన గ్రామ కమిటీల ఎంపికను గురువారం నిర్వహించారు. కార్వేటినగరం, ఆర్‌కేవీబీపేట, సీడీకండ్రిగ గ్రామ కమిటీల నియామకాన్ని త్వరలో చేపడతామన్నారు. మాజీ ఎంపీపీ జనార్దన్‌రాజు, తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్రాయులుయాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, రవియాదవ్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలు

విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో ఉమామహేశ్వరరావు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని డీవైఈవో ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. రాచపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు.. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే లక్ష్యం నిర్దేశించుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు 580కు పైగా మార్కులు సాధించేలా చదవాలన్నారు. ఆరో తరగతి ఎన్‌రోల్‌మెంట్, విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా అందించిన కిట్ వివరాలను హెచ్‌ఎం మంగపతిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఆదర్శ పాఠశాలను సందర్శించారు.

ఉద్యోగుల ఆరోగ్య భద్రతే లక్ష్యం: రమాదేవి

జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ రమాదేవి, తదితరులు

రేణిగుంట, న్యూస్‌టుడే: అమరరాజ సంస్థ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను బాధ్యతగా తీసుకుంటుందని, దీనిలో భాగంగా ఏటా ఉద్యోగులకు వార్షిక వైద్య పరీక్షలకు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులు వారికి తెలియజేస్తుంటామని అమర ఆసుపత్రి ఎండీ గౌరినేని రమాదేవి అన్నారు. గురువారం స్థానిక అమర రాజ పరిశ్రమలో ఉద్యోగులకు వార్షిక వైద్య పరీక్షలను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు మంచి ఆహార అలవాట్లు, వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్య శిబిరంలో వివిధ పరీక్షలతో పాటు.. ఈ ఏడాది ప్రత్యేకంగా విటాలిటీ ఇండెక్స్ అనే టూల్ ప్రవేశపెట్టారు. ఇందులో నాలుగు ముఖ్య శారీరక ప్రమాణాల ఆధారంగా ఆరోగ్య స్థితి అంచనా వేసి సూచనలు చేస్తారు. అమరరాజ ముఖ్య ఆరోగ్య అధికారి చంద్రబాబు, చీఫ్ అధికారి ప్రశాంత్ తివారి పాల్గొన్నారు.

'మామిడిపై వైకాపా అసత్య ప్రచారం'

చిత్తూరు(జిల్లా పంచాయతీ): మామిడి పంటపై వైకాపా అసత్య ప్రచారం చేస్తున్నారని తెదేపా జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మామిడి కాయలు కిలో రూ.12కు కొనుగోలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందులో ఒక కేజీ మామిడికి ప్రభుత్వం రూ.4 రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. రూపాయి అయినా ఇచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. నాయకులు శశికర్‌బాబు, మేషక్, శ్యామ్, కందస్వామి పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీదేవి రథోత్సవం

కార్వేటినగరం: ద్రౌపదీ సమేత అర్జునుని రథోత్సవం వైభవోపేతంగా జరిగింది. ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి రథోత్సవం కనుల పండువగా సాగింది. తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రవియాదవ్, కార్యదర్శి గౌతం, ఉపాధ్యక్షుడు రవిరెడ్డి, అదనపు కార్యదర్శి సాయిరాయల్, కోశాధికారి లక్ష్మీపతిమొదలియార్ పాల్గొన్నారు.

సత్తాచాటి.. పతకాలు సాధించి

● క్రీడల్లో రాణిస్తోన్న యువత

న్యూస్‌టుడే, చిత్తూరు(క్రీడలు)

అవకాశాలు అందరికీ దక్కవు. వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకునేవారు కొందరే ఉంటారు.. ఈ కోవకు చెందిన వారు ఈ యువత.. ఆటల్లో మెరికల్లా సాధన చేస్తున్న ఈ యువత క్రీడల్లో సత్తా చాటుతూ దూసుకెళ్తున్నారు.. శిక్షకుల ప్రోత్సాహంతో క్రమశిక్షణ అలవరచుకుని పట్టు వదలకుండా పతకాలు సాధిస్తున్నారు.. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలనే సంకల్పంతో కసరత్తు చేస్తున్నారు.

సాధనతో విజయాలు..

గురుచరణ్ స్వస్థలం చిత్తూరు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన గురుచరణ్.. బాస్కెట్‌బాల్‌లో ఏడేళ్లుగా సాధన చేస్తున్నాడు. గతంలో స్కూల్ గేమ్స్, అసోసియేషన్ మీట్, యూనివర్సిటీ స్థాయిలో పలు మ్యాచ్‌లలో తలపడ్డారు. శిక్షకుల ప్రోత్సాహంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తూ ఆటలో పరిణతి సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లో సీనియర్స్ విభాగంలో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి గతేడాది రజత పతకాన్ని అందుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడమే తన లక్ష్యమంటున్నాడు.

పతకం లిఖితం..

కత్తిసాము (ఫెన్సింగ్) లో సత్తా చాటుతోంది చిత్తూరు నగరానికి చెందిన లిఖిత. ప్రస్తుతం బీటెక్ చదువుతోన్న ఈ యువతి.. పాఠశాల స్థాయి నుంచి కత్తిసాములో అత్యద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. క్షణకాలంలో విజేతల్ని తేల్చే కత్తిసాములో కఠోర సాధనతో ప్రావీణ్యం సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. శిక్షకుల సహాయంతో ఇప్పటివరకూ రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్య పతకాల్ని గెలుచుకుంది. తెలంగాణ, మణిపూర్ రాష్ట్రంలో జరిగిన జాతీయ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించింది. జాతీయ స్థాయిలో సత్తా చాటి.. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడమే తన లక్ష్యమంటోంది **లిఖిత**.

శెభాష్ అనిపిస్తూ..

చిత్తూరు నగరానికి చెందిన **నాగార్జున** బాస్కెట్‌బాల్ ఆటగాడు. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి. బాస్కెట్‌బాల్‌లో పదో తరగతి నుంచి సాధన చేస్తున్నాడు. ఎస్వీ వర్సిటీ తరపున నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. ఇటీవల జరిగిన వర్సిటీ స్థాయి క్రీడల్లో బంగారు పతకం సాధించాడు. దేశం తరపున ఆడటమే తన ఆశయం అంటున్నాడు.

మామిడి చెట్ల తొలగింపుపై జరిమానా..?

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మామిడికి గిట్టుబాటు ధరలేకపోవడంతో విసిగిన రైతు కుమార్ బుధవారం ఎకరా పొలంలో మామిడి మొక్కల్ని కూల్చి చదును చేపట్టారు. ఈ ఘటనపై గురువారం అటవీశాఖ అధికారులు వెళ్లి తోట పరిశీలించి రైతు కుమార్‌ను అటవీశాఖ కార్యాలయానికి పిలిపించి, వాల్టా చట్టం ప్రకారం జరిమానా కట్టాలని లేదా కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, మరోసారి శుక్రవారం కార్యాలయానికి రావాలని చెప్పడంతో రైతు అసహనానికి గురయ్యారు. కొందరు కూటమి నేతలు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగడం అన్యాయమని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తన బాధ అర్థం చేసుకోవాలన్నారు.

9న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

నగరి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈనెల తొమ్మిదో తేదీన జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ చట్టాలు రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. 12వ పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు వేలన్, బాషా, రాజేంద్ర, సతీష్, శేఖర్, నాగోమి, మురళి, ఉష, యేసయ్య పాల్గొన్నారు.

వైభవంగా క్షీరాభిషేకం

కార్వేటినగరం: సాయిబాబా ఆలయంలో గురువారం క్షీరాభిషేకం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఎంపీపీ లత, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ

గుడిపాల, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం అరక్కోణానికి చెందిన ప్రభాకర్(27) ప్రభు(48) మినీ వ్యానులో చిత్తూరు వస్తుండగా ఎదురుగా చెన్నై వెళ్తున్న లారీ వీరిని బొమ్మసముద్రం క్రాస్‌లో ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ సంఘం ఎంఈవో తిరుమలమ్మను ఉపాధ్యాయులు కోరారు. గురువారం ఆ మేరకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి చేస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాల పరిసరాల శుభ్రత

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో పరిశుభ్రంగా మారిన పరిసరాలను గురువారం జేసీబీతో శుభ్రం చేయించారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు మణికంఠ, సభ్యులు అజ్గర్‌అలీ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో పరిసరాల్లో వ్యర్థాలను తొలగించారు. ట్యాంకు వద్ద మురుగు నిల్వ లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో పరిశుభ్రత పనులు చేయడంతో విద్యార్థులకు సమస్య తీరింది.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండు చేశారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, మంజునాథ్ పాల్గొన్నారు.

కొంగాటంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు సన్మానం

కొంగాటంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు హామీ

వి.కోట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొంగాటం గ్రామంలో గురువారం వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పర్యటించారు. గ్రామస్థులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. వి.కోట మండలంలో లక్షకు పైగా జనాభా ఉన్నా.. ఒకటే పీహెచ్‌సీ ఉందని స్థానిక భాజపా నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొంగాటంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటునకు చర్యలు తీసుకొంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ భాజపా నేతలతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు అడిగి తెలుసుకొన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు కొంగాటం విజయ్ తదితరులు ఉన్నారు.

గుట్టలు కరుగుతున్నాయ్..!

❖ చురుగ్గా బయో మైనింగ్ పనులు

పుంగనూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం వ్యర్థాలను డంపింగ్ యార్డుల్లో పారబోసి చేతులు దులుపుకొంది. ఐదేళ్లలో చెత్తశుద్ధిపై ఏ మాత్రం దృష్టి సారించలేదు. దీంతో లక్షల టన్నుల చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించింది. అక్టోబరు 2 నాటికి చెత్తను పూర్తిగా రీసైక్లింగ్ చేయాలనే లక్ష్యంతో బాధ్యతలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు అప్పగించింది.

పుంగనూరు పురపాలక పరిధిలోని డంపింగ్ యార్డుల్లో ఏళ్ల తరబడి చెత్త పేరుకుపోయింది. ఓ వైపు దుర్వాసన, మరోవైపు కాలుష్యానికి కారణాలుగా పరిణమించాయి. వ్యర్థాల గుట్టలు ఎట్టకేలకు కరుగుతున్నాయి. అవగాహన లోపంతో ఏళ్ల తరబడి గుట్టలుగా ఉన్న వ్యర్థాలను నేడు సరైన రీతిలో నిర్వీర్యం చేస్తున్నారు. రూ.1.95కోట్లతో బయో మైనింగ్ ప్రాజెక్టు ద్వారా జిగ్మా గ్లోబల్ సెల్యూషన్స్ ఏజెన్సీ వారు చెత్త నిర్వీర్యం పనులు చేపట్టారు. పురపాలికలో 22,945 మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ ఉంది. వాటిలో మట్టి, ఇనుము, ప్లాస్టిక్, దుస్తులు వేరు చేసి 70శాతం వ్యర్థాలను స్థానికంగా రీసైక్లింగ్ చేస్తున్నారు. మిగిలినవి జిగ్మాకు తరలిస్తున్నారు.

ప్రాజెక్టు వివరాలిలా..
ఏజెన్సీ పేరు: జిగ్మా గ్లోబల్ సెల్యూషన్స్ ప్రై.లి.
ప్రాజెక్టు విలువ: రూ.1.95 కోట్లు
వ్యర్థాలు: 22,945 మెట్రిక్ టన్నులు
వ్యర్థాల్లో 70 శాతం: ల్యాండ్ ఫిల్లింగ్ కోసం
30 శాతం: సిమెంటు పరిశ్రమలు, భూమి చదును

పుంగనూరు డంపింగ్ యార్డులో కొనసాగుతున్న వ్యర్థాల తొలగింపు పనులు

పూర్తిస్థాయిలో దృష్టి

డంపింగ్ యార్డులోని వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంపై దృష్టి పెట్టాం. ఇప్పటికే పనులు జోరందుకున్నాయి. గుట్టలు తొలగిన స్థలాన్ని ఎలా ఉపయోగించుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజలు సైతం చెత్తను పురపాలక సిబ్బందికి అందించి సహకరించాలి. రోడ్లు, కాలువలపై వ్యర్థాలను వేయరాదు.
- మధుసూదనరెడ్డి, కమిషనరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు, న్యూస్‌టుడే: సమస్య: పుంగనూరు పట్టణ సమీపంలోని టిడ్కో గృహాల సముదాయం బ్లాకు నం.7లో పైప్‌లైన్ దెబ్బతింది. **- నవనీత, స్థానికురాలు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- మధుసూదనరెడ్డి, కమిషనరు, పుంగనూరు

సమస్య: మదనపల్లె రోడ్డులోని విస్తరణ ప్రాంతాల్లో వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నాం. రాత్రివేళల్లో చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. **- నరసింహులు**

సమాధానం: పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- మహేష్, డీఈఈ, పురపాలక సంఘం

పలమనేరు, న్యూస్‌టుడే: **సమస్య:** మున్సిపల్ పరిధిలోని దొరణాలచెగన్నవీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.
- సుందరం, పలమనేరు

సమాధానం: వీధుల్లో చెత్త తీయించి, పిచ్చి మొక్కలు తొలగిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: **సమస్య:** పురపాలక పరిధిలోని శాంతినగర్‌లో తాగునీటి బోరు మరమ్మతుకు గురైంది. **- చాంద్, కుప్పం**

సమాధానం: మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం పురపాలక**

సమస్య పరిష్కారం.. సాఫీగా ప్రయాణం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు-బెంగళూరు మార్గంలో స్థానిక పుంగమ్మ కట్ట రోడ్డుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, మట్టి దిబ్బలను అధికారులు తొలగించారు. సమస్యపై గత నెల 15న 'ఈనాడు'లో 'ప్రమాదకరంగా బెంగళూరు రహదారి' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన రహదారి భవనాల శాఖ డీఈ సురేష్‌బాబు రోడ్డు పొడువున ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో మట్టి తోలి ముళ్లపొదలు తొలగించారు.

తొలగిన పూడిక

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని వెంగళపల్లె పంచాయతీ గజ్జలవారి పల్లెలో సర్పంచి డి.నాగరత్నమ్మ కాలువలో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 27న 'ఈనాడు'లో పూడిక తొలగించరూ శీర్షిన వార్త ప్రచురితం కావడంతో ఆ మేరకు స్పందించారు.

ఈనాడు కథనానికి స్పందన

చెత్త తొలగించారు

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ముత్యాచారిపాళ్యం వీధిలో రోడ్లమీద పడిన వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. చెత్త కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఆ మేరకు అధికారులు స్పందించి శుభ్రత చర్యలు చేపట్టారు.

విన్యాసాలు.. తెస్తాయి ప్రమాదాలు

యువత మోటారు సైకిళ్ల విన్యాసాలతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. గురువారం పలమనేరు నుంచి మదర్‌థెరిసా కళాశాలకు వెళ్లే దారిలో మబ్బువాళ్లపేట వద్ద ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ఓ యువకుడు మరో వాహనాన్ని కాలితో నెడుతూ కనిపించారు. వారికి ముందు, వెనుక భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశముంది. ఈ విషయమై పలమనేరు సీఐ నరసింహరాజు మాట్లాడుతూ.. వాహనాలపై విన్యాసాలు చేసే వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. - న్యూస్‌టుడే, పలమనేరు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు విన్నవించేందుకు వచ్చిన బాధితులు

ముగిసిన సీఎం పర్యటన

ఈనాడు, చిత్తూరు; శాంతిపురం, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన విజయవంతమైంది. బుధ, గురువారాల్లో శాంతిపురం, కుప్పం పురపాలిక పరిధిలో పర్యటించిన చంద్రబాబు ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుప్పం ప్రభుత్వాసుపత్రిలో నెర్వ్ కేంద్రం ప్రారంభించారు. తెదేపా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు బెంగళూరుకు బయల్దేరారు. నాయకులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు.

చంద్రబాబుకు పీచుతో తయారు చేసిన వినాయకుడి చిత్రాన్ని అందిస్తున్న అభిమానులు

కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు అన్నారు. బేలుపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమం పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. తల్లికి వందనంలో ప్రతి విద్యార్థికి రూ. 13 వేలు అందజేయడం జరిగిందన్నారు. వృద్ధులు, వింతువులకు రూ. 4 వేలు చొప్పున పింఛను అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. సుబ్రహ్మణ్యం, రఘుచంద్రగుప్తా, చంద్రారెడ్డి, పళణి పాల్గొన్నారు.

పట్నపల్లెలో పథకాల గురించి మహిళకు వివరిస్తున్న తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, నాయకులు

డెంగీపై అప్రమత్తత అవసరం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: డెంగీ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మావతి అన్నారు. గంగినాయనిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆమె అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రత, వండిన ఆహారం వెంటనే తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. హెచ్ఈ కాంతమ్మ, వైద్య సిబ్బంది తిరుమలమ్మ, సాయిదివ్య పాల్గొన్నారు.

రాంనగర్ రోడ్డు.. రాకపోకలకు కష్టం

పురపాలక పరిధిలోని వనమలదిన్నె రోడ్డులో రాంనగర్ వద్ద రోడ్డుపై గోతులు పడ్డాయి. గోతులను తప్పించి వాహనాలు నడపడం కష్టంగా మారింది. రాత్రివేళల్లో గుంతలు తెలియక పలువురు ప్రమాదానికి గురవుతున్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు

ప్రహరీ పునర్నిర్మించరూ..!

పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రహరీ ఇటీవల కూలిపోయింది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రహరీ పడిపోవడంతో ఎదురుగా ఉన్న మరుగుదొడ్లకు వెళ్లడానికి బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ప్రహరీ పునర్నిర్మిస్తే బాలికలకు వసతిగా, రక్షణగా ఉంటుంది. - న్యూస్‌టుడే, పుంగనూరు

నీటి వృథా అరికట్టండి

మండలంలోని కందూరు పంచాయతీ బాలప్పగారిపల్లె నీటి ట్యాంకు నుంచి గ్రామానికి నీరసరఫరా అవుతున్న పైప్‌లైన్ మరమ్మతుకు గురైంది. దీంతో నీరు కలుషితమౌతోంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరమ్మతు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సోమల

దీపం కాదు.. మంట

విద్యుత్తు స్తంభంపైన దీపం వెలుగుతోంది.. అనుకుంటే పొరపడినట్టే.. తీగలు ఒకదానికి ఒకటి తగలడంతో మంటలు చెలరేగాయి. దీంతో పట్టణంలోని జవిళివీధి, గాంధీనగర్, ఎంసీపాళ్యం, ఆదిఆంధ్రావీధుల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. పట్టణ నడిబొడ్డులో నిత్యం వేలాది మంది సంచరించే బజారువీధిలో ఈ మంటలు కనిపించాయి. - న్యూస్‌టుడే, పలమనేరు

బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై నిరసన

వి.కోట, న్యూస్‌టుడే: మదనపల్లె సమీపంలో బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై దళిత సంఘాల నేతలు గురువారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొరస్వామి, గణపతి, వినోద్ తదితరులు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీపతిరాజ, ప్రదీప్‌రాజులు

కూటమి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమ ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తెదేపా నాయకులు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజులు పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపేటలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. యర్రగంగనపల్లెలో అసంపూర్తిగా ఉన్న యానాదుల ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఇళ్లను పూర్తి చేయాలని అధికారులను కోరారు. నాయకులు పగడాల హరిప్రసాద్, ప్రహ్లాద్, రామకృష్ణ, శివకుమార్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో..

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని 15వ వార్డులో శుక్రవారం చేపట్టనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొననున్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా ప్రారంభిస్తారు.

పారిశుద్ధ్య పర్యవేక్షణ తప్పనిసరి

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల తప్పనిసరని ఎంపీడీవో బాలాజీ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని కోగిలేరు, పెద్దవెలగటూరు పంచాయతీల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తసేకరణపై గ్రామాల్లో ప్రజలకు వివరించాలని చెప్పారు. అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. తాగునీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోగిలేరులో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

కమిషనరు మధుసూదనరెడ్డికి సమస్యలు చెబుతున్న టిడ్కో నివాస గృహాల ప్రజలు

సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌కు వినతి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక టిడ్కో గృహాల సముదాయంలో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని స్థానికులు గురువారం పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డికి వినతి చేశారు. పైపులైన్ల లీకేజీ, నీటి సరఫరాలో సిబ్బంది అస్తవ్యస్తంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నీటి సరఫరా కోసం కొందరు డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. కమిషనరు స్పందిస్తూ టిడ్కో అధికారులు తమకు స్వాధీనపరచకపోయినా నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ చేస్తున్నామని తెలిపారు. పురపాలక సిబ్బందిని నియమించామని ఇతరులకు డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పలు వీధుల్లో పీర్లు కొలువుదీరాయి. గురువారం స్థానిక కుమ్మరవీధిలో, సుబేదారువీధిలో పీర్లకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. కుమ్మరవీధిలో అన్నదానం చేశారు. ఏడో రోజుకు చేరుకున్న సంబరాల్లో చదివింపులు చేసి ప్రార్థనలు చేశారు. శనివారం అన్నదానం, ఆదివారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కుమ్మరవీధిలో కొలువుదీరిన పీర్లు

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులు

క్రీడా దుస్తుల వితరణ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పీడీ మురళీధర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు జర్సీలు అందజేశారు. ఉపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ.. బెంగళూరులో స్థిరపడ్డ పుంగనూరుకు చెందిన విజయభాస్కర్‌రాజు రూ. 20 వేలు వెచ్చించి 50 మంది క్రీడాకారులకు జర్సీలు అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకరటమణారెడ్డి, రమణమ్మ, శంకర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

వనిత.. వ్యాపార దక్షత

● రుణాలు సద్వినియోగం చేసుకుంటూ.. ఆర్థికంగా ఎదుగుతూ

సోమల, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లో చేరిన మహిళలు గ్రామ సమైఖ్య, మండల సమైఖ్య శ్రీనిధి, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. కుటుంబ ఆర్థిక చేయూతకు పిల్లల భవిష్యత్తుకు తమవంతు సహకారం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు

రుణాలు సకాలంలో చెల్లిస్తూ..

మండలంలోని కందూరుకు చెందిన మెహరూన్‌బీ శ్రీలక్ష్మి సంఘంలో సభ్యురాలు. స్థానికంగా చిన్నపాటి సప్లయి సామాను దుకాణం ప్రారంభించి వ్యాపారాన్ని వృద్ధి చేశారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తూ కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు తనవంతు సాయపడుతున్నారు.

కందూరులో సప్లయర్ దుకాణం నిర్వహిస్తున్న మెహరూన్‌బీ

కుటుంబం అభివృద్ధికి సహకారం

కందూరుకు చెందిన శ్రీదేవి శారద మహిళ సంఘంలో సభ్యురాలు. బ్యాంకుల్లో, గ్రామ సమైఖ్యలో రుణాలు తీసుకొని లీడర్‌గా కొనసాగుతూ.. స్థానికంగా దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నారు. కుటుంబం ఆర్థిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు.

దుస్తుల దుకాణంలో శ్రీదేవి

పిల్లలను ఉన్నతంగా చదివిస్తూ..

కందూరుకు చెందిన నాగభూషణం భార్య ఉమామహేశ్వరి వాసవీ మహిళా సంఘంలో సభ్యురాలు. బ్యాంకు ద్వారా రుణాలు తీసుకొని హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నారు. భర్తకు తనవంతు సహకారం అందిస్తూ తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు.

హార్డ్‌వేర్ దుకాణంలో ఉమామహేశ్వరీ

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

సోమల, న్యూస్‌టుడే: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని అధైర్య పడాల్సిన అవసరం లేదని మండల తెదేపా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లె, మఠంగొల్లపల్లె, దిడ్డివారిపల్లె తదితర గ్రామాల్లో నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర, జనార్ధన, మల్లికార్జున, మహేంద్ర బాబు, అష్రఫ్‌అలీ, నౌషాద్ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని చదళ్ల వద్ద చౌడేపల్లె మండలం ఊటూరు గ్రామానికి చెందిన మునెప్ప టమాటా లోడుతో గురువారం పుంగనూరుకు వస్తుండగా టెంపో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

అనాథ శవానికి అంత్యక్రియలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరులోని అంబేడ్కర్ భవన్ సమీపంలో బుధవారం మృతి చెందిన అనాథ శవానికి ఏఎస్సై అశ్వర్థనారాయణ, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గురువారం స్థానిక శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు.

(c) eenadu

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై డైరెక్టర్ కల్నల్ ఆర్కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. యానాంతో పాటు శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలకు చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. రోజూ 800 మంది వరకు అభ్యర్థులు పాల్గొంటారని, వీరికి ఆహారం ఏర్పాటు చేయదలచిన వారు నోడల్ అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులానాయక్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. 77020 03535 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న కల్నల్ ఆర్కే సింగ్

పనులు మరింత సులభం

స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల మంజూరులో మెప్మాలో ఆర్పీలకు ట్యాబ్‌లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. తెదేపా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆనందరావు మెప్మా ఉద్యోగులకు, సీఈవోలకు, ఆర్పీలకు గురువారం ట్యాబ్‌లు అందజేశారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

రైల్వేలైను.. అడ్డంకులు తొలగేను

కోటిపల్లి-నర్సాపురం మధ్య పనుల ఆరంభమే తరువాయి

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, అల్లవరం: కోనసీమ వాసుల చిరకాల స్వప్నం నెరవేరే పరిస్థితి కనిపిస్తోంది. కోటిపల్లి-నర్సాపురం మధ్య రైలు కూత వినిపించేందుకు మార్గం సుగమం అయింది. రైల్వే అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు నెలకొన్న కొన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగాయని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ముందుకెళ్లడమే తరువాయి అని స్పష్టం చేస్తున్నారు. అల్లైన్‌మెంట్‌పై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా స్టే విధించడంతో ఆ మధ్య పనులు నిలిచిపోయాయి. తాజాగా ఆ స్టేను ఎత్తివేశారని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు. అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద గోదావరిపై వంతెన నిర్మించే ప్రాంతంలో సామగ్రి నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కలెక్టర్ మహేశ్‌కుమార్ చొరవ చూపి సమస్య పరిష్కరించారు. దీంతో వాటికీ అడ్డంకులు తొలగాయి. ఇక రైల్వే లైను పనులు ఊపందుకోవడమే తరువాయి.

రెండు ప్రాంతాల పరిధిలో..

రైల్వే లైన్ వల్ల అమలాపురం మండలం జల్లపల్లి నుంచి పేరూరు వరకు, మలికిపురం మండలం గుడిమెళ్లంక వద్ద విలువైన భూములు కోల్పోతున్నామని పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక 2003-04లో సేకరించినవాటికి అప్పట్లో పరిహారం చెల్లించినా భూములు స్వాధీనం చేసుకోలేదు. ప్రాజెక్టు పట్టాలెక్కుతున్న నేపథ్యంలో తాజా భూసేకరణ ధరలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద నిర్మాణ ప్రక్రియ

“కోటిపల్లి- నర్సాపురం మధ్య రైల్వే నిర్మాణ పనులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులు తొలగాయి. భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి మాకు స్వాధీనపరచగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.” అని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు.

భూసేకరణ ఇలా..

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌లో కోటిపల్లి నుంచి అమలాపురం వరకు 12.07 కి.మీ.. అమలాపురం-నర్సాపురం మధ్య 45.17 కి.మీ మేర రైల్వే ట్రాక్ ఏర్పాటు (మొత్తం 57.21 కి.మీ) కానుంది. కోనసీమ జిల్లాలో 45.65 కి.మీ, పశ్చిమ గోదావరిలో 11.55 కి.మీ వస్తుంది. రైల్వే లైనుకు 26 గ్రామాల పరిధిలో 351.77 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటికే ఎనిమిది గ్రామాల పరిధిలో 112.86 హెక్టార్లు సేకరించి రైల్వే శాఖకు అప్పగించారు. పేరూరు, పాశర్లపూడి, గుడిమెళ్లంక వద్ద మూడు వంతెనలకు 24.10 ఎకరాలు తీసుకున్నారు. 18 గ్రామాల పరిధిలో 238.91 హెక్టార్లు ఇంకా సేకరించాల్సి ఉంది. రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా 13 గ్రామాల పరిధిలో 161 హెక్టార్లలో సర్వే చేశారు. మరో అయిదు గ్రామాల పరిధిలోని 75.96 హెక్టార్లకు సంయుక్త సర్వే చేపట్టాల్సి ఉంది. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో వేగం పెరగనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఆరోగ్యంగా బడికి వచ్చేలా...!

విద్యార్థులకు వైద్య పరీక్షలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా జిల్లాలో గురువారం నుంచి పరీక్షలు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లో చదువుకుంటున్న 3-18 ఏళ్ల మధ్య విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు.

జిల్లా వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	1575
విద్యార్థులు	1,08,272
అంగన్‌వాడీ కేంద్రాలు	1,726
3–6 ఏళ్ల లోపువారు	38,083
గురుకులాలు	6
విద్యార్థులు	5,250
పరీక్షలు చేసే సిబ్బంది	947 మంది

ప్రణాళిక రూపకల్పన..

చిరుప్రాయంలోనే వ్యాధులను గుర్తించి విద్యార్థి ఆరోగ్య జీవనానికి బాటలు వేయాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. వైద్య పరీక్షలు నిర్వహించే ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ పూర్తి చేశారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారులను గుర్తించి ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం అందిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారుంటే నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 1,575 ప్రభుత్వ పాఠశాలల్లో 1,08,272 మంది చదువుతున్నారు. 1,726 అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో 3 నుంచి ఆరేళ్ల వయసు చిన్నారులు 38,083 మంది ఉన్నారు. జిల్లాలోని ఆరు గురుకులాల పరిధిలో సుమారు 5వేల మంది చదువుతున్నారు. వీరికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి స్థానిక వైద్యాధికారికి రిఫర్ చేస్తారు.

ఎత్తు, బరువుకు సంబంధించినవి..

ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండటం లేదు. ప్రతి ఒక్కరూ పోషకాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వయసుకు తగిన బరువు, ఎత్తు ఉన్నారా? లేదా? అని పరీక్షిస్తారు. ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే తల్లిదండ్రుల సమావేశం నిర్వహణకు ముందే ఈ పరీక్షలు పూర్తి చేయాలని భావిస్తున్నారు. అందులో గుర్తించిన ఆరోగ్య సమస్యలను ఆ రోజు వారి తల్లిదండ్రులకు వివరించనున్నారు.

అమలాపురం డివిజన్ పరిధి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

త్వరితగతిన పూర్తి చేస్తాం

పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పిల్లల ఆరోగ్యం ఎలా ఉందనే సమాచారం తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభించాం. ఈ నెల 10వ తేదీలోగా ప్రాథమిక పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

-డా.సుమలత, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త

ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో.. అయిదుగురి సస్పెన్షన్, తహసీల్దార్‌కు నోటీసు

‘ఈనాడు, ఈటీవీ’ కథనాలకు స్పందన

ఈనాడు, అమలాపురం: కపిలేశ్వరపురం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో ఇసుక తవ్వకాలు చేపట్టినవారిపై చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిషేధం ఉన్నా ఇక్కడ అడ్డగోలుగా తవ్వకాలు సాగుతున్నాయి. అయినా పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అయిదురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. కపిలేశ్వరపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు ఇస్తూ కలెక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైనవారిలో నిదసనమెట్ల గ్రేడ్-5 కార్యదర్శి, టేకి, కపిలేశ్వరపురం వెల్ఫేర్ అసిస్టెంట్లు, తాతపూడి పంచాయతీ కార్యదర్శి, పశువైద్య సహాయకుడున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడ ఉల్లంఘనలు జరిగినా వాహనాలు స్వాధీనం చేసుకుని, భారీగా జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. క్షేత్రంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ తవ్వకాల నేపథ్యంలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు శుక్రవారం నిర్వహించనున్న జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అధికారులు విస్తృతంగా దాడులు చేస్తుండడంతో కొందరు నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతున్నట్లు తెలుస్తోంది.

లిప్తపాటులో మృత్యు కాటు

- కారు టైరుపేలి ప్రమాదం.. భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు
- స్వల్పంగా గాయపడిన మరో ఇద్దరు

రావులపాలెం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: వారిద్దరూ కష్టజీవులే.. కుటుంబ పోషణలో ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అనుకోని ప్రమాదంలో మృత్యువు వీరి బంధాన్ని విడదీసింది. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవ్వడంతో భర్త మృతిచెందగా భార్య తీవ్ర గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన బొండాల వెంకటలక్ష్మీనరసింహగుప్తా(51) గ్రామంలోనే పరుపుల వ్యాపారం చేస్తుండగా ఆయన భార్య వీర వెంకటలక్ష్మి మగ్గంవర్కు చేస్తుంటారు. ఈమె చేస్తున్న మగ్గం వర్కుకు చెందిన మిషన్లు పాడవ్వడంతో మరమ్మతు చేయించుకోవడానికి గురువారం ఇద్దరూ కలిసి కారులో రాజమహేంద్రవరం బయలుదేరారు. రావులపాలెం సమీపంలోని ఈతకోట టోల్‌ప్లాజా దాటిన తరువాత ఒక్కసారిగా వాహనం టైరుపేలి డివైడర్‌పై నుంచి అవతల వైపునకు దూసుకుపోయింది.

సంఘటనా స్థలంలో క్రేన్లతో కార్లను తొలగిస్తున్న అధికారులు

ముందుభాగం పూర్తిగా ధ్వంసం కావడంతో ఇద్దరూ అందులో ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి వెంకటలక్ష్మిని బయటకు తీశారు. డ్రైవింగ్ సీటులో ఉన్న గుప్తాను అతికష్టం మీద బయటకి తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలవ్వడంతో కొత్తపేట ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌పై నుంచి దూసుకుపోవడంతో అదే మార్గంలో రాజమహేంద్రవరం నుంచి పెనుగొండ వెళుతున్న మరో కారుని ఢీకొంది. దీంతో అందులో ఉన్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, రాజమహేంద్రవరానికి చెందిన భార్యాభర్తలు కర్రి రామారెడ్డి, దివ్యపద్మజ్యోతిలకు గాయాలయ్యాయి. రావులపాలెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. వీరు పెనుగొండలోని ఓ శుభకార్యం నిమిత్తం వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. క్షతగాత్రులు కోలుకుంటున్నట్లు చెప్పారు.

కారులో ఇరుక్కుపోయిన నరసింహగుప్తా

నరసింహగుప్తా

ఓర్పుగా వింటూ.. అభివృద్ధిని చెబుతూ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఏడాది కాలంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు సంక్షేమపథకాలు అందించారని, ఇచ్చిన హామీలను నెరవేర్చారని కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమాన్ని రెండోరోజు గురువారం రామచంద్రపురం మండలం ఓదూరు నుంచి ప్రారంభించి నరసాపురపుపేట, అగ్రహారం, చోడవరం, యనమదల గ్రామాల్లో నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టాలను ఓపిగ్గా వింటూ వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు అందించారు. నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో ముచ్చటించారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం చేశారు. పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల ఉద్యోగాలు కల్పనకు ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. పార్టీ నాయకులు కాకినాడ రామారావు, తెదేపా మండలాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, పెంకే సాంబశివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓదూరులో బాధితుడితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో పీ-4, వార్షిక రుణ ప్రణాళిక, సూర్య ఘర్ పథకం అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శకుల ద్వారా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించాలన్నారు. అన్న క్యాంటీన్లలో ప్రజలకు మెరుగైన భోజనం అందించాలన్నారు. సూక్ష్మ రుణాల కల్పనలో బ్యాంకర్లు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులు ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. జేసీ నిశాంతి, డీఆర్వో రాజకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దూర దృశ్య సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్ష చేశారు.

సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

నదీపాయల్లోకి వరదనీరు

గోదావరి వరదల సీజన్ మొదలైంది. గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో ధవళేశ్వరం బ్యారేజీకి నీరు చేరుతోంది. గురువారం దీని నుంచి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు మొత్తం 12,150 క్యూసెక్కుల మేర సరఫరా చేశారు. మిగిలిన సుమారు లక్ష క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి నదికి వరదనీరు తగలడంతో ఈ జలాలు క్రమేపీ రంగు మారుతున్నాయి. బ్యారేజీ నుంచి సుమారు లక్ష క్యూసెక్కులు విడిచిపెట్టడంతో దిగువున ఉన్న గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లోకి చేరి ఇక్కడి నుంచి సముద్రంలోకి వెళుతుంది. పి.గన్నవరం మండలం బూరుగులంకరేవులో బుధవారం మధ్యాహ్నం వరకు నీరు లేదు. ప్రస్తుతం దిగువకు అదనపు జలాలు విడిచిపెట్టడంతో ఈ రేవు వద్ద నదీపాయలోకి క్రమేపీ చేరుతుంది. బ్యారేజీ నుంచి రెండు లక్షలు పైబడి సముద్రంలోకి విడిచిపెడితే బూరుగులంక రేవులో మరింతచేరి ఇక్కడ తాత్కాలిక బాట కొట్టుకుపోతుంది. అలా జరిగితే గోదావరి మధ్యలో ఉన్న బూరుగులంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక గ్రామాల ప్రజలు మరపడవలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. రానున్న నాలుగు రోజుల్లో వరద జలాలను బట్టి ఇక్కడ పరిస్థితి ఉంటుంది. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

పి.గన్నవరం అక్విడక్టు దిగువన రంగుమారి గోదావరి జలాలు

బూరుగులంకరేవులో తాత్కాలికబాటను తాకుతున్న నీరు

వచ్చే ఏడాది ఉత్తరాంధ్రకు గోదావరి: మంత్రి నిమ్మల

పురుషోత్తపట్నం నుంచి 1,400 క్యూసెక్కుల నీటి విడుదల

సీతానగరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పూర్తయ్యేలోగా ఎడమకాలువ కింద ఉత్తరాంధ్రలోని ఆయకట్టుకు వచ్చే ఏడాది నుంచి నీళ్లు తరలించేలా పనులు వేగవంతం చేశామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి 1,400 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎడమకాలువ పరిధిలో 204.800 కిలోమీటర్ల పనులను పూర్తి చేసేందుకు రూ.2,050 కోట్లతో టెండర్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. పురుషోత్తపట్నం, ఏలేరు జలాశయానికి 30 టీఎంసీల నీటిని సరఫరా చేసే సమయంలోనే ఉత్తరాంధ్రకూ మళ్లిస్తామన్నారు. గత తెదేపా హయాంలో రాష్ట్రంలో 1,041 ఎత్తిపోతల ద్వారా 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే, వైకాపా 450 ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో వైకాపా పెట్టిన రూ.18వేల కోట్ల బకాయిలను తీరుస్తూనే అన్ని ఎత్తిపోతల పథకాలను గాడిలో పెడుతున్నామన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పుష్కర కాలువలకు నీటి విడుదలకు స్విచ్ వేస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు బత్తుల, నెహ్రూ, రుడా ఛైర్మన్ చౌదరి, తదితరులు

ఎక్కడివారు అక్కడే..!

వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల జాబితా విడుదలైంది. పట్టణం పరిధిలోనే బదిలీ చేయాలనే ఉద్యోగుల డిమాండ్ నెరవేరింది. ఎక్కువ మంది ఉద్యోగులు తాము పనిచసే పట్టణాల పరిధిలోని వార్డుల్లోనే ఉన్నారు. అక్కడి వారిక్కడికి.. ఇక్కడి వారక్కడికి అన్న చందంగా మార్పులు జరిగాయి.

జిల్లాలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం పురపాలక సంఘాలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీతో కలిపి 48 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో పనిచేసే వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, వార్డు ఎడ్యుకేషన్, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శి, వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శుల బదిలీలు పూర్తయ్యాయి.

116 మంది వరకు..

వార్డు సచివాలయాల్లో 116 మంది ఉద్యోగులు అదే పట్టణ పరిధిలోని ఇతర వార్డు సచివాలయాలకు బదిలీ అయ్యారు. 17 మంది ఉద్యోగులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వివిధ పురపాలక సంఘాలకు బదిలీపై వెళ్తున్నారు. నాలుగు పట్టణాల్లో వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు 15 మంది, ఎడ్యుకేషన్, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు 30 మంది, వార్డు శానిటరీ ఎన్విరాన్‌మెంటల్ క్యాదర్శులు 35 మంది, వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులు 36 మంది ఆయా పురపాలక సంఘాల పరిధిలోనే బదిలీ అయ్యారు.

జిల్లా వివరాలు ఇలా..

పట్టణం	ఉద్యోగులు
అమలాపురం	45
ముమ్మిడివరం	17
రామచంద్రపురం	29
మండపేట	25

ఇతర పట్టణాలకు..

మండపేట పురపాలక సంఘం పరిధిలోని నలుగురు ఉద్యోగులు రాజమహేంద్రవరం, రామచంద్రపురం, పిఠాపురం పట్టణాల్లోని వార్డు సచివాలయాలకు బదిలీ అయ్యారు. రామచంద్రపురం పరిధిలోని వార్డు సచివాలయాల నుంచి నలుగురిని మండపేట, సామర్లకోట, ముమ్మిడివరంలోని వార్డు సచివాలయాలకు బదిలీ చేశారు. అమలాపురం పట్టణ పరిధిలోని ఓ ఉద్యోగి, ముమ్మిడివరం పరిధిలోని వార్డు సచివాలయాల నుంచి అయిదుగురు కాకినాడ, రామచంద్రపురం, పెద్దాపురం, అమలాపురం పట్టణాలకు బదిలీ అయ్యారు.

విద్యా పూదోట.. ప్రతిభా సుమాల కోట

న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

లక్షలాది మందిని ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంతో పాటు వేలాదిమంది పారిశ్రామిక వేత్తలు, సివిల్ సర్వెంట్లు, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులను అందించిన విజ్ఞాన భాండాగారం జేఎన్‌టీయూకే. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు... రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయదలిచిన ఇంజినీరింగ్ కళాశాలను, అక్కడి పరిస్థితుల దృష్ట్యా కాకినాడకు మార్చారు. 1946లో ప్రారంభమైన ఆ కళాశాల మద్రాస్ రాష్ట్రంలో యూనివర్సిటీకి అనుబంధంగా మూడు కోర్సులతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అనంతరం జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు అనుబంధంగా కొనసాగింది. 2008లో ప్రత్యేక యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి నేటి వరకూ ఎంతో మంది ఇక్కడ నుంచి పట్టభద్రులయ్యారు. నేడు ఈ విద్యాలయం 11వ స్నాతకోత్సవానికి ముస్తాబైంది.

నేడు జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం

జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సందర్భంగా 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తారన్నారు.

పలువురికి బంగారు పతకాలు

ఛాన్సలర్, ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన 40మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డులు, బంగారు పతకాలు అందజేస్తారని చెప్పారు.

విద్యుత్తు అలంకరణ మధ్య జేఎన్‌టీయూకే ప్రాంగణం

పూర్వ విద్యార్థిగా సేవలందిస్తున్న సుబు కోట

స్నాతకోత్సవం సందర్భంగా కోట సుబ్రహ్మణ్యానికి(సుబు కోట) గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నారు. విజయవాడలో పుట్టి పెరిగిన సుబ్రహ్మణ్యం 1962 ప్రాంతంలో జేఎన్‌టీయూకేలో ఇంజినీరింగ్ చదివారు. అనంతరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో మాస్టర్ డిగ్రీకి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చేరారు. తర్వాత న్యూయార్క్‌లోని రోచెస్టర్ యూనివర్సిటీ ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడ్డారు. డేటా జనరల్ సిస్టమ్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా చేరిన ఆయన ఉత్తమ ప్రోగ్రామర్‌గా అవార్డు అందుకున్నారు. అనంతరం అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్‌గా ఎదిగిన సుబు కోట తాను చదివిన జేఎన్‌టీయూకేకు తనవంతుగా చేయూతనిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా స్టార్టప్‌ల ఏర్పాటుకు సుబు కోట ఫౌండేషన్, జేఎన్‌టీయూకే సంయుక్తంగా రూ.కోటి కేటాయించారు. వర్సిటీ పూర్వవిద్యార్థిగా ఆయన అందిస్తున్న సేవలకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

ఎందరో ప్రముఖులు...

దేశానికి మెట్రోరైలును పరిచయం చేసి మెట్రోమేన్ పేరుగాంచిన పద్మవిభూషణ్ శ్రీధరన్, మధ్యతరగతి ప్రజల మనస్సులు చూరగొన్న మారుతి కారు రూపకల్పన చేసి సంచలనం సృష్టించిన భాస్కరుడు, ఫార్మారంగంలో ఎన్నో వ్యాక్సిన్లు తయారు చేసిన శాంతా బయోటెక్ స్థాపకులు వరప్రసాద్‌రెడ్డి, సాంకేతికరంగంలో సంచలనం సృష్టించిన ఇన్ఫోటెక్ ఫౌండర్ ఛైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి, అంతరిక్ష రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్, ఇక్కడి విద్యార్థులే. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారులు ముద్దాడ రవిచంద్ర జే.శ్యామలరావు, నాగులాపల్లి శ్రీకాంత్, కె.కన్నబాబు, ఎంటి.కృష్ణబాబు, ఎస్‌వి.ప్రసాద్, ఓంకార్ శర్మ, ఐపీఎస్ అధికారి నాగేంద్రకుమార్ తదితరులతోపాటు, అమెరికాలో వివిధ కంపెనీలు స్థాపించివారు, ప్రముఖ కంపెనీలకు వైస్ ప్రెసిడెంట్లు, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థులు కావడం గమనార్హం.

(c) eenadu

ఏపీ జేఏసీ కో-ఛైర్మన్‌గా శ్రీనివాసరావు

రాష్ట్ర ఛైర్మన్ విద్యాసాగర్‌తో పామ శ్రీనివాసరావు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పామ శ్రీనివాసరావు ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐకాస (ఏపీ జేఏసీ) కో-ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఏపీఎన్జీజీవో భవన్‌లో జరిగిన ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఏపీటీఎస్ఏ ఉమ్మడి జిల్లాశాఖ, ఏపీ ఎన్జీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పీవీ కృష్ణ తదితరులు ఆయనను అభినందించారు.

71 మందికి ఒకటే మరుగుదొడ్డి

గంగలకుర్రు గుంతమామిడిదొడ్డి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 66 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరికీ ఒకటే మరుగుదొడ్డి. అదీ కూడా అధ్వానంగా ఉంది. రెండు సిమెంటు రేకులు బోటు పెట్టి అడ్డుగా కర్టెన్ వేశారు. గత వైకాపా పాలనలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు అప్పటి పాలకులు భూమి పూజ చేశారు. రూ.6 లక్షలు మాత్రమే రావడంతో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీనిపై మండల విద్యాశాఖాధికారి మోకా ప్రకాష్‌ను వివరణ కోరగా ఇక్కడి సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తున్నామని చెప్పారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

పైన నిప్పులు.. కింద పూలు

విద్యుత్తు నియంత్రికల కింద చిరు వ్యాపారులు

అమలాపురం గడియార స్తంభం నుంచి బస్టాండ్ వైపు వెళ్లే మార్గంలో విద్యుత్తు నియంత్రిక మధ్య కొందరు చిరువ్యాపారులు ప్రమాదకర పరిస్థితిలో దుకాణాలు నడుపుతున్నారు. ఇక్కడ కుట్టుమిషన్, పూల దుకాణం ఉన్నాయి. ప్రమాదమని తెలిసినా..ప్రత్యామ్నాయం లేక ఆ ప్రాంతాన్ని వీడటం లేదు.

– న్యూస్‌టుడే, కోనసీమ

పశువైద్యం.. పాడి రైతులకు దూరం

బదిలీల నేపథ్యంలో ఖాళీ అయిన పోస్టులు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పశువైద్యుల కొరతతో పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పశుసంవర్ధక శాఖలో బదిలీలు నిర్వహించారు. వెళ్లినవారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 ఆసుపత్రులకు పూర్తిస్థాయి వైద్యులులేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సమీపంలోని సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. ఒక్కొరికి రెండేసి చోట్ల విధులు నిర్వహించాల్సి రావడంతో సేవలు గగనంగా మారుతున్నాయి.

■ **ఎక్కడెక్కడ అంటే..**

కొత్తలంక, మామిడికుదురు, కొమరగిరిపట్నం, మానేపల్లి, అంబాజీపేట, మండపేట, ద్వారపూడి, ఆత్రేయపురం, [illegible], అంగరతో పాటు పి.గన్నవరంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో సహాయ సంచాలకుడి హోదాలో వైద్యుడు లేని పరిస్థితి నెలకొంది. పి.గన్నవరంలోని సహాయ సంచాలకుడు పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు సంబంధించి పాలనాపరమైన వ్యవహారాలతో పాటు పి.గన్నవరంలో ఆసుపత్రికి వచ్చే పశువులకు వైద్యసేవలు అందించేవారు. ఇక్కడ రెండేళ్లుగా అమలాపురం ఏ.డీ. ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా బదిలీ అయిన వారిస్థానంలో కొత్తవారిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. రైతుసేవా కేంద్రాల పరిధిలో గ్రామీణ పశుసంవర్ధక శాఖ సహాయకులు 230 మందికి గాను 220 మంది ఉన్నారు. పదిచోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని సైతం భర్తీ చేయాల్సి ఉంది.

జిల్లా వివరాలు	
పశువుల ఆసుపత్రులు	63
గ్రామీణ పశువైద్యశాలలు	25
ప్రాంతీయ ఆసుపత్రులు	11
గోపాలమిత్రలు	72
గేదెలు	1.10 లక్షలు
ఆవులు	56,000
మేకలు, గొర్రెలు	45,000

పి.గన్నవరంలోని ప్రాంతీయ పశువుల ఆసుపత్రి ఇది. రెండేళ్లుగా ఏ.డీ. లేకపోవడంతో ఇన్‌ఛార్జితో నెట్టుకొస్తున్నారు

■ **ఇన్‌ఛార్జులను నియమించాం**

బదిలీ అయినవారి స్థానంలో కొత్తవారు చేరలి. ప్రస్తుతం వైద్యులులేని చోట సమీపంలోని ఆసుపత్రుల వైద్యులను ఇన్‌ఛార్జిగా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించాం. పశువులకు సకాలంలో వైద్యసేవలు అందించేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం. - డాక్టర్ కె.వెంకటరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ప్రైవేటు పాఠశాలలను కాపాడాలి

గడియారస్తంభం కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉచిత సీట్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని ప్రైవేటు పాఠశాల సంఘ నాయకులు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలకు సెలవు ప్రకటించి సంఘ నాయకులు అమలాపురం గడియారస్తంభం కూడలిలో నిరసన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను కాపాడాలని నినాదాలు చేశారు. గత ప్రభుత్వంలో నాలుగు సంవత్సరాల బకాయిలను వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి డీఆర్వో రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు లక్ష్మీశ్రీనివాస్, కార్యదర్శి బి.రమేష్, సతీష్, తులసీ రమేష్, చెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేవు పాట మళ్లీ వాయిదా

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం, పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు పాట మళ్లీ వాయిదా పడింది. 2025-26 సంవత్సరానికి జాయింట్ కౌన్సిల్ సభ్యులు రాని కారణంగా జిల్లాలో శుక్రవారానికి వాయిదా పడిన పాటను తిరిగి ఈ నెల 14న పోలవరం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ(హైదరాబాద్), న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఏటా మాదిరి వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని '2023 ప్రతిభా పురస్కారాల'కు ఎంపిక చేసింది. ఎలనాగ(కవిత), డా.ప్రభల జానకి(విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మిరెడ్డి (చిత్రలేఖనం), సంపత్‌రెడ్డి(శిల్పం), పేరిణి రమేష్‌లాల్(నృత్యం), హరిప్రియ(సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి(పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ(నాటకం), కడకంచి పాపయ్య(జానపద కళారంగం), దూళిపాళ మహదేవమణి(అవధానం), ఆచార్య కె.మలయవాసిని(ఉత్తమ రచయిత్రి), డా.శాంతి నారాయణ(నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు గురువారం ప్రకటనలో తెలిపారు. త్వరలోనే విశ్వవిద్యాలయంలో అవార్డుతోపాటు ఒక్కొక్కరికి రూ.20,116 నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు.

మరింత నాణ్యతతో మధ్యాహ్న భోజనం

పరిశీలన చేపట్టిన రాష్ట్ర ఆహార సంఘ సభ్యులు

పామర్రు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిటీ కమిషనర్, సభ్యులు, డీఎస్‌వో

పామర్రు, మండపేట, న్యూస్‌టుడే: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యతతో ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆహార సంఘం కమిషనర్ ఇ.లక్ష్మీరెడ్డి, రాష్ట్ర సంఘం సభ్యులు జక్కంపూడి కిరణ్ వెల్లడించారు. గురువారం కె.గంగవరం మండలంలో ఈ సభ్యుల బృందం పర్యటించింది. సుందరపల్లి, పామర్రు ఉన్నత పాఠశాలలు, సుందరపల్లి ప్రాథమిక పాఠశాల, కె.గంగవరం చౌకధరల దుకాణం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పాఠశాలలకు అందిస్తున్న సన్న బియ్యంలో వచ్చే నెల నుంచి పోషకాలుండేలా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపి ఇవ్వడానికి చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సుందరపల్లి పాఠశాల, పామర్రు ఉన్నత పాఠశాలల్లో భోజనం బాగుందన్నారు. సుందరపల్లి ప్రాథమిక పాఠశాలలో మెరుగుపడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం తక్కువగా ఉంటోందని, సరైన వసతులు కూడా లేవని, వీటిని ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని రామచంద్రపురం సీడీపీవోను ఆదేశించారు. భోజన పథకాన్ని తనిఖీలు చేస్తున్నారా? పోషకాలు పరిశీలిస్తున్నారా? అని పీహెచ్‌సీ వైద్యాధికారిణి హర్షితను ప్రశ్నించారు. కె.గంగవరంలోని చౌకధరల దుకాణాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఉదయభాస్కర్, పి.శ్రీనివాసరావు, సురేష్, వై.రామయ్య, ఎంఈవో సీహెచ్.ఆంజనేయులు, సీఎంఆర్టీ జి.వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ● డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి సంబంధించి మండపేటలోని పౌరసరఫరా శాఖకు చెందిన గోదాములను ఈ సభ్యుల బృందం తనిఖీ చేసింది. రికార్డులు పరిశీలించి నిల్వల వివరాలు తెలుసుకున్నారు.

వింత టేకు చేప

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో గురువారం వింత టేకు చేప ఆశ్చర్యపరిచింది. తలభాగం [illegible] ముందుకు ఉండటం ఇదే మొదటిసారి చూడటమని గంగపుత్రులు అంటున్నారు. ఇది కేవలం 400 గ్రాముల బరువు ఉంది. దీనిని అనంతరం గోదావరిలోకి విసిరేశారు. ఇది టేకు జాతికి చెందినదేనని మత్స్యశాఖ ఏడీ వర్ధన్ తెలిపారు. - న్యూస్‌టుడే, అంతర్వేది

కొత్త ఏకరూప దుస్తులతో మెగా పీటీఎం

నగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఈ నెల 10న అన్ని పాఠశాలల్లో నిర్వహించే మెగా పీటీఎంకు విద్యార్థులంతా కొత్త ఏకరూప దుస్తులతో వచ్చేలా సమాయత్తం చేస్తున్నట్లు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేసినట్లు చెప్పారు. మామిడికుదురు మండలంలోని నగరం జడ్పీ ఉన్నత, ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రతిభా సామర్థ్యాలను పెంచుకుంటూ మంచి మార్కులు సాధించేలా ఇప్పటినుంచే అన్ని సబ్జెక్టులపై పూర్తి దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు పి.సోమేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రవేశాల ప్రక్రియ

ప్రవేశాల కోసం టేబుళ్ల వద్ద విద్యార్థులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

కరపత్రం అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్, రెడ్డి సుబ్రహ్మణ్యం

అంబాజీపేట: కూటమి ప్రభుత్వంలో ఏడాది పాటు జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తున్నామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. మండలంలోని తొండవరం ముహూర్తాల చెరువు ప్రాంతంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ఇచ్చి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శులు చిన్నం బాలవిజయరావు, పెదపూడి శ్రీనివాస్, గూడాల ఫణి, రవణం రాము, పితాని కేశవ, వెంకటసుబ్బారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

గుంతల దారిలో.. ఎన్నెన్ని వెతలో..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలివెల గ్రామంలోని కోటమెరక కాలనీ వాసులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రధాన రహదారి భారీ గుంతలు ఏర్పడటంతో పాటు వర్షనీరు నిలిచిపోయి రాకపోకలకు నరకం అనుభవిస్తున్నారు. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు రాగానే పనులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి పరుచూరి సత్తిబాబు తెలిపారు.

- న్యూస్‌టుడే, కొత్తపేట

మస్కట్ నుంచి రామలక్ష్మిని తీసుకువచ్చేలా కృషి

వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశం

రామలక్ష్మి కుమారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సమన్వయకర్త రమేష్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అయినవిల్లి మండలం విలస గ్రామానికి చెందిన సవరపు రామలక్ష్మి ఈ ఏడాది మార్చిలో ఉపాధి నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్లారు. ఆమెను పశ్చిగోదావరి జిల్లాకు చెందిన ఓ ఏజెంట్ ఆ దేశం పంపించారు. అక్కడ ఓ ఇంట్లో పనికి కుదరగా.. యజమాని సక్రమంగా భోజనం పెట్టడం లేదని, చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశానికి తీసుకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమాల్లో ఆమె వీడియో పెట్టారు. దీనిపై 'స్వదేశానికి తీసుకు రావాలని వేడుకోలు' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించారు. ఆమె వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి డీఆర్వో రాజకుమారి సమన్వయకర్త రమేష్ ద్వారా రామలక్ష్మి కుటుంబ సభ్యుల నుంచి పూర్తి వివరాలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న అల్లూరి చిత్రం

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన అల్లూరి సీతారామరాజు చిత్రం ఆకట్టుకుంటోంది. ఈ నెల 4న సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన గొప్పతనాన్ని, స్వాతంత్ర్య పోరాటాన్ని నేటితరానికి తెలియచెప్పడం కోసం ఈ చిత్రాన్ని గీసినట్లు తెలిపారు. తన సునయన ఆర్ట్స్ గ్యాలరీలో దీన్ని ఆవిష్కరించారు.

18 మండలాలకు సాగునీరు: మంత్రి నిమ్మల

సీతానగరం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం, జలవనరుల శాఖకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. జిల్లాలో సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల నుంచి పుష్కర కెనాల్‌కు 1,400 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను తీరుస్తూనే ఉమ్మడి జిల్లాలో ఎత్తిపోతల పథకాలన్నీ రెండు రోజుల్లో ప్రారంభించి సాగునీరు విడుదల చేయగలిగామన్నారు. గోదావరికి 14 మీటర్లకు నీటిమట్టం చేరిన సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సాగునీటిని సరఫరా చేశామన్నారు. పుష్కరకాలువ ద్వారా తుని వరకు 18 మండలాలకు సాగునీరు చేరుస్తున్నామన్నారు. అచ్చయ్యపాలెం వద్ద రెగ్యులేటర్ ఏర్పాటుతో ఆటంకాలు లేకుండా నీరు అందిస్తున్నామన్నారు. పుష్కర పైపులైన్లు కొత్తగా వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీవర్షాలకు పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి నీటిమట్టం 27.230 మీటర్లకు చేరిందని పీబీసీ ఎల్ఎంసీ తుని సర్కిల్ ఎస్ఈ బి.ఏసుబాబు తెలిపారు. గోదావరి ఎడమగట్టున ఎత్తిపోతల పథకాల వద్ద గురువారం సాయంత్రానికి 16.28 మీటర్లకు ప్రవాహం చేరిందన్నారు. ఏలేరు జలాశయంలో 10 టీఎంసీల జలాలు ఉండటంతో పీబీసీ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు చేరుతుందన్నారు.

నిర్వాసితులకు రూ.28.18 కోట్లు.. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణలో 72 ఎకరాలకు సంబంధించిన రైతులకు 6 శాతం వడ్డీ వేసి సుమారు రూ.28.18 కోట్లు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని రైతుల తరపున కె.బాలకృష్ణ అన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రాజానగరం తెదేపా ఇన్‌ఛార్జి బీవీఆర్ చౌదరి, పీబీసీ ఎల్ఎంసీ ఈఈ పీఎస్ఎస్ రంగారావు, డీఈ సీహెచ్ కోటేశ్వరరావు, జేఈలు వినోద్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

Kkd & సామర్లకోటలో 45 లక్షలు & 30 లక్షలకే, House (85 లక్షలు, 1.20 లక్షలకే విల్లా), Open Sites అమ్మకం. 80% లోన్ Kuda, 98490 40891.

LAND FOR SALE

GENERAL

కొవ్వూరు మం॥, దేవర్ల పరిధిలో అర్లమ్మ క్వారీలో మంచి రాయి గల సుమారు 9 ఎ॥ భూమి అమ్మకమునకు కలదు (సర్వే నెం.86/1) S.లక్ష్మీనరసింహారావు, Ex MPP, 96662 69666. వివరాలకు: J.సత్యనారాయణ, 99591 56079.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Well Established (RJY) Company Looking for Managers (M/F) Full Time/ Part Time. Preferably Retd./ VRS/ House-wives. Age: above 30 yrs. Income: 80K above. Cont: 9440579695, 7093442345.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. ప్రముఖ ఫైనాన్స్ & ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. జీతం: 20k to 30k. సెల్: 99512 86781, 83092 95955.

TOURS AND TRAVELS

మహాలయ పక్షంలో నేపాల్ (ముక్తినాథ్) 6-9-25 తేదీ, 12 రోజులు, టికెట్ 25,000. రైలు, భోజనం, A/C బస్సు, రూం. కె.వాసు, నెల్లూరు. ✆ 94913 40504

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-70 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పోలీసులకు చిక్కిన అంతర్‌జిల్లా నేరస్థుడు

విజయవాడ: బాల్యం నుంచే దొంగతనాలు మొదలెట్టాడు. 24 ఏళ్ల వయసుకే 40 నేరాలు చేశాడు. పలు జిల్లాల పోలీసులను ఉరుకులు పెట్టించాడు. ఎవరికీ చిక్కకుండా మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. చివరికి దొరికిపోయాడు. అతడి నుంచి 60 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ఉయ్యాల రాజేష్(24) కుటుంబం విజయవాడ వాంబేకాలనీలో ఉంటోంది. అతడు 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పుడే దొంగతనాలు చేయడంతో మూడుసార్లు బాలుర పరిశీలనా గృహంలో ఉంచారు. బయటకు వచ్చినా తీరు మారలేదు. కూలి పనులు చేస్తూ.. చోరీలు చేసేవాడు. 2024 సెప్టెంబరులో మధురానగర్‌లో ఒక తమిళ కుటుంబం ఇంట్లో రూ.11 లక్షలు దోచాడు. జైలుకు వెళ్లి జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇతను తాళంవేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. పెద్దపెద్ద గోడలను క్షణాల్లో ఎక్కేస్తాడు. ఇలా మధురానగర్‌లో 5 నేరాలు చేసి 94 గ్రాముల బంగారం చోరీ చేశాడు. పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేటల్లో మొత్తం 12 నేరాలు చేశాడు. దోచిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తన సిబ్బందితో ఎట్టకేలకు అతడిని పట్టుకున్నారు. విజయవాడ పరిధిలోని 6 కేసుల్లో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని ఏసీపీ దామోదర్ అభినందించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		24,000
పాతకాయ:	గండేరా	25,000
	గటగట	26,000
కొత్తకాయ:	గండేరా	26,000
	గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		18,000-22,000
కొత్త (పచ్చి) కాయ		19,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		4,500
కిలో		300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	95-00
రిటైల్ లైవ్	117-00
డ్రెస్డ్	170-00
స్కిన్‌లెస్	193-00

ఎర్రచందనం చెట్టు కొమ్మల నరికివేత

కేసు నమోదు చేసిన అధికారులు

నరికిన చెట్టును పరిశీలిస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి నాగసత్యనారాయణ

ఎర్రచందనం చెక్క

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని సమతా నగర్‌లో సత్యాల సీతమ్మ ఇంటి ఆవరణలోని ఎర్రచందనం చెట్టు కొమ్మల్ని నరకడంపై అధికారులు కేసు నమోదు చేశారు. గురువారం తొలుత చెట్టు కొమ్మలు తొలగించారు. ఇంతలో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి బి.నాగసత్యనారాయణ సిబ్బందితో అక్కడికి చేరుకుని మొదలు నరకకుండా అడ్డుకున్నారు. దీనిపై ఆ ఇంటి యజమాని మాట్లాడుతూ తమ ఇంటి ఆవరణలో 30 ఏళ్ల నుంచి ఈ చెట్టు పెరుగుతోందన్నారు. గోడపై కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని తొలగించేందుకు గత ఏడాది ఏప్రిల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినా స్పందన లేదన్నారు. అటవీశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఎర్రచందనం చెట్టు విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. కూల్చివేసిన 8 కొమ్మల కలపను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్టు కొమ్మలను నరికిన నేరానికి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

బాలికను మోసగించిన యువకుడికి 15 ఏళ్ల జైలు

అయినవిల్లి, న్యూస్‌టుడే: ఓ దివ్యాంగ బాలిక(17)ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడికి పోక్సో కోర్టు న్యాయమూర్తి 15 సంవత్సరాల జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా విధించినట్లు గురువారం పి.గన్నవరం సీఐ భీమరాజు తెలిపారు. వివరాలిలా.. అయినవిల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగ బాలిక అమలాపురంలో ఇంటర్ చదువుతోంది. తల్లిదండ్రులు లేకపోవడంతో నాన్నమ్మ, మేనత్త వద్ద ఉంటోంది. తొత్తరమూడి దూనబోయినవారిపాలేనికి చెందిన వనచర్ల సురేష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకోవడంతో బాలిక గర్భం దాల్చింది. దీనిపై జులై 2018న బాధితురాలు అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై జానీబాషా పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నాటి డీఎస్పీ ప్రసన్నకుమార్ దర్యాప్తు చేపట్టి సదరు యువకుడిని అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో గురువారం కాకినాడ పోక్సోకోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి నిందితుడికి 15 సంవత్సరాల జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి ఎస్సై జానీబాషా, డీఎస్పీలు ప్రసన్నకుమార్, మాసుంబాషా, ప్రస్తుత డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ భీమరాజు, ఎస్సై హరికోటిశాస్త్రిలను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

మామిడికుదురు, రాజోలు, ఆత్రేయపురం: విద్యుత్తు స్తంభాలను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మగటపల్లి ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ కె.రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మగటపల్లి, గోగన్నమఠం, కొమరాడ, ఈదరాడ, లూటుకుర్రు, ఆదుర్రు, పాశర్లపూడిలంక, మాకనపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు. ● ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పొన్నమండ, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు అమలాపురం ఈఈ తెలిపారు. ● ఆత్రేయపురం, కట్టుంగ, నార్కెడుమిల్లి, అంకంపాలెం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.రాంబాబు తెలిపారు.

తాటిపాక కూడలి సుందరీకరణకు ప్రణాళిక

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం తాటిపాక కూడలిని సుందరీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని అమలాపురం ఆర్డీవో మాధవి తెలిపారు. ర.భ.శాఖ ఎస్ఈ బి.రాము, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆమె కూడలిని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనికి శ్రీకారం చుట్టామన్నారు. సమీపంలో బైపాస్ ఉండటంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటిని అధిగమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అమలాపురం దగ్గర ఈదరపల్లిలో చేసిన తరహాలో చేస్తామన్నారు. ఆక్రమణలు గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజోలు, మామిడికుదురు తహసీల్దార్లు సీహెచ్ భాస్కర్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 | పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

నీటి సరఫరా పునరుద్ధరణ

మామిడికుదురు: మొగలికుదురులో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు చెప్పిన సమస్యను సంబంధిత గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఏఈఈ జయశ్రీ వద్ద ప్రస్తావించగా స్పందించారు. సరఫరా పునరుద్ధరించడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

స్పందనకు వందనం

దోమల మందు పిచికారీ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలో దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి డ్రెయినేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం పంట కాలువలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సమస్యను స్థానిక సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి తాడి ఏసు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో తొలగించి కాలువను శుభ్రం చేశారు.

వీధి దీపాలు వెలిగాయి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కట్టుంగ గ్రామంలో వీధి దీపాలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా స్పందించి వీధి దీపాలు వేయించారు.

కానరాని స్వచ్ఛత.. నిర్వహణ లేని కేంద్రాలు

– న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

అంతర్వేది దేవస్థానం గ్రామంలోని సంపద కేంద్రం దుస్థితి

ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత కరవైంది. వ్యర్థాలను రోడ్లు, కాలువల చెంతన వేయడంతో గుట్టలుగా దర్శనమిస్తూ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

● రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు మండలాల్లో సుమారు 54 గ్రామాల్లో గత తెదేపా పాలనలో రూ.లక్షలు వ్యయం చేసి సంపద కేంద్రాలను నిర్మించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను తడి, పొడిగా కేటాయించి వాటిని తొట్టుల్లో వేసి ఎరువుగా తయారు చేసి విక్రయించి సంపద సృష్టించాలన్నదే లక్ష్యం. గత వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో నిర్వహణ కరవై నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి గ్రామాల్లో స్వచ్ఛత తీసుకురావాలని ఆదేశించింది. దీనిపై ప్రజాప్రతినిధులు ఎంత మెరపెట్టుకుంటున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేది దేవస్థానం, మోరి, మోరిపోడు తదితర గ్రామాల్లో సంపద కేంద్రాలు ఛిద్రమై రూపులేఖలు లేకుండా పోయాయి. కేవలం స్తంభాలు మాత్రమే కనిపిస్తున్నాయి. మరికొన్ని బాగున్నా వాటిని వినియోగించక వ్యర్థాలను కేంద్రాల పక్కన, రోడ్లు, కాలువల చెంత వేయడంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ● మలికిపురంలో ప్రధాన రహదారి చెంత, గుడిమెళ్లంక రోడ్డు, కాలువల చెంత, ఖాళీ ప్రదేశాల్లో చెత్త విపరీతంగా పేరుకుపోయింది. కొన్ని గ్రామాల్లో కేంద్రాలు బాగున్నా వాటిలో చెత్త సేకరణ జరగడం లేదు. ● రాజోలు మండలంలోని చింతలపల్లి, తాటిపాక, రాజోలు, శివకోడు, కడలి తదితర గ్రామాల్లో చెత్తాచెదారం రోడ్లు, కాలువ చెంతన వేయడంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం..

గ్రామాల్లోని చెత్తాచెదారం రోడ్లు, కాలువల చెంత వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తాం. తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద సృష్టించడానికి కార్యదర్శులకు అవగాహన కల్పిస్తాం.

- సూర్యనారాయణ, ఎంపీడీవో, సఖినేటిపల్లి

రంగా విగ్రహావిష్కరణ నేడు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం గాంధీ బొమ్మల కూడలిలో స్థానిక యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్, మాజీ ఎమ్మెల్యే, రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైల్వేలైనుకు తొలగిన ప్రతిబంధకాలు

రాజోలు, న్యూస్‌టుడే: కోటిపల్లి- నర్సాపురం రైల్వేలైను భూసేకరణ విషయంలో ఎదురైన ప్రతిబంధకాలను కోర్టు సడలించడంపై మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా గురువారం హర్షం వ్యక్తం చేశారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేలైనుకు మార్గం సుగమం కావడం శుభ పరిణామమన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరంలోని ఆర్యాపురానికి చెందిన దాసరి గోపి, సీతాభార్గవి దంపతులు రూ. 50,116, అమలాపురానికి చెందిన యర్రమిల్లి రవికుమార్, వెంకట నాగమీనాక్షి దంపతులు రూ. 50,116 విరాళాన్ని గురువారం అందజేశారు. వీరికి స్వామి వారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఈవో సూర్యచక్రధరరావు అభినందించారు.

పెదపట్నంలంక భూముల పరిశీలన

మామిడికుదురు, న్యూస్‌టుడే: పెదపట్నంలంకలో గతంలో ఇళ్ల స్థలాలుగా కేటాయించిన దుక 6.50 ఎకరాల భూములపై స్థానికంగా సొసైటీ సభ్యుల నుంచి వచ్చిన అభ్యంతరాలకు సంబంధించి అమలాపురం ఆర్డీవో కె.మాధవి గురువారం పరిశీలించారు. అనంతరం వరద ముంపునకు గురయ్యే స్థానిక లంక గ్రామాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. పాశర్లపూడిలో రైల్వే వారధి పనులు జరుగుతున్న చోట్ల స్థానికుల అభ్యంతరాలపై పరిశీలన చేశారు. పాశర్లపూడిబాడవలో ముంపునీటి తాకిడికి కొబ్బరిచెట్లు దెబ్బతింటున్నాయని రైతుల నుంచి వచ్చిన అర్జీపై పరిశీలన చేశారు. తహసీల్దారు సునీల్‌కుమార్, ఉప తహసీల్దారు శరణ్య, ఆర్ఐ ఇబ్రహీం, పెదపట్నంలంక సర్పంచి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించండి: డీఈవో

విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన సలీంబాషా

రాజోలు, న్యూస్‌టుడే: విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. రాజోలు మండలం శివకోటి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన శాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. అక్కడ ఆహార పదార్థాలను, సరకుల నాణ్యతను, విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలించారు. విద్యార్థుల హాజరు నిర్ధారించిన సమయాల్లో వేయకుంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నల్లి మనోహరం, ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పిలుపునిచ్చారు. రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. డిపో కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మార్చే జీవోలను రద్దు చేయాలన్నారు. జి.శ్రీనివాస్, జ్యోతికుమారి, బాబూరావు, పరమహంస, సీహెచ్ రెడ్డి, మాణిక్యం పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి వినతి

అంబాజీపేట, ఆత్రేయపురం: బంద్ విజయవంతమైందని ప్రైవేట్ పాఠశాలల సంఘం అంబాజీపేట మండల అధ్యక్షుడు పితాని సూర్యచంద్రనాగేశ్వరరావు అన్నారు. గురువారం అన్ని ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటించాయన్నారు. ఎంఈవోలు ప్రకాష్, వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

● **ఆత్రేయపురంలో ఎంఈవో** పీవీ ప్రసాదరావుకు సంఘ ప్రతినిధులు ఎన్.రామరాజు, రమేష్ వినతిపత్రం అందజేశారు.

ప్రకృతి వైపరీత్యాల సన్నద్ధతపై అవగాహన

పి.గన్నవరం: ఎన్.డి.ఆర్.ఎఫ్. అధికారులు గురువారం ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఎన్.డి.ఆర్.ఎఫ్. ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఆర్ఐ వి.డాంగే పాల్గొన్నారు.

సుపరిపాలనతో ప్రభుత్వం ముందడుగు

లక్కవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

మలికిపురం, మామిడికుదురు, అయినవిల్లి, రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రాక్షస పాలన నుంచి విముక్తి పొందిన రాష్ట్రానికి మంచి పరిపాలన అందిస్తూ కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా లక్కవరంలో మండల పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ మంచి ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. పార్టీ మహిళా రాష్ట్ర కార్యదర్శి భూదేవి, జిల్లా నాయకుడు ముదునూరి చినబాబు, మండల పార్టీ కార్యదర్శి నవరత్నం, సర్పంచులు పుష్పకుమారి, హెలీనా, నాగు, చాగంటి స్వామి, బందెల పద్మ, మోకా పార్వతి, బోణం సాయిరాం, అడబాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

● మామిడికుదురు మండలం కొమరాడలో జరిగిన కార్యక్రమంలో బోనం బాబు, మొల్లేటి శ్రీనివాస్, కడలి కృష్ణమోహన్, వర్ధినీడి వెంకట రామయ్య, విత్తనాల జానకిరామ్ పాల్గొన్నారు. ● అయినవిల్లిలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, వన్నా శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. ● రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో గ్రామపార్టీ అధ్యక్షుడు వైట్ల రవిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రభుత్వ పాలనను వివరించారు.

అయినవిల్లిలో మాజీ మంత్రి చిక్కాల, నామన తదితరులు

లక్ష్మీపోలవరంలో ఎమ్మెల్యే సత్యానందరావు

చినుకు పడితే ఛిద్రం

మోరి నుంచి మలికిపురం కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి చినుకుపడితే చిత్తడిగా మారుతుండటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తీరప్రాంత గ్రామాల విద్యార్థులు, ప్రజలు మలికిపురం వెళ్లి వచ్చేందుకు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. గుంతల్లో పడి అనేకమంది గాయాలపాలయ్యారు. ఈ సమస్యను ఆర్ అండ్ బీ జేఈ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

- న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

దుస్థితిలో బస్ షెల్టర్

పులిదిండి కాలువ రేవులో ర.భ రాష్ట్రీయ రహదారి చెంతన ఉన్న బస్ షెల్టర్ ప్రయాణికులకు అనువుగా లేదు. లోపల భాగం దిగబడిపోయి కూర్చునేందుకు వీల్లేకుండా ఉంది. బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఈ షెడ్డులో సైకిళ్లు, ఇతర సామగ్రి ఉంచుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి కనుమూరి సూర్యసుందర సీతాకుమారి వద్ద ప్రస్తావించగా, బస్ షెల్టర్‌లో వ్యర్థాలు వేయకుండా చూస్తామన్నారు.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ట్యాంకు శిథిలమైనా.. పట్టించుకోరా!

లూటుకుర్రు రామాలయం సమీపంలో దాదాపు నాలుగు దశాబ్దాల నాటి 40 వేల లీటర్ల సామర్థ్యమున్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిల స్థితికి చేరడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు నెర్రెలు తీసి ఇనుప ఊచలు బయటకు తేలి ఆందోళనకరంగా ఉన్నాయి. మెట్లు విరిగిపోవడంతో ట్యాంకును శుభ్రం చేయడం సాధ్యం కావడం లేదు. దీనిని పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. కొత్త ట్యాంకు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఏఈఈ జయశ్రీ తెలిపారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

రావిపాడు కాలువ పనులకు రూ.17 లక్షలు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రావిపాడు చిన్నతరహా మురుగు కాలువ అభివృద్ధి పనులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయని డ్రెయినేజీ డీఈఈ ఆర్.నాగార్జున తెలిపారు. టెండరు కూడా ఖరారైందన్నారు. త్వరలోనే పనులు మొదలు పెడతామన్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ కాలువ పలుచోట్ల ఆక్రమణల బారిన పడింది. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో ముంపునీరు దీనిద్వారా గోరింకల ప్రధాన కాలువలో కలవాలి. అనేక సంవత్సరాలుగా దీనిని బాగు చేయకపోవడంతో వర్షాలకు నీరు దిగక చేలు ముంపుబారిన పడుతున్నాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో బాగుచేసి ఆక్రమణలు తొలగిస్తామని డీఈఈ వెల్లడించారు.

లైసెన్స్ హక్కు బహిరంగ వేలం పాట ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, వానపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం ఆవరణలో గల వ్యాపారముల లైసెన్స్ హక్కులు గూర్చి 1 సం॥రం కాలమునకు అనగా 1-08-2025 నుండి 31-07-2026 వరకు మాత్రం - శ్రీ ఉప కమిషనర్, దే॥దా॥శాఖ, కాకినాడ వారి ఆమోదపు ఉత్తర్వులకు లోబడి - శ్రీ తనిఖీదారు, దే॥దా॥ శాఖ, రాజమహేంద్రవరం వారి సమక్షమున ఆలయ కార్య నిర్వహణాధికారి వారిచే ది. 14-07-2025 సోమవారం మధ్యాహ్నం 2.00 గంటలకు దేవస్థానం వద్ద బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. ఆసక్తి గలవారు పాడుకొనుటకు వీలుగా ఈ ప్రకటన జారీ చేయడమైనది.

తేది: 03-07-2025, కార్యనిర్వహణాధికారి

వానపల్లి గ్రామం.

గమనిక: పూర్తి వివరములు సంబంధిత రెవిన్యూ కార్యాలయముల నోటీసు బోర్డు నందు ప్రకటన కొరకు ఉంచిన కరపత్రముల ద్వారా తెలుసుకొనవలెను.

నగరంలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లిం సోదరులు

బీబీసకీనా పీర్ల ఊరేగింపు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని నగరం, మామిడికుదురులో ముస్లిం సోదరులు బీబీసకీనా పీర్లను, ఇమామ్ రజా పంజా నుంచి తీసిన అలీ అజ్గర్ ఊయలను భక్తిశ్రద్ధలతో గురువారం ఊరేగించారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆయన పరివారానికి నివాళులర్పించారు. కర్బలా పుణ్యభూమిలో హజ్రత్ అబ్బాస్ చూపిన ధైర్య సాహసాలను మహ్మద్ అలీజాఫరీ వివరించారు. వివిధ గ్రామాల నుంచి ముస్లిం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొప్పిశెట్టి సేవలు ప్రశంసనీయం

కొప్పిశెట్టి దంపతులను సత్కరిస్తున్న స్థానికులు

మామిడికుదురు: ఆర్మీలో 40 ఏళ్లు సేవలందించి హవాల్దార్‌గా ఉద్యోగ విరమణ చేసిన కొప్పిశెట్టి వెంకటసత్యనారాయణ దంపతులకు స్వగ్రామమైన మామిడికుదురులోని కంచివారిపాలెంలో గురువారం ఘన సత్కారం లభించింది. తొలుత కుటుంబ సభ్యులు, స్థానికులు స్థానిక బుల్లియ్య వంతెన నుంచి ఊరేగిస్తూ తీసుకొచ్చారు. ఆయన సేవలను కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌లో సేవలందించినట్లు వెంకటసత్యనారాయణ తెలిపారు. గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు, కోదండ రామాలయం, సూర్యతేజ యువజన సంఘాల సభ్యులు కొప్పిశెట్టి దంపతులను ఘనంగా సన్మానించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఆలమూరు మండలం మడికికి చెందిన కోరుప్రోలు సతీష్ రాజమహేంద్రవరంలోని ఒక కళాశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 2న కళాశాలకు వచ్చాడని, తర్వాత కనిపించలేదని తండ్రి సత్యనారాయణ గురువారం ప్రకాశంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యునికి సత్కారం

అయ్యాజీవేమాను సత్కరిస్తున్న నాయకులు

రాజోలు, న్యూస్‌టుడే: భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమాను ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాజోలులో గురువారం ఘనంగా సత్కరించారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు వడ్లమూడి ప్రకాశరావు, కట్టా శ్రీను, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, నూలు దాశరథి, గంటి చంద్రశేఖర్, నార్కెడుమిల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

రంగు మారిన నీటితో ఆందోళన

రావులపాలెం గ్రామీణం: రావులపాడులో రక్షిత పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీరు ఎరుపు రంగులో ఉండటంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పథకాన్ని శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుని సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య మాట్లాడుతూ ట్యాంకును శుభ్రం చేయిస్తామన్నారు.

ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలి

ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ఎంపీడీవోగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కె.వి.ప్రసాద్ దంపతులను గురువారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో గురువారం సత్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పప్పుల సాయిబాబు, నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, అడబాల రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి చేద్దాం



తొండవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న రామాంజనేయులు, సిబ్బంది

అంబాజీపేట, రాజోలు, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలని జిల్లా టీబీ అధికారి డాక్టర్ రామాంజనేయులు అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా తొండవరం సచివాలయం వద్ద సర్పంచి పేరాబత్తుల దొరబాబు అధ్యక్షతన గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డి.చక్రధర్, ఎం.భూలక్ష్మి పాల్గొన్నారు. ● రాజోలు మండలం మెరకపాలెంలో తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మణికుమార్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురికి పరీక్షలు చేసి నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గిడుగు వెంకటనారాయణప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు నాగదుర్గ, అడబాల రామకృష్ణ, అడబాల రమేష్, కె.సముద్రుడు, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ - శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం

వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, Dr. B.R.Ambedkar కోనసీమ జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండర్/ బహిరంగ వేలం ప్రకటన

Rc. No.VI/2025 తేది:26-06-2025

షెడ్యూల్-A (E-Procurement)

వ నెం.	లైసెన్సు హక్కు వివరము	కాలపరిమితి	ధరావతు రూపాయలు	బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ తేది	E-టెండర్ దాఖలు చేయు చివరి తేది, సమయం	E-టెండర్ తెరచు తేది, సమయం
1	కూరగాయలు సరఫరా చేయుటకు	ది.01-08-2025 నుండి ది.31-03-2026	2,00,000.00	27-06-2025	10-07-2025 5.30 p.m.	11-07-2025 మధ్యాహ్నం 1.00

షెడ్యూల్-B (సీల్డ్ టెండర్)

వ నెం.	లైసెన్సు హక్కు వివరము	కాలపరిమితి	ధరావతు రూపాయలు	సీల్డ్ టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేదీ	సీల్డ్ టెండర్ దాఖలు చేయు చివరి తేది సమయం	సీల్డ్ టెండర్ తెరచు తేది సమయం
1	కూరగాయలు సరఫరా చేయుటకు	ది.01-08-2025 నుండి ది.31-03-2026	2,00,000.00	10-07-2025	11-07-2025 ఉదయం 11.00	11-07-2025 మధ్యాహ్నం 2.00
2	వివిధ విభాగములకు అవసరమైన న్యూస్‌పేపర్ సప్లయి చేయుటకు	ది.01-09-2025 నుండి ది.31-08-2026 వరకు	50,000.00	16-07-2025	18-07-2025 ఉదయం 09.00	18-07-2025 ఉదయం 10.00
3	పార్కింగ్ ప్రదేశము నందు తాత్కాలిక షాపులు 10x10x10 కొలతలతో 16, 17, 18, 19, 20, 21, 22, 30, 38, 39, 40, 41, 49, 54, 56, 62, 63, 66, 67, 68, 69, 75, 76, 85	మూడు సంవత్సరములు కాల పరిమితి(స్వాధీనం చేసిన తేది నుండి)	50,000.00	16-07-2025	18-07-2025 ఉదయం 10.00	18-07- 2025 ఉదయం 10.40

షెడ్యూల్-C (బహిరంగ వేలంపాట)

వ.	లైసెన్సు హక్కు వివరము	కాలపరిమితి	ధరావతు రూపాయలు	బహిరంగ వేలం పాట జరుపు సమయం
1	పార్కింగ్ ప్రదేశము నందు తాత్కాలిక షాపులు 10x10x10 కొలతలతో షాపు నెంబర్లు 16, 17, 18, 19, 20, 21, 22, 30, 38, 39, 40, 41, 49, 54, 56, 62, 63, 66, 67, 68, 69, 75, 76, 85	మూడు సంవత్సరములు కాలపరిమితి (స్వాధీనం చేసిన తేది నుండి)	50,000	18-07-2025 ఉదయం 10.30

షరతులు: ✦ సీల్డ్ టెండర్, బహిరంగ వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గలవారు దేవస్థాన కార్యాలయము నందు రూ. 500/- చెల్లించి టెండర్ షెడ్యూల్ పొంది దేవస్థాన కార్యాలయము నందు సీల్డు టెండర్ దాఖలు చేయవచ్చును. ✦ సీల్డ్ టెండర్ ఐటమ్‌లకు షరతులు మరియు ఇతర వివరముల కొరకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించవలెను. ఫోన్ నెంబర్లు: 08855-271888, 94910 00085. ✦ D.D.: The Executive Officer, Sri Venkateswara Swamy Devasthanam, Vadapalli పేరున తీసుకొనవలెను.

తేది: 26-06-2025, స్థలం: వాడపల్లి. సం/- **ఉప కమిషనర్** మరియు **కార్యనిర్వహణాధికారి**

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

బస్టాండ్‌లో ప్రత్యేక గస్తీ

యానాం, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ బస్ బస్టాండ్‌లో తిష్ఠవేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న మందుబాబుల బెడద తొలగించడానికి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. 'మద్యం తాగి... బస్టాండులో తిష్ఠ' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఆయన స్పందించారు. పట్టణ ప్రాంతంలో నిరంతరం గస్తీ తిరిగే ఒక బృందం తరచూ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తుందన్నారు. ప్రయాణికులు కూర్చొనే బల్లలు, కుర్చీల్ని ఆక్రమించి పడుకునే మందుబాబులు అక్కడి నుంచి పంపించి వేస్తారన్నారు. పగలూరాత్రీ ఈ తనిఖీలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని వార్డు సచివాలయ సిబ్బందితో కమిషనర్ పి.రవివర్మ గురువారం సమీక్ష నిర్వహించారు. అడ్మిన్ కార్యదర్శులు, వీఆర్వోలు, శానిటేషన్, వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి నగర పంచాయతీ పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అడ్మిన్ కార్యదర్శులు ఇంటి, ఖాళీ స్థలాలు, కొళాయి పన్నుల వసూలు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో శానిటరీ కార్యదర్శులు ఉదయం క్షేత్ర స్థాయిలో పర్యటించి బ్లీచింగ్, ఇతర పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని కమిషనర్‌కు సూచించారు. వార్డు సచివాలయ, నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948

అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166

కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

పొదలు తొలగించారు..

సమస్య: నంగవరం-గొల్లవిల్లి రహదారిలో విద్యుత్తు తీగలపై పొదలు అల్లుకుని ప్రమాదాన్ని తలపిస్తున్నాయి.

పరిష్కారం: సమస్యను విద్యుత్తు జేఈ వెంకటేశ్వరావు దృష్టికి తీసుకెళ్లగా పొదులు తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ముంపు ముప్పు తొలగేనా..?

ఎట్టకేలకు పూడికతీత పనులు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం గొల్లగూడెం బైపాస్‌రోడ్డు మురుగుకాలువపై రాళ్ల తొలగింపు

పట్టణ పరిధిలో వర్షాలకు ముంపు సమస్య తలెత్తకుండా ఏటా వేసవిలో ప్రధాన డ్రెయిన్లు, అంతర్గత మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి. గత ప్రభుత్వంలో ఈ పనుల్ని మరిచిపోయారు. దీంతో ఏటా చినుకుపడితే రహదారులు చిత్తడిగా మారడంతో పాటు ఏ మాదిరి వర్షం కురిస్తే ముంపు సమస్య ఏర్పడుతోంది.

ఈ ప్రాంతాల్లో.. పట్టణ శివారులోని హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎర్రవంతెన, నల్లవంతెన, సావరం, విద్యుత్తునగర్, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లోని డ్రెయిన్లకు అవుట్‌లెట్‌లు లేవు. దీంతో మురుగు ముందుకు వెళ్లడం లేదు. నిల్వ చేరి దుర్వాసన రావడంతో పాటు వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో మురుగుకాలువలు రోడ్డుకంటే ఎత్తుగా ఉండటం వల్ల వర్షపునీరు వెళ్లే దారిలేదు. మేజర్ డ్రైన్ల నిర్మాణం పూర్తికావడం లేదు. వైకాపా పాలనలో కోట్లు ఖర్చు చేసినట్లు చూపించినా పారిశుద్ధ్యం మెరుగుపడలేదు.

పర్యవేక్షణ కొరవడి.. గతంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. నిర్మాణంలో ప్రణాళిక లోపం కారణంగా వాటిలో మురుగు సక్రమంగా పారడం లేదు. కాలేజీ రోడ్డులో మురుగుకాలువలు ఎత్తుగా ఉండటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. ముస్లింవీధి, గొల్లగూడెం బైపాస్‌రోడ్డు, కె.అగ్రహారం, సూర్యనగర్, సినిమారోడ్డు తదితర ప్రాంతాల్లోని మురుగు కాలువలు చెత్తతో నిండిపోతున్నాయి. కొందరు కాలువల్లోనే చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పారబోస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. కొందరు డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు, నాపరాళ్లు వేసి కాలువల్ని మూసేస్తున్నారు. ఆ ప్రాంతంలో సిబ్బంది పూడికలు తొలగించడం లేదు. అలాంటి చోట్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు వార్డులోని పలు వీధులు జలమయం అవుతున్నాయి. పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కాలేజీరోడ్డులో మురుగుకాలువపై ఆక్రమణలు

పూడికతీతతో దుర్వాసన.. పట్టణంలో మురుగుకాలువల్లో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు బయటకు తీసి రోడ్లపై నాలుగు రోజుల పాటు ఉంచుతున్నారు. తర్వాత ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ కారణంగా ఆ ప్రాంతాల్లో దుర్వాసన కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రణాళిక బద్ధంగానే..

పట్టణ పరిధిలో సుమారు 172 కిలోమీటర్ల మేర ప్రధాన మురుగుకాలువ వ్యవస్థ ఉంది. ఈ ఏడాది పూడికలు తీయించేందుకు ప్రభుత్వం రూ.30 లక్షలు కేటాయించింది. తమ వార్డుల్లో మురుగుకాలువ పూడికలు తొలగించారని కౌన్సిలర్ ఆమోదిస్తేనే బిల్లులు చెల్లించాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఈ నెలాఖరుకు పూడికలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

-సత్యనారాయణ, మున్సిపల్ డీఈ

మాట్లాడుతున్న ఎస్సై నూకరాజు

చరవాణి వినియోగంలో అప్రమత్తత అవసరం

యానాం, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలు వినడం కోసం తల్లిదండ్రుల సెల్‌ఫోన్లను ఉపయోగించే విద్యార్థులు నగదు లావాదేవీలు సాగించే క్రమంలో పొరపాట్లు చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు సూచించారు. సర్వశిక్షాభియాన్ సమావేశమందిరంలో పీఎంశ్రీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులకు నూతన న్యాయ చట్టాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలు, బాల్య వివాహాల గురించి గురువారం అవగాహన కల్పించారు. సర్వశిక్షాభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, ప్రధానోపాధ్యాయురాలు సూర్యసుందరి, ఏఎస్సై దేవరపల్లి ప్రకాష్, కళావతి ప్రసంగించారు.

సహజ వాయువు కేటాయింపునకు సహకరించండి

సోము వీర్రాజును సత్కరిస్తున్న జీఎన్ నాయుడు

యానాం, న్యూస్‌టుడే: రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ ఉత్పత్తుల తయారీకి అత్యంత కీలకమైన సహజ వాయువు సరఫరా కోసం కేంద్రం నుంచి అనుమతులు పొందడానికి పూర్తి సహకారం అందించాలని భాజపా మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజును రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ జీఎన్ నాయుడు కోరారు. గురువారం దరియాలతిప్ప ఏటిగట్టు మార్గంలోని రీజెన్సీ అతిథి గృహంలో సోము వీర్రాజును సత్కరించారు. అందరి సహకారంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

వైజ్ఞానిక యాత్రలో విద్యార్థినుల సందడి

కోరింగ మడ ఫారెస్టులో ఏర్పాటు చేసిన పడవపై విద్యార్థినులు

యానాం, న్యూస్‌టుడే: గిరియాంపేటలోని రక్ష హరికృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం తాళ్లరేవు మండలం కోరింగ మడ అడవి, గాడిమొగ రిలయన్స్ పరిశ్రమ ప్రాంతాల్లో వైజ్ఞానిక యాత్రలో పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అనిమిల్లి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాయామోపాధ్యాయుడు పాలికి ప్రకాష్, అధ్యాపకులు నున్నా సురేష్, వై.సునీత, దుర్గమ్మ బృందం మడ అడవుల్లో పెరిగే వివిధ రకాల మొక్కలు, జంతువులు, జలచరాలు గురించి వారికి వివరించారు.

సుపరిపాలనతో రెట్టింపు లబ్ధి: ఎమ్మెల్యే

కొత్తపాలెంలో కరపత్రమిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సుపరిపాలనతో ఇంటింటికీ రెట్టింపు లబ్ధి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సమనస పంచాయతీ పరిధిలోని రంగాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం పట్టణం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం పట్టణంలోని 2, 3, 6వ వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కూటమి నాయకులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు, తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సక్రమంగా అందుతున్నాయా..? అని అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గురువారం గూడాల గ్రామంలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

కాట్రేనికోన: కూటమి ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. కాట్రేనికోనలోని కొత్తపాలెం, లచ్చిరాజుచెరువు, పల్లంకుర్రు గ్రామాల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాడిగి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, ఐ.వెంకటేశ్వరరావు, పీఎస్ఎన్ రాజు, సుధీర్, బుజ్జి, శ్రీను, రమణారావు, ఏసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు పెచ్చెట్టి బాబు తెలిపారు. 26, 27 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. భాస్కర్ల రామకృష్ణ, మాకిరెడ్డి పూర్ణిమ, కర్రి దత్తుడు, మొగలి శ్రీను, కొప్పుల బాబి తదితరులు పాల్గొన్నాం.

సమ్మె విజయవంతానికి పిలుపు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి కోరారు. అమలాపురం ఆర్టీసీ డిపో గేటు ఎదుట గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్టీసీలో పనిభారాన్ని తగ్గించడంతోపాటు మహిళా ఉద్యోగులకు రాత్రి వేళల్లో విధులు అప్పగించడాన్ని ఖండించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. డిపో కార్యదర్శి కె.రవికుమార్, ఎం.శివరామకృష్ణ, డి.భయ్యమ్మ, కె.శ్రీనివాసరావు, కె.గంగాశంకర మూలయ్య తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

యానాం: పుదుచ్చేరి వైద్య కళాశాలల్లో పీజీ దంతవైద్య కోర్సుల్లో ప్రవేశానికి నీట్ పీజీ అర్హత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సెంటాక్ సమన్వయకర్త కోరారు. ఆన్‌లైన్ ద్వారా గురువారం నుంచి దరఖాస్తుల్ని స్వీకరిస్తున్నామని, ఆదివారం అభ్యర్థులు దరఖాస్తులు పంపించాలన్నారు. చెల్లించాల్సిన రుసుములు, ఇతర వివరాలకు సెంటాక్ వెబ్‌సైట్ www.centacpuducherry.inను పరిశీలించాలన్నారు.

వంతెనపై మట్టితో తిప్పలు

కాట్రేనికోనకు వచ్చేందుకు ఏకైక మార్గమైన ఉప్పుకాలువ వంతెనపై గుంతలు ఏర్పడి ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. పదిహేనేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెనపై అక్కడక్కడా గుంతల ఏర్పడ్డాయి. రక్షణ గోడలు పెచ్చులూడుతున్నాయి. అంచుల్లో మట్టి, చెత్త పేరుకుపోయింది. వర్షం కురిస్తే నీరు నిలిచిపోతోంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై రహదారికి మరమ్మతులు చేపట్టి చెత్త తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కాట్రేనికోన

అధ్వానంగా రహదారి

కాట్రేనికోన నుంచి నడవపల్లి వెళ్లే తారురోడ్డు గుంతలు పడింది. ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కొత్తపాలెం ప్రజలు తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో తెదేపా హయాంలో ఈ రోడ్డు నిర్మించారన్నారు. దీనిపై ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఎండైనా వానైనా.. షెడ్డులోనే బోధన

ఎండొచ్చిందంటే ఉక్కపోతతో అవస్థ.. వానొస్తే నీరు లోపలికొస్తుందేమోనన్న భయం.. ఇది అమలాపురం మండలం సమనస పంచాయతీ పరిధిలోని రంగాపురం పెదపేటలోని అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి. సొంత భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులోనే ఈ కేంద్రం నిర్వహిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో మూడు సెంట్ల స్థలాన్ని అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కేటాయించారు. వైకాపా పాలనలో భవన నిర్మాణం ఊసే లేకపోవడంతో రేకుల షెడ్డులోనే కొనసాగుతోంది. -న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

నివాసాల చెంత మురుగు

ఉప్పలగుప్తం మండలం గోపవరం నం.1 ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిలో నివాసాల చెంత బోదెలో వ్యర్థాలు, మురుగు నిల్వలు పేరుకుపోయాయి. దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో పాఠశాల విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచి బోదెలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

సమస్యలు పరిష్కరిస్తాం: కమిషనర్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పదో వార్డులో నెల కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్, సమతానగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో డీఈ సత్యనారాయణ. ఏఈలు, అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సరైన మురుగుకాలువ వ్యవస్థలేక ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు సరిగా రావడంలేదని పలువురు ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏఈలు.భాస్కర్, కృష్ణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిబ్బందితో వైద్యులు స్వాతి, గౌతమి

వైద్యులకు సన్మానం

కాట్రేనికోన: పల్లంకుర్రు పీహెచ్‌సీలో వైద్యులుగా పనిచేస్తూ ఇటీవల కిర్లంపూడి, బండారులంకకు బదిలీ వెళ్తున్న డా.స్వాతి, డా.గౌతమిని వైద్య సిబ్బంది, స్థానికులు గురువారం పల్లంకుర్రులో సన్మానించారు. కొవిడ్ సమయంలో డా.స్వాతి పల్లంకుర్రులో అందించిన సేవలను పలువురు కొనియాడారు.

భవిత కేంద్రాల్లో మెరుగైన సేవలందించాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భవిత కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలని సమగ్ర శిక్షా ఏపీసీ మమ్మి సూచించారు. బండారులంకలోని భవిత కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న బోధనపై ఆరా తీశారు. ప్రత్యేక శ్రద్ధతో చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంవో సుబ్రహ్మణ్యం, డీవైఈవో జి.సూర్యప్రకాశం, ఎంఈవో-2 ఎస్.దుర్గాదేవి, ఐఈఆర్టీలు ఎం.శ్రీనివాసరావు, జి.నానాజీ, జి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి సంతాపం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చల్లపల్లికి చెందిన పాస్టర్ జి.అద్భుత కుమార్(బాబురావు) బుధవారం రాత్రి మృతి చెందారు. జిల్లాలో మహిమ స్వస్థిశాల పేరుతో నిర్వహిస్తున్న చర్చిలను ఆయన స్థాపించారు. జిల్లాలోని బైబిల్ మిషన్ సభ్యులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

సమావేశంలో మాట్లాడుతున్న గొలకోటి దొరబాబు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని ముమ్మిడివరం ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొలకోటి దొరబాబు సూచించారు. స్థానిక తెదేపా కార్యాలయం వద్ద మండల తెదేపా అధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు, కో కన్వీనర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి పథకాల అమలు, అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, నడిమింటి సూర్యప్రభాకరం, చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీనివాస్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, గుత్తుల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు రోడ్డుపైకి వస్తున్న దృష్టిితి

దారులు.. నిర్లక్ష్యం ఏరులు

అమలాపురంలో నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ నుంచి ఈదరపల్లి మార్గంలో పెట్రోలు బంకు ఎదుట మురుగుతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ డ్రైనేజీలో పూడిక తొలగించక మురుగు రోడ్డెక్కుతోంది. పెద్దవాహనాలు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు పక్కకు వెళ్తే అంతే. ఆ ప్రాంతంలో దుర్వాసన కారణంగా ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. -న్యూస్‌టుడే, కోనసీమ

పెట్రోలు బంకు ఎదుట..

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన: కాట్రేనికోన, చెయ్యేరు ఉప విద్యుత్తు కేంద్రాల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఈఈ కె.రాంబాబు తెలిపారు. కాట్రేనికోన, పల్లంకుర్రు, కొప్పిగుంట, బలుసుతిప్ప, చిర్రయానం, చెయ్యేరు, పెనుమల్ల, ఉప్పూడి, దొంతికుర్రు తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రజలంతా పరిసరాల శుభ్రత పాటించాలని డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు తెలిపారు. పల్లంకుర్రు, కాట్రేనికోన, గెద్దనపల్లి, చెయ్యేరు, పెనుమల్ల తదితరచోట్ల గురువారం ఆయన పర్యటించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బందికి ఇవ్వాలన్నారు. ఎంపీడీవో వెంకటాచలం, డిప్యూటీ ఎంపీడీవో మమత, జేవీ సత్యనారాయణ, రామారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం

సదస్సులో మాట్లాడుతున్న ఉమాలక్ష్మి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి బి.ఉమాలక్ష్మి అన్నారు. ముమ్మిడివరం మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ (బెంగళూరు) సహకారంతో కార్లిమ్యాట్ సిస్టర్స్ ఆఫ్ థెరిస్సా (అమలాపురం), పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ముమ్మిడివరం) ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సదస్సులో ఉమాలక్ష్మి మాట్లాడారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్ జి.కరుణాకరరావు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరంలోని ఆర్యాపురానికి చెందిన దాసరి గోపి, సీతాభార్గవి దంపతులు రూ.50,116, అమలాపురానికి చెందిన యర్రమిల్లి రవికుమార్, వెంకటనాగమీనాక్షి దంపతులు రూ.50,116 విరాళాన్ని గురువారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఈవో సూర్యచక్రధరరావు అభినందించారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తన తల్లి పేరిట ఉన్న భూమిని ఓ మహిళ. . వేరేవారికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని విశ్రాంత జైలర్ ఎం.భోగేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై ముమ్మిడివరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం పరిధి పిడింగొయ్యిలో తన తల్లి విజయలక్ష్మి పేరున ఉన్న 13.99 సెంట్ల భూమిని పెద్దాపురానికి చెందిన ఓ మహిళ ఈ నెల 18న ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

సేంద్రియ పద్ధతిపై అవగాహన ఉండాలి

అమలాపురం పట్టణం: పాడి రైతులకు సేంద్రియ పద్ధతిపై అవగాహన కల్పించడం ద్వారా నాణ్యమైన పాలు పొందవచ్చని అదనపు జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అమలాపురం పశువైద్యశాలల్లోని పశుక్షేత్రాలను శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి అభివృద్ధి చేస్తున్న సేంద్రియ పద్ధతిలోపశుగ్రాస క్షేత్రం గురించి తెలుసుకున్నారు.

నిప్పుల గుండం ఏర్పాటు

కాట్రేనికోన: మొహర్రం సంతాప దినాల సందర్భంగా చెయ్యేరు అలీనగర్ హాజరత్ అబ్బాస్ పీర్ల పంజా వద్ద గురువారం రాత్రి నిప్పులగుండం ఏర్పాటు చేశారు. షా ఖాసీం, ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్ పీర్లతో ముజావర్లు, యువకులు నిప్పుల గుండం తొక్కారు. ఏటా మొహర్రం 8వ రోజున నిప్పుల గుండం ఏర్పాటు చేస్తారు. నగరం, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ, సావరం, ద్రాక్షారామ తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు.

తాటిపాక కూడలి సుందరీకరణకు ప్రణాళిక

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం తాటిపాక కూడలిని సుందరీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని అమలాపురం ఆర్డీవో మాధవి తెలిపారు. ర.భ.శాఖ ఎస్ఈ బి.రాము, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆమె కూడలిని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనికి శ్రీకారం చుట్టామన్నారు. సమీపంలో బైపాస్ ఉండటంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటిని అధిగమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అమలాపురం దగ్గర ఈదరపల్లిలో చేసిన తరహాలో చేస్తామన్నారు. ఆక్రమణలు గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

(c) eenadu

మండపేట

•మండపేట • రామచంద్రపురం

రామచంద్రపురంలో 8న ఉద్యోగ మేళా

రామచంద్రపురం: మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో ఈ నెల 8న రామచంద్రపురం పట్టణ ఉపాధి భవన్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేళాకు ఐటీఐ కార్పెంటర్, ఫిట్టర్, సివిల్, వెల్డర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ తదితర కోర్సులు చదివినవారు అర్హులన్నారు.

నిబంధనలు సరిచేయాలి

మండపేట: విద్యార్థులకు ఉచిత ప్రవేశాల అంశంలో నిబంధనలు సరిచేయాలని కోరుతున్నామని, అయినా అధికారుల వేధింపులు పెరిగిపోతున్నాయంటూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేట్ పాఠశాలల జేఏసీ పిలుపు మేరకు గురువారం మండపేట నియోజకవర్గం పరిధిలో సుమారు 40 పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన

పామర్రు: కోనసీమ జిల్లా పరిధిలోని 22 మండలాల్లో, 1572 పాఠశాలల్లో సుమారు 94వేల మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేసినట్లు సమగ్ర శిక్ష ఏఎంవో రాంబాబు తెలిపారు. గురువారం కె.గంగవరం మండలం గోపాలరావుపేట ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. దాతలు అందించిన రాత పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, సీఎంఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు అందిస్తున్న సమగ్ర శిక్ష ఏఎంవో రాంబాబు

పరిసరాలను పరిరక్షించుకోవాలి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: మన పరిసరాలను మనమే పరిరక్షించుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని ఎంపీడీవో కె.స్వప్నజ్యోతి అన్నారు. హసనబాద గ్రామ పంచాయతీ వద్ద సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన గురువారం సాధారణ గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అవార్డు అందుకున్న ఎంపీడీవోను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, వికసిత భారత్ ప్రతిజ్ఞ చేయించారు. 11 ఏళ్ల ప్రధాని మోదీ పాలన, కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. వార్డు సభ్యులతో కలిసి ఎంపీడీవో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాదరెడ్డి, ఉప సర్పంచి నీలం భవాని, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మోదీ పాలనపై కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, సర్పంచి

తాపేశ్వరంలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం తాపేశ్వరంలో జీసస్ క్రైస్ట్ గ్లోరీ చర్చి వద్ద పాస్టర్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డేనియల్ పాల్ ఆధ్వర్యంలో గురువారం ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఎస్‌సీ కార్పొరేషన్ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. తొలుత ఎమ్మెల్యేను పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు సత్కరించారు. క్రీస్తు సేవకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి మంత్రి ఆర్థిక సాయం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి, ఓ పేద విద్యార్థి చదువుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. కె.గంగవరం మండలం తమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన యర్ర వెంకటరమణ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని మంత్రి దృష్టికి కూటమి నాయకులు తీసుకురాగా రూ.10 వేలు మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం కొముడి వారి లంకకు చెందిన వాసంశెట్టి సత్య యశ్వంతి చదువుకు రూ.20 వేలు మంత్రి అందజేశారు. పీ4లో భాగంగా 65 మందిని దత్తత తీసుకుని చదివిస్తున్నామని, సత్యను కూడా చదివిస్తానని మంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

ప్రకృతి సేద్యానికి పిలుపు.. రైతులకు మేలుకొలుపు

న్యూస్‌టుడే, రాయవరం

రైతులకు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులతో సస్యరక్షణపై అవగాహన కల్పించడానికి కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయాధికారులు రైతులకు సాగులో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపుతూ, పాత పద్ధతులకు స్వస్తిపలికి, పెట్టుబడి ఖర్చులను తగ్గిస్తూ, అధిక దిగుబడులను సాధించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో విత్తనం నాటే దగ్గర నుంచి పంట చేతి కందే వరకు ప్రతి దశలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు చేదోడుగా నిలుస్తున్నారు. ప్రకృతి సేద్యం, రసాయన ఎరువుల వాడకంలో జాగ్రత్తలు, విత్తనాల ఎంపిక, బయో ఎరువులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఇలా...

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
మండపేట	16,008	5,685
కపిలేశ్వరపురం	15,763	7,263
రాయవరం	14,101	5,123
రామచంద్రపురం	17,963	7,966
కె.గంగవరం	15,589	7,554

ప్రతి మంగళ, బుధవారాల్లో...

పొలం పిలుస్తోంది ద్వారా అధికారులు ప్రతి మంగళ, బుధ వారాల్లో క్షేత్ర సందర్శన చేసి రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వారంలో నాలుగు గ్రామాల వంతున నెలకు 16 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు ఎక్కువగా వినియోగించడం వల్లే నేల కలుషితమవుతుంది. దీంతో భూమిలో పోషకాలు నశించి చీడపీడలు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయి. ప్రకృతి సాగును ప్రోత్సహించేలా సీఎన్‌ఎఫ్ సిబ్బంది రైతులకు జీవామృతం, బీజామృతం తదితర కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రకృతిసేద్యంపై చెల్లూరు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రమేష్‌కుమార్

సద్వినియోగం చేసుకోవాలి..

రైతులకు ఆధునిక వ్యవసాయ శాస్త్రీయపరిజ్ఞానం, పంటల ఉత్పత్తి పెంచేందుకు సూచనలు, సలహాలు, రైతు మిత్ర సంఘాలతో వ్యవసాయ విజ్ఞానం, ఆధునిక సమాచార పరిజ్ఞానం, వ్యవసాయ అనుబంధ సేవలపై అవగాహన కల్పిస్తున్నాం.

- కేవీఎన్ రమేష్‌కుమార్, వ్యవసాయాధికారి, రాయవరం

రైతు హక్కుల సాధనకు పోరాటం

పామర్రు, న్యూస్‌టుడే: సన్న, చిన్నకారు, కౌలు రైతుల హక్కుల కోసం పోరాటం చేస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కె.గంగవరంలో గురువారం కౌలు రైతుల సదస్సు నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సులో చర్చించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో వందలాది మంది కౌలు రైతులు పంట నష్టాలు చవిచూస్తున్నారన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా ఐక్యంగా ఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. కౌలు ఒప్పందం రిజిస్ట్రేషన్, సాగు భూములపై హక్కులు, నష్టపరిహారం, రుణాలు, కనీస మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల వంటి సమస్యల పరిష్కారానికి, నగదు చెల్లింపుల గురించి తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. నాయకులు వి.చిట్టిబాబు, వెంకటపల్లి భీమశంకరం, బి.సిద్ధు, కౌలు రైతు నాయకులు జని పెల్ల ప్రసాద్, చెల్లే లక్ష్మి, ఇళ్ల సత్యనారాయణ, పి.సుబ్బారావు, ఆనసూరి సత్యనారాయణ, రమాదేవి, సుందరపల్లి అప్పారావు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సంక్షేమం, అభివృద్ధితో సుపరిపాలన

మండపేట, ద్వారపూడి, పామర్రు, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి పథకాలతో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎస్‌సీ కార్పొరేషన్ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం మండపేట పట్టణంలోని 4,5,10 వార్డుల్లో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రసాద్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేశ్వరరావు కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● ఎమ్మెల్యే జోగేశ్వరరావు ఇప్పనపాడు గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నల్లమిల్లి వీరెడ్డి, కుంచె ప్రసాద్, చింతా వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు. ● కేశవరంలో తెదేపా గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు కంటిపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు గారపాటి శ్రీనివాస్, కాశీఅన్నపూర్ణ, పిసిపే రాజు, ఆళ్ల రాజు, తొడ్డపటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

కేశవరంలో తెదేపా నాయకులు..

కూటమి ప్రభుత్వంతోనే..

కె.గంగవరం కుందూరు, అద్దంపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్వహించారు. గ్రామాల్లో ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెకానిక్‌లను సంఘటిత కార్మికులుగా గుర్తించాలి

ద్రాక్షారామ: ప్రపంచ మోటారుసైకిల్ మెకానిక్ దినోత్సవాన్ని నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల మోటారుసైకిల్ మెకానిక్‌లు గురువారం ద్రాక్షారామలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌లు ద్రాక్షారామ ప్రధాన వీధుల్లో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాసంశెట్టి సత్యం, తెదేపా నాయకులు కేకును కోసి మెకానిక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. తమను ప్రభుత్వం సంఘటిత కార్మికులుగా గుర్తించాలని, బీమా సౌకర్యం కల్పించాలని మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ద్రాక్షారామ మెకానిక్ సంఘం గౌరవ అధ్యక్షుడు మద్దాల సత్యప్రసాద్, మూడు మండలాల అధ్యక్షులు పిల్లి కృష్ణ, గోపి, గండం దుర్గారావు, ఉపాధ్యక్షుడు దడాల రవికుమార్, కార్యదర్శి పిల్లి భీమన్న, కోశాధికారి అనిశెట్టి ముత్యాలరావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు

ద్వారపూడి, న్యూస్‌టుడే: గంజాయి, మాదకద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం రైల్వే డీఎస్పీ ఎ.ప్రదీప్ అన్నారు. మాదకద్రవ్యాల రవాణా నిర్మూలనలో భాగంగా రామచంద్రపురం రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై వి.కిషోర్, జీఆర్పీ, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి ద్వారపూడి రైల్వే స్టేషన్ వద్ద తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైలులో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | మండపేట: 80085 74183 | రామచంద్రపురం: 80085 74191

స్పందనకు వందనం

డ్రెయినేజీ శుభ్రం

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం వి.సావరంలోని శెట్టిబలిజ రామాలయం వద్ద డ్రెయినేజీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురుగు నిలిచిపోయింది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి రమణ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీని శుభ్రం చేయించారు.

వర్షం నీటికి అడ్డంకులు తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక ఏడిద రోడ్డు నుంచి సైదిలు పేట రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయి రాకపోకలకు ఆటంకంగా మారింది. దీనిపై 'వర్షం కురిసి రెండు రోజులు తప్పని పాట్లు' శీర్షికన గత నెల 29న ఈనాడులో వార్త ప్రచురితం అయ్యింది. దీనికి కమిషనర్ టీవీ రంగారావు స్పందించారు. ఆయన ఆదేశాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బంది నిల్వ నీరు తొలగేలా పనులు చేపట్టారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కాజులూరు, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. ఆర్యవటం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉంది. దీంతో పాఠశాల మూసి వేస్తారనే ఆందోళనతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేస్తున్నారని గ్రామస్థులు ఎంపీడీవో, ఎంఈవో డేవిడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు గురువారం గ్రామానికి చేరుకుని పాఠశాల ఉపాధ్యాయురాలు కె.అమ్మాజీ, గ్రామస్థులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు, తాతబ్బాయి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తన వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లిన సీఐ

ద్వారపూడి: మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో మహిళకు గాయాలయిన ఘటన ఇప్పనపాడు రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. గ్రామీణ పోలీసుల వివరాల ప్రకారం.. రావులపేటకు చెందిన గరగ సత్యవతి(60) ద్వారపూడి నుంచి మండపేట మనుమడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా స్థానిక రైస్‌మిల్లు వద్ద అదుపు తప్పి పడిపోయారు. సత్యవతి తలకు గాయమవగా అదేసమయంలో అటుగా వస్తున్న సీఐ పి.దొరరాజు తన వాహనంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెకు చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా సీఐను పలువురు అభినందించారు.

అధ్వానంగా పుంత రోడ్డు

కె.గంగవరం మండలం పామర్రు నుంచి వాకతిప్పకు చేరే పుంత రోడ్డు అధ్వానంగా ఉంది. గత దశాబ్దకాలంగా దీన్ని బాగుచేయించ లేదు. ఈ రహదారి సుమారు 600 ఎకరాల ఆయకట్టుకు అనుసంధానంగా ఉంటుంది. రైతుల పంట ఉత్పత్తులు బయటకు తెచ్చుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. గతంలో గ్రావెల్ రోడ్డుగా ఉండేదని, ఇప్పుడు మట్టిరోడ్డుగా మారి గుంతలు పడిపోయి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినుకు పడినా చిత్తడిగా మారిపోతోందని వాపోతున్నారు. అధికారులు, స్థానిక నాయకులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. సమస్యను వ్యవసాయాధికారి సద్గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లగా మార్కెట్ కమిటీ నిధులతో పుంత రోడ్లు అభివృద్ధి చేసేవారని, నిధులు లభ్యతను బట్టి ప్రాధాన్యతా క్రమంలో బాగుచేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, పామర్రు

గుంతల్లో రాకపోకలు ఎలా..?

రాయవరం-మాచవరం ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయవరం, బూరుగుపూడి, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు ప్రజలకు ఈ మార్గమే ముఖ్యదారి. బీఎస్‌ఎన్‌ఎల్ ఎక్సేంజ్ వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. వర్షం నీరు గుంతల్లో చేరడంతో వాహనచోదకులు పడిపోతున్నారు. రాత్రివేళల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా మారడంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. దీనిపై ర.భ.శాఖ రామచంద్రపురం డీఈఈ సూర్యనారాయణను వివరణ కోరగా వర్షాలు తగ్గిన అనంతరం అత్యవసర నిధులతో గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాయవరం

ఉద్యోగులకు అండగా నిలుస్తాం

రామచంద్రపురం: ప్రభుత్వ ఉద్యోగులకు మంత్రి సుభాష్ సహా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. బదిలీపై వెళ్లిన ఉద్యోగ సంఘ నాయకులకు జేఏసీ ఛైర్మన్, ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అతిథులుగా సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్జీవో భవనానికి రామచంద్రపురంలో 5 సెంట్ల భూమి కేటాయించాలని, బకాయి డీఏలు ఇప్పించాలని, పీఆర్సీ కమిటీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని సత్యం హామీ ఇచ్చారు. బదిలీపై వెళ్లిన ఉద్యోగులను, అతిథులను సంఘం తరఫున సత్కరించారు. కంచుమర్తి బాబూరావు, సలాది వెంకప్పనాయుడు, గొల్లపల్లి కృష్ణ, మద్దాల బాపూజీ, పడాల సత్య ప్రసాద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.ప్రవీణ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

సత్యంను సత్కరిస్తున్న ఏపీఎన్జీవో సంఘ నాయకులు

మృతి చెందిన ఆయా కుటుంబానికి అంగన్‌వాడీల చేయూత

రాయవరం: రాయవరం మండలం వెదురుపాకలో ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ ఆయా కుటుంబానికి మండల అంగన్‌వాడీలు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన ఎనిమిదవ అంగన్‌వాడీ ఆయా గేలం సుబ్బలక్ష్మి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ నేతలు డి.ఆదిలక్ష్మి, ఎస్.కృష్ణకుమారి, సీహెచ్.సత్యవేణి చేతుల మీదుగా 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.2 వేల నగదును అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.బాల త్రిపురసుందరీ, ఎస్.శ్రీసత్య, ఇవీఎల్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆయా కుటుంబానికి నిత్యవసరాలు అందిస్తున్న అంగన్‌వాడీలు

పారదర్శకతకు పెద్దపీట

మండలం	కేంద్రాలు	గర్భిణిలు	బాలింతలు	చిన్నారులు
మండపేట	94	627	541	4471
రాయవరం	70	300	249	2009
కపిలేశ్వరపురం	78	344	279	2380

ద్వారపూడి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయనున్నారు. కేంద్రాల్లో అబ్ధిదారులకు అందిస్తున్న పోషకాహారం, సరకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు వీలుగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్‌ఆర్‌ఎస్)నకు సంబంధించి పోషణ్ ట్రాకర్ ప్రత్యేక యాప్‌ను ఈ నెల 1వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేసేటప్పుడు, ఆహార పంపిణీ సమయంలో ముఖ గుర్తింపు తీసుకుని పంపిణీ చేయనున్నారు.

లబ్ధిదారు ముఖ ఆధారిత గుర్తింపు తీసుకుంటున్న కార్యకర్త

నియోజకవర్గంలో ఇలా..

మండపేట నియోజకవర్గంలో 242 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 237 మంది కార్యకర్తలు పనిచేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతోపాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అమలు చేసిన యాప్‌లు లోపాలతో ఉండటంతో కేంద్రాల్లో సరకులు పక్కదారి పట్టాయని విమర్శలు ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు పోషకాహారం పక్కాగా అందేలా సవరణలు చేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయనున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ఏ మేరకు పంపిణీ అవుతుందో పర్యవేక్షణ సులభతరం అవుతుంది. చాలా కేంద్రాల్లో ఇప్పటికే ముఖ ఆధారిత గుర్తింపు మొదలుపెట్టారు. 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల్లో ఎంత మంది ఆహారం తీసుకుంటున్నారనేది యాప్‌లో నమోదు చేయాలని అధికారులు స్పష్టం చేశారు.

పక్కాగా అమలు చేస్తున్నాం..

లబ్ధిదారుల ముఖ గుర్తింపును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో సిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఇప్పటి వరకు మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 95 శాతం పూర్తి చేశాం.

- ఐ.మాణిక్యం, గ్రేడ్-1 సూపర్‌వైజర్, ఇన్‌ఛార్జి సీడీపీవో, మండపేట

కొనసాగుతున్న మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమ్మె

మండపేట, రామచంద్రపురం: తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 41వ రోజుకు చేరింది. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దీక్షా శిబిరం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. కప్పల అన్నవరం, పిట్టా ప్రవీణ్‌కుమార్, సైనం భాస్కరరావు, మందపాటి గనియ్య, వెంకటేశ్వర్లు, సురేంద్ర, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ✦ రామచంద్రపురం మున్సిపల్ ఇంజినీరింగ్ లైటింగ్, వాటర్ వర్క్స్ సిబ్బంది తలపెట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. నాయకులు మాట్లాడుతూ సమ్మెలో కార్మిక సోదరులంతా భాగమవ్వాలని పిలుపునిచ్చారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపమన్నారు.

మండపేటలో నినాదాలు చేస్తున్న కార్మికులు

కనీస వేతనం అందించాలి

రామచంద్రపురం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఎస్‌ఎస్‌ఏ(సర్వశిక్షా అభియాన్) ఉద్యోగులకు కనీస వేతనం, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, జీవో నంబర్-2 సవరించాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కాంట్రాక్టు, ఒప్పంద ఉద్యోగుల సమాఖ్య జేఏసీ ఛైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు పేర్కొన్నారు. గురువారం తమ ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి ఆయన రామచంద్రపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్, కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పామర్రు, మండపేట, రాయవరం, ద్రాక్షారామ: కె.గంగవరం మండలం కోట ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు శుక్రవారం చేపట్టనున్నట్లు ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. దీని కారణంగా కోట, సుందరపల్లి, ఊడిమూడి, మల్లవరం, నీలగిరిపేట, గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ✦ విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండపేట డీఈఈ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఏడిద రోడ్డులో పెద్దమ్మతల్లి గుడి వద్ద గల ఉపకేంద్రం పరిధిలో బైపాస్‌రోడ్డు, ఏడిద రోడ్డు, రాజీవ్ గృహకల్ప, సంగం కాలనీ, విజయలక్ష్మినగర్, మెహర్ ఆశ్రమం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ✦ రాయవరం, సోమేశ్వరం, లొల్ల, మాచవరం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. రాయవరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సోమేశ్వరం ఉపకేంద్రం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ✦ ద్రాక్షారామ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు.

భూమి కౌలు హక్కుకు బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడలో గల రావు బహదూర్ పైండా వెంకట చలపతి సత్రం అండ్ ఛారిటీస్‌నకు చెందిన డా॥ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, ద్రాక్షారామ గ్రామంలోని R.S.No.240, 251, 252/2లలో య. 15.70 ట్ల భూమిని 1 ప్రతిగా కౌలుకు సాగు చేసుకునే హక్కునకు 2025-26 నుండి 2027-28 వరకు 3 సంవత్సరములకు మాత్రం ది. 14-07-2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు ద్రాక్షారామలోని శ్రీ పైండా వెంకన్న రామకృష్ణయ్య సత్రం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు రూ. 50,000/- లు ధరావతుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను. మిగిలిన పాట షరతులు కాకినాడలో గల సత్రం ఆఫీసులో సంప్రదించగలరు.

కాకినాడ,
ది. 03-07-2025.

డా॥ పైండా విశ్వనాథకుమార్, MBBS, DA
ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, సెల్: 91213 23888

(c) eenadu

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్ కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. యానాంతో పాటు శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలకు చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. రోజూ 800 మంది వరకు అభ్యర్థులు పాల్గొంటారని, వీరికి ఆహారం ఏర్పాటు చేయదలచిన వారు నోడల్ అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులనాయకేను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. 77020 03535 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న కల్నల్ ఆర్‌కే సింగ్

17న డైట్‌లో మొదటి విడత కౌన్సెలింగ్

బొమ్మూరు: డీసెట్- 2025 ద్వారా రెండు సంవత్సరాల డీఈఎల్ఈడీ కోర్సులో ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్ ఈ నెల 17 నుంచి 22 వరకు జరుగుతుందని బొమ్మూరు డైట్ ప్రిన్సిపల్ జయశ్రీ తెలిపారు. 8 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. 13 నుంచి 15 వరకు సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. బొమ్మూరు డైట్‌లో జరిగే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలని సూచించారు. పరిశీలన అనంతరం ఎడ్మిషన్ లెటర్ పొందాలని స్పష్టం చేశారు.

వైద్య విద్యార్థులకు తరగతులెలా!

కొత్త బ్యాచ్ వస్తున్నా పూర్తికాని ప్రధాన భవనం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధాన భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఏపీ ఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో మేఘా సంస్థ పనులు చేపడుతోంది. ఈ ఏడాది ఆగస్టులో వచ్చే కొత్త బ్యాచ్ బోధనకు ఇది అందుబాటులో ఉండాలనే మార్గదర్శకాలున్నా ప్రస్తుతం అతీగతీ లేదు. పనులు ఇలాగే జరిగితే భవనం పూర్తవడానికి మరో ఏడాది పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నెల రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం..

జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఆగస్టులోపు ప్రధాన భవనం పూర్తికావాల్సి ఉంది. అలా కాకుంటే వచ్చే ఏడాది వైద్య విద్య సీట్లు కుదించడం లేదా తొలగించడం చేస్తామని ఎన్ఎంసీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వైద్య కళాశాల నిర్మాణానికి 2022లో రూ.450 కోట్లు కేటాయింపు చేశారు. వీటిలో రెండు బ్యాచ్‌లకు సంబంధించి తరగతులు, పరిపాలనకు మల్లికార్జుననగర్‌లో ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్(పీఈబీ) నిర్మించారు. ప్రధాన భవనం పూర్తయితే మొత్తం పీఈబీలో వసతులు, విద్యార్థులను దాన్లోకి తరలించి, పీఈబీ భవనాన్ని నర్సింగ్ కళాశాలగా మార్చాలనే ప్రతిపాదన ఉంది. పీఈబీలో రెండే లెక్చర్ హాళ్లు ఉన్నాయి. మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు మాత్రమే వసతులున్నాయి. ఇప్పుడు మూడో ఏడాది ప్రారంభమవుతుంది. వారికి లెక్చర్ హాలు, ల్యాబులు, ఇతరత్రా వసతులు సమకూర్చాల్సి ఉంది. ఇందుకు మిగిలిన గడువు నెల రోజులే. ఆలోగా ఏ మేరకు పనులు జరుగుతాయన్నది చూడాల్సి ఉంది.

నిర్మాణంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల భవనం

గుత్తేదారుల నిర్లక్ష్యమేనా..?

గతేడాదే ప్రధాన భవనం పూర్తవ్వాల్సి ఉన్నా ఎప్పటికి పూర్తవుతుందో ప్రస్తుతానికి తెలియని పరిస్థితి ఉంది. గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రధాన భవనం నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేసే గాలికొదిలేయడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనికి సంబంధించి కూటమి ప్రభుత్వం నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం చేయకపోయినా ఈ భవనాన్ని సెల్లార్, జీప్లస్-4గా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

ఓ పక్క పనులు చేసేలా..

ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం ఆగస్టులోపు వైద్య కళాశాల ప్రధాన భవనం మొత్తం పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో ఒకవైపు భాగాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు యోచిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్త బ్యాచ్ విద్యార్థులకు లెక్చర్ హాలు, ఇతర వసతులను పూర్తిచేసి బోధనను ఇబ్బంది లేకుండా చూసేందుకు గుత్తేదారు సంస్థతో ముందుకెళ్తున్నారు.

పేదింట పప్పు ఉడికేదెప్పుడో?

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

లబ్ధిదారుల ఇబ్బంది

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే నిత్యావసర సరకుల్లో కందిపప్పు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, అవకతవకల వల్ల నేటికీ రేషన్‌లో పూర్తిస్థాయిలో కందిపప్పు అందించలేని పరిస్థితి. ప్రస్తుత నెల నుంచి ఇస్తారని లబ్ధిదారులు ఆశించినా చౌకదుకాణాలకు సరఫరా కాలేదు. గత సర్కారు దెబ్బతో టెండర్లు వేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తుంది. గత ప్రభుత్వం రేషన్‌లో బియ్యం తప్ప మిగతా సరకులేమీ సక్రమంగా ఇవ్వకపోగా కందిపప్పు పంపిణీదారులకు భారీ మొత్తంలో సొమ్ము బకాయి పెట్టి ఇబ్బందులకు గురిచేసింది. అరకొరగా పంచదార, కందిపప్పు ఇచ్చినా తూకాల్లో మోసం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని గుర్తించి సరఫరా నిలిపేసింది. కందిపప్పునకు సంబంధించి కొత్త టెండర్ల ఖరారులో ఆలస్యం జరుగుతుండటంతో చెన్నై నుంచి తీసుకొచ్చేందుకు నిర్ణయించారు. గతేడాది అక్టోబరులో జిల్లాకు 375 టన్నులు కేటాయించారు. నాణ్యత లేకపోవడంతో తిరిగి కొన్ని లారీలను వెనక్కి పంపించేశారు. తర్వాత వచ్చిన పప్పు, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఉన్న నిల్వలనే ఆయా మండలాలకు సర్దుబాటు చేస్తూ వచ్చారు. గుత్తేదారులు ఆసక్తి చూపకపోవడం, టెండర్లు ఖరారు కాక గత 4 నెలలుగా అదీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే కందిపప్పు అందిస్తున్నారు.

రేషన్‌లో అందించే కందిపప్పు (పాత చిత్రం)

ప్రస్తుతం ఏమిస్తున్నారంటే..

ప్రస్తుత నెలలో జిల్లాలో రేషన్ దుకాణాలకు 8,400 టన్నుల బియ్యం, 284 టన్నుల పంచదార సరఫరా చేశారు. ఐసీడీఎస్‌కు మాత్రం 25 టన్నుల కందిపప్పు అందించడంతోపాటు భోజన పథకం కోసం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు 375 టన్నుల సన్నబియ్యాన్ని సరఫరా చేసినట్లు పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. చౌకదుకాణాల్లో కేజీ రూ.67కు అందాల్సిన కందిపప్పును బయట మార్కెట్‌లో రూ.130 నుంచి రూ.150 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..

సరకు నిల్వ కేంద్రాలు	5
చౌక ధరల దుకాణాలు	871
మొత్తం రేషన్ కార్డులు	5,64,988
అంత్యోదయ కార్డులు	20,538
బియ్యం కార్డులు	5,44,450

స్నేహపూర్వక పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజలకు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సేవలందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఎస్పీ డి.నరసింహకిషోర్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో సమర్థంగా నేరాలను కట్టడి చేయగలుగుతున్నామన్నారు. ఈ ఏడాదిలో ఛేదించిన కేసులు, సాధించిన విజయాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు, దర్యాప్తు పురోగతి విశ్లేషించారు. కేసుల దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలను వివరించారు. సాక్ష్యాధారాల సేకరణ, నిందితులను పట్టుకోవడం, సకాలంలో ఛార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించి తక్షణమే స్పందించాలని.. బాధితులకు అండగా నిలవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువవ్వాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు సమర్థంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్‌రెడ్డి, ఇతర సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

వచ్చే ఏడాది ఉత్తరాంధ్రకు గోదావరి: మంత్రి నిమ్మల

పురుషోత్తపట్నం నుంచి 1,400 క్యూసెక్కుల నీటి విడుదల

సీతానగరం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పూర్తయ్యేలోగా ఎడమకాలువ కింద ఉత్తరాంధ్రలోని ఆయకట్టుకు వచ్చే ఏడాది నుంచి నీళ్లు తరలించేలా పనులు వేగవంతం చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎడమకాలువ పరిధిలో 204.800 కిలోమీటర్ల పనులను పూర్తి చేసేందుకు రూ.2,050 కోట్లతో టెండర్లు పూర్తిచేశామన్నారు. సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల నుంచి గురువారం 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ఎడమకాలువ కింద ఉమ్మడి విశాఖ జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో ఆయకట్టు ఉందని, పురుషోత్తపట్నం, పుష్కర రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా 5వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకోవచ్చన్నారు. ఏలేరు జలాశయానికి 30 టీఎంసీల నీటిని సరఫరా చేసే సమయంలోనే ఉత్తరాంధ్రకూ మళ్లిస్తామన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో వైకాపా పెట్టిన రూ.18వేల కోట్ల బకాయిలను తీరుస్తూనే అన్ని పథకాలను గాడిలో పెడుతున్నామన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

పుష్కర కాలువలకు నీటి విడుదలకు స్విచ్ వేస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు బత్తుల, నెహ్రూ, రుడా ఛైర్మన్ చౌదరి తదితరులు

1.38 లక్షల ఎకరాలకు..

తాడిపూడి ఎత్తిపోతల నుంచి మోటారు ద్వారా మంత్రి సాగునీరు విడుదల చేశారు. ఈ పథకంతో తూర్పు, ఏలూరు జిల్లాల పరిధిలోని 1.38 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సుమారు 1,57,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించనున్నట్లు చెప్పారు. కొవ్వూరు, గోపాలపురం, పోలవరం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, సీహెచ్.బాలరాజు, ద్విసభ్యకమిటీ సభ్యులు సుబ్బారాయచౌదరి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శాఖ మెరుగైన పనితీరు కనబరచాలి : కలెక్టర్

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమలు, పథకాల అమలు విషయంలో వివిధ శాఖల పనితీరుపై సర్వే జరుగుతున్న నేపథ్యంలో మెరుగైన పనితీరు కనబరచాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం పీ-4, సానుకూల పరిపూర్ణత సర్వే, మహిళా సంఘాలకు వార్షిక క్రెడిట్ జీవనోపాధి కల్పన ప్రణాళికలు, పోషణ్ ట్రాకర్, బాల సంజీవని, బయోగ్యాస్, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌ల నిర్వహణ విషయంలో శానిటేషన్, సమయపాలనకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలకు సంబంధించి గణాంకాలను పోషణ్ ట్రాకర్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు నుంచి వచ్చి చేరే నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉద్ధృతి పెరిగింది. 96,506 క్యూసెక్కులు కాటన్‌బ్యారేజీకి వచ్చి చేరుతున్నాయి. ధవళేశ్వరం ఆర్మ్‌లో 70 గేట్లలో 37 గేట్లను, ర్యాలీలో 20, మద్దూరులో 11, విజ్జేశ్వరంలో 14 గేట్లను గురువారం 0.40 మీటర్ల మేర పైకెత్తి 99,689 క్యూసెక్కుల అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాలకు తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.


సముద్రంలోకి విడుదల చేసిన అదనపు జలాలు

గోకవరంలో అత్యధిక వర్షపాతం

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో గడిచిన 24 గంటల్లో(గురువారం ఉదయం 8.30 గంటల వరకు) అత్యధికంగా గోకవరం మండలంలో 14.2 మి.మీ., అత్యల్పంగా పెరవలి మండలంలో 3.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. దేవరపల్లిలో 10.6 మిమీ., సీతానగరం 8.4, గోపాలపురం 7.6, చాగల్లు 7.4, కోరుకొండ 7.4, నల్లజర్ల 7.2, తాళ్లపూడి 7.2, రాజమహేంద్రవరం అర్బన్ 7.0, రాజానగరం 6.6, నిడదవోలు 6.2, రాజమహేంద్రవరం గ్రామీణం 6.2, ఉండ్రాజవరం 5.4, రంగంపేట 5.2, కొవ్వూరు 4.6, అనపర్తి 4.2, బిక్కవోలు 3.8, కడియం 3.8 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

విద్యాపూదోటలో ప్రతిభా సుగంధాలు

నేడు జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం

న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

లక్షలాది మందిని ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంతో పాటు వేలాదిమంది పారిశ్రామికవేత్తలు, సివిల్ సర్వెంట్లు, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులను అందించిన విజ్ఞాన భాండాగారం జేఎన్‌టీయూకే. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు... రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయదలిచిన ఇంజినీరింగ్ కళాశాలను, అక్కడి పరిస్థితుల దృష్ట్యా కాకినాడకు మార్చారు. 1946లో ప్రారంభమైన ఆ కళాశాల మద్రాస్ రాష్ట్రంలో యూనివర్సిటీకి అనుబంధంగా మూడు కోర్సులతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అనంతరం జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు అనుబంధంగా కొనసాగింది. 2008లో ప్రత్యేక యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి నేటి వరకు ఎంతో మంది ఇక్కడ నుంచి పట్టభద్రులయ్యారు. నేడు ఈ విద్యాలయం 11వ స్నాతకోత్సవానికి ముస్తాబైంది. కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉపకులపతి సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించనున్నారు.

విద్యుత్తు అలంకరణల మధ్య జేఎన్‌టీయూకే ప్రాంగణం

ఎందరో ప్రముఖులు...

దేశానికి మెట్రోరైల్‌ను పరిచయం చేసి మెట్రో మేన్ పేరుగాంచిన పద్మవిభూషణ్ శ్రీధరన్, మధ్యతరగతి ప్రజల మనస్సులు చూరగొన్న మారుతి కారు రూపకల్పన చేసిన భాస్కరుడు, శాంతా బయోటెక్ స్థాపకులు వరప్రసాద్‌రెడ్డి, ఇన్ఫోటెక్ ఫౌండర్ ఛైర్మన్, బీవీ మోహన్‌రెడ్డి, అంతరిక్ష రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ ఇక్కడి విద్యార్థులే. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారులు ముద్దాడ రవిచంద్ర జే.శ్యామలరావు, నాగులాపల్లి శ్రీకాంత్, కె.కన్నబాబు, ఎంటీ.కృష్ణబాబు, ఐపీఎస్ అధికారి నాగేంద్రకుమార్ తదితరులు ఇక్కడే చదివారు.

వేలాది మందికి 'పట్టం'..

కళాశాల స్థాయి నుంచి యూనివర్సిటీగా మారిన జేఎన్‌టీయూకేలో ప్రతి ఏటా వేలాది మంది ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ, పరిశోధన, మేనేజ్‌మెంట్, ఫార్మసీ విభాగాల్లో ఉత్తీర్ణులవుతున్నారు. వారందరూ పట్టాలు అందుకొని సమాజంలో ఉన్నత స్థాయిలో స్థిరపడుతున్నారు.

ఏడాది	పట్టాలు అందుకున్న విద్యార్థులు
2022	1,11,233
2023	1,20,718
2024	39,413
2025	50,980

పూర్వ విద్యార్థిగా సేవలందిస్తున్న సుబు కోట

స్నాతకోత్సవం సందర్భంగా కోట సుబ్రహ్మణ్యానికి(సుబు కోట) గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నారు. విజయవాడలో పుట్టి పెరిగిన సుబ్రహ్మణ్యం 1962 ప్రాంతంలో జేఎన్‌టీయూకేలో ఇంజినీరింగ్ చదివారు. అనంతరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో మాస్టర్ డిగ్రీకి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చేరారు. తర్వాత న్యూయార్క్‌లోని రోచెస్టర్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడ్డారు. డేటా జనరల్ సిస్టమ్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా చేరారు. అనంతరం అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్‌గా ఎదిగిన సుబు కోట తాను చదివిన జేఎన్‌టీయూకేకు తనవంతుగా చేయూతనిస్తున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా స్టార్టప్‌ల ఏర్పాటుకు సుబు కోట ఫౌండేషన్, జేఎన్‌టీయూకే సంయుక్తంగా రూ.కోటి నిధి కేటాయించారు.

ధర పెరిగే.. ఆశలు చిగురించె

గత పది రోజుల నుంచి పొగాకు రైతులు ఆనందంగా ఉన్నారు. ఈ ఏడాది సీజన్‌కు సంబంధించి మార్చి 26 నుంచి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని అయిదు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రారంభ ధర రూ.290తో మొదలుపెట్టారు. అప్పటినుంచి జూన్ 28 వరకు అత్యధిక ధర రూ.290 మాత్రమే పలికింది. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం ధర ఇదే అయితే పెట్టుబడి రాదని ఆందోళన చెందారు. జూన్ 28 తర్వాత అంతకంతకు పెంచుతూ గురువారం నాటికి కిలో పొగాకు అత్యధిక ధర రూ.314 పలికింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, గోపాలపురం**

పీహెచ్‌సీ వైద్యాధికారి అరెస్టు

ఉన్నతాధికారులకు డీఎంహెచ్‌వో నివేదిక

మసీదు సెంటర్ (కాకినాడ): మహిళను మోసం చేశారనే ఆరోపణలపై ఓ వైద్యాధికారిని రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం కాకినాడ జిల్లా గొల్లప్రోలు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుబ్బారావు కొవిడ్ సమయంలో రాజమహేంద్రవరంలోని ఓ వ్యక్తికి వైద్యం చేశారు. అదే సమయంలో ఆ వ్యక్తి బంధువైన ఓ మహిళతో పరిచయం పెంచుకుని, మోసం చేశారనే ఆరోపణలున్నాయి. బాధితురాలు ప్రకాష్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గతనెల 28న వైద్యుడిని అరెస్ట్ చేయగా, ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని పోలీసులు ఇటీవల డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ దృష్టికి తీసుకొచ్చారు. జరిగిన విషయంపై డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కి నివేదిక పంపించామని డీఎంహెచ్‌వో గురువారం తెలిపారు. తదుపరి ఉత్తర్వులు రాగానే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

లిప్తపాటులో మృత్యు కాటు

- కారు టైరుపేలి ప్రమాదం.. భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు
- స్వల్పంగా గాయపడిన మరో ఇద్దరు

రావులపాలెం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: వారిద్దరూ కష్టజీవులే.. కుటుంబ పోషణలో ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అనుకోని ప్రమాదంలో మృత్యువు వీరి బంధాన్ని విడదీసింది. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవ్వడంతో భర్త మృతిచెందగా భార్య తీవ్ర గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన బొండాల వెంకటలక్ష్మీనరసింహగుప్తా(51) గ్రామంలోనే పరుపుల వ్యాపారం చేస్తుండగా ఆయన భార్య వీర వెంకటలక్ష్మి మగ్గంవర్కు చేస్తుంటారు. ఈమె చేస్తున్న మగ్గం వర్కుకు చెందిన మిషన్లు పాడవ్వడంతో మరమ్మతు చేయించుకోవడానికి గురువారం ఇద్దరూ కలిసి కారులో రాజమహేంద్రవరం బయలుదేరారు. రావులపాలెం సమీపంలోని ఈతకోట టోల్‌ప్లాజా దాటిన తరువాత ఒక్కసారిగా వాహనం టైరుపేలి డివైడర్‌పై నుంచి అవతల వైపునకు దూసుకుపోయింది. ముందుభాగం పూర్తిగా ధ్వంసం కావడంతో ఇద్దరూ అందులో ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి వెంకటలక్ష్మిని బయటకు తీశారు. డ్రైవింగ్ సీటులో ఉన్న గుప్తాను అతికష్టం మీద బయటకి తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలవ్వడంతో కొత్తపేట ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌పై నుంచి దూసుకుపోవడంతో అదే మార్గంలో రాజమహేంద్రవరం నుంచి పెనుగొండ వెళుతున్న మరో కారుని ఢీకొంది. దీంతో అందులో ఉన్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, రాజమహేంద్రవరానికి చెందిన భార్యాభర్తలు కర్రి రామారెడ్డి, దివ్యపద్మజ్యోతిలకు గాయాలయ్యాయి. రావులపాలెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. వీరు పెనుగొండలోని ఓ శుభకార్యం నిమిత్తం వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. క్షతగాత్రులు కోలుకుంటున్నట్లు చెప్పారు.

సంఘటనా స్థలంలో క్రేన్లతో కార్లను తొలగిస్తున్న అధికారులు

కారులో ఇరుక్కుపోయిన నరసింహగుప్తా

నరసింహగుప్తా

గురువారం వరద ప్రవాహంలో మునిగిపోతూ ఇలా..

ఆరునెలలు దాటిందా.. గో'దారే'!

దశాబ్దాలుగా లంక ప్రజల అవస్థలు

సీతానగరం, న్యూస్‌టుడే: గోదావరి నది మధ్యలో ఉండే లంక గ్రామాల ప్రజలకు ఆరునెలల పాటు ఉండే రోడ్డు మార్గం ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ముంపునకు గురవుతోంది. బొబ్బిల్లంక నుంచి ములకల్లంక చేరాలంటే నదీగర్భంలో వేసిన రోడ్డు మార్గం ఒక్కటే దారి. ఏటా వరదల సమయాల్లో లంకకు వేసిన రోడ్డు కొట్టుకుపోతోంది. దీంతో ములకల్లంక వాసులు సొంతంగా ఏర్పాటుచేసుకున్న నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ములకల్లంక నుంచి ద్విచక్ర వాహనాలను బొబ్బిల్లంకలో భద్రపరుచుకుంటారు. పడవలపై నదిని దాటి ద్విచక్రవాహనాలపై పొలం పనులు, రాజమహేంద్రవరంలో పాలవ్యాపారం తదితరాలను పూర్తిచేసుకుంటారు. వరద ఉద్ధృతి పెరిగి స్థానిక యంత్రాంగం ప్రమాద హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఆవులు, గేదెలు, గొర్రెలు ఇతర జీవాలను బయటకు తీసుకువస్తారు. 2020లో సుమారు రూ.35 కోట్లతో చేపట్టిన 300 మీటర్ల వంతెన పనులు నదిలో స్తంభాలు వేసి వదిలేశారు. ఆరునెలల పాటు రాకపోకలు సాగించే ఈ దారి బుధవారం సాధారణంగా ఉంది. గురువారం వరదలు ఎక్కువ కావడంతో మార్గం మునిగిపోయి కొట్టుకుపోతుంది. దీంతో లంక ప్రజలు పడవలపై బయటకు వస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

అనాథ పిల్లలకు ఆధార్ నమోదుపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆధార్ కార్డు లేని అనాథ చిన్నారుల గుర్తింపు పనుల జరుగుతున్న సాతి సర్వేపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో గురువారం సాతి కమిటీ సభ్యులతో నేరుగా.. ఉమ్మడి జిల్లాలోని ఇతర సాతి కమిటీ సభ్యులతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. ఆధార్ లేకుండా ఉన్న అనాథ పిల్లలను ఎంతమందిని గుర్తించారు, వారికి ఆధార్ నమోదుకు సంబంధించి కావాల్సిన ధ్రువ పత్రాల సమకూర్చడం.. వాటి కోసం సంబంధిత శాఖలను ఏవిధంగా సంప్రదించాలి.. తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్య, వైద్యారోగ్యశాఖలు, ఎస్సీలు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం'లో ప్రవేశాల ప్రక్రియ

హాజరైన విద్యార్థులు

నూజివీడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ (శ్రవణ్), సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అధ్యాపకులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

కోటసత్తెమ్మా.. భక్తుల సారె నీకమ్మా..

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మవారికి కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన 23 మంది భక్తులు గురువారం ఆషాఢం సారె సమర్పించారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 5న కోటసత్తెమ్మ వారి ఆలయ హుండీని లెక్కించనున్నట్లు హరిసూర్యప్రకాష్ తెలిపారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

ఏపీ జేఏసీ కో-ఛైర్మన్‌గా శ్రీనివాసరావు

రాష్ట్ర ఛైర్మన్ విద్యాసాగర్‌తో పాము శ్రీనివాసరావు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐకాస (ఏపీ జేఏసీ) కో-ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఏపీఎన్జీజీవో భవనంలో జరిగిన ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఏపీటీఎస్ఏ ఉమ్మడి జిల్లాశాఖ, ఏపీ ఎన్జీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామ్మోహనరావు, పీవీ కృష్ణ తదితరులు ఆయనను అభినందించారు.

జిల్లా ఉద్యాన అధికారిగా మల్లికార్జునరావు బాధ్యతలు

కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న మల్లికార్జునరావు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లా ఉద్యాన అధికారి(డీహెచ్‌ఓ)గా ఎన్.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీహెచ్‌ఓగా బాధ్యతలు నిర్వర్తించిన బి.సుజాతకుమారి ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో కాకినాడ జిల్లా నుంచి బదిలీపై మల్లికార్జునరావు వచ్చారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో అంతర పంటల సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాలని ఆయనకు కలెక్టర్ సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు.

జీవన దీపాలు వెలిగిస్తూ..!

అవయవదానంపై విస్తృత ప్రచారం చేస్తున్న దంపతులు

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మనం ఒక్కరం లేకున్నా సమాజంలో పది మందిలో మళ్లీ బతికించేది అవయవ దానం. నేనే పరమావధిగా అవయవ దాన ఆవశ్యకతపై కొవ్వూరు పట్టణానికి చెందిన అనపర్తి గోపాలకృష్ణ విస్తృత ప్రచారం చేస్తున్నారు. భార్య, మాజీ కౌన్సిలర్ పార్వతీదేవి, కొడుకు సందీప్‌తో అవయవ దానానికి అంగీకారం తెలిపి ఆ దిశగా మరింత మందిని ప్రోత్సహిస్తున్నారు. 2009లో అనపర్తి ఫౌండేషన్, కోటి రత్నాల కొవ్వూరు కమిటీ(కేకేసీ) సంస్థలను స్థాపించారు. గోపాలకృష్ణ చేపట్టిన అవయవ దాన స్ఫూర్తితో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు సుమారు 200 మంది వరకు అవయవాలను దానం చేసేందుకు అంగీకారం తెలిపారు.

అంగీకార పత్రం తప్పనిసరి..

కచ్చితంగా అంగీకార పత్రంతోనే అవయవ దానం చేయాలి. అవసరమైన వారికి అమర్చేందుకు వైద్య, విద్య పరిశోధనకు గాని నేత్రాలు వినియోగించుకోవచ్చని నిర్ధారించాలి. మృతదేహాన్ని ప్రజల బాక్సులో భద్రపరిచి 24 గంటల లోపు సంబంధిత వైద్య కళాశాలలకు పంపేందుకు బంధువులు అనుమతి పత్రాన్ని ఇవ్వాలి.

చైతన్యం నింపడంతో..

కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో సుమారు 10 మంది వరకు కార్నియా దానం చేశారు. అవయవదానానికి అంగీకారం తెలపకున్నా వారిలో చైతన్యం నింపడంతో రక్త సంబంధీకులకు ఒక కిడ్నీ దానం చేసి వారి ప్రాణాలు కాపాడిన వారూ ఉన్నారు.


అవయవ దాన చైతన్య పాదయాత్రలో అంగీకార పత్రాల సేకరణ (పాత చిత్రం)

ప్రమాదం జరిగినప్పుడో, నివారణ కాని వ్యాధితో వ్యక్తి కోమాలో ఉండి వైద్య పరిశీలన ద్వారా సెరబ్రల్ అయ్యి ఆక్సిజన్ ద్వారా గుండె పని చేస్తూ ఉంటే దానిని బ్రెయిన్ డెత్ అంటారు. ఇలాంటి వారి అవయవాలు 18 మందికి ఉపయోగపడతాయి. ● నేత్రాలు,

ఏది ఎలా ఉపయోగం..

మూత్రపిండాలు ఇద్దరికి, కాలేయం ముగ్గురికి, ప్రాంక్రియాస్, గాల్‌బ్లాడర్ ఒకరికి, ఊపిరితిత్తులు, గుండె ఒక్కొక్కరికి, కర్ణభేరి ఇద్దరికి ఉపయోగపడతాయి. ● నరాలు, గుండె కవాటాలు, బోన్స్ కూడా మరొకరికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయవచ్చు. ● జీవించి ఉండగానే రక్తం, ఒక కిడ్నీ, కాలేయంలో 1/4 భాగం దానం చేయవచ్చు. శరీరకంగా మరణించిన వారు కేవలం కళ్లు మాత్రమే దానం చేయడానికి వీలవుతుంది.

మార్గదర్శకాలు..

పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ వయసు వారైనా అవయవ దాతలుగా మారొచ్చు. క్యాన్సర్, హెచ్.ఐ.వి. వంటి వ్యాధులు, విష ప్రభావం వల్ల మృతిచెందిన వారి అవయవాలు పనికిరావు.

సమాజానికి ఏదో చేయాలని..

ఒకప్పుడు రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన నేను వివేకానందుడి పుస్తకాలు చదివి సమాజానికి ఏదో చేయాలని నిర్ణయించుకున్నాను. వెన్నెల అంధుల సమితి, కోటి రత్నాల కొవ్వూరు, అనపర్తి, వివేకానంద ఫౌండేషన్లను స్థాపించా.

- అనపర్తి గోపాలకృష్ణ, పార్వతీదేవి, కేకేసీ, అనపర్తి ఫౌండేషన్, కొవ్వూరు

పౌరసరఫరాల సంస్థ డీఎంగా గణేష్..

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్(డీఎం)గా బి.గణేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌ఛార్జి డీఎంగా ఓఎన్జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాగ్యవతి బాధ్యతలు నిర్వర్తించారు. కొత్త డీఎం గణేష్ జిల్లా కలెక్టర్ ప్రశాంతి, సంయుక్త కలెక్టర్ చిన్నరాముడును మర్యాద పూర్వకంగా కలిశారు.

రేవు పాట మళ్లీ వాయిదా

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం, పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు పాట మళ్లీ వాయిదా పడింది. 2025-26 సంవత్సరానికి జాయింట్ కౌన్సిల్ సభ్యులు రాని కారణంగా ఇటీవల శుక్రవారానికి వాయిదా పడిన పాటను తిరిగి ఈ నెల 14న పోలవరం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

6న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న అండర్-13 బాల, బాలికల చదరంగం పోటీలు ది రాజమండ్రి హార్డ్‌వేర్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నట్లు కార్యదర్శి జీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి ఇద్దరు విజేతలు ఆగస్టులో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 1-1-2012 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులన్నారు.

స్వదేశాగమన శుభాకాంక్షలు

అమెరికా దేశంలో హవాయిలో నగరంలో జూన్ 25 నుండి 28 వరకు జరిగిన "ప్రపంచ గ్లకోమా సమావేశం"లో గ్లకోమా వ్యాధికి సంబంధించిన అంశంపై ప్రసంగించి స్వదేశానికి విచ్చేసిన సందర్భంగా మా గౌరవ డాక్టర్ ప్రశాంత్ కుమార్ గారికి ఇవే మా స్వదేశాగమన శుభాకాంక్షలు.

Dr. A.Prashanth Kumar
M.S., (Ophthal)., PDCR
Director - Glaucoma & Cataract Services and Consultant - Neuro Ophthalmology

(విల్మర్ ఐ ఇన్‌స్టిట్యూట్, అమెరికా)లో శిక్షణ పొందిన ప్రముఖ గ్లకోమా మరియు న్యూరో ఆప్తాల్మాలజీ కంటి వైద్య నిపుణులు

గౌతమి నేత్రాలయము
SEE FOR YOURSELF
కోరుకొండ రోడ్, రాజమండ్రి, 0883-2443441/2
Dr. V.K.Raju M.D, F.R.C.S, F.A.C.S Chairman

18 మండలాలకు సాగునీరు

మంత్రి నిమ్మల రామానాయుడు

సీతానగరం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం, జలవనరుల శాఖకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల నుంచి పుష్కర కెనాల్‌కు 1,400 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను తీరుస్తూనే ఉమ్మడి జిల్లాలో ఎత్తిపోతల పథకాలన్నీ రెండు రోజుల్లో ప్రారంభించి సాగు నీరు విడుదల చేయగలిగామన్నారు. గోదావరికి 14 మీటర్లకు నీటిమట్టం చేరిన సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సాగునీటిని సరఫరా చేశామన్నారు. పుష్కరకాలువ ద్వారా తుని వరకు 18 మండలాలకు సాగునీరు చేరుస్తున్నామన్నారు. అచ్యుయ్యపాలెం వద్ద రెగ్యులేటర్ ఏర్పాటుతో ఆటంకాలు లేకుండా నీరు అందిస్తున్నామన్నారు. పుష్కర పైపు లైన్లు కొత్తగా వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీవర్షాలకు పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి నీటిమట్టం 27.230 మీటర్లకు చేరిందని పీబీసీ ఎల్ఎంసీ తుని సర్కిల్ ఎస్ఈ బి.ఏసుబాబు తెలిపారు. గోదావరి ఎడమగట్టున ఎత్తిపోతల పథకాల వద్ద గురువారం సాయంత్రానికి 16.28 మీటర్లకు ప్రవాహం చేరిందన్నారు. ఏలేరు జలాశయంలో 10 టీఎంసీల జలాలు ఉండటంతో పీబీసీ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు చేరుతుందన్నారు.

నిర్వాసితులకు రూ.28.18 కోట్లు..

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణలో 72 ఎకరాలకు సంబంధించిన రైతులకు 6 శాతం వడ్డీ వేసి సుమారు రూ.28.18 కోట్లు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని రైతుల తరపున కె.బాలకృష్ణ అన్నారు. ఆ మొత్తం త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రాజానగరం తెదేపా ఇన్‌ఛార్జి బీవీఆర్ చౌదరి, పీబీసీ ఎల్ఎంసీ ఈఈ పీవీఎస్ఎస్ రంగారావు, డీఈ సీహెచ్ కోటేశ్వరరావు, జేఈలు వినోద్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ ఆధ్వర్యంలో 9, 10 తేదీలలో అంతర్జాతీయ సదస్సు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని వీసీ ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దీనికి సంబంధించిన గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్ అనలిటికల్ అండ్ ఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్ అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ముఖ్యవక్తలుగా రోవాన్ యూనివర్సిటీ (యూఎస్ఏ) నుంచి ప్రొ. కె.వి.రామానుజాచారి, చైనా నుంచి చీఫ్ సైంటిస్ట్, క్యాన్సర్ బయోసైన్స్ వైద్యులు ఎన్.నాగన్న, ఎన్ఐటీ - వరంగల్ ప్రొఫెసర్ టి.నాగేశ్వరరావు, ఐఐటీ - ఖరగ్‌పూర్ నుండి డా.రాంబాబురెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. సదస్సుకు ఛైర్మన్‌గా బి.జగన్మోహన్‌రెడ్డి, డైరక్టర్‌గా కె.దీప్తి, కన్వీనర్ టి.వి.రామ్మోహన్, కో కన్వీనర్లుగా ఎస్.పుత్రయ్య, బి.రాముడు, నిర్వహణా కార్యదర్శిగా ఎస్.ప్రశాంతి, కోశాధికారిగా బి.ఎల్.వి.రమణ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వి.స్వామి, తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపల్ టి.అశోక్, సెమినార్ నిర్వాహకులు, కెమిస్ట్రీ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ బి. వరప్రసాద్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం.77028 77188, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 8330952080

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీతలు: మెస్సర్స్ న్యూట్రి బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, రిజిష్టర్డు ఆఫీస్ : డి.నెం.68-9-51/ఏ2, సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, వెంకన్న ఫంక్షన్ హాల్ రోడ్డు, అశోక్ నగర్, కాకినాడ, కాకినాడ జిల్లా - 533003. మెస్సర్స్ న్యూట్రి బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యాక్టరీ చిరునామా : డి.నెం.68-3ఎ, 76-6, 69-2, రంగంపేట నుండి సింగంపల్లి రోడ్డు, సుభద్రంపేట, రంగంపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా. మెస్సర్స్ న్యూట్రి బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్టర్ : యల్లా సందీప్, తండ్రి : లేటు శ్రీ యల్లా రుద్ర వీర వెంకటేశ్వరరావు, డి.నెం. 68-9-51/ఏ2, సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, వెంకన్న ఫంక్షన్ హాల్ రోడ్డు, అశోక్ నగర్, కాకినాడ, కాకినాడ జిల్లా - 533003. మెస్సర్స్ న్యూట్రి బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్టర్ : శ్రీమతి తులా షన్మిత రామ లక్ష్మి, భర్త: శ్రీ తులా మహేష్, డి.నెం. 68-3ఎ, 76-6, 69-2, రంగంపేట నుండి సింగంపల్లి రోడ్డు, సుభద్రంపేట, రంగంపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా. **హామీదారులు : 1) యల్లా సందీప్,** తండ్రి : లేటు శ్రీ యల్లా రుద్ర వీర వెంకటేశ్వరరావు, డి.నెం. 68-9-51/ఏ2, సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, వెంకన్న ఫంక్షన్ హాల్ రోడ్డు, అశోక్ నగర్, కాకినాడ, కాకినాడ జిల్లా - 533003. **2) శ్రీమతి తులా షన్మిత రామ లక్ష్మి,** భర్త: శ్రీ తులా మహేష్, డి.నెం.8-24, బంట్రోతు వీధి, ద్వారపూడి, తూర్పు గోదావరి జిల్లా - 533341. **3) శ్రీ తులా మహేష్,** తండ్రి : శ్రీ తులా శేషారావు, డి.నెం. 8-24, బంట్రోతు వీధి, ద్వారపూడి, తూర్పు గోదావరి జిల్లా - 533341. **డిమాండ్ నోటీసు తేది: 14-07-2023**

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.13-07-2023 నాటికి **రూ.3,27,09,104/- + తేది.14-07-2023** నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. (తదుపరి జమలు ఉన్నచో మినహాయించబడును).

షెడ్యూల్ ఆస్తుల వివరములు :

రిజిష్టర్డు రేటిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నెం.4829/2013, తేది.12.07.2013 ప్రకారం **శ్రీమతి తులా షన్మిత రామలక్ష్మి, భర్త : శ్రీ తులా మహేష్ గారి పేరున గల ఆస్తి షెడ్యూలు - డాక్యుమెంట్ ప్రకారం షెడ్యూలు : షెడ్యూలు-ఎ:** తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, రాజమండ్రి, వెంకటేశ్వర నగర్ వద్ద సాధారణ నీటి సదుపాయాలు మరియు నడక మార్గాలు, అన్నీ ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో గల ప్రస్తుత డి.నెం.81-9-5/4, ఆర్.ఎస్.నెం.208/1, వెంకటేశ్వర నగర్ లోని డైరెక్టర్ అఫ్ డిస్ట్రిక్ట్ కంట్రీ మరియు టౌన్ ప్లానింగ్ వారి ద్వారా ఆమోదం పొందిన ఎల్‌పి.నెం.184/87 ప్రకారం ఆమోదం పొందిన ప్లాన్ ప్లాట్స్ లోని ప్లాట్ నెం.ఎల్‌పి1/ఎ-278 లోని 497.77 చ॥గ॥లు లేదా 416.19 చ॥మీ॥ల స్థలం విస్తీర్ణంలో 62.22 చ॥గ॥లు లేదా 52.02 చ॥మీ॥ల అవిభాజ్యపు, అనిర్దేశ్యపు మరియు అనుపాత ఉమ్మడి హక్కుల వాటా విస్తీర్ణం గల యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** 33 అ॥ల వెడల్పు గల రోడ్డు - 56.00 అ॥లు, **పడమర :** ప్లాట్ నెం.ఎ-273 లోని స్థలం - 56.00 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.ఎ-277 లోని స్థలం - 80.00 అ॥లు, **దక్షిణం :** ప్లాట్ నెం.ఎ-279 లోని స్థలం - 80.00 అ॥లు., **పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం 497.77 చ॥గ॥లు లేదా 416.19 చ॥మీ॥ల మొత్తం స్థల విస్తీర్ణంలో 62.22 చ॥గ॥లు లేదా 52.02 చ॥మీ॥ల విస్తీర్ణం గల అవిభాజ్యపు, అనిర్దేశ్యపు మరియు అనుపాత ఉమ్మడి హక్కుల వాటాతో గల స్థలం సాధారణ నీటి సదుపాయాలు మరియు నడక మార్గాలు, అన్నీ ఈజిమెంటరీ హక్కులు మొ॥ వాటితో కలదు.**

షెడ్యూలు-బి: రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, పైన తెలిపిన ఎ షెడ్యూలు ఆస్తి వద్ద డాఫోడిల్ అను పేరుతో G+3 బహుళ అంతస్తులతో కూడిన భవనం రెండవ అంతస్తు నందు 1500 చ॥అ॥లు (కామన్ ఏరియా, బాల్కానీలు మరియు కార్ పార్కింగ్‌తో సహా) విస్తీర్ణంతో గల నివాస ఫ్లాట్ నెం.301. **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **పడమర :** వరండా మరియు ప్రవేశం, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై. **పైన తెలిపిన హద్దులలోని రెండవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.301 అన్నీ ఉమ్మడి మెట్లు మరియు ఉమ్మడి వరండాలు మరియు ఉమ్మడి దారులు లిఫ్ట్, కార్ పార్కింగ్ ఏరియా మరియు నీటి సదుపాయాలు, అన్నీ కార్పొరియల్ మరియు ఇన్‌కార్పొరియల్ హక్కులతో కలదు.**

రిజర్వు ధర : రూ.58,50,000/-   ధరావత్తు : రూ.5,85,000/-   బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 23-07-2025   సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:04-07-2025 నుండి 22-07-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ **M/s. PSB Alliance & M/s. Baanknet** యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.

2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎం.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎం.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎం.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ **రూ.50,00,000/-** (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై **TDS @ 1%** వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో **1% TDS**ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ **TDS** సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది: 03-07-2025 ప్రదేశం: విశాఖపట్నం   **సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ఇళ్లు కూల్చేసినా.. ఆభరణాలు అపహరించినా చర్యలేవీ..?

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు సీతామహాలక్ష్మి

ఏ.వి.ఎ రోడ్డు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: గోకవరం మండలం మల్లవరంలోని సింగారమ్మ ఆలయ నిర్వాహకులు, అర్చకత్వం చేస్తున్న వారిపై దాడికి పాల్పడి గృహాలను ధ్వంసం చేసి, దేవుడి పూజా సామగ్రి, బంగారం, వెండి ఆభరణాలు చోరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది అయినా పురపు సూర్యనారాయణ డిమాండు చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు సింగారలక్ష్మి, సీతామహాలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. సింగారమ్మ చింతగా పేరొందిన ఆలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తుంటారన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాలకు చెందిన కొందరు వ్యక్తులు ఆలయాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనే దురుద్దేశంతో ఏప్రిల్ 23వ తేదీ రాత్రి అక్కడ నివాసముంటున్న వీరరాఘవమ్మ, సింగారలక్ష్మిపై దాడి చేసి గృహాలు, దుకాణాలను కూల్చివేసి, సుమారు రూ. 25 లక్షల విలువైన బంగారం, వెండి దోచుకెళ్లారన్నారు. దీనిపై గోకవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంతో మే 26న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. రాష్ట్ర హైకోర్టులో జూన్ 20న రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. బాధితులు సింగారలక్ష్మి, సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తమ వస్తువులు, దుస్తులు, ధ్రువపత్రాలు తగులబెట్టారని, ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వట్టికూటి దుర్గాప్రసాద్, పసపులూటి సూర్య, ఆలమూరు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నామవరంలో చోరీ

20 కాసుల బంగారం, రూ.5 లక్షల నగదు అపహరణ

రాజానగరం, న్యూస్‌టుడే: మండలానికి చెందిన నామవరంలోని ఓ ఇంట్లో 20 కాసుల బంగారం, రూ.5 లక్షల నగదు అపహణకు గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. సీఐ ఎస్ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేలంగి లోవరాజు తన కుటుంబ సభ్యులతో కలసి బుధవారం లోవలోని తలుపులమ్మవారి దర్శనానికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా బీరువా తలుపులు తెరచి ఉండటం గమనించారు. బీరువాలో ఉంచిన ఆభరణాలు, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కుటుంబ సభ్యులను విచారించి, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు. లోవరాజు తాళం చెవిని మెయిన్ గుమ్మం పక్కనే ఉన్న స్విచ్‌బోర్డుపై పెట్టి ఆలయానికి వెళ్లారని పోలీసులు తెలిపారు. దీంతో దొంగ సులభంగా ఇంట్లోకి ప్రవేశించి బీరువా తలుపులను ఇనుప ఊచతో తెరిచాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రసన్నగౌడ్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట రూ.1.40 లక్షల టోకరా

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఇంటి నుంచి పనిచేసే విధానంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రూ.1.40 లక్షలు కాజేసిన ఘటన రాజమహేంద్రవరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన యువతి ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో వర్క్ ఫ్రం హోం ఉద్యోగం ఇస్తామని ఓ నకిలీ ఖాతా నుంచి లింకు వచ్చింది. దానిని ఆమె క్లిక్ చేయగా బయోడేటా, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలు పంపాలని సంక్షిప్త సందేశం పంపారు. ఉద్యోగం కోసం ముందుగా కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలని.. ఆ వెంటనే నియామకపత్రాలు వస్తాయని నమ్మించారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి ఇన్‌స్టాగ్రామ్‌లో సందేశాల రూపంలో వచ్చిన లింకులను క్లిక్ చేయడం ద్వారా రూ.1.40 లక్షల నగదు ఆ యువతి బదిలీ చేసింది. అనంతరం అవతలి వ్యక్తి నుంచి స్పందన రాకపోవడంతో మోసపోయానని గ్రహించి గురువారం ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	24,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	95-00
రిటైల్ లైవ్	117-00
డ్రెస్డ్	170-00
స్కిన్‌లెస్	193-00

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

Kkd & సామర్లకోటలో 45 లక్షలు & 30 లక్షలకే, House (85 లక్షలు, 1.20 లక్షలకే విల్లా), Open Sites అమ్మకం. 80% లోన్ Kuda, 98490 40891.

LAND FOR SALE

GENERAL

కొవ్వూరు మం॥ దేచర్ల పరిధిలో అర్లమ్మ క్వారీలో మంచి రాయి గల సుమారు 9 ఎ॥ భూమి అమ్మకమునకు కలదు (సర్వే నెం.86/1) S.లక్ష్మీనరసింహారావు, Ex. MPP, 96662 66366. వివరాలకు: J.సత్యనారాయణ, 99591 56079.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Well Established (RJY) Company Looking for Managers (M/F) Full Time/ Part Time. Preferably Retd./ VRS/ House-wives. Age: above 30 yrs. Income: 80K above. Cont: 9440579695, 7093442345.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. ప్రముఖ ఫైనాన్స్ & ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. జీతం: 20k to 30k. సెల్: 99512 86781, 83092 95955.

TOURS AND TRAVELS

మహాలయ పక్షంలో నేపాల్ (ముక్తినాథ్) 6-9-25 తేదీ, 12 రోజులు, టికెట్ 25,000. రైలు, భోజనం, A/C బస్సు, రూం. కె.వాసు, నెల్లూరు. ✆ 94913 40504

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-70 పైు

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరంలోని ఆర్యాపురానికి చెందిన దాసరి గోపి, సీతాభార్గవి దంపతులు రూ.50,116, అమలాపురానికి చెందిన యర్రమిల్లి రవికుమార్, వెంకటనాగమీనాక్షి దంపతులు రూ.50,116 విరాళాన్ని గురువారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఈవో సూర్యచక్రధరరావు అభినందించారు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-34/చిన్నవి-30, వంకాయలు నలుపు-32/గులాబీ-38/తెలుపు-38/దొమ్మేరు-44, బెండ-24, బీర పందిరి-36/30, దొండ-36, క్యారెట్-32, బీట్‌రూట్-34, గోరుచిక్కుళ్లు-38, దోస-15, ఆనబకాయ-11/13, చిక్కుళ్లు-54, పచ్చిమిర్చి-36, బంగాళదుంపలు-22, ఉల్లిపాయలు-22

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
83282 39927, 80089 02897

సమస్య: స్థానిక శ్యామలానగర్ ఓంకార్ వీధిలో ఖాళీస్థలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగించడం లేదు. దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం కారణంగా రోగాలు విజృంభించే ప్రమాదం ఉంది. దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.
– సీతాదేవి, స్థానికురాలు

సమస్య: స్థానిక లలితానగర్‌లో పందుల బెడద ఎక్కువగా ఉంది. అవి స్వైరవిహారం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి.
– నాగేంద్ర, స్థానికుడు

సమాధానం: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– వినూత్న, ఎంహెచ్‌వో
– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సారంగధరమెట్ట యూపీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: సీపీఆర్(కార్డియో పల్మనరీ రిససిటేషన్)తో ఆపద సమయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని సారంగధరమెట్ట యూపీహెచ్‌సీలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సీపీఆర్ మీద దశలో శిక్షణ ఇచ్చారు. వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ బి.శ్రీనివాస్‌నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రోగికి ఎలాంటి సమయంలో సీపీఆర్ చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి నీలిమ, జీఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ ప్రశాంత్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హరిహర వీరమల్లు ట్రైలర్ విడుదల

ఏ.వి.ఎ రోడ్డు, న్యూస్‌టుడే: పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం నగరంలోని అనుశ్రీ(సాయి కృష్ణ) థియేటర్‌లో గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా థియేటర్ అధినేత అత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో అభిమానులు సందడి చేశారు. ట్రైలర్ అద్భుతంగా ఉందని, పాన్ ఇండియా స్థాయి చిత్రమని సత్యనారాయణ అన్నారు. ఈ నెల 24న చిత్రం విడుదలై అఖండ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. అనంతరం అభిమానులతో కలిసి కేకు కోశారు.

కేకు కోస్తున్న సత్యనారాయణ

ప్రత్యేక శిక్షణ.. భవితకు బాసట

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కార్యాచరణ

న్యూస్‌టుడే, దేవీచౌక్

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగ అవకాశాలతోపాటు ఉన్నత చదువులకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పీజీ సెట్, ఐ సెట్, సీయూ సెట్, ఎడ్ సెట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం మే నెలలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఆయా విభాగాల్లో నిపుణులైన కళాశాల అధ్యాపకులే శిక్షకులుగా వ్యవహరించారు. వారి మార్గదర్శకంలో ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటి 200 మంది వివిధ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎడ్ సెట్‌లో మూడో ర్యాంకు, ఐసెట్‌లో 60 మందికి పైగా వెయ్యిలోపు ర్యాంకులు, పీజీ సెట్‌లో 150 మంది ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, పీజీ సమన్వయకర్త డాక్టర్ బి.మల్లికార్జున, ఆయా విభాగాల అధిపతులు అభినందించారు. ప్రస్తుతం పీజీలో మంచి అవకాశాలున్నాయని డాక్టర్ మల్లికార్జున తెలిపారు. పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు విద్య, ఫార్మాతోపాటు వివిధ రంగాల్లో ప్రారంభ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

అధ్యాపకుల మార్గదర్శకంతోనే..

పీజీ సెట్ లైఫ్ సైన్సెస్‌లో 18వ ర్యాంకు సాధించా. కళాశాల అధ్యాపకుల మార్గదర్శకం వల్లే ఇది సాధ్యమైంది. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఏ విభాగాల్లో మంచి అవకాశాలున్నాయి తదితర అంశాల గురించి తెలియజేశారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు కూడా అందజేశారు.
– వి.విద్యా శ్రీహరి, బీఎస్సీ

పీజీ సెట్‌లో ఏడో ర్యాంకు సాధించా..

వేసవిలో ఇచ్చిన ప్రత్యేక శిక్షణ తరగతులకు ఆన్‌లైన్‌లో హాజరయ్యాను. పోటీ పరీక్షల్లో ఎటువంటి ప్రశ్నలు వస్తాయి, ఎలా తయారు కావాలి, ర్యాంకుల ఆధారంగా ఎటువంటి అవకాశాలు ఉంటాయి తదితర అంశాల గురించి అధ్యాపకులు వివరించారు. వాటికి సంబంధించిన పుస్తకాలు కూడా ఆన్‌లైన్ ద్వారా అందించారు. దీని ద్వారా పీజీ సెట్ ఆంగ్ల విభాగంలో 7వ ర్యాంకు సాధించగలిగాను.
– వై.అఖిల, బీఏ

చరవాణిలోనూ సందేహాలు తీర్చారు..

కళాశాలలో ఇచ్చిన శిక్షణ వల్లే మంచి ర్యాంకు సాధించగలిగాను. గత ఏడాది కూడా పోటీ పరీక్షలకు హాజరైనప్పటికీ మంచి ర్యాంకు సాధించలేకపోయాను. శిక్షణలో విద్యార్థుల సందేహాలను ఫోన్ ద్వారా కూడా అధ్యాపకులు నివృత్తి చేశారు. ఈ ఏడాది ఎడ్ సెట్‌లో మూడో ర్యాంకు, పీజీ సెట్ మ్యాథ్స్ విభాగంలో ఆరో ర్యాంకు సాధించాను. ఎమ్మెస్సీ చేయాలనే ఆలోచన ఉంది.
– ఎస్.కోమలిక, బీఎస్సీ

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

- సమయం: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదు
- ప్రాంతాలు: కోర్లమ్మపేట, రామచంద్రరావుపేట, సాంబశివరావుపేట, దేవీచౌక్, తుమ్మలావ
- సమయం: ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదు.
- ప్రాంతాలు: కాతేరు పరిధిలోని సుబ్బారావుపేట, సంజీవ్‌నగర్, శాంతినగర్, వేణుగోపాలపురం, భరత్‌నగర్, మిలటరీ కాలనీ, క్వారీ ప్రాంతం, కొంతమూరులోని కళ్యాణ్‌నగర్, ఆదర్శనగర్, ఎంప్లాయిస్‌కాలనీ, జంగాలకాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, నాలుగో వంతెన పరిసర ప్రాంతాలు.

వ్యూహలక్ష్మీదేవికి మహాభిషేకం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గాడాల శ్రీమహాలక్ష్మీ సమేత చిన్నవేంకటేశ్వర స్వామి పీఠంలో వారాహీదేవి గుప్త నవరాత్రుల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం పీఠాధిపతి వెంకన్నబాబు స్వామీజీ ఆధ్వర్యంలో వ్యూహాలక్ష్మీదేవికి మహాభిషేకం నిర్వహించారు. ఆలయంలో రాశులు, నక్షత్రాలతో కొలువైన శ్రీమహాలక్ష్మి అమ్మవారు వారాహీదేవిగా దర్శనమివ్వడం ఇక్కడ ప్రత్యేకత అని పీఠాధిపతి తెలిపారు. మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ రేవంత్, వాసంశెట్టి గంగాధరరావు, కడియాల శ్రీనివాస్, శనివారపు ధనరాజు, మతల రమేష్, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఏ.వి.ఎ రోడ్డు: క్రైస్తవులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బిషప్ పి.బాబి ప్రభుత్వాన్ని కోరారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ క్రైస్తవ దినోత్సవం సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులకు రాజమండ్రి కార్పొరేషన్, జిల్లాలోని 7 ఫెలోషిప్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు శిష్యుడైన సెయింట్ తోమా మన దేశానికి వచ్చిన సందర్భంగా జులై 3వ తేదీని క్రైస్తవులు ఆశీర్వాద రోజుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం చర్చిల్లో సైనికులు, ప్రజల కోసం ప్రార్థనలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బిషప్ ఆనంద్‌కుమార్, రె.ఎలియాజర్, డా.సుందరరాజు, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం ఘనంగా నిర్వహించాలి

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10న మెగా తల్లిదండ్రులు-టీచర్ల సమావేశాన్ని (పీటీఎం 2.0) ఘనంగా నిర్వహించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నారాయణపురంలోని నగరపాలక సంస్థ మోడల్ ఫౌండేషన్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య బంధం బలోపేతం చేసేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా సమావేశం నిర్వహించి కార్యాలయానికి నివేదిక అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంఓ గౌరీ శంకరరావు, సీఎంఓ శ్రీనివాసరావు, డీఐ బి.దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైస్తవ దినోత్సవం పేరిట కార్యక్రమాలు అభినందనీయం

ఏ.వి.ఎ రోడ్డు, న్యూస్‌టుడే: భారతీయ క్రైస్తవ దినోత్సవం సందర్భంగా జిల్లా, రాజమహేంద్రవరం పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీసీ రోడ్డులోని సీఎస్ఐ చర్చిలో గురువారం సాయంత్రం ఏసు భక్తి దినం కార్యక్రమం నిర్వహించారు. క్రీస్తు శిష్యులలో ఒకరైన తోమా ప్రాణ త్యాగానికి గుర్తుగా ఏటా జులై 3న భారతీయ క్రైస్తవ దినోత్సవం జరుపుకొంటున్నామని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ ప్రభాస్ సిన్హా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ క్రైస్తవ దినోత్సవం పేరిట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల మృతి చెందిన నల్లజర్ల ప్రాంతానికి చెందిన పాస్టర్ కుటుంబానికి రూ. 50 వేల సహాయం మంత్రి మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ జాన్ వెస్లీ ప్రసంగీకులుగా వ్యవహరించారు. రె.మోజెస్ బాబు, డా.జుహాని, టాటా విక్టర్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

గోవులను కబేళాకు తరలించకుండా కట్టడి చేయాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : కబేళాలకు ఒడిశా రాష్ట్రం, గోదావరి జిల్లాల నుంచి గోవులు వెళ్తున్నాయని, దీనికి అడ్డుకట్ట వేసేందుకు రాజమహేంద్రవరంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని కొవ్వూరుకు చెందిన గోవు, గౌతమి, గోదావరి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వైకే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గోవధ నిషేధం, హైందవ దేవాలయాల పరిరక్షణ కోరుతూ సీతంపేట మాతృరూపిణీ సేవా సంస్థ వ్యవస్థాపకుడు అజ్జరపు హరిబాబు చేపట్టిన రిలే నిరాహారదీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. శ్రీనివాస్ గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించి హరిబాబుకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మానవులకు గోవులతో అనుబంధం తెగిపోయిందని, అందువల్లే అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామన్నారు. గోదావరి జిల్లాల నుంచి ఒక్క గోవు కూడా కబేళాకు వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. దేశిరెడ్డి బలరామ నాయుడు, దూర్వాసుల సత్యనారాయణ, పట్నాల సూరిబాబు, చెరుకుపల్లి శంకర్ తదితరులు సంఘీభావం తెలిపారు.

గుంత.. ప్రమాదాల చింత

దేవీచౌక్ కూడలిలో రహదారిపై కొంత మేర గుంతలా ఏర్పడటంతో పాదచారులు, ద్విచక్రవాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డుపై అడ్డంగా ఉన్న గుంతను రాత్రి వేళలో గమనించక ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి దేవీచౌక్ కూడలిలో రహదారిపై గుంతలు పూడ్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ఆవరణ.. అధ్వానం

నగరంలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ ఇది. సబ్‌కలెక్టర్ కార్యాలయం వెనుకవైపు ఉన్న సబ్‌ట్రెజరీ, గృహ నిర్మాణ సంస్థ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాలకు వెళ్లే మార్గమిది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. అడుగు తీసి అడుగు వేయలేని విధంగా తయారవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలతోపాటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలు జారిపోతుండడంతో చోదకులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయాల ఆవరణలో క్వారీ చిప్స్ వేయిస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని అంటున్నారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

విధ్వంసం నుంచి వికాసం వైపు

మహిళ నుంచి వివరాలు యాప్‌లో పొందుపరుస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో వైకాపా మిగిల్చిన విధ్వంసకర పరిస్థితుల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం వికాసం వైపు అడుగులు వేస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం 11వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడిందన్నారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ దోచుకోవడం తప్ప ప్రజావసరాలను గత ప్రభుత్వం గుర్తించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గన్ని కృష్ణ, యర్రా వేణుగోపాలరాయుడు, వర్రే శ్రీనివాస్, కాశీ నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం కార్మికులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. విజయ గౌతమి మోటారు సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విక్రమ హాల్‌లో జరిగిన ప్రపంచ మెకానిక్‌ల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. భవానీ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా వ్యక్తిగత బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. వృత్తిలో నైపుణ్యం పెంచుకొనేందుకు ఆటోమొబైల్ యూనియన్‌తో మాట్లాడి సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కరరావు, రఘువర్మ, రాము, నాగేశ్వరరావు, రాజు, అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహానికి నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే రాజా తదితరులు

వైభవంగా ఎస్వీ రంగారావు జయంతి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, చిరంజీవి ఫ్యాన్స్ కొత్తపేట రాజా, ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నట చక్రవర్తి ఎస్వీ రంగారావు 107వ జయంతి గురువారం వైభవంగా నిర్వహించారు. గోదావరిగట్టున ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పంతం కొండలరావు, తెదేపా నాయకుడు గన్ని కృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, టి.కె.విశ్వేశ్వరరెడ్డి, యర్రా వేణుగోపాలరాయుడు, బెజవాడ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచనపై జిల్లా స్థాయి పోటీలు బొమ్మూరు డైట్‌లో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ జయశ్రీ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 7న పాఠశాలల్లో విద్యార్థులకు కౌమార విద్య, ఆరోగ్య పరిరక్షణ, వివిధ అంశాలపై వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం) : ఆలమూరు మండలంలోని మడికికి చెందిన కోరుప్రోలు సతీష్ రాజమహేంద్రవరంలోని ఒక కళాశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 2న కళాశాలకు వచ్చాడని, తర్వాత కనిపించలేదని తండ్రి సత్యనారాయణ గురువారం ప్రకాశం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కళాశాల విద్యార్థి..

నగరంలోని ఒక డిగ్రీ కళాశాలలో బీసీఏ చదువుతున్న తమ కుమారుడు వట్టి చేతన్ ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి లక్ష్మణ్ ప్రకాశంనగర్ పోలీసులను గురువారం ఆశ్రయించారు. కళాశాలకు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేశారు.

సేవకు ప్రతిరూపం లయన్స్

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : లయన్స్ అంటేనే సేవకు ప్రతిరూపమని జిల్లా గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ రాజమండ్రి మహిళ 2025-26 ఏడాదికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం గాదాలమ్మ నగర్‌లోని మాటూరి రంగారావు, మంగతాయారు లయన్స్ భవనంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ మహిళా క్లబ్ జిల్లాలోనే అగ్రస్థానంలో సేవలందిస్తూ ముందుకు సాగడం గర్వకారణమన్నారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. బాదం బాలకృష్ణ అధికారిగా వ్యవహరించిన కార్యక్రమంలో అధ్యక్షురాలిగా బచ్చు శ్రీదేవి, కార్యదర్శిగా మాటూరి సౌమ్య, కోశాధికారిగా మన్యం లావణ్య జ్యోతి, 35 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సభ్యులు తాము చేయబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. పూర్వపు జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు, బి.వి.ఎన్.రెడ్డి, గ్రంధి వెంకటేశ్వరరావు, కొల్లూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ రాజమండ్రి మహిళ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అన్న క్యాంటిన్ తనిఖీ

టి.నగర్, న్యూస్‌టుడే: నగరంలోని గోకవరం బస్టాండు వద్ద అన్న క్యాంటిన్‌ను కలెక్టర్ ప్రశాంతి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి క్యాంటీన్ నిర్వాణ తీరు తెలుసుకున్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఇంజినీరు మదర్షా ఆలీ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

ద్విచక్ర వాహనాల ద్వారా ఉత్తరాల బట్వాడాను ప్రారంభిస్తున్న డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు

ఉత్తరాల బట్వాడా ఇక వేగవంతం

లాలాచెరువు కేంద్రం నుంచే కార్యకలాపాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: ప్రైవేటు సంస్థలకు దీటుగా భారతీయ తపాలాశాఖ వివిధ సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది. గతంలో నగరంలోని వేరువేరు ప్రాంతాల్లోని తపాలా కార్యాలయాల ద్వారా ఉత్తరాల బట్వాడా జరిగేది. ఇక నుంచి ఒకే కేంద్రం నుంచి చేస్తారు. ఇందులో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరం లాలాచెరువు తపాలా క్వార్టర్స్ ఆవరణలో డెలివరీ సెంటర్ ప్రారంభించారు. తొలిదశలో దేశ వ్యాప్తంగా 638 డెలివరీ కేంద్రాలను గుర్తించగా విశాఖపట్నం రీజియన్ పరిధిలో నాలుగు ఏర్పాటు చేశారు. విశాఖపట్నం రెండు, కాకినాడ, రాజమహేంద్రవరంలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉత్తరాల బట్వాడా అంతా లాలాచెరువు డెలివరీ సెంటర్ నుంచే జరుగుతోంది. ఈ కేంద్రానికి 533101 పిన్‌కోడ్ కేటాయించారు.

వచ్చిన రోజే.. నగరంలో ఇన్నీసుపేటలో ప్రధాన తపాలా కార్యాలయంతోపాటు దానవాయిపేట, ఆర్యాపురం, శ్రీరామ్‌నగర్, స్పిన్నింగ్ మిల్లు కార్యాలయాల నుంచి ఉత్తరాల బట్వాడా జరుగుతోంది. 55 మంది పోస్ట్‌మెన్‌లు రోజుకు సుమారు 10 వేల ఉత్తరాలు బట్వాడా చేస్తున్నారు. ఇప్పటికీ వీరిలో చాలామంది సైకిళ్లపైనే ఉత్తరాలు అందిస్తున్నారు. బట్వాడా మరింత వేగవంతం చేసేందుకు పోస్ట్‌మెన్‌లు ద్విచక్ర వాహనాలు వినియోగిస్తున్నారు. ఇంధన ఖర్చు తపాలాశాఖ చెల్లించనుంది. గతంలో ఆయా తపాలా కార్యాలయాల పరిధిలో పంపే ఉత్తరాలకు వాటి పిన్‌కోడ్ వేస్తేనే మరుసటి రోజు డెలివరీ అయ్యేవి. వేయడం మరిచిపోయినా, తప్పుగా వేసినా మరో రోజు ఆలస్యమయ్యేది. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇక నుంచి నగరంలో ఏ చిరునామాకు పంపినా అన్నింటికీ ఒకే పిన్‌కోడ్(డెలివరీ కేంద్రం) కేటాయించారు. దీని ద్వారా బట్వాడా వేగంగా జరుగుతుందని డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఇక నుంచి వచ్చిన రోజే ఉత్తరాలు డెలివరీ అవుతాయన్నారు. ఉత్తరాలు అత్యవసర డెలివరీ కావాల్సిన వారు లాలాచెరువులోని డెలివరీ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

హడావుడిగా మొదలెట్టి.. అసంపూర్తిగా వదిలేసి

కేంద్ర, మున్సిపల్ సాధారణ నిధుల పనుల తీరు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు హడావుడిగా తలపెట్టిన పనులు నేటికీ పూర్తి కాలేదు. మున్సిపల్ సాధారణ నిధులతో వీటిని చేపట్టారు. కంబాలచెరువు నుంచి దేవీచౌక్ మీదుగా గోకవరం బస్టాండ్, పుష్కర ఘాట్ వరకు రోడ్డు విస్తరణ, మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడంతోపాటు మొక్కలు పెంచాల్సి ఉంది. ఆకర్షణీయంగా లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి రంగులు వేసి వదిలేశారు. ఎన్నికల తర్వాత పనులు పక్కన పెట్టేశారు. దీనిపై విమర్శలు రావడంతో మళ్లీ మధ్యలో కొంత మేర లైటింగ్ వేర్పాటు చేశారు. పుష్కర ఘాట్ వద్ద రోడ్డు శివారులో వేసిన టైల్స్ ఊడిపోయాయి. కంబాలచెరువు వద్ద వేసిన డివైడర్‌లో లైటింగ్ సదుపాయం కల్పించకపోగా, కనీసం మొక్కలు కూడా వేయకపోవడం గమనార్హం. నగరం నడిబొడ్డున ఉన్న జంక్షన్‌లో రెండేళ్లుగా డివైడర్ అసంపూర్తిగా వదిలివేశారు. కొన్ని చోట్ల రోడ్లకు ఇరువైపులా బెర్మ్‌లు సక్రమంగా పూర్తి చేయలేదు. వై-జంక్షన్ నుంచి గ్రాండ్ ట్రంక్ రోడ్డు పేరుతో లాలాచెరువు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తి కాలేదు. కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి సుమారు రూ. 5 కోట్లతో స్మార్ట్ రోడ్డు పేరిట ఈ పనులు చేపట్టారు. ప్రభుత్వ అటానమస్ కళాశాల, అల్లు రామలింగయ్య హోమియో కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్డీఓ కార్యాలయం మీదుగా లాలాచెరువు వద్ద జాతీయ రహదారిని కలవాల్సి ఉంటుంది. భవిష్యత్తు ప్రణాళికలకు అనుబంధంగా ఈ రోడ్డును ప్రణాళిక బద్ధంగా తీర్చిదిద్దాల్సి ఉంది. మధ్యలో డివైడర్లు, ఇరు వైపులా సైకిల్ పాత్, ద్విచక్రవాహనాలకు వేరు వేరుగా ప్రత్యేక పాత్‌లను నిర్మించాల్సి ఉంది. ఇక ఇరువైపులా పార్కు తరహాలో తీర్చిదిద్దాలి. గ్రీనరీ పెంచి మినీ పార్కు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పనులు అసంపూర్తి వదిలివేశారు. అక్కడక్కడ వేసిన గ్రీనరీ పాడైపోయింది. కేవలం ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్డీఓ కార్యాలయం వరకు ఓ మోస్తారు పనులు చేపట్టి వదిలివేశారు. నడకదారిపై వేసిన టైల్స్ కుంగిపోయాయి. ఎన్నికలు జరిగి ఏడాది మారినప్పటికీ ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోగా, చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించింది. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కంబాల చెరువు జంక్షన్ వద్ద అసంపూర్తిగా డివైడర్

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

క్షయవ్యాధిపై అవగాహన

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: క్షయ వ్యాధిపై సామాజిక అవగాహన కలిగి ఉండాలని మండలస్థాయి పీహెచ్‌సీ వైద్యాధికారులు దుర్గాప్రసాద్, ప్రియాంక అన్నారు. అనపర్తి మండలం కొప్పవరంలో గురువారం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు ఉత్పత్తులు వాడేవారికి, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. టీబీ ముక్త్ సూపర్‌వైజర్ మహేష్‌బాబు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమంలో చేరి సేవ చేయాలనుకునే వారు తమను సంప్రదించాలని కోరారు. గ్రామంలో 80 మందిని పరీక్షించారు. నాయకులు వెంకటరామారెడ్డి, తమ్మిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

బొమ్మూరు: ఈ నెల 11న జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచనపై జిల్లా స్థాయి పోటీలు బొమ్మూరు డైట్‌లో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ జయశ్రీ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 7న పాఠశాలల్లో విద్యార్థులకు కౌమార విద్య, ఆరోగ్య పరిరక్షణ, వివిధ అంశాలపై వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి

ధవళేశ్వరం: ఎస్వీ రంగారావు 107వ జయంతిని ధవళేశ్వరం జనసేన నాయకుడు యడ్లమహేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక బ్యారేజీ సెంటర్‌లో రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పేదలకు ఉచితంగా వైద్యమందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో గురువారం 16 మంది బాధితులకు వైద్యసహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.25.31 లక్షల విలువగల చెక్కులను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఈశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, ఒగిరెడ్డి రాధ తదితరులు పాల్గొన్నారు. ● పుత్రవియోగంతో బాధపడుతున్న తెదేపా సీనియర్ నేత కోసూరు ముత్యాలను రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. సుష్మంత్ వెంకట్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ● అనపర్తిలో పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన నూతన భవనాలు నిర్మించేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఉండవల్లిలో గురువారం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కళాశాల స్థలం కేటాయించడంతోపాటు, రంగంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేయిస్తామని, కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

నన్నయకు యూబీఐ పరికరాల వితరణ

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలోని మైదానం నిర్వహణలో భాగంగా ప్రాంగణంలో ఉన్న యూనియన్ బ్యాంక్ వారు రూ.2.59 లక్షల విలువైన డోజర్, హోల్ డిగ్గర్‌లను బహూకరించారు. వర్సిటీ ప్రాంగణంలో యూనియన్ బ్యాంక్ అధికారులతో కలిసి గురువారం వీసీ ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో యూనియన్ బ్యాంక్ ఎంతో సహకారాన్ని అందిస్తోందన్నారు. గతంలో ట్రాక్టర్‌ను బహూకరించారని గుర్తు చేశారు. యూనియన్ బ్యాంక్ రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ ఎ.మనోజ్, చీఫ్ మేనేజర్ జి.సురేష్, స్థానిక బ్యాంక్ మేనేజర్ పి.ప్రవీణ్ తదితరులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వి.స్వామి, డీన్ ఇన్‌ఛార్జి ఆఫీసర్ బి.జగన్మోహన్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ వి.నిర్మలాజ్యోతి, ఇంజనీర్ ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

డోజర్, హోల్ డిగ్గర్‌లను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

భూమి కౌలు హక్కు బహిరంగ వేలం పాట ప్రకటన

తూ॥గో॥ జిల్లా, సీతానగరం మండలం, సీతానగరం గ్రామంలో వేంచేసియున్న **శ్రీ వేణుగోపాల స్వామివారి దేవస్థానం** పూర్తి హక్కుభుక్తమైనటువంటి సీతానగరం గ్రామం, ఆర్.యస్.నెం.234/4, 455 వగైరాలలో గల య.14.43 సెంట్లు మెరక పల్లంభూములను 6 ప్రతులుగా సేద్యం చేసుకొని అనుభవించే హక్కును గూర్చి 3 సం॥లు కాలమునకు శ్రీ జిల్లా దేవదాయ శాఖ అధికారి, రాజమహేంద్రవరం వారి ఆమోదపు ఉత్తర్వులకు లోబడి ది.09-07-2025 తేదీ బుధవారం ఉ॥ 11 గం॥లకు దేవస్థానం వద్ద శ్రీ తనిఖీదారు, దే॥ధ॥శాఖ, రాజమహేంద్రవరం వారి సమక్షమున ఆలయ కార్యనిర్వహణాధికారి వారిచే బహిరంగ వేలంపాటలు నిర్వహించబడును. ఆసక్తి గలవారు పాడుకొనుటకు వీలుగా ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ది.03-07-2025, సీతానగరం. కార్యనిర్వహణాధికారి

గమనిక: పూర్తి వివరములు ఆయా రెవిన్యూ కార్యాలయముల నోటీసు బోర్డు నందు ప్రకటన కొరకు ఉంచిన కరపత్రముల ద్వారా తెలుసుకొనవలెను.

ఆలయ భూముల కౌలు హక్కు బహిరంగ వేలం పాట ప్రకటన

తూ॥గో॥ జిల్లా, కడియం మండలం, కడియం గ్రామములో గల దేవదాయ శాఖ, సంస్థల తాలూకు భూములను కౌలు హక్కులు గూర్చి 3 సం॥లు కాలమునకు అనగా 2025-26 సం॥ నుండి 2027-28 మాత్రం సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశములకు లోబడి శ్రీ తనిఖీదారు, దేవదాయ శాఖ, రాజమహేంద్రవరం వారి సమక్షమున ఆలయముల కార్యనిర్వహణాధికారి వారిచే బహిరంగ వేలంపాటలు నిర్వహించబడును. ఆసక్తి గలవారు పాల్గొనుటకు వీలుగా ఈ ప్రకటన జారీ చేయడమైనది.

బహిరంగ వేలం పాటల వివరం

వ.నెం.	దేవస్థానం పేరు చిరునామా	భూమి తాలూకు వివరం: గ్రామం	R.S. No.	విస్తీర్ణం య.సెం.	తేది సమయం	పాట జరుగు ప్రదేశం	పాట నిర్వహించు అధికారి
1.	శ్రీ మల్లేశ్వర స్వామివారి దేవస్థానం, కడియం	కడియపు లంక	353/1, 2 ఎ. మెరక	4-15 (2ప్రతులు)	15-07-2025 ఉదయం గం॥ 10.30 ని॥	దేవస్థానం వద్ద	కార్యనిర్వహణ అధికారి
2	శ్రీ జనార్ధన స్వామివారి దేవస్థానం, కడియం	॥	208 మెరక	3-62 (ఏకప్రతి)	15-07-2025 మధ్యాహ్నం గం॥ 12.00 ని॥	॥	॥

గమనిక: మిగిలిన పూర్తి వివరములు సంబంధిత రెవెన్యూ కార్యాలయముల నోటీసు బోర్డు నందు ప్రకటన కొరకు ఉంచబడిన కరపత్రముల ద్వారా తెలుసుకొనవలెను.

ది.03-07-2025, కడియం. కార్యనిర్వహణాధికారి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జగ్గంపేట ఏ.సి. బ్రాంచి (02731), కాకినాడ జిల్లా

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క రూల్స్ లోని రూల్ 8 (6) నిబంధనల అనుసరించి జారీ చేయడమైనది.

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) దీనితో చదువుకోవలసిన సదరు రూల్స్ లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతకు దిగువ సంతకందారు అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జగ్గంపేట ఏ.సి. బ్రాంచి, జగ్గంపేట,** కాకినాడ జిల్లా యొక్క అధీకృత అధికారి తేది. **27-06-2024**న జారీ చేసిన డిమాండ్ నోటీస్‌లో తెలిపిన విధంగా ఋణగ్రహీత: శ్రీ కోలా నరసింహారావు, తండ్రి: పుల్లయ్య, డోర్ నెం.4-37, పెనుగొండ నగర్, వేమగిరి, కడియం మండలం, తూర్పు గోదావరి జిల్లా-533 125 వారు ది.**26-06-2024** నాటికి యస్.బి.ఐ. రియాల్టీ లోన్ అకౌంట్ నెం.**37975050573** చెల్లించవలసిన బకాయి రూ.**59,52,187/-** (అక్షరాల యాభై తొమ్మిది లక్షల యాభై రెండు వేల నూట ఎనభై ఏడు రూపాయలు మాత్రమే) + తేదీ: **27-06-2024** నుండి పైన తెలిపిన సొమ్ము పై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు మొదలగునవి. నోటీసు తేదీ నుండి 60 రోజుల లోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13 (4) దీనితో సదరు రూల్స్ లోని రూలు 8 (1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది.**28-08-2024**న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది.**03-09-2024**న ఇంగ్లీష్-ఇండియన్ ఎక్స్‌ప్రెస్, తెలుగు డైలీ-సాక్షి దినపత్రికలో రూలు 8 (2) ప్రకారం ప్రచురించడమైనది. తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులపై నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల సదరు ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం కొరకు టెండర్లు /కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును. ది.**26-06-2024** నాటికి యస్.బి.ఐ. రియాల్టీ లోన్ అకౌంట్ నెం.**37975050573** చెల్లించవలసిన బకాయి రూ.**59,52,187/-** (అక్షరాల యాభై తొమ్మిది లక్షల యాభై రెండు వేల నూట ఎనభై ఏడు రూపాయలు మాత్రమే) + తేదీ: **27-06-2024** నుండి పైన తెలిపిన సొమ్ము పై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ కాస్ట్స్, ఇతర ఖర్చులు మొదలగునవి. (డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఏమైనా చెల్లించిన బకాయి తగ్గించబడును)

స్థిరాస్థి వివరములు

కాకినాడ యస్ఆర్ఓ.లో చేరిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.10062/2018 తేదీ:04-10-2018 ప్రకారం శ్రీ కోలా నరసింహారావు, తండ్రి: పుల్లయ్య గారికి చెందిన ఆస్థి.

తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్, తూరంగి పంచాయతీ/గ్రామం, పాత సర్వే నెం.161/1ఏ, ఉత్తర ప్రత్యుత్తరాలకు కొత్త సర్వే నెం.217/1, యల్.పి.నెం.4/86లో ప్లాట్ నెం.47లో మొత్తం 1398 చదరపు గజముల స్థలమునకు గాను తూర్పు వైపు గల 740 చదరపు గజముల స్థలమునకు హద్దులు

ఉత్తరం: 33 అడుగులు వెడల్పు గల రోడ్ 53'.0" **దక్షిణం:** పుంత రోడ్ 53'-0" **తూర్పు:** ఇతరులకు చెందిన ఆస్థి 126'-0". **పడమర:** కృష్ణవేణి, భర్త: జోణం వెంకట రావు గారికి చెందిన స్థలం 126'-0".

పైన తెలిపిన సరిహద్దుల్లో 740 చదరపు గజముల స్థలమునకు అన్ని సూపర్ స్ట్రక్చర్స్, అన్ని సాధారణ మార్గములు, నీటి వసరులు మరియు అన్ని సులభతరమైన హక్కులతో సహా

తేది: 02-07-2025 సం/- అధీకృత అధికారి

ప్రదేశం: జగ్గంపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఒకటిలో ఒక్కరూ చేరలేదు

న్యూస్‌టుడే, సీతానగరం: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడంపై విద్యాశాఖలో ఆందోళన నెలకొంది. బేసిక్ ప్రైమరీ, మోడల్ స్కూల్ వంటి పాఠశాలలను ఏర్పాటుచేసి ఉపాధ్యాయులను పదోన్నతులు కల్పించి సక్రమ బోధన నియమించింది. పాఠశాలలు పునఃప్రారంభం నుంచే విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేస్తున్నా ఆశించిన స్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు జరగని పరిస్థితి నెలకొంది.

పరిస్థితి ఇలా..

గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 ఏళ్ల వయసు పైబడిన పిల్లలు, బడి ఈడుకలిగి బయట ఉన్న వారిని విద్యాశాఖ గుర్తించి ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వానికి నివేదికలు ఇస్తోంది. దీని ఆధారంగా విద్యార్థులకు అవసరమైన పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూపదుస్తులు, బూట్లు, బ్యాగ్‌లు ఇతరత్రాలను సిద్ధం చేస్తారు. ఈ ఏడాది జూన్ 12 నుంచి జులై 12 వరకు 'పిల్లల నమోదు ప్రత్యేక కార్యక్రమం-2025' పేరుతో విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని సుబ్రహ్మణ్యంపేట, శ్రీరామనగరం, జెజేనగర్, బుచ్చింపేట, పల్లకడియం తదితర 57 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. రఘుదేవపురం కొత్త కాలనీ పాఠశాలలో ఒక్క విద్యార్థి ఒకటో తరగతిలో ప్రవేశించారు. మిర్తిపాడులోని 12 పాఠశాలల పరిధిలో 50 మంది ప్రవేశాలకు లక్ష్యం ఇస్తే కేవలం 19 మంది సగం పాఠశాలల్లో చేరారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

రాజానగరం నియోజకవర్గం...			
మండలం	పాఠశాలలు	లక్ష్యాలు	ఇప్పటి వరకు
సీతానగరం	43	314	267
కోరుకొండ	39	336	238
రాజానగరం	42	419	243

నియోజకవర్గంలోని ఓ పాఠశాలలో ఒకటిలో చేరిన నలుగురు పిల్లలు

ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు..

జిల్లాలో ఈ ఏడాది ఒకటో తరగతిలో ప్రవేశాల లక్ష్యం 7,207 ఉంది. ఈనెల 30కి 3,655 మాత్రమే యూ-డైస్ ప్రకారం నమోదు చేశారు. 51 శాతం మాత్రమే ప్రవేశాలు ఉండడంపై ఆయా మండల విద్యావనరుల కేంద్రాల అధికార యంత్రాంగంతో విద్యాశాఖ టెలీకాన్ఫరెన్సులు నిర్వహిస్తోంది. పాఠశాలల పునఃప్రారంభం రోజునే తల్లికి వందనం పథకం అమలుచేయడంతో చాలామంది ప్రైవేటు పాఠశాలల్లో తమపిల్లలను చేర్చారని విద్యాశాఖకు నివేదికలు పంపించినట్లు సమాచారం.

ప్రత్యేక చర్యలు చేపట్టాం

పాఠశాలల్లో ఒకటితోపాటు అన్ని తరగతుల్లో ప్రవేశాలు పెంచేలా ఆయా మండల విద్యావనరుల కేంద్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నాం. జులై నెలలో ప్రవేశాలకు సమయం పెంచాం. ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పథకాలు, ఇతరత్రా సౌకర్యాలు వివరించేలా కార్యాచరణ ఇచ్చాం. **-కంది వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి**

డంపింగ్ యార్డుల పరిశీలన

బిక్కవోలు,రంగంపేట: బిక్కవోలు, ఊలపల్లి, మెళ్లూరు, ఆరికిరేవుల, కొంకుదురు, రంగాపురం తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం, డంపింగ్‌యార్డుల నిర్వహణను ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ విస్తరణాధికారి జాన్ మిట్టల్, ఇతర సిబ్బంది పరిశీలించారు. డంపింగ్ యార్డుల లోతు, పేరుకుపోయిన వ్యర్థాల ఎత్తు తదితర వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. నీ రంగంపేట మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలోని డంపింగ్ యార్డులను గురువారం స్థానిక అధికారులు పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సేకరిస్తున్న చెత్త పరిమాణం, డంపింగ్‌యార్డు విస్తీర్ణం కొలతలను సేకరించినట్లు ఎంపీడీవో వి.వి.సాయిబాబు తెలిపారు.

రాపాక, నల్గొండ మధ్య పంటపొలాల్లో ముంపునీరు

పంట పొలాల్లోకి వరదనీరు..

సీతానగరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కొండగోదావరిగా పిలవబడే ముంపునీరు పంటచేలను ముంచెత్తుతోంది. రాపాక, నల్గొండ భూముల్లోకి గురువారం ముంపునీరు చేరి గోదావరిని తలపిస్తోంది. ముంపునీరు పోయేలా బుదరకాలువ పూడికతీత పనులు గత మూడేళ్లుగా లేకపోవడంతో తొర్రిగెడ్డ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లోకి ముంపునీరు చేరకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లక్రితం సుమారు రూ.100 కోట్ల పైబడి నిధులతో రివర్స్ పంపింగ్ స్కీమ్‌కు శంకుస్థాపన చేసి వదిలేశారు. కూటమి ప్రభుత్వంలో రివర్స్ పంపింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి: బీవీఆర్ చౌదరి

కోరుకొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనపై ఏడాది కాలంలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మండలంలోని రాజవరం, కణుపూరు, నరసాపురం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అడపా వీరబాబు, కంటే కేశవరావు, పి.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందని తెదేపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి అన్నారు. రఘుదేవపురంలో మండల తెదేపా నాయకుడు గెడ్డం తిమ్మారావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

రఘుదేవపురంలో ఇంటింటా ప్రచారంలో బీవీఆర్ చౌదరి తదితరులు

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: సీపీఆర్(కార్డియో పల్మనరీ రిససిటేషన్)తో ఆపద సమయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని సారంగధరమెట్ట యూపీహెచ్‌సీలో గురువారం వైద్యఆరోగ్య సిబ్బందికి సీపీఆర్ మొదటి దశపై శిక్షణ ఇచ్చారు. వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ బి.శ్రీనివాస్‌నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రోగికి ఎలాంటి సమయంలో సీపీఆర్ చేయాలో వివరించారు.

రత్నం కుటుంబానికి పరామర్శ

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి బుర్రిలంకకు చెందిన ప్రముఖ నర్సరీరైతు రత్నం వెంకట రామారావు(బాబులు) ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని వైకాపా జిల్లా ఇంఛార్జి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గురువారం పరామర్శించారు. అనంతరం బాబులు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయనతో పాటు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, మండలశాఖ అధ్యక్షుడు యాదల సతీశ్‌చంద్రస్టాలిన్, సాపిరెడ్డి సూరిబాబు, కొత్తపల్లి నాగశివాజీ, రత్నం కృష్ణమూర్తి, తోకల శ్రీనివాసరావు, బోడపాటి మూర్తి, గాద సాయి తదితరులు ఉన్నారు.

బాబులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి వేణు

ఉపాధ్యాయులకు గ్రామస్థుల సన్మానం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల జరిగిన బదిలీల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లనున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్థులు గురువారం పాఠశాలలో సన్మానించారు. కూటమి నేత నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కేవీ రాఘవులు, ఎంఎస్ ఎస్ఎం లీల, పి.శ్రీనివాస్, బి.నాగమణి, కేవీవీ భారతి, పి.త్రిమూర్తులు, ఎల్.శ్రీలక్ష్మి, కె.సత్యనారాయణలను సన్మానించారు. సర్పంచి బుంగ రామారావు, నాయకులు బ్రహ్మారెడ్డి, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీనివాస్, హెచ్ఎం పీవీ ప్రభాకరరావు పాల్గొన్నారు. ● మెళ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, అలియా బేగం, వరప్రసాద్, పి.వి రత్నకుమారి, ఎన్.కామాక్షిలను ఈ సందర్భంగా సత్కరించారు. హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో నాయకులు

రోడ్డు ఇలా...ప్రయాణం ఎలా

బొమ్మూరు చెరువుగట్టు ప్రాంతం గుంతలు, బురదతో దారుణంగా ఉంది. కనీసం నడిచేందుకు వీలు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వాలు మారినా మా పరిస్థితి మారడం లేదని వాపోతున్నారు. వర్షాకాలం వస్తే చెరువుగట్టు చుట్టు బురద వల్ల రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఈ సమస్య పై గ్రామకార్యదర్శి కాశీ స్పందిస్తూ ఆ ప్రాంతంలో ప్రశాంతినగర్ నుంచి ఆరోగ్యకేంద్రం వరకు రోడ్డు వేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

వృథాగా పోతున్న గోదావరి జలాలు

పుష్కరవనం సమీపంలో ఆటోనగర్‌కు వెళ్ళే గ్రావెల్‌రోడ్డు వద్ద గల గోదావరి జలాలు ప్రవహించే పైపులైనుకు సంబంధించిన జాయింట్ లీకై నీళ్లు వృథాగా పోతున్నాయి. బొమ్మూరు కొండపై గల గోదావరి పంపింగ్ స్కీం నుంచి ఆటోనగర్‌కు పైపులైను ద్వారా నీళ్లు వెళ్తున్నాయి. దీంతో గ్రావెల్ రోడ్డు గోదావరి జాలాలతో నిండిపోయింది. – న్యూస్‌టుడే, రాజానగరం

జాతీయ యువజనోత్సవంలో గైట్ ఫార్మసీ విద్యార్థి

రాజానగరం, న్యూస్‌టుడే: నప్రస్ ఫౌండేషన్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో జాతీయ సాంస్కృతిక యువజనోత్సవాలు జూన్ 23 నుంచి 28 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని నాగూర్‌లో నప్రస్ పేరుతో నిర్వహించారు. 23 రాష్ట్రాల నుంచి 102 మంది మహిళలు పాల్గొన్నారు. గైట్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఫర్జానా అష్మి మహ్మద్ ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొని సంస్కృతి, సంప్రదాయాలు, జానపద నృత్యాలు గురించి తెలియజేశారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎస్.పి.నారాయణ టోదాస్ చేతుల మీదుగా ఫర్జానా ప్రశంసా పత్రం అందుకుందని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.డి.ధనరాజు తెలిపారు.

ప్రశంసా పత్రం అందుకున్న ఫర్జానా అష్మిమహ్మద్

విద్యార్థులు క్రీడలకు దూరం

అనపర్తి గ్రామీణం, పెదపూడి, న్యూస్‌టుడే: పిల్లల శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. దీంతో విద్యార్థులు తరగతిగదులకే పరిమితమవుతున్నారు.

అధ్వానంగా పెద్దాడ జడ్పీ పాఠశాల ఆవరణం

ఎప్పటికి ఏర్పాటు..

అనపర్తి నియోజవర్గం నాలుగు మండలాల్లో మొత్తం 38 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 144 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో సగానికి పైగా క్రీడాప్రాంగణాలు లేవు. పెదపూడి మండలంలోని 13 జడ్పీ, ఒక ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో రామేశ్వరం, అచ్యుతాపురత్రయం, కుమారప్రియం, శహపురం, జి.మామిడాడలోని బాలికల, ఎల్ఎన్.పురం, వేంద్ర. రంగంపేట మండలంలోని 10 పాఠశాలలకు గాను చండ్రేడు, కోటపాడు, బిక్కవోలు మండలంలోని పందలపాక, కొంకుదురు, అనపర్తి మండలంలోని పొలమూరు, తదితర పాఠశాలలకు క్రీడా ప్రాంగణాలు లేవు. 144 ప్రాథమిక పాఠశాలలకు గాను క్రీడా ప్రాంగణాలు లేనివే ఎక్కువ. వీటిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సాధనకు ఇబ్బందులు..

వాలీబాల్ అంటే నాకు ఇష్టం. క్రీడా ప్రాంగణం లేక ప్రైవేటుగా శిక్షణ పొందుతున్నాను. వ్యాయామ ఉపాధ్యాయులు చెప్పిన అన్ని నిబంధనలు పాటిస్తున్నాను. ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. క్రీడా ప్రాంగణం ఉంటే సాధన మరింత సాధ్యమవుతుంది. **- గోపాలదాసు నవీన్, పెద్దాడ జడ్పీ పాఠశాల**



ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం. పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకు దాతల సహకారం ఉంటే విద్యార్థులు పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తారు. క్రీడా ప్రాంగణాలు లేని పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. **- సి.వి.వి.సత్యనారాయణ, ఎంఈవో-2, పెదపూడి**

"కళామతల్లి ముద్దుబిడ్డ"కు అశ్రునివాళి

తన నటనా కౌశలంతో నాటక రంగంలో ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలకు జీవం పోసి నటులుగా, దర్శకునిగా నాటకరంగకళామతల్లి ముద్దుబిడ్డగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకొని ఎంతో మందికి నటనారంగంలో శిక్షణ ఇప్పించిన మంచిమనిషి, మా శ్రేయోభిలాషి శ్రీ తాడి సూర్యనారాయణరెడ్డి గారు మా కుటుంబ ఉన్నతికి శ్రమించి ఎన్నో త్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తి. మీ మరణం మాకు తీరని లోటు. దైవసన్నిధికి చేరిన మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ తాడి సూర్యనారాయణరెడ్డి గారు
రంగస్థల నటులు, దర్శకుడు
జననం: 19-02-1948 మరణం: 24-06-2025
కొంకుదురు

పెద్దకార్యం: ది.04-07-2025 (ఈరోజు) కొంకుదురులో మా స్వగృహమునందు.

భార్య: శ్రీమతి సూర్యకాంతం
కుమార్తె: శ్రీమతి కొవ్వూరి పద్మావతి
అల్లుడు: కొవ్వూరి తాతారెడ్డి
మనుమరాలు: K.S.M.మానస - సతీష్‌రెడ్డి
మనుమడు: K.S.S.V.కృష్ణారెడ్డి
మునిమనుమలు: K.G.S.షణ్ముఖరెడ్డి, లాస్యప్రణతి
మరియు కుటుంబసభ్యులు

సోదరుల కుమారులు: తాడి వెంకట కృష్ణారెడ్డి (తాడిశ్రీ), తాడి రామహరగోపాల్‌రెడ్డి, తాడి వెంకట గోపాలకృష్ణారెడ్డి; మనుమడు: తాడి పవన్ వెంకట నరసింహారెడ్డి, కొంకుదురు

తోడల్లుడు: వెలగల చెల్లారెడ్డి, శ్రీ ధనలక్ష్మి కటపీసెస్; అల్లుళ్లు: సత్తి గుర్రెడ్డి (చక్రవర్తి), కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొంకుదురు

బావమరిది: కొవ్వూరి సత్యనారాయణరెడ్డి; మేనల్లుడు: కొవ్వూరి రామస్వామిరెడ్డి గారి కుటుంబసభ్యులు, కొంకుదురు

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి శాసనసభ్యులు

శ్రీ వెంకటరమణ ఆర్ట్స్: చిన్నం వెంకట నారాయణరెడ్డి (చంటిబాబు), కర్రి రామారెడ్డి (హీరో), కర్రి శ్రీనివాసరెడ్డి (కోటా శ్రీను), ద్వారంపూడి సాయిరామారెడ్డి (డాక్టర్ సాయి), చిన్నం వెంకటరెడ్డి (చిన్నం బుజ్జి)

సత్తి అమ్మిరెడ్డి (సూర్లు మాస్టారు), కొవ్వూరి జగాశ్రీనివాసరెడ్డి (జగా శ్రీను), చిన్నం వెంకటకృష్ణారెడ్డి (మాస్టారు), చింతా సత్తిరెడ్డి, చిన్నం వెంకటరెడ్డి (రాజమౌళి), పడాల సాంబశివారెడ్డి (పాలకేంద్రం)

చింతా శ్రీనివాసరెడ్డి (బూన్), తెదేపా రాష్ట్ర TNTUC కార్యనిర్వాహణ కార్యదర్శి, కొంకుదురు

వెలగల నాగిరెడ్డి, వెలగల సుబ్బారెడ్డి, వెలగల ధర్మారెడ్డి, వెలగల శ్రీనివాసరెడ్డి, కొంకుదురు

సత్తి వీరమణి, సర్పంచ్; సత్తి నాగిరెడ్డి (రాజా), కొంకుదురు

కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఛైర్మన్: కొమరిపాలెం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ, బిక్కవోలు మండల తెదేపా అధ్యక్షులు, కొంకుదురు

కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, కొంకుదురు

సబ్బెళ్ళ వీర్రాఘవరెడ్డి (కిళ్లీ కొట్టు), SSN.రెడ్డి (USA), కొంకుదురు

కర్రి క్రీస్తురెడ్డి & సన్స్, కొంకుదురు

సత్తి శ్రీనివాసరెడ్డి, కుటుంబసభ్యులు, మహేంద్రవాడ

శ్రీ శారదా కళానికేతన్, పొలమూరు

మల్లిడి వెంకటరెడ్డి, శ్రీమతి గౌరీ పార్వతి, కొంకుదురు

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ఇండియన్ క్రైస్తవ దినోత్సవం

ఉండ్రాజవరం: సంఘ కాపరుల ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ దినోత్సవాన్ని తాడిపర్రు తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించారు. దైవ సందేశం వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉండ్రాజవరం మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు సుధాకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ కత్తుల ప్రకాష్, పలువురు సంఘ కాపరులు పాల్గొన్నారు.

ఉచితంగా పశు టీకాల పంపిణీ

చాగల్లు: జీవాల పెంపకంలో వాటి కలిగే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని చాగల్లు మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ పేర్కొన్నారు. మండలంలోని మీనానగరం, మార్కొండపాడు, దారవరంలో నట్టల నివారణ మందులు, చిటుక, నీలి నాలుక వ్యాధులకు నివారణ టీకాలను గురువారం ఉచితంగా అందించారు. 1,800 గొర్రెలకు, 250 మేకలకు ఉచితంగా టీకాలు వేశామని ఆయన తెలిపారు.

జగన్నాథ రథయాత్ర

చాగల్లు: చాగల్లు మండలం నెలటూరు గ్రామంలోని సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి చాగల్లు వరకు జగన్నాథ రథయాత్ర గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో జగన్నాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. భక్తుల చప్పన్ భోగ్ కార్యక్రమంలో భాగంగా సుమారు 56 రకాల నైవేద్యాలను స్వామివారికి సమర్పించారు. గ్రామస్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాశక్తి నమోస్తుతే



ఉండ్రాజవరం: ఆషాఢ మాసం నవమిని పురస్కరించుకుని పాలంగిలో కొలువైన కనకదుర్గమ్మ తల్లికి గురువారం విశేష అలంకరణ, పూజలు, అభిషేకాలు చేశారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు. తణుకు, ఉండ్రాజవరం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చినుకుపడితే చిత్తడే..

పెరవలి మండలం కానవరంలోని పల్లపువీధి రామాలయం నుంచి అంతర్వేదిపాలెం ఏటి పాయకు వెళ్లే మార్గంలో వర్షపు నీరు చేరింది. విద్యార్థులు, రైతులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై నడిచేందుకు వీలు లేకుండా ఉంది. సమస్య పరిష్కరించి, కాలువలో నీరు పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి బేగ్ మొహిద్దీన్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, పెరవలి

జ్వరాలొస్తాయి జాగ్రత్త..

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో జ్వరాలు సోకే సమయమిది. ఏటా వర్షాకాలంలో జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులతో జ్వర పీడితులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పీడితుల పరిస్థితిని బట్టి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ పరీక్షలు చేసి అందుకు అనుగుణంగా వైద్యం చేయాలి. పరిసరాలు శుభ్రంగా ఉండక ఏటా డెంగీ జ్వరాలు నమోదు అవుతున్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తున్నా పూర్తిస్థాయిలో స్పందన కనిపించట్లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జాతీయ డెంగీ మాసోత్సవాలకు శ్రీకారం చుట్టింది. జులై 1న ప్రజలను చైతన్యం చేసే కార్యాచరణను ప్రారంభించారు. ఈ ప్రక్రియ 31వ తేదీ వరకు కొనసాగనుంది.

నాలుగేళ్లలో నమోదు ఇలా..

సంవత్సరం	మలేరియా	డెంగీ
2022	1	24
2023	-	28
2024	1	26
2025*	0	3

*జూన్ 31వ తేదీ వరకు

డివిజన్ పరిధిలో..: కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో 174 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 95 వేల నివాసాల్లో సుమారు 6.24 లక్షల మంది నివసిస్తున్నారు. తొమ్మిది మండలాల ప్రజల కోసం 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలు నడుస్తున్నాయి.

దుద్దుకూరులో డెంగీ మాసోత్సవ అవగాహన ప్రదర్శన

ఇవి పాటిద్దాం..: ❖ డెంగీ దోమలు నిల్వ నీటిలో పెరుగుతాయి. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ❖ పాత్రలపై మూతలు పెట్టాలి. ❖ ఇళ్ల పరిసరాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు ఉంచకూడదు. ❖ పనికిరాని మొక్కలను తొలగించి శుభ్రత పాటించాలి. ❖ కూలర్లలో నీరు మారుస్తూ ఉండాలి. ❖ మురుగు కాలువల్లో దోమల లార్వా పెరగకుండా శ్రద్ధ చూడాలి.

లక్షణాలుంటే అశ్రద్ధ చేయొద్దు..

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, వికారం వంటి లక్షణాలు ఉంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన పరీక్షలు చేస్తున్నారు. పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత.

- జె.సంధ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కొవ్వూరు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం: మరమ్మతుల్లో భాగంగా ఉండ్రాజవరం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నారాయణఅప్పారావు గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

■ గోపాలపురం: జగన్నాథపురం విద్యుత్తు ఉపకేంద్రం 33/11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌కు సంబంధించి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరిచర్లగూడెం, కోమటికుంట, జగన్నాథపురం, సంజీవపురం గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

■ పెరవలి: మల్లేశ్వరం, పెరవలి ఉపవిద్యుత్తు కేంద్రాల పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహరించాలని కోరారు.

రబీ బకాయిలు.. ఖరీఫ్‌లో గుబులు

నిడదవోలు, న్యూస్‌టుడే: రబీలో ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యానికి ఇంతవరకు నగదు జమ కాకపోవడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ పనులు మొదలవ్వగా, పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం నగదు కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు అవుతోందని, పెట్టుబడి కోసం నగదు ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లాలో సుమారు రూ.150 కోట్ల వరకు ధాన్యం నగదు జమ అవ్వాల్సి ఉందని చెబుతున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో రూ.47 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో సన్న, చిన్నకారు రైతులే అధిక సంఖ్యలో ఉన్నారు. రబీ సొమ్మునే ఖరీఫ్‌కు పెట్టుబడిగా పెడతారు. ఈ క్రమంలో త్వరగా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలం	బకాయిలు (రూ.కోట్లలో)
నిడదవోలు	12
ఉండ్రాజవరం	34
పెరవలి	1

రాయితీలు కోల్పోయే అవకాశం..

జూన్ 7న 130.8 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. బ్యాంకులు, సహకార సొసైటీ బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందని పరిస్థితి. రైతుల దుస్థితిని అర్థం చేసుకుని తక్షణమే బకాయిలు ఇవ్వాలి. నాలాంటి చిన్న రైతులు అనేక మంది అవస్థలు పడుతున్నారు.

- సైదు సూర్యనారాయణ, తీరుగూడెం

రూ.1.28 లక్షలు రావాలి..

ఏప్రిల్ 28న ధాన్యం విక్రయించాను. ఆనాటి నుంచి నేటికీ ధాన్యం సొమ్ము రాలేదు. ఇప్పటివరకు పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ప్రస్తుతం ఖరీఫ్‌కు పెట్టుబడి లేక సమస్యగా ఉంది. తక్షణమే ధాన్యం సొమ్ము విడుదల చేసేలా అధికారులు చొరవచూపాలి.

- చెరుకు శ్రీను, సింగవరం

తాడిపూడితో నీటి సమస్యకు పరిష్కారం: మంత్రి నిమ్మల

తాళ్లపూడి, న్యూస్‌టుడే: వ్యవసాయ, తాగునీటి సమస్యలకు తాడిపూడి ఎత్తిపోతల పథకం పరిష్కారం చూపిస్తుందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి మంత్రి రామానాయుడు గురువారం మోటారు ద్వారా నీరు విడుదల చేశారు. అంతకుముందు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గోదావరికి పసుపు, కుంకుమ, పుష్పాలతో పూజ చేసి సారె సమర్పించి హారతి ఇచ్చారు. అనంతరం స్విచ్ ఆన్‌చేసి పంపు ద్వారా నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 మండలాల పరిధిలోని 139 గ్రామాల్లోని 5.40 లక్షల మందికి తాగునీరు సరఫరా అవుతుందన్నారు. ప్యాకేజీ-4 కింద సబ్‌లిఫ్ట్ 1 నుంచి 4 పంపులు, 2 నుంచి మూడు పంపులు సాగునీరు విడుదల అవుతుందన్నారు. సబ్‌లిఫ్ట్ 5 నుంచి దేవరపల్లి మండలం పరిధిలో ఆయకట్టుకు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కొవ్వూరు, గోపాలపురం, పోలవరం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, సీహెచ్.బాలరాజు, ద్విసభ్యకమిటీ సభ్యులు సుబ్బారాయచౌదరి, రామకృష్ణ, పథకం డీఈ రామేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్విచ్ ఆన్‌చేసి నీరు విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల, చిత్రంలో ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి, ఆర్డీవో

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

కొవ్వూరు పట్టణం: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అయిదేళ్ల తిరోగమన పాలన నుంచి రాష్ట్రం ప్రగతి బాటలో నడుస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణ పరిధిలోని ఒకటో వార్డు పరిధి రాజీవ్, శ్రీరామా కాలనీల్లో గురువారం నిర్వహించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలన, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను అందించారు. సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకుని స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వివరాలు నమోదు చేశారు. ద్విసభ్య కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి హామీని ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారన్నారు. కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని, అర్బన్‌బ్యాంకు అధ్యక్షుడు మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, పెనుమాక జయరాజు, కొప్పాక జవహర్, సూరపనేని సురేష్, మద్దిపట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములు అవ్వాలి: కూటమి పాలన ఆరంభమై ఏడాదైన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. కొవ్వూరు పట్టణం, గ్రామీణ పరిధిలో బూత్, వార్డు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలతో గురువారం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. నెలపాటు క్షేత్రస్థాయికి వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకుని నివేదిక ఇవ్వాలన్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనా నైపుణ్యాలు అవసరం

నిడదవోలు: నిడదవోలు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ కె.జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో సమస్యలను గుర్తించి వాటికి తగిన సూచనలు చేయాలన్నారు. యువత తమ శక్తి సామర్థ్యాలను గుర్తించి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఉపాధి సృష్టించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఈ.నాగేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ పీఎస్ఎస్ స్రవంతి, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లీకులతో వ్యాధుల భయం

దేవరపల్లి మండలం యర్నగూడెంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని పెద్ద మురుగుకాలువలోని మంచినీటి పైపులైన్ లీకవుతోంది. వర్షాల నేపథ్యంలో కాలువలో పైపులు ఉండడంతో తాగునీరు కలుషితమై, రోగాలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. రోజూ అధికారులు రాకపోకలు సాగించే రహదారిలో పైపులు లీకవుతున్నా చూడట్లేదనే విమర్శలు ఉన్నాయి. వీటిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అమ్మిరాజును సంప్రదించగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, దేవరపల్లి

'క్రైస్తవుల సమస్యలపై పోరాటానికి సహకారం'

కొవ్వూరు పట్టణం: క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి పార్టీ సహకరిస్తుందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ భారతీయ క్రైస్తవ దినోత్సవం సందర్భంగా విజయవాడలో విజయ్‌కుమార్‌ను కలిశామన్నారు. క్రైస్తవుల సంక్షేమంపై ఆయనతో చర్చించామన్నారు. రాష్ట్ర బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు ఇ.బాలరాజు, బి.నవీన్‌కుమార్, మిహన్‌కుమార్, దైవప్రకాష్, మోచెయ్, జీవరత్నం, జోసఫ్ ఆంద్రుస్, కె.జాన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల పునరుద్ధరణ

థియేటర్ల కూడలి వెనుక వైపు, వేములూరు పుంత రోడ్డులో పలుచోట్ల విద్యుద్దీపాలు పాడయ్యాయి. వర్షాలు, ఈదురుగాలుల తర్వాత మరింత సమస్యగా ఉంది. కొన్నిచోట్ల వెలిగినా వెంటనే ఆరిపోతున్నాయి. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి కమిషనర్ సందీప్‌కు చెప్పగా స్పందించారు. విద్యుత్తు విభాగ సిబ్బందిని పంపించి వీధి దీపాలను పునరుద్ధరింపజేసే పనులు చేయించారు. –న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

ఛిద్రంగా రహదారి

ఉండ్రాజవరం మండలంలోని తీపర్రు నుంచి ఉండ్రాజవరం మీదుగా వడ్లూరు వెళ్లే రహదారి గోతులమయంగా తయారైంది. తణుకు నుంచి నిడదవోలు, రాజమహేంద్రవరం వైపు ఈ రహదారి మీదుగా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. కార్మికులు రాత్రి సమయాల్లో సైతం ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తారు. మరమ్మతులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి అభివృద్ధి పనులు చేయిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. –న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

గుంతలతో చింత

దూబచర్ల నుంచి చేబ్రోలుకు వెళ్లే రహదారిలో దత్తాత్రేయ ఆలయం ముందు రోడ్డుపై గుంతలు పడ్డాయి. దగ్గరకు వచ్చే వరకు దారి కనిపించకపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అటు వైపు వెళ్లకుండా స్థానికులు రాళ్లు ఏర్పాటు చేశారు. దీనిపై ర.భ.శాఖ డీఈ వెంకటరమణను వివరణ కోరగా గుంతలు పూడ్చి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నల్లజర్ల

అక్రమ తరలింపు.. లారీ పట్టివేత

నిడదవోలు, న్యూస్‌టుడే: ఏ విధమైన బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని కొవ్వూరు డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు గురువారం పట్టుకున్నారు. కొవ్వూరు మండలం వాడపల్లి నుంచి అక్రమంగా 20 టన్నుల ఇసుకతో వస్తున్న లారీని టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధరరావు ఆధ్వర్యంలో నిడదవోలు మండలం గోపవరం వద్ద పట్టుకున్నారు. లారీని సమిశ్రగూడెం పోలీసులకు అప్పగించినట్లు ఆయన వివరించారు.

తల్లీ, కుమార్తె అదృశ్యంపై కేసు

చాగల్లు: తల్లీ, కుమార్తె అదృశ్యంపై చాగల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. మండలానికి చెందిన ఓ మహిళ తన రెండేళ్ల కుమార్తెతో పాటు గతనెల 26వ తేదీ నుంచి కనిపించట్లేదు. బంధువుల ఇంటి వద్ద కూడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశారు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు చాగల్లు హెచ్‌సీ సీహెచ్.రాజు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని గాంధీబొమ్మకూడలిలో గుర్తుతెలియని వ్యక్తి ఒకరు గురువారం మృతిచెందారు. స్థానికులు గుర్తించి నిడదవోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. మృతదేహాన్ని సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేశారు. మరిన్ని వివరాలకు నిడదవోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గోదావరిలో దూకిన మహిళ..!

కొవ్వూరు పట్టణం: రోడ్‌కం రైలు వంతెనపై నుంచి గోదావరిలో గుర్తుతెలియని మహిళ దూకినట్లు వచ్చిన సమాచారం కలకలం సృష్టించింది. 106వ స్తంభం వద్ద మహిళ దూకినట్లుగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం 2వ పట్టణ పోలీసు సిబ్బంది, కొవ్వూరు పట్టణ పోలీసులు ఎవరి పరిధిలో వారు పరిశీలన చేపట్టినా ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఏవిధమైన ఫిర్యాదు అందలేదు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

దేవరపల్లి: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ పిలుపునిచ్చారు. దేవరపల్లిలోని ఉండవల్లి కృష్ణారావు ఇంటి వద్ద సీఐటీయూ మండల నాయకులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. కార్మికుల ప్రాణాలు కోల్పోతున్న పరిశ్రమల యజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించట్లేదని విమర్శించారు. మల్లెపూడి వెంకటలక్ష్మి, పద్మ కామేశ్వరి, ఇందిరా, శ్రీనివాసరావు, వరలక్ష్మి, రత్నాజీ పాల్గొన్నారు.

దుకాణం ధ్వంసం.. ఇద్దరిపై దాడి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: కోవా, బేకరీ దుకాణాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన కొప్పిడి దుర్గావరప్రసాద్, కేశిరెడ్డి రాఘవ, ఏలూరుకు చెందిన డి.ఎన్.వి.తేజేశ్వరరావు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొప్పినీడి దుర్గావరప్రసాద్ మండలంలోని గుణ్ణంపల్లిలో జాతీయ రహదారి పక్కన దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన రాము, లవ్‌కుమార్ మద్యం తాగి దుకాణం వద్దకు వచ్చి రెండు బన్‌లు అడిగారు. ఒకటి ఇచ్చి మరొకటి ఇస్తుండగా.. రెండు అడిగితే ఒకటి ఇచ్చావేంటని దుర్గావరప్రసాద్‌తో ఘర్షణకు దిగారు. తమ అనుచరులు ముగ్గుర్ని పిలిచి దుకాణాన్ని ధ్వంసం చేశారు. దుర్గావరప్రసాద్‌ను కొట్టడానికి ప్రయత్నించగా అడ్డొచ్చిన కేశిరెడ్డి రాఘవ, రెస్టారెంట్ యజమాని డి.ఎన్.వి.తేజేశ్వరరావులపై దాడి చేశారు. తేజేశ్వరరావు మెడలో బంగారు గొలుసును లాక్కున్నారు. ఈ ఘటనలో గాయపడిన రాఘవ, తేజేశ్వరరావులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీఎం పర్యటన విజయవంతంపై హర్షం

తాళ్లపూడి: ఈనెల 1న మలకపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను సమష్టి కృషితో విజయవంతం చేశారని, ఇక్కడి కార్యక్రమాలను అంతా ప్రశంసించారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. తాళ్లపూడిలో తెదేపా మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో పనిచేసే నాయకత్వానికి పదవులు అప్పగించి, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. తాళ్లపూడి మండలంలోని నాయకులు, కార్యకర్తలు మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. అనంతరం బీసీ కాలనీలో ఇంటింటికీ ప్రచారం చేశారు.

బీమాతో ప్రయోజనాలు

ఉండ్రాజవరం: పొలంలో పచ్చిరొట్ట పెంచడంతో భూసారం వృద్ధి చెంది, పైరుకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు సూచించారు. దమ్మెన్ను, వేలివెన్ను, కాల్దరిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలకు బీమా చేయడంతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి నారుమళ్లు, వరినాట్లు ప్రక్రియ పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. సర్పంచులు అత్తిలి సత్యనారాయణ, గురజర్ల సత్యనారాయణ, సేంద్రియ వ్యవసాయ విభాగం ప్రతినిధి అక్కిన కాశీ పాల్గొన్నారు.

यूनियन बैंक Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, భీమవరం, ప.గో.జిల్లా

బంగారు నగల వేలం ప్రకటన

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి మా బ్యాంకు శాఖల నుండి రుణం పొందారు. రుణ బకాయిలు తిరిగి చెల్లించాలంటూ పలుమార్లు నోటీసులు పంపినను రుణాలు తిరిగి చెల్లించలేదు. మా బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం తేది:11-07-2025, శుక్రవారం సాయంత్రం 04.00 గంటలకు సంబంధిత బ్యాంకు శాఖల ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయించబడింది. రుణగ్రహీతల బంగారు ఆభరణాలు అమ్మకం తరువాత వేలం ద్వారా స్వీకరించబడిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కూడా బ్యాంకు యొక్క బకాయిలు బాకీ ఉన్నట్లయితే, మిగిలిన బకాయిలను రాబట్టుకొనుటకు రుణగ్రహీతపై అవసరమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించబడతాయి. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలలో ఎవరైనా మరణించినట్లయితే, ఈ వేలం నోటీసు రుణగ్రహీతల చట్టపరమైన వారసులకు వర్తిస్తుంది. రుణగ్రహీతలకు నోటీసు అందకపోయినా లేదా నోటీసు తిరస్కరించిన వారికి ఈ పత్రికాప్రచురణ చివరి నోటీసుగా పరిగణించబడుతుంది.

వ.సం.	లోన్ అకౌంట్ నెం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	బకాయి మొత్తం (రూ. లక్షలలో)	స్థూల బరువు (గ్రాములలో)
		శృంగవృక్షం బ్రాంచ్		
1	051616630001072	చింతపల్లి నాగేశ్వరరావు, 3-153 శృంగవృక్షం పోస్ట్, పిపి రోడ్, శృంగవృక్షం - 534243	0.21 లక్షలు	10.00
		దగ్గులూరు బ్రాంచ్		
2	076916540003362	మల్ల వెంకట నవీన్‌కుమార్, తండ్రి : హరిప్రసాద్, ఇంటి నెం.1 99, గవరపేట, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఆం.ప్ర. దగ్గులూరు-534250	0.64 లక్షలు	14.00
3	076916540004141		1.79 లక్షలు	36.00
		మల్లవరం బ్రాంచ్		
4	089416630000227	దాకే లక్ష్మణరావు, 3 78 యస్‌సి ఏరియా, మల్లవరం, అంబేద్కర్ విగ్రహం, చాగల్లు మండలం, మల్లవరం-534342	0.32 లక్షలు	11.00
		పెనుమంట్ర బ్రాంచ్		
5	043016540007499	గుత్తుల సత్యవతి, భర్త : సత్యనారాయణ, 11 73, బ్రాహ్మణచెరువు, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర-534124	1.06 లక్షలు	21.50
6	043016540007500		0.40 లక్షలు	8.20
7	043016540007190	గోగడ దుర్గా మహేశ్వరి, భర్త : గోగడ ముత్యాలు, ఇంటి నెం.153, వి వి పాలెం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర - 534124	0.54 లక్షలు	12.00
8	043016540007780		0.80 లక్షలు	18.00
9	043016540008211		1.16 లక్షలు	24.00
10	043016540008245		2.68 లక్షలు	56.00
		పాలకొల్లు యూబిఐ బ్రాంచ్		
11	498406540043770	సింగంశెట్టి పెద్దింట్లు, 26-5-1, ముచ్చర్ల వారి తోట, కొండాలమ్మ గుడి, పాలకొల్లు-534260	0.71 లక్షలు	12.60
12	498406540043649		1.60 లక్షలు	29.50
13	498406540043620	భీమానందం ప్రభావతి, భర్త : నాగేశ్వరరావు, డి.నెం.1 89, వద్దిలంక, ఎలమంచిలి మండలం, పాలకొల్లు-534266	1.75 లక్షలు	29.00
14	498406540044362	నీలిమ శలా, 6-3-13, వార్డు నెం.29, చింతలతోట, పాలకొల్లు-534260	0.61 లక్షలు	10.70
15	498406540044458	మజ్జి వినయ్‌కుమార్, తండ్రి : వెంకట త్రినాథ ప్రసాద్, డి.నెం.21 10 1, రాజేంద్ర నగర్, పాలకొల్లు, పాలకొల్లు-534260	1.38 లక్షలు	29.00
16	498406540044045		0.30 లక్షలు	5.40
17	498406540044003		0.69 లక్షలు	12.20
18	498406540035890	చిమట సురేష్, తండ్రి : చెన్నయ్య, 5 168, బి, యస్‌సి కాలనీ, రామాలయం దగ్గర, ఇనుమెల్ల గుంటూరు, పశ్చిమ గోదావరి-522661	0.18 లక్షలు	5.50
19	498406540035948	మాకా సువర్ణ రావు, 7-40, చిన్నపేట, పోడూరు మండలం, పెనుమదం, పోడూరు-534267	0.17 లక్షలు	4.90
		ఖండవల్లి బ్రాంచ్		
20	280016540008873	రామిశెట్టి లక్ష్మి వెంకట నాగ సాయి ప్రసాద్, తండ్రి : రామిశెట్టి సూరిబాబు, ఇంటి నెం.9 37, రాజుల రామాలయం వీధి, ఖండవల్లి-534330	1.58 లక్షలు	29.50
		కోపల్లె బ్రాంచ్		
21	029816540002578	కొండేటి పుష్ప, భర్త : సామ్‌సను, డి.నెం.2 27, చిన్నపేట, కోపల్లె పోస్టు, కోపల్లె గ్రామం, కాళ్ల మండలం, ప.గో.జిల్లా, కాళ్ల-534206	0.37 లక్షలు	7.50
22	029816540002412		0.50 లక్షలు	10.00
		భీమవరం యూబిఐ బ్రాంచ్		
23	496206540026353	దొడ్డి మాణిక్యం, తండ్రి : డి.దావీదు, డి.నెం.3 37 1, పెదపేట, పాలకోడేరు, పాలకోడేరు-534210	0.27 లక్షలు	5.00
		లజపతిరాయ్‌పేట బ్రాంచ్		
24	130316540004713	అల్లపల్లి మోహిని దేవి, భర్త : లక్ష్మి నారాయణ, 6ఎ-4-4, వీవర్స్ కాలనీ, వార్డు 29, పాలకొల్లు, పాలకొల్లు - 534260	0.53 లక్షలు	10.10
		తణుకు యన్‌హెచ్ రోడ్ బ్రాంచ్		
25	269116540003502	దేశబత్తుల శ్రీనివాసు, 14-13-36-1, మిషన్ స్కూలు వీధి, పాత టౌన్, తణుకు-534211	0.90 లక్షలు	18.00
26	269116540004450	ఎలిపే సతీష్ కుమార్, ఉండ్రాజవరం గ్రామం, ఉండ్రాజవరం-534216	0.70 లక్షలు	15.00
27	269116540004711		0.73 లక్షలు	15.00
28	269116630000994	రొట్టె రవితేజ, 3 1 5 , తండ్రి : రాములు, అంబటి వారి వీధి, పాత టౌన్, తణుకు	0.13 లక్షలు	3.0

షరతులు : 1) వేలంలో పాల్గొనే ఆసక్తిగల వ్యక్తులు తేది:11-07-2025, శుక్రవారం మధ్యాహ్నం 02.00 గంటలలోపు రూ.5,000/- (ఐదు వేల రూపాయలు మాత్రమే) మొత్తాన్ని E.M.D గా డిపాజిట్ చేయాలి. 2) వేలంలో విజయవంతమైన బిడ్డర్ E.M.D మినహా మిగిలిన బిడ్ మొత్తాన్ని వెంటనే చెల్లించాలి మరియు విజయవంతం కాని బిడ్డర్లు డిపాజిట్ చేసిన E.M.D వారికి తిరిగి చెల్లించబడుతుంది. 3) బిడ్ అంగీకారానికి సంబంధించి బ్యాంక్ నిర్ణయం అంతిమమైనది, దానికి కట్టుబడి ఉండవలెను మరియు ప్రశ్నించడానికి వీలుబడదు. 4) వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలను మార్చే హక్కు బ్యాంకుకు ఉంది. ఏ దశలోనైనా వేలాన్ని రద్దు చేసే హక్కు బ్యాంకుకు ఉంది. 5) వేలంలో పాల్గొనువారు ఆధార్ మరియు పాన్ కార్డు కాపీలను బ్యాంకునకు సమర్పించవలెను.

తేది. 03.07.2025 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

పద్నాలుగేళ్ల లోపు బాలలందరూ బడిలోనే: కలెక్టర్

'నేను బడికి పోతా' గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న వెట్రిసెల్వి, అధికారులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 6 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న బాలలంతా బడిలోనే ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో 'నేను బడికి పోతా' అమలుపై గురువారం జిల్లా స్థాయి అవగాహన పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బడీడు పిల్లలతోపాటు చదువు మానేసిన వారిని పాఠశాలలో చేర్పించాలన్నారు. రానున్న 15 రోజులపాటు 'నేను బడికి పోతా'ను సమర్థంగా నిర్వహించాలన్నారు. సాంఘిక సంక్షేమ, బీసీ, ట్రైబల్, ఐటీడీఏ పరిధిలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల నమోదు వంద శాతం ఉండాలన్నారు. అనంతరం 'నేను బడికి పోతా'పై ముద్రించిన గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులపై మంత్రి ఆరా

అధికారులతో మాట్లాడుతున్న రామానాయుడు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం మీదుగా తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని పుష్కర ఎత్తిపోతల పథకం పంపుల ప్రారంభానికి బుధవారం సాయంత్రం వెళ్తూ మంత్రి నిమ్మల రామానాయుడు మార్గం మధ్యలో ఆగి పనులు పరిశీలించారు. బట్రస్ డ్యాం నిర్మాణం, డీ వాల్ పనుల గురించి ఎస్ఈ రామచంద్రరావుతో మాట్లాడారు. వరద పెరుగుతున్న దృష్ట్యా దిగువ కాఫర్ డ్యాం వద్ద నీటిని తోడేందుకు చేసిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. బట్రస్ డ్యాం పనులు చివరి దశకు చేరుకున్నాయని డీ వాల్ నిర్మాణానికి ఆటంకం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఈ వివరించారు.

చంపేస్తున్నారా.. చనిపోతున్నారా!

కాలువల్లో గుర్తు తెలియని మృతదేహాలు

పోలీసులకు సవాల్‌గా కేసులు

అన్ని కోణాల్లో చేస్తేనే..

● రెండు నెలల కిందట గణపవరం మండలం పిప్పర వద్ద ఉండి కాలువలో 60 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. అతని వివరాలు తెలియరాలేదు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వృద్ధుడి ఆచూకీ తెలుసుకునేందుకు అదృశ్య కేసులను పరిశీలిస్తున్నారు.

● ఏలూరు నగర శివారు వెంకటాపురం- మాదేపల్లి రోడ్డులోని పంట బోదెలో 3 నెలల కిందట కుళ్లిన దశలోని సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఆయన్ను ఎవరైనా హత్య చేశారా? ప్రమాదవశాత్తు మృతి చెందారా? వివరాలు తెలియరాలేదు.

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆ కేసులు మిస్టరీగా మారాయి. ప్రమాదవశాత్తు చనిపోతున్నారా.. ఆత్మహత్య చేసుకుంటున్నారా.. ఎవరైనా చంపేశారా.. అన్న విషయాలు తెలియక క్లిష్టమవుతున్నాయి. పంట బోదెలు, కాలువలు, నిర్మానుష్య ప్రాంతాల్లో గుర్తుతెలియని మృతుల కేసులు సత్వరం కొలిక్కి రాక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. మృతులు ఎక్కడివారో.. ఎలా చనిపోయారో తెలియక చిక్కుముళ్లు వీడటం లేదు.

కుంటుపడుతున్న పురోగతి.. ఉమ్మడి జిల్లాలో అనుమానాస్పద మృతి కేసులు పెరుగుతున్నాయి. ఊరు, పేరు తెలియని మృతదేహాల కేసుల పురోగతి కుంటుపడుతోంది. కాలువలు, పంట బోదెల్లో లభ్యమైన మృతదేహాల కేసులు ఛేదించడం క్లిష్టమవుతోంది. మృతదేహాలు కుళ్లిపోవడం, గుర్తుపట్టలేని విధంగా మారడంతో.. ఆచూకీ తెలుసుకోలేక పోతున్నారు. ఆయా పోలీసు స్టేషన్లలో అదృశ్యం కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తేనే నిజాలు బయటపడే అవకాశముంది. మృతదేహం లభ్యమైనప్పుడు ఊరు, పేరు తెలియని పక్షంలో మొదట ఆ వ్యక్తి ఆచూకీ కనుగొనడమే సమస్యగా మారుతోంది. పని ఒత్తిడి కారణంగా ఆయా కేసులను పక్కన పెట్టడంతో అసలు నిజాలు తెలియడం లేదు. మరోవైపు తమ వారు ఏమయ్యారో తెలియక బాధిత కుటుంబాలు మనోవేదన పడుతున్నాయి. 'అదృశ్యం, అనుమానాస్పద మృతి కేసుల విషయంలో ఎక్కడా రాజీపడకుండా దర్యాప్తు చేస్తున్నాం. కేసుల పురోగతి, స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పోలీసు అధికారులకు సూచనలిస్తున్నాం' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

పోటెత్తే వాగులు.. దారివ్వని గోదారి!

☛ పంట పొలాలకు ముంపు ముప్పు ☛ ఎత్తిపోతల కోసం రైతులు ఎదురుచూపులు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం వద్ద నిర్మించిన కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను ఆనుకుని.. సుమారు 1500 ఎకరాలు ఏటా ముంపు బారిన పడుతున్నాయి. స్లూయిస్ తలుపుల ద్వారా కొండవాగుల వరద గోదావరిలోకి చేరాల్సి ఉంది. అయితే ఆ తలుపులు గోదావరి వరదల సమయంలో మూసుకుపోవడంతో వరద స్లూయిస్ వెనుకభాగంలోని పంట పొలాలను ముంచెత్తుతోంది. నదిలో వరద తగ్గినప్పటికీ.. పంట భూములు రోజుల తరబడి ముంపులోనే ఉండటంతో సాగు భారమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎత్తిపోతలతోనే పరిష్కారం.. పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాల కోసం ప్రభుత్వం రైతుల నుంచి సుమారు 350 ఎకరాలు సేకరించి డంపింగ్‌యార్డు, పైప్‌లైన్ నిర్మాణం కోసం ఉపయోగించుకుంది. దీంతో సుమారు 1500 ఎకరాల్లో ఆ మేరకు విస్తీర్ణం తగ్గి ముంపు ముప్పు పెరిగింది. గోదావరిలో నీటిని ఎత్తిపోసే విధంగా ఎత్తిపోతల నిర్మిస్తే తప్ప ఇక్కట్లు తీరే పరిస్థితి లేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు.. కూటమి ప్రభుత్వం రాకతో ఎత్తిపోతల పథకం నిర్మాణంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో నియమించిన కమిటీ సభ్యులు ముంపు సమయంలో పరిస్థితిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఎత్తిపోతల పథకం ఆవశ్యకత తప్పనిసరని పేర్కొంటూ నాటి ప్రభుత్వానికి నివేదిక అందజేసినా ఫలితం లేకపోయింది.

పెరుగుతున్న వరద

పోలవరం, న్యూస్‌టుడే: నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు ఉప నదుల ద్వారా గోదావరికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం సాయంత్రానికి నీటి మట్టం 27.45 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 1.35 లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా దిగువకు వెళ్తున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

రూ.47 కోట్లతో ప్రతిపాదనలు.. అఖండ గోదావరి కడిగిపల్లి (ఏజీ ఆర్టీ) పర్యవేక్షణ ఈఈ మణికంఠం మాట్లాడుతూ.. ఎత్తిపోతల నిర్మాణానికి రూ.47 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను రూపొందించి ఇటీవల ప్రభుత్వానికి నివేదించామన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతం

శ్రీకాకుళం క్యాంపస్‌లో టేబుళ్ల వద్ద విద్యార్థులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

బాలికలే అధికం.. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండో రోజు జరిగిన కౌన్సెలింగ్‌లో బాలికలే అధిక సంఖ్యలో ప్రవేశాలు దక్కించుకున్నారు. గురువారం జరిగిన అడ్మిషన్ల ప్రక్రియకు అధికారులు 547 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. వీరిలో 429 మంది అడ్మిషన్లు పొందారు. వీరిలో బాలుర సంఖ్య 116 అయితే బాలికలు 313 మంది ప్రవేశాలు పొందడం విశేషం.

ఇదేమి కాలంరొయ్యో!

● ఆక్వాకు కలిసిరాని ప్రథమార్ధం ● నష్టాల బాట పట్టిన రైతు

కలిదిండి, మండవల్లి, న్యూస్‌టుడే: కలిదిండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కోలా రాజా 20 ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. గతేడాది ప్రథమార్ధంలో ఖర్చులు పోను ఎకరాకు లక్ష రూపాయలు మిగిలాయి. ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

రొయ్య రైతులు కష్టాలకు ఎదురీదుతున్నారు. ఆక్వా రంగానికి ఈ ఏడాది ప్రథమార్ధం ఏ మాత్రం కలసి రాలేదు. 2024తో పోల్చితే.. 2025లో తొలి ఆర్నెళ్ల నష్టాలు చవిచూసింది. ఇందుకు ప్రధాన కారణం వాతావరణం.. వ్యాధుల బెడద. . ధరల పతనం. ఆరు నెలల్లో ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా 70 శాతం రైతులు నష్టపోయారు.

గతం ఘనం.. గత సంవత్సరం రొయ్యల రైతులకు స్వర్ణయుగంగా మారింది. సగటున ఏడాదిలో 260 రోజులు పొడి వాతావరణం ఉంది. 2023 నవంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు వేడితో కూడిన వాతావరణం ఉండటంతో ఆక్వా రంగానికి అనుకూలంగా మారింది. దీంతో పెద్దఎత్తున రైతులు నష్టాల నుంచి లాభాల వైపునకు అడుగులు వేశారు.

నాడు - నేడు (మే నెల ప్రాతిపదికన)

విషయం	2024	2025
వాతావరణం	అధిక ఉష్ణోగ్రతలు (42-46 డిగ్రీలు)	అధిక వర్షపాతం (13.7 సెం.మీ)
వ్యాధుల బెడద	30 శాతం	70 శాతం
ధరలు (100కౌంటు)	రూ.240-250	రూ.215-220
దిగుబడి	70శాతం	20 శాతం

మే నెలలో వర్షాలు.. 125 ఏళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ నివేదిక వెల్లడించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ వాతావరణం రైతులకు పూర్తిగా సహకరించలేదు. మే నెలలో ఎడతెరిపి లేని వర్షాలతో ప్రాణవాయువు సమస్య ఏర్పడి చేపలు, రొయ్యలు మృత్యువాత పడ్డాయి. దీంతోపాటు అధిక సాంద్రతలో సాగు చేపట్టడం, నీరు, మేత యాజమాన్యంపై సరైన అవగాహన లేకుండా సాగు చేయడం, రొయ్య పిల్లల ఎంపికలో అజాగ్రత్త వల్ల రొయ్యలు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేకపోయాయి.

యాజమాన్య పద్ధతులే రక్ష.. మండు వేసవిలోనూ ఆకస్మికంగా వాతావరణం చల్లబడిపోవడం, ఎడతెరిపి లేని వర్షాలు చేపలు, రొయ్యల సాగుకు ప్రతికూలంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో సరకును రక్షించుకోవడానికి అనువైన యాజమాన్య పద్ధతులపై సాగుదారులకు మరింత అవగాహన కల్పిస్తామని మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు.

పీఆర్ ఇన్‌ఛార్జి ఎస్ఈ బాధ్యతల స్వీకరణ

రామన్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఎస్వీ రామన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఎస్ఈగా విధులు నిర్వర్తించిన రమణమూర్తి గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఏలూరులో క్వాలిటీ కంట్రోల్ డీఈగా పని చేస్తున్న రామన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పలువురు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రూ.315కు చేరిన పొగాకు ధర

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు ధర రూ.315కు చేరింది. జంగారెడ్డిగూడెం రెండో వేలం కేంద్రంలో గురువారం నాటి వేలంలో కిలో పొగాకుకు రూ.5 పెరిగి గరిష్ఠ ధర రూ.315 నమోదైంది. ఇప్పటి వరకు రూ.310 ఉంది. కాగా జంగారెడ్డిగూడెం ఒకటి, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల్లో మాత్రం రూ.4 పెరగడంతో రూ.314 గరిష్ఠ ధర నమోదైంది. కొద్ది రోజులుగా మేలు రకం వర్జీనియా పొగాకు ధరలలో పెరుగుదల కొనసాగుతోంది.

కొత్తగా రుణం.. ఉపాధికి ఊతం..!

ఎస్సీ కార్పొరేషన్‌కు ఊపిరి పోసే యత్నం

రుణం చెల్లించాలని కోరుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. ఆ శాఖ నుంచి ఎటువంటి సహాయం ఎస్సీ సామాజిక వర్గ యువత పొందలేదు. చివరకు ఉపాధి యూనిట్లను సైతం రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కార్పొరేషన్‌కు పునర్వైభవం తెచ్చేందుకు యత్నిస్తోంది. అర్హులకు ఉపాధి రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ మొదలైంది. నిలిచిన కార్యకలాపాలు మళ్లీ మొదలయ్యాయి. ఈ క్రమంలో ఉపాధి రుణ బకాయిల వసూళ్లు చేపట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు బృందాలను ఏర్పాటు చేసి వసూళ్లు ప్రారంభించారు. ముందు నోటీసులు జారీ చేస్తున్నారు. వసూలైన మొత్తాలతో కొత్త వారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంది.

581 యూనిట్లు.. ఉమ్మడి జిల్లాలో 2017 నుంచి 2019 వరకు 581 మందికి వివిధ యూనిట్లను మూడు కేటగిరీలుగా రూ.23.65 కోట్లు ఉపాధి రుణాలుగా పొందారు. వీటిలో స్వయం ఉపాధి విభాగం ద్వారా బ్యూటీ పార్లర్, మెడికల్ స్టోర్, టెంట్ హౌస్ తదితర యూనిట్లు ఇచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ఇన్నోవా, ఇథియోస్ కార్లు ఇచ్చారు. ఇతర విభాగంలో ఆటోలు, ట్రక్ ఆటోలు, చిన్న కార్లు ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.15.36 కోట్లను లబ్ధిదారులు తిరిగి చెల్లించారు. ఇంకా రూ.8.29 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వీటికి రెండు నెలలు గడువు నిర్ణయించి ఈ లోగా వసూలు చేయాలన్న యోచనతో కార్యాచరణ చేపట్టినట్లు ఈడీ ముక్కంటి చెప్పారు.

నగదు ఇవ్వకండి.. ఈ బకాయిలకు సంబంధించి ఎవరికీ నగదు ఇవ్వవద్దని ఈడీ ముక్కంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎస్‌బీఐలో ఉన్న ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ ఖాతా నంబరు 6208445544లో జమ చేయాలన్నారు. లేకుంటే డీడీ తీసి ఏలూరులోని తమ కార్యాలయంలో అందజేయాలని ముక్కంటి లబ్ధిదారులకు సూచించారు.

అతివలపై అఘాయిత్యాల నిరోధానికి చర్యలు

వన్‌స్టాప్ కేంద్రం దస్త్రాలు పరిశీలిస్తున్న శైలజ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళలపై దాడులు, అఘాయిత్యాలను నిరోధించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని వన్‌స్టాప్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేసుల రిజిస్టర్, వైద్యం తదితరాలను పరిశీలించారు. తితిదే కల్యాణ మండపం వద్దనున్న ఉద్యోగ మహిళల వసతి గృహాన్ని సందర్శించారు. శైలజ మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే అదే దోషులకు ఆఖరి రోజని హెచ్చరించారు. నిందితులకు శిక్షపడేలా పోలీసులకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఎవరైనా మహిళలపై అసభ్య పోస్టులు పెడితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆర్‌జేడీ బి.సుజాతరాణి, నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి, సీడీపీవో రాజశేఖర్, ఈవో మల్లిక, కేంద్రం ఏవో నిర్మల, సీఐ ఎం.సుబ్బారావు, తహసీల్దార్ గాయత్రి తదితరులు ఉన్నారు.

సమూలంగా గంజాయి మూలాల నాశనం: ఈగల్ ఐజీ

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

పోలీసులు, రైల్వే అధికారులతో మాట్లాడుతున్న రవికృష్ణ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి మూలాలను సమూలంగా నాశనం చేస్తామని.. సాగు, అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఈగల్ బృందం ఐజీ రవికృష్ణ అన్నారు. 'ఆపరేషన్ విజయ'లో భాగంగా ఏలూరు రైల్వేస్టేషన్‌లో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఈగల్ బృందం ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి ఐజీ గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కోరమండల్, ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఒడిశా నుంచి ఇతర ప్రాంతాలకు రైళ్లలో గంజాయి, మత్తు పదార్థాలు రవాణా అవుతున్న దృష్ట్యా ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ.. జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే 20 కేసుల్లో 700 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. 45 మందిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, సీఐలు అశోక్ కుమార్, కోటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ ధనరాజు, రైల్వే డీఎస్పీ రతన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కందిపప్పు సరఫరా

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎమ్ఎల్ఎస్ పాయింట్ నుంచి కాలం చెల్లిన కందిపప్పు వస్తోందని చౌక దుకాణదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని 54 చౌక దుకాణాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది. ఈ నెల ఎమ్ఎల్ఎస్ పాయింట్ నుంచి పలు రేషన్ దుకాణాలకు వచ్చిన కందిపప్పు ప్యాకెట్లు మే నెలతో గడువు ముగిసిందని, వీటిని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తీసుకెళ్లడానికి నిరాకరిస్తున్నారు. గత నెలలో సైతం ఇలానే కాలం చెల్లిన కందిపప్పు పంపిస్తే వెనక్కి పంపించడంతో మంచి కందిపప్పు పంపారని డీలర్లు చెబుతున్నారు. ఈ నెలా కాలం చెల్లిన కందిపప్పు ప్యాకెట్లు పంపించడంపై.. ఎమ్ఎల్ఎస్ పాయింట్ సిబ్బందిని అడిగితే సరైనా సమాధానం చెప్పడం లేదంటున్నారు. సరకుల నాణ్యత సరిగా ఉండటం లేదని, బియ్యం బస్తాలను తూకం వేయకుండా తరలించడంతో స్థానికంగా తూకాల్లో వ్యత్యాసం వస్తోందని డీలర్లు వాపోతున్నారు.

ప్రకృతి వైపరీత్యాల వేళ అప్రమత్తతే కీలకం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టరు స్మరణ్‌రాజ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల, డివిజన్ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు సబ్ కలెక్టరు బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. గురువారం సాయంత్రం నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో డివిజన్, మండల స్థాయి అధికారులతో ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలు ఉన్నచోట పరిస్థితులను మండల స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగు నీరు, వసతి సౌకర్యాలపై మండలాల వారీగా ఆరా తీశారు. ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే మోటార్లతో తోడించే ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరం.. ఎంతో దూరం

ప్రతి ఆవాస ప్రాంతంలో రేషన్ దుకాణం ఏర్పాటుకు వినతి

'నా భర్త పోతురాజు గొర్రెల కాపరి. నేనే తిమ్మయ్యపాలెం లోని చౌక దుకాణానికి వెళ్లాలి. కొయ్యలగూడెం మండలంలోని సుమారు 8 గ్రామాల్లో రేషన్ దుకాణాల్లేవు. రెండు కిలోమీటర్లకు పైగా దూరమున్న సమీప పంచాయతీ కేంద్రాలకు వెళ్లి సరకులు మోసుకురావాలి. మా గ్రామంలో కొత్త దుకాణం ఏర్పాటు చేయాలి' అని కొత్తగూడేనికి చెందిన సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

ఏలూరు అర్బన్, పెదపాడు, ఉంగుటూరు, ఆగిరిపల్లి, మండవల్లి, కొయ్యలగూడెం గ్రామీణ - న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 1,350కి పైగా రేషన్ దుకాణాలుండేవి. ప్రస్తుతం 1,123కే పరిమితమయ్యాయి. వివిధ కారణాలతో 215 దుకాణాలు ఖాళీ అయ్యాయి. డీలర్లు మరణించడం లేదా స్వచ్ఛందంగా వదులుకోవడంతో ప్రతి మండలంలో సుమారు 15 నుంచి 20 వరకు మూతపడ్డాయి. వీటి భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో దుకాణాలను అందుబాటులోకి తేవడం ద్వారా కార్డుదారులకు సాంత్వన చేకూరనుంది. 'పోర్టబిలిటీ విధానంలో ఏ రేషన్ దుకాణంలోనైనా సరకులు తీసుకునే అవకాశముంది. ఖాళీ దుకాణాల భర్తీకి ప్రభుత్వమే ప్రకటన ఇవ్వాల్సి ఉంది' అని డీఎస్వో విలియమ్స్ తెలిపారు.

సమస్యలివీ..

పెదవేగి ››› మండలంలో 36 రేషన్ దుకాణాలున్నాయి. వివిధ కారణాలతో ఆరుగురు డీలర్లను తొలగించారు. జగన్నాథపురం, పినకడిమి, రాయన్నపాలెం గ్రామాల్లో దుకాణాలు లేకపోవడంతో.. అక్కడి కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు.

చాట్రాయి ››› మండలం కరుణాపురం గ్రామస్థులు 3 కి.మీ., సూరంపాలెం, జగన్నాథపురం వాసులు 3.5 కి.మీ. దూరంలోని రేషన్ దుకాణాలకెళ్లి నిత్యావసరాలు తీసుకురావాల్సి వస్తోంది.

ఆగిరిపల్లి ››› మండలం మల్లి బోయినపల్లి వాసులు 3 కి.మీ. దూరంలోని న్యాగొండపల్లి వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నారు.

నూజివీడు ››› మండలం వేంపాడు గ్రామస్థులు 5 కి.మీ. ప్రయాణించి గొల్లపల్లి రేషన్ నుంచి సరకులు తీసుకొస్తున్నారు.

మండవల్లి ››› మండలంలోని చావలిపాడు, కానుకొల్లు, పెరికెగూడెం, కొత్తూరు గ్రామస్థులు 3 కి.మీ. దూరం వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకుంటున్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం: డీడీ

బాలికలతో విశ్వమోహన్‌రెడ్డి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు రుచికర, నాణ్యమైన భోజనం అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు వై.విశ్వమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలికల వసతి గృహం-1ను గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. రోజు మెనూ ప్రకారం భోజనం అందించారా.. లేదానని ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు. ఎవరైనా ఎక్కువ రోజులు వసతి గృహానికి రాకపోతే వెంటనే తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువులో రాణించేలా వసతి గృహాధికారులు శ్రద్ధ చూపాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

సీపెట్‌లో ప్రవేశాలకు అవకాశం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి సమీపంలోని సూరంపల్లిలో ఉన్న కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీపెట్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)లో పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులై విద్యార్థుల నుంచి 3 ఏళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం తెలిపారు. ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌కు భారతదేశంతో పాటు విదేశాలలో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10 లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు చరవాణి నంబర్ 93985 35697లో సంప్రదించాలని కోరారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆహార పదార్థాల నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఆహార తనిఖీ సహాయాధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. స్థానిక కొత్త బస్టాండ్ ఎదుటనున్న ఓ రెస్టారెంట్‌లో గురువారం సాయంత్రం తనిఖీలు చేశారు. అక్కడి ఆహార పదార్థాలు పరిశీలించారు. నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపారు. ఆయన మాట్లాడుతూ.. రెస్టారెంట్లు, హోటళ్లు, ఫుడ్‌కోర్టుల్లో నిల్వ ఉంచిన మాంసం, ఆహార పదార్థాలు వినియోగించినా.. తయారీలో రంగులు కలిపినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. చాలా చోట్ల ఆహార పదార్థాలు నాసిరకంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయని.. రెస్టారెంట్, హోటళ్ల నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించాలని ఆయన ఆదేశించారు.

రండి.. మా పిల్లలూ ఇక్కడేనండి..

ప్రభుత్వ బడుల్లో చదివిస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, ఉంగుటూరు, వేలేరుపాడు, కలిదిండి, న్యూస్‌టుడే: వారంతా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు.. పెద్ద పెద్ద విద్యాసంస్థల్లో తమ పిల్లలను చదివించే స్తోమత వారిది.. కానీ 'మీ పిల్లలను మా పాఠశాలల్లో చదివించండి' అంటూ ఇంటింటికీ తిరిగి అడిగిన మాటలు మనకూ వర్తిస్తాయనుకున్నారు.. మనం ఇతరులకు చెప్పి.. మన పిల్లలను ప్రైవేటులో చదివించడమేమిటని భావించారు. మార్పు మన నుంచే రావాలని.. తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించారు. వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేసి.. తమ పిల్లలనే ఒక ఉదాహరణగా చూపుతూ అందరిలో స్ఫూర్తి నింపుతున్నారు ఈ గురువులు.

తన కుమారుడినే ఉదాహరణగా..

ఉంగుటూరు మండలం బాదంపూడికి చెందిన శిరికి శివ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఎస్జీటీ కొలువు పొందారు. అదే స్ఫూర్తితో తన కుమారుడు జశ్వంత్, కుమార్తె కీర్తనను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివించారు. 2024-25 పదో తరగతి ఫలితాల్లో జశ్వంత్ 580 మార్కులు సాధించి.. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. 'నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి కొలువు సాధించా. సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి నా కుమారుడు జశ్వంతే నిదర్శనం. తల్లిదండ్రులందరికీ ఇదే ఉదాహరణగా చూపి.. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నా.' అని శివ చెబుతున్నారు.

అత్యుత్తమ విద్యాబోధన ఉంటుందనే..

జంగారెడ్డిగూడేనికి చెందిన బాబూ రాజేంద్రప్రసాద్ పంగిడిగూడెం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనకున్న ఒక్కగానొక్క కుమార్తె హెప్సీ సుమ ప్రసన్నను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రస్తుతం బాలిక జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. 'ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారు. అత్యుత్తమ బోధన ఉంటుంది. అందుకే నా కుమార్తెను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నా.' అని రాజేంద్రప్రసాద్ అంటున్నారు.

నమ్మకం కలిగించేందుకు..

శ్రీకాకుళం జిల్లా గంగువారి సిగడాం మండలం నడిమివలసకు చెందిన పాతర్లపల్లి నీలకంఠం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. 2014 డీఎస్సీలో ఎస్‌ఏ (తెలుగు)గా కొలువు సాధించి ప్రస్తుతం బాదంపూడిలో స్థిరపడ్డారు. కుమారుడు సంజయ్‌ను ఆయన పని చేసే బొమ్మిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి, కుమార్తె శ్రీవల్లీని బాదంపూడిలోని నం.1 ఎంపీపీ పాఠశాలలో అయిదో తరగతి చదివిస్తున్నారు. 'ప్రజల్లో ప్రభుత్వ బడులపై నమ్మకం కలగాలనే మా పిల్లలను ఇక్కడ చదివిస్తున్నా. ఒత్తిడి లేకుండా పిల్లలను సహజంగా స్వేచ్ఛగా ఉండాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నా.' అంటున్నారు నీలకంఠం.

ధైర్యంగా అడుగుతున్నా..

ప్రభుత్వ ఉపాధ్యాయులను అందరూ సహజంగా అడిగే ప్రశ్న మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారు? అని. . ఈ ప్రశ్నకు ఆమె నుంచి మంచి సమాధానమే ఉంది. కలిదిండికి చెందిన ఉపాధ్యాయురాలు భూపతి గ్రీష్మ కలిదిండి మండలంలోని పరసావానిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. వారి పాప అదే పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. 'అమ్మగా.. గురువుగా నా బిడ్డను రోజంతా చూసుకోవడం చాలా బాగుంది. నా బిడ్డా మా బడిలోనే ఉంది.. మీ పిల్లలనూ చేర్పించండని ధైర్యంగా తల్లిదండ్రులను అడుగుతున్నా' అని చెబుతున్నారు గ్రీష్మ.

ఇద్దర్నీ అందులోనే..

అతని విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే.. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన అతను తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనే చెరువుగొల్లగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూనెం సుందర్. వేలేరుపాడు మండలం కొత్తూరుకు చెందిన ఆయనకు అజయ్, సంజయ్ ఇద్దరు పిల్లలు. వారిద్దరూ 1 నుంచి 5 వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదివారు. ఆరో తరగతి నుంచి జీలుగుమిల్లి మండలం బరింకలపాడు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్నారు. 'ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుంటారు. నాకులా నా పిల్లలూ ప్రయోజకులు కావాలనే ఇక్కడ చదివిస్తున్నా.' అంటున్నారు సుందర్.

గుబ్బల మంగమ్మ గుడికి సౌర కాంతులు

పలకలు అమర్చుతున్న కార్మికులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడి ప్రాంగణంలో సౌరశక్తి విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేశారు. గుడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సౌరశక్తి పలకలను అమర్చారు. ఈ యూనిట్ ద్వారా ఆలయం వద్ద రేకుల పందిరి, పరిసరాల్లోని దీపాలు, పంకాలు, సీసీ కెమెరా, మంచినీళ్ల ట్యాంకు మోటారు తదితరాలకు కనెక్షన్ ఇస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

6న ఈత పోటీలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక బిశ్వనాథ్ భర్తియా ఈత కొలనులో జిల్లా ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉమ్మడి జిల్లా స్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఔత్సాహికులు ఈ నెల 5లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 94403 37313 నంబరును సంప్రదించవచ్చని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఆశ్రమ పాఠశాలలో మలేరియా పడగ

11 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ

చికిత్స పొందుతున్న విద్యార్థులు

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని చేగొండపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు మలేరియా బారిన పడ్డారు. గురువారం ఆశ్రమ పాఠశాలలో ఎల్‌ఎన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పిల్లలకు ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు చేశారు. వారిలో ఎనిమిది మందికి పాజిటివ్ రాగా.. మరో ముగ్గురికి జ్వరం లేకపోయినా.. వారికీ మలేరియా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో విద్యార్థులను వెంటనే పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ జరిపిన రక్త పరీక్షల్లోనూ పాజిటివ్‌గా తేలడంతో వైద్యులు అవసరమైన మందులు అందజేశారు. వారు ప్రస్తుతం సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే చికిత్స పొందుతున్నారు. తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సమాచారం తెలియజేయడంతో వారు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలివచ్చారు.

చేతి వేలు కొరికి పడేశాడు

బాధితుడు సాంబశివరావు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పాత రావిచర్లలో బొర్రా సాంబశివరావు కుడి చేతి ఉంగరం వేలిని మరీదు వెంకటేశ్వరరావు కొరికిపడేశాడు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్టు భావిస్తున్నారు. గ్రామీణ ఎస్సై జ్యోతి బాసు కథనం ప్రకారం.. గురువారం మండలంలోని రావిచర్లలో బొర్రా సాంబశివరావు, మరీదు మోహన్ కృష్ణ, మరీదు వెంకటేశ్వరరావు మరి కొందరు కలసి పార్టీ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మోహన్‌కృష్ణ, వెంకటేశ్వరరావులు గొడవ పడ్డారు. మధ్యలో వెళ్లి గొడవను నివారించేందుకు యత్నించిన సాంబశివరావు చేతి వేలిని మరీదు వెంకటేశ్వరరావు కొరికేశాడు. 'వైకాపాలో ఉన్నప్పుడే నిన్ను చంపేయాలనుకున్నాం. . మళ్లీ తెదేపాలోకి వచ్చావంటూ' దాడికి యత్నించినట్లు బాధితుడు పేర్కొన్నాడని తెలిపారు. చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గత ప్రభుత్వ తప్పులు సరిచేస్తూ.. సంక్షేమ పథకాల అమలు: మంత్రి

నూజివీడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు గాంధీ నగర్, నెహ్రూపేటల్లో గురువారం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయని కితాబిచ్చారు. గ్యాస్ రాయితీ పడటం లేదని, మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని మరి కొందరు వ్యక్తి గత సమస్యలను ప్రస్తావించారు. స్పందించిన మంత్రి అక్కడే ఉన్న కమిషనర్, ఇతర శాఖల అధికారులను తక్షణమే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరవటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలన్నింటిని సరి చేసుకుంటూ కూటమి ప్రభుత్వం సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తోందని తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం అవుతుందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ఏడాది కాలంలోనే నూజివీడు నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, ఆయా వార్డుల అధ్యక్షులు, కార్యదర్శులు మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో బంగారు కుటుంబాల నమోదు: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4లో భాగంగా జిల్లాలో బంగారు కుటుంబాల నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. బంగారు కుటుంబాల నమోదు, మార్గదర్శకుల గుర్తింపును ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

కుక్కునూరులో 31.0 మి.మీ. వర్షపాతం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 గంటల మధ్య 6.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కుక్కునూరులో అత్యధికంగా 31.0, ఏలూరు గ్రామీణంలో అత్యల్పంగా 0.2 మి.మీ. వర్షం కురిసింది. జీలుగుమిల్లి 15.6, టి.నరసాపురం 15.0, చింతలపూడి 13.2, బుట్టాయగూడెం 11.4, జంగారెడ్డిగూడెం 11.2, పోలవరం 10.2, కొయ్యలగూడెం 10.2 చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రైవేటు పాఠశాలల బంద్ వాయిదా: అపుస్మా

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గురువారం నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్ వాయిదా వేసినట్లు ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ తెలిపారు. అపుస్మా రాష్ట్ర నాయకులతో ప్రభుత్వం చేపట్టిన చర్చలు సానుకూలంగా ఉండటంతో.. బంద్ వాయిదా వేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం, జనపనార సంచుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సంచాలకుడు ఎం.ఫణికుమార్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. మగ్గం వర్క్‌లో 31, జనపనార సంచుల తయారీలో 14 రోజులపాటు శిక్షణ ఇస్తామని, ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణానంతరం ధ్రువపత్రం ఇవ్వడంతో పాటు బ్యాంకు నుంచి ముద్ర రుణం పొందడానికి సిఫార్సు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95027 23561 నంబరును సంప్రదించవచ్చని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'కొల్లేరు' హామీలు అమలు చేయాల్సిందే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కొల్లేరు ప్రజల మెడపై కత్తిలా వేలాడుతున్న జీవో నంబరు 120ని రద్దుచేసి పర్యావరణాన్ని, ప్రజల జీవనోపాధిని కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో 5వ కాంటూరు పరిధిలోని చేపల చెరువులను ధ్వంసం చేశారని, లక్షలాది మంది ప్రజల జీవితాలను నాశనం చేశారని పేర్కొన్నారు. దీనివల్ల వేలాది మంది జీవనోపాధి నిమిత్తం దూర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. కొల్లేరులో రెగ్యులేటర్లు నిర్మిస్తామని, దానిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, ఉపాధి కల్పిస్తామని వేలాది కోట్లు విడుదల చేసినా.. ఆ నిధులతో ఉపాధి కల్పన జరగలేదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా.. కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు నామమాత్రంగా ప్రజాభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (यूनियन बैंक / Union Bank of India)

ప్రాంతీయ కార్యాలయం, భీమవరం, ప.గో.జిల్లా

బంగారు నగల వేలం ప్రకటన

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి మా బ్యాంకు శాఖల నుండి రుణం పొందారు. రుణ బకాయిలు తిరిగి చెల్లించాలంటూ పలుమార్లు నోటీసులు పంపినను రుణాలు తిరిగి చెల్లించలేదు. మా బ్యాంక్ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** మార్గదర్శకాల ప్రకారం **తేది:11-07-2025, శుక్రవారం** సాయంత్రం **04.00 గంటలకు** సంబంధిత బ్యాంకు శాఖల ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయించబడింది. రుణగ్రహీతల బంగారు ఆభరణాలు అమ్మకం తరువాత వేలం ద్వారా స్వీకరించబడిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కూడా బ్యాంకు యొక్క బకాయిలు బాకీ ఉన్నట్లయితే, మిగిలిన బకాయిలను రాబట్టుకొనుటకు రుణగ్రహీతపై అవసరమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించబడతాయి.దిగువ పేర్కొన్న రుణగ్రహీతలలో ఎవరైనా మరణించినట్లయితే, ఈ వేలం నోటీసు రుణగ్రహీతల చట్టపరమైన వారసులకు వర్తిస్తుంది. రుణగ్రహీతలకు నోటీసు అందకపోయినా లేదా నోటీసు తిరస్కరించిన వారికి ఈ పత్రికాప్రచురణ చివరి నోటీసుగా పరిగణించబడుతుంది.

వ. సం.	లోన్ అకౌంట్ నెం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	బకాయి మొత్తం (రూ. లక్షలలో)	స్థూల బరువు (గ్రాములలో)
		శృంగవృక్షం బ్రాంచ్		
1	051616630001072	చింతపల్లి నాగేశ్వరరావు, 3-153 శృంగవృక్షం పోస్ట్, పిపి రోడ్, శృంగవృక్షం -534243	0.21 లక్షలు	10.00
		దగ్గులూరు బ్రాంచ్		
2	076916540003362	మల్ల వెంకట నవీన్‌కుమార్, తండ్రి : హరిప్రసాద్, ఇంటి నెం.1 99, గవరపేట, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఆం.ప్ర. దగ్గులూరు-534250	0.64 లక్షలు	14.00
3	076916540004141		1.79 లక్షలు	36.00
		మల్లవరం బ్రాంచ్		
4	089416630000227	దాకే లక్ష్మణరావు, 3 78 యస్‌సి ఏరియా, మల్లవరం, అంబేడ్కర్ విగ్రహం, చాగల్లు మండలం, మల్లవరం-534342	0.32 లక్షలు	11.00
		పెనుమంట్ర బ్రాంచ్		
5	043016540007499	గుత్తుల సత్యవతి, భర్త : సత్యనారాయణ, 11 73, బ్రాహ్మణచెరువు, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర-534124	1.06 లక్షలు	21.50
6	043016540007500		0.40 లక్షలు	8.20
7	043016540007190	గోగడ దుర్గా మల్లేశ్వరి, భర్త : గోగడ ముత్యాలు, ఇంటి నెం.153, వి వి పాలెం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర -534124	0.54 లక్షలు	12.00
8	043016540007780		0.80 లక్షలు	18.00
9	043016540008211		1.16 లక్షలు	24.00
10	043016540008245		2.68 లక్షలు	56.00
		పాలకొల్లు యూబిఐ బ్రాంచ్		
11	498406540043770	సింగంశెట్టి పెద్దింట్లు, 26-5-1, ముచ్చర్ల వారి తోట, కొండాలమ్మ గుడి, పాలకొల్లు-534260	0.71 లక్షలు	12.60
12	498406540043649		1.60 లక్షలు	29.50
13	498406540043620	భీమాసండం ప్రభావతి, భర్త : నాగేశ్వరరావు, డి.నెం.1 89, పద్దిలంక, ఎలమంచిలి మండలం, పాలకొల్లు-534266	1.75 లక్షలు	29.00
14	498406540044362	నీలిమ శలా, 6-3-13, వార్డు నెం.29, చింతలతోట, పాలకొల్లు-534260	0.61 లక్షలు	10.70
15	498406540044458	మజ్జి వినయ్‌కుమార్, తండ్రి : వెంకట త్రినాథ ప్రసాద్, డి.నెం.21 10 1, రాజేంద్ర నగర్, పాలకొల్లు, పాలకొల్లు-534260	1.38 లక్షలు	29.00
16	498406540044045		0.30 లక్షలు	5.40
17	498406540044003		0.69 లక్షలు	12.20
18	498406540035890	చిమట సురేష్, తండ్రి : చెన్నయ్య, 5 168, బి, యస్‌సి కాలనీ, రామాలయం దగ్గర, ఇసుమెల్ల గుంటూరు, పశ్చిమ గోదావరి-522661	0.18 లక్షలు	5.50
19	498406540035948	మాకా సువర్ణ రావు, 7-40, చిన్నపేట, పోడూరు మండలం, పెనుమదం, పోడూరు-534267	0.17 లక్షలు	4.90
		ఖండవల్లి బ్రాంచ్		
20	280016540008873	రామిశెట్టి లక్ష్మి వెంకట నాగ సాయి ప్రసాద్, తండ్రి : రామిశెట్టి సూరిబాబు, ఇంటి నెం.9 37, రాజుల రామాలయం వీధి, ఖండవల్లి-534330	1.58 లక్షలు	29.50
		కోపల్లె బ్రాంచ్		
21	029816540002578	కొండేటి పుష్ప, భర్త : సామ్‌సను, డి.నెం.2 27, చిన్నపేట, కోపల్లె పోస్టు, కోపల్లె గ్రామం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా, కాళ్ళ-534206	0.37 లక్షలు	7.50
22	029816540002412		0.50 లక్షలు	10.00
		భీమవరం యూబిఐ బ్రాంచ్		
23	496206540026353	దొడ్డి మాణిక్యం, తండ్రి : డి.దావీదు, డి.నెం.3 37 1, పెదపేట, పాలకోడేరు, పాలకోడేరు-534210	0.27 లక్షలు	5.00
		లజపతిరాయ్‌పేట బ్రాంచ్		
24	130316540004713	అల్లపల్లి మోహిని దేవి, భర్త : లక్ష్మి నారాయణ, 6ఎ-4-4, వీవర్స్ కాలనీ, వార్డు 29, పాలకొల్లు, పాలకొల్లు - 534260	0.53 లక్షలు	10.10
		తణుకు యన్‌హెచ్ రోడ్ బ్రాంచ్		
25	269116540003502	దేశబత్తుల శ్రీనివాసు, 14-13-36-1, మిషన్ స్కూలు వీధి, పాత టౌన్, తణుకు-534211	0.90 లక్షలు	18.00
26	269116540004450	ఎలిపే సతీష్ కుమార్, ఉండ్రాజవరం గ్రామం, ఉండ్రాజవరం-534216	0.70 లక్షలు	15.00
27	269116540004711		0.73 లక్షలు	15.00
28	269116630000994	రొట్టె రవితేజ, 3 1 5 , తండ్రి : రాములు, అంబటి వారి వీధి, పాత టౌన్, తణుకు	0.13 లక్షలు	3.0

షరతులు : 1) వేలంలో పాల్గొనే ఆసక్తిగల వ్యక్తులు తేది:11-07-2025, శుక్రవారం మధ్యాహ్నం 02.00 గంటలలోపు రూ.5,000/- (ఐదు వేల రూపాయలు మాత్రమే) మొత్తాన్ని E.M.D గా డిపాజిట్ చేయాలి. 2) వేలంలో విజయవంతమైన బిడ్డర్ E.M.D మినహా మిగిలిన బిడ్ మొత్తాన్ని వెంటనే చెల్లించాలి మరియు విజయవంతం కాని బిడ్డర్లు డిపాజిట్ చేసిన E.M.D వారికి తిరిగి చెల్లించబడుతుంది. 3) బిడ్ అంగీకారానికి సంబంధించి బ్యాంక్ నిర్ణయం అంతిమమైనది, దానికి కట్టుబడి ఉండవలెను మరియు ప్రశ్నించడానికి వీలుబడదు. 4) వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలను మార్చే హక్కు బ్యాంకుకు ఉంది. ఏ దశలోనైనా వేలాన్ని రద్దు చేసే హక్కు బ్యాంకుకు ఉంది. 5) వేలంలో పాల్గొనువారు ఆధార్ మరియు పాన్ కార్డు కాపీలను బ్యాంకునకు సమర్పించవలెను.

తేది. 03.07.2025 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆటోలు, బ్యాటరీల దొంగల అరెస్టు

కేసుల వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ భీమారావు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆటోలు, బ్యాటరీలు చోరీ చేస్తున్న దొంగలను అరెస్టు చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ వి. భీమారావు తెలిపారు. భీమవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా పేరికిగూడెం గ్రామానికి చెందిన పి.నాగరాజు విశాఖపట్నంలో ఉంటున్నాడు. ఇతను భీమవరం రెండో పట్టణంలోని రెండు చోట్ల ఆటోలను అపహరించాడు. దీనిపై డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సీఐ జి.కాళీచరణ్ దర్యాప్తు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి జాతీయ రహదారిపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఇదే తరహాలో మిగిలిన జిల్లాల్లో ఎక్కడైనా ఆటోలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు ఉన్నాయా అని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆరా తీశారు. అక్కడి నుంచి కూడా దొంగిలించిన ఆటోలను జాతీయ రహదారి మీదుగా విశాఖ తీసుకెళ్లినట్లు తేలింది. దాంతో సీసీ కెమెరా ఫుటేజీలో ఉన్న దొంగ కోసం గాలించగా నాగరాజుగా తేలింది. ఇతనిపై మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో గతంలో డీసీ షీట్ ఉండటంతో విచారణ వేగవంతం చేశారు. భీమవరం, ఆకివీడు, అమలాపురం, విశాఖ, మండవల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.17 లక్షల విలువైన 13 ఆటోలను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆటోలను ఓ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అతని గురించి గాలిస్తుండగా ఇటీవల పెనుమంట్రలో ఆటో అపహరణ సమయంలో త్రుటిలో పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. జిల్లాలోనే ఉంటున్నాడని చరవాణి లొకేషన్ ఆధారంగా గాలించగా తాడేపల్లిగూడెంలోని ఓ లాడ్జిలో బస చేసినట్లు గుర్తించి పట్టుకున్నారు. వివాహానికి ముందు నుంచి దొంగతనాలకు అలవాటు పడిన నాగరాజుకు విశాఖ జిల్లా సబ్బవరానికి చెందిన పి.గణేష్ సహకరించడంతో అతన్ని కూడా అరెస్టు చేశారు.

65 బ్యాటరీలు స్వాధీనం.. భీమవరం, కాళ్ల, ఆకివీడు, ఉండి, వీరవాసరం, పాలకోడేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 14 కేసుల్లో 65 బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసలైన ఉండిరోడ్డుకు చెందిన తీగల నరేంద్ర భవాని, సుంకరపద్దయ్య వీధికి చెందిన పైలా రాకేశ్ అనే సాయి, టిడ్కో గృహాల్లో ఉంటున్న యలగడ కోదండ సాయి వెంకట సత్యనారాయణను అరెస్టు చేశారు. సులువుగా డబ్బులు సంపాదించాలనుకుని ఆటోలు, లారీల్లోని బ్యాటరీలను అపహరించి విక్రయిస్తున్నారు. డీఎస్పీ ఆర్.జి.జయసూర్య, సీఐలు ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, ఎస్సైలు రెహమాన్, ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ పాల్గొన్నారు. కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

రైలు నుంచి జారి పడి ఉపాధ్యాయుడి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైలు నుంచి జారి పడి ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన నగర శివారులో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఏలూరు ఫిల్‌హౌస్‌పేటకు చెందిన నేతల చంద్రశేఖర్ ఆజాద్(51) శ్రీపర్రు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ రాత్రి విజయవాడలోని సోదరుడి ఇంటికెళ్లేందుకు ఏలూరులో కాకినాడ-తిరుపతి రైలెక్కారు. వట్లూరు సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి మృతి చెందారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్సై సైమన్ గురువారం కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువతి .. ఏలూరు నేరవార్తలు,: నగరానికి చెందిన ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా గుట్టుగా అంత్యక్రియలు పూర్తి చేశారు. శనివారపుపేటలోని ఓ ప్రాంతానికి చెందిన యువతి గురువారం మృతి చెందారు. ఆమె ఉరేసుకున్నట్లు చెబుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియకుండా హడావుడిగా అంత్యక్రియలు పూర్తి చేశారు. యువతి ఎందుకు ఆత్మహత్య చేసుకుంది? ఆమెను ఎవరైనా వేధించారా? ఏవైనా సమస్యలున్నాయా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రహదారి దాటుతుండగా అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు చెందిన పేర్ని దుర్గారావు(47) చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పెయ్యేరు పూర్ణిమా థియేటర్ వద్ద దుర్గారావు రహదారి దాటుతుండగా అదే సమయంలో సింగరాయపాలెం నుంచి ముదినేపల్లి వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుడి కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95 రిటైల్ ధర 117 చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, 110, 121 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

92.7 FM Rajamahendravaram (ఈ FM 92.7 Mee FM)

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 6304901226

ఐచ్ఛిక సెలవులకు అనుమతినివ్వాలి: ఫ్యాప్టో

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు ఐచ్ఛిక సెలవులకు అనుమతివ్వాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు కోరారు. స్థానిక జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో గురువారం డీఈవో వెంకట లక్ష్మమ్మను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మొహర్రం, కార్తిక పూర్ణిమ తదితర రోజులను సెలవులుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహనరావు, నాయకులు టి.రామారావు, ఆర్.రవికుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోర్ 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

భీమవరం మెంటేవారి తోటలో బైపాస్ రోడ్‌కు దగ్గర్లో 5 సెంట్లు చొప్పున 2 స్థలాలు అమ్మకం. కాంటాక్ట్: 98482 09906.

JOBS

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబికేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబికేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రముఖ SML ISUZU జయలక్ష్మి మోటర్స్ ఏలూరు నందు సర్వీస్ ఎడ్వైజర్స్, మెకానిక్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. ✆ 94405 80868.

SECURITY GUARDS

పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమడోలు, తణుకులలో సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గం॥ డ్యూటీ, వీక్లీ ఆఫ్. జీతం: 15,000/- PF + ESI. Ex. సర్వీస్ జీతం: 20,000/- . PF + ESI. ✆ 95818 58667.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.70 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

పంటల బీమాపై అవగాహన: కలెక్టర్

గోడపత్రం విడుదల చేస్తున్న వెట్రిసెల్వి తదితరులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఖరీఫ్-2025పై ముద్రించిన గోడపత్రాన్ని గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఖరీఫ్ వరి పంటకు గ్రామ యూనిట్‌గా, మినుములకు జిల్లా యూనిట్‌గా, పత్తి యూనిట్ లైన్ పంటలకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

నిడమర్రు, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. తోకలపల్లి ఎన్టీఆర్ కాలనీ, క్రొవ్విడిలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి అభ్యంతరాల్లేని చోట, పోరంబోకు స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఉత్తర్వు 30 విడుదల చేసిందన్నారు. ఈ మేరకు అందిన దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.దుర్గాప్రసాద్, సిబ్బందితో సమీక్షించారు.

దుర్గమ్మకు గాజుల అలంకరణ

చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: చేబ్రోలు గాంధీనగర్‌లోని కనక దుర్గమ్మకు గురువారం గాజుల అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం.. నిడమర్రు: పెదనిండ్రకొలనులో శ్రీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. సాయినాథునికి ప్రత్యేక పూజలు, హోమాలు, పూజలు చేశారు. బాబూరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

మహా ధర్నా విజయవంతానికి పిలుపు

ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, న్యూస్‌టుడే: పురపాలక ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాకు జిల్లా నుంచి పెద్దఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారిణిగా శ్రీలక్ష్మి

నిడమర్రు గ్రామీణ, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ బువ్వనపల్లి సెక్టార్ పర్యవేక్షణాధికారిణి రూపశ్రీ బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఉంగుటూరు మండలం బాదంపూడి సెక్టార్ పర్యవేక్షణాధికారిణి శ్రీలక్ష్మికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

ఏలూరు సినిమా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబికా డీలక్స్	అందాల రాక్షసి
అంబికా మినీ	తొలిప్రేమ
సాయిబాలాజీ	శ్రీశ్రీశ్రీ రాజావారు
బాలాజీ	హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్ 1	కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్ 2	మార్గన్
సత్యనారాయణ స్క్రీన్ 3	తమ్ముడు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	కుబేర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సితారే జమీన్ పర్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	3 బీహెచ్‌కే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కుబేర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మార్గన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	కన్నప్ప
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కన్నప్ప

వంతెన.. నిలిచేనా!

శిథిలావస్థలో వారధులు

దినదిన గండంలా రాకపోకలు

పెదపాడు, న్యూస్‌టుడే: పెదపాడు మండలంలోని ప్రధాన మార్గాల్లో కాలువలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ప్రధానంగా ఆంగ్లేయుల హయాంలో ఏర్పాటు చేసిన వారధులు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రక్షణ గోడలు పూర్తిగా కిందకు దెబ్బతినడంతో... వాటిని పునర్నిర్మించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫలితంగా వంతెనల మీదుగా ప్రయాణం ప్రయాణికులకు దినదిన గండంగా మారింది. పెను ప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. 'శిథిల వంతెనలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. అనుమతులు వచ్చాక మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం' అని ర.భ.శాఖ ఏఈ శేషుకుమార్ తెలిపారు.

పెదపాడు మండలం కొత్తముప్పర్రు పరిధిలోని ఏడు తూములు కాలువలో వట్లూరు ముదురు కాలువపై ఆంగ్లేయుల హయాంలో నిర్మించిన వంతెన శిథిలావస్థ చేరిన దృశ్యమిది. ఈ వారధి పైనుంచి ఏలూరు నుంచి కొత్తూరు మీదుగా పెదపాడు వెళ్తుంటారు. ఏళ్ల కిందట లారీ ఢీకొని రక్షణ గోడ దెబ్బతింది. ప్రహరీని పునర్నిర్మించకపోవడంతో.. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏలూరు- పెదపాడు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

పాతముప్పర్రు- జయపురం మార్గంలో.. కాలువపై నిర్మించిన వారధి ప్రమాదకరంగా మారింది. వారధికి ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పెదపాడు మండలం తోటగూడెం నుంచి కృష్ణా జిల్లా బొమ్ములూరు మీదుగా హనుమాన్ జంక్షన్ జాతీయ రహదారిని కలిపేందుకు ఏలూరు- కృష్ణా కాలువపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు దెబ్బతిన్న దృశ్యమిది. ఈ గోడలు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల తోటగూడెం- పునుకొల్లు జడ్పీ రహదారిని రూ.98 లక్షలతో నిర్మించారు. వంతెన రక్షణను విస్మరించడంతో.. వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు టూటౌన్: 80085 74487	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పవరుపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షానికే నీరు, మురుగు ఏకమై రహదారులపై పొంగి ప్రవహిస్తోంది. **- సుధాకర్**

✓ సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడతాం. **- చంద్రయ్య, అదనపు కమిషనర్**

? మస్తాన్‌మస్తాం కాలనీ నుంచి రామనగర్ మీదుగా చాపల వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- వెంకట్, స్థానికుడు**

✓ సమస్య నా దృష్టికి రాలేదు. ఒకట్రెండు రోజుల్లో వీధి దీపాలను బాగు చేయిస్తాం. **- సాంబశివరావు, విద్యుత్తు ఏఈ**

పెదపాడు, న్యూస్‌టుడే: ? పాత ముప్పర్రులోని ఉన్నత పాఠశాల సమీప అంతర్గత రహదారిలో మురుగునీరు ప్రవహిస్తోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు కాలు జారి పడిపోయి గాయపడుతున్నారు. **- సుభాష్, పాత ముప్పర్రు**

✓ కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేసి మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటాం. **- సూర్యకుమార్, ఈవోపీఆర్డీ**

అభివృద్ధి పథాన ఏలూరు: బడేటి

మహిళకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పవరుపేటలోని వివిధ కార్యాలయంలో గురువారం ఆయా శాఖలతో వివిధాంశాలపై సమీక్షించారు. ఏటా 15 శాతం వృద్ధిరేటుతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పారిశ్రామిక రంగాల్లో వృద్ధి రేటు సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు పెదబాబు, ఉప కమిషనర్ చంద్రయ్య, సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ విశ్వమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకటో డివిజన్‌లో ప్రచారం.. ఏలూరు అర్బన్: 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా ఒకటో డివిజన్‌లో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, ఏఎంసీ ఛైర్పర్సన్ పార్థసారథి ప్రచారం చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

గిరిజన పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంత పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. కుక్కునూరు మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, ఆ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలన్నారు. రాయిగూడెం, ఉప్పేరు, వీరవల్లి, రామసింగారం తదితర ఆదర్శ పాఠశాలల్లో 26 మంది ఉపాధ్యాయులకు 8 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. ఆయా బడుల్లో ఖాళీలు భర్తీ చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

కొల్లేరువాసులతో మాట్లాడుతున్న వీరాంజనేయులు

నిడమర్రు గ్రామీణ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆప్కాబ్ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. అడవికొలనులో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా మండలాధ్యక్షుడు ముత్యాల స్వామి నేతృత్వంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన వెంట రాష్ట్ర బ్రిక్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, నాయకులున్నారు.

సాగు చేసుకోనివ్వడం లేదు.. నిడమర్రు గ్రామీణ: ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులును తోకలపల్లి గ్రామస్థులు గురువారం కలిశారు. కొల్లేరు ప్రాంతంలోని జిరాయితీ భూముల్లో అటవీ శాఖ అధికారులు సాగు చేసుకోనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని గన్ని హామీ ఇచ్చారు.

మౌలిక సదుపాయాల కల్పనకు విరాళం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు పశు సంవర్ధకశాఖ అధికారులు రూ.80 వేల విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో స్థానిక కలెక్టరేట్‌లో ఆ శాఖ జేడీ పి.గోవిందరాజులు గురువారం కలెక్టర్ వెట్రిసెల్వికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. పీ4 కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని వసతి గృహాలు, భవిత కేంద్రాలు, క్రీడా సౌకర్యాలు తదితర సామాజిక సదుపాయాల కల్పనకు అధికారులు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు.

అనుసంధాన మార్గాలపై దృష్టి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: అనుసంధాన(లింక్) రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. నారాయణపురం, ఉంగుటూరు, కైకరం, తల్లాపురం, గొల్లగూడెం, రావులపర్రు, దొంతవారి గ్రామాల రాకపోకలకు దెబ్బతిన్న అనుసంధాన రోడ్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయా రహదారులకు మరమ్మతులు చేపట్టాలా.. కొత్తగా నిర్మించాలా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్, సర్పంచి కేవీ శ్రీనివాస్ తదితరులున్నారు.

పేదల సంక్షేమమే పరమావధి: చింతమనేని

వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కె.కన్నాపురం, తాళ్లగోకవరం, వేగివాడ, చక్రాయిగూడెం, ముండూరు గ్రామాల్లో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, సాధికారిత కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. తొలుత కె.కన్నాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. చింతమనేని మాట్లాడుతూ.. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సమపాళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేసిందని కొనియాడారు. ఏఎంసీ ఛైర్పర్సన్ గారపాటి రామసీత, నాయకులు అనిల్‌కుమార్, రాంప్రసాద్, సత్యనారాయణ, తాళ్లగోకవరం సర్పంచి నెక్కలంపూడి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టె మార్చి.. సమస్య తీర్చి!

నిడమర్రు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఐదు రమ్య కాలనీ రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకు వద్ద ప్రమాదకరంగా దర్శనమిస్తున్న విద్యుత్తు నియంత్రణ పెట్టెను అధికారులు మార్చారు. 'రక్షణ చర్యలు చేపట్టరూ' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు ఏఈ ప్రసాద్ స్పందించారు. సిబ్బందిని పంపి పెట్టెను మార్పు చేశారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంపే రక్ష.. ఎన్నాళ్లీ శిక్ష

ఏలూరు నగరం పడమర లాకుల వద్ద తమ్మిలేరుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వారధి మీదుగా ఎన్టీఆర్ కాలనీ, వెంకటాపురం నుంచి వంగాయగూడెం వెళ్తుంటారు. రోజూ వేలాది మంది ప్రయాణించే వంతెన రక్షణ గోడలు కూలిపోయాయి. కొందరు స్థానికులు నేలమట్టమైన గోడల వద్ద ప్రమాదాలు జరగకుండా తాత్కాలికంగా ముళ్ల కంపలు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలు సైతం లేకపోవడంతో.. రాత్రివేళ ఆదమరిచి వాహనాలు నడిపితే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**

ప్రధాన రోడ్డు.. పట్టదే గోడు!

ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వే గేటుకు ఇరువైపులా రోడ్డు దెబ్బతింది. భారీ గుంతలు ఏర్పడి వాహనదారులను హడలెత్తిస్తోంది. గుంతల్లోకి వర్షపు నీరు చేరి తటాకాలను తలపిస్తోంది. భీమవరం- జంగారెడ్డిగూడెం ప్రధాన మార్గం కావడంతో.. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ గోతులు గమనించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చేబ్రోలు (ఉంగుటూరు)**

పట్టాలు దాటుతూ.. ప్రమాదాలకు గురవుతూ!

ఏలూరు నగర మధ్యలో పవరుపేట రైల్వే స్టేషన్ ఉంది. పాత బస్టాండు, గన్‌బజారు నుంచి కొత్త బస్టాండు, నరసింహారావు పేట మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికులు, మూగజీవాలు పట్టాలపైకి వెళ్లకుండా రక్షణ గోడలు, దిమ్మెలు ఏర్పాటు చేశారు. అవికాస్త దెబ్బతినడంతో.. పలువురు పట్టాలు దాటుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు, దిమ్మెలు పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు**

చెట్టు కొమ్మ.. నిర్లక్ష్యమే సుమా!

ఏలూరు నగరం కొత్త బస్టాండు నుంచి జన్మభూమి పార్కుకు వెళ్లే మార్గంలో.. రోడ్డు అంచు కుంగిపోయి గొయ్యి ఏర్పడింది. కొన్నాళ్లుగా కురుస్తున్న వానలతో రహదారి దెబ్బతింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తరచూ గోతిలో పడి గాయాల పాలవుతున్నారు. దీంతో స్థానికులే ప్రమాద సూచిగా చెట్టు కొమ్మ పెట్టారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా తక్షణమే గోతిని పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**

కార్మిక హక్కులు హరించొద్దు: ఐఎఫ్‌టీయూ

మాట్లాడుతున్న వెంకట్రావు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు హరించేలా వ్యవహరిస్తున్నాయని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు విమర్శించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. నగర కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ.. ఈ నెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలని కోరారు. నాయకులు రాంబాబు, వెంకటరమణ, గంగరాజు, శ్రీను, నెహ్రూబాబు, నూకరాజు పాల్గొన్నారు.

నిడమర్రు గ్రామీణ: మండలంలోని పలు శాఖల అధికారులకు సీఐటీయూ మండలాధ్యక్షుడు రమణారావు గురువారం సమ్మె నోటీసులు అందజేశారు. నాయకులు నాగశేషు, నాని పాల్గొన్నారు.

గ్రామీణులకు శుద్ధి జలం

నిడమర్రు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణులకు శుద్ధి జలం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో వియకుమారి అన్నారు. బావాయిపాలెం, బువ్వనపల్లి, నిడమర్రు గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల వద్ద పరీక్షల తీరును గురువారం ఆమె పరిశీలించారు. కుళాయిల ద్వారా శుద్ధి నీరు సరఫరా చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీతాల విడుదలకు వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాల బిల్లులు విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు ఆర్.శ్రీనివాస్ డాంగే, ఎం.త్యాగరాజు కోరారు. స్థానిక డీఈవో కార్యాలయంలో సహాయ సంచాలకుడికి గురువారం వినతిపత్రం అందజేశారు. ★ నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకుడు ఎ.అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటికి వినతి పత్రం సమర్పించారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

గోపాలపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఏలూరు డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్రభారతి అన్నారు. గోపాలపురం పంచాయతీ పందిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి చేరలేదు. దాంతో డీవైఈవో గురువారం పాఠశాలను సందర్శించి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని తల్లిదండ్రులకు వివరించారు. ఒకటో తరగతిలో ఒక విద్యార్థిని చేర్పించారు. వారం రోజుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు పలువురు తల్లిదండ్రులు ముందుకొచ్చారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం

చిన్నారుల నృత్యాన్ని తిలకిస్తున్న శైలజ

దెందులూరు, న్యూస్‌టుడే: మహిళా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. స్థానిక బాలసదన్‌ను గురువారం ఆమె సందర్శించి, అక్కడి వసతులపై ఆరా తీశారు. అనంతరం అక్షయపాత్ర భోజన తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీడీ శారద, ఏసీడీపీవో రాజశేఖర్, తహసీల్దార్ సుమతి, ఎస్సై శివాజీ, తెదేపా నాయకులున్నారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో.. అప్పనవీడు(పెదపాడు): అప్పనవీడులోని అభయాంజనేయస్వామిని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ గురువారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి పూజ చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మెకానిక్‌ల పాత్ర కీలకం: ఎస్సై

చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: దైనందిన జీవితంలో మెకానిక్‌ల పాత్ర కీలకమని చేబ్రోలు ఎస్సై మామిడాల సూర్యభగవాన్ అన్నారు. చేబ్రోలులో శ్రీ విజయ భారతి మోటార్ సైకిల్ మెకానిక్స్ సంఘం ఆధ్వర్యాన గురువారం ప్రపంచ మెకానిక్‌ల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు శ్రీనివాస్, ఏసురాజు, హేమంత్‌కుమార్, త్రిమూర్తులు, రామాచార్యులు పాల్గొన్నారు.

ఏలూరు వన్‌టౌన్: మెకానిక్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘ నాయకులు కోరారు. నగరంలో ఏలూరు టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో... కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెకానిక్ నాగరాజు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వినతిపత్రం ఇచ్చారు. నాయకులు జయరామిరెడ్డి, నాగరాజు, త్రినాథ్, శ్రీను, బాషా, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరు: కేక్ కోస్తున్న నాయకులు

రహదారి ప్రమాదంపై కేసు

పెదవేగి, న్యూస్‌టుడే: మే ఒకటిన చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఫల్గుణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాట్నాలకుంటకు చెందిన ఉప్పలపాటి గోపికిశోర్ రాయన్నపాలెంలోని పొలంలో పని చేసి, తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గం మధ్యలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో. . గోపికిశోర్‌కు గాయాలయ్యాయి. ఆయన్ను ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

వృద్ధుడికి గాయాలు.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలైన ఘటన 216ఏ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఉంగుటూరుకు చెందిన విడియాల రామారావు ఆవులకు పచ్చగడ్డి కోసుకొని ద్విచక్ర వాహనంపై నారాయణపురం నుంచి స్వగ్రామం బయల్దేరారు. మార్గం మధ్యలోని ఉంగుటూరు వద్ద చేబ్రోలు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొంది. ప్రమాదంలో రామారావుకు తీవ్ర గాయాలు కాగా, ఆయన్ను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఈ నెల 2న ఏలూరు పవరుపేట గిలకలగేటు వద్ద పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొన్న విషయం విదితమే. మృతుడిని కొత్తపేటకు చెందిన ముద్దన వెంకటరావు(59)గా గుర్తించారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం పూర్తయ్యాక, బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రయాణం తారుమారు!

బురదమయంగా బీటీ రోడ్లు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బీటీ రోడ్లు గ్రావెల్ మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. గ్రామీణ సడక్ యోజన కింద పదేళ్ల కిందట రూ.1.27 కోట్లతో ఏలూరు హనుమాన్‌నగర్ నుంచి బూరాయగూడెం వరకు తమ్మిలేరు గట్టు వెంబడి బీటీ, సీసీ రహదారులు నిర్మించారు. రెండేళ్ల క్రితం తమ్మిలేరు రక్షణ గోడ పనులు చేపట్టారు. ఆ సమయంలో యంత్రాలతో మట్టి తవ్వి లారీలతో తరలించారు. ఆ సమయంలో రహదారి కొంత మేర ఛిద్రమైంది. గత వైకాపా ప్రభుత్వం రోడ్డు నిర్వహణను గాలికి వదిలేయడంతో.. మోకాలు లోతున వాహనాలు దిగబడిపోయి ప్రజలు రాకపోకలకు నరకయాతన అనుభవించారు.

చినుకు పడితే చిత్తడే.. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గ్రావెల్‌తో రహదారి పనులు చేపట్టింది. బీటీ రోడ్డు కాస్త మట్టి రహదారిగా తయారైంది. ఫలితంగా చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఈ మార్గంలో పెదపాడు మండలంలోని గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కొత్త బస్టాండ్, మినీ బైపాస్‌కు వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడంతో నిత్యం జనంతో రద్దీగా ఉంటోంది. బురదగా మారిన రోడ్డులో రాకపోకలకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జర్రున జారి ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి అనుసంధాన రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. 'రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం' అని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెదవేగి, న్యూస్‌టుడే: విజయరాయి విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

దాతల సహకారం ఎనలేనిది

భీమడోలు, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమానికి దాతల సహకారం ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో.. మంతెన సూర్యనారాయణ ఆర్థిక సాయంతో 66 మంది దివ్యాంగులకు గురువారం బియ్యం, పోషకాహారం అందజేశారు. రామిశెట్టి సుబ్బాయమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు, శ్రీసత్య సాయిబాబా ట్రస్ట్ సమకూర్చిన రెండు చక్రాల కుర్చీలను ఇద్దరికి అందజేశారు

కాలువలోకి దిగొద్దు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం కుడి కాలువకు నీరు విడుదల చేశారని ఇన్‌ఛార్జి తహసీల్దారు వై.పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు కాలువలోకి దిగొద్దని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

డెంగీపై జాగ్రత్తలు అవసరం

భీమడోలు, న్యూస్‌టుడే: డెంగీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సబ్ యూనిట్ అధికారి గోవిందరావు అన్నారు. కురెళ్లగూడెంలో గురువారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి అరుణ జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో

ఐ.పి.నెం. 17/2025

Between:

1) కటకం వీర వెంకట దుర్గా భాను రాజేష్
2) కటకం ప్రశాంతి - పిటీషనర్లు/డెబిటర్స్

మరియు

1) పి.ఎస్.శ్రీనివాస్, 2) తన్నీరు మున్నయ్య (బుజ్జి), 3) కొనకళ్ళ శోభన్, 4) ఉప్పు సత్య సన్యాసలింగం, 5) ఉప్పు బసవరాజు, 6) ది అఫీషియల్ రిసీవర్, ఏలూరు - రెస్పాండెంట్లు/ క్రెడిటర్స్

పై ఐ.పి. పిటీషన్‌ను పిటీషనర్లు/ డెబిటర్లును ఇన్‌సాల్వెంట్స్‌గా డిక్లేర్ చేయమని రెస్పాండెంట్లు/ క్రెడిటర్స్ పై దాఖలు చేసినారు. సదరు ఐ.పి. పిటీషన్ విషయమై ఇంకనూ ఇతరులెవ్వరికైననూ ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ది. 17-07-2025వ తేదీన ఉ.10.30లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినదిగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రచురణ

సం/- **ఆచంట వెంకటేశ్వరరావు**
సబ్బారపు చెన్నకేశవరావు
అడ్వకేట్స్, ఆర్.ఆర్. పేట, ఏలూరు
సెల్: 98491 92411

(c) eenadu

పోలవరం

•పోలవరం • చింతలపూడి

నిత్యావసర సరకులు అందుబాటులో ఉంచుకోవాలి: డీఎస్‌వో

మాట్లాడుతున్న విలియమ్స్

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరి వరద ముంపునకు గురయ్యే గ్రామాల్లో నిత్యావసర వస్తువులను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విలియమ్స్ అన్నారు. ఈ మేరకు గురువారం వేలేరుపాడులో రేషన్ దుకాణాల డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

లక్కవరం స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని డీఎస్పీ రవిచంద్ర అన్నారు. గురువారం మండలంలోని లక్కవరం పోలీస్‌స్టేషన్‌ను సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఎస్సై శశాంకను ఆదేశించారు. పలు రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న రవిచంద్ర

సన్న బియ్యం అన్నం.. తృప్తిగా తింటున్నాం..!

మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల హర్షం

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు
చింతలపూడి	281	17,693
పోలవరం	440	18,274

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం తినేందుకు సగం మందిపైగా విద్యార్థులు ఆసక్తి చూపేవారు కాదు. కూరలు బాగున్నా.. అన్నం ముద్దగా ఉందనో, వాసన వస్తుందనో తినడానికి ఇష్టపడేవారు కాదు. చాలామంది ఇంటినుంచే బాక్సులు తెచ్చుకుని పాఠశాలల్లో భుజించే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని పాఠశాలల్లో సన్న బియ్యంతో అన్నం వడ్డిస్తుండటంతో విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. సన్న బియ్యం అన్నంతో, పోషక విలువలతో కూడిన కూరలతో కడుపునిండా తింటున్నామంటూ విద్యార్థులు చెబుతున్నారు.

భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

ఇంటి భోజనం వద్దని ఇక్కడే..

పాఠశాలలో వడ్డించే అన్నం ముద్దగా ఉండటంతో తినలేకపోయేవాళ్లం. దీంతో ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని పాఠశాలలో కూరలు మాత్రమే తినేవాళ్లం. ప్రస్తుతం సన్న బియ్యంతో అన్నం వడ్డిస్తుండటంతో ఇక్కడే భోజనం చేస్తున్నాం. **- కుమార్, సంతోష్, రాజేశ్ నాయుడు, ప్రణీత్‌కుమార్**

అయిష్టంగా తినేవాళ్లం

ఇంతకు ముందు పాఠశాలలో వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని అయిష్టంగా తినేవాళ్లం. ప్రస్తుతం సన్నబియ్యంతో అన్నం వడ్డిస్తుండటంతో భోజనం రుచిగా ఉంటుంది. కూరలు రుచిగా వండుతున్నారు. దీంతో ఇష్టంగా తింటున్నాం. **- నాగు, చంటి, 8వ తరగతి**

ఇంటి నుంచి తెచ్చుకునే వాళ్లం

గతంలో మధ్యాహ్న భోజనం రుచిగా వండకపోవడంతో ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునే వాళ్లం. దూర ప్రాంతం నుంచి రావడంతో ఒక్కోరోజు ఇంటివద్ద భోజనం సిద్ధం అవకపోతే పస్తులు ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. భోజనం చాలా రుచిగా ఉంటుంది. **- భావన, సత్య, తొమ్మిదో తరగతి**

ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం..

ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. సన్నబియ్యంతో అన్నం, పోషకాలతో రుచికరమైన కూరలతో వడ్డిస్తుండటంతో పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. **- వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి**

నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. కేఆర్‌పురంలో గిరిజన సహకార సంస్థ, పౌర సరఫరాల శాఖ కార్మికుల సంఘం కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను విరమించాలని ప్రచురించిన కరపత్రాలను చూపుతూ నినాదాలు చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కన్నాయగూడెంలో నిర్మిస్తున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి, ఏకలింగేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ నిర్మాణానికి కొయ్యలగూడెంకు చెందిన రామ్‌దేవ్ ఫైబర్ స్టోర్స్ నిర్వాహకులు రూ.51వేలు, మాలి భవర్‌లాల్ రూ.41వేలు, మంతెన సోమరాజు, గొరిశెట్టి వాసు రూ.5వేల వంతున విరాళాలను అందజేసినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

నగదు అందజేస్తున్న దాతలు

కొనసాగిన సమ్మె

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పురపాలక ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నాలుగో రోజైన గురువారం కొనసాగింది. ఇంజినీరింగ్ విభాగ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విధులు బహిష్కరించి పురపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నారు. వీరి సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బి.వెస్లీ మద్దతు పలికారు. సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రావు, నాయకులు నిమ్మల సుబ్బారావు, దోసూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం వెంకటేశ్వర సంతాన గోపాల జగన్నాథ స్వామి ఆలయంలో జగన్నాథ రథోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి గురువారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలలో ఇలా విశేష అలంకారంలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించి తరించారు.

మహిళా సర్పంచుల శిక్షణ ప్రారంభం

మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీహరి

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: సర్పంచుల విధి విధానాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామాలను సుందరీకరించాలని జడ్పీ సీఈవో శ్రీహరి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 'మార్పు ద్వారా విజేతలు- మహిళా సాధికారతతో సుపరిపాలన సాధ్యం' అనే అంశంపై డివిజన్‌లోని 10 మండలాలకు చెందిన 90 మంది మహిళా సర్పంచులకు మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టాల అమలు, విధులపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎంపీడీవోలు కేఆర్ఎస్‌కే ప్రసాద్, శ్రీలత, కె.శ్రీనివాస రెడ్డి, సీహెచ్. ఆశా అలేఖ్య, టి.ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. రాజుపాలెంలో గురువారం నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అంతర్వేదిగూడెంలో ట్రైకార్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు నేతృత్వంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని మంగపతిదేవిపేటలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ గురువారం ప్రారంభించారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ప్రచారం: ఎమ్మెల్యే

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: పోలవరం నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాదిలో అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూ పనిచేసుకుంటూ వెళుతుంటే, అది చూసి జీర్ణించుకోలేక కొంతమంది వ్యక్తులు, నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో అసంతృప్తి రావాలని, అధిష్ఠానంలో చెడ్డపేరు తీసుకురావాలని ఇలా చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓ వెబ్‌సైటు ఆంగ్ల దినపత్రికలో తప్పుడు కథనాలు ప్రచురించిన పాదం మూర్తినాయుడిని రెండు రోజుల కిందట అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. మీడియా అంటే తమకు చాలా గౌరవమని, సమస్యలపై వచ్చే వార్తలపై స్పందించి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న బాలరాజు

జీలుగుమిల్లి(బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. బర్రింకలపాడులో తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేను పలువురు కలిశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి, తక్షణ పరిష్కారానికి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నియోజకవర్గంలో 300 వినతులు రాగా, 270కు పైగా పరిష్కరించినట్లు వివరించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు: జడ్పీ సీఈవో

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ అవసరమని జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బయ్యనగూడెం, సీతంపేట పంచాయతీల్లో గురువారం ఆయన పర్యటించారు. వీధుల్లో పేరుకుపోతున్న చెత్తను తరలించే విధానంపై సిబ్బందిని ప్రశ్నించారు. సంపద కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. బయ్యనగూడెంలో చెత్తను తరలించడానికి అదనంగా రిక్షాలు అవసరమవుతాయని సిబ్బంది కోరగా.. జిల్లా పంచాయతీ అధికారిని చరవాణిలో సంప్రదించి అందుకు అనుమతించారు. రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసే విధానంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. ఆయన వెంట ఎంపీడీవో కె.కిరణ్ కుమార్, సర్పంచి అనంతలక్ష్మి, కూటమి నాయకులు తదితరులు ఉన్నారు. అనంతరం సీఈవో గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు.

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో శ్రీహరి అన్నారు. గురువారం పట్టెన్నపాలెంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరించే విధానాన్ని ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఇళ్ల నుంచి పొడి, తడి చెత్త వేరు చేసి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలన్నారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేవు పాట మళ్లీ వాయిదా

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం, పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు పాట మళ్లీ వాయిదా పడింది. 2025-26 సంవత్సరానికి జాయింట్ కౌన్సిల్ సభ్యులు రాని కారణంగా ఇటీవల శుక్రవారానికి వాయిదా పడిన పాటను తిరిగి ఈ నెల 14న పోలవరం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాసబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్తు స్తంభం అమరిక

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ఆ శాఖ అధికారులు దృష్టి సారించారు. 'కరెంట్ పోని రోజే లేదు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఈఈ పీఆర్ అహ్మద్‌ఖాన్ స్పందించారు. పట్టణంలో విద్యుత్తు కోతలు అధికం కావడంతో పాటు పలు సమస్యలను ఈ కథనం ద్వారా వెలుగులోకి తేవడంతో వాటిని పరిష్కరిస్తున్నారు. ఇందులో భాగంగా ఉప్పలమెట్టలో ప్రమాదకరంగా ఉన్న స్తంభం, విద్యుత్తు లైన్లను గురువారం తొలగించారు. కొత్త స్తంభం అమర్చి, విద్యుత్తు లైన్లను సరిచేశారు.

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

తమ గ్రామం ఏ కాంటూరులో ఉందో చెప్పాలని ఆందోళన

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ముందుగానే గోదావరి వరద ముంపునకు గురయ్యే తమ గ్రామం ఏ కాంటూరులో ఉందో స్పష్టత ఇవ్వాలని తాట్కూరుగొమ్ము కాలనీవాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం ఉండట్లేదని వాపోయారు. అనంతరం తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

అధ్వాన దారితో అవస్థలు

కన్నాపురం- పులిరామునుగూడెం మార్గంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ తవ్విన ప్రదేశంలో రహదారి బురదమయమైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా ఇక్కడ బురద పేరుకుపోయి దాటి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లోని అనేక మారుమూల గ్రామాలకు ఇది ప్రధాన రహదారి. నిత్యం ఆ గ్రామాల వారితో పాటు పలువురు ఉద్యోగులు ఈ మార్గంలో వెళ్తారు. ఇది దాటి వెళ్తూ జారి పడిపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ వంతెన నిర్మించాల్సి ఉందని, ఆ పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చింతలపూడి ఎత్తిపోతల పథకం డీఈ శ్రీనివాసరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, బుట్టాయగూడెం**

బురదతో ప్రమాదకరంగా రహదారి

పాఠశాల చెంత.. అపరిశుభ్రతతో చింత!

స్థానిక సంతపాకల పాఠశాల సమీపంలో పారిశుద్ధ్యం అధ్వానంగా దర్శనమిస్తోంది. మురుగు కాలువలో చెత్తాచెదారం పడి వాడుక నీరు పారడం లేదు. పాఠశాల ఎదురుగా భారీ గోతుల్లో వర్షపు నీరు నిలిచి పాదచారులు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. ఫలితంగా దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కామవరపుకోట**

అడ్డుగా పోసి.. ఇబ్బంది పెట్టి

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: రామవరం పంచాయతీలోని ఇప్పలగుంపులో నివాసాల్లోకి పంట కాలువ నీరు రావడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. నూతన మంచినీటి ట్యాంకు నిర్మాణం కోసం పూడిక తీసిన మట్టిని పంట కాలువకు అడ్డుగా పోశారు. దీంతో కాలువకు వెళ్లే నీరంతా ఇళ్ల మధ్యలోకి చేరుతోంది. గుత్తేదారుకు చెప్పినా పట్టించుకోవట్లేదని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు

విద్యుత్తు సరఫరా నిలిపివేత

చింతలపూడి, టి.నరసాపురం, కామవరపుకోట, న్యూస్‌టుడే: మరమ్మతుల నిమిత్తం పలు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. సీతానగరం, లింగపాలెం, రేచర్ల, రాఘవాపురం, టి.నరసాపురం, మక్కినవారిగూడెం, తిరుమలదేవిపేట ఉపకేంద్రాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, కళ్లచెర్వు, సాగిపాడు ఉపకేంద్రాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. చింతలపూడి టౌన్ ఫీడర్‌లో కొవ్వూరుగూడెం, బోయగూడెం, పాతచింతలపూడి, సమ్మెటవారిగూడెం తదితర వార్డులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం విద్యుత్తు ఉపకేంద్రంలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7.30 నుంచి పది గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని పోలవరం, రామయ్యపేట, కృష్ణారావుపేట, గూటాల, పట్టిసీమ ఇటుకలకోట గ్రామాల పరిధిలోని సరఫరా ఉండదన్నారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని బైనేరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో చెట్ల కొమ్మల తొలగించేందుకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కొవ్వూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, ఇంద్రజిత్ నగర్, పాత పంచాయతీ కార్యాలయ ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన కెవెస్ రెడ్డి నారాయణ, ఎస్‌కె బాజీ ద్విచక్రవాహనంపై ద్వారకాతిరుమల వస్తుండగా.. స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్దకు వచ్చేసరికి గోతుల్లో పడి ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేయించుకున్నారు.

సారా స్థావరాలపై దాడి

కుక్కునూరు, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలంలోని సారా స్థావరాలపై జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడుల్లో వెంకటాపురం పెదవాగు సమీపంలోని స్థావరాలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో 250 లీటర్ల బెల్లపు ఊట, 10 లీటర్ల సారా పట్టుబడినట్లు ఎక్సైజ్ వెంకటలక్ష్మి వివరించారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బేకరీ ధ్వంసంపై ఫిర్యాదు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: కోవా, బేకరీ దుకాణాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన కొప్పిడి దుర్గావరప్రసాద్, కేశిరెడ్డి రాఘవ, ఏలూరుకు చెందిన డి.ఎన్.వి.తేజేశ్వరరావు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొప్పినీడి దుర్గావరప్రసాద్ మండలంలోని గుణ్ణంపల్లిలో జాతీయ రహదారి పక్కన కోవా, బేకరీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన రాము, లవ్‌కుమార్ మద్యం తాగి దుకాణం వద్దకు వచ్చి రెండు బన్‌లు అడిగారు. ఒకటి ఇచ్చి మరొకటి ఇస్తుండగా.. రెండు అడిగితే ఒకటి ఇచ్చావేంటని దుర్గావరప్రసాద్‌తో ఘర్షణకు దిగారు. అనంతరం వారి అనుచరులైన భీమడోలు మండలం కురెళ్లగూడేనికి చెందిన బాబి, నల్లజర్ల ఘంటావారిగూడేనికి చెందిన అంజి, నానికి ఫోన్ చేసి పిలిచారు. ఐదుగురు కలిసి దుకాణాన్ని ధ్వంసం చేసి.. దుర్గావరప్రసాద్‌ను కొట్టడానికి ప్రయత్నించగా.. అడ్డు వచ్చిన కేశిరెడ్డి రాఘవ, స్థానిక రెస్టారెంట్ యజమాని డి.ఎన్.వి.తేజేశ్వరరావులపై దాడి చేసి కొట్టారు. తేజేశ్వరరావు మెడలో బంగారు గొలుసును లాగేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన రాఘవ, తేజేశ్వరరావులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆందోళన చేస్తున్న రైతులు, డిపాజిటు దారులు

డిపాజిట్లు చెల్లించాలని డిమాండ్

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కాల పరిమితి పూర్తైన డిపాజిట్ల నగదు వెంటనే చెల్లించాలంటూ టి.నరసాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద రైతులు, డిపాజిటుదారులు గురువారం ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సహకార సంఘంలో సుమారు 370 మంది డిపాజిటు దారులు రూ.34కోట్లు నగదు డిపాజిటు చేశారన్నారు. పీఏసీఎస్‌లో అక్రమాలు బయటపడిన అనంతరం కొంతమంది డిపాజిటు దారులకు సుమారు రూ.17కోట్ల డిపాజిటు నగదు చెల్లించారని, మిగిలిన వారికి కాల పరిమితి పూర్తైనా నేటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిపాజిట్లు చెల్లించకపోతే రెన్యువల్ చేయాలని లేదా రైతుల రుణాలకు తమ నగదు జమ చేయాలని విన్నవించినా.. పీఏసీఎస్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల కూడా కొందరి ఎస్బీ ఖాతా నుంచి నగదు రైతు రుణాలకు జమ చేసిన అధికారులు తమ డిపాజిట్ల విషయంలో పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. తమకు సమాధానం చెప్పే వరకు విధులు నిలిపి వేయాలని సిబ్బందిని బయటకు పంపి, గేట్లు వేశారు. ఈవిషయమై పీఏసీఎస్ కార్యదర్శి ఆగస్టిన్ మాట్లాడుతూ.. రైతులు పీఏసీఎస్‌కు చెల్లించాల్సిన నగదు చెల్లించడం లేదని, ఆ నగదు చెల్లిస్తేనే డిపాజిటు దారులకు ఇవ్వాలని, అధికారులు సూచించారని ఆయన తెలిపారు.

పౌర సేవలు అందించడంలో అలసత్వం

కామవరపుకోటలో పనిచేసిన పలువురు అధికారులపై అభియోగాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కామవరపుకోట తహసీల్దారు కార్యాలయంలో విధి నిర్వహణలో, పౌర సేవలు అందించడంలో అలసత్వానికి సంబంధించి పలువురు రెవెన్యూ అధికారులపై అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. కామవరపుకోటలో గతంలో పనిచేసిన అధికారులపై ఈ అభియోగాలు నమోదు చేశారు. వీరిలో అప్పటి తహసీల్దారు జీవీవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు పుట్టి మాధవి, కామవరపుకోట 1 వీఆర్వో కంకిపాటి నాగేశ్వరరావు, తడికలపూడి వీఆర్వో కేవీవీ సారథి, సర్వేయర్ నెల్లి విజయరాజు, ఆర్ఐ పెరవలి మానస, సీనియర్ అసిస్టెంట్ జీకే శ్రీనివాస్‌లపై అభియోగాలు నమోదు చేశారు. వీరందరూ ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మాకు ఎటువంటి సమాచారం లేదని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయ ఏవో శేఖర్‌బాబు తెలిపారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి వినతి

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాహణాధికారి అభిషేక్‌కు ధవళేశ్వరంలో తెదేపా నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. తాట్కూరుగొమ్ము కాలనీ, ఎర్రబోరు, నడిమిగొమ్ము తదితర గ్రామాలను 41 కాంటూరులో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్, శ్రీకాంత్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలవరం పునరావాసంలో అనేక మంది అర్హుల పేర్లు గల్లంతయ్యాయని, సమగ్ర విచారణ జరిపి, అర్హుల పేర్లు జాబితాలో చేర్చాలని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్‌కు కుక్కునూరు మండల తెదేపా నాయకులు కోరారు. గురువారం ధవళేశ్వరంలోని ఆయన కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 2017లో సర్వే చేసినప్పుడు అర్హులందరి పేర్లు నమోదయ్యాయని, తర్వాత వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు చేయడంతో కొన్ని పేర్లు తొలగించారని వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు చుంచు సత్యనారాయణ, గుర్రం ఉదయ్, నరుకుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల నియామకం కార్యకర్తలకు గర్వకారణం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా కొయ్యలగూడేనికి చెందిన బొల్లిన నిర్మలకిశోర్ నియమితురాలు కావడం మండలంలోని పార్టీ కార్యకర్తలకు గర్వకారణమని పార్టీ మండలాధ్యక్షుడు గొలిశెట్టి వాసు అన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు నాయకులు గురువారం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో నాగు, కృష్ణారావు, సత్యనారాయణ, మంజునాథ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

ఎక్కడ పనిచేసినా మంచి సేవలందించాలి: సీఐ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఎక్కడ పనిచేసినా ప్రజలతో మమేకమై మంచి సేవలందించాలని భీమడోలు సీఐ విల్సన్ అన్నారు. భీమడోలు సర్కిల్ పరిధిలో బదిలీ అయిన 9 మంది పోలీసులకు ద్వారకాతిరుమలలో ఆత్మీయ వీడ్కోలు సభ గురువారం జరిగింది. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, భీమడోలు ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో బదిలీ అయిన పోలీసులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ద్వారకాతిరుమల, భీమడోలు పోలీస్‌స్టేషన్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి ధర్నాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం శుక్ర, శనివారాల్లో డిపో వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆందోళనలు చేయనున్నట్లు వివరించారు.

ఆర్థికసాయం అందజేత

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సంస్థ తరఫున దెయ్యాల నూకరాజు కుటుంబ సభ్యులకు రూ.10,500 ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేసినట్లు అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ తెలిపారు. నూకరాజు అనారోగ్యంతో గురువారం మృతి చెందారన్నారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి సహాయం అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా క్రైస్తవ దినోత్సవం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలోని సియోను ప్రార్థన మందిరంలో గురువారం క్రైస్తవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సేవకులు మాట్లాడుతూ.. అందరం ఐక్యత కలిగి ఉండాలని, ఎటువంటి బేధాభిప్రాయాలు లేకుండా సువార్త పరిచర్య చేసుకోవాలని దైవజనులు జయరాజు అన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: జాతీయ ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుళ్లపూడిలో భారత క్రైస్తవ దినోత్సవం (ఏసు భక్తి దివాస్)ను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చర్చిలో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు జి.పిలిప్, సలహాదారు ఎం.జోసఫ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.పీటర్, రాష్ట్ర కోశాధికారి కె.సియోనుకుమార్, పలువురు పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలం, కన్నాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంనకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన భూమి సేద్యము చేసుకొను కౌలు హక్కునకు ఈ దిగువ తెలిపిన ప్రకారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున ఆసక్తికలవారు ఈ దిగువ తెలిపిన విధముగా ధరావతులు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ.నెం.	దేవస్థానం పేరు గ్రామము	భూమియున్న గ్రామం	సర్వే నెంబర్	విస్తీర్ణం య.సెం.	భూమి స్వభావం	ధరావతు సొమ్ము	లీజు కాలపరిమితి	బహిరంగ వేలంపాట నిర్వహించు ప్రదేశం, తేదీ మరియు సమయం
1	శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం కన్నాపురం	దిప్పకాయలపాడు గ్రామం కొయ్యలగూడెం మండలం	104/1	3.75	మెట్ట	రూ. 15,000/-	2025-26 నుండి 2027-28 వరకు (3 సం.రం.లు)	ది. 10-07-2025 ఉదయం గం. 10.00ల నుండి శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, కన్నాపురం గ్రామం

పాట షరతులు మరియు ఇతర వివరములకు శ్రీ స్వామి వారి దేవస్థాన కార్యాలయం పనివేళలలో సంప్రదించవలెను.

కొయ్యలగూడెం, తేది: 03-07-2025 సం/- కార్యనిర్వహణాధికారిణి, సెల్: 79935 11656

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

డెంగీపై ఆందోళన వద్దు.. అప్రమత్తతే ముద్దు

ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: డెంగీతో ఆందోళన వద్దని, అప్రమత్తత, అవగాహనతో నివారించవచ్చని సబ్ యూనిట్ అధికారి ఎం.చలమంద, ప్రభుత్వ వైద్యాధికారి డా.జగన్మోహనరావు తెలిపారు. ఆగిరిపల్లి ప్రధాన కూడలిలో గురువారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తాజా ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి చవటపల్లి లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	కైకలూరు	:73060 88555
ముసునూరు	:93983 81268	కలిదిండి	:90594 84862

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ? ఆగిరిపల్లి ప్రధాన రహదారిలో మురుగు నీరు పోకుండా ఇబ్బందులు పడుతున్నాం. పలు మార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా స్పందించడం లేదు. **- మానేపల్లి జగదీశ్వరరావు, ఆగిరిపల్లి**

✔ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తా. **- బి.ఆనంద్‌బాబు, ఈవోపీఆర్డీ**

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ? ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద ఆకతాయిల ఆగడాలు విపరీతంగా పెరిగాయి. ఆ ప్రదేశమంతా మద్యం సీసాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతున్నాయి. **- అశోక్‌చౌదరి, ముదినేపల్లి**

✔ వెంటనే సిబ్బందిని పంపి వాటిని తొలగిస్తాం. అలాగే అక్కడ మద్యం తాగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. **- రమేశ్, పంచాయతీ కార్యదర్శి**

శోభాయమానంగా జగన్నాథుడి రథయాత్ర

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర శోభాయమానంగా సాగింది. ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఛైర్మన్ డా.రావి వెంకటరావు యాత్రను ప్రారంభించారు. అక్కడ నుంచి నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారిలో వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు రథయాత్ర కొనసాగింది. విద్యార్థులు, హరి భక్తులు హరినామ స్మరణలతో రథాన్ని లాగారు. భరత నాట్యం, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఎస్సై కె.శుభశేఖర్ బందోబస్తు నిర్వహించారు.

వారాహి మాతకు విశేష పూజలు

మండవల్లి, న్యూస్‌టుడే: వారాహి మాత వారోత్సవాలను పురస్కరించుకుని మండవల్లి లోని నాగేంద్రస్వామి వారి ఆలయ క్షేత్రంలో కొలువైన విజయ దుర్గ మాతకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో గురువారం అమ్మవారిని వారాహి మాతగా అలంకరించి పలు అభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్ర నామార్చన, ధూప సేవ తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రైవేటులో ఫీజులుం
తల్లిదండ్రుల జేబులకు చిల్లు

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలో విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకే పరిమితమైంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ, సొంతంగా పాఠ్య పుస్తకాల విక్రయాలు, బోధనా తీరుపై ఎలాంటి నియంత్రణ లేదు. నియోజకవర్గంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అనుమతుల్లేకుండా సొంత సిలబస్‌తో కూడిన పాఠ్య, నోటు పుస్తకాలు విక్రయిస్తున్నాయి. దీనిలో బయట మార్కెట్‌లో లభించేవాటికి ధరల్లోనూ భారీ వ్యత్యాసం ఉంటుంది. ఈ ఏడాది బోధనా ఫీజులను ఇష్టారీతిన పెంచేశారు.

ఆగిరిపల్లికి చెందిన ఓ వ్యక్తి తన కుమారుడిని నూజివీడులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. 9వ తరగతి ఐఐటీ ఫౌండేషన్‌కు రూ.80 వేలు, పుస్తకాలకు రూ.20వేలు, పాఠశాల బస్సుకు రూ.20 వేలు కలిపి మొత్తంగా ఒక సంవత్సరానికి రూ.1.20 లక్షలు చెల్లించాలని చెప్పారు.

నూజివీడుకు చెందిన ఓ వ్యక్తి తన కుమార్తెను ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీలో చేర్పించారు. అకడమిక్ ఫీజు రూ.25 వేలు, పుస్తకాలకు రూ.5 వేలు మొత్తంగా ఏడాదికి రూ.30 వేలు చెల్లించాలని చెప్పారు.

విద్యాశాఖ ఉదాసీనత..

☛ నియోజకవర్గంలో 69 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేవు. చాలా చోట్ల క్రీడా మైదానాల్లేవు. కొన్ని అగ్నిప్రమాదాల నివారణ నిబంధనలు పాటించడం లేదు.

☛ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఆకాశన్నంటుతున్నాయి. టెక్నో, ఐఐటీ ఫౌండేషన్ పేరుతో అదనపు పాఠ్యాంశాలు జోడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వీటి నియంత్రణ లేకపోవడంతో రుసుములు పెంచుకుంటూ పోతున్నారు. తమ పిల్లలు కార్పొరేట్ స్థాయి విద్యతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశ పడుతున్న వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి.

☛ ఫౌండేషన్ కోర్సుల పేరుతో ప్రత్యేక సిలబస్ అందిస్తున్నారు. దీని స్థానంలో స్టేట్ సిలబస్‌ను పాఠ్యాంశాల పీరియడ్స్ కుదిస్తున్నారు. దీంతో తెలుగు, హిందీ, ఆంగ్లంపై విద్యార్థులు పట్టుకోల్పోతున్నారు. విద్యాశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి.

నియోజకవర్గంలో ప్రైవేటు బడుల వివరాలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
నూజివీడు	38	12,556
ఆగిరిపల్లి	18	3,735
ముసునూరు	07	2,203
చాట్రాయి	06	1,175

చర్యలు తప్పవు..

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ చేశాం. **- కె.ఆనంద్‌కుమార్, ఎస్.జమలయ్య, ఎంఈవోలు**

గాలొచ్చినా.. చినుకొచ్చినా కోత!
మండల కేంద్రంలో తప్పని విద్యుత్తు కష్టాలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో విద్యుత్తు సరఫరాలో జరుగుతున్న అంతరాయంలో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల కూడలి నుంచి చొప్పరమెట్ల వైపు అధికారులు ఎడాపెడా కోతలు విధిస్తూ అవస్థలకు గురి చేస్తున్నారు. రోజూ గంట నుంచి రెండు గంటల సేపు ఏదో రూపంలో సరఫరా జరగడం లేదు. గాలొచ్చినా, చినుకులు పడుతున్నా కోతలు తప్పడం లేదు. రాత్రి వేళల్లో గంటల తరబడి సరఫరా నిలిచిపోవడంతో చిన్నారులు, ముసలి వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పర్యవేక్షణ లోపం, సాంకేతిక ఇబ్బందులు పెరిగిపోయి ఈ పరిస్థితి తలెత్తుతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఏఈ రజని తెలిపారు.

దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించాలి

వీఆర్వోలకు సూచనలు ఇస్తున్న తహసీల్దారు భద్రు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఇటీవల బియ్యం కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వీఆర్వోలు వెళ్లి క్షుణ్నంగా పరిశీలించాలని నూజివీడు తహసీల్దారు భద్రు స్పష్టం చేశారు. గురువారం నూజివీడు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఇంటి స్థలం కోసం పలువురు దరఖాస్తు చేశారన్నారు. వీరిలో అర్హులెవరో విచారణ చేయాలని సూచించారు. సారథి మన వారధి కార్యక్రమంలో పలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిని పరిశీలించి అర్హులైతే సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పలు రెవెన్యూ అంశాల పైన వీఆర్వోలకు సూచించారు.

పథకాలు ప్రతి ఇంటికి చేరేలా పాలన

నూజివీడులో ప్రచారం నిర్వహిస్తున్న వెంకటస్వామి తదితరులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని 17వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ దాసరి వెంకటస్వామి, వార్డు అధ్యక్షురాలు శీలం పద్మశ్రీ, కార్యదర్శి మారగాని జగన్మోహనరావు, సీనియర్ నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం బ్రోచర్లు ఇంటింటికి అందించారు. 22వ వార్డు అధ్యక్షులు కానోళ్ల సోమేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ రామెళ్ల రంగారావులు 13వ వార్డులో అధ్యక్షుడు లాగు కుమార్‌బాబు, మహిళా అధ్యక్షురాలు గ్రంధాల లక్ష్మీ గౌరీశ్వరి, 14వ వార్డులో కొడవటి భాస్కరరావు, కార్యదర్శి యర్రంశెట్టి సాంబశివరావు, 32వ వార్డులో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు గొల్లు దుర్గాదేవి, వాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని వైకాపా అప్పుల ఊబిలోకి నెడితే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేశ్ అన్నారు. గురువారం గోపవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాన్ని ప్రతి ఇంటికి చేరువ చేసేలా చేస్తున్నామని తెదేపా ఎస్సీ విభాగ నాయకుడు నక్కా రాము తెలిపారు. సూరంపాలెం గ్రామంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండవల్లి, న్యూస్‌టుడే: వైకాపా విధ్వంస పాలనతో గాడి తప్పిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో అభివృద్ధి పథంలో నడిపిస్తోందని తెదేపా నేత గురుగుబెల్లి సత్యనారాయణ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా గురువారం పుట్ల చెరువు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, హరికృష్ణ, శ్రీకాంత్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పేదల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాటుగా సుపరిపాలన అందించిందని నూజివీడు నియోజకవర్గ తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తోటపల్లిలో ఆయన ఇంటింటికి వెళ్లి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి అభినందనలు

వినయ్‌కుమార్

కలిదిండి, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా నీట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన కలిదిండికి చెందిన శెట్టిపల్లి నాగేశ్వరరావు, శైలజ దంపతుల కుమారుడు వినయ్‌కుమార్‌ను గ్రామస్థులు గురువారం అభినందించారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలో 960 ర్యాంకు సాధించడం ద్వారా గ్రామానికి మంచి గుర్తింపు తీసుకొచ్చినట్లు పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ తాతయ్య సుబ్బారావు స్ఫూర్తి.. నాన్న నాగేశ్వరరావు బాటలో వైద్య వృత్తిపై ఆసక్తితో ఉన్నట్లు చెప్పారు. తనపై అభిమానం కురిపించిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏమైనా ఇబ్బందులుంటే చెప్పండి

విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న శైలజ

ముసునూరు, న్యూస్‌టుడే: సమాజంలో మహిళలను, బాలికలను లైంగికంగా వేధింపులకు గురి చేసినా, దాడులు చేసినా తక్షణమే మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. గురువారం ముసునూరు బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. అధ్యాపకుల బోధన విధానం, వసతులు గురించి అడిగి తెలుసుకుని పరిసరాలను పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులుంటే ధైర్యంగా చెప్పాలన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ, సీసీ రోడ్డు, వర్షాలు కురుస్తున్న సమయంలో భోజనశాల తడుస్తోందని ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి, ఎస్ఎంసీ సభ్యులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు, రక్షణ వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తుందన్నారు. సమస్యలు వస్తే మహిళా కమిషన్ దృష్టికి ఎలా తీసుకురావాలో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించి వారితో కలిసి భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, తహసీల్దార్ వెంకటరమణ, సీడీపీవో విజయకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ పంగిడయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మహానటుడు ఎస్వీ రంగారావు

కైకలూరు, న్యూస్‌టుడే: తెలుగు చలనచిత్ర పరిశ్రమకు వన్నె తెచ్చిన మహానటుల్లో ఎస్వీ రంగారావు ఓ పట్టుకొమ్మని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు కొనియాడారు. గురువారం రంగారావు జయంతిని ఎస్వీఆర్ కల్చరల్ ఆర్ట్స్ నియోజకవర్గ అధ్యక్షుడు చూండూరు రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కమ్మిలి మాట్లాడుతూ మాయాబజార్, నర్తనశాల చిత్రాల్లో ఆయన నటనతోనే అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినీ పరిశ్రమకు గుర్తింపు లభించిందన్నారు. కైకలూరులో ఎస్వీ రంగారావు విగ్రహ ఏర్పాటుకు నాయకులు కృషి చేయాలని అభిమానులు కోరారు. కేవీఎన్ఎం నాయుడు, మాజీ తహసీల్దార్ కమ్మిలి సుబ్బారావు, హరికృష్ణంరాజు, కేకే బాబు, భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ఆషాఢం సారె

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా అన్నవరంలోని గంగానమ్మకు భక్తులు గురువారం సారె సమర్పించారు. తొలుత మేళతాళాలతో మహిళలు ఆషాఢం సారెను ఆలయానికి తీసుకొచ్చారు. అమ్మవారికి జలాభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకుడు గుమ్మడి వెంకటరమణ, మహిళలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు

ఆలయ దారులకు మోక్షం కలిగించండి

కలిదిండి, న్యూస్‌టుడే : కోరుకొల్లులోని ఆలయాల రహదారులకు మోక్షం కలిగించాలని జనసేన నాయకుడు కేశిరెడ్డి వెంకట శ్రీరామకృష్ణ గురువారం డిమాండ్ చేశారు. గ్రామంలో పురాతన దేవాలయాలు ఉన్నాయని, ఏడాదికి 50 రకాల పండుగలు జరుగుతాయని చెప్పారు. గుడికి వెళ్లే రోడ్లు ధ్వంసం కావడంతో భక్తులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. వీటిని బాగు చేయించడానికి పాలకులు, అధికారులు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. సోమేశ్వరాలయం, సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయాలకు వెళ్లే మార్గాల్లో వెంటనే నూతన రహదారులు నిర్మించాలన్నారు. దీనిపై భక్తులతో కలిసి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు పరిస్థితిని వివరిస్తామన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	తమ్ముడు
సత్యనారాయణ మినీ	---------
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	జురాసిక్ వరల్డ్ రీబర్త్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	కుబేర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	కన్నప్ప
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	ఓదెల 2
కైకలూరు: విజయలక్ష్మి జీ3	కన్నప్ప
మాగంటి సినిమాస్	మారన్
శ్రీవెంకటరమణ సినిమాస్	కుబేర
ముదినేపల్లి: పూర్ణిమ	కుబేర

నీటి తీరువా వసూలులో 'టాప్'

వీఆర్వో గంగాధరరావును సత్కరిస్తున్న రామకృష్ణ, శ్యామల

తాడినాడ (కలిదిండి), న్యూస్‌టుడే : నీటి తీరువా వసూలులో తాడినాడ - చినతాడినాడ వీఆర్వో గుమ్మడి గంగాధరరావు నిర్ణీత సమయంలో ఉమ్మడి జిల్లాలోనే అధిక వసూలు చేసినట్లు తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గంగాధరరావుతో పాటు తొలి ఐదు స్థానాల్లో నిలిచిన గుడిపాటి శేష శ్రీనివాసరావు, ఈదా సునీల్, జె.జయరాజు, పి.పమిడేశ్వరరావును రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. తాడినాడ, చినతాడినాడకు సంబంధించి నీటి తీరువా 1434 ఫసలీ పాత బకాయిలు, కొత్తవి కలిపి రూ.59 లక్షలు ఉండగా గంగాధరరావు 30 రోజుల్లో 38.50 లక్షలు వసూలు చేశారన్నారు. జూన్ 30న ఒక్క రోజులో రూ.10.05 లక్షలు రాబట్టినట్లు తహసీల్దారు వివరించారు. వీఆర్వో గంగాధరరావు మాట్లాడుతూ తాడినాడ - చినతాడినాడ రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజం గుర్తించేలా ఎదగాలి

ముసునూరు, న్యూస్‌టుడే: దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు నాగబాబు అన్నారు. ముసునూరు మండలం గుడిపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు మారుమూల గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు వచ్చి చదువుకునే 60 మందికి దాత రాయంకుల రామారావు రూ.60 వేలతో ఏడాది పాటు ఉచితంగా బస్ పాసులను ఇప్పించారు. వాటిని గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి సమాజం గుర్తించేలా ఎదగాలన్నారు. బాగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

బస్ పాసులు అందిస్తున్న రామారావు

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీపీవో

చెత్త సేకరణ పరిశీలిస్తున్న అనురాధ

ముసునూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేసి సంపద సృష్టించుకోవాలని డీపీవో కె.అనురాధ అన్నారు. గురువారం ముసునూరు మండలం గోపవరం, ముసునూరు గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి, సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులు వేర్వేరుగా సేకరిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాలభివృద్ధికి వినియోగించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సుకుమార్ పాల్గొన్నారు.

బూరుగుగూడెంలో పిచ్చి కుక్క స్వైర విహారం
● ఎనిమిది మందికి గాయాలు ● బాలుడి పరిస్థితి విషమం

చాట్రాయి, న్యూస్‌టుడే: బూరుగుగూడెంలో బుధవారం అర్ధ రాత్రి సమయంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఎనిమిది మందిని గాయపరిచింది. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దళితవాడలో రాత్రి సమయంలో కనిపించిన వారిపై దాడికి దిగింది. కారుమంచి బాబూరావు, గడ్డం తిరుపతిరావులను రహదారిపై గాయపరచగా.. ఇంటిలో నిద్రిస్తున్న పరకాల ఏసుపై దాడి చేయగా గట్టిగా కేకలు వేయగా కుమారుడు సంజయ్ అడ్డుకునే యత్నం చేశాడు. ఇద్దరినీ గాయపరిచింది. స్థానికులు వెంబడించగా పరిగెడుతూ మరో ముగ్గురి కరిచింది. వీరందరూ చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం వెళ్లగా గాయాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నూజివీడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాయంత్రం వరకు అక్కడే ఉన్నా సరైన రీతిలో వైద్యం అందక గాయపడిన వారు వేర్వేరు వైద్యశాలల్లో చేరారు. పరిస్థితి విషమంగా ఉన్న కోట మనోజ్(6) ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. నూజివీడు ప్రభుత్వ వైద్యశాలకు పిచ్చికుక్క బాధితులు వెళ్లినా సరైన వైద్యం అందలేదని మండల తెదేపా కార్యదర్శి తెల్లూరి శేఖర్ తెలిపారు.

బంగారు గాజులు మాయంపై కేసు

కైకలూరు, న్యూస్‌టుడే: బంగారు గాజులు మాయమైన ఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సోము సీతామహాలక్ష్మి ఆరేళ్ల కిందట భర్త చనిపోవడంతో కిరాణా దుకాణం నడుపుతూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. గతేడాది ఫిబ్రవరి 13న ఉదయం చేతికున్న రెండు బంగారు గాజులను కిరాణా దుకాణంలోని డబ్బాలో పెట్టి స్నానం చేసేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా సుమారు రూ.లక్ష విలువ చేసే గాజులు కనిపించకుండా పోయాయి. ఇటీవల ఆమె కుమారుడు ఇంటికి రావడంతో జరిగిన విషయాన్ని తెలియజేశారు. అతని సూచనతో సీతామహాలక్ష్మి గురువారం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై వి.రాంబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

51 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: బైపాస్ రోడ్డులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో 51 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పీడీఎస్ డీటీ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని బైపాస్ రహదారిలో ఏపీ 39 యూవీ 7078 వాహనంలో బియ్యం రవాణా అవుతున్నాయన్న సమాచారం మేరకు తనిఖీ చేపట్టగా రేషన్ షాపుల్లో బియ్యం లభ్యమయ్యాయన్నారు. డ్రైవర్ నక్కా శివ, రేషన్ బియ్యం సరఫరాదారులు ధనికొండ గోపీరాజు, ధనికొండ గణేశ్‌లు.. వీరికి సాయం చేస్తున్న ఖాసింబాబులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ముమ్మరంగా ఖరీఫ్
వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

చినకామనపూడిలో ట్రాక్టర్‌తో దున్నుతున్న దుక్కి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: తొలకరి మొదలైంది.. కైకలూరు నియోజకవర్గంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పులకరించిపోతున్నారు. ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. వరినారు వేయడానికి దుక్కులు దున్నుతున్నారు. మరో పక్క నారు మడులు వేయడం, వెదజల్లడం వంటి పనులు చేస్తున్నారు. ఈ సారి వరి విత్తనాలు కాస్త ఆలస్యంగా రైతు సేవా కేంద్రాలకు చేరుకోవడంతో రైతులు ఎక్కువగా ప్రైవేటు వ్యాపారులు, రైతువారీ విత్తనాలు సేకరించుకున్నారు. నియోజకవర్గంలో సుమారు 32 వేల ఎకరాల్లో వరిసాగుకు సిద్ధమవుతున్నారు. దీర్ఘకాలికంగా ఖరీఫ్‌లో వరిసాగుకు బీపీటీ 5204 రకం, ఎంటీయూ 1061 రకాలను అధికంగా ఉపయోగిస్తున్నారు. సన్న రకాలుగా పేరొందిన బీపీటీ విత్తనాలకు గత కొన్నేళ్లుగా చీడపీడల సమస్య వెంటాడుతుండటంతో ముతక రకాలుగా పిలుచుకునే ఎంటీయూ రకాలపై అన్నదాతలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగులో చీడ పీడలను తట్టుకుంటుందని భావించే 1061 సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దిగుబడులు సైతం బీపీటీ కంటే అధికంగా రావడంతో పాటు ఏ గ్రేడు రకంగా మద్దతు ధర ఇస్తుండటంతో రైతులకు ఆసక్తి పెరిగి వీటినే అధికంగా పండిస్తున్నారు.

మహిళా సాధికారతతోనే సమాజంలో మార్పు

కైకలూరు, న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే సమాజంలో మార్పు సాధ్యపడుతుందని కైకలూరు, కోడూరు ఎంపీడీవోలు ఆర్.ఫణీంద్ర, జి.సుధాప్రవీణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన మహిళా గ్రామ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగంలో పురుషులతో పాటు సమాన హక్కులు ఉన్న మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో మహిళా సర్పంచులు ప్రత్యేకతను చాటుకోవాలని సూచించారు. పరిపాలనలో అవలంబించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పాలనా కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కలిదిండి మండలంలోని ఓ గ్రామపంచాయతీకి చెందిన మహిళా సర్పంచి గత వైకాపా పాలనలో స్వతహాగా పరిపాలన చేయలేకపోయామని.. కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛగా ఉంటున్నామని తెలపడం గమనార్హం. అంతకు ముందు మహాత్ముల చిత్రపటాలకు నివాళులర్పించారు. డిప్యూటీ ఎంపీడీవోలు బి.అశోక్, ఎ.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రుచికర, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో పి.భార్గవి స్పష్టం చేశారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంఈవో కె.ఆనంద్ కుమార్‌తో కలిసి ఎంపీడీవో గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారు చేసే ప్రాంతం, ఆహార పదార్థాల నాణ్యత, ఎంత మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు, మెనూ అమలు తీరు పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతలో రాజీ లేదని, ఆహార పదార్థాలు తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పోతవరప్పాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బస్టాండ్‌లోకి రాకపోకలు బంద్
ఎన్‌హెచ్ విస్తరణ పనులతో రహదారిపైనే బస్సులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డ్రెయినేజీ నిర్మాణం కోసం గురువారం తవ్వకాలు చేపట్టారు. రెండు పొక్లెయిన్లతో తవ్వకాలు చేయడంతో బస్సులు రహదారిపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయి. అక్కడే ఆటోలు సైతం నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. డ్రెయినేజీ నిర్మాణానికి, దానిపై శ్లాబు ఏర్పాటుకు సుమారు నెల రోజులు పడుతుందని, అప్పటి వరకు బస్టాండ్‌లోకి రాకపోకలు ఉండవని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

దారిని తవ్వుతున్న పొక్లెయిన్‌లు

నిబంధనలు అమలు చేయాలి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రతి మద్యం దుకాణం వద్ద నిబంధనల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేసి వాటిని అమలు చేయాలని ఎక్సైజ్ సీఐ రమేశ్ సూచించారు. మండలంలోని పలు దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన పట్టికను ఆయన పరిశీలించారు. 21 ఏళ్లలోపు వారికి మద్యం విక్రయించకూడదని, ఒకరికి మూడు సీసాలు మించి ఇవ్వకూడదని, డ్యూటీలో ఉన్న డ్రైవర్లకు మద్యం అమ్మవద్దని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంత పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. కుక్కునూరు మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, ఆ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలన్నారు. రాయిగూడెం, ఉప్పేరు, చీరవల్లి, రామసింగారం తదితర ఆదర్శ పాఠశాలల్లో 26 మంది ఉపాధ్యాయులకు 8 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు.

సేవా దృక్పథం అవసరం

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న కమ్మిలి తదితరులు

మండవల్లి, న్యూస్‌టుడే: పేద వర్గాలకు అండగా ఉంటూ ప్రతి వ్యక్తి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని నియోజకవర్గ తెదేపా కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. గురువారం మానవత సంస్థ డైరెక్టరు తెదేపా నేత బూరుబోయిన శ్రీనివాసరావు జన్మ దినోత్సవం సందర్భంగా ఆయన సహకారంతో లోకుమూడి దత్తాశ్రమంలో మానవత, ఏబీసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 726 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. తలసీమియా వ్యాధిగ్రస్తుల చికిత్సకు 26 మంది యువకులు రక్తదానం చేశారు. కైకలూరులోని చిన్నారుల అనాథ ఆశ్రమం, తామరకొల్లు వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించి కైకలూరు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాష్ట్ర పర్యాటక, ఆర్యవైశ్య కార్పొరేషన్ల డైరెక్టర్లు కొడాలి వినోద్, పీజేఎస్ మాల్యాద్రి, మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

గుడిపాడులో గోడ పత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: చింతలపూడిలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ కోరారు. గురువారం ముసునూరు మండలం గుడిపాడులో గోడ ప్రతులను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగా సాధించిన అటవీ భూముల సాగుదారులందరికీ హక్కులు కల్పించి ప్రభుత్వ వ్యవసాయ పథకాలన్నీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కూలీలు ఈ సభకు రావాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రాయంకుల లక్ష్మణరావు, ఏడుకొండలు, అలెగ్జాండర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

భూస్వాముల సాగులోని అటవీ భూముల్లో ఎర్ర జెండాలు

చాట్రాయి, న్యూస్‌టుడే: భూస్వాముల సాగులో ఉన్న అటవీ భూముల్లో గురువారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో పది ఎకరాల్లో పేదలు ఎర్ర జెండాలను పాతి ఆక్రమించారు. జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ ముగ్గురు రైతుల సాగులో భూమి ఉండగా రెవెన్యూ, అటవీ శాఖలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అటవీ భూములను సాగు చేస్తున్నారని కచ్చితంగా తెలిసినా అటవీ, రెవెన్యూ యంత్రాంగం మౌనాన్ని పాటిస్తోందని విమర్శించారు. గతంలో పేదలు అటవీ భూముల్లోకి వెళ్తే కందకాలు తవ్వి వారిని బయటకు పంపిన అటవీశాఖ నేడు ఎందుకు ఆక్రమణల తొలగింపునకు ముందుకు రావడం లేదని పుల్లారావు ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు అబ్బదాసిరి సుందరం, తగరం తిరుపతిరావు, రేగుల రాముడు తదితరులు పాల్గొన్నారు.

చీపురుగూడెంలో ఎర్ర జెండాలతో నాయకులు, పేదలు

(c) eenadu

కాందిశీకుల భూములూ కొట్టేశారు..

సర్పవరంలో వైకాపా నేతల పాగా

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్: వైకాపా ప్రభుత్వంలో అడ్డూ అదుపు లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ భూములను చెరబట్టిన ఆ పార్టీ నేతలు కూటమి సర్కారులోనూ ఎక్కడా జోరు తగ్గడంలేదు. కాకినాడ జిల్లాలో చోటుచేసుకుంటున్న పరిణామాలే నిదర్శనం. కాకినాడ గ్రామీణ నియోజకవర్గం సర్పవరంలో సుమారు రూ.30 కోట్ల విలువైన బర్మా కాందిశీకుల సొసైటీ భూములపై నాడు కన్నేసి కొంతమేర ఆక్రమించారు. భూపత్రాలు సృష్టించి, కోర్టుల్లో కేసులు వేసి పాగా వేశారు. తాజాగా ఆ స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన పాత భవనాలను కూలగొట్టి ఆక్రమించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు స్థానికంగా కొందరు కూటమి నేతలు సహకరిస్తుండడం గమనార్హం. బర్మా యుద్ధ సమయంలో ఆ దేశం నుంచి వచ్చిన నిరాశ్రయులకు ప్రత్యేక కాలనీలు ఏర్పాటుచేశారు. వారి కోసం సర్పవరంలో పారిశ్రామిక సహకార ఉత్పాదక సంఘం ఏర్పాటు చేసి ఆరు ఎకరాలు ఇచ్చారు. ఉపాధి కోసం పట్టుగూళ్ల పెంపకం, దారాల సేకరణ, సగ్గుబియ్యం తయారీ, మరికొన్ని చిన్న యూనిట్లను ఎస్సీ కార్పొరేషన్, గ్రామీణాభివృద్ధిశాఖ, పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. క్రమేణా అవన్నీ మూతపడ్డాయి. ఖాళీగా ఉన్న ఆ భూములపై పెద్దల కన్నుపడి కొన్నేళ్లుగా కొంతమేర స్థలాలను ఆక్రమించుకున్నారు. చాలావరకు చేతులు మారాయి. వైకాపా హయాంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలపై ఆ భూములు తమవంటూ బోర్డులు రాసుకున్నారు. అక్కడ ఉపాధి పొందినవారి కుటుంబాలను.. ఇక్కడ మీకేం భూమి లేదు వెళ్లిపోండంటూ స్పష్టంచేశారు. ప్రస్తుతం పట్టు పెంపకం కోసం నిర్మించిన భవనాలను పడగొడుతున్నారు. రాత్రుళ్లు చదును చేస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వం బర్మా సొసైటీకి ఇచ్చిన ఇవి ఎలా ప్రైవేటు పరం అయ్యాయంటూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెళ్లాయి.

పట్టుగూళ్లు పరిశ్రమ భవనాన్ని పడగొట్టి చదును చేస్తున్నారిలా.

తమవేనంటూ భవనాలు పడగొట్టి..

గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కాందిశీకులకు ఇచ్చిన భూముల్లోనే సర్వే నెంబర్ 108లో ఒక ఎకరం పట్టు పరిశ్రమశాఖకు అప్పగించారు. 2009 వరకు కార్యకలాపాలు సాగినా తర్వాత మూతపడడంతో అక్కడ నిర్మించిన భవనాలు, భూమిని ఎస్సీ కార్పొరేషన్‌కు అప్పగించడానికి ప్రయత్నించినా అధికారులు పట్టించుకోలేదు. ఆక్రమణదారులు చొరబడి అవి తమవేనంటూ భవనాలను పడగొడుతున్నారు. పట్టు పరిశ్రమలశాఖ మరోసారి తమకు ఇచ్చిన భూములను సర్వేచేసి చూపిస్తే వాటిని అధికారికంగా ప్రభుత్వానికి అప్పగించేస్తామంటూ ఉన్నతాధికారులకు లేఖలు రాసి మిన్నకుంది. జిల్లా పట్టుశాఖ ఇన్‌ఛార్జి అధికారి పాలరాజు వద్ద ప్రస్తావించగా 'గతంలో మా శాఖకు సర్పవరంలో భూమి ఇచ్చారు. వాటిని కొంతమంది ఆక్రమించుకుంటున్నారని తెలిసి ఈనెల 5న సర్వేచేయిస్తున్నాం. ఆ స్థలాన్ని తిరిగి ఎస్సీ కార్పొరేషన్‌కు అప్పగించాలని నిర్ణయించాం' అని పేర్కొన్నారు.

అలంకరణ.. ఆకట్టుకునేలా..

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ పరిధిలోని గ్రామాల్లో వారాహి అమ్మవారి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈమేరకు కొవ్వూరు గ్రామంలో వారాహి అమ్మవారికి గాజులతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

వారాహి అమ్మవారు

రైల్వేలైను.. అడ్డంకులు తొలగేను

కోటిపల్లి-నర్సాపురం మధ్య పనుల ఆరంభమే తరువాయి

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, అల్లవరం: కోనసీమ వాసుల చిరకాల స్వప్నం నెరవేరే పరిస్థితి కనిపిస్తోంది. కోటిపల్లి-నర్సాపురం మధ్య రైలు కూత వినిపించేందుకు మార్గం సుగమం అయిందని రైల్వే అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు నెలకొన్న కొన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగాయని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ముందుకెళ్లడమే తరువాయని స్పష్టం చేస్తున్నారు. అలైన్‌మెంట్‌పై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా స్టే విధించడంతో ఆ మధ్య పనులు నిలిచిపోయాయి. తాజాగా ఆ స్టేను ఎత్తివేశారని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు. అయినవిల్లి మండలం శానిపల్లిలంక వద్ద గోదావరిపై వంతెన నిర్మించే ప్రాంతంలో సామగ్రి నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కలెక్టర్ మహేశ్‌కుమార్ చొరవ చూపి సమస్య పరిష్కరించారు. దీంతో వాటటికీ అడ్డంకులు తొలగాయి. ఇక రైల్వే లైను పనులు ఊపందుకోవడమే తరువాయి.

అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద నిర్మాణ ప్రక్రియ

"కోటిపల్లి- నర్సాపురం మధ్య నిర్మాణంలో ఉన్న రైల్వే నిర్మాణ పనులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులు తొలగాయి. భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి మాకు స్వాధీనపరచగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం." అని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు.

రెండు ప్రాంతాల పరిధిలో..

రైల్వే లైన్ వల్ల అమలాపురం, మలికిపురం మండలాల్లో విలువైన భూములు కోల్పోతున్నామని పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక 2003-04లో సేకరించినవాటికి అప్పట్లో పరిహారం చెల్లించినా భూములు స్వాధీనం చేసుకోలేదు. ప్రాజెక్టు పట్టాలెక్కుతున్న నేపథ్యంలో తాజా భూసేకరణ ధరలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌లో కోటిపల్లి నుంచి అమలాపురం వరకు 12.07 కి.మీ.. అమలాపురం-నర్సాపురం మధ్య 45.17 కి.మీ మేర రైల్వే ట్రాక్ ఏర్పాటు కానుంది. కోనసీమ జిల్లాలో 45.65 కి.మీ, పశ్చిమ గోదావరిలోకి 11.55 కి.మీ వస్తుంది. రైల్వే లైనుకు 26 గ్రామాల పరిధిలో 351.77 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటికి 8 గ్రామాల పరిధిలో 112.86 హెక్టార్లు సేకరించారు. మిగిలిన భూమిసేకరణకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో వేగం పెరగనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

వచ్చే ఏడాది ఉత్తరాంధ్రకు గోదావరి: మంత్రి నిమ్మల

పురుషోత్తపట్నం నుంచి 1,400 క్యూసెక్కుల నీటి విడుదల

సీతానగరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పూర్తయ్యేలోగా ఎడమకాలువ కింద ఉత్తరాంధ్రలోని ఆయకట్టుకు వచ్చే ఏడాది నుంచి నీళ్లు తరలించేలా పనులు వేగవంతం చేశామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గురువారం 1,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమ కాలువ పరిధిలో 204.800 కిలోమీటర్ల పనులు పూర్తి చేసేందుకు రూ.2,050 కోట్లతో టెండర్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. పోలవరం ఎడమకాలువ కింద ఉమ్మడి విశాఖ జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో ఆయకట్టు ఉందని, పురుషోత్తపట్నం, పుష్కర రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా 5వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకొచ్చామన్నారు. ఏలేరు జలాశయానికి 30 టీఎంసీల నీటిని సరఫరా చేసే సమయంలోనే ఉత్తరాంధ్రకూ మళ్లిస్తామన్నారు. 2014-19 మధ్యకాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం జలవనరులకు రూ.72 వేల కోట్లు కేటాయిస్తే, వైకాపా అయిదేళ్ల పాలనలో కేవలం రూ.22వేల కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 1,041 ఎత్తిపోతల ద్వారా 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే, వైకాపా 450 ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో వైకాపా పెట్టిన రూ.18వేల కోట్ల బకాయిలను తీరుస్తూనే అన్ని ఎత్తిపోతల పథకాలను గాడిలో పెడుతున్నామన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని 18 మండలాల్లో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పుష్కర కాలువలకు నీటి విడుదలకు స్విచ్ వేస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు బత్తుల, నెహ్రూ, రుడా ఛైర్మన్ చౌదరి, తదితరులు

విద్యాపూదోటలో ప్రతిభా సుగంధాలు

నేడు జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం

న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

లక్షలాది మందిని ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంతో పాటు వేలాదిమంది పారిశ్రామికవేత్తలు, సివిల్ సర్వెంట్లు, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులను అందించిన విజ్ఞాన భాండాగారం జేఎన్‌టీయూకే. దేశానికి స్వాతంత్య్రం రాకముందు... రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయదలచిన ఇంజినీరింగ్ కళాశాల, అక్కడి పరిస్థితుల దృష్ట్యా కాకినాడకు మార్చారు. 1946లో ప్రారంభమైన ఆ కళాశాల మద్రాస్ రాష్ట్రంలో యూనివర్సిటీకి అనుబంధంగా మూడు కోర్సులతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అనంతరం జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు అనుబంధంగా కొనసాగింది. 2008లో ప్రత్యేక యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి నేటి వరకూ ఎంతో మంది ఇక్కడ నుంచి పట్టభద్రులయ్యారు. నేడు ఈ విద్యాలయం 11వ స్నాతకోత్సవానికి ముస్తాబైంది. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉపకులపతి సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. 2023-24లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు, ప్రతిభావంతులైన 40మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డులు, బంగారు పతకాలు అందజేస్తారని చెప్పారు.

విద్యుత్తు అలంకరణల మధ్య జేఎన్‌టీయూకే ప్రాంగణం

ఎందరో ప్రముఖులు..

దేశానికి మెట్రోరైలును పరిచయం చేసిన మెట్రో మేన్ పద్మవిభూషణ్ శ్రీధరన్, మధ్యతరగతి ప్రజల మనస్సులు దోచిన మారుతి కారు రూపకర్తల్లో ఒకరైన భాస్కరుడు, శాంతా బయోటెక్ స్థాపకులు వరప్రసాదరెడ్డి, ఇన్ఫోటెక్ ఫౌండర్ ఛైర్మన్, బీవీ మోహన్‌రెడ్డి, అంతరిక్ష రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ ఇక్కడి విద్యార్థులే. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారులు ముద్దాడ రవిచంద్ర, జె.శ్యామలరావు, నాగులపల్లి శ్రీకాంత్, కె.కన్నబాబు, ఎంటీ కృష్ణబాబు, ఎస్.వి.ప్రసాద్, ఓంకార్ కల్లే, ఐపీఎస్ అధికారి నాగేంద్రబాబు తదితరులతోపాటు, అమెరికాలో వివిధ కంపెనీలు స్థాపించి వాటి ఛైర్మన్లు, ప్రముఖ కంపెనీలకు వైస్ ప్రెసిడెంట్లు, ప్రజాప్రతినిధులుగా ఎందరో జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థులే కావడం గమనార్హం.

వేలాది మందికి 'పట్టం'..

కళాశాల స్థాయి నుంచి యూనివర్సిటీగా మారిన జేఎన్‌టీయూకేలో ప్రతి ఏటా వేలాది మంది ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ, పరిశోధన, మేనేజ్‌మెంట్, ఫార్మసీ విభాగాల్లో డిగ్రీలు పొందుతున్నారు. వారందరూ పట్టాలు అందుకొని సమాజంలో ఉన్నత స్థాయిలో స్థిరపడుతున్నారు.

ఏడాది	పట్టాలు అందుకున్న విద్యార్థులు
2022	1,11,233
2023	1,20,718
2024	39,413
2025	50,980

పూర్వ విద్యార్థిగా సేవలందిస్తున్న సుబు కోట

స్నాతకోత్సవం సందర్భంగా కోట సుబ్రహ్మణ్యానికి(సుబు కోట) గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నారు. విజయవాడలో పుట్టి పెరిగిన సుబ్రహ్మణ్యం 1962 ప్రాంతంలో జేఎన్‌టీయూకేలో ఇంజినీరింగ్ చదివారు. అనంతరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో మాస్టర్ డిగ్రీకి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చేరారు. తర్వాత న్యూయార్క్‌లోని రోచెస్టర్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడ్డారు. డేటా జనరల్ సిస్టమ్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా చేరిన ఆయన ఉత్తమ ప్రోగ్రామర్‌గా అవార్డు అందుకున్నారు. అనంతరం అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ప్రైవేట్ ఏజెన్సీ... సుబు కోట తాను చదివిన జేఎన్‌టీయూకేకి తనవంతుగా సాయం చేయాలనుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేసి కోట ఫౌండేషన్, జేఎన్‌టీయూకే సంయుక్తంగా రూ.కోటి కేటాయించారు. వర్సిటీ పూర్వవిద్యార్థిగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి గవర్నర్ చేతుల మీదుగా శుక్రవారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారి అరెస్టు

ఉన్నతాధికారులకు డీఎంహెచ్‌వో నివేదిక

మసీదు సెంటర్ (కాకినాడ): మహిళను మోసం చేశారనే ఆరోపణలపై ఓ వైద్యాధికారిని రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం కాకినాడ జిల్లా గొల్లప్రోలు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుబ్బారావు కొవిడ్ సమయంలో రాజమహేంద్రవరంలోని ఓ వ్యక్తికి వైద్యం చేశారు. అదే సమయంలో ఆ వ్యక్తి బంధువైన ఓ మహిళతో పరిచయం పెంచుకుని, మోసం చేశారనే ఆరోపణలున్నాయి. బాధితురాలు ప్రకాష్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గతనెల 28న వైద్యుడిని అరెస్ట్ చేయగా, ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని పోలీసులు ఇటీవల డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ దృష్టికి తీసుకొచ్చారు. జరిగిన విషయంపై డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కి నివేదిక పంపించామని డీఎంహెచ్‌వో గురువారం తెలిపారు. తదుపరి ఉత్తర్వులు రాగానే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి తీరువా.. సాగుకు చేరువ

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ప్రాజెక్టులు, కాలువలు, చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించినందుకు నీటితీరువా వసూలు చేస్తారు. దీనిని చెల్లించిన ప్రతి రైతు సాగునీటి విడుదల, భూమిపై యాజమాన్య హక్కులపై ప్రశ్నించడానికి భరోసా ఉండేది. గత వైకాపా ప్రభుత్వంలో భూములకు భద్రత లేకుండా రైతులు బిక్కుబిక్కుమంటూ ఉండేవారు. నీటి తీరువా వసూళ్లూ నిలిపివేశారు. చాలా మంది రైతులు పన్ను చెల్లిస్తామని ముందుకొచ్చినా కట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. సాగునీటి వనరులను పటిష్ఠం చేసేందుకు నిర్ణయించింది. గ్రామ సచివాలయాల్లో నగదు లేదా డిజిటల్ విధానంలో నీటి తీరువా చెల్లించేలా ఏర్పాట్లు చేసింది. ఈ సొమ్మును తిరిగి నీటి సంఘాలకు కేటాయిస్తారు. వాటితో సాగునీటి వ్యవస్థలను బాగుచేసుకునే అవకాశం కలుగుతుంది.

వసూలుతో వనరుల పటిష్ఠానికి చర్యలు

పేరుకుపోయిన బకాయిలు

జిల్లాలో రీ-సర్వే జరిగిన గ్రామాల్లో భూములకు జారీ చేసిన ఎల్‌పీఎంలు, ఆయా సర్వే నంబర్ల ఆధారంగా నీటి తీరువాను వసూలు చేస్తున్నారు. 2020 సంవత్సరానికి ముందున్న బకాయిలను నిర్ధారించి, 2024 ఏడాది వరకు(1,430 ఫసలీ - 1,434 ఫసలీ) నీటి పన్ను గ్రామ సచివాలయాల్లో చెల్లించే విధంగా సాంకేతిక వ్యవస్థను సిద్ధం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) ద్వారా డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లాలోని గోదావరి డెల్టా, ఏలేరు, సుబ్బారెడ్డిసాగర్, పంపా, పుష్కర, తాండవ రిజర్వాయర్లతో పాటు చెరువులు, కాలువల కింద 96 వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. వీటి ఆయకట్టు కింద ఉన్న భూములకు సంబంధించి గత అయిదేళ్ల నీటి తీరువా డిమాండ్ రూ.34,26,11,050 కాగా, ఇప్పటికి రూ.1,06,41,397 చెల్లించారు. ఇంకా రూ.33,19,69,653 బకాయిలున్నాయి. గత ప్రభుత్వంలో నీటి పన్ను కట్టించుకోకపోవడంతో రైతులు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు పొందడంలో ఇబ్బంది పడ్డారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సుబ్బారెడ్డి సాగర్ రిజర్వాయర్

డివిజన్	నీటి పన్ను బకాయిలు(రూ.)
కాకినాడ	22,26,91,821
పెద్దాపురం	10,92,77,833

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం

జిల్లాలో నీటితీరువా వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. రైతులు నీటి పన్ను చెల్లించి, రసీదులు పొందాలి. అన్ని గ్రామ సచివాలయాల్లో చెల్లింపునకు అవకాశం కల్పించారు. రైతులు కట్టిన పన్ను సొమ్ములు తిరిగి నీటి సంఘాలకు జమ చేస్తారు. తద్వారా సాగునీటి వ్యవస్థలను పటిష్ఠం చేస్తారు.

- జె.వెంకటరావు, డీఆర్వో, కాకినాడ జిల్లా

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. రోజూ 800 మంది వరకు అభ్యర్థులు పాల్గొంటారని, వీరికి ఆహారం ఏర్పాటు చేయదలచిన వారు నోడల్ అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. 77020 03535 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న కల్నల్ ఆర్‌కే సింగ్

రౌతులపూడిలో 18.8 మి.మీ. వర్షపాతం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం తెల్లవారు జాము నుంచి అన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. రౌతులపూడిలో 18.8 మి.మీ., శంఖవరంలో 14.6, ఏలేశ్వరంలో 14.4, తొండంగిలో 13.6, కోటనందూరులో 12.8, తునిలో 12.2, జగ్గంపేటలో 8.2, ప్రత్తిపాడులో 6.8, తాళ్లరేవులో 6, పిఠాపురంలో 5.4, కిర్లంపూడిలో 5.2 మి.మీ.చొప్పున వర్షపాతం నమోదైంది.

ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో.. అయిదుగురి సస్పెన్షన్, తహసీల్దార్‌కు నోటీసు

'ఈనాడు, ఈటీవీ' కథనాలకు స్పందన

ఈనాడు, అమలాపురం: కపిలేశ్వరపురం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో ఇసుక తవ్వకాలు చేపట్టినవారిపై చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిషేధం ఉన్నా ఇక్కడ అడ్డగోలుగా తవ్వకాలు సాగుతున్నాయి. అయినా పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అయిదురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. కపిలేశ్వరపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు ఇస్తూ కలెక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైనవారిలో నిదసనమెట్ట గ్రేడ్-5 కార్యదర్శి, టేకి, కపిలేశ్వరపురం వెల్ఫేర్ అసిస్టెంట్లు, తాతపూడి పంచాయతీ కార్యదర్శి, పశువైద్య సహాయకుడున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడ ఉల్లంఘనలు జరిగినా వాహనాలు స్వాధీనం చేసుకుని, భారీగా జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. క్షేత్రంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ తవ్వకాల నేపథ్యంలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు శుక్రవారం నిర్వహించనున్న జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

దిద్దేశారు.. అడ్డంగా దొరికేశారు!

నకిలీ ధ్రువపత్రాలతో భూమాయ కేసులో లోతుగా విచారణ

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్: అది ఉమ్మడి కుటుంబానికి చెందిన ఆస్తి తగాదా వ్యవహారం. అందులో గత వైకాపా ప్రభుత్వంలోని పెద్దలు తలదూర్చారు. సెటిల్‌మెంట్ వ్యవహారం నడిపి ఆ భూమిని అభివృద్ధి పేరుతో దక్కించుకున్నారు. యాజమాన్య హక్కుల కోసం నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనిపై ఆ కుటుంబానికి చెందిన అనసూరి వెంకటరమణ అనే బాధితుడి ఫిర్యాదుతో డొంకంతా కదులుతోంది. సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసిన ఈ వ్యవహారంలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

నకి'లీలలు' ఇవిగో..

✦ అనసూరి సోమన్న నుంచి వారసత్వంగా అనసూరి సుబ్రహ్మణ్యానికి భూమి దఖలుపడినట్లు పత్రాలు సృష్టించారు. ఇందుకు ముందుగా సోమన్న మరణ ధ్రువీకరణ పత్రాన్ని గైగోలుపాడు పంచాయతీ నుంచి జారీ అయినట్లు రిజిస్ట్రార్‌కు చూపించారు. గైగోలుపాడు పంచాయతీయే కాదు. రమణయ్యపేట పంచాయతీలో ఒక భాగం. అది గమనించకుండానే ధ్రువపత్రాన్ని ఆ గ్రామం పేరున ఇవ్వడంతో విచారణలో అధికారులు నకిలీదని నిర్ధారించారు.

✦ ఆ భూమి సోమన్నకు చెందినదేనని 2002, 2003లో కాకినాడ అర్బన్ తహసీల్దార్ జారీచేసినట్లు చూపించిన ధ్రువపత్రాల్లో సంతకం సరిపోలలేదు. ఆర్డీవో విచారణలో తహసీల్దార్ కూడా అది తన సంతకం కాదని తేల్చేశారు.

✦ వీలునామాతో కలిపి జతచేసిన లింక్ డాక్యుమెంట్లు, ప్రస్తుత పత్రాలు సరిపోలడం లేదు. అవన్నీ ఫోర్జరీ చేసినవేనని గుర్తించారు.

✦ సోమన్న మరణ ధ్రువీకరణ పత్రం గైగోలుపాడు నుంచి జారీఅయినట్లు గమనించకుండానే అప్పటి సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌రెడ్డి రిజిస్ట్రేషన్ చేసేయడం విశేషం. అతనిపైనా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీకి ఫిర్యాదు చేశారు.

✦ 2023 ఏప్రిల్ 6న అనసూరి సుబ్రహ్మణ్యం పేరున హడావిడిగా రిజిస్ట్రేషన్ చేసేశారు. అదే రోజున ఆయనతో అప్పటి వైకాపా నేతలు భూ అభివృద్ధి ఒప్పందం చేసుకున్నారంటే ఇందులో కుట్రదాగి ఉందని ఫిర్యాదు దారుడు చెబుతున్నారు.

✦ ఉమ్మడి ఆస్తిగా ఉన్నప్పుడే నగరపాలక సంస్థ 80 అడుగుల రోడ్డును వీరి భూమి మీదుగా ప్రతిపాదించి తీసుకున్నారు. కొన్నాళ్లకు ప్రతిపాదన రద్దుచేసి స్థలం వెనక్కి ఇచ్చేశారు. అభివృద్ధి పేరుతో వైకాపా నేత చేతిలోకి వెళ్లిన తర్వాత నగరపాలక సంస్థ మళ్లీ రోడ్డు ప్రతిపాదించి సుమారు రూ.కోటి టీడీఆర్‌లు జారీచేయడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

✦ ఫిర్యాదుదారుడు కూడా తాను ఆరోపిస్తున్న వ్యక్తులు నిర్వహించిన బహుళ అంతస్తుల ప్రచార కరపత్రాల వేడుకలో పాల్గొన్నారని, అప్పుడు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆర్డీవో విచారణలో పేర్కొన్నారు.

✦ నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన వారి వెనుక ఎవరున్నారో లోతుగా విచారణ చేస్తామని సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

250 ఎకరాలు.. 17,500 మొక్కలు

ఒకేరోజు నాటడానికి యంత్రాంగం కసరత్తు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఒకేరోజు 250 ఎకరాల విస్తీర్ణంలో 17,500 పండ్ల మొక్కలు నాటడానికి యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డ్వామా ద్వారా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఈ నెల 8న ఈ మొక్కలను నాటనున్నారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర వర్గాల్లోని సన్న, చిన్నకారు రైతులను ఎంపిక చేశారు. ఈ ఏడాది మొత్తం 2 వేల ఎకరాల్లో పెంపకానికి నిర్ణయించారు. ఇప్పటికే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హులైన వారికి ఉచితంగా మొక్కలను అందించనున్నారు.

నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు

రూ.2.48 కోట్లు కేటాయింపు

ఈ నెల 8న చేపట్టనున్న కార్యక్రమానికి రూ.2.48 కోట్లు కేటాయించారు. వీటి ద్వారా గుర్తించిన నర్సరీల్లో మొక్కలను కొనుగోలు చేయనున్నారు. మామిడి, జీడిమామిడి, కొబ్బరి, తైవాన్ జామ, జామ, నిమ్మ, సపోట తదితర రకాలను సిద్ధం చేస్తున్నారు. దీనిపై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిని సంప్రదించగా పండగ వాతావరణంలో పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లోనూ పెద్ద ఎత్తున త్వరలో మొక్కలు నాటుతామని పేర్కొన్నారు.

VIGNAN's
INSTITUTE OF INFORMATION TECHNOLOGY (A)
INSTITUTE OF ENGINEERING FOR WOMEN (A)
DUVVADA, VISAKHAPATNAM-530049.
CAREER GUIDANCE AWARENESS PROGRAM
ARE YOU CONFUSED ABOUT ENGINEERING COURSES AND SELECTION ?
PARENTS & STUDENTS are invited to consult our Counselling Expert and clear doubts to fix Course and Goal
Date & Venue:
TUNI
Spandana Convention Hall, Opp. Aditya Degree College, Pentakota Road.
05th July 2025
KAKINADA
Townhall, Near Tirumala Theatre, Main Road.
06th July 2025
COUNSELLING EXPERTS
Contact : 7569153732, 9866431178

(c) eenadu

ఏపీ జేఏసీ కో-ఛైర్మన్‌గా శ్రీనివాసరావు

రాష్ట్ర ఛైర్మన్ విద్యాసాగర్‌తో పామా శ్రీనివాసరావు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పామా శ్రీనివాసరావు ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐకాస (ఏపీ జేఏసీ) కో-ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఏపీఎన్‌జీవో భవన్‌లో జరిగిన ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని చెప్పారు. ఏపీటీఎస్ఏ ఉమ్మడి జిల్లాశాఖ, ఏపీ ఎన్‌జీవో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పీవీ కృష్ణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉచిత ప్రవేశాలు కల్పించకపోతే చర్యలు

సూచనలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, విద్యాశాఖ అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉచిత నిర్బంధ విద్యా చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపికైన పిల్లలకు విధిగా ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందేనని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన విద్యాశాఖ అధికారులతో కలిసి జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు వారాలుగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు దీనిపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యార్థులను చేర్చుకోకుంటే తల్లికి వందనం పథకాన్ని కోల్పోతారని, ఈ నెల 9 లోగా ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేశారు. లాటరీలో ఎంపికైన విద్యార్థికి సీటు నిరాకరిస్తే.. దానికి కారణాలను మండల విద్యాశాఖ అధికారికి తెలియజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘ ప్రతినిధి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉచిత ప్రవేశాలు కల్పించామని, ఈ విద్యా సంవత్సరంలో స్పష్టమైన ఆదేశాలు జారీ కానందున సంశయానికి గురవుతున్నామన్నారు. డీఈవో పి.రమేష్, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాలరావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడిని కలిసిన స్విమ్మర్ శ్యామల

గోలి శ్యామలను అభినందిస్తున్న రాజాసూరిబాబురాజు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు, పురపాలిక సంఘ మాజీ అధ్యక్షుడు రాజాసూరిబాబురాజును గురువారం అంతర్జాతీయ స్విమ్మర్ గోలి శ్యామల మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బంగాళాఖాతం నుంచి కాకినాడ వరకు సముద్రంలో స్విమ్మింగ్ విజయవంతంగా పూర్తిచేసినందుకు శ్యామలను అభినందించి సత్కరించారు.

ఆట.. అందలమే బాట

వారికి క్రీడలపై ఆసక్తి ఎక్కువ. సరైన సౌకర్యాలు లేకున్నా, కోచ్‌ల సహకారంతో రాణిస్తున్నారు. పిఠాపురం నుంచి జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి వెళ్లేందుకు పాటుపడుతున్నారు. బంగారు పతకాలు సాధిస్తూ పేరు తెచ్చుకుంటున్నారు పోల్‌వాల్ట్ క్రీడలో సాలా రవి, బాక్సింగ్‌లో జె.ఐశ్వర్య సూర్యదీపిక. సరైన మైదానాలు లేకున్నా ఆసక్తితో కోచ్‌లు ఎలిపే సునీల్ దేశాయ్, పి.లక్ష్మణరావు శిక్షణ ఇస్తున్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

పోల్‌వాల్ట్‌లో పతకాల వేట

పిఠాపురానికి చెందిన **సాలా రవి** డిగ్రీ చదువుతున్నాడు. ఇతడు ఏడో తరగతి నుంచే పోల్‌వాల్ట్‌లో సత్తా చాటుతున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. ఇటీవల గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ స్టేట్ అథ్లెటిక్స్ పోల్‌వాల్ట్ అండర్-17 విభాగంలో రవి రజత పతకం సాధించాడు. గతంలో జాతీయ స్థాయిలోనూ రాణించాడు. ఇప్పటి వరకు 15 బంగారు, రెండు రజత, మూడు కాంస్య పతకాలు సాధించాడు. 2016 లో విశాఖలో జరిగిన జాతీయ స్థాయి పోల్‌వాల్ట్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకోగా, అదే ఏడాది గుంటూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం, విజయవాడ, ప్రొద్దుటూరుల్లో బంగారు పతకాలు గెలుచుకున్నాడు. రవి ఆర్మీలో ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో ఉన్నాడు. బీఎంఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయుడు ఎలిపే సునీల్‌దేశాయ్ రవికి చిన్ననాటి నుంచి శిక్షణ ఇస్తున్నారు. పోటీలకు ఆయనే దగ్గరుండి తీసుకెళ్తుంటారు.

పోల్‌వాల్ట్ క్రీడలో జంపు చేస్తున్న సాలా రవి

బాక్సింగ్‌లో బంగారం..

పిఠాపురానికి చెందిన **జె.ఐశ్వర్య సూర్యదీపిక** ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రెండేళ్లుగా బాక్సింగ్ నేర్చుకుంటోంది. కాకినాడ, పిఠాపురంలలో జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 పోటీల్లో కాంస్య పతకం సాధించింది. విశాఖలో రాష్ట్ర స్థాయి యూత్ బాక్సింగ్‌లో రజతం కైవసం చేసుకుంది. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల బాక్సింగ్ 81 కేజీల పైబడిన విభాగంలో రజతం సాధించింది. హరియాణా రోతక్‌లో జరిగిన జాతీయ స్థాయి ఆరో సబ్‌జూనియర్ పోటీల్లో 81 కేజీల పైబడిన విభాగంలో తలపడింది. జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు పిఠాపురానికి చెందిన కోచ్ లక్ష్మణరావు వద్ద శిక్షణ తీసుకుంటోంది. క్రీడా కోటాలో సర్కారు కొలువే లక్ష్యమని చెబుతోంది.

బాక్సింగ్ పోటీలో తలపడుతున్న జె.ఐశ్వర్య సూర్యదీపిక

జేఎన్‌టీయూకేలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

పలువురు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పర్యటన నేపథ్యంలో ఎస్పీ బిందుమాధవ్ గురువారం జేఎన్‌టీయూకే ప్రాంగణాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు పరేడ్ మైదానంలోని హెలిప్యాడ్, జేఎన్‌టీయూకే ప్రాంగణం, సభా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌డీపీవోలు మనీష్ దేవరాజ్ పాటిల్, శ్రీహరిరాజు, నగర పట్టణ, రూరల్ సీఐలు, ట్రాఫిక్ సీఐలు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: కాకినాడలో జరిగే జేఎన్‌టీయూకే స్నాతకోత్సవ సభకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం విచ్చేయనున్నందున జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సామర్లకోట రైల్వే స్టేషన్‌ను గురువారం పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, స్టేషన్ ఆవరణను పరిశీలించారు. వాతావరణ అనుకూలాన్ని బట్టి గవర్నర్ వందేభారత్ రైలు లేదా హెలికాప్టర్‌లో వస్తారన్నారు. అనంతరం కాన్వాయ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణ భగవాన్, రైల్వే స్టేషన్ ఎస్ఎం రమేష్ ఉన్నారు.

తలుపులమ్మకు సారె - చీర

తలుపులమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: చిరకాలం నుంచి వచ్చే సంప్రదాయాలను కొనసాగించడం మన ధర్మం అని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. లోవలో కొలువుదీరిన తలుపులమ్మ ఆషాఢమాస ఉత్సవాలు సందర్భంగా ఆమె సారె-చీర సమర్పించారు. సామూహిక కుంకుమపూజలో ఆమె పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే దివ్య

పోలవరం కాలువలో ఇళ్లు కోల్పోతున్న కుమ్మరిలోవ కాలనీ వాసుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య హామీ ఇచ్చారు. ఈ కాలువ నిర్మాణంలో తొలగించనున్న కాలనీవాసులకు గురువారం మండలంలోని గెడ్లబీడు అతిథి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 472 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పునరావాస కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు తక్షణం చర్యలు చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, పార్టీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు భారతరత్న కోసం కృషి

విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం తదితరులు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: సామర్ల వెంకటరంగారావు (ఎస్వీ రంగారావు)కు రాష్ట్ర ప్రభుత్వం తరపున సముచిత స్థానం కల్పించడంతో పాటు ఏటా ఎస్వీఆర్ అవార్డులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, భారతరత్న ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు తెలిపారు. ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు గురువారం కాకినాడ నాగమల్లితోట కూడలిలో కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీ మాట్లాడుతూ ఎస్వీఆర్ విగ్రహం పరిరక్షణ, అవసరమైన సదుపాయాలు సానా సతీష్‌బాబు ట్రస్టు నుంచి నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ రాజశేఖరం మాట్లాడుతూ పౌరాణిక, జానపదాల్లో ఆనాడు ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లకు మెలకువలు నేర్పిన విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగారావు అని కొనియాడారు. కాకినాడ గ్రామీణ జడ్పీటీసీ సభ్యుడు నులుకుర్తి రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, కోశాధికారి రంగనాయకులు, ఉపాధ్యక్షుడు మాధవరపు పట్టాభిరామయ్య, సలాది మూర్తి, వినాయక మాధవరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీజనల్ మెడికల్ ఎగ్జామినేషన్ బోర్డు నిర్వహణ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో రీజనల్ మెడికల్ ఎగ్జామినేషన్ బోర్డును పారదర్శకంగా నిర్వహిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇతర అవసరమున్న వ్యక్తుల ఆరోగ్య స్థితిపై నిపుణుల ఆధారిత మెడికల్ అంచనా నివేదిక అందించడం, పలు రకాల సేవా నియామకాలు, ఉద్యోగవిరమణ, హాజరు మినహాయింపులు, ఫిట్‌నెస్ ధ్రువీకరణ వంటి అంశాలను పక్కాగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

మహిళా మార్ట్‌ల అభివృద్ధికి కృషి

కోరింగ వెలుగు మహిళా మార్ట్‌లో సరకులు పరిశీలిస్తున్న మహిత

తాళ్లరేవు, న్యూస్‌టుడే: మహిళా మార్ట్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సెర్ప్ అసిస్టెంట్ డైరెక్టర్ మహిత అన్నారు. తాళ్లరేవు మండలం కోరింగలో వెలుగు మహిళా మార్ట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. మార్ట్‌లో కొనుగోలుకు వచ్చిన మహిళలతో మాట్లాడి అక్కడ అందుతున్న సేవలు, ధరలపై ఆరా తీశారు. ఆన్‌లైన్‌లో అమ్మకాల లావాదేవీల గురించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోరింగ, ఉప్పాడ కొత్తపల్లి, కిర్లంపూడి, తొండంగి మండలాల్లో వెలుగు మహిళా మార్ట్‌లను పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో 50 వెలుగు మహిళా మార్ట్‌లు ఉన్నాయన్నారు. సెర్ప్ అధికారి శ్రీనివాసరెడ్డి, డీపీఎం వెంకటేశ్వరరావు, వి.బి.ఆర్.రాయ్, ఏపీఎం బి.విష్ణుమూర్తి, లీగల్ కోఆర్డినేటర్ తాడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం'లో ప్రవేశాల ప్రక్రియ

హాజరైన విద్యార్థులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

రివ్యూ ఓపీ విధానం రోగులకు ఉపయోగకరం

రోగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న రెండో పూట రివ్యూ ఓపీ విధానం రోగులకు ఎంతో ఉపయోగకరమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ఆమె గురువారం మధ్యాహ్నం అవుట్ పేషెంట్ విభాగాలను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలను ప్రతిబింబిస్తూ రోగులకు ఒకేరోజులో రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ వంటి అన్ని వైద్యసేవలు అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. అందులో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ రెండో పూట ఓపీ నిర్వహిస్తున్నామని చెప్పారు. దీంతో ఉదయం వైద్యుడు సూచించిన పరీక్షల రిపోర్టులను మధ్యాహ్నం చూపించి అదేరోజు చికిత్స పొందే అవకాశం ఉందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇది ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు.

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తదితరులు

పక్కాగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర

మసీదు సెంటర్ (కాకినాడ): ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర నరసింహనాయక్ పేర్కొన్నారు. ఆయన గురువారం గోడపత్రికలను ఆవిష్కరించారు. వీటిని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామ ఆరోగ్య కేంద్రాల్లో ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఫ్రైడే...డ్రైడే కార్యక్రమం అమలు చేయాలన్నారు. డీఐవో డాక్టర్ సుబ్బరాజు, గణాంక అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో సూర్యచంద్రరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 మండలాలకు సాగునీరు
మంత్రి నిమ్మల రామానాయుడు

సీతానగరం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం, జలవనరుల శాఖకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల నుంచి పుష్కర కెనాల్‌కు 1,400 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను తీరుస్తూనే ఉమ్మడి జిల్లాలో ఎత్తిపోతల పథకాలన్నీ రెండు రోజుల్లో ప్రారంభించి సాగునీరు విడుదల చేయగలిగామన్నారు. గోదావరికి 14 మీటర్లకు నీటిమట్టం చేరిన సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సాగునీటిని సరఫరా చేశామన్నారు. పుష్కరకాలువ ద్వారా తుని వరకు 18 మండలాలకు సాగునీరు చేరుస్తున్నామన్నారు. అచ్చియ్యపాలెం వద్ద రెగ్యులేటర్ ఏర్పాటుతో ఆటంకాలు లేకుండా నీరు అందిస్తున్నామన్నారు. పుష్కర పైపు లైన్లు కొత్తగా వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీవర్షాలకు పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి నీటిమట్టం 27.230 మీటర్లకు చేరిందని పీఏపీ ఎల్ఎంసీ తుని సర్కిల్ ఎస్ఈ బి.ఏసుబాబు తెలిపారు. గోదావరి ఎడమగట్టున ఎత్తిపోతల పథకాల వద్ద గురువారం సాయంత్రానికి 16.28 మీటర్లకు ప్రవాహం చేరిందన్నారు. ఏలేరు జలాశయంలో 10 టీఎంసీల జలాలు ఉండటంతో పీబీసీ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు చేరుతుందన్నారు.

నిర్వాసితులకు రూ.28.18 కోట్లు..

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణలో 72 ఎకరాలకు సంబంధించిన రైతులకు 6 శాతం వడ్డీ వేసి సుమారు రూ.28.18 కోట్లు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని రైతుల తరపున కె.బాలకృష్ణ అన్నారు. ఆ మొత్తం త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, రాజానగరం తెదేపా ఇన్‌ఛార్జి బీవీఆర్ చౌదరి, పీఏపీ ఎల్ఎంసీ ఈఈ పీవీఎస్ఎస్ రంగారావు, డీఈ సీహెచ్ కోటేశ్వరరావు, జేఈలు వినోద్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి తుని నుంచి బస్సు సౌకర్యం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తుని నుంచి వచ్చే భక్తులు దర్శనం కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. తుని డిపోకు చెందిన ఈ బస్సు గురువారం భక్తులతో వచ్చింది. జాతర నిర్వహించే 37 రోజులపాటు ఈ ప్రత్యేక బస్సు నడుపుతామని ఏపీ విజయలక్ష్మి తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రసాదాన్ని అందించారు.

1 నుంచి జాతీయ జూనియర్ మహిళా హాకీ టోర్నీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆగస్టు 1 నుంచి 12 వరకు జాతీయ జూనియర్ మహిళా హాకీ ఛాంపియన్‌షిప్ జరగనుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన రెవెన్యూ, క్రీడాభివృద్ధి, వైద్య,ఆరోగ్యం, పురపాలక, ఆర్అండ్‌బీ, విద్యుత్తు, సమాచార శాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ పోటీలకు 29 రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారిణులు, 200 మంది సహాయ సిబ్బంది హాజరవుతారని తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. భోజనం, వసతి, పారిశుద్ధ్యం, వైద్యం తదితర అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు, డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, ఆర్డీవో మల్లిబాబు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, సీపీవో త్రినాథ, హాకీ అసోసియేషన్ ప్రతినిధులు హర్షవర్ధన్, రవిరాజు, సెట్రాజ్ సీఈవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికుల వేతనాలు పెంపునకు డిమాండ్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో పనిచేస్తోన్న ఒప్పంద కార్మికుల వేతనాలను పెంపుదల చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. దీనిపై జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, యూనియన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కొండబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ల అమలుకు జులై 15 వరకు వివిధ నిరసన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. సంఘ నాయకులు బంగారు రాజేష్, శ్రీనివాస్, కటారి సత్యనారాయణ, లక్ష్మణ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE
HOUSE FOR SALE
GENERAL
LAND FOR SALE
GENERAL

JOBS
Well Established (RJY) Company Looking for Managers (M/F) Full Time/ Part Time. Preferably Retd./ VRS/ House wives. Age: above 30 yrs. Income: 80K above. Cont: 9440579695, 7093442345.

మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. ప్రముఖ ఫైనాన్స్ & ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. జీతం: 20k to 30k. సెల్: 99512 86781, 83092 95955.

TOURS AND TRAVELS

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

గమనిక

EENADU for Advertisement Contact: 8008597607

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	24,000
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	95-00
రిటైల్ లైవ్	117-00
డ్రెస్డ్	170-00
స్కిన్‌లెస్	193-00

విద్యుత్తుశాఖ సబ్‌ఇంజినీర్ సస్పెన్షన్
ఆలస్యంగా వెలుగులోకి..

తొండంగి, న్యూస్‌టుడే: తొండంగి విద్యుత్తుశాఖ సబ్ ఇంజినీర్ షేక్ బషీరుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు జూన్ 10న ఆదేశాలు జారీ చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. వసూళ్లయిన విద్యుత్తు బిల్లుల మొత్తం రూ.15 లక్షలను సంస్థకు జమచేయకుండా వాడుకున్నట్లు విచారణలో తేలడంతో బషీరుద్దీన్‌ను జూన్ 10న సస్పెండ్ చేసినట్లు ఏఈ లోవరాజు గురువారం తెలిపారు. వివరాలివీ.. తొండంగి విద్యుత్తుశాఖ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 44 విద్యుత్తు కనెక్షన్ల (హేచరీ,చెరువు) నుంచి వసూళ్లయిన బిల్లులు సుమారు రూ.15 లక్షలు ఏపీఈపీడీసీఎల్‌కు జమ చేయకుండా తప్పుడు బిల్లులు వినియోగదారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. బిల్లు చెల్లించినా బకాయి చూపించడంతో వినియోగదారులు ఖంగుతిని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డివిజన్ కార్యాలయం జగ్గంపేట నుంచి ఏఏవో (అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్) కె.రవీంద్ర, మరో ఇద్దరు అధికారుల బృందం జూన్ మొదటి వారంలో కార్యాలయానికి వచ్చి విచారణ చేశారు. 22 కనెక్షన్లకు సంబంధించి ఆధారాలు దొరకడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

హత్యకేసులో నిందితులకు జైలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో 2019 జనవరి 16న చెందుర్తికి చెందిన ఆరుగుళ్ల శ్రీను హత్య కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీహరి గురువారం తీర్పునిచ్చారని ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. చెందుర్తికి చెందిన ఆరుగుళ్ల శ్రీనుతో విభేదాలతో అతని భార్య గంగ చేబ్రోలులోని పుట్టింటికి వెళ్లిపోయింది. సంక్రాంతి పండగకు తన ముగ్గురు పిల్లల్ని తీసుకువెళ్లేందుకు అత్తగారింటికి వెళ్లిన శ్రీనుపై బావమరుదులు దొండపాటి చంద్రబాబు, అర్జున్, వరుసకు వదిన అయిన నేదూరి రత్నం దాడి చేయగా మృతి చెందాడన్నారు. మృతుడు శ్రీను సోదరి శాంతి ఫిర్యాదుతో ముగ్గురిపైనా అప్పటి ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేయగా.. సీఐ సూర్యఅప్పారావు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం దొండపాటి చంద్రబాబుకు రెండేళ్ల జైలుశిక్ష రూ.1000 జరిమానా, అర్జున్‌కు రెండు నెలల జైలుశిక్ష రూ.500 జరిమానా విధించారన్నారు. రత్నం అనే అచ్చమ్మపై కేసు కొట్టివేశారన్నారు.

ఇళ్లు కూల్చేసినా.. ఆభరణాలు అపహరించినా చర్యలేవీ..?

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు సీతామహాలక్ష్మి

ఎ.వి.ఎ రోడ్డు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: గోకవరం మండలం మల్లవరంలోని సింగారమ్మ ఆలయ నిర్వాహకులు, అర్చకత్వం చేస్తున్న వారిపై దాడికి పాల్పడి గృహాలను ధ్వంసం చేసి, దేవుడి పూజా సామగ్రి, బంగారం, వెండి ఆభరణాలు చోరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు సింగారలక్ష్మి, సీతామహాలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. సింగారమ్మ చింతగా పేరొందిన ఆలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తుంటారన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాలకు చెందిన కొందరు వ్యక్తులు ఆలయాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనే దురుద్దేశంతో ఏప్రిల్ 23వ తేదీ రాత్రి అక్కడ నివాసముంటున్న వీర్రాఘవమ్మ, సింగారలక్ష్మిపై దాడి చేసి గృహాలు, దుకాణాలను కూల్చి వేసి, సుమారు రూ. 25 లక్షల విలువైన బంగారం, వెండి దోచుకెళ్లారన్నారు. దీనిపై గోకవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంతో మే 26న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. రాష్ట్ర హైకోర్టులో జూన్ 20న రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. బాధితులు సింగారలక్ష్మి, సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తమ వస్తువులు, దుస్తులు, ధ్రువపత్రాలు తగులబెట్టారని, ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వట్టికూటి దుర్గాప్రసాద్, పసపులూటి సూర్య, ఆలమూరు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాట - 22, 24, వంకాయలు - 34, 44, 50, బెండకాయలు - 38, పచ్చిమిర్చి - 45, 50, కాకరకాయ - 40, బీర - 35, 44, క్యాబేజీ - 28, క్యారెట్ - 36, దొండకాయలు - 44, బంగాళా దుంపలు - 20, 23, ఉల్లి - 23, 29, గోరుచిక్కుడు - 38, దోసకాయలు - 14, చిక్కుడు - 54, చేమదుంపలు - 40, బీట్‌రూట్ - 34, కీరదోస - 40, బీన్స్‌ - ఆలు - 50, క్యాప్సికం - 80, బొబ్బర్లు - 38, చిలగడదుంపలు - 36, ఒకటి పొట్టిగాను పనస కాయ - 12, 17, పొట్లకాయ - 16 20, అరటికాయ - 7, 9, మునగకాడ - 10, 12, మామిడికాయ - 10, 12, నిమ్మకాయలు(డజన్) - 24, 36, 48.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- తమ్ముడు, జురాసిక్ వరల్డ్ రీబర్త్, కన్నప్ప, కుబేర, మార్గాన్, సోలోబాయ్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- తమ్ముడు, కన్నప్ప, 3బిహెచ్‌కే, షోటైమ్, లక్ష్మీ- తమ్ముడు, సత్యగౌరి - జురాసిక్ వరల్డ్ రీబర్త్, తిరుమల - తమ్ముడు, సీఅండ్‌సీ 1- తమ్ముడు, సీఅండ్‌సీ 2- తమ్ముడు, శ్రీప్రియ - జురాసిక్ వరల్డ్ రీబర్త్, పద్మప్రియ- తమ్ముడు, సూర్య1(వాకలపూడి) - జురాసిక్ వరల్డ్ రీబర్త్, సూర్య 2 - తమ్ముడు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

సాంబమూర్తినగర్ : 91548 46719
మసీదుసెంటర్ : 91541 18210
గాంధీనగర్ : 80085 74159
బాలాజీచెరువు : 80085 74154
కాకినాడ నగరం : 80085 74157

ఉ. 10 - మ. 1

వెలగని వీధి దీపాలు

సాంబమూర్తినగర్: సాంబమూర్తినగర్ ఐదో వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేలాడుతున్న తీగలతో ఇక్కట్లు

సాంబమూర్తినగర్: వెంకటనగర్‌లో నీటి ట్యాంకుల వెనుక వైపు రహదారిలో విద్యుత్ స్తంభం వద్ద కేబుల్ వైర్లు వేలాడుతున్నాయి. ఇటువైపు వెళ్లే వాహనదారులకు తగలడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వైర్లను సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త సమస్యను పరిష్కరించండి

కాకినాడ నగరం: స్థానిక శాంతినగర్ పాత ఆర్టీవో కార్యాలయం వీధిలో గత కొద్ది రోజులుగా చెత్త పేరుకుపోతోంది. పారిశుద్ధ్య సిబ్బంది ఇటువైపు రావడం లేదు. దీంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇదే వీధిలో పాఠశాల, బీసీ వసతి గృహం ఉన్నాయి. చర్యలు తీసుకోవాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలువలు ఇలా.. మురుగుపారేదెలా..?

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని పలు కాలువలు ఎత్తుపల్లాలతో ఉండటం, మరికొన్నింటిలో చెత్తాచెదారం, గడ్డి, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో పాటు చిన్నపాటి వర్షానికే కాలువలు నిండి మురుగు రోడ్ల పైకి చేరుతుంది. పళ్లంరాజునగర్‌లోని ఓ వీధిలో రహదారి మధ్యలో కాలువ గడ్డి, చెత్తతో నిండిపోయింది. మురుగు పారేందుకు వీలులేకుండా ఉంది. దోమలతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. అలాగే వెంకట్‌నగర్ ప్రధాన రహదారిపై సైతం ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలని, మురుగు నీరు పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకట్‌నగర్‌లోని కాలువలో పెరిగిన గడ్డి

పళ్లంరాజునగర్‌లోని ఓ వీధిలో వ్యర్థాలతో..

నిధుల కుమ్మరింత.. పనుల వెక్కిరింత

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధి యళ్లవారిగరువు సర్వేపల్లి రాధాకృష్ణన్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో రెండేళ్ల కిందట వైకాపా హయాంలో 'నాడు-నేడు' కింద రూ.2.93 కోట్లతో పనులు చేపట్టారు. ఎక్కడా ఆ అభివృద్ధి ఆనవాళ్లు కనిపించడం లేదు. అదనపు గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇరుకు గదుల్లోనే తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాల ఆవరణ ఎత్తుపల్లాలుగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. ఇదే ఆవరణలో గతంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన అదనపు గదుల నిర్మాణం సైతం పునాదులకే పరిమితమైంది. నాడు-నేడు కింద మైనరు, మేజరు మరమ్మతుల పేరుతో రూ.40లక్షల వరకు ఖర్చు చేశారు. ఆ పనులు చేసిన జాడా లేదు. పాఠశాలకు మంజూరైన నాడు-నేడు నిధుల వినియోగంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రస్తుత విద్యా కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్ కలెక్టరు, విద్యా మంత్రి, కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. దాంతో ఇటీవల డీఈవో ఆదేశాల మేరకు సమగ్ర శిక్షా అధికారులు విచారణ చేపట్టారు. దీనిపై డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో తరగతి గదుల కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.

పూర్తికాని అదనపు తరగతి గదుల నిర్మాణం

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలను గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రిక్కీ గూటం మాట్లాడుతూ క్రీస్తుశకం 52లో ఏసుక్రీస్తు శిష్యుడైన తోమాతో భారతీయ క్రైస్తవ చరిత్ర ప్రారంభమైందని, గత రెండువేల సంవత్సరాలుగా దేశ నిర్మాణం, అభివృద్ధిలో భారతీయ క్రైస్తవ సమాజం కీలక పాత్రను పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల మెగా వైద్య శిబిరాలు నిర్వహించగా, ట్రినిటి ఆసుపత్రితోపాటు ఇనోదయ, రాఘవ, ట్రస్టు, అరుణ ఆసుపత్రులు, పలు దంత, కంటి వైద్య ఆసుపత్రులు, వైద్యులు సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు.

దుమ్ములపేటలో ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు వైద్యపరీక్షలు

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

కాకినాడ కలెక్టరేట్: స్థానిక 48వ డివిజన్ షీలోపు ప్రార్థనా మందిరంలో గురువారం పాస్టర్ కె.ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కంటి, దంత, జనరల్ విభాగాల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సిరాజ్ ఐజాక్ , జోసెఫ్ బెన్నీ, శ్యాంబెన్నీ, ఆనంద్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకు మేలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక 9, 20వ డివిజన్లలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ కూటమిది అభివృద్ధి అయితే, వైకాపాది విధ్వంసమని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌లు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కృషిచేస్తున్నారని వివరించారు. నగర తెదేపా అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ పార్టీ నాయకులు వాసంశెట్టి చిట్టప్ప, లూటుకుర్తి మోహన్, చాపల ప్రశాంతి, గౌరుసు దుర్గారావు, ఆకుల జాన్‌వెస్లీ, డొక్కా శ్రీను, కొప్పనాతి రవివర్మ, కాలాడి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

నగరాభివృద్ధికి ప్రణాళికలు

కాకినాడ నగరం: 2047 విజన్ ప్రణాళికలో భాగంగా నగరాభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూచించారు. గురువారం నగరపాలక సంస్థ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిలో కాకినాడను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అదనపు కమిషనర్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం హానికరం

మసీదు సెంటర్ (కాకినాడ): ప్లాస్టిక్ వాడకం సమాజానికి హానికరమని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక శ్రీసత్య దంత వైద్యశాలలో ఐడీఏ సభ్యులతో ప్లాస్టిక్ సంచుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేనేత వస్త్ర సంచులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఐడీఏ సీడీహెచ్ కన్వీనర్ డా.శ్రీవల్లి, డా.లిఖిత, డా.మాధురి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ అవసరం

కాకినాడ నగరం: విద్యార్థి దశ నుంచి సామాజిక సమస్యలను అర్థం చేసుకోవాలని పీఆర్ ప్రభుత్వ డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ డా.కె.ఆంజనేయులు సూచించారు. స్థానిక కళాశాలలో గురువారం 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు, వృత్తి నైపుణ్యాలు, సేవా భావం అవసరమని చెప్పారు. డీఎఫ్ఎస్ఐ సమన్వయకర్తలు రాంబాబు, మధుప్రసాద్, కామర్స్ విభాగ ఇన్‌ఛార్జి డాక్టర్ కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైకాపా విస్తృతస్థాయి సమావేశం

కాకినాడ కలెక్టరేట్: వైకాపా కాకినాడ నగర నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక డీ-కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా హాజరవుతారని చెప్పారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణంలోని వారాహి నవరాత్రులు పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో హయగ్రీవ, దత్తాత్రేయ హోమాలు నిర్వహించారు. రాయుడుపాలెంలోని హ్రీం పీఠంలో వ్యవస్థాపకుడు ఈశ్వర్ గురూజీ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు.

అలంకరణలో అమ్మవారు

రేషన్ బియ్యం స్వాధీనం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణంలోని రమణయ్యపేట పారిశ్రామిక ప్రాంతంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు గోదాములో తనిఖీలు నిర్వహించారు. కేవస్ భరత్ అనే వ్యక్తి నిల్వచేసిన 1100 కేజీల బియ్యాన్ని సీజ్ చేశారు. అతడిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్‌వోలు వీరాస్వామి, అనిల్ తెలిపారు.

అన్యాక్రాంతం కాకుండా చర్యలు

కరప: ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందం పేర్కొన్నారు. కరపమండలం యండమూరులోని స్థానిక రైతు సేవా కేంద్రం సమీపంలో గ్రామకంఠం భూమి ఆక్రమించి చెరువు తవ్వుతున్నారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఆయన వీఆర్వో ఏసేబు, సర్వేయర్ వీరేష్‌లతో కలిసి సర్వే చేపట్టారు. ఇందులో 9సెంట్ల భూమి సరిహద్దు రైతు కామరాజు ఆక్రమించి గట్టు వేసుకున్నట్లు గుర్తించి రెండురోజుల్లో ఆక్రమణలు తొలగించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి, ఇన్‌ఛార్జి సీఈవో ప్రవీణ్‌కుమార్ తదితరులు

డీసీసీబీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

గాంధీనగర్, న్యూస్‌టుడే: డీసీసీబీకి చెందిన స్థలంలో అక్రమంగా హోటల్ నిర్వహిస్తుండటంతోపాటు, బ్యాంకుకు వచ్చే వారికి ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తున్నారని, ఆక్రమణలు తొలగించాలంటూ డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి(బాబు) గురువారం నగర కమిషనర్, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ డీసీసీబీ ప్రధాన ద్వారం వద్ద సుమారు 12 సంవత్సరాల కిందట చిన్న హోటల్ పెట్టుకుని దానిని విస్తరించి, బ్యాంకు స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. ఆయన ఫిర్యాదుతో టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణారావు అక్కడకు చేరుకుని పరిసరాలను పరిశీలించారు. నిర్వాహకులను నిలదీశారు. తాము వేరే వారి దగ్గర లీజుకు తీసుకున్నామని చెప్పడంతో తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సీఈవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దీనిపై గతంలోనే నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, మరోసారి వారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం.. సమస్యలతో సతమతం

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఆకర్షణీయ నగరం కాకినాడలోని పళ్లంరాజునగర్, రాజారామ్మోహన్‌నగర్ వాసులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. 8, 9 డివిజన్ల పరిధిలో ఈ ప్రాంతాల్లో ఉద్యోగులు, వ్యాపారులతోపాటు మధ్య తరగతి కుటుంబాల వారు అధికంగా నివాసం ఉంటున్నారు. మూడువేలమందికి పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో సౌకర్యాలు అంతంత మాత్రమే. ఇటీవల కాలంలో నూతన భవన సముదాయాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ రోడ్లు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంది. వర్షం పడితే రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. మురుగు పారే మార్గం లేకపోవడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఖాళీ స్థలాల సమస్య అధికంగా ఉంది. వర్షాల సమయంలో స్థలాల్లోకి నీరు చేరి మురికి కూపాలుగా మారుతున్నాయి. అందులో దోమలు, క్రిమికీటకాలు ఆవాసాలు ఏర్పరచుకున్నాయి. పాములు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు పెరిగి రహదారులు మూసుకుపోయాయి. రాత్రి మలుపు తిరిగే క్రమంలో ముళ్ల కంపలు గుచ్చుకోవడంతోపాటు చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

గుంతల్లో నీరు నిలబడి అధ్వానంగా మారిన రహదారి

రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు

ఎవరూ పట్టించుకోవడం లేదు

గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలా వీధుల్లో రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ కూడా దెబ్బతింది. రెండు చిన్నపాటి ఉద్యానాలు నిరుపయోగంగా ఉన్నాయి. పాముల బెడద అధికంగా ఉంది. ఇళ్లల్లోకి వస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. - గణపతి, స్థానికుడు

తొలగించారు.. వదిలేశారు

కాకినాడ, శాంతినగర్‌లోని ఓ వీధిలో చెట్టుకొమ్మలను తొలగించి రహదారికి అడ్డుగా వదిలేశారు. దాంతో వాహనదారులు ఆ వీధిలో రాకపోకలు సాగించేందుకు వీలులేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

పొంచి ఉన్న ప్రమాదం

కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై కాలువపై స్లాబురాయి లేక ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు గమనించకుంటే పడిపోయే ఆస్కారముంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తిచేస్తున్నారు.
– న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ఆకట్టుకున్న ఆచమనం నాటిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎస్వీ రంగారావు కళాస్రవంతి సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి దంటు కళాక్షేత్రంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంస్థ అధ్యక్షుడు పీజే చంటిరెడ్డి, గౌరవాధ్యక్షుడు పి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్వీరంగారావు రాష్ట్ర స్థాయి కళాపురస్కారాలను విశాఖకు చెందిన కర్రి ధర్మరాజు, పేర్నీడి సూర్యనారాయణలకు అందజేశారు. ఈ సందర్భంగా నాట్యాచార్య ఎం.వి.రమణ శిష్యబృందంచే నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం వెంకన్నబాబు రచించిన ఆచమనం నాటికను ప్రదర్శించారు. ఉపిసి హెచ్.సత్యనారాయణ తాండ్రపాపారాయుడు ఏకపాత్రాభినయం అలరింపజేసింది. గట్టి సత్యనారాయణ, కర్రి అచ్యుతరామా రెడ్డి, పిజ.చంటి రెడ్డి, డి.వెంకట్, వైవి.దాసు, తలారి రామచంద్రరావు, మార్ని జానకిరామ్ చౌదరి, డేగల రమేష్, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



నాటికలోని సన్నివేశం

ఎస్వీ రంగారావుకు నివాళి

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: చలన చిత్ర పరిశ్రమకు ఎస్వీ రంగారావు నటన పెద్దబాల శిక్ష వంటిదని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డా. అడ్డాల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న ఆయన విగ్రహానికి అడ్డాల, చిట్నీడి శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరాణిక, జానపద, సాంఘిక పాత్రల్లో తనదైన నటనతో రంగారావు మెప్పించారని చెప్పారు. నిమ్మకాయల వెంకటేశ్వరరావు, కాకినాడ లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ అడ్డాల, చిట్నీడి శ్రీనివాస్

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

సామర్లకోట గ్రామీణం: వాడబలిజ మత్స్యకారుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. కొప్పవరం కూడలిలోని కార్యాలయంలో గురువారం ఎంపీని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఆధ్వర్యంలో కాకినాడ నగర వాడబలిజ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఆ సంఘం అధ్యక్షుడు నీలపల్లి కామరాజు పాల్గొన్నారు.

ఇంటింటా కరపత్రాల పంపిణీ

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణంలోని పలు గ్రామాల్లో గురువారం తెదేపా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. తూరంగి గ్రామం మహాలక్ష్మి నగర్‌లో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు కరపత్రాలు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కరప, న్యూస్‌టుడే: కష్ట సమయాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక సేవావేత్త పోలిశెట్టి నారయ్య కోరారు. కరపలోని నక్కావారి ఎస్సీపేటకు చెందిన ఉల్లం దేవుడు తన తాటాకిల్లు పాడైపోయి వర్షం ఇంట్లోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నారయ్య అభ్యర్థన మేరకు విశ్రాంత ఉద్యోగి వి.శ్రీనివాసరావు అందించిన రూ.5వేలను బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు.

పార్సిల్ తీసుకోవాలంటే.. యాతనే!

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ ఆర్టీసీ కార్గో కార్యాలయం వద్ద పార్సిల్ తీసుకునేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పార్సిల్ బుకింగ్‌కు, డోర్ డెలివరీకి కాకినాడ డిపో వద్ద ఒకటే కార్యాలయం అందుబాటులో ఉండేది. కార్గోకు ఆదరణ లభిస్తుండడం, బుక్ చేసుకునే వారి సంఖ్య పెరుగుతుండటంతో డిపో అధికారులు ఆవరణలో ఏడాది కిందట త్వరితగతిన పార్సిల్స్ అందించేలా కొత్త కార్యాలయం ఏర్పాటు చేశారు. అయితే తగినంత సిబ్బంది లేకపోవడం, ఇతర కారణాలతో వినియోగదారులకు అందజేయడంలో జాప్యం చోటుచేసుకుంటోంది. అరగంట నుంచి గంటవరకు క్యూ లైన్‌లో నిలబడాల్సి వస్తోందని వాపోతున్నారు. కార్యాలయం వద్ద రెండు కౌంటర్లు ఉన్నా ఒక్క కౌంటర్ మాత్రమే పనిచేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై డిపో అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం సమయంలో మాత్రమే ఒక కౌంటర్ ఉంటుందని, మిగతా అన్ని వేళలా ఇద్దరు సిబ్బందితో పాటు సహాయకులు ఉంటారన్నారు. ఇబ్బందులు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పార్సిల్ కార్యాలయం వద్ద వరుసలో వినియోగదారులు

CHANGE OF NAME

I, Rama Koteswara Rao Mannem, S/o. Markandeyulu (Late), aged about 40 years, R/o. 45-7-19, Jagannaickpur, Kakinada, Kakinada District, A.P-533002 do hereby declare, affirm that the name of my elder daughter is changed from **MANNEM THANU SRI** (Old Name) to **MANNEM THANUSREE** (New Name). Hence, hereafter all her documents, records and correspondence will be continued with her new name **MANNEM THANUSREE** for all purposes, vide Affidavit dated 03 July, 2025.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE: KAKINADA
E.P. 80/2023 in O.S. 677/2022

Between:
Sathi Ganapathi Reddy ...Decree Holder/ Plaintiff
and
Vanga Rajasekhar, S/o. (Late) Venkata Trinadh, Age 39 years, Private Employee, Door No.37-2-23,pedda market veedhi, beside Asha Bankers Building, Kakinada. ...Judgement Debtor/Defendant

పై నెంబరు అములు గ్రంథములో DHrకు రావలసిన డిక్రీ బాకీకుగాను JDr తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలపు ఉస్తిహార్లు షరతులకు లోబడి శ్రీ కోర్టువారు **ది. 18-07-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** వేలం వేయుదురు. కావున పాడదలచినవారు వచ్చి సదరు వేలంలో పాల్గొనవచ్చును. వివరముల కొరకు పై శ్రీ కోర్టు నజారత్ ఆఫీసు నందు గాని, ఈ క్రింది తెలిపిన DHr అడ్వకేట్ గారిని గాని అడిగి తెలుసుకొనవచ్చును.

EXECUTION PETITION SCHEDULE PROPERTY FILED BY THE DECREE HOLDER : Kakinada District, Kakinada Municipality, T.S.No.617, Block No.9, Ward No.4, Market Street, G+1 RCC Roof Building, bearing Door No. 37-2-23, situated in an extent of 150 sq yards site within the following boundaries and measurements: **East :** 25.0 feet Road; **West:** Door No. 37-2-22 Sait Mangilal Building; **North:** Door No.37-2-24 Aasha Bankers Building; **South:** Door No. 37-2-21 Kamal Finance Building.

Within the above boundaries the site of 150 square yards and G+1 RCC Building was therein with common ways and with all easementary rights etc., in which an undivided and unspecified 1/4th joint share of J.Dr.

1/4th Value : Rs. 8,50,000/-
Amin's Value: Rs. 20,00,000/-
JDR's Value: Not Given

Dr. మేడపాటి ధర్మారెడ్డి, Ph.D in Law
అడ్వకేట్, డో.నెం. 64-2-2, ధనలక్ష్మి నిలయం, వాటర్ ట్యాంక్ మెయిన్ గేట్ ఎదురుగా, ప్రతాప్ నగర్, కాకినాడ. సెల్: 8099505050
కాకినాడ ది.03-07-2025

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

సీఎం చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే వర్మ భేటీ

పిఠాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం రాత్రి మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం, జిల్లా పరిస్థితులపై చర్చించుకున్నారు. పార్టీ బలమైన కార్యకర్తలు ఉన్నారని సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు.

అన్నక్యాంటీన్ తనిఖీ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో అన్నక్యాంటీన్‌ను నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ కనకారావు గురువారం తనిఖీ చేశారు. భోజనాలు చేస్తున్నవారితో మాట్లాడారు. భోజనం, అల్పాహారం అందించే వేళలు విధిగా పాటించాలని ఆదేశించారు. ఏఈ ప్రభాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాలు చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198 పిఠాపురం: 80085 65544

సమస్య: సర్పవరం గ్రామం పూలమార్కెట్ కూడలిలో పూల వ్యర్థాలు పేరుకుపోయాయి. - ఎం.నారాయణరావు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి సిబ్బందితో చెత్త తొలగించారు. - న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

సమస్య: నాగులపేట కూడలిలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. - వాసు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణరావుకు తెలుపగా కాలువ శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: చేబ్రోలు మార్కెట్ వీధిలో కాలువ పూడుకుపోయి మురుగు నీరు ప్రవహించక దుర్వాసన వస్తోంది. - స్థానికులు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురంలోని సీతయ్యగారితోటలో డ్రెయినేజీ వెంట తుప్పలు పెరిగిపోయాయి. - రాజు

పరిష్కారం: సమస్యను పారిశుద్ధ్య అధికారి ప్రకాశ్‌కు చెప్పగా కార్మికులతో తుప్పలు తొలగిస్తున్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: కరపమండలం వేళంగి నుంచి కూరాడ వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. - ఆనంద్

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్త, వ్యర్థాలు తొలగించారు. - న్యూస్‌టుడే, కరప

జంట పట్టణాల్లో ట్రాఫిక్ కష్టాలు

పెద్దాపురం, సామర్లకోట, న్యూస్‌టుడే: రోజురోజుకీ పెరిగిపోతున్న వాహనాల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య జటిలంగా తయారవుతోంది. వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ఈ సమస్య ఇబ్బందికరంగా మారుతోంది. పెద్దాపురం నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట రెండు జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పాలవుతున్నారు.

● పెద్దాపురం పట్టణం దర్గాసెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు నానా కష్టాలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనాల రాకపోకలతో రద్దీమయంగా ఉంటోంది. పైగా రాజమహేంద్రవరం, కాకినాడ, జగ్గంపేట, పెద్దాపురం మండలంలోని ఆర్బీపట్నం, కాండ్రకోట గ్రామాలకు వెళ్లే కూడలి ప్రాంతం కావడంతో ఆర్టీసీ బస్సులు, జీపులు, లారీలు, ఆటోలు, ఇంజినీరింగ్ కళాశాల, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వాహనాల రాకపోకలతో విపరీతమైన రద్దీ నెలకొంటుంది. నాలుగు రహదారుల కూడలి మధ్యలో ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయడంతో వాహనాలు నిలిచిపోయి ఈ పరిస్థితి ఎదురవుతోందని వాహనచోదకులు అంటున్నారు.

● సామర్లకోట పట్టణంలో ప్రధానంగా స్టేషన్ సెంటర్, రైల్ కమ్ బస్సు వంతెన, రైల్వేగేట్ వద్ద, మటన్‌సెంటర్‌లో ప్రతిరోజూ ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. స్టేషన్ సెంటర్‌లో రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ రెండూ ఒక చోట ఉండడంతో ప్రయాణికులతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఇదే ప్రాంతంలో ఆటోలు నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. రైల్వే వంతెన వద్ద రోజూ చాలా దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోయి కాకినాడ, రాజమహేంద్రవరం వెళ్లే ప్రయాణికులు నానాపాట్లుపడుతున్నారు.

పెద్దాపురం: దర్గాసెంటర్ నాలుగు రహదారుల కూడలిలో బస్సులు నిలుపుదలతో నిలిచిపోయిన ట్రాఫిక్

చర్యలు చేపడతాం..

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. దర్గాసెంటర్‌లో నాలుగు రహదారుల కూడలిలో ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటాం. ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనదారులకు అపరాధ రుసుం విధిస్తున్నాం. వాహనదారులు, ప్రజలు కూడా తమకు సహకరించాలి.

- వి. మౌనిక, అడపా గంగాధరం, ఎస్సైలు
పెద్దాపురం, సామర్లకోట

రేషన్ బియ్యం స్వాధీనం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణంలోని రమణయ్యపేట పారిశ్రామిక ప్రాంతంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం విజిలెన్స్ అధికారులు వచ్చిన సమాచారం మేరకు గోదాములో తనిఖీలు నిర్వహించారు. కేవస్ భరత్ అనే వ్యక్తి నిల్వచేసిన 1100 కేజీల బియ్యాన్ని సీజ్ చేశారు. అతడిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ వీరాస్వామి, అనిల్ తెలిపారు.

భూమి అప్పగించాలని ఆందోళన

గొల్లప్రోలు: చేబ్రోలులోని తమ భూమిని రెవెన్యూ దస్త్రాల్లో చేర్చి అప్పగించాలని కోరుతూ గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం పలువురు ఆందోళన చేశారు. చేబ్రోలుకు చెందిన సిద్దిరెడ్డి జోగయ్య, సుబ్బలక్ష్మి, వేపూరి నాగమణి బంధువులు, గ్రామస్థులతో కలిసి ధర్నా చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ తమ తల్లి పేరున్న భూమిలో బ్లైండ్ రికార్డు తీసుకున్నందున మినహాయించి మిగతా అప్పగించాలని కోరుతున్నారు. చర్యలు చేపడతామని ఆందోళనకారులకు ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

కరప: ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందం హెచ్చరించారు. కరప మండలం యండమూరులోని స్థానిక రైతు సేవా కేంద్రం సమీపంలో గ్రామ కంఠం భూమి ఆక్రమించి చెరువు తవ్వుతున్నారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఆయన వీఆర్వో ఏసేబు, సర్వేయర్ వీరేష్‌లతో కలిసి సర్వే చేపట్టారు. ఇందులో 9సెంట్ల భూమి సరిహద్దు రైతు కామరాజు ఆక్రమించి గట్టు వేసుకున్నట్లు గుర్తించి రెండురోజుల్లో ఆక్రమణలు తొలగించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్య అవగాహన ర్యాలీలు

గొల్లప్రోలు: డెంగీ, మలేరియా ప్రబలకుండా దోమలు నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యులు పిలుపునిచ్చారు. చేబ్రోలులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి వినీత్, సంతోష్ ఆశ్రితలు వివరించారు. వైద్య సిబ్బంది విజయలత, రామ్మోహనరావు, గంగాధర్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. గొల్లప్రోలు యూపీహెచ్‌సీ వైద్యుడు అమృతరావు, హెచ్‌వీ లక్ష్మీరమణ, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షించాలి

గొల్లప్రోలు: గ్రామాల్లో రక్షిత నీటి పథకం పైపులు, డ్రెయిన్లు కలిసేచోట లీకేజీలు లేకుండా, తాగునీరు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని జడ్పీ సీఈవో లక్ష్మణరావు ఆదేశించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించి 15 రోజులకోసారి శుభ్రపరచాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు చెప్పారు. ఎంపీడీవో స్వప్న, డిప్యూటీ ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

వారాహి మాతకు పూజలు

రమణయ్యపేటలో..

సర్పవరం జంక్షన్: వారాహి అమ్మవారి నవరాత్రులు పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో హయగ్రీవ, దత్తాత్రేయ హోమాలు నిర్వహించారు. రాయుడుపాలెంలోని హ్రీం పీఠంలో వ్యవస్థాపకుడు ఈశ్వర్ గురూజీ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు.

సామాజిక సేవలు అలవర్చుకోవాలి

సామర్లకోట: సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక సేవలు అలవర్చుకోవాలని భీమేశ్వర లయన్స్‌క్లబ్ సామర్లకోట అధ్యక్షుడు ఆముదాల శ్రీనివాస్ అన్నారు. గురువారం సామర్లకోట పట్టణంలో పేదలకు ఆహారపొట్లాలు అందించే కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, చక్రధర్, సురేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కరప, న్యూస్‌టుడే: కష్ట సమయాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక సేవావేత్త పోలిశెట్టి నారయ్య కోరారు. కరపలోని నక్కావారి ఎస్సీపేటకు చెందిన ఉల్లి దేవుడు తన తాటాకిల్లు పాడైపోయి వర్షం ఇంట్లోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నారయ్య అభ్యర్థన మేరకు విశ్రాంత ఉద్యోగి వి.శ్రీనివాసరావు అందించిన రూ.5వేలను బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

సామర్లకోట గ్రామీణం, సర్పవరం జంక్షన్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజల పాలిట పెన్నిధి అని ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని కొప్పవరం కూడలిలో ఉన్న క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేశారు. కాకినాడకు చెందిన చక్రిరాల వీర వెంకట చలపతిరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ రూ. లక్ష చెక్కును ఆయన కుమారుడు వసంత్‌కు ఎంపీ అందజేశారు. నాయకులు ఆరిగెల శ్రీనివాసరావు, తోట నవీన్, నులు కుర్తి వెంకటేశ్వరరావు, కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. ● కాకినాడ గ్రామీణం వలసపాకల తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, తెదేపా నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా 20 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారు. పలివెల త్రిమూర్తులు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

వసంత్‌కు చెక్కు అందజేస్తున్న ఎంపీ సానా సతీష్‌బాబు

వలసపాకలలో చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పిఠాపురం, కాజులూరు: పిఠాపురం మండలం కుమారపురంలోని ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం కొత్త లైన్ ఏర్పాటు పనులు జరుగుతాయని ఈఈ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కుమారపురం, ఎఫ్‌కేపాలెం గ్రామాల్లో సరఫరాకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ✦ ఆర్యవటం ఉపకేంద్రం ఆవరణలో మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కాజులూరు, అయితపూడి, తిప్పరాజుపాలెం, ఒంటితాడి, పల్లిపాలెం, శీల, గొర్రిపూడి, కొంగోడు, బంధనపూడి, చీకట్లవారిపేట, మతుకుమిల్లి, తర్లంపూడి, టి. మామిడాడ, చేదువాడ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఎస్వీ రంగారావుకు నివాళి

తాళ్లరేవు: కోరింగ పంచాయతీ పరిధిలోని పెదబొడ్డువెంకటాయపాలెంలో విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఏఎంసీ మాజీ ఛైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు, తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి నివాళి అర్పించారు.

పెదబొడ్డువెంకటాయపాలెంలో...

CHANGE OF NAME

I, ADDEPALLI KANAKA LAKSHMI W/o ADDEPALLI SRINIVAS, Resident of D.No. 3-22, Post Office Streeet , Thimmapuram , kakinada Rural , Kakinada District. I have changed my name from DURGA GUTTULA (Before Marriage) to ADDEPALLI KANAKA LAKSHMI (After Marriage) Hence I am being called ADDEPALLI KANAKA LAKSHMI As per Affidavit dated 12.03.2025 for all Purpose. KAMBHAMAPTI YEDUKONDALU Advocate - Notary Kakinada .

లింక్ దస్తావేజులు పోయినవి

సామర్లకోట వాస్తవ్యులు లేటు చందలాడ దినవీర్రాజు గారి కుమారుడు చందలాడ పద్మరాజు అను నేను, నా బావగారు అయిన కూచిపూడి బాపినాడు పేరున విశాఖపట్నంలో మధురవాడ సబ్ రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 3082/2007, 3083/2007, 3084/2007, 3085/2007 మరియు 3086/2007లకు సంబందించిన లింక్ డాక్యుమెంట్ నెం. 32/1994, 16/1994, 68/1994, 69/1994 మరియు 80/1994 లను జిరాక్స్ చేయించుటకు ది.15-05-2025న సామర్లకోటలో మా ఇంటి నుండి మఠం సెంటర్ వద్దకు తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడి పోయినవి. కావున ఎవరికైనా దొరికిన ఎడల నా అడ్రస్సుకు తెలియ పరచవలసినదిగా కోరుచున్నము.

చందలాడ పద్మరాజు,
డోర్ నెం.9-2-2, చందలాడ వారి వీధి,
సామర్లకోట – 533440.
సెల్ నెం: 98491-10920

లింక్ దస్తావేజులు పోయినవి

సామర్లకోట వాస్తవ్యులు లేటు చందలాడ దినవీర్రాజు గారి కుమారుడు చందలాడ పద్మరాజు అను నేను, నా సోదరి కూచిపూడి లక్ష్మి బుల్లెమ్మ పేరున విశాఖపట్నంలో మధురవాడ సబ్ రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 3077/2007, 3078/2007 మరియు 3079/2007లకు సంబందించిన లింక్ డాక్యుమెంట్ నెం. 29/1994, 30/1994 మరియు 31/1994 లను జిరాక్స్ చేయించుటకు ది.15-05-2025న సామర్లకోటలో మా ఇంటి నుండి మఠం సెంటర్ వద్దకు తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడి పోయినవి. కావున ఎవరికైనా దొరికిన ఎడల నా అడ్రస్సుకు తెలియ పరచవలసినదిగా కోరుచున్నము.

చందలాడ పద్మరాజు,
డోర్ నెం.9-2-2, చందలాడ వారి వీధి,
సామర్లకోట – 533440.
సెల్ నెం: 98491-10920

కాలువ శుభ్రం చేయాలి

మన చైతన్యం.. జనసౌకర్యం

పిఠాపురంలోని పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి విరవాడ వెళ్లే మార్గంలో ఉన్న పంట కాలువ నిండా గుర్రపుడెక్క ఆవరించింది. ఈ కాలువ నుంచి పట్టణ శివారు ఆయకట్టుకు సాగునీరందుతుంది. ఖరీఫ్ సాగుకు దగ్గర పడుతున్న నేపథ్యంలో కాలువను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే సాగునీటి ఎద్దడి తప్పదని రైతు నాగేశ్వరరావు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను జలవనరులశాఖ ఏఈ ప్రసన్నకుమార్‌కు చెప్పగా త్వరలోనే శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

పడిపోయిన ప్రహరీ.. తప్పిన ప్రమాదం

గొల్లప్రోలు: గొల్లప్రోలు మార్కెట్ సమీపంలో ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీలో కొంత భాగం గురువారం కూలి రోడ్డుపై పడింది. కొన్నాళ్లుగా కురుస్తున్న వర్షాలతో శిథిల స్థితిలో ఉన్న గోడ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. శిథిల స్థితిలో ఉన్న ప్రహరీ, భవనాల యజమానులకు నోటీసులు జారీచేసి తొలగించాలని కోరుతున్నట్లు టీపీవో నీలిమాదీప్తి తెలిపారు.

గుంతలో పడితే అంతే..

పెద్దాపురం పట్టణం జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారి గుర్రాల సెంటర్ ప్రాంతంలో సుమారు రెండు అడుగులు లోతున గుంత పడింది. ఈ రహదారి ఇటూ జగ్గంపేట, ఏజెన్సీ మండలాలకు, అటూ రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు వచ్చే వాహనాలతో రద్దీమయంగా ఉంటుంది. ఈ గుంతలో ద్విచక్రవాహనదారులు పడితే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉంది. దీనిపై ర.భ.శాఖ డీఈఈ రాఘవరావు మాట్లాడుతూ సిబ్బందిని పంపి గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

దివ్యాంగులకు భోజన సౌకర్యం

పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం: పెద్దాపురం పట్టణంలో గురువారం టూ వీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్‌ల ప్రదర్శనను పురపాలక సంఘ మాజీ అధ్యక్షుడు రాజాసూరిబాబురాజు ప్రారంభించారు. సామర్లకోటకు చెందిన తూరంపాటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం పులిమేరులోని శాంతి వర్ధన్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. ✦ సామర్లకోటలో ఇందన రాము ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ రోడ్డులో కార్యక్రమం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు అనీల్ పాల్గొని కేక్ కోసి ప్రజలకు పంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, తినుబండారాలు పంపిణీ చేశారు. ✦ పిఠాపురంలో సంఘ జిల్లా కార్యదర్శి యాసిన్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి దొరబాబు మాట్లాడుతూ మెకానిక్ వృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలి..

పిఠాపురం, సామర్లకోట, సర్పవరం జంక్షన్: క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలని పాస్టర్లు సూచించారు. గురువారం పిఠాపురం ఏబీసీ చర్చిలో భారత క్రైస్తవ దినోత్సవం నిర్వహించారు. వైద్యం, విద్య, పేదలకు సేవలు చేయడంలో క్రైస్తవులు ముందుంటారన్నారు. థియోఫిలాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ✦ సమాజంలో క్రైస్తవులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పురపాలిక వైస్ ఛైర్‌పర్సన్ ఊబా జాన్‌మోజెస్ అన్నారు. సామర్లకోట పట్టణంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ దినోత్సవాన్ని ఆ సంఘ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ బ్లెస్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పురపాలిక వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజేస్ ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి, భవిత కేంద్రంలో దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ✦ కాకినాడ గ్రామీణం సర్పవరం జంక్షన్‌లోని దుర్గా మిని గూడ్స్ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ సంఘ కార్యాలయంలో వెన్నపు పాల్‌ప్రసాద్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇనోదయ హాస్పటల్స్, శ్రీసత్య, సరి డెంటల్ హాస్పటల్స్ వైద్యులు అడ్డాల సత్యనారాయణ, అలైస్ పెర్సీ, రీనా ఆధ్వర్యంలో ప్రజలు, కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

కౌలు రైతులకు కార్డులు అందించాలి

గొల్లప్రోలు: అర్హులైన కౌలు రైతులందరికీ ఎల్ఈసీ కార్డులు అందించాలని గొల్లప్రోలు ఇన్‌ఛార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ వీఆర్వోలను గురువారం నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. గ్రామాల వారీగా కౌలురైతుల జాబితాలు రూపొందించాలన్నారు.

భక్తులకు ఉచిత ప్రసాదం వితరణ

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని పిఠాపురం గోపాలబాబా ఆశ్రమం వారు సుమారు 300కేజీల ప్రసాదం వితరణ చేశారు. దానిని అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

పెద్దాపురం, కరప: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణకై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అన్నారు. గురువారం పెద్దాపురం మండలం చదలాడ, దివిలి, జి.రాగంపేట గ్రామాలను ఆయన పరిశీలించారు. జి.రాగంపేటలో చెత్త నుంచి సంపద తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ✦ తడి-పొడి చెత్తను వేరు చేసి ఇంటింటా తిరిగే పారిశుద్ధ్య సిబ్బందికి అందించేలా ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు సూచించారు. కరపమండలం విజయరాయుడుపాలెంలో ఆయన సర్పంచి వెలుగుబండి సీతారామ రాఘవతో కలిసి తడి-పొడి చెత్త సేకరణపై మహిళలకు అవగాహన కల్పించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కాజులూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. ఆర్యవటం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉంది. ఎంపీడీవో, ఎంఈవో డేవిడ్ గురువారం గ్రామానికి చేరుకుని పాఠశాల ఉపాధ్యాయురాలు కె.అమ్మాజీ, గ్రామస్థులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వాడబలిజ మత్స్యకార జాతి అభివృద్ధికి కృషి

సామర్లకోట గ్రామీణం: వాడబలిజ మత్స్యకార జాతి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. కొప్పవరం కూడలిలోని కార్యాలయంలో గురువారం ఎంపీని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఆధ్వర్యంలో కాకినాడ నగర వాడబలిజ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఆ సంఘం అధ్యక్షుడు నీలపల్లి కామరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XII ADDL DISTRICT JUDGE COURT AT PITHAPURAM
E.P.NO: 55/2021, ARC NO: 319/2019

Between :
M/s. Shriram City Union Finance Ltd.,
Rep. though G. P. A Holder, D. Rammohan,
Regional Manager, Zonal Office, Rajahmundry.
... Decree Holder
And
1. Ganta Suneel
2. Ganta Malleswari
3. Surada Samuel Raju ...Judgement Debtor

పై నెంబరు గ్రంథము సందు డిక్రీ బాకీ మరియు ఖర్చులు దర్మిలా వడ్డీ మరియు ఇతర ఖర్చులు వసూలు చేసుకునే నిమిత్తం 2వ JDR అయిన శ్రీమతి గంటా మల్లేశ్వరి యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో గల ఈ క్రింది ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కోర్టు వారు 16-07-2025 తేదీన శ్రీ కోర్టు వారి ఆవరణలో ఉదయం 10.30 ని॥ల నుండి బహిరంగంగా వేలం నిర్వహించబడునని కావలసినవారు శ్రీ కోర్టు వారి యెదుట జరుగు వేలం పాటలో పాల్గొని పాడుకోవలసినదిగాను యిందుమూలముగా యావన్మందికి ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచటం అయినది. వేలం పాటలో పాల్గొనదలచినవారు తదుపరి వివరముల కొరకు పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టు మరియు సుజారత్ వారి ఆఫీసు నందు సంప్రదించగలరు.

SCHEDULE FILED BY THE DHR

East Godavari District, Pitapuram Sub-Registry, Kothapalli Mandal, Aminabad Panchayath and Villlage, S.No.43/6, Plot No.11B, house site to an extent of 97 Sq. yards within the following **Boundaries:** **East:** 18.6 feet 12 feet width passage in which 6 feet from this property, **West:** 18.6 feet Plot No.14B, **North:** 47 feet Plot No. 11A, **South:** 47 feet Plot No.12.

Value of the Schedule Property:

DHR విలువ : రూ.3,09,000/-
అమీనా విలువ : రూ.4,00,000/-
మార్కెట్ విలువ : రూ.1,06,700/-
JDR విలువ : ఇవ్వలేదు

GSMN స్వామి, అడ్వకేట్
గాంధీ నగర్, కాకినాడ,
రాజమండ్రి 03.07.2025 సెల్: 98661 91397 & 70135 11357

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సిఫార్సు

పెద్దాపురం: పెద్దాపురం నియోజకవర్గంలో కొత్తగా కాలనీలు ఏర్పడడం, ఓటర్లు పెరుగుతున్నందున నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు సిఫార్సులు చేసినట్లు పెద్దాపురం ఆర్డీవో కె. శ్రీరమణి అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంత మంది ఓటర్లు తమ సమీప పోలింగ్ కేంద్రానికి మార్పుచేయమని కోరుతున్నందున క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేస్తామన్నారు. పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, పట్టణ తెదేపా అధ్యక్షుడు సత్యనారాయణ, సీపీఎం నాయకుడు సూరిబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను తరిమేద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం

సామర్లకోట, సర్పవరం జంక్షన్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను తరిమేద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం.. అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సామర్లకోట అయోధ్యరామపురం బచ్చు ఫౌండేషన్ పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచులు వాడకం నిషేధ దినోత్సవాన్ని పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ● కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలో గురువారం లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచులు రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్తులకు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ సంచులు వాడకం వల్ల కలిగే అనర్థాలను, ప్రత్యామ్నాయాలను వైద్యులు అడ్డాల సత్యనారాయణ, సువర్ణరాజులు వివరించారు.

కూటమి పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

సామర్లకోట గ్రామీణం: కూటమి ప్రభుత్వ సుపరిపాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మండలంలోని పి.వేమవరం, కాపవరంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ విజయాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. నిమ్మకాయల రంగనాగ్, పార్టీ నాయకులు తోటకూర శ్రీనివాస్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

పి.వేమవరం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సర్పవరం జంక్షన్, తాళ్లరేవు: కాకినాడ గ్రామీణ పరిధి నేమాం గ్రామంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. కర్రి వెంకట్రాజు, పలివెల గాయిత్రి తదితరులు పాల్గొన్నారు. తూరంగి గ్రామం మహాలక్ష్మి నగర్‌లో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు కరపత్రాలు పంపిణీ చేశారు. ✦ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చెల్లె వివేకానంద అన్నారు. జి.వేమవరం, పటవల, పెదబొడ్డువెంకటాయపాలెం, సుంటకరేవు గ్రామాల్లో తెదేపా గ్రామ కమిటీల అధ్యక్షులు భజన సత్తిబాబు, కొప్పిశెట్టి చంటి, వడ్లమూరి సతీష్, గండి అప్పారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ✦ కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. తాళ్లరేవు మండలం నీలపల్లి రాజులకాలనీలో సర్పంచి చిట్టూరి నాగమణి, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు వస్కా రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో కరపత్రాలు పంచిపెట్టారు. చిక్కాల, క్లస్టర్ సమన్వయకర్త టేకుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పెదపూడి: పెదపూడి మండలం పైన గ్రామంలో తెదేపా నేత నల్లమిల్లి మనోజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో గ్రామంలో సుమారు రూ.4 కోట్లకు పైగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు చేపట్టామన్నారు. మట్టపర్తి వీరభద్రరావు, జుత్తుక సూర్యకుమారి పాల్గొన్నారు.

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రెండోరోజు..4 కేసులు..రూ.64 వేలు జరిమానా

కత్తిపూడిలో కేసు నమోదు చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

ఈనాడు కథనానికి స్పందన

శంఖవరం, న్యూస్‌టుడే: ఈనాడులో వచ్చిన కథనానికి వరుసగా రెండో రోజు రవాణాశాఖాధికారులు పలు కేసులు నమోదు చేశారు. కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్ బుధవారం 16 కేసులు, రూ.98వేలు విధించిన సంగతి తెలిసిందే. రెండో రోజు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న నాలుగు వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.64వేలు అపరాధ రుసుము విధించారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ తుని డిపో మేనేజర్ జి.జి.వి. రమణ తెలిపారు. ఈ నెల 8న సూపర్‌లగ్జరీ ప్రత్యేక బస్సు బయల్దేరుతుందన్నారు. మంగళవారం (జులై 8) ఉదయం 10 గంటలకు బయల్దేరి విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి 11న రాత్రి తుని చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.3,500 టికెట్టు ధరగా నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 73829 13216, 85550 55080, 73829 13016 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

నిర్వహణకు నీళ్లు.. హైవేపై పాట్లు

ప్రమాదకరంగా ఎన్‌హెచ్ అంచులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ప్రజా ప్రయోజనార్థం నాలుగు వరుసలుగా జాతీయ రహదారిని తీర్చిదిద్దారు. దీంతో వాహన వేగం పెరిగింది. ప్రయాణ దూరం తగ్గింది. కాని నిర్వహణ మాత్రం మరిచారు. స్వల్ప మొత్తంలో అయ్యే పనులు సైతం చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని యర్రవరం నుంచి అన్నవరం వరకు ఉన్న సుమారు 40 కి.మీ. పొడవున ఉన్న ఎన్‌హెచ్‌పై పలు సమస్యలు. సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.

ప్రమాదకరంగా కాలువలు

జాతీయ రహదారిపై కురిసిన వర్షం నీరు దిగువకు సజావుగా పోయేందుకు రోడ్డువైపులా కాలువలను నిర్మించారు. కాలువలపై స్లాబు దిమ్మెలను అమర్చారు. కాని పలు ప్రాంతాల్లో స్లాబు దిమ్మెలు ఛిద్రమైనా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేవు. మండలంలోని చిర్రింపేటలో కాలువలపై స్లాబు దిమ్మెలు లేవు. ఈ ప్రాంతంలో లారీ ఒకటి అదుపు తప్పి హైవే వెంటే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఇది జరిగి నెలరోజులు కావస్తున్నా.. తిరిగి స్లాబు రాళ్లను అమర్చలేదు. హైవే వెంటే ఇలా ప్రమాదకరంగా ఉన్నా ... [illegible] ... సమస్యను పరిష్కారం చూపడంలేదు.

యర్రవరంలో జాతీయ రహదారి అంచునే చేరిన వర్షం నీరు

నీళ్లతో కనరాని అంచులు

ఎన్‌హెచ్ వెంటే ఉన్న దుకాణాల ముందు మట్టితో ఎత్తు చేసుకున్నారు. ఈ క్రమంలో నీరు హైవే వెంటే నిల్వ ఉంటోంది. రహదారి అంచుల్లో కోతపడి వర్షానికి నీరు నిలుస్తుంది. ఒకవైపు రయ్‌రయ్‌మంటూ భారీ వాహనాలు దూసుకుపోయే హైవేపై ద్విచక్ర వాహనాలు అంచులవెంట రాకపోకలు సాగిస్తున్నారు. యర్రవరం, చిర్రింపేట, ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి ఇలా ఎక్కడ చూసినా అంచులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్డుకి సమాంతరంగా అంచు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి దిగాలంటే తిరిగి ఎక్కాలంటే సాహసమే. పరిమితికి మించి నల్లరాతిని లారీలు రవాణా చేస్తున్నాయి. అదనంగా వాహనాల్లో వేస్తున్న మెటల్ రహదారిపై ఎక్కడపడితే అక్కడ పడుతుండడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు జారిపడుతున్నారు. సంబంధిత శాఖ సిబ్బంది చొరవ తీసుకుని హైవే అంచులను పటిష్ఠం చేయాలని, నీరు నిలిచిపోకుండా ఏర్పాట్లు చేయాలని ప్రజానీకం కోరుతోంది.

నాయనార్లకు శుభ స్వాగతం..!

63 విగ్రహాల ప్రతిష్ఠకు శ్రీకారం నేడు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

మండలంలోని రాచపల్లిలోని శ్రీరమణ సేవాశ్రమంలో వెలసిన అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివభక్తులైన 63 నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. జులై 7న ఆలయ ప్రాంగణంలో నాయనార్ల శిలా విగ్రహాలు, మరో 63 లోహ విగ్రహాలను కొలువుదీర్చనున్నారు. ఆంధ్ర అరుణాచలంగా ప్రసిద్ధి చెందుతున్న ఈ దేవస్థానం తిరువణ్ణామలైలోని అరుణాచల ఆలయ నమూనాగా నిర్మించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణాచల మాధవి, శ్రీరమణ సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద పర్యవేక్షణలో మహోత్సవాల సన్నాహాలు పూర్తయ్యాయి. నేడు గోపూజ, గణపతి, లక్ష్మీ నవగ్రహ హోమాలు జరుగుతాయి. జులై 5న రుద్ర సంగ్రహణం, అగ్నిసంగ్రహణం, దీక్షా హోమం, శాంతిహోమం, అనంతరం రక్షోఘ్నం, గ్రామబలి, ప్రవేశబలి నిర్వహిస్తారు. 6న స్వామి అమ్మ, అంకురార్పణ, యాగశాల నిర్మాణం, అష్ట పూజ జరుగుతాయి. 7న నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ, కుంభాభిషేకం జరుగుతాయి.

రాచపల్లిలోని అరుణాచలేశ్వర క్షేత్రం, కొలువైన స్వామివారు

అంకెల్లో విశిష్టత

1 తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే అరుణాచలేశ్వర క్షేత్ర ఆలయాల్లోనే.. 2 ఆసియాలోనే రెండో అరుణాచల క్షేత్రం.. తిరువణ్ణామలై తర్వాత ఇక్కడే.. 63 మహాశివ భక్తులైన సుందరర్, తిరునీలకంఠ, అనయ, ఇలా.. 63 నాయనార్ల విగ్రహాలు కొలువుదీరనున్నాయి. వీటిని మహాబలిపురం నుంచి తెచ్చారు. మరో 63 లోహ విగ్రహాలు కుంభకోణం నుంచి వచ్చాయి. 4 అపీత కుచాంబ, దక్షిణామూర్తి, వినాయకుడు, షణ్ముఖుడు ఉపాలయాలు ఉన్నాయి. 9 ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తి, లక్ష్మీ హయగ్రీవ, సూర్యభగవానుడు, కాలభైరవుడు, లింగోద్భవ మూర్తి, నృత్యలింగమూర్తి, గంగామాత, నందీశ్వరుడు, భరతమాత విగ్రహాలు కొలువు. ✦ ప్రధాన ఆలయం చుట్టూ ఉపాలయాలు, జనవేశ్వరుని మండపం, ప్రాకార మండపాలు, పుష్కరిణి, సమీపంలోని కృష్ణమందిరం సందర్శకుల తాదాత్మ్యం చెందేలా ఉంటాయి.

క్షేత్ర ప్రస్థానం ఇదీ..

● 1990 ఆగస్టు 15న రాచపల్లిలో శ్రీరమణ సేవాశ్రమం స్థాపన ● 1996లో నిర్విషయానంద మందిరం ● 1998లో రమణ మందిరం నిర్మాణం ● 2008 ఆగస్టు 28న శ్రీఅపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి శంకుస్థాపన ●.2021 మార్చి 6న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగాయి. నాటి నుంచి నిత్యకల్యాణం.. పచ్చతోరణంగా క్షేత్రం అలరారుతోంది.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు: ఎమ్మెల్యే దివ్య

తుని పట్టణం, తొండంగి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు అన్ని విధాలా మేలు జరుగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. పట్టణంలోని కొండవారిపేట ప్రాంతంలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి

తుని కొండవారిపేటలో ప్రజలకు కరపత్రాలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, నాయకులు మళ్ల గణేష్, తాటిక సురేష్, లంక సునీల్, గూటాల అప్పారావు, జువ్వల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. * సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం బెండపూడిలో జరిగింది. ఎమ్మెల్యే దివ్య ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి గురించి వివరించడంతో పాటు కరపత్రాలు అందించారు. నాయకులు యనమల రాజేష్, సాధనాల నూకరాజు, పాలచర్ల ఎర్రబ్బు, గోపి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ డే సందర్భంగా ర్యాలీ

తుని, న్యూస్‌టుడే: మెకానిక్ డే సందర్భంగా పురవీధుల్లో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. కనకదుర్గా స్కూటర్స్, మోటార్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని సంఘ భవనంలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించుకున్నారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు జి.నానాజీ, జి.నూకరాజు, బొబ్బిలి వెంకట రమణ, కీర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ప్రదర్శన చేస్తున్న మెకానిక్కులు

'సుపరిపాలనలో తొలి అడుగు'తో ఇంటింటా సంతోషం: ఎంపీ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఇంటింటా సంతోషాన్ని చూస్తున్నామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. మండలంలోని ఏలూరు గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నేతృత్వంలో జరిగిన 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, పరిశీలకుడు మెట్ల రమణబాబు, పార్టీ నేత తోట నవీన్, పార్టీ శ్రేణులతో కలిసి గురువారం పర్యటించారు. పథకాల అమలు పట్ల సంతృప్తి వ్యక్తం అవుతోందని ఎంపీ అన్నారు. సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు సర్పంచి సత్యనారాయణ, మాజీ సర్పంచి యమున, నాయకులు అబ్బులు, త్రిమూర్తులు స్వాగతం పలికారు. కొమ్ముల కన్నబాబు, బద్ది రామారావు, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి పాల్గొన్నారు.

ఏలూరులో ఎంపీ సతీష్‌బాబు, ఎమ్మెల్యే సత్యప్రభ రమణబాబు తదితరులు

ఏ ఆసరా లేని శిశువులను ఆదరిద్దాం: ఎమ్మెల్యే

ఏలేశ్వరం: ఏ ఆసరా లేని శిశువులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో గురువారం అభాగ్యులకు అమ్మ బడి, బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై శిక్షణ కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. జన్మనిచ్చిన శిశువులను ఎక్కడైనా చెత్త కుప్పల్లో గుర్తిస్తే 1098, 181 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఊయల'లో వేయాలన్నారు. ఎంపీపీ బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బి.గోపీ, మూది నారాయణస్వామి, నాయకులు జ్యోతుల పెదబాబు, పెంటకోట మోహన్, బద్ది రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి పాల్గొన్నారు. కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పుస్తకాలను ఎమ్మెల్యే అందించారు.

సేవలు విస్తృతం కావాలి.

ఏలేశ్వరంలో 'నరేగా' కార్యాలయాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. ఎంపీపీ బుజ్జి , వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో రైతులకు డ్రోన్లు

జగ్గంపేట,న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని రాష్ట్రప్రభుత్వం 80శాతం రాయితీతో రైతులకు డ్రోన్లను అందిస్తుందని

రైతుకు డ్రోన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం తెదేపా కార్యాలయం వద్ద గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర సీహెచ్‌సీ రైతు గ్రూపునకు డ్రోన్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాల వారిగీ పరిమితంగా రైతు గ్రూపులకు డ్రోన్లను అందిస్తుందన్నారు. నాయకులు పోతుల మోహనరావు, కుంచె రాజా, బొల్లంరెడ్డి రామకృష్ణ, గండేపల్లి మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు పాలనంతా ప్రజాసంక్షేమమే

జగ్గంపేట గ్రామీణం,: ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతుందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు అన్నారు. నరేంద్రపట్నంలో పర్యటించిన ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి యాప్‌లో పొందుపరిచారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి నాయకత్వంలో ఎంతో అభివృద్ధి సాధించడం జరిగిందన్నారు. నాయకులు తోట నవీన్, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అప్పలరాజు, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం

గండేపల్లి: ఏడాది పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు తెలియజేసేందుకు 'సుపరిపాలన తొలిఅడుగు' చేపట్టినట్లు మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహనరావు, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి జాస్తి వసంత్ అన్నారు. తాళ్లూరులో గురువారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ప్రారంభించారు. నాయకులు సర్పంచ్ శీలామంతుల వీరబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, ఉండవల్లి బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

జగ్గంపేటలోని శాలిపేట వినాయకుడి ఆలయసమీపాన ఉన్న 13వ నంబర్ అంగన్‌వాడీ భవనం పక్కన ఉన్న ఖాళీస్థలంలో తుప్పలు పెరిగి భవనాన్ని కప్పేస్తున్నాయి. దీనిపై జూన్ 29న 'ఈనాడు'లో 'కేంద్రాన్ని మొక్కలు కప్పేస్తున్నాయి' అని కథనం ప్రచురితం కావడంతో సిబ్బంది కేంద్రం చుట్టూ ఉన్న తుప్పలను తొలగించి శుభ్రంచేశారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట

మురుగు తీశారు సరే.. వదిలేస్తే ఎలా..!

తుని పట్టణం వీరవరపుపేట నుంచి కొత్తసూరవరం వెళ్లే మార్గం దుర్గంధంతో ఉంది. కొద్ది రోజుల కిందట కాలువల నుంచి మురుగు తీసి రోడ్డుపైనే వదిలేశారు. తర్వాత వర్షాలు పడి బురదమయం కాగా రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో చేయాల్సిన పనులు వానాకాలంలో చేస్తుండడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సలీమ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తడి ఆరిన వెంటనే మట్టి, వ్యర్థాలు తరలిస్తామన్నారు. – న్యూస్‌టుడే, తుని పట్టణం

రెండు వాహనాలు ఢీ.. చోదకుడికి గాయాలు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : మండలంలోని యర్రవరం ఎన్‌హెచ్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. జగ్గంపేట నుంచి ప్రత్తిపాడు వైపు వెళుతున్న లారీకి మేకలు అడ్డురావడంతో చోదకుడు అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. ఇదే సమయంలో కోళ్లతో వస్తున్న వ్యాన్ లారీని ఢీకొట్టింది. వ్యాన్ క్యాబిన్‌లో ఉన్న చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ వెనుకభాగం వ్యాన్‌లో దూసుకుపోవడంతో ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ దగ్గరుండి సహాయక చర్యలను చేయించారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలను హైవే అంచుకు తరలించే ఏర్పాట్లు చేశారు. గాయపడిన వ్యాన్ చోదకుడ్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సహాయ చర్యలు పర్యవేక్షిస్తున్న జ్యోతుల నవీన్

విభాగినిని ఢీకొట్టిన లారీ..తప్పిన ప్రమాదం

తొండంగి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్‌పై ఓ లారీ డివైడర్ (విభాగిని)ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలివీ.. కత్తిపూడి నుంచి తుని వైపు వెళ్తున్న ఓ లారీ గురువారం తమ్మయ్యపేట వద్ద అదుపుతప్పి రహదారి మధ్యలో ఉన్న విభాగినిని ఢీకొట్టింది. అదే సమయంలో వెనుకే వస్తున్న మరో లారీ వేగంగా వచ్చింది. అయితే డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించి ఆ లారీని నిలుపుదల చేశాడని లేకుంటే ముందు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. డివైడర్‌ను ఢీకొట్టిన లారీ ముందుభాగం నుజ్జయ్యింది. ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

PUBLIC NOTICE

On instructions by my client M/s. Shriram Finance Ltd., Inniespeta Branch, Rajamahendravaram issue this notice to General Public. My client intends to sanction loan to Maddala Durga Prasad, S/o Ramana, Jagapathinagaram Village, Kirlampudi Mandal, E.G.Dt. on the security of the below mentioned property belongs to them by way of registered equitable mortgage.

SCHEDULE OF THE PROPERTY/TIES

RCC roof Daba house in an area of 170 Sq. yards = 142-8 Sq. meters on western side to a tiled house bearing Door No. 1-86 = new Door No. 1-122 covered by RS No.340 situated at Jagapathinagaram Village, within Jagapathinagaram Gram Panchayati, within Kirlampudi Mandal, within Sub Registrar of Prathipadu, E.G.Dist., within the following boundaries: **EAST** : Wall between this property and property of Maddala Veera Ganapathi 51'-0"; **SOUTH** : House, site of Puwala Subrahmanyam, Alla Venkateswara Rao 30'-0"; **WEST** : Main Road 51'-0"; **NORTH** : Main Road 30'-0" Together with electrical service connection and all easement rights (As per Regd. Sale Deed dated 29-06-2016 (Vide Doct. No.3315/16))

PLN PRASAD, B.Com., B.L., Advocate
Rajahmundry, D.No: 11-3-10, Seshaiahmetta
Dt: 02-07-2023. RAJAMAHENDRAVARAM-4, Cell. 98495 87025

గురుగ్రామ్‌లో జాతీయ స్థాయి సదస్సు ప్రారంభం

తుని, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రం గురుగ్రామ్‌లో రెండు రోజులు జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సుకు పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి గురువారం హాజరయ్యారు. పలు నగరపాలక, పురపాలక, నగర పంచాయతీల ఛైర్మన్లు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. రాజ్యసభ సభ్యుడు దినేశ్‌శర్మ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై నిర్వహించిన సమావేశంలో తుని పట్టణంలోని డ్రెయినేజీ వ్యవస్థ, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు తీసుకుకుంటున్న చర్యలపై ఛైర్‌పర్సన్ భువనసుందరి మాట్లాడారు.

సదస్సులో నార్ల భువన సుందరి

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

తుని, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైను మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు, ఏఈ మాధురి తెలిపారు. తుని మండలంలోని హంసవరం, హెచ్.కొత్తూరు, తిమ్మాపురం, కెవో మల్లవరం, దొండవాక, సీహెచ్ అగ్రహారం, ఎస్.సూరవరం జగ్గంపేట గ్రామీణ మండలంలోని రాజపూడి, జె.కొత్తూరు, మల్లిసాల, వెంగాయమ్మపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారాంపురం, గుర్రంపాలెం, బావవరం, కాండ్రేగుల, గొల్లలగుంట, కాట్రావులపల్లి, జగ్గంపేటలో పలువీధుల్లో విద్యుత్తు సరఫరా ఉండదు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

తుని పట్టణం, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా గురువారం ద పాస్టర్స్ ఫెలోషిప్ పట్టణ, మండల శాఖల గౌరవ అధ్యక్షుడు కె.ఫిలిప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనా కూడిక నిర్వహించారు. ముఖ్య ప్రసంగికులు కె.యోహాన్ సందేశాన్ని అందించారు. సాల్మన్‌రాజు, ఆనంద్ కుమార్, ఆనంద్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

అవీ ఇవీ అన్నీ

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

కిర్లంపూడి, శంఖవరం, న్యూస్‌టుడే: రైతుకు ఖరీఫ్ పంట సాగుకు అవసరమయ్యే నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారిణి ఎన్.సుధామాధురి దుకాణదారులకు సూచించారు. కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగిల్లో విత్తన అమ్మకాల దుకాణాలను ఏవో తనిఖీలు చేశారు. ● కొంతంగి రైతుసేవా కేంద్రం వద్ద గురువారం వ్యవసాయాధికారి గాంధీ రైతులకు రాయితీపై విత్తనాలను అందజేశారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

ప్రత్తిపాడు: ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఈఆర్వో, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయంలో రాజకీయపార్టీలు, బూత్‌స్థాయి అధికారులతో ఈఆర్వో గురువారం సమావేశం నిర్వహించారు.

9న సమ్మెలో పాల్గొంటాం

ప్రత్తిపాడు: జులై 9న జరిగే సమ్మెలో పాల్గొంటామని మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి తెలిపారు. సమ్మె నోటీసును సీఐటీయూ విద్యాశాఖ కార్యాలయంలో గురువారం అందజేశారు.

ఏకరూప దుస్తుల్లో రావాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు జులై 10 నుంచి ఏకరూప దుస్తుల్లో రావాలని ఎంఈవో రాజబాబు స్పష్టం చేశారు. చింతలూరు పరిధిలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

ప్రత్తిపాడు: విద్యార్థుల సంఖ్య పెరిగేలా సమష్టిగా కృషి చేస్తామని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు తెలిపారు. యూటీఎఫ్ సమావేశం గురువారం జరిగింది.

సేవలు ప్రశంసనీయం

జగ్గంపేట: జగ్గంపేట గ్రంథాలయ అధికారి కె.ఉదయభాస్కరరావు పదవీవిరమణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. భాస్కరరావు దంపతులను పాఠకులు,సిబ్బంది సన్మానించారు.

రెయిన్ కోట్లు అందజేత

జగ్గంపేట గ్రామీణం: రాజపూడిలో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచి విష్ణుమూర్తి సొంత ఖర్చుతో రెయిన్‌కోట్లు,గొడుగులు అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుని: శ్రీసత్య వాగ్దేవి పురోహిత బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా నూకల రమేష్, ఉపాధ్యక్షుడిగా తేజోమూర్తుల వెంకట గిరి తదితరులతో కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు.

చెత్తను సంపదగా మార్చుకుంటేనే గ్రామాభివృద్ధి

గండేపల్లి: గ్రామాల్లో ఉన్న చెత్తను సంపదగా మార్చుకుంటేనే స్వచ్ఛత, అభివృద్ధి దిశగానూ పయనిస్తాయని ఎంపీడీవో చంద్రరావు అన్నారు. జడ్.రాగంపేట, ఉప్పలపాడు, తాళ్లూరు, నీలాద్రిరావుపేటలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు.

నలుగురిపై కేసులు

తుని పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరామా థియేటర్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా వేగంగా, నిర్లక్ష్యంగా బైక్ నడిపిన నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై విజయబాబు తెలిపారు.

ఆరుగురిపై బైండోవర్

గండేపల్లి, న్యూస్‌టుడే: స్థల వివాదంలో ఆరుగురిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. మల్లేపల్లి గ్రామంలోని రెండు కుటుంబాల సరిహద్దు స్థలవివాదంలో తరచూ గొడవలు పడుతున్నార న్నారు. ఈ సందర్భంగా ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులపైన, మరో కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులపైన బైండోవర్ కేసులు నమోదుచేసి మండల డిప్యూటీ తహసీల్దార్ ఎదుట హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ Union Bank of India కత్తిపూడి బ్రాంచ్ వారి తరుపున బ్రాంచ్ మేనేజరు గారు ఇచ్చిన సంజాయిషి పై యావన్మందికి తెలియజెయడమైనది ఏమనగా నక్కా వీరబాబు, తండ్రి. పాపారావు గారి పేరున గల House loan Account No. 096730100012428 ఫైల్ నందు గల ఒరిజినల్ Doct No.2584/2008 మరియు Loan Documents Miss పోయినవి అని తెలుసుకొని వెతకగా కనిపించలేదు. కావునా సదరు Loan Documents మరియు ఒరిజినల్ Document No.2584/2008 తీసుకొని వచ్చి నా క్లయింట్‌కు గాని ఈ క్రింది అడ్రసు లో ఇచ్చి తగిన పారితోషకం పొందగలరు.

R.V .Ramanarao,
Advocate,Pithapuram,
Ph. No. 92474 78463.

ఆధునికీకరిస్తే అన్నదాతకు ఆసరా..

కేఎంఆర్ ట్యాంకు దుస్థితి..

న్యూస్‌టుడే, తుని గ్రామీణం.

మెట్టప్రాంతంలోని సాగునీటి చెరువులే రైతుకు బాండాగారాలు. వేల ఎకరాలకు సాగు నీరు అందించే చెరువులు గత పాలకుల నిర్లక్ష్యంతో నిరాదరణకు గురయ్యాయి. దీంతో శిథిలమైన పొర్లగట్లు, గేట్లు, పూడికతో నిండిన గర్భాలతో చెరువుల్లోని నీటి నిల్వసామర్థ్యం తగ్గడంతో ఆయకట్టు రైతుకు పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి. దీంతో పంట చివరిదశలో తీవ్ర నష్టాలు చూడాల్సి వస్తోంది. వేల ఎకరాలకు సాగునీరు అందించే హంసవరం కేఎంఆర్ ట్యాంక్(చెరువు) ఈ కోవలో ప్రముఖమైంది. పాలకులు చెరువును ఆధునికీకరిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని పలు గ్రామాలకు చెందిన అన్నదాతలు కోరుతున్నారు.

ఆక్రమణలతో నిల్వసామర్థ్యం తగ్గుతూ..

తుని, తొండంగి మండలాల పరిధిలోని సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించే హంసవరం కేఎంఆర్ ట్యాంకు సుమారు వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన గర్భాన్ని కలిగిఉంది. అయితే దశాబ్దకాలంగా ఈ చెరువు గర్భం ఒక పక్క ఆక్రమణలకు గురికావడంతోపాటు మరో వైపు చెరువులో పూర్తిస్థాయిలో తూడికాడ పెరిగి పూడికతో నిండిపోవడం వల్ల నీటి నిల్వసామర్థ్యం తగ్గింది. కాలువ గేట్లు పాడైపోవడంతో అవసరం ఉన్నా లేకున్నా నీళ్లు దిగువప్రాంతానికి వెళ్లిపోతున్నాయి. పొర్లుగట్లు పూర్తిగా శిథిలం కావడంతో ఎప్పుడు కూలిపోతుందోనని దిగువ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో జలవనరులశాఖ అధికారులు స్పందించి చెరువును ఆధునికీకరిస్తే రైతులకు మంచి ఫలితాలు అందుతాయి. ఆ దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శిథిలమైన చెరువు పొర్లగట్టు

ప్రకటన

కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, తాళ్ళూరు గ్రామ కాపురస్తులు ఒబ్బిణ్ణి గీతాభవానీ, తండ్రి: రామకృష్ణ అనువారు ఇచ్చిన సంజాయిషీ మా క్లయింట్ గండేపల్లి మండలం, సుబ్బాయ్యమ్మపేట గ్రామ కాపురస్తులు గొల్లవిల్లి తాతారావు గారి కుమారుడు గొల్లవిల్లి రామకృష్ణ వగైరాల వద్ద నుండి ఉప్పలపాడు గ్రామం తాలూకు స.నెం. 196-2B రులో య.1-33 ట్లు భూమిని క్రయం పొందదలచియున్నారు. సదరు ఆస్తికి పుట్టబడిన దస్తావేజు నెం. 2263/1983, జగ్గంపేట SRO నందు గొల్లపల్లి తాతారావు గారి పేర పుట్టబడిన క్రయ దస్తావేజు పోయినదని మా క్లయింట్‌కు తెలియపరచియున్నారు. కావున సదరు దస్తావేజు గురించి కాని, సదరు ఆస్తిపై గాని ఎవ్వరికైనా ఏవిధమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల ఈ రోజు నుండి 3 రోజులలోగా లిఖితపూర్వకంగా ఈ క్రింది తెలిపిన అడ్రస్‌కు తెలియజేయవలెను. తదుపరి వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు చెల్లనేరవు.

షెడ్యూల్: కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, జగ్గంపేట SRO లో చేరిన ఉప్పలపాడు గ్రామ పంచాయతీ బోర్డుకు చెందిన ఉప్పలపాడు గ్రామం తాలూకు జిరాయితీ మెర్క, పాత సర్వే నెం. 196-2రుకు దరిమిలా సబ్ డివిజన్ కాబడిన సర్వే నెం. 196-2B, పూరా య. 1-33 ట్లుకు హద్దులు వివరం. తూర్పు: ఒబ్బిణ్ణి గీతాభవానీ గారి భూమి; దక్షిణం: పాము సూరిబాబు గారి భూమి; పడమర: దొడ్డి అమ్మాణీ అనే మాణిక్యం గారి భూమి; ఉత్తరం: పుత్సకాయల కామేశ్వరరావు గారి భూమి.
సదరు హద్దులు మధ్యస్థమైన య. 1-33 ట్లు జిరాయితీ మెర్క భూమి మాత్రం.

దారా శ్రీనివాస్, అడ్వకేట్
జగ్గంపేట, సెల్:98482 22455

(c) eenadu

భూస్వాధీనం.. న్యాయమేనా?

అధికారులు, మంత్రులతో సీఎం చర్చ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణ సమీపాన 13 గ్రామాల భూములను స్వాధీనపరుచుకోకూడదని రైతు సంఘాల నాయకులు, రైతు కూలీలు చేపట్టిన ఆందోళన మరింత తీవ్రమైంది. రైతులతో సమావేశమై వారి సమస్యకు పరిష్కారం చూపిస్తానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పటికే ప్రకటించారు. శుక్రవారం రైతులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడి వాస్తవ పరిస్థితులపై మంత్రులు, అధికారులతో బెంగళూరులోని తన 'కావేరి నివాసం'లో గురువారం సాయంత్రం సుదీర్ఘంగా చర్చించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, న్యాయ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, ఆహార, పౌరశాఖల మంత్రి కేహెచ్ మునియప్ప, పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్, రెవెన్యూ మంత్రి కృష్ణ బైరేగౌడ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, మరో ఐదు శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

స్వాధీనపరుచుకునే భూముల వివరాలున్న పటాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి చూపించి వివరిస్తున్న ఎంబీ పాటిల్

కర్ణాటక పారిశ్రామిక అభివృద్ధి మండలి 13 గ్రామాల్లో భూములు స్వాధీనపరుచుకునేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. దాన్ని వ్యతిరేకిస్తూ మూడున్నరేళ్లుగా స్థానిక రైతులు ఉపవాస దీక్షలు, రిలే నిరాహార దీక్షలు చేస్తూ వస్తున్నారు. ఆ ఉద్యమం ప్రస్తుతం తీవ్రరూపం దాల్చింది. కూరగాయలు, పంపర పనస సాగు ఉన్న సారవంతమైన భూములను ఎలా స్వాధీన పరచుకుంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. నంది బెట్టపై మంత్రివర్గ సమావేశంలో తమ సమస్యను పరిష్కరించే దిశలో చర్చించాలని కోరగా, బెంగళూరులోనే మీతో భేటీ అవుతానని సీఎం వారికి అప్పుడు నచ్చజెప్పి పంపించారు.

నిరసన పథం: దేవనహళ్లి తాలూకాలో రైతుల భూములను అడ్డగోలుగా లాగేసుకోవడం సరికాదంటూ వివిధ రైతు, ప్రజా సంఘాల ప్రముఖులు రాకేశ్ టికాయత్, దర్శన్ పాల్, డాక్టర్ సునిలామ్, పీటీ జాన్, సామాజిక కార్యకర్త ఎస్.ఆర్.హిరేమఠ్ తదితరులు బెంగళూరు స్వాతంత్య్ర ఉద్యానవనంలో గురువారం నిర్వహించిన ఆందోళన.. (న్యూస్‌టుడే, మెజెస్టిక్)

బావిలోకి ఆటో బోల్తా.. ఇద్దరి మృతి

బీదర్, న్యూస్‌టుడే : బీదర్ తాలూకా ఘోడంపల్లి గ్రామ శివార్లలో గూడ్సు ఆటో బుధవారం అర్ధ రాత్రి అదుపు తప్పి నేలబావిలో పడిపోయింది. ఈ ఘటనలో కాంత మహారాజ్ (45), రవి (22) అనే ప్రయాణికులు మరణించారు. అర్జున్, ప్రజ్వల్, పవన్, సంగమేశ్ అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. రహదారిపై వెళుతూ, అదుపు తప్పి పక్కనే ఉన్న పొలంలోకి గూడ్సు ఆటో దూసుకుపోవడంతో ప్రమాదం సంభవించింది. గాంధీగంజ్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

● తన కుమారుడు రవి రోడ్డు ప్రమాదంలో మరణించాడని తెలుసుకున్న అతని తల్లి శారదా బాయి (55) గుండెపోటుతో మరణించడంతో ఘోడంపల్లిలో విషాదం నిండుకుంది. కుమారుని మృతదేహాన్ని కడచూపు చూసుకోకుండానే ఆమె కన్నుమూశారు. ఘోడంపల్లి గ్రామంలో తల్లీ కుమారుల మృతదేహాలకు ఇతర కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

చినుకుల చిందులు

ఖరీఫ్ ప్రారంభంలోనే జలాశయాల భర్తీ

తుంగభద్ర జలాశయానికి గురువారం రాత్రి విద్యుద్దీపాలంకరణ

పాండవపుర సమీప చిక్కదేవరాయ డ్యాం నిండి.. కావేరి మాత ఉరకలు, పరుగులు తీసే వేళ.. యువ విహంగాలు!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తీర ప్రాంత జిల్లాలు, మల్నాడు ప్రాంతంలో భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి, హొసనగర, సాగర తాలూకాలతో పాటు కొడగు జిల్లా వ్యాప్తంగా వానలు గురువారం జోరందుకున్నాయి. అంగన్‌వాడీల నుంచి అన్ని విద్యా సంస్థలకు వర్ష ప్రభావ జిల్లాల్లో గురువారం సెలవు ప్రకటించారు. శుక్రవారం ఈ సెలవు కొనసాగించారు. వర్షం తగ్గుముఖం పడితే ఈ ప్రాంతాల్లో మళ్లీ తరగతులు ప్రారంభిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కొడగు జిల్లాలో గాలితో పాటు వర్షం భయపెడుతోంది. జిల్లా మొత్తం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. కావేరి, కపిల నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. జలపాతాల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వాటి సమీపానికి పర్యాటకులు, స్థానికులు వెళ్లకుండా అధికారులు నిషేధం విధించారు. చిక్కమగళూరు జిల్లాలోని శృంగేరి, ఎన్‌ఆర్‌పుర, కొప్ప, కళస, మూడిగెరె తాలూకాల్లోని విద్యాలయాలకు సెలవు ప్రకటించినట్లు జిల్లాధికారి మీనా నాగరాజు ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర కన్నడ జిల్లా కార్వార చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షాలకు రహదారుల పక్కన ఉన్న కొండ చరియలు విరిగి పడ్డాయి. కొడసళ్లి ఆనకట్టకు వెళ్లే మార్గంలోని రహదారి కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేందుకు అన్ని మార్గాలు మూసుకు పోయాయి. కల్యాణ కర్ణాటకకు జీవనాడి తుంగభద్ర భర్తీ కావడంతో భారీగా ఇన్‌ఫ్లో ఉండగా, 12 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. దక్షిణ కన్నడ జిల్లా కడబ, సుళ్య, కుక్కె సుబ్రహ్మణ్య ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగాయి. కుక్కెలో కుమారధార నది స్నానఘట్టాన్ని ముంచెత్తింది. మల్నాడు, తీర ప్రాంత జిల్లాలు, బెళగావిలలో మరో ఆరు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చామరాజనగర జిల్లాల్లో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశామని వాతావరణ శాఖ అధికారి ఎన్.పువ్వై అరసన్ తెలిపారు.

రవికుమార్ నోటిదురుసు

అనుచిత వ్యాఖ్యలతో కలకలం

ఎమ్మెల్సీ రవికుమార్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీశ్‌ను ఉద్దేశించి భాజపా ఎమ్మెల్సీ రవికుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'శాలిని రాత్రంతా ప్రభుత్వం కోసం, పగలంతా ముఖ్యమంత్రి కోసం పని చేస్తారు' అని నోరు పారేసుకున్నారు. కొద్ది రోజుల కిందట కలబురగి జిల్లాధికారి ఫౌజియా తరునంను ఉద్దేశించి 'జిల్లాధికారి పాక్ నుంచి వచ్చారో.. ఇక్కడే ఐఏఎస్ పూర్తి చేశారో నాకు తెలియడం లేదు' అని వ్యాఖ్యలు చేశారు. ఆ వివాదం తీవ్రం కావడంతో హైకోర్టు ముందు రవికుమార్ ఇప్పటికే క్షమాపణలు చెప్పారు. ఆ కేసు విచారణ పూర్తి కాకమునుపే అత్యంత సీనియర్ అధికారిణి శాలిని రజనీశ్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కించపరుస్తూ వ్యాఖ్యానించిన రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్ విధానసౌధ ఠాణాలో ఫిర్యాదు చేశారు. రవికుమార్‌ను విధాన పరిషత్తు నుంచి బహిష్కరించాలని పరిషత్తు అధ్యక్షుడు బసవరాజ హొరట్టికి వినతిపత్రాన్ని అందజేశామని మనోహర్ తెలిపారు.

ముఖ్యమంత్రికి ఫిర్యాదు..

బెంగళూరు (మారతహళ్లి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ రవికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ఐఏఎస్ అధికారులు గౌరవ్ గుప్త, పంకజ్ కుమార్ పాండే, ఖుష్బూ గోయల్ చౌదరి తదితరులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. అధికారులను కించపరిచేలా రవికుమార్ గతంలోనూ వ్యాఖ్యలు చేశారని, బేషరతుగా క్షమాపణలు అడగకపోతే పోరాటాన్ని తీవ్రం చేయడం అనివార్యం అవుతుందని గౌరవ్ గుప్త తెలిపారు.

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వినతిపత్రాన్ని అందిస్తున్న అధికారులు

● భాజపా నాయకులు మహిళలను కించపరిచేలా మాట్లాడడంలో సిద్ధహస్తులని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ దుయ్యబట్టారు. మను సంస్కృతికి మద్దతు పలికేవారంతా మహిళలను కించపరుస్తారని వ్యాఖ్యలు చేశారు. తనపై సీటీ రవి చేసిన వ్యాఖ్యలనూ ఆమె ప్రస్తావించారు.

ఏసీపీ నారాయణకు ముఖ్యమంత్రి ఫోన్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందని బెళగావిలో కాంగ్రెస్ నిరసన సమావేశాన్ని నిర్వహించిన సమయంలో భాజపా కార్యకర్తలు మోదీకి మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్లజెండాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేసిన వారిని ఎలా అనుమతించారంటూ ధార్వాడ ఏసీపీ నారాయణ భరమనిని తన వద్దకు పిలిపించుకుని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొట్టబోతూ, చివరి క్షణంలో నియంత్రించుకున్నారు. ఈ ఘటన అనంతరం ఆయనను ప్రభుత్వం బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వలేదు. సుమారు నాలుగు నెలలు ఆయన ఎస్పీ కార్యాలయంలో పోస్టింగ్ కోసం వేచి చూశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. విషయం తెలుసుకున్న సీఎం సిద్ధరామయ్య ఏసీపీ నారాయణకు గురువారం ఉదయం ఫోన్ చేశారు. మీపై నాకు కోపం లేదని, కోపాన్ని నియంత్రించుకోలేక అలా చేశానని, అన్యథా భావించవద్దని విజ్ఞప్తి చేశారు. రాజీనామా వెనక్కు తీసుకుని విధులకు హాజరు కావాలని కోరారు. 'ముఖ్యమంత్రి ఫోన్ చేసి, రాజీనామా వెనక్కు తీసుకోమని సూచించారు. ఇప్పుడు నేను విధులకు హాజరవుతున్నాను. రాజీనామా వెనక్కు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. రాజీనామాను అంగీకరించకుండా హోం శాఖ తిరస్కరిస్తేనే తాను విధుల్లో కొనసాగేందుకు అవకాశం ఉంటుంది' అని తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి దానిపై నిర్ణయం తీసుకుంటామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు.

శివుడికి చేదు గుళిక

రాజకీయ విషమ పరీక్ష

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : నేనే ఈ ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య నంది గ్రామంలో చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి వర్గానికి చెందిన నేతలు కంగుతిన్నారు. ఆయనే అలా చెబితే అవును అనడం మినహా నేనేమీ చెప్పే స్థితిలో లేనని శివుడు నిర్వేదాన్ని వ్యక్తం చేశారు. సిద్ధరామయ్య అనంతరం పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ ముఖ్యమంత్రి అవుతారని కోడిమఠం స్వామి జోస్యం చెప్పారు. ఈ రెండు ఘటనల నేపథ్యంలో తన రాజకీయ గురువు బీకే హరిప్రసాద్‌తో శివకుమార్ తన నివాసంలో గురువారం సమాలోచనలు నిర్వహించడం రాజకీయ వేడి మరింత పెరిగింది. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి చర్చించేందుకు వచ్చిన ఎంబీ పాటిల్‌తోనూ డీకే రాజకీయాలు మాట్లాడారని సమాచారం. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య ప్రకటించడాన్ని ఉప ముఖ్యమంత్రి సమర్థించుకోవడం ఆరో గ్యారంటీ అని విపక్ష నేత ఆర్.అశోక్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా ఎవరు కొనసాగుతారో ప్రకటించవలసిన పార్టీ అధినాయకుడు ఖర్గే, పార్టీ వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా మౌనంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇంటికి మూడు తలుపులని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి అయ్యేందుకు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదవిపై ఆశపెట్టుకున్న 'కనకపుర బండ' ఇప్పుడు జారి పడిందని శివుడ్ని ఉద్దేశించి భాజపా కర్ణాటక తన ఎక్స్ ఖాతాలో ఎద్దేవా చేసింది.

తన రాజకీయ గురువు బీకే హరిప్రసాద్‌తో మాట్లాడుతున్న డీకే శివకుమార్

అడ్డుకట్ట వేయాలి

ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ కొందరు నేతలు పట్టుబడుతున్నారు. సహకార శాఖ మంత్రి కెఎన్ రాజణ్ణపై మొదట చర్యలు తీసుకుంటే.. మిగిలిన వారు నోటిని అదుపులో ఉంచుకుంటారని కుణిగల్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్‌కు నోటీసులు జారీ చేసిన విధంగా రాజణ్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబరులో రాజకీయ ఉద్యమం వస్తుంది' అని యువ జనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ గౌడ వ్యాఖ్యానించారు.

హృదయజ్యోతి మిణుకు మిణుకు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మారుతున్న జీవనశైలి ప్రమాణాలు, పని ఒత్తిడి, నిద్రలేమి, సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, ఛాతీలో నొప్పిని గ్యాస్ట్రిక్‌గా నిర్లక్ష్యం చేయడం తదితర కారణాలతో ఎక్కువ మంది గుండెపోటుకు గురవుతున్నారని ప్రముఖ హృద్రోగ నిపుణుడు, బెంగళూరు గ్రామీణ లోక్‌సభ సభ్యుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ పునరుద్ఘాటించారు. కొన్ని జిల్లాల్లో సగటున 50 మంది మరణిస్తుండగా, బెంగళూరు లాంటి జిల్లాల్లో ఈ సంఖ్య 100కుపైగా ఉంది. పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ కార్డియాక్ అరెస్టుతో మరణించిన అనంతరం ప్రభుత్వం పునీత్ రాజ్‌కుమార్ హృదయ జ్యోతి పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గత రెండేళ్లలో ఈ పథకం కింద 7.49 లక్షల మంది ఉచితంగా ఈసీజీ పరీక్షలు, హృద్రోగ నిపుణుల సలహాలను తీసుకున్నారు. వీరిలో 7,239కి గుండెపోటు ముప్పును గుర్తించి, శస్త్రచికిత్సలు చేయించుకునేందుకు సిఫార్సు చేశారు. ఈ పథకాన్ని మార్చి 2023లో బెంగళూరులో ప్రారంభించగా, గత ఏడాది మార్చి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకూ విస్తరించారు. వైద్య పరీక్షలు, నిపుణుల సిఫార్సు అనంతరం అవసరానికి అనుగుణంగా శస్త్రచికిత్స, స్టెంటు వేయించుకోవడం, ఇతర చికిత్సలకు ప్రముఖ ఆసుపత్రులకు వెళ్లాలని రోగికి సూచిస్తారు. ఛాతీలో నొప్పి మొదలైన మొదటి గంటలోగా ఆసుపత్రికి చేర్చగలిగితే మరణాల సంఖ్యను గణనీయంగా నియంత్రించవచ్చని డాక్టర్ మంజునాథ్ తెలిపారు. గోల్డెన్ అవర్‌గా పేర్కొనే ఈ సమయం రోగి ప్రాణాలు కాపాడేందుకు కీలకం.

డాక్టర్ మంజునాథ్

గదగలో గత మూడు నెలల్లో గుండెపోటుతో 78 మంది కన్నుమూశారు. మరణించిన వారిలో 71 ఏళ్ల పైబడిన వారు 19 మంది, 51-70 ఏళ్ల వారు 44 మంది, 30-50 ఏళ్ల వయసు వారు 14 మంది కాగా, 30 ఏళ్ల కన్నా తక్కువ వయసు వారు ఒకరు ఉన్నారు. మరణించిన వారిలో 50 మంది పురుషులు కాగా, మిగిలిన 28 మంది మహిళలు ఉన్నారు. కరోనా మహమ్మారి సమయంలో టీకా వేయించుకోవడమే గుండెపోటు, ఇతర అనారోగ్యాలకు కారణమన్న అపోహ ఎక్కువ మందిలో ఉంది. ఇది ఒట్టి అపోహ అని వ్యాక్సిన్ తయారు చేసిన కంపెనీలు, కేంద్ర ఆరోగ్య శాఖ, నిపుణులు స్పష్టం చేశారు. హాసన జిల్లాలో గత 40 రోజుల్లో 28 మంది మరణించారు. వీరి మరణాలకు కారణాలను గుర్తించేందుకు జయదేవ ఆసుపత్రి వైద్యుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమితి ప్రతినిధులు ఇప్పటికే మృతుల నివాసాలకు వెళ్లి విచారణ చేపట్టారు. వారి వైద్య చరిత్ర, పొందుతున్న చికిత్సలు, ఆహారపు అలవాట్లు, మరణోత్తర నివేదికల ఆధారంగా వారి మరణాలకు కారణాలను గుర్తించే ప్రక్రియను సమితి ప్రతినిధులు కొనసాగించారు.

వ్యాయామం చేస్తుంటే..

మైసూరు: మైసూరు గోకులంలో ఉంటున్న ఇంజినీరు బీఎన్ శ్రీధర్ (51) గుండెపోటుతో గురువారం మరణించారు. హాసన జిల్లా హొళె నరసీపుర తాలూకా జుంజనహళ్లికి చెందిన ఆయన మైసూరులోని ఒక కంపెనీలో ఇంజినీరుగా సేవలు అందిస్తున్నారు. విజయనగరలోని ట్రెడ్ మిల్‌పై వ్యాయాయం చేస్తుండగా, ఛాతీలో నొప్పి వచ్చింది. చికిత్సకు తరలించేలోగా ఆయన మరణించారు.

జ్యూస్ తాగుతూ..

చామరాజనగర: కొళ్లేగాల సమీపంలోని మీణ్యం గ్రామానికి చెందిన రమేశ్ (42) గుండెపోటుతో బుధవారం అర్ధరాత్రి మరణించారు. ప్రైవేటు బస్సుకు డ్రైవరుగా పని చేస్తున్న ఆయన విధులు పూర్తయిన అనంతరం మాధువనహళ్లిలో బస్సు నిలిపిన అనంతరం ఛాతీలో నొప్పి వచ్చింది. ఆటోలో ఆసుపత్రికి వెళ్లి, ఈసీజీ చేయించుకుని మళ్లీ బస్టాండ్‌కు వచ్చారు. ఒక స్టాల్ వద్ద జ్యూస్ తాగుతూ కుప్పకూలి మరణించారు.

గ్యాస్ట్రిక్ అని నిర్లక్ష్యం..

చిక్కమగళూరు: ఛాతీలో నొప్పిని గ్యాస్ట్రిక్ అని భావించి మాత్రలు వేసుకున్న హరీశ్ (29) అనే యువకుడు గురువారం గుండెపోటుతో మరణించారు. తరికెరె తాలూకా శివన గ్రామానికి చెందిన బాధితుడు కొబ్బరికాయల వ్యాపారి. వాంతులు అవుతున్న అతనికి గ్యాస్ట్రిక్ అని మాత్రలు ఇచ్చారు. అప్పటికీ ఛాతీలో నొప్పి, వాంతులు తగ్గకపోవడంతో ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మరణించారు.

ఆయన అలా.. ఎలా చెబుతారు?

బెంగళూరు (గ్రామీణం): కొవిడ్ సమయంలో తీసుకున్న టీకాతోనే గుండెపోటు సమస్య తెరపైకి వచ్చిందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల చేసిన వ్యాఖ్యలను బయోకాన్ కంపెనీ అధ్యక్షురాలు కిరణ్ మజుందార్ షా ఖండించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలతో ప్రజలకు తప్పుడు సందేశం వెళుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో తయారైన, తయారవుతున్న అన్ని వ్యాక్సిన్లు సురక్షత, పరిణామకారి, ప్రపంచ కొలమానాలకు అనుగుణంగా తయారవుతున్నాయని తెలిపారు. పలు దఫాల క్లినికల్ ట్రయల్స్ అనంతరమే వీటిని వినియోగించేందుకు ఆమోదం లభించిందన్నారు. వ్యాక్సిన్లతోనే మహమ్మారి విస్తరణ నిలిచిపోయిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

కిరణ్ మంజుందార్‌షా

ఆరోజెంతో దూరంలేదు..

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : తన సోదరుడు శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని తాను గట్టిగా కోరుకుంటున్నానని మాజీ ఎంపీ డీకే సురేశ్ తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడే శివకుమార్ సీఎం అవుతారని అభిమానులు, పార్టీ నేతలు ఆశపెట్టుకున్నారని చెప్పారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం, సీనియరు నాయకులందరూ అన్నకు సహకరిస్తారనే ధీమా వ్యక్తం చేశారు. 'నమ్మకం లేకుండా జీవితాన్ని సాగించడం కష్టం. తన అన్న ముఖ్యమంత్రి అవుతారన్న నమ్మకం నాకు ఉంది. ఆ సమయం త్వరలో వస్తుంది' అని పేర్కొన్నారు. వర్షాకాలంలో నగర పౌరులకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవడం, నిండుగా ఉన్న జలాశయాల నుంచి పంట కాలువలకు నీటిని విడవడం ఆ రెండే తన సోదరుని ముందున్న అత్యవసర విధులని చెప్పారు.

డీకే సురేశ్

ఉదయపూర్ రైలులో మంటలు

రామనగర, న్యూస్‌టుడే : మైసూరు నంచి బెంగళూరుకు వస్తున్న ఉదయపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. చెన్నపట్టణ సమీపంలోని వందరగుప్పె స్టేషన్‌లో రైలును నిలిపి మంటల్ని అదుపు చేశారు. వందరగుప్పె గ్రామానికి చెందిన వారు మంటల్ని గుర్తించి హెచ్చరించి సమయప్రజ్ఞను చూపించారు. మంటల్ని అదుపు చేసిన అనంతరం రైలు బెంగళూరుకు తరలి వెళ్లింది.

మైసూరు.. చూసొద్దామా!

మైసూరు దసరా సంబరాల్లో కీలమైన 'గజపడె' బృందంలో సేవలందించే ఏనుగుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. బండీపుర అటవీ ప్రాంతంలో కొన్ని ఏనుగుల దేహదారుఢ్యం, ఇతర ప్రత్యేకతలను గుర్తించి ఎంపిక చేస్తున్న అటవీ, పశుసంవర్ధక శాఖాధికారులు. వీటికి త్వరలో శిక్షణనివ్వనున్నారు. ఆగస్టు నాటికి వీటిని రాచనగరికి తరలించాక.. ప్రధాన వీధుల్లో తాలీము కొనసాగించడం రివాజు. వాటి వెంట వచ్చే మావటీలకు ఏర్పాట్లు, వారి పిల్లల చదువులు, ఇతర ఆటపాటలకు వసతులుకల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని సంబంధిత అధహకారులు వివరించారు. (న్యూస్‌టుడే, మైసూరు)

తల్లిని పంచుకున్న తనయులు

చామరాజనగర, న్యూస్‌టుడే : కాళనహుండి గ్రామానికి చెందిన చంద్రమ్మ (75) అనే వృద్ధురాలి పోషణ చివరికి భారంగా మారింది. ఆమె కుమారులు ఇద్దరూ తలా ఆరు నెలలు ఆమెను పోషించేలా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి కారణమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త మరణం అనంతరం ఉన్న ఆస్తి మొత్తాన్ని కుమారులకు రాసిచ్చి, దివ్యాంగురాలైన కుమార్తెతో కలిసి ఉంటోంది. ఇల్లు, ఒక పట్టా భూమిని తన పేరిట ఉంచుకుంది. తాను ఇంకా కుమార్తెకు సేవ చేయలేకపోతున్నానని, మీతోనే తామిద్దరినీ ఉంచుకోవాలని చంద్రమ్మ కోరింది. ఇల్లు, నివేశనాన్ని తమ పేరిట రాసిస్తే ఆ పని చేస్తామని చెప్పారు. దానికి సంబంధించిన ఒప్పంద పత్రంపై సంతకం చేయించుకుని తల్లీ, చెల్లి బాధ్యతను చూస్తామని ఆమె కుమారులు ఒక ఒప్పందానికి వచ్చారు.

పెళ్లికాలేదని.. బలవన్మరణం

కోలారు, న్యూస్‌టుడే : కోలారు జిల్లాసుపత్రిలో డి.గ్రూపు ఉద్యోగి హరీశ్ బాబు (33) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బంగారుపేట తాలూకా నాయనకనహళ్లికి చెందిన బాధితుడు ఆసుపత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈఎన్‌టీ విభాగంలోని ఒక గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సిబ్బంది ఫిర్యాదు చేశారు. వివాహం కావడం లేదన్న బాధతో బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని కోలారు నగర ఠాణా పోలీసులు అనుమానిస్తున్నారు.

ముగ్గురు ఉద్యోగులపై వేటు

గాంధీనగర, యలహంక, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన ఆరోపణలపై ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ బెంగళూరు పాలికె ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. షెడ్యూల్డు కులాలు, తెగల గణన వివరాలను నమోదు చేసుకునే సమీక్షలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న రమేశ్, పెద్దురాజు, సి.సెంథిల్ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. పౌరులతో గొడవ పెట్టుకోవడం, కొట్టిన ఆరోపణలు వీరిపై ఉన్నాయి. సమీక్ష పూర్తిగా చేయకుండానే ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తున్నారని, దీన్ని ప్రశ్నిస్తే అక్కడి నివాసులపై గొడవకు దిగినట్లు ఫిర్యాదులు అందాయి. సమీక్ష సరిగా జరగడం లేదని అనుమానం ఉంటే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచించారు. షెడ్యూల్డు తెగలు, కులాలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని చెప్పారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

అసంఘటిత కార్మికుల సభ విజయవంతానికి పిలుపు

బళ్లారి, న్యూస్‌టుడే: ఈనెల 5న బళ్లారి నగరంలో వివిధ వర్గాల అసంఘటిత కార్మికులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ, ప్రభుత్వాలు ప్రవేశ

సమావేశానికి హాజరైన వివిధశాఖాధికారులు

పెట్టిన పథకాలపై అవగాహన కార్యక్రమం విజయవంతం చేయడానికి వివిధశాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ అధికారులను కోరారు. గురువారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు స్మార్ట్ కార్డులు, ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు వివిధ సామగ్రి పంపిణీ కార్యక్రమం చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంది. ఈ నెల 5న ఉదయం వాల్మీకి భవనంలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్మికశాఖలో 28 వేర్వేరు వర్గాల అసంఘటిత కార్మికులు 2,600 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్మికులకు స్మార్ట్‌కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, వారి కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడానికి 28 బస్సులు, 15 క్రూజర్ వాహనాలు, 500 ఆటోల్లో వస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు ఆహారం, నీటి వ్యవస్థ, కార్యక్రమం జరిగే

మాట్లాడుతున్న లోక్‌సభ సభ్యుడు తుకారామ్, చిత్రంలో మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ, ఏడీసీ మహమ్మద్ ఝుబేర

ప్రదేశం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలి. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం, పోలీస్ భద్రత కల్పించాలని అధికారులకు సూచించారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, కార్మికశాఖాధికారి సిద్ధప్ప ఖైనూర్, పరశురామ్, రమేష్, మౌనేష్, వివిధశాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న అతిథి ఉపన్యాసకుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గప్ప చిత్రంలో సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏళ్ల తరబడి అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహించే వారు.. తప్పకుండా నెట్, స్లెట్ అర్హత సాధించిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి. ఈ ఆదేశాలు అతిథి అధ్యాపకులకు మరణ శాసనంగా మారిందని అతిథి ఉపన్యాసకుల సంఘం జిల్లా అధ్యక్షుడు డా.దుర్గప్ప ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 450 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 10 వేల మందికిపైగా అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అతిథి అధ్యాపకులపై ఆధారపడ్డాయి. ఈ విద్యా సంవత్సరం కొత్తగా నెట్, స్లెట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహించాలని నిబంధన తెచ్చింది. ఈ నిబంధనలతో రాష్ట్రంలో 5,856 మంది ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, దిల్లీ, హరియాణా వేర్వేరు రాష్ట్రాల్లో అతిథి అధ్యాపకులకు యూజీసీ నిబంధనల ప్రకారం రూ.60వేలకుపైగా వేతనాలు ఇస్తున్నారు. ఇదే మాదిరిగా కర్ణాటకలో కూడా అతిథి అధ్యాపకులకు వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 10 బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు సిద్దేశ్, రుద్రముని, గురురాజ్, రమేష్, రామచంద్రరావ్, ఎర్రిస్వామి, శరణప్ప, జయరామ పాల్గొన్నారు.

32 నామినేషన్ పత్రాలు సమర్పణ

బళ్లారి, న్యూస్‌టుడే: రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సమాఖ్యకు మొత్తం 52 నామినేషన్ పత్రాలు సమర్పించగా వాటిలో 32 నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయి. మిగిలిన నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి ప్రమోద్ తెలిపారు. జూన్ 30 నుంచి ఈనెల 2 వరకు నాలుగు జిల్లాలకు 12 మంది డైరెక్టర్లను ఎంపిక చేయాల్సి ఉండగా, మొత్తం 52 నామినేషన్ పత్రాలు సమర్పించారు. గురువారం ఎన్నికల అధికారి ప్రమోద్ అధ్యక్షతన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. మొత్తం 52 నామినేషన్ పత్రాలకుగాను 20 నామినేషన్ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 32 నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నట్లు ప్రకటించారు. వాటిలో రాయచూరు-8, బళ్లారి-5, విజయనగర-8, కొప్పళ-11 నామినేషన్ పత్రాలు వేసినట్లు చెప్పారు. రాబకొవి అధ్యక్షుడు, కేఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్, ఉపాధ్యక్షుడు ఎ.రవీంద్ర, మాజీ అధ్యక్షులు జి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లుగా పనిచేసిన వెంకన్నగౌడ, శివప్ప, శ్రీనాథప్ప, మరుళసిద్ధప్ప, భీమనగౌడ, నాగమణి, సీతామహాలక్ష్మి, కవిత, ధనంజయలు పోటీలో ఉన్నారు.

సణ్ణ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం

11వ వార్డులో మహిళల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి 'సలాం బళ్లారి' అభియాన్‌లో భాగంగా గురువారం 11వ వార్డులో పర్యటించారు. స్థానిక కాంగ్రెస్ నేత లోకేష్‌తో కలిసి ఎమ్మెల్యే కాలినడకన తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో వాహనాల సంచారం ఇబ్బందిగా మారింది. మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరారు. 11వ వార్డులో సణ్ణ మార్కెట్ పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. తక్షణమే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్పొరేటర్లు నూర్ మహమ్మద్, మించు సీనా, ప్రభంజనకుమార్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమంలో ప్రభుత్వం విఫలం

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన భ్రష్టుపట్టిపోయింది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇళ్లకే పరిమితమయ్యారు. చెప్పుకోదగిన ఒక్క మంచిపని కూడా జరగలేదు. వెంటనే ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని జేడీఎస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం వారు జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన నేతృత్వం వహించిన జిల్లా ధ్యక్షుడు కె.కొట్రేశ్ తదితరులు మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయారు. ఉత్తమ పాలన వదిలేసిన ఎమ్మెల్యేలు ఆస్తులను మూటగట్టుకునే పనుల్లో మునిగిపోయారు. రైతుల సంక్షేమానికి ఒక్క మంచి పని కూడా చేయలేదని ధ్వజమెత్తారు. జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రముఖులు కృష్ణమూర్తి, హులుగప్ప, నాగేంద్రప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పాలనాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న జేడీఎస్ నాయకులు

సందేశాత్మక కవితలు రచించాలి

మాట్లాడుతున్న బెంగళూరు కనకదాసు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు చిక్కణ్ణ

బళ్లారి, న్యూస్‌టుడే: సమాజంలో కలిసి జీవించేలా సందేశాత్మక కవితలు, తత్వాలను రచించాలని బెంగళూరు కవి కనకదాసు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు చిక్కణ్ణ కోరారు. బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేడ్కర్ సభాభవనంలో గురువారం కవి కనకదాసుపై ఏర్పాటు చేసిన విచార సంకీర్ణను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. కన్నడ కవితలను సంప్రదాయంలో కనకదాసు ఉన్నత స్థానంలో నిలిపారు. 15వ శతాబ్దంలో కనకదాసు కవిత, తత్వాలు మానవ విలువల పెంచే విధంగా ఉన్నాయి. ప్రస్తుత కవిత్వంలో మానవ విలువలు కనిపించడం లేదని విచారం వ్యక్తం చేశారు. బళ్లారి వీఎస్కేయూ ఉపకులపతి మునిరాజు మాట్లాడుతూ కనకదాసు కీర్తనలు ప్రజల సామాజిక జీవిత వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయన్నారు. ఆయన తన కీర్తనలతో సమాజంలో మార్పులు తీసుకుని రావడానికి శ్రమించారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్యలో చదువులకే పరిమితం కాకుండా కవిత్వం, సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. జ్ఞానం పెంచుకుంటే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. కన్నడ అధ్యయన విభాగం ఆచార్యుడు డా.సంతోష్ కనకదాసుపై జీవిత చరిత్ర, తత్వాలను వివరించారు. పరిపాలన విభాగం రిజిస్ట్రార్ దినేష్, ఆచార్యులు రాబర్ట్ జోష్, కనకదాసు తత్వాల అధ్యయన కేంద్రం సభ్యులు దస్తగిరి దిన్ని, డా.అనుపమ, డా.శశికళ, శివప్రకాశ, డా.షకీల పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ఆచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధన విద్యార్థులు, విద్యార్థులు

నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు, సభ్యులను అభినందిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, సభ్యులు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రమేష్

బళ్లారి, న్యూస్‌టుడే: బహుజన సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్ ఇబ్రహీంపుర, కార్యదర్శి డా.నాగప్పలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆదేశ పత్రాలను అందజేసి మాట్లాడారు. వాల్మీకి అభివృద్ధి మండలి నిధులు మళ్లింపుపై సీబీఐతో విచారణ చేయించాలని కోర్టు తీర్పు ఇవ్వడాన్ని బీఎస్పీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కుర్చీ కోసం కోల్డ్‌వార్ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయింది. ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించడంలేదని ఆరోపించారు. రాష్ట్ర సమితి సభ్యులు గంగాధర, శకుంతలా, కల్లప్పతురువి, నాగరాజ్ నాయక్ పాల్గొన్నారు.

బలహీనులపై దౌర్జన్యం తగదు

హొసపేటె, న్యూస్‌టుడే: సమాజంలో దళిత, గిరిజనులు, బలహీనులపై దౌర్జన్యం చేస్తే పోలీస్ శాఖ చూస్తూ ఊరుకోబోదని విజయనగర ఎస్పీ డాక్టర్ శ్రీహరిబాబు హెచ్చరించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాలవారు స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగం మనకు ఇచ్చింది. ప్రశాంతంగా జీవించే హక్కును ఎవరూ కాలరాసే అధికారం లేదని తేల్చిచెప్పారు. ఎస్సీ, ఎస్టీలపై ఎక్కడైనా దౌర్జన్యాలు జరిగితే పోలీస్ ఠాణాకు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని ఆయన సూచించారు. కులం పేరుతో దూషిస్తే చట్టంలో కఠిన సెక్షన్లు ఉన్నాయని హెచ్చరించారు. డీఎస్పీలు టి.మంజునాథ్, మల్లేశ్ దొడ్డమని, సీఐలు రఘునాథ్, ఫక్కీరమ్మ, అబ్కారీశాఖ అధికారిణి శైనాజ్ పాల్గొన్నారు.

దళిత, గిరిజన వర్గాల సమస్యలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ డాక్టర్ శ్రీహరిబాబు

ఛార్జీలు భారమైనా మెట్రోనే భద్రం

ఎంతకీ తగ్గని కిటకిట

రైల్లో సంచరించేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని బెంగళూరు నగరంలో మెట్రో రైలు సేవలతో నగరవాసి జీవనం ముడిపడిపోయింది. దాంతో విడదీయలేని సంబంధం ఏర్పడింది. ఛార్జీలు పెంచడంతో మొన్నటి వరకు తక్కువ సంఖ్యలో సంచరించిన ప్రయాణికులు.. మళ్లీ జోరందుకున్నారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీతో మెట్రో రైళ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. వీలైనన్ని వాహనాలను పట్టాలెక్కిస్తున్నా డిమాండు తీరడం లేదు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఇవి అందుబాటులో లేవని జనం పెదవి విరుస్తుండటం డిమాండు తీవ్రతను చెప్పకనే చెబుతోంది. తెల్లవారుజాము ఐదు గంటలకే మొదలయ్యే వీటి పరుగు.. రాత్రి 11 గంటల దాకా 73 కిలోమీటర్ల పొడవునా నిరంతరాయంగా కొనసాగుతోంది. నగర పరిధిలో 38 రైళ్లు నిరంతరాయంగా సేవలందిస్తున్నట్లు అధికారులు వివరించారు. రద్దీ సమయంలో మూడు నిమిషాలకొకటి, సాధారణ పరిస్థితిలో ఐదు నిమిషాలకు ఓ రైలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం నిత్యం ఆరులక్షల మంది సంచరిస్తున్నారు. సెలవు రోజుల్లో ఆ సంఖ్య 6.5 లక్షలకు పెరుగుతోంది. చల్లఘట్ట (కెంగేరి) నుంచి వైట్‌ఫీల్డ్ వరకు గులాబీ కారిడార్ మార్గంలో ఎక్కువ మంది మెట్రోనే నమ్ముకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థలు ఆ మార్గంలో ఎక్కువగా ఉండటంతో వేగవంత ప్రయాణం ఉత్తమని భావిస్తున్నారు. అటుగా తిరిగే రైళ్లకు ఆరు బోగీలను అమర్చుతున్నారు. వాటి సంఖ్యను ఎనిమిదికి పెంచాలనే డిమాండ్ అంతకంతకూ ఎక్కువవుతోంది. ఎనిమిది బోగీల సంచారం ఇప్పట్లో సాధ్యం కాదని బీఎంఆర్‌సీఎల్ అధికారులు స్పష్టం చేశారు. ఆ మార్గంలో ఎక్కువ సార్లు రైలు సంచరించేలా చేస్తామని హామీనిచ్చారు. అంజనాపుర- నాగసంద్ర మధ్య గ్రీన్ కారిడార్ మెట్రో రైలు అపార్ట్‌మెంట్ల వాసులకు వరమే. ఈ పరిధిలో ఉన్నన్ని బహుళ అంతస్తులు నగరంలో మరెక్కడా లేవు. ఛార్జీ కాస్త ఎక్కువైనా.. వేగంగా, సురక్షితంగా గమ్యస్థానం చేరేందుకు అవకాశం కలుగుతుందనే స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెజెస్టిక్ ప్రయాణ ప్రాంగణంలో కిటకిట

నాణ్యమైన విద్య అందించాలని వినతి

డీసీ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పేద, సామాన్య, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను భర్తీ చేయాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి వేదిక నేతృత్వంలో గురువారం డీసీ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేసి ముఖ్యమంత్రికి అందజేయాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి. దుస్థితికి చేరుకున్న తరగతి గదులు నిర్మించాలి. విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలి, మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థ కల్పించాలని కోరారు. గ్రంథాలయం, క్రీడామైదానం అభివృద్ధి చేయాలని కోరారు. అధ్యక్షురాలు అక్కమహాదేవి సభ్యులు అమృత, మమత, అరుణ, హనుమయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే లక్ష్యం

కంప్లి, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తీ దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఉత్తమ సమాజ నిర్మాణమే ధర్మస్థల గ్రామాభివృద్ధి లక్ష్యమని తాలూకా యోజనాధికారి రాఘవేంద్ర తెలిపారు. కంప్లి చప్పరద హళ్లిలోని మహిళా స్వసహాయ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విశ్వ తంబాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ మార్పునకు మహిళలు సైతం తమ వంతుగా ముందుకు రావాలని కోరారు. ఉపన్యాసకుడు ఎస్.రాము తంబాకు వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. కృషి అధికారి సంజు కుమార్, మహిళా సంఘాల సమాఖ్య సభ్యులు, సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ప్రతినిధులు

EENADU Classifieds
REAL ESTATE
HOUSE FOR SALE
విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఎమ్మిగనూరులో 7 నుంచి పుణ్య సంస్మరణ

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని ఎమ్మిగనూరు శ్రీగురు మహంతర మఠంలో శ్రీగురు సిద్ధలింగ మహంతర 24వ పుణ్య సంస్మరణోత్సవ సందర్భంగా ఈనెల 7 నుంచి 12 వరకు వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. 7న ధర్మ ధ్వజారోహణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వామదేవ శివాచార్య తెలిపారు. 9న ఉచిత దంత పరీక్షలు, సాయంత్రం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం, 10న అయ్యాచార దీక్ష, సాయంత్రం గురు పౌర్ణమి సందర్భంగా గురు వందన తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

వామదేవ శివాచార్య స్వామీజీ

సీబీఐ సీజ్ చేసిన యంత్రం చోరీకి యత్నం

రాయదుర్గం పట్టణం: అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలంలోని వివాదాస్పద ఓబుళాపురం ఇనుప గనుల ప్రాంతంలో సీబీఐ సీజ్ చేసిన హిటాచి యంత్రాన్ని ధ్వంసం చేసి అపహరణకు యత్నించిన ఏడుగురు పట్టుబడ్డారు. గురువారం రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓబుళాపురంలోని సుంకులమ్మ ఆలయం సమీపాన గతంలో సీబీఐ ముడి ఇనుప ఖనిజంతో పాటు తవ్వేందుకు వినియోగించిన పలు యంత్రాలను సీజ్ చేసింది. వాటిని అక్కడే నిల్వ ఉంచింది. ఈ క్రమంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా సండూరు తాలూకా కురేకుప్ప గ్రామానికి చెందిన మారుతి, వీరేశ్, గాదిలింగప్ప, గణేశ్, బసవరాజు, ఉమాపతి, దొడ్డ బసప్ప కలిసి ఈనెల 2న హిటాచి యంత్రాన్ని గ్యాస్ కట్టర్లతో విడిభాగాలుగా మారుస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ ముఠా సభ్యులు యంత్రాల విడిభాగాలు తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ముఠాలోని వీరేశ్, ఉచ్చప్ప, ప్రకాశ్ పరారీలో ఉన్నారని.. పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐ వివరించారు. బొలెరో వాహనం, ఆటో, గ్యాస్ సిలిండర్లు, కట్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చెళ్లకెర ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలకు మూడు ర్యాంకులు

ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగంలో ర్యాంకులు సాధించిన రంజిత, అర్చన, దివ్య

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: బెళగావిలోని విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికి ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రకటించిన ర్యాంకుల జాబితాలో చెళ్లకెర ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రాణించారు. ప్రథమ ర్యాంకుతో పాటు మూడు ర్యాంకులను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.బెనాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని రంజిత ప్రథమ ర్యాంకుతో పాటు విశ్వవిద్యాలయం నుంచి బంగారు పతకాన్ని దక్కించుకున్నట్లు చెప్పారు. ఇదే విభాగంలో అర్చన మూడో ర్యాంకు, దివ్య నాలుగో ర్యాంకును సాధించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శ్రీనివాసులు సమాచారాన్ని అందించారన్నారు. కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు ర్యాంకులు, పతకాలను సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

తుంగభద్ర తీర ప్రజలూ.. జాగ్రత్త

కంప్లి: తుంగభద్ర జలాశయం నుంచి నదికి 50 వేల క్యూసెక్కుల నీరు వదిలే అవకాశం ఉన్న దృష్ట్యా నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంప్లి తహసీల్దార్ మంజునాయక్ సూచించారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు దుస్తులు ఉతికేందుకు, చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లొద్దన్నారు. ఈ విషయమై కంప్లి ప్రాంతంలోని నదీ తీర గ్రామాల్లో దండోరా వేయించాలని గ్రామాల అధికారులకు సూచించానని తెలిపారు.

ఆన్‌లైన్ ఆటలకు యువకుడి బలి

దావణగెరె, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై రూ.18 లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలైన శశికుమార్ (25) అనే యువకుడు తీవ్ర నిర్ణయమే తీసుకున్నాడు. రుణదాతలు వెన్నాడిన క్రమంలో తీర్చే మార్గమే కరవై ఆ యువకుడు ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్ యాప్‌లపై నిషేధాన్ని విధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ.. సెల్ఫీ వీడియో తీసుకుని చివరికి బలవన్మరణానికి పాల్పడ్డాడు. దావణగెరెలోని కేటీజే నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజలకు మెరుగైన చికిత్సలే లక్ష్యం

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేందుకు తాళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోనే నివాస గృహాలను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే బి.ఎం.నాగరాజు పేర్కొన్నారు. తాళూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వివిధ అభివృద్ధి పనులకు డీహెచ్‌వోతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేసి మాట్లాడారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి బోర్డు నుంచి రూ.50లక్షలతో నర్సింగ్, డి.గ్రూపు సిబ్బందికి నివాస గృహాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సిరుగుప్ప పట్టణంలో 150 పడకల హైటెక్ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. తాలూకాలోని కురవళ్లి, రావిహళ గ్రామాల్లో నూతన ప్రాథమిక ఆసుపత్రులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది కేంద్ర స్థానంలోనే ఉండాలన్నారు. డీహెచ్‌వో డా.యల్లా రమేష్‌బాబు మాట్లాడుతూ సిరుగుప్ప తాలూకా ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష, సెల్ కౌంటర్, హృదయ సమస్యల కోసం ఈసీజీ యంత్రాలు, తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాళూరు గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు బల్లారప్ప, వైద్యుడు సునీల్, జీపీ సభ్యులు పురుషోత్తమరెడ్డి, రామాంజని, ఫక్కీరప్ప దేవరెడ్డి, ముందప్ప, ఈరణ్ణ, నేణికప్ప, గాదిలింగప్ప, మాళమ్మ, చందనగౌడ, రాజేశ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

(c) eenadu

బళ్ళారి

రేపు కార్మికశాఖ మంత్రి జిల్లా పర్యటన

సంతోష్ ఎస్.లాడ్

బళ్లారి, న్యూస్‌టుడే: కార్మికశాఖ మంత్రి, ధార్వాడ జిల్లా బాధ్య మంత్రి సంతోష్ ఎస్.లాడ్ ఈ నెల 5న జిల్లా పర్యటనకు రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి విజయనగర జిల్లా నుంచి రోడ్డు మార్గాన ఉదయం 11 గంటలకు బళ్లారి నగరానికి చేరుకుంటారు. అనంతరం వాల్మీకి భవనంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటలకు జిల్లా నేతలతో చర్చలో పాల్గొంటారని వివరించారు.

నేడు మంత్రి శివరాజ ఎస్.తంగడగి బళ్లారికి రాక

శివరాజ ఎస్.తంగడగి

బళ్లారి, న్యూస్‌టుడే: వెనుకబడిన వర్గాల శాఖ, కన్నడ సాంస్కృతికశాఖ, కొప్పళ జిల్లా బాధ్య మంత్రి శివరాజ ఎస్.తంగడగి ఈ నెల 4న ఉదయం బళ్లారి నగరంలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.15గంటలకు స్థానిక గాంధీనగర్ మొదటి క్రాస్‌లోని మహిళ కళాశాల ఎదురుగా శశికిరణ క్రెడిట్ సౌహార్ద కో-ఆపరేటివ్ సొసైటీ నూతన శాఖను ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డు మార్గాన కొప్పళకు వెళ్తారన్నారు.

సంచార వాహిని.. కార్మికులకు సంజీవని

ఇంటిముంగిటకే వైద్యసేవలు

బళ్లారి, న్యూస్‌టుడే: నిర్మాణ, ఇతర కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించే లక్ష్యంతో కార్మికశాఖ బళ్లారి జిల్లాకు మూడు సంచారవైద్య (మొబైల్ హెల్త్) వాహనాలను మంజూరు చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా, డబ్బులు వృథా ఖర్చు చేయకుండా వారి ముంగిటకే సంచార వైద్య వాహనం కదలి వస్తుంది. వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఔషధాలను అందజేయనున్నారు.

జిల్లాలో 63,182 మంది గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 63,182 మంది కార్మికులు గుర్తింపు కార్డులు పొందారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సంచార వైద్య వాహనంలో ఉచితంగా ఆరోగ్య సేవలు పొందవచ్చు. బళ్లారి, కురుగోడు తాలూకాలకు-1, సండూరు-1, కంప్లి, సిరుగుప్ప-1 సంచార వైద్య వాహనాలు వచ్చాయి. ఈ వాహనంలో 25 వైద్య పరికరాలు, 5 ప్రయోగశాల పరికరాలు, 37 వైద్య వినియోగ వస్తువులు అందుబాటులో ఉంటాయి. సిబ్బంది బయోమెట్రిక్ ద్వారా హాజరు కావాల్సి ఉంది. వాహనానికి జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో వాహనం ఏ ప్రదేశంలో ఉంది. ఎంతమంది కార్మికులకు చికిత్స అందజేస్తున్నారా? లేదా? అని పరిశీలించే విధంగా సిద్ధం చేశారు. కార్మికులకు సంబంధించిన ఆరోగ్య వివరాలను గోప్యంగా ఉంచుతుందని కార్మికశాఖాధికారులు తెలిపారు.

అందుబాటులో వైద్యులు

సంచార వైద్య వాహనంలో ఎంబీబీఎస్ అర్హత కలిగిన వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, పరిపాలన సిబ్బంది, సాంకేతిక నిపుణులు, డ్రైవర్, సహాయక సిబ్బందితో పాటు మొత్తం ఆరుగురు విధులు నిర్వహిస్తారు. జిల్లాలో వార్డులు, పిర్కా, గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీ, జిల్లా స్థాయిలో నమోదైన కార్మికులు వివరాల ఆధారంగా విభాగాలకు వెళ్లి చికిత్స అందిస్తారు. 15 రోజులకు ఓ సారి మార్గసూచిని సిద్ధం చేసి నిర్దేశించిన ప్రాంతానికి చేరుకుని కార్మికులకు చికిత్స అందజేస్తారు.

పరీక్షలు, సేవలు

సంచార వైద్య వాహనంలో వైద్యులు రోగులను పరీక్షిస్తారు. లివర్ పరీక్షలు, ఆడియోమెట్రిక్ స్క్రీనింగ్ టెస్ట్, నేత్ర, సీబీసీ, ఈఎస్ఆర్, మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల కార్య పరీక్ష, రక్తంలో ఐరన్, మలేరియా, మూత్ర, థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తారు. కార్మికులకు ఉచితంగా ఔషధాలు అందిస్తారు. నిర్మాణ, ఇతర కార్మికులకు అనుకూలంగా ఉంటుంది.

ఒకటిన వాహనం ప్రారంభం

బళ్లారి, కురుగోడు తాలూకాలకు సిద్ధమైన మొబైల్ హెల్త్ వాహనాన్ని స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ప్రారంభించారు. బళ్లారి, కురుగోడులో మొబైల్ వాహనం ద్వారా చికిత్స ప్రారంభమైంది. సండూరు, కంప్లి, సిరుగుప్ప తాలూకాలకు కేటాయించిన మొబైల్ హెల్త్ వాహనాలు ప్రారంభించాల్సి ఉంది. స్థానిక ఎమ్మెల్యేలు తేదీని నిర్ణయిస్తే ఆరోగ్య సేవలు ప్రారంభించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

కార్మిక శాఖ కార్యాలయం

సంచార వైద్య సేవల వాహనం

కార్మికులకు ఉపయుక్తం

కార్మికశాఖలో నమోదు చేసుకున్న నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులకు మొబైల్ హెల్త్ వాహనం ద్వారా పరీక్షలు, చికిత్స అందజేయడం నిక అనుకూలంగా మారింది. కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి.

\- సిద్దప్ప, ఖైరూరు, కార్మికశాఖాధికారి, బళ్లారి

ఉప్పారహళ్లిలో ఇళ్ల పట్టాల పంపిణీ

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా మెట్రి గ్రామ పంచాయతీ పరిధి ఉప్పారహళ్లిలో ఆశ్రయ పథకం కింద 40 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గణేశ్ గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలు ఇచ్చిన స్థలంలో లబ్ధిదారులు నివాసం ఉంటే ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీనివాస మాట్లాడుతూ 1992-93లో 74 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. వివిధ కారణాలతో వారు ఆ స్థలాల్లో నివాసం ఉండలేదు. పంచాయతీ సామాన్య సభలో తీర్మానించి ఆ 74 మందిలో 40 మందికి ప్రస్తుతం ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మిగతా 34 మంది దరఖాస్తు చేసుకుంటే అర్హతను గుర్తించి పట్టాలు ఇస్తామన్నారు. జీపీ అధ్యక్షురాలు నాగమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, తాలూకా పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీకుమార్, సహాయ నిర్దేశకుడు మల్లన గౌడ, హొసకోటె జగదీశ్, జీపీ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణేశ్

వైద్యాధికారుల బదిలీ ఆపాలని వినతి

హొసపేట: ఇప్పటికే వైద్యుల సంఖ్య చాలా తక్కువ ఉన్న హొసపేటలో ఉన్నవారిని బదిలీ చేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని భగత్‌సింగ్ రక్తదాతల సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం వారు ఈ అంశంపై జిల్లా పాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆందోళనకు నేతృత్వం వహించిన కె.ఎం.సంతోష్ తదితరులు మాట్లాడుతూ కొత్త జిల్లా విజయనగర కేంద్ర స్థానం హొసపేటెలో ఇప్పటికే వైద్యుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వందలకొద్దీ ప్రజా ఆసుపత్రి, 60 పడకల మాతా,శిశు ఆసుపత్రుల్లో వైద్యులు లేరు. పరిస్థితి ఇలా ఉంటే ప్రజా సుపత్రి నుంచి మొన్ననే ఓ పీడియాట్రిషియన్‌ను బదిలీ చేశారని వాపోయారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడున్న వైద్యులను బదిలీ చేయరాదని, ఖాళీ ఉన్న పోస్టులను వెంటనే నింపాలని డిమాండ్ చేశారు.

ఏడుగురు నిర్దేశకుల ఎన్నిక ఏకగ్రీవం

ఏకగ్రీవంగా ఎన్నికైన నిర్దేశకులు

కారటగి, న్యూస్‌టుడే: గంగావతస్తర సంఘం నిర్దేశకులుగా కొప్పళ జిల్లా ఏడు తాలూకాల నుంచి ఏడుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొప్పళ తాలూకా నుంచి విరుపాక్షప్ప బారకర, కనకగిరి నుంచి కృష్ణ బెనకనాళ, గంగావతి నుంచి ఆనంద్ హెబ్బాళ, కారటగి నుంచి శరణప్ప కాయిగడ్డి, యలబుర్గా నుంచి రామ, కుష్టగి నుంచి వాగేశ్ కట్టి, కుకనూరు నుంచి బుడ్డప్ప బారకేర నిర్దేశకులుగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమణ్ణ బారకేర, గౌరవ అధ్యక్షుడు రాజశేఖర ముష్టూరు తదితరులు నూతన నిర్దేశకులను అభినందించారు.

ఐకమత్యంతో విజయం తథ్యం

సింధనూరు, న్యూస్‌టుడే: ఏ సమాజంలోనైనా ఐకమత్యం ముఖ్యం, అది ఉంటే అన్ని పనులూ సులభమని శ్రీవిశకరణ సమగార (వమ్మార సమాజం) హరళయ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ బెలగేరి పేర్కొన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో గురువారం చమ్మార సమాజం రాయచూరు, కొప్పళ జిల్లాల సమ్మేళనం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన జగదీశ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి, తమ పిల్లలను ఉన్నత హోదాలో చూడాలనే ఆశలు ఫలించాలంటే వాళ్లను శ్రద్ధతో చదివించాలని సూచించారు. సమాజం తలెత్తే పనులు సక్రమంగా జరగాలంటే ఐకమత్యం ఎంతో బలం.. ఈ సూత్రాన్ని అందరూ నమ్మాలని కోరారు. ఈ సందర్భంగా సమాజం రాయచూరు, కొప్పళ జిల్లాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేశారు. సమాజం రాయచూరు జిల్లా అధ్యక్షుడిగా లాలప్ప.ఎస్ బాలగవి, కొప్పళ జిల్లా అధ్యక్షుడిగా రవి సాఖనకర్ ఎంపికయ్యారు. నూతన అధ్యక్షులను రాష్ట్ర సమితి పెద్దలు సత్కరించారు. గౌరవ అధ్యక్షుడు ఎల్లప్ప, ఉపాధ్యక్షుడు పరశురాం, కార్యదర్శి సునీల్ మదనేరి, న్యాయవాది సంగమేశ్, దశరథ్, వెంకటేశ్ మండేవాడి పాల్గొన్నారు.

రాయచూరు, కొప్పళ అధ్యక్షులను సత్కరిస్తున్న సమాజం రాష్ట్ర పెద్దలు

బాలికల వసతి కళాశాల ప్రారంభం

అరళహళ్లిలో మొరార్జీదేశాయ్ వసతి కళాశాల ప్రారంభిస్తున్న శాసనసభ్యుడు గాలి జనార్దనరెడ్డి

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి నియోజకవర్గం అరళిహళ్లిలో మొరార్జీదేశాయ్ బాలికల వసతి పీయూ కళాశాలను శాసనసభ్యుడు గాలి జనార్దనరెడ్డి గురువారం ప్రారంభించారు. కళాశాల భవనాన్ని రూ.10 కోట్లతో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాయన్నారు. గడ్డి నుంచి బంకాపూర్ దాకా రూ.కోటితో ఒక టిన్ను కిలోమీటరు రహదారిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖులు వేదమూర్తి గవిసిద్దయ్యస్వామి, పంచాయతీ అధ్యక్షులు మంజుళా, మైనారిటీ సంక్షేమశాఖ అధికారి అజ్మీర్అలీ పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 ఏడాదిలో వివిధ కోర్సుల ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో కోరారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీఎస్‌డబ్ల్యూ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

ఎరువుల కొరత తీర్చాలని వినతి

రుద్రేశప్పకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎరువుల వ్యాపారుల సంఘం ప్రతినిధులు

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ జిల్లాలో ఎరువుల కొరత తీర్చాలని ఎరువులు, పురుగుమందు, విత్తనాల వ్యాపారుల సంఘం కోరింది. ఈ మేరకు గురువారం జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు టి.ఎస్.రుద్రేశప్పను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కొప్పళ జిల్లాలకు సరఫరా అవుతున్న ఎరువుల్లో 50 శాతం రాయచూరు, విజయనగర, బళ్లారి, గదగ జిల్లాల వ్యవసాయ అధికారులు తీసుకెళ్తున్నారన్నారు. ఆ జిల్లాలకు సరఫరా అయ్యే ఎరువులను కొప్పళకు కేటాయించడంతో అక్కడి అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎరువుల కంపెనీలు లింక్ ఉత్పత్తులు మెలిక పెట్టడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. లక్ష రూపాయల ఎరువులకు రూ.50వేల లింక్ ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్న షరతు విధిస్తున్నారు.. ఇది రైతులకు భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, గౌరవాధ్యక్షుడు గురుపాదప్ప, కార్యదర్శి డీపీ సత్యనారాయణ, రితేశ్, చాలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు బస్ సదుపాయం

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలు, క్యాంపుల విద్యార్థుల అనుకూలం కోసం గురువారం ఆర్టీసీ బస్సు ప్రారంభించారు. శ్రీరామనగర్‌లో బస్సుకు పూజలు నిర్వహించిన అనంతరం ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల అమలు సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడి విద్యుత్తు సబ్ స్టేషన్ ప్రాంతంలోని చిలుకూరు నాగేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మరికి బసవణ్ణ క్యాంపులోని బొబ్బా రామచంద్ర రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు రోజు అవస్థలు పడుతున్నారు. సిద్దాపుర, కృష్ణానగర్ క్యాంపు, మరళి, జంగమర కల్లుడి తదితర గ్రామాల విద్యార్థులు శ్రీరామనగర్ రావాలంటే సమయానికి బస్సులు దొరకడం లేదు. ఇటీవల రద్దీ అధికమవడంతో గ్రామాల్లో బస్సుల సంగతి ఆపడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి శివరాజ్ తంగడగి ఆదేశం మేరకు ఆర్టీసీ అధికారులు విద్యార్థుల కోసం బస్ సదుపాయం కల్పించారని వివరించారు. జీపీ అధ్యక్షుడు, సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బస్‌కు పూజలు నిర్వహించిన గ్రామపెద్దలు

ఆసుపత్రి నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

దక్షిణకొప్ప చెన్నవీరశరణ బళగ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న చిగురుపాటి రామబసవేశ్వర రావు

కంప్లి, న్యూస్‌టుడే: దక్షిణకొప్ప చెన్నవీర శరణ బళగ స్థానిక కంప్లి కొట్టాల మార్గంలో నిర్మిస్తున్న ఉచిత కంటి ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రముఖుడు చిగురుపాటి రామబసవేశ్వర రావు గురువారం రూ.5 లక్షల విరాళం అందించారు. ఆసుపత్రి స్థల దాత పోలూరు సత్యనారాయణ మాట్లాడుతూ పారిశ్రామికవేత్త రామబసవేశ్వర రావు ఉచిత కంటి ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళంగా ఇవ్వడం అభినందనీయం. ఆయన తన వంతుగా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. శరణ బళగ కార్యదర్శి డాక్టర్ బసవరాజ గౌడ, బీడీసీసీ బ్యాంకు నిర్దేశకుడు ముకయ్యస్వామి, ప్రముఖులు కె.ఎం.వాగేశ్, కొట్రేశ్, విరుపాక్షప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఉపసంహరించాలి

శిరస్తేదారుకు వినతి పత్రం అందిస్తున్న కార్యకర్తలు

సిరివార,(మాన్వి): కొందరు అధికారులు అక్రమంగా లతో కలిసి ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం చేకూర్చుతున్నారని, దీన్ని అడ్డుకుంటే అక్రమంగా కేసులు పెడుతున్నారని కర్ణాటక రక్షణ వేదిక ప్రతినిధులు ఆరోపించారు. పట్టణంలో ప్రభుత్వ నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకున్నందుకు వేదిక అధ్యక్షుడు కె.రామచంద్రపై అక్రమంగా కేసులు బనాయించారని కార్యకర్తలు ఆరోపించారు. కేసులను ఉపసంహరించుకోవాలని లేకుంటే జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. శిరస్తేదారు దాసరి వాసుకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తాలూకా కరవే సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

5న కార్మికులకు స్మార్ట్ కార్డుల వితరణ

బళ్లారి, న్యూస్‌టుడే: కార్మిక శాఖ, రాష్ట్ర అసంఘటిత కార్మిక సామాజిక భద్రత మండలి, జిల్లా యంత్రాంగం, పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉదయం 11 గంటలకు స్థానిక వాల్మీకి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వివిధ వర్గాల అసంఘటిత కార్మికులకు స్మార్ట్‌కార్డులు వితరణ కార్యక్రమం, వివిధ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్, జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొంటారని సంబంధిత అధికారి పేర్కొన్నారు.

వీరభద్రస్వామి రాజగోపురం పనులు

బళ్లారి, న్యూస్‌టుడే: దరూరు గ్రామ ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే వీరభద్ర స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణ పనులు గురువారం ట్రస్ట్ సభ్యులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు రావడంతో రూ.కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ట్రస్ట్ సభ్యులు దరూరు పురుషోత్తమ గౌడ తెలిపారు. 81 అడుగులతో రాజగోపురం, 47 అడుగుల ఈశాన్య గోపురం, 31 అడుగుల శిలా మండపం, తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పూజారి మల్లయ్య, వీరేశ నాయక్, వీరేశయ్యస్వామి, హంపనగౌడ, పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం పనులు ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు పురుషోత్తమగౌడ, వీరేశయ్యస్వామి తదితరులు

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

అయ్యమ్మ (పాతచిత్రం)

సిరుగుప్ప, న్యూస్‌టుడే: దేవిగనర్ క్యాంపు 19వ వార్డుకు చెందిన అయ్యమ్మ (31) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతనెల జూన్ 22న మధ్యాహ్నం సిరిగేరి క్రాస్‌లో బస్సు ఎక్కి సిరుగుప్పకు వచ్చి ఇక్కడి నుంచి కేఎస్ఆర్టీసీ బస్సు ఎక్కి వెళ్లిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదన్నారు. తెక్కలకోట పోలీసురాణాలో ఆమె సోదరుడు బసవల్ల భీమప్ప ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సబ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

విత్తనాలు అందిస్తున్న అధికారులు

మాన్వి, న్యూస్‌టుడే: తాలూకాలోని కురిడి రైత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికంగా సాగు చేసే పంటల్లో కంది ప్రధానమైనది ఉన్నారు. మిశ్రమ వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయన్నారు. విత్తనాలు శుద్ధి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయక మేనేజర్ సయ్యద్ జలాల్, పంచాయతీ సభ్యులు, రైతు ప్రముఖులు పంచయ్యస్వామి, పంపనగౌడ, మహిబూబ్, జైసుద్దీన్, మహంతప్పగౌడ, గూళప్ప, వాలేకర్, హులిగెప్ప, బసవరాజ తదితరులు పాల్గొన్నారు.

కారాగారంలో నిషేధిత వస్తువులు లేవు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి కేంద్ర కారాగారంలో చరవాణి, గంజాయి, మాదక ద్రవాలకు అవకాశం లేదని జిల్లా ముఖ్య అధికారి ఆర్.లతా తెలిపారు. కేంద్ర కారాగారంలో చరవాణులు ఉపయోగిస్తున్నారు. గంజాయిని ఖైదీలు వాడుతున్నట్లు కొన్ని వీడియోలు వచ్చినట్లు సామాజిక మాధ్యమాలు, కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయి. వాటిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. వీడియోలను పరిశీలించగా ఇప్పటివి దృశ్యాలు కాదని తేలిందన్నారు. జైల్లో భద్రత ఉందన్నారు. జైలుపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

10న హడపద అప్పణ జయంతి

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, బళ్లారి నగర పాలికె సంయుక్తంగా ఈ నెల 10 ఉదయం 11.30 గంటలకు డా.జోశరాసి దొడ్డనగౌడ రంగమందిరంలో హడపద అప్పణ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్నడ సాంస్కృతిక అధికారి నాగరాజ తెలిపారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు.

ప్రైవేట్ బస్సు, లారీ ఢీ

మాన్వి, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం ఉదయం ప్రైవేట్ బస్సు, లారీ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసం అయింది. ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. కూడలి వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాదంపై పోలీసులు బస్సును క్రేన్‌తో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాన్వి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాడుగొల్ల గిరిజన మహిళలకు జాగృతి చెందాలి

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: కాడుగొల్ల (అడవి గొల్ల) సామాజిక వర్గానికి చెందిన మహిళలు మూఢనమ్మకాలను విడనాడి చైతన్యవంతులు కావాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మీ చౌదరి పేర్కొన్నారు. హిరియూరులో కాడుగొల్ల మహిళల జన జాగృతి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాడుగొల్ల వర్గం ప్రజలు అధికంగా నివసించే గొల్లహట్టి గ్రామాల్లో ఆధునిక యుగంలో నేటికీ బహిష్టు సమయంలో, పురుడు పోసుకున్నప్పుడు గృహాల్లో కాకుండా గ్రామానికి దూరంగా నిర్మించిన గుడిసెల్లో ఒంటరిగా నివసించే పద్ధతిని మానుకోవాలన్నారు. మహిళలు విద్యావంతులుగా మారి జాగృతి చెంది మూఢనమ్మకాలను వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ గోవింద కారజోళ, సాహితీవేత్త బంజగెర జయప్రకాశ్, తహసీల్దార్ రాజేశ్ కుమార్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి విజయకుమార్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

హమ్మయ్య..గుంతలు పూడ్చారు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా గోరేబాళ క్యాంపు ప్రజలు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. నెల రోజులుగా క్యాంపు మధ్యలో ప్రధాన రహదారి వంతెనపై మూడు నాలుగు చోట్ల భారీస్థాయి రంధ్రాలు ఏర్పడి అవి మెల్లగా పెద్దగా తయారయ్యాయి. చిన్నపాటి వాహనాలకే కాక రాయచూరు భారీ వాహనాలు సైతం ఈ గుంతల్లో పడి పలుసార్లు ఇబ్బందుల పడ్డాయి. సరిగ్గా గాంధీనగర్‌కు వెళ్లే మలుపు వద్ద ఈ ప్రమాదం పొంచి ఉందని.. ఈ దారిలో జనం అతి జాగ్రత్తగా సంచరించేవారు. స్థానిక ప్రజలు రాళ్లు,రప్పలు అడ్డు పెడితే.. అవి సమస్యగా మారేవి. 'ఈనాడు'లో మే 21న 'కాస్త చూసి వెళ్లండి..ప్రమాదముంది' శీర్షికన వార్త ప్రచురించింది. ఎట్టకేలకు హైవే అభివృద్ధి అధికారులు గురువారం వీటి మరమ్మతులు చేపట్టారు. పెద్ద పెద్ద గుంతలను మొరం సిమెంటు దారి జాయింటును సరిచేశారు. గోరేబాళక్యాంపు ప్రజలు హమ్మయ్య అనుకున్నారు.

గోరేబాళక్యాంపులో వంతెనపై మరమ్మతులు చేయిస్తున్న హైవే అభివృద్ధి అధికారులు

VACANCIES

Applications are invited for the post of **Branch Manager** at **Bellary Branch**, of The Citizen Cooperative Society Ltd., (Multi State Cooperative Society) Regd. **Office:** Hyderabad. **Qualification:** Any Graduate with Computer Applications Knowledge, **Experience:** 5-10 Years in any Banking/NBFC as Manager, age must be below 40 Years. Interested Candidates may send resume on or before **14-07-2025**

to:citizensociety.hr@gmail.com
or citizengm1@gmail.com

నేడు కార్మికులకు స్మార్ట్‌కార్డుల వితరణ

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులకు శుక్రవారం స్మార్ట్‌కార్డు వితరణకార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆ శాఖ అధికారి సూర్యప్ప దొండురమట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మల్లిగె సభాంగణంలో కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ ప్రారంభిస్తారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

3-07-2025 (ఉ.8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.53	1587.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	26,718	10,503
ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	13,748	296
నీటి నిల్వ (టి.ఎం.సి)	78.239	8.782

నిల్వసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఎమ్మిగనూరులో విష జ్వరాల పంజా

పరిశీలించిన డీహెచ్‌వో

బళ్లారి, న్యూస్‌టుడే: వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రజలు ఆందోళన చెందకుండా శుద్ధమైన నీరు, వేడి ఆహారం తీసుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు సూచించారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందాలని పేర్కొన్నారు. కురుగోడు తాలూకాలోని సముదాయ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎమ్మిగనూరులో విష జ్వరాలు నమోదు కావడంతో డీహెచ్‌వో గురువారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామంలో డయేరియా, డెంగీ కేసులు నమోదు కాలేదు. వాతావరణంలో మార్పులు రావడంతో విషజ్వరాలు బారినపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. తగినన్ని ఔషధాలు అందుబాటులో ఉంచాం. అంబులెన్సును సైతం ఇక్కడ ఉంచుతున్నట్లు చెప్పారు. అత్యవసర కేసులు వస్తే జిల్లా ఆసుపత్రికి తరలించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రభుకర్, రవీంద్ర పనకేర, ఫరూఖ్ అహ్మద్, భరత్, అదికారి ఈశ్వర్ దాసప్పనవర పాల్గొన్నారు.

గ్రామస్థులకు విష జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌వో డా.యల్లా రమేష్‌బాబు, తదితరులు

భక్తిప్రపత్తులతో వారాహి నవరాత్రోత్సవాలు

బళ్లారి (గ్రామీణ, న్యూస్‌టుడే: బళ్లారి బాలాజీ క్యాంపులో వెలసిన అమృతేశ్వర దేవాలయంలో గురువారం వారాహి నవరాత్రోత్సవాల పూజలు అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వారాహి అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన, సప్తశతి పారాయణం, వారాహి గాయత్రి హోమం, చండీ హోమం, పల్లకి ఉత్సవం జరిపారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పూజలు తిలకించారు. భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సినీ నిర్మాత కొర్రపాటి సాయి కుమారు బసప్పులు, అర్చకులు లక్ష్మీనారాయణ ఆచార్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి విశేష అలంకరణ

అమృతేశ్వరస్వామికి పుష్పాలంకరణ

శుభాకాంక్షలు

సింధనూరు నగరాభివృద్ధి ప్రాధికార (సుడా) నూతన పాలక మండలి సభ్యులుగా నియమితులైన మా స్కూలు నిర్దేశకులు, మా అందరికీ ఆత్మీయులు శ్రీ వై.నరేంద్రనాథ్ గారికి ఇవే మా హృదయపూర్వక శుభాభినందనలు.

యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది

విద్యా పబ్లిక్ స్కూల్

మస్కిరోడ్, సింధనూరు.

(c) eenadu

ఛార్జీలు భారమైనా మెట్రోనే భద్రం

ఎంతకీ తగ్గని కిటకిట

రైల్లో సంచరించేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

రైలు బోగీలో నిత్యం ఇదే సందడి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని బెంగళూరు నగరంలో మెట్రో రైలు సేవలతో నగరవాసి జీవనం ముడిపడిపోయింది. దాంతో విడదీయలేని సంబంధం ఏర్పడింది. ఛార్జీలు పెంచడంతో మొన్నటి వరకు తక్కువ సంఖ్యలో సంచరించిన ప్రయాణికులు.. మళ్లీ జోరందుకున్నారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీతో మెట్రో రైళ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. వీలైనన్ని వాహనాలను పట్టాలెక్కిస్తున్నా డిమాండ్ తీరడం లేదు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఇవి అందుబాటులో లేవని జనం పెదవి విరుస్తుండటం డిమాండ్ తీవ్రతను చెప్పకనే చెబుతోంది. తెల్లవారుజాము ఐదు గంటలకే మొదలయ్యే వీటి పరుగు.. రాత్రి 11 గంటల దాకా 73 కిలోమీటర్ల పొడవునా నిరంతరాయంగా కొనసాగుతోంది. నగర పరిధిలో 38 రైళ్లు నిరంతరాయంగా సేవలందిస్తున్నట్లు అధికారులు వివరించారు. రద్దీ సమయంలో మూడు నిమిషాలకొకటి, సాధారణ పరిస్థితిలో ఐదు నిమిషాలకు ఓ రైలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం నిత్యం ఆరులక్షల మంది సంచరిస్తున్నారు. సెలవు రోజుల్లో ఆ సంఖ్య 6.5 లక్షలకు పెరుగుతోంది. చల్లఘట్ట (కెంగేరి) నుంచి వైట్‌ఫీల్డ్ వరకు గులాబీ కారిడార్ మార్గంలో ఎక్కువ మంది మెట్రోనే నమ్ముకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థలు ఆ మార్గంలో ఎక్కువగా ఉండటంతో వేగవంత ప్రయాణం ఉత్తమని భావిస్తున్నారు. అటుగా తిరిగే రైళ్లకు ఆరు బోగీలను అమర్చుతున్నారు. వాటి సంఖ్యను ఎనిమిదికి పెంచాలనే డిమాండ్ అంతకంతకూ ఎక్కువవుతోంది. ఎనిమిది బోగీల సంచారం ఇప్పట్లో సాధ్యం కాదని బీఎంఆర్‌సీఎల్ అధికారులు స్పష్టం చేశారు. ఆ మార్గంలో ఎక్కువ సార్లు రైలు సంచరించేలా చేస్తామని హామీనిచ్చారు. అంజనాపుర- నాగసంద్ర మధ్య గ్రీన్ కారిడార్ మెట్రో రైలు అపార్ట్‌మెంట్ల వాసులకు వరమే. ఈ పరిధిలో ఉన్నన్ని బహుళ అంతస్తుల నగరంలో మరెక్కడా లేవు. ఛార్జీ కాస్త ఎక్కువైనా.. వేగంగా, సురక్షితంగా గమ్యస్థానం చేరేందుకు అవకాశం కలుగుతుందనే స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెజెస్టిక్ ప్రయాణ ప్రాంగణంలో కిటకిట

‘హిందీతో విద్యార్థులకు ఇక్కట్లే’

స్వాతంత్ర్య ఉద్యానవనంలో ధర్నా చేస్తున్న కరవే కార్యకర్తలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : హిందీని పక్కన పెట్టి రాష్ట్రంలో ద్విభాషా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో కర్ణాటక రక్షణవేదిక కార్యకర్తలు గురువారం ధర్నాకు దిగారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రీయ విద్యాలయాల్లో ద్విభాషా విధానాన్ని అమలు చేయాలని పట్టుబట్టారు. వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ మాట్లాడుతూ సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలల్లో కన్నడ భాషను ప్రథమంగా తప్పనిసరి చేసి అమలు చేయాలని ఒత్తిడి తెచ్చారు. త్రిభాషా విధానంతో విద్యార్థులు ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఆ విధానానికి స్వస్తి చెప్పి తమిళనాడు, మహారాష్ట్రల్లో అమలులో ఉన్న రీతిలో కర్ణాటకలో అమలులోకి తేవాలని కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో కన్నడ, ఆంగ్ల భాషలను తప్పనిసరి చేయాలన్నారు. హిందీని తొలగించకపోతే తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2024లో నిర్వహించిన ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షల్లో హిందీ పాఠ్యాంశంలో 90.79 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదని గుర్తుచేశారు. 2025లో ఫలితాల్లో కూడా ఇదే తరహా సమస్య ఎదురైందన్నారు.

భాజపా నాయకుడి తీరుపై తీవ్ర ఆరోపణలు

మంగళూరు, న్యూస్‌టుడే : పుత్తూరు భాజపా నాయకుడు జగన్నివాసరావు కుమారుడు కృష్ణ జె.రావు తన కుమార్తె (21)పై అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేసినా కాషాయ పార్టీ నాయకులు స్పందించడం లేదని బాధిత యువతి తల్లి ఆరోపించారు. తన కుమార్తె బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం డబ్బు ఇస్తామని, కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాషాయ పార్టీ నాయకుల ఆగడాలు ఎక్కువవుతున్నా భాజపా పెద్దలు, హిందూ సంఘాల నేతలు ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ నాయకుడు పద్మరాజ్ ప్రశ్నించారు. దీనిపై తాము బాధితురాలి కుటుంబంతో కలిసి పోరాటాన్ని చేస్తామని హెచ్చరించారు.

అప్పుల బాధ తాళలేక అన్నదాత బలవన్మరణం

మైసూరు, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక తుంబసోగె వంతెన పైనుంచి కపిల నదిలోకి దూకి గోవింద నాయక (50) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. జె.సరగూరు తాలూకా ముక్కూరు గ్రామానికి చెందిన బాధితుడు వ్యవసాయం కోసం బ్యాంకుతో పాటు, ప్రైవేటు కంపెనీల్లో రుణాలు తీసుకున్నారు. పంట నష్టంతో రుణాన్ని తీర్చలేకపోవడం, ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇట్నా గ్రామం వద్ద అతని మృతదేహం గురువారం లభించింది. సరగూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు.. సైకిల్ సవారీ

నివాస ప్రదేశాల్లోని రహదారుల్లో సైకిల్ మార్గం

బెంగళూరు (బాణసవాడి) : పరిసరాల సంరక్షణ, ప్రజల ఆరోగ్యం కోసం కేంద్ర భూఉపరితల సచివాలయం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలతో కలిసి సైకిల్ మార్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం 25 కిలోమీటర్ల సైకిల్ మార్గాన్ని అభివృద్ధి చేశారు. రానున్న రోజుల్లో ప్రధాన రహదారుల్లో 400 కిలోమీటర్ల సైకిల్‌మార్గం నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఐదేళ్లలో వంద కిలోమీటర్ల సైకిల్ మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందు కోసం రహదారులను గుర్తించామని పాలికె అధికారులు తెలిపారు. సైకిల్ మార్గం అభివృద్ధి చేసి.. ఇంధనంతో నడిచే వాహనాల సంఖ్య తక్కువ చేయాలనే ఉద్దేశంతో ప్రతిపాదనలు రూపొందించాయి. ప్రస్తుతం జయనగర, శేషాద్రిపురం, జేపీనగర, అశోక్‌నగర, ఇందిరా నగర, డాలర్స్ కాలనీ, బనశంకరి, బసవనగుడి ప్రాంతాల్లో సైకిల్ మార్గాల్లోని కొన్ని ప్రధాన రహదారుల్లో అభివృద్ధి చేశారు. సైకిల్‌పై ఆసక్తి పెంచేందుకు పాఠశాలలు, కళాశాలలు వివిధ ప్రాంతాల్లో సైకిలిస్టు క్లబ్‌లను ఏర్పాటు చేసి వాటిని ప్రోత్సాహించేందుకు పథకాలను సిద్ధం చేశామని నగరాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. ఇంధనంతో నడిచే వాహనాలపై ఆధారపడకుండా యువత సైకిల్‌పై సంచరించాలనే జాగృతి చేపడతామని వివరించారు.

రహదారి పక్కన పాదచారి మార్గాలపై సైకిల్ మార్గం

ఆన్‌లైన్ ఆటలకు యువకుడి బలి

దావణగెరె, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై రూ.18 లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలైన శశికుమార్ (25) అనే యువకుడు తీవ్ర నిర్ణయమే తీసుకున్నాడు. రుణదాతలు వేధించడంతో క్రమంలో తీర్చే మార్గమే కరవై ఆ యువకుడు ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్ యాప్‌లపై నిషేధాన్ని విధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ.. సెల్ఫీ వీడియో తీసుకుని చివరికి బలవన్మరణానికి పాల్పడ్డాడు. దావణగెరెలోని కేటీజే నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	90
క్యారెట్-	110
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	35
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	30
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	170
బీట్‌రూట్-	40
వంకాయలు-	60
బెండకాయలు-	55
ముల్లంగి-	45
నిమ్మకాయ-	280

పండ్లు,ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	420
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	395
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	45
బొప్పాయి-	35
ఆరంజి-	195
బత్తాయి-	95

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

సిద్ధుపై శ్రీరాములు నిప్పులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాజకీయాల్లో గెలుపు-ఓటములు శాశ్వతం కాదని మాజీ మంత్రి బి.శ్రీరాములు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనను ఉద్దేశించి రెండు చోట్ల ఓడిన వ్యక్తి తనను ఉద్దేశించి మాట్లాడుతున్నాడని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బాదామిలో తనపై 1700 ఓట్ల మెజార్టీతో సిద్ధరామయ్య గతంలో గెలుపొందారని గుర్తు చేశారు. ఆ నాడు ఓడి ఉంటే ముఖ్యమంత్రి అయి ఉండేవాడివా? అంటూ ఏకవచనంతో సంబోధిస్తూ ప్రశ్నించారు. గతంలో తాను మొళకాల్మూరు నుంచి 40 వేల ఓట్ల మెజార్టీతో గెలిచానని గుర్తు చేశారు. ప్రజాదరణ తక్కువ అవుతున్న ప్రతి సందర్భంలోనూ ఇతరులను విమర్శించడం మానుకోవాలని సిద్ధరామయ్యకు హితవుపలికారు.

ఉడుపిలో మాదక ద్రవ్యాలు

ఉడుపి, న్యూస్‌టుడే : ఉడుపిలో దైవ దర్శనానికి, పర్యాటక ప్రాంతాల్లో సంచరించేందుకు వస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న తమిళనాడుకు చెందిన జాయల్ అల్బా అనే నిందితుడ్ని నార్కోటిక్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. అతనికి మద్దతు ఇస్తున్న మరో ఎనిమిది మంది యువకులను అదుపులోనికి తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో ప్రకటనలు, ఫోన్ నంబరు అందుబాటులోకి తీసుకువచ్చి సుఖ నిద్రను ఇచ్చే ఆయుర్వేద ఔషధం పేరిట వీరు మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులతో ఎన్‌సీబీ పోలీసులు కార్యాచరణను నిర్వహించారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

ఆ రెండూ.. వేర్వేరు కులాలు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : వీరశైవ లింగాయత జంగమలు, బేడ లేదా బుడగ జంగమ అనేవి వేర్వేరు కులాలని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. కొందరు ఏకంగా తాము లింగాయత జంగమలు తాము బేడ/బుడ్గ జంగమలు అని షెడ్యూల్డు కులాల వారిమని కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకోవడం నేరమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కలబురగిలోని ధర్మాసనం ముందుకు వచ్చిన అర్జీని జస్టిస్ రామచంద్ర డి. హుద్దార్, జస్టిస్ సునీల్ యాదవ్ పీఠం విచారణ పూర్తి చేసింది. లింగాయత సముదాయంలోని జంగమలు సమాజంలోని ఉన్నత వర్గానికి చెందిన వారని పీఠం పేర్కొంది. తమను షెడ్యూల్డు కులాల వారిగా పరిగణించాలని పోరాటం చేస్తున్న లింగాయత జంగమలకు ఈ తీర్పు చేదు గుళికగా మారింది.

అమ్మవారి తాళి చోరీ

మైసూరు, న్యూస్‌టుడే : రాచనగరి శివారు గాయత్రిపురలోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ఉన్న తాళిని ఒక వ్యక్తి దొంగిలించుకుని పరారయ్యాడు. పూజ చేసుకునే నెపంతో అమ్మవారి విగ్రహానికి దగ్గరగా వచ్చి గొలుసు తెంపుకొని వెళ్లిపోయాడు. సీసీ ఫుటేజ్‌లోని చిత్రాల ఆధారంగా నిందితుని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

జిమ్ శిక్షకుడి దుర్మరణం

మైసూరు, న్యూస్‌టుడే : కేరళలోని కొట్టియూరు దేవాలయంలో దర్శనం చేసుకుని మైసూరుకు వస్తున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో అనంత భూషణ్ (27) అనే జిమ్ ట్రైనరు మరణించాడు. కేరళ- కర్ణాటక సరిహద్దుల్లోని బావలి వద్ద వర్షంతో నిండిన గుంతలో అతని బైకు పడి అదుపుతప్పింది. కిందపడిన అతని పైనుంచి వెనుక వస్తున్న బస్సు వెళ్లడంతో బాధితుడు అక్కడికక్కడే మరణించాడు. తలకు శిరస్త్రాణం ఉన్నప్పటికీ బస్సు చక్రం నేరుగా తలపై నుంచి వెళ్లడంతో అతను మరణించాడు. బాధితుని మృతదేహాన్ని మైసూరులోని అతని నివాసానికి గురువారం సాయంత్రం తీసుకువచ్చారు.

వచనానందస్వామి సోదరుడి మృతి

బెళగావి, న్యూస్‌టుడే : అథణి తాలూకా తాంవశి గ్రామం వద్ద గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో యోగ గురువు, హరిహర పీఠాధ్యక్షుడు వచనానంద స్వామి సోదరుడు అశోక్ గౌరగొండు మరణించారు. భరమకోడి నుంచి తాంవశి వైపు వెళుతున్న సమయంలో వీధి కుక్క అడ్డుగా రావడంతో బైకు పైనుంచి అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని ఆసుపత్రికి తరలించేలోగా మార్గం మధ్యలో మరణించారు. తాంవశి గ్రామంలో గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అథణి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఉద్యానవనాల అభివృద్ధికి శ్రీకారం

ఎలక్ట్రానిక్ సిటీ హోసూరు రోడ్డులో అభివృద్ధి చేసిన ఉద్యానవనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాలను జైవిక ఉద్యానవనాలుగా మార్చుతున్నారు. వివిధ కంపెనీల తోడ్పాటులో హోసూరు రోడ్డులోని ఎలక్ట్రానిక్ సిటీ మార్గంలోని డివైడర్లు, రహదారి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాల్లో జైవిక ఉద్యానవనాలు అభివృద్ధి చేస్తున్నారు. ఆయుర్వేద మొక్కలతో పాటు వివిధ జాతుల మొక్కలు, పూల మొక్కలను నాటుతున్నట్లు జాతీయ రహదారి ప్రాధికార అధికారులు తెలిపారు. ఎలక్ట్రానిక్ సిటీ నుంచి అత్తిబెలె వరకు 25 కిలోమీటర్ల మేరకు ఖాళీ ప్రదేశాలను ఆక్సిజన్ అందించే మొక్కలు నాటి సంరక్షిస్తామన్నారు. ప్రస్తుతం పొడవైన ఉపరితల వంతెనతో పాటు ఎల్లో మెట్రో ఉపరితల వంతెన మార్గాల కింద ప్రదేశాల్లో మొక్కలు నాటుతున్నారు. జైవిక ఉద్యానవనాల వల్ల వాయుకాలుష్యం నియంత్రణలోకి వస్తుందని తెలిపారు. నగరం చుట్టుపక్కల ఉన్న జాతీయ రహదారుల పొడవునా వివిధ జాతుల మొక్కలు నాటి ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తామని అధికారులు వివరించారు.

వంతెనల కింద జైవిక ఉద్యానవనం

చాముండి దర్శనానికి ప్రత్యేక సదుపాయం

మైసూరు, న్యూస్‌టుడే : ఆషాఢ శుక్రవారాలు చాముండి బెట్టకు మెట్ల మార్గంలో వస్తున్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఎక్కువ మంది భక్తులు తమ మొక్కు తీర్చుకునేందుకు మెట్ల మార్గంలో వచ్చి, దర్శనానికి ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార గుర్తించింది. మెట్లపై నడక మార్గంలో భక్తులకు ప్రత్యేక టోకెన్లను వితరణ చేయడం ద్వారా బెట్టపైకి చేరుకున్న అనంతరం నేరుగా ధర్మ దర్శనం వరుసలోకి చేరుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు.

చారిత్రక చాముండి మాత ఆలయం

ప్రజ్వల్ కేసు వాయిదా

ప్రజ్వల్

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిలు కోసం వేసుకున్న అర్జీ విచారణ జులై 7కు వాయిదా పడింది. గత 13 నెలలుగా పరప్పన అగ్రహార కారాగారంలో ఉన్న తన కక్షిదారునికి బెయిలు ఇవ్వాలని కోరుతూ సీనియరు న్యాయవాది ప్రభులింగ నావడగి బుధవారం వాదనలు వినిపించారు. దిగువ కోర్టులో ఇంకా సాక్షుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో బెయిలు ఇవ్వకూడదని సిట్ తరుపున ఆచార్య రవివర్మ కుమార్ వాదించారు. ప్రజ్వల్‌పై కేసు పెట్టిన పనిమనిషిని పోలీసులు రేవణ్ణ ముందుకు తీసుకువచ్చి, ఆయన కాళ్లపై పడి క్షమాపణ అడగాలని ఒత్తిడి చేశారని, ఇప్పుడు ప్రజ్వల్‌కు బెయిలు ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకుని జస్టిస్ ఎస్ఆర్ కృష్ణకుమార్ తదుపరి విచారణను జులై 7కు వాయిదా వేశారు.

సందేశాత్మక కవితలకే గుర్తింపు

మాట్లాడుతున్న బెంగళూరు కనకదాసు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు చిక్కణ్ణ

బళ్లారి, న్యూస్‌టుడే: సమాజంలో కలిసి జీవించేలా సందేశాత్మక కవితలు, తత్వాలను రచించాలని బెంగళూరు కవి కనకదాసు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు చిక్కణ్ణ కోరారు. బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డా. బి.ఆర్.అంబేడ్కర్ సభాభవనంలో గురువారం కవి కనకదాసుపై ఏర్పాటు చేసిన విచార సంకీర్ణను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. కన్నడ కవితలు సంప్రదాయంలో కనకదాసు ఉన్నత స్థానంలో నిలిపారు. 15వ శతాబ్దంలో కనకదాసు కవిత, తత్వాలు మానవ విలువల పెంచే విధంగా ఉన్నాయి. ప్రస్తుత కవిత్వంలో మానవ విలువలు కనిపించడం లేదని విచారం వ్యక్తం చేశారు. బళ్లారి వీఎస్కేయూ ఉపకులపతి మునిరాజు మాట్లాడుతూ కనకదాసు కీర్తనలు ప్రజల సామాజిక జీవిత వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయన్నారు. ఆయన తన కీర్తనలతో సమాజంలో మార్పులు తీసుకుని రావడానికి శ్రమించారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్యలో చదువులకే పరిమితం కాకుండా కవిత్వం, సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. జ్ఞానం పెంచుకుంటే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. కన్నడ అధ్యయన విభాగం ఆచార్యుడు డా.సంతోష్ కనకదాసుపై జీవిత చరిత్ర, తత్వాలను వివరించారు. పరిపాలన విభాగం రిజిస్ట్రార్ దినేష్, ఆచార్యులు రాబర్ట్ జోష్, కనకదాసు తత్వాల అధ్యయన కేంద్రం సభ్యులు దస్తగిరి దిన్న, డా.అనుపమ, డా.శశికళ, శివప్రకాశ, డా.షకీల పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ఆచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధన విద్యార్థులు, విద్యార్థులు

పార్టీ కోసమే నా తపన



బసనగౌడ యత్నాళ్

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్రను పదవి నుంచి తప్పించాలని కోరుతూ పోరాటం చేసినా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అక్రమార్జన కేసులపై సుప్రీంకోర్టులో దావా వేసినా, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ కేసులపై ప్రజా జాగృతి కల్పించినా అన్నీ కాషాయ పార్టీ శ్రేయస్సు కోసమేనని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ (భాజపా బహిష్కృత) పేర్కొన్నారు. భాజపా నుంచి తనను బహిష్కరించేందుకు నేతృత్వం వహించిన శక్తులు తనకు తెలుసన్నారు. తాను చేసిన పోరాటాలకు దక్కిన విజయాలను కూడా తమ విజయమని చెప్పుకొనేందుకు విజయేంద్ర సిగ్గుపడడం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు.

ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కట్లు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏళ్ల తరబడి అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహించే వారు.. తప్పకుండా నెట్, స్లెట్ అర్హత సాధించిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి. ఈ ఆదేశాలు అతిథి అధ్యాపకులకు మరణ శాసనంగా మారాయని అతిథి ఉపన్యాసకుల సంఘం జిల్లా అధ్యక్షుడు డా.దుర్గప్ప ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 450ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 10 వేల మందికిపైగా అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అతిథి అధ్యాపకులపై ఆధారపడ్డాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, దిల్లీ, హరియాణా వేర్వేరు రాష్ట్రాల్లో అతిథి అధ్యాపకులకు యూజీసీ నిబంధనల ప్రకారం రూ.60వేలకుపైగా వేతనాలు ఇస్తున్నారు. ఇదే మాదిరిగా కర్ణాటకలో కూడా అతిథి అధ్యాపకులకు వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 10 బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు సిద్దేశ్, రుద్రముని, గురురాజ్, రమేష్, రామచంద్రరావ్, ఎర్రిస్వామి, శరణప్ప, జయరామ పాల్గొన్నారు.

రైల్వే ఛార్జీల పెంపు సబబే

సమర్థించుకున్న విపక్షనేత అశోక్

అశోక్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పలు సంవత్సరాలుగా రైలు ప్రయాణ ఛార్జీలను కేంద్రం ప్రభుత్వం పెంచలేదని విపక్ష నేత ఆర్.అశోక్ గుర్తు చేశారు. ఈ ప్రయాణ ఛార్జీలను పెంచడంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన విమర్శలను ఖండించారు. సాధారణ రైళ్లలో కిలోమీటరుకు పైసా, ఏసీ బోగీలకు కి.మీ.కు 2 పైసల ఛార్జీని పెంచడంలో తప్పేముందని ప్రశ్నించారు. వికాస్ ఎక్స్‌ప్రెస్ (భాజపా) కొత్త ట్రాకులను నిర్మిస్తోందని, విద్యుద్ధీకరణ, డబ్లింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో స్వల్పంగా ఛార్జీల పెంపు అనివార్యమైందని అశోక్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సామాన్యుల విషయంలో ఉత్తుత్తి ఆందోళనను వ్యక్తం చేస్తున్నారని ట్వీట్ చేసి విమర్శలు గుప్పించారు. మీ నేతృత్వంలోని పాల ధరలను పెంచి, రైతుల కోసం పెంచామని సమర్థించుకోవడం, ఇంధనం, ఆస్తిపన్ను, స్టాంప్ డ్యూటీ, మద్యం, బస్సు ఛార్జీలను పెంచి ప్రగతిశీల ఆదాయ విధానం అని సమర్థించుకోవడమే మీకు తెలుసని ఎద్దేవా చేశారు. కి.మీ.కు ఒక పైసా ఛార్జీ పెంచితే కేంద్రం పేదల వ్యతిరేక ప్రభుత్వం అవుతుందా అని ప్రశ్నించారు. వంద కి.మీ. ప్రయాణానికి ఒక రూపాయి చెల్లించడం ప్రయాణికునికి భారం కాదన్నారు. ఆర్టీసీ, బీఎంటీసీలు తక్కువ ప్రయాణ దూరాలకు కూడా రూ.30 వరకు పెంచారని గుర్తు చేశారు. రెండేళ్ల కిందట కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నిసార్లు, ఎన్ని ధరలను పెంచిందీ గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. మీ కన్నీళ్లు పేదల కోసమే అని నటించవద్దని విమర్శలు గుప్పిస్తూ ట్వీట్ల వర్షాన్ని కురిపించారు. దేవనహళ్లి వద్ద భూ మాఫియాకు మద్దతు ఇచ్చేందుకు భూములను స్వాధీనపరుచుకుంటున్నారని దుయ్యబట్టారు. సీఎం, డీసీఎం ఇద్దరూ భూరాకెట్లు నడుపుతున్నారని, సారవంతమైన భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కర్ణాటకలో అధికార పార్టీ దోపిడీలను లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

వీరభద్ర రాజగోపురం పనులు

బళ్లారి, న్యూస్‌టుడే: దరూరు గ్రామ ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే వీరభద్రస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణ పనులు గురువారం ట్రస్ట్ సభ్యులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు రావడంతో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ట్రస్ట్ సభ్యులు దరూరు పురుషోత్తమ గౌడ తెలిపారు. 81 అడుగులతో రాజగోపురం, 47 అడుగుల ఈశాన్య గోపురం, 31 అడుగుల శిలా మండపం, తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

(c) eenadu

డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు

బాగేపల్లి పేరును భాగ్యనగరగా మార్చినందుకు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డి గురువారం సదాశివనగరలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. బాగేపల్లి ప్రజల కోరికను ప్రభుత్వం తీర్చిందని, నంది హిల్స్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో భాగ్యనగర పేరును ఖరారు చేస్తూ తీర్మానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు భాగ్యనగర ప్రజలు రుణపడి ఉంటారన్నారు. **-న్యూస్‌టుడే, బెంగళూరు (హోయసలనగర)**

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

తల్లీబిడ్డల శ్రేయస్సుకు ఇన్ఫోసిస్ చేయూత

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. గ్రామీణ కర్ణాటకలో తల్లి, నవజాత శిశువులకు మౌలిక వసతులు కల్పించేందుకు తమవంతు బాధ్యతగా రూ.48 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు పొందిన ప్రశాంతి బాలమందిర ట్రస్టుతో కలిసి ముందుకు సాగుతామంది. ముద్దేనహళ్లిలోని శ్రీమధుసూదన్ సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసర్చ్, శ్రీసత్యసాయి సరళా మెమోరియల్ ఆసుపత్రితో కలిసి ఉచిత ఆరోగ్య సేవలందించేందుకు ఫౌండేషన్ సహకారాన్ని అందించనుంది. బాలింతలు, నవజాత శిశువులకు చికిత్స అందించేందుకు ఐసీయూ, సీటీ స్కానర్లు, ఆపరేషన్ థియేటర్లను అందుబాటులోకి తెస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

హో సూ రు క బు ర్లు

ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర సేవలు వరం

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్, మేయరు సత్య, కమిషనరు, ఉప మేయరు, కార్పొరేటర్లు

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు-తళి రోడ్డులోని టీవీఎస్‌నగర్‌లో కార్పొరేటరు, పన్నుల కమిటీ ఛైర్మన్ చన్నీరప్ప వినతి మేరకు రూ.3 కోట్లతో నిర్మించిన నగర ఆరోగ్య చికిత్స కేంద్ర భవనాన్ని సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలకు అంకితం చేశారు. ఆరోగ్య కేంద్ర భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయరు సత్య, ఉపమేయరు ఆనందయ్య, కమిషనరు షబీర్ ఆలం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో 24 గంటలూ గర్భిణులకు చికిత్స, ప్రసవానికి అవసరమైన అన్ని వసతులు ఉన్నాయన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, పడకలు, ఇతర సదుపాయాలు రోగులకు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వైద్యుడు, ఫార్మసిస్టు, ముగ్గురు నర్సులు, ఇద్దరు సిబ్బందిని నియమించామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లాధ్యక్షుడు ఎం.మునిరాజ్, జిల్లా ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ రమేశ్‌కుమార్, కార్పొరేటర్లు ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, డాక్టర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు నేడు కౌన్సెలింగ్

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు-డెంకణీకోట మార్గంలోని మిడిగిరిపల్లిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో డిగ్రీ తరగతుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ భాగ్యమణి తెలిపారు. కళాశాలలో ప్రారంభించిన కొత్త కోర్సుల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులకు సులభంగా ప్రవేశాలు పొందవచ్చన్నారు. వందకుపైగా సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పేదల బడి...సంస్కరణల ఒడి

జూజువాడి పాఠశాలకు రాష్ట్రస్థాయి ప్రశస్తి

జూజువాడి ప్రభుత్వ మహోన్నత పాఠశాల

ప్రధానోపాధ్యాయిని నర్మదాదేవి

అశోక్, ప్రణాళిక కమిటీ ఛైర్మన్

శ్రీధర్, విద్యా విభాగం ఛైర్మన్

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు-బెంగళూరు జాతీయ మార్గంలోని జూజువాడి పారిశ్రామికవాడలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రస్థాయి ప్రశస్తిని ప్రకటించింది. కావేరి నదీ తీరంలోని తిరుచ్చి నగరంలో 6న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రశస్తిని విద్యా మంత్రి అన్బిల్ మహేష్ అందజేయనున్నారు. తమిళనాడులోనే జూజువాడి ప్రభుత్వ మహోన్నత పాఠశాల అరుదైన గుర్తింపు పొందింది. ఈ పాఠశాలలో దాదాపు రెండువేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో అధిక సంఖ్యలో కార్మికుల కుటుంబాలకు చెందిన వారే. పిల్లలకు నాణ్యమైన విద్యనందించడానికి జూజువాడి ఒకటో వార్డు కార్పొరేటరు, ప్రణాళిక సంఘం ఛైర్మను అశోకరెడ్డి, రెండో వార్డు కార్పొరేటరు, విద్యా కమిటీ ఛైర్మన్ శ్రీధర్, పోషక ఉపాధ్యాయ బృందం సభ్యులు ఎంతో కృషి చేశారు. వీరికి ప్రధానోపాధ్యాయిని నర్మదాదేవి సహకరించారు.

సామాజిక బాధ్యత నిధులతో..

ఇద్దరు కార్పొరేటర్లు పరిశ్రమల నుంచి సామాజిక బాధ్యత నిధులు (సీఎస్ఆర్) సేకరించి పాఠశాలకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. పారిశ్రామికవాడలోని పరిశ్రమల యాజమాన్యం పెద్ద మనసు చేసుకొని నిధులిచ్చింది. వాటితో స్మార్ట్, రోబొటెక్ తరగతులు, ప్రతిభావంత ఉపాధ్యాయులను సమకూర్చారు. పర్యావరణ పరిరక్షణకు ఏకంగా ఉద్యాన వనం నిర్మించారు. బడి ఆవరణలో ఒకేరోజు 10వేల మొక్కలు నాటారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేయడంతో పాటు శుద్ధి జలం ప్లాంటు, విద్యార్థులకు ఆరోగ్య చికిత్స శిబిరాలు, ఆధునిక మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా రూ.8 కోట్లు వెచ్చించి పాఠశాలను అమోఘంగా తీర్చిదిద్ది రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించేలా చేసిన ఘనత ఈ ఇద్దరు కార్పొరేటర్లు, బృందానికి చెందుతుంది. రాష్ట్రంలోనే తొలిసారి 'బెల్ వాటర్' పద్ధతి అమలు చేసిన ఘనత ఈ పాఠశాలకే దక్కింది.

ఆర్ఎస్ఎస్‌పై మళ్లీ విరుచుకుపడిన ప్రియాంక్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తీరుపై మంత్రి ప్రియాంక్ ఖర్గే మళ్లీ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధిస్తామని ఇటీవలే పోస్టులో దుయ్యబట్టిన ఆయన అధికారం కోసం, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే సంఘ్‌పై భాజపా ప్రేమను నటిస్తోందని ఎద్దేవా చేశారు. భాజపా నాయకులు తమ పిల్లలను బడికి బదులుగా శాఖకు ఎందుకు పంపించడం లేదని ప్రశ్నించారు. సంఘ పరివార్‌పై ప్రేమ ఉంటే 'చడ్డీ'లు వేసి, కోలాటానికి పంపించాలని హితవు పలికారు. కాషాయ పార్టీ నాయకులు తమ పిల్లల కోసం 'సెల్ఫీ విత్ శాఖ' పేరిట ఫొటోలు తీసి పంపించాలని హితవు పలికారు. కాషాయ పార్టీ నాయకుల జుట్టు అంతా నాగపూర్ నేతల చేతులో ఉందని ఎద్దేవా చేశారు.

దేవరహట్టిలో పారిశుద్ధ్య సమస్య

మురుగునీటి కాలువలను చూపుతున్న గ్రామస్తులు

పావగడ, న్యూస్‌టుడే : పావగడ తాలూకా దేవరహట్టి గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగునీటి కాలువలు చెత్త చెదారంతో నిండిపోవడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలమతున్నాయి. వర్షాకాలంలో పరిశుభ్రతకు ప్రాముఖ్యం ఇవ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరని గ్రామ ప్రముఖుడు ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంగనవాడి కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. కాలువలలో నిలిచిన మురుగునీరు దుర్వాసన వెదజల్లుతోంది చిన్నారులు వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్నారు. గ్రామంలో సరఫరా చేసే నీటి పైపులు పగిలి 80 శాతం నీరు వృథా అవుతోంది. 20 శాతం నీరు కలుషితమై గృహాలకు చేరుతోంది. సమస్యను పలు మార్లు పంచాయతీ అధికారులకు తెలియచేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు సమస్యలపై స్పందించి గ్రామంలో పరిశుద్ధ్య సమస్యల పరిష్కరించాలని, లేకుండా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని అధికారులను హెచ్చరించారు.

నష్టపరిహారం చెల్లించాలని మంత్రికి వినతి

మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి సోమణ్ణ, ఎమ్మెల్యే సురేష్‌బాబు తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా కెంకెరె గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని, నష్ట పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కేంద్ర మంత్రి సోమణ్ణకు వినతి పత్రం అందజేశారు. భూములు స్వాధీనం చేసుకొని నాలుగేళ్లవుతున్నా రహదారి నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేయడానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

కెంకెరె నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు ప్రాంతంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాలూకా మాజీ పంచాయితీ అధ్యక్షుడు నవీన్ ఇంటికి మంత్రి సోమణ్ణ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నవీన్ చిత్ర పటానికి పూలమాల వేశారు. చిక్కనాయకనహళ్లి ఎమ్మెల్యే సురేష్‌బాబు, మాజీ ఎంపీ బసవరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యుల బాధ్యత బ్యాంకులదే

మహిళా స్వసహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల సామాజిక భద్రతకు బీమా పథకాలు కల్పించాల్సిన బాధ్యత జాతీయ బ్యాంకులదేనని జడ్పీ ప్రధాన ప్రణాళికాధికారి గాయత్రి అన్నారు. ఆమె గురువారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనజాగృతి కార్యక్రమంలో బీమా పథకాల ప్రచార గోడపత్రికలు విడుదల చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబాన్ని సామాజిక భద్రత బీమా పథకం పరిధిలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్, కెనరా బ్యాంకుల మేనేజర్లు రాఘవేంద్ర, కుశాల్‌కుమార్, రూడ్‌సెట్ అధికారి ఉదయ్‌కుమార్, ఆర్థిక అక్షరాస్యత ప్రచారాధికారి తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, చిత్రదుర్గం**

త్వరలో వంతెన పనులు పూర్తి

ఉపరితల వంతెన పనులను పరిశీలిస్తున్న పాలికె ఉన్నతాధికారులు

బెంగళూరు (అడుగోడి), న్యూస్‌టుడే : నగరంలోని ఈజిపుర-కోరమంగల మధ్యసాగుతున్న ఉపరితల వంతెన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తామని పాలికె ప్రత్యేక కమిషనర్ కరిగౌడ తెలిపారు. గురువారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. వంతెన నిర్మాణానికి అవసరమైన భూస్వాధీన ప్రక్రియ పూర్తి చేశారని, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని గుత్తేదారులకు సూచించినట్లు తెలిపారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేసి వాహన సంచారానికి అవకాశం కల్పిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీరు రాఘవేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

తాలూకా నూతన విద్యాధికారిణిగా రేణుకమ్మ

రేణుకమ్మను సత్కరిస్తున్న విద్యాశాఖ ప్రముఖులు

పావగడ, న్యూస్‌టుడే : పావగడ బీఈవోగా విధులు నిర్వర్తించిన ఇంద్రాణమ్మ పదవీ విరమణ చేయడంతో ఆమె స్థానంలో ఎం.రేణుకమ్మను నియమించారు. ఈమె మండ్య పట్టణంలో డైట్ కళాశాలలో ఉపన్యాసకురాలిగా పనిచేస్తూ పదోన్నతిపై పావగడ తాలూకా బీఈవోగా రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఎం.రేణుకమ్మను అధికారులు బి.ఆర్.సి.వెంకటేశ్, సోమశేఖర్, ప్రధానోపాధ్యాయులు పరంధామరెడ్డి, సావిత్రమ్మ తదితరులు స్వాగతించి సత్కరించారు.

ఏనుగుల ఎంపిక ప్రారంభం

మైసూరు, న్యూస్‌టుడే : నాడహబ్బకు ఏనుగుల ఎంపిక ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈసారి 11 రోజులు కొనసాగే జంబూసవారీలో పాల్గొనే ఏనుగులను ఎంచుకునేందుకు పాతిక గజరాజులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఆగస్టు 4 నుంచి వివిధ క్యాంపుల నుంచి ప్యాలెస్‌కు గజ ప్రయాణం ప్రారంభం అవుతుంది. మత్తిగోడు, దొడ్డ హరవె, భీమనకట్టె, దుబారె, బళ్ల, బండీపుర క్యాంపుల్లోని ఏనుగుల సామర్థ్యం, ఆరోగ్యం, గతంలో దసరా వేడుకల్లో పాల్గొన్న అనుభవాన్ని అధికారులు పరిశీలించారు.

వెంకటరమణప్పకు ఘన నివాళి

వెంకటరమణప్ప

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: బెంగళూరు నగరంలోని తెలుగు మాధ్యమ పాఠశాలలకు ఎనలేని సేవలందించిన విశ్రాంత తెలుగు ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణప్ప మృతి తీరని లోటని తెలుగు సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. కర్ణాటక తెలుగు ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ బొందురామస్వామి గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన సంతాప సభలో మాట్లాడారు. నగరంలో తెలుగు ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారాలను అందుకున్న ఏకైక వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని గుర్తుచేశారు. తెలుగు మాధ్యమ పాఠశాలల బాగోగులకు నిరంతరం శ్రమించారన్నారు. ఆయన చనిపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి తెలుగు ఉపాధ్యాయులు, స్థానిక నగర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆగస్టులో ఎల్లో మార్గంలో మెట్రో

జ్యోతి వెలిగిస్తున్న పాలికె చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు, డాక్టర్ సెల్వకుమార్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో ఆగస్టులో ఎల్లో మార్గంలో నమ్మ మెట్రో రైలు పరుగులు తీస్తుందని బీఎంఆర్‌సీఎల్ ఎండీ, పాలికె చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ బెంగళూరు ఛాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) 48వ వార్షిక సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎల్లో మార్గంలో మెట్రో రైలు సంచారం మొదలైతే సిల్క్‌బోర్డు కూడలి వద్ద వాహన సంచార రద్దీ అదుపులోకి వస్తుందన్నారు. నగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కొన్ని పథకాలు చేపట్టామని, రెండేళ్లలో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. మెట్రో విస్తరణ, ఆఖరి స్టేషన్ నుంచి రవాణా వ్యవస్థ తదితర అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సెల్వకుమార్, ఎస్‌బీఐ బెంగళూరు విభాగం జీఎం జూహి స్మితాసిన్హా, బ్రిగేడ్ గ్రూపు అధ్యక్షుడు ఎం.ఆర్.జైశంకర్, బీసీఐసీ అధ్యక్షుడు వినీత్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అంతర్జాతీయ జావెలిన్‌త్రో పోటీ

నీరజ్‌చోప్రాకు మైసూరు పేట తొడుగుతున్న సీఎం సిద్ధరామయ్య

గోవిందరాజు నుంచి చిత్రపటాన్ని స్వీకరిస్తున్న నీరజ్‌చోప్రా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: భారతీయ క్రీడా ఇతిహాసంలో తొలిసారిగా ఇక్కడి కంఠీరవ క్రీడాంగణంలో 'నీరజ్‌చోప్రా క్లాసిక్-2025' పేరిట అంతర్జాతీయ జావెలిన్‌త్రో పోటీలు 5న జరగనున్నాయి. రెండుసార్లు ఒలింపిక్స్ పతక విజేత నీరజ్‌చోప్రా, జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ నేతృత్వంలో భారత అథ్లెటిక్ సమాఖ్య ఆమోదంతో ఈ పోటీ నిర్వహించనున్నారు. భారత్ తరపున అంతర్జాతీయ క్రీడాకారులు నీరజ్‌చోప్రా, సచిన్‌యాదవ్, రోహిత్‌యాదవ్, సాహిల్ సిల్వాల్, యశ్వీర్‌సింగ్ పాల్గొంటున్నారు. వీరితో పాటు ప్రపంచస్థాయిలో పేరొందిన అథ్లెట్లు జర్మనీ నుంచి థామస్‌రోహ్లర్, కెన్యాకు చెందిన జులియన్ యోగో, అమెరికా నుంచి కర్టిస్‌థాంప్సన్, చెక్‌రిపబ్లిక్, బ్రెజిల్, శ్రీలంక, పోలండ్‌కు చెందిన మార్టిన్‌కొనెక్నీ, లూయిస్ మౌరిసియో డిసిల్వా, రుమేష్ పతిరాజ్, సిప్రియన్‌మ్రిగ్లోడ్ పోటీపడనున్నారు.

ముఖ్యమంత్రి సన్మానం: డబుల్ ఒలింపిక్స్ పతక విజేత జావెలిన్‌త్రో క్రీడాకారుడు నీరజ్‌చోప్రాను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సన్మానించి అభినందలు తెలిపారు. ఉద్యాన నగరానికి విచ్చేసిన నీరజ్‌చోప్రా గురువారం సీఎంను కావేరి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సీఎం కర్ణాటక సంప్రదాయం ప్రకారం శాలువా కప్పి, మైసూరు పేట తొడిగి, గంధం హారం వేసి సత్కరించారు. ఆయన సాధించిన ఘనతలను అభినందించారు. అనంతరం రాష్ట్ర యువజన సేవా క్రీడా శాఖ, కర్ణాటక ఒలింపిక్ సంఘం కలిసి కేఓఏ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీరజ్‌చోప్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను క్రీడాశాఖ కమిషనర్ చేతన్, కార్యదర్శి రాజ్‌సింగ్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.గోవిందరాజు, కార్యదర్శి అనంతరావు మైసూరు పేట, శాలువ, హారంతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: నగరంలోని ఆర్‌టీనగర పోలీసు ఠాణా పరిధిలోని సుల్తాన్‌పాళ్య నివాసి సునీత(15) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. విద్యార్థిని తొమ్మిదో తరగతి చదువుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల బాలిక పాఠశాలకు సక్రమంగా వెళ్లడం లేదు. బుధవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

నలుగురు నిందితుల అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: నగదును విదేశీ కరెన్సీగా మార్చుతామంటూ ఓ పారిశ్రామికవేత్తను నమ్మించి, కత్తులు చూపించి బెదిరించి రూ.2 కోట్లు దోచుకుని పరారైన నలుగురు నిందితులను విద్యారణ్యపుర పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను బెంజిమిన్ హర్ష, రక్షిత్, ప్రకాశ్, భరత్‌గా గుర్తించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కెంగేరిలో ఉంటున్న పారిశ్రామికవేత్త శ్రీహర్ష కోల్డ్ ప్రెస్ట్ ఆయిల్ కంపెనీ నిర్వహిస్తున్నారు. కంపెనీకి అవసరమైన ఆధునిక యంత్రాలను జర్మనీ నుంచి కొనుగోలు చేసేందుకు పంపించాల్సిన నగదును యూఎస్ డాలర్లుగా మార్చాలనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్నేహితుడు రక్షిత్ బెంజిమిన్ హర్ష అనే వ్యక్తిని పరిచయం చేశాడు. రూ.2 కోట్లను అమెరికన్ డాలర్లుగా మార్చి ఇస్తానని బెంజిమిన్ హర్ష ఆయనను నమ్మించారు. ఇందులో భాగంగా గత నెల 25న ఎం.ఎస్.పాళ్యలోని తన ఇంటికి డబ్బులు తేవాలని బెంజిమిన్ శ్రీహర్షకు సూచించారు. అక్కడికి వచ్చి ఆయన డబ్బులు లెక్కిస్తుండగా ఐదుగురు వ్యక్తులు అక్కడికి చేరుకొని బెదిరించి డబ్బులు తీసుకొని పరారయ్యారు. సంఘటన జరిగిన కొద్ది సేపటికి బెంజిమిన్ హర్ష అక్కడి నుంచి జారుకున్నాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటినుంచి హిందూ స్వాభిమాని రథయాత్ర



గోడపత్రికలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అఖిలభారత హిందూ మహాసభ కర్ణాటక తరపున 4 నుంచి రెండు రోజుల పాటు హిందూ స్వాభిమాని రథయాత్ర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ రాజ్య సంఘటన కార్యదర్శి అరుణ్‌కుమార్, వకీలు జగదీష్, యువక సభ రాజ్య అధ్యక్షుడు విశ్వనాథ, మహిళా ప్రతినిధులు సునీతాబాయి, సవిత, ఉమా, మంజుళ పాల్గొని మాట్లాడారు. రథయాత్ర తొలిరోజు శుక్రవారం రాష్ట్రీయ అధ్యక్షుడు చక్రపాణి మహరాజ్ విచ్చేస్తారన్నారు. 5న గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కాడు మల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్యాలెస్ మైదానం కింగ్స్ కోర్ట్‌లో కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా హిందువుల రక్షణకు పోరాటాలు చేసిన వారికి ప్రశస్తులు అందజేసి సన్మానిస్తామని వెల్లడించారు.

మహిళకు దేహశుద్ధి

హావేరి, న్యూస్‌టుడే: బాలికలకు పనులు ఇప్పిస్తానని నమ్మించి వారిని శారీరంగా వేధిస్తున్న లక్కవ్వ అనే మహిళకు బ్యాగవాది గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. కార్మికులు, పేదలు, ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలికలను ఆమె లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నట్లు గ్రామస్థులు గుర్తించారు. అనంతరం ఆమెను హానగల్ గ్రామీణ ఠాణా పోలీసులకు అప్పగించారు.

హోటల్ సిబ్బందిపై దాడి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఖాళీ టీ కప్పు ఇవ్వలేదన్న కోపంతో నలుగురు వ్యక్తులు హోటల్ సిబ్బందిపై దాడి చేసి పరారైన సంఘటన బుధవారం రాత్రి శేషాద్రిపురం పోలీసు ఠాణా పరిధిలో జరిగింది. కాఫీ తాగేందుకు నలుగురు వ్యక్తులు హోటల్‌కు వచ్చారు. రెండు కాఫీలు తీసుకుని రెండు ఖాళీ కప్పులు ఇవ్వాలని కోరారు. అందుకు సిబ్బంది నిరాకరించారు. దీనిపై వారి మధ్య వాదన మొదలై ఘర్షణగా మారినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

ఎక్స్‌ప్రెస్ కెనాల్‌పై గళం విప్పండి

వివరాలు తెలుపుతున్న గోవిందరాజు తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే: హేమావతి ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్ పథకంతో తుమకూరు జిల్లావాసులకు అన్యాయం జరుగుతుందని ఘోషిస్తున్న పోరాటదారుల ఒత్తిడితో ప్రభుత్వం 4న సభ ఏర్పాటు చేయనుంది. ఈ సభలో జిల్లా ప్రజాప్రతినిధులు నష్టాలపై గళం విప్పాలని ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్ పథకం వ్యతిరేక పోరాట సమితి నిర్ణయించినట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎ.గోవిందరాజు వెల్లడించారు. ఆయన గురువారం తుమకూరులో విలేకరులతో మాట్లాడారు. అనుసంధాన కాలువకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో ప్రభుత్వం దిగొచ్చి 4న ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ నేతృత్వంలో చర్చించడానికి జిల్లా ప్రజా ప్రతినిధుల సభను నిర్వహిస్తోందన్నారు. జిల్లావాసులకు న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రే సభను ఏర్పాటు చేసి లింక్ కెనాల్ పథకాన్ని రద్దు చేయాలన్నారు. తుమకూరు జిల్లా కుణిగల్ ఎమ్మెల్యే డా.రంగనాథ్ పోరాటంతో అక్కడి ప్రజల్లో గందరగోళం సృష్టించారని, రైతుల మధ్య చిచ్చుపెట్టే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కుణిగల్‌కు హేమావతి నీటిని ఇవ్వరాదని తాము ఎన్నడూ చెప్పలేదన్నారు. అనుసంధాన కాలువ ద్వారా నీటిని మళ్లించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. లింక్ కెనాల్ రద్దు చేసి హేమావతి కాలువనే వెడల్పు చేసి నీటిని తరలిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. శుక్రవారం జరిగే సభలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు జిల్లావాసుల కోసం గట్టిగా గళం వినిపించాలని డిమాండు చేశారు. గుబ్బి భాజపా నాయకుడు దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లావాసుల పాలిట లింక్ కెనాల్ మరణశాసనంగా మారుతుందన్నారు. సమావేశంలో సమితి ప్రతినిధులు బైరప్ప, పంచాక్షరయ్య, రైతు నాయకులు అజ్జప్ప, కళ్లిపాళ్య లోకేష్, వెంకటేగౌడ, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

వేతన సంఘం సిఫార్సులు వర్తింపజేయాలి



వేదికపై మాట్లాడుతున్న అమృతరాజ్ తదితరులు

తుమకూరు: మహానగర పాలికె ఉద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫార్సులను వర్తింపజేయాలని, ఆర్థిక శాఖ నుంచి గ్రాంట్లు విడుదల చేయాలంటూ బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో 8 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు కర్ణాటక రాష్ట్ర మహానగర పాలికెల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమృతరాజ్ తెలిపారు. ఆయన తుమకూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి ఇప్పటికే అనేక మార్లు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదన్నారు. 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పది మహానగర పాలికె ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని, పనులను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేసిన ఆరోగ్య సంజీవిని పథకాన్ని పాలికె ఉద్యోగులకూ వర్తింప చేయాలన్నారు. సమావేశంలో మహానగర పాలికె ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరామ్, ప్రధాన కార్యదర్శి బసవరాజయ్య, రాష్ట్రంలోని పది పాలికెల అధ్యక్షులు, పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

దుకాణంపై మాజీ డీజీపీ కుమార్తె...

బెంగళూరు (అడుగోడి): హతుడు మాజీ డీజీపీ ఓంప్రకాశ్ కుమార్తె కృతిక అకారణంగా పార్లర్‌పై దాడికి పాల్పడిన సంఘటన బుధవారం ఇక్కడి హెచ్.ఎస్.ఆర్ లేఅవుట్ పోలీసు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఓంప్రకాశ్ హత్య జరిగిన తర్వాత ఆమె వేరే ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి పక్కనున్న నందిని పార్లర్ ఎదుట ఆగి చూస్తున్నారు. దుకాణం యజమాని ఆమె వద్దకు వచ్చి పలకరించగా, దాడిచేసి చిక్కిన వస్తువులను పగలగొట్టింది. అనంతరం దుకాణం యజమానిపై దాడి చేసి గాయపరిచింది. బాధితుడి ఫిర్యాదుతో స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెను అదుపులోకి తీసుకొని ప్రశ్నించి విడిచిపెట్టారు. ఓంప్రకాశ్ హత్య కేసులో ఆమె తల్లి జైల్లో ఉండగా, సోదరుడు వేరే ప్రాంతంలో ఉంటున్న విషయం తెలిసిందే.

ఇండస్ట్రియల్ ఎస్టేటు
మదనపల్లె 517325, A.P
బిల్డింగు లీజుకు ఇవ్వబడును
వేర్ హౌస్/ మాల్ /
షాపింగ్ కాంప్లెక్సులకు
సరిపోవును.
అన్ని సదుపాయములు కలవు
వివరములకు
Contact:
92473 78547
90303 75282

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

సిద్దుపై శ్రీరాములు నిప్పులు

బి.శ్రీరాములు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాజకీయాల్లో గెలుపు- ఓటములు శాశ్వతం కాదని మాజీ మంత్రి బి.శ్రీరాములు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనను ఉద్దేశించి రెండు చోట్ల ఓడిన వ్యక్తి తనను ఉద్దేశించి మాట్లాడుతున్నాడని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బాదామిలో తనపై 1700 ఓట్ల మెజార్టీతో సిద్ధరామయ్య గతంలో గెలుపొందారని గుర్తు చేశారు. ఆ నాడు ఓడి ఉంటే ముఖ్యమంత్రి అయి ఉండేవాడివా? అంటూ ఏకవచనంతో సంబోధిస్తూ ప్రశ్నించారు. గతంలో తాను మొళకాల్మూరు నుంచి 40 వేల ఓట్ల మెజార్టీతో గెలిచానని గుర్తు చేశారు. ప్రజాదరణ తక్కువ అవుతున్న ప్రతి సందర్భంలోనూ ఇతరులను విమర్శించడం మానుకోవాలని సిద్ధరామయ్యకు హితవుపలికారు.

పార్టీ కోసమే నా తపన

బసనగౌడ యత్నాళ్

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్రను పదవి నుంచి తొలగించాలని కొంతకాలంగా పోరాటం చేసినా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అక్రమార్జన కేసులపై సుప్రీంకోర్టులో దావా వేసినా, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ కేసులపై ప్రజా జాగృతి కల్పించినా అన్నీ కాషాయ పార్టీ శ్రేయస్సు కోసమేనని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ (భాజపా బహిష్కృత) పేర్కొన్నారు. భాజపా నుంచి తనను బహిష్కరించేందుకు నేతృత్వం వహించిన శక్తులు తనకు తెలుసన్నారు. తాను చేసిన పోరాటాలకు దక్కిన విజయాలను కూడా తమ విజయమని చెప్పుకొనేందుకు విజయేంద్ర సిగ్గుపడటం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు.

నిబంధనలు అతిక్రమిస్తే.. తప్పదు జరిమానా

స్వాధీనం చేసుకున్న ఆటోలు

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలో సంచార నియమాలను ఉల్లంఘిస్తున్న వాహనాలపై జరిమానా విధించడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఆటో డ్రైవర్లు వివిధరీతుల్లో అడ్డదిడ్డంగా వెళుతున్నారు. అలాంటి ఆటోలను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు కార్యాచరణ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా, పీయూసీ, పర్మిట్ తదితర పత్రాలు లేకుండా తిరుగుతున్న ఆటోలు, ఇతర రాష్ట్రాల ఆటోలు, సమవస్త్రాలు ధరించకుండా నడుపుతున్న వాహనాలను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. బుధవారం ఒక్క రోజే 50 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు. లైసెన్సు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఆగస్టు లోపు అన్ని దాఖలాలు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. నోపార్కింగ్ స్థలాల్లో వాహనాన్ని నిలబెట్టిన డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యాచరణ నెల రోజులు కొనసాగుతుందని పీఎస్సై సణ్ణ వీరేశ్ వెల్లడించారు. అన్ని దాఖలాలు లేని ఆటోల్లో పిల్లలను పాఠశాలలకు పంపవద్దని సలహా ఇచ్చారు.

పోలీసుల చర్యలపై ప్రజలు ప్రశంసలు

పోలీసులు చేపట్టిన కార్యాచరణను ప్రజలు స్వాగతిస్తున్నారు. ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆటో డ్రైవర్లు ఇన్నాళ్లు నియమాలను బేఖాతారు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతున్నందున ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ప్రాంగణం లోపలకు ప్రవేశించాలన్నా.. బయటికి రావాలన్నా.. బస్సు డ్రైవర్లు ముప్పుతిప్పలు పడుతున్నారు. ప్రధాన రహదారుల్లో ప్రయాణికులను ఎక్కించుకోవటానికి కొందరు డ్రైవర్లు ఉన్న పళంగా ఆపేయడం, క్షణాల్లో ప్రమాదాలు తప్పిపోయిన ఘటనలు కోకొల్లలు. ఉదయం లింక్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చే సమయంలో రైల్వేస్టేషన్ ముందు ఆటోలను అడ్డంగా పెడుతున్నారు. ద్విచక్ర వాహనం, కారు బయటికి తీయాలంటే గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉంది. ట్రాఫిక్, రైల్వే పోలీసులు కఠినంగా వ్యవహరించనందున డ్రైవర్లు నియమాలను పాటించలేదు. ప్రస్తుతం చేపట్టిన చర్యల వల్ల మార్పు వస్తుందని పౌరులు ఆశిస్తున్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని కోరుకుంటున్నారు. ఆటో డ్రైవర్లు బాడుగలు సైతం అధికంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఖరారు చేసిన ధరల కంటే మూడు రెట్లు అధికంగా రాబడుతున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ప్రీపెయిడ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వానదేవుడి దండయాత్ర

ఖరీఫ్ ప్రారంభంలోనే జలాశయాల భర్తీ

పాండవపుర సమీప చిక్కదేవరాయ డ్యాం నిండి.. కావేరి మాత ఉరకలు, పరుగులు తీసే వేళ.. యువ విహంగాలు!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తీర ప్రాంత జిల్లాలు, మల్నాడు ప్రాంతంలో భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి, హొసనగర, సాగర తాలూకాలతో పాటు కొడగు జిల్లా వ్యాప్తంగా వానలు గురువారం జోరందుకున్నాయి. అంగన్‌వాడీ నుంచి అన్ని విద్యా సంస్థలకు వర్ష ప్రభావ జిల్లాల్లో గురువారం సెలవు ప్రకటించారు. శుక్రవారం కూడా సెలవు కొనసాగనుంది. వర్షం తగ్గుముఖం పడితే ఈ ప్రాంతాల్లో మళ్లీ తరగతులు ప్రారంభిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కొడగు జిల్లాలో గాలితో పాటు వర్షం భయపెడుతోంది. జిల్లా మొత్తం ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. కావేరి, కపిల నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. జలపాతాల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వాటి సమీపానికి పర్యాటకులు, స్థానికులు వెళ్లకుండా అధికారులు నిఘా వహించారు. చిక్కమగళూరు జిల్లాలోని శృంగేరి, ఎన్‌ఆర్‌పుర, కొప్ప, కళస, మూడిగెరె తాలూకాల్లోని విద్యాలయాలకు సెలవు ప్రకటించామని జిల్లాధికారి మీనా నాగరాజు ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర కన్నడ జిల్లా కార్వార చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షాలకు రహదారుల పక్కన ఉన్న కొండ చరియలు విరిగి పడ్డాయి. కొడసహళ్లి ఆనకట్ట వద్ద మార్గంలోని రహదారి కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేందుకు అన్ని మార్గాలు మూసుకుపోయాయి. కల్యాణ కర్ణాటకకు జీవనాడి తుంగభద్ర భర్తీ కావడంతో భారీగా ఇన్‌ఫ్లో ఉండగా, 12 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. దక్షిణ కన్నడ జిల్లా కడబ, సుళ్య, కుక్కె సుబ్రహ్మణ్య ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగాయి. కుక్కెలో కుమారధార నది స్నానఘట్టాన్ని ముంచెత్తింది. మల్నాడు, తీర ప్రాంత జిల్లాలు, బెళగావిలలో మరో అరు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చామరాజనగర, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, దావణగెరె, కోలారు, మండ్య, మైసూరు, తుమకూరు, విజయనగర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశామని వాతావరణ శాఖ అధికారి ఎస్.పూవై అరసన్ తెలిపారు. ఖరీఫ్ ప్రారంభంలోనే జలాశయాలన్నీ భర్తీ కావడంతో రానున్న రోజుల్లో కురిసే వానలకు సమకూరే నీటి నుంచి ముప్పు ఎదురుకాకుండా అధికారులు చర్యలకు ఉపక్రమించారు.


తుంగభద్ర నదీమతల్లి జోరుకు గురువారం సాయంత్రం హంపీ సమీప మండపాలూ నీటిపాలు

ఆయుర్వేద కళాశాలలో సదస్సు

పాత్రికేయులతో మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి, వైద్యులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఆయుర్వేద మందుల్లో వినియోగించే మినరల్స్ (ఖనిజాలు)పై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 5న పూర్ణిమా ఆయుర్వేద వైద్య కళాశాల, పరిశోధనా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరరెడ్డి కరముడి వెల్లడించారు. గురువారం కళాశాలలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలల అధ్యాపకులు, పీజీ, డిగ్రీ విద్యార్థులు, ఆయుర్వేద వైద్యుల హాజరవుతారని తెలిపారు. రాజీవ్‌గాంధీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యుడు డాక్టర్ బి.ఎస్.సవడి ప్రారంభిస్తారని, గంగావతి ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ స్ఫూర్తి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ శంకరగౌడ, బాగలకోట కళాశాల డీన్ డాక్టర్ శివకుమార్ గంగల్ హాజరవుతారని వివరించారు. పూర్ణిమా ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు ఉన్నారని, అత్యాధునిక వైద్య చికిత్సను తక్కువ ధరకే అందిస్తున్నట్లు తెలిపారు. వంద ఉచిత శిబిరాలు నిర్వహించామన్నారు. ఆసుపత్రి ఆవరణలో 250 ఔషధ మొక్కలను పెంచుతున్నట్లు వివరించారు. ఇక్కడ ఆయుర్వేద విద్యలో 60 సీట్లు ఉంటే, నీట్‌లో అర్హత సాధించిన 200 మంది విద్యార్థులు ప్రవేశం కోసం దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో వైద్యులు నందా, ప్రత్యూషా, నాగలాంబిక పాల్గొన్నారు.

రేపు సాంస్కృతిక సంభ్రమం

విలేకరులతో మాట్లాడుతున్న రంగస్వామి

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక రంగమందిరంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం సాంస్కృతిక సంభ్రమం, సంగీత నృత్యోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రంగసిరి సాంస్కృతిక కళా బృందం అధ్యక్షుడు రంగస్వామి వెల్లడించారు. ఆయన గురువారం పత్రికాభవన్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. హిందుస్థానీ శాస్త్రీయ, సుగమ, జానపద, భావగీత సంగీతాలు, దాసవాణి, భక్తి, రంగ గీతాల ఆలాపన, భరతనాట్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. వివిధ రంగాలకు చెందిన కళాకారులు ప్రకాష్ గద్దె, సణ్ణ వెంకటేష్, హనుమంతప్ప, హనుమంతి, కొండయ్య, బి.ఎం.రాజు, అమరేశ్, వెంకటేష్ దిన్ని, అప్సర్ హుస్సేన్, ముత్తణ్ణ, బి.శ్రీనివాస్, బి.విశాలరెడ్డి, జగదీశ్ దాస్, నిరుపాదప్ప నంజలదిన్నికి రంగసిరి పురస్కారాలను ప్రదానం చేస్తామని వెల్లడించారు. స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు సాన్నిధ్యం వహిస్తారని, ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించినట్లు తెలిపారు.

బెబ్బులి సినిమాను ఆదరించండి

రాయచూరు, న్యూస్‌టుడే : మాన్వి తాలూకా బాగలవాడ నివాసి పి.భీమరావ్ దర్శకత్వం వహించిన 'బెబ్బులి కట్' కన్నడ సినిమా జులై 4న రాష్ట్ర వ్యాప్తంగా విడుదలవుతుందని చిత్ర బృందం ప్రతినిధులు చెన్నబసవ అరోలి, బాబు, సచిన్, తరుణ్ రెడ్డి, లక్ష్మీనారాయణ వెల్లడించారు. గురువారం పత్రికా భవన్‌లో సినిమా గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ 75 శాతాన్ని జిల్లాలో చిత్రీకరించామని, ఈ ప్రాంత కళాకారులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణ నేపథ్యం, భాష, యాసలతో రూపొందించిన సినిమా ట్రైలర్‌ను యూట్యూబ్‌లో విడుదల చేయగా మంచి స్పందన వచ్చినట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సినిమా గురించి కన్నడ చిత్ర పరిశ్రమ చర్చించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ప్రేక్షకులు చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గోడ పత్రం విడుదల చేస్తున్న ప్రతినిధులు

అప్పుల బాధ తాళలేక అన్నదాత బలవన్మరణం

మైసూరు, న్యూస్‌టుడే : అప్పుల బధ తాళలేక తుంబసోగె వంతెన పైనుంచి కపిలా నదిలోకి దూకి గోవింద నాయక (50) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. జి.సరగూరు తాలూకా ముళ్లూరు గ్రామానికి చెందిన బాధితుడు సేద్యం కోసం బ్యాంకుతో పాటు, ప్రైవేటు కంపెనీల్లో రుణాలు తీసుకున్నారు. పంట నష్టంతో రుణాన్ని తీర్చలేకపోవడం, ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇట్న గ్రామం వద్ద అతని మృతదేహం గురువారం లభించింది. సరగూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జిమ్ శిక్షకుడు దుర్మరణం

మైసూరు, న్యూస్‌టుడే : కేరళలోని కొట్టియూరు దేవాలయంలో దర్శనం చేసుకుని మైసూరుకు వస్తున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో అనంత భూషణ్ (27) అనే జిమ్ ట్రైనరు మరణించాడు. కేరళ- కర్ణాటక సరిహద్దుల్లోని బావలి వద్ద వర్షంతో నిండిన గుంతలో అతని బైకు పడి అదుపుతప్పింది. కిందపడిన అతని పైనుంచి వెనుక వస్తున్న బస్సు వెళ్లడంతో బాధితుడు అక్కడికక్కడే మరణించాడు. తలకు శిరస్త్రాణం ఉన్నప్పటికీ బస్సు చక్రం నేరుగా తలపై నుంచి వెళ్లడంతో అతను మరణించాడు. బాధితుని మృతదేహాన్ని మైసూరులోని అతని నివాసానికి గురువారం సాయంత్రం తీసుకువచ్చారు.

యువకుడి బలవన్మరణం

దావణగెరె, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై రూ.18 లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలైన శశికుమార్ (25) అనే యువకుడు ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్ యాప్‌లపై నిషేధాన్ని విధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ, సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేటీజే నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉదయపూర్ రైలులో మంటలు

రామనగర, న్యూస్‌టుడే : మైసూరు నుంచి బెంగళూరుకు వస్తున్న ఉదయపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. చెన్నపట్టణ సమీపంలోని వందరగుప్పె స్టేషన్‌లో రైలును నిలిపి మంటల్ని అదుపు చేశారు. వందరగుప్పె గ్రామానికి చెందిన వారు మంటల్ని గుర్తించి హెచ్చరించి సమయప్రజ్ఞను చూపించారు. మంటల్ని అదుపు చేసిన అనంతరం రైలు బెంగళూరుకు తరలి వెళ్లింది.

ఆలమట్టిలో ఊపందుకున్న అవుట్‌ఫ్లో

రాయచూరు, న్యూస్‌టుడే : ఉత్తర కర్ణాటకలో మెరుగైన వానల ప్రభావంతో ఆలమట్టి అవుట్‌ఫ్లో పుంజుకుంది. గురువారం సాయంత్రం దిగువన నదికి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర నుంచి ఆలమట్టిలోకి 96,445 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. గడచిన రోజుతో చూస్తే అవుట్‌ఫ్లో 20 వేల క్యూసెక్కులు పెరిగింది. ఇన్‌ఫ్లో 1833 క్యూసెక్కులు తగ్గింది. ప్రస్తుతం 87.992 (గరిష్ఠ సామర్థ్యం 123.081 టీఎంసీలు) టీఎంసీల నీటి లభ్యత ఉంది. నారాయణపురలో 26.66 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పైనుంచి లక్ష క్యూసెక్కుల నీరు చేరుతోంది. 30 గేట్లను తెరిచి జల విద్యుత్తు కేంద్రానికి, జూరాలకు 95,265 క్యూసెక్కులను నదికి పంపిస్తున్నారు. మరో ఐదు రోజుల్లో కాలువలకు నీటి విడుదలను ప్రారంభిస్తారు. నీటి సరఫరా తేదీలను ప్రకటించడంతో ఆలమట్టి, నారాయణపుర కుడి, ఎడమకాలువల పరిధిలో సేద్యం ప్రాథమిక పనులు మొదలయ్యాయి. అత్యధిక వర్షపాతం నమోదైతే రెండు ఆనకట్టల్లో గరిష్ఠానికి చేరువ కాకముందే నదికి వదులుతారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం

కరపత్రాలతో ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్షక, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు జులై 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐసీసీటీయూ జిల్లా అధ్యక్షుడు అజీజ్ జాగీర్దార్ శ్రామికులకు పిలుపునిచ్చారు. ఆయన గురువారం రాయచూరు తాలూకా యరగేరా గ్రామంలో ఆందోళన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి కీడు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నందునే వివిధ సంఘాలు ఒకే వేదికపై పోరాటానికి సిద్ధమైనట్లు తెలిపారు. పని సమయాన్ని 12 గంటలకు పెంచడానికి విరమించాలని, మహిళా కార్మికులతో రాత్రి వేళల్లో పని చేయించుకోవాలని తీర్మానాలు చేస్తే, పెట్టుబడిదారులకు ప్రయోజనం చేసేలా చట్టాన్ని రూపొందిస్తే కార్మికులు మనుగడ కోల్పోతారని వివరించారు. పోరాటాన్ని విజయవంతం చేస్తే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు హనీఫ్, జిలానీ, ప్రకాష్, తిప్పణ్ణ, మలకరెడ్డి, సాబణ్ణ పాల్గొన్నారు.

'హిందీతో విద్యార్థులకు ఇక్కట్లే'

స్వాతంత్య్ర ఉద్యానవనంలో ధర్నా చేస్తున్న కరవే కార్యకర్తలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : హిందీని పక్కన పెట్టి రాష్ట్రంలో ద్విభాషా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెంగళూరు స్వాతంత్య్ర ఉద్యానవనంలో కర్ణాటక రక్షణావేదిక కార్యకర్తలు గురువారం ధర్నాకు దిగారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రీయ విద్యాలయాల్లో ద్విభాషా విధానాన్ని అమలు చేయాలని పట్టుబట్టారు. వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ మాట్లాడుతూ సీబీఎస్‌సీ, ఐసీఎస్‌సీ పాఠశాలల్లో కన్నడ భాషను ప్రథమంగా తప్పనిసరి చేసి అమలు చేయాలని ఒత్తిడి తెచ్చారు. త్రిభాషా విధానంతో విద్యార్థులు ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఆ విధానానికి స్వస్తి చెప్పి తమిళనాడు, మహారాష్ట్రల్లో అమలులో ఉన్న రీతిలో కర్ణాటకలో అమలులోకి తేవాలని కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో కన్నడ, ఆంగ్ల భాషలను తప్పనిసరి చేయాలన్నారు. హిందీని తొలగించకపోతే తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2024లో నిర్వహించిన ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో హిందీ పాఠ్యాంశంలో 90.79 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదని గుర్తు చేశారు. 2025లో ఫలితాల్లో కూడా ఇదే తరహా సమస్య ఎదురైందన్నారు.

అక్రమ కేసులు ఉపసంహరించాలి

సిరివార,(మాన్వి) : కొందరు అధికారులు అక్రమార్కులతో కలిసి ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం చేకూర్చుతున్నారని, దీన్ని అడ్డుకుంటుంటే అక్రమంగా కేసులు పెడుతున్నారని కర్ణాటక రక్షణ వేదిక ప్రతినిధులు ఆరోపించారు. పట్టణంలో ప్రభుత్వ నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకున్నందుకు కరవే అధ్యక్షుడు కె.రాఘవేంద్రపై అక్రమంగా కేసులు బనాయించారని కార్యకర్తలు ఆరోపించారు. కేసులను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. శిరస్తేదారు దాసరి వాసవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తాలూకా కరవే సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

విత్తనాలు అందిస్తున్న అధికారులు

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని కురిడి రైత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికంగా సాగు చేసే పంటల్లో కంది ప్రధానంగా ఉందన్నారు. మిశ్రమ వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయన్నారు. విత్తేముందు విత్తనాలను శుద్ధి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయక మేనేజర్ సయ్యద్ జలాల్, పంచాయతీ సభ్యులు, రైతు ప్రముఖులు పంచయ్యస్వామి, పంపనగౌడ, మహిబూబ్, జైనుద్దీన్, మహాంతప్పగౌడ, గూళప్ప, వాలేకర్, హులిగెప్ప, బసవరాజ్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో విజయం తథ్యం

రాయచూరు, కొప్పళ అధ్యక్షులను సత్కరిస్తున్న సమాజం రాష్ట్ర పెద్దలు

సింధనూరు, న్యూస్‌టుడే: ఏ సమాజంలోనైనా ఐకమత్యం ముఖ్యం, అది ఉంటే అన్ని పనులు సులభమని శ్రీశివశరణ సమగార (చమ్మార సమాజం) హరళయ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ బెటగేరి పేర్కొన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో గురువారం చమ్మార సమాజం రాయచూరు, కొప్పళ జిల్లాల సమ్మేళనం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన జగదీశ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి, తమ పిల్లలను ఉన్నత హోదాలో చూడాలనే ఆశలు ఫలించాలంటే వాళ్లను శ్రద్ధతో చదివించాలని సూచించారు. సమాజం తలపెట్టే పనులు సవ్యంగా జరగాలంటే ఐకమత్యం ఎంతో బలం.. ఈ సూత్రాన్ని అందరూ నమ్మాలని కోరారు. ఈ సందర్భంగా సమాజం రాయచూరు, కొప్పళ జిల్లాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేశారు. సమాజం రాయచూరు జిల్లా అధ్యక్షుడిగా లాలప్ప.ఎస్ బాలగవి, కొప్పళ జిల్లా అధ్యక్షుడిగా రవి సాణక్నవర్ ఎంపికయ్యారు. నూతన అధ్యక్షులను రాష్ట్ర సమితి పెద్దలు సత్కరించారు. గౌరవ అధ్యక్షుడు ఎల్లప్ప, ఉపాధ్యక్షుడు పరశురాం, కార్యదర్శి సునీల్ మదన్‌బావి, న్యాయవాది సంగమేశ్, దశరథ్, వెంకటేశ్ మండేవాడి పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులపై వేటు

గాంధీనగర, యలహంక, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన ఆరోపణలపై ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ బెంగళూరు పాలికె ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. షెడ్యూల్డు కులాలు, తెగల గణన వివరాలను నమోదు చేసుకునే సమీక్షలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న రమేశ్, పెద్దురాజు, సి.సెంథిల్ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. పౌరులతో గొడవ పెట్టుకోవడం, కొట్టిన ఆరోపణలు వీరిపై ఉన్నాయి. సమీక్ష పూర్తిగా చేయకుండానే ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తున్నారని, దీన్ని ప్రశ్నిస్తే అక్కడి నివాసులపై గొడవకు దిగినట్లు ఫిర్యాదులు అందాయి. సమీక్ష సరిగా జరగడం లేదని అనుమానం ఉంటే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచించారు.

ఏసీపీ నారాయణకు ముఖ్యమంత్రి ఫోన్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందని బెళగావిలో కాంగ్రెస్ నిరసన సమావేశాన్ని నిర్వహించిన సమయంలో భాజపా కార్యకర్తలు మోదీకి మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్లజెండాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేసిన వారిని ఎలా అనుమతించారంటూ ధార్వాడ ఏసీపీ నారాయణ భరమనిని తన వద్దకు పిలిపించుకుని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొట్టబోతూ, చివరి క్షణంలో నియంత్రించుకున్నారు. ఈ ఘటన అనంతరం ఆయనను ప్రభుత్వం బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వలేదు. సుమారు నాలుగు నెలలు ఆయన ఎస్పీ కార్యాలయంలో పోస్టింగ్ కోసం వేచి చూశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. విషయం తెలుసుకున్న సీఎం సిద్ధరామయ్య ఏసీపీ నారాయణకు గురువారం ఉదయం ఫోన్ చేశారు. మీపై నాకు కోపం లేదని, కోపాన్ని నియంత్రించుకోలేక అలా చేశానని, అన్యథా భావించవద్దని విజ్ఞప్తి చేశారు. రాజీనామా వెనక్కు తీసుకుని విధులకు హాజరు కావాలని కోరారు. 'ముఖ్యమంత్రి ఫోన్ చేసి, రాజీనామా వెనక్కు తీసుకోమని సూచించారు. ఇప్పుడు నేను విధులకు హాజరవుతున్నాను. రాజీనామా వెనక్కు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. రాజీనామాను అంగీకరించకుండా హోం శాఖ తిరస్కరిస్తేనే తాను విధుల్లో కొనసాగేందుకు అవకాశం ఉంటుంది' అని తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి దానిపై నిర్ణయం తీసుకుంటామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు.

ప్రైవేట్ బస్సు లారీ ఢీ

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం ఉదయం ప్రైవేట్ బస్సు-లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు ముందరి భాగం ధ్వంసం అయింది. ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. కూడలి వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ క్రమంలో పోలీసులు బస్సును క్రేన్‌తో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాన్వి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

03-07-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.53	1587.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	26,718	10,503
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	13,748	296
నీటి నిల్వ (టి.ఎం.సి)	78.239	8.782

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మన్నలాపూరులో పేలిన సిలిండర్

పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా మన్నలాపూరు గ్రామంలో బుధవారం రాత్రి రామప్పగౌడ అనే వ్యక్తి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. ప్రమాద ధాటికి ఇంటి తలుపు, కిటికీలు దెబ్బతిన్నాయి. వంట చేయటానికి గ్యాస్ ఆన్ చేసినప్పుడు పేలుడు సంభవించింది. పైపు లీకేజీ వల్ల సిలిండర్ పేలింది. రామప్పగౌడ వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక దళ సిబ్బంది సకాలంలో చేరుకుని సిలిండర్‌ను బయటికి తీశారు. ఇలాంటి ఘటన సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారికి అగ్నిమాపక దళం అధికారులు అవగాహన కల్పించారు. మరో సంఘటనలో హైదరాబాద్ రహదారి వద్ద నిలబడిన క్వాంటర్ వాహనంలోని సిలిండర్లకు నిప్పు అంటుకుంది. వాహనంలోని సిబ్బంది మంటలను ఆర్పారు.

వాహనం బోల్తా చోదకుడి మృతి

వాహనంపై చోదకుడి మృతదేహం

సిరివార, (మాన్వి) : తుంగభద్ర ఎడమ కాలువ వద్ద టాటా ఏస్ వాహనం అదుపు తప్పి పల్టీకొట్టడంతో వాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మాన్వి పట్టణం నుంచి రంగుల డబ్బాలను తీసుకుని దేవదుర్గకు వెళుతున్న టాటా ఏస్ విక్టర్ వాహనం అదుపు తప్పి కాలువ గట్టు పైనుంచి పక్కన పొలంలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడు హుసేన్‌బాషా (30) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దేవదుర్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

VACANCIES

Applications are invited for the post of **Branch Manager** at **Bellary Branch,** of The Citizen Cooperative Society Ltd., (Multi State Cooperative Society) Regd. **Office:** Hyderabad. **Qualification:** Any Graduate with Computer Applications Knowledge, **Experience:** 5-10 Years in any Banking/NBFC as Manager, age must be below 40 Years. Interested Candidates may send resume on or before **14-07-2025**

to:citizensociety.hr@gmail.com
or citizengm1@gmail.com

శుభాకాంక్షలు

సింధనూరు నగరాభివృద్ధి ప్రాధికార (సుడా) నూతన పాలక మండలి సభ్యులుగా నియమితులైన మా స్కూలు నిర్దేశకులు, మా అందరికీ ఆత్మీయులు శ్రీ వై.నరేంద్రనాథ్ గారికి ఇవే మా హృదయపూర్వక శుభాభినందనలు.

యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది
విద్యా పబ్లిక్ స్కూల్
మస్కిరోడ్, సింధనూరు.

(c) eenadu

ఈనాడు కర్నూలు

శుక్రవారం జులై 4, 2025

కొనసాగుతున్న కాల్వ లైనింగ్ పనులు

దిగువన పనులు దిగదుడుపు

● నీళ్లొచ్చే వేళ కాల్వకు మెరుగులు

ఎగువన తుంగభద్ర పరవళ్లు తొక్కుతోంది.. జలాశయం నిండుకుండలా మారింది.. మరో వారం రోజుల్లో కాల్వలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అంతలోపు కాల్వకు లైనింగ్ పనులు చేయాలన్న ఉద్దేశంతో గుత్తేదారులు నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. అధికారులూ చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. తుంగభద్ర బోర్డు పరిధిలోని 0/0 నుంచి 250 కి.మీ వరకు కాల్వకు లైనింగ్ పనులు జరుగుతున్నాయి. తొమ్మిది ప్యాకేజీలుగా విభజించి రూ.448 కోట్లతో మొదలెట్టారు. జిల్లా పరిధిలోని 135 కి.మీ. నుంచి 250 కి.మీ. వరకు పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఏటా నీళ్లొచ్చే ముందే చేస్తున్నారు. అవన్నీ నీట మునిగి కొట్టుకుపోతున్నాయి.

– న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణ, హాలహర్వి

మమ అనిపించేశారు

- ఈ ఏడాది లైనింగ్ పనులు 136 కి.మీ నుంచి 138 కి.మీ వరకు చేపట్టారు. ముందుగా ఎర్రమట్టి వేసి లెవలింగ్ చేయాలి. అందుకు విరుద్ధంగా తెల్లగరుసు వేశారు. ఇందులో గట్టిదనం ఉండదని ఇంజినీర్లే చెబుతున్నారు. కాల్వకు నీటిని విడుదల చేస్తే మట్టి మొత్తం కొట్టుకుపోయే అవకాశముంది.
- 155 కి.మీ నుంచి 156 కి.మీ వరకు కాల్వను వెడల్పు చేసి లైనింగ్ చేపట్టాలి. గుత్తేదారుడు సబ్ లీజ్‌పై పనులు చేయిస్తున్నారు. లైనింగ్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. ఇసుక సంచులు ఏర్పాటు చేసి దానిపై లైనింగ్ పనులు చేశారు. అంతేగాకుండా లైనింగ్‌కు, కాల్వగట్టుకు మధ్య మట్టితో కాకుండా రాళ్లు వేసి పనులు చేపట్టారు. ఎప్పుడు దెబ్బతింటుందోనని రైతులు వాపోతున్నారు.
- ఇప్పటికే పనులు చేసిన చోట బెడ్డింగ్ దెబ్బతింది. కాల్వలో వేసి బెడ్డింగ్, లైనింగ్‌కు మధ్య చీలికలు ఏర్పడ్డాయి. లైనింగ్‌కు మధ్య ఉన్న జాయింట్‌ల వద్ద చీలికలొచ్చాయి. అప్పుడే కాల్వ లైనింగ్‌లో నాణ్యత తేలిపోయింది.

పంపు రైతుల గుంపు

చినుకు రాలింది.. విత్తనం మొలకెత్తింది.. పెరుగుతున్న మొక్కలు చీడపీడల బారిన పడకుండా మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది.. ఇందుకు సంబంధించి రైతులు పంపుల(స్ప్రేయర్ల)ను సిద్ధం చేసి పెట్టుకొంటున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదురుగా ఉన్న మెకానిక్‌ల వద్ద స్ప్రేయర్ల మరమ్మతుల కోసం వివిధ ప్రాంతాల నుంచి రైతులు తరలొచ్చారు. మరమ్మతులు చేయించుకోవడానికి ఒక్కోదానికి రూ.2 వేల నుంచి రూ.3వేల ఖర్చు చేయాల్సి వస్తోందని అన్నదాతలు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

కర్షకుల గుండెల్లో గునపం

యాపర్లపాడు పొలాల్లో నిలిపిన పొక్లెయిన్

ఈనాడు, కర్నూలు: పచ్చని పొలంపై మైనింగ్ మాఫియా కన్ను పడింది.. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన నేలను భూచోళ్లు సొంతం చేసుకొనే పనిలో పడ్డారు. తాము 20 ఏళ్ల కిందటే లీజుకు తీసుకున్నామంటూ అక్కడ యంత్రాలను దింపారు.. పంటలను చెరిపేసే యత్నం చేస్తున్నారు.. అక్కడ విలువైన ఇనుప ఖనిజం ఉండటంతో హఠాత్తుగా వచ్చినట్లు తెలుస్తోంది. వెల్దుర్తి మండలం పుల్లగుమ్మికి చెందిన పలువురు రైతులు ఊరి సరిహద్దులోని కల్లూరు మండలం యాపర్లపాడులోని భూములను తరతరాలుగా సాగుచేసుకుంటున్నారు. ఒకప్పుడు కొండలు, గుట్టలతో నిండిన ఆ ప్రాంతాన్ని వ్యవసాయానికి అనుగుణంగా చదును చేసుకున్నారు. బోర్లు తవ్వించుకొన్నారు.. ఏడాదికి మూడు పంటలు పండేలా నేలను మార్చుకొన్నారు. పత్తి, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటల సాగుతో పొలాలు కళకళలాడుతున్నాయి.

2005లో 95 మందికి పట్టాలు

యాపర్లపాడులో సుమారు 136 మందికి పైగా రైతులు మూడు తరాలుగా వ్యవసాయం చేస్తున్నారు. 2005లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబరు 238-ఎ1లో 95 మందికి పట్టాలు ఇచ్చింది. సుమారు 131.25 ఎకరాల్లో 20 ఏళ్లుగా అధికారికంగానే పంటలు పండిస్తున్నారు. వారికి అదనంగా మరో 41 మంది ఆ గ్రామంలోని భూముల్లో సాగుచేసుకుంటున్నట్లు దస్త్రాల్లో నమోదై ఉంది.

లీజుకు తీసుకున్నామంటూ

పది రోజుల కిందట కొందరు వ్యక్తులు ఏకంగా పొక్లెయిన్‌తో సహా వచ్చి తవ్వకాలు చేస్తున్నారు. సుమారు 180 ఎకరాల్లో ఇనుప ఖనిజం తవ్వడానికి అనుమతులున్నాయి.. ఆయా భూములు ఖాళీ చేయాలని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల కిందటనే వాటిని లీజుకు తీసుకున్నాం.. రైతులకిచ్చిన పట్టాలు చెల్లవంటూ సదరు వ్యక్తులు చెబుతున్నారు. 21 ఏళ్ల కిందటే లీజుకు తీసుకుంటే అప్పటి నుంచి ఎందుకు తవ్వకాలు చేయలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఇనుప ఖనిజం కోసమేనా

యాపర్లపాడు భూముల్లో సమృద్ధిగా ఇనుపఖనిజం ఉంది. దాన్ని కొనేవారు లేకపోవడంతో ఆ ప్రదేశాన్ని లీజుకు తీసుకున్న సంస్థ తవ్వకాలు జరపకుండా వదిలేసింది. తాజాగా జైరాజ్ ఇస్పాత్ సంస్థ అక్కడి ఇనుప ఖనిజం తీసుకునేందుకు అంగీకరించడంతో ఆ సంస్థ తవ్వకాలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. యాపర్లపాడు భూముల్లో అర కి.మీ. దూరం రహదారి నిర్మాణానికి వీలుగా భూమిని చదును చేశారు. అటవీ భూమికి సరిహద్దులో ఆ రహదారి నిర్మిస్తున్నారు. రైతులు ఆందోళన చేస్తుండడంతో ప్రస్తుతానికి ఆయా పనులు నిలిపివేశారు.

ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను చూపుతున్న పుల్లగుమ్మి రైతులు

తరతరాలుగా సాగులో ఉన్నాం

– గుంటి శంకర్, పుల్లగుమ్మి

40 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. 2005 సంవత్సరంలో పట్టాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. పది రోజుల కిందట కొందరు హఠాత్తుగా వచ్చి పంటలు పాడు చేస్తున్నారు. లీజుకు తీసుకున్నాం.. ఖాళీ చేయమంటున్నారు. ఎంత పరిహారం ఇచ్చినా ఆ భూమిని వదులుకోం. భూమి కోల్పోతే మేమే కాదు.. ఆ పొలాల్లో పనిచేసే వేలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతాం.

శ్రమించి బాగుచేసుకున్నాం

– లక్ష్మన్న, పుల్లగుమ్మి

మా గ్రామంలోని రైతులకు వ్యవసాయం తప్ప మరో వృత్తి తెలియదు. ఎక్కువ ఆదాయం వచ్చేలా మా భూముల్లో బోర్లు, పైపులు, డ్రిప్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నాం. ఆయా భూములను సాగుయోగ్యంగా మార్చుకునేందుకు రూ.లక్షలు వెచ్చించాం. ఇంత చేసిన తరువాత ఆయా భూములు వదిలేయాలంటున్నారు. మాకు న్యాయం చేయకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తాం.

ప్రతి గడపకు సుపరిపాలన ఫలాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి తర్వాత రాష్ట్రంలో కొనసాగించిన అరాచకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నట్లు ఎమ్మెల్సీ బి.టి. నాయుడు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ పూల నాగరాజు, తెదేపా కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్‌లతో కలిసి 25వ వార్డులోని 75, 76 బూత్‌లలో పర్యటించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి పి.రాజశేఖర్ యాదవ్, బాలు, సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ల డెరెక్టర్లు కె.నాగేంద్రకుమార, విజయ్‌కుమార్, డి.జేమ్స్, పి.రవికుమార్, అఖిల్, సత్రం రామకృష్ణుడు, ఎస్‌కె బషీర్, బూత్ ఇన్‌ఛార్జి చలపతి తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

అన్న క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లలో భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్‌లో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు.

కలెక్టరేట్ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమశాఖ డీడీగా రాధిక గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా డీఎస్‌డబ్ల్యూవోగా పనిచేస్తూ.. పదోన్నతిపై కర్నూలు డీడీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రంగలక్ష్మీదేవి బదిలీ అయిన మూడు నెలల నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.

రుణ పత్రంపై ముడుపుల ముద్ర

'ఫ్రాంకింగ్ కోసం రైతుల నుంచి అదనపు వసూలు ● రిజిస్ట్రేషన్ సిబ్బంది, వెండర్ల చేతివాటం

చినుకు జోరందుకొంది.. కాడి కదిలింది.. పెట్టుబడికి కావాల్సిన సొమ్ము కోసం రైతులు బ్యాంకులు, సహకార సంఘాల వద్దకు పరుగులు పెడుతున్నారు. పంట రుణ మొత్తానికి సంబంధించి రైతు ఫ్రాంకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిర్ణీత మొత్తం చెల్లిస్తే.. వారు పత్రాలు చట్టబద్ధమైనవని, నిర్ణీత స్టాంప్ డ్యూటీ చెల్లించినట్లు ధ్రువీకరిస్తూ దరఖాస్తు ఫారంపై ముద్ర (ఫ్రాంకింగ్) వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయితేనే రైతులకు రుణం అందుతుంది. ఇదే అదనుగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల సిబ్బంది, వెండర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫ్రాంకింగ్ చేసేందుకు నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

రూ.లక్షకు వెయ్యి

- ఉమ్మడి జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉండగా ఫ్రాంకింగ్ యంత్రాలు కర్నూలు, నంద్యాల, ఆదోనిలోనే ఉన్నాయి. రూ.లక్షలోపు రుణాలకు రూ.వెయ్యి, రూ.2 లక్షల్లోపు పంట రుణానికి రూ.1100 ఫ్రాంకింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్కడ సిబ్బంది నిర్ణీత ధర కంటే అధికంగా రూ.వెయ్యికి రూ.1100, రూ.1100కు గాను రూ.1200 వసూలు చేస్తున్నారు. మిగిలిన చోట్ల ప్రైవేటు వెండర్లకు వీటిని జారీ చేస్తారు. ఇందుకు వీరికి రూ.100పై రూ.2.25 వరకు కమీషన్ వస్తుంది.
- నంద్యాల జిల్లాలో పదిమందికి పైగా, కర్నూలు జిల్లాలో 8 మంది వెండర్ల వద్ద ఫ్రాంకింగ్ యంత్రాలు ఉన్నాయి. వీరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. రూ.వెయ్యికి రూ.1200, రూ.1100కు రూ.1300 వరకు అదనంగా తీసుకుంటున్నారు.

రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు

- ఉమ్మడి జిల్లాలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లా రైతులకు రూ.8,964 కోట్లు, నంద్యాలకు రూ.9,213 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. రెండు జిల్లాల్లోని 34 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 652 శాఖల పరిధిలోని 5.23 లక్షల మంది రైతులతో పాటు 50 వేలమంది కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. రైతుల భూమి విస్తీర్ణం, అర్హతలను బట్టి రుణాలు పంపిణీ చేస్తున్నారు.
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.18 వేల కోట్ల పంట రుణాలకు సంబంధించి లక్షలాది మంది రైతులు కచ్చితంగా ఫ్రాంకింగ్ చేసుకోవాల్సి ఉంది. ఒక్కో రైతు నుంచి రూ.100- రూ.200 అధికంగా వసూలు చేసి పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల పరిధిలో అక్రమ వసూళ్లు రూ.కోట్లకు చేరుకుంటాయని అంచనా.

గ్రామాల్లో మరీ ఎక్కువ

నందికొట్కూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఫ్రాంకింగ్ యంత్రం లేదు. అక్కడి రైతులు కర్నూలు, ఆత్మకూరుకు వెళ్తారు. ఆత్మకూరు వెండరు ఇటీవల కాలంలో అందుబాటులో లేకపోవడంతో వెలుగోడుకు వెళ్లాల్సి వస్తోంది. బనగానపల్లి, కొలిమిగుండ్ల, అవుకు ప్రాంతాలకు చెందిన వారు కోవెలకుంట్ల వెండర్‌పై ఆధారపడుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల రైతులు ఆదోనికి, కోడుమూరు రైతులు కర్నూలు కార్యాలయాలకు వెళ్లాల్సిందే. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు వెండర్లు ఒక్కొక్కరి నుంచి రూ.200 కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

ఎక్కువ మొత్తం తీసుకుంటున్నారు

– ఎన్‌సీ మోహన్‌రెడ్డి, నంద్యాల

నా కుమారుడి పేరు మీద పంట రుణం తీసుకోవాలని నంద్యాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి ఫ్రాంకింగ్‌కు వెళ్తే రూ.వెయ్యికి అదనంగా రూ.100 వసూలు చేశారు. కార్యాలయంలో రద్దీ అధికంగా ఉండటంతో సిబ్బంది అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అదనంగా వసూలు చేస్తున్నారు.

స్థాయి మరిచారు

● ఉన్నతీకరణకే ఆసుపత్రులు పరిమితం
● సిబ్బంది నియామకం ఎప్పుడో

జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న పట్టణాలు.. అక్కడి ఆసుపత్రుల స్థాయి పెంచారు.. వైద్యులు స్థానాల భర్తీ మరిచారు.. ఉన్నతీకరించినా పరికరాలు ఇవ్వలేదు.. సిబ్బందిని నియమించలేదు.. దీంతో ఇప్పటికీ ప్రాథమిక పరీక్షలే చేస్తున్నారు.. అత్యవసరమైతే పెద్దాసుపత్రికి సిఫారసు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆదోనిలో జిల్లా సర్వజన ఆస్పత్రిగా, డోన్, బనగానపల్లి, ఎమ్మిగనూరు పట్టణాల్లో ప్రాంతీయ ఆస్పత్రిగా మార్చారు. 100 పడకలకు పెంచారు. భవనాల విస్తరణకు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలోనే సుమారు రూ.70 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేసింది. వాటిని పూర్తి చేయడంలో వైకాపాకు ఐదేళ్లు పట్టింది. ఎన్నికలు వస్తున్న తరుణంలో ఆర్భాటంగా ప్రారంభించారు. నేటికీ వైద్యులు లేక మెరుగైన వైద్య సేవలందడం లేదు. రూ.కోట్లు పోసి నిర్మించిన ఆస్పత్రుల్లో కేవలం ప్రాథమిక పరీక్షలకే పరిమితమయ్యాయి. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి సిబ్బందిని నియమించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల వైద్యం, ఎమ్మిగనూరు, డోన్ గ్రామీణ

పరిశీలన

ఎమ్మిగనూరు ఆస్పత్రిలో వైద్య కోసం వచ్చిన రోగులు

70 కి.మీ. వెళ్లమంటున్నారు

- ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచారు. ఇక్కడ నిత్యం ఓపీ 400-500, ఐపీ 40 వరకు ఉంటుంది. నెలకు రెండు వందల వరకు ప్రసవాలు, 30 వరకు కంటి చికిత్సలు చేస్తారు.
- 24 మంది వైద్యులకు 17 మంది పని చేస్తున్నారు. డిప్యూటీ జనరల్ సర్జన్, అనస్థీషియా వంటి ముఖ్యమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- జాతీయ రహదారి ఎమ్మిగనూరు మీదుగా వెళ్తోంది. ప్రమాదంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి 70 కి.మీ. దూరంలో ఉన్న కర్నూలుకు పంపుతున్నారు.
- ఎముకల సంబంధిత వైద్యుడు ఉన్నా ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో కర్నూలుకు పంపిస్తున్నారు.

కట్టుకట్టి పంపిస్తున్నారు

- డోన్ ఆసుపత్రిని 100 పడలకు పెంచారు. 23 మంది వైద్యులుండాల్సిన చోట 15 మంది పని చేస్తున్నారు. నిత్యం ఓపీ 400, ఐపీ 30 వరకు ఉంటుంది.
- జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, అనస్థీషియా, గైనకాలజిస్టు, రేడియోలజిస్టు, ఇద్దరు జనరల్ మెడిసిన్ వైద్యులు లేరు.
- డోన్-బెంగళూరు జాతీయ రహదారి ఉండడంతో నిత్యం జరిగే ప్రమాద బాధితులను కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.
- ఇక్కడ ఐసీయూ అవసరముంది. పరికరాలు లేవు. శస్త్రచికిత్సలు జరగడం లేదు. కట్టుకట్టి పంపడానికి పరిమితమవుతున్నారు.

ప్రాథమిక పరీక్షలకే పరిమితం

- ఆదోనిలోని వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రిని 350 పడకల స్థాయికి పెంచారు. ఇక్కడ ఓపీ 500, ఐపీ 30 వరకు ఉంటుంది. 78 మంది వైద్యులకు 19 మంది పని చేస్తున్నారు.
- పశ్చిమ ప్రాంతంలో 17 మండలాల వాసులు ఇక్కడికే వస్తుంటారు. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, పాము కాటు, విష ప్రభావం తదితర కేసులు వస్తుంటాయి. వీరికి ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేస్తున్నారు.
- పట్టణం మీదుగా 167వ జాతీయ రహదారి వెళ్తుంది. నిత్యం 10కిపైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయపడిన వారిని ఐసీయూలో ఉంచడం, సిటీ స్కాన్, ఎమ్మారై తదితర పరీక్షలు నిర్వహించడం, రేడియాలజిస్ట్, పాథాలజిస్ట్, సైక్రియాటిస్ట్ వంటి ఉన్నతస్థాయి వైద్య సేవలందడం లేదు.

తుంగభద్ర నిండుగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. నదిలో నీటి ప్రవాహం ఉన్నా.. ప్రమాదకర పరిస్థితుల్లో ఇసుకను తోడేస్తున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి, ఎడ్లబండ్లు వరుసకట్టి తీసుకెళ్తున్నారు.

–ఈనాడు, కర్నూలు

పంటలకు ఊపిరి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఆలూరు మండలం మినహా జిల్లా అంతటా మోస్తరు వర్షం కురిసింది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు కౌతాళంలో 44.6 మి.మీ. జిల్లా సగటున 17.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. కాగా ఇప్పటి వరకు 25.0 మి.మీ. రికార్డైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఇప్పటికే సాగైన పంటలకు ఊపిరిపోసిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వర్షం కురవగా.. పెద్దకడుబూరు 43.6, ఎమ్మిగనూరు 38.6, గోనెగండ్ల 25.6, కోడుమూరు 23.6, కృష్ణగిరి 23.6, మద్దికెర 22.8, ఆదోని 21.6, సి.బెళగల్ 20.4, తుగ్గలి 18.8 మి.మీ. కురిసింది.

WANTED LECTURER

Application are invited for the post of lecturer in **ZOOLOGY** Subject interested Candidates can attend for **Interview on 06/07/2025 (Sunday)** at 10 a.m with resume.

Principal: B.Sreekanth

SRI NANDI JUNIOR COLLEGE
Nandikotkur, Nandyal (D.t.,)
Cell: 94408 44186.

లీకులతో సరి.. నీరందేనా మరి?

తుంగభద్ర జలాశయం నిండుగా నీరు చేరడంతో ఎప్పుడైనా నీటిని వదిలే అవకాశం ఉంది. కేసీ కాల్వ షెటర్ల నుంచి నీరు లీకవుతోంది. కట్ట దెబ్బతింది. దీంతో చివరి ఆయకట్టు రైతుకు నీరు చేరడం ప్రశ్నార్థకంగా మారింది. వేసవిలోనే మరమ్మతులు చేయాల్సి ఉన్నా అధికారులు మిన్నకుండిపోయారు. – ఈనాడు, కర్నూలు

కాల్పులు కలిపిన బంధం

జమ్మూకశ్మీర్‌లో చోటు చేసుకున్న పహల్గాం కాల్పుల ఘటన ఎందరికో కడుపు కోతను మిగల్చగా.. ఓ భార్యకు భర్తను దగ్గర చేసి ఆ కుటుంబంలో ఐదేళ్ల తర్వాత సంతోషాన్ని నింపింది. . పహల్గాంలో కాల్పుల తర్వాత అక్కడి ప్రభుత్వం స్థానికుల వివరాలు సేకరిస్తోంది. సాంబా జిల్లా గంగూవాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆవులను మేపుతున్న బెస్త వీరేశ్ వివరాలను పోలీసులు అడిగారు. మంత్రాలయం అని చెప్పడంతో పోలీసులు.. ఇక్కడి ఎస్సై శివాంజల్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. వీరేశ్ ఫొటోలు వాట్సప్‌కు పంపించారు. విచారణ చేపట్టగా చెట్నిహళ్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. భార్య యల్లమ్మ, కుటుంబ సభ్యులకు ఫొటో చూపించగా వారు గుర్తించారు. మతిస్థిమితం సరిగా లేక ఊళ్లో తిరిగేవాడని, ఐదేళ్ల క్రితం ఊరు వదిలి వెళ్లిపోయాడని భార్య తెలిపారు. అప్పుడే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఫిర్యాదు తీసుకోలేదని అన్నారు. అనంతరం వీరేశ్‌తో ఫోన్‌లో మాట్లాడించి ఇక్కడికి రప్పించారు. ఐదేళ్ల కిందట వెళ్లిపోయిన వ్యక్తి తిరిగిరావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, మంత్రాలయం

దంపతులు యల్లమ్మ, వీరేశ్

వివాదాలకు సామరస్య పరిష్కారం

● రేపు జాతీయ లోక్‌అదాలత్

న్యాయం కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్న కక్షిదారుల వివాదాలను జాతీయ లోక్‌అదాలత్ సామరస్యంగా పరిష్కరించి ఊరటనిస్తోంది. సత్వర న్యాయం అందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వేల కేసులు పరిష్కారం అవుతున్నాయి. పోలీసు స్టేషన్, కోర్టుల్లో అపరిష్కృత కేసుల భారం తగ్గించటంలో జాతీయ లోక్‌అదాలత్ ఎంతో మేలు చేస్తోంది. సమయం, డబ్బు వృథా చేసుకుంటూ సుదీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారుల వివాదాలు సామరస్యంగా పరిష్కరించి మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో ఈ నెల 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు గాయత్రీఎస్టేట్

రాజీ మార్గం.. శ్రేయస్కరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 22 బెంచీల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారు. పోలీసు స్టేషనలో నమోదై కోర్టు విచారణలో రాజీ అయ్యే కేసుల్లోని ఫిర్యాదుదారులు, నిందితులు రాజీ కుదుర్చుకుంటే.. నేరుగా స్థానిక కోర్టుల్లో నిర్వహించే లోక్‌అదాలత్‌ను ఆశ్రయించి పరిష్కరించుకోచ్చు. న్యాయవాది లేదా సంబంధిత కోర్టు న్యాయమూర్తికి తెలిపితే లోక్‌అదాలత్‌తో కేసు పరిష్కరించుకోవచ్చు.

నిర్వహించిన తేదీ	పరిష్కరించిన కేసులు	వాహన చట్టం కేసులు	సివిల్ కేసులు	క్రిమినల్ కేసులు
16-3-2024	1219	136	322	496
29-6-2024	1139	132	307	770
14-9-2024	6319	177	437	5318
14-12-2024	14314	164	388	13658
8-3-2025	9942	161	346	9502

ఎలాంటి కేసులు

రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులు, సివిల్ , కుటుంబ వివాదాల, భార్యాభర్తల గొడవలు, రహదారి ప్రమాదాలు, చెక్ బౌన్స్ కేసులు, ప్రీలిటికేషన్ కేసులు, ప్రభుత్వశాఖ సేవలకు సంబంధించిన కేసులు, బీమా సంస్థలకు సంబంధించినవి ఇతరత్రా వివాదాలు జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు.

మంచి అవకాశం

– లీలావెంకటశేషాద్రి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఇరువురు కక్షిదారులు పరస్పరం చర్చించుకుని సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు. కక్షిదారులపై ఎలాంటి ఒత్తిడి ఉండదు. వారి పూర్తి అంగీకారంతో కేసు పరిష్కరిస్తారు. ఈ తీర్పుతో కక్షిదారులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కక్షిదారులు కేసులకు చెల్లించిన కోర్టు ఫీజు వాపసు తీసుకునే అవకాశం ఉంటుంది.

(c) eenadu

ధరలేక.. దిక్కు తోచక

గ్రామాల్లో నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం నిమ్మ ధరలు అమాంతం పడిపోవడం, పంటలకు వైరస్ సోకడంతో రైతన్నలకు తీరని నష్టం వాటిల్లింది. మండలంలోని మల్లెవేముల గ్రామానికి చెందిన మహిళా రైతు ఈదుల లక్ష్మీదేవి 4.5 ఎకరాల్లో నిమ్మ చెట్లను తొలగించింది. ప్రస్తుతం నిమ్మ ధరలేకపోవడం, వైరస్ ప్రభావంతో చెట్లు ఎండుముఖం పట్టుతుండటంతో అన్నదాతలు నష్టపోయారు. గత నాలుగు నెలల క్రితం బస్తా నిమ్మకాయలు రూ.4వేలు ఉండేది. ప్రస్తుతం బస్తా కేవలం రూ.200 మాత్రమే నడుస్తోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ప్రత్యామ్నాయ పంటలకు సాగుచేసిన నిమ్మను తొలగిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మల్లెవేముల(చాగలమర్రి)

పొంచి ఉన్న ప్రమాదం

ముచ్చుమర్రి కేసీ ఎత్తిపోతల పథకం పంపులు ప్రమాదకరంగా మారాయి. పథకం మోటార్ల నుంచి కేసీకి అనుసంధానంగా రెండు భారీ పంపులను ఏర్పాటు చేశారు. పశువులు, మనుషులు వాటి పైనుంచి వెళ్లినా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఇనుప కడ్డీలను ఏర్పాటు చేశారు. ఓ పైపులైన్ కడ్డీలు అపహరణకు గురవ్వడంతో ప్రమాదకరంగా తయారైంది. ఎవరైనా అటుగా వెళితే ప్రమాదవశాత్తు అందులో పడిపోయే అవకాశం ఉంది. కేసీ అధికారులు, కమిటీ సభ్యులు స్పందించి దెబ్బతిన్న పంపునకు గ్రిల్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు

పంట నీటి పాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కృష్ణా నదికి ముందస్తుగా నీరు రావడంతో మునక ప్రాంతాల్లో వేసిన పంట కొట్టుకొచ్చి ఒడ్డుకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా ప్రవాహం రోజు రోజుకు పెరుగుతోంది. నందికొట్కూరు నియోజకవర్గం కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లోని మునక భూముల్లో నీరు తగ్గిన తరువాత సుమారు 40 ఎకరాల్లో అన్నదాతలు నూలు, సొర, బీర వంటి పంటలను సాగు చేశారు. కొత సమయంలో నదిలోకి వచ్చిన నీటి ప్రవాహంతో కొంత పంట నీట మునగగా, కొంత పంట ఒడ్డుకు చేరింది. మిగతా పంట ప్రవాహంలో కొట్టుకుపోయింది. సుమారు 25 మంది రైతులకు రూ.30 వేల నుంచి 50 వేల వరకు నష్టం వచ్చినట్లు అంచనా. పంట చేతికొచ్చే సమయంలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

ఒడ్డుకు కొట్టుకు వచ్చిన నూలు, సొరకాయ పంటలు

కనులారా స్వామిని చూసేలా..

◆ రాఘవేంద్రుడి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో మఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి గురు, శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటోంది. దీంతో దర్శనానికి ఇబ్బందులు లేకుండా మఠం ప్రధాన ముఖద్వారం నుంచి బారికేడ్లు, మఠం ప్రాకారంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన ముఖద్వారంలో ఇద్దరు మఠం అధికారులు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు సెక్యూరిటీ గార్డులను, ప్రాకారంలో ఆరుగురు అధికారులు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. 10 నిమిషాలకు ఒకసారి భక్తులను పరిమిత సంఖ్యలో మఠం ప్రాకారంలోకి పంపించి దర్శనం సజావుగా జరిగేట్లు చర్యలు తీసుకుంటున్నారు. బృందావనం దర్శనానంతరం ఉత్తర ద్వారం నుంచి బయటికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు.

శ్రీమఠం ముఖద్వారం వద్ద తొక్కిసలాట లేకుండా దర్శనానికి పంపిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

చిన్నపిల్లల తల్లులకు, వృద్ధులకు ప్రత్యేకం

స్వామి దర్శనానికి వచ్చే చిన్నపిల్లల తల్లులకు, వృద్ధులకు, గర్భిణులకు 7వ నంబరు కౌంటర్‌లో శీఘ్ర దర్శనానికి పంపించే ఏర్పాట్లు చేశారు. గురువారం మఠం మేనేజర్ దగ్గరుండి వారిని ప్రత్యేక దర్శనానికి పంపించారు.

ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా..

వచ్చే నెల 8 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలకు భక్తులు నిత్యం వేల సంఖ్యలో తరలిరానున్నారు. సేవా కార్యకర్తలు, దాతలు, సాధారణ భక్తుల సౌకర్యార్థం దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామని మఠం మేనేజర్ తెలిపారు. శీఘ్ర దర్శనం చేయిస్తామని ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మోసపోవద్దని, దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

బ్యాంకుల వద్ద భద్రం

◆ ఏటీఎం కేంద్రాల్లోనూ అప్రమత్తత ముఖ్యం

ఆదోని పట్టణంలోని ఏటీఎం కేంద్రంలో యువతిని ఏమార్చిన దొంగలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ◆ ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న సెంట్రల్ బ్యాంకు ఏటీఎంలోకి ఈ నెల 1న ఓ యువతి డబ్బులు డ్రా చేసేందుకు వచ్చింది. గమనించిన ముగ్గురు వ్యక్తులు ఏటీఎం కేంద్రంలోకి వెళ్లారు. యువతిని సినీఫక్కీలో ఏమార్చి పిన్ నంబరు తెలుసుకొని ఏటీఎం కార్డును మార్చేశారు. తర్వాత అందులోంచి రూ.49,950 స్వాహా చేశారు.

◆ ఆలూరు మండలం ఎ.గోనేహాలు గ్రామానికి చెందిన రైతు రవికుమార్‌రెడ్డి గతనెల 21న ఆదోని పట్టణంలోని ఇండియన్ బ్యాంకులో బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి రూ.2.5 లక్షలు రుణం తీసుకున్నాడు. రూ.2 లక్షలు డ్రా చేసి సంచిలో పెట్టుకొని బ్యాంకు బయటకు వచ్చాడు. తన ద్విచక్రవాహనానికి మరో వాహనం అడ్డం ఉండడంతో నగదు సంచిని బైక్ ముందు బ్యాగులో పెట్టి.. వాహనాన్ని పక్కకు తీసి వచ్చి చూడగా.. నగదు కనిపించలేదు. జిల్లాలో బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద దొంగల సంచారం పెరిగింది. బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే వారిపై రెక్కీ నిర్వహించి సినీఫక్కీలో దొంగతనం చేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నిఘా ఉంచి వ్యక్తుల దృష్టి మార్చి పిన్ తెలుసుకొని ఏటీఎం కార్డులను మార్చేసి సొమ్ము కాజేస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఇలాంటి సంఘటనలు అధికంగా జరుగుతున్నాయి. ప్రజలు బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలకు వెళ్లిన సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- పెద్దమొత్తంలో నగదు డిపాజిట్, డ్రా చేసేందుకు వెళ్లాల్సి వస్తే.. ఒకరిని తోడుగా తీసుకెళ్లాలి.
- బ్యాంకులో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే బ్యాంకు అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలి.
- బ్యాంకు బయట మీ వాహనానికి అడ్డంగా మరో వాహనం పెట్టి.. డబ్బు కింద పడిందని.. వివిధ కోణాల్లో మీ దృష్టి మళ్లించి నగదు ఎత్తుకెళ్తారు.
- కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తుల సహాయం తీసుకోరాదు.
- ఏటీఎం ద్వారా డ్రా చేయడం తెలియకపోతే తెలిసిన వారిని తీసుకెళ్లాలి.
- ఏటీఎంలో పిన్ నంబరును ఎవరూ చూడకుండా అప్రమత్తంగా ఉండాలి.

అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించండి

-మర్రిపాటి హేమలత, డీఎస్పీ, ఆదోని

ఆదోని పట్టణంలోని ఓ బ్యాంకు వద్ద, ఏటీఎం కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. వారి కోసం ప్రత్యేకంగా గాలిస్తున్నాం. త్వరగా పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తాం. ప్రజలు బ్యాంకులకు, ఏటీఎం కేంద్రాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.

కోతిరాళ్ల పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయుల కేటాయింపు

కోతిరాళ్ల(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పత్తికొండ మండలం కోతిరాళ్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇబ్బందులపై 'ఐదు తరగతులకూ ప్రధానోపాధ్యాయుడే' శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డెప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను అక్కడికి పంపారు. పందికోన ప్రాథమిక పాఠశాల నుంచి ఒకరు, పత్తికొండ పట్టణంలోని మరో పాఠశాల నుంచి ఒకర్ని కోతిరాళ్ల పాఠశాలకు వెళ్లేలా మండల విద్యాధికారి రమేశ్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఇద్దరు ఉపాధ్యాయులు పాఠశాలకు రావటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

ఎరువుల లోటు.. కర్షకుల పాట్లు

గోనెగండ్ల మండలంలో ఇటీవల అనుకూలమైన వర్షం కురిసింది. దీంతో సాగు చేసిన పంటలకు ఎరువులు వేయడానికి అనుకూలమైన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో గురువారం ఉదయమే ఎరువుల దుకాణాల వద్ద నిరీక్షించారు. దుకాణాల్లో యూరియా కొరత ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కావాలంటే వ్యాపారులు మరో రసాయనిక ఎరువుకు లింకు చేస్తున్నారని.. అది కొనుగోలు చేస్తేనే ఇస్తున్నారని చెప్పారు. యూరియా కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు. సేద్యం ఖర్చులు తగ్గించుకునేందుకు చాలా మంది కర్షకులు ఎరువులను వారి ద్విచక్ర వాహనాల పైనే తరలించారు.

–న్యూస్‌టుడే, గోనెగండ్ల

మాతామరణాలు నివారించాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: హైరిస్కు గర్భిణులను క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణలో ప్రసవానికి మూడు రోజుల ముందే ఆసుపత్రుల్లో చేర్పిస్తే మాతామరణాలు నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. పూర్వ అధ్యాపక కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులకు గర్భిణులకు అందించాల్సిన సమగ్ర సేవలపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. డాక్టర్ రోహిణి, డాక్టర్ భావన గర్భిణుల విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీఐవో నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ మహేశ్వరప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, డీపీఎంవో డాక్టర్ ఉమా, సర్వజన ఆసుపత్రి నుంచి డాక్టర్ రత్నప్రభ పాల్గొన్నారు.

కన్నీరు తుడిచేదెవరమ్మా

◆ తల్లి మృతితో తల్లడిల్లిన కుమారుడు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఇద్దరూ వాహనంపై కర్నూలు నుంచి బయల్దేరారు. తన కొడుకు వాహనం నడుపుతుంటే.. చూసి మురిసిపోయింది ఆ తల్లి. అమ్మ మురిపెం చూసి ఎంతో సంతోషించాడు ఆ కొడుకు. వారిద్దరి ఆనందానికి అవధుల్లేవు. వారిని చూసి విధికి కన్నుకుట్టిందేమో.. తల్లిని దూరం చేసి, కుమారుడికి కన్నీటిని మిగిల్చింది. కుటుంబంలో విషాదం నింపింది. కర్నూలు నగర శివారులోని గుత్తిపెట్రోలు బంక్ ఉపరితల వంతెన వద్ద 44-నెంబరు జాతీయ రహదారి సర్వీసురోడ్డులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవి(56) మృతిచెందారు. కల్లూరు మండల పెద్దపాడుకు చెందిన రమణ, లక్ష్మీదేవి దంపతులకు నలుగురు కుమారులు. కొంతకాలం కిందట నంద్యాల జిల్లాలో డోన్‌లో స్థిరపడ్డారు. రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రమణ పక్షవాతంతో మంచానికే పరిమితం అయ్యారు. గురువారం లక్ష్మీదేవి, తన రెండో కుమారుడు సుదర్శన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వెళ్లారు. తమ పొలాలకు సంబంధించి స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో పని ముగించుకొని, తిరిగి డోన్‌కు బయల్దేరారు. గుత్తి పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారికి సంబంధించి సర్వీసురోడ్డు వద్దకు చేరుకోగానే వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక లక్ష్మీదేవి కొద్దిసేపటికే మృతిచెందారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కారు చోదకుడి అతివేగం, అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు చోదకుడు వాహనం వదిలి పరారయ్యాడు. బాధితుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలు లక్ష్మీదేవి

ఘటనాస్థలంలో గాయపడిన సుదర్శన్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం ప్రజల చెంతకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, స్వయం సహాయక సంఘాల మైక్రో క్రెడిట్ ప్లాన్, తదితర అంశాలపై సీఎస్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం, పురపాలికల్లో శుభ్రత చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై వేధింపులు, నేరాలు జరగకుండా చూడాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. సౌరవిద్యుత్తు, ప్రాజెక్టులకు భూముల కేటాయింపు తదితర అంశాలను ఈ వీడియో కాన్ఫరెన్సులో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ డా.బి నవ్య, సీపీవో హిమ ప్రభాకర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఇతర అధికారులు

కుర్చీలో కాసుక్కూర్చున్నారు

■ 20 నెలలుగా వేతనం ఇచ్చేశారు ■ 'ఈనాడు' కథనంతో దింపేశారు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దొంగ చేతికే తాళాలు ఇచ్చిన చందంగా బాగోతం నడిచింది. రూ.2.42 కోట్ల స్వాహాలో ప్రధానసూత్రధారి క్లర్క్ కమ్ సీఈవో ఎస్.ఏ రఫీక్ అని సహకార అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. అయితే అతను సొసైటీలో కొనసాగేలా జిల్లా సహకార అధికారులు వెనకేసుకొచ్చారు. రఫీక్ ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి వచ్చినప్పటికీ.. దర్జాగా కుర్చీలో కూర్చోబెట్టి.. నెల నెలా వేలకు వేల రూపాయలు వేతనాలు సమర్పించుకున్నారు. ఇలా ఒకటీ, రెండు నెలలు కాదు ఏకంగా 20 నెలలపాటు వేతనాలు, సకల మర్యాదలు పొందాడతను. సహకార చట్టం ప్రకారం అక్రమాలకు పాల్పడిన రఫీక్‌ను తప్పించి.. విచారణ చేపట్టాలి. అయితే ఏడాదిన్నరకు పైగా ఆయనను సీఈవోగా కొనసాగిస్తూనే విచారణ చేపట్టడం చూస్తుంటే సహకార అధికారులు ఎంతగా అతనికి కొమ్ముకాశారో అర్థం అవుతోంది. 2023 నవంబరులో సహకార అధికారులు సెక్షన్-51 కింద విచారణకు ఆదేశించారు. ఎట్టకేలకు వారం రోజుల కిందట జిల్లా సహకార అధికారులకు సమగ్ర విచారణ నివేదికలు అందాయి. ఆ సొసైటీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలకు ఉపక్రమించాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రస్తుత జిల్లా సహకార అధికారి డీఎల్‌సీవోకు ఆదేశాలిచ్చారు.

డిపాజిట్ల సేకరణే లేదు

2022 నుంచి ఇప్పటి వరకు ఆ సొసైటీలో ఎలాంటి డిపాజిట్ల సేకరణ, లావాదేవీలు జరగడం లేదు. రుణాల రూపంలో ప్రజల నుంచి రూ.20 లక్షలు రావాల్సి ఉంది. ఇక ఈ సొసైటీకి రెండు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. ప్రస్తుతం రూ.55 లక్షల వరకు ఖాతాల్లో నిల్వలున్నట్లు సమాచారం. వందల మంది నుంచి డైలీ డిపాజిట్ల పేరుతో వసూలు చేసిన రూ.2.42 కోట్ల సొమ్మును 2023 నవంబరు వరకు కొనసాగిన సొసైటీ ఛైర్మన్ బాలరాజు, క్లర్క్ కమ్ సీఈవోగా ప్రస్తుతం సొసైటీలో విధులు నిర్వహిస్తున్న రఫీక్ వీరిద్దరే స్వాహా చేసినట్లు విచారణలో వెల్లడైంది.

విధుల నుంచి సీఈవో తొలగింపు

పొదుపు ఖాతాకు కన్నం.. రూ.2.42 కోట్లు స్వాహా అని ఈనాడులో గురువారం కథనం ప్రచురితమైంది. ఈనాడు కథనానికి స్పందించిన సహకార అధికారులు ఆ సొసైటీలో పనిచేస్తున్న క్లర్క్ కమ్ క్యాషియర్, సీఈవోగా పనిచేస్తున్న ఎస్.ఏ రఫీక్‌ను సంఘం విధుల నుంచి తొలగించినట్లు ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ నాగరమణయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విచారణ నివేదికలో అతని పేరున్నందున సంఘం విధుల నుంచి తొలగించామన్నారు. సంఘానికి చెల్లించవలసిన నగదు చెల్లింపులను రఫీక్‌కు చెల్లించవద్దని సభ్యులకు సూచించారు. అలా ఎవరైనా చెల్లిస్తే సంఘానికి ఎలాంటి బాధ్యత ఉండబోదని తెలిపారు.

సీఈవో ఎస్.ఎ. రఫీక్

తల్లికి వందనం డబ్బులివ్వాలని గొడవ

◆ పురుగుల మందు తాగిన భార్య ◆ భర్త కూడా ఆత్మహత్యాయత్నం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పిల్లల చదువుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన 'తల్లికి వందనం' డబ్బులు ఇవ్వాలని భర్త తన భార్యతో గొడవపడ్డాడు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన భార్య పురుగుల మందు తాగడంతో భర్త కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా గోనెగండ్లలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అంజినమ్మ, ఈరన్న దంపతులు కురువపేటలో నివాసం ఉన్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. పాడి పోషణతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈరన్నకు ఆదోని మండలంలోని కపటి నాగలాపురం గ్రామానికి చెందిన శంకరప్ప పెద్దకుమార్తె అంజినమ్మతో వివాహం జరిగింది. ఈరన్న మద్యానికి బానిస కావడంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా మార్పు రాలేదు. గతనెల ప్రభుత్వం పిల్లల చదువు కోసం తల్లికి వందనం కింద అంజినమ్మ బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమ చేసింది. ఈ డబ్బులు ఇవ్వాలని ఈరన్న నిత్యం గొడవపడేవాడు. తమ పిల్లల చదువుకు ఖర్చు చేస్తానని, ఇచ్చేది లేదని భర్త మొరపెట్టుకునేది. బుధవారం సాయంత్రం డబ్బుల విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. జీవితంపై విరక్తి చెందిన అంజినమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే పురుగుల మందు తాగి ఈరన్న బలవన్మరణానికి పాల్పడాడు. వీరిద్దరూ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అంజినమ్మ పరిస్థితి విషమంగా ఉందని, తమ కుమార్తెకు న్యాయం చేయాలని ఆమె తండ్రి శంకరప్ప గురువారం పోలీసులను ఆశ్రయించారు. న్యాయం చేస్తామని పోలీసులు చెప్పి పంపారు.

న్యాయం చేయాలని పిల్లలతో పోలీసులను ఆశ్రయిస్తున్న అంజినమ్మ తండ్రి

అక్రమంగా విక్రయం.. రూ.1.02 లక్షల విలువైన ఎరువుల సీజ్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎరువుల బస్తాలు అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదోని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ దాడులు చేపట్టారు. గురువారం గ్రామంలోని నబీ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేయగా.. ఎలాంటి విక్రయ అనుమతులు లేని కర్ణాటకకు సంబంధించి డీఏపీ ఎరువుల బస్తాల నిల్వలను గుర్తించినట్లు సుధాకర్ తెలిపారు. దాదాపు రూ.1.02 లక్షలు విలువ చేసే 76 ఎరువుల బస్తాలను సీజ్ చేసి అమ్మకాలను నిలిపివేశామన్నారు. ఎరువుల నమూనాలను ప్రయోగశాలలకు పంపిస్తామన్నారు. ఫలితాల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కుమారుడిపై ఎస్పీకి ఫిర్యాదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలుకు చెందిన రంగలక్ష్మమ్మ అనే వృద్ధురాలు గురువారం వాట్సప్ ద్వారా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు వినతిపత్రం పంపి తన సమస్య వివరించారు. తన భర్త ఏపీఎస్పీ రెండో పటాలంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసి పదవీ విరమణ పొంది చనిపోయారు. తన కుమారుడు కానిస్టేబుల్‌గా కర్నూలులో పనిచేస్తున్నాడన్నారు. తన 15 తులాల బంగారు, పింఛను పాస్‌బుక్కు, రూ.1.80 కోట్ల డబ్బు మొత్తం కుమారుడు తీసుకుని తన బాగోగులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. గతంలో తన కుమారుడు పనిచేసే కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. తనను ఇబ్బంది పెడుతున్న కుమారుడిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఆమె అందులో పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ హుసేన్‌పీరా అన్నారు. అదనపు ఎస్పీ, కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సిబ్బంది డాగ్‌స్క్వాడ్‌తో కలిసి కర్నూలు రైల్వే స్టేషన్‌లలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు సూట్‌కేసులతో పాటు పార్సిల్ సర్వీసుకేంద్రంలోని పలు పార్సిళ్లను తనిఖీ చేశారు. కర్నూలు స్టేషన్‌కు వచ్చి ఆగిన యశ్వంత్‌పురం రైలును తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే 1972 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐలు నాగరాజారావు, అబ్దుల్‌గౌస్, గుణశేఖర్‌బాబులు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

పోలీసు జాగిలంతో తనిఖీ చేయిస్తున్న పోలీసులు, పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా

అనిశా కేసులో సస్పెండ్ సీఐకి బెయిల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: అవినీతి నిరోధకశాఖ కేసులో నిందితుడిగా ఉంటూ.. సస్పెండ్ అయిన సీఐ మధుసూదన్‌గౌడ్‌కు అ.ని.శా. కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా ఉన్న మధుసూదన్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ ఓ కేసులో నిందితుడి నుంచి రూ.80 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఇద్దరిని అరెస్టు చేసిన అనిశా అధికారులు కేసు నమోదుచేసి, రిమాండ్‌పై జైలుకు పంపారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఇద్దరినీ సస్పెండ్ చేశారు. జూన్ 26వ తేదీన రవికుమార్ బెయిల్‌పై విడుదలయ్యారు. మధుసూదన్‌కు కూడా కోర్టు బెయిల్ మంజూరు చేయటంతో గురువారం జిల్లా కారాగారం నుంచి బయటకు వచ్చారు.

పొలం వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

☛ 15మందిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని శిల్పా కాలనీలో పొలం వివాదం విషయంలో గురువారం ఇరువర్గాలకు చెందిన వారు కొట్టుకున్నారు. ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పట్టణ సీఐ శ్రీనివాసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వర్క్యార్‌కు చెందిన తిమ్మప్ప తల్లి పాపమ్మకు మండలంలోని కడిమెట్లలో పొలం ఉంది. దీని విషయంలో పాపమ్మ తమ్ముడైన చెన్నప్పకు మధ్య పొలం వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శిల్పా కాలనీలో ఓ తెదేపా నాయకుడి ఇంటి వద్ద ఇరువర్గాలకు చెందిన వారి సమక్షంలో పొలం పంచాయితీ నిర్వహించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి చేతికి దొరికిన వస్తువులతో కొట్టుకున్నారు. ఘర్షణలో ఒక వర్గానికి చెందిన తిమ్మప్ప, వెంకటేశ్వరమ్మ, దస్తగిరి, వెంకటేశ్వర్లు.. మరో వర్గానికి చెందిన భీమా, చెన్నప్పకు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. అక్కడ నుంచి ఇరు వర్గాల వారు పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ ఆవరణలోనూ గొడవ పడగా పోలీసులు మందలించారు. ఇరు వర్గాలకు చెందిన 15మందిపై కేసు నమోదు చేశారు.

EENADU eClassifieds

EDUCATION

DISTANCE EDUCATION

Open 10th, Inter, DPPTTC, Online Degree, PG, MBA & MCA Courses. Cont: Sri Sai College of Distance Education, Knl. ✆ 79812 23882.

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

రోహిణి ఇన్‌ఫ్రా వారి నూతన ప్రాజెక్ట్ కామధేను నివాస్ - 2, బెంగుళూరు రోడ్డు లక్ష్మీపురం దగ్గర ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. అనూష: 91600 38988, 88866 62148.

JOBS

కర్నూలు - నంద్యాల చెక్ పోస్ట్‌లో కొత్తగా ప్రారంభించిన మల్లికార్జున ఫర్నిచర్ నందు పనిచేయుటకు అకౌంటెంట్ M/F కావలెను. అర్హత: B.Com, MBA. ✆ 98493 50328.

FACULTY/ TEACHERS

Wanted Experienced JEE/NEET faculty for Junior College and School. Cell: 95505 90900/ 92907 48955.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

నీటి కుంటను పరిశీలిస్తున్న ఎస్‌.ఈ రామ్మోహన్‌రెడ్డి

ఎస్‌.ఎస్‌.ట్యాంకు పటిష్టతకు చర్యలు

ఆదోని పురపాలకం: ఆదోని పట్టణ శివారులోని దెబ్బతిన్న బసాపురం నీటి కుంటను పబ్లిక్ హెల్త్ విభాగం ఎస్‌.ఈ రామ్మోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈనాడులో గురువారం 'బసాపురం.. నీటి నిల్వ ప్రశ్నార్థకం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారుల బృందం స్పందించి కుంటను పరిశీలించింది. ప్రస్తుతం తాత్కాలిక పనులు చేపడతామని.. వచ్చే ఏడాది శాశ్వత పనులు చేపడతామని ఎస్‌.ఈ తెలిపారు. ఉప ఎస్‌.ఈ సతీష్, పురపాలక ఛైర్‌పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, ఇన్‌ఛార్జి ఎం.ఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మద్దికెరలో సాయి భక్తుల భిక్షాటన

మద్దికెర, న్యూస్‌టుడే : గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని సాయి భక్తులు భిక్షాటన చేపట్టారు. గురువారం ఇంటింటికి తిరుగుతూ గ్రామస్థుల నుంచి బియ్యం, ఇతర ధాన్యం, సేకరించారు. ఈ నెల 10న జరిగే ఉత్సావాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మల్లికార్జున, రామాంజులు, రామచంద్ర, అంజి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదోని:	ఆలూరు:	పత్తికొండ:
77996 66004	80085 62277	80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలంలోని, నంచెర్లలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మద్దికెర ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి తాగునీటి సరఫరా చేపట్టాలి. - రఘు, నంచెర్ల

✔: మద్దికెర ఎస్‌ఎస్‌ట్యాంకు నుంచి తాగునీటి సరఫరాకు పైపులైన్ వేశాం. కొద్దిగా పనులు మిగిలాయి. వాటిని పూర్తి చేసి తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకుంటాం. - మల్లికార్జున రెడ్డి, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ చిప్పగిరి మండలం.

హొళగుంద, న్యూస్‌టుడే: ?:స్థానిక మారెమ్మ ఆలయం ఆదోనికి వెళ్లే మార్గంలో చేతిపంపు నిరుపయోగంగా ఉంది. మరమ్మతులు చేయించండి - వెంకటేష్

✔: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం - చక్రవర్తి, డిప్యూటీ ఎంపీడీవో హొళగుంద

?: మండలంలోని అగ్రహారంలోని బస్సు షెల్టర్ అపరిశుభ్రంగా ఉంది. - ప్రసాద్, అగ్రహారం.

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, అగ్రహారం.

ఆదోని పురపాలకం: ?: ఆదోని పట్టణంలోని గోకర్‌జెండా సమీపంలో ఖారీ బడి ఎదురుగా లోపలి ప్రాంతంలో చేతి పంపు మరమ్మతుకు గురైంది. మరమ్మతు చేయించాలి. - వేణు, ఆదోని. ✔: సమస్యను పరిష్కరిస్తాం. - కృష్ణ, కమిషనర్

విద్యార్థినుల రక్షణ అస్త్రంగా 'శక్తి యాప్'

ఆదోని నేరవార్తలు: శక్తి యాప్ విద్యార్థినులకు రక్షణ అస్త్రంగా పనిచేస్తోందని ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత అన్నారు. ఆదోని పట్టణంలోని కిడ్డీస్ సీబీఎస్‌ఈ పాఠశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా.. వేధింపులకు గురి చేసినా భయపడకుండా సమాచారం ఇవ్వాలని సూచించారు. మూడో పట్టణ ఎస్సై రామస్వామి, పాఠశాల డైరెక్టరు కేశవనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత

చరవాణి చిక్కితే రూ.10వేలు!

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదాలను నియంత్రించే పనిలో భాగంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా, మద్యం తాగి, చరవాణిలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నవారిపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ద్విచక్రవాహనాలు, లారీలు, కారులు, ఆటోలు ఇలా ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై పెద్దమొత్తంలో అపరాధ రుసుం విధిస్తున్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్‌పై ప్రయాణం

ఆదోని నియోజకవర్గంలో కేసుల వివరాలు

నెల	డ్రంక్ అండ్ డ్రైవ్	నిబంధనల ఉల్లంఘనులు	జరిమానా
ఏప్రిల్	156	432	రూ. 1,40,201
మే	71	513	రూ. 3,07,845

● ఆదోని నియోజకవర్గంలో ప్రతినెలా దాదాపు 80నుంచి 100 వరకు రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో 6నుంచి 8మంది వరకు మృత్యువాత పడుతున్నారు. మరో 120 మంది వరకు గాయాలకు గురవుతున్నారు.

అత్యధిక ప్రమాదాలు

ఇటీవల రహదారి ప్రమాదాలను పరిశీలిస్తే అత్యధిక ప్రమాదాలకు సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ను అరికట్టాలని పెద్దమొత్తంలో అపరాధ రుసుం విధించేందుకు శ్రీకారం చుట్టింది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపితే మొదటిసారిగా రూ. 1500.. రెండోసారి పట్టుబడితే రూ. 10వేలు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

న్యాయస్థానంలో హాజరు

మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్యనే అధికంగా ఉంటుంది. దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన చోదకుడిపై కేసు నమోదు చేయడంతోపాటు న్యాయస్థానంలో హాజరు పరుస్తారు. కోర్టులో రూ. 10వేలు జరిమానాతోపాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

☛ ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

- మర్రిపాటి హేమలత, డీఎస్పీ, ఆదోని

రహదారి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని వాహన చోదకులపై జరిమానా విధిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో పాటు న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నాం.

రోజూ వాహన తనిఖీలు

- శిశిరదీప్తి, మోటర్ వెహికల్ అధికారిణి, ఆదోని

రోజూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నాం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మొదటిసారి పట్టుబడితే రూ. 1500.. రెండోసారి పట్టుబడితే రూ. 10వేలు జరిమానా తప్పదు. ప్రతి వాహన చోదకుడు లైసెన్సు కలిగి ఉండడంతోపాటు వాహనాలకు సంబంధించిన దస్త్రాలు పెట్టుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

అధికారులు సక్రమంగా పనిచేయకపోతే చర్యలు

ఆస్పరి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పంచాయతీ అధికారులు సక్రమంగా పనిచేయకపోతే చర్యలు ఉంటాయని జిల్లా సీఈవో నాసరరెడ్డి అన్నారు. గురువారం జొహరాపురం, ఆస్పరిలోని చెత్త సంపద కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న క్లాప్ మిత్రలతో మాట్లాడారు. జొహరాపురం గ్రామంలో కాల్వలు లేక మురుగు రహదారిపై ప్రవహిస్తుండడంతో, చెత్తాచెదారం రహదారిపైనే ఉండటంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో క్లాప్ మిత్రల ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ తప్పకుండా చేయించాలన్నారు. సక్రమంగా పనిచేయకపోతే చర్యలు ఉంటాయన్నారు. ఎంపీడీవో గీతావాణి, డిప్యూటీ ఎంపీడీవో విజయభాను, పంచాయతీ కార్యదర్శులు విజయరాజు, జంప్లానాయక్, నాగేష్, సురేష్, నబిసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా సీఈవో నాసరరెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

చందోలి గ్రామంలో మహిళలతో అరా తీస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

చందోలి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా చందోలిలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సాంబశివారెడ్డి, బత్తినలోక్‌నాథ్, తిమ్మయ్యచౌదరి, రామానాయుడు పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ: ఆదోని తెదేపా అబ్జార్వర్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఆదోని తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆదోని పట్టణం వాల్మీకినగర్‌లో గురువారం 'సుపరిపాలన.. తొలి అడుగు' కార్యక్రమం చేపట్టారు. కురవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, గుడిసె కృష్ణమ్మ, భూపాల్‌చౌదరి, వార్డు కౌన్సిలరు పార్వతి పాల్గొన్నారు.

వాల్మీకినగర్‌లో ఇంటింటికి వెళ్లి వివరిస్తున్న మీనాక్షినాయుడు, ధర్మవరం సుబ్బారెడ్డి

వెల్దుర్తి: మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ తన స్వగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వెల్దుర్తిలో నీటి సమస్య పరిష్కారం కోసం బ్రహ్మగుండం నుంచి ప్రత్యేకంగా పైపులైను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మద్దికెర: మద్దికెరలో జడ్పీటీసీ మాజీ సభ్యులు రాజన్న, పురుషోత్తమచౌదరి, పార్టీ జిల్లా కార్యదర్శి ధనుంజయ తదితరులు ఇంటింటికీ తిరిగి సర్కారు అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

తుగ్గలి: ఉప్పర్లపల్లి గ్రామంలో తెదేపా రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు పాల్గొని చంద్రబాబు పాలనపై ప్రజలతో మాట్లాడారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా 'విజన్ 2047'

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: 2047 నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ మండల పరిషత్తు సమావేశ భవనంలో గురువారం ఆర్డీవో భరత్‌నాయక్ నేతృత్వంలో అధికారుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలతోపాటు మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పేదరికాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి 2047 విజన్‌తో ముందుకు వెళ్తున్నారన్నారు. అధికారులు తమ శాఖల పరిధిలోని అంశాలను, సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంక్

రాంపురం గ్రామంలో మెట్ట ప్రాంతంలో ఉన్న కాలనీలలోని కొళాయిలకు నీరందక ఇబ్బంది పడుతున్నట్లు మహిళలు తెలిపారు. తాగునీటి ట్యాంకు(సిస్టర్న్) నిరుపయోగంగా ఉన్నాయి. ట్యాంక్ పక్కనే నివాసితులు ట్యాంకు పైపులకు తాడు కట్టి ఉతికిన బట్టలు ఆరేసుకొంటున్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఇటీవల గ్రామానికి వచ్చిన తెదేపా నాయకులకు నీటి సమస్య గురించి మహిళలు ఏకరువు పెట్టారు. గ్రామంలో మెట్ట ప్రాంతాల్లోని కొళాయిలకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

12 కిలోమీటర్లు.. 587 గుంతలు

మండలంలోని దేగలహాల్ రహదారి చుక్కలు చూపిస్తోంది. చిప్పగిరి నుంచి దేగలహాల్‌కు 12కిలోమీటర్ల దూరం ఉండగా, 587 గుంతలు పడ్డాయి. వాహనాలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. దేగలహాల్‌కు చుట్టుపక్క హాలహర్వి మండలంలోని మల్లికార్జున పల్లి, శిరుగాపురం, కొక్కర చేడు, శ్రీధర్‌హాల్, బేవినహాల్ గ్రామాలు ఉన్నాయి. గుంతకల్లు నుంచి దేగలహాల్‌కు వెళ్లి అక్కడి నుంచి ఆయా గ్రామాలకు ద్విచక్రవాహనాల్లో వెళ్తారు. రహదారి సమస్య వల్ల చిప్పగిరి, గుంతకల్లుకు వెళ్లకుండా కర్ణాటకలోని బళ్లారి పట్టణానికి వెళ్లి సరకులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిప్పగిరి

సీఆర్పీతోనే విద్య బోధన

హాలహర్వి మండలంలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. మండల పరిధిలో శిరుగాపురం ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకపోవడంతో సీఆర్పీతో బోధన కొనసాగుతుంది. నిబంధనల ప్రకారం సీఆర్పీల విధులు బోధన కాదు.. అయినా ఉపాధ్యాయులు కొరతతో ఇలా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిచడంతోపాటు చదువు నేర్పిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ఉపాధ్యాయులు లేకుండా పాఠశాలలు నడుస్తున్నాయని గ్రామీణ ప్రజలు విమర్శిస్తున్నారు. – హాలహర్వి, న్యూస్‌టుడే

పాఠశాల ముందు పారుతున్న మురుగు

పాఠశాల ముందు రహదారిపై ప్రవహిస్తున్న ఈ చిత్రం పత్తికొండ మండలంలోని హోసూరులోనిది. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ పాఠశాల ముందు ఉన్న రహదారిలో నిత్యం ఇలా మురుగు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా ఈసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాల వంట గది పక్కనే రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. రహదారి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు డ్రైనేజీ కాల్వలో పారేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

కళాకారులకు డప్పుల పంపిణీ

ఆదోని ఎస్కేడీకాలనీ, న్యూస్‌టుడే : మొహర్రం సందర్భంగా ఆదోని మండలం బైచిగేరి గ్రామంలో గురువారం తెదేపా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో డప్పు కళాకారులకు ఉచితంగా 12డప్పులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. డప్పుకళాకారులకు ప్రభుత్వం రూ.4వేలు పింఛను అందిస్తోందని గుర్తు చేశారు.

దళిత మహిళల సామూహిక దీక్ష విరమణ

ఆస్పరి, న్యూస్‌టుడే : తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని రెండో రోజు కైరుప్పల గ్రామ దళిత మహిళలు సామూహిక దీక్షలు చేపట్టారు. గురువారం ఉదయం దీక్షలో గాయత్రీ, లక్ష్మి, శారదమ్మ, వీరేశమ్మ, రంగమ్మ, ఈశ్వరమ్మ, రాఘవేంద్రమ్మ కూర్చున్నారు. సాయంత్రం వీఆర్వో ఈరన్న దీక్ష శిబిరం వద్దకు చేరుకున్నారు. అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కలెక్టర్, పత్తికొండ ఆర్డీవో ఆదేశాల మేరకు మహిళలకు నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు. నాయకులు ముద్దరంగన్న, బిటెక్ బద్రి, పులికొండ, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేయిస్తున్న వీఆర్వో ఈరన్న

ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోరా?

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద నుంచి ఆదోనికి రాకపోకలు సాగించాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నా పట్టించుకోరా అని ఎమ్మెల్యే విరుపాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గ్రామశివారులోని ఆదోని వెళ్లే రహదారిలో గుంతలమయంగా ఉన్న రోడ్డులో వరినాట్లు నాటి నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతలు లేని రాష్ట్రంగా చేస్తామని ఇలా వదిలేశారని ఎద్దేవా చేశారు. రోడ్డు పనులు చేపట్టకపోతే రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. మండల కన్వీనర్ షఫీయుల్లా, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు గ్రామీణ: విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. గురువారం ఆలూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నంబర్-1ను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందించిన సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు నాసిరకంగా ఉన్నాయన్నారు. మండల కన్వీనరు మల్లికార్జున్, రాజు పాల్గొన్నారు.

ఆలూరు: ఆలూరులో బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటుకు చొరవ చూపాలని డీవైఎఫ్‌ఐ ప్రాంతీయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, మైనా కోరారు. ఆలూరు రోడ్డు భవనాల అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్యే విరుపాక్షికి వినతిపత్రం అందించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు బసవరాజు, ఎర్రిస్వామి, ఉపేంద్ర, తేజ, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలూరు: ఆలూరు అభివృద్ధికి సహకరించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలో గురువారం మంత్రిని కలిసి పలు సమస్యలు వివరించడం జరిగిందని చెప్పారు.

ఆదోని మార్కెట్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పంట దిగుబడుల ధరలు. పత్తి క్వింటాలు కనిష్ఠంగా రూ. 4699, గరిష్ఠంగా రూ. 8101, మధ్య ధర రూ. 7759. వేరుసెనగ రూ. 5296-6082-5719, ఆముదాలు రూ. 5727-5892-5892.

తుగ్గలి: తుగ్గలి ఎస్సైగా బాలనరసింహులు బాధ్యతలు చేపట్టారు. గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారిలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎక్కువ ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలపై జరిమానాలు విధించినట్లు తెలిపారు.

మద్దికెర: సైబర్ నేరగాళ్లు ప్రజలను ఉచ్చులోకి లాగి ఆర్థికంగా దెబ్బతీస్తారని ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వెల్దుర్తి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సుహాసిని పేర్కొన్నారు. కలుగొట్ల, రామళ్లకోట, పుల్లగుమ్మి గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు.

పత్తికొండ గ్రామీణం: ఎంపీడీవో కవిత, ఈవోఆర్డీ నరసింహులు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామంలోని 4, 5 వార్డులతోపాటు తదితర కాలనీల్లో పర్యటించారు.

ఆలూరు గ్రామీణ: ఆలూరు సీడీపీవోగా బాధ్యతలు చేపట్టిన నరసమ్మ తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కమ్మరచేడు(ఆలూరు గ్రామీణ): గ్రామంలో పీర్లను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సై మహబూబ్‌బాషా సూచించారు. గ్రామంలో పర్యటించి పీర్ల చావిడి దగ్గర గ్రామస్థులతో మాట్లాడారు.

ఆదోని పాతపట్టణం: హొళగుంద లింగంపల్లిలో సురేష్‌పై దాడిన వారిని శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరామ్ డిమాండ్ చేశారు. చికిత్స పొందుతున్న సురేష్‌ను ఆయన పరామర్శించారు.

హొళగుంద: మండల పరిధి నెరణికి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మండల వైద్యాధికారి న్యూటన్ ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు.

ఆదోని వైద్యం: ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతినగర్ పరిధిలో క్షయ వ్యాధి నిర్మూలనపై వైద్యాధికారి త్రివేణి ర్యాలీ నిర్వహించారు.

ఆదోని పాతపట్టణం: విక్టోరియపేటలోని రుక్మిణి, పాండురంగస్వామి ఆలయంలో భావసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో 6నుంచి ఆషాఢ మాస మహోత్సవాలు నిర్వహిస్తారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రాధాన్యం

పత్తికొండ గ్రామీణం: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. పత్తికొండ వెలుగు కార్యాలయ ప్రాంగణంలో పత్తికొండ, ఆలూరు క్లస్టర్ల ఎం.ఐ కంపెనీ డీసీవోలు, ఎఫ్‌సీవోలు, డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో 2500 హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగు లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఏపీడీ పి. ఫిరోజ్‌ఖాన్, యం.ఐ ఇంజినీరు రంజిత్ కుమార్‌రెడ్డి, ఉద్యానవన అధికారి రఘువరన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసులు

సమస్యలు పరిష్కారించాలి

చిప్పగిరి, న్యూస్‌టుడే : మండలంలోని రహదారులు, తాగునీటి సమస్యలు పరిష్కారించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు గిడ్డయ్య, భూపేష్ అన్నారు. చిప్పగిరిలో గురువారం వారు మాట్లాడుతూ..మండలంలో 16 గ్రామాలుండగా ఏరూరు, దేగలహాల్, తిమ్మాపురం, నేమకల్లు, సంగాల, రామదుర్గం, కుందనగుర్తి, దౌల్తాపురం, నంచెర్ల గ్రామాలకు సరైన రోడ్లు లేవన్నారు. ఖాజీపురం, చిప్పగిరి, బెల్డోణ ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి నీటి శుద్ధి చేయకుండా వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు రాముడు, అంజి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుండా లైనింగ్ పనులు

పత్తికొండ గ్రామీణం: హంద్రీనీవా కాల్వ విస్తరణలో లైనింగ్ పనులు నాణ్యతతో చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి కోరారు. పత్తికొండ-హోసూరు సమీపంలో కాల్వ విస్తరణ పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి.. కాల్వలోనే బైఠాయించి నిరసన తెలిపారు.

హంద్రీనీవా కాల్వలో సీపీఎం నాయకుల నిరసన

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి కోరారు. సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 9న చేపట్టనున్న సమ్మెకు సంబంధించి తాఖీదు పత్రాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణికి అందించారు. యూనియన్ నాయకులు జయశ్రీ, చంద్రమ్మ, నీలావతి పాల్గొన్నారు.

సీడీపీవోకు సమ్మె తాఖీదు పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఈసారైనా ఇళ్ల స్థలాలు దక్కేనా?

➤ ఇల్లు లేని నిరుపేదల కోసం 2009లో కొనుగోలు చేసిన స్థలం ఇది. సర్వే నంబర్ 444-2బిలో 4 ఎకరాలను కొనుగోలు చేశారు. కొంతమంది కోర్టును ఆశ్రయించడం, దౌర్జన్యంగా అధికారులను అడ్డుకోవడం వంటి చర్యలతో పంపిణీ ఆగిపోతోంది. ఒకరు పోతే ఒకరు ఈ దుశ్చర్యలకు పాల్పడుతూ అర్హులకు నీడ లేకుండా చేస్తున్నారు. ఈ స్థలంలో పలుమార్లు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను సైతం ఎత్తుకెళ్లారు. నష్టం కలిగేలా చేశారు. కూటమి ప్రభుత్వమైనా అర్హులను గుర్తించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తికొండ, న్యూస్‌టుడే: మద్దికెరలో ఇళ్లు లేని నిరుపేదల కోసం 2009లో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలాన్ని లబ్ధిదారులకు కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 15ఏళ్లుగా అర్హులకు పంపిణీ చేస్తామని చెపుతున్నా.. సాధ్యం కావడం లేదు. ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులు, పాలకులు అన్నీ సిద్ధం చేసినా కొన్ని కారణాల వల్ల రద్దవుతూనే ఉన్నాయి. వీటిపై ఆశలు పెట్టుకున్న వారు నిరాశకు గురవుతున్నారు. ఎలాగైనా వీటిని దక్కించుకుని లబ్ధి పొందాలన్న కొందరి చర్యలతో నిరుపేదలకు ఏళ్ల తరబడి అన్యాయం జరుగుతోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తహసీల్దారుకు సెలవు పెట్టించి

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన అప్పటి తహసీల్దారుతో ఎనిమిది నెలల పాటు సెలవు పెట్టించారు. ఆయన స్థానంలో ఇక్కడే పనిచేస్తున్న ఉప తహసీల్దారుకు తహసీల్దారుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఆధ్వర్యంలో లబ్ధిదారుల జాబితా కూడా రూపొందించి అప్పటి ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయాలని ప్రయత్నించారు. అయినా అవి సఫలం కాలేదు.

వేతనాలు చెల్లించకుంటే జీవనం కష్టం

ఆలూరు, న్యూస్‌టుడే : సకాలంలో వేతనాలు చెల్లించకుంటే జీవనం ఎలా కొనసాగించేదని పాఠశాలల పారిశుద్ధ్య కార్మికుల సంఘ నాయకులు రంగమ్మ, ఈరమ్మ, శాంతి అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆలూరు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మండల విద్యాధికారికి వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు నారాయణస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

కింది కోర్టును ఆశ్రయించండి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారధితోపాటు తెదేపా రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని హైకోర్టులో వేసిన పిటిషన్‌పై కోర్టు కింది కోర్టును ఆశ్రయించాలని సూచించినట్లు ఆదోని మండలం ధనాపురం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. గతనెలలో గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తనకు జరిగిన అగౌరవంపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే, కేసు నమోదు చేయలేదన్నారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆదోని పట్టణ శివారు యల్లమ్మ కొండ ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరాలపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేపట్టారు. దాదాపు 300 లీటర్ల బెల్లం ఊట, సారా బట్టీలను ధ్వంసం చేసి, 15లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సైదులు తెలిపారు. వాల్మీకినగర్‌కు చెందిన బోయ లాలుస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యల్లమ్మ కొండల్లో ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

జేఎంతండా(పత్తికొండ గ్రామీణం): మండల పరిధిలోని జేఎం తండాలో ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకి వినియోగించే 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌గౌడ్, పత్తికొండ సీఐ సువర్ణలత, ఎస్సై సాయిప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన తిమ్మయ్య(25) అనే యువకుడు గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు తరలించారు. కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

(c) eenadu

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

విద్యార్థులకు సూచనలిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుల సలహాలు పాటించి క్రమశిక్షణతో విద్యా ప్రమాణాలు పెంచుకొని చదువుల్లో రాణించి తల్లిదండ్రుల ప్రతిష్ఠ పెంచాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. గురువారం కైరవాడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై గోనెగండ్ల సీఐ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ హాజరై విద్యార్థులకు ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, నకిలీ రుణ యాప్స్, రోడ్డు నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

23.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు మండలంలో గురువారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దాంతో 23.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో అభిమన్యు తెలిపారు. వర్షం రాకతో పంటలకు జీవం పోసిందని రైతులు తెలిపారు. మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అన్నదాతలు ఎరువులు తెచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఎమ్మిగనూరు (గ్రామీణం)	కోసిగి
80085 73794	9550434095

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: రాధాకృష్ణ కాలనీలో మ్యాన్‌హోల్‌లో మురుగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రహదారిపై దుర్వాసన వెదజల్లుతోంది. - లక్ష్మి, కాలనీవాసి

✔: సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. - శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: ఎస్ఎంటీ కాలనీలో బోర్ లైన్‌లో తాగునీటి ట్యాంకు నిర్మించి వదిలేశారు. బోరు మరమ్మతులు చేపట్టి నీటిని విడుదల చేయండి. - గోపీ

✔: మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - శరత్, ఏఈ

?: సోమేశ్వర టాకీస్ వెనుక రహదారి అధ్వానంగా ఉంది. రహదారికి మరమ్మతులు చేపట్టండి - లక్ష్మన్న, కాలనీవాసి

✔: రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. - శరత్, ఏఈ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. విష పురుగుల భయంతో చిన్నారులు, మహిళలు బయటికి వెళ్లలేకపోతున్నారు. -గ్రామస్థులు, పెద్దకడబూరు

✔: మండల కేంద్రంలో నెలకొన్న వీధి దీపాల సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం.

- ప్రభావతీదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కళాశాల విద్యార్థులకు ఎస్సై శివాంజల్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, అంతర్జాలంలో మోసాల పట్ల అవగాహన కల్పించారు.

చేనేతల సంక్షేమమే తెదేపా ధ్యేయం

- ఎమ్మెల్యే బీవీ

ఉప్పరవీధిలో ప్రజలకు అభివృద్ధి పనులను వివరిస్తున్న ఎమ్మెల్యే బీవీ, తదితరులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సంక్షేమమే తెదేపా లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమావేశాన్ని గురువారం పర్కీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికుడు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు చేనేత సహకార పరపతి సంఘం, మున్సిపాలిటీ మధ్య ఉన్న మైదానాన్ని కోర్టు తీర్పు ప్రకారం కేటాయిస్తామన్నారు. చేనేత మైదానంలో ఆక్రమంగా వేసిన దుకాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో మార్కెట్ యార్డు సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జౌళిశాఖ సహాయసంచాలకులు, కార్యదర్శి అప్పాజీ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లయ్య, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఎంబీ మహేష్, పరిశీలకులు శ్రీరాములు, నేతలు మాచాని శివశంకర్, మాస్టర్ వీవర్ సంఘం అధ్యక్షులు పెద్ద రంగన్న, నాయకులు చిన్నరంగన్న, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ఉప్పర వీధిలో 19 వార్డులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. భావితరాల భవిష్యత్తు కోసం చంద్రన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారని స్పష్టం చేశారు.

లక్ష్య సాధనలో మహాయోగులు

✦ క్యాంపస్ ఎంపికలో సత్తా చాటిన విద్యార్థులు

క్యాంపస్ ఎంపికలో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో చదివి లక్ష్యం చేరారు. వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఎంపికలో సత్తా చాటారు. అనుకున్న ఉద్యోగాలు సాధించి భళా అనిపించారు. ఎమ్మిగనూరు మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఎంపికలో పలువురు విద్యార్థులు కంపెనీలకు ఎంపికయ్యారు. వారిపై 'ప్రత్యేక కథనం'.. డిగ్రీ కళాశాలలో సాధించిన నైపుణ్యతతో వివిధ కంపెనీల ద్వారా నిర్వహించిన ఎంపికలో సత్తా చాటారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, పైథాన్ ఫర్ డేటా, కంప్యూటర్ కోర్సులు, ఆర్కిటెక్, మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర వాటిలో ప్రతిభ చాటి విద్యార్థులు క్యాంపస్ ఎంపికలో అబ్బురపరిచారు. 16 కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. కళాశాలలో దాదాపు 45 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. రాబోయే రోజుల్లో ఉద్యోగాలే లక్ష్యంగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతోంది.

మంచి ఉద్యోగం సాధించడమే లక్ష్యం – సమీనా, బీజడ్‌సీ

నేను బీజడ్‌సీ మూడో సంవత్సరం చదువుతున్నా. మంచి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో రోజూ సాధన చేశా. ఇతర పనులకు వెళ్లకుండా ఉద్యోగంపై ధ్యాస పెట్టాను. ప్రభుత్వం ఇస్తున్న శిక్షణలో పాల్గొన్నా. చదువుతో పాటు కంపెనీలు నిర్వహించిన పోటీ పరీక్షల్లో అన్నింటికీ సమాధానం ఇచ్చాను. ప్రధానంగా మౌఖిక పరీక్షల్లో కొన్ని ప్రశ్నలు క్లిష్టంగా ఉండడంతో వాటికి సమాధానం ఇచ్చా. దీంతో ఆల్ టెక్నాలజీ కంపెనీకు ఎంపిక చేశారు. ప్రతి నెలా రూ.45వేల జీతం వస్తుందన్నారు.

పట్టుదలతో చదివాను: – నిఖిత, బీకాం

నేను డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నా. క్యాంపస్ ఎంపికలోనే ఉద్యోగం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. నాకు వచ్చే జీతంలో కొంత పేదలకు దానం చేస్తా. భవిష్యత్తులో ఉన్నత స్థాయి కంపెనీలో ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నా. డిక్షన్ టెక్నాలజీ కంపెనీలో ఉద్యోగం సాధించా. నెలకు రూ.35వేలకు పైగానే జీతం వస్తోంది.

శిక్షణ తీసుకోవడంతో..: – సురేంద్ర, బీఎస్సీ

నేను బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నా. కళాశాలలో ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగపడింది. ప్రతి రోజూ రెండు గంటల పాటు శిక్షణలో ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్ డేటా, ఆర్కిటెక్ కోర్సులు నేర్చుకున్నా. కంపెనీల ప్రతినిధులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతో ఎంపిక చేశారు. భవిష్యత్తులో మరిన్ని కంపెనీల ఎంపికల్లో పాల్గొంటా. పుష్కల్ ఆగ్రో టెక్నో లిమిటెడ్ కంపెనీకి ఎంపిక చేశారు. నెలకు రూ.30వేల వరకు జీతం ఇస్తారని చెప్పారు.

హామీల అమలు తెదేపాతోనే సాధ్యం

కరపత్రాల వివరాలు తెలియజేస్తున్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, న్యూస్‌టుడే: హామీలు ఇచ్చినట్లుగా, అమలు చేయాలన్నా తెదేపాతోనే సాధ్యమని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. రెండో రోజు మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పథకాలను, చేయాల్సిన పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, భీమ, తిమ్మప్ప, చాపల నాగేశ్, వెంకటేశ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మాట నిలబెట్టుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రామాకాంతరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం పెద్దకడబూరులో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి పనులపై కరపత్రాలు అందజేశారు. మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న తన స్వగ్రామంలో ఇంటింటి వెళ్లి ప్రజలకు వివరించారు. నాయకులు మల్లికార్జున, మీసేవా ఆంజినయ్య, బాషా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఆర్థిక విచ్ఛిన్నం చేసిన జగన్

సి.బెళగల్, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తున్నామని కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సి.బెళగల్‌లో పాల్గొన్నారు. గత ఐదేళ్లలో జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేశారన్నారు. కొత్తకొండలయ్య, పాత కొండలయ్య, విమాంకాసీం, మిన్నట్లా స్వామి పీర్ల చావిడిలను సందర్శించి చదివింపులు చేశారు. నాయకులు చిన్న తిమ్మప్ప, వీరన్న గౌడు, చంద్రశేఖరు పాల్గొన్నారు.

పీరుకు చదివింపులు చేస్తున్న డి.విష్ణువర్ధన్‌రెడ్డి

అర్హులందరికీ పథకాలు అందాలి

మునగాల (గూడూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. మునగాల గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గూడూరు నగరపంచాయతీలో పట్టణ తెదేపా కన్వీనర్ రామాంజనేయులు ఇంటింటికి తిరిగి పథకాలు వివరించారు.

గ్రామాల్లో సుపరిపాలన సాధ్యం

గోనెగండ్ల,న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే అభివృద్ధి సంక్షేమంపై దృష్టిసారించి ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని మండల తెదేపా కన్వీనర్ తిరుపతయ్యనాయుడు అన్నారు. గోనెగండ్లలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజలు కాలనీలో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

నేడు చందమామ సరికేసు

గొల్లలదొడ్డి(సి.బెళగల్),న్యూస్‌టుడే: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో చందమామ వీరు సరికేసుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కర్నూలు,

గొల్లలదొడ్డిలో పీర్లచావిడిలో కొలువుదీరిన చందమామ పీర్లు

సి.బెళగల్ నుంచి గొల్లలదొడ్డి గ్రామం వరకు ఆర్టీసీ బస్సు సర్వీస్ కల్పించారు. చందమామ సరికేసు తిలకించడానికి బెంగళూరు, హైదరాబాదుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలాది జనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చనుగొండ్ల, పెంచికలపాడు, నాగలాపురం, మునుగాల, మల్లాపురం, గుడిపాడు, జులకల్లు, గ్రామాల్లోని ఆయా పీర్లచావిడిలో గురువారం పీర్లు కొలువుదీరాయి. భక్తి శ్రద్ధలతో ఆయా పీర్ల చావిడిలలో భక్తులు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి: డీఎస్పీ

మంత్రాలయం, కోసిగి, న్యూస్‌టుడే: పీర్ల పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. మండల పరిధిలోని రచుమర్రి గ్రామంలో గురువారం సీఐ రామాంజులు, మాధవరం ఎస్సై విజయకుమార్‌లతో ప్రజలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో మొహర్రం ప్రేరేపించినా, కారణమైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కోసిగి సీఐ మంజునాథ్, ఎస్సై హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో కోసిగి మండల కేంద్రం, పల్లెపాడు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఆకతాయిలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

గూడూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మొహర్రం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఇన్‌ఛార్జ్ ఎస్‌ఐ బీవై స్వామి పేర్కొన్నారు.

నాడు నిర్లక్ష్యం.. నేడు నెరవేరనున్న లక్ష్యం

మండలంలోని గాజులదిన్నె జలాశయం వద్ద ప్రజల దాహార్తి తీర్చేందుకు 2016లో తెదేపా ప్రభుత్వం తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికి వదిలేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.19.50కోట్లతో తాగునీటి పథకం పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా 14 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యం పెట్టారు. ప్రస్తుతం జలాశయంలో ఇన్‌టెక్‌వెల్, పథకం వద్ద నీటిట్యాంకు సంపు పనులు జరుగుతున్నాయి. తొమ్మిది నెలల్లో పనులు పూర్తవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 14 గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. దీంతో మండలంలో సగం గ్రామాలకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందని వెల్లడించారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

బురదలో కాలుపెడితేనే.. ఆసుపత్రిలో అడుగుపెట్టేది

ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి వద్ద వర్షం నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. ఆసుపత్రి ముందు గుంతలను సరిగా పూడ్చక పోవడంతో వర్షం నీరు నిలుస్తోంది. ఆసుపత్రికి రోజు 500మంది ఓపీ, 40మందికి పైగా ఆసుపత్రిలో చేరుతారు. ఆసుపత్రి ముందు వర్షం నీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. దోమలు వృద్ధి చెందుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులు ప్రధాన ద్వారం నుంచి కాకుండా మరో ద్వారం ద్వారా ఆసుపత్రిలోకి వెళ్తున్నారు. వంద పడకల ఆసుపత్రిలోనే ఓపీ, మందులు పంపిణీ, రక్త పరీక్షలు వంటివి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు నేరవార్తలు

ఇసుక లారీ.. ఇష్టారాజ్యంగా మారి

ఇసుక లారీల ఇష్టారాజ్యంగా మారింది. కౌతాళం మండలంలోని హాల్వి గ్రామం వద్ద ఇసుక రీచ్‌ల నుంచి వస్తున్న లారీలు, టిప్పర్లు బైపాస్ రహదారిపై ఇష్టానుసారంగా, అడ్డదిడ్డంగా నిలబెడుతున్నారు. దీంతో ఇతర వాహనాలు రాకపోకలకు వీలులేకుండా పోతోంది. అడ్డంగా నిలిపిన ఇసుక లారీలతో సుమారు 10 నిమిషాలకు పైగా ఆర్టీసీ బస్సు రోడ్డుపైనే ఆగిపోయింది. ఇసుక లారీదారులను అడిగేవారు లేక మద్యం తాగి రహదారిపై అడ్డదిడ్డంగా నిలబెడుతున్నారు. వీరిపై తగిన చర్యలు, పర్యవేక్షణ లేక ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. –న్యూస్‌టుడే, కౌతాళం

నీటి కోసం తప్పని నిరీక్షణ

కౌతాళం మండలంలోని పొదలకుంట గ్రామంలో ఇందిరమ్మ కాలనీకి తాగునీరందించే గ్రామ పంచాయతీ బోరు మరమ్మతులకు గురైంది. దీంతో ఒకే బోరు నీటిపై గ్రామస్థులు ఆధారపడాల్సి వచ్చింది. గ్రామంలో మొహర్రం పండగ వేళ నీటి కష్టాలు మొదలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ వారు స్పందించి వెంటనే బోరు మరమ్మతులు చేయించి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. –న్యూస్‌టుడే, కౌతాళం

ఐఎంఏ అధ్యక్షురాలుగా డాక్టర్ శిల్ప

నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎంపికైన డాక్టర్ శిల్ప, డాక్టర్ కార్తిక్ తదితరులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ శిల్ప పేర్కొన్నారు. ఐఎంఏ నూతన(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అధ్యక్షురాలు డాక్టర్ శిల్ప ప్రసంగిస్తూ.. సంఘం తరపున ప్రజలకు ఉచిత వైద్య సేవలందిస్తామన్నారు. గ్రామంలో మారుమూల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తామన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ గౌడప్పగౌడు, మాలకొండయ్య, కార్యదర్శి చంద్రకుమార్, ట్రెజరర్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధిస్తాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. పట్టణంలో హోటల్స్, రహదారిపై ఉన్న అల్పాహార కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అంగళ్లలో పరిసరాల పరిశుభ్రత లేదన్నారు. ప్లాస్టిక్‌లో ఆహార పదార్థాలను ప్యాకింగ్ చేస్తే రూ.10వేల జరిమానా విధిస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

కళాశాలకు బస్సు నడపండి

బస్సు నడపాలని ధర్నా చేస్తున్న విద్యార్థులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపురం గ్రామం నుంచి 8 కిలోమీటర్ల దూరం ఉన్న కళాశాలకు బస్సు సర్వీసును నడపాలని గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. బస్సు సర్వీసు లేకపోవడంతో ప్రతి రోజు కళాశాలకు 40 మంది విద్యార్థులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 55 మంది విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపురం నుంచి మంత్రాలయంకు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సు నడిపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

శ్రావణమాస ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు

కౌతాళం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రముఖ ఆలయం ఉరుకుంద శ్రీనరసింహ ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు అన్నారు. గురువారం ఉరుకుంద ఆలయంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు జరిగే శ్రావణమాస ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలను కల్పిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కల్పిస్తామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి దర్శనానికి స్లాట్ బుకింగ్, గర్భగుడి దర్శనానికి ప్రత్యేక టికెట్ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, అర్చకులు శివన్న స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పథకాలు వర్తింపజేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఏపీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగరాజు డిమాండు చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని డిమాండు చేశారు. తల్లికివందనం, రేషన్‌కార్డు, ఇంటి స్థలాలు, శాశ్వత గృహాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, సీఐటీయూ రాముడు, కేశన్న, ఖాజా, లక్ష్మన్న, సురేష్, విక్రమ్, నరేష్, శివ, ఉరుకుందు, పల్లవి, రాజు, గీతాంజలి, ఆశా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రీ సర్వేలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

ముగతిలో రీసర్వేపై సమీక్షించిన డివిజనల్ సర్వే అధికారి శ్రీనివాసురాజు

ముగతి(నందవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని డివిజనల్ సర్వే అధికారి శ్రీనివాసురాజు సూచించారు. గురువారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో రీసర్వేపై సంబంధిత సర్వేయర్లతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా, అవకతవకలకు తావు లేకుండా రీ సర్వేలో జరిగిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. రీ సర్వేలో నిర్లక్ష్యం వహించకుండా చూడాలన్నారు. సర్వే చేసిన తర్వాత రైతులకు తమ రికార్డుల వివరాలు చూపాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకెళ్లాలని, ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని చెప్పారు. మండల సర్వేయర్ అక్బర్ బాషా, సర్వేయర్లు శేఖర్, ప్రవీణ్‌కుమార్, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకాలు పెరిగి.. ఆదాయం సమకూరి..

● గత ఏడాది కన్నా రూ.5 కోట్లు అధికం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉప విభాగంలో నెలకు రూ. కోట్ల విలువైన మద్యం అమ్మకాలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం ధరలను తగ్గించడం, నాణ్యమైనది సరఫరా, కర్ణాటక మద్యం నిర్మూలనకు కృషితో విక్రయాలు పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అదే సమయంలో పల్లెల్లో గొలుసు దుకాణాలు పెరిగి మద్యం అమ్మకాలు పెరిగాయి.

ఈ ఏడాది రూ.13 కోట్లు

ఉప విభాగంలోని మంత్రాలయం మండలంలో రెండు, నందవరం మండలంలో రెండు, ఎమ్మిగనూరు పట్టణంలో తొమ్మిది, గ్రామీణంలో మూడు మద్యం దుకాణాలు ఉన్నాయి. పట్టణంలో మూడు బార్లు ఉన్నాయి. గత ఏడాది జూన్ నెలలో ఉప విభాగంలో రూ.8 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అదే నెలలో రూ.13కోట్ల విక్రయాలు జరిగాయి. మంత్రాలయం, నందవరం మండలాలు కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్నాయి. దీంతో అక్రమంగా అక్కడి నుంచి తెచ్చిన మద్యం సరిహద్దు గ్రామాల్లో విచ్చలవిడి అమ్మకాలు జరిగేవి. దానికి తోడు గత వైకాపా ప్రభుత్వ హయాంలో మద్యం ధరలు పెరగడం, నాసిరకం అమ్మకాలతో గతంలో అమ్మకాలు తగ్గేందుకు కారణంగా ఎక్సైజ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గొలుసు దుకాణాలు పెరిగి..

గత జూన్ నెలలో పట్టణంలో రూ.7.92 కోట్లు, గ్రామీణంలో రూ.1.61కోట్లు, మంత్రాలయం మండలంలోని రూ.1.79కోట్లు, నందవరం మండలంలో రూ.1.55కోట్లు మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరిగాయి. పట్టణంలోని మూడు బార్లలో కేవలం రూ.12లక్షల మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. గ్రామీణం, పట్టణంలో మద్యం అమ్మకాలు పెరగడంలో గొలుసు దుకాణాలు ఒక కారణం. పల్లెల్లో జనాభాను బట్టి రెండు నుంచి ఐదు వరకు గొలుసు దుకాణాలు వెలిశాయి. రాజకీయ అండతో గొలుసు దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెలువడుతున్నాయి. పట్టణంలోని దాబాలు అనధికార బార్లుగా మారాయి.

తగ్గిన కర్ణాటక అమ్మకాలు

ఉప విభాగంలో కర్ణాటక మద్యం గ్రామ గ్రామాన జోరుగా అమ్మకాలు జరిగేవి. మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులు దక్కించుకోవడం, గొలుసు దుకాణాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నారు. కర్ణాటక మద్యం విక్రయిస్తే రాజకీయ అండతో కేసులు నమోదు చేసి నిర్మూలనకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గొలుసు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టనట్లు వ్యవహరించడంతో గ్రామాల్లో శాంతిభద్రతలు సమస్యగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మూలనకు చర్యలు –రమేశ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ

గొలుసు దుకాణాల నిర్మూలనకు తరచూ దాడులు నిర్వహిస్తున్నాం. తక్కువ ధరకే మద్యం లభిస్తున్నందున కర్ణాటక మద్యం విక్రయాలు బాగా తగ్గాయి.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్యాలకుర్తి తోటలో, పులకుర్తిలో, కోడుమూరు కోట వీధిలో వెలసిన సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో కొలువుదీరిన బాబాకు గురువారం కాగడ హారతి, అభిషేకాలు నిర్వహించారు. ప్యాలకుర్తిలో బాబాకు పల్లకీ సేవ చేశారు. భారీ సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

కంబదహల్(సి.బెళగల్)న్యూస్‌టుడే: కంబదహల్ గ్రామంలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబాకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. మధ్యాహ్నం పురోహితుడు కాగడ హారతి ఇచ్చారు. సాయంత్రం సాయిబాబా విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించగా భక్తులు రహదారికి ఇరువైపుల నిలబడి పూజాద్రవ్యాలు అందించి మొక్కులు చెల్లించుకున్నారు. పోలకల్ గ్రామంలో సద్గురు శింగరయ్య ఆలయంలో గురువారం సర్వజ్యోతి పీఠాధ్యక్షుడు రాజయ్య స్వామి ఆధ్వర్యంలో నాగదోష నివారణ ప్రత్యేక అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

మొక్కలు నాటిన అధికారులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోందని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు అన్నారు. కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ మొక్కలు నాటారు. నగరంలో పలు చోట్ల వారం రోజుల పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కెనరా బ్యాంకులో అందించే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మీదివేములలో పోలీసు పికెట్

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని మీదివేముల గ్రామంలో ఇటీవల జరిగిన హత్య నేపథ్యంలో పోలీసు పికెట్‌ను కొనసాగిస్తున్నట్లు ఎస్సై సునీల్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను పికెట్‌లో ఉన్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

?: వెంకటరమణ కాలనీ ప్రధాన రహదారిపైకి పశువులు రావడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చూడాలి. - మనోజ్

?: చెన్నమ్మకూడలి ఫ్లైవంతెన కింద రహదారి అధ్వానంగా మారింది. మరమ్మతులు చేయాలి. - ప్రవీణ్

✓: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. - నగరపాలక అధికారులు

గోదాగోకులంలో అఖండ పారాయణం

ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న మారం నాగరాజుగుప్త, సుధాకర్

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: చాతుర్మాస్య వ్రత దీక్షలో భాగంగా కర్నూలు నగర శివారులోని గోదా గోకుల క్షేత్రంలో ఈ నెల 6 నుంచి సెప్టెంబరు 7వ తేదీ వరకు (63 రోజులు) విష్ణు సహస్రనామ అఖండ పారాయణం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో గోదాగోకుల వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త మాట్లాడారు. రోజూ ఉదయం, సాయంత్రం అఖండ పారాయణం ఉంటుందని, ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు గురువులు, పీఠాధిపతులు హాజరవుతారని తెలిపారు. పారాయణంలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. సమావేశంలో పెరుమాళ్ల సుధాకర్, శ్రీనివాసరావు, ఇటిక్యాల పుల్లయ్య, వెంకట కృష్ణయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. అఖండ పారాయణం గోడపత్రాలను విడుదల చేశారు.

ఆలయాల్లో ఆషాఢ మాసం పూజలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో వారాహి పూజలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ లలితాపీఠంలో పీఠాధిపతి గురు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వారాహి అమ్మవారికి 8 రోజులుగా పూజలు కొనసాగుతున్నాయి. వారాహి అమ్మవారికి గురువారం ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.

● నవరాత్రుల్లో భాగంగా సూర్యనారాయణ స్వామి ఆలయంలోని మహాగౌరీ అమ్మవారి సన్నిధిలో అర్చకులు మండపారాధన, శ్రీదేవి ఖడ్గమాల, లలితా సహస్రనామ లలిత త్రిశతి నామపూర్వక కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి వారాహి సహస్రనామం, పాదుకాస్థాన పూజల అనంతరం మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

నేడు శాకంబరిగా..: స్థానిక మణికంఠ అయ్యప్ప ఆలయంలోని చౌడేశ్వరిదేవి, పాతబస్తీ లలితాపీఠంలో వారాహి అమ్మవారికి ఆషాఢ మాసం తొమ్మిదో రోజైన శుక్రవారం శాకంబరీ (కూరగాయలతో) అలంకరణ చేస్తారు. మహిళలు కుంకుమార్చనలతో పూజలు చేస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సూర్యనారాయణ స్వామి ఆలయంలో పూజకు హాజరైన మహిళలు

కార్మికుల వేతనాలు.. రాజకీయ వాటాలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పలువురు కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాల్సి ఉంది. మూడేళ్ల కిందట 21 మంది కార్మికులు విధుల్లో చేరారు. అప్పట్లో పనిచేసిన క్రమంలో ఆరు నెలల బకాయిలు వారికి రావాల్సి ఉంది. ఈ వేతనాలు గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఖాతాల్లో జమైనట్లు సమాచారం. బకాయి వేతనాలను ఇంకా ఆ కార్మికులకు ఇవ్వకుండా జాప్యం చేశారని తెలిసింది. వేతనాల్లో కొంత తమకు చెల్లించాలని పలువురు పట్టుబట్టారని తమ వాటా ఇస్తే.. మిగతా సొమ్ము మీకు ఇస్తామని చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎవరెవరికి ఎంతెంత..?

మూడేళ్ల కిందట నగరపాలక ప్రజారోగ్య విభాగంలో 21 మంది కార్మికులను తీసుకున్నారు. వారికి అప్పట్లో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఆ బకాయిలు వేతనాలు జమయ్యాయి. ఇంకా కార్మికుల చేతికి రాలేదు. పలువురు ప్రతినిధులతో కలిసి ఓ ఆప్కాస్ ఉద్యోగి తాము కష్టపడి వేతనాలు వచ్చేలా చేశామని, తమకు వాటాలు కావాలని కోరినట్లు సమాచారం. దీంతో సదరు ప్రతినిధుల కార్యాలయాలకు రావాలని కార్మికులకు చరవాణి ద్వారా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కార్మికులకు రూ.12 వేలు జీతమైతే తాము రూ.15 వేలు రాశామని పలువురు పారిశుద్ధ్య తనిఖీదారులు చెబుతున్నారనేది బహిరంగ రహస్యమే. రూ.మూడు వేలు వసూలు చేయాలని పట్టుబట్టారు. ఓ పారిశుద్ధ్య తనిఖీదారుడు కార్మికులకు అప్పట్లోనే తాను ఇచ్చానని ప్రస్తుతం ఇవన్నీ నావే అంటున్నారని నగరపాలకలో వినిపిస్తుంది.

స్థాయి సంఘం ఆమోదం

కార్మికులు 21 మందికి వేతనాలు ఇచ్చేలా ఆ నిధుల మంజూరుకు స్థాయి సంఘం రెండేళ్ల కిందటే ఆమోదం తెలిపింది. కార్మికుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయలేదు. పారిశుద్ధ్య తనిఖీదారుల ద్వారా ఇచ్చి మాముళ్లు రాబట్టేందుకు అప్పట్లో ఓ అధికారి ఎత్తుగడ వేశారని విమర్శలున్నాయి. ప్రస్తుతం వేతనాల పంచాయతీ నగరపాలకలో నడుస్తుంది. పాలనలో పారదర్శకత లేకపోవడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. కార్మికుల డబ్బులను వాటాలు వేసుకోవడం ప్రస్తుతం నగరపాలకలో చర్చనీయాంశంగా మారింది.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు సహకరించాలని నియోజకవర్గ ఆర్వో, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల, పోలింగ్ కేంద్రాల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దారు రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మహిళా పోలీసుస్టేషన్ సీఐ విజయలక్ష్మి స్థానిక దామోదర్ సంజీవయ్య మున్సిపల్ పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత కోసం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తియాప్, శక్తి వాట్సప్ నెంబరు 7993485111, శక్తి టీంల సేవలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలు యాప్, ఫోన్ నెంబరు సంప్రదించాలన్నారు. అవి ఏవిధంగా పనిచేస్తాయో వివరించి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై గురించి తెలియజేశారు.

ఆటోల బంద్ 9న

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మె సందర్భంగా ఈ నెల 9న చేపడుతున్న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం ఓర్వకల్లులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆటో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కేంద్రంలో భాజపా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ విధానాలకు ప్రాధాన్యమిస్తోందన్నారు. రవాణా రంగం ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందన్నారు. వాటిని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న బంద్‌కు కార్మికులు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శ్రీధర్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్య పరిష్కారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. నగరపాలక ఇంజినీరింగ్ విభాగ కార్మికులు కొన్ని రోజులుగా సమ్మె బాట పట్టారు. నగరపాలక కార్యాలయం సమీపంలో టెంట్

నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ విభాగ కార్మికులు

వేసుకొని నిరసన సమ్మె చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి నగరపాలక అధికారులు టెంట్‌ను తొలగించి ఉదయం కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. దీంతో కార్మికులు నగరపాలక కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద లబ్ధిదారులకు క్లెయిమ్ మొత్తాల పంపిణీ కార్యక్రమం గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తబస్టాండ్ బ్రాంచ్‌లో నిర్వహించారు. బ్యాంకు ప్రాంతీయ అధికారి పి.నరసింహారావు, బ్రాంచ్ మేనేజర్ ఆర్. రజని బీమా పొందిన కె.పరమేశ్, గీతామహాలక్ష్మి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. రెండు లక్షల చొప్పున క్లెయిమ్ చెక్కులు అందజేశారు.

6న వైకుంఠ ఏకాదశి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: తొలిఏకాదశి పురస్కరించుకొని గీతా ప్రచారాలయంలో ఈ నెల 6వ తేదీ ప్రత్యేకపూజలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. ఉదయం 9గంటలకు సామూహిక గోపూజ అనంతరం విష్ణు సహస్రనామ, సంపూర్ణ భగవద్గీత పారాయణం అనంతరం ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయన్నారు.

వంతెన.. పనులు ఇంతేనా

కర్నూలు నుంచి సుంకేసులకు వెళ్లే దారిలో జి.సింగవరం వద్ద కేసీ కాల్వపై వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో కొత్త వంతెన నిర్మాణం చేపట్టారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. సూరత్ జాతీయ రహదారి పనుల కోసం భారీ వాహనాలతో నిర్మాణ సామగ్రిని ఇటు నుంచే తరలిస్తున్నారు. పాత వంతెనకు ముప్పు వాటిల్లనుంది. ఈ వాహనాల వల్ల ఎక్కడ వంతెన దెబ్బతింటుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. - ఈనాడు, కర్నూలు

అదిగో గొయ్యి.. చూసి అడుగెయ్

నగరంలో పలు చోట్ల మురుగు కాల్వలపై ఏర్పాటు చేసిన కల్వర్టులు కుంగి ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం.. ఆపై గమనించకుంటే ప్రమాదం తప్పదు. కర్నూలు సి.క్యాంపు కూడలి నుంచి తిరిగే కల్యాణ మండపం మీదుగా వరసిద్ధి వినాయక స్వామి దేవాలయానికి వెళ్లే రహదారిలో గొయ్యి ఏర్పడింది. దానిని బండరాళ్లతో మూయటంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు చర్యలు చేపట్టి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

మురుగు.. రహదారిపై పరుగు

వెంకటరమణ కాలనీ సమీపంలోని మమతానగర్‌లోని ఓ వీధిలో రహదారిపై మురుగు నిలిచింది. మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగంతా రహదారులపై పారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా వీధిలో నడవాలంటే ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలువలు పునరుద్ధరించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాల సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సర్వజన వైద్యశాలలో సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నీ విభాగాల పనితీరును పరిశీలించామన్నారు. నాల్గవ తరగతి సిబ్బంది పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చిరు ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏవో శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు

తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి

కలెక్టరేట్ ఎదుటన నిరసన తెలుపుతున్న కృష్ణాపురం రైతులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రీ-సర్వే తర్వాత ఆన్‌లైన్ అడంగల్‌లో తప్పిదాల వల్ల తమకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని బాధితులు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వెల్దుర్తి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతులకు వెబ్‌ల్యాండ్‌లో తక్కువ భూమి ఉండగా.. రీసర్వే పుణ్యమా అని ఆన్‌లైన్‌లో వందల ఎకరాలు ఉన్నట్లు చూపిస్తుండటంతో తల్లికి వందనం పథకం అందడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు తమ సమస్యను పరిష్కరించి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, తమకు రీసర్వేకు ముందు ఎంత పొలం ఉందో అంతే పొలాన్ని ఆన్‌లైన్ అడంగల్‌లో సవరణలు చేయాలని కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతులు పరమేష్, వెంకటరాముడు, పెద్ద రామదాసు, సుమతి తదితరులు అధికారులను కోరారు.

రగ్బీ క్రీడాకారిణికి చేయూత

క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందజేస్తున్న బి.టి.అనురాధ

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కర్నూలు క్రీడాకారిణి శ్రుతి ఎంపికైంది. ఆమెకు ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ మాజీ మెజిస్ట్రేట్ బి.టి.అనురాధ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని మాజీ ఎంపీ టీజీ.వెంకటేష్ అన్నారు.

ర్యాలీని ప్రారంభించిన టీజీ.వెంకటేష్

నగరంలోని ఎన్ఆర్‌పేటలోని భాష్యం ఆంగ్ల పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో గురువారం సంస్థలో శిక్షణ పొందిన అభ్యర్థులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పుష్పకుమార్ పాల్గొన్నారు.

సం క్షి ప్త స మా చా రం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : మండల పరిధిలోని విత్తన ఎరువు, పురుగు మందుల డీలర్లకు ఖరీఫ్-2025కు సంబంధించి గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిణి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సాలురెడ్డి, డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమై నేటికి 23 ఏళ్లైందని కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలంటూ.. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జే.నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిబాబా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులపై అక్రమ వేధింపులు ఉన్నాయని, తక్షణమే వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే.భారతి, లీలావతి, శ్రీ వాణి, లక్ష్మీదేవి, సరోజమ్మ పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: మహిళలకు హక్కులతో పాటు సమానత్వం కావాలని రోజా మహిళా ఐక్య సంఘం నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. స్థానిక 48వార్డు రోజావీధిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. స్థానిక కేకేభవన్‌లో నాయకులు జాఫర్‌హుసేన్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మెలో రహదారి పక్కన చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు షరీఫ్, నాయకులు నరసింహులు, శివప్రసాద్ పిలుపునిచ్చారు.

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కర్నూలు గ్రామీణం: కార్యక్రమంలో తెదేపా నాయకులు

ఓర్వకల్లులో ఇంటింటి ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు మండల తెదేపా నాయకులు అన్నారు. మండల పరిధిలోని ఉల్చాల, గార్గేయపురం గ్రామాల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, పథకాల అమలు గురించి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బుర్ర వెంకటేష్, ఏసు రాజు, రామాంజనేయులు, విజయకుమార్, సత్రం రామకృష్ణుడు, రాము గౌసియా బేగమ్, కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: తెదేపాతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఓర్వకల్లులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, అబ్దుల్లా, యాసిన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలకు భారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పాలకవర్గాలు ప్రజలపై విద్యుత్తు భారం మోపుతున్నాయని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ఆనంద్‌బాబు, కేవీ నారాయణ, రాముడు, అంజిబాబు, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

ఏడాది పాలనలో ఉత్తమ ఫలితాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా

పథకాలను వివరిస్తున్న రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్

ఆయన గురువారం 10, 48 వార్డుల్లో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు.

మైదానంలో సాధన.. పతకాలు వచ్చిపడేలా

ప్రసాద్.. ప్రత్యేకం

నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రసాద్ నాయక్ సీఈసీ గ్రూప్‌లో ఉన్నారు. తల్లిదండ్రులు సుశీలమ్మ, రామాంజనేయులు. వారి వృత్తి వ్యవసాయం. పాఠశాల స్థాయిలో ప్రతిభతో కర్నూలు శాయ్ సెంటర్‌లో ప్రవేశం పొంది, హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాడు. 2023 సెప్టెంబరులో తెనాలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. 2024 జులైలో అనంతపురంలో జరిగిన సీనియర్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం అందుకున్నాడు. 2024 జులైలో రాజమండ్రిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు. 2024 డిసెంబర్‌లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించారు.

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: ప్రతిభతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూలు కేంద్రంలో ప్రవేశం పొందారు. క్రీడల్లో సాధన చేస్తూ.. ఇక్కడే ఇంటర్మీడియట్ చదువుతూ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నారు. రానున్న పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా నిత్యం సాధన చేశారు. గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు.

విజయాలు సిద్ధించేలా..

నగరంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతున్నాడు సిద్దిక్. తల్లిదండ్రులు షాకీరా, మహమ్మద్ సిరాజ్. తండ్రి రైతు. స్వగ్రామం తాడిపత్రి. రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు సంవత్సరాల కిందట కర్నూలు శాయ్ సెంటర్‌లో ప్రవేశం పొంది. జాతీయస్థాయి పోటీలే లక్ష్యంగా మెలకువలు నేర్చుకుంటున్నాడు. ప్రత్యర్థి గోల్స్ చేయకుండా.. ప్రత్యర్థి జట్టు విజయానికి అడ్డుగా నిలబడతాడు. 2022 ఆగస్టులో తెనాలిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో 2023 సెప్టెంబర్‌లో కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు. తెనాలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. 2024 జులైలో అనంతపురంలో జరిగిన సీనియర్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం అందుకున్నాడు. 2024 జులైలో రాజమండ్రిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు. 2024 డిసెంబర్‌లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించాడు. జాతీయస్థాయి పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యమని చెబుతున్నాడు సిద్దిక్.

కళాశాలకు బస్సు నడపండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపురం గ్రామం నుంచి 8 కి.మీ. దూరం ఉన్న కళాశాలకు బస్సు సర్వీసును నడపాలని గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. బస్సు సర్వీసు లేకపోవడంతో ప్రతి రోజు కళాశాలకు 40 మంది విద్యార్థులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 55 మంది విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపురం నుంచి మంత్రాలయంకు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సు నడిపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

(c) eenadu

కంబగిరి మాన్యం కాజేశారు
- నేతల గుప్పిట్లో భూములు

కంబగిరి స్వామి ఆలయం

బనగానపల్లి, అవుకు, న్యూస్‌టుడే: కంబగిరి స్వామి మాన్యంపై పెద్దల పెత్తనం కొనసాగుతోంది.. అవుకు మండలం కునుకుంట్లకు 10 కి.మీ. దూరంలో ఎర్రమల కొండల్లో ఆలయం కొలువుదీరింది.. ఆలయానికి సంబంధించి 110 ఎకరాలు ఉండాలి.. అందులో 60 ఎకరాలు ఎక్కడుందో తెలియడం లేదు. భూములన్నీ సారవంతమైనవి కావడంతో రెవెన్యూ అధికారులు కొంత సొంతం చేసుకోగా మరికొంత భూమిని పెద్దలకు రాసిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

60 ఎకరాలు ఏమైనట్లు

ఉత్సవ విగ్రహాలకు సంబంధించి ఉప్పలపాడులో 15 ఎకరాలు, కునుకుంట్లలో ఎనిమిది, జూనుతలలో రెండెకరాలు కలిపి మొత్తం 25 ఎకరాలు ఉండాలి. అదేవిధంగా మూల విరాట్‌కు సంబంధించి 85 ఎకరాల భూమి ఉంది. ఇందులో ప్యాపిలి మండలం రాచర్ల వద్ద 18 ఎకరాలు పొలం ఉండగా, ఇందులో నాలుగెకరాలు ప్రియా సిమెంట్ పరిశ్రమ లీజులో ఉంది. అవుకు మండలం రామాపురంలో ఏడెకరాలు, సింగనపల్లెలో 4.70 ఎకరాలు, కొలిమిగుండ్లలో 3.30 ఎకరాలు, నాయినిపల్లెలో నాలుగెకరాలు ఉన్నట్లు చెబుతున్నారు. కొత్త రెవెన్యూ దస్త్రాల ప్రకారం 40.59 ఎకరాలు ఉంది. మిగిలింది ఎక్కడుందో తెలియడం లేదు.

వేలం వేయరు ఎందుకో

ఆలయ మాన్యాలకు సంబంధించి సంబంధింత శాఖ వేలం నిర్వహించాలి. కంబగిరి స్వామి మాన్యానికి మాత్రం వేలం నిర్వహించడం లేదు. పెత్తందార్ల ఆధీనంలో ఉండటంతో అధికారులు భయపడుతున్నట్లు తెలుస్తోంది. ఉప్పలపాడు, రాచర్ల గ్రామానికి చెందిన అర్చకులే ఆలయ నిర్వహణ కొనసాగిస్తున్నారు. సుమారు 30 వరకు అర్చక కుటుంబాలు విడిపోవడంతో వంశపారంపర్యంగా వస్తున్న భూములను ఒక్కొక్క కుటుంబం రెండు నుంచి మూడెకరాలు సాగు చేసుకుంటున్నారు. వంద ఎకరాలకు పైగా అంటే నామా మాత్రంగా ఎకరాకు రూ.5వేల చొప్పున కౌలు వచ్చిన ఏడాదికి సుమారు రూ.5లక్షలకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. “ ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని.. దేవాదాయశాఖ జిజిల్లా అధికారి మోహన్ పేర్కొన్నారు.

దారంతా నీరు.. జనం బేజారు

మహానంది మండలం గాజుల పల్లె గ్రామం నుంచి మహదేవపురం వెళ్లే రహదారి చిన్న వర్షం కురిసినా వంకను తలపిస్తోంది. బుధవారం రాత్రి కురిసిన వానకు రోడ్డంతా నీరు నిలిచాయి. కాల్వలు లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. మోకాలి లోతు నీటిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలని గాజుల పల్లె వాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

కట్టదిట్టం చేస్తేనే నీళ్లు
☛ హడావుడిగా గోరుకల్లుకు మరమ్మతులు
☛ గాలేరు-నగరికి నీటి విడుదల సందిగ్ధం

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ బిరబిరా పరుగెడుతోంది. శ్రీశైల జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఏక్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉంది. కాల్వలకు నీళ్లు వదిలే అవకాశం ఉండటంతో అన్నదాతలు వరి సాగుకు సమాయత్తం అవుతున్నారు. మరోవైపు సీమ జిల్లాల్లో సాగుకు జీవనాడి అయిన గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోయింది. దీనికి మరమ్మతులు చేస్తేనే జలాశయంలో నీరు నింపి.. లక్షల ఎకరాలకు ఈసారి కృష్ణా జలాల విడుదల సాధ్యమవుతుంది. ఈ పనులు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. త్వరగా పూర్తిచేసి సాగునీటి విడుదలకు సమస్య లేకుండా చూడాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పాణ్యం, పాణ్యం గ్రామీణం

గోరుకల్లు జలాశయం వద్ద జరుగుతున్న మరమ్మతులు

రూ.2.50 కోట్లతో అనుమతులు

గోరుకల్లు జలాశయంలో బుధవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. రూ.2.50 కోట్లతో మరమ్మతులు చేసేందుకు కలెక్టరు రాజకుమారి పాలనా అనుమతులు ఇచ్చారు. పనులు చేసిన వెంటనే బిల్లులు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో గుత్తేదారులు మరమ్మతులు చేపట్టారు. జలాశయంలో జారిపోయిన రాతిపరుపు రాళ్లను తొలగించి కట్ట చుట్టూ రింగ్ బండ్ వేసేందుకు అధికారులు పనులు చేపట్టారు. మూడు వారాల్లో మరమ్మతులు పూర్తిచేయాలని లక్ష్యం నిర్ణయించారు. వర్షాల వల్ల కట్టపై టిప్పర్లు తిరగలేని పరిస్థితి తలెత్తితే పనులు మరింత ఆలస్యమయ్యే ఆస్కారం ఉంది. పనుల్లో జాప్యం నీటి విడుదలపై ప్రభావం చూపనుంది.

నత్తను తలపిస్తున్న పనులు

రాయలసీమ జిల్లాలకు ఆయువుపట్టు అయిన గోరుకల్లు జలాశయం గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నంద్యాల జిల్లాతో పాటు వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. జలాశయం కట్టకు వేసవిలో జరగాల్సి పనులను ప్రాజెక్టులకు నీళ్లొదిలే సమయంలో ప్రారంభించారు. ఓ వైపు శ్రీశైలం జలాశయం నుంచి ఏక్షణమైనా నీళ్లు వదిలేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గోరుకల్లు జలాశయంలో మాత్రం నీటిని నిల్వచేసే పరిస్థితి లేదు. మరమ్మతులు పూర్తిచేస్తేనే సాగునీరు సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

మూడు వారాల్లో పూర్తిచేస్తాం
- శుభకుమార్ ఈఈ

గోరుకల్లు జలాశయం కట్ట మరమ్మతులను మూడు వారాల్లో పూర్తిచేస్తాం. పనులు పూర్తయిన వెంటనే ప్రాజెక్టును నీటితో నింపుతాం. పనులు వేగంగా చేసేలా చర్యలు చేపట్టాం.

8 టీఎంసీలు నింపితేనే

■ గోరుకల్లు జలాశయంలో ప్రస్తుతం 3 టీఎంసీల మేర నీరు ఉంది. నీటి నిల్వ 6 టీఎంసీలకు చేరుకుంటేనే జీఎన్ఎస్ఎస్ కాల్వకు నీళ్లు అందుతాయి. కాల్వ సామర్థ్యం మేర 20 వేల క్యూసెక్కుల వరకు నీరు విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో 8 టీఎంసీలు నిల్వ చేయాల్సి ఉంది. ఈ ఏడాది మట్టికట్ట పటిష్ఠతను దృష్టిలో పెట్టుకుని 8 టీఎంసీల మేర నీటిని నిల్వ చేయాలని అధికారులు నిర్ణయించారు.

■ జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తేనే అవుకు, గండికోట జలాశయాలను త్వరగా నింపే అవకాశం ఉంటుంది. గోరుకల్లు జలాశయాన్ని నింపడంలో జాప్యం జరిగితే మిగతా జలాశయాల కింద పంటల సాగు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది.

■ గోరుకల్లు జలాశయాన్ని నింపకుండానే ప్రత్యామ్నాయంగా బైపాస్ కాల్వ ద్వారా నీరు విడుదల చేసే అవకాశం ఉంది. కాని బైపాస్ కాల్వ ద్వారా 2 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేయొచ్చు. బైపాస్ కాల్వ ద్వారా అవుకు జలాశయాన్ని నింపాలంటేనే 3 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. గోరుకల్లు జలాశయం మరమ్మతులు వేగంగా పూర్తిచేస్తేనే గాలేరు నగరి కాల్వ ద్వారా సాగునీటి విడుదలకు అవకాశం ఉంటుంది.

నిండుకుండలా శ్రీశైలం జలాశయం

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 65,159 క్యూసెక్కులు వస్తోంది. కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్‌కు 58,578 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 875.70 అడుగులు, నీటి నిల్వ 167.0956 టీఎంసీలుగా నమోదైంది.

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధనే లక్ష్యం

బనగానపల్లి, న్యూస్‌టుడే: అధికారులు ‘వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ 2047’ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

గురువారం పట్టణంలోని పొదుపు భవనంలో నియోజకవర్గం స్థాయిలో విజన్ 2047 యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ఉన్నత వర్గాలపై ఉందన్నారు. నియోజకవర్గంలో 6,500 బంగారు కుటుంబాలు, 157 మందిని మార్గదర్శకులను గుర్తించినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమాజంలో నిరుపేదలు లేకుండా ఉన్నత వర్గాలతో సమానంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు పోవాలన్నారు. అధికారులు అలసత్వం లేకుండా బాధ్యతగా చూసుకోవాలన్నారు. సమాజంలో ధనిక, పేద అంతరాలను తగ్గించేందుకు పీ4 విధానం తీసుకొచ్చామన్నారు. ఉన్నత వర్గాలు, రాజకీయ నాయకులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు భాగస్వాములైతే స్వర్ణాంధ్రను సాధించవచ్చన్నారు. ఈ నెల 5న మొక్కలు నాటే కార్యక్రమాన్ని పట్టణంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రుణ పత్రంపై ముడుపుల ముద్ర
☛ ‘ఫ్రాంకింగ్’ కోసం రైతుల నుంచి అదనపు వసూలు
☛ రిజిస్ట్రేషన్ సిబ్బంది, వెండర్ల చేతివాటం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : చినుకు జోరందుకొంది.. కాడి కదిలింది.. పెట్టుబడికి కావాల్సిన సొమ్ము కోసం రైతులు బ్యాంకులు, సహకార సంఘాల వద్దకు పరుగులు పెడుతున్నారు. పంట రుణ మొత్తానికి సంబంధించి రైతు ఫ్రాంకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిర్ణీత మొత్తం చెల్లిస్తే.. వారు పత్రాలు చట్టబద్ధమైనవని, నిర్ణీత స్టాంప్ డ్యూటీ చెల్లించినట్లు ధ్రువీకరిస్తూ దరఖాస్తు ఫారంపై ముద్ర (ఫ్రాంకింగ్) వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయితేనే రైతులకు రుణం అందుతుంది. ఇదే అదనుగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల సిబ్బంది, వెండర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫ్రాంకింగ్ చేసేందుకు నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నిఘా నేత్రం

రూ.లక్షకు వెయ్యి

● ఉమ్మడి జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉండగా ఫ్రాంకింగ్ యంత్రాలు కర్నూలు, నంద్యాల, ఆదోనిలోనే ఉన్నాయి. రూ.లక్షలోపు రుణాలకు రూ.వెయ్యి, రూ.2 లక్షల్లోపు పంట రుణానికి రూ.1100 ఫ్రాంకింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్కడ సిబ్బంది నిర్ణీత ధర కంటే అధికంగా రూ.వెయ్యికి రూ.1100, రూ.1100కు గాను రూ.1200 వసూలు చేస్తున్నారు. మిగిలిన చోట్ల ప్రైవేటు వెండర్లకు వీటిని జారీ చేస్తారు. ఇందుకు వీరికి రూ.100పై రూ.2.25 వరకు కమీషన్ వస్తుంది.

● నంద్యాల జిల్లాలో పదిమందికి పైగా, కర్నూలు జిల్లాలో 8 మంది వెండర్ల వద్ద ఫ్రాంకింగ్ యంత్రాలు ఉన్నాయి. వీరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. రూ.వెయ్యికి రూ.1200, రూ.1100కు రూ.1300 వరకు అదనంగా తీసుకుంటున్నారు.

ఎక్కువ మొత్తం తీసుకుంటున్నారు - ఎన్‌సీ మోహన్‌రెడ్డి, నంద్యాల

నా కుమారుడి పేరు మీద పంట రుణం తీసుకోవాలని నంద్యాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి ఫ్రాంకింగ్‌కు వెళ్తే రూ.వెయ్యికి అదనంగా రూ.100 వసూలు చేశారు. కార్యాలయంలో రద్దీ అధికంగా ఉండటంతో సిబ్బంది అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అదనంగా వసూలు చేస్తున్నారు.

రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు

● ఉమ్మడి జిల్లాలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లా రైతులకు రూ.8,964 కోట్లు, నంద్యాలకు రూ.9,213 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. రెండు జిల్లాల్లోని 34 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 652 శాఖల పరిధిలోని 5.23 లక్షల మంది రైతులతో పాటు 50 వేల మంది కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. రైతుల భూమి విస్తీర్ణం, అర్హతలను బట్టి రుణాలు పంపిణీ చేస్తున్నారు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.18 వేల కోట్ల పంట రుణాలకు సంబంధించి లక్షలాది మంది రైతులు కచ్చితంగా ఫ్రాంకింగ్ చేసుకోవాల్సి ఉంది. ఒక్కో రైతు నుంచి రూ.100- రూ.200 అధికంగా వసూలు చేసి పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల పరిధిలో అక్రమ వసూళ్లు రూ.కోట్లకు చేరుకుంటాయని అంచనా.

గ్రామాల్లో మరీ ఎక్కువ

నందికొట్కూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఫ్రాంకింగ్ యంత్రం లేదు. అక్కడి రైతులు కర్నూలు, ఆత్మకూరుకు వెళ్తారు. ఆత్మకూరు వెండరు ఇటీవల కాలంలో అందుబాటులో లేకపోవడంతో వెలుగోడుకు వెళ్లాల్సి వస్తోంది. బనగానపల్లి, కొలిమిగుండ్ల, అవుకు ప్రాంతాలకు చెందిన వారు కోవెలకుంట్ల వెండర్‌పై ఆధారపడుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల రైతులు ఆదోనికి, కోడుమూరు రైతులు కర్నూలు కార్యాలయాలకు వెళ్లాల్సిందే. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు వెండర్లు ఒక్కొక్కరి నుంచి రూ.200 కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

స్థాయి మరిచారు
▸▸ ఉన్నతీకరణకే ఆసుపత్రులు పరిమితం
▸▸ సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలి

జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న పట్టణాలు.. అక్కడి ఆసుపత్రుల స్థాయి పెంచారు.. వైద్యులు స్థానాల భర్తీ మరిచారు. ఉన్నతీకరించినా పరికరాలు ఇవ్వలేదు.. సిబ్బందిని నియమించలేదు.. దీంతో ఇప్పటికీ ప్రాథమిక పరీక్షలే చేస్తున్నారు.. అత్యవసరమైతే పెద్దాసుపత్రికి సిఫారసు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆదోనిలో జిల్లా సర్వజన ఆస్పత్రిగా, డోన్, బనగానపల్లి, ఎమ్మిగనూరు పట్టణాల్లో ప్రాంతీయ ఆస్పత్రిగా మార్చారు. 100 పడకలకు పెంచారు. భవనాల విస్తరణకు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలోనే సుమారు రూ.70 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేసింది. వాటిని పూర్తి చేయడంలో వైకాపాకు ఐదేళ్లు పట్టింది. ఎన్నికలు వస్తున్న తరుణంలో ఆర్భాటంగా ప్రారంభించారు. నేటికీ వైద్యులు లేక మెరుగైన వైద్య సేవలందడం లేదు. రూ.కోట్లు పోసి నిర్మించిన ఆస్పత్రుల్లో కేవలం ప్రాథమిక పరీక్షలకే పరిమితమయ్యాయి. ‘కూటమి’ ప్రభుత్వం దృష్టి సారించి సిబ్బందిని నియమించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల వైద్యం, ఎమ్మిగనూరు, డోన్ గ్రామీణ

కట్టుకట్టి పంపిస్తున్నారు

■ డోన్ ఆసుపత్రిని 100 పడకలకు పెంచారు. 23 మంది వైద్యులుండాల్సినా 15 మంది పని చేస్తున్నారు. నిత్యం ఓపీ 400, ఐపీ 30 వరకు ఉంటుంది.

■ జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, అనస్థీషియా, గైనకాలజిస్టు, రేడియోలజిస్టు, ఇద్దరు జనరల్ మెడిసిన్ వైద్యులు లేరు.

■ డోన్-బెంగళూరు జాతీయ రహదారి ఉండడంతో నిత్యం జరిగే ప్రమాద బాధితులను కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.

■ ఇక్కడ ఐసీయూ అవసరముంది. పరికరాలు లేవు. శస్త్ర చికిత్సలు జరగడం లేదు. కట్టు కట్టి పంపడానికి పరిమితమవుతున్నారు.

డోన్ ఆస్పత్రిలో రేడియాలజిస్టు లేక గదికి తాళం

650 పడకలన్నారు.. అవస్థలు మిగిల్చారు

■ నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిని 200 నుంచి 650 పడకల స్థాయికి పెంచారు. రోజు ఓపీ 2,500 దాటుతోంది. ఐపీ 100-200 వరకు ఉంటోంది.

■ వందకు పైగా వైద్యులు ఉండాల్సినా.. 30 వరకు ఖాళీలున్నాయి. చిన్న పిల్లల విభాగంతోపాటు డెర్మటాలజీ, మత్తు వైద్యుడు, పల్మనాలజీ, డెంటల్, రేడియాలజీ, ఆర్థో, విభాగాల్లో ఒక్క ప్రొఫెసర్, ఒక్క సహాయ ప్రొఫెసర్ స్థానాలు తక్కువగా ఉన్నాయి.

■ ప్రతి విభాగంలో ఇద్దరు, ముగ్గురు సీనియర్ రెసిడెన్సీ వైద్యుల కొరత ఉంది. ఉన్నవారితో మూడేళ్లుగా నెట్టుకొస్తున్నారు.

■ గైనకాలజీ విభాగంలో రోజు 80 మంది వరకు రోగులు వస్తుంటారు. ఇక్కడా ఇద్దరు ప్రొఫెసర్లు, సహాయ వైద్యుల కొరత ఉంది.

అందాల భవనం.. అందని పరికరం

■ బనగానపల్లి ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచారు. భవనం నిర్మించినా పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. పేరుకు ప్రాంతీయ ఆసుపత్రిగా మారినా.. ఇప్పటికీ నంద్యాల, కర్నూలు ఆసుపత్రులకే రోగులను రెఫర్ చేస్తున్నారు.

■ సిటి స్కానింగ్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ చికిత్సలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవు. గైనకాలజిస్టు, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోజుకు 400 మంది అవుట్ పేషెంట్లు, 50 మందికి పైగా ఇన్ పేషెంట్లు ఉంటారు.

లోపల పేజీల్లో
బ్యాంకుల వద్ద భద్రం
కనులారా స్వామిని చూసేలా.. 6

6న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న నంద్యాల నెరవాటి పాఠశాలలో 13 ఏళ్లలోపు బాల, బాలికలకు జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికృష్ణ, రామసుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీలోపు ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 2, 3 తేదీల్లో మచిలీపట్నంలో జరగబోయే రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

WANTED LECTURER
Application are invited for the post of lecturer in ZOOLOGY Subject interested Candidates can attend for Interview on 06/07/2025 (Sunday) at 10 a.m with resume.
Principal: B.Sreekanth
SRI NANDI JUNIOR COLLEGE
Nandikotkur, Nandyal (D.t.,)
Cell: 94408 44186.

కనులపండువగా జగన్నాథుడి రథయాత్ర

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలో గురువారం జగన్నాథస్వామి రథయాత్ర కనులపండువగా సాగింది. నారదముని భక్త బృందం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి చౌడేశ్వరీదేవీ గుడి వరకు యాత్ర సాగింది. రాత్రి చౌడేశ్వరీదేవీ ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ, భజన నిర్వహించారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

రథంపై కొలువైన దేవతామూర్తులు


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

వివాదాలకు సామరస్య పరిష్కారం
☛ రేపు జాతీయ లోక్‌అదాలత్

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: న్యాయం కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్న కక్షిదారుల వివాదాలను జాతీయ లోక్‌అదాలత్ సామరస్యంగా పరిష్కరించి ఊరటనిస్తోంది. సత్వర న్యాయం అందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వేల కేసులు పరిష్కారం అవుతున్నాయి. పోలీసు స్టేషన్, కోర్టుల్లో అపరిష్కృత కేసుల భారం తగ్గించటంలో జాతీయ లోక్‌అదాలత్ ఎంతో మేలు చేస్తోంది. సమయం, డబ్బు వృథా చేసుకుంటూ సుదీర్ఘ కాలం కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారుల వివాదాలు సామరస్యంగా పరిష్కరించి మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో ఈ నెల 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు.

ఎలాంటి కేసులు

రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, కుటుంబ వివాదాల, భార్యాభర్తల గొడవలు, రహదారి ప్రమాదాలు, చెక్‌బౌన్స్ కేసులు, చిట్‌ఫండ్, ప్రీలిటికేషన్ కేసులు, ప్రభుత్వశాఖ సేవలకు సంబంధించిన కేసులు, బీమా సంస్థలకు సంబంధించివి ఇతరత్రా వివాదాలు జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు.

రాజీ మార్గం.. శ్రేయస్కరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 22 బెంచీల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారు. పోలీసు స్టేషనలో నమోదై కోర్టు విచారణలోని రాజీ అయ్యే కేసుల్లోని ఫిర్యాదుదారులు, నిందితులు రాజీ కుదుర్చుకుంటే.. నేరుగా స్థానిక కోర్టుల్లో నిర్వహించే లోక్‌అదాలత్‌ను ఆశ్రయించి పరిష్కరించుకోచ్చు. కక్షిదారుడు తమ న్యాయవాది ద్వారా గానీ లేదంటే సంబంధిత కోర్టు న్యాయమూర్తికి తెలిపి గాని లోక్‌అదాలత్‌తో కేసు పరిష్కరించుకోవచ్చు.

నిర్వహించిన తేదీ	పరిష్కరించిన కేసులు	మోటారువాహన చట్టం కేసులు	సివిల్ కేసులు	క్రిమినల్ కేసులు
16-3-2024	1219	136	322	496
29-6-2024	1139	132	307	770
14-9-2024	6319	177	437	5318
14-12-2024	14314	164	388	13658
8-3-2025	9942	161	346	9502

శాశ్వత పరిష్కారం - లీలావెంకటశేషాద్రి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఇరువురు కక్షిదారులు పరస్పరం చర్చించుకుని సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు. కక్షిదారులపై ఎలాంటి ఒత్తిడి ఉండదు. వారి పూర్తి అంగీకారంతో కేసు పరిష్కరిస్తారు. ఈ తీర్పుతో కక్షిదారులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కక్షిదారులు కేసులకు చెల్లించిన కోర్టు ఫీజు వాపసు తీసుకునే అవకాశం ఉంటుంది.

(c) eenadu

ధరలేక.. దిక్కు తోచక

గ్రామాల్లో నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం నిమ్మ ధరలు అమాంతం పడిపోవడం, పంటలకు వైరస్ సోకడంతో రైతన్నలకు తీరని నష్టం వాటిల్లింది. మండలంలోని మల్లెవేముల గ్రామానికి చెందిన మహిళా రైతు ఈదుల లక్ష్మీదేవి 4.5 ఎకరాల్లో నిమ్మ చెట్లను తొలగించింది. ప్రస్తుతం నిమ్మ ధరలేకపోవడం, వైరస్ ప్రభావంతో చెట్లు ఎండుముఖం పట్టుతుండడంతో అన్నదాతలు నష్టపోయారు. గత నాలుగు నెలల క్రితం బస్తా నిమ్మకాయలు రూ.4వేలు ఉండేది. ప్రస్తుతం బస్తా కేవలం రూ.200 మాత్రమే నడుస్తోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసేందుకు నిమ్మను తొలగిస్తున్నారు. – న్యూస్‌టుడే, మల్లెవేముల(వాగలమర్రి)

పొంచి ఉన్న ప్రమాదం

ముచ్చుమర్రి కేసీ ఎత్తిపోతల పథకం పంపులు ప్రమాదకరంగా మారాయి. పథకం మోటార్ల నుంచి కేసీకి అనుసంధానంగా రెండు భారీ పంపులను ఏర్పాటు చేశారు. పశువులు, మనుషులు వాటి పైనుంచి వెళ్లినా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఇనుప కడ్డీలను ఏర్పాటు చేశారు. ఓ పైపులైన్ కడ్డీలు అపహరణకు గురవ్వడంతో ప్రమాదకరంగా తయారైంది. ఎవరైనా అటుగా వెళితే ప్రమాదవశాత్తు అందులో పడిపోయే అవకాశం ఉంది. కేసీ అధికారులు, కమిటీ సభ్యులు స్పందించి దెబ్బతిన్న పంపునకు గ్రిల్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

పంట నీటి పాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కృష్ణా నదికి ముందస్తుగా నీరు రావడంతో ముంపు ప్రాంతాల్లో వేసిన పంట కొట్టుకొచ్చి ఒడ్డుకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా ప్రవాహం రోజు రోజుకు పెరుగుతోంది. నందికొట్కూరు నియోజకవర్గం కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని ముంపు భూముల్లో నీరు తగ్గిన తరువాత సుమారు 40 ఎకరాల్లో అన్నదాతలు సూలు, సొర, బీర వంటి పంటలను సాగు చేశారు. కొంత సమయంలోనే నదిలోకి వచ్చిన నీటి ప్రవాహంతో కొంత పంట నీట మునగగా, కొంత పంట ఒడ్డుకు చేరింది. మిగతా పంట ప్రవాహంలో కొట్టుకుపోయింది. సుమారు 25 మంది రైతులకు రూ.30 వేల నుంచి 50 వేల వరకు నష్టం వచ్చినట్లు అంచనా. పంట చేతికొచ్చే సమయంలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

ఒడ్డుకు కొట్టుకు వచ్చిన సూలు, సొరకాయ పంటలు

కనులారా స్వామిని చూసేలా..

◆ రాఘవేంద్రుడి దర్శనానికి ఏర్పాట్లు

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో మఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి గురు, శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటోంది. దీంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా మఠం ప్రధాన ముఖద్వారం నుంచి బారికేడ్లు, మఠం ప్రాకారంలో ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేశామని శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన ముఖద్వారంలో ఇద్దరు మఠం అధికారులు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు సెక్యూరిటీ గార్డులను, ప్రాకారంలో ఆరుగురు అధికారులు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. 10 నిమిషాలకు ఒకసారి భక్తులను పరిమిత సంఖ్యలో మఠం ప్రాకారంలోకి పంపించి దర్శనం సజావుగా జరిగేట్టు చర్యలు తీసుకుంటున్నారు. బృందావన దర్శనానంతరం ఉత్తర ద్వారం నుంచి బయటికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు.



శ్రీమఠం ముఖద్వారం వద్ద తొక్కిసలాట లేకుండా దర్శనానికి పంపిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

చిన్నపిల్లల తల్లులకు, వృద్ధులకు..

స్వామి దర్శనానికి వచ్చే చిన్నపిల్లల తల్లులకు, వృద్ధులకు, గర్భిణులకు 7వ నంబరు కౌంటర్ నుంచి శీఘ్ర దర్శనానికి పంపించే ఏర్పాట్లు చేశారు. గురువారం మఠం మేనేజర్ దగ్గరుండి వారిని ప్రత్యేక దర్శనానికి పంపించారు.

ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా..

వచ్చే నెల 8 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలకు భక్తులు నిత్యం వేల సంఖ్యలో తరలిరానున్నారు. సేవా కార్యకర్తలు, దాతలు, సాధారణ భక్తుల సౌకర్యార్థం దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామని మఠం మేనేజర్ తెలిపారు. శీఘ్ర దర్శనం చేయిస్తామని ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మోసపోవద్దని, దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

బ్యాంకుల వద్ద భద్రం

◆ ఏటీఎం కేంద్రాల్లోనూ అప్రమత్తత ముఖ్యం

ఆదోని పట్టణంలోని ఏటీఎం కేంద్రంలో యువతిని ఏమార్చిన దొంగలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ◆ ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న సెంట్రల్ బ్యాంకు ఏటీఎంలోకి ఈ నెల 1న ఓ యువతి డబ్బులు డ్రా చేసేందుకు వచ్చింది. గమనించిన ముగ్గురు వ్యక్తులు ఏటీఎం కేంద్రంలోకి వెళ్లారు. యువతిని సినీఫక్కీలో ఏమార్చి పిన్ నంబరు తెలుసుకుని ఏటీఎం కార్డును మార్చేశారు. తర్వాత అందులోంచి రూ.49,950 స్వాహా చేశారు.

◆ ఆలూరు మండలం ఎ.గోనెహాళ్ గ్రామానికి చెందిన రైతు రవికుమార్‌రెడ్డి గతనెల 21న ఆదోని పట్టణంలోని ఇండియన్ బ్యాంకులో బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి రూ.2.5 లక్షల రుణం తీసుకున్నాడు. రూ.2 లక్షలు డ్రా చేసి సంచిలో పెట్టుకొని బ్యాంకు బయటకు వచ్చాడు. తన ద్విచక్రవాహనానికి మరో వాహనం అడ్డం ఉండడంతో నగదు సంచిని బైక్ ముందు బ్యాగులో పెట్టి.. వాహనాన్ని పక్కకు తీసి వచ్చి చూడగా.. నగదు కనిపించలేదు. జిల్లాలో బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద దొంగల సంచారం పెరిగింది. బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే వారిపై రెక్కీ నిర్వహించి సినీఫక్కీలో దొంగతనం చేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నిఘా ఉంచి వృద్ధుల దృష్టి మార్చి పిన్ తెలుసుకుని ఏటీఎం కార్డును మార్చేసి సొమ్ము కాజేస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఇలాంటి సంఘటనలు అధికంగా జరుగుతున్నాయి. ప్రజలు బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలకు వెళ్లే సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- పెద్దమొత్తంలో నగదు డిపాజిట్, డ్రా చేసేందుకు వెళ్లాల్సి వస్తే.. ఒకరిని తోడుగా తీసుకెళ్లాలి.
- బ్యాంకులో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే బ్యాంకు అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలి.
- బ్యాంకు బయట మీ వాహనానికి అడ్డంగా మరో వాహనం పెట్టి.. డబ్బు కింద పడిందని.. వివిధ కోణాల్లో మీ దృష్టి మళ్లించి నగదు ఎత్తుకెళ్తారు.
- కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తుల సహాయం తీసుకోరాదు.
- ఏటీఎం ద్వారా డ్రా చేయడం తెలియకపోతే తెలిసిన వారిని తీసుకెళ్లాలి.
- ఏటీఎంలో పిన్ నంబరును ఎవరూ చూడకుండా అప్రమత్తంగా ఉండాలి.

అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించండి

-మర్రిపాటి హేమలత, డీఎస్పీ, ఆదోని.

ఆదోని పట్టణంలోని ఓ బ్యాంకు వద్ద, ఏటీఎం కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. వారి కోసం ప్రత్యేకంగా గాలిస్తున్నాం. త్వరగా పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తాం. ప్రజలు బ్యాంకులకు, ఏటీఎం కేంద్రాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.

ప్రత్యేక నిధులు విడుదల చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మెగా పీటీఎం కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి ప్రభుత్వాన్ని కోరారు. నంద్యాల పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పీటీఎం మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుల ఖాతాలకు జమ చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యాలయ ఇన్‌ఛార్జి సుబ్బయ్య, నాయకులు చెన్నకేశవులు, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్, బసవరాజు, మునీర్ అహ్మద్, వేణుగోపాల్, రామాంజనేయరెడ్డి, వెంకటేశ్వరరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం కొండపేటలో వారితో పాటు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తెదేపా రాష్ట్రకార్యదర్శి, డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావుయాదవ్ తదితరులు ఇంటింటి పర్యటన చేపట్టారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం కింద పిల్లల తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల హామీల మేరకు పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, పేదల సంక్షేమం కోసం ఇంటింటికి సుపరిపాలన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ హరికిషన్, మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడ్, మాజీ సర్పంచి టీఈ పెద్దకేశవయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఇంటింటి పర్యటనలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి తదితరులు

ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణం 40వ వార్డులోని చిన్న ఆసుపత్రి వీధిలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మనియార్ ఖలీల్ అహ్మద్, నాయకులు పఠాన్‌జాకీర్, నవాజ్, అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు, అబ్బాస్, దర్గా జాఫర్, జాహిద్, అర్షద్ అలీఖాన్, రవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కరపత్రాలను అందజేస్తున్న మంత్రి ఫరూక్, ఫిరోజ్

తల్లికి వందనం డబ్బులివ్వాలని గొడవ

◆ పురుగుల మందు తాగిన భార్య

◆ భర్త కూడా ఆత్మహత్యాయత్నం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పిల్లల చదువుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన 'తల్లికి వందనం' డబ్బులు ఇవ్వాలని భర్త తన భార్యతో గొడవపడ్డాడు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన భార్య పురుగుల మందు తాగడంతో భర్త కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా గోనెగండ్లలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అంజినమ్మ, ఈరన్న దంపతులు కురువపేటలో నివాసం ఉన్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. పాడి పోషణతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈరన్నకు ఆదోని మండలంలోని కపటి నాగలాపురం గ్రామానికి చెందిన శంకరప్ప పెద్దకుమార్తె అంజినమ్మతో వివాహం జరిగింది. ఈరన్న మద్యానికి బానిస కావడంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా మార్పు రాలేదు. గతనెల ప్రభుత్వం పిల్లల చదువు కోసం తల్లికి వందనం కింద అంజినమ్మ బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమ చేసింది. ఈ డబ్బులు ఇవ్వాలని ఈరన్న నిత్యం గొడవపడేవాడు. తమ పిల్లల చదువుకు ఖర్చు చేస్తానని, ఇచ్చేది లేదని భర్త మొరపెట్టుకునేది. బుధవారం సాయంత్రం డబ్బుల విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. జీవితంపై విరక్తి చెందిన అంజినమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే పురుగుల మందు తాగి ఈరన్న బలవన్మరణానికి పాల్పడ్డాడు. వీరిద్దరూ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అంజినమ్మ పరిస్థితి విషమంగా ఉందని, తమ కుమార్తెకు న్యాయం చేయాలని ఆమె తండ్రి శంకరప్ప గురువారం పోలీసులను ఆశ్రయించారు. న్యాయం చేస్తామని పోలీసులు చెప్పి పంపారు.

న్యాయం చేయాలని పిల్లలతో పోలీసులను ఆశ్రయిస్తున్న అంజినమ్మ తండ్రి

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్

అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ముద్దవరం, గొరుమానుకొండ(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బుగ్గానిపల్లెతండా, ముద్దవరం, గొరుమానుకొండ గ్రామాల్లో జాతీయ ఉపాధి పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లను, హార్టికల్చర్ ఫిట్టింగ్, కంపోస్టు గుంతలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులు తదితర నిర్మాణాలను ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి ఇంటికి కంపోస్టు గుంతలు తీసుకోవాలని, పశువులు ఉన్న రైతులు గోకులాలు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో విజయరాణి, ఈసీ నాగలక్ష్మి, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గోకులం షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

పారిశుద్ధ్యం ఆధారంగా గ్రామాలకు ర్యాంకులు

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందంతో సమావేశమైన కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల ఆధారంగా ర్యాంకులు ఇవ్వనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందం సభ్యులు నంద్యాల కలెక్టరేట్‌లో గురువారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పౌరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, పారిశుద్ధ్యంపై అవగాహన పెంచడం, గ్రామాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు మెరుగుపర్చడమే స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యమని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి వ్యర్థాల సేకరణ, ప్రాసెసింగ్‌పై గ్రామీణుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. చెత్త రహిత, బహిరంగ మల విసర్జన లేని గ్రామాలకు ర్యాంకులు ఇవ్వనున్నట్లు వివరించారు.

భోజన పథకం నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం చేయవద్దని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం హరిజనవాడలోని జడ్పీ ఉన్నత పాఠశాల, గొర్లగుట్ట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో సోమశేఖర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థుల హాజరు శాతం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను సకాలంలో అందరికీ అందజేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు.

హరిజనవాడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | Union Bank of India A Government of India Undertaking

అసెట్ రికవరీ బ్రాంచి- తిరుపతి

Iవ అంతస్తు, ఎస్‌వి క్యాంపస్ శాఖ, ఎస్‌వి విశ్వవిదాలయ పాలనా భవనం వెనుక, ఎస్‌వి విశ్వవిద్యాలయ శాఖ, ఇ-మెయిల్: arb.tirupathi@unionbankofindia.bank, ఫోన్: 8328565422.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ.-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద హామీగల స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల నోటీసు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జిచేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & గ్యారంటార్(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన దిగువ తెలుపబడిన విధంగా బకాయిలను రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే" స్థితిలో విక్రయించబడును. రిజర్వు ధర, ధరావతు మరియు బిడ్ పెంపుదలలు దిగువ తెలుపబడినవి:

ఇ వేలం తేది, సమయం: 30-07-2025, మ.12.00 గం. నుండి సా.5.00 గం.వరకు. (10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో)

రుణగ్రహీతలు/ తనఖారుణగ్రస్తులు/గ్యారంటర్లు: 1) శ్రీ షేక్ కరీముల్లా తండ్రి షేక్ సయ్యద్, డి.నెం.5-12బి, పప్పులబట్టి స్ట్రీట్, కన్యకాపరమేశ్వరి స్కూల్ ఏరియా సమీపాన, సుంకాలమ్మ టెంపుల్ స్ట్రీట్, నంద్యాల, 2) శ్రీమతి షేక్ ముంతాజ్ భర్త షేక్ కరీముల్లా, డి.నెం.5-12బి, పప్పులబట్టి స్ట్రీట్, కన్యకాపరమేశ్వరి స్కూల్ ఏరియా సమీపాన, సుంకాలమ్మ టెంపుల్ స్ట్రీట్, నంద్యాల.

హామీగల స్థిరాస్తులను విక్రయించి రాబట్టుకోవల్సిన హామీగల రుణం: 31-05-2025 నాటికి రూ.62,01,481/- (అరవై రెండు లక్షల ఒక వెయ్యి నాలుగు వందల ఎనభైఒక్క రూపాయలు మాత్రమే) మరియు దానిపై తదనంతర వడ్డీ, అపరాధ వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

విక్రయించబడనున్న స్థిర సెక్యూర్డ్ అసెట్స్ వివరం: నంద్యాల జిల్లా మరియు నంద్యాల జిల్లా ఎస్ఆర్ఓ, నంద్యాల రెవిన్యూ పరిధిలో 117 చ.గజాల విస్తీర్ణంతో నంద్యాల, రజియా మసీద్ ఎదురుగా, వార్డు-7, సడిగడ్డ ఏరియా, నబీనగర్, డి.నెం.7/80-సి5-6, సర్వే నెం.1693 PYKIలో ఉన్న శ్రీ షేక్ కరీముల్లాకు చెందిన నివాస భూమి మరియు భవనం యావత్తు. సరిహద్దులు: తూర్పు: 15అ.రోడ్, పడమర: కె.కరీమ్ బాషా మరియు ఇతరుల స్థలం, ఉత్తరం: విక్రయదారు స్థలం, దక్షిణం: షేక్ జమాల్ బాషా ఇల్లు.

రిజర్వు ధర: రూ.52,75,000/-, ఇఎండి: రూ.5,27,500/- **బిడ్ పెంపుదల మొత్తం: రూ.55,000/-**

సెక్యూర్డు క్రెడిటార్స్‌కు తెల్సిన ఏవేని ఎన్కంబ్రెన్సుల వివరాలు: లేవు/ తెలియదు.

ఇఎండి దాఖలుకు చివరి తేది: ఇ-వేలం ముగింపు సమయంలోపు. ఏదేని సాంకేతిక లోపాన్ని నివారించుటకు తగినంత ముందుగా ఇఎండిని డిపాజిట్ చేయవల్సిందిగా మరియు ఆస్తి ఐడితో లింక్/మ్యాప్ చేయవల్సిందిగా విజ్ఞప్తి.

రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నిబంధనల కొరకు దిగువతెలిపిన సైట్లను చూడగలరు:

10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో పైనతెలిపిన తేది మరియు సమయంలోగా వెబ్ పోర్టల్/ వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నిర్వహించబడును. తమ మొబైల్ నెంబరు మరియు చెల్లుబాటగు ఇమెయిల్ ఐడి ఉపయోగిస్తూ https://baanknet.com (వెబ్‌సైట్ హోమ్ పేజిలో ఇవ్వబడిన బయ్యర్ రిజిస్ట్రేషన్ లింకు) ద్వారా ఔత్సాహిక బిడ్డర్లు/ కొనుగోలుదార్లు రిజిస్టరు చేసుకోవల్సి ఉంటుంది. ఔత్సాహిక బిడ్డర్లు/ కొనుగోలుదార్లు ఇంకా కెవైసి డాక్యుమెంట్లు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవల్సి ఉంటుంది. వెబ్‌సైట్ హోమ్ పేజిలో ఇవ్వబడిన బయ్యర్ మాన్యువల్‌చే ఔత్సాహిక బిడ్డర్లు/ కొనుగోలుదార్లు మార్గదర్శనం చేయబడతారు. ● సందేహనివృత్తి కొరకు సంప్రదించవల్సిన నెంబరు: 8291220220 మరియు ఇమెయిల్ ఐడి: support.BAANKNET@psballiance.com ● వేలం సంబంధిత సందేహాల కొరకు sarfaesi@unionbankofindia.com కు ఇ-మెయిల్ చేయండి లేదా పైచిరునామాలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మైదుకూర్ శాఖను మరియు వేలం వివరాలు పొందుటకు మరియు ఆస్తి తనిఖీకై అధీకృత అధికారి (8328565422)ని కూడా సంప్రదించవచ్చును. ● బిడ్డర్లు వారి బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనుటకు ముందు వేలం అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు https://baanknet.com చూడవల్సిందిగా సూచించడమైనది. ఇ-బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసిన తర్వాత కృతార్థుడైన బిడ్డరుకు పిఎస్‌బి అలయెన్స్ ప్రై.లి., చే ఇ-మెయిల్ ద్వారా తెలియజేయబడును.

తేది: 30.06.2025 ప్రదేశం: తిరుపతి సం/- చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, అసెట్ రికవరీ శాఖ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వెంకన్న(60) అనే వ్యక్తి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దొర్నిపాడు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గుండుపాపల గ్రామానికి చెందిన వెంకన్నకు ఇద్దరు కుమారులు. మద్యం తాగటానికి చిన్న కుమారుడు డబ్బులు ఇవ్వలేదని విషద్రావణం తాగాడు. గమనించిన కుమారుడు చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రంగయ్య తెలిపారు.

నీట మునిగి విద్యార్థి మృతి

శిరివెళ్ల, న్యూస్‌టుడే: శిరివెళ్ల పరిధిలోని పచ్చర్ల సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో నీటి కుంటలో పడి విద్యార్థి మృతి చెందాడు. గురువారం సెలవు కావడంతో నంద్యాల పట్టణానికి చెందిన యాకుబ్ అనే వ్యక్తి తన కుమారుడు అజ్మతుల్లాఖాన్(14)తో కలిసి నల్లమల అటవీ అందాలు చూసేందుకు పచ్చర్ల సమీప ప్రాంతాలకు వచ్చారు. ఈ క్రమంలో అజ్మతుల్లా బహిర్భూమికి రావడంతో సమీపంలోని నీటి కుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మునిగిపోయాడు. తండ్రి వెంటనే కుమారుడిని నీటి నుంచి బయటకు తీసి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీసు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కౌలుకార్డులు సృష్టించాడు.. తనువు చాలించాడు

సర్వాయిపల్లె(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని సర్వాయిపల్లె గ్రామంలో దూదేకుల శివరాముడు(74) విషద్రావణం తాగి మృతి చెందాడని గురువారం ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన శివరాముడు కొందరు రైతుల పొలాలను వారికి తెలియకుండా కౌలు తీసుకున్నట్లు కౌలుకార్డులు సృష్టించాడు. ఈ విషయం తెలిసిన సదరు రైతులు శివరాముడును ప్రశ్నించారు. బాధిత రైతులు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి కౌలు కార్డులు రద్దు చేయించారు. ఈ విషయంలో ఆందోళన చెందిన శివరాముడు బుధవారం మనస్తాపానికి గురై స్థానిక పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో విష ద్రావణం తాగి వాంతులు చేసుకుంటుండగా గ్రామస్థులు గుర్తించి నంద్యాలలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన చెన్నయ్య (38) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... చెన్నయ్య గత కొంత కాలంగా తాగుడుకు బానిసై అనారోగ్యం బారిన పడ్డాడు. జీవితంపై విరక్తి చెందిన గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

Open 10th, Inter, DPPTTC, Online Degree, PG, MBA & MCA Courses. Cont: Sri Sai College of Distance Education, Knl. ✆ 79812 23882.

FACULTY/ TEACHERS

Wanted Experienced JEE/NEET faculty for Junior College and School. Cell: 95505 90900/ 92907 48955.

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

రోహిణి ఇన్‌ఫ్రా వారి నూతన ప్రాజెక్ట్ కామదేను నివాస్ - 2, బెంగుళూరు రోడ్డు లక్ష్మీపురం దగ్గర ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. అనూష: 91600 38988, 88866 62148.

JOBS

కర్నూలు - నంద్యాల చెక్ పోస్ట్‌లో కొత్తగా ప్రారంభించిన మల్లికార్జున ఫర్నిచర్ నందు పనిచేయుటకు అకౌంటెంట్ M/F కావలెను. అర్హత: B.Com, MBA. ✆ 98493 50328.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. నందికొట్కూరు ఉప కారాగారాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశమయ్యారు. ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. వసతులు, భోజనం గురించి ఆరా తీశారు. కారాగారం పర్యవేక్షకుడు రఘునాథ్‌రెడ్డి, ప్యానెల్ లాయర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : మొహర్రం కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న మకానుల్లో పీర్లు కొలువుదీరాయి. గురువారం భక్తులు ఫాతెహాలు చదివించారు. గాంధీచౌక్‌లోని హసేన్ ఆలం, చాంద్‌బాడలోని ఇమామ్ ఖాసిం, కల్పనా సెంటర్‌లోని ఇమామ్ ఖాసిం, నీలిబీబీలో బీబీ ఫాతిమా, ఖైరువాడీలోని ఇమామ్ ఖాసిం పీర్లను పలువురు దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28820

ఆత్మకూరు పట్టణం ?: వెంగళరెడ్డినగర్‌లో మార్కండేయ ఆలయం మలుపు వద్ద చాలా రోజులుగా వీధిదీపం వెలగడం లేదు. - రమణ, స్థానికుడు

✓: నూతన వీధిదీపం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. - షాహీర్‌బాషా, పురపాలక ఏఈ

?: ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటలో కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. - సుభాన్, స్థానికుడు

✓: సిబ్బందికి సూచించి కాల్వల్లో పూడిక తొలగిస్తాం. - జీవన్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు

26న జిల్లా రెడ్‌క్రాస్ సమావేశం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా రెడ్‌క్రాస్ సాధారణ సమావేశం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జి.రాజకుమారి తెలిపారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనంలో సమావేశం ఉంటుందని ఆమె గురువారం వెల్లడించారు. రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు, అసోసియేట్ సభ్యులు, ప్యాట్రన్లు, వైస్ ప్యాట్రన్లు సమావేశంలో పాల్గొనేందుకు గుర్తింపు కార్డును తప్పనిసరిగా తేవాలన్నారు.

అవయవ దాత రవికుమార్‌కు నివాళి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : అవయవదానం చేసిన పాణ్యం బీసీకాలనీకి చెందిన రవికుమార్‌కు పలువురు నివాళి అర్పించారు. రవికుమార్ జూన్ 29న ద్విచక్ర వాహనంపై గోస్పాడుకు వెళ్లడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో రవికుమార్ అవయవాలను దానం చేశారు. ఆయన భార్య లలిత 12 రోజుల కిందటే కుమార్తెకు జన్మనిచ్చారు. రవికుమార్ మృతి సమాచారం అందుకున్న పలువురు గురువారం పాణ్యంలోని వారి గృహంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

వేళకందని వైద్యం.. వ్యాధికన్నా ప్రమాదం

☛ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత

☛ నాడిపట్టే వారు లేరని రోగుల ఆవేదన

పరిశీలన

ఆత్మకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం గాలిలో దీపంలా మారింది. సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో రోగులకు సకాలంలో సేవలు అందడం లేదు. వాతావరణ మార్పులతో నిత్యం పెద్ద సంఖ్యలో రోగులు ఆసుపత్రులకు వస్తున్నారు. రోజురోజుకు ఓపీ పెరుగుతోంది. సేవలు మాత్రం తీసికట్టుగా మారుతున్నాయి. అన్ని విభాగాల్లో వైద్యులు, నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది కూడా సరిపడా లేరు. ఎక్స్‌రే, ఇతర వైద్య పరీక్షలకు వేచిచూడాల్సి వస్తోంది. దీంతో నామమాత్రపు వైద్యమే అందుతోంది. మెరుగైన చికిత్స కోసం రోగులు నంద్యాల, కర్నూలుకు వెళ్లాల్సి వస్తోంది.

ఆత్మకూరులో ఎదురుచూపులే

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు సీహెచ్‌సీకి రోజుకు 350 మందికి పైగా రోగులు వస్తున్నారు. నెలలో సాధారణ ప్రసవాలు 30, సిజేరియన్ కాన్పులు 12 వరకు చేస్తున్నారు. ఇక్కడ స్టాఫ్‌నర్సులు, సిబ్బంది సరిపడా లేరు. ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది విధులను పర్యవేక్షించాల్సిన హెడ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పనులు ముందుకుసాగడం లేదు. సూదులు వేయడం, సాధారణ వైద్య సేవలు ఆలస్యమవుతున్నాయి. ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో చికిత్స చేయలేని పరిస్థితి. ప్రసవాల సమయంలో ఆపరేషన్ థియేటర్‌లో జనరల్ డ్యూటీ అటెండర్లు లేరు.

● సీహెచ్‌సీలో హెడ్‌నర్సుగా పనిచేస్తున్న వసంతకుమారి బదిలీపై వెళ్లారు. అధికారులు మరొకరిని నియమించలేదు. హెడ్‌నర్సు లేకపోవడంతో ఆసుపత్రి పర్యవేక్షణ, ఉద్యోగుల విధులు, వైద్య సేవల్లో ఆలస్యమవుతోంది.

● సీహెచ్‌సీలో నలుగురు స్టాఫ్‌నర్సులకుగాను ఇద్దరే ఉన్నారు. వీరిలో ఒకరు సెలవు పెడితే మిగిలిన ఒక్కరిపైనే భారం పడుతోంది. వైద్యం కోసం రోగులు గంటలకొద్దీ వరుసల్లో నిరీక్షించాల్సి వస్తోంది.

● మహిళా స్టాఫ్‌నర్సులు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరు. దీంతో మహిళలకు వైద్య సేవలు, కాన్పులు, ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు తీసుకొచ్చే విధులను పురుషులే నిర్వర్తిస్తున్నారు.

● రోగులు, బాలింతలను ఆపరేషన్ థియేటర్‌లోపలికి తీసుకువెళ్లడం, శస్త్ర చికిత్స సమయంలో సాయం అందించే ఆపరేషన్ థియేటరు అసిస్టెంట్ లేరు. దీంతో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందితో ఈ పనులు చేయిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ రెగ్యులర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది.

నందికొట్కూరులో నిరాశే..

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ రోజురోజుకు పెరుగుతోంది. రోగుల సంఖ్యకు సరిపడా సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో వైద్యం ఆలస్యం అవుతోంది. ఈ సీహెచ్‌సీలో రోజుకు 200- 250 ఓపీ ఉండేది. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కారణంగా రోజూ 350- 400 మంది రోగులు వస్తున్నారు. వారికి ఓపీ ఇవ్వడంతో, సూదిమందు వేసేందుకు నర్సులు, మందుల పంపిణీ చేసేందుకు ఫార్మాసిస్టులు తక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

● ఇక్కడ జనరల్ సర్జన్ అందుబాటులో లేరు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఇక్కడికి తీసుకొస్తే నిరాశ తప్పదు. ఎముకలు విరిగిన వారికి ఎక్స్‌రే కూడా తీయడం లేదు. దీంతో కర్నూలుకు తీసుకెళ్లాల్సి వస్తోంది. ప్రమాదాల్లో మరణించిన, ఆత్మహత్యలు చేసుకున్న వారికి పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు అందుబాటులో లేరు.

ఓపీ కోసం కౌంటరు వద్ద వేచి ఉన్న రోగులు, బంధువులు

రైతుకు పంట రుణం చెక్కు అందజేస్తున్న రామాంజనేయులు

రైతులకు అన్నివిధాలా సహకారం

నందికొట్కూరు, న్యూస్‌టుడే : సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార సంఘాల అధికారి రామాంజనేయులు సూచించారు. స్థానిక సొసైటీ ఆవరణలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ సహకార సంఘం వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సహకార సంఘం రైతులకు అన్నివిధాలుగా సేవలు అందిస్తున్నారు. నూతనంగా మంజూరైన రుణాల చెక్కులు, ఎరువులు పంపిణీ చేశారు. సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు, కేడీసీసీ బ్యాంకు మేనేజరు వెంకటరమణ, సొసైటీ సీఈవో రబ్బానీ, ఖాజా, చంద్రశేఖర్‌గౌడ్, అశోక్, మల్లికార్జున పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

గడివేముల, న్యూస్‌టుడే : అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చూడాలని తహసీల్దారు వెంకటరమణ సిబ్బందికి సూచించారు. గడివేములలో గురువారం ఆయన గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రీసర్వే తప్పులను సరిచేయాలని చెప్పారు.

మడుగు దాటితేనే.. బడిలో అడుగు

నందికొట్కూరు మండలం 10 బొల్లవరం గ్రామంలోని ఆదర్శ పాఠశాల ముందు చిన్నపాటి వర్షానికే నీరు మడుగులా నిలుస్తోంది. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ముందు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

రక్షణ లేక.. భయపెడుతున్న నియంత్రిక

శ్రీశైల మహాక్షేత్రంలోని పాతాళగంగ మార్గంలో వలయ రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. దీనిచుట్టూ రక్షణ గోడ నిర్మించలేదు. దీని పక్కనే దుకాణాలు ఉన్నాయి. ఆ దుకాణాలన్నీ ఇనుప షెడ్లలో, రేకులతో ఏర్పాటు చేసిన షెడ్లలో నిర్వహిస్తున్నారు. గాలివానల సమయంలో దుకాణాలకు విద్యుత్తు ప్రసారం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రిక చుట్టూ రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం నంది సర్కిల్

ఛీఛీదారి.. ప్రమాదకారి

మహానంది మండలం గాజులపల్లె ఆర్.ఎస్ గ్రామం శివారులో సీసీ రహదారి ఛిద్రమైంది. ఈ దారిలో గోపవరం మీదుగా నిత్యం బడిబస్సులు నంద్యాలకు వెళ్తుంటాయి. రోడ్డు పక్కనే తెలుగుగంగ 12వ బ్లాక్ కాల్వ ప్రవహిస్తోంది. అడుగున ఉన్న మట్టి కొట్టుకుపోవడంతో సీసీరోడ్డు మధ్యలోకి విరిగిపోయింది. దీంతో వాహదారులు భయం భయంగా ప్రయాణిస్తున్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచి అస్లాంబాషాను వివరణ కోరగా.. సమస్యను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, మహానంది

ప్రత్యేక ప్రతిభావంతులు.. పోటీల్లో మెరుపులు

☛ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న మానసిక దివ్యాంగులు

☛ జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు సొంతం

సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే మేము సైతం క్రీడల్లో విజేతలుగా నిలుస్తామని చాటుతున్నారు ప్రత్యేక అవసరాల విద్యార్థులు. మహానంది మండలం గోపవరం గ్రామంలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రలోని మానసిక దివ్యాంగులైన విద్యార్థులు పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపుతున్నారు. తమ పనులు తాము చేసుకోలేని వారికి.. కేంద్రం నిర్వాహకులు క్రీడల్లో పతకాలు సాధించేలా తీర్చిదిద్దారు. శిక్షకుల ప్రోత్సాహంతో పలువురు విద్యార్థులు పోటీల్లో విజయాలు సాధిస్తున్నారు.

ప్రిన్సిపల్ కల్యాణితో పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించిన విద్యార్థులు

రేణుక.. విజయ దీపిక

పగిడ్యాల మండలం ఎన్.ఘణపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు రేణుక ప్రీ ఒకేషనల్- 2ఏ శిక్షణ పొందుతోంది. ఈమె పరుగు పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తోంది.

● జనవరిలో కర్నూలులో జరిగిన పారా క్రీడల్లో పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణం అందుకుంది.

● ఫిబ్రవరి 2న మంగళగిరిలో జరిగిన 7వ ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్- 2025లో 100 మీటర్ల పరుగులో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్టీఫెన్‌హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారి జరిగిన జిల్లాస్థాయి పారా క్రీడల్లో ఈ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేశారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ మొదలైన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్ర- 2025లో ప్రదర్శనలో పాల్గొని ప్రశంసలు పొందారు.

● ఈ ఏడాది జనవరి 20న కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పరుగు పందెంలో ఆరీఫా, సుబ్బమ్మ, రేణుక, సాయికుమార్, రమణారెడ్డి, సాయికిరణ్‌లు వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాలు గెలుపొందారు. మౌనివర్ధన్, మౌనిక, శివారెడ్డి, పీరయ్య, రమణారెడ్డి, అశోక్, తేజ రజత పతకాలు సాధించారు.

● జిల్లాస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో కూడా వీరు రజత పతకం అందుకున్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

గడివేముల, న్యూస్‌టుడే : రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. బూజునూరు గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మండలంలో పలు గ్రామీణ రహదారులు నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పంటా రామచంద్రారెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంచాలకట్ట శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ గీత, తెదేపా నాయకులు వంశీధర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, అనసూయమ్మ, రఫీక్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆమె నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, జీఎన్ఎస్‌రెడ్డి, వాసుదేవగుప్తా, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

చెంచుల సంక్షేమానికి కృషి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : చెంచుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఆత్మకూరు మండలం బైర్లూటి గూడెంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి చెంచుల సమస్యలు తెలుసుకున్నారు. చెంచులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పెంపొందించుకోవాలన్నారు.

చెంచులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలి

పాములపాడు, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అధికారులను ఆదేశించారు. పాములపాడు మండలంలోని భానుముక్కల, వానాల గ్రామాల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ ప్రసాదరెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పండగలు ప్రశాంతంగా చేసుకోండి

మిడుతూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రజలు పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. మొహర్రం సందర్భంగా మండలంలోని వీపనగండ్లలో గురువారం స్థానికులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల సమస్య రాకుండా చూసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై ఓబులేసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

విద్యుత్తు ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ సుధాకర్‌బాబు

నియంత్రికలపై భారం తగ్గించేందుకు చర్యలు

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల విద్యుత్తు ఉపకేంద్రంలో నియంత్రికలపై భారం తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎస్ఈ సుధాకర్‌బాబు చెప్పారు. ఉపకేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ నియంత్రికను గురువారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. 8 ఎంవీఏ నియంత్రిక ఏర్పాటు వల్ల ఉపకేంద్రంపై భారం తగ్గుతుందన్నారు. ఉపకేంద్రంలో నీటివసతి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరెడ్డి, ఏడీఏ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జగజ్జనని అమ్మవారికి సారె సమర్పణ

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో ఉన్న జగజ్జనని అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గురువారం భక్తులు సారె సమర్పించారు. కర్నూలు, ఎమ్మిగనూరు, కడప, గిద్దలూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పురవీధుల గుండా సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారికి సారె తీసుకొస్తున్న మహిళలు

పుర కార్మికులను క్రమబద్ధీకరించండి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని కోరుతూ ఆత్మకూరు పురపాలక కార్యాలయం వద్ద గురువారం కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పురపాలక కార్మిక సంఘం అధ్యక్షుడు నాగన్న మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల రద్దుచేసి, ఒప్పంద, పొరుగు సేవల కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న చేపట్టే సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని కోరారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధి మందగించింది

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : గత పాలకుల నిర్లక్ష్యంతోనే పట్టణంలో అభివృద్ధి మందగించిందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. పట్టణంలోని బొమ్మలసత్రం వంతెన కింద కొద్దిపాటి వర్షానికే రహదారులపై మురుగునీరు ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరుతున్నట్లు తెలుసుకుని గురువారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రి ఫరూక్ ఆధ్వర్యంలో బొమ్మలసత్రం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

మహారాజశ్రీ కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.A.No.411/2021 in O.S.No.490/2010
K.చెంచురాజు (Died) S/o. K.శేషగిరిరావు
L.Rs.K.శారదమ్మ W/o. Late K.చెంచురాజు
M.విజయవాణి D/o. Late K.చెంచురాజు
N.ప్రత్యూష D/o. Late K.చెంచురాజు
K.రవికాంత్ S/o. Late K.చెంచురాజు, All are R/o. H.No.B/B 432, B.Camp, Kurnool ..అర్జీదారులు
V/s.
K.పద్మావతమ్మ పాతి వారసులు కె.సుధారాణి & వగైరా ...రెస్పాండెంట్లు
వేలం ప్రకటన
పై నెంబరు దావాలో దాఖలు అర్జీలో కనపరచిన మూడవ ఐటమ్ వేలం వేయమని అర్జీదారులు అర్జీ దాఖలు చేసినారు. వేలం వాయిదా 19.07.25 తేదీన ఉన్నది. సవాలుదారులు పై వేలం తేదీన పై కోర్టులో పగలు 10.30 గంll నుంచి జరిగే వేలంలో పాల్గొనవలయును.
షెడ్యూలు: Item No.3: The house bearing No.10 (1/58 Old House) is Situated in Gani Village within the limits of Orvakal SRO and its Boundaries are East: House of Yeddula Subbanna & K.Thippanna, West: Rasta, North: House of Bollavaram Ramana, South: House of Boya Venkateswarlu.
Measurement: East-West: 20 Feet, North-South: 40 Feet
Item No.3 in the Plaint
కోర్టు ఉత్తర్వుల మేరకు
Sd/- B.Krishnaa Murthy, B.Com., B.L.
Advocate, Kurnool. Cell: 94407 70483.

నందికొట్కూరు నుంచి నాగలూటి వెళ్లే బీటీ రహదారి బురదమయమై మట్టిరోడ్డును తలపిస్తోంది. 340సీ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేసే భారీ వాహనాలతో పాటు నాపరాతి లోడుతో వెళ్లే వాహనాల కారణంగా ఈ రహదారి మొత్తం గుంతలమయమైంది. గుంతల్ని పూడ్చేందుకు కంపెనీ వారు మట్టి వేశారు. వర్షాలకు మట్టి తడిసి దారి మొత్తం బురదగా మారింది.

పగిడ్యాల : లక్ష్మాపురం అంచె సమీపం నుంచి నందికొట్కూరు వెళ్లే రహదారి భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని జీవనజ్యోతి సర్కిల్ వరకు రోడ్డు దారుణంగా దెబ్బతింది. గోతుల్లో నీరు నిలిచి వాహనదారులు జారిపడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

అడుగడుగునా గోతులు.. అరచేతిలో ప్రాణాలు

ఈర్నపాడు గ్రామంలో ప్రధాన రహదారిపై మోకాలి లోతు నీరు నిలిచింది. తరచూ వర్షాలు కురుస్తుండటంతో వారం రోజులుగా దారి వాగులా మారింది. నీటిలో గుంతల్ని గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు.

గ్రామీణ రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. కొన్నేళ్లుగా నిర్వహణ లేక ఛిద్రమయ్యాయి. అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. ఈ రహదారులపై ప్రయాణించేందుకు గ్రామీణులు నరకయాతన అనుభవిస్తున్నారు. నీరు నిలవడంతో గోతుల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలనైనా పూడ్చివేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు, బండిఆత్మకూరు, పగిడ్యాల

బండిఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు- ఎ.కోడూరు మధ్య రహదారి ఛిద్రమైంది. దారిపొడవునా గోతులు ఏర్పడ్డాయి. వాటిలో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. ఈ దారిలో ప్రయాణించేందుకు నరకయాతన అనుభవిస్తున్నామని శింగవరం, ఈర్నపాడు, సోమయాజులపల్లె, మణికంఠాపురం గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఒప్పందం ప్రకారం వేతనాలివ్వాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల భద్రతా సిబ్బందికి ఒప్పందం ప్రకారం వేతనాలు, సెలవులు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ భద్రతా సిబ్బంది ఆసుపత్రి ఆవరణలో గురువారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ఎంవోయూ నిబంధనల మేరకు వేతనాలు ఇవ్వాలని గుత్తేదారుడిని కోరితే స్థానిక ఎస్‌వో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు నరేష్‌యాదవ్, జయరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న భద్రతా సిబ్బంది

బియ్యం వ్యాపారుల ఘర్షణ

గడివేముల, న్యూస్‌టుడే : పెసరవాయి గ్రామంలో గురువారం రేషన్‌బియ్యం కొనుగోలు చేసే వ్యాపారుల మధ్య ఘర్షణ జరిగింది. వెలుగోడుకు చెందిన ఓ వ్యాపారి గ్రామంలో రేషన్‌బియ్యం కొనుగోళ్లు చేస్తుండగా ఆత్మకూరు ప్రాంతానికి చెందిన మరో వ్యాపారి దాడికి యత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రాంతంలో తాను మాత్రమే కొనుగోలు చేసేలా ఇక్కడి అధికారులతో మాట్లాడుకున్నానని.. నువ్వు ఎలా కొంటావని వెలుగోడు వ్యాపారిపై దాడికి ప్రయత్నించడంతో అతను వెళ్లిపోయారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదువుల్లో రాణించాలని జిల్లా ఉప విద్యాధికారి శంకర్‌ప్రసాద్ సూచించారు. బండిఆత్మకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను క్రమశిక్షణతో విన్నప్పుడే సులభతరంగా అర్థమవుతాయని చెప్పారు. విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. హెచ్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల
(AP SBTET చే గుర్తింపు),
బుగ్గలేటిపల్లె, రాయచోటి రోడ్, కడప.
పాలిసెట్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులకు వెబ్ ఆప్షన్స్ మొదలైనవి. మా యొక్క కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునికమైన ల్యాబొరేటరీస్ మరియు అతితక్కువ ఫీజుతో అన్ని వసతులతో కూడిన హాస్టల్ సౌకర్యం క్యాంపస్ నందే కలదు. MNC కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడును. కావున మా కళాశాలకు మొదటి ఆప్షన్ ఇచ్చి మీ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి.
కళాశాల code - BCTW | కోర్సులు : CSE, ECE, EEE
Contact : 7658983344, 9908045334

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

కరపత్రాల పంపిణీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

వెంకటాపురం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ పాలన కొనసాగిస్తోందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

డోన్, న్యూస్‌టుడే: డోన్ పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ వద్ద 33 కేవీ విద్యుత్తు పనుల కారణంగా శుక్రవారం శ్రీరామనగర్, టీచర్స్‌కాలనీ, వైఎస్సార్‌నగర్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్, నల్లగుట్ట, ఎక్సైజ్ కార్యాలయం ప్రాంతం, లక్ష్మంపల్లె, మల్లెంపల్లె గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్తుకోత ఉంటుందని డీఈఈ నాగేంద్ర తెలిపారు.

కేవీలో తరగతులు ప్రారంభించాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో కేంద్రీయ విద్యాలయం తరగతులను ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండు చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డికి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

దస్త్రాలను పరిశీలిస్తున్న డీసీహెచ్‌వో డా.లలిత

బేతంచెర్ల, న్యూస్‌టుడే: వైద్యులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి డీసీహెచ్‌వో డా. లలిత అన్నారు. గురువారం పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఆసుపత్రిలో అన్ని వార్డుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సీఆర్‌పీ సిస్టం వచ్చే విధంగా చూస్తామని, పోస్టుమార్టం సిబ్బంది లేకపోవడంతో బనగానపల్లికి వెళ్తున్నారని, ఇక్కడే పోస్టుమార్టం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సాగరిక, వెంకటేశ్వర్లు, దంత వైద్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

శిరివెళ్ల, న్యూస్‌టుడే: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఒకటో సచివాలయాన్ని జేసీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం సంబంధించి రెవెన్యూ లాగిన్‌లోని పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

◆ బేతంచెర్ల మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ◆ 'ఈనాడు' ఫోన్-ఇన్‌కు విశేష స్పందన

?: పట్టణంలోని తహసీల్‌పేట కాలనీలో కుళాయిలకు తాగునీరు నాలుగైదు రోజులకోసారి వస్తోంది. మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-రామకృష్ణ, తహసీల్‌పేట.**

✔: సమస్య రాకుండా చూస్తాం. క్రమం తప్పకుండా కాల్వలు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

?: కోటపేట ప్రాంతంలోని పెద్దకబేలాలో పారిశుద్ధ్యం లోపించింది. వర్షాకాలంలో దుర్వాసన వస్తోంది. క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. **-మేకల నాగరాజు, కోటపేట.**

✔: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించి సమస్య లేకుండా చేస్తాం.

?: అల్లాబకాష్ దర్గా ఏరియాలో కంప చెట్లు అధికంగా పెరిగాయి. రాత్రి పూట పాములు, విషకీటకాల బెడద అధికమైంది. **- మౌలాలి, అల్లాబకాష్ దర్గా.**

✔: ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయిస్తాం.

కార్యక్రమంలో కమిషనర్ హరిప్రసాద్ ఇతర అధికారులు

?: రేగిమానుపేట, కోటపేట, చాకలిపేటలో ఉన్న సీసీ రోడ్డును తవ్వేశారు. నేటికీ రోడ్లకు నోచుకోక పోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ ప్రాంతంలోని పార్కు లైన్‌లో సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలి. **- రూబెన్, ఎన్‌జీవో కాలనీ.**

✔: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధుల కోసం రూ.21 కోట్లకు డీపీఆర్ పంపించాం. నిధులు రాగానే మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల నగర పంచాయతీలో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఇబ్బందులు కలగకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. గురువారం 'ఈనాడు' ఫోన్-ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. ప్రధానంగా తాగునీరు, సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలను విన్నవించారు. అన్నింటికి కమిషనర్ సమాధానాలిస్తూ.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

?: పట్టణంలో సంతోష్ మెడికల్ షాపు ఎదురుగా కాల్వలో వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. **- బుగ్గన ప్రసన్నలక్ష్మి, బేతంచెర్ల.**

✔: చెత్తాచెదారం, వ్యర్థాలను కాల్వలో వేస్తే చర్యలు తీసుకుంటాం.

?: దుర్గాపేట కాలనీలో ఉన్న సిద్ధప్ప దేవాలయం పక్కన ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు పైకప్పు లేకపోవడంతో నీటిలో వ్యర్థాలు పడుతున్నాయి. అలాగే పక్కనే ఉన్న మినీ ట్యాంకును శుభ్రం చేయాలి. **- మధు, దుర్గాపేట.**

✔: త్వరలో ట్యాంకుకు పైకప్పు నిర్మాణం చేపడతాం. మినీ ట్యాంకును సిబ్బందితో శుభ్రం చేయిస్తాం.

?: అల్లాబకాష్ దర్గా ఏరియాలో కుళాయిలకు నీళ్లు సరిగా రావడం లేదు. సీసీ రోడ్లు, కాల్వలు శుభ్రం చేయించాలి. **- గోకార్‌బీ, అల్లాబకాష్ దర్గా కాలనీ.**

✔: కుళాయిలకు నీళ్లు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో కాల్వలు, సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తాం.

చాగలమర్రిలో 5న మెగా ఉద్యోగ మేళా

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో ఈనెల 5న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరెస్పాండెంట్ రఘురామ్, కళాశాల ప్రధానాచార్యులు షాబుద్దీన్ తెలియజేశారు. స్థానిక కళాశాలలో గురువారం ఉద్యోగ మేళా కరపత్రాలను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మేళా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహేశ్వరయ్య, కంపెనీ ప్రతినిధి నితిన్ పాల్గొన్నారు.

కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

రైల్వే సమస్యలను పరిష్కరించాలని వినతి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భాజపా నాయకులు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి తీసుకెళ్లారు. కొండపేటలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి ఆమె హాజరు కావడంతో భాజపా నాయకులు స్వాగతం పలికారు. పట్టణంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణం, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్, దొరపల్లె బ్రిడ్జి వద్ద సర్వీసు రోడ్డు నిర్మాణం తదితర సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు

ఎంపీకి ప్రధాని మోదీ చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

ఆమె సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

గుంతల దారి.. ప్రయాణం వేసారి

ప్యాపిలి మండలం ఎస్.రంగాపురం గ్రామంలోని ప్రధాన రహదారి దెబ్బతిని గుంతలు పడ్డాయి. గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే నీరు గుంతల్లో నిలుస్తోంది. ఇలానే ఉంటే రోడ్డు మరింత దెబ్బతినే అవకాశం ఉందని. సంబంధిత అధికారులు రహదారికి మరమ్మతులు చేపడితే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఎస్.రంగాపురం (ప్యాపిలి)

బస్సు ప్రాంగణం.. జలమయం

బనగానపల్లె ఆర్టీసీ బస్టాండు ఆవరణలో చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిపోతోంది. నిత్యం సుమారు వంద బస్సు సర్వీసులు, 3 వేల మందికి పైగా ప్రయాణం చేసే బస్టాండు చిన్నపాటి వర్షానికే నీటి నిల్వ చేరి అధ్వానంగా తయారవుతోంది. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వేసిన సీసీ రోడ్డు నాణ్యత ప్రమాణాలు లేక పోవడంతో బస్సులు లోనికి వచ్చే దారిలో వర్షం నీరు నిల్వ ఉంటోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, బనగానపల్లె

నేర నియంత్రణకు కొత్త వాహనాలు

నేర నియంత్రణలో భాగంగా పట్టణ పోలీసు స్టేషన్‌కు రెండు ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ కేటాయించారు. ఈ వాహనాలతో పోలీసు సిబ్బంది సత్వరం ఘటనాస్థలికి చేరుకోవడం, నేరస్థులను పట్టుకునేందుకు వీలవుతుందని పట్టణ సీఐ యుగంధర్ తెలిపారు. శాంతిభద్రతలను కాపాడే చర్యల్లో భాగంగా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు ఆధునీకరణ దిశగా సాగుతోందన్నారు. -న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

వాలిన స్తంభం.. కూలేందుకు సిద్ధం

కోవెలకుంట్ల మండలంలోని జొలదరాశి గ్రామంలో పాఠశాల దగ్గర ఆర్అండ్‌బీ రహదారి పక్కనే విద్యుత్తు స్తంభం వాలిపోయింది. వర్షాకాలం కావడంతో భారీ గాలులు వీచి స్తంభం కూలే ప్రమాదం ఉంది. పక్కనే పాఠశాల, రోడ్డు ఉండటంతో కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి వెంటనే స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

కార్యాలయం తరలించడం దారుణం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సుదూరంగా ఉన్న భవనంలోకి తరలించాలనుకోవడం దారుణమని, ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యాలయం తరలింపు వద్దని గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వైకాపా నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు.

తెదేపాతోనే సుపరిపాలన సాధ్యం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపాతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి పట్టణంలోని సౌజెల్ వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ

కార్యక్రమంలో జిల్లా తెదేపా అధ్యక్షుడితో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

హయాంలో ప్రజలకు పథకాలు అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైకాపా నాయకులకు మాటలు రావడం లేదన్నారు. వైకాపా అధినేత ఆసాంతం కార్యక్రమాలు చేస్తున్న వారికే మద్దతు ఇస్తున్నారన్నారు. వైకాపా నాయకులు మాయ మాటలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి. కిశోర్, కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మండల కన్వీనర్ హరికుమార్‌రెడ్డి, చింతకుంట శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హరివరం(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని హరివరం బూత్ కమిటీ కన్వీనర్ పెద్ద చంద్రాయుడు అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కరపత్రాల పంపిణీ చేపట్టారు. తెదేపా అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే చేపట్టిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. గ్రామ కోఆప్షన్ సభ్యులు పెద్ద చెన్నడు, సత్యరాజు, పాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపూబ్బ (ప్యాపిలి), న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిందని తెదేపా సీనియర్ నాయకుడు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దపూబ్బ గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోందని తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి రూబెన్ పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణంలో కోటపేట, కోట కిందిపేట కాలనీల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

బేతంచెర్ల,న్యూస్‌టుడే: పట్టణంలో పలు కాలనీల్లో మరమ్మతులకు గురైన విద్యుద్దీపాలకు మరమ్మతులు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాల, దుర్గాపేట కాలనీ, శేషారెడ్డి పాఠశాల, మంగలి వీధి, హనుమాన్ నగర్ తదితర ప్రాంతాల్లో దీపాలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పేదల పక్షాల భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం సీపీఐ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు.

సంజామల, న్యూస్‌టుడే: సంజామలకు శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రానున్నట్లు ఆర్అండ్‌బీ శాఖ డీఈ సునీల్‌రెడ్డి తెలిపారు. సంజామల నుంచి ముదిగేడు వరకు నూతనంగా నిర్మిస్తున్న రెండు వరుసల రహదారి నిర్మాణాన్ని మంత్రి పరిశీలించనున్నారని డీఈ పేర్కొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికచట్టాల పరిరక్షణ కోసం లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని ఈనెల 9వ తేదీన చేపట్టే సమ్మెలో కార్మికులు, ప్రజలు పాల్గొనాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శేబారాణి అన్నారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు అందిస్తున్న సేవలకు వారికి తగిన వేతనం అమలు చేయటంలేదన్నారు.

డోన్, న్యూస్‌టుడే: వేరుసెనగ రాయితీ విత్తనాలు అర్హులంతా ఉపయోగించుకోవాలని ఏడీఏ సునీత సూచించారు. డోన్‌లో పలువురు రైతులకు వ్యవసాయ అధికారులు విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, విస్తరణాధికారులు బెన్నిరాజు, మధు పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే సిబ్బంది వేతనాలు పెంచేలా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు ఎంపీ బైరెడ్డి శబరిని కోరారు. ఈ సందర్భంగా ఆమెకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అన్వర్, అబ్బాస్, గౌస్, చంద్ర, సంజీవుడు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రకాష్‌నాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బోరుబావులకు ఇన్‌లైన్ క్లోరినేషన్ చేస్తున్నామన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం కొలిమిగుండ్లకు వస్తున్నట్లు మండల తెదేపా నాయకులు మూలె రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, జయలక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి గురువారం చెప్పారు. శాంతినగర్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభిస్తారన్నారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సావిత్రి గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీని గురువారం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కుండలు, పాత్రల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆళ్లగడ్డ: 8008 574916 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లె: 80085 73763

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల పట్టణంలోని సప్తగిరి పాఠశాల సమీపంలో పైప్‌లైన్ పగిలి నీరు రహదారిపై ప్రవహిస్తోంది. **- శేఖర్, స్థానికుడు.**

✔: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. **- ప్రకాశ్‌నాయుడు, ఈవోఆర్డీ.**

ప్యాపిలి, న్యూస్‌టుడే: ?: వెంగళాంపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న ట్యాంకు పరిసర ప్రాంతంలో మురుగు నిలుస్తోంది. **- సరస్వతి, కాలనీవాసి.**

✔: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- రంగస్వామి, సర్పంచి.**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: కొత్త ఇందిరానగర్‌లో బసలయ్య ఇంటి సమీపంలో వీధి దీపాలు సరగా వెలగటం లేదు. **- చంద్రశేఖర్, కొత్త ఇందిరానగర్.**

?: వైఎస్ఆర్ నగర్‌లో ట్యాంకు ఉన్న వీధిలో విద్యుత్తు దీపాలు వెలగక రాత్రి వేళ అవస్థలు పడుతున్నాం. **- రాముడు, వైఎస్ఆర్ నగర్.**

?: ఆటోనగర్‌లో విద్యుత్తు స్తంభానికి దీపం సరిగా వెలగడం లేదు. **-శ్రీనివాసులు, ఆటోనగర్.**

✔: సిబ్బందితో వెలగని దీపాలను గుర్తించి సమస్య పరిష్కరిస్తాం.

(పై మూడు సమస్యలకు మున్సిపల్ ఏఈ సురేష్ సమాధానాలు ఇచ్చారు)

ముఖఆధారిత హాజరు తప్పనిసరి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: లబ్ధిదారుల ఇళ్లకు సరకులు సరఫరా చేసేందుకు ముఖఆధారిత హాజరు తప్పనిసరి అని ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో డోన్ నియోజకవర్గ అంగన్‌వాడీ కార్యకర్తలకు పట్టణ సూపర్‌వైజర్ పరమేశ్వరి అధ్యక్షతన ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు.

ప్రాజెక్టు సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శంషాద్‌బేగం

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శోభారాణి, అరుణ, శకుంతల, దేవకృపమ్మ, ఉమారాణి, తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పెంపుడు శునకాలకు టీకాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణంలోని పశువైద్యశాలలో జులై 6వ తేదీ ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్నట్లు పశువైద్య సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. పశువైద్యశాలలో సంప్రదించి వివరాలు నమోదు చేసుకున్న వారి పెంపుడు జంతువులకు టీకాలు వేస్తామన్నారు. జంతువుల నుంచి సంక్రమిత వ్యాధులు మనుషులకు ప్రబలకుండా టీకాలు వేయించాలని సూచించారు.

కాలనీ రస్తా ఆక్రమించేశారు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: అహోబిలం గ్రామంలో కొత్త కొట్టాల చెంచుకాలనీలో రస్తా ఆక్రమణకు గురైంది. ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లేందుకు వీలుగా ప్రభుత్వ రస్తా ఉంది. 30 లింకులు ఉన్న ఈ రస్తాను స్థానికులు ఆక్రమించి లాడ్జి, మరుగుదొడ్లు నిర్మించారు. రాకపోకలకు వీలులేకుండా తడికెలు అడ్డుగా పెట్టారు. బుధవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి రావడంతో కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. రస్తా ఆక్రమణలను తొలగించి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఎమ్మెల్యే ఆదేశించారు.

రహదారి ఆక్రమించడంతో ఇలా...

మత్తుపదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ సీఐ నాగభూషణం, పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం రైళ్లలో తనిఖీల్లో భాగంగా డోన్ రైల్వే ఆర్పీఎఫ్, పట్టణ పోలీసుశాఖ, జీఆర్పీ పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలను గురువారం తనిఖీ చేశారు. నంద్యాల తాలూకా ఎస్సై గంగయ్యయాదవ్, రైల్వే జీఆర్పీ ఎస్సై కుమారి, ఈగల్ టీమ్ నంద్యాల నుంచి డోన్ రైల్వే స్టేషన్ వరకు బోగీలను పరిశీలించారు. డోన్ రైల్వే జీఆర్పీ ఎస్సై బిందు మాధవి, ఈగల్ టీమ్ బృందం ప్రసాద్, మనోహర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్, ప్యాపిలి పట్టణాల్లోని పలు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు నరేంద్ర, సిద్దయ్య గురువారం దాడులు నిర్వహించారు. నిబంధనలకు అతిక్రమించి ఉపయోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్రమైన ఆహారాన్ని నిల్వ చేసినట్లు గుర్తించి, రూ.30 వేల జరిమానా విధించారు. పలు హోటళ్ల యజమానులపై కేసులు నమోదు చేశారు.

ఆయుష్‌కు అనారోగ్యం!

సిబ్బంది కొరత.. వైద్యశాలల మూత

రుద్రవరంలో నర్సుల గదిగా మారి హోమియో వైద్యుడి గది

ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణ, న్యూస్‌టుడే: తక్కువ ప్రభావంతో రోగాలకు చికిత్స విధానాన్ని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్ వైద్యాన్ని ప్రవేశపెట్టింది. చిన్న పాటి జ్వరం వచ్చినా శక్తిమంతమైన యాంటీబయాటిక్స్ వాడాల్సి వస్తుంది. ఇది దీర్ఘకాలంలో రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. అందుకే అల్లోపతి వినియోగం తగ్గించాలని ఆయుష్ (ఆయుర్వేదిక్, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి) మందులను వినియోగించాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

★ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన వైద్య అందించేందుకు ప్రతీ పీహెచ్‌సీలోనూ ఆయుష్ వైద్యశాలను ప్రారంభించింది. ప్రతీ చోటా వైద్యుడిని నియమించారు. ఆ తర్వాత నిర్వహణను ప్రభుత్వం విస్మరించడంతో ఒక్కో కేంద్రంలో ఈ వైద్యసేవలు నిలిచిపోతూ వస్తున్నాయి.

★ అహోబిలం గ్రామంలో ప్రభుత్వం ఆయుర్వేద ఆసుపత్రిని ఏర్పాటుతో పాటు వైద్యురాలిని నియమించింది. తర్వాతి కాలంలో ఈమె బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది.

★ ఆళ్లగడ్డలో ఆయుష్ వైద్యశాలలో వైద్యుడి నియామకం లేక 14 ఏళ్లవుతోంది.

★ రుద్రవరంలో గతంలో హోమియో వైద్యుడిని నియామకం జరిగింది. జీతభత్యాలు సరిగా అందకపోవడంతో తన విధులకు రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఐదేళ్లుగా పోస్టు ఖాళీగానే ఉంది.

★ అహోబిలం, ఆలమూరు, ముత్యాలపాడు పీహెచ్‌సీల్లో ఆయుష్ విభాగాలు ఉన్నా సేవలు మాత్రం శూన్యం.

★ దొర్నిపాడు, శిరివెళ్ల పీహెచ్‌సీల్లో యునాని విభాగాల్లో వైద్యులు లేకపోవడం రోగులకు ఆయుష్ సేవలు అందడం లేదు.

అరకొరగానే మందులు...

★ గ్రామీణ ప్రాంతాల్లో డిస్పెన్సరీల్లో మందుల కొరత వేధిస్తోంది. గతంలో ఆరు నెలలకు ఒకసారి మందులను పంపిణీ చేసేవారు. ఇప్పుడు రెండేళ్లకు ఒకసారి పంపిణీ చేయడం గగనంగా మారింది.

★ యునాని ఆసుపత్రుల్లో మందులు అయిపోయాయి. కనీసం ఒక్క మందు కూడా లేకుండా ఆసుపత్రులు వెలవెలబోతున్నాయి. వైద్యులు కేవలం రోగులను పరీక్షించడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. దీర్ఘకాల వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మందులు లేవని చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

★ మోకాళ్ల నొప్పులు, అజీర్ణం, పక్షవాతం సంబంధిత చికిత్స కోసం రోగులు వస్తుంటారు. వారికి సరిపడా మందులు అందుబాటులో ఉండటం లేదు. తైలాలు, కషాయాల సరఫరా లేకపోవడంతో ప్రైవేటు దుకాణాలను రోగులు ఆశ్రయిస్తున్నారు.

ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి

– రఫీ, ఉపాధ్యాయుడు, ఆళ్లగడ్డ

నేను పదేళ్లుగా ఆయుర్వేదిక్, హోమియో మందులనే వాడుతున్నాను. ఆళ్లగడ్డలో ప్రభుత్వ ఆయుష్ వైద్యం అందుబాటులో లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేటు వైద్యుల వద్దకే వెళ్తున్నాను. ప్రజల కోసం ఆయుష్ వైద్యశాల పనితీరును మెరుగు పరచాలి.

ప్రశాంతంగా మొహర్రం నిర్వహించుకోవాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మొహర్రంను గ్రామస్థులు ఐకమత్యంగా భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ యుగంధర్ కోరారు. గురువారం ఆయన పురపాలిక పరిధిలో పడకండ్ల గ్రామానికి వెళ్లి గ్రామ పెద్దలతో మాట్లాడారు. పీర్ల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు.

పెద్దలతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని అరబ్ మసీదు సమీపంలోని చిన్నమకానం వద్ద అలీఅక్బర్ పీరును గురువారం కొలువుదీర్చారు. ఈనెల 8న అలీఅక్బర్‌పీరు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసుస్టేషన్ సమీపంలో కొలువుదీరిన హసన్ హుసేన్ పీర్ల ఊరేగింపు గురువారం రాత్రి నిర్వహించారు. స్థానిక చావిడిలో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు.

సంజామల, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. గ్రామ పెద్దల సమక్షంలో పీర్లకు కులమతాలకు అతీతంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు

బనగానపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని గురువారం రాత్రి చిన్నసరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఇమాం, ఖాసీం పీర్లకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అన్నవరం పీరు వచ్చి ఇమాం, ఖాసీం పీర్ల వద్ద ఏర్పాటు చేసిన గుండంలో ప్రవేశించి సంప్రదాయాన్ని పాటించారు. ఆస్థానంలో బంగారు పీర్లకు భక్తులు పోటెత్తారు. సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై దుగ్గిరెడ్డి బందోబస్తు నిర్వహించారు.

సదస్సుకు పంపకపోవడం బాధాకరం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ, స్థానిక సంస్థలపై ఈ నెల 3, 4 తేదీల్లో గుడ్‌గావ్‌లో నిర్వహించే జాతీయ సదస్సుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థలు రాష్ట్రం తరపున 25 మందిని పంపతున్నారు కానీ ఉమ్మడి జిల్లాల నుంచి ఎందుకు ప్రాతినిధ్యం వహించకుండా చేశారని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. కేవలం రూలింగ్ పార్టీ వారినే పంపుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సదరు విభాగాలకు లిఖిత పూర్వకంగా మెయిల్ చేసినట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో దస్త్రాల పరిశీలన

సంజామల, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ గురువారం తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆధ్వర్యంలో ఈ నెల 5న లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. చిన్న సమస్యలకు ఘర్షణలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఎస్సై రమణయ్య పాల్గొన్నారు.

భారత్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల
(AP SBTET చే గుర్తింపు).
బుగ్గలేటిపల్లె, రాయచోటి రోడ్, కడప.
పాలిసెట్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులకు వెబ్ ఆప్షన్స్ మొదలైనవి. మా యొక్క కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునికమైన ల్యాబొరేటరీస్ మరియు అతితక్కువ ఫీజుతో అన్ని వసతులతో కూడిన హాస్టల్ సౌకర్యం క్యాంపస్ నందే కలదు. MNC కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడును. కావున మా కళాశాలకు మొదటి ఆప్షన్ ఇచ్చి మీ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి.
కళాశాల code - BCTW | కోర్సులు : CSE, ECE, EEE
Contact : 7658983344, 9908045334

(c) eenadu

తేరుకోని గ్రామాలు

బలియాపాల్‌లో ఇలా...

ఖ్రగాయిలో ఓడ్రాఫ్ జవానులు, ఎంపీ ప్రతాప్ షడంగితో కలిసి వరద పీడిత గ్రామాల్లో పరిస్థితి సమీక్షిస్తున్న ప్రభాతి

● మునిగిన పంటలు.. అన్నదాతల ఆక్రందన ● ప్రభావిత ప్రాంతాల్లో ప్రభాతి పరిడ పరిశీలన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లాకు కోలుకోని దెబ్బ తగిలింది. పది రోజుల వ్యవధిలో రెండుసార్లు ముంచెత్తిన వరదలు రైతన్నల వెన్ను విరిచాయి. లోతట్టు గ్రామాల్లో ఇంకా నీరుంది. నీట మునిగిన వరినారు, కూరగాయలు, ఇతర పంటలు పాడయ్యాయని అన్నదాతలు బావురుమంటున్నారు.

రెండు సమితుల్లో ఎక్కువ నష్టాలు

సువర్ణరేఖ, బుడాబొలంగ, జలకా నదులకొచ్చిన వరదల్లో బాలేశ్వర్‌లోని ఖ్రగాయి, బలియాపాల్, జలేశ్వర్ సమితులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. జలేశ్వర్ తేరుకోగా, మిగతా రెండు సమితుల్లోని గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. తిండికి, మంచినీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని, పశువులకూ గ్రాసం కరవైందని వాపోతున్నారు. 1894 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నీరు వీడిన తరువాత వివరాలు వెల్లడవుతాయి.

ఆదుకుంటాం... ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ గురువారం ఉదయం బలియాపాల్, ఖ్రగాయి ప్రాంతాల్లో విహంగ వీక్షణం చేశారు. తరువాత బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి, ఇతర అధికారులతో మాట్లాడారు. ప్రభాతి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బాధితుల్ని ఆదుకుంటుందని, పంట నష్ట పరిహారం పూర్తిగా చెల్లిస్తామన్నారు. పరిస్థితి కుదుటపడే వరకు రిలీఫ్ పంపిణీ జరుగుతుందని తెలిపారు.

నీరు వీడిన బాలేశ్వర్‌లో పాదయాత్రగా బాధితుల ఇబ్బందుల అధ్యయనం

భారీ వర్షం.. తీవ్ర నష్టం

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేల కొరిగి రాకపోకలకు, విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇళ్లు ధ్వంసమయ్యాయి. యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు చేపడుతోంది.

బాధితులకు ప్లాస్టిక్ పరదాలు అందజేస్తున్న తహసీల్దార్, ఆర్.ఐ.

జయపురంలో బీభత్సం

జయపురం సమితిలో చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి రాకపోకలు ఆగిపోయాయి. 10 గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచి అంధకారంలో ఉన్నాయి. జబాకనాడి, బాయగూడ, సియాడియాలు, అంతా, సోమదాస్‌పూర్, ఘివురి, సర్గిగూడ పంచాయతీల్లో వర్షపు నీరు పొలాల్లో చేరడంతో రైతులు కంట తడి పెడుతున్నారు. ఖయారిముండి, సింధిగావ్, ఉమురి, ధన్‌పూర్, జాముండా, జయంతిగిరి, హడప, కుములిపుట్ ప్రాంతాల్లో 12 ఇళ్లు ధ్వంసమయ్యాయి. తహసీల్దార్ చిత్తరంజన్ పట్నాయక్, ఇంజినీర్ అజయ్ జానీ, ఆర్.ఐ.లు బాధితులకు గురువారం పరదాలు అందజేశారు. – న్యూస్‌టుడే, జయపురం

ధన్‌పూర్ వద్ద ధ్వంసమైన ఇంటి వద్ద బాధితులు

ప్రమాదస్థాయిలో డుడుమ

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లమతపుట్ సమితి మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రానికి చెందిన డుడుమ జలాశయం ప్రమాదస్థాయికి చేరుకుంది. 2,590 అడుగుల నీటి సామర్థ్యం గల ఈ జలాశయంలో బుధవారం 2588.3 అడుగులకు చేరింది. దీంతో ఒక గేటు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు. గురువారం మరో రెండు గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులు దిగువనున్న బలిమెలకు విడుదల చేశారు. – న్యూస్‌టుడే, మాచ్‌ఖండ్

డుడుమ జలాశయం వద్ద వరదనీరు

గుండిచా ఆవరణ ఆనందసాగరం..

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీలోని గుండిచా ఆలయ ఆవరణ ఆనందసాగరాన్ని తలపిస్తోంది. భక్తులతో శారదాబలి కళకళలాడింది. గురువారం ఉదయం 4 గంటలకు ఆలయం తలుపులు తెరిచిన సేవాయత్‌లు జగన్నాథ, బలభద్ర, సుభద్ర సన్నిధిలో మంగళ హారతి, మైలం, అబకాశ, గోపాలవల్లభ సేవలు చేశారు. తదుపరి ప్రారంభమైన దర్శనాలు రోజంతా కొనసాగాయి. శుక్రవారం స్వామి నవమి దర్శనం కీలకమైనది. రథయాత్రలో గుండిచా మందిరంలో నవమి దర్శనం కోటిజన్మల ఫలంగా భక్తులు నమ్ముతారు. రద్దీ ఎక్కువగా ఉంటుందన్న అంచనాతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. శనివారం (5న) తిరుగు (బహుడా) యాత్రగా ముగ్గురు మూర్తులు శ్రీక్షేత్రానికి తిరుగు ప్రయాణమవుతారు. మూడు రథాలు దక్షిణాభిముఖంగా సిద్ధం చేసిన సంగతి తెలిసిందే.

స్వామి సన్నిధిలో బారికేడ్లలో భక్తుల సందడి

6న తెరుచుకోనున్న హిరాకుడ్ గేట్లు

హిరాకుడ్ జలాశయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 6న హిరాకుడ్ జలాశయం గేట్లు తెరవనున్నారు. ఉదయం 9 గంటలకు పూజలు నిర్వహించి ఈ ఏడాదిలో తొలి వరద నీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు హిరాకుడ్ రిజర్వాయరు చీఫ్ ఇంజినీరు సుశీల్‌కుమార్ బెహరా గురువారం విలేకరులకు చెప్పారు. ఇంతవరకు 7వ నెంబరు స్లూయిస్ గేటు తెరవాలని నిర్ణయించామని, వర్షపాతం, ఛత్తీస్‌గఢ్ నుంచి విడుదలవుతున్న వరదనీరు పరిస్థితిపై సమీక్షించిన తర్వాత ఎన్ని గేట్లు తెరవాలన్నదానిపై ఆదివారం తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. హిరాకుడ్ జలాశయం సామర్థ్యం 630 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 603.02 అడుగులు ఉందన్నారు. సెకనుకు 60 వేల నుంచి లక్ష క్యూసెక్కుల నీరు ప్రవేశిస్తోందని, 40 వేల క్యూసెక్కులు కాలువలకు విడుదల చేస్తున్నామన్నారు. హిరాకుడ్ గేట్లు తెరిచినా మహానది, ఉపనదులకు వరద ముప్పు ఉండబోదన్నారు. ఒకవేళ మహానది, వైతరణి పరివాహక ప్రాంతంలో భారీగా వర్షాలు కురిస్తే నదుల్లో ప్రవాహాలు పెరుగుతాయన్నారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల జలవనరుల నిపుణులతో నిత్యం సంప్రదిస్తున్నామని, అన్ని కోణాల్లో సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. మరోవైపు జలవనరులశాఖ ప్రొక్యూర్మెంట్ చీఫ్ ఇంజినీరు సాగర్ మహంతి భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని నదులు ప్రమాదస్థాయికి దిగువన ప్రవహిస్తున్నాయని, బాలేశ్వర్ జిల్లాల్లో సువర్ణరేఖ, జలకా, బుడాబొలంగ నదులు శాంతించాయని తెలిపారు.

నాలుగు నెలల్లో బాధితులకు చిట్‌ఫండ్ సొమ్ము

మోహన్‌చరణ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చిట్‌ఫండ్ బాధితులకు నాలుగు నెలల్లోగా ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తెలిపారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో సీఎం అధికారులతో సమీక్షించారు. ఇంతవరకు 1,26,137 మందికి రూ. 43.07 కోట్లు చెల్లింపులు జరిగాయని, త్వరలో మరో 5 లక్షల మందికి సొమ్ము అందజేస్తామని విలేకరులకు చెప్పారు. చిట్‌ఫండ్ బాధితుల సంఖ్య 20 లక్షలమందికిపైగా కాగా, నాలుగు చిట్ సంస్థల్లో వారంతా సొమ్ము పొదుపు చేసి మోసపోయారు. 2015 నుంచి బాధితులు తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. నాటి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఆయా కంపెనీల యజమానులను అరెస్ట్ చేసి ఆస్తులు స్వాధీనం చేసుకొంది. అందరికీ న్యాయం చేస్తామని ఆనాటి బిజద పెద్దలు చెప్పినా మాట నిలబెట్టుకోలేదు. గతేడాది ఎన్నికలకు ముందుగా భాజపా మేనిఫెస్టోలో చిట్‌ఫండ్ బాధితులందరికీ సొమ్ము చెల్లిస్తామని చెప్పింది.

సాంస్కృతిక కేంద్రాలకు ప్రాధాన్యం: సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రాచీన సాంస్కృతిక కేంద్రాల పునరుద్ధరణకు, అంతరిస్తున్న కళలకు ప్రాధాన్యమివ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. గురువారం సాయంత్రం భువనేశ్వర్‌లోని ఐఆర్‌సీ విలేజి పరిధిలో కొత్తగా నిర్మాణమైన శబరి సాంస్కృతిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక కేంద్రాల్లో ఏటా ఉత్సవాలు చేపట్టి గౌరవం పెంచుతామని, కళాకారులను సత్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండొ, నవరంగపూర్ ఎంపీ బలభద్ర మాఝి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక భవనం ప్రారంభిస్తున్న సీఎం

బురద దారిలో నిండు చూలాలికి నరకం

గర్భిణిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా వాహనం బురదలో ఇరుక్కోవడంతో రెండు గంటలు నరకం చూసిన ఘటన కొరాపుట్ జిల్లా కుంద్ర సమితిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కెరమెటి పంచాయతీ పాండ్రిమాటి గ్రామానికి చెందిన అజయ్ శాంటా భార్య లక్ష్మీ శాంటాకు గురువారం ప్రసవ వేదన మొదలవడంతో జననీ ఎక్స్‌ప్రెస్(అంబులెన్స్)కు సమాచారం ఇచ్చారు. ఆమెను వాహనంలో తీసుకెళ్తుండగా బురద రోడ్డులో అంబులెన్స్ కూరుకుపోయింది. స్థానికులు రెండు గంటలు శ్రమించి ట్రాక్టర్ సాయంతో బయటకు తీశారు. అనంతరం ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. – న్యూస్‌టుడే, జయపురం

ట్రాక్టర్ సహాయంతో అంబులెన్స్‌ను లాగుతున్న దృశ్యం

ఇండో - అమెరికా సంబంధాలు బలీయమైనవి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఇండో-అమెరికా సంబంధాలు బలీయమైనవని, రెండు దేశాల మధ్య వాణిజ్య, సాంస్కృతిక, స్నేహ బంధం ముడిపడి ఉందని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. గురువారం సాయంత్రం అమెరికాలోని మొనంటా నుంచి 10 మందితో కూడిన ప్రతినిధుల బృందం రాజ్‌భవన్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా వారితో గవర్నరు మాట్లాడుతూ... ఒడిశా కళలు, సాంస్కృతిక వైభవం గురించి వివరించారు.

అమెరికా ప్రతినిధులతో గవర్నరు ముచ్చట

నీలాద్రి బిజెలోగా భాండాగారం పనులు పూర్తి



గజపతి దివ్యసింగ్‌దేవ్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జగన్నాథుని రత్నభాండాగారం మరమ్మతులు నీలాద్రి బిజె (8న) లోగా పూర్తయ్యే సూచనలు ఉన్నాయని, పురావస్తుశాఖ (ఏఎస్ఐ) అధికారులు శ్రద్ధగా విధులు నిర్వహిస్తున్నారని పూరీ రాజు గజపతి దివ్యసింగ్ దేవ్ చెప్పారు. గురువారం శ్రీక్షేత్ర పాలనాధికారి అరవింద పాడితో కలిసి రత్నభాండాగారం పనులు పరిశీలించిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఎస్ఐ అధికారులు బాధ్యతగా పనులు చేయిస్తున్నారని, తమ అంచనా ప్రకారం రెండు, మూడు రోజుల్లో పనులు ముగుస్తాయన్నారు. అనంతరం ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఇదివరకు ఏర్పాటైన అధ్యయన సంఘం పర్యవేక్షణలో స్వామి సంపద లెక్కింపు జరుగుతుందన్నారు. పాలనాధికారి విలేకరులతో మాట్లాడుతూ... పనులన్నీ పూర్తయ్యాయని, లోపల 600 గ్రానైట్ రాళ్లు కొత్తగా అమర్చారని, స్టీల్ ఫ్రేమింగ్ జరిగిందన్నారు. భాండాగారం ప్రధాన ద్వారం, వెలుపల స్వల్పంగా పనులు జరుగుతున్నాయన్నాయన్నారు. ప్రధాన ద్వారం తలుపులు బర్మాటేకు కలపతో నిర్మాణం జరుగుతోందని, దీన్ని అమర్చిన తర్వాత వెండి తాపడం చేయించాలని నిర్ణయించామన్నారు.

విధుల్లో చేరండి: సురేష్

సురేష్ పూజారి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఓఏఎస్, ఓఆర్ఎస్ అధికారులు ఆందోళన వీడి విధుల్లో చేరాలని రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి కోరారు. గురువారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీఎంసీ సహాయ కమిషనర్ రత్నాకర్ సాహూపై దాడి ఘటనలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుందన్నారు. అయిదుగురిని వెంటనే అరెస్ట్ చేశారని, పోలీసుల దర్యాప్తు జరుగుతోందని, ఘటన వెనుక ఉన్నవారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. అధికారులు సహాయ నిరాకరణ వీడాలని కోరారు.

ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచండి

రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని కేంద్రానికి రాష్ట్ర సర్కారు విన్నవించింది. మూడు రోజుల దిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రి కృష్ణచంద్రపాత్ర్ ఆ శాఖ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి ఈ మేరకు విన్నవించారు. గత సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి బకాయిల గురించి చర్చించారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా జరుగుతున్న బియ్యం సరఫరాలో ఆలస్యంపై విన్నవించారు. అనంతరం దిల్లీ ఆహార శాఖ మంత్రి, పీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి శక్తికాంతదాస్ తదితరులను కలిసి ఆయా సమస్యలను వివరించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ప్రహ్లాద్ జోషికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కృష్ణచంద్ర

ఐఏఎస్ సీనియర్ అధికారి బిష్ణుపదకు ఊరట

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఐఏఎస్ సీనియర్ అధికారి బిష్ణుపద శెఠికి గురువారం హైకోర్టులో ఊరట లభించింది. న్యాయస్థానం ఆయనకు ఇంటీరియం బెయిల్ మంజూరు చేసింది. ప్రజా పనుల శాఖకు సంబంధించి ఒక కాంట్రాక్టు మంజూరులో ఆ సంస్థతో ఆయన రూ.10 లక్షల డీల్ కుదుర్చుకున్నారన్న అభియోగం మేరకు సీబీఐ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున శెఠి హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 8న విచారణ జరగనుండగా, తాత్కాలిక బెయిల్ మంజూరైంది.

ప్రపంచ పోటీల్లో రాష్ట్ర పోలీసుల సత్తా

భగవాన్ రెడ్డి

సుమన్ శేఖర్ దాస్

బ్రహ్మపుర క్రీడలు, రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలు - 2025లో ఇప్పటికే ఓ స్వర్ణం, రజత పతకాలను సాధించిన ఒడిశా పోలీసులు గురువారం వివిధ కేటగిరీల్లో మరో మూడు స్వర్ణాలు దక్కించుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ అండర్-64 కిలోల విభాగంలో కానిస్టేబుల్ భగవాన్ రెడ్డి, 84 కిలోల విభాగంలో సుమన్ శేఖర్ దాస్ బంగారు పతకాలు సాధించారు. ఇదివరకు 800 మీటర్ల పరుగులో స్వర్ణం దక్కించుకున్న కానిస్టేబుల్ అశోక్ దండసేన, 1500 మీటర్ల కేటగిరీలోనూ మరో స్వర్ణం గెలిచారు. మహిళల కేటగిరీలో 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకంతో సరిపెట్టుకున్న సుస్మిత తిగ్గా 1500మీ. లో బంగారు పతకం సాధించారు. ఒడిశా డీజీపీ యోగేశ్ బహదూర్ ఖురానియా విజేతలను అభినందించారు.

జగన్నాథుడికి శ్రీరాముని అవతారం

బ్రహ్మపురలో గుసానినువాగాంలోని గుండిచా మందిరంలో గురువారం సాయంత్రం జగన్నాథ స్వామిని శ్రీరామునిగా, బలభద్ర స్వామిని బలరామ అవతారాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల మిఠాయిల్ని స్వాములకు నైవేద్యంగా సమర్పించారు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

ఐక్యంగా అడుగేయ్... నిర్లక్ష్యంపై అడిగేయ్

చందహండిలో వర్షపునీటిలో మునిగిన గొట్టపుబావి

జోరిగావ్ సమితి కలియాపరా గ్రామానికి చెందిన మహిళకు రెండు నెలల క్రితం పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను ఆసుపత్రిలో చేర్చేందుకు గ్రామానికి అంబులెన్స్ రాకపోవడంతో, ఇతర వాహనాలు లేక, అతి కష్టంగా రెండు కిలోమీటర్లు నడిపించుకుని తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్చారు.

డాబుగావ్ సమితి కుసుమఖుంటి గ్రామానికి చెందిన గర్భవతి ప్రసవ వేదనతో బాధపడుతుండడంతో రహదారి సరిగా లేక డోలీపై మోసుకెళ్లారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లిన మనోహర్ రంధారి (ప్రస్తుత డాబుగావ్ ఎమ్మెల్యే) గర్భవతిని మోయడంలో సహకరించారు. గెలిచినా వెంటనే గ్రామానికి రహదారి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు.

నవరంగపూర్, న్యూస్‌టుడే

అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న నవరంగపూర్ జిల్లాలో పలు గ్రామాలకు సరైన రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలు తవ్వకపోవడంతో వర్షపునీరు రహదారులపైకి చేరి పాడవుతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు తర్వాత విస్మరిస్తున్నారు. జిల్లాలో 5,425 కిలోమీటర్ల పొడవున రహదారులు ఉన్నాయి. చాలా రోడ్లు నడవడానికి వీలు లేకుండా ఉండడంతో ఆందోళనలు చేపట్టడానికి. నేతలను నిలదీయడానికి స్థానికులు సిద్ధపడుతున్నారు. ఎందుకు తమ ప్రాంతంపై ఇంత చిన్నచూపని ప్రశ్నిస్తున్నారు.

నవరంగపూర్ జిల్లాలోని మైదల్‌పూర్-రాబణగూడకు నాలుగు కిలోమీటర్ల రహదారి బురదమయం కావడంతో గ్రామస్థులు పలు మార్లు వరినాట్లు వేసి నిరసన తెలిపారు.

జిల్లాలో ఉన్న 60 శాతానికిపైగా రహదారులు తీవ్రంగా మరమ్మతులకు గురయ్యాయి. ఏటా రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తోంది. ప్రయోజనం కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు.

దృష్టి సారిస్తాం

గ్రామీణ రహదారుల నిర్మాణ శాఖ అధికారులు, పారిశుద్ధ్య వ్యవస్థ నిర్వహణ శాఖాధికారులతో చర్చించి రహదారుల నిర్మాణంపై దృష్టి సారిస్తాం. అవసరమైన చర్యలు తీసుకుంటాం.– **శుభంకర్ మహాపాత్ర్, పాలనాధికారి**

తప్పని డోలీ మోత

గ్రామీణ ప్రాంతాలకు సరైన రహదారులు లేకపోవడంతో అత్యవసర సమయంలో డోలీల్లో మోసుకెళుతున్నారు. రోగులు, గర్భవతులు ఆసుపత్రికి చేరేంతవరకు ప్రాణాలపై ఆశలు వదులుకుంటున్నారు. మనిషి చనిపోయిన తర్వాత శ్మశానం వరకు మోసుకెళ్లడానికి కూడా సరైన రహదారులు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని జిల్లా ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీలు లేక వర్షపునీరు ఇళ్లలో చేరడంతోపాటు పలు చోట్ల గొట్టపుబావులు మునిగిపోవడంతో తాగేందుకు నీళ్లు దొరకడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి పక్కా రహదారులు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మైదల్‌పూర్-రాబణగూడ రహదారిపై వరి నాట్లు వేస్తున్న గ్రామస్థులు

అధ్వానంగా చందహండికి వెళ్లే రహదారి

పొలాల నుంచి మృతదేహాన్ని మోసుకెళ్తూ..

(c) eenadu

వర్షాలకు 30 ఇళ్లు ధ్వంసం

చెంపపుట్‌లో కూలిన ఇంటి గోడ వద్ద బాధితుడు

కొరాపుట్ జిల్లాలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో గురువారం 678.8 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా అత్యవసర విభాగాధికారి జ్ఞానేంద్ర త్రిపాఠి తెలిపారు. అత్యధికంగా దశమంత్‌పూర్‌లో 110 మి.మీ.లు, కొరాపుట్‌లో 96.2 మి.మీలు, బొయిపరిగుడ, జయపురంలో 73 మి.మీ., బందుగాంలో 11 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. బుధవారానికి జిల్లాలో 30 ఇళ్లు ధ్వంసమైనట్లు తెలిపారు. సుందర్‌గఢ్ నగరంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు చేరి ప్రజలు ఇక్కట్లు పడ్డారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్డెక్కిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, సిమిలిగుడ

బీఈఎంసీలో పంచాయతీల విలీనం అంశంపై చర్చ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) కమిషనర్ ప్రథమేష్ అరవింద్ రాజెషిర్కేను గురువారం సహారొతొళి అంచొలొ మిళిత క్రియానుస్థాన్ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ అధ్యక్షుడు సంజీబ్ కుమార్ పట్నాయక్ నాయకత్వంలో కమిటీ ప్రతినిధుల బృందం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసింది. నగర శివారులోని 18 పంచాయతీలు బీఈఎంసీలో విలీనం అంశంపై కమిషనర్ రాజెషిర్కేతో చర్చించారు. బృందంలో కమిటీ ప్రతినిధులు దేబీప్రసాద్ దాస్, టి.సుదేశ్ కుమార్ పాత్ర్, బి.వి.సాగర్, అజిత్ పట్నాయక్, దిగంబర సామంత్రాయ్, జితేంద్ర కుమార్ పాఢి తదితరులున్నారు.

బీఈఎంసీ కమిషనర్ రాజెషిర్కేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిటీ ప్రతినిధి

బ్రహ్మపురలో జానపద జాతర

కళా బృందాలతో ఊరేగింపులో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బరిష్ఠ (సీనియరు) కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మపురలో రెండు రోజుల జానపద జాతర గురువారం ముగిసింది. ఉదయం గాంధీనగర్ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహం నుంచి కళా బృందాలతో భారీ ఊరేగింపు జరిగింది. ఇది గిరి మార్కెట్ రోడ్డులోని ప్రకాశం హాలు వరకూ కొనసాగింది. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు, బృందాలు కర్ర, కత్తి సాము, అగ్నితో విన్యాసాలు, ఆదివాసీ నృత్యాలు, గంజాం జిల్లా జానపద నృత్యాలు, ఘంట, మృదంగ వాద్యాలు తదితరాలు ప్రదర్శించి ప్రజల్ని విశేషంగా ఆకట్టుకున్నారు.

ఆకట్టుకున్న ఫొటోగ్రఫీ మేళా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: తగర వాస్తు శిల్పులు బుధవారం సాయంత్రం రాజధాని నగరంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ మేళా చూపరులను ఆకట్టుకుంది. తగర వాస్తుశిల్పకళ వ్యవస్థాపకులు లీతా మహంతి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ మేళాకు విశేష స్పందన లభించింది. ఒడిశా కళలు, వాస్తుశిల్పకళ అనే అంశంపై చర్చించారు. మేళాలో పలు చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. అనంతరం పలు చిత్రాలతో కూడిన అల్బమ్‌ను అతిథులు ఆవిష్కరించారు. సత్యజిత్‌రే చిత్ర, టెలివిజన్ సంస్థ సంచాలకుడు శేఖర్ ఖటువా, ఒడిశా మ్యూజియం సూపరింటెండెంట్ భారతి పాల్, బీ.కే. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ సెఠి పాల్గొన్నారు.

అల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజిలెన్స్‌కు చిక్కిన ఇంజినీరు

డిలేశ్వర్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బొలంగీర్ జిల్లా టిట్లాగఢ్ ప్రజా పనుల శాఖ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఏఈఈ) డిలేశ్వర్ మాఝి గురువారం విజిలెన్స్‌కు చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగున్నారన్న అభియోగం మేరకు.. విజిలెన్స్ అధికారులు టిట్లాగఢ్, సంబల్‌పూర్, ఝార్సుగూడ, బ్రజరాజనగర్‌లలో 6 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు. విలాసవంతమైన భవనాలు, షాపింగ్‌మాల్, నగలు, నగదు, ఇతర ఖరీదైన సామగ్రి, బ్యాంకు డిపాజిట్లున్నాయి.

గుణుపురం రామావతారంలో జగన్నాథుడు, బలరామునిగా బలభద్రుడు

ఖరగ్‌పూర్‌లో వెండి కిరీటాలతో ముగ్గురు మూర్తులు

రాయగడ పట్టణంలో..

పర్లాఖెముండిలో శ్రీకృష్ణ అవతారంలో..

కోదండ రామునిగా జగన్నాథుడు

రాష్ట్ర వ్యాప్తంగా జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గుండిచా మందిరానికి చేరుకున్న జగన్నాథుడు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నాడు. గురువారం కోదండ రాముని అవతారంలో జగన్నాథుని దర్శించుకున్న భక్తులు విశేష పూజలు చేశారు.
– న్యూస్‌టుడే, రాయగడ పట్టణం, గుణుపురం, జయపురం, పర్లాఖెముండి, ఖరగ్‌పూర్,

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు రాష్ట్ర బాలలు

పోటీలకు ఎంపికైన బాలబాలికలు. చిత్రంలో సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో ఈ నెల 5 నుంచి 7వరకు జరగనున్న జాతీయ మినీ, బాలల ఫెన్సింగ్ పోటీలకు రాష్ట్ర బాలబాలికలు వెళ్తున్నట్లు క్రీడాశాఖ 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఆశాఖ సహకారంతో బొలంగీర్‌లోని రాజేంద్ర నారాయణ సింగ్‌దేవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన శిబిరంలో బాలబాలికలను ఎంపిక చేసి పోటీలకు పంపుతున్నట్లు రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం ప్రతినిధులు చెప్పారు.

జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు: బ్రహ్మపుర క్రీడలు: గంజాం జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధి కమిటీ సౌజన్యంతో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం తరపున బ్రహ్మపురలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఇంజినీరింగ్ స్కూల్ క్రీడామైదానంలోని ఇండోర్‌హాల్లో ఈనెల 6 వరకు జరుగుతున్న పోటీల్లో జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన బాలబాలికలు పోటీపడుతున్నారు. ఇందులో అండర్-11, 13, 15, 19, సీనియర్ కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్ మ్యాచులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి అండర్-11, 15 కేటగిరీలలో బాలబాలికలకు సింగిల్స్ మ్యాచులు జరిపారు. సాయంత్రం ఏర్పాటైన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ బాగా ఆడి ప్రతిభ చాటాలన్నారు.

మొక్కలు నాటండి.. పచ్చదనం పెంచండి

జయపురం, పర్లాఖెముండి, సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని వక్తలు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జయపురంలో కొరాపుట్ జిల్లా న్యాయమూర్తి ప్రదీప్ కుమార్ మహంతి, న్యాయమూర్తి సంతోష్ బారిక్, న్యాయవాదులు విష్ణు ప్రసాద్, ప్రద్యుమ్న సుజాత, పర్లాఖెముండిలో న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి బిమల్ రౌళా, ప్రిన్సిపల్ వై. ధర్మారావు, క్రీడా ఉపాధ్యాయుడు సురేంద్ర పాత్ర్, ఫారెస్టర్ సంతోష్ సాహు, సిమిలిగుడలో నాల్కో కార్యనిర్వాహక సంచాలకుడు నిరంజన్ సామల్, జనరల్ మేనేజర్ ఆనంద్ బాసు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కనాటి నీరు పోస్తున్న న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి బిమల్ రౌల్

మొక్కలు నాటుతున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

మొక్క నాటుతున్న న్యాయమూర్తి ప్రదీప్ కుమార్

అందరిలో సేవా స్ఫూర్తి ఉండాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరిలో సేవా స్ఫూర్తి ఉండాలని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. గురువారం దశమంత్‌పూర్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన సత్యసాయి శత జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయి భక్తులు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మార్కండేశ్వర, కోఆర్డినేటర్ అజిత్ పాత్ర్, సమితి ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన భక్తులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



భక్తులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

అశ్లీల నృత్యాలు నిషేధించాలి

పాలనాధికారి కార్యాలయం వద్ద సంఘ సభ్యులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నాటకాల్లో అశ్లీల నృత్యాలు నిషేధించాలని జిల్లా శబరి శ్రీక్షేత్ర నట గురువు సంఘం అధ్యక్షుడు చైతన్య సౌరా డిమాండ్ చేశారు. గురువారం పాలనాధికారి శుభంకర్ మహాపాత్రకు వినతిపత్రం అందజేశారు. నాటికల ద్వారా బాల్య వివాహాలు, బాల కార్మికులు, మహిళలపై అత్యాచార ఘటనల నిర్మూలించేలా సమాజాన్ని చైతన్యం చేస్తున్నామన్నారు. ఇటీవల పలువురు నాటకాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శించడం చెడు ప్రభావం చూపుతాయన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

'రాష్ట్రేతర తెలుగు సమాఖ్య' పదో వార్షికోత్సవాలు ఇటీవల కొచ్చిన్ (కేరళ)లో జరిగాయి. 'రాతెస' ఈస్టర్న్ ఇండియా జోనల్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బ్రహ్మపురకు చెందిన తెలుగు ప్రముఖుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు)ను వేడుకల్లో అతిథులు సత్కరించారు.
–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

జగన్నాథుని దర్శించుకున్న పాతపట్నం ఎమ్మెల్యే

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం రాత్రి పర్లాఖెముండిలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాల్లో పాల్గొన్నారు. గుండిచా మందిరంలో జగన్నాథ, బలరామ, సుభద్రలను దర్శించుకున్న ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆయనను సత్కరించి జగన్నాథ చిత్రపటాన్ని అందజేసింది. భాజపా పట్టణ అధ్యక్షుడు వసంత కుమార్, సైలాడ సర్పంచి గిన్ని లక్ష్మణ్ రెడ్డి, నాయకులు అనపాన రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవతా మూర్తులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

వెతలు కనరు.. సమస్య తీర్చరు

నవరంగపూర్ జిల్లా చందహండి సమితి పట్టాలియా పంచాయతీ నుంచి పహోజారి గ్రామ రహదారి అధ్వానంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు బురదమయంగా మారి అడుగు తీసి వెయ్యలేని పరిస్థితి. 5 కిలోల రేషన్ బియ్యం కోసం వేరే మార్గంలో రూ.100 ఖర్చవుతోందని వాపోయారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.
– న్యూస్‌టుడే, నవరంగపూర్

సుదర్శన్ అకౌంట్ హ్యాక్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీకి చెందిన ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ అఫీషియల్ 'ఎక్స్' అకౌంట్ ఆరు రోజులుగా హ్యాక్ అయింది. దీనిపై తాను సైబర్ సెల్ అధికారులకు ఫిర్యాదు చేశానని, అభిమానులందరికీ దీనిపై తెలియజేస్తున్నట్లు పట్నాయక్ గురువారం పూరీలో విలేకరులకు తెలిపారు.

పులి పాదముద్రల కలకలం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ జిల్లా జితుసోల్ ప్రాంతంలో గురువారం ఉదయం పులి పాదముద్రలు కలకలం రేపాయి. గతంలోలా రాయల్ బెంగాల్ టైగర్ ఈ ప్రాంతంలోనికి ప్రవేశించి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు ఎటువంటి వివరాలు తెలపలేదు.

మందిర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పురోహితులకు చెక్కును అందజేస్తున్న దాత మినతి సామల్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజా వీధిలో జగన్నాథ మందిర నిర్మాణం పనులకు గురువారం కరణం వీధికి చెందిన మినతి సామల్ రూ.లక్ష చెక్కును పురోహితులకు అందజేశారు. దాత మాట్లాడుతూ మందిర నిర్మాణంలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు.

బర్మొండా మైదానం పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

బర్మొండా మైదానంలో కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గురువారం భువనేశ్వర్‌లోని బర్మొండా మైదానం పరిశీలించారు. ఈ నెల 11న పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ భువనేశ్వర్ వస్తున్న సంగతి తెలిసిందే. బర్మొండాలో ఏర్పాటయ్యే బహిరంగ సభలో పాల్గొంటారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు అజయ్‌కుమార్ లల్లూ, పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, సీఎల్పీ నేత రామచంద్ర కడం మైదానాన్ని పరిశీలించారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం అనుగుల్ జిల్లా సందర్శనార్థం వచ్చి తాల్చేరు తొలిసాహిలోని గుండిచా మందిరం జగన్నాథ, బలభద్ర, సుభద్రల సన్నిధిలో పూజలు చేశారు.
–న్యూస్‌టుడే, భువనేశ్వర్

డీఆర్ఎం పరిశీలన

జయపురం: వర్షాల కారణంగా బుధవారం రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన విషయం విదితమే. గురువారం వాల్తేరు డివిజన్ డీఆర్ఎం లలిత్ బెహరా పరిస్థితిని పరిశీలించారు. 300 మంది సిబ్బంది, 13 జేసీబీల సాయంతో మట్టి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

పట్టాలపై మట్టి తొలగింపు పనులు

సమాచారం ఉంటే సహకరించండి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ గుండిచా మందిరం వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఎవరి వద్దనైనా వీడియో దృశ్యాలు, ఇతర ఆధారాలుంటే తెలియజేయాలని అధికారులు కోరారు. ఈ నెల 9న దర్యాప్తు అధికారిణి అనూగార్గ్ పూరీలోని ప్రభుత్వ సర్క్యూట్ అతిథి భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు, మళ్లీ 10న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజల్ని కలుస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పర్లాఖెముండి: పర్లాఖెముండి నుంచి 70 మందికి పైగా ప్రయాణికులతో రామగిరి వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి గజపతి జిల్లా రామగిరి ఠాణా పరిధిలోని రాసీబడి ఘాట్ కిందకి దూసుకెళ్లి బండరాయిని ఢీకొట్టింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఓపీజీసీ అధికారులతో సింగ్‌దేవ్ భేటీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ గురువారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో ఒడిశా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు. విద్యుత్తు శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సింగ్‌దేవ్ ఉత్పత్తి, గ్రిడ్ స్టేషన్ల పరిస్థితి సమీక్షించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి

కోతకు గురై.. రాకపోకలు నిలిచి

నవరంగపూర్, న్యూస్‌టుడే: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నవరంగపూర్ జిల్లా జొరిగావ్ సమితి దొర్ర వద్ద నాగి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గురువారం నదిపై ఉన్న రహదారి కోతకు గురైంది. నవరంగపూర్ -ఉమ్మర్‌కోట్ జాతీయ రహదారి-39లో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి.

వృక్షాలు నేలకొరిగి.. విద్యుత్తు సరఫరా నిలిచి..

విరిగిన చెట్టు కొమ్మలు తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి దశమంతపూర్ పంచాయతీలో జాతీయ రహదారి 326పైన గుంటగూడ, టాపజోడి చౌక్‌వద్ద వృక్షాలు నేలకొరిగి రాకపోకలు, విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. గురువారం వర్షం తగ్గుముఖం పట్టడంతో అగ్నిమాపక, విద్యుత్తు శాఖల సిబ్బంది చర్యలు చేపట్టారు.

5నుంచి కొరాపుట్‌లో ధర్మేంద్ర పర్యటన

ధర్మేంద్ర ప్రధాన్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ నెల 5, 6 తేదీల్లో కొరాపుట్ జిల్లాలో పర్యటించనున్నారు.

మహిళా హోంగార్డ్ దుర్మరణం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని ఛాత్రబజార్ ప్రాంతంలో గురువారం సైకిల్‌పై వస్తున్న హోంగార్డ్ మనోరమ పండా (40)ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఘటనా స్థలంలో ఆమె మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించి, లారీ చోదకుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డగా దుండగులు దోచుకెళ్లిన ఘటన జయపురం సమితిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అంబాగూడ పంచాయతీ హడియా గ్రామానికి చెందిన నలుగురు రైతులు గురువారం ఎస్‌బీఐ బ్యాంకులో నుంచి రూ.3.90లక్షలు తీశారు. సంచుల్లో డబ్బులు పెట్టుకొని తిరిగి వెళ్తూ గాంధీ చౌక్

బొత్రకు చెందిన రూ.1లక్ష నగదున్న సంచితో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మూడు ఇళ్లల్లో చోరీ

పర్లాఖెముండి: ఒకేసారి మూడు ఇళ్లల్లో

చికిత్స పొందుతూ మృత్యువాత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి

రైలు పట్టాలపై మృతదేహాలు లభ్యం

పాము కాటుకు యువకుడి మృతి

అరుగాలం కష్టం దొంగలపాలు

ఒడిశాకు చెందిన మరో ఇద్దరి అదృశ్యం

జూద శిబిరంపై దాడి

EENADU eClassifieds
REAL ESTATE
HOUSE FOR SALE
JOBS
SECURITY GUARDS
ప్రకటన చిన్నదైనా స్పందన అధికమే ఈనాడు క్లాసిఫైడ్స్
ఈనాడు
Cell: 80085 97609
Cell: 80081 11237

గ్రామాల్లో శుభ్రత తప్పనిసరి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ఆదేశించారు. గురువారం మండలంలోని పెదబుడ్డిడిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా హరితరాయబారులకు అందజేయాలన్నారు. రోజూ పల్లెల్లో శానిటేషన్ చేయాలని సూచించారు. తాగునీటి రక్షిత పథకాల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఎంపీడీవో కె.ధర్మారావు తదితరులు ఉన్నారు.

ఎదురెదురుగా బస్సు, లారీ ఢీ

● ఒకరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

కనమర్లపూడి(శావల్యాపురం), న్యూస్‌టుడే: వేగంగా ప్రయాణిస్తున్న ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మార్గంలో పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కనమర్లపూడి ఎస్సీ కాలనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా ఛాంపియన్ గ్రామానికి చెందిన జితేందర్ బిసోయ్ (30) టమాటాల లోడు కోసం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు బయలు దేరాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి 40 మంది ట్రావెల్స్ బస్సులో కాశీ యాత్రకు వెళ్తుండగా కనమర్లపూడి వద్ద బస్సు డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో పాటు డ్రైవరు జితేందర్ బిసోయ్ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. అతన్ని కాపాడేందుకు స్థానికుల ప్రయత్నం ఫలించలేదు. బస్సులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని శావల్యాపురం, నూజండ్ల 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై సంఘటన చోటు చేసుకోవడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రూరల్ సీఐ కె.ప్రభాకరరావు, ఎస్సైలు పోక్లెయిన్ సాయంతో లారీ, బస్సును వేరు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. బస్సులో ఉన్న ధనలక్ష్మి, సాయి పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్లీనర్ గోపాల్ బిసోయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ప్రభుత్వ బడి.. వసతులు కొరవడి

న్యూస్‌టుడే- వీరఘట్టం, సీతంపేట, భామిని, మెంటాడ, పాచిపెంట

గత ప్రభుత్వ పాలనలో నాడు-నేడు పేరిట రూ.కోట్లు ఖర్చు చేసి అవసరం లేని చోట్ల అదనపు భవనాలు నిర్మించారు. అవసరమైన చోట గాలికొదిలేశారు. జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కూడా లేని దుస్థితి. వంట శాలలు సైతం లేక ఆరుబయట వంటలు చేస్తున్నారు. ఇటీవల పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం.

మండలం	పాఠశాలలు	శిథిల భవనాలు	వంటశాలల్లేనివి	ప్రహరీలేనివి
వీరఘట్టం	62	04	38	02
సీతంపేట	168	08	130	168
పాలకొండ	59	01	20	-
భామిని	66	03	34	-
మెంటాడ	121	05	91	18

పాచిపెంట మండలం కొత్తవలసలో పనులు పూర్తికాని గదిలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

ఏనిమిదేళ్లుగా అసంపూర్తి నిర్మాణాలు..

పాచిపెంట మండలంలోని కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తి భవనాలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 139 మంది చదువుతున్నారు. ఎనిమిదేళ్ల కిందట రూ.22 లక్షలతో చేపట్టిన భవన సముదాయం పూర్తికాలేదు. ఆయుదేళ్ల క్రితం ఎస్ఎస్ఏ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. అందులోనే పాఠాలు చెబుతున్నారు. నాడు-నేడులో ప్రారంభించిన మరుగుదొడ్ల పనులు పూర్తికాలేదు. విషయం హెచ్ఎం నిర్మల వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

రక్షణ గోడలు కరవు..

సీతంపేట మండలం కె.గుమ్మడ గిరిజన ఆశ్రమ సంక్షేమ ప్రాథమిక పాఠశాల రక్షణగోడ లేక విలువైన వస్తువులు, ద్విచక్ర వాహనాలు రక్షణ కరవవుతోంది. ముళ్ల కంచెలతో కొంచెం ఏర్పాటు చేసుకున్నారు. భామిని మండలం బాలురుకోట ప్రాథమిక పాఠశాల శిథిలమవడంతో రేకులషెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే చర్యలు చేపడతాం. – పి.కృష్ణమూర్తి, డీడీఈవో, పాలకొండ

ప్లాస్టిక్ ముప్పు.. కలగదా కనువిప్పు!

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. విచ్చలవిడిగా వినియోగిస్తుండటంతో ఎక్కడ చూసినా గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. కాలువల్లో పేరుకుపోతుండటంతో పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి ఆటంకం కలుగుతోంది. రోజూ చెత్త సేకరణలో టన్నుల కొద్దీ నిషేధిత పాలిథిన్ సంచులు బయటపడుతుండటంతో కట్టడి చేయడం అధికారులకు సవాల్‌గా మారుతోంది.

కొరవడిన పర్యవేక్షణ

గతంలో పెద్దలు ఓ సంచి, గొడుగు పట్టుకుని బజారుకు వెళ్లేవారు. ప్రస్తుతం సరకులు కొనుగోలు చేశాక తీసుకెళ్లడానికి సంచి లేదని చెబుతుండటంతో కొందరు దుకాణదారులు తప్పనిసరి పరిస్థితుల్లో నిషేధిత పాలిథిన్ సంచులు అందజేస్తున్నారు. ఇంటికి తెచ్చాక కవర్లు బయట పడేస్తున్నారు. అవి ఎక్కడికక్కడ పేరుకుపోయి మరిన్ని సమస్యలకు కారణమవుతున్నాయి. మూగజీవాలు వాటిని తినేస్తుండటంతో అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయి. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి 31 వార్డుల్లో రోజూ 28 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 5 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి 23 వార్డుల్లో నిత్యం 21 టన్నుల చెత్త సేకరిస్తుండగా వాటిలో సుమారు 3.5 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. విచ్చలవిడిగా విక్రయిస్తుండటం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వినియోగం పెరిగిపోతోంది.

విచ్చలవిడిగా పెరుగుతున్న వినియోగం

అపరాధ రుసుం అంతంతే..

అధికారుల తనిఖీల్లో నిషేధిత పాలిథిన్ సంచులు బయటపడితే విక్రేతలకు అపరాధ రుసుం నామమాత్రంగా విధిస్తున్నారు. రూ.50 లేదా రూ.100 విధిస్తుండటంతో దుకాణదారులు చెల్లించి తిరిగి అమ్మకాలకు ఉపక్రమిస్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా మిన్నకుంటున్నారు. కొందరు పెద్ద దుకాణదారులతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

మహిళా మార్టులతో ప్రయోజనం

పురపాలక సంఘాల పరిధిలో మహిళా మార్టులు ఏర్పాటు చేసి వస్త్ర, కాగిత సంచులు విక్రయించేలా చర్యలు తీసుకుంటే సంఘాలు ఆర్థిక బలోపేతమవుతాయి. నిషేధిత పాలిథిన్ సంచుల వినియోగాన్ని పక్కాగా నియంత్రించడానికి అవకాశం ఉంటుంది. చెన్నైలో మాదిరిగా వస్త్ర సంచుల కియోస్కులు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో పాలిథిన్ సంచుల వినియోగం తగ్గుతుందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడ్డారు.

నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయించకుండా చర్యలు

ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో వస్త్ర సంచుల తయారీపై శిక్షణ ఇచ్చాం. నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయించకుండా చర్యలు తీసుకుంటాం.– ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

ఇంట్లోనే సేంద్రియ ఎరువు..!

ఉపాధి హామీ పథకంలో గుంతల తవ్వకం

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం రైతులకు మరింత చేరువ చేస్తోంది. పశువుల వ్యర్థాలు, ఇంట్లోని తడి చెత్తను బయట పడేయకుండా గుంతల్లో వేసి ఎరువు తయారు చేసేలా ప్రణాళిక రూపొందించింది. గుంతలు తీయించుకోవడానికి నిధులు సమకూరుస్తోంది. వర్మీ కంపోస్టు, ఇతర సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలని సూచిస్తోంది.

కార్యాచరణ ఇలా..

గుంతలను రెండు రకాలుగా విభజించారు. పశువులుంటే 1.5 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, 0.9 మీటర్ల లోతుతో గుంత తవ్వాలి. ఇందుకు రూ.958 మంజూరు చేస్తున్నారు. జీవాలు లేని వారు ఒక మీటరు డయామీటర్ 0.9 మీటర్ల లోతుతో వృత్తాకారంలో రెండు గుంతలు తవ్వాలి. ఒక్కో గుంతకు మధ్య 0.5 మీటర్ల ఖాళీ ఉండాలి. ఇందుకు రూ.647 ఇస్తున్నారు.

అర్హులు వీరే..

మండలం	గుంతల లక్ష్యం	పూర్తయినవి
ఇచ్ఛాపురం	5,041	4,953
కవిటి	7,889	7,340
కంచిలి	6,389	5,584
సోంపేట	7,684	4,760
మందస	7,973	6,710
పలాస	4,157	2,706

సొంత స్థలాలున్న వారు గుంతలు తవ్వుకోవచ్చు. జాబ్ కార్డు కలిగిన వ్యక్తి ఎరువు గుంతలు తవ్వాలనుకుంటే ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిని కలిసి విషయం చెప్పాలి. అనంతరం గుంత తవ్వుకున్న ఉపాధి హామీ వేతనదారు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. ఎరువు గుంతలు త్వరగా నిర్మించుకుంటే పంటలు, మొక్కలకు ఉపయోగం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

పలాస మండలం చిన్న నీలావతిలో ఎరువు గుంత తవ్వుతున్న వేతనదారు

సద్వినియోగం చేసుకోవాలి..

ఎరువు గుంతలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ ఉపయోగపడే మంచి పథకం. ఇంట్లోని తడి చెత్తను వాటిలో వేసుకుంటే సుమారు 3 నెలలకు ఎరువు తయారవుతుంది. పంట పొలాల్లో, పూలు, కాయగూరల మొక్కలకు వినియోగించుకోవచ్చు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే పరిసరాలు శుభ్రంగా ఉంటాయి.
– సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, డ్వామా, పలాస క్లస్టర్

వేణుగోపాలుడు.. దస్త్రాల్లోనే భూస్వామి..!

● స్వామికి వందల ఎకరాలు ● ఆలయ నిర్వహణకు అగచాట్లు

న్యూస్‌టుడే, బొబ్బిలి

పేరుకు రూ.వేల కోట్ల ఆసామి.. కానీ ధూపదీప నైవేద్యానికి వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆలయ నిర్వహణకూ ఇబ్బందులే. ఇదంతా బొబ్బిలి వేణుగోపాలస్వామి గురించే. ఉత్తరాంధ్రాలోని స్వామి ఆలయ భూముల వ్యవహారం ఏళ్లుగా తేలడం లేదు. ఫలితంగా స్వామి కోవెల కళ తప్పుతోంది.

బ్యాంకు లాకర్లలో బంగారం

2020 ఆగస్టులో దేవాదాయశాఖ రాష్ట్ర బృందం స్వామి ఆస్తులను ప్రత్యేకంగా లెక్కించింది. ఆభరణాల లెక్క చూసి, సుమారు 18 కిలోల బంగారు, వెండి పలు బ్యాంకు లాకర్లలో భద్రపరిచారు. భూముల వ్యవహారాన్ని తేల్చలేకపోయారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని వేసి గుర్తిస్తామని అప్పట్లో చెప్పినా.. ఇంతవరకు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదు. రికార్డుల్లో వేల ఎకరాల భూములు ఉన్నాయే తప్ప అవి ఎక్కడ అన్నదీ తేల్చడం లేదు. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వెంటనే భూముల గుర్తింపుపై దృష్టి సారించాలని కోరారు.

బలిజిపేట మండలం అజ్జాడలోని స్వామి భూములు

సర్వే ఆగడంతో తంటా

రీసర్వేతోనే వేణుగోపాలస్వామి భూముల వ్యవహారంపై స్పష్టత వస్తుందని అప్పట్లో అన్నారు. కొన్నిచోట్ల సర్వే పూర్తయినా లెక్కలు తేలలేదు. మరికొన్ని చోట్ల సర్వే జరగలేదు. కొన్నింటికి సర్వే నంబర్లు లేక సమస్య వస్తోంది. ఆలయ భూములే అని చెప్పడానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు.

ఆదాయం ఏడాదికి సుమారు రూ.లక్షే..!!

- గుర్తించిన వాటిలో బలిజిపేట మండలం అజ్జాడతోపాటు బొబ్బిలి మండలంలో 714 ఎకరాలున్నాయి. వాటి నుంచి ఎలాంటి శిస్తు రావడం లేదు.
- పాతబొబ్బిలిలో 10 ఎకరాలు, గొల్లపల్లిలో 9.30, ఎంబన్నవలసలో మూడు, తెర్లాంలో 6.87 ఎకరాల నుంచి నామమాత్రపు శిస్తులు వస్తున్నాయి. నిబంధనల మేరకు దేవాదాయశాఖకు చెల్లించాల్సిన రుసుములు జమ చేయడంలేదు. అంతా కలిపి ఏడాదికి రూ.లక్ష కూడా రావడం లేదు. చేసేది లేక ఆలయ అనువంశిక ధర్మకర్త సుజయ్‌కృష్ణ, సోదరుడు బేబీనాయన నెలకు దాదాపు రూ.2 లక్షల సొంత నిధులు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.
- మోఖాసా కొత్తవలసలో 1,585 ఎకరాలు ఉన్నప్పటికీ వాటి ఆనవాళ్లు గుర్తించడం లేదు.
- శ్రీకాకుళం జిల్లా పద్మాపురంలో 1.32 ఎకరాలు, రామంపేటలో 9, మల్లివీడులో 240, వాటపాగులో 30 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాల్లో ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.

దస్త్రాల్లోనే భూములు

మొత్తం ఎకరాలు: 4,011

గుర్తించినవి: 714

గుర్తించాల్సింది: 3,297

దృష్టి సారిస్తాం..: వేణుగోపాలస్వామి భూములపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. క్షేత్రస్థాయికి వెళ్లి గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారుల సహకారం కూడా తీసుకుంటాం. సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది. - లక్ష్మణరావు, కార్యనిర్వాహక అధికారి, వేణుగోపాలస్వామి ఆలయం

బాలికలూ.. భద్రత ముఖ్యం

● డీఐజీ గోపీనాథ్ జట్టీ

పాచిపెంట, న్యూస్‌టుడే: బాలికలకు చదువుతో పాటు భద్రత ముఖ్యమని డీఐజీ గోపీనాథ్ జట్టీ పేర్కొన్నారు. పాచిపెంట మండలంలోని పి.కోనవలస గిరిజన బాలికల గురుకుల కళాశాలలో గురువారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్ లేని సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. మహిళలకు శక్తి యాప్ రక్షణగా ఉంటుందన్నారు. యుక్త వయసులో బాలికలు ప్రేమ, పెళ్లి లాంటి మాటలకు లొంగిపోవద్దని సూచించారు. తాను కూడా వసతి గృహంలో చదివానని, దృఢ సంకల్పం.. తల్లిదండ్రుల కష్టంతో ఈ స్థాయికి ఎదిగానని గుర్తుచేసుకున్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. మంచి వాతావరణం, సౌకర్యాలు, క్రమశిక్షణతో బోధించే గురుకులాల్లో చదవడం అదృష్టమన్నారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని, ప్రలోభాలకు గురికావొద్దన్నారు. అనంతరం ఈ ఏడాది పది పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ సత్కరించారు. ఏఎస్పీ అంకితా సురాన, ప్రిన్సిపల్ భవానీ, సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకటసురేష్, బాలికలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినిని సత్కరించిన గోపీనాథ్ జట్టీ, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకితా సురాన

ఓటరు నమోదుపై బీఎల్వోలకు శిక్షణ

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త ఓటర్ల నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు నీలకంఠరావు అన్నారు. గురువారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. వారి విధులను వివరించారు. సర్వే సమయాల్లో ఫారం-6 తీసుకోవాలని, వలసలు, మృతి చెందిన వారి ఓట్లు తొలగించడం, రెండు చోట్ల నమోదులను అప్రమత్తంగా ఉంటూ పరిశీలించాలన్నారు. డీటీ బి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దమైనా దశ మారదా..?

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించేందుకు ప్రభుత్వం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని(ఆర్జీయూకేటీ) ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లున్నాయి. ఇందులో ఎచ్చెర్ల మండలం షేర్ మహ్మద్‌పురంలో నెలకొల్పిన శ్రీకాకుళం క్యాంపస్ ఒకటి. 2015లో ప్రారంభించి పదేళ్లు పూర్తయినా ఇంకా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. దీనికి తోడు అధికారుల ఇష్టానుసార నిర్ణయాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు అవస్థలు తప్పలేదు.

తొలి ఏడాది 2015-16 విద్యా సంవత్సరం విద్యార్థులకు ఇక్కడ వసతులు లేకపోవడంతో నూజివీడులో తరగతులు నిర్వహించారు. రెండో ఏడాది నుంచి స్థానికంగానే పీయూసీ-1 తరగతులు ప్రారంభించారు. వారి రెండేళ్ల చదువు పూర్తయి, ఇంజినీరింగ్‌కు వచ్చేసరికి వసతుల లేమి కారణంగా నూజివీడులోనే కొన్నాళ్లు తరగతులు నిర్వహించారు. అనంతరం దశలవారీగా తరగతి, వసతి, ఇతర భవనాలు నిర్మాణాలు చేపట్టారు. నాలుగేళ్ల నుంచి పీయూసీ-2, ఇంజినీరింగ్-1, 2 బ్యాచ్‌లు ఇక్కడే నడుపుతున్నారు. ఈ ఏడాది నుంచి పీయూసీ-1ను నూజివీడుకు తరలించి అక్కడ ఉన్న ఈ-3, 4 బ్యాచ్ లను ఇక్కడికి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. దీంతో స్థానికంగానే చదువుకోవచ్చని భావించిన విద్యార్థులు, వారి తలిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఈసారి శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనవారికి కౌన్సెలింగ్ కూడా నూజివీడులోనే నిర్వహిస్తుండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పనులు చేస్తేనే పాట్లు తప్పేది..

నాలుగేళ్ల కిందట మూడు వేల మందికి ఉపయోగపడేలా రూ.66.7 కోట్లతో అకడమిక్ బ్లాక్ నిర్మాణం ప్రారంభించారు. అత్యాధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ.24 కోట్లతో గుత్తేదారులు పనులు చేశారు. వీటి బకాయిలు ఉండటంతో మూడున్నరేళ్లుగా నిర్మాణాలు నిలిచిపోయాయి. క్యాంపస్‌లోని బోర్లు తరచూ కలుషితమై విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.2.4 కోట్లతో చేపట్టిన వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు రెండేళ్ల నుంచి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

- నూజివీడు నుంచి ఈ-3, 4 బ్యాచులను జిల్లాకు తీసుకొస్తే స్థానికంగా వసతి సమస్య ఎదురవుతుంది. ప్రస్తుతం షేర్‌మహ్మద్‌పురం క్యాంపస్‌లో సుమారు 3,400 మంది ఉంటున్నారు. తాజాగా మరో వెయ్యి మందికి సదుపాయాలు కల్పించాలి. ఇప్పటికే ఉన్న బోర్లలో అరకొరగా నీరొస్తోంది.
- ఐదు అంతస్థుల భవనాలకు లిఫ్ట్ సౌకర్యం లేదు.
- ఈ-3, 4 విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలు, ప్లేస్‌మెంట్ సెల్ వంటి సౌకర్యాల్లేవు.
- పీయూసీ-1, 2 బ్యాచులకు చెందిన బాలురుకు మాత్రమే శివానీ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో తరగతులు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి పీయూసీ-2 బాలికలను అక్కడే ఉంచాలని నిర్ణయించారు. అక్కడ ప్రహరీ లేకపోవడంతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశముందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

పీయూసీ-1 తరగతులు నూజివీడులో ఇబ్బందుల్లేకుండా నిర్వహిస్తాం. అంతా ఒక చోటే ఉంటే సీనియర్, జూనియర్స్ సహకరించుకోవడంతో పాటు ప్రాంగణ ఎంపికల్లోనూ మంచి ఫలితాలొచ్చే అవకాశం ఉంటుంది. అందుకే ఈ-3, 4 బ్యాచ్‌లను ఇక్కడికి మారుస్తున్నాం. ఇతర సమస్యలకు స్థానిక అధికారులే పరిష్కారం చూపాలి.
– సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

వెళ్లడమే కష్టం.. ఇల్లెక్కడ కడతాం..!



ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తామని వైకాపా నాయకులు నమ్మించి నట్టేట ముంచారనేందుకు నిదర్శనమే ఈ చిత్రం. శ్రీకాకుళం గ్రామీణ మండలం లింగాలవలసలోని జగనన్న కాలనీలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. అడుగు తీసి అడుగేయలేని దుస్థితి.. ఇక్కడ మొత్తం 1,850 మందికి స్థలాలు కేటాయించగా, 1,550 గృహాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కనీస వసతుల్లేకపోవడంతో పూర్తి చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపట్లేదు. ప్రస్తుతానికి కొన్ని ఇళ్లలో సుమారు 100 మంది వరకు ఇక్కడ నివసిస్తున్నారు. వారు కూడా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై లింగాలవలస పంచాయతీ కార్యదర్శి హెచ్.రవికాంత్ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం, కలెక్టరేట్(శ్రీకాకుళం)

మీటరు అమర్చారు..రక్షణ మరిచారు

ఇచ్ఛాపురం పట్టణ పరిధి దాసన్నపేట కూడలిలో దీప స్తంభానికి విద్యుత్తు మీటరు, నిర్వహణ పెట్టెలు అమర్చారు. రక్షణ చర్యలు లేకపోవడంతో తరచూ విద్యుదాఘాతానికి గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఉపకరణాలను ఎత్తులో అమర్చాలని.. దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని పుర ఏఈ కామేశ్వరరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కుండీలతో బెంబేలు

వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు, చినవంక, గరుడభద్ర ఇతర ప్రాంతాల్లో మెగా రక్షిత నీటి పథకం పైపులైన్ వాల్వ్‌కు ఏర్పాటు చేసిన కుండీలు లోతుగా ఉండటంతో ప్రమాదకరంగా మారాయి. వాటిపై పలకలు అమర్చకపోవడంతో జీవాలు లోపల పడి మృత్యువాత పడుతున్నాయి. వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. పరిశీలించి పలకలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఉద్దానం రక్షిత నీటి సరఫరా పథకం జేఈ తేజేశ్ తెలిపారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ప్రమాద సూచికలేవీ..?

కవిటి మండలం రాజపురం నుంచి కొజ్జిరియా వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డులో మూడు చోట్ల ప్రమాదకర మలుపులు న్నాయి. ప్రమాద సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ విక్రమ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పగలూ వెలుగులు

కంచిలిలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీధి దీపాలు కొన్ని రోజులుగా పగలూ వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ రాంబాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా గతంలో ఏర్పాటు చేసిన ఎంసీబీలు (స్విచ్‌లు) మరమ్మతులకు గురయ్యాయని.. కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కంచిలి

ఉల్లాసంగా..ఉత్సాహంగా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జగన్నాథస్వామివారి రథోత్సవాల్లో భాగంగా ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. హీరా పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీవెంకటేశ్వర డాన్స్ అకాడమీ సంస్థ నాట్య గురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో, చిన్నాగురుస్వామి, జయలక్ష్మి పర్యవేక్షణలో శాస్త్రీయ, నృత్య ప్రదర్శనలు సాగాయి.

మహిషాసురమర్దిని నృత్యరూపకంలో ఓ ఘట్టం

(c) eenadu

పథకాల సద్వినియోగంతో రెట్టింపు ఆదాయం

అన్నవరంలో డ్రిప్ సేద్య పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అధికారులు

నరసరావుపేట వ్యవసాయం, నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వం అందించే పథకాల్ని సద్వినియోగం చేసుకొని రెట్టింపు ఆదాయం పొందాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. గురువారం ఆయన రొంపిచర్ల మండలం అన్నవరం, నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామాల్లో ఉద్యాన పంటలను పరిశీలించారు. అన్నవరంలో లింగయ్య చౌదరి సాగు చేసిన జామతోటలో డ్రిప్ పరికరాల పనితీరును పరిశీలించారు. భూగర్భ జల శాఖ వారు అమర్చే ఫ్లోమీటర్ల ద్వారా ఎన్ని లీటర్ల నీటి వినియోగం జరుగుతుందో తెలుసుకునే అవకాశం ఏర్పడిందని రైతు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కుర్రులో రైతు పోతురాజు శివయ్య సాగు చేసిన వంగ, గులాబీ తోటలను కలెక్టర్ పరిశీలించారు. రైతులు రెండు, మూడు రకాల పంటలు సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద రైతు తన ఇంటిపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడంతో కలెక్టర్ అభినందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గుడ్లు, పాల నాణ్యతను పరిశీలించి. . మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్ అధికారి ఆంజనేయులు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఐ.వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జలాశయాల్లో చేపల వేట నిషేధం

అచ్చంపేట, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం అమలులో ఉందని జిల్లా మత్స్య శాఖాధికారి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా వేటకు వెళ్తే వారి లైసెన్సుల రద్దుతో పాటు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రత పాటించాలి.. పల్లె మెరవాలి

పల్లెల స్వచ్ఛతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటింటి చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రాల నిర్వహణను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపికకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పేరిట కేంద్ర బృందాలు గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నాయి. బహిరంగ మల విసర్జనను పూర్తిగా నియంత్రించేందుకు 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ అమలు చేసి ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించింది. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. తాజాగా ఈ ప్రక్రియను పునరుద్ధరించారు.

గ్రామాల్లో పర్యటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

నరసరావుపేట వ్యవసాయం, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును ఐదుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం పరిశీలన చేస్తోంది. ఇప్పటివరకు మైదవోలు, కోట, సోలస (యడ్లపాడు మండలం), ములకలూరు (నరసరావుపేట), కారంపూడి, పెదకొదమగుండ్ల (కారంపూడి), లింగంగుంట్ల, కాశిపాడు (పెదకూరపాడు), రామచంద్రరావుపురం (చిలకలూరిపేట), చందవరం (నాదెండ్ల) గ్రామాల్లో స్వచ్ఛత తీరును పరిశీలించారు. జిల్లాలో 526 పంచాయతీలు ఉంటే వాటిలో 33 గ్రామాలను కేంద్ర బృందం సందర్శించే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలను సందర్శించి స్వచ్ఛత, మరుగుదొడ్ల నిర్వహణ వంటివి పరిశీలిస్తున్నారు. ఇంకుడు గుంత ఉందా.. తడి,

కారంపూడి: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పొడి చెత్త సేకరిస్తున్నారా.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, పంచాయతీ రిక్షాలు, ట్రాక్టర్, ఫాగింగ్ యంత్రాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.

లక్ష్యం.. ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ మల విసర్జన లేని గ్రామాలను గుర్తించడమే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ ప్రధాన లక్ష్యం. అలాంటి పంచాయతీలకు ర్యాంకులు ప్రకటించి. ఉత్తమంగా నిలిచిన వాటికి గాంధీ జయంతి (అక్టోబరు 2) రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పురస్కారాలు అందజేయనున్నారు.

సర్పంచులకు సదవకాశం.. స్వచ్ఛతలో జాతీయస్థాయి గుర్తింపు పొందేందుకు సర్పంచులకు సదవకాశం వచ్చింది. ప్రభుత్వం ఇచ్చే నిధుల్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్ని స్వచ్ఛంగా మార్చేందుకు కృషి చేస్తే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో ఆ పల్లెలు మురిసే అవకాశముంది. ప్రధాన మంత్రి చేతుల మీదుగా పురస్కారంతో పాటు గ్రామాలకు ప్రత్యేక నిధులు పొందే వీలుంది.

❖ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కింద కేంద్ర బృందం సభ్యులు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వారు గుర్తించిన అంశాల ఆధారంగా ర్యాంకులు ప్రకటించి ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు అందజేస్తారని డీపీవో నాగేశ్వర నాయక్ తెలిపారు.

అందుబాటులోకి వస్తే అమృతమే!

జిల్లాలో రూ.307.20 కోట్లతో పనులు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద గత నెలలో జిల్లాకు రూ. 307.20 కోట్లు మంజూరు చేయగా.. అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న వారితో ఈ నెల 21న పనులు మొదలుపెట్టనున్నారు. పథకం కింద ఏడు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో తాగునీటి వనరులను మెరుగుపరచడం.. శివారు బస్తీలు, బలహీన వర్గాల కాలనీలకు పైప్‌లైన్లు వేసి కుళాయిల ద్వారా ఇంటింటికీ నీరు అందించే పనులు చేపడతారు.

వినుకొండలో నిర్మిస్తున్న వాటర్‌ట్యాంకు

గత నెలలో టెండర్లు

జిల్లాలోని నరసరావుపేట, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల పురపాలికలు, దాచేపల్లి, గురజాల నగర పంచాయతీల్లో అమృత్ 2.0 కింద పనులు చేపట్టేందుకు జూన్ 24న ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు ఇవ్వడం.. పైపులైన్లు, నీటి ట్యాంకులు నిర్మించడంతో పాటు మురుగునీటి పారుదల పనులు చేపట్టనున్నారు. ఆయా పట్టణాల్లోని పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి అమర్చడం.. తాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచడం వంటివి చేయనున్నారు.

మున్సిపాలిటీ	నిధులు (రూ.కోట్లలో)
నరసరావుపేట	23.32
చిలకలూరిపేట	116.80
పిడుగురాళ్ల	24.77
వినుకొండ	29.57
దాచేపల్లి	49.61
గురజాల	25.10
మాచర్ల	37.53

ట్యాంకర్లతో నీటి సరఫరా.. పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచర్ల, నరసరావుపేట పట్టణాల్లోని శివారు కాలనీలకు ఇప్పటికీ తాగునీటి సరఫరా సౌకర్యం లేదు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఏ మూలకూ సరిపోవడం లేదు. వేసవి కాలం వచ్చిందంటే ఆయా ప్రాంతాల ప్రజల తాగునీటి కష్టాలు వర్ణనాతీతం. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ఏళ్లుగా కోరుతున్నారు. నరసరావుపేట ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడమే కాకుండా పనులు పట్టాలెక్కేలా కృషి చేస్తున్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి వచ్చే వేసవిలోపు తాగునీరు అందేలా చేస్తామని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్. చిత్రంలో నాయకులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం: కొమ్మాలపాటి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా తెదేపా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నరసరావుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గ్రామ, మండల, బూత్ స్థాయి ఇన్‌ఛార్జి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. కరపత్రాలు పంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ నేతలు గొట్టిపాటి జనార్దన్ బాబు, నాగసుధీర్, నరసింహారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బడికి దూరంగా బాలలు

ఇప్పటి వరకు గుర్తించింది 661 మంది

సత్తెనపల్లి, రొంపిచర్ల, న్యూస్‌టుడే: బడిఈడు ఉండి పాఠశాలలకు దూరంగా ఉంటున్న 14 ఏళ్లలోపు బాలలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కూటమి ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమం చేపట్టింది. గత నెల మూడో వారం నుంచి ఈ నెల 12 వరకు జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. వేసవి సెలవులకు ముందు సర్వే నిర్వహిస్తే 535 మంది ఉన్నట్లు తేలింది. వారిని ఇంటికి దగ్గర్లోనే బడుల్లో చేర్పించారు. పాఠశాలలు తెరిచిన తర్వాత నిర్వహిస్తున్న 'నేను బడికి పోతా'లో ఇప్పటివరకు 126 మంది బడి బయట ఉన్నట్లు గుర్తించారు. ఉపాధ్యాయ బదిలీలు, కొత్త ప్రదేశాల్లో చేరికలతో ఈ ప్రక్రియ మొదట్లో నెమ్మదిగా ఉన్నా ఇప్పుడు వేగం పుంజుకుంది. విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు బాలలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, వివిధ రకాల ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తున్నారు. బడిబయట పిల్లల్ని గుర్తించి వారిని పాఠశాలల్లోకి చేరుస్తున్నట్లు విద్యా శాఖ ఏఎల్ఎస్‌సీ శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రొంపిచర్లలో బడిబయట ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యా శాఖాధికారులు

1,482 మందికి రవాణా భత్యం.. ఇంటికి దూరంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అందించనున్న రవాణా భత్యానికి జిల్లాలో 1482 మంది అర్హులుగా జిల్లా విద్యా శాఖాధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీరంతా ఒకటి నుంచి ఎనిమిది తరగతులను కిలోమీటరు నుంచి మూడు కిలోమీటర్ల పైబడి దూరంలోని బడుల్లో చదువుకుంటున్నారు. వీరికి నెలకు రూ.600 చొప్పున మూడు నెలలకు ఒకసారి చెల్లించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. తద్వారా పిల్లల చదువులకు రవాణా ఖర్చుల భారం నుంచి తల్లిదండ్రులకు కాస్తంత ఊరట లభించనుంది.

త్వరలో భూసేకరణ మార్కింగ్

జాతీయ రహదారి 3ఏ నోటిఫికేషన్ విడుదల

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: గుంటూరు- వినుకొండ జాతీయ రహదారి 544డి విస్తరణలో భాగంగా త్వరలో భూసేకరణ మార్కింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు దిల్లీ నుంచి జాతీయ రహదారుల అథారిటీ వారు 3ఏ నోటిఫికేషన్ విడుదల చేశారు. గుంటూరు నుంచి వినుకొండ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును ట్రాఫిక్ దృష్ట్యా నాలుగు వరుసలుగా విస్తరించనున్న విషయం తెలిసిందే. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇందుకు ఎంత భూమి అవసరమో గుర్తించి మార్కింగ్ వేసి, అనంతరం ఎక్కడెక్కడ భూమి కావాలో ఆ ప్రాంత రైతులకు నోటీసులు ఇవ్వనున్నారు. జాతీయ రహదారుల అథారిటీ అధికారులు వచ్చాక భూసేకరణ మార్కింగ్ చేపడతామని జేసీ సూరజ్ గనోరే తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: 'ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయా? రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్ని గమనిస్తున్నారా? అంటూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం రెండోరోజు గురువారం కొనసాగింది. సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం అంచులవారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఇంటింటా తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా ఆరా తీశారు. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వివరించారు. వినుకొండలోని 17వ వార్డులో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెల్దుర్తిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక తయారు చేయాలని పార్టీ శ్రేణులకు మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటా తిరుగుతూ సమస్యలు తెలుసుకుని.. పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేట మండలం పసుమర్రు, యడ్లపాడు మండలంలో ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ఆగుతూ.. సాగుతూ..

రెండేళ్లయినా పూర్తికాని అమరావతి-రాజుపాలెం మార్గం

అమరావతి మండలంలో రహదారి దుస్థితి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, బెల్లంకొండ, అమరావతి

రహదారి దూరం:	45.5 కి.మీ.
నిర్మాణ వ్యయం:	రూ.147.98 కోట్లు
పనులు పూర్తి:	రూ.43 కోట్ల మేరకు
చెల్లించిన బిల్లులు:	రూ.13 కోట్లు

జిల్లాలో చాలా రోడ్లు బాగు పడినా.. అమరావతి- రాజుపాలెం ప్రధాన రహదారి మాత్రం ఇంకా అలాగే ఉంది. రెండేళ్లుగా పనులు ఆగుతూ సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో 2023 జూన్‌లో పనులు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు సగం కూడా పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలా రోడ్లను బాగు చేశారు. ఈ మార్గం ఎప్పుడు పూర్తవుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

హైదరాబాద్ వెళ్లడానికి అనువుగా.. అమరావతి, పెదకూరపాడు మండలాల వాసులు హైదరాబాద్ వెళ్లాలంటే కొత్త మార్గం అనువుగా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్ వెళ్లాలంటే సత్తెనపల్లి.. అటు నుంచి పిడుగురాళ్ల.. ఆపై మిర్యాలగూడ, నల్గొండ మీదుగా వెళ్లాలి. కొత్త దారి అందుబాటులోకి వస్తే సత్తెనపల్లి వెళ్లకుండా పిడుగురాళ్లకు చేరుకోవచ్చు. ఇలా 40 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

బెల్లంకొండ మండలంలో ఇలా..

మూడు మండలాల వాసులకు అవస్థలు.. అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మీదుగా రాజుపాలెం వరకు ఈ రహదారి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గుంతల కారణంగా మూడు మండలాల వాసులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పైగా రోడ్డు వేస్తున్నామని చెప్పి కొన్నిచోట్ల తవ్వి కంకర వేసి వదిలేశారు. మార్గం మొత్తం తొలగించి.. కంకర వేసి కొత్తది నిర్మించాల్సి ఉండగా.. గుంతలున్నచోట కంకర వేసి పాత రోడ్డును అలాగే ఉంచి నిర్మిస్తున్నారు. నాబార్డు నిధులతో నిర్మిస్తున్న ఈ మార్గానికి సంబంధించి రూ.30 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉండటంతో గుత్తేదారు పనులు ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

రోడ్డు నిర్మాణంలో ఆలస్యంపై ఆర్అండ్‌బీ ఈఈ రాజానాయక్‌ను వివరణ కోరగా.. వారం రోజుల్లో బకాయి బిల్లులు మంజూరవుతాయని.. పనులు వేగవంతమవుతాయని తెలిపారు.

త్రికోటేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.82,05,746

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపును గురువారం నిర్వహించామని ఈవో చంద్రశేఖరరావు తెలిపారు. 126 రోజులకు సంబంధించి రూ.82,05,746 సమకూరినట్లు వివరించారు. కొండపైన రూ.74,54,621.. కొండ దిగువన రూ.1,72,385, అన్నదానానికి విరాళాల రూపంలో రూ.5,78,740 ఆదాయం వచ్చిందన్నారు. హుండీల్లో 28.500 గ్రాముల బంగారం, 562.500 గ్రాముల వెండి, మలేసియా కరెన్సీ ఒకటి, బంగ్లాదేశ్ కరెన్సీ 12 నోట్లు, సింగపూర్ డాలర్లు రెండు, అమెరికా డాలర్లు 48 లభించినట్లు వివరించారు.

లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో తదితరులు

సాగు హక్కు పత్రాలు తీసుకోండి

మంగళగిరి, న్యూస్‌టుడే: కౌలు రైతులు తప్పనిసరిగా భూమి సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని, దీని ద్వారానే పంట నమోదు జరుగుతుందని.. నష్టం జరిగినప్పుడు కౌలు రైతు పేరు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి సచివాలయంలో గురువారం రైతులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో వివిధ పంటల సాగు పద్ధతులపై రైతులతో ఆయన చర్చించారు. ప్రభుత్వం అందించే రాయితీలు, యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రైతుల ఖాతాలకు రూ.20 వేలు జమ చేయనుందని తెలిపారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ ధాన్యాన్ని భద్రపర్చుకునేందుకు వ్యవసాయ శాఖ ద్వారా పట్టాలు ఇవ్వాలని కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

శావల్యాపురం, న్యూస్‌టుడే : ప్రజలకు సేవలు అందించే విషయంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ జిల్లా వైద్యాధికారి హనుమకుమార్ అన్నారు. మండలంలోని కనమర్లపూడిలో జరుగుతున్న కార్యక్రమాన్ని గురువారం పర్యవేక్షించారు. గ్రామంలో గర్భిణుల నమోదు, పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, పీఎంజేవై ఈకేవైసీ ఎలా జరుగుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధుల పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. ఆయన వెంట వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, ఆరోగ్య కార్యకర్త రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పి.పృథ్వీరాణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఈపూరు, న్యూస్‌టుడే: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.రవి సూచించారు. ఈపూరు మండలం ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం వివిధ కార్యక్రమాల అమలు తీరుపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో కాన్పుల వివరాలపై సమీక్షించారు. గత ఏడాది ఆసుపత్రిలో 12 కాన్పులు జరిగాయని, ఈ సంవత్సరం ఇప్పటికి రెండు జరిగాయని.. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలని సూచించారు. వైద్యాధికారి నవీన్‌కుమార్, హెచ్‌ఈవో నరసమ్మ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో రవి

సభ్యుల హాజరుపై ఉత్కంఠ

జడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

గుంటూరు, న్యూస్‌టుడే

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ సభ్యుల హాజరుపై ఉత్కంఠ నెలకొంది. గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనుంది. మార్చి 15న జరిగిన సమావేశానికి వైకాపా జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరవడంతో కోరం లేక వాయిదా వేశారు. ఆ తర్వాత సమావేశం ఏర్పాటు చేసినా.. కొందరు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యుల విజ్ఞప్తి మేరకు జడ్పీ సీఈవో సమావేశాన్ని వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 వార్షిక జడ్పీ బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఆమోదించలేదు. దాంతో ఏపీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వానికి బడ్జెట్‌ను పంపడంతో ఆమోదించింది. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు వీలు కుదిరింది.

అజెండా ప్రతుల అందజేత.. జిల్లాలో 54 మంది జడ్పీటీసీ స్థానాలు ఉంటే.. శావల్యాపురం జడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి (తెదేపా) మినహా మిగిలిన వారంతా వైకాపాకు చెందినవారే. సాధారణ ఎన్నికలు-2024కు ముందు జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా తెదేపాలో చేరారు. అప్పటినుంచి వైకాపాకు చెందిన ఎక్కువ మంది ఛైర్‌పర్సన్‌తో విభేదించి జడ్పీ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలకు గైర్హాజరవుతూ బడ్జెట్ ఆమోదించకుండా మోకాలడ్డుతున్నారనే విమర్శలు న్నాయి. సాధారణ ఎన్నికల్లో తెదేపా ఆధ్వర్యంలోని కూటమి పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుపొందారు. ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఏపీ పీఆర్ చట్టం ప్రకారం వరుసగా మూడు సమావేశాలకు గైర్హాజరైతే జడ్పీటీసీ సభ్యులపై అనర్హత వేటు పడే అవకాశముంది. దాంతో జడ్పీటీసీ సభ్యుల ఇళ్లకు వెళ్లి సమావేశం అజెండా ప్రతులను సిబ్బంది అందజేశారు.

తమకు సమావేశం గురించి తెలియజేయలేదని ఎవరూ ఆరోపించకుండా ఉండేందుకే జడ్పీ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. సమావేశం అజెండాలో జడ్పీ బడ్జెట్‌తో పాటు 13 శాఖలకు చోటు కల్పించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా చర్చించనున్నారు. అయితే జడ్పీటీసీ సభ్యుల హాజరుపైనే అందరి దృష్టి ఉంది.

సిండికేట్ కనుసన్నల్లోనే వేలం

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కృష్ణానదీ తీర ప్రాంతంలో రేవుల నిర్వహణ సిండికేట్ కనుసన్నల్లోనే కొనసాగుతోంది. జిల్లాపరిషత్తు కార్యాలయంలో రేవుల వేలం ప్రక్రియను జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ గురువారం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జడ్పీ కార్యాలయంలో గుత్తేదారులు మాట్లాడుకుని సిండికేట్‌కు అనుకూలంగా కూడబలుక్కున్నారు. ఆయా రేవులకు జడ్పీ అధికారులు నిర్ణయించిన ప్రాథమిక ధరకు కొంత మొత్తం పెంచి దక్కించుకున్నారు. స్థానికేతరులు ఎవరూ సీల్డ్ టెండర్లు వేయకుండా స్థానిక నాయకులతో చెప్పించడంతో వారు వేలంలో పాల్గొనలేదు. దీంతో అచ్చంపేట మండలం చింతపల్లి (పడవ) రేవును రూ.2.20 లక్షలకు, గింజుపల్లి రేవును రూ.3.50 లక్షలకు, అమరావతి మండలం దిడుగు (పడవ) రేవును రూ.6 లక్షలకు పాట పాడిన గుత్తేదారుల పేరుతో ఖరారు చేశారు. మాదిపాడు బల్లకట్టు రేవుకు గుత్తేదారులు సీల్డ్ టెండర్లు వేయకుండా.. నేరుగా బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దాంతో ఈ రేవుకు వేలం ఖరారు చేయకుండా జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు వాయిదా వేసినట్లు సమాచారం. మాచవరం మండలం గోవిందాపురం బల్లకట్టు, కొల్లిపర మండలం వల్లభాపురం రేవుల వేలంలో గుత్తేదారులు పాల్గొనలేదు. వారంతా సిండికేటై చింతపల్లి, గింజుపల్లి, దిడుగు రేవులను తక్కువ ధరకే సొంతం చేసుకోవడంతో జడ్పీ ఆదాయానికి గండి పడింది. వేలంలో ధర పెంచకుండా ముందస్తుగా మాట్లాడుకుని అమలు చేశారు.

వేలం నిర్వహిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ

(c) eenadu

శ్రీవాణి భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చండి

దర్శనానంతరం భక్తుల డిమాండు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నిమ్మల మురళీకృష్ణ మరికొందరు భక్తులు తితిదే అధికారులను కోరారు. గురువారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్న అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కనీస వసతుల లేమిపై ఫిర్యాదు చేశారు. శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం వద్ద తెల్లవారు జామున 4.00 గంటల నుంచి వేచిఉండగా ఉదయం 7.30 గంటలకు టికెట్లు జారీ చేస్తారని చెప్పారని, అప్పటివరకు అక్కడ కూర్చునేందుకు కుర్చీలు, బల్లలు, మంచినీళ్లు, ఇతర వసతులు లేవని, డయల్ యువర్ ఈవోకు ఫిర్యాదు చేద్దామన్నా కుదరలేదని వారు ఆరోపించారు. టికెట్లు కొనుగోలు చేశాక రూ.500, రూ.1000 గదులు ఇవ్వాల్సి ఉండగా రూ.50 గదులు రెండు కేటాయించారని, వాటిలో బొద్దింకలు, బల్లులు ఉన్నాయని వాపోయారు. ఫిర్యాదు చేశాక సిబ్బంది వచ్చి క్లీన్ చేశారని, గదుల కేటాయింపు సిబ్బందిని సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి శ్రీవాణి భక్తులకు సౌకర్యాలు మెరుగుపరిచేలా చొరవచూపాలని కోరారు. మీడియాకు ఫిర్యాదు చేసిన వారిలో వెట్టం శ్రీనివాసరావు, కె.రామగురవయ్య, జి.శంకర శ్రీనివాస్, ఎస్కే షాబిల్ ఉన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు: తితిదే

తితిదేపై అసత్య ఆరోపణలు చేసేవారిని, సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తితిదే హెచ్చరించింది. గురువారం ఉదయం శ్రీవాణి దర్శనానికి వచ్చిన ఐదుగురు భక్తులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని వెల్లడించింది. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేస్తామని, అంతకంటే గంట ముందు మాత్రమే భక్తులను కౌంటర్ వద్దకు అనుమతిస్తున్నట్లు వెల్లడించింది. సదరు భక్తులు వేకుజామున 3.30 గంటలకే వచ్చి టికెట్ల కేటాయింపులో జాప్యం జరిగిందని, ఎటువంటి అన్నపానీయాలు తితిదే కేటాయించలేదని ఆరోపించడం సరికాదంది. సాధారణంగా కౌంటర్ తెరిచే సమయానికి ముందు నుంచి టీ, కాఫీ, పాలు, మజ్జిగ నిరంతరం సరఫరా చేస్తామని వెల్లడించింది. శ్రీవాణి భక్తులు ఎక్కువగా తిరుపతిలోనే వసతి పొంది దర్శనానికి వెళ్తుంటారని, తిరుమలలో డిమాండ్ చేస్తే అందుబాటులో ఉన్నవి కేటాయిస్తున్నట్లు పేర్కొంది. టీబీసీలోని రూ.50 విలువైన గదులను తాము తనిఖీ చేయగా పరిశుభ్రంగానే ఉన్నాయని, సదరు భక్తులు తితిదేపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించింది. రద్దీ నేపథ్యంలో భక్తులు సంయమనంతో సహకరించాలని సూచించింది.

ఇన్‌స్పైర్ చేయండి.. రాష్ట్రపతిని కలవండి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

దేశ రాష్ట్రపతి, ప్రధాన మంత్రిని నేరుగా కలిసి వారితో ముచ్చటించాలని ఉందా? చిట్టి చేతులకు ఆ సదవకాశం ఉంది. బాల శాస్త్రవేత్తలు సమాజానికి ఉపయోగపడే ఏదైనా పురస్కరణ చేస్తే.. వారిని కలవడమే కాదు ఆ సృజనకు 'పేటెంట్' కూడా పొందవచ్చు. బాల్యదశలోనే పిల్లల్లో సైన్సుపట్ల ఆసక్తిని పెంపొందించి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. సృజనాత్మక ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఇన్‌స్పైర్ పోటీలను కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో పెంపొందిస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్లు పంపేందుకు సెప్టెంబరు 15 వరకు గడువు ఉంది.

జిల్లాకు వచ్చిన అవార్డులు ఇలా..

సంవత్సరం	నామినేషన్లు	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి	జాతీయ స్థాయి
2022–23	1300	126	13	2
2023–24	1431	142	.....	.....
2024–25	1320	139	.....	.....

తన ఆవిష్కరణ గురించి వివరిస్తున్న విద్యార్థిని (పాత చిత్రం)

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా..

ఇన్‌స్పైర్ అవార్డులు పొందేందుకు ఆసక్తి ఉన్నవారు www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మొదట పాఠశాల అథారిటీ ఐచ్ఛికాన్ని క్లిక్‌చేసి వన్‌టైం రిజిస్ట్రేషన్ చేయాలి. పాఠశాల వివరాలన్నీ పొందుపర్చాలి. జిల్లా విద్యాశాఖ నుంచి ఆమోదం లభించిన తరువాత ఈ-మెయిల్, యూజర్ ఐడీతో లింక్ వస్తుంది. అందులో పాస్‌వర్డ్ ఏర్పాటు చేయాలి. ఆ తరువాత నమూనా పూర్తి వివరాలను పొందుపర్చాలి. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఒక్కో ఉన్నత పాఠశాల నుంచి ఐదు చొప్పున.. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు చొప్పున నామినేషన్లు పంపాలని నిర్ణయించారు.

ప్రోత్సాహకాలు ఇవీ

ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ప్రాజెక్టుల్లో ఉత్తమ ఆలోచనల్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డులకు ఎంపిక చేస్తుంది. అలా జిల్లాస్థాయిలో ప్రాజెక్టు ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టు ప్రదర్శనకు రూ.10 వేలు నగదు పారితోషికం అందజేస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులపై పేటెంట్‌ను ప్రభుత్వం విద్యార్థికి ఇస్తుంది. జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులకు రూ.25 వేల వరకు నగదు ప్రోత్సాహకం అందజేస్తారు.

పోటీ అంశాలివే..

డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించాలి.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు బి.శ్రీనివాసరావు తెలిపారు. బస్సు 8వ తేదీ రాత్రి 10 గంటలకు నరసరావుపేటలో బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని 10వ తేదీ ఉదయం 4 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. స్వామివారి దర్శనం అనంతరం అక్కడ బయల్దేరి 11న ఉదయం 5 గంటలకు నరసరావుపేట చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర రూ.2550గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7382896041, 7382896038, 9959225428 సంప్రదించాలని కోరారు.

నర్సరీలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: నర్సరీలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, నిబంధనలకు వ్యతిరేకంగా నర్సరీలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఉద్యానశాఖ జిల్లా అధికారి ఎ.వెంకట్రావు అన్నారు. మండలంలోని ఉప్పలపాడులో 'షేడ్‌నెట్ నిర్మాణం' అను విషయంపై అవగాహన కల్పించారు. నర్సరీ చట్టం-2010పై నర్సరీ యజమానులకు అవగాహన కల్పించారు. మిరప నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, విత్తనశుద్ధి గురించి వివరించారు. ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన గురించి రైతులకు తెలియజేశారు. ఈనెలా ఖరీఫ్‌లో పసల్ బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.లలో)

నరసరావుపేట: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 100, లిఫ్టింగ్ ధర - 122, చికెన్ విత్ స్కిన్ - 177, చికెన్ స్కిన్‌లెస్ - 201.

కృష్ణా జిల్లా: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95, లిఫ్టింగ్ ధర 117, చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193. [illegible] 101, 108, 120, 204.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర [illegible]

ఊడిన అమరేశ్వరాలయ రాజగోపుర తలుపు

అమరావతి, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయ రాజగోపురం తలుపు బుధవారం రాత్రి ఊడిపోయింది. ఆలయ కాపలా సిబ్బంది రాత్రివేళ పశ్చిమ దిక్కువైపు తలుపులు మూస్తుండగా.. ఒక తలుపు ఊడి పక్కకు ఒరిగిపోయింది. గతంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో కారుతో రాజగోపురం తలుపులను ఢీకొట్టడంతో దెబ్బతిన్నాయి. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం తలుపు ఊడింది. ఈ విషయమై ఈవో రేఖ మాట్లాడుతూ తలుపు తయారీదారులకు సమాచారం ఇచ్చామని, శుక్రవారం వచ్చి మరమ్మతులు చేస్తారని తెలిపారు.

ఫార్మా పరిశ్రమల్లో మాక్‌డ్రిల్

సూచనలు ఇస్తున్న అధికారులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: మాక్ డ్రిల్ ద్వారా ప్రజల్లో భద్రతపై అవగాహన పెరుగుతుందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.శ్రీనాథ్‌రావు అన్నారు. జిల్లాలోని నడికుడి వద్దనున్న ఫార్మా పరిశ్రమలు షిమోగా హెల్త్‌కేర్, కెమిస్ ల్యాబ్స్, శ్రీసింధు లైఫ్ సైన్సెస్‌లో రసాయనాలతో సంభవించే ప్రమాదాల నివారణపై సంబంధిత శాఖ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో పరిశ్రమల్లో సిబ్బంది, కార్మికుల మధ్య సమన్వయం ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ మాక్ డ్రిల్ దోహదపడుతుందన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజల స్పందన, సామర్థ్యాన్ని పరిశీలించడమే మాక్ డ్రిల్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ టి.రాజు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు అరికట్టడమే అంతిమ లక్ష్యం

తనిఖీలు చేస్తున్న రెండో పట్టణ ఎస్సై హరిబాబు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: నేరాలు అరికట్టడమే అంతిమ లక్ష్యంగా పల్నాడు జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. 'విజిబుల్ పోలీసింగ్ విధానం'లో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగత, ఆర్థిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ప్రధాన కూడళ్లలో విజిబుల్ పోలీసింగ్ విధానం అవలంబించడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చన్నారు. అక్రమంగా గంజాయి, మద్యం, నిషేధిత పొగాకు ఉత్పత్తులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించని వారికి అపరాధ రుసుం విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

'నిందితుడైన జగన్.. ఫిర్యాదిని కలవడం నేరం'

అరండల్‌పేట, న్యూస్‌టుడే: 'వైకాపా అధినేత జగన్ కారు కిందపడి సింగయ్య మృతి చెందారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న జగన్.. మృతుడి భార్య, ఫిర్యాది లూర్దు మేరీని కలవడం నేరం'.. అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. అమరావతి రోడ్డులోని జనసేన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఫిర్యాదిని కలవడమంటే.. వారిని కేసు నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేయడమే. సింగయ్య మృతి చెందిన వెంటనే రూ.10 లక్షల పరిహారాన్ని వైకాపా నేతలు అందించడం చూస్తుంటే.. జగన్ నేరం ఒప్పుకున్నట్లే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో నిష్పక్షపాతంగా పాలన సాగిస్తుంటే.. వైకాపా కుట్రపూరితంగా వ్యవహరిస్తూ.. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూడడం దారుణం. సింగయ్యను జగన్ అనుచరులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లనందునే మృతి చెందారు. జగన్‌ను కలిసిన తర్వాత సింగయ్య భార్య లూర్దు మేరీ.. వ్యాఖ్యలు చూస్తుంటే కుట్ర కోణం ఉందనిపిస్తుంది' అని వెల్లడించారు.

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై సమీక్ష

వీడియో సమావేశంలో కలెక్టర్, అధికారులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాధాన్య అంశాలైన పీ4, మహిళా స్వయం శక్తి సంఘాలకు వార్షిక క్రెడిట్ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్, మైక్రో క్రెడిట్ ప్లాన్, పోషణ్ ట్రాకర్, బాల సంజీవని లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు, బయోగ్యాస్ ప్లాంట్, సోలార్ ప్రాజెక్టులకు భూ సేకరణ సంబంధిత అంశాలు, రుతుపవన సన్నాహక చర్యలు తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఆయా శాఖల అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల విస్తృత తనిఖీలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: రాష్ట్ర రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాల బస్సులను రవాణా శాఖ అధికారులు గురువారం విస్తృత తనిఖీలు చేశారు. 88 పాఠశాలల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామని, రవాణా శాఖ నియమ నిబంధనలు పాటించని బస్సులకు సుమారు రూ.3,12,920 అపరాధ రుసుము వసూలు చేసినట్లు జిల్లా రవాణా అధికారి జి.సంజీవ్‌కుమార్ తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ

పంచాయతీ స్థలంలో నిర్మించి, అద్దెకు ఇచ్చిన గది

కారంపూడి, న్యూస్‌టుడే: కారంపూడిలోని పంచాయతీకి చెందిన విలువైన స్థలాన్ని ఓ వైకాపా నాయకుడు ఆక్రమించి, అందులో గది కట్టించి అద్దెకు ఇచ్చేశాడు. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గాంధీబొమ్మ సెంటర్లోని మచ్చ బావి పక్కన సర్వే నెంబరు 347లో పంచాయతీ స్థలం ఉంది. దీనిపై కన్నేసిన వైకాపా నాయకుడు ఆక్రమించేసి, తన పూర్వీకుల నుంచి సంక్రమించినట్లుగా చూపి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అండదండలతో గది నిర్మించి, అద్దెకు ఇచ్చాడు.

దస్త్రాలు పరిశీలిస్తున్నాం: కశిన్యానాయక్, కార్యదర్శి

గాంధీబొమ్మ సెంటర్లోని మచ్చ బావి ప్రాంతం పంచాయతీకి చెందిందే. అక్కడ నిర్మించిన గదికి సంబంధించిన దస్త్రాలు పరిశీలిస్తున్నాం. పంచాయతీ స్థలం ఎంత ఉంది. రికార్డుల్లో ఏమేరకు నమోదైందో చూస్తున్నాం. గది పంచాయతీ స్థలంలో ఉన్నట్లే తేలితే ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటాం.

ఎదురెదురుగా బస్సు, లారీ ఢీ

ఒకరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న జితేందర్ బిసోయ్

కనమర్లపూడి(శావల్యాపురం), న్యూస్‌టుడే : వేగంగా ప్రయాణిస్తున్న ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం మండలం కనమర్లపూడి ఎస్సీ కాలనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా ఛాంపియన్ గ్రామానికి చెందిన జితేందర్ బిసోయ్ (30) టమాటాల లోడు కోసం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు బయలు దేరాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి 40 మంది ట్రావెల్స్ బస్సులో కాశీ యాత్రకు వెళ్తుండగా కనమర్లపూడి వద్ద బస్సు డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో పాటు డ్రైవరు జితేందర్ బిసోయ్ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. అతన్ని కాపాడేందుకు స్థానికుల ప్రయత్నం ఫలించలేదు. బస్సులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని శావల్యాపురం, నూజండ్ల 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై సంఘటన చోటు చేసుకోవడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రూరల్ సీఐ కె.ప్రభాకరరావు, ఎస్సైలు పొక్లెయిన్ సాయంతో లారీ, బస్సును వేరు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. బస్సులో ఉన్న ధనలక్ష్మి, సాయి పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్లీనర్ గోపాల్ బిసోయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ పి. శ్రావణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 81217 65159

ఆస్తి తనిఖీ కొరకు : 83328 35007

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1)నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత: శ్రీ కరీముల్లా మొఘల్, తండ్రి : బాబావలీ, డోర్ నెం.2-22, రాజాపేట, పోతవరం పోస్ట్, పురుషోత్తమపట్నం హామ్లెట్, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522616. **వేరొక చిరునామా:** శ్రీ కరీముల్లా మొఘల్, తండ్రి : బాబావలీ, డోర్ నెం.13-5-1/ఎ, 2వ లేన్, ఇస్లాంపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522601. **వేరొక చిరునామా:** శ్రీ కరీముల్లా మొఘల్, తండ్రి : బాబావలీ, షాప్ నెం.2, 2-15-42, కోట సెంటర్, సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522601. **వేరొక చిరునామా:** శ్రీ కరీముల్లా మొఘల్, తండ్రి: బాబావలీ, ప్లాట్ నెం.43కు పడమర వైపు, సాయిబాబా గుడి దగ్గర, లక్ష్మి శారదాంబ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522601.

డిమాండ్ నోటీసు తేది: 19-10-2023 డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.19-10-2023 నాటికి రూ.37,51,947/-+ వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.(ఏవైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును).

షెడ్యూల్ ఆస్తి వివరములు :

పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, నరసరావుపేట సబ్ డిస్ట్రిక్ట్, నరసరావుపేట మున్సిపల్ లిమిట్స్‌కు వెలుపలగా నరసరావుపేట రెవెన్యూ ఏరియాలోని సత్తెనపల్లి రోడ్డుకు తూర్పుగా గల సాయిబాబా గుడికి ఈశాన్యం సమీపంలోగల నరసరావుపేటరెవిన్యూ గ్రామ డినెం.39/1రు య. 10-73ట్లు, డినెం.39/2రు య3-00ట్లు, డినెం42/బిరు య1-31ట్లు వెరశి య. 15-04ట్లులో య.4-621/2 ట్లు భూమిన్నీ "లక్ష్మి శారదాంబనగర్" అను పేరుతో ప్లాట్లుగా విభజించగా ఏర్పడిన ప్లాట్లులోని ప్లాటునెం. 43రు లో పడమర వైపుగాగల ఇల్లు ఆవరణ స్థలము యావత్తు ఆస్తి రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 10283/2020, తేది: 05-09-2020 ప్రకారం శ్రీ కరీముల్లా మొఘల్, తండ్రి బాబావలీ గారికి చెందినది. **హద్దులు: తూర్పు:** వేములపాటి బాజిబాబుగారిప్లాటునెం. 43రు గాగల స్థలం హద్దు అ.41 లు, **దక్షిణం:** బ్లాకునెం.ఎరు గాగల స్థలంహద్దు. అ.29లు, **పడమర:** అ25లు వెడల్పుగల రోడ్డు హద్దు. అ.41లు, **ఉత్తరం:** అ30లు వెడల్పుగల రోడ్డు హద్దు. అ.29లు

ఈ నాలుగు హద్దుల మధ్యన గల చ.గ. 132-11లకు సరియగు చ.మీ.110-46ర్ల స్థలములో ఇప్పటికి సుమారు. 10నెలలు క్రిందట చ.అ 1200లలో నిర్మించినఆర్.సి.సి. డాబా ఇల్లు అందలి యావద్విశిష్ట వస్తు కప్పు, కలప సామానున్నూ, మరియు తలుపులు ద్వారబంధములు సహాయున్నూ అందలిగల కరెంటు సర్వీసు మీటరున్నూ,సదరుమీటరు డిపాజిట్టుతో సహాయున్నూ ఇందలి నాకు గల సమస్తహక్కులతో సహా మీకు విక్రయించి స్వాధీన పరచడమైనది.కరెంటు సర్వీసు మీటరున్నూ, సదరు మీటరు

రిజర్వు ధర : రూ.34,50,000/- ధరావత్తు : రూ.3,45,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 21-07-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: 04-07-2025 నుండి 20-07-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఇదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డీను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 03-07-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రైతులకు రుణాల మంజూరులో ప్రథమం

మొక్క నాటుతున్న డివిజన్ రిజిస్ట్రార్ తిరుపతయ్య, పక్కన జిల్లా సహకార అధికారి నాగరాజు

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : రైతులకు రుణాలు మంజూరు చేయడంలో సహకార సంఘాలు ప్రథమ స్థానంలో ఉన్నాయని జిల్లా సహకారశాఖ అధికారి ఎం.నాగరాజు అన్నారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులతో పాటు ఇతర వర్గాలకు సేవలందించేలా సహకార సంఘాలు చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణం సకాలంలో చెల్లించడం ద్వారా రైతులు తమ సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సహకార సంఘాల బలోపేతంతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. డివిజన్ రిజిస్ట్రార్ కె.తిరుపతయ్య మాట్లాడుతూ సంఘాలలో అక్రమాలకు తావులేకుండా కంప్యూటరీకరణ చేశామన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ రిజిస్ట్రార్ ఎస్.చిన్నరామిరెడ్డి పీఏసీ సీహెచ్ స్వరూప, నాదెండ్ల పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నాదెండ్ల, గణపవరం సీఈవోలు సీహెచ్ ధనలక్ష్మి, పి.లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

మహిళా కూలీ బలవన్మరణం

అద్దంకి, న్యూస్‌టుడే: తిమ్మాయపాలెం ఇటుక బట్టీల్లో పనిచేసే మహిళా కూలీ బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం ముండ్రువారిపాలేనికి చెందిన డి.మరియకుమారి (33) భర్తతో విభేదించి తొమ్మిదేళ్ల నుంచి వినుకొండ మండలం పెదకంచర్లకు చెందిన కంచర్ల శ్రీనివాసరావుతో సహజీవనం చేస్తున్నారు. ఆమెకు ముగ్గురు సంతానం. పిల్లలను తీసుకొచ్చేందుకు శ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఇంట్లోని దూలానికి ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెను కిందకు దించి అద్దంకి ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/పంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 ఫ్లైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోర్ 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

TO LET

COMMERCIAL

గుంటూరు, అశోక్‌నగర్, 1వ లైను, బీడీపీ ఆఫీస్ దగ్గర, డా॥ క్యాబ్ బిల్డింగ్ నందు 2వ ఫ్లోర్‌లో 1600 S.Ft. బిల్డింగ్ కమర్షియల్ పర్పస్‌కు అద్దెకు కలదు. ✆: 98854 99979, 94926 01716 & 96525 56678.

JOBS

Wanted Experienced Accountant to work on Tally ERP for an interior industry in Narasaraopet, Work timings from 9AM to 6.30 PM. 83310 29045.

Wanted Telecallers Male/Female to work in auto nagar, Guntur. from 9.30 AM to 6.30 PM @ 13,500 PM Contact 83310 29045.

Wanted Part Time Lady Graduate Teachers, Time: 1.00 P.M. to 8.00 P.M. & For Study Hours: 4.00 P.M. to 8.00 P.M. Sri Satya Sai Ideal School, Chowtra, Guntur-3. ✆: 0863-2222114, 2241837.

గుంటూరు, లక్ష్మీపురంలోని ఫ్లవర్ స్టోర్ నందు పనిచేయుటకు ఫుల్‌టైమ్ & పార్ట్ టైమ్ డెలివరీ బాయ్స్ కావలెను. 2 వీలర్ తప్పనిసరి. లోకల్స్ వారికి ప్రాధాన్యత. ✆: 63090 65666.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ +మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

అమరావతి ఇండస్ట్రియల్ స్పేర్స్ పేరేచర్ల ఆఫీస్ నందు పనిచేయుటకు కంప్యూటర్‌లో అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ మరియు సూపర్‌వైజర్ కావలెను. కాంటాక్ట్: 98123 34678.

కంప్యూటర్ డిజైనర్, ఐపీ కోఆర్డినేటర్, నర్సింగ్ స్టాఫ్, హెల్పర్స్, ల్యాబ్ టెక్నీషియన్ (నైట్ డ్యూటీ) కావలెను. ✆: 77999 77855.

MARKETING/ SALES

Wanted – Public Relations Officer (PRO) for Dental Clinic in Guntur. (M/F). Role: Patient interaction, community outreach, event coordination, and clinic promotion. Contact: 9440303206.

FACULTY/ TEACHERS

Naveena High School, Guntur require qualified Teachers for Maths & Science, English & Social Combinations and Lady P.E.T. 93923 58368.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..

ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

(c) eenadu

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో దేవదాసు

నకరికల్లు, న్యూస్‌టుడే: నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏవో దేవదాసు అన్నారు. గురువారం నకరికల్లులోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. వరి విత్తనాల నిల్వలు, దస్త్రాలు, బిల్లు పుస్తకాలను ఆయన పరిశీలించారు. లైసెన్స్ కల్గిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల

రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపు

మాచర్ల (కారంపూడి): రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపు దక్కింది. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాచర్ల క్లబ్ సభ్యులు కృష్ణకుమారి, సురేశ్, లక్ష్మీ రెండు రజత, రెండు కాంస్య పతకాలు అందుకున్నారు. పిల్లర్ ఆఫ్ది రోటరీ క్లబ్ అవార్డును డాక్టర్ రామకోటయ్యకు ప్రదానం చేశారు.

అవార్డులు స్వీకరిస్తున్న మాచర్ల రోటరీ క్లబ్ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? ముప్పాళ్ళ మున్సిపేటలోని ప్రధాన మురుగు కాలువ అధ్వానంగా ఉంది. పూడికతీత పనులు చేపట్టి వ్యాప్తిని అడ్డుకోవాలి. **- స్థానికులు, ముప్పాళ్ళ** ✔ మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తాం. **- శివాజీ, కార్యదర్శి - న్యూస్‌టుడే, ముప్పాళ్ళ**

? తండాలోని మెయిన్ బజారులో వీధి దీపాలు వెలగడం లేదు. **- లక్ష్మీనారాయణ, బొదిలవీడు** ✔ కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- వెంకటేశ్వర్లు, కార్యదర్శి** ? శివాలయం పరిసర ప్రాంతంలో చెత్త వేస్తున్నారు. భక్తులు ఆలయానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. **- మహిళలు, వెల్దుర్తి** ✔ ఆలయ పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- మకటలాల్, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, వెల్దుర్తి**

? దిడుగు ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. **- కాలనీ వాసులు** ✔ సిబ్బందిని పంపి, దీపాలను వెలిగిస్తాం. **- సుధాకర్, కార్యదర్శి - న్యూస్‌టుడే, అమరావతి**

చీకట్లు తొలగాయ్

స్పందనకు వందనం

సత్తెనపల్లి: పట్టణంలోని 11వ వార్డు వెంగళ రెడ్డినగర్ వార్డు సచివాలయం సమీపంలోని బజారులో వీధి దీపం వెలగక చీకట్లు అలుముకున్నాయి. రాత్రి వేళల్లో పాములు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడు' దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యను 'న్యూస్‌టుడే' మున్సిపల్ డీఈ మధుసూదనరావుకు తెలియజేయడంతో ఆయన స్పందించారు. వీధి దీపానికి మరమ్మతు చేయించారు.

కూటమి వచ్చింది.. కష్టాలు తీర్చింది!

దాచేపల్లి, న్యూస్‌టుడే

తెదేపా నాయకుల పోరాటం ఫలించింది. అన్నదాతలకు న్యాయం జరిగింది. ఎమ్మెల్యే యరపతినేని చొరవతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పరిహారం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో యరపతినేని శ్రీనివాసరావు చొరవతో చెట్టినాడు సిమెంట్స్ యాజమాన్యం పెదగార్లపాడు వద్ద పరిశ్రమను స్థాపించడానికి ముందుకు వచ్చింది. అప్పటి తెదేపా నేత పురంశెట్టి అంకులు ఆధ్వర్యంలో పెదగార్లపాడు, తంగెడ, కేసానుపల్లి, తుమ్మలచెరువు గ్రామాల రైతులతో చర్చలు జరిపి భూములు ఇప్పించేలా కృషి చేశారు. 2018లో పరిశ్రమ నిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం రాగానే యాజమాన్యం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. పరిశ్రమ నుంచి వెలువడిన దుమ్ము ధూళితో పంటలు దెబ్బతింటున్నాయని, నష్టపరిహారం చెల్లించాలని వేడుకున్నా పట్టించుకోలేదు. మైనింగ్‌తో ఇళ్ల గోడలు బీటలు వారి దెబ్బతిన్నాయి. బాధితులు నిరసనలు, ఆందోళనలు చేయగా.. అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేశారు. అలాగే తంగెడ గ్రామంలోని భవ్య సిమెంట్ పరిశ్రమ యాజమాన్యాన్ని బెదిరించి, మరో సంస్థకు దారాదత్తం చేశారు. అప్పట్నుంచి గ్రామాభివృద్ధిని విస్మరించారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయించి పరిశ్రమ యాజమాన్యం, రైతులతో చర్చలు జరిపారు. రైతుల పిల్లలు 50 మందికి పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇప్పించారు. పెదగార్లపాడు, తంగెడ గ్రామాల్లో మైనింగ్ దాటికి దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారంగా రూ.30,000 చొప్పున 137 కుటుంబాలకు రూ.41,10,000 చెల్లించారు. దుమ్ముధూళి దాటికి నష్టపోయిన 358.75 ఎకరాల పంటలకు రూ.81,52,850 పరిహారం అందించారు.

యువకుడికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని

రుణపడి ఉంటా

ఉద్యోగం ఇస్తామని తక్కువ ధరకు సిమెంట్ పరిశ్రమ మా భూమి కొనుగోలు చేసింది. బీటెక్ పూర్తి చేసి అయిదేళ్లుగా ఉద్యోగం కోసం యాజమాన్యం వద్దకు వెళ్లినా పట్టించుకోలేదు. వైకాపా నాయకులు బయటి వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకున్నారు. ఎమ్మెల్యే యరపతినేని, గ్రామ నాయకుడు పరంజ్యోతి చొరవతో ఉద్యోగం వచ్చింది. వారికి రుణపడి ఉంటాను. **- చొక్కా వెంకటేశ్వర్లు, పెదగార్లపాడు**

నష్టపరిహారం ఇచ్చారు

మా ఊరిలో 100కు పైగా ఇళ్లు బీటలు వారాయి. మా సమస్యపై అప్పటి ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదు. మా పేరు చెప్పుకొని కొందరు నాయకులు లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన అధికారులు, యాజమాన్యంతో చర్చలు జరిపి, దెబ్బతిన్న ప్రతి ఇంటికి నష్టపరిహారం ఇచ్చారు. **- యలమందమ్మ, పెదగార్లపాడు**

అప్పుల ఊబి నుంచి బయటపడ్డాం

మా గ్రామ శివారులో 10.5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మిరప పంట సాగుచేశా. సిమెంట్ పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ము ధూళి పంటపై పడి, మిరప మొక్కలు ఎదుగుదల లేక, పూత రాలిపోయింది. దిగుబడి రాలేదు. పెట్టుబడి దక్కలేదు. అప్పుల పాలయ్యాను. ప్రస్తుతం రూ.3,16,800 పరిహారం అందింది. అప్పుల బాధ తప్పింది. **- పక్కీరయ్య, తక్కెళ్లపాడు**

దుర్గిలో సత్యసాయి రథయాత్ర

దుర్గి, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా వందో జయంతి సందర్భంగా జిల్లాలో చేపట్టిన రథ యాత్ర గురువారం దుర్గికి చేరింది. స్థానిక సత్యసాయిబాబా సేవా సంఘం సభ్యులు రథంతో గ్రామోత్సవం నిర్వహించారు. వేదికకు అన్నదానం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్, పలుమారి సుబ్బారావు, గోవర్ధనరావు, రత్తయ్య, నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

ప్రతిభావంతులకు సత్కారం

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లు మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించిన ఐదుగురు విద్యార్థులను కుంకలగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. కుంకలగుంటకు చెందిన విద్యార్థులు రాధిక, నకరికల్లుకు చెందిన మల్లికార్జున, లక్ష్మీప్రసన్న, వెన్నెలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సింగరాజు సాయికృష్ణ హాజరై రాధికకు రూ.5,000 బహుమతిగా అందించారు. ఆయన మాట్లాడుతూ తాను కుంకలగుంట పాఠశాలలో చదివి, వైద్యునిగా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. అదే పాఠశాలకు అతిథిగా వచ్చినందుకు గర్వంగా ఉందన్నారు.

చర్చి వార్షికోత్సవం

రెంటచింతల, న్యూస్‌టుడే: దేశంలో క్రైస్తవ బోధనలు చేసేందుకు తొలిసారి అడుగు పెట్టిన థామస్ అని తుమ్మకోట ఆర్సీఎం చర్చి వికారం గురువు పవిత్రన్ అన్నారు. సెయింట్ పునీత థామస్ చర్చి 125 ఏళ్ల వార్షిక వేడుక గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యపూజబలి, తదితర కార్యక్రమాలు చేపట్టారు. పాదర్లు రాజారత్నం, ఏలీషారావు, థామస్ పాల్గొన్నారు.

ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

రాష్ట్రంలో సుపరిపాలన

పుట్లగూడెం(అచ్చంపేట), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టారని మండల తెదేపా అధ్యక్షుడు ఆశీర్వాదం, డీసీ ఛైర్మన్ పాపిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు పుట్లగూడెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలు అందజేశారు. నాయకులు బత్తుల శ్రీనివాసరావు, చిమటా శ్రీను, చంటి, నవీన్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.75 కోట్లు

మాడుగులలో విద్యార్థులతో యరపతినేని

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లగుడిపాడులోని సాక్షి వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2.75 కోట్ల నిధులను కేటాయించినట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అంజనాపురం, రామాపురం క్యాంపు, చర్లగుడిపాడులలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సాయంత్రం చర్లగుడిపాడులో గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్ రెడ్డి, కాంతారావు, లక్ష్మీనారాయణ, శ్రీను, రామారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధిస్తూ.. హామీలన్నీ నెరవేరుస్తున్నాం

హస్సేన్‌నగరం(పెదకూరపాడు), న్యూస్‌టుడే: వైకాపా అరాచకాలకు చరమగీతం పాడి, కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో ప్రజలకు మరోసారి స్వాతంత్ర్యం కల్పించిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి గురువారం హస్సేన్‌నగరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు చెప్పారు. తెలుగు వెన్నా సాంబశివారెడ్డి, అర్తిమళ్ల రమేశ్, ఏలూకూరి బ్రహ్మయ్య, నెల్లూరి మల్లి తదితరులు పాల్గొన్నారు.

హస్సేన్‌నగరంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అంచులవారిపాలెం(రాజుపాలెం): రాష్ట్రంలో ఆర్థిక వనరులు సమృద్ధిగా లేనప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుతోపాటు రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం అంచులవారిపాలెంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఇంటింటికీ తిరిగి ఏడాదిలో చేపట్టిన పథకాల గురించి గ్రామస్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. తొలుత కాపు నాయకుడు వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మండల అధ్యక్షుడు నరసింహారావు, జనసేన అధ్యక్షుడు తోట నర్సయ్య, నాయకులు వెంకటకోటయ్య, ప్రభుదాసు, పవన్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సుపరిపాలన కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే కన్నా

కార్యకర్తలే పార్టీకి ఉక్కు కవచాలు

మాచర్ల (కారంపూడి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఉక్కు కవచాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్లలోని మానకొండ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి పార్టీ క్లస్టర్, యూనిట్ బూత్ లెవల్ ఇన్‌ఛార్జులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, తెదేపా చేసిన యాప్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రజలు ఏడాదిగా స్వర్ణయుగాన్ని అనుభవిస్తున్నారన్నారు.

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి: తల్లికి వందనం పథకంతో పేద తల్లుల బిడ్డల చదువులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని, మహిళలకు దీపం-2 పథకం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. వెల్దుర్తిలో గురువారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్రీడాకారులకు అభినందన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడల్లో రాణించి సత్తెనపల్లికి వన్నె తీసుకురావాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో గత నెల చివరి వారంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు పి.వంశీకృష్ణ, ఎన్.శరత్‌లను కన్నా అభినందించారు. యువతకు కూటమి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై నడిచేదెట్లా?

మండలంలోని చంద్రాజుపాలెం రామాలయం వీధిలో మురుగు నీరు రోడ్డుపై నిలిచింది. కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్డుపై నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. కనీసం ప్రజలు నడిచేందుకు వీలు లేకుండా ఉంది. దోమలకు ఆవాసంగా మారింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బెల్లంకొండ**

మురుగులో కుళాయిలు

ధరణికోటలోని చెంచు కాలనీలో వీధి కుళాయిలు మురుగు కాలువలో ఉన్నాయి. కాలువ పూడికతో నిండి దుర్వాసన వస్తోంది. కుళాయి కింద బిందెలు, బక్కెట్లు మురుగులోనే పెట్టాల్సి వస్తోంది. పైపులకు లీకేజీలు ఏర్పడితే, నీరు కలుషితం అయితే అతిసారం బారినపడే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి కుళాయిలు కాలువలో లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

తాగునీరు సురక్షితమేనా?

సచివాలయంలో నీటి పరీక్షలు చేస్తున్న ఉద్యోగులు

వర్షాకాలంలో నీటి కలుషితంతో అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇలాంటి తరుణంలో ప్రజలు తాగే నీరు సురక్షితమా..కాదా అనే విషయం తేల్చాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై ఉంది. వర్షాల నేపథ్యంలో నీటి పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల్ని ప్రజలకు తెలియజేయాలని తాజాగా జిల్లాలోని 416 గ్రామ సచివాలయాలకు ఆదేశాలు అందాయి. కొన్ని రోజుల కిందట కూటమి ప్రభుత్వం నూతన నీటి పరీక్ష కిట్లను అందజేసింది. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

జాతీయ రహదారిపై అంధకారం

నగర పంచాయతీ పరిధిలో మాచర్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రెండేళ్ల కిందట మాచర్ల క్రాస్, నడికుడి ప్రాంతంలో డివైడర్లలో దీపాలను ఏర్పాటు చేశారు. అవి ఒక్కసారి కూడా వెలగకపోవడం గమనార్హం. రాత్రి వేళ డివైడర్లు కనపడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారుల అధికారులను అడగా.. నగర పంచాయతీ అధికారులకు అప్పగించామన్నారు. నగర పంచాయతీ అధికారులు మాత్రం తమకు అప్పగించలేదంటున్నారు. ఇరు శాఖల మధ్య సమన్వయ లోపంతో దీపాలు వెలగడం లేదు. **- న్యూస్‌టుడే, దాచేపల్లి**

మాచర్ల క్రాస్ రోడ్డులో వెలగని దీపాలు

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించరూ..

తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తూ..

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల మరమ్మతుదారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు మధుబాబుకు వినతిపత్రం అందజేశారు. 55 ఏళ్ల పైబడిన మెకానిక్‌లకు ప్రతినెల రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని, కార్మికశాఖ నుంచి గుర్తింపు కార్డులు ఇప్పించాలని, ఎలక్ట్రికల్ వాహనాలు, బీఎస్-5, బీఎస్-6 వాహనాల మరమ్మతులపై శిక్షణ ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఐలాండ్ సెంటరు నుంచి ర్యాలీగా కార్యాలయం దగ్గరకు వచ్చారు.
అచ్చంపేట: ప్రపంచ వాహనాల మెకానిక్‌ల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని మెకానిక్‌ల సంఘం ఆధ్వరంలో వేడుకలు నిర్వహించారు.

రెవెన్యూ సమస్యలపై చర్చ

మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

క్రోసూరు (అచ్చంపేట), న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తించేలా చూడాలని క్రోసూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం కోరింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోటయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఆగస్టు 31లోపు దేవాదాయ భూముల విభజన జరుగుతుందన్నారు. గుడిపాడు ఎంపీటీసీ సభ్యురాలు సుల్తానా, ఇతర సభ్యులు మాట్లాడుతూ తమకు 16 నెలల నుంచి గౌరవవేతనం అందడం లేదన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదన్నారు. సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీవో వెంకటేశ్వరరావు, ఏఈ మల్లికార్జునరావు తదితరులు మాట్లాడారు.

పంట బీమా తప్పనిసరి

కారంపూడి, న్యూస్‌టుడే: పంటలు సాగు చేస్తున్న రైతులు బీమా చేయించాలని డీసీ ఛైర్మన్ అంజయ్య తెలిపారు. గురువారం చింతపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈమేరకు ఏవో నరసింహారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటల బీమా ద్వారా పరిహారం పొందవచ్చన్నారు. ఈనెల 31 లోగా బీమా చేయించుకోవాలన్నారు.

రైతుల హక్కులు కాపాడాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే: అటవీ, అసైన్డ్ భూములు సాగుచేసుకునే రైతుల హక్కులను రెవెన్యూ అధికారులు కాపాడాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జి.రవిబాబు డిమాండ్ చేశారు. గురువారం అచ్చంపేట రెవెన్యూ కార్యాలయం వద్ద చెరుకొంపాలెం అసైన్డ్ భూముల రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ సరోజకు వినతిపత్రం అందజేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కౌలురైతు సంఘ నాయకులు టి.హనుమంతరావు, సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, హసన్, కేకే రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటచింతల యువకుడు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. పెయింటర్ ఆగస్టీన్ (26) కుటుంబ కలహాలతో మధ్యాహ్నం ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు.

దోమలతో వ్యాధులు

డెంగీపై అవగాహన ర్యాలీ

కారంపూడి: జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా గురువారం కారంపూడి ఉన్నత పాఠశాలలో ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వైద్యులు రమ్య, లక్ష్మీమోనిక విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల గన్యా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తాయన్నారు

వాహనాల తనిఖీ

రెంటచింతల: రెంటచింతలలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అతివేగంగా నడిపిన, అధికలోడుతో వెళ్లే వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని చోదకులు, మైనర్లు 15 మందిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జున తెలిపారు.

పీర్లకు అలంకరణ

నకరికల్లు: మొహర్రం పురస్కరించుకుని పలు గ్రామాల్లో పీర్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. గుండ్లపల్లి, చల్లగుండ్ల, కుంకలగుంట, కండ్లగుంట, దేచవరం గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

9న సార్వత్రిక సమ్మె

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి మహేష్ కోరారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఉద్యోగినికి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, సీఐటీయూ నాయకులు గురువారం సమ్మె నోటీసు అందజేశారు.
పెదకూరపాడు: ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు కోరారు. గురువారం పెదకూరపాడులో సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ప్రసాద్, రతన్‌రాజు, సుధాకర్, నాగేశ్వరరావు, యాకోబు, శేఖర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత

స్పందనకు వందనం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: శిరిగిరిపాడు గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. కాలువలు నిండి, మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తున్న తీరుపై గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ మకట్‌లాల్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి, కాలువలు శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

అల్లూరి స్ఫూర్తిని పుణికిపుచ్చుకోవాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దేశభక్తి, మనోధైర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని నేటితరం విద్యార్థులు పుణికిపుచ్చుకోవాలని స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో గురువారం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెనాలికి చెందిన యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. వసతిగృహ అధికారి రత్నబాబు, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, సేవాసంస్థ బాధ్యులు బుల్లిబాబు, శ్రీలత, అంజి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడికి నిరసన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సర్వేలో భాగంగా విజయవాడలో ఇంటి కొలతలు తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగిని అర్చనపై భౌతిక దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొండలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ గురువారం ఆ సంఘ ఆధ్వర్యంలో పురపాలక సంఘ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సంఘ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు ప్రదీప్, కమిటీ సభ్యులు వంశీసాయి, గౌరీశంకర్, సరిత, సైదా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పునరుద్ధరణకు చర్యలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: అచ్చంపేట మండలం పుట్లగూడెం- బెల్లకొండ మండలం వెంకటాయపాలెం వెళ్లే అటవీ రహదారి పునరుద్ధరణకు ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. అఖిలభారత గిరిజన వికాస్ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు బీటీ నాయక్, రమేష్‌నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నారు.

అటవీ, అసైన్డ్ భూముల వివరాలివ్వండి

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని అటవీ, అసైన్డ్ భూముల వివరాలు సమాచార హక్కు చట్టం ప్రకారం అందజేయాలని కోరుతూ మండల జనసేన నాయకులు గురువారం తహసీల్దార్ సరోజకు వినతిపత్రం అందజేశారు. మండల జనసేన అధ్యక్షుడు వీరభద్రరావు, నీలం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మన్నెం గోపి తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు కొత్తరూపు

సత్తెనపల్లి, పెదకూరపాడు, న్యూస్‌టుడే

సాగు, తాగునీటి కాలువలు పూడికతో నిండి అధ్వానంగా ఉన్నాయి. కట్టలు బలహీనపడి లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. చివరి ఆయకట్టుకు జలాలు అందడం లేదు. చాలాచోట్ల రైతులే శ్రమదానంతో బాగు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కాలువలపై దృష్టి సారించింది. వాటికి కొత్తరూపు తెస్తోంది. ఖరీఫ్‌లో పంటల సాగుకు నీరు విడుదల చేసిన వెంటనే, చివరి వరకు పారేలా అభివృద్ధి పనులు చేపడుతోంది. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని కాలువల మరమ్మతు పనులు చేపట్టారు.

108 పనులు.. రూ.5.79 కోట్లు

జలవనరుల శాఖలోని సత్తెనపల్లి ఈఈ కార్యాలయ పరిధిలో నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, క్రోసూరు సబ్ డివిజన్ల పరిధిలోని కాలువల మరమ్మతులకు (ఓఅండ్ఎం) రూ.5.79 కోట్ల నిధుల్ని ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో 108 పనుల్ని చేపట్టబోతున్నారు. మేజరు, మైనరు కాలువల పనుల్ని వేగవంతం చేస్తున్నారు.

◆ అమరావతి మేజర్ పరిధిలోని లగడపాడు వంతెన నుంచి 28వ కిలోమీటరు (సత్తెనపల్లి- అమరావతి కాలచక్ర రహదారి) వరకు ఎనిమిది మైనర్లలో పొక్లెయిన్లతో కాలువల పూడికతీత పనులు చేపడుతున్నారు. ఒక్కో నీటి సంఘానికి రూ.2 నుంచి రూ.3 లక్షల పనుల్ని కేటాయించారు.

◆ ముప్పాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని పెదనంది పాడు బ్రాంచి కాలువ కట్టల్ని బలోపేతం చేస్తున్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని మేజర్లు, మైనర్లలో పూడికతీత, కట్టల బలోపేతం, ముళ్లకంపలు, పిచ్చిచెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయి.

ఆయకట్టుకు ప్రయోజనం

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలో మిరప, పత్తి, వరి, మొక్కజొన్న పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు ఉంటున్నాయి. అమరావతి మేజర్ కాలువ చివరి వరకు నీరు పారకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల ఇదే పరిస్థితి. ఇప్పుడు అభివృద్ధి పనులతో సాగునీటి అవసరాలు తీరనున్నాయి.

◆ మరమ్మతు పనుల్ని పకడ్బందీగా చేపడుతున్నట్లు సత్తెనపల్లి ఈఈ మురళీధర్ చెప్పారు. సాగర్ జలాశయం నుంచి కాలువలకు నీరు విడుదల చేయకముందే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనుల్ని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

సత్తెనపల్లి వద్ద మరమ్మతులు

(c) eenadu

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి

నూజండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు దీడయ తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఉమాదేవి సిబ్బందిని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జంగాలపల్లె, త్రిపురాపురం, ములకలూరు పంచాయతీల్లో రక్షిత నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను ఆమె గురువారం పరిశీలించారు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పొడి చెత్త వేరు చేయాలన్నారు. ఆదేశించారు. జంగాలపల్లెలో నీటి ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు అందుబాటులోకి తీసుకురాకపోతే కార్యదర్శులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ రబ్బాని, కార్యదర్శులు ప్రభాకరరావు, రవీంద్ర, సందీప్ సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట పట్టణం: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోటీ పరీక్షలకు సంబంధించి గ్రంథాలయంలో పుస్తకాల వివరాలు, గ్రంథాలయంలో సౌకర్యాలపై సిబ్బంది, పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ భవనంలో విద్యుత్తు తీగలు వేలాడుతుండటం, ప్రహరీ లేకపోవడాన్ని పరిశీలించిన ఆయన గోడ నిర్మాణం, విద్యుత్తు తీగల మరమ్మతు పనులు చేయించాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మను ఆదేశించారు. అనంతరం గ్రంథాలయ సెస్ బకాయిలను చెల్లించాలని పురపాలకసంఘ కమిషనర్ శ్రీహరితో ఫోన్‌లో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో మున్సిపల్ కార్యాలయం పక్క బజారు నుంచి కోర్టుకు వెళ్లే దారిలో పలువురు మూత్రవిసర్జన చేస్తున్నారు. దీంతో ఆటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. - రామారావు ✔ ఆ దారిలో ఎవరూ మూత్ర విసర్జన చేయకుండా చర్యలు తీసుకుంటాం. - **రమణారావు, పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? నరసరావుపేట పాతూరు చెరువుకట్ట వీధిలో దేవాలయం ఎదుట డ్రైనేజీలో పూడిక తీయడం లేదు. ప్లాస్టిక్, వ్యర్థాలతో నిండిపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. - మహాలక్ష్మి ✔ సిబ్బందిని పంపి పూడిక తొలగిస్తాం. - **రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

చిలకలూరిపేట: మాట్లాడుతున్న వీఆర్‌వో రమేష్‌బాబు

ఓటు నమోదు పారదర్శకంగా నిర్వహించాలి

చిలకలూరిపేట గ్రామీణ, వినుకొండ, న్యూస్‌టుడే: ఓటు నమోదు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమైనా బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ఓటు నమోదు అధికారి (ఈఆర్‌వో) రమేష్‌బాబు సూచించారు. చిలకలూరిపేట పురపాలకసంఘం కౌన్సిల్ హాలులో నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల్లోని బీఎల్‌వోల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం -6, 7, 8, 6ఎ తదితర అంశాలపై అవగాహన చేశారు. చిలకలూరిపేట, నాదెండ్ల తహసీల్దార్లు మహ్మద్ హుస్సేన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. వినుకొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.శ్రీనివాసులు బీఎల్‌వోలకు శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి స్తూపం కూల్చివేతపై ఫిర్యాదు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 12వ వార్డులో ఏర్పాటు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి స్తూపాన్ని కూల్చివేయడంపై సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుపోయిన వెంకటేశ్వర్లు, సాతులూరు లూథర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్తూపం వెనుక ఉన్న ఇంటిని పట్టణానికి చెందిన షరీఫ్‌నబీ అనే వ్యక్తి కొనుగోలు చేశారని ఆయన జేసీబీ, పనివారితో వచ్చి ఇంటిని పడగొట్టే పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, లూథర్ స్తూపం ఉన్న విషయాన్ని హెచ్చరించారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించి స్తూపం కూల్చివేతకు కారణమైన షరీఫ్‌నబీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాల కళకళ

ఉన్నతీకరించిన తొలి ఏడాది రికార్డు స్థాయిలో చేరిక

వినుకొండ, న్యూస్‌టుడే

పట్టణంలో కొత్తగా ఉన్నతీకరించిన పాఠశాల మొదటి విద్యా సంవత్సరంలోనే ప్రత్యేకత చాటుకుంది. వినుకొండలోని ఎన్నెస్పీ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో (కోఎడ్యుకేషన్) 6, 7, 8 తరగతులకు ప్రవేశాలు ప్రారంభించిన వెంటనే రోజుల్లోనే సీట్లు భర్తీ అయ్యాయి. అందుబాటులో ఉన్న గదులు, ఉపాధ్యాయుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ప్రవేశాలు ఆపాలని నిర్ణయించారు. ప్రాథమికోన్నత పాఠశాలను ప్రభుత్వం ఈ సంవత్సరం ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించింది. జీజీఎల బదిలీ కౌన్సెలింగ్‌లో ప్రధానోపాధ్యాయుడు, ఫిజిక్స్‌తో పాటు ఏడుగురు సబ్జెక్టు టీచర్లను నియమించారు. గతంలో ఉన్న ఆరు, ఏడుతో పాటు కొత్తగా ప్రారంభించిన ఎనిమిదో తరగతికి విద్యార్థులు పోటీపడ్డారు. తరగతికి ఒక్క

ఎన్నెస్పీ కాలనీలోని ఉన్నత పాఠశాల

తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య		
తరగతి	గతంలో	ఇప్పుడు
6	40	109
7	42	96
8	0	106
9	0	26

సెక్షన్ మాత్రమే ఉన్నప్పటికీ 100 మంది వరకు చేరారు. పరిమితికి మించడంతో కొత్తగా వచ్చిన వారికి సీట్లు లేవని చెబుతున్నారు. తొమ్మిదో తరగతికి చేరాలనుకునే వారికి సీట్లు నిర్వహించి ప్రవేశం కల్పిస్తున్నారు. వీరంతా వచ్చే ఏడాది పదో తరగతి మొదటి బ్యాచ్ కావడంతో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్థానికంగా మరో రెండు ఉన్నత పాఠశాలలు ఉన్నా అందులో ఒకటి బాలికలు రెండోది బాలురకు ప్రత్యేకించినవి కావడం, ఇదొక్కటే కోఎడ్యుకేషన్‌లో నడవడం, అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉండటం, గతంలో వారి బోధన తీరు బాగుండటంతో పేరు ఉండటం ప్రవేశాలపై సానుకూలతను పెంచింది. ఇందులో ఉన్న ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఆయుదుగురు ఉపాధ్యాయులు, వంద మందికి పైగా విద్యార్థులున్నారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

పాఠశాలలో నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. బోధన ఉపాధ్యాయులు ప్రతి సెక్షన్‌కు ఒక్కొక్కరే ఉన్నందున 6, 7, 8 తరగతులకు ప్రవేశాలు ఆపేశాం. ఆయా తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. మాపై నమ్మకంతో చేరిన విద్యార్థులకు న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తాం. చదువుతో పాటు ఇతర అంశాలపై శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాం. - **సీహెచ్ వీర అప్పయ్య, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, ఎన్నెస్పీ కాలనీ, వినుకొండ**

శిరిడీసాయికి అభిషేకం

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో బోసుబొమ్మ సెంటర్‌లోని శిరిడీసాయి మందిరంలో మూలవిరాట్‌కు మహిళలు 151 కలశాలతో నీరు తెచ్చి అభిషేకం నిర్వహించారు. తొలుత విష్ణు సహస్రనామం పఠించారని ఆలయ పూజారి పి.శ్రీనివాసశర్మ తెలిపారు. శంకర సత్సంగం, గీతామందిరం సభ్యులు పాల్గొన్నారు.

కలశాలతో మహిళల ఊరేగింపు

క్లబ్ సాయం.. తండాలో తీరిన దాహం

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే: ఇన్నర్‌వీల్ మిడ్ పట్టణ క్లబ్, విజయవాడ తోడ్పాటుతో బొల్లాపల్లి మండలం వెంకటరెడ్డిపురం తండా వాసుల దాహార్తి తీరింది. ట్రాన్స్ మీడియా ఇంటర్నెట్ సంస్థ ఆర్థిక సహకారంతో రూ.24.58లక్షల ఖర్చుతో బోరు బావి, నీళ్లు నిల్వ చేసే ట్యాంకు నిర్మించడంతో పాటు గ్రామంలో అంతర్గత పైపులైన్ ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. తాగు నీటి పథకం ప్రారంభించేందుకు గ్రామానికి వచ్చిన క్లబ్ అధ్యక్షులకు కంతేటి సంధ్యారాణికి తండా మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు.

గిరిజన మహిళలతో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు సంధ్యారాణి

పునర్నిర్మాణం దిశగా బలమైన పునాదులు

వినుకొండ, ఈపూరు, చిలకలూరిపేట గ్రామీణ, రొంపిచర్ల, నూజండ్ల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో వ్యవస్థల్ని గాడిన పెట్టి రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా బలమైన పునాదులు వేశారని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు- ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం వినుకొండ పట్టణం 17వ వార్డు, సాయంత్రం ఈపూరు మండలం ఇనుమెళ్ల, ముప్పాళ్లలో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకన్నా రౌడీయిజాన్ని నమ్ముకున్న వ్యక్తి జగన్ అని ప్రజలు తిరస్కరించినా మళ్లీ దానినే అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. సామాజిక పింఛను రూ.4వేలు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కౌన్సిలర్ షేక్, తెదేపా పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రావిపాటి జగ్గారావు, జనసేన నాయకులు, ఎమ్మెల్యే గ్రామ పార్టీ అధ్యక్షుడు సీతారామయ్య ఉన్నారు. చిలకలూరిపేట మండలం పసుమర్రులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పసుమర్రు, గణపవరం, మానుకొండవారిపాలెం గ్రామాలు గతంలో అభివృద్ధికి దూరమయ్యాయని ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఈ సందర్భంగా ఓగేరు వాగులో రూ.2.50 కోట్లతో చేపట్టే వంతెన, పూడికతీత పనులను ప్రారంభించారు. పసుమర్రు పశువైద్యశాలలో పశుగ్రాస విత్తనాలు రాయితీపై పశుదాణా పంపిణీ చేశారు. గొర్రెలకు నట్టల నివారణమందు పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో పరిశీలకురాలు ఉషారాణి, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, కందుల రమణ, జాలాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. రొంపిచర్ల మండలం మునమాక, ముత్తనపల్లిలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ జి.కోటేశ్వరరావు ఇంటింటికి కరపత్రాలు అందజేశారు. నూజండ్ల మండలం తిమ్మాపురం, పుచ్చనూతల పంచాయతీల్లో మాజీ ఎంపీపీ బొట్ల అంజయ్య నేతృత్వంలో పార్టీ నేతలు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

ఈపూరు: ఇనుమెళ్లలో గ్రామస్థులకు కరపత్రాలు అందిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మక్కెన

సమస్యలు ప్రస్తావించిన ప్రజలు.. వినుకొండ కొండ మెట్ల బజారులో కరెంట్ స్తంభం వరకు కురస్తే పాక్షికంగా కొడుతుందని తిరుమలమ్మ చెప్పడంతో రెండ్రోజుల్లో సమస్య పరిష్కరించాలని అక్కడే ఉన్న విద్యుత్తుశాఖ ఏఈని పిలిపించి ఆదేశించారు. కొండమెట్ల రోడ్డు నుంచి అప్పయ్యకుంట మీదుగా మసీదు వరకు కొత్త రహదారి నిర్మించాలని జానీబాషా వినతి పత్రం అందించారు. తమ ప్రాంత వాసుల అంత్యక్రియలకు ప్రత్యేక స్థలం కేటాయించాలని సీహెచ్ కోటిరత్నం విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్సకు సీఎం సహాయనిధి నుంచి ఎల్‌వోసీ ఇప్పించాలని బేతం సుభాషిణి అభ్యర్థించారు. మాలపల్లెకు శ్మశానం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయా విజ్ఞప్తులను చర్చించి పరిష్కరిస్తామని జీవీ ఆంజనేయులు తెలిపారు.



నరసరావుపేట: ముత్తనపల్లిలో కరపత్రాలు అందిస్తున్న గోనుగుంట్ల, పార్టీ నేతలు

జోరుగా కాలువల్లో పూడికతీత

పిచికలపాలెం (శావల్యాపురం), న్యూస్‌టుడే: మండలంలో కొంకేరు వాగు పరిధిలో కంచర్ల కాలువ ప్రధానమైనది. దీని కింద కనమర్లపూడి, పిచికలపాలెం, పెదకంచర్ల తదితర గ్రామాల రైతుల పొలాలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం కాలువల అభివృద్ధి పట్టించుకోకపోవడంతో అవి ముళ్లపొదలు, పూడికతో నిండి ఆయకట్టు చివరి భూములకు సాగునీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంట కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. అభివృద్ధి పనులకు రూ.8.90లక్షల నిధులు కేటాయించిందని సాగునీటి సంఘం అధ్యక్షుడు తిరువీదుల శ్రీనివాసరావు, ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరుకున్నాయి. కాలువలో పూడికతీతతో పొలాలకు నీరందు తుందని ఆయకట్టు పరిధిలో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాగుపడిన కంచర్ల కాలువ

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలో కొత్తపాలెం, కొండవీడు, కోట గ్రామాల్లో విద్యుత్తు నియంత్రికలకు మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.



విరిగిన స్తంభం.. తప్పిన ప్రమాదం

పట్టణంలోని కారంపూడి రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా విభాజకంపై స్తంభం గురువారం విరిగి తీగల ఆధారంగా పక్కకు వాలింది. తొలి ఏకాదశి పండగ సందర్భంగా స్తంభాలను అలంకరించేందుకు కార్మికులు పనిచేస్తుండగా అకస్మాత్తుగా ఈ స్తంభం విరిగింది. దానికి తాడు కట్టి కిందకు దించి పక్కన పెట్టారు.

– న్యూస్‌టుడే, వినుకొండ

ప్రధాన కూడలిలో తప్పని అవస్థ

చిలకలూరిపేట చౌత్రా సెంటర్‌లో ఆంజనేయస్వామి గుడి పక్కన చిన్నపాటి వర్షానికే నీరు నిలబడుతోంది. ప్రధాన కూడలి, పైగా మూడు దేవాలయాలకు రాకపోకలు సాగించే మార్గం కావడంతో ద్విచక్రవాహనాలు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పురపాలకసంఘ ఏఈ అన్సర్ దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంతంలో మెరక తోలించి నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

మూతకు మరమ్మతు చేయరూ!

పట్టణంలో ప్రధాన చర్చి పక్క వీధిలో డ్రెయినేజీ మూతకు రంధ్రం పడింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించక పాదచారులు అడుగేస్తే కాళ్లు ఇరుక్కుపోయే అవకాశం ఉంది. ఈ విషయమై మున్సిపల్ ఏఈ జ్యోతిని సంప్రదించగా వెంటనే మ్యాన్‌హోల్‌పై కొత్త మూత ఏర్పాటు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం

నూజండ్ల, న్యూస్‌టుడే: ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పెద్దవరం ప్రాథమిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్‌ల రహిత దినోత్సవం నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు భూమిలో కలిసి పోవడానికి 100 నుంచి 500 సంవత్సరాల వరకు పడుతుందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల భూమి నుంచి సముద్ర జీవులకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా పేపర్ సంచులు తయారు చేయించారు. జనపనార, వస్త్ర సంచులు వాడుకోవాలన్నారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండ పండగలో భక్తులకు ఇబ్బంది రానీయొద్దు

వినుకొండ, వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈనెల 6న తొలి ఏకాదశి తిరునాళ్లను విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘాట్ రోడ్డు ప్రయాణం, కొండపై దర్శనం, సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నరసరావుపేట ఆర్డీవో మధులత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది హత్య సంఘటన దృష్ట్యా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనుమతి లేని సాంస్కృతిక కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లను ముందుగా అదుపులోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్టీసీ అధికారులు ఫిట్‌నెస్ ఉన్న బస్సులను మాత్రమే కొండపైకి నడపాలని సూచించారు. తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

450 మందితో బందోబస్తు

వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమీక్ష అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా ఒక అదనపు ఎస్పీ, ఒక డీఎస్పీ, 22 మంది సీఐలు, 25 మంది ఎస్సైలతో పాటు 450 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలకు ఆంక్షలతో కూడిన అనుమతి ఇస్తున్నామన్నారు. కొండపైకి ప్రైవేటు వాహనాలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసుల ఆంక్షలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ప్రభలు ఎన్నెస్పీ కాలనీలో, ఆర్కెస్ట్రా, నాటకాలను జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 5 నుంచి ఆంక్షలు అమలులోకి వస్తాయని, రోడ్ల వెంబడి ఎలాంటి వాహనాలు నిలపకూడదన్నారు. సమావేశంలో రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్సైలు ఉన్నారు.

కాలువకు రూపు తెచ్చారు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: పట్టణంలో బరంపేట మిట్టబజారులో మురుగు కాలువలు రూపు కోల్పోయాయి. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 3న 'ఇక్కడో కాలువ ఉండాలే' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య స్పందించారు. కాలువను, చెత్త తరలించే బండిని బాగు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈనాడు కథనాలకు స్పందన

కల్వర్టుకు కాంక్రీట్ పూత

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని 23వ వార్డులో జెండా చెట్టు బజారులో దెబ్బతిన్న కల్వర్టును బాగు చేశారు. నాలుగేళ్ల క్రితం తాగు నీటి సరఫరా పైపులైన్ కోసం సిమెంట్ రోడ్డుతో పాటు కల్వర్టును పగలగొట్టి కాల్వ తీశారు. అప్పటి నుంచి దానిని పూడ్చకుండా వదిలేయడంతో రాత్రి వేళ కనిపించక చాలా మంది జారి పడి కొందరికి గాయాలయ్యాయి. ఈ సమస్యను జూన్ 20 'ఈనాడు' వెలుగులోకి తేవడంతో మున్సిపల్ ఏఈఈ ఆదినారాయణ స్పందించి సిమెంట్ కాంక్రీట్ వేయించి సమస్యను పరిష్కరించారు. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు బ్యాగుల అందజేత

వినుకొండ రూరల్: ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారు విద్యార్థులు, పేదలకు తోచిన సాయం అందించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు అన్నారు. తన మాతృమూర్తి జ్ఞాపకార్థం విఠంరాజుపల్లిలోని సెయింట్ ఆన్స్ ఉషోదయ మూగ, చెవిటి, మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, మిఠాయిలు అందజేశారు. ప్రిన్సిపల్ నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపిరెడ్డికి అభినందనలు

నరసరావుపేట వ్యవసాయం: వైకాపా పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.

సేవలకు గుర్తింపు

నరసరావుపేట సెంట్రల్: మండలంలో శంకరభారతీపురం జడ్పీ పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు బొగ్గరపు సుజాతకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ ఇటీవల గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. నరసరావుపేటలోని లూథరన్ అంధుల పాఠశాలలో ఈమె విద్యనభ్యసించారు. అంధ బాలలకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో పాఠశాలల్లో చేరేందుకు చేసిన ఈమె కృషికి గుర్తింపు లభించింది. ఆమెకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పెదకంచర్ల దారిలో ప్రయాణం ప్రయాస

కారంపూడి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బ్రాహ్మణపల్లె, విఠంరాజుపల్లె మీదుగా పెదకంచర్ల వెళ్లే పంచాయతీ రాజ్ శాఖ రహదారిలో చాలా చోట్ల తారు లేచి గుంతలు ఏర్పడ్డాయి. గుంతల కారణంగా లారీలు తదితర లోడు వాహనాలు కట్టలు విరిగి ఇబ్బంది పడుతున్నారు. ఇదే మార్గంలో బ్రాహ్మణపల్లె సమీపంలో వాగుపై నిర్మించిన కల్వర్టు లోపల గోడ కూలి గొయ్యి ఏర్పడింది. వినుకొండ పట్టణంలోకి రాకుండా నరసరావుపేట, కారంపూడి వైపు వెళ్లే వాహనాలకు ఇది బైపాస్‌గా ఉపయోగపడుతుంది. ఈ విషయమై ఏఈ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. – న్యూస్‌టుడే, వినుకొండ

దేవాదాయ భూముల కౌలు వేలం

ఈపూరు, న్యూస్‌టుడే: ఈపూరు వీరేశ్వరస్వామి దేవాలయం పరిధిలోని మాన్యం భూముల కౌలుకు గురువారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు రూ.1,24,100 పాడుకున్నారు. ఏడాది పాటు ఈ భూములు వీరి అధీనంలో ఉంటాయి. గతంలో ఈ భూములకు రూ.2.54లక్షలు కౌలు పలికింది. ఇప్పుడు వేలానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండుసార్లు వాయిదా పడింది. మూడోసారి జరిగిన వేలంపాటలో 10.50 ఎకరాల దేవాదాయశాఖ భూమిని ఏడుగురు రైతులు రూ.1,24,100కు పాడుకున్నారు. కార్యక్రమంలో కారంపూడి గ్రూపు సంస్థల ఈవో కె.హనుమంతరావు, ఇనుమెళ్ల గ్రూపు సంస్థల ఈవో ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu

డోలీ మోతలు లేని గ్రామాలే లక్ష్యం

మంత్రి సంధ్యారాణి

మక్కువ, న్యూస్‌టుడే: కొండశిఖర గ్రామాలకు రహదారులు వేసి డోలీ మోతలు లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. మక్కువ మండలంలోని దుగ్గేరు, మార్కొండపుట్టిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం గురువారం నిర్వహించారు. 14 గ్రామాల ప్రజలు ఆమెకు స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. దుగ్గేరు, మార్కొండపుట్టిలో సీసీ రోడ్లు, కాలువలు లేవని స్థానికులు చెబితే పరిష్కరిస్తామన్నారు. దుగ్గేరులో పీహెచ్‌సీతో పాటు గుంటభద్ర, మెండంగి వెళ్లే మార్గాల్లో వంతెనలు నిర్మిస్తామన్నారు. మెండంగి, చిలకమెండంగి, సిరివరకు రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. తెదేపా మండలాధ్యక్షుడు జి.వేణుగోపాలనాయుడు, నాయకులు వీరబాబు, చిన్నారి, బుచ్చినాయుడు, వాసునాయుడు, పి.మల్లేశ్వరరావు, ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మార్కొండపుట్టిలో కరపత్రాలు చూపుతున్న మంత్రి సంధ్యారాణి, గ్రామస్థులు

జిల్లా ఉన్నతాధికారులతో 'ఫోన్-ఇన్' నేడు

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రులకు రోగులు వరస కడుతున్నారు. ఈ నేపథ్యంలో మీ ప్రాంతాల్లో అధ్వాన పరిసరాలు, మురుగుతో నిండిన కాలువలు, ఆసుపత్రుల్లో మందులు, వైద్యుల కొరత, వైద్య చికిత్సకు ఎదురవుతున్న సమస్యలను నేరుగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక దృష్టికి తీసుకురావొచ్చు. 'ఈనాడు' ఫోన్‌ఇన్‌కు కాల్ చేసి సమస్యలకు పరిష్కారం పొందవచ్చు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

తేదీ: 04.07.2025, శుక్రవారం
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య
ఫోను నంబర్లు: 08963358680, 83338 13243

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి: డీఐజీ

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల నియంత్రణపై దృష్టి పెట్టినట్లు డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీసు కార్యాలయంలో సోషల్ మీడియా, సైబర్ సెల్, మినీ ట్రైనింగ్ కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ట్రాఫిక్ నియంత్రణ, రహదారి ప్రమాదాల నివారణకు విజిబుల్ పోలీసింగ్ ఉపయుక్తంగా ఉండేలా అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఘటనా స్థలానికి చేరుకుని వెంటనే అంబులెన్సుల్లో క్షతగాత్రులను తరలించేందుకు ఈ వాహనాలు ఉపకరిస్తాయన్నారు. వెనుకబడిన జిల్లాలో పోలీసు వ్యవస్థ మెరుగు పర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకితా సురాన, డీఎస్పీలు రాంబాబు, థామస్‌రెడ్డి, సీఐలు రంగనాథం, అప్పారావు, శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభిస్తున్న గోపీనాథ్ జట్టి

గొంతులో గరళం

న్యూస్‌టుడే పరిశీలన

రక్షిత నీటి పథకాల చెంత కానరాని శుభ్రత

న్యూస్‌టుడే, పార్వతీపురం

- నాగావళి, సువర్ణముఖి, వేగావతి, వంశధార పెద్దగెడ్డ నదుల జలాలతో జిల్లాలో పది సీపీడబ్ల్యూ పథకాలు పనిచేస్తున్నాయి. వీటి నుంచి 291 గ్రామాల పరిధి 2.39 లక్షల మందికి తాగునీరు అందిస్తున్నారు.
- ఒక్కో గ్రామానికి మాత్రమే తాగునీరు అందించే పథకాలు 1,299 ఉన్నాయి. వీటికి బోరుబావులే ఆధారం. వీటి నుంచి 4.62 లక్షల మందికి రక్షిత జలాలు అందించాలి.
- 137 గ్రామాలలో 7,217 చేతిపంపులు ఉన్నాయి. వీటి నుంచి 24 వేల మందికి తాగునీరు అందించే వీలుంది.
- 160 గ్రామాల్లో 32 వేల మందికి గ్రావిటీ ఆధారంగా పనిచేసే పథకాలతో జలాలు సరఫరా చేస్తున్నారు.
- సౌరశక్తి ఆధారంగా పనిచేసే పథకాలు జిల్లాలో 395 ఉన్నాయి. ఇవి 80 వేల మందికి తాగునీరు అందించాలి.

వెళ్లేదారి లేకుండా ట్యాంకుల చుట్టూ తుప్పలు.. శిథిల స్థితికి చేరిన మెట్ల మార్గాలు.. కనిపించని క్లోరినేషన్ తేదీలు.. ఇదీ జిల్లాలో పలు గ్రామాల్లో రక్షిత నీటి ట్యాంకుల వద్ద దుస్థితి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో ఆసుపత్రుల్లో రోగులు పెద్దసంఖ్యలో చేరుతున్నారు. అలసత్వం చేయకుండా అధికారులు అప్రమత్తం కావాల్సిన సమయమిది.

రెండేళ్లైనా మరమ్మతులు లేవు..

సాలూరు: పట్టణంలోని గాంధీ పార్కు నీటి పథకం రెండేళ్ల కిందట శుభ్రం చేశారు. 2023లో ట్యాంకు మెట్లు విరిగిపోవడంతో ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. పట్టణంలోని 50 వేల మంది ప్రజలకు రోజూ 3.50 ఎంఎల్‌డీ తాగునీరు అందిస్తున్నారు. పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన ట్యాంకు మెట్లు విరిగిపోవడంతో ఇప్పుడు శుభ్రం చేయడం లేదు. 'నీటి సరఫరా కేంద్రం వద్ద పంపింగ్ చేసేటపుడు క్లోరినేషన్ చేస్తాం. ప్రతిరోజూ నీటి పరీక్షలు నిర్వహించి రక్షిత నీరందిస్తున్నాం' అని పుర కమిషనర్ ప్రసాద్ తెలిపారు.

శుభ్రపరిచిన తేదీ వివరాలు లేకుండా ఇలా..

1,500 కుటుంబాలకు కలుషిత జలమే

పాలకొండ: మండలంలోని పొట్లి గ్రామంలో పూర్తిస్థాయిలో రక్షిత పథకం క్లోరినేషన్ జరగడం లేదు. ట్యాంకు ఇనుప రైలింగ్ శిథిలావస్థకు చేరింది. గ్రామంలోని 1,500 వరకు జనాభా ఈ పథకం నీటిపైనే ఆధారపడుతున్నారు. పథకానికి పైన మూత లేకపోవడంతో తాగునీరు కలుషితమవుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

పొట్లిలో శిథిలమైన రక్షిత పథకం

తుప్పు పట్టిన పైపులు

సీతంపేట: మినీ గురుకులం సమీపంలో 2009లో ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా పథకం మెట్లు నాచుపట్టాయి. ట్యాంకుకు నీరు ఎక్కించే పైపులు తుప్పు పట్టాయి.

విరిగిన మెట్లు

బలిజిపేట: మండలంలోని అంపావల్లి పైలెట్ ప్రాజెక్టు పరిధిలోని వెంగళరాయపురం, జగన్నాథవలస గ్రామాలకు తాగునీరందించేందుకు అంపావల్లి గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు మెట్లు సగానికి పైగా విరిగిపోయాయి. దీంతో ఈ ట్యాంకు శుభ్రానికి నోచుకోలేదు. ఈ విషయాన్ని నీటిసరఫరా విభాగం జేఈ పవన్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు.

పరిసరాలు అధ్వానం

సీతానగరం: మండలంలోని రంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో రక్షిత పథకం పరిసరాలు శిథిలం. ట్యాంకును 15 రోజులకోసారి శుభ్రం చేయాల్సి ఉండగా అక్కడ పరిసరాలు నెలల తరబడి శుభ్రత చేయలేదనేలా కనిపిస్తున్నాయి. శుభ్రం చేసిన, తదుపరి తేదీ వివరాల నమోదు లేదు.

క్లోరినేషన్ వట్టి మాటే

భామిని: మండల కేంద్రమైన భామినిలో నీళ్ల ట్యాంకుకు ఎటువంటి శుభ్రత, క్లోరినేషన్ చేపట్టడం లేదు. శుభ్రత వివరాలు తెలిపే బోర్డు సైతం లేదు. ట్యాంక్ పైకి వెళ్లే ఇనుప మెట్లు పూర్తిగా విరిగిపోయాయి.

చేయాల్సిందిలా..

◆ 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలి. ◆ కాలాలతో సంబంధం లేకుండా క్లోరినేషన్ తప్పనిసరి. ◆ క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, కార్యదర్శులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పర్యవేక్షించాలి. ◆ వర్షాకాలంలో కాచిన నీటిని ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. ◆ ఏడాదికి రెండుసార్లు నీటి పరీక్షలు చేసి, లోపాలుంటే సరిచేయాలి. ◆ పథకాలు, పైపులైన్లు మరమ్మతులకు గురైతే సకాలంలో బాగుచేయాలి.

ఉద్యాన తోట.. ఉపాధి బాట

న్యూస్‌టుడే, పార్వతీపురం, పాలకొండ

ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగుకు జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. ఇంత వరకూ మట్టి పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాలో తోటల పెంపకం అంటే జీడి, మామిడి వినిపించేది. వాటికి బదులుగా ఆదాయం సమకూరే వివిధ రకాల తోటల వైపు దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొబ్బరి మొక్కలు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు.

జిల్లావ్యాప్తంగా 4500 ఎకరాల్లో మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 2,700 ఎకరాల్లో కొబ్బరి తోటలు పెంచేందుకు నిర్ణయించారు. జలవనరుల గట్లు, పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలు లక్ష్యంగా తీసుకొన్నారు.

గుమ్మలక్ష్మీపురం మండలం ఒప్పంగిలో కొబ్బరి మొక్కలు వేసేందుకు గుంతలు తవ్వుతున్న కూలీలు

మహిళా సంఘాలకు బాధ్యతలు

వీటి సం'రక్షణ' బాధ్యతను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించాలని నిర్ణయించారు. నిర్వహణ, పెంపకాన్ని ఉపాధి పథకం సహకారంతో వారే చూస్తారు. కొబ్బరి చెట్ల దిగుబడి వచ్చిన తర్వాత వాటిపై వచ్చే ఆదాయాన్ని ఆయా సంఘ సభ్యులందరికీ వర్తించేలా ప్రణాళిక రూపొందించారు.

మహిళా సంఘాలతో సాగు నిర్వహణకు చర్యలు

◆ గ్రామాల్లో చెరువులు, జలాశయాల గట్ల పైన కొబ్బరి మొక్కల పెంపకానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

◆ ఈ నెల 10లోగా మొక్కలను కొనుగోలు చేసి నాటే కార్యక్రమాన్ని ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు. ఎకరానికి 60 మొక్కలు చొప్పున నాటనున్నారు.

ప్రభుత్వ నర్సరీల నుంచి కొనుగోలు

మొక్కలను ప్రభుత్వం నిర్వహిస్తున్న నర్సరీల నుంచి తెప్పించి నాటేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ యోచిస్తోంది. ఒక్కో మొక్క కొనుగోలు ధరను ప్రభుత్వమే నిర్ణయించింది. ఒకవేళ లబ్ధిదారులే మొక్కలు కొనేందుకు ముందుకొస్తే ప్రభుత్వం నిర్దేశించిన ధరను చెల్లిస్తుంది. ఈ నెల 10 నుంచి మొక్కలు నాటే పనులు ప్రారంభించనున్నారు.

లక్ష్యం ఇలా..

నియోజకవర్గం	విస్తీర్ణం(ఎకరాల్లో)
కురుపాం	2,000
పాలకొండ	1,150
సాలూరు	1,050
పార్వతీపురం	300

మొక్కలకు ఎంత ఇస్తారంటే..

మొక్క	ఒక్కోదాని ధర(రూ.లలో)
కొబ్బరి (పోలి బ్యాగులో)	90
కొబ్బరి సీడిలింగ్	60
జీడిమామిడి	40
మామిడి	40
మునగ	08
చింత	55
సీతాఫలం	40
పనస	08

ఏర్పాట్లు చేస్తున్నాం: ప్రభుత్వ నర్సరీల నుంచి కొబ్బరి మొక్కలు తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాకు 1.65 లక్షల కొబ్బరి మొక్కలు అవసరం. వీటి కోసం ప్రయత్నిస్తున్నాం. **- కె.రామచంద్రరావు, పీడీ, డ్వామా**

రండి.. బాలల భవిత మారుద్దాం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపడుతోంది. పాఠశాలల ప్రారంభంలోనే పుస్తకాలు, బ్యాగులు, సామగ్రి అందజేసింది. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతోంది. విద్యార్థుల్లో క్రమశిక్షణ నింపేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరమని భావిస్తోంది. తరగతి గదిలో గురువులు పర్యవేక్షిస్తున్నా ఇళ్ల వద్ద తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఈనెల 10న మెగా సమావేశం నిర్వహిస్తోంది.

జిల్లావ్యాప్తంగా 1,720 పాఠశాలల్లో 1.20 లక్షల మంది చదువుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోనూ ఈ సమావేశాలు జరుగుతాయి. విద్యార్థి నడవడిక, తీరుతెన్నులు, ప్రతిభపై తల్లిదండ్రులతో చర్చిస్తారు. విద్యాహక్కు చట్టం, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. గతేడాది పరీక్షల్లో సాధించిన మార్కులతో పాటు విద్యార్థుల హాజరు, నడవడికపై హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు తయారు చేసి అందజేస్తారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం గురించి వివరించి, ఆరోగ్య పరిరక్షణ బుక్‌లెట్ అందజేస్తారు.

10న తల్లిదండ్రుల మెగా సమావేశం

డ్రీమ్ వాల్స్.. ఫొటో స్పాట్లు..

పాఠశాలల ప్రాంగణాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బృంద చిత్రాలు తీసుకునేలా ఫొటో స్పాట్‌లు, విద్యార్థి లక్ష్యాలు తెలుసుకునేందుకు డ్రీమ్ వాల్స్ ఏర్పాటు చేస్తారు. అమ్మ పేరిట మొక్కలు నాటనున్నారు. వేదికపై పాఠశాలల ప్రగతి గురించి వివరిస్తారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు ఉంటాయి. పాఠశాల కమిటీ అధ్యక్షుడి ఉపన్యాసం, తల్లిదండ్రుల ప్రార్థన, సూచనలు, సహపంక్తి భోజనాల అనంతరం కార్యక్రమం ముగియనుంది. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చామని, కార్యక్రమం విజయవంతం చేస్తామని సమగ్ర శిక్షా ఏపీసీ తేజేశ్వరరావు పేర్కొన్నారు.

జిల్లాలో పాఠశాలలు: 1,720 విద్యార్థులు: 1.20 లక్షల మంది జూనియర్ కళాశాలలు: 14 విద్యార్థులు: 18 వేల మంది

సేవలపై సానుకూలత పెరగాలి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, డీఆర్వో హేమలత

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూలత పెరిగేలా అధికారులు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం అన్ని జిల్లాల అధికారులతో దూరదృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. పథకాల అమలు తీరు, జిల్లా స్థాయిలో ప్రణాళికలపై చర్చించారు. పీ4 కార్యక్రమం అమలుకు సేవానిరతి ఉన్న ప్రముఖులను గుర్తిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వివరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్లు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, మాదకద్రవ్యాల నియంత్రణ, డ్వాక్రా మహిళలకు జీవనోపాధుల కల్పన గురించి చర్చించారు. జేసీ శోభిక, డీఆర్వో హేమలత, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కుర్చీలన్నీ ఖాళీ

న్యూస్‌టుడే, పార్వతీపురం

ఇటీవల బదిలీలతో జిల్లా ఖాళీ అయ్యింది. జిల్లాల పునర్విభజన తర్వాత పెద్దగా కేటాయింపులు లేకపోవడంతో మూడేళ్లు ఆశగానే గడిపేశారు. ప్రస్తుతం కీలకమైన శాఖల అధికారులు బదిలీపై వెళ్లిపోవడంతో ఇబ్బందులు అధికమయ్యాయి. ఈ ప్రభావం అభివృద్ధిపై పడుతోంది.

జిల్లా అభివృద్ధికి ప్రాథమిక శాఖలే కీలకం. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖల్లో అధికారులు లేరు. సీతంపేట ప్రాంతంలో 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఒకే ఒక్క ఉద్యాన సహాయకుడు ఉన్నారు.

★ పశు సంవర్ధక శాఖలో 38 మంది వైద్యులకు 20 ఖాళీలున్నాయి. పారా వెటర్నరీ సహాయకులు 75 మందికి 16 మంది మాత్రమే ఉన్నారు. 70కి 51 కార్యాలయ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

★ ఇటీవల మక్కువ, కొమరాడ, పాలకొండలో పశు వైద్యాధికారులను బదిలీ చేసినా కొత్తగా నియమించలేదు.

వైద్యం.. దయనీయం

వైద్య శాఖలో ఎక్కువగా వైద్యుల కొరత ఉంది. జిల్లా వ్యాప్తంగా 39 మంది అవసరం. 23 మంది బదిలీపై, 14 మంది పీజీ చదివేందుకు వెళ్లారు. మరో ఇద్దరు ఒప్పంద వైద్యులు లేరు. పారా సిబ్బందిలో 50 మంది వరకు లేరు.

సంక్షేమంలోనూ అంతంతే..

జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి గయాజుద్దీన్‌కు తూర్పుగోదావరికి బదిలీ అయ్యింది. వెనుకబడిన సంక్షేమ సాధికారత అధికారి అప్పన్నకు బాధ్యతలు అప్పగించి ఆయన రిలీవ్ అయ్యారు.

★ దివ్యాంగులు, మైనార్టీ శాఖలను ఇతర జిల్లాల అధికారులే చూస్తున్నారు.

★ మహిళా సంక్షేమ శాఖలో 10 ప్రాజెక్టులు, 84 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టరుకు ఒక సూపర్‌వైజర్ అవసరమైనా.. ఉన్నది 48 మంది మాత్రమే.

ఇంజినీరింగ్ శాఖల్లో..

ర.భ.శాఖ ఈఈగా కురుపాం డీఈఈ రామచంద్రరావు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పీఆర్ ఈఈగా పాలకొండ నాణ్యత పర్యవేక్షణ విభాగం డీఈఈ నగేష్, గృహ నిర్మాణ సంస్థను ఎస్‌డీసీ చూస్తున్నారు. తాజాగా పార్వతీపురం సబ్ డివిజన్ డీఈఈ ఉద్యోగ విరమణ చేయగా కొత్తగా ఎవరినీ నియమించలేదు.

జిల్లా స్థాయిలో కొరత

★ జిల్లా ప్రణాళికాధికారి ఉద్యోగ విరమణ చేయగా విశాఖ ఏడీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

★ విద్య, పౌర సరఫరాల శాఖలను నడిపించేందుకు పూర్తిస్థాయి డీఈవో, డీఎస్‌వోలను నియమించాల్సి ఉంది.

★ పరిశ్రమల శాఖ అధికారి కరుణాకర్ విజయనగరం బదిలీ అయ్యారు. ఆయనే మన్యం బాధ్యతలు చూస్తున్నారు.

★ శ్రీకాకుళం పర్యాటక రంగం అధికారే మన్యం జిల్లా విధులు నిర్వర్తిస్తున్నారు.

భర్తీకి నివేదించాం.. : అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని ఆయా శాఖల ప్రధానాధికారులకు నివేదించాం. ఇదే అంశంపై ఇటీవల 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలోనూ మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో చర్చించాం. ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని మంత్రులు చెప్పారు.

- ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవ్ పురస్కారాలకు గిరిజనుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సాధికారత అధికారిణి ఆర్.కృష్ణవేణి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషి చేసిన 150 మందికి పురస్కారాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారులు తాము చేసిన సేవలను 200 పదాలకు మించకుండా నివేదించాలన్నారు. దీనిపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్ మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

పైసలు పక్కదారి.. పస్తులతో హలధారి

న్యూస్‌టుడే, బొబ్బిలి

- వైకాపా నిర్వాకంతో జైకా పనుల నిలుపుదల
- బిల్లులు రాక స్పందించని గుత్తేదారులు

గత ప్రభుత్వం జైకా నిధులుండీ పనులు చేయలేకపోయింది. గుత్తేదారులు దాదాపు రూ.17 కోట్ల పనులు చేయగా పైసా చెల్లించలేదు. ఆయా నిధులను పక్కదారి పట్టించి, ఇతర అవసరాలకు వినియోగించేసింది. దీంతో రెండున్నరేళ్లుగా పనుల్లో పురోగతి లేదు. వీటిని ప్రారంభించి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు 30 శాతం కూడా కాలేదు. కూటమి హయాంలో నోటీసులు ఇచ్చినా గుత్తేదార్ల నుంచి స్పందన లేదు. ఫలితంగా 25 శాతం కంటే తక్కువ కావడంతో పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. పాత గుత్తేదార్లతో చేయించాలా? రీ టెండర్లు పిలవాలా? అన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం అమరావతిలో ఇంజినీర్లతో సమీక్షించారు.

జలాశయం	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)	ఖర్చు చేసింది
వెంగళరాయసాగర్	63.50	12
పెద్దగెడ్డ	28.18	2.50
వట్టిగెడ్డ	44.85	2
పెదంకలాం	17.30	0.50

వెంగళరాయ కుడి ప్రధాన కాలువ పరిధిలో సగంలో ఆగిపోయిన లైనింగ్ నిర్మాణం

కదల్లేదు : జైకాలో వెంగళరాయ సాగర్ ఆధునికీకరణలో భాగంగా అక్విడెక్టు పనులు, జలాశయం చుట్టూ రక్షణగోడ, రెగ్యులేటర్ లీకులు అరికట్టడం, విద్యుత్తు సౌకర్యం, తూములు, షట్టర్ల ఏర్పాటు వంటి పనులు జరగాలి. హెడ్‌వర్క్సు పనులు మాత్రం చేపట్టారు. గోముఖి నదిపై అక్విడెక్టు పనులు ప్రారంభించాలి. కాలువల్లో తుప్పలు నిండి శివారుకు సాగునీరు రాక గత ఖరీఫ్‌లో రైతులు కరవు ఛాయలు చూశారు.

పడకేశాయి: పెద్దగెడ్డ జలాశయం గేట్ల మరమ్మతులు, లైనింగ్ పనులు, మట్టికట్ట పటిష్ఠం వంటివి చేపట్టాలి. కొన్నిచోట్ల తూములకు షట్టర్లు అమర్చాలి. సైఫాన్లు నిర్మించాలి. కాలువ లోపాలు సవరించాలి. కాలువలు పిచ్చిమొక్కలతో నిండి నీరు పారడం లేదు. వట్టిగెడ్డలో స్పిల్‌వేల వద్ద గేట్ల మరమ్మతులు చేపట్టారు. లైనింగ్, సైఫాన్లు నిర్మించాలి. పెదంకలాం పనుల్లో ఆది నుంచి జాప్యం జరుగుతూనే ఉంది. లైనింగ్ పనులు చేసేందుకు అక్కడక్కడ పూడిక తీశారు. గేట్ల లీకులు సరిచేశారు.

వర్షం పడకపోతే నష్టమే

పెద్దగెడ్డ నుంచి మా గ్రామ పరిధిలోని 300 ఎకరాలకు చుక్కనీరు అందడం లేదు. వర్షం పడితేనే పొలం తడిచేది. గతేడాది పంట నష్టపోయా. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

- బి.సీతంనాయుడు, సోంపురం, రామభద్రపురం

ఉన్నతాధికారులకు నివేదించాం

జైకాలో 25 శాతం కంటే తక్కువ పనులు జరగడంతో తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతానికి పనులు నిలిచిపోయాయి. ఖరీఫ్‌లో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం.

- అప్పారావు, పర్యవేక్షక ఇంజినీరు, జలవనరుల శాఖ

(c) eenadu

పర్యాటక దారిలో ప్రమాదకారి

లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలోని గెడ్డపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఏళ్ల నాటి నిర్మాణం కావడంతో శిథిలస్థితికి చేరింది. ఎక్కడికక్కడే పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. విశాఖ నుంచి అరకు, అనంతగిరి, బొర్రా తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. దెబ్బతింటే రాకపోకలు నిలిచిపోతాయి. అయినప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని చోదకులు వాపోతున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో కొత్త వారధి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. నిధులు సైతం విడుదల చేశారు. ఈలోపు వైకాపా రావడంతో పనులు సాగలేదు. ఈ పరిస్థితిపై ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ అధికారి సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు జరిగే నాలుగు రోడ్ల నిర్మాణ పనుల్లో భాగంగా అక్కడ కొత్త వంతెన రానుందని చెప్పారు. ఇటీవల మట్టి పరీక్షలు చేపట్టామని చెప్పారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

సోంపురం గెడ్డపై శిథిలస్థితికి చేరిన వంతెన

పెచ్చులూడి ప్రమాదకరంగా..

చినుకు పడితే మునకేయాల్సిందే!

బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జివలస రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన కింద వంతెనలో నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అందులో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. కొత్తపెంట, పనుకువలస గ్రామాలతో పాటు బాడంగి మండలం గొల్లాది గ్రామస్థులు కూడా ఈ మార్గం మీదుగా రాకపోకలకు సాగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు మీదుగా వెళ్లేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇందులోకి చేరిన నీరు బయటకు వెళ్లడానికి మార్గం లేదని స్థానికులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

ఇలా వదిలేయకండి సారూ..!!

ఈ మార్గం చూశారా.. ఎంత దారుణంగా ఉందో కదా.. సాలూరు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డిది. రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, ఖజానాశాఖ, ఎంఎల్‌ఎస్ పాయింటు తదితర విభాగాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. మరమ్మతులు లేకపోవడంతో ఎక్కడికక్కడే భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాటిల్లో నీరు చేరి, ఇలా బురదమయంగా మారింది. అధికారులు నిత్యం ఇటుగా వెళ్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్పందించి, బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

తాటిపూడి నీటిని రైతుల ప్రయోజనాలకే వినియోగించాలి

శృంగవరపుకోట, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయం నీటిని రైతుల కోసమే వినియోగించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. ఈమేరకు గురువారం విజయనగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల నీటిని విడుదల చేసినందుకు గానూ అభినందనలు తెలిపిన ఆయన 2023 నాటి జీవోను సవరించాలని విన్నవించారు. అందులో జిందాల్ పరిశ్రమకు సైతం విడుదల చేయాలని పేర్కొన్నారని, అది తగదని చెప్పారు. ఇకనుంచి పూర్తిస్థాయిలో పొలాలకు అందించాలని కోరారు. ఈమేరకు ప్రభుత్వం, జలవనరులశాఖ మంత్రి, పరిశ్రమలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	92	154	164

న్యాయమూర్తి టీవీ.రాజేష్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

సీనియర్ సివిల్ జడ్జి టీవీ.రాజేష్ బదిలీ

న్యాయవార్తా విభాగం: విజయనగరంలోని జిల్లా న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జిగా, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేసిన టీవీ.రాజేష్ గుంటూరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, అదనపు న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, బి.అప్పలస్వామి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, కె.విజయ కళ్యాణి సత్కరించారు.

విజయనగరం ఏఎంసీ పాలకవర్గం ఖరారు

నర్సింగరావు, ఛైర్మన్

చంద్రనాయుడు, వైస్‌ఛైర్మన్

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల జాబితాను ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ గౌరవ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఛైర్మన్‌గా కర్రోతు వెంకట నర్సింగరావు, వైస్ ఛైర్మన్‌గా బొబ్బాది చంద్రనాయుడు(జనసేన) నియమితులయ్యారు. సభ్యులుగా ఆర్.అప్పలనాయుడు, వి.సంతోషి, ఎస్.సన్యాసప్పుడు, సీహెచ్.రమణ, వి.మణికుమారి, షేక్ హుస్సేన్, ఎం.దేవీశ్రీ, ఎన్.రమణమ్మ, సీహెచ్.రూపవాణి, ఎల్.గౌరి, యు.వెంకట అప్పారావు, ఎస్.సాయిరామ్, సీహెచ్.తాతయ్యతో పాటు గాజులరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు, నగరపాలక సంస్థ మేయర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి కొనసాగనున్నారు.

2,637 మంది బడి బయటే..!

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలో 2,637 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. 1-10 తరగతుల్లో చదువుతూ వేర్వేరు కారణాలతో వీరంతా చదువు మధ్యలో మానేశారు. వీరిని తిరిగి విద్యాలయాల్లో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.

అంగన్‌వాడీల్లోని పిల్లలపై సర్వే చేస్తున్న అధికారులు

ఈ ప్రాంతాల్లో ఎక్కువ

మండలం	బడిబయట పిల్లలు
విజయనగరం	839
రాజాం	227
భోగాపురం	178
బొబ్బిలి	123
ఎస్.కోట	117
నెల్లిమర్ల	106

కారణాలివీ..

వలసలు, దీర్ఘకాలిక గైర్హాజరు, చదువు పట్ల ఆసక్తి లేకపోవడం తదితర కారణాలతో బాలలు దూరమవుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు గుర్తించి, పాఠశాలలు, వసతిగృహాలు, కేజీబీవీల్లో చేర్పిస్తారు. బడి రూబాట పథకం కింద ఏడాదికి రూ.6 వేల చెల్లించనున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో సర్వే నిర్వహించారు. విజయనగరం మండలంలో వీరి సంఖ్య అధికం. మరో ఆరు మండలాల్లో వందకు పైగా బడిబయట పిల్లలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు బట్టి తెలుస్తోంది.

5 ఏళ్లు నిండిన వారిపై సర్వే

ఆగస్టు 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన వారిని బడిలో చేర్పిస్తారు. అంగన్‌వాడీల నుంచి ఒకటో తరగతిలో చేర్పించేందుకు ఏప్రిల్ నెలలో డ్రైవ్ నిర్వహించారు. మళ్లీ వీరి కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. పిల్లలు ప్రభుత్వ లేదా ప్రైవేటులో ఎక్కడ చేరారో తెలుసుకుంటారు. ఆయా వివరాలను విద్యాశాఖకు అందజేయాలని ఐసీడీఎస్ విభాగానికి కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు.

సార్వత్రిక విద్యాపీఠంలో..

పదో తరగతి తప్పినవారు, బడిమధ్యలో మానేసి 14 సంవత్సరాలు నిండిన వారికి సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాలు కల్పించనున్నారు. ఓపెన్‌స్కూల్ ద్వారా పదిలో ఉత్తీర్ణులైన వారిని ఇంటర్మీడియట్‌లో చేర్పిస్తారు. మహిళలు, ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధి వేతనదారులు కూడా చదువు కొనసాగించి, విద్యార్హతలు పొందేలా చర్యలు తీసుకున్నట్లు సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు తెలిపారు.

67 మందికి కారుణ్య నియామకాలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విధుల్లో ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధి నిర్వహణలో మృతిచెందిన వారి వారసులకు కారుణ్య నియామకాల కింద కలెక్టర్ ఛాంబర్లో గురువారం ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. రెవెన్యూ, ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ విభాగాల్లో స్థానాలు కల్పిస్తూ 67 మందికి పత్రాలిచ్చారు. వీరిలో 63 మందిని జూనియర్ సహాయకులు/టైపిస్టులుగా, నలుగురిని సబార్డినేట్లుగా నియమించారు. కలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, జేసీ సేధు మాధవన్ పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రశ్నించిన ప్రతిపక్షాన్ని బెదిరించడమేంటి: బొత్స

విజయనగరం పట్టణం, అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అమలుకు నోచుకోని ఎన్నికల హామీలపై నేతలను ఎండగడుతూ 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తామని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మ్యానిఫెస్టో అమలు చేయమంటే తాట తీస్తాం.. తోలు తీస్తాం.. భూస్థాపితం చేస్తాం.. అనడం ఏంటని ప్రశ్నించారు. తాటాకు చప్పుళ్లకు బెదరమన్నారు. విజయనగరంలో గురువారం జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయాన్ని ఏప్రిల్, మే నెలల్లో ఇస్తామని శాసనమండలి సాక్షిగా చెప్పిన మంత్రి లోకేశ్ జులై వచ్చినా ఇవ్వలేదన్నారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ నైపుణ్యాభివృద్ధికి బదలాయించామని చెబుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు పథకంపై మాట మార్చారన్నారు. తమ పార్టీ మ్యానిఫెస్టోను భగవద్గీత, కురాన్, బైబిల్‌గా చూసిందన్నారు. రాష్ట్రంలో చంద్రన్న దగా, చంద్రన్న పగ.. ఈ రెండు తప్ప ఇంకేమీ లేవని వైకాపా ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

వైకాపా సమావేశంలో గుర్తుతెలియని నాయకుడి చేతివాటం..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరంలో గురువారం జరిగిన వైకాపా జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన ఓ గుర్తుతెలియని నాయకుడు చేతివాటం ప్రదర్శించాడు. సమావేశం ముగిసిన తర్వాత ఎమ్మెల్సీ సురేష్‌బాబు బయటకు వెళ్తుండగా వెనుక నుంచి ప్యాంటు కుడిజేబులో ఉన్న రూ.70 వేలను దొంగలించేందుకు ప్రయత్నించాడు. గుర్తించిన ఎమ్మెల్సీ అతని చేయి పట్టుకోగా డబ్బులు కింద పడేసి పరారయ్యాడు. అతడు ఎవరినేది గుర్తించలేదని ఆయన తెలిపారు.

పురస్కారాలకు ఎంపిక.. హైదరాబాద్: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందికి '2023 ప్రతిభా పురస్కారాలు' ప్రకటించింది. ఎలనాగ(కవిత), డా.ప్రభల జానకి(విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి(చిత్రలేఖనం), సంపత్‌రెడ్డి(శిల్పం), పేరిణి రమేష్‌లాల్(నృత్యం), హరిప్రియ(సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి(పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ(నాటకం), కడకంచి పాపయ్య(జానపద కళారంగం) తదితరులను ఎంపిక చేసింది.

VIGNAN's
INSTITUTE OF INFORMATION TECHNOLOGY (A)
INSTITUTE OF ENGINEERING FOR WOMEN (A)
DUVVADA, VISAKHAPATNAM-530049.
CAREER GUIDANCE AWARENESS PROGRAM
ARE YOU CONFUSED ABOUT ENGINEERING COURSES AND SELECTION ?
PARENTS & STUDENTS are invited to consult our Counselling Expert and clear doubts to fix Course and Goal
Date & Venue:
VIZIANAGARAM
Senate Hall, 4th Floor, SVN Lake Palace.
05th July 2025
SRIKAKULAM
Mythri Hall, Varam Residency, Day & Night Jn.
06th July 2025
COUNSELLING EXPERTS
Contact : 7989568554, 9849601031

ఈనాడు, విజయనగరం, కొత్తవలస, రేగిడి, న్యూస్‌టుడే

ఆడపెయ్యిల వృద్ధికి ప్రత్యేక చర్యలు

● రూ.150కి మేలు జాతి వీర్యం ● ఉచితంగా పిండ మార్పిడి

కూటమి ప్రభుత్వం పాడి రైతులకు మేలు చేకూర్చే మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆడ పెయ్యిల సంతతిని పెంచడానికి మేలు జాతి వీర్యాన్ని జులై 1 నుంచి రూ.150కి అందించనుంది. ఇంతవరకు రూ.500 వసూలు చేసేవారు. మరింత ఎక్కువ మంది లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ధరను భారీగా తగ్గించారు.

లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన దూడ

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంతో..

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఆడపెయ్యిల శాతాన్ని వృద్ధి చేసి, పాల ఉత్పత్తి పెంచాలని భావిస్తోంది. దీనిలో భాగంగా నూతన సాంకేతికతతో పెయ్యిలను ఇవ్వగలిగే వీర్యాన్ని అభివృద్ధి చేసి అందిస్తోంది. ఏటా 15 శాతం పాల ఉత్పత్తిని పెంచాలని పశుసంవర్ధక శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో మేలు జాతి వీర్యంతో పాడి పశువులకు చూడి కట్టించడంపై ఆ శాఖ అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో సంతానోత్పత్తికి ఉపయోగపడే పాడి పశువులు 3.24 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. అన్ని పశువుల ఆసుపత్రుల్లో జులై 1 నుంచి మేలు జాతి వీర్యాన్ని అందజేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవీ.రమణ తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15 వేల ఇంజెక్షన్లు..

విజయనగరం జిల్లాలో 15 వేల ఇంజెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. మండల పశువైద్య కేంద్రాలు, ఆసుపత్రులు, పాలీక్లినిక్‌లు, ఆర్‌ఎస్‌కేల్లో అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 11 వేల ఇంజెక్షన్లు ఆయా కేంద్రాలకు సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అదనపు సౌకర్యాలు..

ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు ఇంకో సౌలభ్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. నేరుగా పశువులకు పిండమార్పిడి (ఎంబ్రో) చేయించుకునే అవకాశం కల్పించింది. రూ.5 వేల విలువైన ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితమని తెలిపారు. జిల్లాలో ఇద్దరు వైద్యులకు పిండమార్పిడిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జెర్సీ, ఒంగోలు లాంటి జాతుల లక్షణాలు పశువులకు శతశాతం రావాలంటే ఏడు తరాలు పడుతుందని, పిండ మార్పిడిలో అయితే ఒకసారికే కచ్చితమైన జాతి పశువులు పుడతాయని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ తెలిపారు. రైతులు నేరుగా రైతుసేవా కేంద్రాల్లో, పశువుల ఆసుపత్రుల్లో సంప్రదించొచ్చని తెలిపారు.

రైలులో 19 కిలోల గంజాయి స్వాధీనం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా నియంత్రణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపడుతోందని ఏఎస్పీ అంకితా సురాన అన్నారు. గురువారం రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైల్లో నాకాబందీ చేపట్టారు. పార్వతీపురం టౌన్ స్టేషన్ నుంచి విజయనగరం వరకు పోలీసు జాగిలాలతో పరిశీలించారు. డొంకినవలస సమీపంలో ఇద్దరు ప్రయాణికుల వద్ద 4 కిలోలు, విజయనగరం సమీపంలో రిజర్వేషన్ బోగీలో ఇద్దరు మహిళల నుంచి 15 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పార్వతీపురం సీఐ, ఎస్సైలు, ఈగల్ బృందాలు, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఏఎస్పీ అంకితా సురాన ఆధ్వర్యంలో తనిఖీలు

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో అర్హత

విజయనగరం క్రీడావిభాగం, న్యూస్‌టుడే: బీసీసీఐ ఆధ్వర్యంలో ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన అంపైర్ల ఎంపిక పరీక్షల్లో విజయనగరానికి చెందిన **తోట విజయ్** ఉత్తీర్ణత సాధించారు. ఈయన ఎక్కువ మ్యాచ్‌లకు స్కోరర్‌గా పనిచేశారు. త్వరలో దేశవాళీ, ఐపీఎల్, అంతర్రాష్ట్ర మ్యాచ్‌లకు అంపైరింగ్ చేసే అవకాశం దక్కనుందని 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

EENADU Classifieds

HEALTH & CARE
మత్తు వ్యసనాలు నిద్రలేమి అతి ఆలోచనలు డిప్రెషన్ SEX కుటుంబ సమస్యలకు పరిష్కారం
MIND POWER
విజయనగరం గంటస్తంభం పక్కన
888 55555 13

PLOT FOR SALE
VZM- VSP నేషనల్ హైవే చెల్లూరు జంక్షన్ ప్రక్కన VMRDA గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో గజం 14,000/- రెడీ టు కన్‌స్ట్రక్షన్. ✆ 9492342274.

SECURITY GUARDS
జై గణేష్ సెక్యూరిటీ విజయనగరం టౌన్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు - 11 మంది కావలెను. జీతం: 15000/-, PF & ESI. సంప్ర: 99893 70717.

సెక్యూరిటీ గార్డులు, నైట్ వాచ్‌మెన్ కావలెను. Qlf: 10th, డిగ్రీ, హిందీ మాట్లాడాలి. జీ॥ 14 వేలు+ రూమ్+ PF+ ESI. గరివిడి, విజయనగరం జిల్లా. Ct: RSR, 77029-59468, 0891-3570630.

JOBS
బ్రాంచ్ మేనేజర్ & అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ (విజయనగరం & విశాఖపట్నం) కోసం 3 సం॥ల బ్యాంకింగ్/ NBFC/ ఇన్సూరెన్స్/ చిట్ ఫండ్స్ మొ॥ అనుభవం కలవారు కావలెను. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులకు అవకాశం కలదు. ఆకర్షణీయమైన జీతంతో పాటు ఇన్సెంటివ్స్ + PF + T.A., హెల్త్ ఇన్సూరెన్స్ కలవు. వర్చువల్ ఇంటర్వ్యూ (ZOOM) 4,5 & 6 జులై 2025 ఉ॥ 10 గం॥ నుండి సా॥ 5 గం॥ వరకు. మీ Resume Whatsapp చేయగలరు. ఫోన్: 97057 09977.

Wanted Experienced Telecallers & Front Office Executive (F) for a Furniture & Interior Designing Factory, Near Raghu College. Best Salary+ Incentives. ✆ 8886336969.

Ephraim Enterprises పార్వతీపురంలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీంలీడర్స్, జిల్లా మేనేజర్స్‌గా కావలెను. జీతం 21వేలు నుండి 45వేలు లోపు. Cell: 9704107303, 9182830838, 9959166816.

REAL ESTATE
HOUSE FOR SALE
విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేకి ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ప్లాటు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G-3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాలం చెల్లిన బస్సులను నిలిపివేయాలి

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మహిళల ఉచిత ప్రయాణం పథకం విజయవంతం కావాలంటే ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను నిలిపివేసి, వాటి స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి పి.భానుమూర్తి కోరారు. గురువారం విజయనగరంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4, 5వ తేదీల్లో రాష్ట్రంలో అన్ని డిపోల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుంచి నేటి వరకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పొరుగు సేవల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. జిల్లా కార్యదర్శి రవికాంత్, డిపో అధ్యక్షుడు ఎన్.స్వామి, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి భానుమూర్తి

ఏపీజేఏసీ సాధారణ ఉప కార్యదర్శిగా ఎన్నిక


రమణ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల ఐక్య కార్యాచరణ సమితి డిప్యూటీ జనరల్ కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేగల వెంకట రమణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కొత్తవలస సంఘం అధ్యక్షుడు జె.వి.ప్రసాదరావు తెలిపారు. విజయవాడలో గురువారం అన్ని శాఖల ప్రధాన ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు, ఏపీఎస్‌ఆర్‌టీసీ, పింఛనుదారులు వార్డు సచివాలయాలు, సీపీఎస్ రాష్ట్ర నాయకులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రమణకు కొత్తవలస తాలూకా ఎన్జీవో సంఘం అభినందనలు తెలిపింది.

బెట్టింగులకు బానిసై ఆత్మహత్య

డోల రాము (పాతచిత్రం)

విశాఖపట్నం(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసై చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బలిజిపేట మండలం గళావల్లికి చెందిన డి.రాము(35) ఏడేళ్ల క్రితం విశాఖకు వలస వెళ్లారు. రామాటాకీస్ ప్రాంతంలోని పాతవస్తువుల దుకాణంలో పనిచేసేవారు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని నెలలుగా బెట్టింగులు, మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో బంధువులు, స్నేహితులు హితబోధ చేసి ఎండాడ ప్రాంతంలో కాపురం పెట్టించారు. ఇటీవల మళ్లీ అప్పులు చేశాడు. దీంతో లావణ్య బుధవారం ఇద్దరు కుమారుల్ని తీసుకుని సొంతూరులో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. ఈక్రమంలో రాత్రి వేళ ఆయన పంకా హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం భార్య ఫోన్ చేయగా ఎంతకీ స్పందించకపోవడంతో మరిదిని ఇంటికి పంపించింది. అతను కిటికీలోంచి చూడగా వేలాడుతూ కనిపించాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

పిన్నిని హతమార్చిన యువకుడు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని పెదచాకలి వీధి కూడలికి చెందిన మహిళ మృతి కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఆస్తి గొడవలతో కుమారుడి వరసయ్యే వ్యక్తి హత్య చేసినట్లు గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ సతీష్‌కుమార్ వెల్లడించారు. తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు శరీరంపై గాయాలు, ఇంటి పరిసరాల్లో రక్తం ఆధారంగా సమగ్ర దర్యాప్తు నిర్వహించి హత్యగా తేల్చారు. మృతురాలు కారగాని పద్మ(45) భర్త పైడిరాజు సోదరుడి కుమారుడు సంతోష్‌కుమార్. పక్కపక్క ఇళ్లలో ఉండే వీరికి అయిదేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఇటీవల సంతోష్‌కుమార్ భార్య పావని అనారోగ్యంతో మృతిచెందింది. కుమారుడు ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నాడు. దీనివల్ల ఆర్థికంగా చితికిపోయి మనస్తాపానికి గురయ్యాడు. కాగా రోజూ రాత్రిపూట దిష్టి తీసిన నిమ్మకాయను పద్మ తన ఇంటి ముందు పడేస్తోందన్నది సంతోష్‌కుమార్ అనుమానం. ఈ కారణంగానే కుటుంబ నాశనం అవుతోందని అనుకున్నాడు. దీంతో ఆమెను హతమార్చాలని ప్రణాళిక రచించాడు. బుధవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో వీధిలో ఎవరూ లేకపోవడం గమనించాడు. పద్మ ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి.. కత్తితో పొడిచి హతమార్చాడు. సంతోష్‌కుమార్ మాంసం విక్రయశాలను నిర్వహిస్తున్నాడు. ఆ కత్తితోనే హత్య చేశాడు. ఎస్సై రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ, ఎస్సైలు

పాముకాటుకు గిరిజనుడి బలి

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం పత్తికగూడకు చెందిన నిమ్మక కిరణ్(21) పాము కాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై అమ్మనరావు తెలిపారు. పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న అర్ధరాత్రి ఇంట్లో మంచంపై పడుకున్న సమయంలో పంకా పైనుంచి పాము జారి పడి కాటు వేసింది. ముఖమంతా వాపులు రావడంతో కలవరపడి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ అయిదు రోజులు వైద్యసేవలు పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రులు రమ, రాము కన్నీరుమున్నీరవుతున్నారు. పదోతరగతి వరకు చదివిన కిరణ్.. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ, ఇతర పనులు చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నాడు. బతికించుకునేందుకు ఆ తల్లిదండ్రులు ఎంత ప్రయత్నించినా విధి కన్నెర్ర జేసింది. యువకుడి మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్.కిరణ్ (పాతచిత్రం)

(c) eenadu

నమ్మండి.. ఇదీ తారు రోడ్డే!

సీతానగరం నుంచి అజ్జాడ వరకు ఉన్న రోడ్డు లక్ష్మీపురం గ్రామంలో అధ్వానంగా తయారైంది. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో బురదగా మారింది. కాలి నడకన వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు అర కిలోమీటరు మేర గుంతలే ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. పక్కా కాలువలు నిర్మించి, రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని ఏఈ రాజేంద్ర తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

నిధులొస్తేనే.. పనులు

సాలూరు పట్టణంలోని గుమడాం పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరుకాక పనులు మధ్యలో ఆగిపోయాయి. గత ప్రభుత్వం నాడు- నేడులో భాగంగా రూ.23 లక్షలు మంజూరు చేసింది. తొలి విడతగా రూ.10 లక్షలు మాత్రమే రావడంతో పునాదులు, పిల్లర్లు, స్లాబ్ వరకు నిర్మించారు. తర్వాత నిధులు రాకపోవడంతో రెండేళ్లుగా ఆపేశారు. దీంతో విద్యార్థులు ఎస్సీ కాలనీలోని పాఠశాలకు వెళ్తున్నారు. విషయం ఎంఈవో వెంకటరావు వద్ద ప్రస్తావించగా.. నిధులు మంజూరైతే నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు

షెల్టరు శిథిలం.. ఉండాలంటే భయం

పాచిపెంట మండలంలో ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. గౌరమ్మపేట, గంగన్నదొరవలస, పి.కోనవలసలో ఇదే పరిస్థితి నెలకొంది. పి.కోనవలస చెక్‌పోస్టు కూడలి, చెరుకుపల్లి, విశ్వనాథపురం, శ్యామల గౌరీపురం, గురివినాయుడుపేట తదితర చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రయాణికులు వర్షంలోనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు. బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

వడమ విలవిల!

పాలకొండ పట్టణ పరిధిలోని వడమ రైతులు విలవిల్లాడుతున్నారు. తోటపల్లి శివారు ఆయకట్టుగా ఉన్న ఈ గ్రామ భూములకు దశాబ్దాలుగా సాగునీరు అందడం లేదు. ఏలాం కూడలి నుంచి కాలువ పూర్తిగా ఆక్రమణలతో నిండిపోయింది. ఇందిరానగర్ కాలనీ దాటిన తరువాత కనుమరుగైంది. ఈ కాలువ ద్వారా 200 ఎకరాలకు సాగునీరు చేరాల్సి ఉన్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు. పట్టణంలోని మురుగు ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న వరద కాలువలోకి రావడంతో సమీప పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కాలువ ఆక్రమణకు గురికావడంతో గట్లు బలహీనమై సుమారు 50 ఎకరాల మేర భూములు మురుగుగా మారుతున్నాయి. విషయం జలవనరుల శాఖ డీఈఈ గనిరాజు వద్ద ప్రస్తావించగా.. నిధులు విడుదలయ్యాయని, పనులు చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పాలకొండ

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

బలిజిపేట, న్యూస్‌టుడే: బొబ్బిలిలో విద్యుత్తు నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు బలిజిపేట ఏఈ సింహాచలం తెలిపారు. బలిజిపేట, పెంట, జగన్నాథపురం, పిరిడి తదితర గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ఓటరు నమోదుపై బీఎల్వోలకు శిక్షణ

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త ఓటర్ల నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు నీలకంఠరావు అన్నారు. గురువారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. వారి విధులను వివరించారు. సర్వే సమయాల్లో ఫారం-6 తీసుకోవాలని, వలసలు, మృతి చెందిన వారి ఓట్లు తొలగించడం, రెండు చోట్ల నమోదులను అప్రమత్తంగా ఉంటూ పరిశీలించాలన్నారు. డీటీ బి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పాత ఊరులో కాలువలు పూడికతో నిండిపోయాయి. - **రామకృష్ణ** ★ పూడికలు తొలగించే పనులు చేపడతాం. – వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి – సీతానగరం

? పాలకొండలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - **లాస్య, విద్యార్థిని** ★ కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం - **రత్నరాజ్, కమిషనరు.** – పాలకొండ గ్రామీణం

? పాలకొండ ఇందిరానగర్ గిరిజన వసతి గృహం వద్ద విద్యుత్తు తీగలపై చెట్టుకొమ్మలు వేలాడుతున్నాయి. - **రాకేష్, విద్యార్థి** ★ చెట్టు కొమ్మలు తొలగిస్తాం. **-ఎ.శ్యామ్, ట్రాన్స్‌కో ఏఈ.** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? గాదెలవలస బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నాం.- **అప్పయ్య, స్థానికుడు** ★ పరిశీలించి కొత్త దీపాలు అమర్చుతాం. - **మనోహర్, పంచాయతీ కార్యదర్శి** – సీతానగరం

కాలనీలో కష్టాలు.. కోకొల్లలు

సౌకర్యాలు లేక తప్పని ఇబ్బందులు

పాలకొండ, న్యూస్‌టుడే

గత ప్రభుత్వం పట్టణ పేదల కోసం స్థలాలు కేటాయిస్తే సంబరపడ్డారు. కానీ సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకొండలో 2020లో 33 ఎకరాలు రూ.12 కోట్లు వెచ్చించి సేకరించారు. 1,514 మందికి పట్టాలు అందించారు. 1,243 మందికి గృహాలు మంజూరు చేశారు. అయిదేళ్లు గడిచినా నేటికీ నిర్మాణాలు పూర్తి కాలేదు.

బురదగా మారిన రోడ్డు

నీరు రాని కుళాయిలు

సదుపాయాలు మృగ్యం..

అర్బన్ లేఅవుట్‌కు నిర్ణయించిన స్థలంలో నీటి సమస్యతో రైతులు గతంలో పంటలు వేయలేదు. ఇప్పుడూ ఇదే పరిస్థితి ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కా రోడ్లు లేక వర్షం పడితే బురదగా మారడంతో నడిచే వీలు లేకుండా పోతోంది. నిర్మాణాలు పూర్తికాక కొన్ని వీధుల్లో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. కాలువలు లేక వర్షం నీరు రోడ్డుపై పారుతోంది. పట్టణానికి దూరంగా ఉండడం, సదుపాయాల కొరతతో లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు.

గెడ్డలో నీరుంటేనే..

లేఅవుట్ అభివృద్ధి పేరుతో అధికారులు భారీగా ఖర్చు చేశారు. కేవలం గ్రావెల్ వేసేందుకు రూ.66 లక్షలు వ్యయం చేశారు. నిర్మాణాలకు వీలుగా సమీపంలో ఓనిగెడ్డ నుంచి కాలనీకి నీరు అందించడానికి రూ.80 లక్షలు వెచ్చించారు. ప్రత్యేకంగా పైపులైన్లు వేసినా.. గెడ్డలో నీరు లేకపోతే ఫలితం శూన్యం. రూ.1.25 కోట్లతో వేసిన ఇంటింటి పైపులైన్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి.

లెక్కల్లో తేడాలు..

కాలనీలో ప్రత్యేకంగా విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి, సరఫరాకు రూ.6 కోట్ల వ్యయం చేశారు. ఈ కాలనీలో 300 వరకు నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఇక్కడ నివాసం ఉంటున్న వారి సంఖ్య 45. మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోందని మిగిలిన వారు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక..

అర్బన్ లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. లబ్ధిదారులు అందరూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.

- **రత్నరాజ్, కమిషనర్, పాలకొండ నగర పంచాయతీ**

బాలికలూ.. భద్రత ముఖ్యం డీఐజీ గోపీనాథ్ జట్టి

పాచిపెంట, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలకు చదువుతో పాటు భద్రత ముఖ్యమని డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. మండలంలోని పి.కోనవలస గిరిజన బాలికల గురుకులంలో గురువారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్ లేని సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. మహిళలకు శక్తి యాప్ రక్షణగా ఉంటుందన్నారు. తాను కూడా వసతి గృహంలో చదివానని, దృఢ సంకల్పం.. తల్లిదండ్రుల కష్టంతో ఈ స్థాయికి ఎదిగానని గుర్తుచేసుకున్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. బాలికలు అప్రమత్తంగా ఉండాలని, ప్రలోభాలకు గురికావొద్దన్నారు. అనంతరం ఈ ఏడాది పది పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ సత్కరించారు. ఏఎస్పీ అంకితా సురాన, ప్రిన్సిపల్ భవానీ, సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకటసురేష్, బాలికలు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం పి.కోనవలస చెక్‌పోస్టును తనిఖీ చేశారు. గంజాయి అక్రమ రవాణాపై వేస్తున్న నిఘా, పట్టుబడిన సరకు గురించి ఆరా తీశారు. పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. ● సాలూరు గ్రామీణ ఠాణాలో కొత్తగా నిర్మించిన అతిథి గృహాన్ని డీఐజీ గోపీనాథ్ జట్టి ప్రారంభించారు.

విద్యార్థినిని సత్కరిస్తున్న గోపీనాథ్ జట్టి ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకితా సురాన

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, తిరుపతిరావు తెలిపారు. మిర్తివలసలో రైతులకు అవగాహన కల్పించారు. వరి పంట చివరిలో పెసలు, మినుములు, ఉలవలు, నువ్వులు, తోటకూర, గోంగూర విత్తనాలు వేస్తే కలుపు సమస్య తగ్గుతుందని తెలిపారు.

ఏడాది పాలన ఆనందమయం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని కేదారిపురంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించారు. రాష్ట్ర కార్యదర్శి వీరేశ్ చంద్రదేవ్, ట్రైకార్ డైరెక్టర్ లావణ్య, నాయకులు కళావతి, నరేష్, భూషణరావు, సుదర్శనరావు, పద్మావతి, రంజిత్‌కుమార్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేదారిపురంలో కరపత్రం అందజేస్తున్న జగదీశ్వరి, వీరేశ్ చంద్రదేవ్, శ్రేణులు

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు

పార్వతీపురం పురపాలక, సీతానగరం, న్యూస్‌టుడే: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బి.విజయచంద్ర పేర్కొన్నారు. 4, 29 వార్డుల్లో రూ.15 లక్షలతో కాలువలు, రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కుసుమగుడి వీధిలో కుళాయి నుంచి బురద నీరు వస్తోందని మహిళలు చెప్పారు. పందివీధి సామాజిక మరుగుదొడ్డి భవనంలో మోటారు పాడవడంతో బోరు నుంచి నీరు తెస్తున్నామని, జీతాలు కూడా చెల్లించడం లేదని నిర్వాహకులు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ● ప్రజా సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని బూర్జలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. రామమందిరం వద్ద అధికారులతో సమీక్షించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుసుమగుడి వీధిలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గిరిజన రైతుల సంక్షేమమే ధ్యేయం

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కుసిమి ఆర్‌ఎస్‌కేలో రాయితీపై కందులు, రాగుల విత్తనాలను పంపిణీ చేశారు. పాలకొండ ఏడీఏ రత్నకుమారి, ఏవో వై.చామంతి మాట్లాడుతూ.. మండలానికి కందులు, రాగుల విత్తనాలు వచ్చాయని, మిడిమి కేంద్రాల్లో పొందవచ్చని చెప్పారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ బి.సంధ్యారాణి, ఎంపీడీవో బి.బి.మిశ్ర, తహసీల్దార్ మల్లేశ్వరరావు, నాయకులు ఎన్.నాగేశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, హెచ్.ప్రసాదరావు, పి.శేఖర్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పీఆర్‌టీయూ బలోపేతానికి కృషి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ కోరారు. గురువారం పట్టణంలో సభ్యులతో సమావేశమయ్యారు. సభ్యత్వ నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.తవిటినాయుడు, కె.విజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి జె.రామినాయుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.శేఖర్‌కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.రవికుమార్, కార్యదర్శి జి.రామినాయుడు, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శుభ్రత తప్పనిసరి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ఆదేశించారు. గురువారం మండలంలోని పెదబుడ్డిడిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా హరితరాయబారులకు అందజేయాలన్నారు. రోజూ పల్లెల్లో శానిటేషన్ చేయాలని సూచించారు. తాగునీటి రక్షిత పథకాల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఎంపీడీవో కె.ధర్మారావు తదితరులున్నారు.

నాసిరకం పనులతో పగుళ్లు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని పెదమేరంగి కూడలి నుంచి బాసంగి గదబవలస వరకు ఇటీవల రహదారి నిర్మించారు. కొన్ని నెలల్లోనే ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్న, కార్యవర్గ సభ్యుడు సూరయ్య గురువారం పరిశీలించారు. నాణ్యత, నిబంధనలు పాటించకుండా మట్టిపై తారు వేయడంతో పాడైనట్లు చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రెండో రోజూ నిలిచిన సరఫరా

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని వడమ రక్షిత పథకం పరిధిలో రెండో రోజూ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అన్నవరం కూడలి వద్ద పైపులైన్లు పాడై బుధ, గురువారాల్లో సరఫరా ఆగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గురువారం నగర పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేయడంతో శుక్రవారం నుంచి సరఫరా యథావిధిగా ఉంటుందని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు.

రాయితీపై పశువుల దాణా

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై దాణా అందిస్తున్నట్లు సర్పంచుల సంఘాధ్యక్షుడు గౌరీశంకరరావు పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలో రైతులకు దాణా పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై 4 వేల కిలోల దాణా సిద్ధంగా ఉంచామని పశువైద్యాధికారి లక్ష్మణరావు తెలిపారు. అవసరమైన రైతులు సంప్రదించాలని సూచించారు.

రూ.65 వేలతో తాగునీటి సరఫరాకు చర్యలు

బలిజిపేట: అంపావల్లి ప్రాజెక్టు పరిధిలో విద్యుత్తు మోటారు, ప్యానెల్ బోర్డు కాలిపోవడంతో 7 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యపై ఈనెల 1న 'ఈనాడు'లో వార్త ప్రచురించగా జేఈ పవన్‌కుమార్ స్పందించారు. రూ.65 వేలతో కొత్త మోటారు బిగించారు. కాలిపోయిన ప్యానెల్ బోర్డు బాగు చేశారు. త్వరలో నీరు సరఫరా చేస్తామని జేఈ చెప్పారు.

వెలిగిన వీధి దీపాలు

పాలకొండ గ్రామీణం: సింగన్నవలస కూడలి నుంచి పాలకొండలోని జగన్నాథ ఆలయం వరకు విద్యుత్తు దీపాలు లేకపోవడంతో అంధకారంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సమస్యపై 'ఈనాడు'లో గత నెల 19న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి దీపాలు ఏర్పాటు చేశారు.

నది పరిసరాలు శుభ్రం

మక్కువ, న్యూస్‌టుడే: మక్కువ సమీపంలోని సువర్ణముఖి నది వద్ద పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ట్రాక్టరుతో దూరంగా తరలించారు. ఇక్కడి సమస్యపై గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'ఇటు అధ్వానం.. ఇటు ప్రమాదం' వార్తకు ఈవో బి.శ్రీనివాస్ స్పందించి చర్యలు చేపట్టారు.

వ్యర్థాల తొలగింపు

సాలూరు గ్రామీణం: కూర్మరాజుపేట సచివాలయం ముందు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇక్కడి సమస్యపై ఈనాడులో ఇటీవల చిత్రవార్త ప్రచురితమవగా కార్యదర్శి ప్రసాద్ స్పందించి సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు.

కార్మికశాఖ కార్యాలయం మార్పు

పాలకొండ: పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయం ... లోని కల్యాణి కోనేరు గట్టుపైకి మార్చారు. పాత భవనం పరిస్థితిపై గత నెల 6న 'ఈనాడు'లో 'కూలితే ప్రమాదమే' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

మురుగుకు మోక్షం

పార్వతీపురం గ్రామీణం: అంటివలస పాఠశాల వీధిలో కాలువల్లో మురుగు నిలిచి రోడ్లపైకి చేరుతోందని 'ఈనాడు'లో గత నెల 21న వార్త ప్రచురితమైంది. ఎంపీడీవో రమేష్, సర్పంచి రాజేంద్ర స్పందించారు. కార్యదర్శి బాషా ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు.

శివారుకు సాగునీరు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: నాగావళి పాత కుడి కాలువలో శివ్వాం ప్రాంతంలో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. దిగువ భూములకు సాగునీరు సక్రమంగా వెళ్లడం లేదని 'ఈనాడు'లో ఇటీవల వార్త ప్రచురితమైంది. నీటి సంఘం అధ్యక్షుడు పి.పాపినాయుడు, నాయకులు ఎం.పురుషోత్తం నాయుడు పొక్లెయిన్ ఏర్పాటు చేసి పూడికతీత పనులు చేయించారు.

ఆర్భాటం చేశారు.. అవస్థలు మిగిల్చారు



ఎల్విన్‌పేటలో అసంపూర్తిగా ఆరోగ్య కేంద్రం నిర్మాణం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు ప్రారంభించిన అయిదేళ్లలో పూర్తి చేయలేదు. దీంతో నేటికీ పునాదులు, గోడల స్థాయిలో దర్శనమిస్తున్నాయి. దీంతో గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఒక్కటే పూర్తి..

మండలానికి 23 రైతు సేవా కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.21.80 లక్షల చొప్పున కేటాయించారు. ఇందులో మాత్రమే ప్రారంభించారు. మండ, జీవల్‌పురం, దుమ్మంగి, తాడికొండ, చెముడుగూడలో పనులు పూర్తయి రెండేళ్లు గడిచినా వినియోగంలోకి రాలేదు. వాలా బోట్లు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి.

ప్రారంభానికి ఎదురుచూపులు..

గుమ్మలక్ష్మీపురం మండలంలో 24 సచివాలయాలు ఉండగా.. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.45.6 లక్షలు మంజూరు చేశారు. కొన్ని చోట్ల గుత్తేదారులు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టారు. కానీ బిల్లులు చెల్లించలేదు. దీంతో ఇరిడి, మండ, జీఎల్‌పురం, నెల్లికెక్కువ, చాపరాయిబిన్నిడిలో రెండేళ్ల క్రితం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు.

ఒక్కోదానికి రూ.20.30 లక్షలు..

13 ఆరోగ్య కేంద్రాలకు గాను ఒక్కోదానికి రూ.20.30 లక్షలు మంజూరు చేశారు. బాలేసు, ఎల్విన్‌పేట-2, చెముడుగూడ, జర్నలో పనులు చివరి దశలో ఉన్నాయి. మిగిలినవి అసంపూర్తిగా వదిలేశారు. ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో లేదోనని కొందరు పనులు చేపట్టలేదు.

చర్యలు చేపడతాం..: బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో కొన్నిచోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నిధులు విడుదలైతే పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతాం.

- **మురళీధర్, పీఆర్ ఏఈ**

నాటుసారాతో ఒకరి అరెస్టు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని గడసింగపురం గ్రామానికి చెందిన ఓ మహిళ నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

మూల్యాంకన వేతనాలు చెల్లించాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించిన వేతనం చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు డిమాండు చేశారు. 3 నెలలు అవుతున్నా బకాయిలు ఇవ్వకపోడంతో సరికాదన్నారు. వెంటనే చెల్లించకపోతే ఆందోళన చేస్తామన్నారు.

ఏడీఏగా సత్యవతి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులుగా జి.సత్యవతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మట్టి నమూనా పరీక్ష కేంద్రం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన మధుసూదనరావు జేడీ కార్యాలయానికి వెళ్లారు.

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో శనివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో..రూపాయిల్లో..) **టమాటా:** 34, **వంకాయలు:** 30, **బెండ:** 30, **బీర:** 40, **చిక్కుడు:** 35, **పచ్చిమిర్చి:** 48, **కాకర:** 34, **క్యారెట్:** 40, **బీట్‌రూట్:** 40, **ఉల్లి:** 23, **బంగాళదుంపలు:** 20, **అల్లం:** 66, **వెల్లుల్లి:** 80, **క్యాప్సికమ్:** 75, **అరటి కాయ:** 5, **ఆనప కాయ:** 12. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

తెరపై ఈనాడు

పార్వతీపురం: శ్రీ వీరభద్ర **సినిమా:** కన్నప్ప, మార్గన్ ★ **టీబీఆర్:** తమ్ముడు ● **పాలకొండ: రామ కళామందిర్-** కన్నప్ప ★ **వెంకట గౌరి (స్క్రీన్1)** - తమ్ముడు, **(స్క్రీన్2)** - కుబేర ● సాలూరు: **శ్రీరామ**- తమ్ముడు, **లక్ష్మి**- కుబేర, **శ్రీలక్ష్మి**- కన్నప్ప

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

మలేరియా, డెంగీ ప్రబలకుండా చర్యలు

సీతంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా నియంత్రణ సహాయ అధికారి శ్రీనివాసరావు, సీతంపేట ఎంపీడీవో బి.బి.మిశ్ర అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లోని ఆరోగ్య పర్యవేక్షకులు, ఎల్‌టీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారులు జె.మోహనరావు, ఎం.మోహనరావు, ఎంటీఎస్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని హడ్డుబంగి సమీపంలో వంతెన వద్ద గురువారం 2 ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. సీతంపేట వైపు నుంచి వస్తున్న ఇద్దరు యువకులకు తీవ్రంగా, కొత్తూరు వైపు నుంచి వస్తున్న వ్యక్తికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు.

ఆటో చోదకుడికి.. పార్వతీపురం పట్టణం, గ్రామీణం: పార్వతీపురం పట్టణానికి చెందిన రాజేష్‌కు చెందిన ఆటో సురేష్ పాఠశాల సమీపంలో ఆగి ఉండగా.. వెనుక నుంచి వచ్చిన మరో ఆటో బలంగా ఢీకొంది. దీంతో రాజేష్‌కు గాయాలవగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్టు ఏఎస్సై ఎన్.భాస్కరరావు వివరాలు సేకరించారు.

పంటల బీమాపై అవగాహన



సిబ్బందికి వివరిస్తున్న అధికారులు

పాలకొండ, న్యూస్‌టుడే: రైతులకు పంట బీమాపై అవగాహన కల్పించాలని ఏడీఏ రత్నకుమారి పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందికి బీమా గురించి వివరించారు. ప్రకృతి వైపరీత్యాలతో వరి, మొక్కజొన్నకు నష్టం జరిగితే బీమా వర్తిస్తుందన్నారు. వరి పంట బీమాకు ఆగస్టు 15, మొక్కజొన్నకు జులై 31 వరకు గడువు ఉందన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటి పతకాలు కైవసం చేసుకున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన పోటీల్లో ఎన్.షణ్ముఖ్ సిద్ధార్థనాయుడు స్వర్ణం, బి.హర్షవర్ధన్, ఇజ్జాడ వైష్ణవి రజతాలు సాధించారని శిక్షకులు రవికుమార్, కోటేశ్వరరావు తెలిపారు. వారిని ఎమ్మెల్యే విజయచంద్ర అభినందించారు.

ఎమ్మెల్యేతో పతకాలు సాధించిన విద్యార్థులు

రామావతారంలో జగన్నాథుడు

పాలకొండ, న్యూస్‌టుడే: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులకు జగన్నాథుడు రామావతారంలో దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు విశ్వనాథ్‌దాస్ ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ● బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట గుండిచా మందిరంలో జగన్నాథుడు గురువారం శ్రీరాముడు, శ్రీకృష్ణుడి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

సర్పంచులకు శిక్షణ

సీతంపేట, న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే స్వపరిపాలన సాధ్యమని ఎంపీడీవో బి.బి.మిశ్ర అన్నారు. సీతంపేట వైటీసీలో 'మార్పు ద్వారా విజేతలు' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణకు పాలకొండ, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాల మహిళా సర్పంచులు హాజరయ్యారు. డీపీఆర్‌సీ ప్రతినిధి లోకనాథం, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని 8 పశువుల మృతి

కలెక్టరేట్ ప్రాంగణం: పార్వతీపురం పట్టణం- సివిని మధ్య రైలు ఢీకొని 8 పశువులు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పరుశురాంపురం నుంచి పార్వతీపురం వారపు సంతకు పశువులు తీసుకొస్తున్న క్రమంలో పట్టాలు దాటిస్తుండగా ప్రమాదం జరిగినట్లు చెప్పారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని జీఆర్పీ పోలీసులు తెలిపారు.

(c) eenadu

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

▶ నేడు మార్కాపురంలో జేజేఎం పథకానికి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మార్కాపురం-తర్లుపాడు రహదారి పక్కన నరసింహాపురంలో సభా వేదికను సిద్ధం చేశారు. దీనికి వంద మీటర్ల దూరంలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఏర్పాట్లను గురువారం పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉదయం 11:30 గంటలకు సభావేదికకు చేరుకుంటారని, జలజీవన్ మిషన్ కింద రూ.1,290 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తారని అధికారుల తెలిపారు. అనంతరం సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని, తిరిగి మధ్యాహ్నం 1:45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరతారన్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఉప కలెక్టర్ బి.సహాధిత్ వెంకటత్రివినాగ్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ జిల్లా అధికారిణి షేక్ ఆయేషాబేగం, జనసేన జిల్లా ఇన్‌ఛార్జి షేక్‌రియాజ్, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాశీనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

నకిలీలు ఘనం... అనర్హులే సగం!

▶ దివ్యాంగుల పింఛన్లలో అక్రమాలు
▶ నత్తనడకన వైకల్య నిర్ధారణ పరీక్షలు

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

- దివ్యాంగుల పింఛన్లు : 33,321
- నోటీసులు జారీచేసింది: 26,194
- పరీక్షలకు హాజరైంది : 24,808
- గైర్హాజరైనవారు : 1,386
- నోటీసులు ఇవ్వాల్సింది: 7,127

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అత్యధిక మంది నకిలీ ధ్రువీకరణపత్రాలతో దివ్యాంగుల పింఛను పొందారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పింఛను తీసుకుంటున్నట్లు గతేడాది అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వానికి ఫిర్యాదులందడంతో నెలకు రూ.15 వేలు చొప్పున సీకేడీ (క్రానిక్ కిడ్నీ డిసీజ్),.పక్షవాతం, నరాల బలహీనత, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి శాశ్వత దివ్యాంగులైనవారు, ఎముకులు సంబంధిత వ్యాధులతో మంచం, కుర్చీలకే పరిమితమైనవారిని జనవరిలో ప్రత్యేక వైద్య బృందాలతో ఇంటింటి సర్వే చేపట్టారు. వీరిలో సగం మంది అనర్హులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనర్హులతోపాటు; పరీక్షలకు గైర్హాజరైనవారు కలిపి మొత్తం 415 మందికి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలపై పింఛన్లు నిలిపేశారు. అనంతరం దివ్యాంగుల లబ్ధిదారుల్లోని అనర్హుల ఏరివేతపై ప్రభుత్వం వైకల్య నిర్ధారణ పరీక్షలకు ఆదేశించింది. ఇప్పటికే ఐదు నెలల దాటినా ఇప్పటికీ పరీక్షలు కొనసాగుతున్నాయి. తద్వారా అనర్హుల లెక్క అధికారికంగా వెల్లడి కాకపోవడంతో అనర్హులు లబ్ధి పొందుతున్నారు.

▶ జిల్లాలో 33,321 మంది దివ్యాంగ పింఛనుదారులున్నారు. వీరిపై ఫిర్యాదులందడంతో ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఫిబ్రవరి 4 నుంచి సదరం పత్రాల పునఃపరిశీలన జరుగుతోంది. ఇప్పటివరకు మొత్తం 24,808 మంది పునఃపరిశీలనకు హాజరు కాగా; 10 వేల మంది అనర్హులు ఉన్నట్లు డీఆర్డీఏ అధికారులు గుర్తించారు. మరో 1,386 మంది గైర్హాజరయ్యారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 40 శాతం వైకల్యంతో బాధపడుతున్నవారికి రూ.3 వేలు చొప్పున పింఛను అందజేశారు. అప్పటి ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కొందరు అక్రమ మార్గంలో పింఛను పొందారు. సదరం శిబిరాలకు వెళ్లకుండా; చెవుడు, కంటి చూపు తదితర విభాగాల్లో వైకల్యం ఉన్నట్లు వైద్యుల నుంచి పత్రాలు పొందారు. అప్పట్లో వైకాపా నాయకుల కనుసన్నల్లో కొందరు దళారుల అవతారమెత్తి మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్నారని ధ్రువపత్రాలు తయారు చేయించారు. క్షేత్రస్థాయిలో వాలంటీర్ల ద్వారా ప్రతిపాదనలందడంతో మండల, జిల్లా అధికార యంత్రాంగం పింఛన్ల మంజూరుకు సిఫార్సు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛను సొమ్మును రూ.6 వేలకు పెంచడంతో అనర్హులు తమ ధ్రువీకరణపత్రాలు నిజమైనవేనని నిర్ధారణ చేయించుకునేందుకు పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నారు.

మార్పులేవీ... మార్కులేవీ?

▶ ఏకేయూ అధికారుల నిర్లక్ష్యంతో జాబితాలకు విద్యార్థుల ఎదురుచూపులు

జిల్లాలోని డిగ్రీ విద్యార్థులు నాలుగు సెమిస్టర్ల పరీక్షలు రాయగా, మూడింటి ఫలితాలొచ్చాయి. వీరికి మార్కుల జాబితాలు మాత్రం నేటికీ చేతికందలేదు. ఒక రెండు నెలలు ఆలస్యమనుకుంటే ఫరవాలేదు.. గత రెండేళ్లుగా ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) పరిధిలో డిగ్రీ విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇదేమని అడిగితే విశ్వవిద్యాలయం అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదు. ఏం చేయాలో పాలుపోక వేలాది మంది విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. –ఈనాడు, ఒంగోలు

▶ ఏకేయూ ఏర్పాటైన తరువాత 2023 నుంచి డిగ్రీ తరగతుల పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ సొంతంగా చేపడుతున్నారు. అప్పటి వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) అధికారులే పరీక్షలు నిర్వహించడంతోపాటు మార్కుల జాబితాలు అందించేవారు. గత రెండేళ్లుగా ఏకేయూ పరిధిలోకి రావడంతో పరీక్షల నిర్వహణ ప్రహసనంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జంబ్లింగ్ పేరుతో విద్యార్థులకు సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించడంపై ఎన్నో విమర్శలొచ్చాయి. అంతదూరం వెళ్లి పరీక్షలు రాసేందుకు అమ్మాయిలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినా ఇప్పటి వరకు ఫలితాలు వెలువరించలేదు. గత మూడు సెమిస్టర్లకు ఫలితాలొచ్చినా వెబ్‌సైట్‌లో చూసుకోవడం తప్పించి మార్కుల జాబితా ఇప్పటివరకు చూడలేదని చివరి సంవత్సరం విద్యార్థులు వాపోతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో వంద వరకు కళాశాలలుండగా, పాతిక వేల మందికిపైగా విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం

కారణాలెన్నో..: మార్కుల జాబితాలు ముద్రించే ప్రైవేటు సంస్థకు, ఏకేయూ మధ్య ఒప్పందాలు కుదరకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మార్కుల జాబితాపై ముద్రించే అపార్ నంబరు ఎంతో కీలకమైంది. అపార్ నంబరు విద్యార్థి ఆధార్‌తో అనుసంధానం కావాల్సి ఉంది. కళాశాలల నుంచి విద్యార్థుల వివరాలు సకాలంలో రాకపోవడం, విశ్వవిద్యాలయం అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

త్వరలో అందజేస్తాం: మార్కుల జాబితాల్లో నకిలీలు సృష్టించడానికి అవకాశం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని ముద్రించేందుకు ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించాం. ముద్రణ ప్రారంభమైంది. వెంటనే ఆయా కళాశాలల యాజమాన్యాలకు పంపిణీ చేస్తాం.. ప్రతి సెమిస్టరుకు మార్కుల జాబితా ఇవ్వడంతో పాటు ఏటా విద్యార్థులకు సకాలంలో పట్టాలు ప్రదానం చేస్తాం.
– డీవీఆర్ మూర్తి, ఉపకులపతి, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం

జగదాంబకు నీరాజనం

మార్కాపురంలో మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు వార్తాలి వారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

రూ.500 కోట్లతో విద్యుత్తు ఉప కేంద్రాలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో రూ.500 కోట్లతో మూడు విద్యుత్తు ఉప కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఏలూరు, టి.సల్లూరు, ఉప్పలపాడు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అనంతరం ఏలూరులో రూ.3.90 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్మాణానికి 50 సెంట్లు స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన దాత ధర్మవరపు కోటిరెడ్డిని అభినందించారు. కుంచేపల్లి, ఉప్పలపాడు పంచాయతీలకు ట్రాక్టర్లను అందజేశారు. కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, విద్యుత్తుశాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్. పక్కన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు, అధికారులు

జరుగుమల్లిలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి స్వామి

కూటమితోనే గ్రామాభివృద్ధి సాధ్యం

జరుగుమల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో ప్రజలకిచ్చిన పథకాలను తెలుపుతూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలోని ఉల్లేరమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలిసి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు పోకూరి రవీంద్ర, ఎంపీపీ బెల్లం నిర్మల, నాయకులు నరాల సోమయ్య, పోటు పెద్దబాబు, ఏలూరి రాంబాబు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, శివ, మక్కెన వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు, రేపు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. జులై 4, 5వ తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌లలో ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

WALK IN INTERVIEW
ON 05.07.2025(SATURDAY) Bet.10AM TO 2PM
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఒంగోలు, చీరాల, అద్దంకి శాఖల సందు పనిచేయుటకు క్రింది సిబ్బంది కావలెను.
COLLECTION EXECUTIVES
డిగ్రీ కలిగి 28 సం॥లలోపు వయస్సు గల యువకులు సర్టిఫికెట్లు, బయోడేటా దిగువ తెలిపిన చిరునామాకు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. జీతం: రూ.19000/- లు + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. టూవీలర్ ఉన్న వారికి ప్రాధాన్యత. ఆసక్తి గల వారు నేరుగా గాని లేదా మెయిల్ ద్వారా సంప్రదించగలరు
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
డి.నెం.37-1-47, 1వ అంతస్తు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా - 523001, సెల్: 94947 77499
Email : mahesh.p1@shriramfinance.me

ముసిరుకున్న ముప్పు!

చిత్రంలో కనిపిస్తోంది ఒంగోలు-కర్నూలు రహదారిలో చీమకుర్తి సమీపంలోని ముసి నది పైనున్న వంతెన. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది రాకపోకలు సాగించే ఈ వంతెన పొడవునా గుంతలమయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతో మంది గాయాలపాలవుతున్నారని వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కీలకమైన ఈ రహదారి నిర్వహణను ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా గాలికొదిలేశారని, ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. –ఈనాడు, ఒంగోలు

1,706 పొగాకు బేళ్ల తిరస్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో గురువారం 1,706 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,068 బేళ్లు రాగా 943, ఎస్‌ఎల్‌ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 4,562 బేళ్లు రాగా 763 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.150 చొప్పున పలికింది.

ప్లాస్టిక్ వినియోగం వద్దు.. పర్యావరణ హితమే ముద్దు!

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా దర్శి మండలం కట్టసింగనపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ వస్తువులు ఉపయోగిస్తే మేలు, వేటిని వినియోగిస్తే ప్రమాదమో తెలిపేలా విద్యార్థులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతిఒక్కరూ విడనాడాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఆ చిత్రమే ఇది. –న్యూస్‌టుడే, దర్శి

రైలునిలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ దామోదర్, అధికారులు

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

▶ రైళ్లల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణాపై పోలీసుశాఖ ఉక్కుపాదం మోపుతోంది. విశాఖ మన్యం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు అక్రమంగా సాగుతున్న గంజాయి రవాణాపై పోలీసులు దృష్టి సారించారు. ఈగిల్, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో ఒంగోలు రైలునిలయంతోపాటు పలు రైళ్లలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విశాఖపట్నం-కొల్లాం ఎక్స్‌ప్రెస్ రైలులోని అన్ని బోగీల్లో అనుమానిత సంచులను పరిశీలించారు. తనిఖీలను ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతుంటే టోల్ ఫ్రీ 1972, పోలీసు వాట్సాప్ 9121102266 నంబర్లకు సమాచారమివ్వాలని సూచించారు. తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ మౌలా షరీఫ్; ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం... సర్కారు విద్య దూరం!

▶ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఊసేలేదు
▶ ఉన్నత చదువులకు నోచుకోని పేద విద్యార్థులు

న్యూస్‌టుడే, మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో పేద విద్యార్థులు సర్కారు విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పదోతరగతి పూర్తయినవారు పై తరగతులకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇక్కడున్న జూనియర్, డిగ్రీ ఎయిడెడ్ కళాశాలలు గత వైకాపా ప్రభుత్వ విధానాలతో ప్రైవేటు కళాశాలలుగా మారిపోయాయి. ఇక్కడ ప్రైవేటుగా 10 జూనియర్, ఏడు డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిల్లో సుమారు పది వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రామీణప్రాంతాల నుంచి వచ్చేవారు కావడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా బస్సులు పెట్టి తరలిస్తోంది. మరికొంత మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. అదే ఇక్కడ ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్కాపురంలో ఎస్వీకేపీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడి ఎస్వీకేపీ ఎయిడెడ్ కళాశాలలోనే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
– కందుల నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే

శ్రద్ధాంజలి

జననం: 01-04-1952
మరణం: 19-06-2025

కీ॥శే॥ డా॥ కంచర్ల రామయ్య గారు
(ఈనాడు రామయ్య)
వ్యవస్థాపకులు : ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల, కందుకూరు, సీనియర్ పాత్రికేయులు

నిరాడంబరానికి నిలువెత్తు రూపం మీరు.. సహృదయానికి అసలైన రూపం మీరు...
మీ ధృడ సంకల్పం, కార్యదక్షత మాకు ఆదర్శనీయం... మీ ఆలోచనా ధృక్పథం మాకు స్ఫూర్తి దాయకం..
కుటుంబ పెద్దగా అందరి బాధ్యతలను చేపట్టి మాకు బంగారు భవిష్యత్తు అందించి దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: శ్రీమతి కంచర్ల ధనలక్ష్మి

కుమారులు - కోడళ్ళు :
డా॥ కంచర్ల విజయ్ శ్రీనివాస్ - ఇంద్రాదేవి
డైరెక్టర్: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి, కందుకూరు.
డా॥ కంచర్ల శ్రీకాంత్ - సరిత
ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు, పొలిటికల్ ఛైర్మన్, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (KADA)
మనుమలు: సాయి శ్రీహాస్, తారక రామ్, అభి కార్తికేయ

పెద్దకర్మ: తేది: 05-07-2025, శనివారం ఉదయం 10.00 గంటల నుండి ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి, కందుకూరు నందు జరుగును. కావున తెలియపరచడమైనది.

(c) eenadu

రూ.కోట్లున్నా.. తీరిక లేదన్నా..

రూ.కోట్ల నిధులున్నా.. అధికారుల నిర్వాకంతో సాగర్ కాలువల దశ మారడం లేదు. దీంతో కట్టడాలు శిథిలమై.. కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కనీసం ఈ ఏడాదైనా ఒంగోలు బ్రాంచి ప్రధాన, అనుబంధ మేజర్, మైనర్ కాలువలకు మరమ్మతులు చేపడతారా అని అన్నదాతలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌టుడే, చీమకుర్తి, సంతనూతలపాడు

గతేడాది ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అద్దంకి తదితర మేజర్ కాలువల మరమ్మతులకు రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయి. చీమకుర్తి, తాళ్లూరు, సంతనూతలపాడు, ఒంగోలు మండలాల పరిధిలోని ఒంగోలు బ్రాంచి, అనుబంధ కాలువలకు మాత్రం ఎలాంటి నిధులు కేటాయించలేదు. మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపడంలో చోటు చేసుకున్న జాప్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. గత వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్వహణ కూడా పట్టించుకోకపోవడంతో కాలువల్లో చిల్ల చెట్లు పెరిగిపోయాయి. రక్షణ గోడలు కూలిపోయాయి. గేట్లు దెబ్బతిన్నాయి. పూడిక పెరిగిపోవడంతో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రానైట్ యాజమాన్యం, ప్రవాస భారతీయులు ముందుకొచ్చి ఒంగోలు బ్రాంచి కాలువ, కారుమంచి, అగ్రహారం మేజర్లలో వివిధ రకాల మరమ్మతులు నిర్వహించారు.

■ **రూ.2 కోట్లకు అనుమతులొచ్చినా.. :** ఈ ఏడాది మరమ్మతుల నిమిత్తం ఒంగోలు బ్రాంచి కాలువ పరిధి లోసుమారు 70 పనులు చేసేందుకు రూ. 2 కోట్లతో ప్రతిపాదించారు. వాటికి ప్రభుత్వం నుంచి పాలనాపరమైన అనుమతులు లభించినా యంత్రాంగంలో కదలిక కరవైంది. సాధారణంగా కాలువల్లో నీరు నిలిపి వేసిన తర్వాత వేసవిలో మరమ్మతులు నిర్వహిస్తుంటారు.

ఒంగోలు బ్రాంచి కాలువ వంతెన గోడకు పగుళ్లు

అయితే వర్షాకాలం ప్రారంభమైనా పనులు చేయకపోవడంపై అన్నదాతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

■ **లీకేజీలు అరికట్టగానే పనులు:** పనుల్లో జాప్యంపై జల వనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి స్పందిస్తూ కొద్ది రోజుల కిందట వరకు తాగునీటి అవసరాల కోసం నీరు విడుదల చేశామన్నారు. అందువల్ల పనులు చేపట్టడం సాధ్యం కాలేదన్నారు. జలాశయం గేట్ల లీకేజీలను పూర్తిస్థాయిలో అరికట్టిన వెంటనే కాలువలపై మరమ్మతులు చేపడతామన్నారు.

చేతిపంపు వద్ద నీటి కోసం పాట్లు

పెచ్చులూడిన పైకప్పు

సంక్షామ గృహం!

పొదిలి విరాట్‌నగర్‌లోని బీసీ బాలుర వసతి గృహం పరిస్థితి ఇది. గత అయిదేళ్లుగా నిర్వహణను గాలికొదిలేయడంతో భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబు పెచ్చులూడి పడుతుండడంతో పాటు... వర్షం పడితే గదులు ఉరుస్తూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. నీటి వసతి లేక ట్యాంకర్ల పైనే ఆధారపడాల్సి వస్తోంది. ట్యాంకు రానప్పుడు ఆవరణలోని చేతిబోరును ఆశ్రయించాల్సి వస్తోంది. పాత మరుగుదొడ్లు పాడవడంతో కొత్తవి నిర్మించారు. నీటి వసతి, నిర్వహణ లేక ఇవీ నిరుపయోగంగానే మారాయి. ఈ పరిస్థితులతో వంద మంది పిల్లల్లో సగం మందే ఉంటున్నారు. సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో నివేదికలు పంపినా నిధులు మంజూరు చేయలేదు. కూటమి సర్కారైనా దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - **ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, పొదిలి**

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్ మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

లో గ్రేడ్ పొగాకు కొనుగోలుతో ఊరట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: లో గ్రేడ్ రకం పొగాకును కొనుగోలు చేయడం ద్వారా రైతులకు ఊరట లభిస్తుందని పొగాకు బోర్డు ప్రాంతీయ కార్య నిర్వహణాధికారి శీలం రామారావు వ్యాపారులకు సూచించారు. ఒంగోలు-2 వేలం కేంద్రంలో గురువారం జరిగిన పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్‌లో లభిస్తున్న ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. నో బిడ్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం మొద్దు పచ్చ, ఎన్‌వోజీ రకం బేళ్లు వేలానికి తీసుకురావొద్దని వివరించారు. పెరిగిన సాగు ఖర్చుల దృష్ట్యా రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తిని కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం వ్యాపారులు, బోర్డు, ఉద్యోగులు, రైతు నాయకులు ఆర్.ఎం.రామారావును సన్మానించారు.

బేళ్లను పరిశీలిస్తున్న ప్రాంతీయ కార్యనిర్వహణాధికారి రామారావు

మానవత్వం చాటుకున్న మంత్రి గొట్టిపాటి

చీమకుర్తి, న్యూస్‌టుడే: క్షతగాత్రురాలికి ఆపన్న హస్తం అందించి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మానవత్వం చాటుకున్నారు. పొదిలి మండలం ఏలూరులో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్తు ఉపకేంద్రం ప్రారంభోత్సవానికి ఆయన వెళుతున్నారు. ఆయన వాహనం ఒంగోలు - కర్నూలు రహదారిలోని సాగర్ వంతెన సమీపం నుంచి వెళుతోంది. అదే సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను ఆయన గుర్తించారు. వెంటనే కాన్వాయ్ దిగి బాధితురాలు లక్ష్మిని పరామర్శించారు. ప్రైవేటు వాహనంలో చీమకుర్తి వైద్యశాలకు తరలించే ఏర్పాటు చేశారు.

లక్ష్మితో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. 7వ పిల్లల (అండర్-10), 13వ మినీ(అండర్-13) పోటీలకు జిల్లాకు చెందిన బి.వెంకటసౌమ్య, డి.లక్ష్మీషణ్ముఖప్రియ, సి.హెచ్.జైత్ర, డి.చరణ్ సాయి ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బి.వెంకటసౌమ్య బంగారు పతకం, డి.లక్ష్మీషణ్ముఖప్రియ, సీహెచ్.జైత్ర, డి.చరణ్ సాయి కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 5వ తేదీ నుంచి నాసిక్‌లో జరిగే పోటీలకు ఈ బృందం పయనమైనట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అక్కడ అద్భుత ప్రతిభచూపి రాష్ట్రానికి ఖ్యాతి తేవాలని రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

మోపాడుకు నిధుల దన్ను

● అభివృద్ధి పనులకు రూ.1.2 కోట్లు

పామూరు, న్యూస్‌టుడే: పామూరు మండలంలోని మోపాడు జలాశయం అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. పామూరు మండలంతో పాటు నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలోని గ్రామాలకు మోపాడు జలాశయం ఆయకట్టు ఉంది. దీని పరిధిలో అధికారికంగా 12,719 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నిధులతో జలాశయం పరిధిలోని పంట కాలువలు, చెట్ల తొలగింపు పనులను చేపట్టనున్నట్లు జల వనరుల శాఖ అధికారులు చెప్పారు. వీటితో పాటు తూములు, డ్రాపుల మరమ్మతులు చేయనున్నారు. ముప్పై ఏళ్లుగా మోపాడు జలాశయం పరిధిలో పంట కాలువల్లో పూడికతీత తీసిన సందర్భాలు లేవని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పూడిక మొత్తం తొలగిస్తే తమ మాగాణి భూముల్లోకి జలాశయం నీరు సాఫీగా ప్రవహిస్తుందని వారంటున్నారు. హనుమంతునిపాడు మండలం నందనవనం చెరువు, కనిగిరి మండలంలోని పునుగోడు, గొల్లపల్లి చెరువుల మూడింటికి కలిపి రూ.11 లక్షలు, సి.ఎస్.పురం మండలంలోని డీజీపేట, బొంతవారిపల్లి, కంభంపాడు, తిమ్మరాజుపల్లి చెరువులు నాలుగింటికి కలిపి రూ.14 లక్షలు నిధులు మంజూరైనట్లు జల వనరుల శాఖ డీఈఈ కె.విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. వాటితో నిర్మాణ పనులు చేయనున్నారు.

మోపాడు జలాశయం

భక్తిశ్రద్ధలతో చిన్న షరగత్

● కోలాహలంగా ఖాసిం దర్గా

తర్లుపాడు, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా తుమ్మల చెరువు హజరత్ ఖాసిం దర్గాలో చిన్న షరగత్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. గురువారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామికి నైవేద్యాలు సమర్పించారు. సంతానం పొందిన వారు తలనీలాలిచ్చారు. ఈ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. అర్ధరాత్రి తర్వాత పీర్లను పుర వీధుల్లో ఊరేగించారు. మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.

తర్లుపాడు: ఖాసిం దర్గాలో భక్తులు

గ్రామాల్లో అగ్ని గుండాల ఏర్పాటు : హనుమంతునిపాడు: హనుమంతునిపాడు, హాజీపురం, మహమ్మదాపురం, రామాయపల్లి, తిమ్మారెడ్డిపల్లి, సీతారాంపురం, నందనవనం, వాలిచెర్ల గ్రామాల్లో కులమతాలకతీతంగా మొహర్రం నిర్వహించారు. పీర్లను నూతన వస్త్రాలతో అలంకరించారు. శుక్రవారం రాత్రికి చిన్న షరగత్ నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు చేశారు. పీర్ల చావిడిల వద్ద అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో

హెచ్‌ఎంపాడులో అలంకరించిన పీర్లు

అశ్విన్‌బాబుకు కప్ అందజేస్తున్న నాట్స్ అధ్యక్షుడు మదన్ పాములపాటి

అమెరికాలో తెలుగు సంబరం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) నిర్వహించే 'అమెరికా తెలుగు సంబరాలు' ఈ నెల 4, 5, 6 తేదీల్లో టంపాలో వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా సన్నాహక కార్యక్రమాలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. సినీ ప్రముఖులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్ఆర్ఐలు క్రికెట్ మ్యాచ్‌లు ఆడారు. సినీ కథా నాయకుడు వెంకటేష్, సంగీత దర్శకులు తమన్, ఆదిత్యా సాయికుమార్, సాప్రాట్, సుధీర్‌బాబు, ప్రశాంత్‌వర్మ, ఓంకార్, అశ్విన్‌బాబు, ఖయ్యూం, హరీష్, భూపతి తదితరుల జట్టు.. అక్కడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్ఆర్ఐల జట్టుతో క్రికెట్ ఆడారు. విజేతలకు, మ్యాచ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు నాట్స్ అధ్యక్షుడు మదన్ పాములపాటి బహుమతులు అందజేశారు. ఈయన సీఎస్.పురానికి చెందినవారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేయాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో 2025 సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడానికి అర్హులైనవారు ఈ నెల 13 లోగా నేషనల్ అవార్డ్స్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పది సంవత్సరాల సర్వీసు పూర్తిచేసినవారు అర్హులన్నారు. నమోదు చేసుకున్న దరఖాస్తు కాపీ, రెండు సెట్లు ప్రతిపాదనలను వర్డ్ డాక్యుమెంట్ (సీడీ)ని 30 పేజీలు మించకుండా డీఈవో కార్యాలయం, ఎంఈవో, ఉప విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నిర్లక్ష్యం ఎగసి పడింది

తాళ్లూరు: తూర్పు గంగవరం శివారు కొత్త లింగాలపాడు కాలనీలో విలువైన మంచినీరు వృథాగా నేల పాలవుతోంది. తరచూ ఇలా జరుగుతున్నా యంత్రాంగంలో స్పందన కరవైంది. దీనిపై ఎంపీడీవో దారా హనుమంతరావును వివరణ కోరగా.. త్వరలోనే పరిష్కార చర్యలు చేపడతామన్నారు.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ(హైదరాబాద్), న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఏటా మాదిరి వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని '2023 ప్రతిభా పురస్కారాల'కు ప్రకటించింది. ఎలనాగ(కవిత), డా.ప్రభల జానకి(విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి(చిత్రలేఖనం), సంపత్‌రెడ్డి(శిల్పం), పేరిణి రమేష్‌లాల్(నృత్యం), హరిప్రియ(సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి(పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ(నాటకం), కడకంచి పాపయ్య(జానపద కళారంగం), దాళిపాళ మహాదేవమణి(అవధానం), ఆచార్య కె.[illegible](ఉత్తమ రచయిత్రి), డా.శాంతి నారాయణ(నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు గురువారం ప్రకటనలో తెలిపారు. త్వరలోనే విశ్వవిద్యాలయంలో అవార్డుతో పాటు ఒక్కొక్కరికి రూ.20,116 అందజేస్తామని చెప్పారు.

నేడు సూచించిన కోడిగుడ్డు ధర

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.ల్లో)

ఒంగోలు: బ్రాయిలర్ ఫారం ధర - 103, రిటైల్ లైవ్ - 125, చికెన్ విత్ స్కిన్ - 181, చికెన్ స్కిన్‌లెస్ - 206

భవిత పాఠశాలలో దస్త్రాలు తనిఖీచేస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి

పొదిలి, న్యూస్‌టుడే: ప్రత్యేక సహిత విద్య, వినికిడి, బుద్ధిమాంద్యం పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారు ప్రధాన పాఠశాలకు వెళ్లేలా తీర్చిదిద్దాలని డీఈవో, సమగ్ర శిక్ష పథకం అదనపు సమన్వయకర్త కిరణ్‌కుమార్ చెప్పారు. గురువారం పొదిలిలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పాఠశాలలో దస్త్రాలను తనిఖీ చేశారు. దివ్యాంగులు, వివిధ రకాల అవసరాలు కలిగిన వారికి అందించే ఫిజియోథెరపీ వ్యాయామ శిక్షణ గురించి తెలుసుకున్నారు. ఇలాంటి కేంద్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. భవితా రిసోర్సు పర్సన్లు షాహీదాబేగం, రమాదేవిల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో-2 నాగలక్ష్మి, సీఆర్ఎంటీలు కిరణ్మయి, సుబ్బారెడ్డి, శ్రీనివాసకుమార్ ఉన్నారు.

పులి దాడిలో ఎద్దుకు గాయాలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: నల్లమల అటవీప్రాంతంలోని పాలుట్ల గిరిజనగూడెం వద్ద పెద్ద పులి మరోసారి పంజా విసిరింది. గురువారం ఉదయం పాలుట్లకు చెందిన జెండావత్ బాలునాయక్‌కు చెందిన ఎద్దులు, ఆవులను అడవిలో మేతకు తీసుకెళ్లారు. అక్కడే కాపు కాసిన పులి ఒక్కసారిగా మందపై దాడి చేయగా, కాపరులు గట్టిగా కేకలు వేయడంతో అడవిలోకి పారిపోయింది. ఓ ఎద్దుకు గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో పులి దాడి చేయడం ఇది మూడోసారని స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనలతో పాలుట్ల వాసులు భయాందోళనలు చెందుతున్నారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు గూడెంవాసులు తెలిపారు.

రెండు లారీలు ఢీకొని..

సింగరాయకొండ గ్రామీణం, జరుగుమల్లి: జాతీయ రహదారి పక్కన ఆగివున్న లారీని, మరో లారీ ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పెట్రోలు బంకు వద్ద ఓ చోదకుడు లారీని రోడ్డుపక్కన నిలిపి మూత్ర విసర్జనకు వెళ్లారు. అదే సమయంలో రొయ్యల లోడుతో వస్తున్న మరో లారీ అదుపు తప్పి నిలిచివున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రొయ్యల లోడు లారీలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం తిల్లపూడికి చెందిన వ్యాపారులు నడపాన శ్రీను, సాయితో పాటు చోదకుడు చక్రధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్సై మహేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాదంలో ధ్వంసమైన లారీ

మహిళా సీఐని దూషించిన కేసులో

పొదిలి ఎక్సైజ్ ఎస్సై సస్పెన్షన్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహిళా సీఐని దూషించిన కేసులో పొదిలి ఎక్సైజ్ ఎస్సై వి.సైమన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ డి.శ్రీనివాసులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 29న ఎస్సై సైమన్ తమ పరిధిలోని కొనకనమిట్లలో మద్యం సీసాలతో ఉన్న వెంకటేశ్వర రెడ్డిని అరెస్టు చేశారు. అతనిపై కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టడానికి రూ.5 వేలు డిమాండ్ చేశారు. అనంతరం అతన్ని వదిలిపెట్టాడు. దీనిపై మహిళా సీఐ తాళ్లూరి అరుణకుమారి ఎస్సై సైమన్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన సైమన్ స్టేషన్ సిబ్బంది ఎదుటే సీఐను కులం పేరిట అసభ్యపదజాలంతో దూషించారు. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు కూడా చేశాడు. దీంతో సీఐ అరుణకుమారి అదేరోజు జిల్లా ఉన్నతాధికారులకు ఈ విషయం నివేదించారు. 30న ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పాటు డిప్యూటీ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టగా సైమన్‌పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో అతన్ని సస్పెండ్ చేస్తూ డీసీ డాక్టర్ డి.శ్రీనివాసులు ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్సై సైమన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

నకిలీ పత్రాలు.. వంచన చిత్రాలు

◆ తప్పుడు ఆధారాలతో భూ దోపిడీ

కనిగిరి, న్యూస్‌టుడే

పశ్చిమ ప్రాంతంలోని కనిగిరి పట్టణం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో అక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి వాటిని కాజేస్తున్నారు. రాత్రికి రాత్రే నకిలీ పత్రాలు, స్టాంపులు సిద్ధమైపోతున్నాయి. రెండో భార్య, కొత్త వారసులను తెరపైకి తీసుకొస్తున్నారు. తెల్లారే సరికి ఆ స్థలం తమదంటూ తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో అసలు వారికి నరకం చూపిస్తున్నారు. గత కొంతకాలంగా ఇలాంటి భూ దందా నిత్యకృత్యంగా మారింది. పట్టణంలోని గార్లపేట బస్టాండ్‌లో రెండు నెలల క్రితం రూ. 5 కోట్ల విలువైన ఓ ఇంటిని కాజేసేందుకు కనిగిరి, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాలకు చెందిన ముఠా రంగంలోకి దిగింది. స్థల యజమాని సోదరుడు అనారోగ్యంతో మృతి చెందగా, అతని భార్యగా ఓ మహిళను తీసుకొచ్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో అసలు యజమాని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముఠా వెనక్కు తగ్గింది. తాజాగా ఆ ముఠా సభ్యులే మరో స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించగా బుధవారం అరెస్టు చేశారు.

ఈ భూమి కనిగిరి పట్టణంలోని హోటల్ యజమాని పోలంరెడ్డి మాలకొండారెడ్డిది. నకిలీ పత్రాలతో రూ.15 కోట్ల విలువైన తన భూమిని కాజేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని హక్కుదారుడు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో ఏడుగురిని అరెస్టుచేయగా.. మిగతా వారు పరారీలో ఉన్నారు.

■ **వందలాది నకిలీ పట్టాలు :** కనిగిరి మున్సిపాలిటీ, మండల పరిధిలోని చింతలపాలెం, శంకవరం, అర్బన్‌కాలనీ, కాశిరెడ్డి నగర్, పాపిరెడ్డినగర్, చల్లగిరగల, మాచవరం, గార్లపేట రోడ్డు తదితర ప్రాంతాల్లో 300లకు పైగా నకిలీ పట్టాలున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కనిగిరి, వెలిగండ్ల, సీఎస్ పురం, హనుమంతునిపాడు మండలాలకు చెందిన ముఠా సభ్యులు వీఆర్వోల సాయంతో నకిలీ పట్టాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించి విక్రయిస్తున్నారు. వీరిలో కొందరిని అరెస్టుచేసి జైలుకు పంపినా.. కొత్త ముఠాలు రంగంలోకి దిగుతున్నాయి.

నకిలీ పట్టాతో కాజేసేందుకు యత్నించిన రూ.15 కోట్ల భూమి

వారు తప్పుడు పత్రాలతో భూములను విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు నిర్మాణాలు చేపడదామని వెళితే అవి ప్రభుత్వ భూములని తేలడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

కబ్జా చేస్తే కఠిన చర్యలు

కనిగిరిలో తప్పుడు పత్రాలతో భూ దందా చేస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల నకిలీ పత్రాలతో మోసం చేస్తున్న ఉదంతాలు తమ దృష్టికి వస్తున్నాయి. కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలి. అనుమానమొస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– పి. సాయి ఈశ్వర్ యశ్వంత్, డీఎస్పీ

సిగాచి ప్రమాదంలో అర్ధవీడు వాసి దుర్మరణం

అర్ధవీడు, న్యూస్‌టుడే: తెలంగాణాలోని పఠాన్‌చెరువు మండలం పాశమైలారం సిగాచి కంపెనీలో జూన్ 30న చోటు చేసుకున్న ప్రమాదంలో ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. అర్ధవీడు గ్రామానికి చెందిన **దాసరి సునీల్(22)** మూడు నెలల క్రితం సిగాచి కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదంలో మొత్తం 36 మంది మృతి చెందగా అందులో సునీల్ ఉన్నట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. సునీల్ తల్లిదండ్రులు నరసయ్య, సునీత అక్కడికి చేరుకుని తన కుమారుని మృతదేహాన్ని గుర్తించారు. శవపంచనామా అనంతరం బుధవారం గ్రామానికి మృతదేహాన్ని తరలించారు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడన్న తన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

మిత్రుడికి తోడుగా వెళ్లిన దివ్యాంగుడి మృతి

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: మిత్రుడికి తోడుగా వెళ్లిన దివ్యాంగుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన కాయకాకుల రాము (35) దివ్యాంగుడు. బుధవారం రాత్రి మిత్రుడు తోడుగా రమ్మని కోరడంతో అశోక్ లేలాండ్ ట్రాలీలో నరసరావుపేటకు బయలుదేరారు. రాజుపాలెం వద్ద వీరి వాహనాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో అశోక్ లేలాండ్ వాహనంలో చోదకుడి పక్కన కూర్చొనివున్న రాము అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి గాలెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ బసవరాజు తెలిపారు.

EENADU Classifieds

PEOPLE CARE

OLD AGE HOME

HOUSE FOR SALE

REAL ESTATE

FLAT FOR SALE

Ready to Occupy, Fully Furnished 2800 Square Feet. Duplex flat for sale at Gupthas Royale (Gated Community) 2 Car Parkings, 5 Ac's and 3 BEDS, Dining Table etc. Back side of Ratna Mahal Theatre/ Hotel Sarovar, Ongole. Cell: 9849119754.

JOBS

97011 12824 ఒంగోలు
80087 09902 మార్కాపురం
80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

స్వాగతం.. సుస్వాగతం
ప్రకాశం జిల్లాకు
రూ.1290 కోట్ల విలువైన
తాగునీటి పథకం శంకుస్థాపన
10 లక్షల మందికి తాగు నీరు అందేలా
ప్రభుత్వ ప్రణాళిక.
జూలై 4వ తేదీన ప్రకాశం జిల్లా,
మార్కాపురం నియోజకవర్గం, నరసింహపురం గ్రామంలో
ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి
చేతుల మీదుగా శంకుస్థాపన
అనంతరం 11 గం.లకు
బహిరంగ సభ
కందుల నారాయణ రెడ్డి
శాసనసభ్యులు, మార్కాపురం
ఇమ్మడి కాశీనాధ్
మార్కాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి

గిద్దలూరు: తిమ్మాపురం బీసీకాలనీలో కరపత్రాలను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

త్రిపురాంతకం: నడిగడ్డలో మాట్లాడుతున్న తెదేపా బాధ్యుడు ఎరిక్షన్‌బాబు

డెంగీపై అవగాహన సదస్సు

రాచర్ల: డెంగీ నివారణపై అవగాహన పెంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని అనుములవీడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కాలువల్లో దోమలు పెరగకుండా కిరోసిన్‌ను నీటిలో పోయాలని చెప్పారు. విద్యార్థులు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గిద్దలూరు పట్టణం, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పొదిలి, న్యూస్‌టుడే: బీసీల అభ్యున్నతికి పాటుపడింది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం గిద్దలూరు మండలం తిమ్మాపురం బీసీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీసీ జలజీవన్ మిషన్ పథకం కింద తిమ్మాపురం బీసీ కాలనీలో ఇంటింటికి కుళాయి పథకాన్ని ప్రారంభించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ● త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా బాధ్యుడు ఎరిక్షన్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు బ్రహ్మం చౌదరి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచి పెడుతూ సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ● పెద్దదోర్నాలలోని వీధుల్లో, పొదిలి పంచాయతీలో తెదేపా నాయకులు, బూత్‌కన్వీనర్లు, కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఏడాది కూటమి పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించండి

తర్లుపాడు, న్యూస్‌టుడే: గర్భిణులకు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు పీడీ సువర్ణ అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చెడిపోయిన ఆహార పదార్థాలను పంపిణీ చేసినట్లు సమాచారం వచ్చినందంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తర్లుపాడు, మార్కాపురం రెండు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు, చిన్నారులు దృఢంగా, ఆరోగ్యవంతంగా ఉండాలంటే అంగన్‌వాడీ కార్యకర్తల చేతిలోనే ఉందన్నారు. ప్రతి రోజు ప్రభుత్వ మెనూ ప్రకారం తల్లులకు, గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తే లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. లబ్ధిదారులకు అందించాల్సిన పౌష్టికాహారం కేంద్రం నిర్వాహకులు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసీడీఎస్ జిల్లా పీడీ సువర్ణ

సమన్వయంతో సమర్థవంతంగా పని చేయండి

మార్కాపురం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం మార్కాపురంలో పర్యటిస్తున్న నేపథ్యంలో అధికారులు చిన్న పొరపాటు కూడా జరగకుండా ఏర్పాట్లు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం ఉప కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పర్యటనకు సంబంధించిన కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులతో పాటు డివిజన్‌లోని అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సభాస్థలిలో ఉన్న మహిళలు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సభ లోపల తాగునీరు సౌకర్యం, బయట మొబైల్ మరుగుదొడ్లు తగినన్ని సిద్ధంగా ఉంచాలన్నారు. బందోబస్తు పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చిన్న పొరపాటు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా 720 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాట్లు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఇరకాటంలో ఇంటర్!

☛ బోధకులు లేక చేరని విద్యార్థులు ☛ ప్రైవేటు పైనే ఆసక్తి

గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని గంజి భద్రయ్య మెమోరియల్ హైస్కూల్ ప్లస్ పాఠశాల

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో 20 ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. జిల్లాలో నిర్వహించిన బదిలీల్లో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. దీంతో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌కు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో మొదటి సంవత్సరంలో పలు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి చేరని పరిస్థితి నెలకొంది. పలు పాఠశాలల్లో ఇంటర్మీడియట్ 2వ సంవత్సర ప్రారంభమై నెల రోజులు అయినప్పటికీ ఉపాధ్యాయులు లేక బోధన సాగకపోవడంతో పలువురు విద్యార్థులు టీసీలు తీసుకొని ప్రైవేటు కళాశాలల్లో చేరుతున్న పరిస్థితి ఏర్పడింది. గిద్దలూరు నియోజకవర్గంలోని హైస్కూల్ ప్లస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో ఇంటర్మీడియట్ బోధకుల ఉపాధ్యాయుల కొరతపై స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ఓఎస్‌డీ దృష్టికి తీసుకెళ్లారు.

పరిస్థితి ఇదీ...

గిద్దలూరు మండలం ముండ్లపాడు గంజిభద్రయ్య మెమోరియల్ ఉన్నతపాఠశాలల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోధన చేసే ఉపాధ్యాయులు లేరు. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో ఒక్క విద్యార్థి మాత్రమే చేరారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31 మంది ఉండగా పాఠశాలలో బోధన లేకపోవడంతో 16 మంది విద్యార్థులు టీసీలు తీసుకొని తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది అయినప్పటికీ గిద్దలూరులోని ప్రైవేటు పాఠశాలల్లో చేరారు.
❑ గిద్దలూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ఉన్న బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 38 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13 మంది ఉన్నారు. ఈ పాఠశాలలో లెక్కలు, తెలుగు, ఇంగ్లిషు, బాటనీ సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉంది.
❑ బేస్తవారపేట లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఒక్క విద్యార్థి మాత్రమే చేరాం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17 మంది ఉండగా బోధన చేసే ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యార్థులకు బోధన ఎలా చేపట్టాలో తెలియక ప్రధానోపాధ్యాయుడు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పొదిలి, గిద్దలూరు పట్టణం: పొదిలి మండలంలోని కొత్తూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు పొదిలి ఏఈఈ డి.హరిబాబు తెలిపారు. ● గిద్దలూరు మండలంలోని మోడంపల్లె, వల్లిరెడ్డిపల్లె, పిట్టమీదిపల్లె, కొంగలవీడు, చంద్రారెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లె, నల్లగుంట్ల, బైనపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ శేషగిరిరావు తెలిపారు.

క్షయపై అప్రమత్తత అవసరం

కంభం: క్షయపై అవగాహన అవసరమని టీబీ సూపర్‌వైజర్ బాబు పేర్కొన్నారు. స్థానిక వావిలి విద్యా సంస్థలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధిపై అప్రమత్తతతో వ్యవహరించాలని చెప్పారు. విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలనితెలిపారు. వ్యాధి లక్షణాలు, నివారణకు సూచనలు వివరించారు. అనుమానితులు కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న షరగత్

తర్లుపాడు, రాచర్ల,కంభం, మార్కాపురం, కొనకనమిట్ల, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా తుమ్మలచెరువు దర్గా అజారత్ ఖాసీంస్వామి చిన్నషరగత్ గురువారం కోలాహలంగా మొదలైంది. పలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలు తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి తర్వాత గ్రామ పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. ● రాచర్ల పంచాయతీలో గురువారం రాత్రి చిన్నషరగత్ నిర్వహించారు. పీర్లను గజ్జెలు, దండలు, దట్టీలతో ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పీర్లను దర్శించుకున్నారు. గ్రామస్థుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ● కంభం మండలంలోని తురిమెళ్ల తదతర గ్రామాల్లోనూ చిన్నషరగత్ నిర్వహించారు. ●మార్కాపురం పట్టణంలోని గొర్లగడ్డ పెద్దచావిడిలోని హస్సన్, హుస్సేన్ పీర్లను సుందరంగా ముస్తాబు చేశారు. శనివారం రాత్రి చిన్న షరిగెత్తు, ఆదివారం పెద్ద షరగత్‌ను నిర్వహించనున్నారు. కొనకనమిట్ల మండలం గార్లదిన్నె, నాగంపల్లి, మునగపాడు, బచ్చుకూరపాడు గ్రామాల్లో చిన్నషరిగత్‌ను వేడుకగా నిర్వహించాను.

మార్కాపురం : గొర్లగడ్డ పెద్దచావిడిలో..

తర్లుపాడు: ముస్తాబైన ఖాసీంస్వామి

సీపీఎస్ విధానం రద్దుకు డిమాండు

కంభం, న్యూస్‌టుడే : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య పేర్కొన్నారు. మండలంలోని జంగంగుంట్ల, ఎల్.కోట, రావిపాడు, హజరత్‌గూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఆ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులేషన్, మెడికల్ బిల్లులు తదితర సమస్యలపై చర్చించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పాఠాలు చెప్పే వాతావరణం కల్పించాలన్నారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి డి.సిద్ధిక్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు షఫీ, అంకయ్య, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

పొదిలి ఎక్సైజ్ ఎస్సై సైమన్ సస్పెన్షన్

పొదిలి: పొదిలి ఎక్సైజ్ ఎస్సై వి.సైమన్‌ను సస్పెండ్ చేస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం తెలిపారు. గత నెల 29న సర్కిల్ పరిధిలోని కొనకనమిట్లలో బెల్ట్‌దుకాణం నిర్వహకుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేయలేదన్నారు. ఉన్నతాధికారులతో అమర్యాదగా మాట్లాడటం తదితర కారణాలతో సస్పెండ్ అయినట్లు చెప్పారు. ఎస్సై సైమన్ తనను అగౌరవంగా, అసభ్యకరంగా మాట్లాడారని పొదిలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరుణకుమారి జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో విచారించిన అధికారులు సైమన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ASSIST Building Ideal Communities
పబ్లిక్ నోటీసు
varaha

Enhancing Livelihoods of Tribal Communities through Afforestation in South India

దక్షిణ భారతదేశంలో అటవీకరణ ద్వారా గిరిజన వర్గాల జీవనోపాధిని మెరుగుపరచేందుకు వివిధ పండ్ల,కలప మొక్కల పెంపకం వాటి నిర్వహణపై ఈ నెల 5వ తారీఖున ఈ దిగువ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ఆయా రైతులు మరియు రైతు సంఘాలతో చర్చ నిర్వహించుచున్నాము. మీరందరూ హాజరై మీ విలువైన అభిప్రాయాన్ని తెలియజేయవలసిందిగా మనవి.

కార్యక్రమ వివరాలు: సమయం: ఉదయం 10.30 ని॥ల నుండి 12.30 ని॥ల వరకు)
తేది 05-07-2025 శనివారం
అసిస్ట్ ప్రాంతీయ కార్యాలయం, రాయవరం, మార్కాపురం, ప్రకాశం జిల్లా.
వివరములకు : ఎం.ఎస్.ఎన్.మూర్తి, మేనేజరు, వరాహ 70365 21002

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: మండలంలోని మునగపాడులో కాలువలు చెత్తలో నిండిపోయి అధ్వానంగా మారాయి. నీరు కదలం లేదు. – నాసరయ్య, మునగపాడు
✓: వెంటనే సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. –శ్రీదేవి, ఈవోఆర్డీ

అర్ధవీడు, న్యూస్‌టుడే:

?: మొహిద్దీన్‌పురం తెలుగువీధి సమీపంలోని ప్రధాన దారిలో మురుగు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – నరేష్, మొహిద్దీన్‌పురం.
✓: చర్యలు తీసుకుంటాం. – నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, మొహిద్దీన్‌పురం

సిగాచి ప్రమాదంలో అర్ధవీడు వాసి దుర్మరణం

అర్ధవీడు, న్యూస్‌టుడే: తెలంగాణాలోని పఠాన్‌చెరువు మండలం పాశమైలారం సిగాచి కంపెనీలో జూన్ 30న చోటు చేసుకున్న ప్రమాదంలో ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. అర్ధవీడు గ్రామానికి చెందిన దాసరి సునీల్ (22) మూడు నెలల క్రితం సిగాచి కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదంలో మొత్తం 36 మంది మృతి చెందగా అందులో సునీల్ ఉన్నట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. సునీల్ తల్లిదండ్రులు నరసయ్య, సునీత అక్కడికి చేరుకుని తన కుమారుని మృతదేహాన్ని గుర్తించారు. శవపంచనామా అనంతరం బుధవారం గ్రామానికి మృతదేహాన్ని తరలించారు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడన్న తన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

మృతుడు సునీల్ (పాత చిత్రం)

దైవదర్శనానికి వెళ్లి ..

కొమరోలు గ్రామీణం: మండలంలోని తాతిరెడ్డిపల్లెకు చెందిన డేరంగుల వెంకటస్వామి (65) కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి వెళ్లి గుడి వద్దే గుండెపోటు రావడంతో మృతి చెందారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి

మృతి చెందిన మేకపిల్లలు

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి చెందిన సంఘటన పిడికిటివానిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. రైతు పెద్దిరాజు మధ్యాహ్నం మేక పిల్లలను స్థలంలో కట్టివేసి భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో కుక్కలు మేకలమందపై దాడి చేయడంతో 15 మేక పిల్లలు మృతి చెందాయి. మరో పది పిల్లలు గాయపడ్డాయి. రైతు వచ్చి కుక్కలను తరిమేందుకు ప్రయత్నించినా అతనిపై దాడి చేశాయి. స్థానికులు సాయంతో వాడిని తరిమివేశామని పెద్దిరాజు తెలిపారు. కుక్కదాడి వల్ల నష్టపోయినట్లు వాపోయారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 103, రిటైల్ లైవ్ - 125, చికెన్ విత్ స్కిన్ - 181, చికెన్ స్కిన్‌లెస్- 206

సోషల్ మీడియాలో పోస్టులు.. ఇద్దరి అరెస్టు

కంభం : సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన సమీరా, సూర్యలు పట్టణానికి చెందిన ఖాజావలి, సుభానిలపై ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెట్టారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులకు చెప్పారు.

పూసలపాడులో కేబుల్ తీగ చోరీ..

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ముగ్గురి రైతులకు చెందిన పొలాల్లోని బోర్ల వద్ద నుంచి 70 మీటర్ల కేబుల్ తీగలను దుండగులు అపహరించి ఎత్తుకెళ్లిన సంఘటన పూసలపాడులో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దారవీడు, కొమరోలు గ్రామీణం : ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పెద్దారవీడు మండలం మాచరాజుకుంటకు చెందిన పిచ్చయ్య మార్కాపురం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో గొబ్బూరు వద్ద వెనుక నుంచి వైడీపాడుకు చెందిన మానం రమణ ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టాడు. పిచ్చయ్య గాయపడ్డారు.● కొమరోలు మండలంలోని నారాయణంపల్లెకు చెందిన శివారెడ్డి తన ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి గిద్దలూరు వైపుకు వెళుతుండగా, దద్దవాడ సమీపంలోని మూలమలుపు వద్ద వెనుక నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో శివారెడ్డి కాళ్లు, తలకు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

పులిదాడిలో.... : యర్రగొండపాలెం పట్టణం నల్లమల అటవీప్రాంతంలోని పాలుట్ల గిరిజనగూడెం వద్ద పెద్ద పులి మరోసారి పంజా విసిరింది. గురువారం ఉదయం పాలుట్లకు చెందిన జెండావత్ బాలునాయక్‌కు చెందిన ఎద్దులు, ఆవులను అడవిలో మేతకు తీసుకెళ్లారు. అక్కడే కాపు కాసిన పులి ఒక్కసారిగా మందపై దాడి చేయగా, కాపరులు గట్టిగా కేకలు వేయడంతో అడవిలోకి పారిపోయింది. ఓ ఎద్దుకు గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో పులి దాడి చేయడం ఇది మూడోసారని స్థానికులు చెబుతున్నారు సంఘటనలతో పాలుట్ల వాసులు భయాందోళనలు చెందుతున్నారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు గూడెంవాసులు తెలిపారు.

నేటి నుంచి బస్ సర్వీస్ ప్రారంభం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన ఒంగోలుకు యర్రగొండపాలెం నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటలకు బస్ ఒంగోలుకు బయలు దేరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు రామసముద్రం, త్రిపురాంతకం, ముష్టిగంగారం, కురిచేడు. దర్శి, పతకమూరు, చీమకుర్తి మీదుగా ఒంగోలు వెళ్తుంది.

బాబా చరిత్ర పారాయణం

మార్కాపురం పట్టణం: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని నెహ్రూ బజార్‌లో వెలసిన షిర్డిసాయిబాబా మందిరంలో గురువారం బాబా జీవిత చరిత్ర అఖండపారాయణాన్ని ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దదోర్నాల: బోడేనాయక్ తండా మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న జి.లక్ష్మీనారాయణమ్మ, కేసీఎన్ శ్రీనివాసులులను తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బాల బద్దెనాయక్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు సన్మానించారు.

ఇన్వర్టర్ బహూకరణ

యర్రగొండపాలెం పట్టణం: మండలం నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు స్థానిక ఎంఈవో కార్యాలయానికి రూ.30వేల విలువ చేసే ఇన్వర్టర్‌ను బహూకరించారు.

మిత్రుడికి తోడుగా వెళ్లి..

త్రిపురాంతకం: మిత్రుడికి తోడుగా వెళ్లిన దివ్యాంగుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన కాయకాకుల రాము (35) దివ్యాంగుడు. బుధవారం రాత్రి మిత్రుడు తోడుగా రమ్మని కోరడంతో అశోక్ లేలాండ్ ట్రాలీలో నరసరావుపేటకు బయలుదేరారు. రాజుపాలెం వద్ద వీరి వాహనాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో అశోక్ లేలాండ్ వాహనంలో చోదకుడి పక్కన కూర్చొనివున్న రాము అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి

పొదిలి, న్యూస్‌టుడే: ప్రత్యేక సహిత విద్య, వినికిడి, బుద్ధిమాంద్యం పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారు ప్రధాన పాఠశాలకు వెళ్లేలా తీర్చిదిద్దాలని డీఈవో, సమగ్ర శిక్ష పథకం అదనపు సమన్వయకర్త కిరణ్‌కుమార్ చెప్పారు. గురువారం పొదిలిలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పాఠశాలలో దస్త్రాలను తనిఖీ చేశారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

ఈ చిత్రంలోని కనిపిస్తున్నది బేస్తవారపేట లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉన్న రహదారి. తగిన స్థలం లేకపోవడంతో విద్యార్థినులు తమ సైకిళ్లను ఈ రహదారిపై అడ్డుగా నిలుపుతున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు నిత్యం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మొత్తం 500 మంది విద్యార్థినులు ఉండగా చుట్టు పక్కల గ్రామాల నుంచి సైకిళ్ల పైనే అధికంగా పాఠశాలకు వస్తుంటారు. పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉండటం, ఖాళీ ప్రదేశంలో నూతన పాఠశాల గదులు ఏర్పాటు కావడంతో సరిపడే స్థలం లేకపోవడం వల్ల స్టాండ్ ఏర్పాటుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో సైకిళ్లకు ఎండకు ఎండి, వానకు తడిసిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బేస్తవారపేట

పాఠశాల ముందు ఉన్న రహదారిపై నిలిపిన విద్యార్థినుల సైకిళ్లు

ప్రజా ప్రకటన (PUBLIC NOTICE)

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా: నా క్లయింట్ శ్రీమతి సంచుల సుబ్బలక్ష్మి గారు, కృష్ణంసెట్టిపల్లి గ్రామం, గిద్దలూరు మండలానికి చెందిన వారు, క్రింది పేర్కొన్న ఆస్తి (Suit Schedule Property) ని కుటుంబ వారసత్వం మరియు చట్టబద్ధమైన హక్కుల ఆధారంగా సంపాదించుకొని, తాను స్వంత అధీనంలో ఉన్నారు. పై భూమిపై శ్రీమతి సుబ్బలక్ష్మి గారు న్యాయపరమైన హక్కుల పరిరక్షణకు గాను శ్రీ సంచుల భాస్కర్‌రావు, శ్రీ సంచుల రమేష్, శ్రీ అమడాల అలెగ్జాండర్, శ్రీమతి దాసరి రోజమ్మ అనే వ్యక్తులపై **O.S.No.29/2025** నంబరుతో సివిల్ కేసును గౌ॥ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, మార్కాపురం నందు దాఖలు చేశారు. అదే దావాలో తాత్కాలిక స్టే (Temporary Injunction) ఇవ్వవలసిందిగా. **I.A. No. 394/2025** నంబరుతో ఒక మధ్యంతర అభ్యర్థన (Interlocutory Application) ను కూడా దాఖలు చేశారు. గౌ॥ సీనియర్ సివిల్ జడ్జి గారు తాత్కాలిక ఇంజక్షన్ మంజూరు చేశారు. తద్వారా దావాలో పేర్కొన్న ఆస్తిని ఎవరూ కొనుగోలు చేయరాదు, అద్దె, బదిలీ, హస్తాంతరణ చేయరాదు. కావున: ఏ వ్యక్తి అయినా క్రింది Suit Schedule ఆస్తిని కొనుగోలు చేయరాదు. ఏ రకమైన ఒప్పందాలు, విక్రయాలు, లావాదేవీలు జరిగినచో, అవి చట్టపరంగా చెల్లుబాటు కాదని (Not binding) భావించబడతాయి మరియు కోర్టులో పెండింగ్‌లో ఉన్న దావా ఫలితానికి లోబడి ఉంటాయి. అలాంటి లావాదేవీల వల్ల తిరుగులేని నష్టం జరగవచ్చు.

Suit Schedule – ఆస్తి వివరాలు
కృష్ణంసెట్టిపల్లి గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా, సర్వే నెం. 644/A1, Extent: ఎకరం 0-30 3/4 సెంట్లు హద్దులు: తూర్పు: 8 అడుగుల వెడల్పు రహదారి (లోక్ అదాలత్ అవార్డు ప్రకారం సుబ్బలక్ష్మి స్థలానికి ప్రవేశం), పడమర: పొన్నం సుబ్బారెడ్డి వారి భూమి, ఉత్తరం: రైల్వే ట్రాక్, దక్షిణం: దాసరి రోజమ్మ

వివాదాస్పద ఆస్తి వివరాలు.
Extent: 18.75 సెంట్లు **Document No.:1338/2025, అమ్మినవారు:** సంచుల చిన్న వెంకట సుబ్బయ్య, **కొనుగోలు దారుడు:** అమడాల అలెగ్జాండర్ హద్దులు: తూర్పు: దావేదారుల స్థలం మరియు 8 అడుగుల రాస్తా, పడమర: పగడల అన్నపూర్ణమ్మ స్థలం, ఉత్తరం: దాసరి రోజమ్మ స్థలం. దక్షిణం: హైవే రోడ్డు.
గమనిక:– ఈ సర్వే నెం. 644/A1 లో సంచుల చిన్న వెంకట సుబ్బయ్యగారికి **లోక్ అదాలత్ అవార్డు (O.S.No.332/1998, తేది: 17.08.2002)** ప్రకారం కేటాయించిన భూమి కేవలం 7.75 సెంట్లు మాత్రమే. అయినప్పటికీ ఆయన **అనధికారంగా 10.75 సెంట్లు** విక్రయించినందు, పై లావాదేవీ చట్టపరంగా చెల్లదు. ఈ ప్రకటన ప్రజల సమాచారార్థంగా మాత్రమే జారీ చేయబడినది.

ఇచ్చినవారు: వై.విజయ్‌వర్ధన్, అడ్వకేట్, కోర్టు సెంటర్, మార్కాపురం. సెల్: 99667 76653.

EENADU Classifieds

PEOPLE CARE
OLD AGE HOME
రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE
FLAT FOR SALE
Ready to Occupy, Fully Furnished 2800 Square Feet. Duplex flat for sale at Gupthas Royale (Gauted Community) 2 Car Parkings, 5 Ac's and 3 BEDS, Dining Table etc.. Back side of Ratna Mahal Theatre/ Hotel Sarovar, Ongole. Cell: 9849119754.

HOUSE FOR SALE
విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.
ఒంగోలు, నిర్మల్‌నగర్ నారాయణ పబ్లిక్ స్కూలు దగ్గర 31.5 గదులు ఉత్తర ముఖము, 49 అడుగులు పడమర వెడల్పు, 46 అడుగులు ఇల్లు అమ్మబడును. Ph: 99490 54556.

JOBS
మా కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, స్టోర్ ఇన్‌ఛార్జి. ITI. Dip All. Ex ఆర్మీ కావలెను. (రూ.భో) PF, ESI. జీతం: 18-32 వేలు. సెల్ : 99891 76281.
రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122/ 99590 31122.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500 Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

మర్రిపూడి: ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గుండ్ల సముద్రం ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్ నగదు బ్యాంకు ఖాతాలో జమ చేశారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తమ నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద నగదు జమ చేశారని గాలిముట్టు మరియదాసు, లావణ్య దంపతులు మంత్రితో చెబుతూ ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. త్వరలోనే నిరుద్యోగ భృతిని కూడా అందజేస్తామని తెలిపారు. గతంలో నిర్మించుకున్న ఇళ్ల బిల్లులు చెల్లించాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరగా.. త్వరలోనే పక్కా గృహాల మంజూరుకు శ్రీకారం చుడతామని చెప్పారు. కాలనీలో నీటి సమస్య, విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు బస్సును ఏర్పాటు చేయాలని స్థానికులు చెప్పగా.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. మంత్రి వెంట పార్టీ నాయకులు శ్రీనువాసులు, నరసారెడ్డి, వీరనారాయణ, నరసింహారావు, శ్రీను, వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గుండ్ల సముద్రం ఎస్సీ కాలనీలో విద్యార్థులు, స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

దర్శిలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఇతర నాయకులు

తొలి అడుగు విజయవంతం..

దర్శి, న్యూస్‌టుడే: కూటమి పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి వస్తున్న ఆదరణే ఇందుకు సాక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పాపారావు తెలిపారు. దర్శిలోని 13వ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి గురువారం ఆయన తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, చిన్నా, వాసు, మధు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.280

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం 266 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 1,044 బేళ్లు తీసుకురాగా.. 778 కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.232 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

▶ కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో గురువారం 691 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని గుర్రపడియ, మూగచింతల, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 893 అమ్మకానికి తీసుకువచ్చారు. అందులో 691 కొనుగోలు చేశారు. మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160 పలికినట్లు ఆయన తెలిపారు.

లక్ష చెల్లించక.. లక్ష్యం నెరవేరక!

న్యూస్‌టుడే, కనిగిరి

ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఖాళీ స్థలాలు, కాలువల్లో మురుగు నీరు తిష్టవేస్తే దోమలు వ్యాపించే అవకాశం ఉంది. వీటికితోడు చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోతే దోమలు మరింత వృద్ధి చెంది రోగాలు విజృంభించేందుకు కారణమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెత్త ఎత్తివేసే కంపాక్టర్ వాహనం లేక కనిగిరి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వాహనాన్ని మరమ్మతుల కోసం మూడు నెలల క్రితం నెల్లూరు తరలించారు. మరమ్మతులు పూర్తయినా డబ్బులు చెల్లించకపోవడంతో షెడ్‌లోనే ఉంది. దీంతో పట్టణ వీధుల్లో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి.

మరమ్మతులకు రూ.4 లక్షలు..

మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో చెత్త నిత్యం తొలగించాలంటే కంపాక్టర్ వాహనం ఎంతో కీలకం. ఇది కాస్త మూలకు చేరడంతో మున్సిపల్ అధికారులు నెల్లూరులోని షెడ్‌కు తరలించారు. మొత్తం రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. పూర్తి స్థాయిలో నగదు చెల్లించకపోయినా కనీసం రూ. లక్ష చెల్లించి తీసుకెళ్లాలని మెకానిక్‌లు అధికారులకు స్పష్టం చేశారు. రూ.లక్ష కూడా చెల్లించే వారు లేక అలాగే షెడ్‌లోనే వాహనాన్ని వదిలేశారు. కంపాక్టర్ లేక పోవడంతో పారిశుద్ధ్య కార్మికులు పూర్తి స్థాయిలో చెత్తను తొలగించలేకపోతున్నారు. ఏ వీధి, ఖాళీ ప్రదేశంలో చూసినా వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా కనిపిస్తున్నాయి. అప్పుడప్పుడు పడుతున్న చినుకులకు దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు సైతం విజృంభిస్తున్నయని చెబుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కంపాక్టర్ తీసుకొచ్చి చెత్తను పూర్తి స్థాయిలో తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను వివరణ కోరగా. రూ.లక్ష చెల్లిస్తే షెడ్ నుంచి కంపాక్టర్ తీసుకురావచ్చుననే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరు చేస్తే వాహనాన్ని తీసుకొచ్చి వీధుల్లో చెత్త లేకుండా చేస్తామని తెలిపారు.

కొత్తపేటలో సీసీరోడ్డుపై పేరుకుపోయిన చెత్త

మున్సిపాలిటీ - కనిగిరి	
జనాభా	: 52,139
రోజు పోగయ్యే చెత్త	: 13 టన్నులు
పారిశుద్ధ్య కార్మికులు	: 85 మంది

ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా పుల్లారావు బాధ్యతల స్వీకరణ

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించేదుకు కృషి చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ యు.పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. పొన్నలూరు మండలం నుంచి బదిలీపై వచ్చానని, గతంలో సింగరాయకొండలో డీటీగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన రవి జిల్లా కలెక్టరు కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

9న సార్వత్రిక సమ్మె

టంగుటూరు, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను రక్షించుకునేందుకు, ఉపాధిహామీ చట్టం కాపాడుకునేందుకు ఈ నెల 9న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని మర్లపాడులో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో గురువారం పరిశీలించి మాట్లాడారు.

రూ.పది వేలు వేతనం ఇవ్వాలి

దర్శి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనులు చేస్తున్న క్లాప్‌మిత్రలకు 2020లో రూ.10 వేల వేతనం ఇస్తామన్న ప్రభుత్వ జీవోను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు కోరారు. దర్శిలోని సుందరయ్య భవన్‌లో గురువారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఇస్మాయిల్, గంగయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై నిరసన

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విలీనంతో విద్యార్థులు పడుతున్న ఇక్కట్లను గుర్తించి వెంటనే విరమించుకోవాలని విద్యార్థి సంఘాలు, సీపీఎం నాయకుడు బి.వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ముప్పాళ్లపాడు, మంగంపల్లి గ్రామాల్లోని పాఠశాలల వద్ద గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి వారు నిరసన తెలిపారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అబ్రహం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం తల్లికి వందనం

కనిగిరి: తల్లికి వందనం పథకం పేద విద్యార్థులకు వరమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం తన నివాసంలోని కుట్టు శిక్షణ కేంద్రంలో ఈ పథకం కింద నగదు జమ అయిన విద్యార్థుల తల్లుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకు కోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికే పథకం అమలుచేసి మోసం చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంత మంది విద్యార్థులకూ పథకం అమలు చేశారన్నారు. ఇంకా నగదు జమకాని వారికి రెండో విడతలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

భూ ఆక్రమణలపై సమగ్ర విచారణకు డిమాండు

కనిగిరి: కనిగిరిలో జరుగుతున్న భూ ఆక్రమణలపై సిట్ వేసి సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి కేశవరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ. . కనిగిరిలో రోజురోజుకు భూ కబ్జాలు, పెరిగి పోతున్నాయన్నారు. నకిలీ పత్రాలు, స్టాంపులు సృష్టించి రియల్ మాఫీయాను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని కనక పట్టణంలో రూ.15 కోట్ల విలువ చేసే ప్రైవేటు భూమిని కాజేసేందుకు పన్నాగం పన్ని కటకటాల పాలైన ఘటన వెలుగు చూసిందన్నారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసి మరో ఏడుగురిని అరెస్ట్ చేయక పోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. నాయకులు బషీరా, శాంతాకుమారి, నరేంద్ర, ఏడుకొండలు పాల్గొన్నారు.

సైగ చేసి.. సమస్యలు వివరించి

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని తలకొండపాడులో ఎంపీడీవో హనుమంతరావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మూగ వ్యక్తి నెలకుర్తి వెంకటేశ్వర్లు ఎంపీడీవో వద్దకు వచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై తన సైగలతో తెలియజేశాడు. కాలువల్లో పూడిక చేరి మురుగునీరు పారకపోవడం, కుళాయిల నుంచి నీరు వృథాగా పోవడంతో పాటు అక్కడ పాచిపట్టి దోమలు వ్యాప్తి చెందడం, రహదారుల వెంట పేడ దిబ్బలు ఉన్నాయని వివరించాడు. వెంటనే సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులను పిలిచి ఎంపీడీవో హెచ్చరించారు. గ్రామ పరిశుభ్రత విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంకటేశ్వర్లు చొరవను మెచ్చుకున్నారు.

చక్రాల కుర్చీలో వచ్చి ఎంపీడీవో హనుమంతరావుకు గ్రామ సమస్యలు తెలియజేస్తున్న వెంకటేశ్వర్లు

పొగాకు వేలం కేంద్రం తనిఖీ

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని బోర్డు ఈడీ విశ్వశ్రీ గురువారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ఏ-గ్రేడ్ పొగాకును పరిశీలించారు. లోగ్రేడ్ పొగాకును ఎంతకు కొనుగోలు చేస్తున్నారని వేలం నిర్వహణ అధికారి కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు పెట్టకుండా కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం పీసీపల్లి మండలం పెద అలవలపాడు వెళ్లి రైతుల వద్ద నిల్వ ఉన్న లోగ్రేడ్ పొగాకును పరిశీలించి మాట్లాడారు. వీలున్నంత వరకు రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ నూతన సర్వీసు ప్రారంభం

తాళ్లూరు, కురిచేడు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం ఒంగోలు నుంచి దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు ఒంగోలు డిపో నుంచి కొత్త బస్సు సర్వీసును గురువారం ప్రారంభించారు. ఈ బస్సు ఒంగోలులో ఉదయం పదకొండున్నర గంటలకు బయలుదేరి సంతనూతలపాడు, చీమకుర్తి, తూర్పుగంగవరం, పొతకమూరు, దర్శి, కురిచేడు, ముష్టగంగవరం, త్రిపురాంతకం, రామసముద్రం మీదుగా యర్రగొండపాలేనికి మధ్యాహ్నం రెండున్నర గంటలకు చేరుకుంటుంది. మళ్లీ మూడు గంటలకు వై.పాలెంలో బయలుదేరి ఇదే రూటులో సాయంత్రం ఆరు గంటలకు ఒంగోలు చేరుతుంది.

సాగుహక్కు పత్రాల జారీకి సహకరించాలి

తాళ్లూరు: తాళ్లూరు తహసీల్దారు కార్యాలయాన్ని గురువారం ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తనిఖీ చేశారు. అనంతరం దళిత బహుజన రిసోర్సుకేంద్రం ఆధ్వర్యంలో పంట సాగుహక్కు పత్రాల ప్రచారోద్యమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులు నష్టపోకుండా పంట సాగుదారుల చట్టం ద్వారా వారికి రక్షణ కల్పిస్తుందన్నారు. కౌలుదారులకు సీసీఆర్సీ పత్రాల జారీ కోసం భూ యజమానులు సహకరించాలని సూచించారు. తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణ, డీటీ ఫణీంద్ర పాల్గొన్నారు.

▶ కురిచేడు, న్యూస్‌టుడే: కౌలు పత్రం పొందేందుకు భూ యజమానులు వారికి సహకరించాలని తహసీల్దార్ రజనీకుమారి సూచించారు. గురువారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ దర్శి ఏరియా కోఆర్డినేటర్ నాగమణి అధ్యక్షతన పంట సాగుదారుల చట్టంపై నిర్వహించిన ప్రచారోద్యమ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు.

దారంతా మడుగు... పడేదెలా అడుగు?

సి.ఎస్.పురంలోని డీజీపేట, పామూరు ప్రధాన రహదారులు దుర్గంధమయమైంది. అడుగడుగునా గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజూ వందలాది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇలా రాకపోకలు సాగిస్తుంటారు. డీజీపేట రోడ్డులో పడమటి బజార్ మలుపు వద్ద నుంచి మైదుకూరు-సింగరాయకొండ కూడలి వద్ద వరకు, పామూరు రోడ్డులో సిమెంట్ రహదారి మలుపు వద్ద నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను ఎస్‌హెచ్‌ఏతికి ఎన్.సుమన్ దృష్టికి తీసుకెళ్లగా పామూరు రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. -న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

సి.ఎస్.పురం-డీజీపేట రహదారిలో నిలిచిన నీరు

నమ్మొద్దు... అజాగ్రత్తగా వెళ్లొద్దు

ట్రాక్టర్‌పై అధిక లోడుతో భారీ కలప మొద్దులు తరలిస్తూ ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. కొండపి-టంగుటూరు రహదారిలో పెరిదేపి, ముప్పవరం, వోలేటివారిపాలెం గ్రామాల మధ్య గుంతలమయమైంది. దానికి తోడు ఎక్కువగా మలుపులు ఉన్నాయి. గురువారం ఓ ట్రాక్టర్‌పై పెద్ద కర్రలు వేసి వాటిని చిన్నతాడుతో ఇలా కట్టి తరలిస్తున్నారు. వెనుక వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. దీనిపై కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. వాహనాలను తనిఖీచేసి భద్రతా చర్యలు పాటిస్తూ రవాణా చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

ఆ మార్గంలో శుభ్రత కనుమురుగు

ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక వీధిలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేక ఇళ్లల్లో నుంచి వచ్చే నీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో సీసీ రోడ్డు కాస్త పాచిపట్టింది. ఇళ్ల ముందును నీరు రాకుండా మట్టితో కట్టలు వేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణను వివరణ కోరగా.. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, ముండ్లమూరు

ప్రభుత్వ బడి.. నూతన ఒరవడి

ఈ చిత్రంలోని చిన్నారులంతా తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాలకు (ఏపీ) చెందినవారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పేరుతో పాఠ్య, రాత పుస్తకాలు, రెండు ఏకరూప దుస్తులు, బూట్లు, సాక్సులు ఉచితంగా అందించింది. ఏకరూప దుస్తులను కుట్టించేందుకు ప్రభుత్వం రెండు జతలకు రూ.600లు వంతున అందించడంతో కొందరు పిల్లలు ఇప్పటికే వాటిని కుట్టించుకున్నారు. ఈ పాఠశాలలో 30 మంది వరకు బాలబాలికలు ఉండగా పది మంది రెండు రోజులుగా నూతన దుస్తులు, బూట్లు ధరించి పైస్తాయి పాఠశాల విద్యార్థులకు దీటుగా హాజరవుతున్నారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి: 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: పీసీపల్లి మండలంలోని పలు రహదారుల్లో మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మర్రికుంటపల్లి వద్ద ఎక్కువగా ప్రమాద మలుపులు చోటుచేసుకుంటున్నాయి. -మర్రికుంటపల్లి గ్రామస్థులు
✓: పంచాయతీరాజ్ అధికారులతో చర్చించి బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. -రాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో

?: ముండ్లమూరు మండలం సుంకరవారిపాలెం- పూరిమెట్ల దారిలో చిల్లచెట్లు దట్టంగా పెరిగి రాకపోకల సమయంలో ఇబ్బందిగా ఉంది. -నందగోపాల్, సుంకరవారిపాలెం
✓: ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే చిల్ల చెట్లు తొలగిస్తాం. -చెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ

?: కురిచేడు మండలం పొట్లపాడులోని యోగయ్యస్వామి ఆలయం వీధిలో, సెంటర్ నుంచి బావికి వెళ్లే బజారులో సిమెంట్ రోడ్డు వేసి పక్కా కాలువలు నిర్మించలేదు. మురుగునీరు రహదారిపైనే పారుతోంది. - నిఖిలేష్, స్థానికుడు
✓: కాలువల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం. -సుబ్బులు, సర్పంచి

?: మర్రిపూడి మండలం పన్నూరు బీసీ కాలనీలో వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో రాత్రి పూట ఇబ్బందిగా ఉంటుంది. -శ్రీనివాసులు, స్థానికుడు
✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - నాగూర్‌వలి, ఈవోఆర్డీ

-న్యూస్‌టుడే, పీసీపల్లి, ముండ్లమూరు, కురిచేడు, మర్రిపూడి

పారిశుద్ధ్య నిర్వహణ పనులు

మర్రిపూడి, న్యూస్‌టుడే: మండలంలోని గార్లపేటలో బీసీ కాలనీ, ఇస్లాంపేట, మెయిన్ రోడ్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉన్నట్లు గత నెల 27, 30 తేదీల్లో 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ఈవోఆర్డీ నాగూర్‌వలీలు గురువారం గ్రామంలోకి పాటు, సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య పనులు చేయించారు.

ఉపాధ్యాయులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు

వెలిగండ్ల, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలోని పద్మాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కొటా లపల్లి పాఠశాలకు వెళ్లిన షేక్ సంధానిబాష, ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాఠశాలకు వెళ్లిన రామాంజనేయులకు గురువారం గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. డప్పువాయిద్యాలతో ఊరేగించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు సంపూర్ణ కుమారి, జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులిద్దరూ చేసిన కృషిని నిర్వర్తిస్తూ.. ఈ సత్కారం అర్హులని చెప్పారు. ఎంఈవో దాసప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు హరిబాబు, ఉపాధ్యాయులు చల్లా సత్యనారాయణ, రవికుమార్, బ్రహ్మారెడ్డి, దేవసహాయం, తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలపై సమీక్ష

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం స్త్రీనిధి రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో రూ.1.09 కోట్ల బకాయిలు ఉన్నాయని, ఈ నెల 15లోపు వసూలు చేయాలని, అవకతవకలపై విచారణ జరుగుతుందని సెర్ప్ డీజీఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. ఏపీఎం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: డెంగీ, మలేరియా వ్యాధుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ సూచించారు. గురువారం మండలంలోని హాజీపురంలో వీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో నీటినిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల వ్యాప్తి లేకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటను పీహెచ్‌సీలో సమాచారం ఇవ్వాలని కోరారు. సీహెచ్‌వో చెన్నయ్య, సూపర్‌వైజర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలి దశలోనే కాలేయ సమస్యలు గుర్తించాలి

కనిగిరి, న్యూస్‌టుడే: కాలేయ సమస్యలను మొదటి దశలోనే గుర్తించాలని వైద్యులు ముక్కు కవిత, పి.వి.రజనీకాంత్ సూచించారు. పట్టణంలోని అమరావతి మైదానంలో గురువారం జనని ఛారిటబుల్ ట్రస్ట్, చెన్నై గ్లెనీగల్స్ ఆసుపత్రి సహకారంతో కాలేయ మార్పిడి, ఇతర సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో గుర్తిస్తే మందుల ద్వారానే నయం చేయవచ్చన్నారు. లివర్ సిర్రోసిస్ వ్యాధి రెండు, మూడు దశల్లో మార్పిడి చేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. కాలేయ వ్యాధులకు కారణాలను వివరించారు. ఈ సందర్భంగా 92 మందికి వైద్య పరీక్షలు చేశారు.

పశువైద్యశాల సిబ్బంది చేతివాటంపై విచారణ

మర్రిపూడి, న్యూస్‌టుడే: పశువుల దాణాలో చేతి వాటం ప్రదర్శించిన సిబ్బందిపై గురువారం పొదిలి ఏడీఏ వేణు విచారణ చేపట్టారు. మర్రిపూడి పశు వైద్యశాల పరిధిలో దాణా కోసం పశుపోషకుల నుంచి వైద్యశాల సిబ్బంది నగదు వసూలు చేసి వైద్యాధికారికి ఇవ్వక పోవటంతో దాణా అందలేదు. పశువుల యజమానులను అడిగి ఏడీఏ వివరాలు తెలుసుకున్నారు. సుమారు 120 మందిపైగా నగదు చెల్లించినట్లు తేలింది. దీంతో ఆయన వైద్య సిబ్బందిపై మండి పడ్డారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాణా ఇచ్చిన తరువాతే నగదు చెల్లించాలన్నారు. త్వరలోనే మరో విడత దాణా వస్తుందని, రైతులందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు.

కుంట మట్టి... కొల్లగొట్టి!

మట్టి మాఫియా చెరువులు, కుంటలను వదలడం లేదు. వీరినెవరు అడ్డుకోకపోవటంతో తవ్వేస్తూ ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రం కొండపికి కూతవేటు దూరంలోనే మట్టి తవ్వకాలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్నకండ్లగుంట పంచాయతీ పరిధిలోని జాళ్లపాలెం రోడ్డులో ఉన్న ప్రభుత్వ కుంట భూమిలో మట్టిని కొందరు తవ్వేస్తున్నారు. గురువారం మట్టిని తవ్వేందుకు జేసీబీ యంత్రంతోపాటు, తీసుకెళ్లేందుకు ట్రాక్టర్లు అక్కడికి చేరుకున్నాయి. లోడు అనంతరం కొండపి గ్రామ మీదుగా వెళ్లే అధికారుల కంటపడే అవకాశం ఉండడంతో అడ్డదారిగా ఉన్న మట్టిరోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. చెరువులు, కుంటల్లో మట్టిని ఇష్టాను సారంగా తవ్వేస్తున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఈ విషయమై కొండపి తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. కుంట భూమిలో మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా తవ్వి, మట్టి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. -న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

మట్టిని తరలించేందుకు కుంట వద్దకు చేరిన జేసీబీ, ట్రాక్టర్లు

కారుమంచిలో కేంద్ర బృందం పర్యటన

టంగుటూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2025లో భాగంగా మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం కేంద్ర బృందం పర్యటించింది. పారిశుద్ధ్యం, మురుగు నీటి నిర్వహణ, తడి-పొడి చెత్త సేకరణ, మరుగుదొడ్ల వినియోగం గురించి స్థానికులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. కేంద్ర బృంద సభ్యులు రమేష్, సుధీర్, ఎంపీడీవో దేవసేన కుమారి, డిప్యూటీ ఎంపీడీవో రామసుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై గ్రామాల్లో అవగాహన

మర్రిపూడి: పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జగదీష్ సూచించారు. గురువారం వల్లాయపాలెంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాలో పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందజేయాలని తెలిపారు. ఎవరూ రోడ్లపైన, కాలువల్లో చెత్త, ఇతర వ్యర్థాలను వేయవద్దని సూచించారు.

▶ ముండ్లమూరు: గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో శ్రీదేవి సూచించారు. మండలంలోని ఈదర, పూరిమెట్లలో ఆమె తనిఖీ చేశారు. ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీలను రెండు గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు పోకేజ్ వస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం విషయంలో ఘర్షణపై కేసు

కొండపి గ్రామీణం: స్థల వివాదంపై గురువారం కేసు నమోదు చేసినట్లు కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని జాళ్లపాలెం గ్రామానికి చెందిన భూమా మూర్తి కోటయ్య కుటుంబ సంబంధించిన స్థలాన్ని బాలు చేయించుకుంటుండగా జేసీబీ తీసుకొచ్చారు. ఈ సమయంలో తన స్థలంలో ఉన్న ఉండటంతో తొలగిస్తుండగా స్థానిక మహిళలు జేసీబీ డ్రైవర్‌ను అడ్డుకొని, కోటయ్యపైన దాడికి దిగారన్నారు. ఈ విషయంపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd., Chimakurthy Branch, Prakasam District issue the following notice to the general public.

My client intends to grant loan to the applicant Smt. Devarapalli Hymavathi W/o Venkateswara Rao, R/o. Reddy Nagar, Manchikalapadu Sivaru, Chimakurthy Mandal, Prakasam District, Andhra Pradesh, submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents, I have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if any one have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., shall be informed to the below address within 7 days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: Prakasam District Registration, Chimakurthy Sub Registration, Chimakurthy Mandal, Municipality, Manchikalapadu Gram Panchayath and Village, Reddy Nagar Area, Survey No. 227/2 out of an extent of Ac. 4.32 cents, an extent of 74.87 Gadies or 677.6 sq.yards or 569.184 sq.mts of vacant site bounded by East: Road, South: Site of Gorantla Samrajyalu, West: House of Devarapalli Hymavathi, North: Site of Devarapalli Sitharamaiah.

Sd/- DANDURI VENKATESWARLU
Advocate & Legal Advisor, AP/793/1988
Shriram Finance Ltd, Ongole.

ఎత్తుకు పైఎత్తు.. ఔరా అనేట్టు

నెల్లూరు చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటుచేసిన పెద్ద చెస్ బోర్డు చిన్నారులను ఆకట్టుకుంటోంది. పెద్దలతో కలిసి నడకకు వచ్చిన చిన్నారులు తమ చిట్టి పొట్టి చేతులతో పావులు కదుపుతూ ఎత్తుకు పైఎత్తులు వేస్తుండటం అబ్బురపరుస్తోంది. గురువారం ఇద్దరు చిన్నారులు ఆటలో నిమగ్నమై ఉండగా.. తండ్రి వారికి సాయం చేస్తూ కనిపించారు. – ఈనాడు, నెల్లూరు

ఏటి గట్టు.. మోటార్ల సెట్టు

కందుకూరు మండలం జిల్లెలమూడి రైతులు పాలేరు నదిపై ఏర్పాటు చేసిన నీటి మోటార్లు ఇవి. 40 ఏళ్ల కిందట గ్రామ రైతులకు ఈ నది ఆధారంగా సాగునీటి పథకం ఏర్పాటు చేశారు. అది మూలకు చేరగా.. నేరుగా పొలాలకు నీటిని తరలించుకునేందుకు ఒకే దగ్గర 30కిపైగా మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. – కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే

వరద ముప్పు.. తప్పేలా!

నగరంలో కాలువల అభివృద్ధికి నిధులు

నెల్లూరు నగరంలో అధ్వానంగా ఓ పంట కాలువ

ఈనాడు, నెల్లూరు: కార్పొరేషన్, న్యూస్‌టుడే: నెల్లూరు నగరానికి వరద ముప్పు తప్పించడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. వర్షపు నీటిని వెనువెంటనే బయటకు పంపించేందుకు అవసరమైన కాలువల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని.. ఆర్థికపరమైన అనుమతులు ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఏళ్లుగా నగరాన్ని వేధిస్తున్న సమస్యకు పరిష్కారం లభించబోతోంది.

14 పంట కాలువలు

నగరంలో 14 పంట కాలువలు ఉండగా.. ఒక్కొక్కటి 40 నుంచి 60 అడుగుల వెడల్పు ఉండేవి. దాన్ని పక్కనే ఇరిగేషన్ అధికారులు వెళ్లేందుకు జీప్ ట్రాక్ ఉండేది. ప్రస్తుతం అవేమీ కనిపించడం లేదు. కాలువలన్నీ ఆక్రమణలకు గురవగా.. నగర పరిధిలో ఉండటంతో ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం మానేశారు. నగరపాలక సంస్థ అధికారులు పూడిక తీయడమే తమ బాధ్యత అన్నట్లు వ్యవహరించారు. దాంతో 2015లో కురిసిన వర్షాలతో నగరం నీటమునిగింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో అప్పటి తెదేపా ప్రభుత్వం పరిశీలనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయగా.. అధ్యయనాల అనంతరం 18 కి.మీ డ్రెయిన్లు, 40 కల్వర్టులు, రోడ్లు, ఆక్రమిత భవనాల తొలగింపు, తాగునీటి పైపులైన్లు సరిచేయడంతో పాటు.. పూర్తిగా ఆధునికీకరించాలని సూచించారు. 14 పంటల కాలువల ఆక్రమణలు తొలగిస్తే.. నగరంలో ఎంత వర్షం కురిసినా.. వాటి ద్వారా నీరు దిగువకు వెళ్లే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం రూ. 65 కోట్లతో ప్రతిపాదనలు చేసినా.. కార్యరూపం దాల్చలేదు.

రూ. 47.83 కోట్ల కేటాయింపు

తాజాగా కూటమి ప్రభుత్వం ఉయ్యాల, మలపు, గుండలపాలెం కాలువలతో పాటు రామిరెడ్డి డ్రెయిన్, వావిలేటిపాడు, రేవలపాటి ప్రధాన కాలువలతో పాటు ఉప కాలువల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. తెలుగుగంగ ప్రాజెక్ట్ సీఈ రూ. 50.15 కోట్ల ప్రతిపాదనలు పంపగా.. ఆ మొత్తాన్ని రూ. 47.83 కోట్లకు తగ్గించి.. పరిపాలనా అనుమతి ఇచ్చింది. దీనిపై హర్షం వ్యక్తమవుతోంది.

ఊపిరందక.. ఊరొదిలి పోలేక!

థర్మల్ ప్లాంట్ల ప్రభావంతో తీర ప్రాంతంలో దుర్భర స్థితి

'థర్మల్ ప్లాంట్ల ఏర్పాటుతో మా ప్రాంతం తీవ్రంగా నష్టపోయింది. యాష్‌ప్లాంట్ల కారణంగా ప్రాణాలు పోతున్నాయి. కనీస నిర్వహణ విస్మరించడంతో గాలి కంటే ఎక్కువగా బూడిదనే పీలుస్తున్నాం. గాలిలో కలిసి బూడిద మా ఇళ్లపై పడుతోంది. కొద్దిసేపు బయట నిలబడితే.. ముఖాలు మసిబారుతున్నాయి. చెట్లు రూపు కోల్పోతున్నాయి. పిల్లలకు ఆరోగ్యం బాగుండటం లేదు. ఉపాధి, ఉద్యోగాలు వస్తాయనుకుంటే కూలీ పనులు కూడా సక్రమంగా దొరకడం లేదు. అధికారులు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ధర్నాలు చేసినా స్పందన లేదు. ప్రభుత్వమే శ్రద్ధపెట్టి.. మాకు పునరావాసం కల్పిస్తే బాగుంటుంది.'

– ముత్తుకూరు మండలం దేవరదిబ్బ గిరిజన కాలనీకి చెందిన బుజ్జమ్మ ఆవేదన.

వ్యవసాయ భూముల్లో పేరుకుపోయిన బూడిద

'థర్మల్ ప్లాంట్ల పరిసర గ్రామాల్లో నీటి నాణ్యత దెబ్బతింది. బూడిద నిల్వలు నియంత్రణలో లేవు. పొగతో గాలి నాణ్యత పడిపోయింది. ప్రజలు శ్వాసకోస వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీనిపై నమోదైన కేసులో రెండు ప్లాంట్లు రూ. 3 కోట్లు పరిహారం చెల్లించాలి. వెంటనే తగిన చర్యలు తీసుకోవడంతో పాటు మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలి'

– 2021లో నమోదైన ఓ కేసులో ఎన్‌జీటీ ఇచ్చిన ఆదేశాలివి.. కానీ, ఇప్పటికీ పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు తొలగలేదు.

ఈనాడు పరిశీలన

ఈనాడు, నెల్లూరు

సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాల కారణంగా ఆ ప్రాంతాల్లో భూ, జల, వాయు కాలుష్యం విపరీతంగా పెరగగా.. కాలుష్య రహిత, గ్రామాల అభివృద్ధికి ఆయా సంస్థల నిర్వాహకులు సహకరిస్తారని వాగ్దానాలు చేసిన అప్పటి పాలకులు ప్రస్తుతం కనిపించడం లేదు. మొక్కల పెంపకం నామమాత్రంగా ఉండగా.. బొగ్గు నిల్వ కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకోవడం లేదనే విమర్శలు నెలకొన్నాయి. పారిశ్రామిక ప్రగతిని అందరూ కోరుతున్నా.. ఆ మాటున నెలకొన్న నిర్లక్ష్యంపైనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కమ్మేస్తున్న రోగాలు

భారీ చిమ్నీల నుంచి వెలువడే పొగ, నుసి.. దేవరదిబ్బ, నేలటూరు తదితర గ్రామాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రజలు శ్వాస, చర్మ సంబంధ వ్యాధులతో అల్లాడిపోతున్నారు. పరిశ్రమ వ్యర్థాలను సమీప వాగులు, కాలువల్లో వదలడంతో చేపల వేట సైతం కష్టమవుతోందని చెబుతున్నారు. బాధిత గ్రామాలను ఖాళీ చేయిస్తామని, పరిహారం, పునరావాసం కల్పిస్తామని ఏళ్లుగా చెబుతున్నా.. నేటికీ అడుగులు పడటం లేదు.

పునరావాసం పట్టించుకుంటేగా!

మా గ్రామం చుట్టూ ఉన్న థర్మల్ ప్లాంట్లతో.. చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏర్పాటు సమయంలో ఉపాధి, ఉద్యోగాలు దొరుకుతాయని చెబితే నమ్మి భూములు ఇచ్చాం. కాలుష్యం ఉండదు అన్న అధికారుల మాటలకు ఎంతో సంతోషించాం. చెప్పింది వేరు.. జరుగుతున్నది వేరు.. గాలిలో బూడిద ఎక్కువై పోయింది. చివరకు ఉప్పునీళ్లే దిక్కయ్యాయి. మా ఊరు ఖాళీ చేయిస్తామని ఏళ్ల తరబడి చెబుతున్నా.. పట్టించుకోలేదు. – పోలయ్య, నేలటూరు

అతిథులకు దారిద్దాం

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

పార్కింగ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ సందడి మొదలైంది. ఈ నెల ఆరో తేదీ నుంచి జరిగే వేడులకు అప్పుడే భక్తుల రాక మొదలైంది. గురువారమే దర్గా ఆవరణ, స్వర్ణాల చెరువు కోలాహలంగా మారింది. ముఖ్యమైన రోజుల్లో రద్దీ అధికంగా ఉంటుందనే ఉద్దేశంతో.. సుదూర ప్రాంతాల భక్తులు సొంత వాహనాల్లో ముందుగానే చేరుకుంటున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి, అనంతపురం, కడప, హైదరాబాద్, గుంటూరు, వరంగల్ జిల్లాల భక్తులు స్వర్ణాల చెరువులో స్నానమాచరించి రొట్టెలు మార్చుకున్నారు. అమరవీరుల సమాధులను దర్శించి ప్రత్యేక ఫాతెహాలు చేస్తున్నారు. దీంతో దర్శనానికి వచ్చేవారు ఇబ్బంది పడకుండా దర్గా చుట్టూ బారికేడ్లు సిద్ధం చేయగా... పోలీసుశాఖ పార్కింగ్ ప్రాంతాలను ప్రకటించింది. రొట్టెల పండగకు వచ్చేవారు తమ వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని జిల్లా పోలీసుశాఖ స్పష్టం చేసింది.

పార్కింగ్ ప్రాంతాలివే...

☛ సైన్స్‌పార్కు స్థలం: చెన్నై, గూడూరు వైపు నుంచి వచ్చేవారు.. అయ్యప్పగుడి వద్ద నుంచి మినీ బైపాస్ మీదుగా డీ-మార్ట్ పక్కనే ఉన్న సైన్స్ పార్కు స్థలంలో, ఇదే మార్గంలో వచ్చి అయ్యప్పస్వామి గుడి మీదుగా నేరుగా వచ్చేవారు ప్రభుత్వ ఆసుపత్రిలో వాహనాలు నిలుపుకోవచ్చు.

☛ ఎస్‌వీజీఎస్ కళాశాల: విజయవాడ, కావలి, కడప, ఆత్మకూరు, బుచ్చి వైపు నుంచి వచ్చే వాహనాలకు ☛ డీఎస్‌ఎన్ మినీ ఫంక్షన్ హాల్: జొన్నవాడ మీదుగా వచ్చేవి.. ఫంక్షన్ హాలు ముందు వెనుక ఏర్పాటు చేసిన స్థలంలో ☛ ప్రసార భారతి స్టేషన్: రాపూరు, పొదలకూరు వైపు నుంచి వచ్చేవాటికి

మళ్లింపు ఇలా..

☛ చెన్నై, బెంగళూరు, తిరుపతి నుంచి గూడూరు మీదుగా వచ్చే ఆర్టీసీ బస్సులను అయ్యప్పగుడి సెంటర్ మీదుగా ఫ్లైఓవర్, బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, రామలింగాపురం, ముత్తుకూరు రైల్వే అండర్ బ్రిడ్జి, ఏసీ మార్కెట్, ఆర్టీసీ డిపోనకు.. ☛ పొదలకూరు రోడ్డు సర్కిల్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు డైకస్ రోడ్డు నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడలి.. అయ్యప్పగుడి మీదుగా బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, రామలింగాపురం, ముత్తుకూరు రైల్వే అండర్ బ్రిడ్జి, ఏసీ మార్కెట్.. ఆర్టీసీ డిపోనకు.. ☛ జొన్నవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు.. పుత్తా ఎస్టేట్, సెయింట్ జోసెఫ్ స్కూల్ మీదుగా బోసుబొమ్మ, గాంధీబొమ్మ, ములుముడి బస్టాండ్, ఏసీ మార్కెట్.. ఆర్టీసీ డిపో.. ☛ బట్వాడీపాలెం నుంచి పోలీసు కార్యాలయం మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట వైపు నుంచి మళ్లించగా.. కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి డీకే మహిళా కళాశాల వైపు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదు.

వైద్య కళాశాల ప్రిన్సిపల్‌కు సమ్మె నోటీసు

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: ఈ నెల 9న జరిగే అఖిల భారత కార్మిక సమ్మెకు సంఘీభావంగా ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న శాశ్వత, ఒప్పంద, ఆప్కోస్, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు పాల్గొంటారని యునైటెడ్ మెడికల్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరికి నోటీసు అందించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు సతీష్ కుమార్, కమ్మోటి శ్రీనివాసులు, కార్యదర్శి సందాని బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏరీ లస్కర్లు.. ఎన్నాళ్లీ ఇక్కట్లు

దువ్వూరు కాలువ ప్రధాన రెగ్యులేటరు వద్ద పెరిగిన ముళ్ల చెట్లు

● సంగంలో.. దువ్వూరు కాలువ ప్రధాన రెగ్యులేటర్ చుట్టూ ముళ్ల చెట్లు పెరిగి.. ఉనికి కోల్పోయే స్థితి నెలకొంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

● గాంధీజన సంఘం వద్ద కనిగిరి జలాశయం ప్రధాన కాలువ రెగ్యులేటర్‌ను నియమించి.. సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు మండలాలతో కనిగిరి జలాశయానికి సాగునీటిని తరలిస్తారు. షట్టర్లకు గ్రీజ్ కూడా పూయకపోవడంతో మన్నిక కోల్పోతున్నాయి. లస్కర్లు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమన్న మాట వినిపిస్తోంది.

న్యూస్‌టుడే, సంగం: నెల్లూరు, సంగం డెల్టాల పరిధిలో సుమారు మూడు లక్షల ఎకరాలు సాగవుతుండగా- సాగునీటి సరఫరా, నిర్వహణ, నియంత్రణకు తగినంత మంది లస్కర్లు లేకపోవడం సమస్యగా మారింది. జలవనరులశాఖ ఆధ్వర్యంలో 39 మంది మాత్రమే కొనసాగుతుండటంతో పర్యవేక్షణ పూర్తిగా పడకేసింది. ప్రతి 1200 ఎకరాలకు సాగునీటి సరఫరా, ఎనిమిది మైళ్ల కాలువ నిర్వహణ, రెగ్యులేటర్ నియంత్రణ పర్యవేక్షిస్తూ.. లస్కర్లు సాగుకు సాయంగా నిలిచేవారు. ఇందుకు అనుగుణంగా గతంలో సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, అల్లూరు, కొడవలూరు సెక్షన్లలో 125 మంది ఉండేవారు. 45 మంది సంగం, కనిగిరి జలాశయం వద్దే విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం ఈ రెండింటి వద్ద ముగ్గురు మాత్రమే ఉంటున్నారు. 1996 నుంచి వీరి నియామకాన్ని పూర్తిగా ఆపేసి.. 2014లో పొరుగు సేవల సిబ్బందిని అందుబాటులోకి తెచ్చారు. వీరికి రోజుకు రూ. 350 ఇస్తూ.. తొమ్మిది నెలల పాటు కొనసాగించేవారు. గత మూడేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఏటా జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయి నుంచి వీరి నియామకానికి ప్రతిపాదనలు తీసుకుని.. చీఫ్ ఇంజినీరు స్థాయిలో ఆమోదం పొందాలి. అధికారులు ఈ ప్రక్రియకు తిలోదకాలు ఇవ్వడంతో.. నియామకాలు జరగడం లేదు. ఈ విషయమై జలవనరులశాఖ ఎస్ఈ దేశనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

సోమశిలలో 301.371 అడుగుల నీటిమట్టం

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 77.988 గాను 30.971 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 301.371 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి 192 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతోంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 30, పవర్ టన్నల్ ద్వారా 3,220 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన దక్షిణ కాలువకు 850, ఉత్తర కాలువకు 425 క్యూసెక్కులు తరలిస్తున్నారు. రోజుకు సగటున 135 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు వివరించారు.

అమ్మ వైభవం

కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్లు గురువారం వైభవంగా ముగిశాయి. కలిగిరి, జిర్రావారిపాలెం, పాపనముసిలిపాలెం గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి.. నైవేద్యాలు సమర్పించారు. అంతకు ముందు గ్రామోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి జరిగిన సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సీఐ వెంకట నారాయణ, ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, కలిగిరి

ఆధ్యాత్మిక సంబరం

బారాషహీద్ దర్గాలో ఇప్పుడిప్పుడే ఏర్పాట్లు కొలిక్కి వస్తుండగా.. భక్తుల రాక మొదలైంది. గురువారం పలువురు స్వర్ణాల చెరువులో స్నానమాచరించి అమరవీరులను దర్శించుకున్నారు. దర్గా పరిసరాలు, స్వర్ణాల చెరువు ప్రాంతం సరికొత్త కళను సంతరించుకుంది. – న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

అమృత మూర్తికి అశ్రునివాళి

మా తల్లిగారైన శ్రీమతి మన్నెమాల అన్నపూర్ణమ్మ గారు
గురువారం (3 జులై, 2025) భగవంతుని సన్నిధికి చేరుకున్నారు. మా మాతృమూర్తి ఆత్మకు శాంతి కలగాలని, స్వర్గలోక ప్రాప్తి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాము. ఈ విషాద వార్తను బంధువులు, మిత్రులు, అభిమానులకు తెలియజేస్తున్నాము.
అంతిమయాత్ర.. శుక్రారం మధ్యాహ్నం 2 గంIIలకు కావలిలోని మా స్వగృహం నుండి బయలుదేరును అని తెలియజేయడమైనది.
కుమారుడు.. మన్నెమాల సుకుమార్ రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు, కావలి, నెల్లూరు జిల్లా.

మరో కేసులో కాకాణికి 17 వరకు రిమాండ్

ఈనాడు, నెల్లూరు: ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం సరఫరా చేసిన కేసులో వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నెల్లూరు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఎన్నికల సమయంలో.. 2024 ఏప్రిల్ 20వ తేదీ ముత్తుకూరు మండలం పంటపాళెంలో కారులో అక్రమంగా తీసుకువెళుతున్న 4,286 మద్యం సీసాలను ఇందుకూరుపేట సెబ్ అధికారులు పట్టుకున్నారు. దీనిపై అదే రోజు కేసు నమోదు చేయగా.. ఏ1గా ఎం.సుధాకర్‌రెడ్డి, ఏ2గా పుచ్చకాయల నాగేశ్వరరావు, ఏ3గా లోకవరపు వెంకటరమణ, ఏ4గా రాములు తదితరులు ఉన్నారు. ఎన్నికల సమయంలో మద్యం సరఫరా చేయించడంతో పాటు.. దాన్ని ఎవరికీ కనిపించకుండా దాచమని చెప్పిన వైకాపా నాయకుడు సుధాకర్‌రెడ్డి ఏ1గా ఉండగా.. అదంతా ఆ సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అధికార పార్టీ మంత్రిగా ఉన్న కాకాణి ప్రోద్బలంతోనే జరిగిందన్న అభియోగాలపై ఏ8గా ఆయన్ను చేర్చారు. దాంతో ఇందుకూరుపేట ఎక్సైజ్ అధికారులు పీటీ వారెంట్ ద్వారా నెల్లూరులోని నాలుగో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నిషాద్ నాజ్.షేక్ ఈ నెల 17వతేదీ వరకు రిమాండ్ విధించారు. దాంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

అపోలోలో వైద్య నిపుణులను సంప్రదించండి

Apollo HOSPITALS

ఆర్థో క్లినిక్/ మోకాలు & తుంటి కీలు రిప్లేస్‌మెంట్ క్లినిక్ @ నెల్లూరు
తేది: ఆదివారం, 06 జులై 2025
సమయం: ఉ.10.00 - మ.1.00 గం.వరకు
అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ ముత్తుకూరు రోడ్, నెల్లూరు - ఆం.ప్ర.

డా. మదన్ మోహన్ రెడ్డి
MS (Ortho), FRCS (US), MD (France)
జాయింట్ రిప్లేస్‌మెంట్ - ఆర్థోస్కోపి & రొబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు
చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్
మీకు ఈ దిగువ లక్షణాలు/ పరిస్థితులు ఉన్నట్లయితే, మా వైద్యనిపుణుని సంప్రదించండి:
• మోకాలు & తుంటి కీలు సమస్యలు
• మోకాలు & తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలో డాక్టర్ అభిప్రాయం కోరువారు

మోకాలు, తుంటి మరియు వెన్నెముక క్లినిక్ @ నెల్లూరు
తేది: ఆదివారం, 06 జులై 2025
సమయం: ఉ.10.00 - మ.1.00 గం.వరకు
అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ ముత్తుకూరు రోడ్, నెల్లూరు - ఆం.ప్ర.

డా. పమ్మి కార్తీక్ రెడ్డి
(డా. మదన్ మోహన్ రెడ్డి బృందం)
MBBS, MS(Ortho), DNB (ఆర్థో)
ఆర్థోప్లాస్టీ మరియు ఆర్థోస్కోపీలో ఫెలోషిప్ (జర్మనీ)
మీకు ఈ దిగువ లక్షణాలు/ పరిస్థితులు ఉన్నట్లయితే, మా వైద్యనిపుణుని సంప్రదించండి:
• మోకాలు మరియు తుంటి కీలు సమస్యలు
• మోకాలు మరియు తుంటి మార్పిడి సర్జరీ గురించి డాక్టర్ అభిప్రాయం కోరువారు
• వెన్నునొప్పి • వెన్నుపూస జారుట
• ఏసీఎల్ చీలుట
• మోకాలు నొప్పి, తుంటి నొప్పి,
• అస్థిబంధకం చీలుట • స్పాండిలోసిస్
• రుమటాయిడ్ ఆర్థరైటిస్

అపాయింట్‌మెంట్ కొరకు కాల్ చేయండి: 73581 00952 / 99854 22583

ఖచితత్వంతో కూడిన రోబోట్ శస్త్రచికిత్సా నైపుణ్యం.
తక్కువ నొప్పి & త్వరగా కోలుకోవడం

దిగువ తెలిపిన వాటికి రొబోటిక్ శస్త్రచికిత్సలు
హృదయసంబంధమైనవి · మోకాలి మార్పిడి/ వెన్నుముక సంబంధమైనవి · పెద్దప్రేగు సంబంధమైనవి · తల & మెడ · మూత్రపిండ సంబంధమైనవి · జీర్ణాశయ సంబంధమైనవి · గైనకాలజీ · పీడియాట్రిక్ · ఆంకాలజీ

15000+ రొబోటిక్ శస్త్రచికిత్సలు చేయబడినవి
మరిన్ని వివరాలకు సంప్రదించండి: 72999 42572

(c) eenadu

రోడ్డులో నీరు.. రాకపోకలెలా?

గ్రామంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద మెయిన్ రోడ్డుపై కొద్దిపాటి వర్షం కురిసినా నీరు చేరుతుంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోడ్డు ఎత్తు తక్కువగా ఉండడం, కాలువలు లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుంది. ఏళ్లుగా ఉన్నా పరిష్కారం కావడం లేదు. ఈ ప్రాంతంలో నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కలిగిరి

నీటి వృథా.. అరికట్టరా!

ఇది కావలి పట్టణంలోని వెంగళరావునగర్ వద్ద 100 అడుగుల రహదారి సమీపంలో ఎయిర్‌వాల్వు వద్ద వృథాగా పోతున్న నీరు. నిత్యం ఇలా పోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పురపాలక డీఈఈ సాయిరాం స్పందిస్తూ సమస్య పునరావృతం కాకుండా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, కావలి

అసంపూర్తి రోడ్డు.. ప్రజలకు అవస్థ

అల్లూరు నుంచి చుక్కవానిదిబ్బ వెళ్లే రోడ్డు కొంత దూరం వేసి నిలిపివేశారు. దీనిపైగా పది గ్రామాల ప్రజలు వెళుతుంటారు. వీరంతా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ప్రత్యేక పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ కోసం ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు. – న్యూస్‌టుడే, అల్లూరు

మామిడితోట.. కలపగా మారి

మామిడితోటలు కొన్నేళ్లుగా వాతావరణ మార్పులతో దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది కాయలో పురుగు వస్తోందని కొనుగోళ్లు తగ్గిపోయాయి. దీంతో రైతులు నష్టాల పాలై తోటలు కొట్టేస్తున్నారు. కొన్ని రోజులుగా పాలూరు, దొండపాడు, శ్రీరంగరాజపురం, మన్నేటికోట ప్రాంతాల్లో చెట్లు నరికి మొద్దులను కందుకూరు ప్రాంతంలోని ప్లేవుడ్ పరిశ్రమకు విక్రయిస్తున్నారు.

-కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

ప్రమాదకరంగా అండర్‌పాస్

మండలంలోని శాంతినగర్ వద్ద అండర్‌పాస్ ప్రమాదకరంగా ఉంది. జాతీయ రహదారి, రైల్వే బ్రిడ్జి మార్గాలు ఉండగా వీటి కింద నుంచి రావూరుకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు సైతం వెళుతుండడంతో రెండు వైపులా గోతులు పడ్డాయి. మరమ్మతులు చేయాల్సి ఉండగా కేవలం హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసి వదిలేశారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. – న్యూస్‌టుడే, గుడ్లూరు, కందుకూరు

సుపరిపాలనలో తొలి అడుగు గొప్ప కార్యక్రమం: ఎంపీ

ఉదయగిరి, దుత్తలూరు, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గొప్పదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో గురువారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. చెక్కనగిషీ కేంద్రాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు పి.చెంచల బాబుయాదవ్, బయ్యన్న పాల్గొన్నారు. నర్రవాడలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వివరించారు. ● **అనంతసాగరం:** సోమశిలలోని బాదుల్లా సాహెబ్ దర్గాలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీకి మతపెద్దలు దువా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు వచ్చినట్లు తెలిపారు. మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ కేశవ చౌదరి స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాల అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

జేఏసీ ఏర్పాటు చేసి పోరాటం చేస్తాం

ఉలవపాడు, న్యూస్‌టుడే: తమ భూములు కాపాడుకునేందుకు నిరసన తెలిపిన రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని బీసీ కులాల రాష్ట్ర నాయకులు మిరియం శ్రీనివాసులు అన్నారు. గురువారం కరేడులో సమావేశమయ్యారు. జేఏసీ ఏర్పాటు చేసి రైతులు పక్షాన పోరాటం చేస్తామన్నారు.

పందెం.. తీస్తుంది ప్రాణం

కావలిలోని పుచ్చలపల్లివారి వీధికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెట్టింగ్ యాప్ వలకు చిక్కారు. ఇతను పీఈటీగా ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ జూదం వ్యసనానికి అలవాటయ్యారు. ఇందు కోసం సహచర ఉపాధ్యాయుల వద్ద అప్పు చేశారు. రూ.కోట్లలో నష్టపోయి ఎలా తీర్చాలో తెలియక రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు.

● ఉత్తర జనతాపేటలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో పనిచేస్తున్న కాపలాదారు రుణ యాప్‌లో నగదు తీసుకొని ఆన్‌లైన్‌లో జూదం ఆడి భారీగా నష్టపోయారు. రుణ యాప్ నిర్వాహకులు చెప్పినట్లు వడ్డీతో సహా చెల్లించకుంటే మీ కుటుంబ మహిళల నగ్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెడతామని బాధితుడ్ని బెదిరించారు. దీంతో అతను ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నారు.

● ట్రంకురోడ్డులోని ఓ హోటల్‌లో పని చేసే మహిళకు తన చిత్రాలే అసభ్యకరంగా చరవాణిలో వచ్చాయి. దీంతో పోలీసులను ఆశ్రయించగా, ఆమె కుమారుడు లోన్ యాప్‌లో డబ్బులు తీసుకున్న సంగతి తెలిసింది. అలా తీసుకున్న సొమ్ము బెట్టింగ్ యాప్‌లో పెట్టడంతో ఫోన్‌కు ఆ చిత్రాలు వచ్చాయి. పోలీసులు విచారణ చేసేవరకు కుమారుడే కారణమయ్యాడనే సంగతి ఆమెకు తెలియదు.

న్యూస్‌టుడే, కావలి

సరదాగా మొదలైన జూదం వ్యసనంగా మారుతోంది. అందులో చిక్కి అప్పులపాలవుతున్నారు. తాహతుకు మించి చేయడంతో తీర్చే దారి కానరాక చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అప్పు తీర్చాలన్న యాప్‌ల మోసగాళ్ల వేధింపులకు ఎందరో బలవుతున్నారు. పాలకులు వీటిని నియంత్రించడంపై దృష్టి పెట్టడం లేదు.

వెలుగులోకి కొన్నే..

చాలా ఫిర్యాదులు పోలీసుల దృష్టికి వస్తున్నా, కొన్ని మాత్రమే నమోదవుతున్నాయి. జూదాల్లో నష్టపోయామంటున్న వారు ఎక్కువవుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ జూద క్రీడల్లో చాలా మంది నష్టపోతున్నారు. కొందరు మాత్రమే బయటకు చెప్పుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి ప్రముఖుల ద్వారా ప్రచారాలు జరుగుతుండడం కూడా కారణమవుతుంది.

లింకులతో..

చరవాణిలో రుణ యాప్ గురించి లింకులు వస్తాయి. ఆ వ్యసనం నుంచి బయటకు రావాలంటే ఈసారి ఆడి గెలుచుకొని పూర్తిగా రుణవిముక్తి పొందుదామని భావిస్తున్నారు. ఆ క్రమంలోనే చాలామంది తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ తరువాత అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

కావలిలో యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ మహిళా పోలీసు

● కావలి డివిజన్‌లో గత మూడేళ్లలో ఆన్‌లైన్ జూదాలు, రుణాల యాప్‌ల మోసాలపై నమోదైన ఫిర్యాదులు

సంవత్సరం	సంఖ్య
2023	31
2024	59
2025	38

(ఇప్పటి వరకు)

ఆ యాప్స్ జోలికెళ్లొద్దు

–పి.శ్రీధర్, డీఎస్పీ, కావలి

బెట్టింగ్ యాప్స్ జోలికి వెళ్లడం తగదు. వీటిలో చిక్కుకుంటే చాలా ఇబ్బందులు పడతారు. వీలైనంత వరకు పిల్లల చేతికి ఫోన్లు ఇవ్వకూడదు. ఇచ్చినా, వారు ఏం చేస్తున్నారనేది గమనిస్తుండాలి. ఆన్‌లైన్ మోసాలపై కేసులు నమోదు చేస్తున్నాం. ఈ విషయమై ఫోన్ కాలర్ ట్యూన్లలో కూడా అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొందరు బలైపోతుండడం బాధాకరం.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

గుడ్లూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మండల తెదేపా బాధ్యులు నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని చినలాటరపి, జి.నికంపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. క్లస్టర్ బాధ్యుడు యు.సుబ్బారావు, మేకల మాల్యాద్రి, బుల్లెయ్య, చిత్తారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న కూటమి నాయకులు

కందుకూరు గ్రామీణం: ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమ కార్యక్రమాలను నారా చంద్రబాబునాయుడు చేసి చూపించారని నెల్లూరు పార్లమెంట్ తెదేపా అధికార ప్రతినిధి జి.మోషే అన్నారు. మండలంలోని పందలపాడులో గ్రామ పార్టీ అధ్యక్షుడు కూనం లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై గ్రామస్థులకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేకు సత్కారం

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలో వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి కాపునాడు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యేను ఆయన ఇంట్లో కలిసి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కాపు నాడు, రంగా విగ్రహ కమిటీ నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, అల శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వెంగమాంబ సన్నిధి

పొంగళ్లు పెడుతున్న మహిళలు

దుత్తలూరు, న్యూస్‌టుడే : మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి పదహారు రోజుల ఉత్సవం అట్టహాసంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహారు రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం చేయడం ఆనవాయితీ. అమ్మ వారికి శాకంబరీదేవి అలంకారం చేశారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. మహిళలు పొంగళ్లు పెట్టి సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయగిరి, కనిగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

హోమగుండం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వసతులున్నా.. విద్యార్థులేరీ?

న్యూస్‌టుడే, గుడ్లూరు

మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. పాఠశాలలు పునఃప్రారంభమై నెలకావొస్తున్నా. కొత్త ప్రవేశాలు జరగడం లేదు. గుడ్లూరు ఉన్నత పాఠశాలకు గతేడాది వరకు చెమిడిదిపాడు, పొట్లూరు, స్వర్ణాజిపురం, కొత్తపేట, మొగళ్లూరు, అడవిరాజుపాలెం, అమ్మవారిపాలెం, అగ్రహారం గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ బృందం, ల్యాబ్ సౌకర్యం, గ్రంథాలయం ఉంది. ఐఎఫ్‌ఎల్ ప్యానల్స్, డిజిటల్ బోధన జరుగుతుంది. అధునాతన తరగతి గదులున్నాయి. కానీ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. 2023-24లో ఆరు నుంచి పదో తరగతి వరకు 312 మంది విద్యార్థులకు, గత ఏడాది 280 మంది ఉండగా ప్రస్తుతం 250 మంది మాత్రమే ఉన్నారు. ఆరో తరగతిలో నలభైమంది ఉన్నారు. కొత్తగా ప్రవేశాలు లేవు.

● చేవూరు ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు 120 మంది మాత్రమే ఉన్నారు. చినలాటరపి ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి. బసిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలలో కొత్తగా 30 మంది చేరారు.

ఆ ఒక్కరూ మానేస్తే..

గత ఏడాది కాలంగా బసిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థి ఉండగా ఉన్నత పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయిని ఇక్కడ పనిచేస్తున్నారు. ఓ ఉపాధ్యాయిని బదిలీల్లో భాగంగా రావాల్సి ఉండగా.. విధుల్లో చేరలేదు. రోజూ ఆ విద్యార్థి బడికి వచ్చేసమయానికి ఉపాధ్యాయురాలు హాజరు వేసుకుని పాఠశాల మూసి వేసి విద్యార్థిని తీసుకుని పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలలో చదువు చెబుతున్నారు. ఆ చిన్నారికి ప్రాథమిక పాఠశాలకు చెందిన వంట నిర్వాహకులు మధ్యాహ్న భోజనం తీసుకుని వచ్చి పెట్టిపోతుంటారు.

రెండు ఉన్నత పాఠశాలలు ప్రారంభం

: రామ్మోహన్, హెచ్ఎం, గుడ్లూరు

పొట్లూరు, అడవిరాజుపాలెం గ్రామాల్లో ఈ ఏడాది ఉన్నత పాఠశాలలు ప్రారంభించారు. ఆయా గ్రామాల నుంచి కనీసం 50 నుంచి 60 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గింది. పెరిగేలా కృషి చేస్తాం.

ప్రవేశాల పొందితేనే..: గోవర్ధన్, ఎంఈవో

ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు గత సంవత్సరం నుంచి రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని కావడంతో ఇక్కడ విధులు నిర్వహించాలి. అందుకు అక్కడ నుంచి ఒక్క విద్యార్థిని తీసుకుని ఇక్కడకు వస్తున్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ప్రవేశాలు పొందితే ప్రాథమిక పాఠశాల కొనసాగే అవకాశం ఉంది.

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

వరికుంటపాడు : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తూర్పుబోయమడుగుల ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంగయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో ఆర్.బాలాజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో రమేష్ తెలిపారు. రెండో ఎంఈవో రమణయ్యతో కలిసి గురువారం గ్రామంలోని పాఠశాలకు వెళ్లి గ్రామస్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం కాపీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఇవ్వడంతోపాటు స్కూల్ గోడపై మరొకటి అతికించారు.

ANDHRA PRADESH STATE WAQF BOARD, VIJAYAWADA
4th Floor, Imdad Ghar,
Opp. Kaleswara Rao Market, Vijayawada-01
F.No. 05/KAS/AUC/2016/DM/Nayee Bramhin Dated: 03-07-2025

E-AUCTION NOTICE

Intending Bidders/ Persons/ Firms from any Sect within the community of Nayee Bramhins only are invited to participate in the e-auction for Right to collect vowed Hair and Hair cutting only in respect of the Dargah Hazrath Syed Kareemullah Sha Quadri (Rh), Kasumur (V), Venkatachalam (M), SPSR Nellore Distrct to be conducted on 21-07-2025 from 11.00 AM to 02.00 PM through the website i.e., https://konugolu.ap.gov.in under the e-auction ID: 25172.

Please visit the above website for e-auction details under the ID: 25172. For further more details please contact: **99493 52388**

Sd/- **CHIEF EXECUTIVE OFFICER**

బైక్‌మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల మెకానిక్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. గురువారం పట్టణంలోని పోతురాజుమిట్ట షాదీఖానాలో ప్రపంచ మెకానిక్ దినోత్సవం నిర్వహించారు. సీనియర్ మెకానిక్‌లు ఆంజనేయులు, వహియాన్, డీలర్ నరేంద్ర కేకు కోసి పంచిపెట్టారు. మెకానిక్‌ల సంక్షేమ కోసం నరేంద్ర రూ.20వేలు విరాళం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జిలానీ, ఖాదర్‌బాషా నజీర్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తత తప్పనిసరి

కలిగిరి, న్యూస్‌టుడే: చెక్.. క్లీన్.. కవర్ విధానాల్లో ప్రతి ఇంట్లో నిల్వ నీటిని గుర్తించి శుభ్రం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.గీతారెడ్డి తెలిపారు. జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా కలిగిరిలో గురువారం పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో కావలి మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, సీహెచ్‌వో సాయిలక్ష్మి, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపల ఎగుమతికి సిద్ధం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మాచవరం చెరువు వద్ద గురువారం సందడి వాతావరణం కనిపించింది. చెరువుకు పుష్కలంగా నీరు చేరడంతో చేపల వృద్ధి బాగా పెరిగింది. స్థానిక ఎస్టీలే బృందంగా మారి పిల్లలను వేసి పెద్దవి అయిన తర్వాత అమ్మకాలు చేస్తుంటారు. ప్రస్తుతం వారం రోజులుగా కొరమీను, బొచ్చె, పండుగప్ప వంటి రకాలను విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. స్థానికులు ఇక్కడ కొనుగోలు చేసి బంధువులకు దూరప్రాంతాల వారికి పంపిస్తున్నారు.

EENADU eClassifieds

EDUCATION

HOME TUITIONS

Maths / English Home Tuitions చెప్పబడును. 6-10th CBSE / State Syllabus with Strong Foundation / Concept Clarity / Exam Success. Ph:9676992145

PEOPLE CARE

OLD AGE HOME

Lotus Retirement Home : ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచికరమైన ఆహారం & వినోద కార్యక్రమాలతో స్థాపించబడిన సంస్థ. నెల్లూరు ✆ 89859 65614

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని అనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58883.

PLOT FOR SALE

కోవూరులోని పాటూరు రోడ్ లో గల DTCP లేఔట్ నందు 23 అం. ప్లాట్లు అన్ని వసతులతో అమ్మకానికి కలవు. Ph: 9380544418

JOBS

Wanted Fresher / Exp Business Development Manager / Counsellor in Nellore. Attractive Salary. Contact : 8333872869

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలికాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

నెల్లూరు జిల్లాలో ప్రముఖ ఫైనాన్స్ నందు పనిచేయడానికి కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (పురుషులు) మరియు టెలికాలర్ కావలెను. (మహిళలు మాత్రమే), Address: B.V.నగర్. ✆ 63000 03008

శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ నెల్లూరు బ్రాంచ్ నందు పని చేయుటకు కలెక్షన్ మేనేజర్స్, ట్రైని మేనేజర్లు, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫైనాన్స్ రంగంలో అనుభవం గలవారికి ప్రాధాన్యత. సంప్ర: 99898 66066

లోటస్ హాస్పిటల్ నందు పనిచేయుటకు డ్యూటీ డాక్టర్స్, సీనియర్ నర్సింగ్ స్టాఫ్ మరియు డ్రైవరు కావలెను. పొగతోట, నెల్లూరు. Contact : 9121282909

శ్రీరామ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్స్ సంస్థ (Lovol) షోరూం నందు, నెల్లూరు, మిర్యాలగూడ, సూర్యాపేట బ్రాంచ్‌లలో పనిచేయుటకు 1-2 సం|| అనుభవం గల అకౌంటెంట్‌లు కావలెను. మంచి జీతము. ✆ 96403 06306

MARKETING/ SALES

Wanted experienced field marketing executive for food and beverages startup company, salary: 25k+10k incentives. ✆ 9963630236

ACCOUNTING

Wanted Tally Accountant (Male) 4 Years experience with computer knowledge. Sri Durga Hotel, Nellore. Send Resume to WhatsApp No: 7981540612

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800 ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని గాలిదిబ్బలు ప్రాంతంలో కొద్దిరోజులుగా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **–రామయ్య, గాలిదిబ్బలు**

సమాధానం: నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **–ఉమామహేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ – న్యూస్‌టుడే, అల్లూరు**

? మాగ్రామంలోని బస్టాండు సెంటరు వద్ద సిమెంటు రోడ్డు కుంగిపోయింది. చిన్న వర్షం పడినా నీరు నిలిచి రాకపోకలు సాగించలేకున్నాం. **–రాజగోపాల్, కొమ్మి**

✓ సమస్య మా దృష్టికి రాలేదు. పరిశీలించి పరిష్కరిస్తాం **–సల్మాన్, ఏఈ,పీఆర్, – న్యూస్‌టుడే, కొండాపురం**

? గ్రామంలోని బ్రాహ్మణవీధిలో వాహనాలు దుకాణాల ఎదురుగా నిలుపుతున్నారు. పార్శిల్, ఇతరత్రా రవాణా వాహనాలు అక్కడే నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. **- రాజేష్, కలిగిరి**

✓ పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఉమాశంకర్, ఎస్సై, - న్యూస్‌టుడే, కలిగిరి**

? లింగసముద్రం మండలం బలిజపాలెంలో సిమెంట్ రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **– మహేష్, గ్రామస్థుడు**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **– మాధవరావు, పంచాయతీ కార్యదర్శి**

? మాచవరంలో పాఠశాల దగ్గర కుక్కల బెడదతో విద్యార్థులు భయాందోళనకు గరవుతున్నారు. **- రవి, స్థానికుడు**

✓ కుక్కలకు టీకాలు వేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- రత్నజ్యోతి, ఎంపీడీవో – న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**

? గ్రామంలో విద్యుత్తు సరఫరా సరిగా ఉండడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. **– చంద్రశేఖర్, తాళ్లపాలెం, కావలి మండలం**

✓ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. త్వరలో అన్నీ పరిష్కారమవుతాయి. **– చేజర్ల శ్రీనివాసులురెడ్డి, ఏఈ, ఎస్పీడీసీఎల్ – న్యూస్‌టుడే, కావలి**

నీటి కుంట.. తవ్వలేదంట!

న్యూస్‌టుడే, కందుకూరు, గుడ్లూరు

భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతుల పొలాల్లో నీటికుంటల తవ్వకాలకు చర్యలు తీసుకుంది. ఇందుకు కందుకూరు నియోజకవర్గంలో ఈ సంవత్సరం 593 కుంటలు తవ్వకం చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇంతవరకు వీటిలో సగం మాత్రమే పూర్తిచేశారు. మిగిలినవి ఎప్పుడు తవ్వుతారో అధికారులకే తెలియడం లేదు.

పంటలకు ఉపయోగం

మామిడి తోటలు, మెట్ట పైర్లు సాగు చేసే పొలాల్లో నీటి కుంటలతో ఎంతో ఉపయోగం ఉంది. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడంతో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఒక్కో కుంట తవ్వకానికి డ్వామా ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 1.25 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు మంజూరు చేస్తారు. ఈ నగదు కుంట పరిమాణం అనుసరించి మారుతుంది. వర్షాకాలం వచ్చే సరికి కుంటల నిర్మాణం పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గుడ్లూరులో అసంపూర్తిగా నీటికుంట తవ్వకం

మండలం	లక్ష్యం	తవ్వింది
గుడ్లూరు	175	71
కందుకూరు	129	66
ఉలవపాడు	21	14
వలేటివారిపాలెం	152	60
లింగసముద్రం	116	49

చైతన్యం చేస్తాం

శ్రీనివాస్, ఏపీడీ, కందుకూరు

నీటి కుంటల తవ్వకంతో పొలాల విస్తీర్ణం తగ్గుతుందని రైతులు ముందుకు రావడం లేదు. వారిని చైతన్యపరిచి తవ్వకాలు జరిగేలా ప్రయత్నిస్తున్నాం. నగదు కూడా త్వరగా మంజూరవుతోంది. రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 9,345
(3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	
సవర ధర:	రూ. 74,760
వెండి గ్రాము :	రూ. 113.20

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	100
రిటైల్	122
లేయర్	112
బ్రాయిలర్స్	176
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	201
లేయర్ మాంసం	190
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	116
లేయర్	112
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

నేడు విద్యుత్తుకు అంతరాయం

కందుకూరు గ్రామీణం: మండలంలోని ఓగూరు సబ్‌స్టేషను పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఆపరేషన్ విభాగం ఏఈ టి.వి.నరసింహం తెలిపారు. పంటవారిపాళెం పలుకూరు, పత్తిపాటివారిపాళెం, ఉన్నంవారిపాళెం, రెడ్డిపాళెం, వెంకన్నపాళెం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు. పట్టణ పరిధిలోని ఉప్పుచెరువు ఫీడర్‌లోని జనార్దనకాలనీ, కోవూరు రహదారి, సాయినగర్, బలరామయ్యతోట, ఐఎస్ రావు నగర్, ఉప్పుచెరువు, ఏకలవ్యనగర్, బృందావనం కాలనీలలో కూడా ఉదయం 8 నుంచే సరఫరా ఉండదని తెలిపారు.

నట్టల నివారణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

ఉదయగిరి : మండలంలోని గండిపాలెం పశు వైద్యశాల పరిధిలో జరుగుతున్న నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని జీవాల పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మందు జీవాలకు వేయిస్తే పలు వ్యాధులు రావని సూచించారు.



కావలి
•కావలి • ఉదయగిరి • కందుకూరు

కందుకూరు కోర్టు పరిధిలోకి మండలాలు కలపాలి

సమావేశమైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు పట్టణం: కందుకూరు కోర్టు పరిధిలో నుంచి తొలగించిన పొన్నలూరు, కొండపి, జరుగుమల్లి మండలాలను తిరిగి కలపాలని పట్టణంలోని కోర్టు భవనాల సముదాయ ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. గురువారం అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి శ్రీధర్‌నాయుడు నేతృత్వంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ విషయమై సభ్యులు, న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు

దుత్తలూరు, న్యూస్‌టుడే: నర్రవాడలో పులివర్తి వారి ఎల్లమ్మ దేవస్థానంలో వార్షికోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఉత్సవాలు శుక్రవారంతో ముగుస్తాయని, భక్తులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పేరుకే స్వచ్ఛ-ఆంధ్ర.. అధ్వానంగా పారిశుద్ధ్యం

న్యూస్‌టుడే, దుత్తలూరు

ప్రభుత్వం పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యమిస్తోంది. ఇందుకోసం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర అనే కార్యక్రమాన్ని నెలకో సారి నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని అధికారులు బేఖాతరు చేస్తున్నారు. దీంతో పల్లెల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. దీంతో దోమల సమస్య తీవ్రమవుతుంది. వీటి కారణంగా వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 143 గ్రామ పంచాయతీలున్నాయి. 278కి పైగా మజరా గ్రామాలున్నాయి. అధికారులు పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. రహదారుల పక్కనే చెత్త కుప్పలుగా పేరుకుపోతుంది. కాలువల్లో పూడికతీత తీస్తున్న దాఖలాలు లేవు.

ఉదయగిరి: రహదారి పక్కన చెత్త

ఖర్చవుతోందని..

గతంలో ప్రధాన పంచాయతీలకు ఒక్కో దానికి రూ. 46 వేల విలువైన ఫాగింగ్ యంత్రాలను ప్రభుత్వం అందజేసింది. వీటితో ఫాగింగ్ ప్రక్రియ చేపట్టాలంటే ఖర్చు అధికమవుతుందనే నెపంతో వాటిని వినియోగించకుండా పక్కన పెట్టేశారు. వాస్తవంగా గ్రామాల్లో ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే పాలక, అధికార యంత్రాంగం వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలి. కానీ ఏ పంచాయతీలో కూడా ఇది అమలు కావడం లేదు.

చర్యలు తీసుకుంటాం: మాధవీలత, కావలి డీఎల్‌పీవో

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకులకు ఆదేశాలు జారీ చేశాం. కాలువల్లో పూడికతీత పనులు చేసి శుభ్రం చేయాలని సూచించాం. దోమల నివారణకు తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలి.

కార్యదర్శుల మండల కమిటీ ఎంపిక

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎంపిక గురువారం కొండాపురంలో జరిగింది. కమిటీ మండల అధ్యక్షుడిగా సి.హెచ్. ప్రదీప్, ఉపాధ్యక్షుడిగా కె.జె.పృధ్వీరాజ్, జనరల్ సెక్రటరీగా టి.గోపాల్, కోశాధికారిగా సి. హెచ్. వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. వీరిని పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. కార్యక్రమంలో ధనుంజయ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలని రోడ్డెక్కిన రైతన్న

ఉదయగిరి, న్యూస్‌టుడే : రాయితీపై ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ సీజన్ ప్రారంభమవుతున్నందున ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని కోరారు. డిమాండ్ ఏర్పడడంతో కొంత మంది ఎరువుల దుకాణాల డీలర్లు కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే ఇస్తామని చెబుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు రైతులు చిన్నపరెడ్డి, చెంచురామిరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న రైతులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

దుత్తలూరు, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీపురం, కమ్మవారిపాలెం, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో మొహర్రం ప్రార్థనలను గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో చేశారు. చావిళ్లలో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడి ఉన్న మహిళలు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం పెద్ద ఊరేగింపుతోపాటు శనివారం తెల్లవారుజామున మొక్కుబడి ఉన్న వారు అగ్నిగుండ ప్రవేశం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ప్రార్థనలు చేస్తున్న మహిళలు

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: కొండారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల అభివృద్ధితోపాటు మెరుగైన విద్యాబోధన అందించేందుకు శ్రమించిన ఉపాధ్యాయుడు మన్నం మధవరావు బదిలీపై వెళుతుండడంతో విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎనిమిదేళ్లపాటు మంచి బోధనతోపాటు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలకు పరిష్కారం చూపిన ఆయన వెళ్లడం బాధగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వీడ్కోలు సభలో తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పీజీ కేంద్రంలో పనిచేస్తున్న అధ్యాపకులు బి.అశోక్, జి.నిర్మలచక్రవర్తి జలకాలుష్యంపై చేసిన పరిశోధనకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం డాక్టరేట్లు అందజేసింది. జంతు శాస్త్ర విభాగ సహాయ ప్రొఫెసర్ వేమూరి శైలజ నేతృత్వంలో వీరు పరిశోధన చేశారు. కావలి ప్రాంతంలోని చిప్పలేరులో జలకాలుష్యంతో మత్స్యసంపదకు కలిగే అనర్థాలు, మడ అడవులపై పరిశోధనలు చేసినట్లు పీజీ కేంద్రం ప్రిన్సిపల్ సి. హెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

లింగసముద్రం, న్యూస్‌టుడే: పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై మరొకరు దాడికి పాల్పడిన సంఘటన గురువారం అన్నేబోయినపల్లిలో జరిగినట్లు తెలుస్తోంది. బాధితుడు కందుకూరు ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరినట్లు సమాచారం. ఇరువురు మధ్య గొడవకు గల కారణాలు తెలియలేదు. ఈవిషయమై ఎస్సై పి.నారాయణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

లక్ష్యాల మేరకు పని

దగదర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వారానికి 18 వేల మంది కూలీలకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు

లింగసముద్రం: బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కె.శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం చినపవనిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీచేసి మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందించాలని సూచించారు.

ప్రమాదకరంగా అండర్‌పాస్

మండలంలోని శాంతినగర్ వద్ద అండర్‌పాస్ ప్రమాదకరంగా ఉంది. జాతీయ రహదారి, రైల్వే బ్రిడ్జి మార్గాలు ఉండగా వీటి కింద నుంచి రావూరుకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు సైతం వెళుతుండడంతో రెండు వైపులా గోతులు పడ్డాయి. మరమ్మతులు చేయాల్సి ఉండగా కేవలం హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసి వదిలేశారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. జాతీయ రహదారి విభాగం అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుడ్లూరు, కందుకూరు

వృథాకి అర్థం.. అలసిపోతే ఆసనం

నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో వృథా వస్తువులకు అర్థం చెప్పారు. వాడి పడేసిన ప్లాస్టిక్ నీటి సీసాలను చేప ఆకారంలో అమర్చారు. అలాగే ఉపయోగించిన వాహనాల టైర్లు, ఇనుప డ్రమ్ములతో కుర్చీలు తయారు చేశారు. పార్క్‌కు వచ్చే వాకర్లను ఇవి ఆకట్టుకుంటున్నాయి. అలసిపోయిన వాకర్స్ టైర్ల కుర్చీలపై సేద తీరుతున్నారు. – ఈనాడు, నెల్లూరు

పెద్దల భక్తిబాట.. చిన్నారుల ఉయ్యాలాట..

ఇతర రాష్ట్రాలనుంచి రొట్టెల పండగ కోసం వచ్చిన భక్తులు.. దర్గా పరిసరాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడారాల వద్ద వారి పిల్లలకు చీరతో ఉయ్యాలలు ఏర్పాటు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించడానికి వెళ్లారు. చిన్నారులు వాటిలో ఆటలాడుతూ కనిపించారు. – ఈనాడు, నెల్లూరు

సుపరిపాలనలో తొలి అడుగు గొప్ప కార్యక్రమం: ఎంపీ

ఉదయగిరి, దుత్తలూరు, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గొప్పదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో గురువారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. చెక్క నగిషీ కేంద్రాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు పి.వెంకట బాబు యాదవ్, బయ్యన్న పాల్గొన్నారు. నర్రవాడలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వివరించారు. ● **అనంతసాగరం:** సోమశిలలోని బాదుల్లా సాహెబ్ దర్గాలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీకి మత పెద్దలు దువా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు వచ్చినట్లు తెలిపారు. మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ కేశవ చౌదరి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచండి

చేజర్ల, న్యూస్‌టుడే: గ్రామీణ పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో సుజాత సూచించారు. గర్భిణులు నగరాల్లో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి సిజేరియన్ల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం చిత్తలూరులో ఆమె పర్యటించారు. టీకాల వినియోగం, పోషక లోపాలు ఉన్న పిల్లలు, గర్భిణులను గుర్తించి తగిన పౌష్టికాహారం అందించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల బారిన పడిన వారికి చికిత్సలు అందించటం విషయమై చర్చించారు. వైద్యాధికారి నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సెక్షన్లు.. కలెక్షన్లు!

స్టేషన్ బెయిల్ పేరుతో వసూళ్లు

● నగరంలోని ఓ పోలీసు స్టేషన్‌లో భార్యాభర్తల గొడవ కేసు నమోదైంది. భర్త, అతని కుటుంబ సభ్యులు తనను వేధిస్తున్నారని, అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి స్టేషన్ బెయిల్ కావాలంటే ఓ హెడ్‌కానిస్టేబుల్ ఏకంగా రూ.80వేలు అడిగారు. ఎందుకంటే కేసులో నలుగురు ఉన్నారు.. ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున అని లెక్క చెప్పారు.

● నగరంలోని మరో పోలీసు స్టేషన్‌లోనూ ఇదే పరిస్థితి. ఓ కేసు విషయంలో స్టేషన్ బెయిల్ ఇవ్వాలని అడగ్గా.. అందుకు రూ.20వేలు అడిగారు. అంతివ్వకుంటే లేని పోని సెక్షన్లు చెప్పి బెదిరించారు. చేసేదిలేక అడిగినంత నగదు ఇచ్చారు.

● ఈ పరిస్థితి రెండు స్టేషన్లలోనే కాదు.. జిల్లాలోని పలుచోట్ల నెలకొంది.

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

పోలీసు స్టేషన్లలో ఇచ్చే సీఆర్‌పీ నోటీసులతో కొందరు పోలీసులు వ్యాపారం చేసుకుంటున్నారు. సెక్షన్ల పేరుతో బెదిరింపులకు పాల్పడి దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం స్టేషన్ బెయిల్‌కు రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఏడు సంవత్సరాల లోపు శిక్ష పడే ఏ సెక్షన్ అయినా సరే పోలీసు స్టేషన్‌లోనే బెయిల్ తీసుకోవాల్సి ఉంటుంది. ఎప్పుడైనా సరే విచారణకు హాజరు కావాలనే అంగీకార పత్రమే స్టేషన్ బెయిల్. ఇదే అవకాశంగా చేసుకొని కొందరు పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. స్టేషన్ హౌస్ అధికారికి సమాచారం ఉన్నా.. అందులో పర్సంటేజీ ఉండటంతో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 12 సర్కిళ్లలో 52 పోలీసుస్టేషన్లు ఉన్నాయి. నగరంలో ఆరు స్టేషన్లు, రెండు ట్రాఫిక్ స్టేషన్లతో పాటు మహిళా పోలీసు స్టేషన్ వేరుగా ఉంది. ఆయా స్టేషన్లలో నిత్యం ఏదో ఒక కేసు ఎఫ్ఐఆర్ అవుతూనే ఉంటుంది. లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి పోలీసు స్టేషన్లలో కేసు నమోదవుతుండగా, కేవలం మహిళలకు సంబంధించి మహిళా పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదవుతుంటాయి. మిగతా స్టేషన్లలో కూడా అదనపు కట్నం, భర్త వేధింపుల కేసులు నమోదవుతుంటాయి. హత్య, హత్యాయత్నం, అత్యాచారం, పోక్సో తదితర కేసులు మినహా మిగతా అన్ని కేసులకు పోలీసు స్టేషన్‌లోనే బెయిల్ ఇచ్చే అధికారం ఉంది. అంటే ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాలకు 41(ఎ) సీఆర్‌పీ నోటీసులు ఇచ్చి కోర్టులో హాజరు కావాలని ఇస్తుంటారు. కేసులో ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డులతో పాటు రెండు ఫొటోలు ఇస్తే దాని నోటీసు జారీ చేస్తారు. ఇక్కడే పోలీసులు చక్రం తిప్పుతుంటారు. ఏ కేసైనా సరే.. నోటీసులు ఇవ్వాలంటే ఒక్కో వ్యక్తి నుంచి రూ.10వేలు, రూ.20వేలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఏ కేసులో ఎంత మంది ఉంటే అంత మొత్తం ఇవ్వాల్సిందే. లేదంటే నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెడితే జైలుకెళతారని బూచి చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుంటారు.

చర్యలు తీసుకుంటాం..

జి.కృష్ణకాంత్, ఎస్పీ.. 41(ఎ) సీఆర్‌పీ నోటీసులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

మహిళలు అన్నిరంగాల్లో ముందంజ

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: మహిళలు నేడు అన్నిరంగాల్లో పురోగతి సాధిస్తున్నారని, సారా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఘనత అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘానిదేనని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఐద్వా నగర 16వ మహాసభల్లో భాగంగా గురువారం నగరంలోని ఆదిత్యనగర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో ముస్లిం మైనార్టీకి చెందిన మహిళా కమాండర్‌గా కీలకంగా వ్యవహరించారని.. మహిళల్లో ఎంత గొప్ప శక్తి ఉందో అంటూ గుర్తుచేశారు. మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని కూటమి ప్రభుత్వం కుల, మతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తోందని దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో నూతన నగర అధ్యక్షురాలిగా సుబ్బమ్మ, కార్యదర్శిగా కత్తి పద్మ, కోశాధికారిగా షేక్ నాజున్ని, ఆఫీస్ బేరర్స్‌గా సంపూర్ణమ్మ, ఆదిలక్ష్మి, భార్గవి, షాహనా, భాగ్యమ్మ తదితరులు ఎంపికయ్యారు. జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, జిల్లా కన్వీనర్ అన్నపూర్ణమ్మ, జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, గ్రామీణ అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వెంగమాంబ సన్నిధి

పొంగళ్లు పెడుతున్న మహిళలు

దుత్తలూరు, న్యూస్‌టుడే : మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి పదహారు రోజుల ఉత్సవం అట్టహాసంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహారు రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం చేయడం ఆనవాయితీ. అమ్మవారికి శాకాంబరీదేవి అలంకరణ చేశారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. మహిళలు పొంగళ్లు పెట్టి సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయగిరి, కనిగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

హోమగుండం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వేడుకగా రాజసూయ యాగం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని మూలాపేటలో కొలువుదీరిన ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రాజసూయ యాగం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. స్వామి, అమ్మవార్లకు అలంకరణ చేసి ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మహాభారత పురాణ కాలక్షేపాన్ని వివరించారు.

అలంకరణలో స్వామి అమ్మవారు

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

వరికుంటపాడు : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తూర్పుబోయమడుగుల ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంగయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో ఆర్.బాలాజీరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో రమేష్ తెలిపారు. రెండో ఎంఈవో రమణయ్యతో కలిసి గురువారం గ్రామంలోని పాఠశాలకు వెళ్లి గ్రామస్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం కాపీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఇవ్వడంతోపాటు స్కూల్ గోడపై మరొకటి అతికించారు.

ANDHRA PRADESH STATE WAQF BOARD, VIJAYAWADA
4th Floor, Imdad Ghar,
Opp. Kaleswara Rao Market, Vijayawada-01
F.No. 05/KAS/AUC/2016/DM/Nayee Bramhin Dated: 03-07-2025

E-AUCTION NOTICE

Intending Bidders/ Persons/ Firms from any Sect within the community of Nayee Bramhins only are invited to participate in the e-auction for Right to collect vowed Hair and Hair cutting only in respect of the Dargah Hazrath Syed Kareemullah Sha Quadri (Rh), Kasumur (V), Venkatachalam (M), SPSR Nellore Distrct to be conducted on 21-07-2025 from 11.00 AM to 02.00 PM through the website i.e., https://konugolu.ap.gov.in under the e-auction ID: 25172.

Please visit the above website for e-auction details under the ID: 25172. For further more details please contact: **99493 52388**

Sd/- **CHIEF EXECUTIVE OFFICER**

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: భర్త కనిపించడం లేదని భార్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అటవీ శాఖ నెల్లూరు కార్యాలయంలో పనిచేసే అక్షయ్‌కుమార్.. భార్య నవ్యతో కలిసి ఆర్టీవో కార్యాలయం బ్యాంకు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల కిందట వివాహమైంది. బాబు ఉన్నాడు. ప్రతిరోజూ మాదిరిగానే గతనెల 30న ఉదయం అక్షయ్ కుమార్ కార్యాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ఇంటికి వచ్చి ఏటీఎం కార్డు తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ పనిచేయడం లేదు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, భర్త ఆచూకీ తెలపాలని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఖాతా నుంచి నగదు స్వాహా

చేజర్ల, న్యూస్‌టుడే: బ్యాంకు పేరుతో ఫోన్ రావటంతో మాట్లాడేందుకు ఓ రైతు.. ప్రయత్నించగా తన ఖాతా నుంచి నగదు స్వాహా అయిన ఘటన కొలపనాయుడుపల్లిలో చోటుచేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డికి గత నెల 21న బ్యాంకు పేరుతో కాల్ వచ్చింది. అధికారులు ఫోన్ చేశారని అనుకుని సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే మూడుసార్లుగా ఆయన ఖాతా నుంచి రూ.72 వేలు డ్రా చేసినట్లు మేసేజ్‌లు వచ్చాయి. బ్యాంకుకు వెళ్లి సమాచారం ఇవ్వగా.. పది రోజుల ముందే ఖాతా హ్యాకర్ల చేతిలోకి వెళ్లినట్లు సిబ్బంది వివరించారు. దీంతో ఆయన సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గురువారం వెలుగు చూసింది.

యువకుడి బలవన్మరణం

ముత్తుకూరు: మండలంలోని గోపాలపురం వద్ద గురువారం ఉదయం మహారాష్ట్రకు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... మహారాష్ట్రకు చెందిన నలుగురు యువకులు బుధవారం ముత్తుకూరుకు వచ్చారు. వీరిలో అనిల్ (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకోవాలని ఎదురుగా వస్తున్న ట్యాంకర్ కిందపడ్డాడు. గమనించిన డ్రైవర్ చాకచక్యంగా తప్పించారు... అయినా కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి నుంచి సమీపంలోని ఉప్పునీటి గుంతలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

మర్రిపాడు : మండలంలోని పొంగూరు కండ్రికలో గురువారం జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. సమీప అటవీ ప్రాంతం నుంచి తప్పిపోయి గ్రామంలోకి వచ్చింది. వీధి కుక్కలు వెంబడించాయి. గొంతు దగ్గర తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు కుక్కలను తరిమి పశువైద్యులకు సమాచారం ఇచ్చారు. వారు చికిత్స అందించినా.. కొద్దిసేపటికే మృతి చెందింది. పంచనామా నిర్వహించి, దహనం చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

EENADU e Classifieds

EDUCATION

HOME TUITIONS

Maths / English Home Tuitions చెప్పబడును. 6-10th CBSE / State Syllabus with Strong Foundation / Concept Clarity / Exam Success. Ph:9676992145

PEOPLE CARE

OLD AGE HOME

Lotus Retirement Home : ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచికరమైన ఆహారం & వినోద కార్యక్రమాలతో స్థాపించబడిన సంస్థ. నెల్లూరు ✆ 89859 65614

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

కోవూరులోని పాటూరు రోడ్ లో గల DTCP లేఔట్ నందు 23 అం. ప్లాట్లు అన్ని వసతులతో అమ్మకానికి కలవు. Ph: 9380544418

JOBS

Wanted Fresher / Exp Business Development Manager / Counsellor in Nellore. Attractive Salary. Contact : 8333872869

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

నెల్లూరు జిల్లాలో ప్రముఖ ఫైనాన్స్ నందు పనిచేయడానికి కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (పురుషులు) మరియు టెలికాలర్ కావలెను. (మహిళలు మాత్రమే). Address: బి.వి.నగర్. ✆ 63000 03008

శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ నెల్లూరు బ్రాంచ్ నందు పని చేయుటకు కలెక్షన్ మేనేజర్స్, ట్రైని మేనేజర్లు, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫైనాన్స్ రంగంలో అనుభవం గలవారికి ప్రాధాన్యత. సంప్ర: 99898 66066

లోటస్ హాస్పిటల్ నందు పనిచేయుటకు డ్యూటీ డాక్టర్లు, సీనియర్ నర్సింగ్ స్టాఫ్ మరియు డ్రైవరు కావలెను. పొగతోట, నెల్లూరు. Contact : 9121282909

శ్రీరామ్ ఫార్మ ఎక్విప్‌మెంట్స్ సంస్థ (Lovol) షోరూం నందు, నెల్లూరు, మిర్యాలగూడ, సూర్యపేట బ్రాంచ్‌లలో పనిచేయుటకు 1-2 సం// అనుభవం గల అకౌంటెంట్‌లు కావలెను. మంచి జీతము. ✆ 96403 06306

MARKETING/ SALES

Wanted experienced field marketing executive for food and beverages startup company, salary: 25k+10k incentives. ✆ 9963630236

ACCOUNTING

Wanted Tally Accountant (Male) 4 Years experience with computer knowledge. Sri Durga Hotel, Nellore. Send Resume to WhatsApp No: 7981540612

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 9,345
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 74,760
వెండి గ్రాము :	రూ. 113.20

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	100
రిటైల్	122
లేయర్	112
బ్రాయిలర్స్	176
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	201
లేయర్ మాంసం	190
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	116
లేయర్	112
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మనుబోలు : చెత్త రహిత గ్రామాలుగా పంచాయతీలను తీర్చిదిద్దాలని జడ్పీ సీఈవో మోహన్‌రావు పేర్కొన్నారు. మనుబోలులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఇంటింటికి తిరిగి చెత్తను ఎలా సేకరిస్తున్నారో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 250 గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు. పారిశుధ్యం మెరుగుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శులు గురుడయ్య, శ్రావణి పాల్గొన్నారు.

పందెం.. తీస్తోంది ప్రాణం

కావలిలోని పుచ్చలపల్లివారి వీధికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెట్టింగ్ యాప్ వలకు చిక్కారు. ఇతను పీఈటీగా ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ జూదం వ్యసనానికి అలవాటయ్యారు. ఇందు కోసం సహచర ఉపాధ్యాయుల వద్ద అప్పు చేశారు. రూ.కోట్లలో నష్టపోయి ఎలా తీర్చాలో తెలియక రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు.

● ఉత్తర జనతాపేటలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో పనిచేస్తున్న కాపలాదారు రుణ యాప్‌లో నగదు తీసుకొని ఆన్‌లైన్‌లో జూదం ఆడి భారీగా నష్టపోయారు. రుణ యాప్ నిర్వాహకులు చెప్పినట్లు వడ్డీతో సహా చెల్లించకుంటే మీ కుటుంబ మహిళల నగ్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెడతామని బాధితుడ్ని బెదిరించారు. దీంతో అతను ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నారు.

● ట్రంకురోడ్డులోని ఓ హోటల్‌లో పని చేసే మహిళకు తన చిత్రాలే అసభ్యకరంగా చరవాణిలో వచ్చాయి. దీంతో పోలీసులను ఆశ్రయించగా, ఆమె కుమారుడు లోన్ యాప్‌లో డబ్బులు తీసుకున్న సంగతి తెలిసింది. అలా తీసుకున్న సొమ్ము బెట్టింగ్ యాప్‌లో పెట్టడంతో ఫోన్‌కు ఆ చిత్రాలు వచ్చాయి. పోలీసులు విచారణ చేసేవరకు కుమారుడే కారణమయ్యాడనే సంగతి ఆమెకు తెలియదు.

న్యూస్‌టుడే, కావలి

సరదాగా మొదలైన జూదం వ్యసనంగా మారుతోంది. అందులో చిక్కి అప్పులపాలవుతున్నారు. తాహతుకు మించి చేయడంతో తీర్చే దారి కానరాక చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అప్పు తీర్చాలన్న యాప్‌ల మోసగాళ్ల వేధింపులకు ఎందరో బలవుతున్నారు. పాలకులు వీటిని నియంత్రించడంపై దృష్టి పెట్టడం లేదు.

వెలుగులోకి కొన్నే..

చాలా ఫిర్యాదులు పోలీసుల దృష్టికి వస్తున్నా, కొన్ని మాత్రమే నమోదవుతున్నాయి. జూదాల్లో నష్టపోయామంటున్న వారు ఎక్కువవుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ జూద క్రీడల్లో చాలా మంది నష్టపోతున్నారు. కొందరు మాత్రమే బయటకు చెప్పుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి ప్రముఖుల ద్వారా ప్రచారాలు జరుగుతుండడం కూడా కారణమవుతుంది.

లింకులతో..

చరవాణిలో రుణ యాప్ గురించి లింకులు వస్తాయి. ఆ వ్యసనం నుంచి బయటకు రావాలంటే ఈసారి ఆడి గెలుచుకొని పూర్తిగా రుణవిముక్తి పొందుదామని భావిస్తున్నారు. ఆ క్రమంలోనే చాలామంది తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ తరువాత అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

● కావలి డివిజన్‌లో గత మూడేళ్లలో ఆన్‌లైన్ జూదాలు, రుణాల యాప్‌ల మోసాలపై నమోదైన ఫిర్యాదులు

సంవత్సరం	సంఖ్య
2023	31
2024	59
2025 (ఇప్పటి వరకు)	38

కావలిలో యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ మహిళా పోలీసు

ఆ యాప్స్ జోలికెళ్లొద్దు

–పి.శ్రీధర్, డీఎస్పీ, కావలి

బెట్టింగ్ యాప్స్ జోలికి వెళ్లడం తగదు. వీటిలో చిక్కుకుంటే చాలా ఇబ్బందులు పడతారు. వీలైనంత వరకు పిల్లల చేతికి ఫోన్లు ఇవ్వకూడదు. ఇచ్చినా, వారు ఏం చేస్తున్నారనేది గమనిస్తుండాలి. ఆన్‌లైన్ మోసాలపై కేసులు నమోదు చేస్తున్నాం. ఈ విషయమై ఫోన్ కాలర్ ట్యూన్లలో కూడా అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొందరు బలైపోతుండడం బాధాకరం.

పెట్టుబడులపై అధిక లాభాలంటూ రూ.2.11 కోట్ల మోసం

దంపతుల అరెస్టు

హైదరాబాద్: ఆకట్టుకునే పేర్లతో కంపెనీలు స్థాపించారు.. విశ్రాంత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు.. తమ సంస్థల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలంటూ ఎర వేశారు.. ఐదుగురు బాధితుల నుంచి రూ.2.11 కోట్లు కాజేసి వంచించిన కిలాడీ దంపతులు కటకటాల పాలయ్యారు. సైబరాబాద్ ఆర్థిక నేర పరిశోధన విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన దంపతులు పాణెం మహేశ్-ఉజ్వల నగరానికి వచ్చి కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటున్నారు. భర్త డైరెక్టర్‌గా, భార్య నామినీగా ఎం/ఎస్ క్రెస్ట్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో స్థిరాస్తి సంస్థ ప్రారంభించారు. ఇందుకు కేపీహెచ్‌బీ కాలనీలోనే కార్యాలయం ఏర్పాటుచేశారు. దంపతులిద్దరూ విశ్రాంత ఉద్యోగుల వద్దకు వెళ్లి తమ సంస్థలో పెట్టుబడి పెడితే నెలకు 2 శాతం వడ్డీతో లాభాలు తిరిగి చెల్లిస్తామని నమ్మించారు. పెట్టుబడి పెట్టే వారికి ప్రామిసరీ నోట్, బ్యాంకు చెక్కులు, ఎంఓయూలూ అందజేశారు. మరోవైపు అగ్రివుడ్ ఫాం ల్యాండ్, ఫైన్ సొల్యూషన్స్, వెస్టర్న్ ఎక్వా పేరుతో సంస్థలూ స్థాపించారు. క్రెస్ట్ గ్లోబల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభించి దాని ద్వారా దొడ్డిదారిలో ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలిప్పిస్తామని యువతనూ బుట్టలో వేసుకున్నారు. మొత్తంగా ఐదుగురు బాధితుల నుంచి రూ.2.11 కోట్లు వసూలు చేశారు. కొన్ని నెలలపాటు ముందు చెప్పినట్లు వడ్డీ చెల్లించారు. తర్వాత బోర్డు తిప్పేసి ఉడాయించారు. బాధితులు ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు రంగంలోకి దిగి.. బుధవారం కందుకూరులో ఉజ్వలను, బెంగళూరులో మహేష్‌ను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు. కోర్టుకు రిమాండ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. దంపతులపై ఇప్పటికే బాచుపల్లి, కొల్లూరు, చందానగర్, మాదాపూర్ ఠాణాల్లో మరో ఐదు కేసులు నమోదయ్యాయి.

35 వేల పక్కా గృహాలకు ప్రతిపాదనలు

లబ్ధిదారులతోనే..

ఆగిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతోనే పూర్తి చేసేందుకు వారికి అదనపు సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంజూరు చేసిన ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలతో పాటు ఎస్సీ, బీసీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల వంతున నాలుగు విడతల్లో నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తాం. గతేడాది డిసెంబరు నెల పదో తేదీకి ముందుగా పూర్తయిన గృహాలకు అవకాశం లేదు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఆగిన ఇళ్ల నిర్మాణాలకు సాయం అందించేందుకు పరిశీలన జరుగుతోంది.

న్యూస్‌టుడే, సంగం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం-2.ఓలో భాగంగా జిల్లాలో 35 వేల పక్కాగృహాల మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదించామని **గృహనిర్మాణశాఖ పీడీ వేణుగోపాల్** తెలిపారు. సంగంలో 'న్యూస్‌టుడే'తో ఆయన మాట్లాడారు. ఆ శాఖలో జరుగుతున్న పలు అంశాలగురించి వివరించారు.

ముఖాముఖి

2026 ఏప్రిల్ నుంచి..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం-1 2020లో ప్రారంభమైందని, 2026 మార్చి నెలాఖరుకు పూర్తవుతుందని, అనంతరం ఏప్రిల్ నుంచి ఫేజ్-2 అమల్లోకి వస్తుంది. అప్పటి నుంచి నూతన నిర్మాణాలు చేపట్టే గృహాలకు మాత్రమే నిధులు అందుబాటులో ఉంటాయి.

అవకతవకలకు దూరంగా.. వారు చేపట్టిన నిర్మాణాల్లో జరిగిన అవకతవకలు, సామగ్రి గల్లంతు తదితర ఆరోపణలపై ప్రభుత్వం నిర్వహించిన విజిలెన్సు విచారణ జరుగుతుండగా ఏడు నెలలుగా పనులు ఆగాయి. వారిలో 95 మందిని దూరంగా పెట్టి మిగిలిన 65 మందితో తిరిగి పనులు చేయించేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం.

పురోగతి తక్కువ..

2020లో ప్రారంభమైన పీఎంఏవై ఎస్-1లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో మంజూరైన 1.04 లక్షల గృహాల నిర్మాణంలో ఉండగా పురోగతి తక్కువగా ఉంది. ఇప్పటికి 30 వేలు మాత్రమే పూర్తవగా, 22 వేలు ప్రారంభం కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆప్షన్-3 ద్వారా లబ్ధిదారులకు బదులుగా 160 మంది గుత్తేదారులతో 28 వేల గృహాల నిర్మాణానికి అనుమతిస్తే ఏడు వేలు మాత్రమే పూర్తయ్యాయి.

28 వేల మందిని గుర్తించి..

ఆప్షన్-1 పరిధిలో 12 వేలు, ఆప్షన్-3 కింద 16 వేలు మొత్తం 28 వేల మంది ఉండగా, ఆప్షన్-1 లబ్ధిదారులు 5,500 మంది ఖాతాల్లో ఇప్పటికే నగదు జమ చేశాం. మిగిలిన వారు అవకాశాన్ని అందిపుచ్చుకొని నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. లబ్ధిదారులందరికి గృహాలు నిర్మించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

'పొలం ఆక్రమించారు.. న్యాయం చేయండి'

సంగం, న్యూస్‌టుడే: తలుపూరుపాడులో ఎనిమిది ఎకరాల భూమిని వైకాపా ప్రభుత్వం హయాంలో కొందరు ఆక్రమించారని గురువారం తహసీల్దారు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులు ఉపతహసీల్దారు జ్యోతికి వినతి పత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన మహ్మద్ రఫీ కొన్నేళ్ల క్రితం గ్రామంలో ఎనిమిదెకరాల భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తుండేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానిక నాయకులు.. ఆ భూమి ఆయనది కాదని, వేరేచోట ఉందంటూ దాన్ని సొంతం చేసుకున్నారు. అప్పటి నుంచి న్యాయం చేయాలని కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని విన్నవించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల విద్యుత్తు ఉపకేంద్రంలోని గోవిందంపల్లి ఫీడరు పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ సురేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పడమటి కంభంపాడు, పాతాళపల్లి, గోవిందపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: ఏఎస్‌పేట మండలం పందిపాడు ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. చెక్‌డ్యాం నుంచి నీరు రోడ్డుపై ప్రవహించడంతో గోతులమయంగా మారింది. **-లక్ష్మయ్య**

సమాధానం: ప్రతిపాదనలు పంపి ఉన్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. **- ఖాదర్‌మస్తాన్, పీఆర్ ఏఈ**

? చేజర్ల మండలం ఓబులాయపల్లి- ఆదూరుపల్లి మధ్య రహదారిపై కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- పాతపాడు గ్రామస్థులు**

✓ తొలగిస్తాం. **- అన్వేష్, ర.భశాఖ ఏఈ**

? సంగం మండలం పెరమనలో కుక్కలగుంట కల్వర్టు వద్ద రక్షణ ఏర్పాట్లు లేవు. వరద వస్తే ప్రమాదకరంగా ఉంటోంది. **- శ్రీనివాసులు**

✓ ఇంజినీరు దృష్టికి తీసుకెళ్లి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. **- షాలెట్, ఎంపీడీవో**

? అనంతసాగరం మండల పరిధిలోని ఇనగలూరులో రోడ్డుపైనే వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

✓చర్యలుతీసుకుంటాం. **- రమణరావు, కార్యదర్శి**

? పొదలకూరు శ్రీనివాసులు లేఅవుట్‌లోని పార్కు నిర్మాణానికి వదిలిన స్థలంలో పిచ్చి మొక్కలతో అధ్వానంగామారింది. **- పెంచలయ్య**

✓ఉన్నతాధికారులకు వివరించి వసతులు కల్పిస్తాం. **- యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి**

? పొదలకూరు రూరల్ పరిధిలోని పార్లపల్లిలో మురుగు కాలువల నిర్వాహణ లేక పూడిపోయాయి. **- చంద్ర, స్థానికుడు**

✓ శుభ్రం చేయిస్తాం. **- నరసింహారావు, ఎంపీడీవో**

? రాపూరుకు డంపింగ్ యార్డు లేదు. చెత్త ఊరు చుట్టూ వేస్తున్నారు. **- స్థానికులు**

✓ స్థల సేకరణ చేశాం. నిధులు మంజూరైతే ఏర్పాటు చేస్తాం. **- భవాని, ఎంపీడీవో**

? కొడవలూరు మండలం యల్లాయపాళెం ఎస్టీ ఆర్ కాలనీలో కాలువలుసరిగా లేవు. **- శీనయ్య**

✓ నిధుల మంజూరును బట్టి పనులు చేయిస్తాం. **- సుబ్బారావు, ఎంపీడీవో**

? వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలో చాలా చోట్ల బావులకు అనుమతి లేకుండా అక్రమంగా మోటార్లు బిగించి నీటిని మళ్లిస్తున్నారు. **- సురేష్**

✓ సమస్య పరిష్కరిస్తాం. **- కల్పన, ఎంపీడీవో**

? మర్రిపాడు మండలం చుంచులూరు సెంటర్లో వర్షమొస్తే నీరు నిలిచిపోతోంది. **- రమేష్**

✓ నీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లిస్తాం. **- నరసింహనాయుడు, పంచాయతీ కార్యదర్శి**

ప్రజలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

గ్రామ కొలను నిర్మాణంపై అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి ఆనం

చేజర్ల, న్యూస్‌టుడే: ప్రజల జీవన శైలికి అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు సాగాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గురువారం చేజర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ కొలను పనులకు శంకుస్థాపన చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. చేజర్ల చెన్నకేశవాలయం, పెరుమాళ్లపాడు నాగేశ్వరాలయాను పునరుద్ధరిస్తామన్నారు. ఆత్మకూరులో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నామన్నారు. సంగం- మాముడూరు, చేజర్ల - కలువాయి మధ్య రూ.తొమ్మిది కోట్లతో రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. కళాశాలలు, పాఠశాలలకు రాకపోకలు సాగించటానికి అనువుగా బస్సుల వేళలు సవరించాలని విద్యార్థులు కోరగా.. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. దేవాదాయశాఖ దుకాణ సముదాయం, సిమెంటు రోడ్లు, వైద్యారోగ్యశాఖ ల్యాబ్‌ను ప్రారంభించారు. సోమశిలఛైర్మన్ ప్రాజెక్టు కేశవచౌదరి, నాయకులు తాళ్లూరు గిరినాయుడు, రావి పెంచలరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, ఆర్డీవో బి.పావని, తహసీల్దారు బి.మురళి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి

ముత్తుకూరు, నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: అన్నివర్గాల సంక్షేమమే తెదేపా లక్ష్యమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. నారికేళపల్లిలో గురువారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెదేపా' కార్యక్రమంలో ఆయన పాల్గొని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తితిదే బోర్డు సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, తెదేపా తిరుపతి జిల్లా అధ్యక్షులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ➡ నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సర్వేపల్లి అభివృద్ధిపై అధికారులతో సోమిరెడ్డి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాల్లో వృద్ధిరేటు సాధించేలా రైతులకు వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల్లో 1.50 లక్షల మొక్కలను నాటి వాటి పరిరక్షణ బాధ్యత స్థానిక ప్రజలతోపాటు అధికారులు, సచివాలయ ఉద్యోగులు తీసుకోవాలని సూచించారు.

కోవూరు ఆసుపత్రి వందపడకలయ్యేనా..?

ఉన్నతీకరించి వసతులు కల్పిస్తే రోగులకు మేలు

❖ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వంద పడకలతో మల్టీస్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రులను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.
- సత్యకుమార్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి.

❖ కోవూరు సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకలతో అభివృద్ధి చేస్తాం. మెరుగైన వైద్య సేవలందిస్తాం. **- ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు**

న్యూస్‌టుడే, కోవూరు

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం పెట్రోలు బంకు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై ఇటీవల కారు రోడ్డు సమీపంలోని దుకాణంలోకి దూసుకెళ్లడంతో ఆరుగురు మృతిచెందారు. క్షతగాత్రులను నెల్లూరులోని పలు ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యసేవలందించే లోగా అప్పటికే మృతిచెందారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే మొదటి గంట చాలా కీలకమని వైద్యులు సూచిస్తున్నారు. కోవూరు సమీపంలోని 30 కిలోమీటర్ల లోపు జాతీయ రహదారులపై పలు ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కోవూరు సీహెచ్‌సీలో ప్రతి రోజూ 250కి పైగా ఓపీ నమోదవుతోంది. వంద పడకల ఆసుపత్రిగా మార్చి పలు వసతులు కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. నెల్లూరు నగరానికి అత్యంత సమీపంలో ఉండటంతో ఎక్కడైనా ప్రమాదాలు సంభవిస్తే సత్వరం మెరుగైన వైద్యసేవలందించే అవకాశముంది.

కోవూరు సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రోగులు

నిత్యం రోడ్డు ప్రమాదాలు...

కోవూరు నియోజకవర్గంలో ఎన్‌హెచ్‌-16 , ముంబయి జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. రెండు జాతీయ రహదారుల మధ్యలో కోవూరు ప్రభుత్వాసుపత్రి ఉంది. ఇక్కడ వైద్యులు 24 గం. అందుబాటులో ఉంటున్నారు, అత్యవసర సేవలందించేందుకు యంత్రాంగం లేదు. ఎక్కువ మంది 108లో నెల్లూరు జీజీహెచ్ లేదా ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వందపడకల ఆసుపత్రిగా మార్చి అన్ని విభాగాలు ఏర్పాటు చేస్తే ఉపయోగపడుతుంది.

పరుగులు తీయాల్సిందే...

కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, రామతీర్థం, ఇందుకూరుపేట మండల కేంద్రాల్లో మాత్రమే సీహెచ్‌సీలు ఉండగా, ఇనమడుగు, కొడవలూరు, యల్లాయపాళెం, విడవలూరు, జొన్నవాడ, పల్లిపాడు గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా మరో 52 ఉప వైద్య ఆరోగ్య కేంద్రాలు(విలేజ్ క్లినిక్‌లు) నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర కాన్పులు, గుండెనొప్పి, కడుపు నొప్పి, డెంగీ జ్వరాలు, తేలు, పాము కాట్లకు గురైనవారు ఎక్కువగా వస్తుంటారు. వీరికి చికిత్స అందించేందుకు నియోజకవర్గ పరిధిలో ఒక్క ఆసుపత్రిలో కూడా ఐసీయూ విభాగం లేదు. బ్లడ్ బ్యాంకులు నామమాత్రంగా ఉన్నాయి. పురిటి బిడ్డల సంరక్షణకు ఎన్‌ఐసీయూ కేంద్రాలు అందుబాటులో లేవు, కొన్నిచోట్ల పిల్లలకు కామెర్లు సోకకుండా ఉండేందుకు వార్మర్స్ మాత్రమే ఉన్నాయి, చాలా చోట్ల అవి పనిచేయడం లేదు.

మెరుగైన సేవలందిస్తున్నాం

కోవూరు సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఇప్పటికే కాన్పులు, ల్యాబ్, ఎక్స్‌రే, స్కానింగ్ తదితర ఖరీదైన వైద్యసేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. రోగులకు అన్ని రకాలుగా మౌలిక వసతులు కూడా అందుబాటులో ఉన్నాయి.
- డా.లీలావతి, సూపరింటెండెంట్, కోవూరు సీహెచ్‌సీ

బాధ్యతాయుత సర్వేతోనే ఊరట

చేజర్ల, న్యూస్‌టుడే: రీ సర్వే కోసం నిర్దేశించిన దస్త్రాలను పూర్తిగా సేకరించి పక్కాగా కొలతలు వేయాలని ఆర్డీవో పావని.. వీఆర్వోలు, సర్వేయర్లకు సూచించారు. ప్రభుత్వ ఆస్తులను గుర్తించేందుకు వీలుగా సంబంధిత విభాగాల నుంచి పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. గురువారం చేజర్లలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమయ్యారు. రైతుల నుంచి హక్కు పత్రాలు సేకరించి ప్రభుత్వ రికార్డు, క్షేత్రస్థాయిలో పరిస్థితులతో సరిపోల్చుకోవాలన్నారు. క్రమశిక్షణారాహిత్యంతో వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు బి.మురళి, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

మర్రిపాడు, న్యూస్‌టుడే: డి.సి.పల్లి, చుంచులూరు, కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు శ్రీసాంబశివ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి గురువారం ఉచితంగా విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం.. కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఇనమడుగులో డీపీవో పర్యటన

కోవూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇనమడుగులో డీపీవో శ్రీధర్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

దాటాలంటే మీరు.. దారిలో నీరు

మర్రిపాడులోని రామాలయం, బాలుపల్లి ప్రాంతాల్లో మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి నీరు రోడ్లపై నిలిచిపోయింది. ప్రజలు అటూ రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. దోమల వ్యాప్తి అధికమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)**

నిరుపయోగం

రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం ప్రజల దాహార్తి తీర్చేందుకు వేసిన చేతిపంపు బోర్లు నిరుపయోగంగా మారాయి. ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేట లోని ప్రధాన కూడలిలో ఉన్న చేతిపంపు గత కొద్ది రోజులుగా నిరుపయోగంగా ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి చేతిపంపు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, ఇందుకూరుపేట**

దుర్వాసనతో సతమతం

కోవూరు పట్టణంలోని లారీయార్డు సమీపంలో ఇంద్ర లోక్ అవెన్యూ ప్రాంతంలో రోడ్డు పక్కన వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది. పందులు సంచరిస్తుండటం వల్ల అటువైపు వెళ్లలేకున్నామని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ తక్షణమే శుభ్రం చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కోవూరు**

ప్రమాదకర మలుపు

కోవూరు నుంచి పాటూరుకు వెళ్లేదారిలో కిలోమీటరు దూరంలోనే ఆరు మలుపులున్నాయి. అటువైపు ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రహదారిలో వాహనాలు రద్దీగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరించాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోవూరు**

దుమ్ము రేగుతోంది

సైదాపురం మండలం ఊటుకూరు నుంచి పెరుమాళ్లపాడుకు వాహనాలు వెళ్లే రోడ్డు పక్కన ఇళ్లలో ఉండే ప్రజలు అల్లాడుతున్నారు. [illegible] పాటు వివిధ మైన్‌ల లోని ఖనిజాన్ని తీసుకెళ్లేందుకు భారీ లారీలు ఇటు నుంచే వెళుతున్నాయి. దుమ్ముతో ప్రజలు సతమతమవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సైదాపురం, మనుబోలు**

అర్హులకు ప్రభుత్వ పథకాలు

ప్రభుత్వ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సైదాపురం, రాపూరు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో పాలక ప్రభుత్వం కృషి చేస్తోందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సైదాపురం మండలంలోని కట్టుబడిపల్లి, కలిచేడు గ్రామాల్లో గురువారం పర్యటించారు. నాయకులు సుబ్రమణ్యంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెదేపా ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చేశారని తెదేపా తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ అన్నారు. రాపూరు మండలంలోని కంభాలపల్లి పంచాయతీలో ఇంటింటి కెళ్లి కరపత్రాలు అందజేశారు. నాయకులు రాజశేఖర్, పూర్ణచంద్రారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

80 శాతం ఎన్నికల హామీలు అమలు చేశాం

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, కొడవలూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల్లో 80 శాతం అమలు చేశామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత వైకాపా పాలనకు నేడు కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు గుర్తించారని చెప్పారు. ❖ కొడవలూరు మండలం యల్లాయపాళెంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ అవినీతి రహిత, వివాదరహిత కోవూరు నియోజకవర్గమే తన ధ్యేయమన్నారు. తెదేపా నాయకులు జీవీఎన్ శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, అమరేంద్రరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. ❖ నెల్లూరులోని ఆమె నివాసంలో ఇరిగేషన్ శాఖాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముదివర్తిపాళెం కాజ్‌వే, మలిదేవి డ్రైన్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ దేశినాయక్, డీఈ పెంచలయ్య, ఏఈలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

పొదలకూరు : ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యులు నరసింహారావు అన్నారు. గురువారం మహ్మదాపురం ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల తోపాటు, తాటిపర్తి పంచాయతీలోని వరదాపురం ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఆహారం, తాగునీరు వంట గదులు పరిశీలించారు.

అసంపూర్తి రోడ్డు.. వాహనదారుల పాట్లు

గుంతలమయంగా ఉన్న సైదాపురం-పొదలకూరు రోడ్డు

సైదాపురం, మనుబోలు, న్యూస్‌టుడే: సైదాపురం-డేగపూడి ప్రధాన రోడ్డు అసంపూర్తి పనులతో ప్రజలకు అవస్థల ప్రయాణాలు తప్పడం లేదు. దాదాపు 16 కిలోమీటర్లు ఉన్న రోడ్డు పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.45 కోట్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఈ క్రమంలో పూర్తి కాని పనులను ప్రభుత్వం రద్దు చేసింది. సైదాపురం మండల పరిధిలోని ఊటుకూరు, తురిమెర్ల, కలిచేడు గ్రామాల్లో సిమెంట్ రోడ్డు వేసినా ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో నిత్యం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రోడ్డు రెండు వరుసల రోడ్డుగా ఏర్పాటు చేయాలి. చేయకపోవడంతో గుంతల రోడ్డులో ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ర.భ అధికారులు దృష్టిసారించి రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టి ప్రజల ఇక్కట్లను తొలగించాలని సైదాపురం-పొదలకూరు మార్గంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కోవూరు, న్యూస్‌టుడే: మండలంలోని వేగూరుకు చెందిన నాగరాజు(50) సమీప గ్రామం మోడేగుంటలోని రొయ్యల గుంతల వద్ద గురువారం పురుగుల మందు తాగి మృతిచెందారు. ఎస్సై రంగనాథ్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

సైదాపురం, న్యూస్‌టుడే: మండలంలోని లింగసముద్రం ఏరియా నుంచి అనుమతుల్లేకుండా చెట్లను నరికి కలపను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు అటవీశాఖ రేంజర్ మాల్యాద్రి తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం చెట్లను నరకాలంటే తప్పకుండా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా చెట్లను నరికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేకుల షెడ్డు కూల్చేశారని ఫిర్యాదు

పొదలకూరు : తాటిపర్తి గ్రామానికి చెందిన ఖాజాబికి చెందిన రేకులషెడ్డు కూల్చేశారని ఫిర్యాదు చేశారని ఎస్సై హనీఫ్ తెలిపారు. ఆ స్థలం తమదని ఒక వ్యక్తి బుధవారం రాత్రి తాము ఇంట్లో లేని సమయంలో తొలగించారని, విచారించి న్యాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

అనంతసాగరం : ద్విచక్ర వాహనదారుడు రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన అనంతసాగరం శివారులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఉప్పలపాడు జాతీయ రహదారి నుంచి అనంతసాగరం వైపుగా వస్తున్నారు. వాహనాన్ని అదుపు చేయలేక బోల్తా పడ్డారు. స్థానికులు 108 ద్వారా ఆత్మకూరు తరలించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చి నగర పంచాయతీలో మొహర్రం సందర్భంగా ఏడో రోజు ఖాజానగర్ చావిడి వద్ద పీర్లను స్థానికులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారి త్యాగాలను స్మరించుకొని ఊరేగింపు జరగ్గా అధిక సంఖ్యలో నిర్వహించారు.

డిప్యూటీ సీఎం చిత్రపటాలు ఏర్పాటు చేయండి

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలోని ఉపకులపతి, రిజిస్ట్రార్ ఛాంబర్లలో గవర్నర్, సీఎం ఫొటోలతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలు ఏర్పాటు చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సురేశ్ అన్నారు. గురువారం వీసీని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏఎంసీ డైరెక్టర్ వాణి భవాని నాయుడు, మహేశ్, శ్రీహరి, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న 12 మంది ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్ గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఉపాధ్యాయులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

అనంతసాగరం, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. గురువారం బొమ్మవరం, గౌరవరం గ్రామాల్లో చెత్త సేకరణ, తాగునీటి పథకాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో సచివాలయ సిబ్బంది సహకరించాలన్నారు. **సంగం :** ఇంటింటా చెత్త సేకరణ జరగాలని ఎంపీడీవో షాలెట్ అన్నారు. చెర్లోవంగల్లులో గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సేకరణ పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి అందించాలని సూచించారు.

నిధులు వెచ్చిస్తే అభివృద్ధి పరుగులు

న్యూస్‌టుడే, వెంకటాచలం

వెంకటాచలంలో దివ్యాంగులకు అవసరమైన భవనం లేకపోవటంతో మండల పరిషత్తు కార్యాలయం సమీపంలో భవిత భవనం నిర్మాణం కోసం అప్పట్లో ప్రభుత్వం రూ.8 లక్షలు కేటాయించింది. పనులు చేపట్టిన గుత్తేదారు స్లాబ్ నిర్మాణం చేసి చేతులెత్తేశారు. తొమ్మిదేళ్లుగా భవనం అసంపూర్తిగా ఉంది.

నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలం మండలంలో ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టగా... వైకాపా ప్రభుత్వంలో పట్టించుకోలేదు. నిధుల లేమితో అరకొరగానే ఉండిపోయాయి. సామాజిక భవనాలు, పాఠశాల గదులు, దివ్యాంగుల కేంద్రాలు, సచివాలయ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. పలు చోట్ల భవనాల కొరత ఉంది. కొద్దిపాటి నిధులు కేటాయించిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావచ్చని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణాల పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

➡ వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీ కుంకుంపూడిలో సామాజిక భవనం నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.7.5 లక్షలు ఉప ప్రణాళిక నిధులు కేటాయించింది. సరిపోకపోవడంతో గుత్తేదారులు స్లాబ్ వేసి నిలిపేశారు. తరువాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోక పోవటంతో నేటికి అసంపూర్తిగానే ఉంది. నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరినా పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం

అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాల వివరాలు సేకరిస్తున్నాం. వాటిని సంబంధిత అధికారులకు పంపి వాటి నిర్మాణాల పూర్తికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
- కల్పన, ఎంపీడీవో, వెంకటాచలం

కాలానుగుణ వ్యాధులపై అవగాహన

ఆత్మకూరు, న్యూస్‌టుడే : కాలానుగుణ వ్యాధులైన డెంగీ, మలేరియా, గన్యా వంటి వాటిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి షేక్ అస్మా పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థునులకు అవగాహన కల్పించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది సుధాకర్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో తొలగింపు

పాఠశాలలో యంత్రంతో శుభ్రం చేయిస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 750 మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి సరిపడ మరుగుదొడ్లు నీటి వసతి లేదు. కొందరు దాతల సహకారంతో గురువారం మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు ఉపయోగించుకొనేందుకు ఇబ్బందిగా ఉండటంతో యంత్రాల ద్వారా చెత్తను తొలగించారు. ప్రధానోపాధ్యాయిని శైలజ మాట్లాడుతూ నాబార్డు ద్వారా మంజూరైన నిధులతో తరగతి గదులు నిర్మించినా తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు.

పొగతో వాహనదారులకు ఇక్కట్లు

చెత్త సంపద తయారీ కేంద్రం నుంచి వెలువడుతున్న పొగ

అనంతసాగరం, న్యూస్‌టుడే: పాతదేవరాయపల్లిలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దట్టమైన పొగ వ్యాపించింది. ఆత్మకూరు- సోమశిల ప్రధాన రహదారి పక్కనే ఈ కేంద్రం ఉండటంతో పొగ వల్ల అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వహీద మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రంలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ ప్రస్తుతం సెలవులో ఉన్నారని ఆకతాయిలు వ్యర్థాలకు నిప్పు పెట్టినట్లు ఉండొచ్చన్నారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జమాతే ఇస్లామి హింద్ నాయకులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: ఒక విద్యార్థి ఒక మొక్క నాటడం, భవిష్యత్తు తరాలకు ఇచ్చే గొప్ప కానుక అని జమాతే ఇస్లామి హింద్ నెల్లూరు నగర అధ్యక్షుడు సయ్యద్ నవీన్ అష్ఫాద్ తెలిపారు. గురువారం జెండావీధిలోని పీఎస్ఎం హైస్కూలు, గంజిఖానాలోని ప్రైమరీ స్కూలులో 'మట్టిలో చేతులు- హృదయంలో దేశం' అనే స్ఫూర్తి నినాదంతో లక్ష మొక్కలు నాటే ఉద్యమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అన్వర్‌బేగ్, యాకుబ్, ఇలియాస్ హుమయూన్, మస్తక్, ఆయేషాతున్, సఫియా అక్తక్, అఫ్రోజా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు షకీల్, జకీర్ తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా గురువారం జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు రషీద్, అన్వర్‌బేగ్, సందానీబాషా, నవీద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: బర్మాషెల్ పెన్నా కేవలం గుడి ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. బయటకు రావాలంటే భయమేస్తోంది. 30 కుక్కల వరకు ఉన్నాయి. - ప్రభాకర్‌రావు

? దర్గామిట్ట ప్రాంతం తిలక్ కల్యాణ మండపం ఎదురుగా శ్రీరామ స్తూపం వద్దకు వెళ్లే మార్గంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - వాసుదేవరెడ్డి, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. - డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? శివగిరికాలనీలో నాలుగు రోజులుగా నీరు రావడం లేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. చర్యలు తీసుకోవాలి. - లలిత

✓ పరిశీలించి ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపడతాం. - రామమోహనరావు, నగరపాలక సంస్థ ఎస్ఈ

? నవాబుపేట సాయిబాబాగుడి ముందు వీధిలో ఖాళీ స్థలంలో మురుగునీరు చేరుతోంది. దుర్వాసన వస్తోంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. - చిన్నయ్య

✓ పరిశీలించి చర్యలు చేపడతాం. - డాక్టర్ చైతన్య, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి

? నగరంలోని పదారుపల్లి రోడ్డు హాస్టల్ ప్రాంతంలో విద్యుత్తు స్తంభాల కంటే చెట్లు ఎక్కువ ఎత్తులో ఉన్నాయి. - కృష్ణయ్య

✓ సిబ్బందిని పంపి పరిశీలన చేయించి విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం ఇస్తాం. - వైవో నందన్, కమిషనర్

- న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్, నవాబుపేట)

ఉత్తమ సేవలతో గుర్తింపు

అధికారుల నుంచి సత్కారం అందుకుంటున్న ఏఈ మున్వర్

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: విధుల్లో ఉత్తమ సేవలతోపాటు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఇంజినీర్ విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర, సంగీతరావు, జేసీస్ చైర్మన్ బాబూరావు అభిప్రాయపడ్డారు. డివిజన్ ఇంజినీర్ల జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి పలు ఉద్యోగులను నడిపించిన మున్వర్ ఉద్యోగ విరమణ సభను గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించి సత్కరించారు. సభకు ఇంజినీర్ల జిల్లా నాయకుడు ఖాదర్‌బాషా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జిల్లాలో అన్ని మండలాలు, అమరావతి నుంచి ఇంజినీర్లు, నాయకులు హాజరయ్యారు.

శ్రీహరి రాయల్ కుటుంబానికి అండగా ఉంటా

నెల్లూరు(మార్కెట్ సెంటర్): రాయలసీమ కాపు విమోచన సమితి అధ్యక్షుడు, తెదేపా నేత వెలిశెట్టి శ్రీహరి రాయల్ అనారోగ్యంతో మృతి చెందారు. మంత్రి నారాయణ ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి.. అండగా ఉంటామన్నారు.

దృష్టి సారిస్తేనే భక్తులకు దర్శనం

బారాషహీద్ దర్గాలో ఇవీ సమస్యలు

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

బారాషహీదుల గంధ మహోత్సవాన్ని తిలకించిన తర్వాత భక్తులు అమరవీరుల సమాధుల దర్శనం కోసం కోసం బారికేడ్లలో గంటల తరబడి భక్తులు వేచి ఉంటున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు వచ్చినప్పుడు దర్శనాన్ని నిలిపి వేయకుండా భక్తులకు దర్శనం కల్పించాలి. ఈ ఏడాది 80 మందితో జంబో పండగ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులంతా దర్గాలో కాకుండా ఆవరణంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లలో పాల్గొనాలి. గంధ మహోత్సవంలో భాగంగా ఫాతెహా సమయంలో దర్గా కమిటీ సభ్యులు, నాయకులు, పోలీసులతో దర్గా నిండిపోతుంది. అలా కాకుండా ముఖ్యమైన వ్యక్తులనే లోపలకు అనుమతించి కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి దర్గాలోకి వెళితే భక్తులకు గంధం అందడం లేదు. గంధం తీసుకొచ్చిన వారే పంచకుండా బిందెలను తీసుకెళుతున్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులు ప్రత్యేకంగా గంధాన్ని తయారు చేయించి భక్తులకు పంచి పెట్టాలి. కొందరు పోలీసులు, ప్రజాప్రతినిధులు తమ అనుచరులను, బంధువులను దర్గాలో నుంచి భక్తులు బయటకు వచ్చే ద్వారం నుంచి లోనికి పంపుతున్నారు. దీనిని అడ్డుకోవాలి.

బారాషహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా 12 మంది అమరవీరులను దర్శించుకునేందుకు చుట్టుపక్కల జిల్లాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా నెల్లూరుకు చేరుకుంటున్నారు. ఈనెల ఆరో తేదీ నుంచి నిర్వహించనున్న పండగ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏర్పాటు చేసిన క్యూలైన్

గుడారాల సంఖ్య పెంచాలి..

ఈ ఏడాది 15 లక్షల మంది భక్తులు రానున్నట్లు అంచనా. తాత్కాలిక గుడారాల సంఖ్య భారీగా పెంచాలి. దర్గా చుట్టుపక్కల ఉన్న భవనాలను వినియోగించుకుంటే మేలు జరుగుతుంది. వాహనాలు దర్గా ఆవరణలోకి రాకుండా బయటే పార్కింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టాలి. కొందరు పోలీసులు బోర్డులు పెట్టుకుని కార్లలో కుటుంబ సభ్యులు, బంధువులను దర్గా ఆవరణలోకి తీసుకొస్తున్నారు. ఎక్కడ చూసినా పోలీసు స్టిక్కర్లతో ఉన్న కార్లు, ద్విచక్రవాహనాలు నిలిపేస్తున్నారు. అటువంటి వాటిని ఎస్పీ నిరోధించాలి. ముఖ్యమైన ప్రదేశాలు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు తెలిపేలా మార్గ సూచికలు ఏర్పాటు చేయాలి.

బలవంతపు వసూళ్లు..

అమరవీరుల సమాధుల మధ్య కొందరు నియాజ్ డబ్బులంటూ రూపాయిని రూ.వందకు విక్రయిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాలి. భక్తులు కొబ్బరి కాయలు స్వయంగా కొట్టుకునేలా ఏర్పాట్లు చేయాలి. దర్గా లోపల ముజావర్లు కాకుండా బయటి వ్యక్తులు మకాం వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. దర్గా ఆవరణంలో ఏటా ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే యువతులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జనహిత వాత్సల్యకు విరాళం

నెల్లూరు(టౌన్): కుటుంబ సభ్యులు, దాతల సహకారంతో వాత్సల్య పిల్లలకు విద్యలో తోడ్పాటునందిస్తున్నట్లు కిమ్స్ ఆసుపత్రి చిన్నపిల్లల గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ సీఏస్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నెల్లూరు వనంతోపు సెంటరులోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో తల్లిదండ్రులు లేని అనాథ బాలల మధ్య పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఆశ్రమానికి రూ. 50వేలు చెక్కును యాజమాన్యానికి అందించారు. కార్యక్రమంలో ఏపీ హెచ్ఐ అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఆశ్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, పుల్లారెడ్డి, సి.రమాదేవి, వి.నందకిషోర్ బాబ్జి, హేమలత, పరిమళ పాల్గొన్నారు.

దుర్గగుడిలో బ్యాగు చోరీపై కేసు నమోదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గగుడిలో దర్శనానికి వచ్చి క్లాక్ రూమ్‌లో భద్రపరిచిన బ్యాగు చోరీ గురి కావడంపై వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జూన్ 30న నెల్లూరుకు చెందిన వంశీకృష్ణ అనే వ్యక్తి బ్యాగును భద్రపరచి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి బ్యాగు కనిపించకపోవడం, నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈలోగా బ్యాగ్‌లో ఉన్న పోను, రూ.5వేలు నగదు, పవర్ బ్యాంకు ఉన్నాయని చెప్పగా నిర్వాహకులు నగదు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. బాధితుడు అంగీకరించడంతో ఆసమయంలో విధుల్లో ఉన్న గున్నపురెడ్డి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: బారాషహీద్ దర్గా రొట్టెల పండగలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం కల్పించి, పార్కింగ్ స్థలాల్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. రొట్టెల పండగకు వచ్చే భక్తుల వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలను, బయో మరుగు దొడ్లను పరిశీలించారు.

కాలువలు లేక కష్టాలు

భక్తవత్సల నగర్‌లోని బ్యాంకు కాలనీలో కాలువల నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన చోట ఇవి లేక ఇళ్ల నుంచి మురుగునీరు వెళ్లే మార్గం లేదు. దీంతో వీధుల్లో చేరుతోంది. సంపూర్ణ స్మార్ట్ రోడ్డులో కాలువ పరిస్థితి అధ్వానంగా ఉండటంతో మురుగునీరు ముందుకుపోక దుర్వాసనతో అల్లాడుతున్నామని స్థానికులు తెలిపారు. అధికారులు కాలువలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

ఇక్కడ జర భద్రం



నెల్లూరు ట్రంకురోడ్డు నుంచి ఆంజనేయస్వామి గుడి మీదుగా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే తిప్పరాజువారివీధిలో మ్యాన్‌హోల్‌పై ఉన్న జాలి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపైనే ఉండటంతో పాదచారుల కాలికి తగిలి దెబ్బలు తగులుతున్నాయి. ద్విచక్రవాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

బోర్డే బస్టాప్..

నగరంలో ఏసీ బస్టాపులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు సేవలందిస్తుండగా.. ఇంకా పాత పద్ధతిలోనే పొదలకూరు రోడ్డులోని క్యాన్సర్ ఆసుపత్రి ఎదుట రెండు కర్రలతో బస్టాప్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డు మీద బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పొదలకూరు, కలువాయి, కల్లూరు తదితర మండలాలకు ఈ ప్రాంతం మీదుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

రోజులతరబడి మురుగు నిల్వ

నెల్లూరు రూరల్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్ ప్రధాన రహదారి వెంట ఉన్న పెద్ద కాలువ ఇది. పంట కాలువ అనుకుంటే పొరబడినట్లే. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సమీప నివాసాల మురుగు, వ్యర్థ జలాలు రహదారి పక్కనే చేరి మడుగులా దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్లుగా కాలనీలో సమస్య నెలకొనడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉంటోందని వారు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : నగరంలోని కొండాయపాళెం మున్సిపల్ పాఠశాలలో గురువారం మనబడి మహాన్యూస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో బాలాజీ రావు, ఎస్ఎస్ఏ అధికారి సుధీర్‌బాబు మాట్లాడుతూ పాఠశాలకు మహాన్యూస్ ఛైర్మన్ రూ. లక్ష ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు, ఖాజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం రామచంద్రారెడ్డి భవన్‌లో సమ్మె గోడ పత్రాలు ఆవిష్కరించారు. సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, అధ్యక్షుడు శ్రీనివాసులు, మూలం ప్రసాద్, రాంబాబు, సుధాకర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

In The Court of The I Addl. Junior Civil Judge: Nellore
O.S.No. 1121 / 2023
Shaik Junned Basha - Plaintiff
Vs
1. Sk. Tasleem and another - Defendants
Notice
To
D1. Sk. Tasleem S/o. Jani Basha
D2. Sk. Noorjahan @ Noori W/o. Sk. Tasleem.
D1 & D2 are residing at 2/212, Ramakotaiah Nagar, Podalakur Road, Nellore City.
పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తేది: 17-07-2025కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎ.వెంకట మురళీకృష్ణ, బి.ఎ., బి.ఎల్., వాది తరఫు అడ్వకేట్, నెల్లూరు.

సీఎం చంద్రబాబును ఆశీర్వదించండి

తెదేపాలో చేరిన వారితో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ.. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధి 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డ్ కాలనీలో సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అరవ శాంతి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గంగాధర్, రాఘవేంద్రరావు, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● 18వ డివిజన్‌కు చెందిన స్థానిక నాయకులు రజిని, రమణమ్మ, గౌరి, జయ, శైల, రత్నమ్మ, అరుణ, చిన్నా, శివ, మహేష్ తదితరులు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో తెదేపాలో చేరారు. వారికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

డీకే కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న వి.సమతకు ద్రవిడ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఎంవీ శ్రీనాథ్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందించారు. ఆమెను గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అధ్యాపకులు అభినందించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నెల్లూరు(విద్య): బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు వస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం విద్యుత్తు అందించేలా ప్రాంగణంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని ఎస్ఈ వి.విజయన్ పేర్కొన్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీధర్, డీఈఈ అశోక్, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

నెల్లూరు(మార్కెట్ సెంటర్): సర్వేపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం సర్వేపల్లి అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాల్లో వృద్ధిరేటు సాధించేలా రైతులకు వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ పరిధిలో హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. గురువారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో హౌసింగ్, టిడ్కో విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. రవాణా సౌకర్యం, విద్యుద్దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామమోహనరావు, ఈఈ రహంతుజానీ, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచండి

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండులో ఔట్ సోర్సింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. హాజరైన సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

In The Court of The IV Addl. District Judge: Nellore
A.S.No. 114 / 2023
Thandra Srinivasulu - Appellant
Vs
1. Krishnapatnam Infratech Pvt. Limited.,
2. Vemuri Venkata Satya Narayana Murthy - Respondents
Notice to 1st Respondent
Krishnapatnam Infratech Pvt. Limited., having its office at Road No. 10, Jubilee Hills, Hyderabad. Represented by its Senior Manager Ghanta Venugopal S/o Sambasiva Rao, residing at Magunta Layout, Nellore City
పై నెంబరున అప్పిలెంట్ తేది: 11-04-2023న నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు O.S. No. 214/2018 అను దావాలో ఇచ్చిన తీర్పు మీద పై తెలిపిన కోర్టులో మీపై అప్పీలు దాఖలుచేసి యున్నారు. సదరు అప్పీలులో మీకు నోటీసు నిమిత్తం తే 15-07-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
Sk. నన్నే సాహెబ్, B.Com., B.L.,
Sk. రియాజ్ బాషా, B.A.L., B.L.,
అప్పిలెంట్ తరఫు అడ్వకేట్స్, నెల్లూరు.

నగదు దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

నెల్లూరు(నేర విభాగం): ఒంటరిగా వెళ్లే వారిని కత్తితో బెదిరించి నగదు దోపిడీకి పాల్పడే ఇద్దరిని వేదాయపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను గురువారం పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు వెల్లడించారు. కొండాయపాలేనికి చెందిన గల్లా విక్సన్, అదే ప్రాంతానికి చెందిన రౌడీ షీటరు గిద్దలూరు గోవర్ధన్ అలియాస్ గోవాలు చెడు వ్యసనాలకు బానిసై దొంగలుగా అవతారమెత్తారు. గతనెల 25న నెల్లూరులోని వనంతోపు సెంటరులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సార్ అనే వ్యక్తిని నిందితులు కత్తితో బెదిరించి ఫోను పే నుంచి రూ.వెయ్యి వేసుకొని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం పడారుపల్లి వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రతిభ కనబరిచిన ఎస్సై డీఎస్ విజయకుమార్, సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

నగరంలోని పడారుపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మినీ బైపాస్ నుంచి పడారుపల్లి ప్రారంభంలో ఉన్న మ్యాన్‌హోల్‌పై సిమెంట్ మూతలు పగిలిపోయాయి. ఇది రాత్రిపూట వాహనదారులకు, పాదచారులకు కానరాక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కొత్త సిమెంట్ మూతలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

కచ్చితత్వంగా ల్యాబ్ పరీక్షలు

మాట్లాడుతున్న రామనాథరావు

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), న్యూస్‌టుడే: కీటక జనిత వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని మలేరియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు తెలిపారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్‌టెక్నీషియన్లతో గురువారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ల్యాబ్ పరీక్షలు కచ్చితత్వాన్ని మెరుగుపరచాలని తెలిపారు. ప్రామాణిక ప్రయోగశాల విధానాలతో ప్రభుత్వ ఎస్ఎస్‌హెచ్ ల్యాబ్‌ను కూడా అభివృద్ధి చేయాలన్నారు. డీఎల్ఏటీవో ఎస్‌కె.ఖాదర్‌వలి మాట్లాడుతూ.. క్షయ నిర్ధారణ పరీక్షలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ ఛైర్మన్‌కు నివాళి

నెల్లూరు(మార్కెట్ సెంటర్): నెల్లూరు నగరం పొదలకూరురోడ్డులోని రామకృష్ణ నర్సింగ్ హోంలో జడ్పీ మాజీ ఛైర్మన్ డాక్టర్ బాలచెన్నయ్యకు పలువురు నాయకులు నివాళులర్పించారు. అనారోగ్యంతో ఆయన ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి, నాయకులు బాలసుధాకర్, స్వర్ణ వెంకయ్య, ఏసునాయుడు బలరాం నాయుడు తదితరులు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

అపరిష్కృతంగా పింఛనుదారుల సమస్యలు

విశ్రాంత ట్రెజరీ అధికారి అహ్మద్ దంపతులను సన్మానిస్తున్న ప్రభుత్వ పింఛనుదారులు

నెల్లూరు (విద్య): ప్రభుత్వాలు మారుతున్నా ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని స్టేట్ గవర్నమెంట్ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ అన్నారు. గురువారం బీవీనగర్‌లోని ఆ సంఘ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పింఛనుదారులకు రావాల్సిన బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన జిల్లా ట్రెజరీ అధికారి అహ్మద్ దంపతులను సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ ఉద్యమ నేత బాబురెడ్డి, ట్రెజరీ అధికారి గంగాద్రి, సంఘ ఉపాధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి చేయూత

నెల్లూరు(మార్కెట్ సెంటర్): నెల్లూరు తల్పగిరి కాలనీలోని స్వర్ణదీపం ఛారిటబుల్ ట్రస్ట్ అనాథ శరణాలయానికి ఇస్కపాలెంకు చెందిన తెదేపా నేత వల్లూరు బాబురెడ్డి, వసుదర్‌రెడ్డి రూ. 30వేల విలువజేసే బియ్యం, నిత్యావసరాలు గురువారం అందించారు. వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి మంత్రి పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

ప్రకటన

నా కక్షిదారుని సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా, నా కక్షిదారుడు దిగువ షెడ్యూలు దాఖలా భూమిని కొనుగోలు చేయుటకు గాను తీర్మానించుకొనినారు. షెడ్యూలు దాఖలా య.3.20 ట్లు భూమిని బద్దెపూడి శ్రీహరి రావు గారు తేది 12-03-1970 న మరియు తేది 22-04-1972 గల రెండు వేర్వేరు విక్రయ పత్రములు డాక్యుమెంటు నెం. 427/1970 రు మరియు 1073/1972 రు ల ద్వారా కొనుగోలు చేసినారనియు, సదరు బద్దెపూడి శ్రీహరి రావు మరియు అతని కుమారులు షెడ్యూలు దాఖలా య.3.20 ట్ల లో నుండి తూర్పు పార్శ్వం య. 1.20 ట్లు తేది 03-12-2003 న డాక్యుమెంటు నెం. 14286/2003 రు ద్వారా రసం రామకృష్ణారెడ్డి గారికి విక్రయించినారనియు సదరు రసం రామకృష్ణారెడ్డి గారు పై తెలిపిన య 1.20 ట్ల లో నుండి తూర్పు వైపు య. 1.00 ట్ల భూమిని తేది 07-01-2004 దిన డాక్యుమెంటు నెం. 226/2004 రు ద్వారా మెట్టుకూరు శ్రీనివాసులు గారికి విక్రయించినారనియు సదరు బద్దెపూడి శ్రీహరి రావు మరియు వారి కుమారులు షెడ్యూలు దాఖలా య.3.20 ట్లలో నుండి పడమర పార్శ్వం య.2.00 ట్ల భూమిని వద్లమూడి రాజాముని ప్రత్యూష్ గారికి తేది 03-12-2003 న డాక్యుమెంటు నెం. 14287/2003 రు అను విక్రయ పత్రము ద్వారా విక్రయించినారనియు సదరు విక్రయ పత్రములలో డాక్యుమెంటు నెం. 427/1970 రు మరియు నెం. 1073/1972 రు గల ఒరిజినల్ విక్రయ పత్రములు పోయినవనియు సదరు విషయమై పేపరు ప్రకటనలు ఇచ్చి పోలీసు వారి నుండి నర్టిఫికేటు కూడా పొందియున్నారని తెలియజేయుచున్నారు. కావున నా కక్షిదారుడు దిగువ షెడ్యూలు ఆస్థిలో నుండి య.2.00 ట్లు వద్లమూడి రాజాముని ప్రత్యూష్, తండ్రి మునిప్రసాద్ వద్ద నుండి, య.1.00 ట్ల మెట్టుకూరు శ్రీనివాసులు తండ్రిలేట్ రమణారెడ్డి గారి వద్ద నుండి మిగిలిన య.0.20ట్ల భూమిని రసం రామకృష్ణారెడ్డి, తండ్రి హరి రెడ్డి గార్ల వద్ద నుండి కొనుగోలు చేయుటకు తీర్మానించుకొనినారు.

కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎవరికైననూ ఎట్టి హక్కులు కానీ, ఆడుమానములు కానీ, ఛార్జీలు కానీ మరి ఏ ఇతరములైన అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుండి 10 దినములలో దిగువ అడ్రసుకు వ్రాతమూలకమైన ఆధారములతో తెలుపగలరు. పై గడుపు లోపల ఎట్టి అభ్యంతరములు రాని యెడల నాకక్షిదారుడ దిగువ షెడ్యూలు ఆస్థిని కొనుగోలు చేసేదరు తదుపరి వచ్చు అభ్యంతరములు నా కక్షిదారుడ్ని బద్ధగించవు.

ఆస్థి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుజబుజ నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కనుపర్తిపాడు గ్రామములో సర్వే నెం. 315/1-1 రు లో య.3.20 ట్ల భూమికి హద్దులు : **తూర్పు:** పొరుదల కాలువ, **దక్షిణం:** ఈదూరు వేమయ్య భూమి, **పడమర:** సర్వేపల్లి కాలువకట్ట, **ఉత్తరం:** చెముదుగుంట పెంచలయ్య మరియు పంబడి దాసు గారి భూమి.

యస్. శ్రీనివాసమూర్తి, B.A., B.L., అడ్వకేట్
16/1085, ట్రంకురోడ్డు, నెల్లూరు.

జాతీయ సదస్సులో డిప్యూటీ మేయర్

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రం గురుగ్రామ్‌లో నిర్వహించిన పట్టణ, స్థానిక సంస్థల ప్రతినిధులు జాతీయ స్థాయి సదస్సులో నెల్లూరు నగరపాలకసంస్థ డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్ ఇంతియాజ్ పాల్గొన్నారు. గురు, శుక్రవారాల్లో జరగనున్న సదస్సును హరియాణా శాసనసభ స్పీకర్ హర్వీందర్ కల్యాణ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్, కేంద్రమంత్రి మనోహర్‌లాల్ హాజరయ్యారు.

వృత్తినైపుణ్యాలతో రాణింపు

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: విద్యార్థులు వృత్తినైపుణ్యాలను పెంచుకోవాలని డీకే ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి పేర్కొన్నారు. గురువారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'స్వావలంబన కలిగిన యువత కోసం ఒక దార్శనికత' కార్యక్రమాన్ని ఆసుపత్రి డైరెక్టర్ బొల్లినేని భాస్కరరావు వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు నేడు మంచి అవకాశాలు ఉన్నాయని వీటిని అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐవో వరప్రసాద్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో.. రాకపోకలకు ఇక్కట్లే

న్యూస్‌టుడే, నెల్లూరు(బారకాసు)

మార్కెట్‌లో నిలిపిన వాహనాలు

నగరంలోని చేపల మార్కెట్లులో వినియోగదారులకు సమస్యలు తప్పడం లేదు. ఇక్కడ నిత్యం రూ.కోటికి పైగా లావాదేవీలు జరుగుతుంటాయి. పెద్దబజారు సమీపాన డైకస్ రోడ్డు వద్ద దాదాపు రూ.3 కోట్లతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో మార్కెట్‌ను పునరుద్ధరించారు. దీనిపై ఆధారపడి 200కి పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ పర్యవేక్షణ కొరవడింది. ప్రత్యేకాధికారులు, సిబ్బంది తొలుత చూపిన శ్రద్ధ ప్రస్తుతం లేదు. ఆదివారం వేలాది మంది వినియోగదారులు ఇక్కడకు వస్తుంటారు. లోనికి వెళ్లాలంటే సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి నుంచి లోపల వరకు ఎటుచూసిన వాహనాలు నిలిపి ఉంచడంతో పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొందరు మార్కెట్‌లోకే మోటారు సైకిళ్లతో వస్తున్నారు. నడిచే మార్గంలోనే వ్యాపారం సాగిస్తున్నారు. పలుచోట్ల నీరు ఆగిపోయి అపరిశుభ్రత నెలకొంది. కొంత మంది నీటిని వృథా చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

తుది దశకు చేరిన రహదారి

పల్లె పండగ బిల్లులకు మోక్షం

● తొలి విడత కింద రూ.26.50 కోట్లు విడుదల

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద పల్లెల్లో సీసీరోడ్లు, కాలువలు, మినీ గోకులాలు తదితర నిర్మాణ పనుల బకాయి బిల్లులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎనిమిది నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించి తొలి విడతగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పల్లె పండగ పేరుతో గతేడాది అక్టోబర్‌లో పల్లెల్లో ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద 1,172 పనులకు రూ.125.99 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 1,648 పనులు దాదాపు పూర్తి చేశారు. రూ.115.59 కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. తొలి విడతగా ప్రభుత్వం రూ.26.50 కోట్లు విడుదల చేసింది. పనులు చేసిన వారి ఖాతాల్లోకి గురువారం నుంచి జమ అవుతున్నాయి. బిల్లులు దశల వారీగా చెల్లిస్తామని డ్వామా పీడీ విజయప్రసాద్ తెలిపారు.

18 మండలాల్లో వర్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో బుధవారం రాత్రి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా గుడిబండలో 17.4 మి.మీ., అత్యల్పంగా బత్తలపల్లిలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కనగానపల్లి 14.2, హిందూపురం 11.8, మడకశిర 10.0, పరిగి 9.4, చిలమత్తూరు 9.4, ముదిగుబ్బ 8.4, పుట్టపర్తి 8.4, రామగిరి 6.8, అమరాపురం 6.2, రొళ్ల 5.4, ధర్మవరం 4.6, లేపాక్షి 4.0, అగళి 3.2, పెనుకొండ 2.4, కొత్తచెరువు 1.6, బుక్కపట్నం 1.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

అడిగేదెవరు.. తరలించేయ్

■ యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి పట్టణ పరిసరాల్లో యంత్రాలతో కొందరు మట్టి తవ్వి తరలిస్తున్నారు. రాత్రింబవళ్లు మట్టి దోపిడీ చేస్తున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారిలోని రెడ్డికుంట చెరువులో పొక్లెయిన్‌తో మట్టి తవ్వి టిప్పర్లతో అక్రమంగా రవాణా చేస్తున్నారు. దాంతో పాటు కర్ణాటకనాగేపల్లి, కోవెలగుట్టపల్లి, బీడుపల్లి గుట్టల నుంచి కూడా రోజూ అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ముదిగుబ్బ నుంచి బాగేపల్లి వరకు నూతనంగా నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి పనులను అడ్డంగా పెట్టుకుని కొందరు దందా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చెరువులో మట్టిని అక్రమంగా తరలించకుండా తగు చర్యలు తీసుకుంటామని జేఈ సుధాకర్‌రాజు తెలిపారు.

రెడ్డికుంట చెరువులో మట్టి తవ్వకం

కరవుసీమకు పరిశ్రమల కవచం!

యువతకు ఉపాధి, ప్రాంతాల అభివృద్ధికి దోహదం

ఈనాడు, పుట్టపర్తి -హిందూపురం, న్యూస్‌టుడే: కరవుకు పర్యాయంగా మారిన ఉమ్మడి అనంత జిల్లాకు పరిశ్రమల రాక వరంగా కానుందంతో ఈ ప్రాంత ప్రగతి కొత్త పుంతలు తొక్కనుంది. వేలాది మంది యువతకు ఉపాధి అందుబాటులోకి రావడంతోపాటు పరిసర ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తెదేపా సర్కారు 2017లో పెనుకొండకు కియా పరిశ్రమ తీసుకురావడంతో ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. 2015లో గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్, బెల్ ఏర్పాటు రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయి. వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పరిశ్రమల ఏర్పాటుకు ఆకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో ఐదేళ్లలో ఒక్క ప్యాక్టరీ ఏర్పాటు కాలేదు. ఏడాది కిందట కూటమి ప్రభుత్వం రావడంతో పలు పరిశ్రమల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది.

పెట్టుబడుల వరద..

ఉమ్మడి అనంత జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీటి వనరులు, మెరుగైన రవాణా సదుపాయాలు, బెంగళూరు మహానగరానికి దగ్గరగా ఉండటం.. తదితర అంశాలు కలిసొస్తుండటంతో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

★ అనంతపురం జిల్లా రాప్తాడు సమీపాన తెదేపా హయాంలో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తరువాత వైకాపా ప్రభుత్వంలో స్థానిక నాయకులు కొందరు బెదిరింపులకు దిగడంతో సదరు పరిశ్రమ తెలంగాణకు తరలిపోయింది. ప్రస్తుతం రేమాండ్ వస్త్ర పరిశ్రమ 26.87 ఎకరాల్లో రూ.330 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈమేరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాదాపు 3 వేల మందికి ఉపాధి లభించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

★ కళ్యాణదుర్గం సమీపంలోని తిమ్మసముద్రం వద్ద 121 ఎకరాల్లో జివిన్‌ప్రో సంస్థ రూ.11,500 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి దక్కనుంది.

ఆటోమొబైల్, సోలార్..

★ శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి వద్ద 24 ఎకరాల్లో ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్, చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద 24 ఎకరాల్లో ఏరో స్పేస్ యూనిట్లను మరో రూ.650 కోట్లతో ఏర్పాటు చేయనుంది. రేమాండ్ సంస్థ మూడు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాదాపు రూ.1000 కోట్లతో 6,500 మందికి ప్రత్యక్షంగా, మరో 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

★ మడకశిరలోని ఆర్.అనంతపురం గ్రామ సమీపంలోని ఏపీఐఐసీ భూముల్లో భారత్ ఫోర్ట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు 1,000 ఎకరాలు కేటాయించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.2,400 కోట్లు పెట్టేందుకు కంపెనీ సిద్ధంగా ఉంది. దీనివల్ల 1,500 మందికి ఉపాధి దక్కనుంది.

★ మడకశిర మండలం కళ్లుమర్రి, బుల్లసముద్రం, తడకలపల్లి, హరేసముద్రం పంచాయతీల పరిధిలో దాదాపు 5 వేల ఎకరాల్లో రూ.7,500 కోట్లతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం నవయుగ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకుంది. దీనివల్ల 2 వేలమందికి పైగా ఉపాధి లభించనుంది.

10న హెచ్చెల్సీకి నీరు విడుదల

అనంతపురం (శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు (టీబీ హెచ్చెల్సీ) ఈనెల 10న నీరు విడుదల చేయనున్నారు. అదే రోజే కర్ణాటక పరిధిలోని హెచ్చెల్సీ ఆయకట్టుకు వదలనున్నారు. ఇప్పటికే టీబీ బోర్డుకు ఇక్కడి అధికారులు ఇండెంట్ ఇచ్చారు. తొలుత ఈనెల 15 నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే తుంగభద్ర నుంచి దిగువకు జలాలను వదిలేసిన సంగతి తెలిసిందే. గురువారం సైతం 20 క్రస్ట్ గేట్ల ద్వారా 60వేల క్యూసెక్కుల దాకా నదిలోకి వదిలేశారు. ఈక్రమంలోనే హెచ్చెల్సీ ప్రధాన కాలువకు ఐదు రోజుల ముందే నీటిని తీసుకోవాలని నిర్ణయించారు.

వాటా 18.396 టీఎంసీలు: క్రస్ట్ గేట్ల భద్రత, మరమ్మతుల కారణంగా పూర్తి స్థాయిలో నిల్వ చేయడం లేదు. 80 టీఎంసీలకు మించి నిల్వ ఉంచే పరిస్థితి లేదని ఇప్పటికే టీబీ బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్రలో 78.239 టీఎంసీలు ఉన్నాయి. గురువారం 26,718 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రానున్న రెండు రోజుల్లో 70వేల నుంచి 80వేల క్యూసెక్కుల దాకా డ్యాంలోకి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉంది. బుధవారం రాత్రి తుంగ డ్యాం నుంచి ఏకంగా 60వేల క్యూసెక్కులు దిగువకు వదిలేశారు. ఈదఫా 120 టీఎంసీల లభ్యం అవుతాయని అంచనా వేశారు. హెచ్చెల్సీ వాటాగా 18.396 టీఎంసీలను కేటాయించారు. మరో వైపు ప్రధాన కాలువ 137.702 కి.మీ. వద్ద యూటీ పైకప్పులు పూర్తి అయ్యాయి. దీంతో నీటి విడుదలకు ఆటంకం ఉండదని భావిస్తున్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం : మంత్రి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను నిర్దేశించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో పీ4పై అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. పీ4లో చేపట్టాల్సిన అంశాలపై మంత్రి అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే అభివృద్ధి సాధించగలమన్నారు.

సగం ధరకే కొత్త బైక్

■ హైదరాబాద్‌లో పాతవి కొనుగోలు చేసి విక్రయం ■ వెలుగులోకి వచ్చిన నయా దందా

ఈనాడు- అనంతపురం, న్యూస్‌టుడే - తాడిపత్రి: సగం ధరకే కొత్త బైక్‌ల విక్రయిస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టించిన కేటుగాళ్ల గుట్టు బట్టబయలైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మందిని మోసం చేసిన ముఠా సభ్యుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన ముఠా జీరో డౌన్ పేమెంట్ల విధానంలో వివిధ సంస్థలకు చెందిన బైకులను షోరూమ్ నుంచి కొనుగోలు చేస్తున్నారు. బైక్ కొంటున్న సమయంలో నకిలీ ఆధార్, పాన్ కార్డులతోపాటు తప్పుడు వివరాలు సమర్పిస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీల్లో పనిచేస్తున్న కొందరితో కుమ్మక్కై రుణాలు సైతం పొందుతున్నారు. ఒకటి, రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత బైక్ దొంగతనం జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ బైకులను వివిధ మార్గాల్లో అనంతపురం జిల్లాకు తీసుకొచ్చి తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇక్కడున్న కొందరు మధ్యవర్తులను భాగస్వాములుగా చేసుకుని స్థానికంగా తక్కువ ధరలకే బైకులు అంటగట్టినట్లు తెలుస్తోంది. తక్కువ ధరకే కొత్త బైకులు వస్తుండడంతో చాలామంది ముందు వెనుకా చూడకుండా కొనుగోలు చేశారు. ఇలా హైదరాబాద్‌కు చెందిన ముఠా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 2 వేల బైక్‌లు విక్రయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మూలాలను ఛేదించేందుకు ఆరుగురిని అనంతపురం పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఈ స్కాంకు పాల్పడుతున్న కొందరిని గుర్తించారు. మిగిలిన వారికోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

తాడిపత్రి పోలీస్‌స్టేషన్లో రికవరీ చేసిన ద్విచక్రవాహనాలు

నంబరు ప్లేట్లు మార్చేసి..

అనంతపురం జిల్లాలో కొందరికి కొత్త బుల్లెట్ కంపెనీ బైక్‌ను రూ.45 వేలకు, వెయ్యి కిలోమీటర్లు కూడా తిరగని బైక్‌లను రూ.30 వేలకే విక్రయించారు. ఇంకా రిజిస్ట్రేషన్ కాని బైక్‌లను సైతం సెకండ్ హ్యాండ్ పేరుతో అమ్మేశారు. కొనేవారికి అనుమానం రాకుండా ఓఎల్ఎక్స్‌లోని పాత బైక్ నంబర్లను సేకరించి కొత్తవాటిని బిగించేశారు. అత్యవసరంగా డబ్బులు కావాలంటే.. వేరే ఊరికి బదిలీపై వెళ్తున్నానని మాయమాటలు చెప్పి అమాయకులకు బైకులను అంటగట్టారు. ఇలా ఒక్క తాడిపత్రిలో 100కు పైగా బైకులు అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. అనంతపురం, తాడిపత్రి ప్రాంతాల్లో ఇప్పటివరకు 100కు పైగా ద్విచక్ర వాహనాలను రికవరీ చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

శాంతినారాయణకు పురస్కారం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: అనంత జిల్లాకు చెందిన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ శాంతినారాయణ తెలంగాణలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. వివిధ రంగాలకు చెందిన 12 మంది ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. నవల/కథా రచన విభాగంలో శాంతినారాయణ ఎంపికయ్యారు. ఈ విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆయన ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ఆయన ఇనుపగజ్జెలతల్లి, పల్లేరుముల్లు, పెన్నేటీ మలుపులు, నాగలకట్ట సుద్దులు వంటి ఎన్నో రచనలు చేశారు. ఉపాధ్యాయుడిగా, జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా, డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేసి పదవీవిరమణ చేశారు. యువ రచయితలను ప్రోత్సహించడానికి విమల శాంతి సాహిత్య సేవా పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. ఈ మేరకు అభ్యుదయ రచయితల సంఘం, ఉమ్మడిశెట్టి సాహిత్య ట్రస్టు, జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, సాహిత్య భారతి, స్పందన సాహితీ ప్రమతి, మానవత, ఉమర్ అలీషా సాహిత్య సంస్థ, తెలుగు భాషా సంరక్షణ సమితి, తపన సాహిత్య వేదిక తదితర సంస్థలు శాంతినారాయణకు శుభాకాంక్షలు తెలిపాయి.



వార్షిక రుణ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో ప్రజా అవగాహన పెంచాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విజయవాడ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్, జేసీ అభిషేక్‌కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ4, ఎస్‌హెచ్‌జీలకు అన్యువల్ క్రెడిట్ లైవ్‌హుడ్ యాక్షన్ ప్లాన్, మైక్రో క్రెడిట్ ప్లాన్, బాల సంజీవని, సోలార్ ప్రాజెక్టుల భూసేకరణ, పీఎం సూర్యఘర్ తదితర అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ బృందాలకు జీవనోపాధి వార్షిక రుణ కార్యాచరణ ప్రణాళిక, లక్ష్యాలను ప్రణాళిక అమలుకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన పెంచుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సంబంధిత అధికారులను సూచించారు. జిల్లాలో చేపట్టిన సౌర ప్రాజెక్టులకు భూ సేకరణ వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, వ్యవసాయాధికారి సుబ్బారావు, డీపీవో సమత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ఎదుర్కోవడమెలా?

న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం): ప్రస్తుతం వాతావరణ మార్పులతో పాటు తాగునీరు కలుషితంతో మలేరియా, టైఫాయిడ్, డెంగి, అతిసారం తదితర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి? ఒకవేళ సోకినా ఏయే ప్రభుత్వ వైద్యశాలల్లో ఎలాంటి సేవలు అందిస్తారు. వైద్యపరీక్షలు, అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా.. తదితర అంశాలను మీరు తెలుసుకోవాలని అనుకుంటున్నారా.. అయితే మీకు 'ఈనాడు-మీతోడు' చక్కటి అవకాశం కల్పించనుంది. అనంతపురం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈ.బి.దేవితో ఫోన్‌లో నేరుగా మాట్లాడి.. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. సూచనలు, సలహాలు స్వీకరించవచ్చు. మీరు చేయాల్సిందల్లా కింద పేర్కొన్న నిర్ణీత తేదీన ఫోన్ నంబరుకు కాల్ చేయడమే..!

● ఫోన్ చేయాల్సిన తేదీ: 04-07-2025 (నేడే)
● సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
● నంబర్లు: 80085 73008, 08554-277434

తల, మొండెం వేరుచేసి.. దారుణహత్య

■ మూడురోజుల తర్వాత వెలుగులోకి ■ ముదిగుబ్బలో ఘటన

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలో విశ్వనాథ్ (43) దారుణ హత్యకు గురయ్యాడు. కొడవళ్లతో నరికి తల, మొండెం వేరుచేశారు. తలను దూరంగా విసిరేశారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన మూడు రోజుల కిందట ముదిగుబ్బలోని కదిరి రోడ్డులో ఉన్న బైపాస్ సమీప గుట్టలో జరిగింది. ఛిద్రమైన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. తనకల్లు మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన బుగిడె రామప్ప కుమారుడు విశ్వనాథ్ వ్యవసాయం చేసుకునేవాడు. 20 ఏళ్ల కిందట ఓబుళదేవరచెరువు మండలంలోని గాజుకుంటపల్లికి చెందిన శ్యామలతో వివాహం జరిగింది. వీరు కొన్ని రోజులు అత్తింట్లో ఉన్నారు. ఆ తర్వాత కదిరిలోని శివాలయం వీధిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. విశ్వనాథ్ మొదట ట్రాక్టర్‌ను నడిపి జీవించేవాడు. తర్వాత కదిరి సమీపంలో రెండెకరాల భూమిని లీజుకు తీసుకుని ప్రస్తుతం టమాటా పంట సాగు చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో భార్యతో చెప్పి ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లాడు. అతణ్ని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, ముదిగుబ్బ టౌన్ సీఐ శివరాముడు ఘటనా స్థలిని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. విశ్వనాథ్‌కు భార్య, ఇంటర్ చదువుతున్న కుమార్తె చైతన్య, 9వ తరగతి చదువుతున్న కుమారుడు సాయి ఉన్నారు. వీరిద్దరూ కడపలో చదువుతున్నారు.

ఘటనా స్థలిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, అంతర చిత్రంలో విశ్వనాథ్

పదిరోజుల కిందట స్కూటీ కొనుగోలు

ఓబుళదేవరచెరువు మండలంలోని హోండా షోరూంలో విశ్వనాథ్ పదిరోజుల కిందట స్కూటీ కొనుగోలు చేశారు. హత్య జరిగిన ప్రాంతంలో ద్విచక్ర వాహనం లేదు. అందులో ఆస్తికి సంబంధించిన పత్రాలు ఉన్నాయి. హత్యకు ఆస్తి తగాదాలా? అక్రమ సంబంధమా.. ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో చేరిన రామగిరి ఎస్సై

రామగిరి : రామగిరి మండలం ఎస్సై సుధాకర్ యాదవ్ దీర్ఘకాలిక సెలవు తరువాత గురువారం తిరిగి విధుల్లోకి చేరారు. దాదాపుగా 40 రోజుల పాటు సెలవుల్లో ఉండి తిరిగి విధుల్లోకి చేరారు. పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన వైకాపా కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి ఈ ఏడాది ఏప్రిల్ 8న వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్ సమావేశంలో ఎస్సైను ఉద్దేశించి మాట్లాడుతూ రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారని, ఒక సందర్భంలో పోలీసుల గుడ్డలు ఊడదీసి కొడతామని అప్పట్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాపిరెడ్డిపల్లి హెలిప్యాడ్ ఘటనలో పోలీసుల వైఫల్యం ఉందని మాజీ సీఎం జగన్‌తో పాటు స్థానిక మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఇతర వైకాపా నాయకులు పలు సందర్భాల్లో ఎస్సై సుధాకర్ యాదవ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన సంఘటనలు ఉన్నాయి.

తొట్టిని పూడ్చి.. రచ్చకట్టగా మార్చి

కొత్తచెరువు మండలంలోని తిప్పాబట్లపల్లిలో నీటి తొట్టిని రచ్చకట్టగా మార్చారు. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రానీస్ అధికారులు బస్టాప్‌లో ప్రధాన రహదారి పక్కనే దీన్ని నిర్మించారు. పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంకు ఉండటంతో కుళాయి కనెక్షన్ ఇచ్చి కొంతకాలం పశువుల దాహం తీర్చారు. ఆ తరువాత నీటి సరఫరా నిలిపివేయడంతో నిరుపయోగంగా మారింది. స్థానికులు కొందరు తొట్టిని మట్టితో నింపి కూర్చోవడానికి వీలుగా బండలు పరిచి రచ్చకట్టగా మార్చారు. పరిశీలించి, తొట్టిని వినియోగంలోకి తెస్తామని ఎంపీడీవో నటరాజ్ చెప్పారు.

\- న్యూస్‌టుడే, కొత్తచెరువు

నిందితులు అపహరించడానికి యత్నించిన హిటాచి వాహనం

ఓబుళాపురం గనుల్లో రక్షణ కరవు!

●రూ.30 కోట్లు విలువైన ఖనిజం దొంగలపాలు ●సీబీఐ సీజ్ చేసిన యంత్రాలపైనా కన్ను

రాయదుర్గం, డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: ఓబుళాపురం ఇనుప గనుల్లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజంతో పాటు యంత్రాలకూ రక్షణ లేకుండా పోతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓబుళాపురం గనుల్లో సీజ్ అయిన సుమారు లక్ష టన్నుల విలువైన ఖనిజాన్ని అప్పటి ప్రజాప్రతినిధి అండతో అమ్మేసుకున్నారు. ఐదేళ్లపాటు నిరంతరం సాగిన ఖనిజం చోరీని పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారు. తెదేపా నాయకులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖనిజం చోరీకి గురికావడం వాస్తవమేనని తేల్చారు. తర్వాత అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో దొంగతనాలు జరుగుతున్నాయి. సీబీఐ సీజ్ చేసిన టిప్పర్లు, పొక్లెయిన్లు, ఇతర వాహనాలను అక్కడికక్కడే తుక్కుగా మార్చి కర్ణాటకలో అమ్మేసుకుంటున్నారు. తాజాగా హిటాచి వాహనాన్ని దొంగలించిన ముఠా సభ్యులు తుక్కుగా మారుస్తుండగా పోలీసులు పట్టుబడ్డారు.

దొంగ చేతికే తాళాలిచ్చినట్లు..

ఓఎంసీలో అక్రమ మైనింగుకు పాల్పడినట్లు అభియోగాలు నమోదు కావడంతో సీబీఐ అక్కడున్న ఖనిజంతో పాటు యంత్రాలను 2011లో సీజ్ చేసింది. అప్పటి ప్రభుత్వ నిర్వాకం కారణంగా సీజ్ చేసిన వాటికి ఓఎంసీ కంపెనీ సిబ్బందిని కాపలాగా పెట్టారు. దీంతో దొంగ చేతికే తాళాలిచ్చినట్లు అయింది. గతంలో ఓఎంసీలో పనిచేసిన వ్యక్తి వైకాపా ప్రజాప్రతినిధిగా ఉండటంతో స్థానిక నాయకులు రెచ్చిపోయారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో టిప్పర్ల ద్వారా ఖనిజాన్ని ప్యాక్టరీలకు తరలించి జేబులు నింపుకున్నారు.

పట్టించుకోని పోలీసులు

ఖనిజం, యంత్రాలు చోరీకి గురవుతున్నా ఓఎంసీ కేసులో సాక్షిగా ఉన్న టపాల్ శ్యాంప్రసాద్ వైకాపా హయాంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరకు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఫిర్యాదు పై నిర్లక్ష్యం చేసిన అప్పటి సీఐ, ఎస్సైపై కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం వచ్చినా పోలీసుల్లో మార్పు కనిపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విడిభాగాలు చేస్తుండగా.. ఏడుగురి అరెస్టు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ మండలంలోని వివాదాస్పద ఓబుళాపురం ఇనుప గనుల ప్రాంతంలో సీబీఐ సీజ్ చేసిన హిటాచి వాహనాన్ని ధ్వంసం చేసి అపహరణకు యత్నించిన ఏడుగురిని పట్టుబడ్డారు. గురువారం రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజంతో పాటు తవ్వేందుకు వినియోగించిన పలు యంత్రాలను సీజ్ చేసి.. అక్కడే ఉంచింది. ఈ క్రమంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా సండూరు తాలూకా కురేకుప్ప గ్రామానికి చెందిన మారుతి, వీరేశ్, గాదిలింగప్ప, గణేశ్, బసవరాజు, ఉమాపతి, దొడ్డ బసప్ప కలిసి ఈనెల 2న హిటాచి యంత్రాన్ని గ్యాస్ కట్టర్లతో విడిభాగాలుగా మారుస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనాస్థలానికి చేరుకుని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ముఠా సభ్యులు యంత్రాల విడిభాగాలు తీసుకెళ్లి తెరవెనుక ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. వీరిలో ముఖ్యంగా వీరేశ్, ఉచ్చప్ప, ప్రకాశ్ పరారీలో ఉన్నారని. పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలని ఏర్పాటు చేసినట్లు. నిందితుల నుంచి బొలెరో వాహనం, ఆటో, గ్యాస్ సిలిండర్లు, కట్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరమణ, ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి

ఎస్కేయూ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీ నియమించింది. ఈ కమిటీలో మూడు సభ్యులు ఉంటారు. ప్రభుత్వ నామినీగా రాయపూర్‌లోని ఐఐఎం డైరెక్టర్ రామ్‌కుమార్ కాకాని, వర్సిటీ పాలకమండలి నామినీగా గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి శివప్రసాద్, యూజీసీ నామినీగా హిమాచల్ ప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ అలోక్‌కుమార్‌లను నియమించారు. గతేడాది జులై 18న ఆచార్య అనిత ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆమె ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన అభ్యర్థిని గవర్నర్ ఉపకులపతిగా నియమిస్తారు. ఈ పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది. వర్సిటీకి చెందిన విశ్రాంత ఆచార్యులతోపాటు ప్రస్తుతం పని చేస్తున్న పలువురు పోటీ పడుతున్నారు.

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి
మీ ఉన్నతికై శ్రమించిన,
మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల
అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు
ఈనాడులో తక్కువ ఖర్చుతో
ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

'ఉనికిని కాపాడుకునేందుకే జగన్ శవ రాజకీయాలు'

మారుతీనగర్‌లో మహిళలకు ప్రభుత్వ పథకాల అమలును వివరిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ఉనికిని కాపాడుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత-జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత విమర్శించారు. గురువారం ఆమె సోమందేపల్లి మారుతీనగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆయా కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తూ అవగాహన కలిగించారు. మంత్రి మాట్లాడుతూ జగన్‌ను రంగారెడ్డి అని అభివర్ణించారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నామని, జిల్లా అంతటా ఉచితంగా ఎక్కడికైనా వెళ్లవచ్చని ఆమె పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప, చేసిన అభివృద్ధి శూన్యమని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వంలో ఎన్నో హామీలను ఇచ్చి అమలు చేయకుండా మాట తప్పారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. చేనేతలకు త్వరలోనే ఉచిత విద్యుత్తు అమలుతో పాటు రెండో విడత పనిముట్లు అందించనున్నామని చెప్పారు. అనంతరం చౌడేశ్వరి కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన మంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. అధికారులు మారుతీ ప్రసాద్, వెంకటలక్ష్మమ్మ, శాంతలక్ష్మి, శుభరాణి, నాయకులు చంద్రశేఖర్, వెంకటరమణ, ఆంజనేయులు, సిద్దలింగప్ప, నాగప్ప, సంజీవరెడ్డి, సీసీ హరీష్, అనసూయమ్మ, బాబయ్య, మురళీ, ప్రకాశ్, శివలీల, సుజాత, సువర్ణ, రత్నమ్మ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి దర్శనం.. భక్తులకు దుర్లభం

రోజురోజుకీ పెరుగుతున్న రద్దీ ➡ నేడు చిన్న సరిగెత్తు

ఆలయం ఎదుట అగ్నిగుండం వద్ద మొక్కులు చెల్లించుకుంటూ..

నార్పల, న్యూస్‌టుడే : గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు పోటెత్తారు. దేవాదాయశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం స్వామి దర్శనం కోసం ఒకే క్యూలైన్ ఏర్పాటు చేయడంతో రద్దీని కట్టడి చేయలేని పరిస్థితి కనిపించింది. పురుషులకు, మహిళలకు ఒకే వరుస ఉండటంతో ఇబ్బందులు తలెత్తాయి. కిలోమీటరు మేరకు భక్తుల వరుస కొనసాగింది. కోనేరు బావి నుంచి ఆలయం వరకు పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో వేల సంఖ్యలో వస్తున్న భక్తులను నిలువరించలేకపోయారు. ఇసుకేస్తే రాలనంతంగా భక్తుల రద్దీ కనిపించింది.

స్వామి దర్శనానికి గంటల సమయం

స్వామి దర్శనానికి మూడు, నాలుగు గంటల సమయం పట్టింది. చాలా మంది తమ ఇష్టదైవం కుళ్లాయిస్వామి పీర్లను దర్శించుకోకుండానే అగ్నిగుండానికి మొక్కులు చెల్లించి నిరాశగా వెనుదిరిగారు. విడిదినంలోనే పరిస్థితి ఇలా ఉందంటే శుక్రవారం స్వామికి అత్యంత ఇష్టమైన చిన్నసరిగెత్తు ఉండటంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.

● పోలీసులు, దేవాదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయకుంటే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనిపై డీఎస్పీ వెంకటేశులును వివరణ కోరగా గురువారం 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో భక్తుల రద్దీ పెరిగిందన్నారు. చిన్నసరిగెత్తు రోజున 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

కిక్కిరిసిన భక్తజనం

టోల్‌గేట్ పేరిట దోపిడీ

బుక్కరాయసముద్రం: గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకోవడానికి భక్తుల రాక రోజురోజుకీ పెరుగుతోంది. ఈక్రమంలో వివిధ రకాల వాహనాల్లో వచ్చే భక్తులకు టోల్‌గేట్ రుసుం పేరుతో గుత్తేదారులు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నాడు. నిబంధనల ప్రకారం ఆటోలకు రూ.30, నాలుగు చక్రాల వాహనాలకు రూ.100, ఆరు చక్రాల వాహనాలకు రూ.130 వసూలు చేయాలి. పంచాయతీ సీలు లేకుండానే అధిక ధర టోకెన్లు ముద్రించి భక్తులను దోచుకుంటున్నారు. ఆటోలకు రూ.50 వసూలు చేస్తున్నారు. నాలుగు చక్రాలు, ఆరు చక్రాల వాహనాలకు సైతం రూ.20 అదనంగా రుసుం వసూలు చేస్తున్నారు. దీనికితోడు వాహనాల రుసుం చెల్లించే ధరల పట్టిక ను ఎక్కడా ప్రదర్శించడం లేదు. ఈ విషయంపై ఈవోఆర్డీ శైలజారాణిని వివరణ కోరగా నిర్ణయించిన ధరకే రుసుం వసూలు చేసేలా గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

పంచాయతీ సీల్ లేకుండానే రూ.50 టోకెన్

ప్రకటనలో ఒకటి.. విక్రయంలో మరొకటి!

వ్యాపార సంస్థకు జరిమానా

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: ప్రకటనలో ఒక రకమైన వస్తువును చూపి, విక్రయంలో మరొకటి పంపిణీ చేసిన వ్యాపార సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ రూ.50 వేల జరిమానా విధించింది. కేసు పూర్వపరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి పట్టణానికి చెందిన రాఘవరెడ్డి మార్చి 2023న ఆన్‌లైన్‌లో ఆజియో సంస్థకు డబ్బు చెల్లించి జీన్స్ ప్యాంటును రూ.12,999కు కొనుగోలు చేశాడు. పార్శిల్ వచ్చిన తర్వాత వస్తువును చూసిన బాధితుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. ఆన్‌లైన్‌లో చూపిన ప్యాంటు కాకుండా చౌక రకం ప్యాంటును పంపడంతో విక్రయ సంస్థకు ఫోన్ చేశాడు. స్పందించకపోవడంతో మెయిల్ చేశాడు. సంస్థ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కమిషన్ ఫిర్యాదును కేసుగా స్వీకరించి ఇరువర్గాల వాదనలను పరిశీలించింది. వినియోగదారుడి ఆరోపణలు రుజువు కావడంతో విక్రయ సంస్థ ప్యాంటు ధర రూ.12,999కు 8 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, మనోవేదనకు రూ.50 వేలు, న్యాయ ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత ఉత్తర్వులు జారీ చేశారు.

సూపర్ స్పెషాలిటీలో క్యాజువాలిటీ ఏర్పాటుకు చర్యలు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో క్యాజువాలిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా క్యాంటీన్‌కు కేటాయించిన భవనంలో ఉన్న మంచాలు, ఇతర సామగ్రిని తొలగించి అందులో క్యాజువాలిటీ ఏర్పాటుకు పనులు గురువారం ప్రారంభించారు. ఇప్పటికే పది పడకలను వాటి పక్కనే పది ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు ఏర్పాటు చేశారు. గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేయటానికి సమయం పడుతుండటంతో మొదటగా సిలిండర్లు అందుబాటులో ఉంచుకుని రోగులకు వైద్యసేవలు అందించనున్నారు. రోగుల పర్యవేక్షణకు నలుగురు సీఎంవోలతో పాటు సిబ్బందిని నియమించారు. వీరంతా షిఫ్టుల వారీగా పని చేయనున్నారు.

నూతనంగా ఏర్పాటు చేసిన పడకలు

భూములు ఇచ్చినవారికే ఉపాధి చూపాలి

స్థల సేకరణపై టేకులోడు రైతులతో అభిప్రాయ సేకరణ

టేకులోడు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపనకు మేం వ్యతిరేకం కాదు.. మాకు అందులో ఉపాధి అవకాశాలు కల్పించాలని, కాలుష్యం లేకుండా చూడాలని రైతులు పేర్కొన్నారు. గురువారం టేకులోడు గ్రామసచివాలయ సమీపంలో సర్పంచి సరోజమ్మ ఆధ్వర్యంలో పరిశ్రమ స్థాపనకు కావాల్సిన స్థల విషయమై అధికారులు రైతులతో అభిప్రాయ సేకరణ చేశారు. రైతులు మాట్లాడుతూ కియా పరిశ్రమలో తమిళనాడు, కేరళ, హిందీ ప్రాంతాలకు చెందిన వారు మాత్రమే పనిచేస్తున్నారని, స్థానికంగా భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి పనులు ఇవ్వలేదన్నారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకుంటే తమకు రవాణా సౌకర్యం, క్యాంటీన్, టెక్నికల్, నాన్ టెక్నికల్, తదితర పనుల్లో మొదటి అవకాశం కల్పించాలని కోరారు. స్థలం ఇచ్చిన తర్వాత వ్యర్థాలను చెరువులు, కట్టకాలువ, తదితర వాటిలో వేయరాదన్నారు. మొక్కలను విరివిగా పెంచి కాలుష్యం కాకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. తరతరాలు నుంచి పంట మీద ఆధారపడి జీవిస్తున్నామని అవే ఆస్తులను పరిశ్రమలకు ఇచ్చేస్తే తమకు ఎలాంటి ఉపాధి అవకాశం లేకుండా పోతుందని వాపోయారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి టేకులోడులోనే పరిశ్రమ స్థాపన చేయాలని పట్టుబట్టడంతోనే ఇక్కడికి వచ్చిందని ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు సురేంద్ర, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు. ధర విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం చేయమని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నటరాజు, మండల తెదేపా కన్వీనర్ శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, అంజినప్ప, నందీశప్ప, అశ్వర్థప్ప, విశ్వనాథరెడ్డి, గౌరీశంకర్, జనసేన మండలాధ్యక్షుడు చిన్నప్రవీణ్, ఎల్ఐసీ వెంకటరమణ, శ్రీదేవి, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నటరాజు

మాజీ సైనికుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

రవిశంకర్

కొత్తచెరువు, న్యూస్‌టుడే: మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవిశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తచెరువులోని భాస్కర్ డిఫెన్స్ అకాడమీలో జిల్లాలోని మాజీ సైనికుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ధర్మవరం, కదిరి, మడకశిర, హిందూపురం ప్రాంతాల నుంచి మాజీ సైనికులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తీర్మానించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా రవిశంకర్, ఉపాధ్యక్షుడిగా గంగన్న, కార్యదర్శిగా సాయికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా అన్వర్ బాషా, కోశాధికారిగా భాస్కర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఏఎంసీల్లో ఐదుగురికి షోకాజ్ నోటీసులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు సంబంధించి 2022 జనవరిలో జరిగిన వారపు సంతలో ఏసీబీ దాడులు చేశారు. అప్పట్లో సంతల నుంచి వచ్చిన ఆదాయం మొత్తాన్ని, రశీదులను పరిశీలించగా, రూ.30 వేలు అదనంగా సొమ్ము ఉన్నట్లు ఏసీబీ అధికారులు అప్పట్లో గుర్తించి కేసు నమోదు చేశారు. వారిలో విశ్రాంత మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కేశవకుమార్ (కళ్యాణదుర్గం), నాగేంద్ర (కదిరి), గేడర్ వేణుగోపాల్ (రిటైర్డ్), అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ సుశీల (శింగనమల)కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరంతా పదిహేను రోజుల్లో వివరణ ఇవ్వాలని ఎక్స్ అఫిషియో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారం

హిందూపురంలో భారీ మానవహారం

హిందూపురం, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే బతుకు బంగారం అవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ, పోలీస్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా గురువారం పట్టణంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పొట్టిశ్రీరాములు కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, సీఐలు మహ్మద్‌కరీం, జనార్దన్, ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు, తెదేపా పట్టణాధ్యక్షుడు పి.వెంకటేశ్, వాల్మీకి, కురుబ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, పరిమళ, నాయకులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్వహించారు.

సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా 1995, 1996 ఎస్సై బ్యాచ్‌లకు చెందినవారు. గతంలో నాలుగో పట్టణ సీఐగా పనిచేసిన సాయినాథ్, ఎస్పీ కార్యాలయంలో డీటీఆర్బీ సీఐగా పనిచేస్తున్న విజయభాస్కర్‌గౌడ్, పోలీసు కంట్రోల్ రూంలో పనిచేస్తున్న దేవానందలతో పాటు పీటీసీలో పనిచేస్తున్న ఆదినారాయణ, మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సత్యబాబు, సత్యసాయి జిల్లాలో చేస్తున్న కె.రాఘవన్, బి.మోహన్‌లు ఉద్యోగోన్నతి పొందినవారిలో ఉన్నారు.

ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరు నియామకం

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం డివిజన్ ఇన్‌ఛార్జి ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరుగా చిత్తూరు జిల్లా ఏసీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు ఇక్కడ అసిస్టెంట్ కంట్రోలరుగా విధులు నిర్వర్తించిన కల్యాణ చక్రవర్తి కాకినాడకు బదిలీపై వెళ్లారు. పూర్తి స్థాయి ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరును త్వరలో నియమించనున్నారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని అనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

JOBS

ప్రముఖ E-Kart's, వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత 10th, డిగ్రీ. జీతం 18000 నుంచి కలదు. 79756 91563.

Mechanical Engineer: B.Tech in Mechanical Engineering with 2 to 3 years experience - 01 Post, Electrical Engineer: B.Tech in Electrical Engineering with 2 to 3 years Experience - 01 Post, Mechanical Supervisor: Diploma in Mechanical Engineering with 2 to 3 years Experience - 01 Post, ITI Fitters: ITI in Fitter Grade with 3 to 5 years of Experience - 02 Posts, Boiler Operators: Boiler 2nd Class Certificate issued by A.P/T.G with 1 or 2 years of Experience - 01 Post. * (Sapthagiri Camphor Pvt Ltd, ATP) Apply to accountsatp@sclgroup.in

MARKETING/ SALES

ATP టౌన్‌లోని కన్‌స్ట్రక్షన్స్ & ఇంటీరియర్స్ ఆఫీస్ నందు మార్కెటింగ్ చేయడానికి లేడీస్ ఫీల్డ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + టూవీలర్ మస్ట్. వివరాలకు సంప్ర: 9666958268.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

తలనీలాల వేలంలో రూ.25.7 లక్షల ఆదాయం

నార్పల, న్యూస్‌టుడే: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ప్రాంగణంలో తలనీలాల పోగు చేసుకునే హక్కు కోసం బహిరంగ వేలంలో రూ.25.7 లక్షల ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. గురువారం నిర్వహించిన వేలంలో అనంతపురానికి చెందిన రవీంద్రారెడ్డి అందరికంటే ఎక్కువ పాడి వేలం దక్కించుకున్నారు. ఏడాదిపాటు ఆలయ ప్రాంగణంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కు గుత్తేదారుడికి ఉంటుందని అధికారులు తెలిపారు.

రూ.10 లక్షల విలువైన మద్యం ధ్వంసం

రోలర్‌తో మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న సీఐ, ఎక్సైజ్‌శాఖాధికారులు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.10లక్షలు విలువచేసే మద్యం సీసాలు టెట్రా ప్యాకెట్లను స్థానిక సీఐ శేఖర్, జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి గోవిందనాయక్ ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. పులేరు సమీపంలో నిర్మిస్తున్న జాతీయ రహదారిపై వాటిని వేసి రోలర్‌తో తొక్కించారు. రెండు, మూడేళ్ల వ్యవధిలో నమోదైన 78 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 2,184 లీటర్ల మద్యం ధ్వంసం చేసినట్లు వివరించారు. వీఆర్వోలు అనిల్‌కుమార్, నాగరాజు, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

HEFT ENERGY CONCEPT TO COMPLETION

WALK-IN DRIVE M/s HEFT ENERGY PRIVATE LIMITED

Join one of the fastest-growing companies in Renewable Energy Sector We are conducting walk-in interviews for the following roles:

★ Positions: Technicians

★ Date & Time: 05-07-2025 to 06-07-2025, Time: 9.00 AM to 05.00 PM

★ Venue: Alexander Hotels, No.11-120, Sapthagiri Circle, OPP. To Municipal Corporation office, Anantapur, AP – 515001.

★ Eligibility

- Qualification: ITI - Fitter, Electrician, Rigger & Mechanical Experience: 1–5 years – Preferable from Wind Sector, Engineering & Construction. ITI / Diploma – Freshers
- Experienced Technicians (Non-Qualified) Minimum 3 Years experience in Wind, Engineering & Construction.
- Helper – Experienced in construction Sector – Minimum 3 yrs

Bring updated resume, Present employer salary slips, Aadhar Card, PAN Card, Passport Size photo, Academic & Experience Certificates.

Note: "Male Candidates Only"

Contact: 9344997784, 9626499837

Email: hr@heft-energy.com

WANTED

› Front Office Executives › PRO's

› Marketing Executives › Telecallers

CHIRANJEEVI REDDY INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY FOR WOMEN

RACHANAPALLI, BELLARY ROAD, ANANTA PUR

CALL: 9666886027 & 9666886029



CHIRANJEEVI REDDY INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY FOR WOMEN

(All Courses approved by AICTE New Delhi.)

WE'RE HIRING

We're seeking talented and passionate women to join our faculty and staff. Send your resume and cover letter. This opportunity is open to women candidates only, as part of our commitment to creating a women-centric academic environment.

POSITIONS › Principal › Vice Principal › CSE (Asst. Prof.) › ECE (Asst. Prof.) › MBA (Assoc. Prof.) › Physics › Chemistry › English › Librarian

Qualification and Salary as per AICTE Norms

Rachanapalli, Bellary Road, Anantapur - 515004

CONTACT: 9666886027 & 9666886029

డెంగీ లక్షణాలతో వృద్ధుడి మృతి

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలోని కొంకల్లు గ్రామంలో పూజారి తిప్పన్న(80) అనే వృద్ధుడు డెంగీ లక్షణాలతో అనంతపురంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మృతి చెందారు. తిప్పన్నకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రులలో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో అనంతపురం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా రక్త పరీక్షలు చేసి డెంగీ లక్షణాలున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్య కూడా ఉండేదని ఎంఎల్‌హెచ్‌పీ శిల్ప తెలిపారు. కోలుకోలేక మృతిచెందారని వివరించారు.

మోసం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కదిరి వ్యవసాయ విభాగంలో నిధులను ఇతర ఖాతాలకు మళ్లించుకుని మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను కదిరి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏడీబీలో 2024లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేసిన వెంకటనాయుడు సుమారు రూ.1.67 కోట్లను మహిళా సంఘాల గ్రూపుల ఖాతాలు, తెలిసిన వారి ఖాతాలకు మళ్లించాడు. ఆ తర్వాత వాటిని పీలేరుకు చెందిన భానుప్రవీణ్‌రెడ్డి ఖాతాలకు మళ్లించి బ్యాంకుకు మోసం చేసినట్లు రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 2024 మార్చిలో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. అప్పట్లోనే వెంకటనాయుడును పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న రమణారెడ్డి, అంకమబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కదిరి అర్బన్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

బెట్టింగ్ భూతానికి పట్టుచీరల వ్యాపారి బలి

అప్పులు తీర్చలేక నిప్పంటించుకొని ఆత్మహత్య

జగదీశ్

ధర్మవరం, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్ ఆడి అప్పులు తీర్చలేక ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పట్టుచీరల వ్యాపారి జగదీశ్ (32) ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతణ్ని మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. జగదీశ్ క్రికెట్ బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లో లక్షల రూపాయలు పోగొట్టుకోవడంతో పలు చోట్ల అప్పులు చేశాడు. అతని వ్యవహార శైలి నచ్చక భార్య అంజలి మూడు నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఒంటికి నిప్పంటించుకొని జగదీష్ ఆత్మహత్య చేసుకున్నాడని రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. మృతుడి తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి రైతు మృతి

కిష్టప్ప

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ మండలంలోని నాగలగుబ్బల గ్రామానికి చెందిన రైతు కిష్టప్ప (54) ద్విచక్ర వాహనంపై వెళ్తూ కిందపడి మృతిచెందాడు. బుధవారం రాత్రి వ్యవసాయ తోటలో నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి వాహనం బోల్తాపడింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య అనసూయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నాగభూషణం తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ముదిగుబ్బ బ్రాంచ్, 1-50ఎ, మెయిన్ రోడ్డు, ముదిగుబ్బ, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్-515511

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, ముదిగుబ్బ బ్రాంచ్ వారికి ఋణగ్రహీతలు: 1) శ్రీమతి బోయని నాగజ్యోతి, భర్త: బి నాగమునికుమార్, 2) శ్రీ బోయని నాగ ముని కుమార్, తండ్రి: వేమన్న మరియు హామీదారు: శ్రీ మునంజయ, తండ్రి: క్రిష్టప్ప వారు తేది 02-07-2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.16,34,991.50/- + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, ముదిగుబ్బ బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 24-07-2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 24-07-2025, ఉ॥ 10.30 గం. నుండి ఉ॥ 11.30 గం.ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 23-07-2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

హిందూపురం ఆర్‌డి మరియు కదిరి ఎస్ఆర్‌డి, గుంజేపల్లి గ్రామం మరియు ముదిగుబ్బ పంచాయతీ పరిధి, ముదిగుబ్బ మండలం, ఎస్.నెం. 1032, ప్లాట్ నెం. 5, డి.నెం. 1-114D, అసెస్‌మెంట్ నెం. 3749 మరియు డి.నెం. 1-114-L, అసెస్‌మెంట్ నెం.3750 కలిగిన ఇల్లు యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.6, దక్షిణం: ప్లాట్ నెం.9, పడమర: రాగి నాయుడు యొక్క ఆస్తి, ఉత్తరం: 15 అ॥ వెడల్పు రోడ్డు. కొలతలు: తూర్పు-పడమర: 33 అ॥ లేదా 10.065 మీ॥, ఉత్తరం-దక్షిణం: 66 అ॥ లేదా 20.13 మీ॥. మొత్తం విస్తీర్ణం 242 చ॥గ॥. టైటిల్ హోల్డర్: శ్రీమతి బోయని నాగజ్యోతి, భర్త: బి నాగమునికుమార్.

రిజర్వు ధర: రూ. 24,70,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 2,47,000/-**

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏమైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, కడప ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 79016 26769.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 02-07-2025, ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

(c) eenadu

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

నిర్మించారు.. నీటి సరఫరా మరిచారు

స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని నలగొండ్రాయనపల్లిలో పశువుల నీటి తొట్టెను నిర్మించారు. పైపులైన్ ఏర్పాటు చేయక పోవడంతో ఖాళీగా దర్శనమిస్తోంది. దీనికి పది అడుగుల దూరంలోనే ప్రజల తాగునీటి పథకం బోరు బావి ఉన్నా తొట్టెకు నీటి సరఫరా ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. ఈ విషయాన్ని ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మకు తెలుపగా వెంటనే నీటి సరఫరాకు చర్యలు చేపడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, సోమందేపల్లి.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: చాకార్లపల్లి ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట మురుగు తొలగించండి. -బాబు
సమాధానం: వెంటనే పరిశుభ్రతకు చర్యలు చేపడతాం. -వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీవో
సమస్య: నలగొండ్రాయనపల్లిలోని సామాజిక భవనం వద్ద రోడ్డుపై గుంత పడింది. -గంగమ్మ
సమాధానం: త్వరలోనే మరమ్మతులకు చర్యలు చేపడతాం. -రవికుమార్, మండల ఇంజినీర్, సోమందేపల్లి. -న్యూస్‌టుడే, సోమందేపల్లి
సమస్య: మైనగానిపల్లిలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. -గంగాధర్
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి
సమస్య: మోరుబాగల్ ఎస్సీ కాలనీలో మురుగు ప్రవహిస్తోంది. -నాగరాజు
సమాధానం: హరితరాయబారుల ద్వారా తొలగిస్తాం. -తిప్పేస్వామి, సర్పంచి, మోరుబాగల్. -న్యూస్‌టుడే, గుడిబండ

ఉన్నతీకరించినా పాఠశాలల్లో తీరని సమస్యలు

అర్ధాంతరంగా ఆగిన అదనపు గదుల నిర్మాణం

హిందూపురం, మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ బడుల బలోపేతానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు 70 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు. 1 నుంచి 10వ తరగతి వరకు 11 మంది ఉపాధ్యాయులను నియమించి పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ఉత్తమ ఫలితాలు సాధనకు శ్రీకారం చుట్టారు.

ఏఏ గ్రామాల్లో నంటే..

- హిందూపురం నియోజకవర్గంలో మణేసముద్రం, గొల్లాపురం,మేళాపురం, మేళాపురం (ఉర్దూ), రవీంద్రనాథ్‌ఠాగూర్, సర్దార్‌వల్లభాయ్‌పటేల్, డా. జాకీర్‌హుస్సేన్ మదర్‌థెరిస్సా ఎంపీఎల్ పాఠశాలలను, చౌడేశ్వరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు.
- మడకశిర మండలం జిల్లడగుంట, కదిరేపల్లి, బేగార్లపల్లి పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఏర్పాటు చేశారు.

వేధిస్తున్న మౌలిక సదుపాయాల కొరత

- హిందూపురం గ్రామీణ, అర్బన్ పాఠశాలల్లో 1 నుంచి 10 వరకు ఒకే చోట బోధన సాగిస్తుండడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించడంతో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక క్రీడలపై ఆసక్తి కనబరిచే క్రీడాకారులకు నైపుణ్యం పెంపొందించుకునే ఆస్కారం లేకుండా పోయింది.
- మడకశిర మండలంలో ఉన్నతీకరించిన జిల్లడగుంట, కదిరేపల్లి, బేగార్లపల్లి పాఠశాలల్లో అదనపు గదుల సమస్య తీవ్రంగా ఉంది. జిల్లడగుంట పాఠశాలను ఉన్నతీకరించక ముందు కేవలం 70 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం పాఠశాలలో 142 మంది విద్యార్థులున్నారు. వారికి సరిపడా గదులు లేవు. 11 ఉండాల్సిన చోట 5 మాత్రమే ఉన్నాయి. పాఠశాలలో రెండు అదనపు గదుల నిర్మాణం చేపట్టి ఏడాది పైబడుతోంది. ఇంకనూ ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు, వాకిళ్ల వంటి పనులు చేపట్టాల్సి ఉంది.
- కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వంటగదుల కొరత ఉంది. చెట్ల కింద భోజనాలు వండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరు బయట వండటంతో దుమ్మూధూళి పడే అవకాశముంది. వర్షాకాలంలో అయితే మరీ ఇబ్బందిగా ఉంటుంది.

నియోజకవర్గం	ఉన్నతీకరించిన పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హిందూపురం	13	1204
మడకశిర	03	427

ప్రభుత్వానికి నివేదిస్తాం

పాఠశాలలో మౌలిక సౌకర్యాల కోసం నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతాం. అదనపు గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు ఇంజినీరుతో అంచనా వేయించి నిధుల కోసం ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. -నరసింహామూర్తి, ఎంఈఓ-2, మడకశిర

ఇంటింటికీ 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథి, తెదేపా నాయకులు

ఇస్లాపురంలో నియోజకవర్గం తెదేపా పరిశీలకుడు నరసింహారావు, పార్టీ శ్రేణులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ తెలుగుదేశంపార్టీ' కార్యక్రమాన్ని ఎంపీ బి.కె.పార్థసారథి గురువారం మండల పరిధిలోని బాలంపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో కలిసి ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. వచ్చే నాలుగేళ్లలో మరిన్ని పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సిద్ధంగా ఉన్నారని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ హెచ్.ఎన్.రాము, మార్కెట్ యార్డు ఛైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనందకుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆదినారాయణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్థానిక నగరపంచాయతీ పరిధిలోని 1వ వార్డు ఇస్లాపురంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు, పార్టీ పట్టణాధ్యక్షుడు శ్రీరాములు, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు.

సమస్యలు తెలుసుకుంటూ..

రొళ్ల, న్యూస్‌టుడే: సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు హొట్టేబెట్ట, కళ్లురొప్పం, గుడ్డుగుర్కి, వన్నప్పపాళ్యం, జి.ఎన్.పాళ్యం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వీధి దీపాలు సరిగా లేవని, అంగన్‌వాడీ, పాఠశాల సమస్యలు ఉన్నాయని తెలపడంతో సంబంధిత అధికారులను పిలిపించి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. హొట్టేబెట్ట గ్రామంలో నీటి సమస్య ఉందని ప్రజలు చెప్పడంతో వెంటనే కొత్త బోరు తవ్వించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హొట్టేబెట్ట గ్రామంలో అవ్వకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

బకాయిలు వెంటనే చెల్లించండి

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఆరు నెలలుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లులు చెల్లించలేదు. బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని యూటీయూసీ రాష్ట్ర ప్రతినిధి ఎ.శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

నేడు మెగా ఉద్యోగమేళా

హిందూపురం, న్యూస్‌టుడే : ఎస్‌ఎస్‌పీకేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా ఉద్యోగమేళా ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ ప్రగతి తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5న రుక్మిణి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో ఉన్న రుక్మిణి పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను జులై 5వ తేదీ(శనివారం) నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు పల్లా లక్ష్మీకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5న ప్రాకారోత్సవం, కళశస్థాపన, కల్యాణోత్సవం, 6న బ్రహ్మరథోత్సవం, 8న వసంతోత్సవం నిర్వహించనున్నారు.

నేత్రదానంతో జీవితానికి వెలుగు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని బీటీ కాంపౌండ్‌కు చెందిన రాఘవులు(81) అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందారు. నేత్రాలు దానం చేస్తే మరొకరి జీవితంలో వెలుగు చూడవచ్చన్న కుటుంబ సభ్యులు మంచి ఆలోచనతో 'పురం' కేపీ శ్రీనివాసమూర్తి ఫౌండేషన్ నిర్వాహకురాలు జయంతి, డా.సంధ్యాలక్ష్మిలకు తెలిపారు. వారు మృతుడి నేత్రాలను సేకరించి బెంగళూరులోని డా.రాజ్‌కుమార్ నేత్రాలయానికి పంపారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెనుకొండ, న్యూస్‌టుడే: వసతిగృహాల్లోని విద్యార్థులు ప్రస్తుతం వస్తున్న కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త వహించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి గోపీనాయక్ సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా గురువారం ఆయన ఆరోగ్య సిబ్బందితో కలసి స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మలేరియా, డెంగీ, డయేరియా తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు జనార్దన్‌రెడ్డి, ఏఎన్ఎం గీతా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో గ్రామాల అభివృద్ధి

మాట్లాడుతున్న ఎంపీడీవో నరేశ్‌కృష్ణ

పెనుకొండ, న్యూస్‌టుడే: పురుషాధిక్య సమాజంలో సాధికారత సాధించి, పరిపాలనలో మహిళా సర్పంచులు చురుగ్గా పాల్గొనడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందని ఎంపీడీవో నరేశ్‌కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 7 మండలాల మహిళా సర్పంచులకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిక్షకులుగా గ్రామపంచాయతీ కార్యదర్శులు మజీద్, త్రివేణి, సోనియా హాజరై సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఈనెల 5వతేదీ వరకు శిక్షణ కొనసాగనుంది. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కమలాబాయి, మహిళా సర్పంచులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ వైద్య బృందానికి సత్కారం

పెనుకొండ సీహెచ్‌సీ వైద్య బృందాన్ని సత్కరిస్తున్న నాసిన్ డైరెక్టర్ జనరల్ సుబ్రహ్మణ్యం

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మోహన్ నాయక్, వైద్యురాలు భానునాగశ్రీ, సిబ్బందిని గురువారం గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసిన్ పరిశ్రమ డైరెక్టర్ జనరల్ సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. గత శనివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో నాసిన్‌లో విధులు నిర్వహిస్తున్న అనిత గుండెపోటుకు గురవ్వడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు భానునాగశ్రీ, సిబ్బంది గుండెకు భరోసా కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన రూ.54వేలు విలువ చేసే సూదిమందును ఎక్కించి రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించడంతో నాసిన్ అధికారులు వైద్య బృందాన్ని సత్కరించారు.

ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి వివరాలు లభ్యం

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల - కదిరి రహదారిపై కసిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొని మృతిచెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని చలమయ్యగారిపల్లికి చెందిన అవివాహితుడు పవన్‌కల్యాణ్(24) నడుచుకుంటూ వస్తుండగా కదిరి నుంచి గోరంట్లవైపు వస్తున్న కంటైనర్ ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కంటైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యక్తి ఆచూకీ గుర్తించి ఆమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనుకొండ : మండలంలోని మక్కాజిపల్లితండాకు చెందిన విజయమ్మ(45) రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై కియా పరిశ్రమలో సెక్యూరిటీగార్డు విధులు నిర్వహిస్తున్న కుమారుడితో వెళుతూ ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఆమెను కర్నూలు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందారు.

ఎద్దులబండి అదుపుతప్పి తండ్రీకుమారుడికి గాయాలు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఎద్దులు బెదరడంతో బండి అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో తండ్రి, కుమారుడికి తీవ్రగాయాలైన ఘటన మల్లెల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రామాంజనేయులు అతడి కుమారుడు అఖిల్ వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దుల బండిలో వెళ్తుండగా గ్రామసమీపంలోనే ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి పంపించారు.

నలుగురు జూదరుల అరెస్టు

రూ.70,500 నగదు, 19 ద్విచక్రవాహనాల స్వాధీనం

మోదా(పరిగి), న్యూస్‌టుడే: మోదా పంచాయతీ పరిధిలోని బందార్లపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.70,500 నగదును స్వాధీనం చేసుకున్నామని పరిగి ఎస్సై రంగడు యాదవ్ తెలిపారు. వచ్చిన సమాచారంతో దాడి చేయగా నలుగురు పట్టుబడ్డారని, మరో 25 మంది పరారయ్యారని ఎస్సై వివరించారు. అక్కడ నిలిపి ఉంచిన 19 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

తొలగని చెత్తతో దుర్వాసన

హిందూపురం పట్టణంలోని గుడ్డంరంగనాథ స్వామి ఆలయం రహదారి నుంచి మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రహదారి పొడవునా వ్యర్థపదార్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. చుట్టుపక్కల వారు రాత్రి సమయాల్లో ఇంటిలో ఉన్న చెత్తను, ప్లాస్టిక్‌కవర్లను ఇక్కడకు తెచ్చి వేస్తున్నారు. ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకొంటామన్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

రోడ్లన్నీ మురుగుమయం

గొళ్లమారనపల్లి గ్రామంలోని ప్రధాన మట్టి రోడ్లన్నీ గుంతలమయమై కొద్దిపాటి వర్షానికే బురదమయం అవుతోంది. ప్రధాన మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలం ప్రారంభం నుంచి డిసెంబరు నెల వరకు రోడ్లల్లో ఉన్న గుంతల్లో నీరు నిలిచి దోమలు ఎక్కువై రోగాలు వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ సర్పంచి తిప్పేస్వామిని వివరణ కోరగా సీసీ రోడ్డు, కాలువల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే నిర్మిస్తామన్నారు. -న్యూస్‌టుడే, అమరాపురం

పూడుకుపోతున్నా పట్టించుకోరా

అగ్రహారం గ్రామంలోని నీటి ట్యాంకు సగం పూడుకుపోయింది. ట్యాంకు రోడ్డు పక్కన ఉండటంతో మట్టి తోలినప్పుడు పూడుకుంటూ కుళాయిలు కనిపించకుండా ఉన్నాయి. ఇలా ఉంటే నీరు ఎలా తెచ్చుకునేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌ను వివరణ కోరగా గ్రామంలో పరిశీలించి వారంలోపు సరిచేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, రొళ్ల

దేవరహట్టిలో పారిశుద్ధ్య సమస్య

మురుగునీటి కాలువలను చూపుతున్న గ్రామస్థులు

పావగడ, న్యూస్‌టుడే : పావగడ తాలూకా దేవరహట్టి గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యం గురించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగు కాలువలు చెత్త చెదారంతో నిండిపోవడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరని గ్రామ ప్రముఖుడు ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగనవాడీ కేంద్రానికి చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. కాలువలో నిలిచిన మురుగునీరు దుర్వాసన వెదజలుతోంది. చిన్నారులు వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్నారు. గ్రామంలో సరఫరా చేసే నీటి పైపులు పగిలి 80 శాతం నీరు వృథా అవుతోంది. 20 శాతం నీరు కలుషితమై గృహాలకు చేరుతోంది. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియచేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు సమస్యలపై స్పందించి గ్రామంలో పరిశుద్ధ్య సమస్యల పరిష్కరించాలని, లేకుండా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని అధికారులను హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

పెనుకొండ, న్యూస్‌టుడే: అమ్మవారిపల్లిలోని ప్రాథమిక పాఠశాల జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో దాదాపు 15 ఏళ్ల క్రితం మూసివేశారు. పాఠశాలను గ్రామంలో మరో చోట నిర్మించారు. ఈ పాఠశాల గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించేవారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఏడాది క్రితం అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామంలోని సామూహిక భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి ఈ భవనానికి తాళం వేయకపోవడంతో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ విషయాన్ని ఎంఈవో సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఇంత వరకు సమస్య తమ దృష్టికి రాలేదన్నారు. వెంటనే విచారణ జరిపి తాళం వేయించి తగు చర్యలు చేపడతాన్నారు.

చక్రంలో చున్నీ ఇరుక్కోవడంతో ప్రమాదం

గాయపడిన ఫౌజియానా

పెనుకొండ: హిందూపురం నుంచి అనంతపురానికి వెళుతున్న ద్విచక్రవాహన చక్రంలో చున్నీ ఇరుక్కొని కిందపడటంతో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం గుట్టూరు శివారులో జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు హిందూపురానికి చెందిన ఉపాధ్యాయురాలు ఫౌజియానా, భర్త జబీ ఉల్లాతో కలిసి అనంతపురం వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను 108వాహనంలో పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

బోరు విషయంలో అన్నదమ్ముల గొడవ

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన శివారెడ్డి, వెంకటరెడ్డి అన్నదమ్ములు. పొలం వద్ద బోరుబావి విషయంలో గురువారం ఇద్దరూ గొడవ పడి స్వల్పగాయాలపాలయ్యారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎన్టీఆర్ కూడలిలో విభాగిని పనుల ప్రారంభం

పనులను చేపడుతున్న కూలీలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్ కూడలిలో ఎట్టకేలకు విభాగిని నిర్మాణ పనులను తెదేపా నాయకులు చేపట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ నాలుగు వరుసల రహదారి మధ్య ఏకంగా 24 అడుగుల మేర విభాగినిని ర.భ.శా ఇంజినీరింగ్ అధికారులు నిర్మించడంతో మళ్లీ ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, కుల సంఘాలు తమ ఆరాధ్య దైవాల విగ్రహాల ఏర్పాట్లతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈ విషయంపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి ఎస్.సవిత స్వయంగా ఇక్కడి పరిస్థితిని పరిశీలించారు. భారీగా నిర్మించిన విభాగినిని తొలగించి, సాధారణ స్థితిలోనే ఎవరికీ ఇబ్బందులు లేకుండా నిర్మించాలని ఆదేశించారు. దీంతో స్థానిక తెదేపా నాయకులు చంద్రశేఖర్, కన్వీనర్ సిద్ధలింగప్ప, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అంజనేయులు, సురేంద్ర తదితరులు పలు కుల సంఘాల నాయకులతో చర్చించి, సామరస్య పూర్వకంగా సమస్యను పరిష్కరించేందుకు సాధారణ విభాగిని నిర్మాణ పనులను ప్రస్తుతం చేపడుతున్నారు. ఈ నాలుగు వరుసల రహదారికి ఇరువైపులా మురుగు కాలువలను నిర్మించేందుకు వైకాపా ప్రభుత్వంలో నిధులు మంజూరు కాలేదు. దీంతో కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలను చేపట్టడం.. తోపుడు బండ్లను, లగేజీ వాహనాలను రహదారులపై ఉంచడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలను అరికట్టి, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా ఇరువైపులా కాలువలను నిర్మించడమే పరిష్కార మార్గమని పలువురు భావిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల నిధులతో పూర్తి స్థాయిలో రహదారిని నిర్మించినా ఇక్కడి కూడలికి, పెద్దమ్మ గుడికి ఇరువైపులా రహదారి సమస్యలు మాత్రం తప్పడం లేదనే విమర్శలు గ్రామస్థుల్లో నెలకొన్నాయి.

పైపులైన్ దెబ్బతిని పాపిరెడ్డిపల్లిలో నీటి సమస్య

సోమందేపల్లి: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లిలో తాగునీటి పైపులైన్ దెబ్బతిని గ్రామస్థులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఐదు రోజులు గడిచినా ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి పక్కనే తాగునీటి పథకం బోరుబావి ఉండగా.. ప్రభుత్వం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఉపరితల నీటి ట్యాంకును ఇటీవల అధికారులు, తెదేపా నాయకులు ప్రజల ఉపయోగంలోకి తీసుకువచ్చారు. ఐదు రోజుల కిందట తాగునీటి పైపులైన్ దెబ్బతినడంతో సర్పంచి గంగాదేవి, ఇన్‌ఛార్జి కార్యదర్శి రామాంజనేయులు ఇక్కడి పైపులైన్ మరమ్మతులకు కార్మికులను పంపిస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, కనీసం ట్యాంకరుతో నీటిని సరఫరా చేయడం లేదని గ్రామ మహిళలు, యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్

సన్మాన కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేశ్

హిందూపురం పట్టణం: 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అంశంపై రాష్ట్రాల వారీగా ఎంపిక చేసిన మున్సిపల్ ఛైర్మన్‌లకు అవగాహన కల్పించడం కోసం హరియాణాలోని గురుగ్రామ్‌లో రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేశ్ గురువారం హాజరయ్యారు. మొదటిరోజు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీలను సన్మానించే కార్యక్రమంలో రమేశ్ పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో నిర్వహించిన చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

24 గంటల సేవలు.. ఖాళీగా కుర్చీలు

అగళిలో వైద్యం అందక రోగుల ఇబ్బందులు

ఆసుపత్రిలో మధ్యాహ్నం ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అగళి న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో ఉండడంలేదని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా 24 గంటలు ఆసుపత్రిలో సిబ్బంది రోగులకు సేవలు అందించాలి. కానీ వారు ఆసుపత్రి పరిధిలో కనిపించడం లేదని, ఆదివారం సాధారణ సెలవులా ఖాళీగా దర్శనమిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఎం.ఎం.పాళ్యం గ్రామానికి చెందినవారు మధ్యాహ్నం 3 గంటల సమయంలో వైద్యం కోసం వెళ్తే రక్త పరీక్ష చేయించుకోవడానికి, ఇంజెక్షన్ వేయడానికి సిబ్బంది లేరని కేవలం ఫార్మసిస్ట్ మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం బొమ్మనానిపల్లి గ్రామానికి చెందిన వారు ద్విచక్రవాహనంపై పడి కాలుకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి వస్తే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కర్ణాటకలోని శిరాకు తీసుకెళ్లారు. మండలం కర్ణాటకకు సరిహద్దులో ఉండటం, జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, బదిలీ కాకుండా ఏళ్ల తరబడి అగళి పీహెచ్‌సీలోనే ఉండిపోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతోనే ఇలాంటి పరిణామాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

తలుపుల, న్యూస్‌టుడే: మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నాగేంద్ర సూచించారు. మండలంలోని పలు పీర్లచావిడీలను గురువారం సాయంత్రం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులతో మాట్లాడారు. తలుపులలోని కుమ్మర పేట, పులుజబార్, దిగువపేట, కోట, ఎగువపేట, నూతనకాలువ తదితర చోట్ల కొలువైన పీర్లను సందర్శించారు. తగిన సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై చంద్ర (గుప్త), పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: మొహర్రం సందర్భంగా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సోమశేఖర్ గ్రామ ప్రజలను హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని వెల్దుమడుగులో ఎస్సై గ్రామసభ నిర్వహించి, పలు సూచనలు చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

పుట్టపర్తి: ప్రతిఒక్కరూ శ్రద్ధ చూపి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ క్షయ వ్యాధిగ్రస్తులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా క్షయ వ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లాలో 172 మంది ఈ వ్యాధికి చికిత్స పొందుతున్నారని అన్నారు. వారికి జిల్లాలో రెండు సంస్థల సహకారంతో పౌష్టికాహారం ఆరు నెలల పాటు అందించనున్నారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. దాతలు సింగ్యా కంపెనీ ప్రతినిధులు శ్రీరాములు, ఏజీ అండ్ పీ కంపెనీ ఆదిత్య, డీఎస్‌వో వంశీకృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: తాడిమర్రిలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో డ్రైనేజీపై పలకలు విరిగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. - రామస్వామి

సమాధానం: సిమెంట్ పలకలు ఏర్పాటు చేయిస్తాం. - భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ - న్యూస్‌టుడే, తాడిమర్రి

సమస్య: నీకేపల్లిలోని చెన్నకేశవ స్వామి, రామాలయ వీధుల్లో కాలువల్లో మట్టి పేరుకుపోవడంతో మురుగు పేరుకుపోయి ముందుకు సాగడం లేదు. - మురళి, స్థానికుడు

సమాధానం: సమస్యను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడతాం. - చంద్రశేఖర్, కార్యదర్శి

సమస్య: చెన్నేకొత్తపల్లిలోని వీధుల్లో సేకరించిన చెత్తను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించి వదిలి వేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. - నరసింహులు, స్థానికుడు

సమాధానం: చెత్తను సంపద మార్చేందుకు కృషి చేస్తాం. - చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి

(పై రెండు సమస్యలకు చెన్నేకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సమాధానాలు ఇచ్చారు) - న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

సమస్య: ధర్మవరం మున్సిపాలిటీ కార్యాలయం పక్కనే ఉన్న చంద్రబాబు జూనియర్ కళాశాల వద్ద కాలువలో చెత్తాచెదారం నిండిపోయింది. శుభ్రం చేయాలి. - సుబ్బారావు

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం. - శ్యామ్‌సన్, శానిటేషన్ అధికారి - న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

నిరభ్యంతరాలకు నిరీక్షణ

■ అధికారుల పొరపాట్లు.. యజమానులకు తప్పని పాట్లు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: గతంలో రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటు స్థలం కొనుగోలు చేసి, ఇళ్లు నిర్మించుకున్న యజమానులను అవస్థల పాల్జేస్తోంది. కదిరి రెవెన్యూ గ్రామంలోని రెండు ప్రదేశాల్లో ప్రైవేట్ భూములను సుమారు రెండు దశాబ్దాల కిందట అప్పటి అధికారులు నిషేధ జాబితాలోకి చేర్చారు. క్రమంగా పట్టణ విస్తీర్ణం పెరుగుతుండటంతో వ్యవసాయ పొలాలుగా ఉన్న వాటిని నివాస స్థలాలుగా విక్రయించారు. అప్పట్లో ధరలు తక్కువ ఉండటంతో ఎక్కువ మంది ప్లాట్లను కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారు. ఆ తర్వాత ఇంటికి నంబరు, రుణాల కోసం ప్రయత్నించగా అసలు విషయం వెలుగు చూసింది. ఇళ్లు నిర్మించుకున్న స్థలం నిషేధ జాబితాలో ఉన్నందున నిరభ్యంతర పత్రం తప్పనిసరి అని బ్యాంకులు, మున్సిపల్ అధికారులు స్పష్టం చేయడంతో యజమానుల ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కదిరి రెవెన్యూ గ్రామం సర్వేనంబరు 224లో నిర్మించిన ఇళ్లు

వందల సంఖ్యలో యజమానులు

కదిరి పట్టణంలోని అడపాలవీధి సర్వేనంబరు 224లో 269 మంది స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. వివిధ కారణాలతో స్థలం అమ్మిన [illegible] మరో నంబరు వేసి రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల నిరభ్యంతర పత్రం పొందాలని అధికారులు చెబుతున్నారు. దస్తావేజు ఒక నంబరులో ఉండటం, ఇళ్లు మరో నంబరులో నిర్మించడం వల్ల నిరభ్యంతర పత్రం ఇవ్వడం కుదరదంటున్నారు. మదనపల్లె రోడ్డులోని సర్వేనంబరు 683లో 200 మందికిపైగా ఇళ్లు కట్టుకున్నారు. ఇది ప్రైవేటు భూమి అయినప్పటికీ నిషేధ జాబితాలో ఉండటంతో యజమానులు ఇబ్బంది పడుతున్నారు.

విచారణ బృందానికి తలనొప్పిగా..

కదిరి రెవెన్యూ గ్రామంలోని 224, 683 సర్వేనంబర్లలో దాదాపు 470 మంది నిరభ్యంతర పత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. దస్తావేజులు ఒకచోట.. నివాసాలు మరో సర్వే నంబర్లలో ఉండటంతో రెవెన్యూ అధికారులు వీటిని తేల్చడానికి ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. అడపాలవీధిలోని 224 సర్వేనంబరులో 269 మందిలో ఇళ్లు నిర్మించిన 88 మంది మాత్రమే దస్తావేజుల ప్రకారం అదే స్థలంలో ఇళ్లు కట్టుకున్నారు. 102 మంది దస్తావేజుల్లో కనబరిచిన చోట కాకుండా ఇతర ప్రాంతంలో గృహాలు నిర్మించుకున్నట్లు తేలింది. వీటిని తేల్చడం విచారణ బృందానికి తలనొప్పిగా మారింది.

నిబంధనలకు అనుగుణంగా చర్యలు

- **మురళీకృష్ణ, తహసీల్దారు, కదిరి**

నిషేధ భూముల్లో ఇళ్ల నిర్మాణం వ్యవహారాన్ని తేల్చేందుకు విచారణ బృందాన్ని ఏర్పాటు చేశాం. బృందం ఇచ్చే నివేదికను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల ప్రకారం నిబంధనలకు అనుగుణంగా నిరభ్యంతర పత్రాలను అందించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

టి.కుంట్లపల్లి(ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని గురువారం టి.కుంట్లపల్లి పంచాయతీలోని తాటిమేకలపల్లి, పెద్దసానివారిపల్లి, టి.కుంట్లపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని పేర్కొన్నారు. పల్లెపలు గతంలో [illegible] కింద దాదాపు రూ.4,500 కోట్లతో గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు : టి.కుంట్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం రెండోతరగతి, నాల్గో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గణితం పాఠాలు బోధించారు. ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం కింద గుడ్లు, చిక్కీలు ఇస్తున్నారా అని ఆరా తీశారు.

తపాలా కార్యాలయంలో నీటి ఎద్దడి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి తపాలా కేంద్రంలో నీటి సౌకర్యం లేక ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం ప్రాంగణంలోని బోరు పాడైపోయింది. అప్పటి నుంచి సమస్య తలెత్తింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లలో నీరు లేక మహిళలు అవస్థ పడుతున్నారు. బోరుకు మరమ్మతు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగులు, వినియోగదారులు విమర్శిస్తున్నారు. త్వరలో బోరుకు మరమ్మతు చేయించి, వినియోగంలోకి తీసుకొస్తామని తపాలాశాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

ధర్మవరం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి అన్నారు. గురువారం ధర్మవరం ఆర్టీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ధర్మవరం, బత్తలపల్లి మండలాల్లో అధిక రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. బత్తలపల్లి మండలం ఎర్రాయపల్లి, పోట్ల మర్రి వద్ద బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఎంవీఐ రాణి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామంలో మే 25న విజయ్, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, అప్పస్వామి, సూర్యనారాయణపై జరిగిన హత్యాయత్నం కేసులో గురువారం ముగ్గురు నిందితులను ధర్మవరం గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసులో నిందితులైన నాగరాజు, దామోదర్, సత్యమయ్యను అరెస్ట్ చేసి వారిని కోర్టులో హాజరుపరచగా రిమాండుకు ఆదేశించిందని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరిపట్టణం కుటాగుళ్ల చెరువుకట్ట వీధి ప్రాంతానికి చెందిన వృద్ధురాలు పాపమ్మ (69) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలివీ.. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి

గాండ్లపెంట, న్యూస్‌టుడే: బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం నూతన వసతి గృహాలు ప్రారంభిస్తున్నట్లు జీసీడీవో సంపూర్ణ పేర్కొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలోని కస్తూర్బా టైప్ 4 వసతి గృహాన్ని విద్యాధికారి కృష్ణానాయక్, వార్డెన్ జ్యోత్స్నతో కలిసి పరిశీలించారు. వసతి గృహంలో 100 మందికి అవకాశం ఉందన్నారు. మండలంలో తొమ్మిది, పదోతరగతి బాలికలకు ప్రాధాన్యం ఇస్తామని, అనంతరం మిగిలిన సీట్లలో ఇతర తరగతుల బాలికలకు అవకాశం ఉంటుందన్నారు. హెచ్ఎం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

6న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం: పట్టణంలోని సాయినగర్‌లో క్లబ్ మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఆదివారం మధుమేహం, థైరాయిడ్ పరీక్షల ఉచిత శిబిరం నిర్వహిస్తున్నామని సాంస్కృతిక మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, సోలిగాల వెంకటేశులు తెలిపారు. వైద్య శిబిరానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను గురువారం విడుదల చేశారు. డాక్టర్ గండికోట రాజశేఖర్‌రెడ్డి, రమేష్ బాబు, రామకృష్ణ, అశ్వర్థనారాయణ, సాయిరాం పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

కదిరి, న్యూస్‌టుడే: ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కదిరి డిపోలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని డిపో ప్రచార కార్యదర్శి హరికుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపడుతున్నామని పేర్కొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి

కదిరి, న్యూస్‌టుడే: ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అన్నివిధాల కృషి చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరిలోని మదరసాలో గురువారం మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈద్గా మైదానం అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. గ్రామ ప్రాంతాల్లోనూ షాదీఖానాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, కమిషనర్ కిరణ్‌కుమార్, పీఠాధిపతి సయ్యద్ షమీమ్, మౌలానా షమీవుల్లా, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

కదిరి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజా సంక్షేమం కూటమితోనే సాధ్యం

తలుపుల: ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని మల్లిరెడ్డిపల్లి పంచాయతీ పెద్దపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలోనే సుపరిపాలన చేపట్టి ప్రజల్లో నమ్మకం పొందినట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డికి నిద్ర పట్టలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, శంకరనాయుడు, బ్రహ్మానందరెడ్డి, ముక్తియార్‌బాషా, బాగేపల్లి చలపతి, హరినాయక్, అధికారులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

కదిరి, న్యూస్‌టుడే: అరుణాచల గిరి ప్రదక్షిణకు ఈనెల 9న ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎస్టీఎం పెద్దన్న ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సదుపాయం కోసం బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు కదిరి బస్టాండ్ నుంచి సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. బస్సులు గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించి, అరుణాచలం వెళ్తాయని తెలిపారు. నల్లచెరువు, తనకల్లు, ములకలచెరువు, అంగళ్లలో బోర్డింగ్ పాయింట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఒకేసారి నుంచి 35 మందికి మించి బయలుదేరితే ఆ గ్రామానికే బస్సు పంపుతామని పేర్కొన్నారు. రూ.1,140 టికెట్ వసూలు చేస్తారని తెలిపారు.

రహదారి నాణ్యత పరిశీలన

తలుపుల, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన బీటీ రోడ్డును గురువారం నాణ్యత నియంత్రణ అధికారులు పరిశీలించారు. పెద్దన్నవారిపల్లి నుంచి దేవలానాయక్ తండా మీదుగా కొత్తపూలవాండ్లపల్లి వరకు రెండు ప్యాకేజీలతో బీటీ రోడ్డు పనులను అప్పట్లో చేపట్టారు. రెండు ప్యాకేజీలు కలిపి రూ.3.40 కోట్లతో, 4.87 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మించాలి. కంకర వేశారు. తారు వేయాల్సిన సమయంలో ఓ రైతు అనుమతి లేకుండా, పరిహారం చెల్లించకుండా తన పొలంలో రోడ్డు వేస్తున్నారంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ఆగిపోయాయి. ఇప్పటి వరకు చేసిన పనులకుగాను రూ.1.78 కోట్లు బిల్లులు చేసినట్లు క్వాలిటీ కంట్రోల్ డీఈఈ నాగశేఖర్ చెప్పారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఏపీడీ వెంకటాచలపతి, డీఆర్పీ రాజేశ్, పీఐయూ డీఈఈ హనుమంతయ్య, ఏఈఈ రాజేంద్రప్రసాద్, ఏఈ గురురాజ్‌గుప్తా పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

బుక్కపట్నం, న్యూస్‌టుడే: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణమూర్తి హెచ్చరించారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గురువారం ఎస్ఐ పర్యటించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. జూదం, మట్కా తదితర వాటిని ఆడినా చర్యలు తప్పవన్నారు.

గంజాయి విక్రయం.. నిందితుడి అరెస్ట్

నారాయణగూడ, న్యూస్‌టుడే: గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌డీ సీఐ నాగరాజు బృందం అరెస్టు చేసింది. ఆయన కథనం ప్రకారం.. శ్రీసత్యసాయి జిల్లా పీకేపీ తండా నల్లమడ ప్రాంతానికి చెందిన రమావత్ లోకనాథ్ నాయక్ (29) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న ఇతను కూకట్‌పల్లి ఫోర్త్ స్టేజీ వద్ద గంజాయి అమ్ముతున్నాడని సమాచారం అందింది. ఎస్‌సీఎఫ్‌డీ బృందం మాటు వేసి, బాలానగర్‌లో నిందితుడిని పట్టుకుంది. అతడి నుంచి 2.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, బాలానగర్ స్టేషన్‌లో అప్పగించారు.

ద్విచక్రవాహనం బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నల్లచెరువు, న్యూస్‌టుడే: తనకల్లు మండలం ముండ్లవారిపల్లికి చెందిన వేణుగోపాల్, వరలక్ష్మీ దంపతులు ద్విచక్రవాహనంలో కదిరికి వెళ్తుండగా నల్లచెరువు సమీపంలోని సంతతోపు 42వ జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్, వరలక్ష్మీ తీవ్రంగా గాయపడగా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం దుకాణాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు, బార్లలో రాత్రి 11 గంటల వరకే మద్యం అమ్మకాలు జరపాలని సూచించారు. 20 ఏళ్లలోపు వారికి మద్యం అమ్మరాదని, ఒక వ్యక్తికి 3 సీసాలకు మించి ఇవ్వరాదని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. కల్తీ మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎక్సైజ్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 14405 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మూతపడే దిశగా వసతిగృహం

తలుపులలోని బీసీ బాలుర వసతి గృహం మూతపడే పరిస్థితి నెలకొంది. పాఠశాలలు ప్రారంభమై 22 రోజులు కావస్తున్నా కొత్తగా ప్రవేశాలు చేపట్టలేదు. గతేడాది ఉన్న విద్యార్థులను చేర్చుకోలేదు. కనీసం వసతిగృహం తాళాలు తీయలేదు. మండలంలో ప్రాథమికోన్నత పాఠశాలలను ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం పూర్తిగా మూసివేయడంతో ఆరోతరగతి నుంచి చదివే విద్యార్థులు తప్పనిసరిగా ఉన్నత పాఠశాలలో చేరాల్సి ఉంది. మండల కేంద్రంలో బీసీ బాలుర వసతిగృహం అందుబాటులో ఉంటే ఉన్నత పాఠశాలలో చేరి చదువుకొనేవారు. ప్రవేశాల కోసం రోజూ వసతిగృహం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ అందుబాటులో లేరని స్థానికులు వాపోయారు. ఉన్నఫలంగా మూసివేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై కదిరి ఏఎస్‌డబ్ల్యూవో బాలాజీని వివరణ కోరగా గతేడాది ఏప్రిల్‌లో 22 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో పదోతరగతి విద్యార్థులు పోగా, మిగిలిన వారు 5 నుంచి 8 మందిలోపే ఉంటారు. వారంతా వస్తే కదిరిలో చేర్పిస్తాం. వసతిగృహాన్ని కదిరికి బదిలీ చేయాలని నిర్ణయించాం. కదిరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో తలుపుల, తనకల్లు మండలాల్లోని బీసీ బాలుర వసతి గృహాలను కదిరిలో పెట్టాలని ఎమ్మెల్యే ప్రతిపాదన చేశారని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, తలుపుల

రక్షణ దిమ్మెలు శిథిలం

ముదిగుబ్బ, కదిరి మండలాల సరిహద్దులోని మద్దిలేరువాగుపై నిర్మించిన కల్వర్టు రక్షణ దిమ్మెలు శిథిలమయ్యాయి. స్థానిక వీరేపల్లిపేట దగ్గర తక్కువ ఎత్తులో నిర్మించిన కల్వర్టుపై అధిక వర్షాలు కురిసినప్పుడు నీటి ఉద్ధృతి పెరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రక్షణ దిమ్మెలు విరిగిపోవడంతోపాటు కల్వర్టుపై కంపచెట్లు ఏపుగా పెరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ దిమ్మెలు బాగు చేయడంతోపాటు కంపచెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ముదిగుబ్బ

మడుగును తలపిస్తున్న మసీదు వీధి

తలుపుల పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న పెద్దమసీదు వీధి మడుగును తలపిస్తోంది. ఇళ్లల్లోని వ్యర్థం నీటిని రోడ్డుపై పడేస్తుండటంతో దుర్వాసన వస్తుంది. ఆ వీధిలో నడవాలన్న ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, తలుపుల

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై అవగాహన

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తుమ్మలబైలు పెద్దతండా, గరగుతండాలలో హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ గ్రామస్థులతో కలిసి అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై సంస్థ అధ్యక్షుడు మూడే రవినాయక్ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నాన్ నోవెన్ ఫాబ్రిక్ బ్యాగులు వాడాలని సూచించారు. గ్రామస్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయక్, గ్రామస్థులు లోకేశ్‌నాయక్, జగదీశ్ నాయక్, సురేంద్రనాయక్, సోమ్లానాయక్, శ్రీరాములునాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

నాన్ నోవెన్ ఫ్యాబ్రిక్ సంచులతో సంస్థ సభ్యులు, గ్రామస్థులు

కూటమి ప్రభుత్వంలో సుపరిపాలనకు నాంది

చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో సుపరిపాలనకు అంకురార్పణ జరిగిందని సీకేపల్లి, కనగానపల్లి తెదేపా మండల కన్వీనర్లు ముత్యాలరెడ్డి, యాతం పోతలయ్య పేర్కొన్నారు. మండలాల కేంద్రాల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేక వైకాపా విష ప్రచారాలకు తెర లేపిందన్నారు. వారి మాయమాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్న విషయాన్ని గుర్తెరగాలని హితవు పలికారు.

రామగిరి (పేరూరు), న్యూస్‌టుడే : ఇంటింటా తెదేపా కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 2వ తేదీ వరకూ ప్రతి గ్రామంలో పర్యటించి ప్రభుత పథకాలను ప్రజలకు తెలియజేస్తామని పేరూరు డ్యాం ఆయకట్టు ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. గురువారం పేరూరు, రామగిరి గ్రామాల్లో ఇంటింటా తెదేపా కార్యక్రమం నిర్వహించారు

తాడిమర్రిలో పీర్ల స్వాములు

గాండ్లపెంటలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

కనగానపల్లిలో..

కొలువుదీరిన పీర్లు

తాడిమర్రి, నంబులపూలకుంట, గాండ్లపెంట న్యూస్‌టుడే: తాడిమర్రి, గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం పీర్లు కొలువుదీరాయి. పీర్లను భక్తులు దర్శించుకుని చక్కెర, బెల్లం చదివింపులు చేశారు. కనగానపల్లి మండల కేంద్రంలోని దస్తగిరి, వన్నూరు స్వాములను గురువారం ముస్తాబు చేసి అలంకరించారు. ఇక్కడ దస్తగిరి స్వామికి ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చి మొహర్రం ముగిసే వరకూ ఇక్కడే ఉంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనం, వసతి ఏర్పాట్లు చేశారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే సహించం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు, వారికి సంబంధించిన 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఐటీయూ మండల అధ్యక్షుడు రమణ ఆరోపించారు. ఈ నెల 9న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మె కరపత్రాలను గురువారం సీఐటీయూ నాయకులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, బ్యాంకింగ్, విశాఖ ఉక్కు, ఆర్టీసీలను ప్రైవేట్ పరం కాకుండా కార్మికులు, ఇతర సంఘాలు ఈ సమ్మెను చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్, బాషా, ఆదినారాయణ, హైదర్‌వలి, ఇర్ఫానా పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

చాలీచాలని వేతనాలతో కుటుంబాలు పస్తులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికులకు ఏడేళ్లుగా వేతనాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలు పస్తుంటున్నాయని ఆ సంఘం అధ్యక్షుడు నాగరాజు వాపోయారు. ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత 8 రోజులుగా మున్సిపాలిటీ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపడుతున్నారు. గురువారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసనలు ఆపబోమని స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, నాయకులు బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

'ఆలయానికి రస్తా ఏర్పాటు చేస్తాం'

బుక్కపట్నం, న్యూస్‌టుడే: రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయానికి గురువారం ఆర్డీఓ సువర్ణ ఆకస్మికంగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మండలంలో నిర్వహిస్తున్న రీసర్వే ఎంత వరకు వచ్చిందో ఇన్‌ఛార్జి తహసీల్దార్ నరసింహులును అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను ఎంత వరకు పరిష్కరించారు, ఏఏ సమస్యలపై వినతులు వస్తున్నాయి అని ఆరా తీశారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నార్సింపల్లి తండాను సందర్శించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు చెన్నమ్మ ఆలయం వరకు 2 కిలోమీటర్ల మేర రస్తా ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. రైతులు అంగీకరిస్తే పొలాల మీదుగా రస్తా ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, వారి ఆదేశాల మేరకు త్వరితగతిన రస్తా ఏర్పాటు చేస్తామని చెప్పారు. తల్లికి వందనం అర్హులై, అనర్హుల జాబితాలో పేర్లు ఉంటే వాటిని పరిశీలించి తక్షణం పరిష్కరించాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్‌కు సూచించారు.

డాక్యుమెంట్ పోయినది
పి.శ్రీనివాసులు S/o పి.ఆంజినేయులు, తుమ్మలబైలు గ్రామం, గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందినటువంటి షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 3806/2017, S.No. 2727 వివరాలతో కూడిన డాక్యుమెంట్ 25-6-2025వ తేదీన గాండ్లపెంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పోగొట్టుకు పోయినవి. పై వివరాలు ఎవరికైన తెలిసిన దిగువ చిరునామాకు తెలుపగలరు.
సెల్: 7569373482

(c) eenadu

కడతాం.. కూలగొడతాం

ఎం.సున్నాపల్లి వద్ద ఇనుప వంతెనను యంత్రంతో కూల్చివేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి మండలం పాలవానిపేట- మేఘవరం రహదారిలో మూలపేట పోర్టు యాజమాన్యం రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఇనుప వంతెన రోడ్డు తవ్వడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోర్టు పనులు ప్రారంభించిన సమయంలో పాలవానిపేట-మేఘవరం రాకపోకలకు ఎం.సున్నాపల్లి ఆలయం బ్రిడ్జి, మూలపేట గెడ్డ బ్రిడ్జి వద్ద రెండు ఇనుప వంతెనలను పోర్టు యాజమాన్యం నిర్మించింది. వీటిపై భారీ సామగ్రిని పోర్టు పనులు కోసం తరలించి ఉపయోగించుకున్నారు. నాలుగు నెలల కిందట నౌపడ మూడురోడ్ల కూడలి నుంచి పోర్టు వరకు 100 మీటర్ల రహదారి నిర్మించడంతో అటువైపు నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అవసరమైనప్పుడు ఉపయోగించుకుని, ఇప్పుడు ఇలా వంతెన కూల్చడంపై మూలపేట, సమీప గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నిరసన తెలిపేందుకు వస్తుండగా పోలీసులు వారిని అడ్డుకుని సముదాయించడంతో ఆగిపోయారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని, భవిష్యత్తులో రోడ్డు ముంపునకు గురైతే కష్టాలు తప్పవని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రంలో పెట్టుబడులు: మంత్రి

టెక్కలి, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు నష్టపోతారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా టెక్కలి మండలం చాకిపల్లిలో గురువారం మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని అభివృద్ధికి వినియోగిస్తున్నామన్నారు. ఎర్రన్నాయుడు స్కూల్‌లో విద్యార్థిగా ఆయన బాటలోనే పనిచేస్తున్నామన్నారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం ప్రజలకు చేసిన కార్యక్రమాలను వివరించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

చాకిపల్లిలో మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

- తెదేపా హయాంలో నిర్మితమై, వివిధ దశల్లో ఉన్న నివాస గృహాలపై రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నిమ్మాడలో ప్రజాదర్బారు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు, లబ్ధిదారులు ఈ మేరకు మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో అంతర్జాలంలో వివరాలు ఉన్న నేపథ్యంలో ఆధార్ సంఖ్య నమోదు చేస్తుంటే ఇళ్లు ఉన్నట్లు చూపుతుందని, రాష్ట్రస్థాయిలో ఈ సమస్య పరిష్కారం కావాల్సి ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనాలను దశలవారీగా పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

ఆరోగ్య కార్యదర్శుల బదిలీల్లో అక్రమాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీల బదిలీల్లో అక్రమాలు జరిగాయని, రీ కౌన్సెలింగ్ నిర్వహించి న్యాయం చేయాలని ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఆరోగ్య కార్యదర్శులు కోరారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కార్యదర్శులకు వార్డుల పరిధిలోనే బదిలీ చేయాల్సి ఉందని, నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతాలకు పంపారని చెప్పారు. కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మళ్లీ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

రైతులకు విత్తనాల సమస్య రానీయొద్దు

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రైతులకు విత్తనాలు సత్వరమే పంపిణీ చేయాలని, ఎక్కడా సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్‌లు అందుబాటులో ఉంచాలని, గతేడాది ఎన్ని మండలాల్లో డ్రోన్‌లు వినియోగించారో ఆ వివరాలను అందించాలని చెప్పారు. ఏపీఎంఐపీ పరిధిలో ఎంత విస్తీర్ణంలో సాగవుతోంది, ఎంత మంది రైతులు ఉన్నారనే వివరాలను తెలియజేయాలన్నారు. ఉద్యాన, ఏపీఎంఐపీశాఖలకు సంబంధించి ఈ ఏడాది కార్యాచరణ, గతేడాది పురోగతి వివరాలు నివేదించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, గోకులాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పెద్దగనగళ్లవానిపేట, ఇద్దివానిపాలెం, దేవునల్తాడ తదితర తీర ప్రాంతాల్లో వాతావరణాన్ని తట్టుకోగలిగే భవనాలను నిర్మించనున్నట్లు మత్స్యశాఖ డీడీ వివరించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, పశుసంవర్ధకశాఖ జేడీ రాజగోపాల్, మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు ఖాళీ.. పర్యవేక్షణ గాలికి..!

- వంశధార ప్రాజెక్టులో కీలకమైన ఇంజినీర్ల కొరత
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సాగు, తాగునీటి వ్యవస్థలో అత్యంత కీలకమైంది వంశధార ప్రాజెక్టు.. లక్షలాది ఎకరాలకు సాగునీరందించడంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇలాంటి ప్రాజెక్టుపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయి. దీన్ని పర్యవేక్షించే అధికారులు లేకుండా పోతున్నారు. జిల్లా స్థాయి అధికారి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు ఏళ్లతరబడి నియామకాలు లేవు. పలుచోట్ల ఇన్‌ఛార్జిలతోనే విధులు నెట్టుకొస్తున్నారు. గత వైకాపా సర్కారు సాగునీటి వ్యవస్థను ఐదేళ్లు గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వంశధార ప్రాజెక్టు పరిధిలో గొట్టాబ్యారేజీ, కుడి, ఎడమ ప్రధాన కాలువలు, జలాశయం, ఆఫ్‌షోర్ జలాశయం, ఎత్తిపోతల పథకం, వంశధార-నాగావళి నదుల అనుసంధాన కాలువ (హెచ్‌ఎల్‌సీ)లు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు అధికారుల కొరత కారణంగా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

వంశధార ప్రాజెక్టు కార్యాలయం

ప్రాజెక్టులో కీలకమైన సూపరింటెండెంట్ ఇంజినీరు (ఎస్‌ఈ) అధికారి లేరు. గత ఆరేళ్లుగా ఇన్‌ఛార్జుల పాలనలోనే ఈ స్థాయి అధికారి వస్తూ వెళ్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన వారులేరు. కింద స్థాయిలో ప్రాజెక్టు నిర్వహణ, నిర్మాణ పనులు దేవుడే దిక్కన్నట్లుగా సాగుతున్నాయి. ప్రస్తుతమున్న ఎస్‌ఈ అధికారి తారకరామా తీర్థ ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్టుకు పార్వతీపురం, విజయనగరం, జిల్లా పరిధిలో ఎస్‌ఈగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల విధులు నిర్వహించిన ఎస్‌ఈ ఉద్యోగవిరమణ చేయడంతో వంశధార ప్రాజెక్టు ఎస్‌ఈ కార్యకలాపాలు సైతం ఈయనకే అప్పగించారు. మూడు జిల్లాలో ఒకే అధికారి జిల్లా స్థాయి పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోచ్చు.

ఆరు డివిజన్లలో అదే తీరు..

ప్రాజెక్టు కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్లడంలో ఈఈ స్థాయి అధికారులు కీలక పాత్రపోషిస్తారు. వంశధార ప్రాజెక్టు పరిధిలో నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస-1, ఆమదాలవలస, హిరమండలం, శ్రీకాకుళం డివిజన్లు ఉన్నాయి. ఒక్క ఆమదాలవలస-1, ఆమదాలవలసలో ఇద్దరు ఈఈలు మాత్రమే ఉన్నారు. మిగిలిన నాలుగు చోట్లా పూర్తిస్థాయి ఈఈలు లేరు. ఎక్కడికక్కడ ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు కార్యకలాపాల అమలులో జాప్యం జరగడమే కాక పర్యవేక్షణలోపం ఎదురవుతోంది. వంశధార, ఆఫ్‌షోర్ జలాశయాల పర్యవేక్షణ, ప్రగతి, ఎంబుక్ వంటి వివరాలు ఏఈ, ఏఈఈలు నమోదు చేస్తారు. వీరు కూడా తక్కువ మందే ఉండటంతో ఇబ్బందులు తప్పలేదు.

ప్రాజెక్టు పోస్టులు- ఖాళీల వివరాలు

పోస్టు	మంజూరు	పనిచేస్తుంది
ఎస్‌ఈ	01	00
డీఎస్‌ఈ	01	00
ఈఈ	06	02
ఏఈ	13	05
ఏఈఈ	58	36

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 866 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సు సీట్ల భర్తీకి నూజివీడులో జరిగిన తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. రెండో రోజు గురువారం 547 మంది విద్యార్థులను పిలవగా 429 మంది ప్రవేశాలు పొందారు. మొత్తం 866 మంది ప్రవేశాలు పొందారు. వీరిలో బాలురు 243 మంది, బాలికలు 623 మంది ఉన్నారు. తొలి విడతలో మిగిలిన 234 సీట్లను మెరిట్ జాబితా ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీచేస్తామని అధికారులు తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

చిత్తడి నేలకు రక్షణ ఛత్రం..!

- సంరక్షణకు చర్యలు
- జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు అమలు దిశగా కసరత్తు

– న్యూస్‌టుడే, సోంపేట

జిల్లాలో చిత్తడి నేలల సంరక్షణకు కమ్యూనిటీ రిజర్వ్‌గా నోటిపై చేసే చర్యలపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ (సాకాన్) గుర్తించిన ప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని సోంపేట పర్యావరణ పరిరక్షణ సంఘం ప్రతినిధులు కొన్నేళ్లుగా జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో (ఎన్జీటీ) పోరాటం చేస్తున్నారు. రెండేళ్ల కిందటే తీర్పు ఇచ్చినప్పటికీ మార్పు రాలేదని ఎన్జీటీ నోటీసులు జారీ చేయడంతో చట్టం ద్వారా రక్షణ కల్పించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా చిత్తడి నేలలున్న పంచాయతీల నుంచి రక్షణ చర్యలకు సంబంధించిన తీర్మానాలు సేకరించి ట్రిబ్యునల్‌కు అందజేసేలా సన్నాహాలు సాగుతున్నాయి. సామాజిక అటవీ ప్రాంతంలో భాగం చేసి అటవీ శాఖకు రక్షణ బాధ్యతలు అప్పగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

సోంపేట వద్ద బీల చిత్తడి నేలల ప్రాంతం

ఎట్టకేలకు కదలిక

కమ్యూనిటీ రిజర్వ్‌గా గుర్తించిన తర్వాత 3 నెలలకు ఒకసారి వివరాలు తెలియజేయాలని సూచిస్తూ ఎన్జీటీ కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల కిందటే నివేదిక అందజేసినప్పటికీ ప్రభుత్వ పరంగా చర్యలు లేకపోవడంతో కోర్టు ధిక్కారం కింద విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ, పర్యావరణవేత్తలు డాక్టర్ కృష్ణమూర్తి, మృత్యుంజయరావు ఎన్జీటీని ఆశ్రయించారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అటవీశాఖాధికారి ఈ అంశంపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో చర్చించారు. బీల ప్రాంతంలో చిత్తడి నేలల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు వివరించారు.

రిజర్వు ప్రాంతంగా గుర్తించేలా చర్యలు

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీల ప్రాంతంలోని చిత్తడి నేలల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని.. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని కోరాం. ఎన్జీటీ తీర్పు అమలుకు వీలుగా చిత్తడి నేలలను రిజర్వ్ ప్రాంతంగా గుర్తించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

- బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

అరుదైన జాతులకు ఆవాసం..

సోంపేట, కంచిలి, కవిటి మండలాల పరిధిలో బీల ప్రాంతం 20 కి.మీ. మేర విస్తరించి ఉంది. 4 వేల ఎకరాలు ఎప్పుడూ నీటి నిల్వతో కళకళలాడతాయి. సోంపేట బీలలో 493 ఔషధ మొక్కలు, చెట్లు, 149 రకాల దేశీయ, సంచార పక్షి జాతులు, 20 వేలకు పైగా నీటి పక్షులు, అరుదైన సర్పాలు, అడవి పందులు, ఇతర జంతువులు ఆవాసం పొందుతున్నట్లు గుర్తించారు. థర్మల్ విద్యుత్కేంద్రం కోసం కేటాయించిన పెద్ద బీల పరిధి రుషికుద్ద, బెంకిలి, బారువ, గొల్లగండి పంచాయతీల్లో 1,590.92 ఎకరాలు చిత్తడి నేలలే. మాణిక్యపురం పంచాయతీ పరిధిలో చిన్న బీల, ఇద్దివానిపాలెం పరిధిలో తంపర నేలలు మరో 2,400 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. సోంపేట మండలం బారువ కంబ ప్రాంతం నుంచి కవిటి మండలం ఇద్దివానిపాలెం వరకు చిత్తడి నేలల సంరక్షణకు చర్యలు చేపట్టడంతో పాటు ఎకో టూరిజం అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

విద్యాలయాల్లో మళ్లీ వేడుక..!

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. అందులో భాగంగానే పిల్లల విద్యాప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమని భావించి గతేడాది మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు(పీటీఎంలు) నిర్వహించింది. రెండో ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించనుంది. ఇప్పటికే పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఈ నెల 10న అన్ని విద్యాలయాల్లో పండగలా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశం వివరాలతో తెలియజేస్తూ తల్లిదండ్రులకు పంపేందుకు ఆహ్వాన పత్రాలను సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ ఇలా...

- విద్యార్థి ఎలా చదువుతున్నారు.. మరింత నాణ్యమైన విద్యనందించేందుకు బోధన పరంగా ఎలాంటి మార్పులు చేయాలి.. ఇలా వివిధ అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారి అభిప్రాయాలు పంచుకుంటారు.
- పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, ఆరోగ్య సంబంధిత సమాచారంతో కూడిన సమగ్ర ప్రగతి పత్రం(హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు) తల్లిదండ్రులకు అందజేస్తారు.
- పిల్లల ప్రవర్తన తీరు, క్రమశిక్షణ తదితర విషయాలపై చర్చిస్తారు.
- ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుంది.
- రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంపై వివరించి పిల్లల ఆరోగ్య పరిరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.

తొలిసారి ప్రైవేటు సంస్థల్లోనూ..

పాఠశాలలు		విద్యార్థులు
ప్రభుత్వ	: 2,955	1,63,115 మంది
ప్రైవేటు	: 397	1,11,913 మంది
కళాశాలలు	: 164	39,000 మంది

గతేడాది కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)లు నిర్వహించారు. ఈ సారి ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ సమావేశాలు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. నిర్వహణకు విద్యాలయాలవారీగా నిధులు మంజూరు చేశారు. వాటితో తాగునీరు, మధ్యాహ్నం భోజనం, కుర్చీలు తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

ఉత్తమ ఫలితాలకు దోహదం..

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశాలు ఈ నెల 10న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వీటిల్లో విద్యాప్రగతిపై చర్చించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. తరగతి గదిలో ఏం చెబుతున్నారు.. అందులో పిల్లలు ఎంత నేర్చుకుంటున్నారనేది తెలుసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ఉపాధ్యాయులతోనూ మాట్లాడటం ద్వారా విద్యార్థి లోపాలు సరి చేసి.. అభ్యసన సామర్థ్యం మెరుగుపడేలా వారిని ప్రోత్సహించడానికి అవకాశం కలుగుతుంది.

– ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

గెయిల్‌కు 1.70 ఎకరాల కేటాయింపు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్)కు శ్రీకాకుళం గ్రామీణ మండలం గూడెంలోని సర్వే నంబరు 261-1సీ1లోని 1.70 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అంగుల్ పైపులైన్ ప్రాజెక్టు భవన నిర్మాణానికి రిసీవింగ్ టెర్మినల్ నిర్మాణానికి కేటాయించారు. 1.70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎలినేషన్ చేసి మార్కెట్ ధర రూ.1.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మధ్యలో ఆగింది.. జీవాలకు ఆవాసమైంది..!

పరిపాలన గ్రామస్థాయిలో జరగాలని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. రూ.కోట్లు వెచ్చించి నిర్మాణాలు ప్రారంభించినా.. మధ్యలో ఆగిపోవడంతో నిరుపయోగంగా మారాయి. బూర్జ మండలం కొరగాంలో రైతు సేవా కేంద్రం కోసం నిర్మించిన భవనం గొర్రెలు, మేకల షెడ్డుగా తయారైంది. ప్రణాళిక లేకుండా గ్రామానికి దూరంగా నిర్మించి ప్రజాధనం వృథా చేశారని స్థానికులు తెలిపారు. ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా పనులు పూర్తి విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు రాలేదన్నారు. – న్యూస్‌టుడే, కొరగాం(బూర్జ)

ర్యాలీ, బంద్, నిరసనలకు అనుమతి తప్పనిసరి: ఎస్పీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసన, బంద్ వంటి ఏ కార్యక్రమాలు నిర్వహించాలన్నా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పక తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, మత, కుల, విద్యార్థి, కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాలు వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు సమాచారం తెలియజేయాలన్నారు. సబ్ డివిజనల్ అధికారి నుంచి అనుమతి పొందినవారు మాత్రమే కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. దరఖాస్తుదారుల వివరాలు, హాజరు సంఖ్య, ప్రదేశం, మార్గం, సమయం, ప్రారంభం, ముగింపు వేళలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వాహనాల సంఖ్య, భోజన సదుపాయం వివరాలు, మైకులు, డీజే వినియోగానికి సైతం అనుమతులు పొందాలన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, హింసాత్మక పోస్టర్లు, ఫొటోల ప్రదర్శన చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండో రోజు కౌన్సెలింగ్

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జరుగుతున్న గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ రెండో రోజు గురువారం కొనసాగింది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులకు స్థానచలనం కల్పించారు. శుక్రవారం కూడా ప్రక్రియ కొనసాగనుంది.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ నియామక ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కర్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు తిప్ప.. వెళితే శిక్ష..!

చెరువులను తలపిస్తున్న అంతర్గత మార్గాలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

రైళ్లు వచ్చే సమయంలో గేట్లు వద్ద గంటల తరబడి వేచి ఉండకుండా కేంద్ర ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో అంతర్గత మార్గాలను నిర్మించింది. ప్రణాళిక ప్రకారం.. కట్టకపోవడంతో ఇవి చెరువులను తలపిస్తున్నాయి. నిర్మాణ దశలో ఉన్నప్పుడే నీరు నిలిచిపోకుండా చేయాల్సిన ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద చేరి, అడుగుల మేర నీరు నిలిచి పాదచారులు ఆ మార్గం మీదుగా వెళ్లేందుకు వెనకాడుతున్నారు.

పొందూరు మండలం బొడ్డేపల్లి దగ్గర ఉన్న రైల్వే అంతర్గత మార్గంలో ఎప్పుడూ నీరు ఉంటుంది. భారీ వర్షాలు పడితే నాలుగు అడుగుల మేర నిలిచిపోతుంది. ఆమదాలవలస, పొందూరు మండలాల్లోని తాడాలవలస, గంగ్రేడు, లచ్చయ్యపేట, గోరింట, గోకర్ణపల్లితోపాటు 10 గ్రామాలు, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పరిధిలోని వాల్తేరు, బూరడ గ్రామాలతో పాటు మరో 30 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పొందూరు మండలం బొడ్డేపల్లి రైల్వే అంతర్గత మార్గంలో నీటిలో నుంచే రాకపోకలు

ఇవన్నీ సమస్యాత్మకమే

జిల్లాలో జి.సిగడాం నుంచి ఇచ్ఛాపురం వరకు పలు ప్రాంతాల్లో అంతర్గత మార్గాలు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో పెనుబర్తి, తాడావలస, బొడ్డేపల్లి, కనుగులవలస, ఆమదాలవలస, కామేశ్వరరావుపేట, చిక్కాలవలస, బసివాడ, కంబకాయి, తిలారు, పంతులుపేట, హరిశ్చంద్రపురం, నడిమివలస, గరుడకండి ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రతి చోట ఇదే పరిస్థితి నెలకొనడంతో రాకపోకలు కష్టతరం మారింది.

పర్యవేక్షణ ఏదీ

అంతర్గతమార్గం నిర్మాణానికి రైల్వేశాఖ సుమారు రూ.3 కోట్లు వరకూ ఖర్చు చేస్తుంది. కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువ వ్యయం అయినవి ఉన్నాయి. కట్టేసి పర్యవేక్షణ లేకుండా వదిలేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. రైల్వే గేట్లు మూసేయడంతో ఎటూ వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. చర్యలు తీసుకుని సమస్య పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా 'ఈ విషయం నా దృష్టికి వచ్చింది. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను' అని ఆయన తెలిపారు.

(c) eenadu

ఈనాడు
శ్రీకాకుళం
శుక్రవారం జులై 4, 2025

కడతాం.. కూలగొడతాం

సంతబొమ్మాళి మండలం పాలవానిపేట- మేఘవరం రహదారిలో మూలపేట పోర్టు యాజమాన్యం రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఇనుప వంతెన రోడ్డు తవ్వడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోర్టు పనులు ప్రారంభించిన సమయంలో పాలవానిపేట-మేఘవరం రాకపోకలకు ఎం.సున్నాపల్లి ఆలయం బ్రిడ్జి, మూలపేట గెడ్డ బ్రిడ్జి వద్ద రెండు ఇనుప వంతెనలను పోర్టు యాజమాన్యం నిర్మించింది. వీటిపై భారీ సామగ్రిని పోర్టు పనుల కోసం తరలించి ఉపయోగించుకున్నారు. నాలుగు నెలల కిందట నౌపడ మూడురోడ్ల కూడలి నుంచి పోర్టు వరకు 100 మీటర్ల రహదారి నిర్మించడంతో అటువైపు నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అవసరమైనప్పుడు ఉపయోగించుకుని, ఇప్పుడు ఇలా వంతెన కూల్చడంపై మూలపేట, సమీప గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నిరసన తెలిపేందుకు వస్తుండగా పోలీసులు వారిని అడ్డుకుని సముదాయించడంతో ఆగిపోయారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని, భవిష్యత్తులో రోడ్డు ముంపునకు గురైతే కష్టాలు తప్పవని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

ఎం.సున్నాపల్లి వద్ద ఇనుప వంతెనను యంత్రంతో కూల్చివేస్తున్న దృశ్యం

చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రంలో పెట్టుబడులు: మంత్రి

టెక్కలి, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు నష్టపోతారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా టెక్కలి మండలం చాకిపల్లిలో గురువారం మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని అభివృద్ధికి వినియోగిస్తున్నామన్నారు. ఎర్రన్నాయుడు స్కూల్‌లో విద్యార్థిగా ఆయన బాటలోనే పనిచేస్తున్నామన్నారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం ప్రజలకు చేసిన కార్యక్రమాలను వివరించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

చాకిపల్లిలో మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

- తెదేపా హయాంలో నిర్మితమై, వివిధ దశల్లో ఉన్న నివాస గృహాలపై రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నిమ్మాడలో ప్రజాదర్బారు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు, లబ్ధిదారులు ఈ మేరకు మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో అంతర్జాలంలో వివరాలు ఉన్న నేపథ్యంలో ఆధార్ సంఖ్య నమోదు చేస్తుంటే ఇళ్లు ఉన్నట్లు చూపుతుందని, రాష్ట్రస్థాయిలో ఈ సమస్య పరిష్కారం కావాల్సి ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనాలను దశలవారీగా పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

ఆరోగ్య కార్యదర్శుల బదిలీల్లో అక్రమాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీల బదిలీల్లో అక్రమాలు జరిగాయని, రీ కౌన్సెలింగ్ నిర్వహించి న్యాయం చేయాలని ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఆరోగ్య కార్యదర్శులు కోరారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కార్యదర్శులకు వార్డుల పరిధిలోనే బదిలీ చేయాల్సి ఉందని, నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మళ్లీ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

రైతులకు విత్తనాల సమస్య రానీయొద్దు

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రైతులకు విత్తనాల సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్‌లు అందుబాటులో ఉంచాలని, గతేడాది ఎన్ని మండలాల్లో డ్రోన్‌లు వినియోగించారో ఆ వివరాలను అందించాలని చెప్పారు. ఏపీఎంఐపీ పరిధిలో ఎంత విస్తీర్ణంలో సాగవుతోంది, ఎంత మంది రైతులు ఉన్నారనే వివరాలను తెలియజేయాలన్నారు. ఉద్యాన, ఏపీఎంఐపీశాఖలకు సంబంధించి ఏడాది కార్యాచరణ, గతేడాది పురోగతి వివరాలు నివేదించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, గోకులాలు సత్వరమే పూర్తి చేయాలన్నారు. పెద్దగనగళ్లవానిపేట, ఇద్దివానిపాలెం, దేవునల్తాడ తదితర తీర ప్రాంతాల్లో వాతావరణాన్ని తట్టుకొనే భవనాలను నిర్మించనున్నట్లు మత్స్యశాఖ డీడీ వివరించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, పశుసంవర్ధకశాఖ జేడీ రాజగోపాల్, మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు ఖాళీ.. పర్యవేక్షణ గాలికి..!

- వంశధార ప్రాజెక్టులో కీలకమైన ఇంజినీర్ల కొరత
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సాగు, తాగునీటి వ్యవస్థలో అత్యంత కీలకమైంది వంశధార ప్రాజెక్టు.. లక్షలాది ఎకరాలకు సాగునీరందించడంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇలాంటి ప్రాజెక్టుపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయి. దీన్ని పర్యవేక్షించే అధికారులు లేకుండా పోతున్నారు. జిల్లా స్థాయి అధికారి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు పోస్టులు భర్తీ చేయడం లేదు. పలుచోట్ల ఇన్‌ఛార్జిలతోనే విధులు నెట్టుకొస్తున్నారు. గత వైకాపా సర్కారు సాగునీటి వ్యవస్థను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వంశధార ప్రాజెక్టు కార్యాలయం

- వంశధార ప్రాజెక్టు పరిధిలో గొట్టాబ్యారేజీ, హిరమండలం జలాశయం, ఎడమ ప్రధాన కాలువలు, ఆఫ్‌షోర్ జలాశయం, ఎత్తిపోతల పథకం, వంశధార-నాగావళి నదుల అనుసంధాన కాలువ (హెచ్‌ఎల్‌సీ)లు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు అధికారుల కొరత కారణంగా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

- ప్రాజెక్టులో కీలకమైన సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) అధికారి లేరు. గత ఆరేళ్లుగా ఇన్‌ఛార్జి పాలనలోనే ఈ స్థాయి అధికారి వస్తూ వెళ్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన వారులేరు. కింద స్థాయిలో ప్రాజెక్టు నిర్వహణ, నిర్మాణ పనులు దేవుడే దిక్కన్నట్లుగా సాగుతున్నాయి. ప్రస్తుతమున్న ఎస్‌ఈ అధికారి తారకరామా తీర్థ ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్టుకు పార్వతీపురం, విజయనగరం, జిల్లా పరిధిలో ఎస్‌ఈగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల విధులు నిర్వహించిన ఎస్‌ఈ ఉద్యోగవిరమణ చేయడంతో వంశధార ప్రాజెక్టు ఎస్‌ఈ కార్యకలాపాలు సైతం ఈయనకే అప్పగించారు. మూడు జిల్లాలో ఒకే అధికారి జిల్లా స్థాయి పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోచ్చు.

ప్రాజెక్టు పోస్టులు- ఖాళీల వివరాలు		
పోస్టు	మంజూరు	పనిచేస్తుంది
ఎస్‌ఈ	01	00
డీఎస్‌ఈ	01	00
ఈఈ	06	02
ఏఈ	13	05
ఏఈఈ	58	36

ఆరు డివిజన్లలో అదే తీరు..

ప్రాజెక్టు కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్లడంలో ఈఈ స్థాయి అధికారులు కీలక పాత్రపోషిస్తారు. వంశధార ప్రాజెక్టు పరిధిలో నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస-1, ఆమదాలవలస, హిరమండలం, శ్రీకాకుళం డివిజన్లు ఉన్నాయి. ఒక్క ఆమదాలవలస-1, ఆమదాలవలసలో ఇద్దరు ఈఈలు మాత్రమే ఉన్నారు. మిగిలిన నాలుగు చోట్ల పూర్తిస్థాయి ఈఈలు లేరు. ఎక్కడికక్కడ ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు కార్యకలాపాల అమలులో జాప్యం జరగడమే కాక పర్యవేక్షణలోపం ఎదురవుతోంది. వంశధార, ఆఫ్‌షోర్ జలాశయాల పర్యవేక్షణ, ప్రగతి, ఎంబుక్ వంటి వివరాలు ఏఈ, ఏఈఈలు నమోదు చేస్తారు. వీరు కూడా తక్కువ మందే ఉండటంతో ఇబ్బందులు తప్పలేదు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 866 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆర్జీయూకేటీ సమీకృత ఇంజినీరింగ్ కోర్సు సీట్ల భర్తీకి నూజివీడులో జరిగిన తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. రెండో రోజు గురువారం 547 మంది విద్యార్థులకు పిలవగా 429 మంది ప్రవేశాలు పొందారు. మొత్తం 866 మంది ప్రవేశాలు పొందారు. వీరిలో బాలురు 243 మంది, బాలికలు 623 మంది ఉన్నారు. తొలి విడతలో మిగిలిన 234 సీట్లను మెరిట్ జాబితా ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీచేస్తామని అధికారులు తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

చిత్తడి నేలకు రక్షణ ఛత్రం..!

- సంరక్షణకు చర్యలు
- జాతీయ హరిత ట్రైబ్యునల్ తీర్పు అమలు దిశగా కసరత్తు

– న్యూస్‌టుడే, సోంపేట

జిల్లాలో చిత్తడి నేలల సంరక్షణకు కమ్యూనిటీ రిజర్వుగా నోటిఫై చేసే చర్యలపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ (సాకాన్) గుర్తించిన ప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని సోంపేట పర్యావరణ పరిరక్షణ సంఘం ప్రతినిధులు కొన్నేళ్లుగా జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో (ఎన్జీటీ) పోరాటం చేస్తున్నారు. రెండేళ్ల కిందటే తీర్పు ఇచ్చినప్పటికీ మార్పు రాలేదని ఎన్జీటీ నోటీసులు జారీ చేయడంతో చట్టం ద్వారా రక్షణ కల్పించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా చిత్తడి నేలలున్న పంచాయతీల నుంచి రక్షణ చర్యలకు సంబంధించిన తీర్మానాలు సేకరించి ట్రైబ్యునల్‌కు అందజేసేలా సన్నాహాలు సాగుతున్నాయి. సామాజిక అటవీ ప్రాంతంలో భాగం చేసి అటవీ శాఖకు రక్షణ బాధ్యతలు అప్పగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

సోంపేట వద్ద బీల చిత్తడి నేలల ప్రాంతం

ఎట్టకేలకు కదలిక

కమ్యూనిటీ రిజర్వ్‌గా గుర్తించిన తర్వాత 3 నెలలకు ఒకసారి వివరాలు తెలియజేయాలని సూచిస్తూ ఎన్జీటీ కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల కిందటే నివేదిక అందజేసినప్పటికీ ప్రభుత్వ పరంగా చర్యలు లేకపోవడంతో కోర్టు ధిక్కారం కింద విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ, పర్యావరణవేత్తలు డాక్టర్ కృష్ణమూర్తి, మృత్యుంజయరావు ఎన్జీటీని ఆశ్రయించారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అటవీశాఖాధికారి ఈ అంశంపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో చర్చించారు. బీల ప్రాంతంలో చిత్తడి నేలల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు వివరించారు.

రిజర్వు ప్రాంతంగా గుర్తించేలా చర్యలు

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీల ప్రాంతంలోని చిత్తడి నేలల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని.. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని కోరాం. ఎన్జీటీ తీర్పు అమలుకు వీలుగా చిత్తడి నేలలను రిజర్వ్ ప్రాంతంగా గుర్తించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

- బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

అరుదైన జాతులకు ఆవాసం..

సోంపేట, కంచిలి, కవిటి మండలాల పరిధిలో బీల ప్రాంతం 20 కి.మీ. మేర విస్తరించి ఉంది. 4 వేల ఎకరాలు ఎప్పుడూ నీటి నిల్వతో కళకళలాడతాయి. సోంపేట బీలలో 493 ఔషధ మొక్కలు, చెట్లు, 149 రకాల దేశీయ, సంచార పక్షి జాతులు, 20 వేలకు పైగా నీటి పక్షులు, అరుదైన సర్పాలు, అడవి పందులు, ఇతర జంతువులు ఆవాసం పొందుతున్నట్లు గుర్తించారు. థర్మల్ విద్యుత్కేంద్రం కోసం కేటాయించిన పెద్దబీల పరిధి రుషికుద్ద, బెంకిలి, బారువ, గొల్లగండి పంచాయతీల్లో 1,590.92 ఎకరాలు చిత్తడి నేలలే. మాణిక్యపురం పంచాయతీ పరిధిలో చిన్న బీల, ఇద్దివానిపాలెం పరిధిలో తంపర నేలలు మరో 2,400 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. సోంపేట మండలం బారువ కంబ ప్రాంతం నుంచి కవిటి మండలం ఇద్దివానిపాలెం వరకు చిత్తడి నేలల సంరక్షణకు చర్యలు చేపట్టడంతో పాటు ఎకో టూరిజం అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

విద్యాలయాల్లో మళ్లీ వేడుక..!

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. అందులో భాగంగానే పిల్లల విద్యాప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమని భావించి గతేడాది మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు(పీటీఎంలు) నిర్వహించింది. రెండో ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించనుంది. ఇప్పటికే పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఈ నెల 10న అన్ని విద్యాలయాల్లో పండగలా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశం వివరాలతో తెలియజేస్తూ తల్లిదండ్రులకు పంపేందుకు ఆహ్వాన పత్రాలను సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ ఇలా...

- విద్యార్థి ఎలా చదువుతున్నారు.. మరింత నాణ్యమైన విద్యనందించేందుకు బోధన పరంగా ఎలాంటి మార్పులు చేయాలి.. ఇలా వివిధ అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారి అభిప్రాయాలు పంచుకుంటారు.
- పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, ఆరోగ్య సంబంధిత సమాచారంతో కూడిన సమగ్ర ప్రగతి పత్రం(హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు) తల్లిదండ్రులకు అందజేస్తారు.
- పిల్లల ప్రవర్తన తీరు, క్రమశిక్షణ తదితర విషయాలపై చర్చిస్తారు.
- ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుంది.
- రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంపై వివరించి పిల్లల ఆరోగ్య పరిరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.

తొలిసారి ప్రైవేటు సంస్థల్లోనూ..

	జిల్లాలో పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	: 2,955	1,63,115 మంది
ప్రైవేటు	: 397	1,11,913 మంది
కళాశాలలు	: 164	39,000 మంది

గతేడాది కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)లు నిర్వహించారు. ఈ సారి ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ సమావేశాలు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. నిర్వహణకు విద్యాలయాలవారీగా నిధులు మంజూరు చేశారు. వాటితో తాగునీరు, మధ్యాహ్నం భోజనం, కుర్చీలు తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

ఉత్తమ ఫలితాలకు దోహదం..

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశాలు ఈ నెల 10న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వీటిల్లో విద్యాప్రగతిపై చర్చించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. తరగతి గదిలో ఏం చెబుతున్నారు.. అందులో పిల్లలు ఎంత నేర్చుకుంటున్నారనేది తెలుసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ఉపాధ్యాయులతోనూ మాట్లాడటం ద్వారా విద్యార్థి లోపాలు సరి చేసి.. అభ్యసన సామర్థ్యం మెరుగుపడేలా వారిని ప్రోత్సహించడానికి అవకాశం కలుగుతుంది.

– ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

గెయిల్‌కు 1.70 ఎకరాల కేటాయింపు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్)కు శ్రీకాకుళం గ్రామీణ మండలం గూడెంలోని సర్వే నంబరు 261-1సీ1లోని 1.70 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అంగుల్ పైప్‌లైన్ ప్రాజెక్టు భవన నిర్మాణానికి రిసీవింగ్ టెర్మినల్ నిర్మాణానికి కేటాయించారు. 1.70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎలినేషన్ చేసి మార్కెట్ ధర రూ.1.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మధ్యలో ఆగింది.. జీవాలకు ఆవాసమైంది..!

పరిపాలన గ్రామస్థాయిలో జరగాలని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. రూ. కోట్లు వెచ్చించి నిర్మాణాలు ప్రారంభించినా.. మధ్యలో ఆగిపోవడంతో నిరుపయోగంగా మారాయి. బూర్జ మండలం కొరగాంలో రైతు సేవా కేంద్రం కోసం నిర్మించిన భవనం గొర్రెలు, మేకల షెడ్డుగా తయారైంది. ప్రణాళిక లేకుండా గ్రామానికి దూరంగా నిర్మించి ప్రజాధనం వృథా చేశారని స్థానికులు తెలిపారు. ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా పనులు పూర్తి విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు రాలేదన్నారు. – న్యూస్‌టుడే, కొరగాం(బూర్జ)

ర్యాలీ, బంద్, నిరసనలకు అనుమతి తప్పనిసరి: ఎస్పీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసన, బంద్ వంటి ఏ కార్యక్రమాలు నిర్వహించాలన్నా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పక తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, మత, కుల, విద్యార్థి, కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాలు వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోకు సమాచారం తెలియజేయాలన్నారు. సబ్ డివిజనల్ అధికారి నుంచి అనుమతి పొందినవారు మాత్రమే కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. దరఖాస్తుదారుల వివరాలు, హాజరు సంఖ్య, ప్రదేశం, మార్గం, సమయం, ప్రారంభం, ముగింపు వేళలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వాహనాల సంఖ్య, భోజన సదుపాయం వివరాలు, మైకులు, డీజే వినియోగానికి సైతం అనుమతులు పొందాలన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, హింసాత్మక పోస్టర్లు, ఫొటోల ప్రదర్శన చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండో రోజూ కౌన్సెలింగ్

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జరుగుతున్న గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ రెండో రోజు గురువారం కొనసాగింది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులకు స్థానచలనం కల్పించారు. శుక్రవారం కూడా ప్రక్రియ కొనసాగనుంది.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ నియామక ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కర్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు తిప్ప.. వెళితే శిక్ష..!

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

రైళ్లు వచ్చే సమయంలో గేట్లు వద్ద గంటల తరబడి వేచి ఉండకుండా కేంద్ర ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో అంతర్గత మార్గాలను నిర్మించింది. ప్రణాళిక ప్రకారం.. కట్టకపోవడంతో ఇవి చెరువులను తలపిస్తున్నాయి. నిర్మాణ దశలో ఉన్నప్పుడే నీరు నిలిచిపోకుండా చేయాల్సిన ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద చేరి, అడుగుల మేర నీరు నిలిచి పాదచారులు ఆ మార్గం మీదుగా వెళ్లేందుకు వెనకాడుతున్నారు.

పొందూరు మండలం బొడ్డేపల్లి దగ్గర ఉన్న రైల్వే అంతర్గత మార్గంలో ఎప్పుడూ నీరు ఉంటుంది. భారీ వర్షాలు పడితే నాలుగు అడుగుల మేర నిలిచిపోతుంది. ఆమదాలవలస, పొందూరు మండలాల్లోని తాడాలవలస, గంట్రేడు, లచ్చయ్యపేట, గోరింట, గోకర్ణపల్లితోపాటు 10 గ్రామాలు, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పరిధిలోని వాల్తేరు, బూరడ గ్రామాలతో పాటు మరో 30 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పొందూరు మండలం బొడ్డేపల్లి రైల్వే అంతర్గత మార్గంలో నీటిలో నుంచే రాకపోకలు

చెరువులను తలపిస్తున్న అంతర్గత మార్గాలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఇవన్నీ సమస్యాత్మకమే

జిల్లాలో జి.సిగడాం నుంచి ఇచ్ఛాపురం వరకు పలు ప్రాంతాల్లో అంతర్గత మార్గాలు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో పెనుబర్తి, తాడావలస, బొడ్డేపల్లి, కనుగులవలస, ఆమదాలవలస, కామేశ్వరరావుపేట, చిక్కాలవలస, బసివాడ, కంబకాయి, తిలారు, పంతులుపేట, హరిశ్చంద్రపురం, నడిమివలస, గరుడకండి ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రతి చోట ఇదే పరిస్థితి నెలకొనడంతో రాకపోకలు కష్టతరం మారింది. వర్షాకాలం వస్తే అవస్థలు తప్పడంలేదు

పర్యవేక్షణ ఏదీ

అంతర్గతమార్గం నిర్మాణానికి రైల్వేశాఖ సుమారు రూ.3 కోట్లు వరకూ ఖర్చు చేస్తుంది. కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువ వ్యయం అయినవి ఉన్నాయి. కట్టేసి పర్యవేక్షణ లేకుండా వదిలేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. రైల్వే గేట్లు మూసేయడంతో ఎటూ వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. చర్యలు తీసుకుని సమస్య పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా 'ఈ విషయం నా దృష్టికి వచ్చింది. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను' అని ఆయన తెలిపారు.

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

సోంపేట, న్యూస్‌టుడే: క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని.. ముందు జాగ్రత్త చర్యలతో ఆరోగ్యంగా ఉండొచ్చని సోంపేట టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు బి.సీత, విక్రమ్, భవ్య, సాయికుమార్ తదితరులు పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం మామిడిపల్లి, బారువా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సోంపేటలో జరిగిన కార్యక్రమంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రెగ్యులర్ ఖాతాలుగా మార్చాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం బొరివంకలో సుమారు 208 మంది రైతుల జిరాయితీ భూములకు సంబంధించిన వివరాలు నోషనల్ ఖాతాలుగా నమోదయ్యాయని.. వాటిని రెగ్యులర్ ఖాతాలుగా మార్చాలని ఆ గ్రామానికి చెందిన బెందాళం జయకృష్ణ కోరారు. ఈమేరకు కవిటిలో గురువారం పలాస ఆర్డీవో జి.వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఆయా భూముల రైతుల హక్కులో ఉన్నాయని.. వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆర్డీవో స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్డీవో వెంకటేశ్‌కు సమస్య వివరిస్తున్న జయకృష్ణ

జై జగన్నాథ్..

ఇచ్ఛాపురం, పలాస, సోంపేట, న్యూస్‌టుడే: రథోత్సవాల్లో భాగంగా గురువారం జగన్నాథ స్వామి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇచ్ఛాపురంలో వేంకటేశ్వరస్వామిగా, పలాసలో రామావతారంలో, సోంపేట, బారువ గుండిచా మందిరాల్లో శ్రీరాముడిగా పూజలందుకున్నారు.

పలాస: రామావతారంలో..

ఇచ్ఛాపురం: వేంకటేశ్వరస్వామి అలంకరణలో జగన్నాథుడు

వైకాపా పాలనలో విధ్వంసం

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, హరిపురం (మందస), పలాస గ్రామీణం, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో గురువారం తెదేపా నాయకులు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు నిర్వహించారు. కవిటి మండలం నెలవంకలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు, మందస మండలం సరియాపల్లి, జిల్లుండ, లింబుగాం, పలాస మండలం లక్ష్మీపురం, బొడ్డపాడు గ్రామాల్లో నేతలు ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి వివరించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం మూడో వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం నాలుగో వార్డులో కౌన్సిలర్ గేదెల శేఖర్, తెదేపా పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పత్రి తవిటయ్య, నందిగాం కోటి పర్యటించారు.

కవిటి మండలం నెలవంకలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

నిఘా పెంచుతాం.. సమస్యల్లేకుండా చూస్తాం

'ఈనాడు' ఫోన్ ఇన్‌లో కాశీబుగ్గ డీఎస్పీ అప్పారావు

న్యూస్‌టుడే, కాశీబుగ్గ, పలాస: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి స్పందన లభించింది. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఫోన్ చేసి అనేక అంశాలను డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై ఆయన స్పందించి వివరణ ఇచ్చారు.

సమస్య పలాసలో ఇందిరా చౌక్ నుంచి జీడి పిక్కల బొమ్మ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రహదారిపై వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వేగ నిరోధానికి చర్యలు తీసుకోవాలి. - పి.విజయ్‌కుమార్, పలాస ❖ డీఎస్పీ: వేగ నిరోధానికి చర్యలు తీసుకుంటాం.

? మందస మండలం హరిపురంలో ప్రధాన రహదారులపై పార్కింగ్ సమస్య కారణంగా విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు విజ్ఞప్తి చేసినా పరిష్కారం కాలేదు. - మురళీకృష్ణ, హరిపురం ❖ రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

? సోంపేట మండలం బారువ బీచ్‌లో కొందరు మద్యం తాగి ఖాళీ సీసాలు వదిలేస్తుండటంతో సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గాజు ముక్కలు కాళ్లకు గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. నిఘా పెట్టి మందుబాబులపై చర్యలు తీసుకోవాలి. - కాశీప్రసాద్, బారువ ❖ డీఎస్పీ: పర్యవేక్షణ పెంచాలని బారువ పోలీసులను ఆదేశిస్తాం.

? కాశీబుగ్గ కె.టి.రోడ్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో తోపుడు బండ్లు నిలపడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. - రాజారావు, కాశీబుగ్గ ❖ తోపుడు బండ్లు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

? పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురానికి చెందిన ఓ వ్యక్తి జీడి పిక్కల కోసం మేలో రూ.25.20 లక్షలు ఇచ్చాను. సొమ్ము అందుకున్న తరువాత అతను పరారయ్యాడు. గుమ్మలక్ష్మీపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు. - రామారావు, జీడిపప్పు వ్యాపారి, పలాస ❖ ఈ విషయమై సంబంధిత పోలీసు స్టేషన్ అధికారితో మాట్లాడతాం. సమస్య పరిష్కారానికి అవకాశం మేరకు సహకారం అందిస్తాం.

? ఇచ్ఛాపురం బజారు వీధి ప్రాంతంలో వాహనాల రాకపోకలతో శబ్ద కాలుష్యం ఎక్కువగా ఉంది. - శంకర్, ఇచ్ఛాపురం ❖ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638975
పలాస గ్రామీణం : 7386409936
కంచిలి గ్రామీణం : 9704568738

?: ఇచ్ఛాపురం పట్టణ పరిధి పురుషోత్తపురం కాలనీలో వీధి దీపం వెలగక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. -కేపీ కుమార్, ఇచ్ఛాపురం ● సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -పి.కామేశ్, ఏఈ, ఇచ్ఛాపురం

?: పలాస మండలం టెక్కలిపట్నం కాలనీలో డ్రైనేజీ శుభ్రం చేయాలి. -స్థానికులు ● నాలుగైదు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. -రవి, పంచాయతీ కార్యదర్శి, టెక్కలిపట్నం -న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఆయా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఏవోలు పి.శ్రీదేవి, బి.నరసింహమూర్తి, పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కొన్నిచోట్ల కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రహదారులపై పారుతోంది. రోటరీనగర్, శివాజీనగర్ ప్రాంతాల సరిహద్దు మార్గంలో ఇళ్ల నుంచి వాడుక నీరు పెరటి వైపు విడిచిపెడుతుండటంతో పరిసరాలు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కార్మికులను పంపి మురుగు నీరు రహదారిపై లేకుండా చర్యలు తీసుకుంటామని పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి వెంకటేశ్ తెలిపారు. - న్యూస్‌టుడే, పలాస

ప్రహరీ నిర్మించరూ..

కంచిలి మండలం బొనమాలిలో ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో గ్రామస్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కట్టెలతో కంచె ఏర్పాటు చేశారు. పశువుల నుంచి రక్షణకు తాత్కాలికంగా చర్యలు తీసుకున్నామని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఎంఈవో చిట్టిబాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. అనుమతులు రాగానే ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

దుర్వాసన భరించలేకున్నాం..

పలాస మండలం శాసనాం చిన్న వీధిలోని కాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని.. తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

శిథిలం..భయం భయం

వజ్రపుకొత్తూరులో పశు వైద్య కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. గోడలన్నీ బీటలు వారాయి. పైకప్పు పెచ్చులూడుతోంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో సిబ్బంది విధులు నిర్వహించడానికి ఆందోళన చెందుతున్నారు. పశు పోషకులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త భవనం నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పశు వైద్యాధికారి పాపారావు తెలిపారు.- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ప్రమాదకర కూడలి

ఇచ్ఛాపురం బజారు కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన వేదిక ప్రమాదకరంగా మారింది. ఇరుకైన కూడలిలో అది అడ్డంగా తిరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సరి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని.. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై ఎం.ముకుందరావు తెలిపారు. -న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆదుకోనున్న అన్నదాతా సుఖీభవ..!

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 30,463 మంది అర్హులుగా గుర్తింపు

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రైతులు వ్యవసాయానికి ఇబ్బంది పడకుండా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం తీసుకొచ్చింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. కర్షకులకు అండగా నిలిచేలా పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ ద్వారా ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందించనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్రం రూ.6 వేలు ఇవ్వనున్నాయి. తొలి విడత పీఎం కిసాన్ కింద రూ.2 వేలు, అన్నదాత సుఖీభవా కింద రూ.5 వేలు కలిపి రూ.7 వేలు అందించనున్నారు.

కవిటి మండలం నెలవంక రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకుంటున్న అన్నదాతలు

మండలం	అర్హులు	ఈకేవైసీ పెండింగ్
కవిటి	7,094	06
ఇచ్ఛాపురం	6,608	67
కంచిలి	8,629	44
సోంపేట	8,132	25

అపరిష్కృతంగా 142 మంది వివరాలు

వ్యవసాయ శాఖ వెబ్‌ల్యాండ్ ఆధారంగా రైతుల జాబితాలు ఖరారు చేసి రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా వడబోత విధానంలో అర్హుల జాబితా సిద్ధం చేసింది. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో 30,463 మంది అన్నదాతలకు ఇందులో చోటు దక్కింది. 142 మంది వివరాలు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రస్తుతం జాబితాలో లేని రైతులకు ఆగస్టులో ఆర్థిక సాయం జమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

బ్యాంకు ఖాతాలకు జమ

అన్నదాతా సుఖీభవ పథకానికి సంబంధించి అర్హుల జాబితా సిద్ధం చేశాం. రైతుల ఈకేవైసీ ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు తొలి విడతలో రూ.7 వేలు జమ చేస్తుంది. ఖరీఫ్ సాగుకు ఆర్థిక సాయం భరోసాగా నిలుస్తుంది. ఈ మొత్తాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
- టి.భవానీ శంకరరావు, ఏడీఏ, సోంపేట

మౌలిక వసతులకు దూరం

న్యూస్‌టుడే, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి శివాజీనగర్‌లో మౌలిక వసతులు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన వీధిలో అనుసంధాన రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టలేదు. చిన్నపాటి వర్షం కురిసినా ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోయి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి లేబర్ కాలనీ కూడలి మీదుగా శివాజీనగర్ ప్రాంతం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ వరకు విస్తరించి ఉంది. వర్షం పడే సమయంలో ఎగువ నుంచి వరద నీరంతా ఇక్కడికి చేరుతుండటంతో రహదారులు బురదమయమవుతున్నాయి.

శివాజీనగర్‌లో రహదారి నిర్మాణానికి నోచుకోని ఓ వీధి

దోమల మోత..

శివాజీనగర్ లోతట్టు ప్రాంతం కావడం, కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చిన వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దోమల మోతతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన వీధుల్లోనే చెత్త సేకరిస్తున్నారు. పలుచోట్ల వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ విష కీటకాలు సంచరిస్తున్నాయని తెలిపారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ ఎన్.రామారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా నిధుల లభ్యత మేరకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వీధి దీపాలు వెలిగాయ్..

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణ పరిధి బ్రాహ్మణ వీధి ఒడియా పాఠశాల, ఏఎస్‌పేటలో వెలగని వీధి దీపాలకు పుర సిబ్బంది మరమ్మతులు చేశారు. ఆయా సమస్యలను స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా దృష్టికి తీసుకురావడంతో పురాధికారులు స్పందించారు. కమిషనర్ నల్లి రమేష్ ఆదేశాల మేరకు పుర ఏఈ పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో సమస్యలు పరిష్కరించారు.

చెత్త తొలగించారు

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి-సోంపేట ప్రధాన రహదారిలో మఠం కంచిలి వద్ద స్వర్గధామం, చెరువు సమీపంలో చెత్త పేరుకుపోయింది. స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో పంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించారు. గురువారం పొక్లెయిన్ సాయంతో సర్పంచి ప్రతినిధి లోకనాథం సమక్షంలో చెత్త తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాల మెకానిక్‌ల ర్యాలీ

ప్రపంచ ద్విచక్ర వాహనాల మెకానిక్‌ల దినోత్సవాన్ని కవిటిలో గురువారం చింతామణి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమావేశం అనంతరం ర్యాలీగా వెళ్లారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మండలంలోని టూ వీలర్ మెకానిక్‌లు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

సామాజిక భవనం ప్రారంభం

కంచిలి మండల పరిధి కత్తివరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.5 లక్షలతో నిర్మించిన ఎస్సీ సామాజిక భవనాన్ని గురువారం ఎంపీపీ పి.దేవదాస్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు దుర్గాశి దర్మారావు, పొందూరు మాదవి, లడ్డు కేశవపాత్ర, కొనపల సురేశ్, తలగాన తిరుపతి పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

స్వయం ఉపాధి పొందండి

పలాస, న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధి పొందాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో గురువారం డిజి లక్ష్మి పథకం కింద సీఎస్‌ఆర్ కిట్లు పంపిణీ చేశారు. సీఎంఎం పి.మోహన్, సీవో బాలరాజు, విజయ్, సీఎల్‌ఆర్‌పీలు, డిజి లక్ష్మి నిర్వాహకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కిట్లు అందజేస్తున్న కమిషనర్ రామారావు

అవీ.. ఇవీ.. అన్నీ

మహిళల భద్రతకే శక్తి యాప్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మహిళల భద్రతకు ఉపయోగపడేలా ప్రభుత్వం శక్తి యాప్ తీసుకొచ్చిందని కాశీబుగ్గ సబ్‌డివిజన్ శక్తి టీం ఎస్సై రవి, ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై ఎం.ముకుందరావు అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్, సైబర్ నేరాలు ఇతర సమస్యలు ఎదురైనపుడు యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ వాన శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీవో రజనీ కుమారి, అధ్యాపకులు నవ్యశ్రీ మహంతి, ప్రియా సుధాకర్, నట్ట బాపూజీ, బి.సునీత, శాంతి పాల్గొన్నారు.

కొబ్బరి పునరుద్ధరణ పథకంతో మేలు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కొబ్బరి పునరుద్ధరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొబ్బరి అభివృద్ధి బోర్డు డైరెక్టర్ అరవాజ్ (కోయంబత్తూరు) సూచించారు. మండల పరిధి పెద్దశ్రీరాంపురం, కత్తివరం గ్రామాల్లో గురువారం ఉద్యాన శాఖ అధికారులతో కలిసి కొబ్బరి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వయసు పైబడిన చెట్లను తొలగించడానికి చెట్టుకు రూ.వెయ్యి చొప్పున బోర్డు అందజేస్తుందని తెలిపారు. ఆ స్థలంలో నాటడానికి కొబ్బరి మొక్కల్ని ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రెండేళ్ల వరకు హెక్టారుకు రూ.17,500 అందిస్తామని తెలిపారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్లు జయనాథ్, కుమారవేళ్, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, ఏడీ చిట్టిబాబు, హెచ్‌వో మాదవీలత, తెదేపా మండలాధ్యక్షుడు మాదిన రామారావు పాల్గొన్నారు.

విశ్రాంత హవల్దార్‌కు స్వాగతం

దేశ రక్షణ శాఖలో హవల్దార్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామానికి వచ్చిన పోతనపల్లి జగదీశ్వరరావుకు గురువారం ఘన స్వాగతం లభించింది. పలాస మండలం బొడ్డపాడుకు చెందిన ఆయన్ను ప్రత్యేక వాహనంపై పలాస రైలు నిలయం నుంచి ర్యాలీగా గ్రామానికి తీసుకొచ్చారు. అభినందన సభలో ఆయన మాట్లాడుతున్న చిత్రాన్ని చూడొచ్చు. సర్పంచి తామాడ మదన్, కిక్కర ఢిల్లీరావు, కుసుమ హరనాథ్ పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మాజీ కౌన్సిలర్ మృతికి సంతాపం

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో మాజీ కౌన్సిలర్ **దేవ లక్ష్మణమూర్తి** (60) మృతి చెందారు. ఉంగరం గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఆయన 2007-12 పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించారు. ఇటీవల అస్వస్థతకు గురికాగా బుధవారం రాత్రి కన్నుమూశారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పురపాలక సంఘం అధ్యక్షుడు బళ్ల గిరిబాబు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, జంట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా మోహన వెంకటేశ్

ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా డా.తిప్పన మోహన వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా కాదా రామకోటి బాధ్యతలు స్వీకరించారు. ఇచ్ఛాపురంలోని రోటరీ క్లబ్ సామాజిక భవనంలో గురువారం నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి (భువనేశ్వర్), రోటరీ జిల్లా మాజీ గవర్నర్ రొబినా రాయణ నందా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజ్‌కుమార్, పి.దినేష్‌కుమార్ నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. హెచ్‌సీ తెలుకుల రామారావు చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను గుర్తించి సత్కరించారు. రోటరీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.డి.త్రినాథరెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నవ్య ఆలోచనలతో నవ సమాజావిష్కరణ

పలాస పట్టణం, న్యూస్‌టుడే: యువత నవ్య ఆలోచనలతో సమస్యల్లేని నవ సమాజ ఆవిష్కరణ దిశగా ముందడుగు వేయాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి విద్యార్థులను కోరారు. కళాశాలలో గురువారం నిర్వహించిన 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఆమె మాట్లాడారు. సమాజ హితానికి దోహదపడాలని సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎల్.గణపతిరావు, కార్యక్రమ సమన్వయకర్తలు పి.వెంకటరమణ, ఎం.శ్రీనివాసపట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి

అడుగడుగునా గోతులు.. తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, సోంపేట

సోంపేట, మందస మండలాల పరిధిలో తీర ప్రాంతం, ఉద్దానం గ్రామాలు రాకపోకలు సాగించే ఎర్రముక్కాం రోడ్డు అధ్వానంగా మారింది. కొన్నేళ్లుగా మరమ్మతులు, నిర్వహణకు నోచుకోకపోవడంతో దారి పొడవునా గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

100 మీటర్లకో మలుపు

రాణిగాం-ఎర్రముక్కాం రహదారి సోంపేట, మందస మండలాల పరిధిలో ఉద్దానం గ్రామాలకు అనుసంధాన మార్గంగా ఉపయోగపడుతుంది. నేరుగా 15 గ్రామాలు, అనుసంధాన రహదారులతో మరో 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. 5 కి.మీ. పైగా రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ కోతకు గురైంది. 100 మీటర్లకు ఒక మలుపు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ఇరువైపులా జీడి తోటలుండటంతో ఎలుగుబంట్లు సంచరిస్తుంటడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో బస్సులు పూర్తిస్థాయిలో నడపడం లేదు. విద్యార్థులు, రైతులు, మత్స్యకారులు, ఇతర వర్గాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా మారిన ఎర్రముక్కాం రహదారి

ఉద్దానం రహదారి నిర్వహణకు దూరం

కానరాని హెచ్చరిక బోర్డులు

మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. నిర్వహణ లేకపోవడంతో పనికి రాని మొక్కలు, పొదలు పెరిగిపోయాయి. బెర్ముల పరిస్థితి సరిగా లేకపోవడంతో వాహనాలు తప్పుకోడానికి సమస్యలు నెలకొంటున్నాయి.

బీటీ రోడ్డు నిర్మించాలి..

తిత్లీ తుపాను తరువాత రాణిగాం-ఎర్రముక్కాం రహదారి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలి. - బి.ఈశ్వరి, సర్పంచ్, సిరిమామిడి

ప్రతిపాదనలు పంపాం..

రహదారి నిర్మాణానికి రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ప్రయత్నిస్తాం. - ధనుంజయ్, ఏఈఈ, పీఐయూ

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం

ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో గురువారం భారతీ క్రైస్తవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇచ్ఛాపురంలో పత్తి అన్వేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ❖ పలాస మండలం లొత్తూరు, చిన్న పలియా, డెర్లి గ్రామాల్లో పేదలకు చిన్నబాడం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్ బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్, సంఘ సభ్యులు వస్త్రాలు, ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. ❖ క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డీవీడీవీ కుమార్ (బోసుబాబు) అన్నారు. కాశీబుగ్గలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెయింట్ థామస్ త్యాగాన్ని వివరించారు.

ఇచ్ఛాపురం: సామాజిక ఆసుపత్రిలో రోగికి పండ్లు, రొట్టె అందజేస్తున్న క్రీస్తు విశ్వాసులు

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న: నందిగాం మండలం సైలాడ పంచాయతీ బంజీరుపేట గ్రామంలో ఉన్న చిన్న తరహా రక్షిత తాగు నీటి పథకం ఆరు నెలలుగా పని చేయడం లేదు. దీంతో తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. తొందరగా మరమ్మతులు చేయించాలి.
– శ్యామలరావు, స్థానికుడు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతు పనులు చేయిస్తాం. – కురేష్ బెహరా, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, నందిగాం

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

ఘనంగా సత్యసాయి పల్లకీ సేవ

సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా కోటబొమ్మాళి మండలం కొత్తపేటలో బాబాకు పల్లకీ సేవను భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయరహదారిపై కొత్తపేట కూడలి నుంచి విద్యుత్తుఉపకేంద్రం వీధివరకు నగరసంకీర్తన సాయి నామస్మరణలు, భజనలతో తిరువీధి నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని పల్లకీసేవ చేశారు. కోటబొమ్మాళి, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన సాయిభక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

పేదల సంక్షేమానికి పెద్దపీట

ఎల్ఎన్‌పేట, సారవకోట, నరసన్నపేట, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, జలుమూరు, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, పలువురు తెదేపా నాయకులు అన్నారు. టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ★ నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఎల్ఎన్‌పేట మండలంలో మోదుగువలస పునరావాస కాలనీ(చిన్నకొల్లివలస)లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా కలెక్టరు, స్థానిక మంత్రి, ఎంపీలతో కలిసి నిర్వాసితుల కమిటీతో సమావేశం ఏర్పాటు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సారవకోట: మాలువలో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఎల్ఎన్‌పేట: ఎమ్మెల్యే గోవిందరావుకు సమస్యలు వివరిస్తున్న నిర్వాసితులు

పాడి రైతులకు కూటమి అండ

పోలాకి, న్యూస్‌టుడే: పాడి రైతులకు అన్ని విధాల కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం మబుగాంలో పాడి పశువుల రైతులకు రాయితీపై దాణా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు తప్పక అమలు చేస్తామన్నారు. పశువైద్యాధికారిణి పద్మప్రియ పాల్గొన్నారు.

పాత కష్టం పోయింది.. కొత్త సమస్య వచ్చింది

★ తిలారు ఆర్వోబీ వంతెనపైకి మార్గం లేక ప్రయాణికుల అవస్థలు
★ 600 మీ. ముందుకొచ్చి ఎండలో పడిగాపులు

– న్యూస్‌టుడే, జలుమూరు

కళింగపట్నం - పాతపట్నం 326ఏ జాతీయ రహదారిలో తిలారు రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ రద్దీతో గతంలో ప్రయాణికులు అవస్థలు పడేవారు. దాన్ని గుర్తించిన ప్రభుత్వం పైవంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జమ్ముకూడలి నుంచి పాతపట్నం వరకు రూ.235 కోట్లను 2019లో మంజూరు చేసింది. రూ.42 కోట్లతో తిలారు రైల్వేవంతెన నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం బస్సులు, ఇతర వాహనాలు వంతెనపై నుంచి వెళ్లిపోతుండటంతో పైకి వెళ్లేందుకు అవకాశం లేక ప్రయాణికులకు కొత్త సమస్య మొదలైంది. సుమారు 600 మీటర్ల ముందున్న నారాయణవలస వద్దకు వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది.

తిలారుకూడలి-నారాయణవలస మధ్య బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

తిలారు రైల్వే నిలయానికి వెళ్లే మార్గం కావడంతో జలుమూరు, కోటబొమ్మాళి, పాతపట్నం, నరసన్నపేట, పోలాకి తదితర మండలాకు చెందిన ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నదూగాం, రావిపాడు, ఏనేటికొత్తూరు, తిలారు, యాళ్లపేట, రామినాయుడుపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ కూడలిలోనే బస్సు ఎక్కేవారు. ప్రస్తుతం మరికొంత మార్గం నడిచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు ఎక్కేందుకు వచ్చే సమయంలో వర్షం పడినా, ఎండ తీవ్రంగా ఉన్నా కాస్త సేద తీర్చుకునేందుకు నిలువ నీడ లేదు. అధికారులు స్పందించి వసతి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమయం వృథా..

కళాశాలకు ఉదయం 7.30 గంటలకే బయలుదేరుతాం. ఇంటి నుంచి కూడలికి 15 నిమిషాలు. అక్కడ నుంచి వంతెన చివరికి మరో 10 నిమిషాల సమయం వృథా అవుతోంది. అప్పటికే బస్సులు వెళ్లిపోయే సందర్భాలు ఉన్నాయి. సుమారు 80 మంది విద్యార్థుల వరకు ఈ కూడలి నుంచే ప్రయాణిస్తారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – పీస పూజిత, విద్యార్థిని, చిన్నదూగాం

బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు..

తిలారు రైల్వే పైవంతెన వద్ద మెట్లమార్గం అవకాశం ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వంతెన చివర 600 మీటర్ల దూరంలోనే ఉంది. ప్రయాణికుల సమస్యను దృష్టిలో పెట్టుకొని బస్‌షెల్టర్ నిర్మాణానికి నిధులకోసం ప్రతిపాదించాం. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
– కె.సత్యభాస్కర్, డీఈఈ జాతీయ రహదారుల విభాగం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నందిగాం: నందిగాం మండలం లట్టిగాం ఫీడరు, నందిగాం పారిశ్రామిక ఫీడర్లకు సంబంధించి మరమ్మతులు చేపడుతుండటంతో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఈఈ శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

8న వినియోగదారుల పరిష్కార వేదిక

టెక్కలి, న్యూస్‌టుడే: ఈ నెల 8న టెక్కలిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఆశాఖ ఏఈ మురళీ మోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తొలుసూరిపల్లి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

పంపిణీకి సిద్ధంగా మొక్కలు

సారవకోట: సారవకోట మండలంలోని మహశింగి పంచాయతీ కొత్తపేట నర్సరీలో 18 రకాలకు చెందిన 50 వేల మొక్కలు ఉచితంగా పంపిణీకి సిద్ధం చేసినట్లు అటవీ సెక్షన్ అధికారి ఈశ్వరరావు తెలిపారు. ఇరిడి, జామ, జమ్మి, నెమలినార, బాదం, ఏగిస, మునగ, ఉసిరి, శ్రీగంధం, ఎర్రచందనం, గుమ్మడి, రెల్ల, సీతాఫలం, కానుగ, నల్లమద్ది వంటి మొక్కలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సమాచారం కోసం 99634 48740ను సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా లేకుంటే ప్రమాదమే..

నరసన్నపేట మండలం బాలసీమ ప్రధాన వీధిలో విద్యుత్తు స్తంభం దిగువ భాగంలో ఇనుప ఊచలు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాకాలం సమయం కావడంతో చిన్నారులు, వృద్ధులు ఎవరైనా స్తంభాల వద్ద వెళ్తే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశముందని, ముందే దాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

సామాజిక నిర్లక్ష్యం..

కొత్తూరు మండలంలోని మహసింగి ఆర్అండ్ఆర్‌కాలనీలో ప్రజల కోసం నిర్మించిన సామాజిక భవనం వృథాగా ఉంది. రూ.లక్షల ఖర్చుతో విలువైన స్థలంలో దీన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ప్రజల అవసరాలకు ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్వాసితకాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ వసంతకుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

నిర్మించారు.. సౌకర్యాలు మరిచారు..

సారవకోట మండలం నౌతల గ్రామంలో గ్రామీణ పశు వైద్య కేంద్రాన్ని 2017లో నిర్మించారు. కేంద్రంలోకి రాకపోకల కోసం మెట్లు, విద్యుత్తు, మరుగుదొడ్డి వంటి సౌకర్యాలు నేటికీ కల్పించలేదు. కిటికీలకు ఉన్న తలుపులు పాడవ్వడంతో వర్షం పడితే నీరు గదుల్లోకి చేరుతోంది. విద్యుత్తు సౌకర్యం లేక టీకాలను సారవకోట ఆసుపత్రిలో ఉంచుతున్నారు. రోజూ బాక్సుల్లో తెచ్చి వినియోగించి మిగతావి తిరిగి ఆసుపత్రికి తరలిస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తానని మండల పశువైద్యాధికారి కిశోర్ తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట

అడుసు తొక్కి వెళ్లాల్సిందే..

నరసన్నపేటలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణానికి వెళ్లే దారి పరిస్థితి ఇది. నిర్మాణ పనులు చేపట్టే పలు ఇంజినీరింగ్ కార్యాలయాలకూ ఇదే మార్గం. చిన్నపాటి వర్షానికే మురుగు రోజుల తరబడి ప్రాంగణం ద్వారం వద్ద నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. అధికారులు సహా, వివిధ పనులపై అక్కడికి వచ్చిన ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఎవరైనా మురుగులో దిగి వెళ్లాల్సిందే. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్ వద్ద ప్రస్తావించగా వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, నరసన్నపేట

కూలకముందే మేల్కోండి..

జాతీయ రహదారిపై పెద్దబమ్మిడి పంచాయతీ నిమ్మాడకూడలి ముందు పంటపొలాల్లోకి కొబ్బరిచెట్ల సమీపంలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ పనుల సమయం కావడంతో రైతులు పొలాల్లోకి ఎక్కువ సమయం ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. క్షేత్ర సిబ్బందితో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ కృష్ణ స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకోండి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ తతజడ్జి నిర్మల

టెక్కలి, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల సూచించారు. టెక్కలి సివిల్ జడ్జి కోర్టులో అవగాహన సదస్సును నిర్వహించారు. 90 రోజుల పాటు మధ్యవర్తిత్వంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదులు డి.వి.వివేకానంద, దివాకర్, వైకుంఠరావు, భుజంగరావు పాల్గొన్నారు.

వీడీవీకే నిర్వహణపై అసంతృప్తి

మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇరపాడుగూడ పంచాయతీలో గిరిజన సంక్షేమానికి మంజూరు చేసిన వన్‌ధన్‌వికాస కేంద్రం (వీడీవీకే)ను కొత్తూరులోని ఆర్టిక్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నిర్వహించడంపై డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం రవికుమార్, ఏపీఎంలు లలిత, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడదాం

కొత్తూరు, హిరమండలం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదామని ఆ సంఘం కొత్తూరు మండలశాఖ అధ్యక్షుడు చంద్రరావు, ప్రతినిధులు అన్నారు. కొత్తూరులో జాతీయ ద్విచక్ర వాహనదారుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. హిరమండలంలో ద్విచక్ర వాహన మెకానిక్‌ల సంఘం సభ్యులు కేకు కోసి పంచిపెట్టారు. ఏబీ రహదారిపై ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మెకానిక్‌ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

హిరమండలం: ర్యాలీలో పాల్గొన్న ద్విచక్ర వాహన మెకానిక్‌ల సంఘ సభ్యులు

వ్యాధుల కాలం.. జాగ్రత్తలు అవసరం

జలుమూరు, నరసన్నపేట, పాతపట్నం, హిరమండలం, నందిగాం, న్యూస్‌టుడే: ప్రస్తుతం వ్యాధుల కాలం నడుస్తోంది గ్రామాల్లో సంబంధిత అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. ★ గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని నరసన్నపేట ఎంపీడీవో వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. దూకులపాడు, సత్యవరం తదితర గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ★ పాతపట్నం మండలంలోని సరాళి, దశరథపురం, తిడ్డిమి, రంకిణి గ్రామాల్లో ఎంపీడీవో పి.చంద్రకుమారి పర్యటించారు. ★ నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు కుమార్ పట్నాయక్, రాజారావు పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

ఆటో స్టాండ్ మార్చండి

కోటబొమ్మాళి: టెక్కలిలో కోనేరు వద్ద ఆటో స్టాండును మరో స్థలంలోకి మార్చుచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆటో కార్మికులకు సూచించారు. మహిళలకు ఉచితబస్సు అమలు చేసే నాటికే వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

పాఠశాల దస్త్రాలు స్వాధీనం

టెక్కలి: ఇటీవల అనుమతులు లేక మూసివేసిన రవీంద్రభారతి పాఠశాల రికార్డులను విద్యాశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్, మండల విద్యాశాఖాధికారి తులసీరావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

పాతపట్నం: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని గంగువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డి.శివ అన్నారు. పాతపట్నం క్షయ యూనిట్ ఆధ్వర్యంలో సింగుపురంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు వంటి అంశాలను గ్రామస్థులకు వివరించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు..

మెళియాపుట్టి: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఉందని కరజాడ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్‌ల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక చైతన్య కార్యక్రమం చేపట్టారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

నరసన్నపేట: స్థానిక బొడ్డవలస సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన చేకూరింది. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సత్యసాయి మందిరంలో ఈ శిబిరాన్ని కన్వీనరు వి.నాగేశ్వరరావు ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

వృద్ధులకు పథకాలు

హిరమండలం: ఆయుష్మాన్ భారత్ వయో వందన కార్డుతో 70 ఏళ్ల వయసు నిండిన వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం లబ్ధిచేకూర్చేందుకు చర్యలు తీసుకుంటుందని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరూక్ అన్నారు. హిరమండలంలో వైద్య ఆరోగ్య ఉద్యోగులు ఆయుష్మాన్ భారత్ వయో వందన సర్వే నిర్వహించారు. దీని ద్వారా నెలవారీ స్థిర పింఛను, ఏటా రూ.5 లక్షల ఆరోగ్య బీమా లభిస్తుందన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నందిగాం: మండలం పెద్దతామరాపల్లి గ్రామంలో ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామపుర వీధుల్లో ఊరేగించారు.

ప్రభుత్వ బడుల్లోనే గుణాత్మక విద్య

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్య అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురువిల్లి వెంకటరమణ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా లింగాలవలస గ్రామంలో అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. సర్వశిక్షా అభియాన్ పరిశీలకుడు కింజరాపు రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పథకానికి నిధుల మంజూరు

పోలాకి, న్యూస్‌టుడే: తెలినీలాపురం జీసీఎఫ్ వాటర్ షెడ్ పథకానికి పోలాకి మండలంలో అంపలాం, ఓదిపాడు గ్రామాలు ఎంపికైనట్లు ఏపీవో రమణ తెలిపారు. గురువారం అంపలాం గ్రామంలో రైతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల్లో అంపలాంకు రూ.1.27 కోట్లు, ఓదిపాడుకు రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ రెండు గ్రామాల్లో ఫారంపాండ్లు, పొలాల్లో నీరు నిల్వ చేసే గుంతలు వంటి పనులు చేపడతామన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

హిరమండలం, న్యూస్‌టుడే: జగన్నాథపురం గ్రామం సమీపంలో వివాదాస్పదమైన సాగు భూములను అధికారులు గురువారం పరిశీలించారు. భూములకు సంబంధించి కొన్నేళ్ల కిందట ప్రభుత్వం తమకు హక్కు పత్రాలు మంజూరు చేసిందని, ఆ భూముల్లో కొంతమంది సాగుచేస్తున్నారని గిరిజనులు ఆరోపించారు. పూర్తి స్థాయిలో పరిశీలించి, సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దారు తెలిపారు.

చెరువు ఆధునికీకరణ పనులు ప్రారంభం

సారవకోట, న్యూస్‌టుడే: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ నెల 2న నౌతల కూడలి నుంచి నౌతల గ్రామం వరకు స్థానిక విద్యార్థులతో నడిచారు. ఆ సమయంలో నాయుడు చెరువు అధ్వానంగా కనిపించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆధునికీకరించాలని అధికారులకు సూచించడంతో పనికిరాని మొక్కలు, చెత్త కుప్పల తొలగింపు పనులు చేపట్టారు.

మద్యం సీసాలు స్వాధీనం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలో ఏబీ రహదారిపై 70 మద్యం సీసాలతో కోవిలాం గ్రామానికి చెందిన నవీన్ పట్టుబడినట్లు సరుబుజ్జిలి ఎస్సై జి.హైమావతి తెలిపారు. ఏబీ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించగా ఆయన వద్ద మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్‌తో ఆదాయం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: ఉద్యానవన పంటలైన ఆయిల్‌పామ్‌తో ఆదాయం పొందొచ్చని, అంతరపంటగా కోకో వేసుకుంటే మరింత లాభదాయకమని ఏవో గోవిందరావు సూచించారు. విశ్వనాథపురంలో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. మెట్టభూముల్లో ఉద్యానపంటలు వేసుకోవాలన్నారు. కలుపునివారణ, ఎరువుల వినియోగంపై పలు సూచనలు చేశారు.

విశ్వనాథపురంలో ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏవో గోవిందరావు

రామావతారంలో జగన్నాథుడు

ఎల్ఎన్‌పేట, పర్లాఖెముండి: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీనర్సుపేట గుండిచా మందిరంలో ఉన్న జగన్నాథస్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ★ పర్లాఖెముండిలో జగన్నాథస్వామిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించుకున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో కొరవడిన నిఘా

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

గ్రామ శివార్లలో ఒంటరి మహిళే లక్ష్యంగా ఆగంతకులు చోరీలకు పాల్పడుతున్నారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై వచ్చి దొంగతనాలకు చేసి ఉడాయిస్తున్నారు. మహిళల మెడలో బంగారు ఆభరణాలు తస్కరించి పరారవుతున్నారు. మెళియాపుట్టి మండలం పరిధిలో మూడేళ్లుగా.. జరిగిన సంఘటనలను పరిశీలిస్తే.. నిఘా పరిస్థితికి అద్దం పడుతుంది.

వృద్ధులే లక్ష్యంగా చోరీలు

మూడేళ్లలో పలు కేసులు నమోదు

ఇదీ పరిస్థితి..

ఆంధ్రా -ఒడిశా సరిహద్దు ప్రాంతం మెళియాపుట్టి మండలంలో శేఖరాపురం వద్ద జూన్ 29న పొలం నుంచి వస్తున్న నక్క తులసమ్మ మెడలో సుమారు తులం బంగారు ఆభరణం చోరీ చేసి ఆగంతుకులు ద్విచక్రవాహనంపై పరారయ్యారు.

బాధితురాలు రవణమ్మ

★ ఈ ఏడాది జనవరిలో టెక్కలి రోడ్డులో మెళియాపుట్టి శివార్లలో కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేటకు చెందిన బడాన అప్పన్న, రవణమ్మ ద్విచక్రవాహనం వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్ద ఉన్న 3 తులాల బంగారాన్ని తస్కరించుకుపోయిన సంఘటన చోటుచేసుకుంది.

★ 2024 అక్టోబరులో టక్కోయి గ్రామానికి చెందిన పల్లి కనకమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు అపహరించుకుపోయారు.

★ 2024 మేలో జాడుపల్లి కాలనీ మల్లారెడ్డి పద్మ అనే మహిళ మెడలో సుమారు రెండు తులాల బంగారు ఆభరణాన్ని గుర్తు తెలియని దుండగులు లాక్కొని ఉడాయించారు.

★ 2023 జూన్ 21న పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన గొట్టిపల్లి నారాయణమ్మ అనే వృద్ధురాలు బంధువుల ఇంటికి వెళ్లి ఆటోలో వస్తుండగా అందులో ఉన్న కిలాడీ మహిళలు ఆమెతో మాటలు కలిపి మూడు తులాల బంగారు గొలుసును తస్కరించారు.

భయందోళనలో గ్రామీణులు..

గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరి మహిళలే లక్ష్యంగా సాగుతున్న చోరీ సంఘటనలపై గ్రామీణులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల కాలం కావడంతో. మహిళలు పక్క గ్రామాల పొలాలకు సైతం ఒంటరిగా వెళ్లి రావాలంటే ఆందోళన చెందుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం..

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రత్యేక నిఘా ఉంది. సరిహద్దుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. తాజా సంఘటనపై కూడా సీసీ ఫుటేజీ సేకరించి దర్యాప్తు చేస్తున్నాం. గతంలో జరిగిన సంఘటనలపై కూడా రికవరీలు జరుగుతున్నాయి. వ్యవసాయ పనులకు మహిళలు ఒంటరిగా వెళ్లకుండా సామూహికంగా వెళ్లి రావడానికి ప్రయత్నించాలి. బయటకు వెళ్లే సమయాల్లో విలువైన ఆభరణాలు ధరించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి.
– రామారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పాతపట్నం

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. బాడాం ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. 10న నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు జగదీశ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి

భక్తిశ్రద్ధలతో పీర్ల ఉత్సవం

పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం కూర్మనాథపురంలో ముస్లింల పండగైన మొహర్రంను హిందువులు ఘనంగా నిర్వహించారు. ఏడో రోజు సర్కస్‌ను గ్రామస్థులు చేపట్టి తమ భక్తిని చాటుకున్నారు. ఇమామ్ షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గ్రామస్థులు పీర్ల వద్ద బిందెలతో నూనె దీపాలు వెలిగించారు. సాయంత్రం పీర్లను పల్లకిలో ఊరేగించారు. రాత్రి అగ్ని గుండంపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు.

CHANGE OF NAME

I, Smt. BAGADI BULU, W/o BAGADI SANMUK RAO, R/at 1-141, Pedda Veedhi, Lingalavalasa Village & Post, Tekkali Mandal, Srikakulam District, Andhra Pradesh, Pin: 532201, Have changed my name SAURA BULU (old name) to BAGADI BULU (New Name). Shall henceforth be known as BAGADI BULU for all practical purposes.

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం: 5-03-1933 మరణం: 25-06-2025

ఆప్యాయతానురాగాలు పంచిన, ఆదర్శమూర్తిగా ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది అందరి మన్ననలు చూరగొని కుటుంబ శ్రేయస్సుకై అహర్నిశలు శ్రమించిన మీరు ఆకస్మికంగా దైవసన్నిధికి చేరినందుకు చింతిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.... అశ్రునయనాలతో

శ్రీ శ్రీ గొర్లె సూర్యనారాయణ గారు
రిటైర్డ్ టీచర్, రాగోలు, (RTC కోలని)
భార్య: శ్రీమతి గొర్లె పగడాలమ్మ

కుమారులు - కోడళ్లు	కుమార్తెలు - అల్లుళ్లు
గొర్లె గణపతిరావు - సరోజనమ్మ	గేదెల విజయలక్ష్మి - స్వర్గీయ బలరాం
గొర్లె వెంకటరమణమూర్తి - జయలక్ష్మి	గేదెల పద్మకుమారి - రఘుపతిరావు
గొర్లె ప్రభాకరరావు - తులసి	మనుమలు మరియు మనుమరాండ్రు
గొర్లె సుబ్రమణ్యం - యోగేశ్వరి	మునిమనుమలు

పెద్దకర్మ: తే 05-07-2025 శనివారం RTC కోలనీ, రాగోలులో మా స్వగృహమునందు జరుపబడును. 9949605491

(c) eenadu

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

పడితే ప్రమాదమే

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలోని ఈదురు గాలులకు చెట్టు కొమ్మ విరిగి విద్యుత్తు స్తంభంపై పడింది. ఏ క్షణమైనా కిందపడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు కొమ్మ తొలగించాలని స్థానికులు కోరారు. విద్యుత్తుశాఖ ఏఈ అప్పన్న వద్ద ప్రస్తావించగా తొలగింపు చర్యలు తీసుకుంటామన్నారు.

తెరపై ఈనాడు

● కిన్నెర : 3బీహెచ్‌కే ● కీర్తన: జురాసిక్ వరల్డ్ రీబర్త్ ● కీర్తిక : షో టైం ● మారుతి : మార్గన్ ● ఎస్వీసీ (రామలక్ష్మణ): కుబేరా ● సన్‌మార్క్స్: తమ్ముడు ● సూర్యమహల్: కన్నప్ప ● సరస్వతి: జురాసిక్ వరల్డ్ రీబర్త్

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే:

? ప్రశాంతినగర్‌లో మట్టి రహదారులతో ఇబ్బందులు పడుతున్నాం. - గోపీ, స్థానికుడు ●సిమెంటు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. -జాన్సన్, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

? బొడ్డేపల్లిపేట ప్రధాన రహదారిలో గోతులతో అవస్థలు తప్పడం లేదు. - మురళి, స్థానికుడు ●మరమ్మతులు చేపడతాం. జాన్సన్, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

? రావికంటిపేటలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - కరుణాకర్, స్థానికుడు ●సమస్య పరిష్కరిస్తాం. - రామారావు, విద్యుత్తు శాఖ ఏఈ, ఆమదావలస

సరుబుజ్జిలి,న్యూస్‌టుడే:

? మండలంలోని చిన్నకాకితాపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని అభివృద్ధి చేయండి - రాంబాబు, చిన్నకాకితాపల్లి
● పరిశీలించి అభివృద్ధికి కృషి చేస్తాం. -డి.బాలరాజు, ఎంఈవో

? మండలంలోని మర్రిపాడు సాగునీటి చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయింది. - ఎస్.రామారావు.మర్రిపాడు.
● తొలగింపు చర్యలు చేపడతాం. -దాలయ్య, ఇరిగేషన్ జేఈ

? అమృతలింగానగరంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. -బి.రమేష్‌కుమార్, స్థానికుడు
● నిధులు మంజూరైతే కొత్త భవనం నిర్మిస్తాం. -డి.బాలరాజు, ఎంఈవో

ఏడాది పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

రణస్థలం, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనకే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. గురువారం అల్లివలసలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రహదారిని ప్రారంభించారు. ● సంక్షేమ, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం చిన్నజొన్నవలస సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు హయాంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు.

ఆమదాలవలస మండలం చిన్నజొన్నవలసలో..

రణస్థలం: అల్లివలసలో ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

సమస్యలు విన్నారు... తక్షణం స్పందించారు..!

ప్రతి సమస్య పరిష్కరిస్తానని శ్రీకాకుళం డివిజన్ డీఎస్పీ వివేకానంద పేర్కొన్నారు. గురువారం ఉదయం 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన డయల్ యువర్ డీఎస్పీ ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

– న్యూస్‌టుడే, నేరవార్తా విభాగం

డయల్ యువర్ డీఎస్పీకి స్పందన

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

?: డే అండ్ నైట్ నుంచి ఆమదాలవలస వెళ్లే రహదారిలో కాంప్లెక్స్ వద్ద ప్రైవేటు బస్సులు ఆపేస్తున్నారు. ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం. - రవికుమార్, బలగ

డీఎస్పీ: ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశాం. ప్రైవేటు వాహనాలు ఆపకుండా చర్యలు తీసుకుంటాం.

?: ఫరీదుపేట నుంచి జాతీయ రహదారిపై ఉన్న దాబాల్లో మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. - ఓ యువకుడు

● ఎట్టి పరిస్థితుల్లో మద్యం విక్రయించకూడదు. పరిశీలించి కేసులు నమోదు చేస్తాం.

?: చిలకపాలెం వద్ద ఆటో వాహనదారులు దుకాణాల ముందు నిలపడం వల్ల వ్యాపారాలకు ఇబ్బందిగా ఉంది. - వ్యాపారి, చిలకపాలెం

● దుకాణాలకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆటోలు నిలిపేలా చూస్తాం.

?: రణస్థలం తహసీల్దారు కార్యాలయం రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మందుబాబులు రోడ్డుపై వెళ్లే మహిళలను ఇబ్బంది పెడుతున్నారు. - ఓ మహిళ, రణస్థలం

● పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తాం. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

?: శ్రీకాకుళం నగరం విశాఖ ఏ కాలనీలో రాత్రి సమయంలో ఖాళీ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నారు. - రాము, విశాఖ ఏ కాలనీ నివాసితుడు

● రాత్రివేళ బీట్ కానిస్టేబుళ్లను పంపిస్తాం. మద్యం తాగిన వారు కనిపిస్తే ఫోన్ చేయండి సిబ్బందిని పంపించి కేసు నమోదు చేస్తాం.

?: డే అండ్ నైట్ కూడలి వద్ద గ్రీన్ సిగ్నల్స్ కేవలం 30 సెకన్లు మాత్రమే ఇచ్చారు. - చంద్రశేఖర్,శ్రీకాకుళం నగరం

● సమయం పెంపునకు చర్యలు తీసుకుంటాం.

?: శ్రీకాకుళం బ్యాంకర్స్ కాలనీలో పాఠశాల వద్ద యువకులు ద్విచక్ర వాహనాలతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. - రమణ, నగరవాసి

● కట్టడి చేస్తాం.

?: ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డాం. ఆమదాలవలసలో తమ ఇంట్లో గంజాయి, మద్యం తాగుతున్నారు. - సాహు, ఆమదాలవలస

● స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వండి. సిబ్బంది ఇంటి వద్దకు పంపిస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

?: మా కుమారుడు గంజాయికి అలవాటు పడ్డాడు. స్థానికంగా విక్రయాలు అరికట్టాలి - ఆమదాలవలస వాసి

● మీ కుమారుడికి కౌన్సిలింగ్ ఇస్తాం. విక్రయాలు జరగకుండా చేస్తాం.

?: ఆమదాలవలస మండలం చిన్న జొల్లవలస గ్రామంలో ప్రభుత్వభూమిని ఆక్రమిస్తున్నారు. - ఓ యువకుడు, ఆమదాలవలస

● రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయండి. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తే ఆక్రమణదారులపై కేసు నమోదు చేస్తాం.

వెంటనే చర్యలు

ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడిన డీఎస్పీ వివేకానంద తక్షణమే కొన్ని సమస్యలు చర్యలు తీసుకున్నారు. ఆమదాలవలసలోని తన నివాసంలో మత్తుపదార్థాలు సేవిస్తున్నారని ఫిర్యాదు చేయగా ఎస్సై బాలరాజు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. చిలకపాలెం వద్ద ఆటోలు ఆపేయడంతో దుకాణాల్లో వ్యాపారులకు ఇబ్బంది కలుగుతుందని ఫిర్యాదు చేయగా ఎచ్చెర్ల ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని ఆటో డ్రైవర్లతో మాట్లాడి ఇబ్బందిలేకుండా చూడాలని సూచించారు.

జై జగన్నాథా!

గుజరాతీపేటలో ఇంద్రద్యుమ్నంలో సత్యనారాయణ స్వామి అవతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళం సాంస్కృతికం, ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథోత్సవంల్లో స్వామి వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మొండేటి వీధిలోని శిర్డీ సాయి మందిరంలో స్వామిని కృష్ణావతారంలో, గుండిచా మందిరంలో రామావతారంలో, గుజరాతీపేటలోని ఇంద్రద్యుమ్నంలో సత్యనారాయణ స్వామి రూపంలో అలంకరించారు. పరిసర ప్రాంతాల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ● కంద్రపేటలో జగన్నాథుడి ఊరేగింపు ఘనంగా భక్తులు జరిగింది. కమిటీ సభ్యులు గురువారం అన్నవితరణ చేపట్టారు. భక్తులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించండి...

లావేరు, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024-2025లో చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల్లో శుక్రవారం నుంచి చేపట్టనున్న సామాజిక తనిఖీ బృందాలకు క్షేత్ర, సాంకేతిక సహాయకులు సహకరించాలని ఎంపీడీవో పి.వెంకటరాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని డీఆర్పీలు, క్షేత్ర, సాంకేతిక, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించారు. అనంతరం ఎస్‌ఆర్‌పీ బి.సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలో రూ.29.59 కోట్ల పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సీహెచ్.రామచంద్రరావు, ఏపీవో ఆర్. సత్యవతి, మండల ఇంజినీరింగ్ అధికారిణి శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ సూర్యనారాయణ

పొంచి ఉన్న ప్రమాదం

పొందూరు మండలం బొడ్డేపల్లి కూడలి నుంచి సింగూరు వెళ్లే మార్గమధ్యంలోని విద్యుత్తు స్తంభం పూర్తిగా ఒరిగిపోయి వాలి ప్రమాదకరంగా మారింది. మొదలవలస, తాడివలస గ్రామాలకు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విద్యుత్తు శాఖ ఏఈ సుధీర్‌ను ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

రహదారి ఛిద్రం.. జర భద్రం

పొందూరు మండలం సింగూరు గ్రామానికి వెళ్లే రహదారి ఛిద్రమై ప్రమాదకరంగా మారింది. భారీ లోడులతో ఇసుక లారీలు ప్రయాణం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ సత్యనారాయణ వివరణ కోరగా మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని నిధులు విడుదలైతే పనులు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే: పొందూరు, పొందూరు గ్రామీణం,

పొదలతో అవస్థలు

శ్రీకాకుళం నగరం ఏఎస్ఎన్ కాలనీ సమీపంలోని భాస్కర్ నగర్‌లో రహదారులకు ఇరువైపులా పనికిరాని మొక్కలు, పొదలు పెరిగిపోయాయి. రాత్రి వేళ విష కీటకాలు రహదారిపైకి వస్తుండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

బురద.. బురద

శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం పంచాయతీ మునసబుపేట వద్ద జగనన్న కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. కనీసం పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆ లే అవుట్‌లో మొత్తం 241 గృహాలు నిర్మించాల్సి ఉండగా.. కొన్ని మాత్రమే పూర్తయ్యాయి. వర్షం పడితే దారంతా బురదమయంగా మారుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

అమ్మో మలుపు..!

లావేరు మండలం జాతీయ రహదారి బుడుమూరు సంత కూడలి నుంచి రౌతుపేట, తామాడ, లక్ష్మీపురం, రేగపాలెం, రణస్థలం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి నేతేరు గ్రామానికి సమీపంలో ఉన్న మలుపు వద్ద పూర్తిగా దెబ్బతింది. వాహనాలు బోల్తా పడిన ఘటనలు ఉన్నాయి. రహదారులు, భవనాల శాఖ ఏఈఈ ఎం.ఆంజనేయ రాజు వద్ద ప్రస్తావించగా రహదారికి ఇరువైపులా కాలువలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, లావేరు

టీడీవలసలో పారిశుద్ధ్య పనులు

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం టంకాలదుగ్గివలస గ్రామంలో పలువురు జ్వరాలతో మంచాన పడడంతో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. కాలువలు శుభ్రం చేయడం తోపాటు తాగునీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ వంటి పనులు చేపడుతున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేశారు. వైద్యాధికారి యశ్వంత్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించడంతోపాటు వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి మందులు అందిస్తున్నారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

ఒక్కరే గురువు.. బోధన బరువు

లావేరు మండలం శిగిరికొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకు సంబంధించి పాఠాలు బోధించేందుకు ఒక్క ఉపాధ్యాయుడు ఇబ్బంది పడుతున్నారు. వేర్వేరు తరగతులకు చెందిన 24 మందికి అన్ని పాఠాలు చెప్పడం కష్టంగా మారిందని, ఎంటీఎస్ ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యాశాఖాధికారి-2 ఎం.మురళీకృష్ణ వద్ద ప్రస్తావించగా ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఉపాధ్యాయులను నియమించడం జరుగుతుందన్నారు. -న్యూస్‌టుడే, లావేరు

13 మంది జూదరుల అరెస్టు

సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని షళంత్రి, పురుషోత్తపురం గ్రామాలకు చెందిన 13 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై బి.హైమావతి తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపురం జీడితోటలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.16,040 నగదు, 5 చరవాణులు, షళంత్రి గ్రామంలో ఆరుగురిని అరెస్టు చేసి రూ.4,570 నగదు, రెండు చరవాణులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

● ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో జూదం ఆడుతున్న 8 మందిని గురువారం సాయంత్రం శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూ.6960 నగదును స్వాధీనం చేసుకుని ఆమదాలవలస పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తొట్టె నిండింది

స్పందనకు వందనం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని బప్పడాం గ్రామంలో తొట్టె నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు. దీనిపై ఈ నెల 1న 'తొట్టె నిర్మించినా వృథా' శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి నీటి నింపారు.

దోమల నివారణకు చర్యలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: డెంగ్యూ నివారణ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం ఇళ్ల మరుగుదొడ్ల గొట్టాలకు ప్లాస్టిక్ వలలను కట్టారు. నగర పరిధిలో మొత్తం 30 వేల నెట్‌లను సిద్ధం చేసినట్లు ప్రజారోగ్యాధికారి పి. సుధీర్‌కుమార్ తెలిపారు. ప్రజలు కూడా డెంగీ బారిన పడకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నగరంలోని ఓ ఇంటి మరుగుదొడ్డి గొట్టానికి నైలాన్ వల కడుతున్న సిబ్బంది

సంతోషిమాత జయంత్యుత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత దేవస్థానంలో అమ్మవారి జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నిర్వహణలో గురువారం శక్తి పంచాయతన త్రిరాత్రి మహాయాగం, అభిషేకం, అలంకరణ జరిపారు. 5 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈవో పి. శ్యామలరావు తెలిపారు.

కాలువ గట్టు ధ్వంసం

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణం మండలం కనుగులవానిపేటలో ఇటీవల నిర్మించిన మురుగు కాలువ గట్టును కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని సర్పంచి గంగు వెంకటరమణ తెలిపారు. గ్రామాభివృద్ధిని దృష్టిలో రూ.4.95 లక్షలు సొంత నిధులతో పనులు చేపట్టామని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

అక్రమంగా మద్యం విక్రయాలు

శ్రీకాకుళం గ్రామీణం, లావేరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణం మండలం సింగుపురంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్న గుండ లక్ష్మణరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కె. రాము తెలిపారు. ఆయన నుంచి 26 సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ● సింగుపురం పరిధిలో జూదమాడుతున్న 9 మందిని గురువారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాము తెలిపారు. ● లావేరు మండలం వెంకటాపురం కూడలిలో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన దుర్గారావు 11 సీసాలతో వెళ్తుండగా పట్టుకున్నామని ఎస్సై జి. లక్ష్మణరావు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

లావేరు, జి.సిగడాం, న్యూస్‌టుడే: లావేరు మండలం బుడుమూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి. యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. జి.సిగడాం మండలంలో బాతువ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నారు.

కలెక్టర్, ఎస్పీలకు సత్కారం

శ్రీకాకుళం సాంస్కృతికం, పాత బస్టాండ్, న్యూస్‌టుడే: పాతశ్రీకాకుళంలో ఇటీవల నిర్వహించిన సిరిమానోత్సవం విజయానికి సహకరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డిను ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువతో సత్కరించారు. కమిటీ ప్రతినిధులు డి.పి.దేవ్, నక్క శంకరరావు, రామలింగస్వామి, శేఖర్, సోంబాబు, రంగాజీదేవ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలమ్మతల్లి ఉత్సవాలు

సరుబుజ్జిలి,న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని షళంత్రి గ్రామంలో శ్రీనీలమ్మతల్లి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో ఈ ఉత్సవాలు ప్రతి ఏడాది జరుగుతాయని గ్రామస్థులు తెలిపారు. కరకవలస కుటుంబీకులు తొలిపూజ అనంతరం ముర్రాటలు పట్టుకుని వచ్చిన మహిళలు నీలమ్మతల్లికి పూజలు చేశారు.

షళంత్రిలో నీలమ్మతల్లికి పూజలు చేస్తున్న మహిళలు

మండల తెదేపా అధ్యక్షుడిగా నూకరాజు

ఆమదాలవలస గ్రామీణం,న్యూస్‌టుడే: ఆమదాలవలస తెదేపా మండల అధ్యక్షుడిగా కనుగులవలస గ్రామ సర్పంచి నూక అప్పల సూరన్నాయుడు(నూక రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఆమదాలవలస మండల తెదేపా విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్యే కూన రవి కుమార్ తీర్మానం చేయగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సుందర శ్రీకాకుళంగా తీర్చిదిద్దండి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం నగరంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపకుడు హారికా ప్రసాద్ కాలుష్యం నిరోధక కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డా. మేడిశెట్టి సత్యస్వరూప్, పూర్వ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథం నాయుడు, కార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి పార్వతీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ● లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, జిల్లా ఛైర్మన్ పొన్నాడ రవికుమార్, టెక్కం రామ్‌గోపాల్, బరాటం కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నార సంచులు ప్రదర్శిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

హెచ్‌ఐవీ పరీక్షలు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్యశాఖ ఇటీవల ప్రారంభించిన మొబైల్ హెచ్.ఐ.వి పరీక్షా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లోనే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం శ్రీకాకుళం గ్రామీణ మండలం కనుగులవానిపేటలో సర్పంచి గంగు వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నమ్రత ప్రియ, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తుకు దూరంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ అన్నారు. పొందూరు మండలం బురిడికంచరాం గ్రామంలో గురువారం అవగాహన కల్పించారు. మత్తు జీవితాలను నాశనం చేస్తుందన్నారు.

బురిడికంచరాంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

శ్రీకాకుళం నగరం ఆదివారంపేటలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరం బలగ ప్రాంతంలోని 10 వార్డుల్లో గురువారం పర్యటించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు సీహెచ్ రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.రమణయ్య, తెదేపా నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నబోతున్న బడి

తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య

– న్యూస్‌టుడే, రణస్థలం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బ్యాగులు, బూట్లు, ఇతర సామగ్రి అందజేసి మధ్యాహ్న భోజనం పెడుతున్నా.. ఆసక్తి చూపడం లేదు. తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయులు ఉంటారు. 20 మంది దాటితే అదనంగా మరొక ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు. ప్రస్తుతం చాలా బడుల్లో పదిమందికంటే తక్కువ ఉన్న పాఠశాలలు అధికమవుతున్నాయి. బడిలో చేర్పించండని ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు వెళ్లి అడుగుతున్నా.. మార్పు రావడం లేదు.

నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్న కొత్తపేట ప్రాథమిక పాఠశాల

పెంపునకు కృషి

రణస్థలం మండలంలో 19 గ్రామాలతోపాటు లావేరు మండలంలో 11, ఎచ్చెర్ల మండలంలో 12 ప్రాంతాలు, జి. సిగడాం మండలంలో 2 గ్రామాల్లోని బడుల్లో 10 మంది లోపు పిల్లలు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. 'బడిలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇస్తున్నాం. సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం' అని నాలుగు మండలాల ఎంఈవోలు త్రినాథరావు, వాగ్దేవి, పున్నయ్య, రవి తెలిపారు.

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం: 5-03-1933 మరణం: 25-06-2025

ఆప్యాయతానురాగాలు పంచిన, ఆదర్శమూర్తిగా ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది అందరి మన్ననలు చూరగొని కుటుంబ శ్రేయస్సుకై అహర్నిశలు శ్రమించిన మీరు ఆకస్మికంగా దైవసన్నిధికి చేరినందుకు చింతిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.... అశ్రునయనాలతో

కీ॥శే॥ గొర్లె సూర్యనారాయణ గారు
రిటైర్డ్ టీచర్, రాగోలు,(RTC కోలని)
భార్య: శ్రీమతి గొర్లె పగడాలమ్మ

కుమారులు - కోడళ్లు
గొర్లె గణపతిరావు - సరోజనమ్మ
గొర్లె వెంకటరమణమూర్తి - జయలక్ష్మి
గొర్లె ప్రభాకరరావు - తులసి
గొర్లె సుబ్రమణ్యం - యోగేశ్వరి

కుమార్తెలు - అల్లుళ్లు
గేదెల విజయలక్ష్మి - స్వర్గీయ బలరాం
గేదెల పద్మకుమారి - రఘుపతిరావు
మనుమలు మరియు మనుమరాండ్రు
మునిమనుమలు

పెద్దకర్మ: తే 05-07-2025 శనివారం RTC కోలనీ, రాగోలులో మా స్వగృహమునందు జరుపబడును. 9943605491

(c) eenadu

మళ్లీ నీట్ నిర్వహించడం కుదరదు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని మద్రాసు హైకోర్టు తెలిపింది. దేశవ్యాప్తంగా మే 4న నీట్ జరిగింది. ఆ రోజు చెన్నైలో కురిసిన వర్షానికి విద్యుత్తు అంతరాయం ఏర్పడిందని, తాము సరిగా రాయలేకపోయినట్లు ఆవడి కేంద్రీయ విద్యాలయంలో పరీక్ష రాసిన 13 మంది, కున్రత్తూరు ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో పరీక్ష రాసిన ఇద్దరు, కేకేనగర్ పద్మ శేషాద్రి పాఠశాలకు చెందిన ఒకరు హైకోర్టులో పిటిషన్ వేశారు. నీట్ పరీక్ష రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని కోరారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో విద్యుత్తు అంతరాయంపై విచారించగా నీట్ పరీక్షకు ఎలాంటి బాధింపు ఏర్పడలేదని తెలిసిందని, ఆ విద్యార్థులు చాలా ప్రశ్నలకు సమాధానం రాసినట్లు, మళ్లీ నిర్వహించడం కుదరదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తరఫున వివరణ ఇచ్చారు. అనంతరం పిటిషన్ విచారించిన హైకోర్టు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదని, 22 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాసిన నేపథ్యంలో మళ్లీ జరపాలని ఉత్తర్వులు ఇస్తే తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని తెలిపి కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ 16 మంది విద్యార్థులు అప్పీల్ చేశారు. అప్పీల్‌పై విచారణ జరిపిన జస్టిస్ నిషా భాను, జస్టిస్ జ్యోతిరామన్ ధర్మాసనం.. మళ్లీ నీట్ నిర్వహించాలని ఉత్తర్వులు ఇస్తే సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ప్రభావితమవుతారని, ఆ ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని తెలిపి కొట్టివేస్తూ గురువారం తీర్పు ఇచ్చారు.

చెన్నైలోని ముఖ్యమైన ప్రదేశాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్పొరేషన్ తరఫున తిరుమంగళంలోని పైవంతెన స్తంభాలపై చిత్రలేఖనాలు రూపొందించిన దృశ్యం - న్యూస్‌టుడే, చెన్నై

పైన ప్రయాణం.. కింద ఆహ్లాదం

ఎమ్మార్టీఎస్ వంతెనల దిగువన పార్కులు

ఈనాడు-చెన్నై

చెన్నై నగరంలో ఎన్నో పార్కులు చూసుంటాం. ఇప్పుడు కొత్త తరహావి అందుబాటులోకి వస్తున్నాయి. ఎమ్మార్టీఎస్ రైలుపట్టాలు వెళ్లే వంతెనలున్న చోట్ల కిందిభాగాన ఖాళీ స్థలాల్లో ప్రయోగాత్మక పార్కులు వస్తున్నాయి. స్టేషన్లున్నచోట్ల మార్గమధ్యంలో అనువుగా ఉన్న ప్రాంతాల్ని ఎంపికచేసి వినూత్న సౌకర్యాలతో అందంగా ప్రజల ముందుకు తెస్తున్నారు.

తిరువాన్మియూరు ఎమ్మార్టీఎస్ స్టేషన్ కింద ముస్తాబైన పార్కు విహంగవీక్షణం

ఒక్కోచోట ఒక్కో ప్రత్యేకత

■ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పార్కుల్లో ఒక్కోచోట ఒక్కో ప్రత్యేకతతో నడుస్తున్నాయి. అన్నిచోట్లా మొక్కలు, నడకబాటలు, బెంచీలు, కనీస వసతులు తెచ్చారు. వేలచ్చేరి ఎమ్మార్టీఎస్ వంతెన కింద దిమ్మెల్ని అందమైన పెయింటింగ్‌లతో ముస్తాబు చేశారు. ఫౌంటేన్లు, సాయంత్రం వేళ రంగుల దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

■ తిరువాన్మియూరు ఎమ్మార్టీఎస్ రైల్వేస్టేషన్ నుంచి వంతెన పొడవునా వనాలు వెలిశాయి. బాడ్మింటన్, టెన్నిస్ కోర్టులూ వచ్చాయి. విశాల మైదానాల్లా తయారుచేయడంతో పిల్లలు, యువత స్కేటింగ్ చేస్తున్నారు. వ్యాయామ పరికరాల్ని మహిళలూ, యువతులు వినియోగించుకుంటున్నారు. వివిధ క్రీడల్లో ఇక్కడి పార్కుల్లో ప్రత్యేక శిక్షణా ఇస్తున్నారు.

■ కొలత్తూరులోనే ఎమ్మార్టీఎస్ వంతెన కింద ఇలాంటి పార్కునే నిర్మించారు. ఈ తరహా పార్కుల్ని అవగాహన వేదికలుగానూ మారుస్తున్నారు. ఫొటో ఎగ్జిబిషన్లు, పర్యావరణహిత కార్యక్రమాలు జరుగుతున్నాయి.

■ ఈ తరహా ప్రాజెక్టులతో రైల్వేతో మరింతగా ప్రజలు అనుబంధం ఏర్పడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో సేద తీరేందుకు ఆసక్తి చూపుతారని, అలసిపోయిన కుటుంబాలకు ఈ ప్రాంతాలు సాంత్వనగా ఉంటాయని అధికారులు వివరిస్తున్నారు. ఆయా పార్కుల్లో టీ, కాఫీ, స్నాక్స్ లాంటి దుకాణాల్ని తెరిచారు.

పిల్లల స్కేటింగ్ సాధన

వ్యర్థ లోహాలతో రూపొందించిన జింకలు

వ్యాయామం చేస్తున్న మహిళలు

25 మీ. వెడల్పుతో..

ఎమ్మార్టీఎస్ వంతెనల కింద 25 మీటర్ల వెడల్పుతో దారిపొడవునా స్థలాల్ని ఎంపిక చేస్తున్నారు. పార్కులకు అనువైన ప్రాంతాలపై సర్వే చేశారు. శివానంద సాలై, ఎమ్మెల్యేక్వార్టర్స్, వాలాజాహ్ సాలై మధ్య 1.5 కి.మీ మేర ఎమ్మార్టీఎస్ వంతెన కింద కొత్తగా వనాల్ని వృద్ధి చేస్తున్నారు. ఓఎమ్మార్‌లోని కస్తూర్బానగర్, ఇందిరానగర్ ఎమ్మార్టీఎస్ వంతెనల కిందా ఇలాంటి ఆహ్లాద వాతావరణం రానున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వనాల వృద్ధి, నడకబాటు, బెంచీలతో పాటు ఆకర్షణీయ ఫౌంటేన్లను ప్రతి 20మీటర్లకో చోట ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

వృథా కానివ్వొద్దు

ఎమ్మార్టీఎస్ వంతెనల కింద అందమైన పార్కులకోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. ప్రస్తుతానికి ఇవెంతో బాగున్నా, భవిష్యత్తులో నిర్వహణ సమస్యలు రాకుండా చూసుకోవాలని సామాజిక కార్యకర్త ఆర్.రమేష్ చెబుతున్నారు. పార్కులకు వచ్చేందుకు పెద్దలు సైతం ఆసక్తి చూపుతున్నారని, వీలైనన్ని ఎక్కువ బెంచీలు పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రాజ్‌నాథ్ సింగ్‌ను సత్కరిస్తున్న ఆర్ఎన్ రవి

రక్షణశాఖ మంత్రితో గవర్నర్ భేటీ

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర రక్షణశాఖ మంత్రితో గవర్నర్ ఆర్.ఎన్.రవి భేటీ అయ్యారు. గవర్నర్ ఆర్.ఎన్.రవి జూన్ 26న ఒకరోజు పర్యటనగా దిల్లీ వెళ్లి రాగా నాలుగు రోజుల పర్యటనగా మంగళవారం మళ్లీ దిల్లీ వెళ్లారు. ఆయన ఆకస్మిక పర్యటన గురించి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో దిల్లీలో గురువారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు జాతీయ సమస్యల గురించి రక్షణ శాఖ మంత్రి అభిప్రాయాలు, అనుభవాలను తెలుసుకుని లబ్ధి పొందడం హర్షణీయమంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు.

ఆ రోజు ఏం జరిగింది?

సిబ్బందితో మాట్లాడిన న్యాయమూర్తి

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ మృతిపై విచారణకు మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం నియమించిన న్యాయమూర్తి జాన్ చంద్రలాల్ రెండోరోజూ వివరాలు సేకరించారు. బుధవారం ఆలయ సిబ్బంది శక్తీశ్వరన్, ఆలయ జాయింట్ కమిషనర్ కార్యాలయ సహాయకుడు పెరియసామి, సహాయ కమిషనర్ డ్రైవరు కార్తిక్‌వేల్, సెక్యూరిటీ సిబ్బంది కుమార్, వినోద్‌కుమార్, ఆలయ సీసీ టీవీ ఆపరేటర్ శ్రీనివాసన్, ప్రవీణ్ తదితరుల వద్ద 12 గంటలపాటు విచారణ జరిపారు. వాటిని లిఖితపూర్వకంగా, వీడియోగా నమోదు చేశారు. పోలీసుల దాడిని చిత్రీకరించిన శక్తీశ్వరన్, ఆలయ సెక్యూరిటీ వినోద్, పెరియసామి, ప్రభు తదితరుల వద్ద గురువారం వేర్వేరుగా విచారించారు. ఆలయానికి వచ్చే భక్తులతో అజిత్‌కుమార్ ఎలా ప్రవర్తిస్తాడు, అతని నేపథ్యం, తోటి ఉద్యోగులతో వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసిన నిఖిత ఆలయానికి ఏ సమయంలో వచ్చింది, అప్పుడు జరిగిన వివాదం, సంభాషణ గురించి ప్రశ్నించారు. అజిత్‌కుమార్ మృతి కేసులో అరెస్టై మదురై సెంట్రల్ జైల్లో ఉన్న ప్రత్యేక బృంద పోలీసులతోనూ న్యాయమూర్తి మాట్లాడనున్నట్లు సమాచారం వెలువడింది.

పరారీలో నిఖిత

ప్యారిస్, న్యూస్‌టుడే: కాపలాదారుడు అజిత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసిన నిఖిత పరారీలో ఉన్నట్లు సమాచారం వెలువడింది. మదురై జిల్లా తిరుమంగళం వద్ద ఉన్న ఆలంపట్టికి చెందిన నిఖిత(46) దిండుక్కల్ ఎంవీఎం ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ కళాశాలలో బోటనీ విభాగాధిపతిగా ఉన్నారు. ఆమె తండ్రి జయపెరుమాళ్ విశ్రాంత ఆచార్యులు. ప్రభుత్వ అధికారి అయిన జయపెరుమాళ్ భార్య శివగామి అమ్మాళ్, కుమార్తె నిఖిత ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తారని మోసానికి పాల్పడినట్లు పలు ఫిర్యాదులు ఉన్నాయి. కళాశాలలో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నప్పటి నుంచి నిఖిత తోటి అధ్యాపకులతో తరచూ ఘర్షణలకు పాల్పడేవారని తెలిసింది. విద్యార్థినులను మానసికంగా హింసించేవారనే ఆరోపణలు ఉన్నాయి. అజిత్‌కుమార్ మృతి ఘటన అనంతరం తిరుమంగళంలో ఉన్న ఇంటికి తాళం వేసి తల్లితో కలిసి నిఖిత పారిపోయినట్లు తెలిసింది. ఐదు రోజులుగా ఆమె కళాశాలకు రాలేదని యాజమాన్యం తెలిపింది.

ఈపీఎస్ ఆరోపణలు మానుకోవాలి: ఆర్.ఎస్.భారతి

చెన్నై, న్యూస్‌టుడే: లాకప్‌డెత్ వ్యవహారంలో ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి ఆరోపణలు మానుకోవాలని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి తెలిపారు. ఆయన తన ప్రకటనలో... దారుణంపై సమాచారం తెలిసిన వెంటనే ఆరుగురు పోలీసులను సస్పెండ్ చేసి అరెస్టు చేశారన్నారు. బాధిత కుటుంబంతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి కారకులపై కఠినన చర్యలు తీసుకోనున్నట్లు, బాధిత కుటుంబానికి న్యాయం చేయనున్నట్లు హామీ ఇచ్చారన్నారు. కేసు దర్యాప్తు సీబీఐకి మార్చారని, మృతుడి సోదరుడు నవీన్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగం అందించడంతో పాటు ఇతర సాయాలు చేసినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన రెండు రోజుల్లో చట్టపరమైన ఇన్ని చర్యలు చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు జరగలేదన్నారు.

పోలీసు భద్రత కల్పించాలి

వీడియో తీసిన వ్యక్తి వినతి

ప్యారిస్, న్యూస్‌టుడే: అజిత్‌కుమార్‌పై పోలీసులు దాడి చేసిన వీడియోను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన ఆలయ సిబ్బంది శక్తీశ్వరన్ తనకు రక్షణ కల్పించాలని డీజీపీకి పంపిన వినతిలో కోరాడు. ఆయన తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. అజిత్‌కుమార్ కేసులో అరెస్టైన ప్రత్యేక బృంద పోలీసులకు రౌడీలతో సంబంధం ఉందని, వారు గతనెల 28న తనను బెదిరించారన్నారు. కోర్టులో ఆధారాలు ఇచ్చిన నేపథ్యంలో తనకు ముప్పు ఉందని, పోలీసు భద్రత కల్పించాలని ఈ-మెయిల్ ద్వారా విన్నవించాడు. ఈ నేపథ్యంలో శక్తీశ్వరన్ ఇంటికి 24 గంటలు షిఫ్టు విధానంలో తుపాకీతో ఉన్న సాయుధదళం పోలీసులు భద్రత కల్పిస్తున్నారు.

అజిత్‌కుమార్ ఇంట్లో విజయ్

విజయ్ ఆర్థికసాయం

ప్యారిస్: అజిత్‌కుమార్ ఇంటికి బుధవారం రాత్రి టీవీకే అధ్యక్షుడు విజయ్ వెళ్లారు. అజిత్‌కుమార్ తల్లి, సోదరుడిని పరామర్శించారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. టీవీకే తరఫున రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు.

డీజీపీ నివేదిక దాఖలు చేయాలి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: కాపలదారుడు అజిత్ కుమార్ మృతి వ్యవహారంపై ఆరు వారాల్లో నివేదిక దాఖలు చేయాలని డీజీపీకి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. వార్తాపత్రికల్లో ప్రచురితమైన వార్తల ఆధారంగా కమిషన్ సుమోటోగా గురువారం విచారణకు తీసుకుంది.

దర్యాప్తు పేరిట దాడి చేయకూడదు

ఏడీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం

ప్యారిస్, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్లలో ఇకపై మరణాలు సంభవించకూడదని, విచారణ ఖైదీలను అనవసరంగా వేధించకూడదని పోలీసు అధికారులకు ఏడీజీపీ ఉత్తర్వులు ఇచ్చారు. డీజీపీ శంకర్ జివాల్ నేతృత్వంలో శాంతిభద్రతల ఏడీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం, ఐజీలు, ఎస్పీలతో బుధవారం సమావేశం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు పోస్టు చేస్తున్నారని, వారిని వెంటనే గుర్తించి చర్యలు చేపట్టాలని ఏడీజీపీ సూచించారు. రాణాల్లో ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలని ఎలాంటి జాప్యం ఉండకూడదని తెలిపారు. దర్యాప్తునకు తీసుకొచ్చే ఖైదీలను అనవసరంగా వేధించకూడదన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందాల్లో అనుభం ఉన్నవారిని మాత్రమే నియమించాలన్నారు. దర్యాప్తు పేరుతో ఖైదీలను ఆయుధాలతో దాడి చేయకూడదని చెప్పారు. కుటుంబంతో కలిసి వాహనాల్లో వెళ్లే వారిని తనిఖీ పేరుతో వేధించకూడదని హితవు పలికారు. రాస్తారోకో, ఆందోళనల్లో లాఠీ ఉపయోగించకూడదని, ఆలయ తిరునాళ్లలో కుల వివక్ష ఘర్షణలు లేకుండా చూసుకోవాలన్నారు.

తమిళ నాలెడ్జ్ క్యాంపస్‌కు శంకుస్థాపన

చెన్నై, న్యూస్‌టుడే: రోజా ముత్తయ్య పరిశోధన గ్రంథాలయం తరఫున తరమణిలో తమిళ నాలెడ్జ్ క్యాంపస్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. 1994వ ఏడాది నుంచి కొనసాగుతున్న రోజా ముత్తయ్య పరిశోధన గ్రంథాలయంలో 5లక్షలకు పైగా పత్రాలను భద్రపరిచారు. తమిళ సాంస్కృతిక చరిత్రను పునర్నిర్మించే పనులను రాష్ట్ర ప్రభుత్వ పలు విభాగాలతో సమన్వయంగా ఈ గ్రంథాలయం చేపడుతోంది. ఈ చర్యలను మరింత మెరుగుపరిచేందుకు తమిళ నాలెడ్జ్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు తరమణిలోని టెక్నాలజీ ప్రాంగణంలో 30వేల చదరపు అడుగుల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించింది. రాష్ట్ర ప్రభుత్వం, పలు సంస్థలు, దాతల సహాయంతో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాంగణానికి సచివాలయం నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం శంకుస్థాపన చేశారు. రోజా ముత్తయ్య పరిశోధన గ్రంథాలయం ఫౌండేషన్ ట్రస్టీలు బాలకృష్ణన్, మరియం రామ్, రామచంద్రన్, ఇంద్రన్, సుందర్ గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

ప్రజలను బెదిరించడం మానుకోవాలి: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రజలను బెదిరించడం మానుకోవాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి తెలిపారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. విరుదునగర్ జిల్లా చిన్నక్కామన్‌పట్టి బాణసంచా ప్రమాదంలో 8 మంది మృతి చెందిన నేపథ్యంలో తగిన పరిహారం అందించాలని ఆందోళన చేసిన ప్రజలను విరుదునగర్ ఎస్పీ బెదిరించటం ఖండించదగినదన్నారు. ప్రశాంతంగా ఉండాలని లేదంటే జరిగేదే వేరని ఎస్పీ బెదిరించినట్లు తెలిసిందన్నారు. జూన్ 12న మేట్టూరు నుంచి నీటిని విడుదల చేసినా ఇంకా డెల్టా జిల్లాల్లోని చిట్టచివరి ప్రాంతాలకు చేరలేదని తెలిపారు. కాలువల్లో సక్రమంగా పూడికతీయక పోవటమే అందుకు కారణమని చెప్పారు. ఆయన విడుదల చేసిన మరో ప్రకటనలో.. వేలూర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ 8న వేలూర్ అన్నా కలైయరంగం వద్ద అన్నాడీఎంకే తరఫున ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయకుండానే గతనెల 25న సీఎం స్టాలిన్ ప్రారంభించారని, అంతలోనే ఎందుకు మూసేశారని ప్రశ్నించారు.

చెన్నై ఈక్కాట్టుతాంగల్‌లోని ఎస్ఆర్ఎం హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు వరల్డ్ రికార్డ్‌లో భాగంగా గురువారం 1993 వడలతో ఐరాస ముఖ్య లక్ష్యమైన 'ఆకలి లేని ప్రపంచం' చిహ్నాన్ని తయారు చేశారు. - ఆర్కేనగర్, న్యూస్‌టుడే

ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం

శాస్త్రీనగర్‌లోని ఆరోగ్యకేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: ఆరోగ్యశాఖ తరఫున రూ.112 కోట్లతో నిర్మించిన పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ముఖ్యమంత్రి స్టాలిన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య వసతులను మరింత అభివృద్ధి చేసేలా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు తరహాలో మహానగర చెన్నై కార్పొరేషన్ తదితర 21 కార్పొరేషన్లు, 63 మున్సిపాలిటీ ప్రాంతాల్లోనూ 708 పట్టణ ఆరోగ్య కేంద్రాలను రూ.177 కోట్లతో నిర్మించనున్నట్లు 2022 మే 7న శాసనసభలో నిబంధన 110 కింద ముఖ్యమంత్రి ప్రకటించారు. తొలి విడతగా రూ.125 కోట్లతో నిర్మించిన 500 పట్టణ ఆరోగ్యకేంద్రాలను 2023 జూన్ 6న ప్రారంభించారు. రెండో విడతగా రూ.52 కోట్లతో 208 పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు. అడయారులోని శాస్త్రీనగర్‌లో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.60 కోట్లతో నిర్మించిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మంత్రి సుబ్రమణియన్, జీసీసీ మేయర్ ప్రియ, ఎంపీ కనిమొళి సోము, ఎమ్మెల్యే జె.ఎం. హెచ్.హసన్ మౌలానా, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి సెంథిల్‌కుమార్, జీసీసీ కమిషనరు కుమరగురుభరన్, జాతీయ ఆరోగ్య మిషన్ సంచాలకులు అరుణ్ తంబురాజ్, ఆరోగ్యశాఖ సంచాలకులు టీఎస్ సెల్వవినాయగం తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిశా: రామసుధన్

రామదాసుతో మాట్లాడుతున్న రామసుధన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దిండివనం సమీప తైలాపురం తోటకు 20 ఏళ్ల తర్వాత వచ్చి పీఎంకే వ్యవస్థాపకుడు రామదాసును కలవడం ఆనందంగా ఉందని రామసుధన్ తెలిపారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, దివంగత కేంద్ర మంత్రి వాళప్పాడి రామమూర్తికి రామదాసుతో సన్నిహిత సంబంధాలు ఉన్నా రాజకీయంగా విభేదాలు ఉండేవి. వాళప్పాడి రామమూర్తి 2002లో మృతి చెందిన తర్వాత ఆయన కుటుంబం తైలాపురం రావడం మానేసింది. రామదాసు, అన్బుమణికి మధ్య ఆధిపత్య పోరు జరుగుతున్న నేపథ్యంలో వాళప్పాడి రామమూర్తి కుమారుడు రామసుధన్ గురువారం రామదాసును కలిశారు. అనంతరం రామసుధన్ విలేకరులతో మాట్లాడుతూ.. తాను మర్యాద నిమిత్తం కలవడానికి వచ్చానన్నారు. రాజకీయాల గురించి మాట్లాడలేదని చెప్పారు.

◆ విద్యుత్తు నియంత్రికల కొనుగోలులో అక్రమాలు

సెంథిల్‌బాలాజీపై కేసు నమోదుకు వారంలో నిర్ణయం

ప్యారిస్, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికల కొనుగోలులో అక్రమాలపై మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ తదితరులపై కేసు నమోదు చేసేందుకు అనుమతిచ్చే విషయమై వారంలోపు నిర్ణయం తీసుకోనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో తెలిపింది. హైకోర్టులో అరప్పోర్ ఇయక్కం దాఖలు చేసిన పిటిషన్‌లో.. రాష్ట్రంలో 2021-23న 45,800 విద్యుత్తు నియంత్రికలు కొనుగోలు చేసేందుకు రూ.1,182.88 కోట్లకు టెండర్ కోరినట్లు తెలిపారు. టెండర్ పత్రాలను పరిశీలించగా గుత్తేదారులు లాభం పొందేలా చేసి ప్రభుత్వానికి రూ.397 కోట్లు నష్టం ఏర్పడినట్లు తెలిసిందని, ఈ విషయమై అవినీతి నిరోధక శాఖకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపారు. ఈ అక్రమాల్లో మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ, టాన్‌జెడ్కో ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టరు రాజేష్ లక్కాని తదితరులను అనుమానించేలా ఆధారాలు ఉన్నాయన్నారు. హైకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ఈ అక్రమాలపై విచారించాలని పేర్కొన్నారు. ఈ పిటిషన్ జస్టిస్ వేల్మురుగన్ ఎదుట గురువారం విచారణకు వచ్చింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ పీఎస్ రామన్.. పిటిషనర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇచ్చే వ్యవహారమై వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటారని, ఈ కేసు చెల్లదని వాదించారు. అరప్పోర్ ఇయక్కం తరఫున.. ఫిర్యాదు చేసి రెండేళ్లయిందని, అన్ని పత్రాలను సమాచార హక్కుచట్టం కింద పొందినట్లు విచారణ సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. ఆమోదించిన న్యాయమూర్తి విచారణను తేదీ తెలపకుండా వాయిదా వేశారు.

రామేశ్వరం జాలర్లకు శ్రీలంకలో జ్యుడిషియల్ కస్టడీ

చెన్నై, న్యూస్‌టుడే: సముద్రంలో సరిహద్దులు దాటారన్న అభియోగంతో శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన రామేశ్వరం జాలర్లు 8 మందికి ఆ దేశం కోర్టు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. రామేశ్వరం నుంచి ఆదివారం సముద్రంలో చేపలు పట్టేందుకు మరబోటులో వెళ్లిన 8 మంది జాలర్లను అంతర్జాతీయ సముద్ర సరిహద్దులు దాటారన్న అభియోగంతో శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. వారిని మన్నార్ కోర్టులో గురువారం హాజరుపరచగా 17వ తేదీ వరకు జ్యుడిషియల్ కస్టడీ విధించారు.

కొడైకెనాల్‌కు శీతలపానీయాలు తీసుకొస్తే పన్ను

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కొడైకెనాల్‌కు 5 లీటర్ల కంటే తక్కువగా నీటి సీసాలు, అన్ని రకాల శీతలపానీయాలు తీసుకొస్తే సీసాకు రూ.20 చొప్పున గ్రీన్ ట్యాక్స్ విధిస్తారని దిండుక్కల్ కలెక్టర్ శరవణన్ ప్రకటించారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు కొడైకెనాల్‌కు వచ్చే అన్ని వాహనాలకు ఈ-పాస్ ఉండాలన్న నిబంధన గతేడాది మే 7వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. కొడైకెనాల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, 5 లీటర్ల కంటే తక్కువగా ఉన్న నీటి సీసాలు, అన్ని రకాల శీతలపానీయాలకు నిషేధం విధించారన్నారు. వాటికి ఇప్పుడు పన్ను విధిస్తారని పేర్కొన్నారు.

సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఉన్నతాధికారులు అతుల్య మిశ్రా, ప్రదీప్ యాదవ్ తదితరులు

ఛాంపియన్స్ ట్రస్టు కార్యక్రమాలపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్టు కార్యనిర్వాహక కమిటీ సమావేశం గురువారం జరిగింది. చెన్నై సచివాలయంలో జరిగిన సమావేశానికి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ నేతృత్వం వహించారు. క్రీడాభివృద్ధికి ఛాంపియన్స్ ట్రస్టు ద్వారా చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ 47వ కార్యనిర్వాహక కమిటీ సమావేశం ఉదయనిధి స్టాలిన్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ప్రత్యేక ప్రాజెక్టుల అమలు విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి ప్రదీప్ యాదవ్, రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, క్రీడాభివృద్ధి కమిషన్ సభ్య కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

రైలు పట్టాలపై బైక్ నడిపి రీల్స్ చేసిన యువకుడు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఇన్‌స్టా రీల్స్ కోసం ఓ యువకుడు నీలగిరి జిల్లా మౌంటైన్ రైలు పట్టాలపై ద్విచక్ర వాహనం నడిపాడు. ఓ యువకుడు ఊటీ మౌంటైన్ రైలు మార్గంలో ద్విచక్ర వాహనం నడుపుతూ, వాహనాన్ని పట్టాలకు అడ్డంగా నిలబెట్టి రీల్స్ చేశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహిస్తున్నారు. ఇలాంటి పనులు మరెవరూ చేయకుండా సదరు యువకుడిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్‌పై బైక్ నడుపుతున్న దృశ్యం

రైలు మార్గంలో విరిగిపడిన కొండ చరియలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం నుంచి అరియలూర్ వెళ్లే మార్గంలో రైలు పట్టాలపై కొండ చరియలు విరిగిపడ్డాయి. వెల్లూర్ రైల్వే స్టేషన్ సమీపంలో సబ్‌వే నిర్మాణ పనులు జరుగుతుండగా కొండ చరియలు విరిగిపడినట్లు సమాచారం. దీని కారణంగా విళుపురం నుంచి అరియలూర్ మీదుగా తిరుచ్చి వెళుతున్న ప్యాసింజర్ రైలు సుమారు 45 నిమిషాలపాటు మార్గ మధ్యలో ఆగిపోయింది. కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

8న ఐఐటీఎంలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్, ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో హ్యుందాయ్ హెచ్‌టీడబ్ల్యూఓ ఇన్నోవేషన్ సెంటర్ ఈనెల 8వ తేదీ ప్రారంభం కానుంది. తైయూరులోని ఐఐటీ మద్రాస్ శాటిలైట్ క్యాంపస్‌లో 8వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీఆర్బీ రాజా ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ఈయనతో పాటు హ్యుందాయ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉన్‌సూ కిమ్, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి కూడా పాల్గొంటున్నారని ఐఐటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

కంచిలో కరెంటు కష్టాలు

- ఇటీవల అధికమైన కోతలు
- ఇబ్బందుల్లో ఆలయాలు, పరిశ్రమలు

చెన్నై మహానగరానికి సమీపాన ఉన్న కాంచీపురం పట్టణం ప్రస్తుతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఒకప్పుడు కాంచీపురం ఆలయాలు, పట్టు వస్త్రాలకు ప్రసిద్ధి. ఇప్పుడు చెన్నై శివారు నుంచి కాంచీపురం వరకు దాదాపు అన్ని ప్రాంతాల్లో కళాశాలలు, పరిశ్రమలు, ఆసుపత్రులు పుట్టుకొచ్చాయి. అలాంటి ప్రాంతంలో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇక్కడి ఆలయాల సందర్శనకు నిత్యం దేశంలోని పలు ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చివెళ్తుంటారు. పెరుగుతున్న పరిశ్రమలు, దేవాలయాలకు వచ్చే భక్తులు విద్యుత్తు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- న్యూస్‌టుడే, వడపళని

కాంచీపురం పట్టణం (విహంగ వీక్షణం)

పెరుగుతున్న స్థిర నివాసాలు

కాంచీపురం పట్టణం చెన్నై మహానగరానికి సమీపంలో ఉండటంతో ఇటీవలి కాలంలో పరిశ్రమలు బాగా ఆవిర్భవిస్తున్నాయి. ఈ క్రమంలో చాలా మంది ఇక్కడ స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో విద్యుత్తు వినియోగం కూడా అధికమైంది. విద్యుత్తు శాఖ నిబంధనల మేరకు ప్రతి 25 వేల కనెక్షన్లకు ఓ ప్రత్యేక విభాగం ఉండాలి. అయితే ప్రస్తుతం శివకంచి, విష్ణు కంచి, ఒర్రిక్కై, పిళ్లయార్ పాలెయం, శంకర మఠంలో ఐదు విభాగాలు మాత్రమే పని చేస్తున్నాయి. ఒక్కో విభాగం 50వేల కన్నా ఎక్కువ కనెక్షన్లు కలిగి ఉంది. ఫలితంగా సరఫరాలో తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. వెల్లైకుళం, టోల్‌గేట్, తాలూకా కార్యాలయంలో మరో మూడు విభాగాలు తెరిచేందుకు టాన్‌జెడ్కో పనులు చేపట్టింది. అయితే ఇవీ ఆలస్యంగానే సాగుతున్నాయి. మూడు విభాగాల్లో జూనియర్ ఇంజినీర్లు లేరు. ఒర్రిక్కై, పంచుపేటలో 110 కిలోవాట్ల సామర్థ్యంతో రెండు సబ్ స్టేషన్లు, వెల్లైకుళం, కాంచీపురంలో 33 కిలోవాట్ల సామర్థ్యంలో మరో రెండు సబ్ స్టేషన్లు పని చేస్తున్నాయి. ఈ నాలుగింటి నుంచి మూడు లక్షల కనెక్షన్లకు విద్యుత్తు లోడు తగ్గిపోయింది. మరో రెండు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు కూడా జారీ చేసింది. అయితే కార్యాచరణకు నోచుకోలేదు. ఒర్రిక్కైలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి చాలా పాతది కావడంతో తరచూ సమస్యలెదురవుతున్నాయి. దీన్ని కూడా మార్చాల్సిన అవసరం ఉంది.

30 లక్షల కనెక్షన్లు..

కార్పొరేషన్ స్థాయిలో ఉన్న కాంచీపురంలో 30 లక్షల విద్యుత్తు కనెక్షన్లున్నాయి. జనాభా, పరిశ్రమల సంఖ్య పెరుగుతుండటంతో విద్యుత్తు అవసరాలు కూడా రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి. ఈ క్రమంలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా కావాలంటే పట్టణానికి మరో రెండు సబ్ స్టేషన్లు అవసరం ఉంది. సబ్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించిన పనులు ముందుకు సాగకుండా ఏళ్ల తరబడి పెండింగులో ఉన్నాయి. ఇదిలా ఉండగా విద్యుత్తు సరఫరా, నిర్వహణకు సంబంధించిన వివిధ రకాల ఉద్యోగాలు భర్తీ కాకుండా అలాగే ఉండిపోయాయి. ఈ కారణంగా కూడా సరఫరా పునరుద్ధరణలో జాప్యం జరుగుతోంది. కాంచీపురంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు చాలా పాతవి. సరఫరాను మెరుగుపరచాలంటే వాటి స్థానంలో కొత్తవి మార్చాల్సి ఉంది.

సరిపడా ఉన్నా..

కాంచీపురంలో సరఫరా చేయడానికి తగినంత విద్యుత్తు ఉందని, కానీ పంపిణీలో సమస్యలు ఉన్నాయని టాన్‌జెడ్కో కార్మికులు పేర్కొంటున్నారు. లైన్‌మెన్, హెల్పర్‌లతో పాటు పలు కేటగిరీల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. సరైన సిబ్బంది లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్వహణ కొరవడుతోందన్నారు. నిర్వహణ పనుల కోసం ఒప్పంద కార్మికుల నియామకం జరిగిందని, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు.

గోశాలను పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

గోశాలను పరిశీలించిన మేయర్

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై రాయపురం జోన్‌లోని బేసిన్ బ్రిడ్జి రోడ్‌లో రూ.1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన గోశాలను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో దానిని మేయర్ ప్రియ గురువారం సందర్శించి పశువుల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కొన్ని సూచనలు చేశారు. వెంట ఎమ్మెల్యే ఐడ్రీమ్ మూర్తి (రాయపురం), ఉత్తర ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ కట్టా రవితేజ, జోన్ కమిటీ చైర్మన్ శ్రీరాములు, కార్పొరేషన్ కౌన్సిలర్ వేలాంకణ్ణి, ఇతర ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

నటులు శ్రీకాంత్, కృష్ణల బెయిల్ పిటిషన్లపై తీర్పు వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: మత్తుపదార్థాల కేసులో అరెస్టయిన సినీనటులు శ్రీకాంత్, కృష్ణ బెయిల్ పిటిషన్లపై తీర్పును కోర్టు వాయిదా వేసింది. మత్తుపదార్థాలు ఉపయోగించిన కేసులో అరెస్టయిన నటులు శ్రీకాంత్, కృష్ణ బెయిల్ కోరుతూ చెన్నై ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు గురువారం విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా కృష్ణ తరఫున.. వైద్య పరీక్షల్లో తాను మత్తుపదార్థాలు ఉపయోగించలేదని తేలిందని వాదించారు. శ్రీకాంత్ తరఫున.. పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తారని తెలిపారు. అయితే పోలీసుల తరఫున.. వారికి బెయిల్ ఇవ్వద్దని వ్యతిరేకించారు. దీంతో తీర్పును కోర్టు వాయిదా వేసింది.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాంధీ నగర్, కొట్టివాక్కం, బెసెంట్ నగర్, అడయార్, అయ్యప్పన్‌తాంగల్, పల్లావరం, షోలింగనల్లూరు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

ఆరోవిల్‌లో ముగిసిన విద్యా శిక్షకుల సమావేశాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా ఆరోవిల్ అంతర్జాతీయ నగర్‌లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 5వ ఇంటిగ్రేటెడ్ విద్యా శిక్షకుల సమావేశాలు బుధవారం రాత్రి ముగిశాయి. శ్రీ అరవిందర్ అంతర్జాతీయ విద్యా పరిశోధన సంస్థ తరఫున నిర్వహించిన సమావేశంలో అనేక మంది విద్యావేత్తలు, పరిశోధకులు 150 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21వ శతాబ్దంలో పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి ఆచరణలో పెట్టాల్సిన కొత్త విద్యా విధానం, పిల్లల భవిష్యత్తు, ఆధునాతన సాంకేతికత, పిల్లల ఆరోగ్యం, మానసిక, ఆధ్యాత్మికతను పెంపొందించడం తదితర అంశాలపై చర్చించారు. ఏర్పాట్లను ఆరోవిల్ ట్రస్ట్ కార్యదర్శి జయంతి ఎస్.రవి మార్గదర్శకాల మేరకు సిబ్బంది సమీక్షించారు.

సమావేశంలో విద్యావేత్తలు

కుటుంబాన్ని ఆదుకోండి

విజయ్‌కు లేఖ రాసి వ్యక్తి ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కందువడ్డీ వేధింపుల కారణంగా టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు లేఖ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పుదుచ్చేరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లితోప్పు పిళ్లైయార్ కోవిల్‌వీధికి చెందిన విక్రమన్(34)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న విక్రమన్ నెల్లితోప్పు నియోజకవర్గ టీవీకే సభ్యుడిగా ఉన్నాడు. అప్పుల బాధ ఎక్కువగా ఉండటంతో గోవిందసాలై ప్రాంతంలోని సొంత ఇంటిని తాకట్టు పెట్టి పిళ్లైయార్‌కోవిల్ వీధికి వచ్చాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వచ్చిన విక్రమన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపి విచారణ చేపట్టారు. విక్రమన్ ఆత్మహత్యకు ముందు రెండు లేఖలు రాసినట్లు గుర్తించారు. అందులో.. మూర్తి కందువడ్డీ కింద ధనశేఖర్ అనే వ్యక్తి వద్ద రూ.3.80 లక్షలు అప్పు తీసుకున్నానని, ప్రతినెలా వడ్డీ సరిగా చెల్లించానన్నాడు. తనకు ప్రమాదం జరగడంతో 3 నెలలుగా వడ్డీ కట్టలేకపోయాయనని, ధనశేఖర్ తన కుటుంబం గురించి అసభ్యంగా మాట్లాడని, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు రాసిన లేఖలో.. వడ్డీ కట్టాలని చిత్రహింసలు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని, తన కుటుంబానికి సాయం చేయాలని కోరాడు.

నిర్మాణంలో ఉన్న టెర్మినల్

చెంగల్పట్టు బస్ టెర్మినల్ పనుల పరిశీలన

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టులో సీఎండీఏ తరఫున రూ.130 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బస్ టెర్మినస్ నిర్మాణ పనులను గురువారం దేవాదాయ సీఎండీఏ చైర్మన్, మంత్రి అయిన పీకే శేఖర్‌బాబు పరిశీలించారు. పనుల గురించి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. పనులను ఈ ఏడాది చివరిలోగా ముగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. టెర్మినస్ అందుబాటులోకి రాగానే ప్రతిరోజు ఇక్కడికి సుమారు 600 బస్సులు వచ్చివెళ్తాయని పేర్కొన్నారు. ఒకే సమయంలో 57 బస్సులను నిలిపేవిధంగా, ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు సమకూరుతాయని వివరించారు. వెంట జిల్లా కలెక్టరు స్నేహ, ఎమ్మెల్యే వరలక్ష్మి, సీఎండీఏ ఉన్నతాధికారులు ఉన్నారు.

పార్టీ నుంచి తొలగించే అధికారం అన్బుమణికి లేదు: రామదాస్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే అరుళ్‌ను పార్టీ నుంచి తొలగించే అధికారం అన్బుమణికి లేదని పీఎంకే వ్యవస్థాపకుడు, అధ్యక్షుడైన రామదాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన దిండివనం సమీప తైలాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ప్రస్తుతం ఎమ్మెల్యే అరుళ్ పీఎంకే చీఫ్ విప్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌కు జీకే మణి ద్వారా లేఖను అందజేస్తేనే అరుళ్‌ను చీఫ్ విప్‌గా తొలగించవచ్చని, కావున ఆయన్ను పార్టీ నుంచి తొలగించే అధికారం అన్బుమణికి లేదన్నారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలు తలెత్తినా వాటన్నింటిని పక్కనపెట్టి పార్టీని ముందుకు నడిపిస్తున్నానని పేర్కొన్నారు. పీఎంకే పొత్తుపై పార్టీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

పోలీసు ఇన్‌స్పెక్టర్‌పై పీఎంకే నేత ఆరోపణలు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులోని 'మై వీ3 యాడ్' అనే కంపెనీ రూ.కోట్లలో మోసానికి పాల్పడిందని ఆరోపిస్తూ పీఎంకే కార్యనిర్వాహకుడు అశోక్ శ్రీనిధి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులు తన కుటుంబ సభ్యులను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కూడా గురువారం ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవడం లేదన్నాడు. దీంతో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో గొడవ పడటంతో ఇన్‌స్పెక్టర్ అరుణ్‌కుమార్ తనపై తప్పుడు కేసు పెట్టారని, దర్యాప్తు పేరుతో తనను వేధిస్తున్నారని అశోక్ శ్రీనిధి విలేకరులతో చెప్పారు.

విలేకరులతో మాట్లాడుతున్న అశోక్ శ్రీనిధి

కపాలీశ్వరర్ ఆలయానికి బాంబు బెదిరింపులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై మైలాపూర్‌లోని ప్రసిద్ధ కపాలీశ్వరర్ ఆలయానికి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకి పాల్పడ్డారు. ఆలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు, బాంబు స్క్వాడ్ ఆలయంలో తనిఖీలు చేపట్టారు. పేలుడు వస్తువులు లభించలేదు. దీని గురించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంరక్షకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ సర్కిల్‌లోని బాలల సంక్షేమం, ప్రత్యేక సేవల విభాగంలో పనిచేస్తున్న అన్నై సత్య ప్రభుత్వ బాలల గృహంలో సంరక్షకుల పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తన్నీరు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోషల్ వర్క్, సోసియాలజీ, సైకాలజీ, పబ్లిక్ హెల్త్, కౌన్సెలింగ్‌లో మాస్టర్స్ చేసిన మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. తగిన దస్త్రాలతో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా నేరుగా లేదా తపాలా ద్వారా 'జిల్లా బాలల భద్రత కార్యాలయం, నెం.19, రెండో అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయ అదనపు ప్రాంగణం, ఫింగర్‌పోస్టు, ఊటీ- 643 006, నీలగిరి జిల్లా' చిరునామాకు దరఖాస్తులు పంపాలని సూచించారు. వివరాలకు 0423-2445529 ఫోన్ నెంబరుపై సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పళని మురుగన్‌ను దర్శించుకున్న నయనతార కుటుంబం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా పళని మురుగన్ ఆలయానికి గురువారం సినీనటి నయనతార-విఘ్నేష్‌శివన్ దంపతులు తమ పిల్లలతో విచ్చేశారు. కొండ కింద నుంచి రోప్ కార్ సాయంతో కొండపైన ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం తరఫున ప్రసాదాలను అందజేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు నయనతారతో సెల్ఫీలు దిగారు.

ఆలయంలో పిల్లలతో నయనతార, విఘ్నేష్‌శివన్

కాంచీపురం జిల్లా కుండ్రత్తూర్ తాలూకా కార్యాలయంలోని రికార్డుల గదిని గురువారం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు కలైసెల్వి

- శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే

తిరుక్కురల్ సూక్తుల పఠనంలో బాలికల ప్రతిభ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అక్కాచెల్లెళ్లు జయమహతి(6) రెండో తరగతి, మిథిల(8) మూడో తరగతి చదువుతున్నారు. వీరిలో జయమహతి పెదవులు తాకకుండా 1.35 నిమిషాల్లో 25 తిరుక్కురల్ సూక్తులను చెప్పింది. అదేవిధంగా మిథిల తమిళ పురాతన బ్రాహ్మి లిపిలో 52 అక్షరాలను 1.35 నిమిషాలలో రాసింది. అక్కాచెల్లెళ్ల ప్రతిభ గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ తంగవేల్ బుధవారం సాయంత్రం ఇద్దరిని తన కార్యాలయానికి పిలిపించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నట్లు గురువారం కలెక్టరేట్ ఓ ప్రకటనలో తెలిపింది.

చిన్నారులతో కలెక్టర్ తంగవేల్

EENADU eClassifieds
REAL ESTATE
HOUSE FOR SALE
GENERAL
విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

'రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్ వ్యాఖ్యలు సరికాదు'

వేలూరు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం నుంచి లౌకికవాదం, సోషలిజం పదాలను తొలగించాలన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సూచనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు శాసనసభ స్పీకర్ అప్పావు తెలిపారు. తిరునెల్వేలిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణ జనాభా సంక్షేమం కోసం 208 కొత్త పట్టణ ఆరోగ్య కేంద్రాలు సాయంత్రం సేవలతో ప్రారంభమయ్యాయని తెలిపారు. తిరునెల్వేలి జిల్లా ఉదయత్తూరులో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభమైందని చెప్పారు. డీఎంకే ప్రభుత్వంలో పాత, దెబ్బతిన్న ప్రభుత్వ భవనాలను పునరుద్ధరించినట్లు తెలిపారు. అజిత్‌కుమార్ మృతిని మనస్సాక్షి ఉన్న ఎవరూ అంగీకరించలేరని, ఈ ఘటన ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న అప్పావు

నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు టెర్మినల్ మార్పు

వడపళని, న్యూస్‌టుడే: అహ్మదాబాద్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల కారణంగా డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ వరకు వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా టెర్మినల్‌లో మార్పు జరిగినట్టు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబరు 12వ తేదీ వరకు 70 రోజులపాటు రైలు 'అసర్వ' స్టేషనులో ఆగుతుంది. ● 12656 చెన్నై సెంట్రల్ - అహ్మదాబాద్ రైలు జులై 4 నుంచి బయలుదేరే రైలు అసర్వ స్టేషనుకు 18.20 గంటలకు చేరుకుంటుంది. ● 12655 అహ్మదాబాద్ - చెన్నై సెంట్రల్ రైలు జులై 5 నుంచి అసర్వ స్టేషను నుంచి 21.05 గంటలకు బయలుదేరుతుంది. ఈ కారణంగా సబర్మతి స్టేషనులో కాసేపు ఆగుతుంది.

డీఎంకే సభ్యత్వ నమోదు శిబిరం

కొత్తగా చేరినవారి వద్ద సంతకాలు తీసుకుంటున్న దృశ్యం

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం లచ్చివాక్కంలో డీఎంకే సభ్యత్వ నమోదు శిబిరం గురువారం నిర్వహించారు. ఎల్లాపురం యూనియన్ కార్యదర్శి మూర్తి అధ్యక్షతన కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సభ్యులను చేర్చారు. సర్వసభ్య సభ్యుడు రామమూర్తి, జిల్లా యువజన విభాగ కార్యదర్శి లోకేష్, జిల్లా ప్రతినిధి రవికుమార్ పాల్గొన్నారు.

అజిత్‌కుమార్ మృతికి నిరసనగా ఆందోళన

వేలూరు, న్యూస్‌టుడే: ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ లాకప్ మరణాన్ని ఖండిస్తూ గురువారం వేలూరు జిల్లా కాట్పాడి న్యాయ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరసనకు దిగారు. పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా హైకోర్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసనలో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా కుంభాభిషేకం

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపం సెన్నాంకారణిలోని శ్రీదేవి కురుమారి అమ్మవారి ఆలయంలో గురువారం కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, యాగ పూజలు నిర్వహించారు. పవిత్ర జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి విమాన కలశాలపై అభిషేకించారు.

7న కరుప్పనస్వామి ఆలయంలో...

విల్లివాక్కం: కరూర్ మేలప్పాలయం శ్రీ ఎల్లై అరసు కరుప్పనస్వామి, శ్రీ ముచ్చిలియమ్మన్, శ్రీ కన్నివినాయగర్ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 7వ తేదీ జరుగనుంది. 4వ తేదీ వేకువజామున ఆలయంలో హోమం, ఆరాధనలతో వేడుకలు ప్రారంభమవుతాయి. పులియూర్ శ్రీకాళియమ్మన్ ఆలయం నుంచి భక్తులు పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకొస్తారు. 7వ తేదీ వేకువజామున యాత్రాదానం, యజ్ఞోపవీతం అనంతరం నాలుగో కాలయాగం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు కుంభాభిషేకం నిర్వహిస్తారు.

5 నుంచి ఏకాహ్నిక హరేరామ నామసంకీర్తనం

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపం శ్రీరామకుప్పంలోని ప్రసిద్ధ పట్టాభిరామస్వామి ఆలయంలో 34వ వార్షిక అఖండ ఏకాహ్నిక హరేరామ నామసంకీర్తనం ఈనెల 5న ప్రారంభం కానుంది. 7వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా తులసి పూజ, తిరుప్పావై, విష్ణు సహస్రనామ పారాయణం, గోపూజ, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆణి తిరుమంజనం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా పరమత్తి వేలూర్‌లోని తిరుజ్ఞానసంబంధర్ మఠంలో బుధవారం దేవారం తిరువాసగ పఠనం, ఆణి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శివగామసుందరి సమేత నటరాజస్వామికి మహాభిషేకం జరిపారు. తిరుజ్ఞానసంబంధర్, తిరునావుక్కరసర్, సుందరర్, మాణిక్కవాసగర్, చండికేశ్వరుడు, అప్పూదియడిగల్‌కు ప్రత్యేక అభిషేకాలు, మహేశ్వర పూజ చేశారు. అదేవిధంగా నన్‌సెయ్ ఇడైయారు తిరువేళీశ్వరర్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహాదీపారాధన జరిపారు. నటరాజర్‌ను అలంకరించి సాయంత్రం ఊరేగించారు.

అలంకరణలో నటరాజస్వామి

తిరుచ్చెందూర్ ఆలయ కుంభాభిషేకానికి ఏర్పాట్లు ముమ్మరం

ప్యారిస్: తిరుచ్చెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేకానికి సంబంధించిన తుది దశ పనులను మంత్రి శేఖర్‌బాబు గురువారం పరిశీలించారు. ఆలయంలో 7వ తేదీ కుంభాభిషేకం జరుగనుంది. వేడుకలో తమిళనాడు మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి 10 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. ఈ సందర్భంగా యాగశాల పూజలు ఈ నెల 1న ప్రారంభమయ్యాయి. భక్తుల వసతి కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అదేవిధంగా తాత్కాలిక వాహన పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు మొదలైన వసతులు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో తుది దశ పనులను మంత్రి శేఖర్‌బాబు పరిశీలించారు. వెంట మంత్రి అనితా రాధాకృష్ణన్, జిల్లా కలెక్టరు ఇళంభగవత్, ఎస్పీ ఆల్బర్ట్ జాన్ తదితరులు ఉన్నారు.

ఎగ్మూరు - సెంగోట్టై ప్రత్యేక రైలు

శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో కుడములుక్కు వేడుకలు, ప్రయాణికుల రద్దీ కారణంగా చెన్నై ఎగ్మూరు - సెంగోట్టై వరకు ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే గురువారం తెలిపింది.

● 06089 చెన్నై ఎగ్మూరులో జులై 6న 21.55కు బయలుదేరి సెంగోట్టైకి మరుసటి రోజు 11.30కి చేరుతుంది. ● 06090 సెంగోట్టైలో 7వ తేదీ 19.45కి బయలుదేరి ఎగ్మూరుకి మరుసటి రోజు 09.05కి వస్తుంది. శుక్రవారం నుంచి రిజర్వేషన్లు ప్రారంభమవుతాయి.

వ్యాధి బారినపడిన చిరుతకు చికిత్స

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం కేర్‌మాళం అడవిలో వ్యాధితో బాధపడుతున్న ఓ చిరుత పులి రోడ్డు సమీపంలో సంచరిస్తుండటాన్ని అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. దీంతో దానికి చికిత్స అందించడానికి ఏర్పాటు చేశారు. బుధవారం బోను ద్వారా పట్టుకున్నారు. రెండేళ్ల వయసున్న ఆడ చిరుతకు పశు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పూర్తిగా కోలుకున్న తర్వాత అడవిలో వదలనున్నట్టు అటవీ శాఖవారు తెలిపారు.

నర్సులకు కిట్లు అందజేస్తున్న మంత్రి నాజర్

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆవడి మున్సిపాలిటీ పరిధిలోని కోవిల్‌పతాగైలో రాష్ట్ర ఆరోగ్యశాఖ తరఫున రూ.1.20 కోట్ల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించారు. దీని ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి నాజర్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించారన్నారు. ముందుగా మంత్రి నర్సులకు కిట్‌లు అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆవడి మేయర్ ఉదయకుమార్, డిప్యూటీ మేయర్ సూర్యకుమార్, కమిషనర్ శరణ్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్లు ప్రభాకరన్, ప్రియ పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడికి భాజపా ఖండన

సైదాపేట, న్యూస్‌టుడే: సేలం జిల్లా వెల్లియంపట్టి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను చిత్రీకరించేందుకు వెళ్లిన పాత్రికేయుడిపై దాడిని తమిళనాడు భాజపా ఖండించింది. తమిళనాడు భాజపా అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో.. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక దోపిడీదారులను గూండాచట్టం కింద అరెస్టు చేయాలన్నారు.

ఫ్రీడమ్ ట్రైలర్ విడుదల

చెన్నై: సత్యశివ దర్శకత్వంలో శశికుమార్, లిజో మోల్ జోస్ జంటగా నటించిన చిత్రం 'ఫ్రీడమ్'. ఎలాంటి తప్పు చేయని ఓ శ్రీలంక శరణార్థి జైలులో చిక్కుకుని తప్పించుకునే కథతో రూపొందిన ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందించారు. ఈ నెల 10న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అందులోని సన్నివేశాలు చిత్రంపై ప్రేక్షకుల అంచనాలను మరింత పెంచుతోంది.

బన్ బట్టర్ జామ్ మూడో సింగిల్...

చెన్నై: రాఘవ్ మిర్దాద్ దర్శకత్వంలో బిగ్‌బాస్ ఫేమ్ జయమోహన్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'బన్ బట్టర్ జామ్'. ఇందులో ఆదిత్య ప్రసాద్, భవ్య త్రిఖ, చార్లీ, శరణ్య పొన్‌వణ్ణన్, దేవదర్శిని, మైఖేల్ తంగదురై, వీజే పప్పు తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ నెల 18న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో మూడో సింగిల్ 'కాజుమా'ను గురువారం విడుదల చేశారు. ఈ పాటను నివాస్ కె.ప్రసన్న, అదితి శంకర్ కలిసి పాడారు.

సైన్స్ ఫిక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూట్

చెన్నై, న్యూస్‌టుడే: వెరూస్ ప్రొడక్షన్స్ తన తదుపరి చిత్రంగా 'రూట్ - రన్నింగ్ ఔట్ ఆఫ్ టైమ్'ను ప్రకటించింది. ఇదో సైన్స్ ఫిక్షన్ క్రైమ్ థ్రిల్లర్ అని వెల్లడించింది. ఇందులో గౌతమ్ రామ్ కార్తిక్, భవ్య త్రిఖ జంటగా నటిస్తుండగా బాలివుడ్ నటుడు అపర్‌శక్తి ఖురానా ఈ చిత్రం ద్వారా తమిళ చిత్రపరిశ్రమకు పరిచయమవుతున్నారు. చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న సూర్యప్రతాప్. ఎస్ రజనీకాంత్ నటించిన 'కోచ్చడైయాన్' చిత్రానికి ఆసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేయడం గమనార్హం. చిత్రం పూజ కార్యక్రమం చెన్నైలో జరిగింది. ఇందులో గౌతమ్ రామ్ కార్తిక్, అపర్‌శక్తి ఖురానా, వైజీ మహేంద్రన్, భవ్య త్రిఖ, నిర్మాతలు ధనిష్టన్ ఫెర్నాండో, రాజరాజన్ జ్ఞానసంబంధం, సంజయ్ శంకర్, షేక్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు. చిత్రం గురించి దర్శకుడు సూర్యప్రతాప్ ఎస్ మాట్లాడుతూ... ఈ చిత్రం మొదటి నుంచి తన కలల ప్రాజెక్టు అన్నారు. ఇది శాస్త్రీయ నేపథ్యంతో, భావోద్వేగమైన కథాపాత్రలతో రూపొందుతున్న చిత్రమని తెలిపారు. ఇందులో గౌతమ్ రామ్ కార్తిక్ పోలీసు అధికారిగా నటిస్తున్నారని వెల్లడించారు.

పూజ కార్యక్రమంలో చిత్రబృందం

అమ్మవారి సన్నిధిలో సిద్ధార్థ్, దేవయాని, శరత్ కుమార్ తదితరులు

కాళికాదేవి సేవలో 3బీహెచ్‌కే బృందం

చెన్నై: శ్రీగణేష్ దర్శకత్వంలోని '3బీహెచ్‌కే' చిత్రం శుక్రవారం సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రదర్శించిన ప్రత్యేక ఆటను చూసిన సినీ రంగప్రముఖులు పలువురు చిత్రబృందానికి అభినందనలు తెలుపుతున్నారు. దర్శకులు మారి సెల్వరాజ్, రామ్, నటులు రవి మోహన్, శింబు తదితరులు చిత్రబృందాన్ని అభినందించారు. ఈ నేపథ్యంలో ప్యారిస్ కార్నర్‌లోని కాళికా మాత ఆలయాన్ని చిత్ర నటీనటులు శరత్‌కుమార్, దేవయాని, సిద్ధార్థ్, హీరోయిన్ మీథా రఘునాథన్ తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ... చేపట్టిన ప్రయత్నం విజయవంతం కావాలని ప్రార్థించామని అన్నారు. చిత్రంలోని నటీనటులు అందరికీ విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ ప్రార్థించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని అందరినీ ఏకం చేయాలి: స్టాలిన్

ప్రజలకు కరపత్రం అందిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అందరినీ ఏకం చేయాలంటూ డీఎంకే శ్రేణులకు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా పోరాడేందుకు రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేలా, డీఎంకే సభ్యత్వ నమోదును ప్రారంభించేలా 'ఓరణియిల్ తమిళ్‌నాడు'ను ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఈనెల 1న ప్రారంభించిన విషయం తెలిసిందే. వాటి ప్రచారాన్ని ఆళ్వార్‌పేట్‌లోని తన నివాసానికి సమీపాన గురువారం ప్రారంభించారు. అక్కడి నివాస ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. రాజకీయ కార్యకలాపాలు, కేంద్ర ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన తన 'ఎక్స్' పేజీలో.. తమిళనాడు నేల, భాష, ఆత్మాభిమానం కాపాడేందుకు కులం, మతం, రాజకీయాలకు అతీతంగా 'ఓరణియిల్ తమిళ్‌నాడు' గెలవాలన్నారు. ఇందుకోసం 45 రోజులు పార్టీ జిల్లా కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలు ప్రచారంలో పాల్గొని రాష్ట్రంలోని అందరినీ ఏకం చేయాలని పిలుపునిచ్చారు.

ఈపీఎస్ పర్యటనకు భాజపాకు ఆహ్వానం

ఎడప్పాడి పళనిసామి, నయినార్ నాగేంద్రన్

సైదాపేట, న్యూస్‌టుడే: అధికారంలోకి రావడమే లక్ష్యంగా అన్నాడీఎంకే శాసనసభ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి 'మక్కళై కాప్పోం- తమిళగత్తై మీట్పోమ్' (ప్రజలను కాపాడుదాం- తమిళనాడును రక్షిద్దాం) పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటన ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలను కలవనున్నారు. మొదటి విడత పర్యటనను 7న కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రారంభించనున్నారు. ఆ రోజు మేట్టుపాళయం, కవుండంపాళయం నియోజకవర్గాలు, 8న కోయంబత్తూరు దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. తర్వాత రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున పర్యటించనున్నారు. మొదటి విడత పర్యటన 23న ఒరత్తనాడు, పేరావూరణి, పట్టుకోట్టై నియోజకవర్గాల్లో ముగించనున్నారు. ఎడప్పాడి పళనిసామి పర్యటన ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు కూటమి పార్టీ భాజపాకు ఆహ్వానం పలికారు. 7న మేట్టుపాళయంలో పర్యటనలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మరికొందరు నేతలు పాల్గొననున్నట్లు సమాచారం.

ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేత

నియామక ఉత్తర్వులు అందిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: జలవనరులశాఖలో ఇంజినీర్ల(సివిల్) ఉద్యోగ ఖాళీలకు టీఎన్‌పీఎస్సీ ద్వారా ఎంపిక చేసిన 169 మందికి నియామక ఉత్తర్వులను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం సచివాలయంలో అందించారు. జలవనరుల శాఖ తరఫున నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్, వాపోస్ ల్యాబ్స్ ద్వారా రూపొందించిన రూ.30కోట్ల విలువైన తమిళనాడు జలవనరుల సమాచారం, నిర్వహణ సంస్థ వెబ్‌సైట్ సేవలను, రూ.3.55 కోట్ల విలువైన జలవనరుల ఉపగ్రహ ఆధారిత జలవనరుల సమాచారం, మానిటరింగ్, భద్రత వ్యవస్థ వెబ్‌సైట్ సేవలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, జలవనరులశాఖ కార్యదర్శి జయకాంతన్, ముఖ్యకార్యదర్శి చీఫ్ ఇంజినీర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే బహిరంగ సభ

పేదలకు స్టీలు పాత్రలను అందజేస్తున్న పుగళేంది

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం మీంజూరులో డీఎంకే బహిరంగ సభ బుధవారం రాత్రి నిర్వహించారు. ప్రధాన కార్యాలయ వక్త, మాజీ ఎమ్మెల్యే పుగళేంది ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెయ్యి మందికి స్టీల్ పాత్రలు అందజేశారు. జిల్లా కార్యదర్శి రమేష్‌రాజ్, యూనియన్ కార్యదర్శులు చంద్రశేఖర్, ఆనంద్, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ శేఖర్ పాల్గొన్నారు.

6 నెలల్లో కుక్కకాటు బాధితులు 2.80 లక్షల మంది

18 మంది మృతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆరునెలల్లో 2.80 లక్షల మంది కుక్కకాటుకు గురయ్యారు. వారిలో 18 మంది మృత్యువాతపడ్డారు. తమిళనాడులో వీధి శునకాలు, పెంపుడు శునకాలవల్లో గాయపడేవారి ఘటనలు పెరుగుతున్నాయి. సాధారణంగా శునకాల పుట్టిన మొదటి సంవత్సరంలోనే రేబీస్ టీకా వేయించాలి, ఆ తర్వాత ఏడాదికోసారి వేయించాలి. టీకాలు వేయించని కారణంగా అవి దాడి చేయడంతో రేబీస్ సోకుతోంది. గతేడాది మాత్రమే 4.80 లక్షల మంది శునకాల దాడి బారినపడ్డారు. 40 మంది రేబీస్ సోకి చనిపోయారు. అత్యధికంగా అరియలూర్‌లో 37,023 మంది, కడలూర్ జిల్లాలో 23,997 మంది, ఈరోడ్‌లో 21,507 మంది కుక్కకాటు బాధితులుగా ఉన్నారు. చెన్నైలో 24,088మంది, కోవైలో 12,097మంది కుక్కకాటుకు గురయ్యారు. తగిన సమయంలో టీకా వేయించుకోకుండా ఆలస్యం చేయడంతో 40మంది రేబీస్ బారినపడి మృతి చెందారు. వారిలో 10మంది పెంపుడు శునకాల దాడిలో గాయపడిన చనిపోయారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ప్రస్తుతం వరకు 2.80 లక్షల మంది శునకాల దాడికి గురయ్యారు. ఇందులో అత్యధికంగా సేలంలో 19,250 మంది, చెంగల్పట్టులో 13,064, తంజావూరులో 11,441 మంది, తిరుచ్చిలో 11,371 మంది, కన్యాకుమారిలో 10,580 మంది బాధితులుగా ఉన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ...రాష్ట్రంలో ఏటా లక్షలాది మంది కుక్కకాటుకు గురవుతున్నా వారందరికీ రేబీస్ రాదన్నారు. రేబీస్ వైరస్ బారినపడిన శునకం, మేక, ఆవు, గుర్రం, కోతి, పిల్లివంటి జంతువులు కరిస్తే తగిన చికిత్స పొందాలి. రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రులు, ఆరోగ్యకేంద్రాల్లో లక్షకుపైగా రేబీస్ టీకాలు నిల్వ ఉన్నాయన్నారు. వీధి శునకాలు, పెంపుడు శునకాలకు నాలుగు విడతలుగా రేబీస్ టీకా వేస్తున్నామన్నారు. అవగాహన లేకుండా చికిత్స పొందకుంటే మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పాఠశాల విద్యార్థి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: రోడ్డుపై నిలిచిన వాన నీటిలో విద్యుత్తు సరఫరా కావడంతో 12వ తరగతి విద్యార్థి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... చెన్నై తిరువొత్తియూర్‌కి చెందిన అల్తాఫ్ కుమారుడు నబ్బిల్ (17) స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో 12వ తరగతి చదువుతున్నాడు. ఇతను బుధవారం రాత్రి ట్యూషన్ నుంచి ఇంటికి బయలుదేరాడు. ఇంటి బయట రోడ్డుపై ఉన్న వాన నీటిలో విద్యుత్తు తీగ పడటంతో అందులో విద్యుత్తు ప్రవహించింది. అది తెలియని బాలుడు నీటిలో కాలు పెట్టడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అక్కడున్న వారు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం'

సైదాపేట: బాలుడి మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఆ ప్రాంతంలో ముందే ఇద్దరు వ్యక్తులు విద్యుదాఘాతంతో గాయపడినట్లు తెలుస్తోందని, విద్యుత్ లీకేజీని సరిచేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటమే విద్యార్థి మృతికి కారణమని తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

తమ్ముడి మృతిని జీర్ణించుకోలేక అన్న...

జయరామన్, బలరామన్ (పాతచిత్రాలు)

వేలూరు: వేలూరు జిల్లా కొట్టావూర్‌కి చెందిన రైతులు జయరామన్ (85), బలరామన్ (80) అన్నదమ్ములు. వీరికి తలా ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరి భార్యలు ఐదేళ్ల క్రితం మృతిచెందారు. దీంతో అన్నదమ్ములు ఒకే ఇంట్లో ఉంటున్నారు. మూడేళ్లుగా కాలు విరిగి మంచానికే పరిమితమైన బలరామన్ బుధవారం మధ్యాహ్నం మృతిచెందాడు. అతని మృతదేహాన్ని ఖననం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జయరామన్ రాత్రి తమ్ముడి మృతదేహం వద్ద కూర్చుని ఏడుస్తూ మృతిచెందాడు. దీంతో ఇద్దరికీ కొట్టావూర్ శ్మశానంలో అంత్యక్రియలు చేశారు.

పండు విత్తనం గొంతులో చిక్కుకుని బాలుడు...

రియాస్ (పాతచిత్రం)

తిరునెల్వేలి: తిరునెల్వేలి జిల్లా మేలపాళైయానికి చెందిన నిజాం అనే వ్యక్తి విదేశంలో పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు రియాస్ (5) ఉన్నారు. నిజాం భార్య కుమారుడితో పాటు తన పుట్టింట్లో ఉంటోంది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి రంబుట్టాన్ పండు రియాస్‌కు ఇచ్చారు. దానిని తింటుండగా విత్తనం గొంతులో చిక్కుకుంది. శ్వాస సమస్య తలెత్తడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే బాలుడు మృతిచెందాడు. ఘటనపై మేలపాళైయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో 12వ తరగతి విద్యార్థి...

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లా కుమలన్‌కుట్టై సెల్వం నగర్‌కు చెందిన శివ కుమారుడు ఆదిత్య స్థానిక ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 12వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలుడు సాయంత్రం పాఠశాలకు 250 మీటర్ల దూరంలో స్పృహ కోల్పోయి కిందపడటంతో స్థానికులు ఈరోడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలో ఆదిత్య మృతిపై అనుమానం ఉందని తల్లిదండ్రులు, బంధువులు పోలీసు స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేశారు. ఈరోడ్ నార్త్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. విద్యార్థుల ఘర్షణలో ఆదిత్య మృతి చెందినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మాన్ని ఢీకొన్న ప్రైవేటు బస్సు: ప్రయాణికులు సురక్షితం

ప్రమాదానికి గురైన బస్సు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కుంభకోణం నుంచి కోవైకు బుధవారం రాత్రి ప్రైవేట్ లగ్జరీ బస్సు 36మంది ప్రయాణికులతో బయలుదేరింది. బస్సుని రాబర్ట్ అనే వ్యక్తి నడిపాడు. గురువారం తెల్లవారుజామున బస్సు తిరుప్పూర్ జిల్లా పొంగలూర్ వద్ద వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మాన్ని ఢీకొంది. ప్రమాదంలో బస్సులో ఉన్న 36మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని స్థానికులు తిరుప్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అవినాశిపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నబిడ్డలను చిత్రహింసలు పెడుతున్న తల్లి

పొన్నేరి, న్యూస్‌టుడే: కళ్లకురిచ్చికి చెందిన సత్య, శివ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ కలహాలతో సత్య భర్తను వీడి తిరువళ్లూరు జిల్లా పొన్నేరికి చెందిన అన్బరసన్ అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. అతనితో గొడవల కారణంగా సత్య తన కుమార్తెలకు వాతలు పెట్టి చిత్రహింసలు పెట్టింది. సమాచారం అందుకున్న పొన్నేరి పోలీసులు పిల్లలను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. సత్య, అన్బరసన్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తల బలవన్మరణం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ముత్యాలపేట కన్నదాసన్ వీధికి చెందిన పార్తిభన్(30) పుదుచ్చేరిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సేల్స్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కీర్తికా (24) అనే యువతితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇంకా సంతానం కలగలేదు. దీంతో దంపతులు మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇద్దరు రెండు రోజుల క్రితం విళుపురం జిల్లా మరక్కాణం తాలూకా సిరువాడిలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తామని చెప్పి ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్లారు. తరువాత అదే రోజు రాత్రి సిరువాడి గ్రామ పొలిమేరలోని చెరువు వద్దకు వెళ్లి విషం తాగారు. స్పృహకోల్పోయి పడి ఉన్న వారిని గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మరణించారు. బ్రహ్మదేశం పోలీసులు బుధవారం మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత...

పెరియపాళ్యం: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీప తిరుక్కండలంలో ఇటుకల బట్టీ ఉంది. ఇందులో ఉత్తరాది రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు పురుషోత్తమజోషి, సునితాజోషి పనిచేస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగా సునితాజోషి బుధవారం రాత్రి ఇంట్లోని పడక గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పెరియపాళ్యం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీపం వలసైవెట్టిక్కాడు గ్రామానికి చెందిన వసంత (60) అనారోగ్యానికి గురైంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కడంబత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై గిండికి చెందిన జయకుమార్, క్రోంపేటకి చెందిన శరవణన్ స్నేహితులు. శరవణన్ చెల్లికి జయకుమార్ ఇటీవల ఉద్యోగం ఇప్పించాడు. దీంతో జయకుమార్ తరచూ స్నేహితుడి చెల్లితో మాట్లాడుతుండేవాడు. ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఆమె నుంచి అప్పుడప్పుడు డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత బంగారు నగలు కూడా తీసుకున్నాడు. వాటిని తిరిగివ్వలేదు. దీంతో ఆమె తన అన్న శరవణన్‌కి చెప్పింది. ఈ నేపథ్యంలో గత నెల 28న జయకుమార్‌ని పిలిచిన శరవణన్.. తన స్నేహితులతో కలిసి మద్యం తాగారు. అప్పుడు తన చెల్లి వద్ద నగలు, నగదు ఎందుకు తీసుకున్నావని గొడవపడ్డాడు. అనంతరం శరవణన్, అతని స్నేహితులు కలిసి జయకుమార్‌పై దాడిచేయడంతో అతను మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శరవణన్, దినేష్ మొదలైన ఆరుగురిని గురువారం అరెస్టు చేశారు.

ఆస్తి వివాదంలో భర్తను చంపిన భార్య...

పద్మావతి

వేళచ్చేరి: కడలూర్ జిల్లా నైవేలి ఇందిరా నగర్‌కు చెందిన కౌసియప్పన్ (63) విశ్రాంత ఎన్నెల్సీ సొసైటీ ఉద్యోగి. ప్రస్తుతం నైవేలిలోని ఓ వస్త్ర దుకాణంలో కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. ఇతని మొదటి భార్య మరణించడంతో అదే ప్రాంతానికి చెందిన పద్మావతి(47)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. పద్మావతికి అప్పటికే పెళ్లై ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా కౌసియప్పన్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతను నివసిస్తున్న గృహం, మరి కొంత ఆస్తిని ఆ మహిళ పేర రాస్తానని పద్మావతితో చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆమె బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భర్త తలపై గడ్డపారతో పొడిచి హత్య చేసింది. తరువాత తన భర్తను హత్య చేసినట్లు బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. సమాచారం మేరకు నైవేలి టౌన్‌షిప్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి నిందితురాలిని అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వైగో మాజీ సహాయకుడు...

సైదాపేట: తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ ప్రాంతానికి చెందిన అరుణగిరి (60) ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో మాజీ సహాయకుడు. సామాజిక మాధ్యమాల్లో నాస్తికవాద ప్రచారం చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఈయన హిందూ దేవుళ్ల గురించి అసత్య ప్రచారం చేస్తున్నారంటూ రాజా అనే వ్యక్తి శంకరన్‌కోవిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు గతంలోనే విచారించారు. ఇదిలా ఉండగా అరుణగిరిని ఈ నెల 1న అరెస్టు చేశారు. బుధవారం కోర్టులో హాజరుపరిచి తిరునెల్వేలి కేంద్ర కారాగారానికి తరలించారు.

నగల వ్యాపారిని కిడ్నాప్ చేసి దోచుకున్న నిందితులు...

ప్యారిస్: శివగంగైకి చెందిన రవిచంద్రన్ నగల వ్యాపారి. ఈయన గత నెల 26వ తేదీ చెన్నైలో బంగారు నగలు కొనుగోలు చేసి రాత్రి సుమారు 7.40 గంటల సమయంలో ఎగ్మూర్ ప్యాంథియన్ రోడ్డు వద్ద 131 గ్రాముల బంగారు నగలు, 1.250 కిలోల వెండి వస్తువులు, రూ.31 లక్షల నగదుతో నిలబడి ఉన్నాడు. అప్పుడు కారులో వచ్చిన కొందరు దుండగులు రవిచంద్రన్‌ని బలవంతంగా కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న నగలు, నగదు దోచుకొని పోరూర్ వద్ద కిందకు నెట్టేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో నిందితులు ప్రభు, ముత్తురామలింగం, దీనా, ప్రేమ్‌కుమార్, ముత్తులింగం, మరో ప్రభుని గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి 203 గ్రాముల బంగారు నగలు, 3.2 కిలోల వెండి, రూ.6.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో.. రవిచంద్రన్ వారానికి మూడుసార్లు చెన్నై షావుకారుపేటకి వచ్చి నగలు కొనుగోలు చేసి ఆటోలో ఎగ్మూర్‌కి వెళ్లి, అక్కడి నుంచి ప్రైవేటు బస్సులో శివగంగైకి వెళ్లడాన్ని గమనించిన నిందితులు పథకం ప్రకారం కిడ్నాప్ చేసి దోచుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

అరెస్టయిన నిందితులు

నకిలీ వీసా కేసులో పరారీ నిందితుడు...


సుందర్

ప్యారిస్: మొహ్మద్ ఇంతియాజ్ అనే వ్యక్తి 2006లో ఐటీఐ పూర్తి చేసి విదేశాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా తిరుముల్లైవాయిల్‌లో ఉంటున్న పాస్టర్ విలియం జోసెఫ్‌ని కలిశారు. తన స్నేహితుల ద్వారా విదేశాలకు వెళ్లేందుకు వీసా ఏర్పాటు చేస్తానని మొహ్మద్ ఇంతియాజ్ సహా 29 మంది నుంచి విలియం జోసెఫ్ రూ.18 లక్షలు తీసుకున్నాడు. అనంతరం వారికి నకిలీ వీసాలు ఇచ్చి మోసానికి పాల్పడటంతో బాధితులు పోలీసులకి ఫిర్యాదు చేశారు. అనంతరం సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి 10 మందిని అరెస్టు చేశారు. అదేవిధంగా వారిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణలో ఉన్న ఈ నేపథ్యంలో నిందితుల్లో ఒకరైన సుందర్ కోర్టు విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉన్నాడు. దీంతో 2017లో సుందర్‌పై కోర్టు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్న నేపథ్యంలో 8ఏళ్ల తర్వాత నీలగిరి జిల్లా కున్నూర్‌లో సుందర్‌ని పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

క్రైం కార్నర్

● ప్యారిస్: చెన్నై కోడంబాక్కంలో పనిచేస్తున్న ఎక్స్‌సెల్ నెట్‌వర్క్ సంస్థ, ప్యారిస్‌లో పనిచేస్తున్న యాక్సెస్ అనే సంస్థలు 2003లో 34 టెలిఫోన్ కనెక్షన్‌లను తీసుకున్నాయి. బిల్లులు చెల్లించకపోవడంతో బీఎస్ఎన్ఎల్‌కి రూ.49 లక్షల నష్టం ఏర్పడింది. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ తరఫున చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం 2003 మార్చి 26న పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. సైదాపేట కోర్టులో ఈ కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. వారిపై 2006లో అరెస్టు వారెంట్ జారీ అయింది. ఈ నేపథ్యంలో 19 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న సయ్యద్ ఇబ్రహీం, మొహ్మద్ తహ యాసిన్ హమీమ్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

ప్రభుత్వాధికారిని బెదిరించిన టీవీకే నిర్వాహకురాలు...

ఆర్కేనగర్: దిండుక్కల్‌కు చెందిన మురుగానందం (56) పళనిలోని ప్రజాపనులశాఖ కార్యాలయంలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. దిండుక్కల్ చిన్న అయ్యంగుళం ప్రాంతానికి చెందిన వడివేల్ భార్య రీతా (46) తమిళగ వెట్రి కళగం నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నారు. మురుగానందం, రీతా మధ్య నగదు లావాదేవీలకు సంబంధించి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఏర్పడిన గొడవలో మురుగానందాన్ని అసభ్య పదజాలంతో దూషించి చంపుతానని రీతా బెదిరించినట్లు తెలుస్తోంది. దీని గురించి మురుగానందం దిండుక్కల్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు రీతాను గురువారం అరెస్ట్ చేశారు.

భయాందోళనకు గురిచేసేలా రీల్స్ చేసిన యువకుడు...

మనోజ్

ప్యారిస్: ప్రజలను భయాందోళనకు గురిచేసేలా ఇన్‌స్టాలో రీల్స్ పోస్ట్ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు ప్రజలను భయాందోళనకు గురిచేసేలా, ప్రజాశాంతికి భంగం వాటిల్లేలా మాట్లాడిన వీడియోని పోస్టు చేశాడు. ఇందుకు సంబంధించి చెన్నై ఎంకేబీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం రీల్స్ పోస్ట్ చేసిన తిరువళ్లూర్‌కి చెందిన మనోజ్ అనే యువకుడిని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నలుగురు బంగ్లాదేశీయులు...

విల్లివాక్కం: కృష్ణగిరి జిల్లా హోసూర్ నగరపాలక సంస్థ నల్లూర్ పోలీసు స్టేషన్ సరిహద్దులోని ఆవలపల్లి ప్రాంతంలో బంగ్లాదేశ్ దేశానికి చెందిన బషర్‌ముల్లా(46) కుటుంబం 2018 నుంచి చట్టవిరుద్ధంగా నివాసం ఉంటోంది. బషర్‌ముల్లా హోసూర్ ప్రాంతంలో చేపల వ్యాపారం చేస్తున్నాడు. సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి బషర్‌ముల్లా, ఆయన భార్య రత్నాబేగం, కుమారుడు అలీ జాడర్‌ముల్లా, బంధువు జూమాఖాత్తంను అరెస్టు చేశారు.

చోరీ కేసులో నలుగురు...

విల్లివాక్కం: నామక్కల్ జిల్లా వేలగౌండంపట్టి స్వామినగర్‌కు చెందిన సురేష్(46) అదే ప్రాంతంలో ఇనుప చువ్వలు, సిమెంట్ దుకాణం నిర్వహిస్తున్నారు. గత నెల 29వ తేదీ రాత్రి దుకాణంలోకి చొరబడిన దుండగులు 3 టన్నుల ఇనుప చువ్వలను చోరీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన వేలగౌండంపట్టి పోలీసులు పుదుక్కోట్టై జిల్లా అగరపట్టి సమీపం పూసత్తురైకి చెందిన డ్రైవర్ మురుగేశన్(56), తిరువప్పూర్ ప్రాంతానికి చెందిన శరవణన్(32), కోవిల్‌పట్టికి చెందిన నల్లతంబి(32), తిరుగోకర్ణానికి చెందిన రాజా అలియాస్ కోళి రాజా(42)ని బుధవారం నామక్కల్ రోడ్డు ప్రాంతంలో అరెస్టు చేశారు.

200 సవర్ల నగలు దోపిడీ

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం ప్రాంతానికి చెందిన కేసరి వర్మన్ విదేశంలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా కుమార్తె కొద్ది రోజుల క్రితం పుష్పవతి కావడంతో నెల రోజులు సెలవుపై కళ్లకురిచ్చి వచ్చాడు. ఈనెల 7వ తేదీ వేడుక జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో భార్యతో కలిసి బంధువులకు ఆహ్వాన పత్రికలు అందజేసేందుకు తిరుగుతున్నారు. ఇంట్లో కేసరి వర్మన్ తల్లిదండ్రులు మాత్రమే ఉన్నట్లు తెలుసుకున్న దుండగులు గురువారం వేకుజామున ఇంటి పెరటి తలుపు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి వృద్ధ దంపతులను తాళ్లతో కట్టేసి, అరవకుండా నోట్లో వస్త్రాలు కుక్కి బీరువాలో ఉన్న 200 సవర్ల నగలు ఎత్తుకెళ్లారు. కాసేపటి తర్వాత వృద్ధ దపంతులు నోట్లో ఉన్న వస్త్రాలను కష్టంమీద తీసి కేకలు వేశారు. ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకుని వారిని విడిపించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో దోషికి ఐదేళ్ల జైలు శిక్ష

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా అంబైకి చెందిన రత్నం(45) టీ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతను 2022లో పాఠశాల విద్యార్థినిపై లైంగికంగా వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అంబై పోలీసులు పోక్సో చట్టం కింద నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం విచారణ ముగిసింది. నేరం రుజువు కావడంతో రత్నంకి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

[illegible] [illegible] [illegible]

(c) eenadu

ప్రజలతో మమేకం.. శ్రేణులకు దిశానిర్దేశం

రెండు రోజుల కుప్పం పర్యటన ముగించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, కుప్పం పట్టణం, శాంతిపురం: శాంతిపురం, కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించిన చంద్రబాబు ప్రజలతో మమేకమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 రోజుల పాటు జరిగే కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన జనం నుంచి వినతులు స్వీకరించి.. అర్జీల సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలకాల ఆవిష్కరణలు, మామిడి రైతులతో సమావేశాన్ని నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ◆ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ..

కార్యకర్తలే తెదేపా బలం

తెదేపా బ్రాండ్ ఇమేజ్ కార్యకర్తలే అన్న విషయాన్ని మరవకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తెదేపా ఓడిపోవడానికి వీలు లేదు.. రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగేలా నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి సాగించాలని నాయకులకు సూచించారు. శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద గురువారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గడిచిన ఎన్నికల్లో 'సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' ప్రచారంతో ఘన విజయం సాధించామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర పునర్నిర్మాణానికి చేపడుతున్న కృషిని జనంలోకి సమర్థంగా తీసుకెళ్లాలని సూచించారు.

టాటా నెర్వ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు

ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు..

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నాలుగు మండలాల్లో 30 రోజుల పాటు కార్యక్రమం వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గతంలో పార్టీ పరమైన కార్యక్రమాల్లో కుప్పం మొదటి స్థానంలో ఉండేదని.. ప్రస్తుతం మసకబారుతోందన్నారు. సొంత నియోజకవర్గంలో పార్టీ తీరు సరిగా లేకుంటే... రాష్ట్రంలో పార్టీపై ఎలాంటి అభిప్రాయం ఉంటుందో గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాజకీయాలు వద్దు

అభివృద్ధి, సంక్షేమం అమలులో రాజకీయాలు వద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో ఆదర్శంగా నిలుస్తూ.. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చేసిన మంచి పనుల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. తెదేపా గ్రాఫ్‌ను మరింత పెంచాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు, తితిదే సభ్యుడు శాంతారామ్ పాల్గొన్నారు.

పల్ప్ పరిశ్రమల ప్రతినిధుల సమావేశం..

మామిడి కొనుగోళ్లతో రైతులను ఆదుకోవాల్సిందిగా పల్ప్ పరిశ్రమల ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. శివపురం వద్ద సీఎం స్వగృహంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు, పల్ప్ యూనిట్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి తక్షణం మామిడి కాయలు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 30 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు పని చేస్తున్నాయని.. వాటి ద్వారా 6,500 మెట్రిక్ టన్నుల కాయలు కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు 1.12 లక్షల టన్నుల మామిడిని కొనుగోలు చేశారని వివరించారు.

ఇకపై.. సుందర పంచాయతీలు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర పురిస్వచ్ఛ మేకవింపులో లెగసీ వేస్ట్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామాల రూపురేఖలు ఇరువైపులా చెత్త దిబ్బలను గుర్తించి వాటిని తొలగిస్తూ గ్రామాలను సుందరంగా తయారు చేస్తున్నారు. జిల్లా పరిధిలో పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పురోగతిలో ఉంది. జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 2,700 టన్నులు, పేరూరు గ్రామపంచాయతీలో 1,296 టన్నులు, లింగేశ్వరనగర్‌లో 725 టన్నులు, చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో 1420 టన్నులు, తిరుపతి గ్రామీణ మండలం పద్మావతిపురంలో 1250 టన్నుల చెత్త దిబ్బలను తొలగించారు. ఇలా ఇప్పటివరకు 9,781 టన్నుల చెత్త నిల్వలను తరలించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో రానున్న రోజుల్లో కార్యక్రమాన్ని విస్తృతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డీపీవో వెల్లడించారు.

చెత్తదిబ్బల తొలగింపుపై దృష్టి

తిరుపతి గ్రామీణ మండలంలో చెత్త నిల్వల తొలగింపు (నాడు - నేడు)

రేషన్ కార్డుదారులకు సర్వర్ సమస్యలు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: రేషన్ కార్డుదారులు చౌకదుకాణాల్లో సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు సరకులు పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం నుంచి దుకాణాల్లో పంపిణీని ప్రారంభించగా సర్వర్ తరచూ మొరాయిస్తోంది. ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. కొందరు రేషన్ దుకాణదారులు సర్వర్ పనిచేయడంలేదని, ఈ రోజు పంపిణీ చేయలేమని ప్రజలకు వాట్సప్‌లో సమాచారం పెడుతున్నారు. గురువారం రాత్రి 7.45 గంటల వరకు వేచిచూసినా సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇళ్లకు వెళ్లిపోయారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లే నాన్న మాతో రా..!

■ విద్యుదాఘాతంతో తండ్రి దుర్మరణం

■ మిన్నంటిన కుమార్తెల రోదనలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: లే నాన్న.. మాతో రా.. మాట్లాడు.. నువ్వు లేకపోతే అమ్మ, మేం బతకం.. మమ్మల్ని నీ దగ్గరకు తీసుకుపో అంటూ కుమార్తెల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం మిన్నంటింది. చూపరులను కంటనీరు తెప్పించింది. ఊహించని రీతిలో తండ్రి మరణించాడన్న వార్తను తట్టుకోలేకపోయి ఇద్దరు కూతుళ్లు బోరున విలపించారు. మృతదేహాన్ని పట్టుకుని పదేపదే ఎంతమంది వారించినా తలుచుకోవడం అక్కడున్న అందరినీ కలిచివేసింది. నాయుడుపేట చంద్రబాబునగర్‌లో గురువారం ఉదయం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తెదేపా కార్యకర్త కందుకూరి మునీశ్వర్(37) షామియానా వేస్తూ ఇనుప కడ్డీలకు విద్యుత్తు తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు.

మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తెదేపా నాయకులు, డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్సై ఆదిలక్ష్మిలు ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ మృతదేహాన్ని పట్టుకుని కుమార్తెలు లోహిత, హిమబిందు, భార్య ఏడుస్తుండటాన్ని చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి, అంబులెన్సు ఖర్చుల్ని పుర వైస్‌ఛైర్మన్ షేక్.రఫీ భరించారు. మృతుడి పెద్ద కుమార్తె లోహిత బీఫార్మసీ పూర్తి చేసి ప్రైవేటుగా పనిచేస్తుండగా.. చిన్నకూతురు హిమబిందు తిరుపతిలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. వీరికి ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఐదేళ్ల నిర్లక్ష్యం.. పొంగిపొర్లుతోంది

● స్వర్ణముఖితో పొంచిఉన్న వరద ముప్పు

● పలుచోట్ల అధ్వానంగా కరకట్టలు

గూడూరు గ్రామీణం-వాకాడు, న్యూస్‌టుడే: స్వర్ణముఖి నది వరదలపై ఆందోళన వ్యక్తమవుతోంది. పెళ్లకూరు నుంచి వాకాడు మండలం పామంజి వరకు నదికి ఇరువైపులా పొర్లుకట్టలతో ప్రమాదం పొంచి ఉంది. పలుచోట్ల పూర్తిగా లేకపోగా మరికొన్నిచోట్ల 2015, 2023లో వచ్చిన వరదలకు కొట్టుకుపోయాయి. ఇంకొన్ని కట్టలు బలహీనంగా ఉండటంతో వరదనీరు పోటెక్కి పలు గ్రామాల ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఐదేళ్ల వైకాపా పాలనలో కట్టల పరిస్థితిని పట్టించుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణం. కూటమి ప్రభుత్వంలోనైనా సత్వరం ప్రత్యేక దృష్టి పెట్టకపోతే వరద ముంపు ఘటనలు పునరావృతం కాకతప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ అసంపూర్తిగా

జిల్లాలో పెళ్లకూరు, నాయుడుపేట మండలాల పరిధిలోని కూచివాడ, అన్నమేడు, మర్లపల్లి, వేముగుంటపాలెం, చిట్టమూరు మండలంలోని గునపాడు, మెట్టు, కోట మండలంలోని గూడలి, దైవాలదిబ్బ, పుచ్చలపల్లి, వాకాడు మండలంలోని వెంకటరెడ్డిపాలెం, బాలిరెడ్డిపాలెం, పామంజి ప్రాంతాల్లో కట్టల పరిస్థితి దారుణంగా ఉంది. పలుచోట్ల నదిలో నుంచి ఇసుక అక్రమ తరలింపులకు కట్టలను అక్రమార్కులు ధ్వంసం చేశారు. బాలిరెడ్డిపాలెం వద్ద 2023లో వచ్చిన వరదలకు పొర్లుకట్టకు గండిపడి తీవ్ర నష్టం వాటిల్లింది. దాంతో రూ.1.70 కోట్లు వెచ్చించి గోడ నిర్మాణ పనులు మొదలు పెట్టినా నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కోట మండలం దైవాలదిబ్బ వద్ద కట్ట ప్రమాదకరంగా ఉంది. చిట్టమూరు మండలం మెట్టు వద్ద అప్పట్లో పనులను అసంపూర్తిగా వదిలేయడంతో కొంత దూరం కట్ట నిర్మించలేదు. రానున్న వర్షాకాలంలో నదికి భారీగా వరదనీరు వస్తే ఈ ప్రాంతాలు ముంపునకు గురవుతాయని స్థానికులు అంటున్నారు.

చిట్టమూరు మండలం మెట్టు వద్ద పొర్లుకట్ట లేక ఇలా ప్రమాదకరంగా

పనుల తీరిలా..

నాయుడుపేట నుంచి గూడలి వరకు నదికి రెండు వైపులా 30 కి.మీ మేర కట్ట పనులను రూ.86 కోట్లతో 2014లో మొదలు పెట్టగా, 46 శాతం పనులను మాత్రమే చేసి మిగిలినవి అసంపూర్తిగా వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో కట్ట లేక ప్రమాదంగా కనిపిస్తోంది. అలాగే వాకాడు బ్యారేజీ నుంచి పామంజి వరకు నదికి కుడివైపున రూ.23 కోట్లతో 2014లో పనులను చేపట్టగా, 2023 వరదలకు పలుచోట్ల కట్టలకు గండ్లు పడి ప్రమాదకరంగా ఉన్నాయి.

● ఈవిషయమై జలవనరుల శాఖ గూడూరు ఈఈ బాబును వివరణ కోరగా కట్టల పనులు చేపట్టేందుకు డీపీఆర్ స్థాయిలో ఉన్నాయని, తర్వాత పనులకు అంచనాలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేస్తారన్నారు.

వైభవంగా.. పార్వేట ఉత్సవం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి పార్వేట ఉత్సవాన్ని శ్రీవారిమెట్టు మార్గంలో గురువారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఉత్సవర్లను బంగారు తిరుచ్చిపై పార్వేట మండపానికి తీసుకువచ్చి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

కాలిపోతుంటే.. ఆర్పుకోవడమేనా..!

■ కనిపించని ప్రమాద నివారణ చర్యలు

కొన్ని ఘటనలు ఇలా..

● గతేడాది రేణిగుంటలోని ఆసుపత్రిలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడున్న పీవోపీ సామగ్రి తగలబడటంతో పొగ పెద్దఎత్తున అలుముకుంది. పైఅంతస్తులో ఉన్న ఇద్దరు పిల్లలు, తండ్రి మృతి చెందారు.

● తిరుపతి శ్రీగోవిందరాజ స్వామి ఆలయ సమీపంలో గతేడాది లావణ్య ఫొటో ఫ్రేమ్ దుకాణం, బుధవారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో మంటలు అలుముకున్నాయి. ఈ ఘటనల్లో రూ.కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఇరుకు రోడ్డులో జరిగిన ఈ ఘటనతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు.

తిరుపతి (నేరవిభాగం, తితిదే), న్యూస్‌టుడే: భవనాలు.. ఇళ్లలో జరిగే అత్యధిక శాతం అగ్ని ప్రమాదాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమవుతోంది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేయడం.. బాధితుల ఫిర్యాదు మేరకు ఆస్తినష్టాన్ని అంచనా వేసి నివేదించడంతో తన పనిని సరిపెడుతోంది. నిబంధనల మేరకు వైరింగ్ ఏర్పాట్లు జరిగాయా? అగ్ని ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు ఉన్నాయా? వంటివాటిని పరిశీలించే పరిస్థితి లేదు.

ఇదేమి నిర్లక్ష్యం గోవిందా

తిరుమల, తిరుపతి, తిరుచానూరు తదితర క్షేత్రాల్లో వందలాది దుకాణాలు నిర్వహిస్తున్నారు. అయితే ఏ ఒక్క దుకాణం వద్ద అగ్ని నిరోధక పరికరాలు లేవనే చెప్పాలి. అయినా విద్యుత్తు శాఖ అధికారులు దుకాణాలు తనిఖీ చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తితిదే అధికారులు తమ పరిధిలో లేని అంశం అన్నట్లు వ్యవహరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

వీటిని పరిశీలిస్తున్నారా..

● భవన నిర్మాణ సమయంలో అమర్చిన వైరింగ్‌ను పదేళ్లకోసారి సరిచూసుకుని మార్చుకోవాలి. ● ప్రతి విద్యుత్తు వినియోగానికి తగ్గట్టుగా లోడింగ్ పెంచుకోకపోవడంతో తీగలు వేడెక్కి కాలిపోతున్నాయి. ● తీగలు పీవీసీ పైపుల్లో.. ప్లాస్టరింగ్ చేసిన గోడల మధ్య ఉండాలి. అప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయినా ఆక్సిజన్ అందక మంటలు వ్యాపించే పరిస్థితి ఉండదు. గోడలపైన, స్విచ్ బోర్డుల వద్ద తీగలు వేలాడితే తీవ్రత తప్పదు. ● మీటర్లు, స్విచ్‌బోర్డుల వద్ద కాలే స్వభావం ఉండే వస్తువులు ఉంచరాదు. ● ప్రతి ఇంట్లో గ్రౌండ్ ఎర్త్ తప్పనిసరిగా పెట్టుకోవాలి. ● ఇంట్లో పీవోపీ వినియోగాన్ని వీలైనంత తగ్గిస్తే ప్రమాదాల సమయంలో దట్టంగా పొగ అలుముకోదు. ● ఫ్లేమ్ రిటార్డెంట్ లో స్మోక్ కేబుల్ (ఎఫ్ఆర్ఎల్ఎస్) వినియోగంతో ప్రమాదం జరిగినా పొగ, మంటలు పెద్దగా వ్యాపించవు. ● మినీయేచర్ సర్క్యూట్ బ్రేకర్ సిస్టమ్ (ఎంసీబీఎస్) అమర్చుకుంటే లోడింగ్‌కు మించి విద్యుత్తు వినియోగిస్తే వెంటనే ట్రిప్ అయి సరఫరా ఆగిపోతుంది. ప్రమాదాలు జరగవు.

నివారణ చర్యలు తీసుకుంటాం.. గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో అగ్నిప్రమాదం జరగడం దురదృష్టకరం. ఇలాంటివి జరగకుండా విజిలెన్స్ విభాగం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. తిరుమల, తిరుపతి, తిరుచానూరు పరిధిలోని ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో అగ్నిమాపక శాఖ అధికారులతో సమీక్షిస్తాం. అగ్ని నిరోధక పరికరాల ఏర్పాటు చర్యలు తీసుకుంటాం. - మురళీకృష్ణ సీవీఎస్‌వో, తితిదే

బ్రహ్మోత్సవాలకు ముందస్తు భద్రతా చర్యలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి జరగనున్న నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలపై ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తనిఖీలు చేపట్టారు. గురువారం స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్, లేపాక్షి ఏరియా, బాలాజీనగర్, కల్యాణకట్ట, అఖిలాండం, పీఏసీ-1, సీఆర్వో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక బాలాజీనగర్‌లో బాంబ్‌స్క్వాడ్‌తో ప్రత్యేకంగా తనిఖీలు చేయించారు. ఇతర రాష్ట్రాలవారిని, సరైన గుర్తింపు పత్రాలు లేనివారిని తిరుపతికి తరలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలు, భద్రతపై ఆరాతీశారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడు పాల్గొన్నారు.

ప్రధాన కల్యాణకట్ట వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు, చిత్రంలో పోలీసు అధికారులు

గణనీయంగా పెరిగిన టమాటా ధర

పలమనేరు, న్యూస్‌టుడే: టమాటా ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇంత కాలం ధరలు లేకపోవడంతో పండించిన పంటను రైతులు రోడ్లమీద, పశువులకు ఆహారంగా వేశారు. వారం కిందట 15 కిలోల పెట్టె రూ.70 నుంచి రూ.100 పలకగా... ప్రస్తుతం పలమనేరు మార్కెట్‌లో అదే పెట్టె రూ.450 పలుకుతోంది. గురువారం మార్కెట్‌కు 300 టన్నుల పంట వచ్చింది. స్థానిక సరకు కొనేందుకు తమిళనాడు వ్యాపారులు ఎక్కువగా వస్తున్నారు. విజయవాడ నుంచి కూడా వ్యాపారులు రావడం విశేషం.

భక్తులను బెదిరించి దోపిడీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం కాలినడకన వెళ్లే భక్తులను బెదిరించి వారి నుంచి నగదు దోపిడీ చేసిన ఘటన శ్రీనివాసమంగాపురంలో గురువారం చోటుచేసుంది. హైదరాబాద్‌కు చెందిన షోహన్‌సింగ్, రామ్‌లకన్‌సింగ్, మోనూసింగ్‌లు శ్రీవారి మెట్టు మార్గంలో కాలినడకన వెళ్లేందుకు శ్రీనివాసమంగాపురం చేరుకున్నారు. ఇక్కడి నుంచి శ్రీవారిమెట్టు చేరుకోవడానికి వెళ్తున్న భక్తులను గుర్తుతెలియని దుండగులు బెదిరించి దోపిడీకి పాల్పడారు. తొలుత డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. లేవని చెప్పడంతో ఓ భక్తుడి నుంచి రూ.400 ఫోన్‌పే చేసుకున్నారు. అదే మార్గంలో గుంపులుగా వస్తున్న భక్తులను చూసి దుండగులు పారిపోగా బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వేయర్‌పై విజిలెన్స్ విచారణ

ఈనాడు కథనానికి స్పందన

కేవీబీపురం, న్యూస్‌టుడే: ఎంఏరాజుల కండ్రిగలో సర్వే సంఖ్యలు మార్చి.. అమాయకులను ఏమార్చి.. అక్రమంగా పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసిన గ్రామ సర్వేయర్ మునెయ్యపై ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. జూన్ 25న 'సర్వే నంబర్లు మార్చి.. ఏమార్చి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ కంఠం సర్వే సంఖ్య 256లోని 8.12 ఎకరాల విస్తీర్ణంపై పూర్తి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

తొక్కిసలాట ఘటనపై త్వరలో నివేదిక

తిరుపతి (నేరవిభాగం): శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన టికెట్ల పంపిణీ సందర్భంగా స్థానిక పద్మావతి పార్క్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ కమిషన్ ప్రభుత్వానికి సమగ్ర నివేదికను త్వరలో అందజేయనుంది. న్యాయ విచారణ కమిషన్ విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణమూర్తి గురువారం కలెక్టరేట్‌లోని కార్యాలయానికి న్యాయమూర్తి విచ్చేశారు.

అల్పాహారంలో జెర్రి.. విద్యార్థినులకు అస్వస్థత

ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పురుగులతో కూడిన అల్పాహారాన్ని తిన్న ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలనీలోని బీసీ బాలికల వసతిగృహంలో గురువారం చోటుచేసుకుంది. వసతిగృహంలో అల్పాహారంగా వడ్డించిన రవ్వ ఉప్మాలో విద్యార్థిని యోష్నా జెర్రిని గుర్తించింది. అప్పటికే పలువురు తినేశారు. విషయాన్ని తోటి విద్యార్థినులకు తెలపడంతో అందరూ అల్పాహారాన్ని కిందపడేశారు. వసతిగృహ అధికారులకు తెలిపినా వారి నుంచి స్పందన లేకపోగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో అర్ధాకలితో కళాశాలలకు వెళ్లారు. ఈ క్రమంలో తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాలలో ప్రార్థన చేస్తుండగా యోష్నా, మునికుమారి, జ్యోష్న అస్వస్థతతో కళ్లు తిరిగి కిందపడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ భారతి వారిని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. చికిత్సను అందించిన వైద్యులు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తప్పవు.. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆస్పత్రిలో బాలికలను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తిరుమల మొదటి ఘాట్‌లో ఏనుగుల కలకలం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద గురువారం రాత్రి ఏనుగులు కలకలం సృష్టించాయి. ఐదారు ఏనుగుల గుంపు ఒక్కసారిగా అటవీప్రాంతం నుంచి రహదారిపైకి వచ్చేందుకు యత్నించాయి. దీంతో అటుగా వెళ్తున్న వాహనాలన్నీ నిలిచిపోయాయి. వెంటనే వాహనచోదకులు తితిదే అటవీశాఖకు, విజిలెన్స్‌కు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పెద్ద శబ్దాలు చేస్తూ ఏనుగుల గుంపును తిరిగి అటవీప్రాంతంలోకి తరిమేశారు. ఈ సందర్భంగా ఏనుగులు అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించాయి. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఘాట్‌రోడ్డుకు సమీపంలోకి వచ్చిన ఏనుగుల గుంపు

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేని భక్తులకు పది గంటల్లో, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. బుధవారం శ్రీవారిని 74,510 మంది దర్శించుకోగా రూ.3.97 కోట్ల హుండీ కానుకలు లభించాయి. అలాగే శ్రీవారి ఆలయం ఎదుట ఉన్న ఇత్తడి గేట్లను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు.

104FM Tirupati 104 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

8008555167, 9000180635

అత్తింటి ఆరళ్లకు వివాహిత బలి

● తమ బిడ్డను హత్య చేశారంటూ బంధువుల ఆరోపణ

● న్యాయం చేయాలని ఆందోళన

శిల్ప (పాతచిత్రం)

తడ, న్యూస్‌టుడే: మెట్టినింట ఆరళ్లకు వివాహిత తట్టుకోలేక బిడ్డలతో పాటు పుట్టింటికి చేరింది. ఆరు నెలలు దాటినా అల్లుడు కూతుర్ని కాపురానికి రమ్మని పిలవలేదు. దీంతో ఆమె తండ్రి స్వయాన ముఖ్యమంత్రికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కుప్పం పోలీసులు సర్దుబాటు చేయగా.. పట్టుమని 20 రోజులు కూడా గడవక ముందే మీ బిడ్డ ఉరేసుకుని చనిపోయిందని కబురు వచ్చింది. చేజేతులా బిడ్డను నరక కూపంలో వదిలి వచ్చామే అన్న వేదనతో ఆమె తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

మృతురాలి బంధువులఆందోళన

వివాహేతర సంబంధం.. ఆపై దాడులు: స్థానికుల వివరాల మేరకు.. శాంతిపురం మండలం గెస్పల్లికి శిల్ప(24)ను తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని (అక్కంపేట సమీపంలోని) ఎస్టీకాలనీకి చెందిన కార్తీక్ అలియాస్ కాటయ్యకు నాలుగేళ్ల కిందట ఇచ్చి వివాహం జరిపించారు. దంపతులకు హేమశ్రీ(3), హర్ష(2) పిల్లలున్నారు. కార్తీక్ శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల వరకు సజావుగా సాగిన వీరి కాపురంలో తరచూ గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం కోసం అత్త మామల వేధింపులు, భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ శిల్పపై దాడి చేసేవాడు. దాంతో ఆమె పుట్టింటికి వెళ్లడం, పంచాయితీలు, కేసులయ్యాయి. చివరగా అందరూ సర్ది చెప్పి మెట్టినింటికి పంపారు. ఎంతకీ భర్త, అత్తమామల్లో మార్పు రాకపోవడంతో శిల్ప బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న శిల్ప తల్లిదండ్రులు, బంధువులు గురువారం ఉదయానికి పెద్ద ఎత్తున వచ్చారు. తమ బిడ్డను చంపేశారని ఆరోపించారు. ఉరికి వేలాడుతున్న శిల్పను కిందికి దింపనివ్వకుండా అడ్డుకున్నారు. అత్తమామలను తమకు చూపించాలని పట్టుబట్టి జాతీయ రహదారిపై అరగంటకు పైగా రాస్తారోకో చేపట్టారు. వారిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పడంతో రాస్తారోకో విరమించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

జి.ఎస్.టి. 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

శ్రీవాణి కేంద్రం వద్ద సౌకర్యాలు మెరుగుపర్చండి

దర్శనానంతరం భక్తుల డిమాండు

శ్రీవారి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నిమ్మల మురళీకృష్ణ మరికొందరు భక్తులు తితిదేను కోరారు. గురువారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్న అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కనీస వసతులు లేవని ఫిర్యాదు చేశారు. శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం వద్ద తెల్లవారు జామున 4 గంటల నుంచి వేచిఉండగా ఉదయం 7.30 గంటలకు టికెట్లు జారీ చేస్తారని, అప్పటివరకు అక్కడ కూర్చునేందుకు కుర్చీలు, బల్లలు, మంచినీళ్లు, ఇతర వసతులు లేవని, డయల్ యువర్ ఈవోకు ఫిర్యాదు చేద్దామన్నా కుదరలేదని వారు ఆరోపించారు. టికెట్లు కొనుగోలు చేశాక రూ.500, రూ.1000 గదులు ఇవ్వాల్సి ఉండగా రూ.50 గదులు రెండు కేటాయించారు, వాటిలో బొద్దింకలు, బల్లులు ఉన్నాయని వాపోయారు. ఫిర్యాదు చేశాక సిబ్బంది వచ్చి క్లీన్ చేశారని, గదుల కేటాయింపు సిబ్బందిని సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి శ్రీవాణి భక్తులకు సౌకర్యాలు మెరుగుపరిచేలా చొరవచూపాలని కోరారు. మీడియాకు ఫిర్యాదు చేసిన వారిలో వెట్టం శ్రీనివాసరావు, కె.రామగురవయ్య, జి.శంకర శ్రీనివాస్, ఎస్కే షాబిల్ ఉన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవు: తితిదే

తితిదేపై అసత్య ఆరోపణలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తితిదే హెచ్చరించింది. గురువారం శ్రీవాణి దర్శనానికి వచ్చిన ఐదుగురు భక్తులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని వెల్లడించింది. రోజూ ఉదయం 8.30 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేస్తామని, అంతకంటే గంట ముందు మాత్రమే భక్తులను కౌంటర్ వద్దకు అనుమతిస్తున్నట్లు వెల్లడించింది. సదరు భక్తులు వేకుజామున 3.30 గంటలకే వచ్చి టికెట్ల కేటాయింపులో జాప్యం జరిగిందని, అన్నపానీయాలు తితిదే కేటాయించలేదని ఆరోపించడం సరికాదంది. సాధారణంగా కౌంటర్ తెరిచే సమయానికి ముందు నుంచి టీ, కాఫీ, పాలు, మజ్జిగ నిరంతరం సరఫరా చేస్తామని వెల్లడించింది. శ్రీవాణి భక్తులు ఎక్కువగా తిరుపతిలోనే వసతి పొంది దర్శనానికి వెళ్తుంటారని, తిరుమలలో డిమాండ్ చేస్తే అందుబాటులో ఉన్నవి కేటాయిస్తున్నట్లు పేర్కొంది. టీబీసీలోని రూ.50 గదులను తనిఖీ చేయగా పరిశుభ్రంగానే ఉన్నాయని, సదరు భక్తులు తితిదేపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించింది. రద్దీ నేపథ్యంలో భక్తులు సంయమనంతో సహకరించాలని సూచించింది.

శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం వద్దకు అన్నప్రసాదాలు తీసుకెళ్తున్న సిబ్బంది

శివయ్యా.. మోసమయ్యా..!

• సెల్‌ఫోన్లకు రెట్టింపు వసూళ్లు • కౌంటర్ల వద్ద కనిపించని సూచికలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు సెల్‌ఫోన్‌ కౌంటర్ల వద్ద నిలువునా మోసానికి గురవుతున్నారు. భక్తుల అవసరం దృష్ట్యా ముక్కంటి ఆలయంలోని బిక్షాలగాలిగోపురం, శివయ్య, తిరుమంజన, దక్షిణ గోపురాలతో పాటు మహాద్వారం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అయితే కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది నిర్దేశిత ధరలు కంటే అదనంగా వసూలు చేయడం పట్ల విమర్శలు గుప్పుమంటున్నాయి.

నిలువునా మోసం

సెల్‌ఫోన్ కనీస వస్తువుగా మారిపోయింది. కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే అన్ని ఫోన్లు వినియోగిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు తీసుకువచ్చే సెల్‌ఫోన్లను ఆలయంలోకి అనుమతించరు. అందుకని ప్రవేశ గోపురాల్లో ఉన్న నిర్దేశిత కౌంటర్లలో వీటిని భద్రపరుచుకునేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఒక్కో చరవాణికి రూ.5 తీసుకోవాల్సి ఉండగా.. సాధారణ ఫోన్‌కు రూ.10, ఖరీదైన ఫోన్లకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక కుటుంబంలో నలుగురు ఫోన్లతో దర్శనానికి వస్తే ఇక్కడే రూ.80 చెల్లించాల్సి రావడంతో భక్తులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. రోజుకు కనీసం 10 వేలకు తక్కువ లేకుండా ఫోన్లను కౌంటర్లలో భద్రపరుస్తున్నారు. రెట్టింపు వసూళ్లతో గుత్తేదారులు ఏటా రూ.1.80 కోట్ల మేర అదనంగా ఆర్జిస్తుండటం గమనార్హం.

కౌంటర్లలో సెల్‌ఫోన్లు పెట్టి రసీదులు తీసుకుంటున్న భక్తులు

సూచికలేక.. రసీదుల్లో రాయక..

సెల్‌ఫోన్ కౌంటర్లలో పనిచేసే సిబ్బంది భక్తుల నుంచి ఎన్ని సెల్‌ఫోన్లు తీసుకుంటున్నారో.. అందుకు సంబంధించి చెల్లించాల్సిన మొత్తాన్ని విధిగా నమోదు చేయాలి. అయితే ఇక్కడ అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. తీసుకున్న సెల్‌ఫోన్ల సంఖ్య రాస్తారంతే. కౌంటర్ల వద్ద సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో నిర్దేశిత మొత్తం కాకుండా ఎక్కువ వసూలు చేస్తున్నారు. సూచికలు ఏర్పాటు చేసినా మూడ్రోజుల్లో మాయమవుతోంది. శాశ్వతంగా సూచికలు అందుబాటులోకి తెచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.


వివరాలు నమోదు చేయకుండా పంపిణీ చేస్తున్న రసీదులు

శివయ్య గోపురం కౌంటర్ వద్ద సూచికల్లో ధరల వరకు చెరిపేసిన వైనం

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని బర్డ్ సంచాలకులు డాక్టర్ జగదీష్, తెలంగాణ డీజీ సౌమ్యమిశ్ర దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో బర్డ్ సంచాలకులు డా.జగదీష్

తెలంగాణ డీజీ సౌమ్యమిశ్రా

ఐవీఆర్ కాల్స్‌కు స్పందన వచ్చేలా కష్టపడండి: డీపీవో

కేవీబీపురం, న్యూస్‌టుడే: వర్షాకాలంలో పారిశుద్ధ్యం, కలుషిత తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, ప్రభుత్వ ఐవీఆర్ కాల్స్‌కు ప్రజల స్పందన వచ్చేలా కష్టపడాలని డీపీవో సుశీలాదేవి అన్నారు. గురువారం కేవీబీపురం మండలంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తీరుపై ఆమె తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండలంలో మొదటి విడతగా 14 పంచాయతీలను ఆదర్శంగా ఎంపిక చేసి చెత్త రహితంగా తీర్చిదిద్దాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. పన్నుల వసూళ్లు ఐదు గుంటలకు అనుమతులు ఇవ్వాలని వివరించారు. పారిశుద్ధ్యంతో చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో మాలతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో సుశీలాదేవి

రేపు జాతీయ లోక్‌అదాలత్

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34 బెంచ్‌లు.. చిత్తూరులో ఐదు బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

6న కాణిపాకం ఆలయ ఉభయదారుల సమావేశం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఈ నెల ఆరో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో 14 గ్రామాలకు చెందిన ఉభయదారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ఉభయదారులు, ఆలయ అధికారులు విచ్చేసి సలహాలు, సూచనలు అందించాలన్నారు.

నేడు హుండీల లెక్కింపు.. స్వామివారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు. లెక్కింపునకు అధికారులు, సిబ్బంది హాజరుకావాలన్నారు.

అధునాతన నైపుణ్యాలతో స్థిరమైన నిర్మాణాలు

తిరుపతి ఐఐటీలో ఐసీసీఎంస్

ఏర్పేడు, న్యూస్‌టుడే: అధునాతనమైన నైపుణ్యాలతో స్థిరమైన నిర్మాణాలు చేపట్టవచ్చని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో గురువారం విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణుల ఆధ్వర్యంలో సామగ్రి, నిర్మాణాలపై మూడో అంతర్జాతీయ సమావేశం (ఐసీసీఎంస్)-2025 నిర్వహించారు. సమ్మిట్‌లో సత్యనారాయణ మాట్లాడుతూ అధునాతన కాంక్రీట్ టెక్నాలజీలతో భవనాల మన్నిక, స్థిరమైన నిర్మాణాలు, ఆధునిక లక్షణాలు, పర్యావరణం పరిరక్షణకు పెంపొందించాల్సిన విధానాలు వివరించారు. అనంతరం సురక్షితమైన, సమర్థవంతమైన నిర్మాణాలు, వాతావరణం- స్థిరమైన మౌలిక సదుపాయాలు వంటివాటిపై ప్రముఖులు చర్చించారు. ప్రొఫెసర్ సురేష్‌జైన్, డా.బిజిలీ బాలకృష్ణన్, డా.నారాయణన్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, యూఎస్‌లోని వర్జీనియా టెక్, యూకేలోని క్వీన్స్, మలేసియాలోని మోనాష్ విశ్వవిద్యాలయాలు, ఐఐటీ బాంబే, కలకత్తా ఎన్ఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ, ప్రముఖులు

20న ఐఐటీ స్నాతకోత్సవం

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీ ఏడో స్నాతకోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆచార్య సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది బీటెక్, పీహెచ్‌డీ పూర్తిచేసిన 417 మంది విద్యార్థులకు పట్టాలు అందించనున్నట్లు అందులో పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా కాగ్నిజెంట్ సహ వ్యవస్థాపకులు, క్రియ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ లక్ష్మి నారాయణన్, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్, జెఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్ హాజరు కానున్నారని ప్రకటనలో వివరించారు.

శ్రీవారి ఆలయం ఎదుట భాజపా ఎంపీ లక్ష్మణ్ కుటుంబం, చిత్రంలో తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

'గత ప్రభుత్వంలో తితిదే బోర్డు అవినీతిమయం'

తిరుమల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో తితిదే ధర్మకర్తల మండలిని అవినీతిమయం చేశారని భాజపా తెలంగాణ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఎంపీ మాట్లాడుతూ.. తిరుమలలో గత పాలకమండలి, ప్రభుత్వం అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేద మందుల తయారీకి రూ.3.90 కోట్లు పెట్టి నాసిరకం యంత్రాలు కొన్నారని ఆరోపించారు. గతంలో తితిదే అవినీతిపై సీఎం చంద్రబాబుకు లేఖను రాస్తానని చెప్పారు. వెంట తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తుడిచ్చిన సైకిళ్లు.. తుప్పు పట్టాల్సిందేనా?

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి మీద విశ్వాసంతో భక్తులు అనేక రూపాల్లో మొక్కులు చెల్లిస్తుంటారు. వాటిలో నూతన వాహనాలు, సైకిళ్లను తరచూ సమర్పిస్తున్నారు. ఇటీవల ఓ భక్తుడు సైకిళ్లు ఇవ్వగా 10 బ్యాటరీ, 90 మామూలు సైకిళ్లను తిరుపతిలోని తితిదే రవాణాశాఖ జీఎం కార్యాలయానికి తరలించారు. తితిదే ఛైర్మన్ క్యాంపు కార్యాలయ సిబ్బంది ఐదు సైకిళ్లను వాడుతుండగా తక్కిన వాటిని రెండు మాసాలుగా దాచిపెట్టి పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో శ్రీవారి భక్తుడొకరు సైకిళ్లు ఇవ్వగా వాటిని ఎంతకూ పట్టించుకోకపోవడంతో చివరకు వేలం వేయాల్సి వచ్చింది. తితిదే పరిధిలో పలు విద్యాసంస్థలు ఉండగా ఏటా ఆయా కోర్సుల్లో ఉత్తమ మార్కులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు లేదా బాలమందిరం, బధిర పాఠశాల విద్యార్థులకు వాటిని బహుమతిగా ఇస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

తితిదే రవాణా శాఖ జీఎం కార్యాలయం పరిధిలో ఉంచిన సైకిళ్లు

అధికారి ఏమంటున్నారంటే..

బ్యాటరీ, రెండు చక్రాల సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలంటూ తితిదే ఉన్నతాధికారులు, డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు ఇచ్చినా ఎవరూ ముందుకు రాకపోవడంతో గతంలో వేలం వేయాల్సి వచ్చిందని తితిదే రవాణా విభాగం జీఎం శేషారెడ్డి తెలిపారు. ప్రస్తుత అందుబాటులో ఉన్న సైకిళ్లపై ఉన్నతాధికారులతో చర్చించి తితిదే ఉద్యోగులకు లేదా విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దేశాభివృద్ధిలో కంపెనీ కార్యదర్శుల పాత్ర కీలకం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: దేశావృద్ధిలో కంపెనీ కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉంటుందని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ సదరన్ రీజియన్ స్నాతకోత్సవాన్ని గురువారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. వీసీ ఉమ అతిథిగా విచ్చేసి ఐసీఎస్ఐ సభ్యులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేశారు. అనంతరం ఐసీఎస్ఐ ఉపాధ్యక్షుడు సీఎస్ పవన్ జి.చండక్ మాట్లాడుతూ నూతన సభ్యులు అవకాశాలను స్వీకరించాలని, వృత్తిపట్ల బాధ్యత వహించాలన్నారు. మొత్తం 263 ఐసీఎస్ఐ సభ్యులకు స్నాతకోత్సవ డిగ్రీలను ప్రదానం చేశారు. ఐసీఎస్ఐ సంయుక్త కార్యదర్శి కౌశిక్ బెనర్జీ, ఎస్ఐఆర్‌సీ ఛైర్మన్ మధుసూధన్, కౌన్సిల్ సభ్యులు మోహన్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వీసీ ఉమకు జ్ఞాపిక అందజేస్తున్న ఐసీఎస్ఐ అధికారులు, సభ్యులు

సైబర్ మోసాలపై రేపు బీఎస్ఎన్ఎల్ అవగాహన

తిరుపతి (విద్య): బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.వెంకోబరావు గురువారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలి.. నిందితులపై ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవచ్చో నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు.

మాట్లాడుతున్న ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి

నకిలీ మద్యం వివరాలు టోల్‌ఫ్రీకి చెప్పండి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నకిలీ మద్యం గురించి సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ 14405కి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లీశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారితో కలిసి జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో వర్క్‌షాపు నిర్వహించారు. క్యూఆర్ కోడ్ సర్వే, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఐజీవోటీ కర్మయోగి, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌ల గురించి వివరించారు. రోజువారీ విధుల్లో ఎలా ఉపయోగించాలి.. సాంకేతికంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొనే సమస్యల గురించి వివరించారు. అక్రమ మద్యం, గంజాయి నేరాల గురించి నిత్యం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రజలు నేరాల నియంత్రణలో సహకరించాలని కోరారు. ఏఈఎస్ వాసుదేవ చౌదరి, సీఐలు రామచంద్ర, నరసానాయుడు, లావణ్య, మురళీమోహన్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

కేవీబీపురం, న్యూస్‌టుడే: పని ప్రదేశంలో తేనెటీగలు దాడి చేయడంతో 20 మంది ఉపాధి కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని వగత్తూరు ఎస్సీ కాలనీకి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన సుమారు 80 మంది ఉపాధి కూలీలు గ్రామ సమీపంలో కందకాలు తవ్వుతున్నారు. ఈ సమయంలో తేనెతెట్టుపై గడ్డపార తగలడంతో ఒక్కసారిగా తేనెటీగల సమూహం కూలీలపై దాడి చేశాయి. అందులో 20 మందిని కుట్టాయి. వారిలో ఆరుగురిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మిగిలిన వారు ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొంది ఇళ్లకు వెళ్లిపోయారు. పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న కూలీలను ఎంపీడీవో మాలతి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారి రామ్‌నాయక్‌కు సూచించారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యాధికారి తెలిపారు.

పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న ఎంపీడీవో మాలతి

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలంలో పునబాక ఎస్టీ కాలనీలో బుధవారం రాత్రి అమాస దుర్గ(21) వివాహిత కుటుంబ సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఆమె భర్త సాయికిరణ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటం.. ఆర్థిక సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె పురుగుల మందు తాగారు. బంధువులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. ఈ మేరకు తహసీల్దారు హరికృష్ణ సమక్షంలో ఎస్సై రాఘవయ్య శవపరీక్ష నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	95
రిటైల్	117
లేయర్	112
బ్రాయిలర్	170
బ్రాయిలర్ స్కిన్ లెస్	193
లేయర్ మాంసం	190

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతం

శ్రీకాకుళం క్యాంపస్ ప్రవేశాల కోసం టేబుళ్ల వద్ద విద్యార్థులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

జగన్ పర్యటనకు జన సమీకరణపై సమీక్ష

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: వైకాపా అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంకు ఈనెల 9న రానున్న నేపథ్యంలో కార్యక్రమానికి పెద్దఎత్తున రైతులను సమీకరించాలని, నియోజకవర్గాల సమన్వయకర్తలు బాధ్యత తీసుకోవాలని వైకాపా ప్రాంతీయ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. జగన్ పర్యటపై మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసంలో గురువారం జరిగిన సమీక్షలో ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీమంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందుబాటులో లేడని చంద్రగిరి నియోజకవర్గంలో తెదేపా నాయకులు గూండాల్లా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని భూమన కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. పనపాకం, ముంగిళిపట్టు గ్రామాల్లో ఆయన పర్యటించారు.

సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఆర్కే రోజా, నారాయణస్వామి

ఉపాధ్యాయుడికి ఛార్జ్‌మెమో

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతి సమయంలో డీఈవో వరలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గంగాధరనెల్లూరు మండలం అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ విజయ్‌కుమార్‌కు.. డీఈవో గురువారం ఛార్జ్ మెమో జారీ చేశారు. తిరుపతి జిల్లాకు చెందిన సురేష్‌కుమార్, చిత్తూరు జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయగా ఆమె పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తిరుపతి డీఈవో కుమార్‌ను కమిషనర్ ఆదేశించగా ఆయన నివేదిక అందజేశారు. దీంతో సురేష్‌కుమార్‌ను.. తిరుపతి డీఈవో సస్పెండ్ చేయగా, విజయ్‌కుమార్‌కు ఛార్జ్ మెమో ఇచ్చారు.

400 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మల్లాం జాతీయ రహదారి మలుపులో గురువారం ఉదయం 400 బస్తాల లోడుతో వెళ్తున్న లారీని స్థానిక సీఐ బాబీ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. శ్రీకాళహస్తి నుంచి నెల్లూరు వెళ్తున్న లారీని తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. 20 టన్నుల బియ్యం ఉంది. లారీ డ్రైవరు వేనాటి గజేంద్రను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయమై సీఐ బాబీని అడగ్గా సూళ్లూరుపేటకు చెందిన దిలీప్‌రెడ్డి అక్రమ రవాణా సూత్రధారిగా గుర్తించామని ఆయన పరారీలో ఉన్నట్లు తెలిపారు. త్వరలో అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తామని మోసగించిన దళారీ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తామని చెప్పి ఓ దళారీ భక్తులను మోసగించి నకిలీ టికెట్లు అంటగట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడి వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లకు చెందిన విజయ్ శ్రీవారి దర్శనం కోసం తన స్నేహితుడి సలహాతో బాలాజీ అనే వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించాడు. అతను కోరిన దర్శనం చేయిస్తానని చెప్పి రూ.65 వేలు వసూలు చేశాడు. అనంతరం భక్తుడికి వారి కుటుంబ సభ్యుల పేరుతో తితిదే లోగో కలిగిన నకిలీ తోమాలసేవ, అభిషేకం టికెట్లు, సూట్‌రూమ్ రసీదు పంపాడు. వాటిని అసలు టికెట్లుగా భావించిన భక్తుడు బుధవారం తిరుమలకు చేరుకున్నాడు. గదుల కోసం దళారిని సంప్రదించగా అతను స్పందించకపోవడంతో అనుమానం వచ్చి టికెట్లను తనిఖీ చేయగా నకిలీవని తేలాయి. అనంతరం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేపట్టారు.

క్షణాల్లో గోడలెక్కి.. ఉన్నదంతా దోచి..

కరుడుగట్టిన అంతర్ జిల్లా నేరస్థుడి పట్టివేత

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే: బాల్యం నుంచే దొంగతనాలు మొదలెట్టాడు. 24 ఏళ్ల వయసుకే 40 నేరాలు చేశాడు. పలు జిల్లాల పోలీసులను ఉరుకులు పెట్టించాడు. ఎవరికీ చిక్కకుండా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. చివరికి చిన్న క్లూతో దొరికిపోయాడు. అతడి నుంచి 60 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ఉయ్యాల రాజేష్ (24) కుటుంబం విజయవాడ, వాంబేకాలనీలో ఉంటోంది. అతడు 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పుడే దొంగతనాలు చేయడంతో మూడు సార్లు బాలుర పరిశీలనా గృహంలో ఉంచారు. బయటకు వచ్చినా తీరు మారలేదు. కూలి పనులు చేస్తూ.. చోరీలు చేసేవాడు. 2024, సెప్టెంబరులో మధురానగర్‌లో ఒక తమిళ కుటుంబం ఇంట్లో రూ.11 లక్షలు దోచాడు. జైలుకు వెళ్లి జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చాడు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దామోదర్. చిత్రంలో సీఐ శ్రీనివాస్, సిబ్బంది

ఎంత దూరమైనా నడిచే.. రాజేష్‌కు బండి నడపడం రాదు. ఎంత దూరమైనా నడిచే వెళతాడు. రాత్రి వేళ బి.ఆర్.టి.ఎస్.రోడ్డు, ఫుట్‌పాత్‌లపై పడుకుంటాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో లేచి నడుచుకుంటూ వెళతాడు. రైల్వేలైను వెంబడి, కాలువ గట్ల వెంట వెళుతూ.. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. పెద్ద పెద్ద గోడలను 5 సెకన్లలోనే ఎక్కేస్తాడు. ఇలా మధురానగర్‌లో 5 నేరాలు చేసి 94 గ్రాముల బంగారం చోరీ చేశాడు. పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేటల్లో మొత్తం 12 నేరాలు చేశాడు. దోచిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస నేరాలు జరుగుతుండటంతో నిఘా పెంచారు. నేరస్థలంలో కొన్ని వేలిముద్రలు దొరికాయి.

ప్రమాదంతో వెలుగులోకి.. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. పేర్లు నమోదు చేసుకునే సమయంలో ఓ యువకుడు పారిపోయాడు. అతడి పేరు రాజేష్ అని తెలిసింది. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి విచారించారు. సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టారు. మాచవరం స్టేషన్ పరిధిలో ఒక చోట కనిపించి, అంతలోనే మాయమయ్యాడు. ఒక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి.. రెడ్‌హ్యాండెడ్‌గా అతడిని పట్టుకున్నారు. విజయవాడ పరిధిలోని 6 కేసుల్లో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని ఏసీపీ దామోదర్ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

EENADU e Classifieds

HEALTH & CARE

NTR వైద్య సేవ ద్వారా ఉచిత ఆపరేషన్లు: మొలలు, హెర్నియా, అపెండిక్స్, విరిగిన ఎముకలు & నరాలు, వెన్నెముక ఆపరేషన్లు, ప్రసవాలు & గర్భసంచి ఆపరేషన్లు, కిడ్నీలో రాళ్ళు, మూత్ర సంబంధిత వ్యాధులు, అన్ని రకాల జ్వరాలు & అత్యవసర చికిత్సలు కలవు. M.S.హాస్పిటల్, తిరుపతి ✆ 98492 84543, 0877-2280779.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

GENERAL

అతి తక్కువ ధరల్లో, 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి అమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు : ✆ 91145 61456.

తిరుపతి - తిమ్మినాయుడుపాలెం, కాటన్ మిల్, విజయకృష్ణ కాలేజీ దగ్గర 36 x 69.5 అ॥ 30 ft రోడ్డు, నార్త్ ఫేస్, LRS అప్రూవ్ ప్లాట్ అమ్మకానికి కలదు. ✆ 96184 00963.

నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే ✆ 95027 74175/ 79959 92114.

తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. వివరములకు సెల్: 95154 83527.

JOBS

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారికి లబ్ధి చేకూర్చడానికి చిత్తూరు జిల్లా నందు పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్. ✆ 77298 93359.

ప్రముఖ మ్యాట్రిమోని ఆఫీస్‌కు ఏదైనా Job లో 2 సం॥ల అనుభవం గల స్త్రీలు PRO & Telecaller కావలెను. Q: Any Degree, Sal: 20 (or) 25K, Age: 30+ తిరుపతి. ✆ 80193 05930.

బాలాజీ ఫైనాన్స్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (Male) & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 14,000, Exp: 1 year. నియర్ రామానుజ సర్కిల్, తిరుచానూరు రోడ్డు, తిరుపతి. ✆ 97013 66663, 90005 05067.

WANTED FOR Primary Teachers (Subject: English), Depends upon Skills, Salary: Above 25K, Contact: ✆ 77318 09480.

నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీం లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం : 20K to 25K, Qua: Inter పైన Age: 25 to 40 yrs. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన Cell No: ✆ 91828 98446.

తిరుపతి, MRపల్లి, ధనలక్ష్మీనగర్‌లో D.No: 23-1-102/16 నెంబర్‌లోని బాలాజీ హాస్పిటల్ నందు పనిచేయుటకు స్టాఫ్ నర్సులు, ఆయాలు కావలెను. జీతం: 16,000/-. ✆ 89776 07644.

పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు పంప్ బాయ్స్ కావలెను. జీతం: 12,000 + కమీషన్ ఇవ్వబడును. శ్రీ లక్ష్మీ శ్రీనివాస పెట్రోల్ బంక్, శ్రీకాళహస్తి రోడ్డు. సంప్ర: 80747 37577.

Study Power (Education Loans) నందు పనిచేయుటకు Staff మరియు కమిషన్ based Agents కావలెను. ✆ 9705817817.

EENADU THE CLASSIFIEDS WAY — B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800 ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

సీప్ స్టడీస్ డైరెక్టర్‌గా రమేష్‌బాబు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య ఎ.ఎం. రమేష్ బాబును సెంటర్ ఫర్ సీప్ స్టడీస్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ వీసీ అప్పారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపల్, నగర పాలక సంస్థ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ తనిఖీలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య గురువారం రాజీవ్‌గాంధీ కాలనీ, గొల్లవానిగుంట, లీలామహల్ సమీపంలోని మధురానగర్ తదితర ప్రాంతాల్లో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎస్ఈ శ్యాంసుందర్, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, వైద్యాధికారి యువ అన్వేష్ పాల్గొన్నారు.

సాంప్రదాయ పద్ధతులపై ఎంఓయూ

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్‌తో ఆయుర్వేద విజ్ఞానంపై గురువారం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ పి.భాస్కరుడు, ఎన్ఐఐఎంహెచ్ జేడీ గోలి పెంచల ప్రసాద్ సంతకాలు చేశారు.

ఏడువేల బంగారు కుటుంబాలే లక్ష్యం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరంలో అధికారులు గుర్తించిన ఏడువేల కుటుంబాలను తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన తిరుపతి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు, కమిషనర్ ఎన్. మౌర్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం పి-4 విధానాన్ని అమలు చేయడంలో కీలకమైన మార్గదర్శకాలను ఆవిష్కరించారు. పలువురు ఉద్యోగ, ఉపాధి అవసరాల ఆవేదనను వినిపించుకున్నారు. రేణిగుంట - చంద్రగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కోసం కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చినట్లు కమిషనర్ ప్రకటించారు. ఉప మేయర్ ముద్ర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలిక అధికారులు

అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన మేయర్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీగోవిందరాజ స్వామి ఆలయం వద్ద జరిగిన అగ్నిప్రమాదం దురదృష్టకరమని, ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గురువారం నగరపాలక మేయర్ శిరీష పరిశీలించారు. అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి సన్నిధి వీధిలో అగ్ని ప్రమాదానికి గురైన దుకాణాన్ని, స్థానికులను పరామర్శించారు. ఘటనపై నివేదిక ఇవ్వాలని నగరపాలకసంస్థ విపత్తు నివారణ శాఖను ఆదేశించారు.

సంస్కృత భాషకు సాంకేతికతనద్దాలి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: సంస్కృత భాషను ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నత విద్యలో ఇంకా అభివృద్ధి చేయాలని భారతీయ జ్ఞాన పరంపరను కొనసాగించాలని నేపాల్ దేశంలో జరిగిన అంతర్జాతీయ సంస్కృత సదస్సులో తీర్మానించినట్లు తిరుపతి వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం వర్సిటీలోని సమావేశ మందిరంలో నేపాల్‌లో జరిగిన సదస్సు విశేషాలను ఆచార్యులకు వివరించారు.

తమిళనాడుకు చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని కారులో మొదటి ఘాట్‌రోడ్డులో కిందకు దిగుతుండగా అకస్మాత్తుగా కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన భక్తులు గాయపడ్డారు.

రెండురోజుల కిందట నెల్లూరు జిల్లా బుచ్చినాయుడు పాలెం చెందిన ఆర్పీఎఫ్ కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై కొండ దిగుతుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు.

మరికొంత మంది సరైన అవగాహన లేక వాహనాలను వేగంగా నడిపి ఘాట్‌రోడ్లలోని చెట్లకు, రక్షణ గోడకు, కల్వర్టులకు ఢీకొని ప్రమాదానికి గురవుతున్నారు.

వాహనం.. పట్టుతప్పుతోంది

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ఘాట్‌రోడ్లలో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. వాహన చోదకుల అవగాహన లేమి, నిర్లక్ష్యం తోనే ఎక్కువ ఘటనలు నమోదవుతున్నాయి. ప్రమాదాల నివారణకు తిరుమల ట్రాఫిక్ విభాగం, ఆర్టీఏ అధికారులు ముమ్మర తనిఖీలు కొనసాగిస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. కొండ దిగే క్రమంలో ఎక్కువమంది చోదకులు వాహనాలపై నియంత్రణ కోల్పోతున్నారు. తిరుమల పరిధిలో గత ఆరునెలల్లో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాటిలో కొందరు మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడి ఆసుపత్రుల్లో చేరిన సంఘటనలు ఉన్నాయి. గతనెల 30వ తేదీన ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శ్రీవారి దర్శనానికి నిత్యం 50-70 వేల మంది భక్తులు వస్తుంటారు. సెలవులు, ప్రత్యేక వేడుకల సమయంలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. ద్విచక్ర వాహనాలు 800 పైగా రాకపోకలు సాగిస్తుండగా ఆర్టీసీ బస్సుల తోడు నాలుగుచక్రాల వాహనాలు, కార్లు పదివేలకు పైగా ఉంటున్నాయి. మొదటి ఘాట్‌రోడ్డు పొడవు 19 కి.మీ. ఉండగా తిరుమల-తిరుపతి మధ్య 58 మలుపులు ఉన్నాయి. రెండో ఘాట్‌రోడ్డు 18 కి.మీ. ఉండగా ఆరు మలుపులు ఉన్నాయి. నైపుణ్యం కలిగిన డ్రైవర్లు మాత్రమే ఈ మార్గాల్లో సురక్షితంగా వాహనాన్ని నడపగలరు. అయితే సుదూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చే చోదకులకు రోడ్డు మలుపులపై సరైన అవగాహన లేక తరచూ రోడ్డు ప్రమాదాలతో తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

చోదకుల శిరస్త్రాణం పరిశీలిస్తున్న తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్

మొదటి ఘాట్‌లో ప్రమాదానికి గురైన కారు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తిరుమల దారుల్లో ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా తితిదే సూచిక బోర్డులోని నిబంధనలు పాటిస్తూ ప్రయాణించాలి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ముందుగా తిరుపతిలో తగిన విశ్రాంతి తీసుకుని తిరుమలకు రావాలి. వాహనాల ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాలి. సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలి. ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణాలు ధరించాలి. అతివేగం, ఓవర్ టేకింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ దూరంగా ఉంచాలి. - హరిప్రసాద్, తిరుమల ట్రాఫిక్ సీఐ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: రాయల్ చెరువు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి అన్నమయ్య కూడలి వరకు వెళ్లే మార్గంలోని మురుగునీటి కాలువల్ని నగరపాలిక సిబ్బంది శుభ్రం చేసి చాలా కాలం అయింది. మురుగునీరు రోడ్డుపై పారుతోంది.

- మహబూబ్ బాషా, రాయల్‌చెరువు రోడ్డు

సమాధానం: పరిశీలించి వెంటనే రాయల్ చెరువు రోడ్డు కాలువను శుభ్రం చేయిస్తాం.

- యువ అన్వేష్, నగరపాలిక వైద్యాధికారి

సమస్య: ఇందిరా మైదానం చుట్టూ బహిరంగ మల మూత్ర విసర్జన ఎక్కువగా జరుగుతోంది. మైదానం చుట్టూ వాహనాలు పార్కింగ్ చేయడంతో వాటి మధ్య మూత్ర విసర్జన చేసి దుర్వాసన వస్తుంది.

- చంద్రమోహన్, కూరగాయల వ్యాపారి

సమాధానం: శానిటరీ సిబ్బంది ద్వారా నిఘా ఏర్పాటు చేసి బహిరంగ మలమూత్ర విసర్జన నియంత్రిస్తాం.

- యువ అన్వేష్, వైద్యాధికారి నగరపాలిక

ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం

సుకన్య

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ జంతుశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని టి.సుకన్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి.రాజమాణిక్యం గురువారం ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎస్.కిశోర్ పర్యవేక్షణలో 'ఎవాల్యుయేషన్ ఆఫ్ బయోకెమికల్ పారామీటర్స్ ఇన్ స్ట్రెప్టోజొటాసిన్ (ఎస్టిజడ్) ఇండ్యూజ్డ్ టైప్ టు డయాబెటిక్ ర్యాట్ అసోసియేటెడ్ విత్ ది ట్రీట్మెంట్ ఆఫ్ మెట్ ఫార్మిన్ అలాంగ్ విత్ మెగ్నీషియం అండ్ విటమిన్ డి' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పాముకాటు నుంచి కోలుకున్న అటవీఉద్యోగి

తిరుమల, న్యూస్‌టుడే: పాముకాటు గురైన తితిదే అటవీశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు(68) కోలుకున్నారు. అమరా ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన గురువారం డిశ్చార్జయ్యారు. ఇటీవల ఆయన తిరుమలలో పాముకాటుకు గురైన విషయం తెలిసిందే.

ఉపాధి పనుల తనిఖీ.. చిన్నగొట్టిగల్లు: ఉపాధి పనులను శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువన్షి గురువారం తనిఖీ చేశారు. చిన్నగొట్టిగల్లు పంచాయతీలో పర్యటించి ఏఏ పనులు ఉన్నాయి, వాటికి వేతనాలు ఎలా చెల్లిస్తారు, పనులు చేసే విధానం గురించి సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిప్పిరెడ్డిగారిపల్లిలోని స్వయం సహాయక సభ్యులతో సమావేశమయ్యారు. ఎంపీడీవో గిడ్డయ్య, ఏపీవో భార్గవి, ఏపీఎం స్వర్ణలతలు పాల్గొన్నారు.

పచ్చని మొక్కలపై.. కంటగింపు

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) అనాలోచిత నిర్ణయంతో ఆహ్లాదం దూరమవుతోంది. వెస్ట్‌చర్చి నుంచి మహిళా వర్సిటీకి వెళ్లే మార్గంలోని ఫుట్‌పాత్‌పైన ఉన్న కుండీలు ఏర్పాటు చేయడంతో మూడు నాలుగేళ్లుగా మొక్కలు ఎంతో ఏపుగా పెరిగాయి. స్థానికులు సైతం వాటికి నీరుపోస్తూ వచ్చారు. రోడ్డుకు ఎంతో అందాన్ని తెచ్చిపెట్టిన కుండీలను గురువారం తుడా సిబ్బంది ఆకస్మికంగా తొలగించారు. స్థానికులు సిబ్బందిని ప్రశ్నించగా కొత్త మొక్కలు, కుండీలు ఏర్పాటు చేస్తామని సమాధానం ఇచ్చారు. ఇదే విషయాన్ని తుడా ఉద్యానాధికారి మాలతి వద్ద ప్రస్తావించగా స్థానికులు వాకింగ్ చేసుకునేందుకు కుండీలు అడ్డుగా ఉన్నాయని ఫిర్యాదు రావడంతో తరలించినట్లు సమాధానం ఇచ్చారు. **- న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)**

కాలువ పూడ్చి.. కారు నిలిపి

వెస్ట్‌చర్చ్ - కలెక్టర్ బంగ్లా మధ్యలోంచి న్యూమారుతీనగర్‌కు వెళ్లే ఇరుకైన మార్గం ఇది. సందులో రెండు ఆటోలు వచ్చినా కదిలేందుకు అవకాశం ఉండదు. ఇటీవల ప్రధాన రహదారిపై నిర్మించిన భవనం పక్కన కొంత స్థలాన్ని పార్కింగ్ కోసం వదులుకున్నారు. ఈక్రమంలో రోడ్డుకు, పార్కింగ్ స్థలానికి మధ్యలో ఉన్న మురుగునీటి కాలువను పూర్తిగా పూడ్చివేశారు. రోడ్డుకు రెండోవైపు సైతం కాలువ పూర్తిగా కనుమరుగు కావడం విశేషం. **- న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)**



పచ్చని.. పద్మగిరి

తనపల్లి వద్ద పద్మగిరి కొండపై వెలసిన శ్రీదండాయుధపాణి స్వామి దర్శనార్థం నిత్యం భక్తులు వస్తుంటారు. పచ్చని చెట్లతో హరితశోభితమై కనిపిస్తున్న కొండ భక్తులకు కనువిందు చేస్తోంది. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు కొండ చివరన స్వీయచిత్రాలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

తారు.. జారు

రామానుజ కూడలి వద్ద గరుడ వారధిపై వలయాకారంలో ఏర్పాటు చేసిన ఇనుప ప్లేట్లు బయటికి కనిపిస్తున్నాయి. వాటిపైన వేసిన తారు తరచూ లేచిపోతుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. తాత్కాలికంగా తారు వేసి వదిలేయకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వాహనచోదకులు కోరుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

రాత్రయితే ఆక్రమణలే..!

పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల తీరు ఎంతకూ మారడం లేదు. అందుకు నిదర్శనమే ఈ బంకు ఏర్పాటు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ ప్రధాన ద్వారం ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో రాత్రికిరాత్రి రేకుల షెడ్ నిర్మాణం చేపడుతున్నారు. దీని ద్వారా రూ. లక్షల్లో బయాణా, రూ. వేలల్లో నెలవారీ అద్దెలు వసూలు చేసుకునేందుకు మార్గం సుగమమం చేసుకున్నారు. ప్రణాళిక విభాగం అధికారులు సూచనలతోనే రాత్రికి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో ఉన్న అక్రమ దుకాణాలకు తోడుగా కొత్తగా వెలుస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. **- న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)**

హరియాణా సదస్సుకు ఉపమేయర్

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: హరియాణాలోని గురుగ్రామ్‌లో గురువారం నుంచి రెండురోజులు పాటు జరగనున్న సదస్సులో ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు. దేశ నిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థల పాత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అనే అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమానికి హాజరైన పార్లమెంట్ స్పీకర్ ఓంబిర్లా, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్‌లను కలిసి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. తెదేపా నాయకుడు పాఠకం వెంకటేష్ వెంట ఉన్నారు.

పార్లమెంట్ స్పీకర్ ఓంబిర్లాకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆర్సీ మునికృష్ణ

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: నగరంలోని డీఆర్ మహల్ రోడ్డులో వివాహ భోజనంబు హోటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్' విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశం నలుమూలల నుంచి ప్రఖ్యాతి గాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామన్నారు. ప్రదర్శన 5వ తేదీ వరకు ఉంటుందన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

ఎగ్జామినేషన్స్ డీన్‌గా అనురాధ

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్‌గా వర్సిటీ సోషల్ వర్క్ విభాగం సీనియర్ ఆచార్యులు అనురాధ నియమితులయ్యారు. గతంలో ఈ పదవిలో ఉన్న ఆచార్య జీవనజ్యోతి పదవీకాలం ముగియడంతో అనురాధను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య రజిని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె డీన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

జీవనజ్యోతి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న అనురాధ

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు జయంతిని గురువారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డా.జి.ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు. నటుడు, దర్శకుడు భరద్వాజ్‌కు స్మారక పురస్కారాన్ని అందజేసి సన్మానించారు.

హామీతో తాత్కాలికంగా సమ్మె వాయిదా

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం నిమిత్తం లభించిన హామీతో తాత్కాలికంగా స్విమ్స్ కార్మికులు తమ సమ్మెను నిలిపివేశారు. గురువారం స్విమ్స్ కూడలి వద్ద సమ్మె కొనసాగిస్తుండగా ఆర్డీవో రామ్మోహన్‌రావు, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి చేరుకుని ఆసుపత్రి సంచాలకుడు ఆర్వీ కుమార్‌తో మాట్లాడారు. తర్వాత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, వందవాసి నాగరాజుతోపాటు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి భరోసా ఇవ్వడంతో వారు తాత్కాలికంగా సమ్మె వాయిదా వేస్తున్నామని, రిలే దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

రామచంద్రాపురం: సొరకాయల పాల్యం పాఠశాల విద్యార్థులకు గురువారం తిరుపతికి చెందిన గోపీనాథ్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. 60 మంది విద్యార్థులకు సరిపడా వాటిని హెచ్‌ఎం శ్రీనివాసులుకు అందించినట్లు తెలిపారు. ఎంఈవో మార్కొండయ్యనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలతో అందరికీ మేలు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ మేలు జరుగుతుందని, సూపర్ సిక్స్ పథకాలు సమర్థంగా అమలవుతాయని చంద్రగిరి శాసన సభ్యుడు పులివర్తి నాని అన్నారు. తిరుమలనగర్ పంచాయతీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. **తిరుపతి (నగరం):** మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఒకటి, 50వ డివిజన్లల్లో పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** తెదేపా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కమ్మపల్లి పంచాయతీలో తెదేపా మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

తిరుమలనగర్‌లో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

'దేవాలయం విషయంలో రాజకీయం తగదు'

చంద్రగిరి, న్యూస్‌టుడే: పనపాకం ఎస్సీ కాలనీలోని మాతమ్మ ఆలయం నిర్మాణంపై రాజకీయరంగు పులిమి తెదేపా నాయకులపై వైకాపా సానుభూతిపరులు బురదజల్లడం హేయమైందని దళితసంఘాల నాయకులు విమర్శించారు. చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరుకుని సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం బస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి వినతిపత్రాన్ని అందించారు.

మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

పాకాల, న్యూస్‌టుడే: డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పాకాల సీఐ సుదర్శనప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్వీరమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ మాసులామణి, అధ్యాపకులు పాల్గొన్నారు. మొగరాల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ఈగల్‌క్లబ్ సమన్వయకర్త వెంకటసిద్దులు, బాబు, సుల్తాన్, నీరజ, ప్రమోదిని, రామమూర్తి, విమలా విక్టోరియా, ఆదికేశవులు పాల్గొన్నారు.

చంద్రగిరి సీఐ బదిలీ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ ఉత్తర్వులు ఇచ్చారు. భాకరాపేట సీఐగా విధులు నిర్వహిస్తున్న ఇమ్రాన్ బాషాకు చంద్రగిరి బాధ్యతలు అప్పగించారు.

అడ్డంగా ఆగి.. అందరినీ ఆపి

శ్రీకాళహస్తి నుంచి తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ వ్యాక్యూమ్ పైపుల్లో సమస్యతో గురువారం రిలయన్స్ మార్ట్‌కు ఎదురుగా రైల్వేఓవర్ బ్రిడ్జి సమీపంలో నడిరోడ్డున నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11:00 నుంచి గంటన్నరకు పైగా ట్రాఫిక్ స్తంభించడంతో శ్రీవారి భక్తులు.. దూరప్రాంత ప్రయాణికులు.. వాహనచోదకులు ఇబ్బందులుపడ్డారు. **- ఈనాడు, తిరుపతి**

తిరుచ్చిపై శ్రీసూర్యనారాయణుడు

తిరుచానూరు: తిరుచానూరులో కొలువుదీరిన శ్రీసూర్యనారాయణుడు గురువారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం హస్త పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, ఏవీఎస్వో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశక్తి పీఠంలో ప్రముఖుల పూజలు.. రామచంద్రాపురం: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠంలో గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

తెలుగు కళా సమితి నూతన కార్యవర్గం

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: కువైట్ తెలుగు కళాసమితి నూతన కార్యనిర్వాహక కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా బసవ హేమ్‌చంద్ (తిరుపతి), ఉపాధ్యక్షుడుగా బీసీ శేఖర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కడలి ఎన్‌వీకే ప్రసాద్ (నాని), సహాయ కార్యదర్శిగా ఆచంట ఎస్‌బీ క్రిష్ణప్రియ, కోశాధికారిగా సరికా సత్యశ్రీధర్ ఎన్నికయ్యారు. వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఏరియా ఎగ్జిక్యూటివ్ సభ్యులిగా ఏడుగురిని ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

సన్నిధివీధిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం.. తిరుపతి (నేరవిభాగం): శ్రీగోవిందరాజస్వామి ఆలయ సన్నిధి వీధిలో బుధవారం అర్ధరాత్రి తరువాత అగ్ని ప్రమాదం జరిగింది. తిరుపతి ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న ఎ.నవీన్ సన్నిధివీధిలో శ్రుతి మెటల్స్ పేరుతో దుకాణం నడుపుతున్నారు. ఆయన కేదార్‌నాథ్‌కు వెళ్లగా సిబ్బంది నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి అనంతరం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. సమాచారం మేరకు రెండు వాహనాలతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపుచేశారు. విగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లు, ఇతర పూజా వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.పదిహేను లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న బాధితుడు తిరుపతికి చేరుకుని ఫిర్యాదు చేశారు. రాత్రి సమయం కావడంతో భక్తుల తాకిడి పెద్దగా లేకపోయింది.

వాహనాలు సహా ఎర్రచందనం స్వాధీనం.. భాకరాపేట: వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖాధికారి వెంకటరమణ తెలిపారు. కల్యాణి డ్యాం పరిధిలో దుంగలను సేకరించి అక్రమంగా కారులో తమిళనాడు రాష్ట్రానికి రవాణా చేస్తుండగా గురువారం తెల్లవారు జామున వారిపై దాడి చేశామన్నారు. నిందితులు పారిపోయారని 130 కిలోల బరువుగల 9 దుంగలు సహా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దుంగల విలువ రూ.7 లక్షలు ఉంటుందని తెలిపారు. డిప్యూటీ రేంజ్ అధికారి పరమేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం వెలికితీత.. యర్రావారిపాలెం: తలకోన జలపాతం వద్ద గుండంలో ఇరుక్కుపోయిన యువకుడి మృతదేహాన్ని ఎట్టకేలకు బయటకు తీశారు. పోలీసులు, పీలేరుకు చెందిన రెస్క్యూ సిబ్బంది ఎంత గాలించినా మృతదేహం లభించకపోవడంతో గురువారం తిరుపతికి చెందిన బృందం రంగంలోకి దిగి మృతదేహాన్ని వెలికితీసినట్లు యర్రావారిపాలెం ఎస్సై బాలకృష్ణ తెలిపారు. అనంతరం యువకుడి మృతదేహాన్ని పంచానామా నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. యువకుడి మరణవార్త తెలిసి వారి బంధువులు భారీగా తలకోనకి తరలివచ్చి శోకసంద్రంలో మునిగిపోయారు.

గుర్తుతెలియని వ్యక్తి.. తిరుపతి(నేరవిభాగం): పుదిపట్ల సమీపంలోని అయాన్ డిజిటల్ సెంటర్ ఎదురుగా గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. వయసు 30 - 35 ఏళ్ల మధ్య ఉంటుందని, కొంతకాలంగా ప్లాస్టిక్ సీసాలు ఏరుకుంటూ.. వైన్ షాపు వద్ద మద్యం తాగేవాడని స్థానికులు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 21 మందికి జరిమానా.. తిరుపతి (లీగల్): నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 21 మంది నిందితులు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ గురువారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పోలీసు, కోర్టు సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒప్పంద ఉద్యోగికి తీవ్ర గాయాలు.. పాకాల: మద్దినాయునిపల్లి ఉపకేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ తీవ్రగాయాల పాలయ్యాడు. గురువారం ఉదయం నియంత్రిక వద్ద ఫ్యూజ్ మరమ్మతుల కోసం ఉపకేంద్రం నుంచి ఎల్‌సీ తీసుకున్నట్లు సమాచారం. సరఫరా ఆపిన తరువాత పనులు చేస్తుండగా ఉపకేంద్రానికి వచ్చిన మరో ఉద్యోగి సరఫరా పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. విద్యుదాఘాతంతో స్తంభంపై నుంచి కిందపడిన భాస్కర్‌కు చేయి కాలిపోవడంతోపాటు కుడి మోకాలు విరిగింది. ప్రస్తుతం తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఇదే ఉపకేంద్రం పరిధిలో గతనెలలోనూ ఓ ప్రమాదం జరిగి గుణశేఖర్ గాయపడ్డారు.

నరశింగాపురంలో ఇరువర్గాల ఘర్షణ.. చంద్రగిరి: నరశింగాపురం పంచాయతీ దళితవాడలో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్యన ఘర్షణ చోటుచేసుకుంది. దళితవాడలో గంగమ్మ జాతరకు చందాలు వేసుకుని నిర్వహిద్దామని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఎంపీటీసీ సభ్యురాలు అశ్విని భర్త మించల ప్రవీణ్‌తో దళితవాడకు చెందిన శ్రీను మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీను కర్ర తీసుకుని ప్రవీణ్ తలపై మోదటంతో అతను తీవ్రగాయాలకు గురయ్యారు. గాయపడ్డ ప్రవీణ్ చంద్రగిరి ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. సీఐ సుబ్బరామిరెడ్డి సిబ్బందితో దళితవాడకు చేరుకుని ప్రాథమిక సమాచారం సేకరించారు. కేసు విచారిస్తున్నారు.

గాయపడ్డ ప్రవీణ్

PUBLIC NOTICE

Your Keshvin Green Energy LLP
LLPIN: ACM-0357

Notice is hereby given pursuant to Rule 17(1) of the Limited Liability Partnership Rules, 2009, that Keshvin Green Energy LLP, having its registered office at 19-4-4G, STV Nagar, Air By pass Road, Tirupati, MR Palli Police Station, Tirupati (Urban), Chittoor- 517501,Andhra Pradesh, intends to shift its registered office from the state of Andhra Pradesh to the state of Telangana.

Any person whose interest is likely to be affected by the proposed change of the registered office of the LLP may deliver either on the MCA-21 portal (www.mca.gov.in) by filling investor complaint form or cause to be delivered or send by registered post of his/her objections supported by an affidavit stating the nature of his/her interest and grounds of opposition to the Ministry of Corporate Affairs, 29-7-33, Goli Complex Hasini Hospital, Vishnu Vardhana Rao Street, Surya Rao Pet, Vijayawada, Andhra Pradesh 520002, within 21 days from the date of publication of this notice with a copy to the applicant .

LLP at it's registered office address mentioned below :
19-4-4G, STV Nagar, Air By Pass Road, Tirupati, M.R.Palli Police Station, Tirupati (Urban), Chittoor-517501

For Keshvin Green Energy LLP
Sd/- R Uday Kumar Reddy
Designated Partner
Date: 03/07/2025.

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

సినీ, బుల్లితెర నటులు బాలాజీతో తెదేపా నేతలు

ముక్కంటి సేవలో నటుడు బాలాజీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సినీ, బుల్లితెర నటులు బాలాజీ శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వీరికి స్థానిక తెదేపా నేతలు బుజ్జి, ఆర్ముగం ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని బి.పి.అగ్రహారంలో ఏర్పాటైన హజరత్ జులేహా పీర్ దర్గాలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి దర్గా ఉరుసు కమిటీ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. విశేష అలంకరణలను చూసేందుకు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

వరదయ్యపాళెం: సమస్య: మండలకేంద్రంలో గ్యాస్ పైపుల కోసం చేపట్టిన తవ్వకాలతో నిత్యం అవస్థలు పడుతున్నాం. గతంలో పైపులు భాగ్యంలో అమర్చేందుకు తవ్వకాలు చేపట్టిన సక్రమంగా పూడ్చలేదు. అలాగే తవ్వకాలు చేపట్టడం. దీంతో గొట్టాలు పగిలిపోయి నీటి సరఫరా రాక ఇబ్బందులు పడుతున్నాం. **- ఏజాస్, స్థానికుడు**

సమాధానం: తాగునీటి గొట్టాల పునరుద్ధరణ పనులు చేపడుతున్నాం. ఒక రోజులో తాగునీరు సరఫరా చేస్తాం. **- బసిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వరదయ్యపాళెం**

సత్యవేడు: సమస్య: మల్లావారిపాళెం వెస్ట్‌లో ఇటీవల కురిసిన వర్షానికి పక్కా కాలువల్లోకి మట్టి చేరింది. పూడు కుపోవడంతో కాల్వలో నీరు కదలడం లేదు. దోమల వృద్ధి చెంది నిద్ర కరవైంది. **- ప్రసాద్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. పూడిక తొలగిస్తాం. **- హరీష్, పంచాయతీ కార్యదర్శి**

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: సువర్ణముఖి నదీ తీరం గంధరాయం వద్ద వ్యర్థాలు పడేస్తున్నారు. పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. **- మూర్తి, శ్రీకాళహస్తి**

సమాధానం: సువర్ణముఖి నదీ తీర పరిసరాలు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- బాలకృష్ణ, పారిశుద్ధ్య విభాగం అధికారి, పురపాలక సంఘం**

సుపరిపాలనతో ప్రజల్లో ఆనందం

శ్రీకాళహస్తిలో మెకానిక్‌లతో సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని బి.పి.అగ్రహారంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచిపెట్టారు. సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రౌడీయిజాన్ని నియంత్రించగలిగినట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా ఆయన తీరు మారలేదని, ఆయన విమర్శలు చేసిన పరిస్థితుల్లో నియోజకవర్గ ప్రజలు లేరన్నారు. పార్టీ పరిశీలకులు అంకయ్య చౌదరి, నేతలు విజయకుమార్, కంటా రమేష్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. అంతర్జాతీయ మెకానిక్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ వ్యాప్తంగా ఉన్న మెకానిక్‌లు చేపట్టిన వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.

కక్షిదారులకు అవగాహన కల్పించండి

పోలీసులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: దీర్ఘకాల కేసులకు సంబంధించి కక్షిదారులకు అవగాహన కల్పించాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్ కోరారు. న్యాయసేవా ఆవరణలో గురువారం పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. శనివారం న్యాయసేవా సముదాయంలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తమవంతుగా సహకారం అందించి కేసుల పరిష్కారానికి సహకారం అందించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, నాగార్జునరెడ్డి, తిమ్మయ్య పాల్గొన్నారు.

పంట కుంటలతో రైతులకు ప్రయోజనం: పీడీ

చెరువు పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్

బీఎన్ కండ్రిగ, న్యూస్‌టుడే: పంట కుంటలు, ఉద్యాన, పూల తోటల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మండలంలోని కనమనంబేడు, పాపనపల్లి, పల్లమాల గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పనులు పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2025-26లో రూ.307 కూలి పెంచిందన్నారు. కచ్చితంగా 100 రోజులు పని చేయాలని, దినసరి కూలి రూ. 300 తీసుకునేటట్లు కూలీలు శ్రమించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద వర్మికంపోస్ట్ పిట్ వాడుకోవాలన్నారు. ఎంపీడీవో వెంకటరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి జలశ్రీ, ఏపీవో దేవరి పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా.. సంక్షేమం

● బాగోగులు పట్టని వైనం ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తలుపులు కిటికీలు

పెచ్చులూడుతున్న పైకప్పు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి భవనాలు, మరమ్మతులకు నోచుకోని గదులు, అడుగడుగునా అసౌకర్యాల మధ్య విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు, పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఉండకుండా సంక్షేమ వసతి గృహాలకు పంపి చదివిస్తున్నారు. అయితే సౌకర్యాల కొరత, సంక్షేమాధికారుల అశ్రద్ధ విద్యార్థులకు శాపంగా మారింది. శ్రీకాళహస్తి నియోజక వర్గ పరిధిలో 6 బీసీ, ఎస్సీ 5 వసతి గృహాలున్నాయి. గిరిజన గురుకులాలు నాలుగున్నాయి.

అరకొర వసతులు

పట్టణ పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో అరకొర వసతులతో అవస్థలు తప్పడం లేదు. గత వైకాపా హయాంలో వసతుల్లో సంక్షేమ వసతి గృహాలు అభివృద్ధి చేసిన దాఖలాల్లేవు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గురుకులాలు, ఏరియా ఆస్పత్రి సమీపంలోని సమీకృత సంక్షేమ వసతి గృహాన్ని అభివృద్ధి పరిచారు.

● పట్టణంలోని గంగరాజు కాలనీ బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో 85 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఇక్కడి గదుల పైకప్పులు పెచ్చులూడిపడటం సర్వసాధారణమైంది. ఇటీవల ఓ విద్యార్థినిపై గాయపడ్డారు. గదులు తలుపులు లేవు, కిటికీ తలుపులు సరిగా పడక ఇబ్బందులు తప్పడం లేదు. ఇక నీటి వసతి లేకపోవడంతో బకెట్లతో తెచ్చుకోవాల్సిన దుస్థితి. ● సంస్కృత పాఠశాల ఆవరణలోని బీసీ సంక్షేమ వసతి గృహంలోనూ విద్యార్థులకు అవసరమైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇక ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లోనూ ఇదే పరిస్థితి. ● తొట్టంబేడు బాలికల సంక్షేమ వసతి గృహాల్లో గదుల్లోకి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ● ఏర్పేడు బీసీ, పల్లం లోని ఎస్సీ సంక్షేమ హాస్టల్లో అసౌకర్యాలతో పిల్లలు అవస్థలు పడాల్సి వస్తోంది. ● రేణిగుంట బీసీ సంక్షేమ వసతి గృహం అభివృద్ధి పనులు ప్రారంభించి వదిలిపెట్టేశారు. ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. కిటికీలకు తలుపులు లేవు.

బకెట్‌తో నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థినులు

అశ్రద్ధతోనే అనర్థాలు

సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు నియమించిన సంక్షేమాధికారుల అశ్రద్ధ కారణంగానే అనర్థాలు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న పులిని పింఛేటి ఇడ్లీలు పెట్టడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తాజాగా తెలుగుగంగ కాలనీలోని సంక్షేమ వసతి గృహంలో అల్పాహారంగా వడ్డించిన ఉప్మాలో జెర్రి వచ్చిందన్న కారణంగా ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.

ఉన్నతాధికారుల దృష్టికి

ప్రాంతీయ సంక్షేమ అధికారిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టా. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- మునీంద్ర, బీసీ సంక్షేమ వసతి గృహాల డివిజన్ సంక్షేమాధికారి, శ్రీకాళహస్తి

గుంతలు పూడ్చారు

ఏర్పేడు: మండల కేంద్రంలోని వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ప్రమాదకర గుంతలను ఎట్టకేలకు పూడ్చారు. కొద్దిరోజులుగా రహదారి పక్కన గుంతలు ఉండటంతో నిత్యం ప్రమాదకరంగా మారింది. 'ఈనాడు'లో గురువారం 'నిర్లక్ష్యంతో ప్రమాదం' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచి శివయ్య యంత్రంతో గుంతలు చదును చేయించారు. మట్టితో పూడ్చి సమస్యను పరిష్కరించారు. సమస్యను తమదృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

ఉగ్రరూపంతో ద్రౌపదమ్మ దర్శనం

పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపది

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఉగ్రరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ద్రౌపది వస్త్రాపహరణం సందర్భంగా జుట్టు విరబోసుకుని ఉన్నట్లుగా అమ్మవారిని అలంకరించారు. ఉదయం శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపతమ్మ పురవీధుల్లో ఊరేగారు. ఈ విశేషోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అగ్నిగుండ మహోత్సవంలో ప్రవేశించేందుకు భక్తులు కట్టుకునే మొక్కుబడి కంకణాలను శుక్రవారం నుంచి భక్తులు కట్టడం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

ఉగ్రరూపిణిగా దర్శనమిస్తున్న ద్రౌపదమ్మ

నారాయణవనం, న్యూస్‌టుడే: తితిదే అనుబంధమైన కరియాపల్లి సమేత శ్రీ చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తన ప్రియ భక్తుడు రావణబ్రహ్మపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గురువారం ఉదయం ఆలయంలో మూలవర్లకు సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం, నిత్యకైంకర్య పూజలు చేపట్టారు. అనంతరం నటరాజ స్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి నూతన పట్టువస్త్రాలు, పుష్పాలతో పరాశరేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి రావణేశ్వర వాహనంపై అధిరోహింపజేసి గ్రామవీధుల్లో ఊరేగించారు. తిరుమల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రావణేశ్వరవాహనంపై పరాశరేశ్వరస్వామి

అర్హు లందరికీ సంక్షేమ ఫలాలు

ఏర్పేడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందజేసేందుకు ప్రభుత్వం నిత్యం కృషి చేస్తోందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సదాశివపురం కండ్రిగలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఏడాదిలో చేసిన ప్రగతి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు నాగరాజానాయుడు, మోహన్‌నాయుడు, పొన్నారావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

రేణిగుంట: పేదల పాలనలోనే కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిందని తెదేపా నాయకులు తెలిపారు. గురువారం రేణిగుంట పంచాయతీలోని వేణుగోపాలపురం గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి పథకాల గురించి ఆరా తీశారు. మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రశేఖర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నీటితో తుప్పు.. వదిలించకుంటే ముప్పు

ఎస్ఎస్‌పురం ఆదిఆంధ్రవాడ మాతమ్మ ఆలయ సమీపంలోని తాగునీటి చేతిబోరు నీరు కలుషితమవుతోంది. బోరు పైపులు దెబ్బతిని తుప్పు పట్టింది. ఆ పైపుల నీటితో కలిసి వస్తున్నాయి. ఈ ప్రాంత తాగునీటి అవసరాలను ఇప్పటికీ ఈ బోరే తీరుస్తుంది. స్థానిక మోటారు బోరు మరమ్మతులకు గురైంది. నెలల తరబడి పాలకులకు చెప్పినా వినిపించుకోని దుస్థితి. చేతి బోరు నీరు కలుషితమై వస్తుండటంతో తాగేందుకు పనికిరావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నాగలాపురం**

తాగునీటికి ఇక్కట్లే!

మండలంలోని దిగువసాంబయ్యపాళెంలో నీటి సమస్య ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. విద్యుత్తు బోరు పనిచేస్తున్నా, ట్యాంకు నుంచి నీరు ఇంటింటికి సరఫరా కావడం లేదు. పదిరోజులుగా సమస్య వేధిస్తోంది. రోజూ పొద్దున్నుంచే పొలాల వెంట వేట సాగిస్తున్నారు. బోరుల నుంచి బిందెలు, డ్రమ్ములతో ఇళ్లకు పడుతూ నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి. ఇక్కడి పాఠశాల నిరంతర ఉపాధ్యాయులు, విద్యార్థుల వేదన వర్ణనాతీతం. సమస్యపై అధికారులు, నాయకులకు విన్నవించినా ప్రయోజనం శూన్యమని గ్రామస్థులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

వ్యర్థం.. తప్పని కష్టం

పట్టణంలోని ఇసుకదిబ్బ సమీపంలోని మురుగు కాల్వల్లో వ్యర్థనీరు సక్రమంగా ప్రవహించడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో నీటి నిల్వలు వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. దుర్గంధంతో పాటు దోమల బెడదతో అక్కడి స్థానికులు అవస్థలు పడాల్సి వస్తోంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

శ్రీసిటీ వ్యర్థాలు.. రైతులకు అవస్థలు

మండలంలోని రాజగోపాలపురం గ్రామ సమీపంలో క్రషర్ వద్ద రైతుల పొలాల్లో శ్రీసిటీ పరిశ్రమ వ్యర్థాలు యథేచ్ఛగా పడేస్తున్నారు. మామూలుగా శ్రీసిటీలోని వ్యర్థాలను టెండర్ ద్వారా గుత్తేదారులకు అప్పగించి తరలించాల్సి ఉంటుంది. ఇదేమీ పట్టకుండా పరిశ్రమ యాజమానులు సమీప ప్రాంత వాసులకు అప్పగించిన వ్యర్థాలను రాత్రిపూట ఇలా పడవేస్తున్నారు. సాగు భూములోనూ, ఏళ్లుదుడకే అక్కడ వ్యర్థాలు వేస్తుండటంతో సంబంధిత రైతులు ఇబ్బందిపడి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలు తగలబెడితే పర్యావరణ సమస్యలు వస్తాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

దరఖాస్తుల ఆహ్వానం

తొట్టంబేడు: తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బోధనానుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలను జోడించి ఈనెల 04వ తేదీ లోపు ప్రిన్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కార్మిక కోడ్లు రద్దు చేయాలి

రేణిగుంట: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికులను ఇబ్బందికరంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని.. వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. హరినాథ్, వెంకటరమణ, సెల్వరాజ్, ధనమ్మ, అంబికా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల అస్వస్థతపై ప్రతిపక్షాల విమర్శలు

విద్యార్థిని అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వినుత

తొట్టంబేడు, న్యూస్‌టుడే: అల్పాహారాన్ని తిని ముగ్గురు వసతిగృహ విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. గురువారం అస్వస్థత లోనైన ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలను పలు పార్టీ నేతలు పరామర్శించారు. గోరు ముద్ద పోయింది.. జెర్రీ ముద్దగా వచ్చిందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. జనసేన సమన్వయకర్త వినుత బాలికలను పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాంగ్రెస్, సీపీఎం నేతలు విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు.

నిధులు కేటాయించాలని తుడా ఛైర్మన్‌కు వినతి

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం-టీపీకోట రహదారి నిర్మాణానికి తుడా నిధులు కేటాయించాలని తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డిని తెదేపా నేతలు కోరారు. తుడా కార్యాలయంలో ఛైర్మన్‌ను గురువారం కలిసిన నేతలు స్థానిక సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. మండలంలోని కీలకమైన రహదారి వైకాపా నేతల దారుణంగా నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలోనూ నిధుల విడుదల కాకపోవడంతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఇటీవలే చేయాలని వ్యాలని కోరారు. ఐటీడీపీ జిల్లా సమన్వయకర్త యాదం ధనుంజయ, బొజ్జి, రవిశెట్టి, ప్రసాదరావు పాల్గొన్నారు.

తుడా ఛైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న తెదేపా నేతలు

ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే సహించం

రోడ్డుపైకి వచ్చిన దుకాణాలను వెనక్కి పంపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ గోపి స్పష్టం చేశారు. పట్టణ వీధుల్లో పలు చోట్ల రోడ్లపైకి వచ్చిన దుకాణాలన్నింటినీ గురువారం వెనక్కు జరిపించారు. రోడ్డుపై వచ్చిన దుకాణదారులకు జరిమానాలు విధించారు. నిబంధనలు అతిక్రమించి మళ్లీ రోడ్ల మీదకు వస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సన్నిధివీధిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీగోవిందరాజస్వామి ఆలయ సన్నిధి వీధిలో బుధవారం అర్ధరాత్రి తరువాత అగ్ని ప్రమాదం జరిగింది. తిరుపతి ఎస్‌ఐటీవో కాలనీలో నివాసం ఉంటున్న ఎ.ఎస్.ఐ సన్నిధివీధిలో శ్రీ పెద్ద బట్టల మెటల్స్ పేరుతో దుకాణం నడుపుతున్నాడు. ఆయన కేదార్‌నాథ్‌కు వెళ్లగా సిబ్బంది నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి అనంతరం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి.

భూముల్లో పర్యటిస్తున్న అధికారులు

ఆర్ట్ ఆఫ్ లివింగ్ భూముల పరిశీలన

ఏర్పేడు: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు అవసరమైన భూములను మండలంలోని కోబాక రెవెన్యూలో కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విమానాశ్రయం, ప్రధాన రహదారి అందుబాటులో 25 ఎకరాల భూమిని ఆ సంస్థ కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంతో కోబాక రెవెన్యూ సర్వే సంఖ్య 174లో గుర్తించారు. దీంతో ఆ సంస్థ సభ్యులతో పాటు కేంద్ర బృందం గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ భార్గవి పాల్గొన్నారు.

అనుమానంతో కత్తితో దాడి

గాయపడిన కేశవులు

ఏర్పేడు: తన గురించి ఏదో తప్పుగా మాట్లాడుతున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తి మరొకరిపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని గుండ్లకండ్రిగ ఎస్టీకాలనీలో జరిగింది. ఎస్టీకాలనీకి చెందిన కేశవులు(46) స్థానికులతో కలిసి వీధిలో కూర్చుని మాట్లాడుతుండగా మద్యం మత్తులో వెళ్తున్న సీతారాం తన గురించి ఏదో చర్చిస్తున్నాడని భావించాడు. దీంతో కత్తితో కేశవులు నరకడంతో తలభాగంపై తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు తిరుపతి రుయాకు తరలించారు. ఆతని పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు సీతారాంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

రేణిగుంట: వైద్య దర్శనానికి తిరుమల వచ్చే యాత్రికులు ఏటీఎం కేంద్రాల్లో నగదు డ్రా చేసే సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను గాజులమండ్యం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మంజునాథరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గాజులమండ్యం కూడలిలోని ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మణిని కానిస్టేబుల్ మహేంద్ర తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, రేణిగుంట బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని ఏటీఎం కేంద్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గతంలోనూ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం చోటు చేసుకొంది. నిందితుడు మణి చేతిలోని సీసీ ఫుటేజీలో గుర్తించారు. మణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుదాకర్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ : ఐదుగురికి గాయాలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఆటోను గుర్తుతెలియని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రేణిగుంట- నాయుడుపేట ప్రధాన రహదారిపై శ్రీకాళహస్తి పట్టణ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి నుంచి నెల్లూరు వైపున్న ఆటోను కాగితాలపూరు సమీపంలో గుర్తుతెలియని లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆటోలోని ఐదుగురు వ్యక్తులు వాహనం నుంచి రోడ్డుపై పడి గాయపడ్డారు. క్షతగాత్రులు అనిల్, దేవా, సంతోష్, వేణు, సుదాకర్‌గా గుర్తించి ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరిని మెరుగైన వైద్య నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారని స్థానికులు తెలిపారు.

మద్యం మత్తులో వివాదం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కొందరు యువకులు దాడికి పాల్పడిన ఘటన అంజిమేడు సమీపంలో గురువారం జరిగింది. పోతుకూనురుకు ఎస్టీకాలనీకి చెందిన కొందరు యువకులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇందులో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

అవినీతి భయం.. రికార్డులు మాయం

బదిలీలతో తప్పులు కప్పిపుచ్చుకునే యత్నం

అంజూరు సచివాలయ భవన సముదాయం

కేవీబీ పురం, న్యూస్‌టుడే: మండలంలోని పలు సచివాలయాల్లోని రికార్డులు మాయమైనట్లు తెలుస్తోంది. గతంలో మండలంలో పనిచేస్తూ బదిలీలపై ఇటీవల పక్క మండలాలకు వెళ్లిన కొంత మంది పంచాయతీ కార్యదర్శులు స్థానిక సర్పంచులతో అంటకాగి చేసిన తప్పిదాల ఆధారాలు లేకుండా చేసుకునే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులు మాయం చేసేశారు. వారు రోజులుగా పంచాయతీలో వారు చేసిన తప్పులను సవరించే పనిలో పడ్డారు. ఇంతలో కొత్తగా బాధ్యతలు తీసుకున్న పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాల్లో రికార్డులు లేకపోవడంతో వారు ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. కొంత మంది తోటి సచివాలయ సిబ్బంది, మరికొందరు స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించి ఏమి చేయాలో అన్న ఆలోచనలో పడ్డారు.

అంజూరు రికార్డులు గూడూరులో..?

మండలంలోని అంజూరు పంచాయతీకి సంబంధించిన రికార్డులు గూడూరులో ఓ పంచాయతీ కార్యదర్శి ఇంట్లో ఉన్నట్లు తెలుస్తోంది. కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న కొద్దిరోజులు మాత్రమే పనిచేయగా ఆ తరువాత వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. కానీ ఇక్కడ వైకాపా సర్పంచి కావడంతో ఆ కొద్ది రోజుల్లోనే రూ.లక్షల వ్యవధిలో నిధులు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ పంచాయతీకి కొత్త కార్యదర్శి వచ్చినా..? ద్రా విషయం ఉన్నతాధికారులకు తెలిసినా..? ఇబ్బందులు తప్పవన్న భావనతో ఈ పంచాయతీ రికార్డులను సదరు పంచాయతీ కార్యదర్శి తన వెంట తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇటీవల వచ్చిన పంచాయతీ కార్యదర్శి రికార్డులపై ఆరా తీస్తుండటంతో సచివాలయ సిబ్బంది ద్వారా గుట్టు చప్పుడు కాకుండా కార్యాలయానికి చేర్చేపనిలో పడ్డారు.

చర్యలు తీసుకుంటాం

పంచాయతీ రికార్డులను పంచాయతీ కార్యదర్శులు తీసుకెళ్లడం చట్టరీత్యా నేరం. వారు అత్యుత్సాహంతో రికార్డులు మాయం చేసినా.. ఆన్‌లైన్ ద్వారా తప్పిదాలు గుర్తించవచ్చు. కార్యాలయంలో రికార్డులు లేని పంచాయతీలను గుర్తించి బాధ్యులకు నోటీసులు జారీ చేసేలా ఎంపీడీవోను ఆదేశిస్తాం.
- సుశీలాదేవి, డీపీవో, తిరుపతి

(c) eenadu

గూడూరు

•గూడూరు •వెంకటగిరి •సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం:
కేజీ రూ. 26 నుంచి
రూ. 35 వరకు

రెండో రకం:
కిలో రూ. 15 నుంచి
రూ. 25 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	116
లేయర్	112
బ్రాయిలర్	212
బ్రాయిలర్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

బాధ్యతల స్వీకరణ

కోట: మండల పరిషత్తు ఏవోగా శివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కోటలో ఏవోగా పని చేస్తూ డిప్యుటేషన్‌పై నెల్లూరులో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పని చేశారు. ప్రస్తుతం ఆయన డిప్యుటేషన్ రద్దు చేసి ఇక్కడకు పంపారు.

వ్యాను డ్రైవర్లకు న్యాయం చేయాలి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడంతో వ్యాను డ్రైవర్లకు అన్యాయం జరుగుతోందని సీఐటీయూ మండల పార్టీ కార్యదర్శి ముకుంద పేర్కొన్నారు. నాయుడుపేట సీఐటీయూ కార్యాలయంలో బుధవారం రాత్రి జనరల్ బాడీ సమావేశం జరిపారు. జిల్లా నాయకులు లక్ష్మీ మాట్లాడుతూ జులై 9న జరిగే సమ్మెలు విజయవంతం చేయాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో చిరుజల్లులు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఎండ తీవ్రతకు ఉక్కపోతకు గురైన ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షం కారణంగా కొంతసేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నిలువెల్లా నిర్లక్ష్యం.. విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తం

డిస్కం అధికారుల తీరుతో ప్రజల అవస్థలు

విద్యుత్తు నియంత్రిక చుట్టూ ధ్వంసమైన రక్షణ గోడ

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదకరంగా ఊడిపోయిన ఫ్యూజ్ బాక్సులు

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

డివిజన్ కేంద్రం నిత్యం ఉక్కపోతతో ఉడికిపోవాల్సి వస్తుంది. విద్యుత్తు ఎప్పుడొస్తుందో, పోతుందో తెలియని పరిస్థితి. నిరంతరం సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రతినెలా మరమ్మతులు, చెట్లు కొట్టేయడానికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సరఫరాలో అంతరాయం చేసి పనులు చేస్తుంటారు. అయినా వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి, ఇతర సమయాల్లో అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఇదీ కారణం

గూడూరు పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికల చుట్టు రక్షణ గోడలు లేకపోవడం, ముళ్ల చెట్లు మధ్యలో ఉండడం, తీగలకు చెట్టు కొమ్మలు అమాంతంగా అల్లుకుంటున్నా.. డిస్కం అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడమే కారణమని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో కేబుల్ వైర్లు విద్యుత్తు స్తంభాలకు అడ్డదిడ్డంగా ఉండడంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయని, వాటిని నివారించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు బిల్లులు ముక్కుపిండి వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సరఫరాను పునరుద్ధరించడంలో కనిపించడంలేదని వాపోయారు. నియంత్రికలకు చాలా చోట్ల కిందకే ఫ్యూజ్ బాక్సులు, విద్యుత్తు వైర్లు ఉండడంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందాల్సి వస్తుంది. మారుమూల ప్రాంతాల్లో పట్టించుకునే దాఖలాలు లేవంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకుంటాం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా సమస్య వేగంగా పరిష్కరిస్తాం. ఫ్యూజ్‌బాక్సులు ఏర్పాటు చేస్తాం. విద్యుత్తు తీగలు కిందకు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- నరేంద్రరెడ్డి, ఈఈ, గూడూరు

దారిలేక.. దీపాలు వెలగక

పగలు, రాత్రి చోరీలు.. నిద్రావస్థలో యంత్రాంగం

ఎన్జీవో కాలనీలో నడిచే దారిలో పెరిగిన పిచ్చిమొక్కలు

నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు

న్యూస్‌టుడే, వెంకటగిరి

పట్టణ శివారు ప్రాంతాలన్నీ ఒకప్పుడు చిట్టడవిని తలపించేవి. కాలక్రమేణా పట్టణాభివృద్ధి చెందుతూ రూపురేఖలు మారాయి. కానీ ఎన్జీవో కాలనీలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 20 ఏళ్లు కావస్తున్నా నేటికి ఇక్కడ నడిచేందుకు రోడ్డు లేదు. గత ప్రభుత్వంలో మౌలిక వసతుల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి నివాసం సమీపంలోని రోడ్డే మూడేళ్ల కిందట సగం వరకు వేసి వదిలేశారు. ప్రస్తుతం ఇక్కడ భారీ భవన నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ముళ్లచెట్లు పెరిగి

ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ దారుణంగా ఉన్నాయి. మట్టి రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో రాకపోకలకు పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి దయనీయంగా ఉంది. తొలి పాలకవర్గంలో వేసిన సిమెంట్ రోడ్డు ధ్వంసం కావడంతో తిప్పలు తప్పడం లేదు.

నివాసాల మధ్య మురుగు

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక నివాసితులు మురుగునీటిని ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. దీంతో మురుగుకూపంగా దర్శనమిస్తోంది. కాలనీ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, కాలువలు అవసరం. మురుగు వల్ల దోమలు విపరీతంగా పెరగడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ వీధిదీపాలు వెలగడం లేదు. దాంతో పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. సమీపంలో రైల్వేస్టేషన్ ఉండడంతో దొంగతనం చేసి నేరుగా రైలులో వెళ్తున్నారు. రాత్రి 7 దాటితే ఈ ప్రాంతంలో వెలుపలకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

మరమ్మతులు చేపడతాం

వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. కాలువలు, రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు కాగానే అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
- వెంకట్రామిరెడ్డి, కమిషనర్, వెంకటగిరి

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నివారించాలని, కవర్లు వినియోగించవద్దని ప్రిన్సిపల్ డాక్టర్ శంకరశర్మ పేర్కొన్నారు. స్థానిక వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ కారకాలు మానవుని శరీరంలోకి ప్రవేశించి అనేక రకాల రోగాలు రావడానికి కారణమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విక్టోరియా రాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ఏడుకొండలు, శ్రీనివాస్, అమ్మాజీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నివేసిత స్థలాలు చూపాలంటూ ఆందోళన

తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: శ్రీహరికోట పునరావాస కేంద్రానికి సంబంధించిన పలువురు బాధితులు గురువారం దొరవారిసత్రం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అక్కరపాక రెవిన్యూ పరిధిలోని ఎన్ఎం అగ్రహారం వద్ద సర్వే నెంబరు 305 నందు పది సెంట్ల చొప్పున నివేసిత స్థలాలను మంజూరు చేశారని తెలిపారు. బయటి ప్రాంతాల్లో జీవనోపాధి కోసం వెళ్లి ఇటీవల వచ్చి ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే కొందరు తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. శనివారం తమ సిబ్బందితో సర్వే చేయించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దారు శైలకుమారి తెలిపారు.

పొలం ఆక్రమించారని ఫిర్యాదు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలంలో శిరసరంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 149-3 పది సెంట్ల భూమిని ఇదే గ్రామానికి చెందిన మల్లు కృష్ణయ్య ఆక్రమించి దౌర్జన్యం చేసినట్లు వేలూరు మురళీకృష్ణారెడ్డి అనే వ్యక్తి పోలీసులకు వారం రోజుల కిందట ఫిర్యాదు చేశారు. తనకు వారసత్వంగా సంక్రమించిన భూమి అయినా అర్హతలేని కొన్ని అగ్రిమెంటు పత్రాలు చూపించి తన పొలంలో షెడ్డు నిర్మించారని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసి దుర్భాషలాడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే తనపై కొందరు దౌర్జన్యాలు చేయించి పొలంలో పాగా వేయించినట్లు తెలిపారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భోజన బియ్యం... ఉపాధ్యాయులకు భయం

గోదాంకు తెచ్చిన బియ్యం బస్తాలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సన్న బియ్యం, రాగిపిండి, బెల్లం సరకులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు స్టాక్ పాయింట్లకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి రెండో నెల కూడా తప్పలేదు. గత నెలలో మొదటి సారిగా అలా జరిగిందని, ఈసారి పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకొంటామని చెప్పిన పౌరసరఫరాల జిల్లా అధికారులు మాట తప్పారు. గత నెలలో మూడు స్టాక్ పాయింట్లు ఉండగా ప్రస్తుతం వాటిని ఐదు పాయింట్లుగా చేశారు. ప్రతి హెచ్ఎం వారి సొంత వాహనంలో వెళ్లి తెచ్చుకుంటున్నామని గతంలో ఇలా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా ఛార్జీలు అవుతున్నాయన్నారు. ఈ విషయమై సీఎస్ డీటీ హజ్మతుల్లాఖాన్‌ను అడగ్గా జిల్లా అధికారులతో మాట్లాడతానన్నారు.

ఊర్ల పేర్లు తలకిందులు

మల్లాం మార్గంలో ర.భ శాఖ రోడ్డు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మిట్టకండ్రిగ, తన్నమాల, పాటిమిట్ట గ్రామాలకు వెళ్లే క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఊర్లపేర్లు తెలియజేసే బోర్డు కొంతకాలంగా ఇలా తలకిందులుగా కనిపిస్తుండటంతో ఈ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. బోర్డు సరిచేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట**

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో?

నాయుడుపేట- దుగరాజపట్నం రహదారిలో చిట్టమూరు మండలం కొత్తగుంట సమీపం నుంచి దుగరాజపట్నం వరకు సుమారు 8 కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా ఉంది. ఐదేళ్లుగా ఈ రోడ్డు దారుణంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నాయుడుపేట నుంచి కొత్తగుంట వరకు రెండు వరుసల రహదారి ఉండగా అక్కడి నుంచి దుగరాజపట్నం వరకు సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారిలతో కలిసి యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు విజన్‌తో ప్లాన్ రూపొందించాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ.. కోట, న్యూస్‌టుడే: చెందోడులో గుండెపోటుతో మృతి చెందిన చిట్టమూరు విద్యుత్తుశాఖ ఏఈ పోలయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తెదేపా మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి నాయకులు గురువారం నివాళులర్పించారు. మద్దాలిలో తెదేపా నాయకుడు ప్రభాకర్ తల్లి కర్మక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు.

సుపరిపాలన కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

ప్రతి హామీని నెరవేస్తాం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బంగారుపేటలోని సుపరిపాలనలో భాగంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ గురువారం కరపత్రాలు అందించి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైకాపా పాలనలో తెదేపా సానుభూతిపరులమని దివ్యాంగులైన తమకు పింఛను రద్దు చేశారంటూ ఇద్దరు వాపోయారు. సీహెచ్‌సీలో కాన్పుకు వెళ్తే సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమస్య: పురపాలక సంఘంలోని సూళ్లూరు కాపు వీధిలో డిస్కం సబ్ డివిజన్ కార్యాలయం ముందు రోడ్డుపై నీరు నిలిచి, రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- స్థానికుడు**
సమాధానం: పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.
- కె.చిన్నయ్య, కమిషనర్

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: సమస్య: కొత్తగుంటలోని ర.భ. రోడ్డుపై వాహనాల పార్కింగ్‌లో నిబంధనలు పాటించడం లేదు. **- సీబీఎస్, చోదకుడు**
సమాధానం: ట్రాఫిక్‌లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం. **- చినబలరామయ్య, ఎస్సై**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: రెండో పట్టణంలోని ఎగువవీరారెడ్డిపల్లి ప్రాంతంలో సీసీ రోడ్డుపై గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- చిన్నయ్య**
సమాధానం: రోడ్డు గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

వెంకటగిరి, న్యూస్‌టుడే : సమస్య: పట్టణంలోని 16వ వార్డు తాజ్‌మహల్ సందులోని పీర్లచావిడి వద్ద ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురైంది. **- రాజు**
సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.
- వెంకట్రామిరెడ్డి, కమిషనర్

ఆక్రమణల తొలగింపు

కోట : రంగన్నగుంటలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలోని ఆక్రమణలను ఎంఈవో2 మస్తానయ్య గురువారం పరిశీలించి తొలగించారు. ఈనాడులో ఈ నెల 3న 'ఆక్రమణ చెరలో పాఠశాల భవనం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంఈవో2 స్పందించారు. ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు.

జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

సూళ్లూరుపేట: దామానెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎంఈవో-2 నన్నూరు శీనయ్య తనిఖీ చేశారు. నాలుగు రోజుల కిందట 'ఈనాడు'లో 'నాడు కళకళ.. నేడు వెలవెల' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖాధికారులు పాఠశాలలో ఎంతమంది విద్యార్థులున్నారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. గ్రామస్థులతో మాట్లాడి, సంఖ్యను పెంచాలని సూచించారు.

రక్షణ గోడ వద్ద ఏర్పాటైన దిమ్మెలు

తడ: జాతీయ రహదారిపై చేనిగుంట వద్ద వంతెన రక్షణ గోడ విరిగిపోవడం వల్ల వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్న విషయమై ఈనాడులో బుధవారం 'రక్షణ గోడ విరిగిపడి నెలైంది' శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు స్పందించారు. రక్షణ గోడ విరిగిన ప్రాంతంలో గురువారం రక్షణగా కాంక్రీట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

వాకాడులో విద్యుత్తు కష్టాలు.. వాకాడు, న్యూస్‌టుడే: గురువారం రాత్రి అకాల వర్షం గాలి వీయడంతో విద్యుత్తు సరఫరాను పలు మార్లు నిలిపివేశారు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరఫరాను గంటల తరబడి తిరిగి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన తెదేపా అధ్యక్షుడికి సన్మానం.. కోట, న్యూస్‌టుడే: కొక్కుపాడులో గురువారం నూతనంగా నియమితులైన తెదేపా మండలాధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మురళి, నాయకులు కోటేశ్వరరెడ్డి, రమేష్, బాలాజీ, వెంకటకృష్ణయ్య, అనూక్, సుధాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. చిల్లకూరు: ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముందుకు సాగారు. మండలంలోని చింతవరం, కొత్తపాలెం, బల్లవోలు గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా తెదేపా నేతలతో కలిసి పర్యటించారు.

ఓవర్ హెడ్‌ట్యాంకుల శుభ్రత తప్పనిసరి.. బాలాయపల్లి: తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను నెలలో రెండు సార్లు తప్పనిసరిగా శుభ్రం చేసి క్లోరినేషన్ చర్యలు అమలు చేయాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ సూచించారు. ఊట్లపల్లి, నిడిగల్లు, సిద్ధాగుంట పంచాయతీలల్లో పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణపై డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజుతో కలిసి పరిశీలించారు.

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు.. కోట: గూడలి స్వర్ణముఖినదిలోని సమగ్ర రక్షత మంచినీటి పథకం బోరుకు సంబంధించిన విద్యుత్తు నియంత్రిక నాలుగు రోజులు కిందట కాలిపోయిన నేపథ్యంలో 10 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈక్రమంలోనే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందాకుమార్ పరిశీలించారు. ఆయన ఆదేశాలతో 160 కేవీ విద్యుత్తు నియంత్రికను అద్దె ప్రాతిపదికను తీసుకువచ్చి గురువారం ఏర్పాటు చేశారు. అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులు నిండాల్సి ఉండగా గూడలి పంచాయతీలోని నాలుగు ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తామని ఏఈ అరవింద్ తెలిపారు. శుక్రవారం నాటికి కోట దళితవాడ, జరుగుమల్లి, నెల్లూరుపల్లి, చెందోడు, ప్రకాశంకాలనీ, కొత్తపాళెం, ఊనుగుంటపాళెం గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో నియామకం.. సూళ్లూరుపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఎంపీడీవోగా ఎ.రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి డీపీవో కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా ఉంటూ డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయ్యారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తాపడి.. వృద్ధుడి దుర్మరణం

విందూరు(గూడూరు పట్టణం), న్యూస్‌టుడే: గూడూరు మండలం విందూరులో గూడూరు-మిట్టాత్మకూరు ప్రధాన రహదారిపై ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై మనోజ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని విందూరు ఎస్టీ కాలనీకి చెందిన చెంచయ్య(69) మరో నలుగురు వ్యక్తులతో కలిసి తీన్‌మార్ ప్రోగ్రాంకి వెళుతున్నారు. ఇంటి వద్ద నుంచి గ్రామ సమీపానికి వచ్చే సరికి ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే బోల్తా పడిపోయింది. దీంతో చెంచయ్య తీవ్రంగా గాయపడడంతో స్థానికులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్యతో పాటు, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

షార్ ఉద్యోగి మృతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఎల్ఏసాగరం వాసి, శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రంలో టెక్నీషియన్-డిగా పని చేస్తున్న పేరంశెట్టి సుధాకర్(48) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. నెల్లూరు ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకుని ఒక్కసారిగా ప్రాణాలు విడిచారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెళ్లకూరు: మండలంలో చెంబడిపాళెం ఎంటీకాలనీలో నాలుగు రోజుల కిందట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమ్మరగిరి సుభాషిణి(23) అనే ఒంటరి మహిళ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమె దివ్యాంగురాలు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో మృతిచెందడటంతో తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నాయుడుపేట పట్టణం: పుదూరు వద్ద ఆటో ఢీకొనడంతో మోటారుసైకిలిస్టు కె.తిరుమలతేజకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన నాయుడుపేటకు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న మల్లాం వెళ్లే ఆటో ఢీకొట్టింది. యువకుడిని నెల్లూరుకు తరలించారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

బాలాయపల్లి: అలిమిలి పంచాయతీ అంబలపూడి మామిడి తోటలో నివాసం ఉంటూ కట్టుకున్న భార్యను కడతేర్చిన బాటా వెంకటేశ్వర్లను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గత నెల 30న సిద్దమ్మ అనే మహిళపై అనుమానాలను పెంచుకుని వేధింపులకు గురి చేస్తూ ఆమె భర్త హత్య చేసిన సంగతి తెలిసిందే. రిమాండ్ కోసం శుక్రవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

నాయుడుపేట పట్టణం: నాయుడుపేట పోలీసులు గురువారం స్థానిక అగ్రహారపేటకు చెందిన రవీంద్రనాథ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి 11.15 గంటలకు ఈయన తన అత్త మహేశ్వరిపై హత్యాయత్నానికి పాల్పడటంతో తిరుపతి స్విమ్స్ అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా..?

వాకాడు: వాలమేడు పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పేద ఎస్సీ కూలీలకు పనులను సక్రమంగా కల్పించడం లేదని ఏపీవో విజయమ్మ వివక్షత చూపుతున్నారని మండల జడ్పీటీసీ రైతు రామకృష్ణ ప్రశ్నిస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తే.. ఆయనతో పాటు మరో నలుగురు ఎస్సీలపై అక్రమ కేసులు పెట్టారంటూ వైకాపా సీనియర్ నేత, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి ఆరోపించారు. వైకాపా నేతలపై మండలంలోని భాజపా, తెదేపా నేతలు అక్రమంగా కేసులు బనాయించారంటూ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, పెంచల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గురువారం మృతిచెందిన మునీశ్వర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా.. వాకాడు: ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం ధర్నా చేపట్టారు. డిపో మేనేజరు వైఖరికి నిరసన చేశారు. బీఎస్-6 బస్సులపై డ్రైవర్లకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా ఆయిల్ పొదుపు రాలేదంటూ వేధిస్తున్నారని ఆందోళన చేశారు.

ఆక్రమణలు తొలగించి.. నీరు వెళ్లేలా చేసి

షార్ యాజమాన్యం ముందస్తు చర్యలు

సీఐఎస్ఎఫ్ బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించి, తవ్వకాలు జరుపుతూ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పట్టణంలో వర్షపు నీరు వెళ్లేందుకు, మురుగు నీటికి పెద్ద డ్రెయిన్లు లేవు. షార్ యాజమాన్యం ఇంజినీర్లు ఫ్లైఓవర్ వంతెన నుంచి (కోళ్లమిట్ట) వచ్చే నీటిని పంపేందుకు పలుదఫాలు సర్వేలు చేశారు. డిజైన్లు రూపొందించారు. డీవోఎస్ కాలనీ గేటు ముందు వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చిన్నపాటి డ్రెయిన్ నిర్మించారు. అక్కడ నుంచి తరలించేందుకు వీలుగా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

పైపుల పూడ్చివేత

పట్టణంలో షార్ యాజమాన్యానికి చెందిన పలు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ఇందులో ప్రధానమైన శ్రీహరికోట రోడ్డులో చేపల మార్కెట్ ఏర్పాటు చేశారు. వారికి రాజకీయ నేతల వత్తాసు కూడా ఉంది. పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. మరికొందరు కూరగాయాల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆక్రమణలు తొలగించేందుకు షార్ అధికారులు వెళ్తే దుకాణాదారులు వాగ్వాదానికి దిగేవారు.. దాంతో కేంద్ర పారిశ్రామిక భద్రత దళాల బందోబస్తు నడుమ తొలగించారు. వెంటనే యంత్రాలను ఏర్పాటు చేసి, తవ్వకాలు జరిపి, పైపులు పూడ్చేశారు. దీంతో కొంతమేర వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం సుగమమైంది. అదే విధంగా గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల, కోర్టు భవనాల వద్ద నిలిచే మురుగు నీరు కూడా సాఫీగా వెళ్లేందుకు షార్ యాజమాన్యం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే దీనిపై పురపాలక అధికారులతో కలిసి షార్ ఇంజినీర్లు సర్వేలు సైతం చేసిన దాఖలాలు ఉన్నాయి.

కూడలి ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

కోట, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో సోలార్‌తో పని చేసే సీసీ కెమెరాలను పోలీసుల సహకారంతో ఏర్పాటు చేశామని వాకాడు సీఐ హుసేన్‌బాషా, ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. కోట అడ్డరోడ్డు, విద్యానగర్ గాంధీ బొమ్మ సెంటర్‌లో రెండేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కెమెరాలు జిల్లా ఎస్పీ కేంద్రానికి అనుసంధానమై ఉంటాయన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డు ప్రమాదాలు, నిందితుల ఆచూకీ, ఇతర కేసుల్లో సాంకేతికపరంగా ఆధారాలు లభించడం కష్టతరంగా ఉండేది. దీంతో ఎస్సై సిబ్బంది సహకరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సాంకేతికతను తీసుకువచ్చారు.

(c) eenadu

ఈనాడు విశాఖపట్నం

శుక్రవారం 4 జులై 2025 | సిటీ 5

స్వాగత సంబరం

భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత గురువారం విశాఖకు తొలిసారి వచ్చిన పీవీఎన్ మాధవ్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఈశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుతో కలిసి విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీగా (చిత్రాల్లో) కార్యాలయానికి వచ్చారు –ఈనాడు, విశాఖపట్నం

ఉల్లాసం.. రెండింతలు!

పర్యాటక రంగంలో విశాఖ మరో మైలు రాయి దాటనుంది. త్వరలో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ ఏసీ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. సాగర తీర అందాలను అంతెత్తు నుంచి వీక్షించేందుకు అవకాశం ఎప్పుడొస్తుందా అని నగర వాసులు ఎదురు చూస్తున్నారు. బీచ్ రోడ్ నుంచి 'హాప్ ఆన్-హాప్ ఆఫ్' పేరుతో నడిచే ఈ బస్సులు 20 స్టాప్‌ల్లో ఆగనున్నాయి. టికెట్ ధరలు, ఇతర పూర్తి వివరాలు త్వరలో వెల్లడవనున్నాయి. ప్రస్తుతం రెండు బస్సులు సిద్ధం చేస్తున్నారు. పర్యాటక మంత్రి, ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించారు. –ఈనాడు, విశాఖపట్నం

బస్సు లోపల ఇలా..

అడ్డంగా దోచేందుకు.. 'అడుగు'పెట్టారు!!

★ మట్టిపోసే ప్రక్రియలోనూ మతలబే
★ అధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారుకు ప్రయోజనం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగర పరిధిలో పచ్చదనం పెంపునకు జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా... ఆయా పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలా వరకు నిధులు వృథా అవుతున్నాయి. ఈ క్రమంలో అక్రమార్కులతో కొందరు అధికారులు చేతులు కలుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పోసిన మట్టి

రూ.36 లక్షలతో: నగరంలోని పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ స్థలంలోని మూడు చోట్ల మొక్కలు పెరగడానికి వీలుగా **అడుగు మేర నాణ్యమైన మట్టి** పోయడం, బోరు, ఇతర పనులు చేపట్టడానికి రూ.36 లక్షలతో టెండర్ పిలిచారు. ఈ పని ఉద్యానవన విభాగానికి చెందినది. అయినా జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ఉద్యానవన విభాగ నిబంధనల మేరకు చేయించాలి. ఇద్దరు గుత్తేదారులు పని దక్కించుకోవడానికి టెండర్లు దాఖలు చేశారు. అందులో ఒకరికి పనులు దక్కాయి. ప్రతిపాదించిన మొత్తం నిధుల్లో 33 శాతం తక్కువకు...అంటే రూ.24.12లక్షలకు గుత్తేదారు పనులు దక్కించుకోవడం గమనార్హం.

పరిశీలన ఎక్కడ: మొక్కల పెరుగుదలకు అనువైన మట్టిని పోశారా..? లేదా..? అనే అంశాన్ని ఉద్యానవన విభాగం పరిశీలించకపోవడం గమనార్హం. గుత్త సంస్థకు, ఉద్యానవన పొరుగు సేవల సిబ్బందికి మధ్య సత్సంబంధాలు ఉండటంతో నాణ్యమైన మట్టి స్థానంలో రాళ్లతో కూడిన కంకర మట్టి పోసినా... బిల్లుల అనుమతికి దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు.

నివేదిక కోరతాం: 'టెండర్‌లో నిబంధనల ప్రకారం అడుగు మేర మట్టి వేయకుండా పనులు ఆపేయడంతో నోటీసు జారీ చేశాం. ప్రస్తుతం పోసిన మట్టి ఎంత ఎత్తులో ఉందో లెక్క కట్టి, నివేదిక సిద్ధం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం' అని జీవీఎంసీ సహాయ ఇంజినీర్ ఉష పేర్కొన్నారు.

పైపైనే చల్లారు: టెండర్ దక్కించుకున్న వారు మూడు ప్రాంతాలకు ఆరు లారీల్లో మాత్రమే మట్టి తీసుకొచ్చి చల్లారు. అడుగు మేర వేయాల్సిన మట్టిని, అంగుళం ఎత్తులో వేసి వదిలేశారు. మిగిలిన పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు ఆదేశిస్తున్నా... ఆ గుత్తేదారు పట్టించుకోకుండా, బిల్లుల కోసం వైకాపా ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి చేస్తుండటం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారంలో ఇంజినీరింగ్ అధికారులు ఎక్కడా తప్పునకు దొరక్కుండా, ఓ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మరో నోటీసు జారీ చేసి పనిని పూర్తిగా రద్దు చేయడంతో పాటు, గుత్త సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టే అవకాశం ఉన్నా... అధికారులు మాత్రం సమయం చూసి బిల్లులు చేసేందుకే ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత వర్షాలకు పాతమట్టి, పోసిన మట్టి కలిసిపోతుందని గుత్తేదారు అంచనా వేస్తూ.. జాప్యం చేస్తున్నారు.

వర్షానికి పైపైన మట్టి కొట్టుకుపోగా.. కనిపిస్తున్న పాతమట్టి

5న జాతీయ లోక్‌అదాలత్

విశాఖలీగల్, న్యూస్‌టుడే: ఈనెల 5న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రాజు గురువారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ వివాదాలు, రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, బ్యాంకింగ్, బీమా, కార్మిక, కుటుంబ వివాదాలు (విడాకులు మినహా) రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టురట్టు 6లో

'భూ'చోళ్ల చేతిలో 'సీతాకోక చిలుక'?!

- 'పార్కు' స్థలంపై కన్ను
- సొంతం చేసుకునేలా వైకాపా హయాంలో కుయుక్తులు
- కౌన్సిల్ ఆమోదం లేకుండానే మళ్లీ అడుగులు

ఈనాడు-విశాఖపట్నం, కార్పొరేషన్-న్యూస్‌టుడే: మధురవాడ వద్ద ఉన్న సీతాకోక చిలుక పార్కు (బటర్ ఫ్లై పార్కు) భూములపై మళ్లీ ప్రైవేటు వ్యక్తుల కన్నుపడింది. వైకాపా హయాంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు యత్నించినా సఫలం కాలేదు. తాజాగా మళ్లీ వారికి అప్పగించేందుకు అనువుగా మున్సిపల్‌శాఖ ఇటీవల మెమో జారీ చేయడం జీవీఎంసీలో చర్చనీయాంశమైంది.

అసలు కథ ఇది..

మధురవాడలో 1.05 ఎకరాల స్థలం 'లే అవుట్ ఓపెన్ స్పేస్' కింద ఉంది. 2023లో జీవీఎంసీ రూ.1.96కోట్లతో పార్కు నిర్మాణం ప్రారంభించింది. ఈ స్థలానికి వెనుక తగినంత మార్గం లేని రెండు ఎకరాల స్థలం ఉంది. అందువల్ల పట్టణ ప్రణాళిక విభాగం ప్లాను కూడా మంజూరు చేయలేదు. పార్కు పూర్తిగా నిర్మిస్తే తమ స్థలం నిరుపయోగంగా మారుతుందని గ్రహించిన యజమానులు అప్పటి వైకాపా పాలకవర్గాన్ని సంప్రదించారు. ప్రైవేటు స్థలంలో 484.39 చదరపు గజాలు పార్కు కోసం తీసుకుని, రోడ్డుకు ఆనుకుని ఉన్న పార్కు స్థలం తమకు ఇవ్వాలని కోరారు. దీని వల్ల జీవీఎంసీ పార్కు రూపు అస్తవ్యస్తంగా మారుతుంది. ప్రైవేటు వ్యక్తులకు మాత్రం రెండెకరాలకు రోడ్డు పక్క నుంచి దారి వస్తుంది. అక్కడ గజం స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో భారీగా పెరుగుతుంది. ఇలా ప్రైవేటు వ్యక్తుల స్థలం విలువ రూ.20 కోట్ల నుంచి ఒక్కసారిగా రూ.150 కోట్లకు పెంచుకునేలా అప్పట్లో పావులు కదిలాయనే ఆరోపణలున్నాయి.

జీవీఎంసీ నిర్మించిన పార్కు ఇదే

1 **కౌన్సిల్ వేదికగా పోరాటం:** 'సీతాకోక చిలుక' పార్కుకు చెందిన స్థలం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వవద్దని కౌన్సిల్ వేదికగా తెదేపా, జనసేన పోరాడాయి. అయినా వైకాపా కార్యవర్గం స్థల మార్పిడి అంశాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. దానిని సవాల్ చేస్తూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోర్టును ఆశ్రయించారు. దీంతో స్థల మార్పిడి ప్రక్రియ నిలిచిపోయింది. ప్రతిపాదనలను తిరస్కరించినట్లు 2024లో ప్రభుత్వం మెమో జారీ చేసింది. స్థలం మార్చడానికి ఎలాంటి తదుపరి చర్యలు తీసుకున్నా, తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.

2 **మళ్లీ ఇప్పుడు:** ఈ పార్కు స్థలం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వదలిస్తే మళ్లీ కౌన్సిల్ ఆమోదం తరువాత ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. అయితే కౌన్సిల్ ఆమోదం లేకుండా ఈ ఏడాది మే నెలలో మెమో జారీ కావడం గమనార్హం. సీతాకోక చిలుక పార్కుకు చెందిన స్థలం 484.39 చదరపు గజాలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి అనువుగా తదుపరి చర్యలు చేపట్టాలనేది అందులోని సారాంశం. ఈ వ్యవహారం మున్సిపల్, జీవీఎంసీ అధికారులకు తప్ప బయట వ్యక్తులకు తెలియకుండా గోప్యత పాటించారు. జీవీఎంసీకి నష్టం కలిగే ఈ తరహా వ్యవహారాలను ప్రభుత్వం నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు.

'పరశురామ' జగన్నాథుడు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం టర్నర్‌చౌల్ట్రీలో జరుగుతున్న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారు పరశురామ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామికి పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఈఓ టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీస్, యూనియన్ బ్యాంక్ బిల్డింగ్, 1వ అంతస్తు, సీతమ్మధార, విశాఖపట్నం-530013. ఫోన్: 0891- 2546717.
ఇ-మెయిల్ ఐడి : operations.vizag@unionbankofindia.bank
లీజు కొరకు ఆవరణ కావలెను
www.unionbankofindia.co.in/tenders.gov.in
సం/- రీజనల్ హెడ్

అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆదేశం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో వార్డు స్థాయిలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేసి జోనల్ కమిషనర్లు సమర్పించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. పట్టణ ప్రణాళికాధికారులు, వార్డు కార్యదర్శుల సహకారంతో ఆయా పనుల ప్రతిపాదనలు ఉండాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రతి వార్డులో రెండు ప్రధాన రహదారుల విస్తరణకు ప్రతిపాదించాలని, భోగాపురం ఎయిర్‌పోర్టును అనుసంధానించే 15 రహదారులు అందులో ఉండాలన్నారు. ఓ పార్కులో, ఓ ప్రధాన రహదారిలో పచ్చదనం అభివృద్ధికి, ప్రతి వార్డులో ప్రధాన కూడలి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఉక్కులో తగ్గిపోతున్న ఉద్యోగుల సంఖ్య



ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : కొన్ని రోజులుగా కొనసాగుతున్న స్వచ్ఛంద, ఉద్యోగ విరమణల నేపథ్యంలో విశాఖ ఉక్కులో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య 10,377కు చేరింది. వీరిలో అధికారులు 3,131, కార్మికులు 7,246 మంది ఉన్నారు. 2010లో 17,830 మంది ఉద్యోగులు ఉండేవారు. మరో వైపు 2025 చివరి నాటికి 5,002 మంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. 2026లో 1,438 మంది, 2027లో 1,411 మంది, 2028లో 1,357 మంది, 2029లో 997 మంది, 2030లో 626 మంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం కర్మాగారంలో బ్లాస్ట్ ఫర్నేస్-3 నడుపుతున్నా అందుకు తగినంత మంది ఉద్యోగులు లేకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన నెలకొంది. అవసరానికి తగినట్లుగా ఉద్యోగుల నియామకం చేపడితే ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం కర్మాగారం మంచి ఫలితాలు సాధిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

అభ్యంతరం లేదంటే.. ఇక ముందుకే!!

అందరికీ అందుబాటులోకి విస్తరణ ప్రతిపాదిత రోడ్ల వివరాలు
'వీఎంఆర్‌డీఏ' బృహత్తర ప్రణాళికపై వినతుల స్వీకరణ గడువు పెంపు

ఈనాడు, విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)-2041 బృహత్తర ప్రణాళిక రూపకల్పన అస్తవ్యస్తంగా సాగింది. రహదారులను ఎక్కడెక్కడ... ఏ మేరకు ప్రతిపాదించారో తెలియక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. వార్డు కార్పొరేటర్లదీ అదే పరిస్థితి. ఎంతమేర స్థలాలు కోల్పోవాల్సి వస్తుందో కూడా తెలియడం లేదు. ఈ మాస్టర్‌ప్లాన్ పునః పరిశీలనకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు గత నెలతో గడువు ముగియగా తాజాగా ఈ నెల 17వ తేదీ వరకు పెంచారు. అసలు రోడ్లపై స్పష్టత వస్తేనే అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం కలుగుతుందని ప్రజలు చెబుతున్నారు. వాటిపై అవగాహన కూడా కల్పించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన వివరాలను వీఎంఆర్‌డీఏ అందుబాటులో ఉంచింది.

'2041 బృహత్తర ప్రణాళిక'లో ప్రతిపాదించిన తీరిది: ★ వాల్తేరు వార్డులోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి నౌరోజి రోడ్డును కలిపే మార్గం ప్రస్తుతం 12 మీటర్లుగా ఉంది. 2041 ప్రణాళికలో 30 మీటర్లకు ప్రతిపాదించారు.

★ గాజువాక నుంచి మద్దిలపాలెం కూడలి వరకున్న రోడ్డు కొన్ని చోట్ల 30, మరికొన్ని చోట్ల 40 మీటర్లుంది. దీన్ని రెట్టింపు చేయాలనుకున్నారు.

★ 24 నుంచి 30 మీటర్ల వెడల్పుతో ఉన్న అనకాపల్లి-గాజువాక, మద్దిలపాలెం-ఆనందపురం రోడ్లను 80 మీటర్లకు విస్తరించాలని నిర్ణయించారు. ★ జగదాంబ కూడలి నుంచి ఆర్కే బీచ్ వరకున్న 18 మీటర్ల రోడ్డును 30 మీటర్లకు; ★ దత్‌ఐలాండ్ నుంచి ఆశీల్‌మెట్ట కూడలి వరకు 24 మీటర్ల వెడల్పుతో ఉన్న రోడ్డును 45 మీటర్లకు; ★ గోశాల నుంచి వేపగుంట వరకు 30 నుంచి 36 మీటర్లతో ఉన్న మార్గాన్ని 60 మీటర్లకు; ★ 18 మీటర్ల తాటిచెట్లపాలెం కూడలి-రైల్వే స్టేషన్ రోడ్డును 45 మీటర్లకు; ★ 18 మీటర్ల అక్కయ్యపాలెం-రైల్వే న్యూకాలనీ మార్గం 30 మీటర్లకు, పెదవాల్తేరు-సిరిపురం రోడ్డును 30 మీటర్లకు; ★ వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా-బీచ్ రోడ్డును 18 మీటర్ల నుంచి 30 మీటర్లకు విస్తరించాలని ప్రతిపాదించారు.

ప్రత్యేకంగా స్వీకరిస్తాం..

2041- బృహత్తర ప్రణాళికపై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంచాం. ఇప్పటివరకు 2 వేల అభ్యంతరాలు వచ్చాయి. వీటి పరిశీలనకు ప్రభుత్వం ఏడుగురితో కమిటీ ఏర్పాటు చేసింది. వీరు అభ్యంతరాలను నిశితంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. నగర పరిధిలో కీలకమైన 31 రహదారులకు సంబంధించి ప్రతిపాదనలు చేశారు. ఎక్కడెంత విస్తరిస్తున్నారో అందరికీ తెలియజేస్తున్నాం. ఈ నెల 16, 17 తేదీల్లో విశాఖ జిల్లాకు సంబంధించి ప్రత్యేకంగా వినతులు స్వీకరిస్తాం. ఈసారి వచ్చిన అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరిస్తాం' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు.

మ్యూల్ ఖాతాల సరఫరా నిందితుల అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: తక్షణ లోన్ యాప్‌ల కోసం మ్యూల్ బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు విశాఖ సైబర్ క్రైం పోలీసులు గురువారం తెలిపారు. ఇటీవల మ్యూల్ ఖాతాల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న కశింకోటకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి ద్వారా రాబట్టిన సమాచారం మేరకు విశాఖ సైబర్ క్రైం పోలీసులు సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో బెంగళూర్‌లో ఓ ముఠాపై దాడులు నిర్వహించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్‌కు చెందిన 13 మంది నిందితులను అదుపులోకి తీసుకుని విశాఖలో రిమాండ్‌కు తరలించారు. 57 చరవాణులు, 137 ఖాతాలు, 11 ల్యాప్‌టాప్‌లు, 132 ఏటీఎం కార్డులు, 4 సీసీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆగస్టు ఒకటి నుంచి ఆర్మీ నియామక ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ 'అగ్నిపథ్'లో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు ఉన్న జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరుకావొచ్చని పేర్కొన్నారు.

సంస్కరణల అమలుకు ప్రాధాన్యం

ప్రసంగిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ అత్యంత కీలకమైన నగరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలన్నీ అమలు చేస్తున్నామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. హరియాణా పర్యటనకు వెళ్లిన ఆయన గురువారం అక్కడ నిర్వహించిన సదస్సులో పాల్గొని... 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. స్వచ్ఛభారత్ అభియాన్, మురుగునీటి నిర్వహణ, సౌర విద్యుత్తు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, వ్యర్థాల నుంచి విద్యుత్తు తయారీ, నగర సుందరీకరణ.. తదితర అంశాలపై మేయర్ వివరించారు. ఇటీవల నగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమ విశేషాలను మేయర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

(c) eenadu

కేజీహెచ్‌లో నీటి శుద్ధి కేంద్రాలు ప్రారంభం

రూ.1.28 కోట్లు అందించిన దివీస్ సంస్థ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో రోగులు, వారి సహాయకులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు వీలుగా 8 ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. దివీస్ ల్యాబొరేటరీస్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.1.28 కోట్లు ఖర్చు చేసి సిద్ధం చేసిన ప్లాంట్లను గురువారం ఉదయం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం రూ.45 లక్షలతో ఓపీ విభాగం వద్ద నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దివీస్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ఆసుపత్రి అభివృద్ధికి సాయం అందిస్తామన్నారు. ప్రారంభోత్సవంలో దక్షిణం తెదేపా బాధ్యులు సీతంరాజు సుధాకర్, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం.సంధ్యారాణి, దివీస్ సంస్థ జీఎం వైఎస్.కోటేశ్వరరావు, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, వైద్యాధికారులు శ్రీహరి, రాధాకృష్ణ, వాసవీలత, రమణ, బంగారయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వైద్యాధికారులు వాణి, సంధ్యాదేవి, దివీస్ సంస్థ ప్రతినిధులు

అమరావతిలో మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా పర్యటన

సింధియా, న్యూస్‌టుడే : ఏపీ, తెలంగాణ సంయుక్త రాష్ట్రాల జనరల్ ఆఫీసర్-కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా గురువారం అమరావతిలో పర్యటించారు. గవర్నర్, విద్యాశాఖమంత్రి, పలువురు అధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి మాజీ సైనికుల సంక్షేమం, ఏపీ భద్రతలో సైనిక సహకారం వంటి అంశాలపై సంభాషించారు. విద్యా శాఖామంత్రి నారా లోకేశ్‌తో ప్రత్యేకంగా సమావేశమై సైనిక పాఠశాలల స్థాపన, పనితీరుపై చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌తో పాలనలో సంక్షేమం, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాతో శాంతి భద్రతలు, నిఘా సమాచారం తదితర అంశాలపై చర్చించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి.

జ్ఞాపిక అందిస్తున్న రాష్ట్రమంత్రి నారా లోకేశ్

ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా

◆ కూటమి నాయకులతో కలిసి పనిచేస్తా
◆ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్
◆ విశాఖలో అభిమానుల భారీ స్వాగత ర్యాలీ

ఈనాడు-విశాఖపట్నం, పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 'నన్ను గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. రాష్ట్ర అధ్యక్షుడిగా శక్తివంచన లేకుండా పనిచేస్తాను. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాను' అని భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత గురువారం తొలిసారి విశాఖ వచ్చిన ఆయనకు విమానాశ్రయం నుంచి భాజపా శ్రేణులు, అభిమానులు భారీ స్వాగత ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, భాజపా ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఈశ్వరరావు, సెయిల్ డైరెక్టర్ సాగి విశ్వనాథ్‌రాజు, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తొలుత విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. మాధవ్ మీడియాతో మాట్లాడుతూ... కూటమి నాయకులతో కలిసి సమష్టిగా పనిచేస్తానన్నారు. భాజపాలో కార్యకర్తలకు సైతం సముచిత స్థానం దక్కుతుందన్నారు. భారతీయ జనతా యువ మోర్చా, భారతీయ మహిళామోర్చా, దళిత, గిరిజన, కిసాన్ మోర్చా, ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు భారీ స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఎన్ఏడీ నుంచి తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం 80 అడుగులరోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు, సిరిపురం, పెదవాల్తేరులోని భాజపా కార్యాలయం వరకు కూడళ్లలో గజమాలలతో స్వాగతం పలికారు. అభిమానులు, కార్యకర్తలు రోడ్లకు ఇరువైపులా నిలిచి పూల వర్షంతో బ్రహ్మరథం పట్టారు.

ద్విచక్ర వాహన ర్యాలీలో అభిమానులు

అభిమానుల మధ్య మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్

అందరి ఆశీస్సులతోనే: విమానాశ్రయం నుంచి ర్యాలీగా లాసన్స్‌బేకాలనీలోని భాజపా కార్యాలయానికి మాధవ్ చేరుకోగా.. ఆయనకు నాయకులు సురేంద్రమోహన్, తదితరులు స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వదించారు. మాధవ్ మాట్లాడుతూ అందరి ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. త్వరలో కేంద్రమంత్రులు విశాఖ వస్తున్నారని, వారితో మాట్లాడి నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గతంలో ఒకసారి విశాఖ మేయర్ పదవి దక్కించుకున్నామని, ఇప్పుడు అదే స్ఫూర్తితో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకెళ్లాలని కోరారు.

నేటి నుంచి మత్తు వైద్యుల సదస్సు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : మత్తు వైద్యశాస్త్రంలో అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్స విధానాలపై గురువారం కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యశాలను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజీ (ఐఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. కేజీహెచ్‌తో పాటు నాలుగు ప్రైవేటు ఆసుపత్రుల్లో... సిజేరియన్ విధానాలతో పాటు మత్తు వైద్యం, ఆధునిక పద్ధతులు వివరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పలువురు మత్తు వైద్య నిపుణులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐఎస్ఏ రాష్ట్ర సంఘం 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 4 నుంచి 6 వరకు పీఎంపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో దక్షిణ భారతదేశ స్థాయి వైద్యుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో పలు రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది మత్తు వైద్య నిపుణులు హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక ప్రతినిధులు, వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఎ.రవి, డాక్టర్ కె.కూర్మనాథ్, డాక్టర్ వి.సుచేతబాబు, డాక్టర్ మదన్‌రెడ్డి, డాక్టర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యశాలను ప్రారంభిస్తున్న ఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, చిత్రంలో నిర్వాహక ప్రతినిధులు డాక్టర్ కె.కూర్మనాథ్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రవి, తదితరులు

చరిత్ర పుటల్లో... సంగ్రామ ఘట్టాల్లో..

◆ అయినా...'పాండ్రంగి'పై చిన్నచూపే
◆ విప్లవ వీరుడు అల్లూరి పుట్టిన ఊరిలో పరిస్థితిది!

పద్మనాభం, న్యూస్‌టుడే: భరతమాత ముద్దు బిడ్డ. విప్లవాన్ని రగిలించిన అఖండ వీరుడు. ఆంగ్లేయులపై స్వాతంత్ర్య సమరాన్ని సాగించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆయన 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలో జన్మించారు. ఆయనలోని తెలుగు వీరుడి చరిత్రను భావి తరాలకు అందించేలా నేటికీ ఆ గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయలేదు. నేడు అల్లూరి జయంతి. ఈ సందర్భంగా పాండ్రంగి అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు గుర్తు చేస్తున్నారు.

పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం

నాలుగేళ్లుగా నిర్మాణ దశలోనే మ్యూజియం

శత జయంతికి ఓ వెలుగు: దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సమరయోధుల గౌరవార్థం వివిధ సంస్థలు, ప్రాజెక్టులకు వారి పేర్లు పెట్టి చిరస్థాయిగా నిలిచిపోయేలా ప్రభుత్వాలు కొన్ని చోట్ల చర్యలు చేపట్టాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామ రాజు స్వగ్రామం మాత్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఆయన జయంతి, వర్ధంతి వేడుకలకు విచ్చేసే నాయకులు హామీలివ్వడం తప్ప చేసింది శూన్యం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం మినహాయింపు కాదు. 1996లో పాండ్రంగిలో ప్రభుత్వం అల్లూరి శత జయంతి ఉత్సవాలను నిర్వహించింది. ఆ గ్రామం కొంత వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి నాయకులు, అధికారులు జయంతికి వచ్చి వెళ్లిపోవడం తప్ప ఆ తర్వాత మహనీయుడిని స్మరించుకున్న సందర్భాలు చాలా అరుదు.

నలుగురు ఎమ్మెల్యేలు

భీమిలి నియోజకవర్గంలో సమితుల తర్వాత ఇప్పటి వరకు నలుగురు ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఇందులో అత్యధికంగా పాండ్రంగి గ్రామానికి చెందిన ఆర్.ఎస్.డి.పి. అప్పలనరసింహరాజు (తెదేపా) 20 సంవత్సరాలు పదవుల్లో ఎన్నికయ్యారు. తర్వాత కర్రి సీతారాం, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు ఎమ్మెల్యే పదవులు పొందారు. వీరందరి హయాంలో పాండ్రంగిలో అల్లూరి సామాజిక వేదిక, విగ్రహం, జన్మ గృహం పునర్నిర్మాణం తప్పితే చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ లేదు. పర్యాటకులు వచ్చినా వీటిని చూసి వెళ్లిపోవడం తప్ప కనీసం ఆతిథ్యం గురించి తెలుసుకునేందుకు మ్యూజియం సైతం లేదు. ఇంకా చెప్పాలంటే కూర్చోవడానికి సిమెంట్ బెంచీలూ లేవు. దీంతో వచ్చిన వారు ఎంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించాలంటే పాండ్రంగి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమలకు అనుగుణంగా పాలిటెక్నిక్‌లో మార్పులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: రానున్న విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల పాఠ్య ప్రణాళికలో సవరణలకు సంబంధించిన కార్యశాలను నగరంలోని దసపల్లా హోటల్‌లో గురువారం నిర్వహించారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సాంకేతిక విద్యాశాఖ సంయుక్త డైరెక్టర్ వి.పద్మారావు వర్చువల్‌గా ప్రారంభించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ జి.వి.రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామీణ, కార్పొరేట్ విద్య ప్రమాణాల సామర్థ్యాను తెలియజేయాల్సిన అవసరాన్ని వివరించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వి.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పాఠ్యాంశాలకు సంబంధించిన తొమ్మిది దశల సవరణలను తెలియజేశారు. అకడమిక్ సంయుక్త కార్యదర్శి ఎ.రవికుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాలను రూపొందించాలని కోరారు. శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టు వర్క్స్, ఇంటర్న్‌షిప్, కేస్ స్టడీస్, పరిశ్రమ శిక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 62 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్ వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏయూ ఆర్జేడీ జి.వి.రామచంద్రరావు, చిత్రంలో డాక్టర్ ఎం.ఎ.రామకృష్ణ, జి.వి.వి.సత్యనారాయణమూర్తి తదితరులు

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే : లారీని నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి ఏడాది పాటు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల జైలుశిక్ష అదనంగా అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు. న్యాయస్థానం సీనియర్ సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ గురువారం అందించిన వివరాలివి. సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ పి.అప్పలరాజు 2022 డిసెంబరులో విశాఖ పోర్టు ప్రాంగణంలో లారీని నిర్లక్ష్యంగా నడిపి, మరో లారీ డ్రైవర్ జనార్దన్ షా మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటనపై హార్బర్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు అప్పలరాజుకు పైవిధంగా శిక్ష విధించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్స్ అయినటువంటి కృష్ణానగర్ రెసిడెంట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మధురవాడ. రి.నెం. 1336/96 సంఘ సభ్యులకు తెలియజేయునది ఏమనగా, ఈ సంఘంలో ఉంటూ లేఅవుట్‌కు సంబంధించిన స్థలాలను అతి తెలివిగా వేరొకరికి మన ప్లాట్స్‌ను, ఖాళీ స్థలాలను అమ్మజూపుచున్నట్లుగా తెలియవచ్చింది. కొందరు వ్యక్తులు కలిసి మన అసోసియేషన్‌కు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లుగా తెలియవచ్చింది. ఈ లేవుట్‌లో ఇనాం భూయజమానులు అయిన వడ్డేరాజు శ్రీరామమూర్తి దాసు, పాపయ్యదాసు వార్లకు ఈ లేఅవుట్ స్థలాల్లో ఉన్న, ఇనాం భూములపై కోర్టులను ఆశ్రయించవలసినదిగా వారు కోరియున్నారు. ఈ సంఘ సభ్యులు కోర్టు నుండి పొందిన కాపీలు మన అసోసియేషన్‌కు తెలియకుండా అడ్డుకుంటూ, మనకి అందకుండా కొందరు వ్యక్తులు మనల్ని కోర్టులో ఎక్స్ పార్టీలుగా చిత్రీకరించియున్నారు. కావున సంఘ సభ్యులకు తెలియజేయునది ఏమనగా తక్షణం కార్యదర్శి సి.హెచ్. రామ్మోహనరావు గారిని కలిసి కోర్టు కాపీలను చూసుకొని, మీ సహాయ సహకారాలు అందిస్తూ (ఈ కోర్టులలో వేసిన సమాచారం మేరకు దానిలో మీ ప్లాట్స్/ స్థలాలు యొక్క స్థలాలు ఉన్నవి, లేనివి తెలుసుకోవలసినదిగా కోరడమైనది) మరియు 22ఎ, ప్రొసీడింగ్ కాపీలను పొందవలసినదిగా కోరడమైనది. ఈ విషయంపై నగర పోలీస్ కమీషనర్ గార్కి కంప్లెయింట్ ఇవ్వడం అయినది. శ్రీ బి.వి సత్యనారాయణ గార్కి ఈ లేవుట్లో ఎటువంటి స్థలం/ ప్లాట్ గాని లేవు. కాని కొందరు సభ్యులు ప్రోద్భలంతో ఇ.సి. గా నియమించారు. తదుపరి వీరిని తొలగించడమైనది. ఇప్పుడు మన అసోసియేషన్‌లో వీరిని తిరిగి ఎటువంటి పదవికి ఎన్నుకొనబడలేదు.

కావున పై విషయాలపై సంఘ సభ్యులకు అందరికి పత్రికా ప్రకటన ద్వారా తెలియపర్చుచూ, తే.06-07-2025న ఆదివారం ఉదయం 10 గం॥లకు ప్లాట్ నెం. 3, మిథిలాపురి కోలనీ, మధురవాడలో జరుగు సమావేశమునకు తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.

తేదీ: 03.07.2025

SRINIVAS AJJARAPU, Advocate
D. No. 43-5-54, Railway New Colony,
Visakhapatnam. Pin: 530016.
Mobile: 98481 92978, 94410 58234, 83742 51345

గీతంలో ఎంవీవీఎస్ మూర్తి జయంతి

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎంపీ దివంగత డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి జయంతి గురువారం వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, స్మృతి వనం వద్ద గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, ప్రో-వీసీలు ఆచార్య వై.గౌతమ్‌రావు, డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ఆచార్య డి.గుణశేఖరన్, సలహాదారు ఆచార్య గొల్లు సూర్యనారాయణ, తెదేపా జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలు కళాశాలల డైరెక్టర్లు, సిబ్బంది నివాళులర్పించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ డాక్టర్ మూర్తి గీతం వంటి విద్యా సంస్థను ఉన్నత సరస్వతీ పీఠంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

డాక్టర్ మూర్తి స్మృతి వనం వద్ద గీతం అధ్యక్షుడు శ్రీభరత్, తదితరులు

భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో దేవాదాయశాఖ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దేవాదాయ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భూముల తాజా పరిస్థితులపై ఈనెల 20లోపు నివేదికలు అందజేయాలన్నారు. దేవాదాయ శాఖ పరంగా నెలకొన్న కొన్ని అంశాలను ఆ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జీవీఎంసీ పరిధిలో కొన్ని ఆలయాలకు సంబంధించిన భూములు రహదారుల విస్తరణలో కోల్పోయినందున టీడీఆర్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని, ఇసుకకొండ సత్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

★ పూర్ణమార్కెట్ విఘ్నేశ్వర ఆలయ సమీపంలో శిథిలమైన భవనం పరిస్థితిపై, దక్షిణ నియోజకవర్గంలో దేవాదాయశాఖకు సంబంధించి ప్రత్యామ్నాయ భూముల కేటాయింపుపై, భీమిలి లక్ష్మీనృసింహ స్వామి ఆలయ భూములపై సమీక్షలో చర్చించారు. సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీఓలు శ్రీలేఖ, సంగీత్‌మాధుర్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సర్వేశాఖ ఏడీ సూర్యారావు, తహసీల్దార్లు, సర్వేయర్లు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టురట్టు

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ కొత్తకాలనీలో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారుల బృందం దాడులు చేసింది. స్పిరిట్ స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడ్ని అరెస్టు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వారం రోజుల క్రితం వెయ్యి లీటర్లకు పైగా స్పిరిట్‌తో పాటు నకిలీ మద్యం పోలీసులకు దొరికింది. పలువురిని అరెస్టు చేసి విచారించగా పరవాడ, అచ్యుతాపురంలలోనూ ఈ దందా గుట్టుగా సాగుతోందని నిందితులు చెప్పారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సహాయ కమిషనర్ సుర్జిత్‌సింగ్ ఆధ్వర్యంలో సబ్బవరం, ఎలమంచిలి ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరవాడ కొత్త కాలనీలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజామున 3గంటల వరకు తనిఖీలు చేశారు. ఇక్కడ ఓ ఇంట్లో 50లీటర్ల స్పిరిట్‌తోపాటు సుమారు 200 ఖాళీ మద్యం సీసాలు, మద్యం కలర్ వచ్చే కేరామిల్ లిక్విడ్ డబ్బా, లేబుల్స్, సీసాల కప్పులు, స్టిక్కర్లు, సీసాలకు సీళ్లు వేసే యంత్రం దొరికాయని సబ్బవరం ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. సామగ్రిని స్వాధీనం చేసుకుని, నిందితుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని ఎలమంచిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించామన్నారు. నిందితుడు అచ్యుతాపురంలోని ఓ మద్యం దుకాణంలో పని చేస్తున్నాడని తెలిపారు. ఇందులో ఇంకా ఎవరి పాత్ర ఉంది... వీరికి స్పిరిట్ ఇతర సామగ్రి ఎక్కడి నుంచి వస్తోంది... తదితర వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని సీఐ పేర్కొన్నారు.

స్పిరిట్ డబ్బాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

సీసాల కప్పులకు సీళ్లు వేసే యంత్రం

కారాగారంలో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటు

ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారం ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యసన విముక్తి కేంద్రం (డి-అడిక్షన్ సెంటర్)ను గురువారం జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్ ప్రారంభించారు. మత్తు పదార్థాలకు బానిసలైన ఖైదీలకు ఆ వ్యసనం మాన్పించడానికి ఇక్కడ చికిత్స అందిస్తారు. నిద్ర పట్టకపోవడం, తదితర మత్తు సమస్యల నుంచి బయటపడేలా చేస్తారు. కారాగారంలో ఎక్కువ శాతం ఖైదీలు గంజాయి, మద్యానికి బానిసలుగా మారి నేరాలకు పాల్పడినవారే. వారిని ఇప్పటి వరకు పెదవాల్తేరులోని మానసిక వైద్యాలయానికి తీసుకువెళ్లి చికిత్స చేయించేవారు. గత ఏడాది హోంమంత్రి వంగలపూడి అనిత కేంద్ర కారాగారాన్ని సందర్శించినప్పుడు కారాగారంలో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రితో మాట్లాడతామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం ఏర్పాటు కావడంతో ఖైదీలకు ఇక్కడే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తామని కారాగార అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్, కారాగార పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు, ఉప పర్యవేక్షణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసన విముక్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంజనీకుమార్

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Creta 2022 Run 72000 Diesel * TATA Punch 2022 Run 7000 Petrol Owner Dirven for Sale. ✆ 9849113313, 8333859555.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

HEALTH & CARE

మందు మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు విశాఖపట్నం : హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావుల మదుం జంక్షన్ వద్ద. ప్రతీనెల 5, 19 తేదీల్లో మందులు.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I Sethi Sobha W/o. Sethi Vijay, Previously called as Sobha Setti residing at 44-7-1/24/49, Alluri Seetharamaraju Nagar, Thatichetlapalem, Visakhapatnam-530016. A.P. Now changed my name from Sobha Setti (Old Name) to Sethi Sobha (New Name) Henceforth I will be called as Sethi Sobha for all Purposes.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar+ G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

MVP COLONY

We have beautiful House Villa at Pedawaltair, Near Visakha Eye Hospital build 197 S.Y. Land Construction 2,900 Sq. Feet. North Facing with Interiors and Cupboards. Ph.: 8500337456.

GENERAL

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేకి ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

ANANDAPURAM

ఆనందపురం పూలమార్కెట్ సమీపంలో గొట్టిపల్లి ఊరుని ఆనుకొని పంచాయితీ లేఅవుట్ B.T. రోడ్డు, కరెంటు, కాంపౌండ్ వాల్ మొ॥ సౌకర్యాలతో 100 గజాలు 11 లక్షలు మాత్రమే. 9652635807.

PENDURTHI

పెందుర్తి జుత్తాడ మరియు రాజయ్యపేటలలో వుడా LRS కలిగిన స్థలములు మరియు నూతన గృహములు అమ్మకానికి కలవు. ✆ 9032038026, 8309303120.

GENERAL

Prime Site 72 & 54 Cents at Dabbanda Near Simhachalam 18km from RTC Complex, Vizag. Contact: 8333859555, 9440320255.

LEASE/ RENT

GENERAL

Parawada Main Road 1700 Sft. each Floor under Construction for Long Lease. Suitable for Banks/ Showrooms etc. 9849261662.

JOBS

Wanted Marketing Manager, 5 Year Experience in MS (ERW), Iron Coil Pipes, Best Pay & High Incentives Cont : 9666341234.

Wanted Godown Boy and Accountant with Tally, Minimum Experience @ Dabagardens, Vizag. Ph: 9885721646.

Delivery Boys Wanted Visiting Card Co. - Vizag Salary 13K - 15K + Petrol Speak Telugu, Hindi. Call : 9887840205.

Wanted Office Assistant Female with knowledge of Cash, minimum Accounts and Computer knowledge. 8.30 AM to 6 PM. Contact: 9393003003.

Wanted Marketing Executives & Courier Pick-up Boys for International Couriers Vizag. ✆ 9963946991, 9966052040.

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth, M/F, Part/ Full excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

JOB OPPORTUNITY
Our Esteem Org. The following jobs to work for our upcoming new branches at Visakhapatnam.
❖ CHIEF ADMINISTRATIVE OFFICERS: Posts-6
Qlf: Retd. Managers in any Dept. & Sector.
Monthly package: 1,25,000/- PM
❖ TEAM LEADERS: Posts-12
Qlf: Min. 1 year Exp. in any Organisation.
Age: 30 yrs & above
Monthly Package: 80,000/-
❖ CUSTOMER SUPPORTING MANAGERS: Posts-15
Qlf: 1 Year exp. in any Business sector.
Age: 30 years & above
Monthly Package: 60,000/-
Note: 1. Appoint immediately 2. Interviews at Board Room
On: 4th & 5th- JULY
Con: M.B.N. SATYANARAYANA
A.S.R. NAGAR-VIZAG.
Ph: 9848197936

బ్రాంచ్ మేనేజర్ & అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ (విజయనగరం & విశాఖపట్నం) కనీసం 3 సం॥లు బ్యాంకింగ్/ NBFC/ ఇన్సూరెన్స్/ చిట్ ఫండ్స్ మొ॥ అనుభవం కలవారు కావలెను. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులకు అవకాశం కలదు. ఆకర్షణీయమైన జీతంతో పాటు ఇన్సెంటివ్స్ + PF + T.A., హెల్త్ ఇన్సూరెన్స్ కలవు. వర్చువల్ ఇంటర్వ్యూ (ZOOM) 4,5 & 6 జులై 2025 ఉ॥ 10 గం॥ నుండి సా॥ 5 గం॥ వరకు. మీ Resume Whatsapp చేయగలరు. ఫోన్: 97057 09977.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలికాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

Study Power (Education Loans) నందు పనిచేయుటకు Staff మరియు కమిషన్ based Agents కావలెను. ✆ 8977731868.

ప్రైవేటు బ్యాంకులో పనిచేయుటకు క్లర్క్స్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, BDM, CRMS కావలెను. జీతం: 18K, స్పాట్ జాయినింగ్ ✆ 7995439539.

ఫైనాన్స్ రంగంలో అనుభవం గల వైజాగ్ బ్రాంచ్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను (Age: 40 yrs.) & వైజాగ్ సిటీ, అనకాపల్లి, గాజువాక, చోడవరం ఏరియాలలో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను & ఆఫీస్ స్టాఫ్ (Male) Age: 35, (కంప్యూటర్ నాలెడ్జి) పనిచేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్స్+ TA ఇవ్వబడును. రాఘవ ఆటో ఫైనాన్షియర్స్, దొండపర్తి, వైజాగ్. ✆ 7680880513, 9100902198.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ (M/F) కావలెను. జగదాంబ ఏరియాలో పనిచేయుటకు. జీతము: 14,000/- & ఇతర సదుపాయాలు కలవు. ✆ 8179552684, 9966682926.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

'స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్' చేతికి వైజాగ్ జట్టు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) పోటీల్లో తలపడే వైజాగ్ జట్టును స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం కొనుగోలు చేసిందని సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ క్రీడాకారుల్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.మోహిత్‌సాయికుమార్, వైస్ ప్రెసిడెంట్ బి.బన్సిధర్ తెలిపారు.

పోలియో రహిత సమాజమే ధ్యేయం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పోలియో రహిత సమాజ నిర్మాణానికి రోటరీ క్లబ్ నిరంతరంగా శ్రమిస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం జిల్లా గవర్నర్ వై.కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్యాణ్ చక్రవర్తి జ్యోతి వెలిగించి, క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. అనంతరం అధ్యక్షునిగా పీవీ.రఘుపతి, కార్యదర్శిగా వంశీమోహన్‌తో ప్రమాణం చేయించారు. వివిధ జిల్లాల క్లబ్ గవర్నర్లు, సభ్యులు పి.శోభన్‌ప్రకాష్, మధుసూదన్‌రావు, జగన్‌మోహన్‌రావు, వినయ్‌గాంధీ, మణిమాల తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి, తదితరులు

బెట్టింగ్‌లకు బానిసై ఆత్మహత్య

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరిలోవ హెడ్‌కానిస్టేబుల్ చంద్రరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గలావిల్లి గ్రామానికి చెందిన డోల రాము (35) ఏడేళ్ల క్రితం విశాఖ నగరానికి వలస వచ్చాడు. రామాటాకీస్ ప్రాంతంలోని పాతవస్తువుల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక్కడ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో బంధువులు, స్నేహితులు హితబోధ చేసి ఎండాడ ప్రాంతంలో కాపురం పెట్టించారు. కొన్ని రోజులు మామూలుగా ఉన్న రాము తిరిగి వాటికి బానిసై మరిన్ని అప్పులు చేశాడు. భార్య లావణ్య బుధవారం ఇద్దరు కుమారుల్ని తీసుకుని సొంతూరులో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. అప్పుల బాధతో తీవ్ర మనస్తాపంలో ఉన్న రాము రాత్రి ఇంట్లో ఫ్యాను హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం భార్య ఫోన్ చేయగా ఎంతకీ స్పందించకపోవడంతో మరిదిని ఇంటికి పంపించింది. అతను కిటికీలోంచి చూడగా రాము ఉరేసుకుని ఉండడం కనిపించింది. ఈ మేరకు ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు సీఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డోల రాము (పాతచిత్రం)

నకిలీ సిగరెట్ల విక్రయం కేసులో నలుగురి అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నకిలీ సిగరెట్ల విక్రయం, సరఫరాకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'ఇంపీరియల్ టుబాకో కంపెనీ' (ఐటీసీ) సంస్థ గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్, కింగ్స్ తదితర సిగరెట్లను పలువురు డీలర్ల ద్వారా పాన్ దుకాణాలకు సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో రుషికొండ ఐటీ హిల్స్ రోడ్డులో దుకాణం నడుపుతున్న ఎండాడకు చెందిన రాజు ఐటీసీ బ్రాండ్ సిగరెట్ల మధ్య నకిలీవి పెట్టి విక్రయిస్తున్నట్లు సంస్థకు సమాచారం అందింది. ఆయా ప్రతినిధులు బుధవారం దుకాణం వద్దకు వెళ్లి తనిఖీలు చేయగా కొన్ని నకిలీ సిగరెట్ ప్యాకెట్లు లభించాయి. నగరంలోని శంకరమఠం ప్రాంతానికి చెందిన వెంకటరమణ, కోటేశ్వరగుప్త అనే ఇద్దరు వ్యక్తులు తనకు సరఫరా చేస్తున్నారని చెప్పడంతో వారి వద్దకు వెళ్లగా 280 నకిలీ ప్యాకెట్లు దొరికాయి. ఇదే సమయంలో పీఎంపాలెం ప్రాంతానికి చెందిన పొట్నూరు శివను పట్టుకున్నారు. వీరిని పీఎంపాలెం పోలీసులకు అప్పగించడంతో ఎస్సై రాము కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

★ ఐటీసీ సంస్థ గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్టు ప్యాకెట్‌ను దుకాణదారులకు రూ.280కి అందిస్తోందని.. కొందరు నకిలీవి తయారు చేసి ప్యాకెట్ రూ.80 చొప్పున సరఫరా చేస్తున్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమ బ్రాండ్‌కు చెడ్డపేరు తెచ్చేలా మోసానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	72
లైవ్	103	92
డ్రెస్డ్	149	154
స్కిన్‌లెస్	170	164

పెందుర్తి

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే
లక్ష్మీకాంత్ ప్రీమియర్స్-1- జూనియర్ వదల్ (మార్నింగ్, ఫస్ట్ షో), కన్నప్ప (మ్యాట్నీ, సెకండ్ షో) ప్రీమియర్స్-2 - తమ్ముడు

రవీంద్రభారతి పాఠశాల జప్తు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ద్వారకానగర్ రవీంద్రభారతి పాఠశాలను గురువారం జప్తు చేసినట్లు కార్మిక రాజ్య బీమా సంస్థ ఉప ప్రాంతీయ అధికారి జి.వేణుమాధవ్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం తమ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో పాఠశాల భవనాన్ని అటాచ్ కుమార్ తదితరులు జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సంస్థ తప్పకుండా తమ ఉద్యోగులకు చెల్లించాలని ఈఎస్ఐ బకాయిలు వెంటనే జమ చేయాలని సూచించారు.

వేపగుంట- పినగాడి మధ్య 60 అడుగుల రోడ్డు

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తి మండలం వేపగుంట నుంచి పినగాడి వరకు ధ్వంసమైన రహదారి స్థానంలో 60 అడుగుల వెడల్పుతో నూతన రహదారి నిర్మించడానికి ఆమోదం లభించిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అర్బన్, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసేలా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా రహదారి నిర్మిస్తాయని పేర్కొన్నారు. వేపగుంట నుంచి లక్ష్మీపురం రైలు పైవంతెన వరకు రూ.1.40 కోట్ల జీవీఎంసీ నిధులతో, వంతెన నుంచి పినగాడి వరకు వీఎంఆర్‌డీఏ నిధులతో రహదారి నిర్మాణం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా
80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: ప్రహ్లాదపురం సింహాద్రి ఆసుపత్రి సమీపంలో 49వ/11/1 వీధి దీపం వెలగడం లేదు. రాత్రుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - రమణమూర్తి, ప్రహ్లాదపురం ✓: వీధి దీపానికి మరమ్మతులు చేయించి వెలిగేలా చేస్తాం. - హరిపాల్, వీధి దీపాల నిర్వహణ అధికారి

అవీ ఇవీ

దారుల్లో గోతులు.. రాకపోకలకు కష్టాలు..!

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ పరిధి లక్ష్మీనగర్, కిశోర్ లేఅవుట్ కాలనీల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సుమారు ఆయుదు వేల మంది జనాభా నివాసం ఉండే కాలనీల్లో పలు బహుళ అంతస్తు భవనాలు, వ్యక్తిగత గృహాలు ఉన్నాయి. మరిన్ని నూతన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయినా కనీస మౌలిక వసతులు సమకూరడం లేదని నివాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యూజీడీ పనుల కోసం రోడ్లను తవ్వేయడంతో, ఎక్కడికక్కడ అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరుతుండటంతో... రాత్రి సమయంలో ప్రమాదానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి... సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కిశోర్ లేఅవుట్‌లో...

వీఎంఆర్‌డీఏ అధికారుల తీరుపై రైతుల నిరసన

పుడా వివాదాస్పద భూముల్లో నిరసన తెలుపుతున్న రైతులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని వివాదాస్పద వీఎంఆర్‌డీఏ 144 ఎకరాల భూముల విషయంలో అధికారుల తీరును వ్యతిరేకిస్తూ రైతులు గురువారం నిరసనకు దిగారు. ఇక్కడ భూముల్లో రైతులు మొక్కలు నాటుకుంటుంటే వీఎంఆర్‌డీఏ సిబ్బంది అడ్డు చెప్పడమే కాకుండా మొక్కలు వేసిన రైతులపై పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల తీరును ఖండిస్తూ పెద్దఎత్తున రైతులు వివాదాస్పద భూముల్లోకి వచ్చి నిరసన తెలిపారు. వివాదాన్ని పరిష్కరిస్తామని అధికారులు ప్రకటించడం తప్ప ఏ రోజు రైతులతో సమావేశం నిర్వహించలేదన్నారు. ఏ ఉద్దేశంతో ఇక్కడ భూములను చదును చేశారని నిలదీశారు. కొందరు రైతు పెద్దలు మాట్లాడుతూ ఈ భూముల విషయంలో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని ఈ స్థలాల్లోకి రైతులు మినహా ఏ ఒక్కరూ వెళ్లకూడదంటూ ఆర్డర్ తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ దౌర్జన్యంగా అధికారులు వస్తున్నారన్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనువాసరావు, రాపర్తి కన్నా, ముమ్మన దేముడు, గ్రామ పెద్దలు ముత్యాలనాయుడు, గంట్ల దేముడు, సాలాపు రమణ, వార్డు జనసేన మహిళా అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి తదితరులు పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం, అంతకాపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, పెద గొల్లలపాలెం, ఆసకపల్లి, ఇరువాడ, గొట్టివాడ, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలి భీమవరం, అడ్డూరు, పంచాయతీల పరిధిలో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌పై అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: చోడవరం మండలం అడ్డూరు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించనున్న వీఎంఆర్‌డీఏ ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌పై సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ కల్పించనున్న వసతులు, ఆన్‌లైన్ బిడ్డింగ్, అనుమతులపై ఎంపీడీవో పి. పద్మజ, ఈవోపీఆర్‌డీ చైతన్య అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ చైతన్య

బాలికలకు దుస్తుల అందజేత

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే : పెందుర్తి మండలం రాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఫస్ట్ టూ కళాశాల విద్యార్థినులకు నగరంలోని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ చేతుల మీదుగా గురువారం ఏకరూప దుస్తులు అందించారు. వెంకటరమణ గురువు బొబ్బిలి శ్రీరామ్మూర్తి 75వ జన్మదినం సందర్భంగా ఒక్కో విద్యార్థినికి రెండు జతల దుస్తులు సమకూర్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు వెంకటరావు, రాము, కె.జయప్రసాద్, సీతాదేవి, చక్రవర్తి, శ్రీదేవి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు, గురువులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అమృతపురంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. సబ్బవరం మండలం అమృతపురంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబ్జీ హాజరై మాట్లాడారు. వైకాపా హయాంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినప్పటికీ సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. వచ్చే రెండు నెలల్లో అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి వంటి పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికుడు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు, గండి వంశీకృష్ణ, గండి దేముడు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, కొటాన అప్పారావు, రేవుపల్లి రమణ, కోరాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: ఏడాది కూటమి పాలన పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం గురువారం పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో జరిగింది. జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో గ్రామ తెదేపా అధ్యక్షుడు డి.శ్రీధర్, నాయకులు ఎ.బంగారయ్య, డి.సారధి, ఎ.శ్రీను, ఆర్.సురేశ్, కె.రాజు, సీహెచ్.రాంబాబు తదితరులు ఇంటింటికీ వెళ్లారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు అందజేశారు. పార్టీశ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాంపురం ప్రచారంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

బంటాకాలనీలో పోలీసుల తనిఖీలు

కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో పెందుర్తి పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయాన్నే ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పెద్దసంఖ్యలో కాలనీకి చేరుకుని ఇళ్లు, దుకాణాలు, వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరాలు నియంత్రణకు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పోలీసులకు ఏవిధంగా సహకరించాలనే విషయాలను కాలనీవాసులకు సీఐ సతీశ్‌కుమార్ వివరించారు.

గ్రామాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సబ్బవరం, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర-2047ను పురస్కరించుకుని సబ్బవరం మండలం మొగలిపురంలో గురువారం తడి - పొడి చెత్త నిర్వహణపై గ్రామస్థులకు ఎంపీడీవో పి.పద్మజ అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు ఎలా ఇవ్వాలో వివరించారు. అనంతరం సంపద తయారీ కేంద్రం, మంచినీటి ట్యాంకును పరిశీలించారు. క్లోరినేషన్ విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీధి కాలువలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలకడం వంటివి చేయడం వల్ల వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చైతన్య, పంచాయతీ కార్యదర్శి రజని, అంగటి నానాజీ, తమరాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పద్మజ

రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అనేక మేలు జరుగుతోందని, సబ్బవరం మండలం గొట్టివాడ సర్పంచి సాలాపు మీన పేర్కొన్నారు. అన్నదాతలకు రాయితీ విత్తనాలను కిలో రూ.10 చొప్పున అందేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు కావాల్సిన వరి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు ప్రశాంతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బొండా సత్యారావు, సాలాపు వెంకటేశ్వరరావు, చెరువు కమిటీ అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, బొండా శివ, బగ్గు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందజేస్తున్న గొట్టివాడ సర్పంచి సాలాపు మీన

నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడలో నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్‌స్టేషన్ కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ కల్తీ మద్యం దందాపై సమగ్ర విచారణ చేసి దాని వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులను ఎత్తివేయాలని, మద్యాన్ని నియంత్రించాలని కోరారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా ప్రతినిధులు

ఏయూ, ఎన్ఎస్‌టీఎల్ సంయుక్త పరిశోధనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు పనిచేసే దిశగా ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు చర్చించారు. ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో గురువారం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, ఏయూ అధికారులతో ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు వి.ఎఫ్.సాజి, వి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాలరావు సమావేశమయ్యారు. ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగంతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలోని పలు విభాగాలతో సంయుక్తంగా కలిసి పని చేయడంతోపాటు త్వరలో ఒక సాంకేతిక సమ్మేళనం (కాంక్లేవ్) నిర్వహించడంపై సమాలోచనలు జరిపారు. ఎంటెక్ నావెల్ ఆర్కిటెక్చర్(సాయంత్రం కోర్సులో) ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, సిబ్బందికి భాగస్వామ్యం కల్పించాలని ప్రతిపాదించారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఔట్‌రీచ్ డీన్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, అధికారులతో ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు

అనాటమీ మ్యూజియానికి గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్ర వైద్యకళాశాల అనాటమీ విభాగం మ్యూజియానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్ మ్యూజియమ్స్ అండ్ సైన్స్ సెంటర్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది. మ్యూజియంలో ఉన్న స్పెసిమెన్లను ఇప్పటికే విదేశాలకు తీసుకెళ్లి, అవగాహన కార్యక్రమాలు ముగిసిన తర్వాత మళ్లీ వెనక్కి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిశోర్ తెలిపారు.

ఖడ్గమృగం పుర్రె

ఆటోల దొంగల అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆటోలు, బ్యాటరీలు చోరీ చేస్తున్న దొంగలను అరెస్టు చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు తెలిపారు. భీమవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా పేరికిగూడెం గ్రామానికి చెందిన పి.నాగరాజు విశాఖపట్నంలో ఉంటున్నాడు. ఇతను భీమవరం రెండో పట్టణంలోని రెండు చోట్ల ఆటోలను అపహరించాడు. దీనిపై డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సీఐ జి.కాళీచరణ్ దర్యాప్తు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి జాతీయ రహదారిపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఇదే తరహాలో మిగిలిన జిల్లాల్లోనూ ఎక్కడైనా ఆటోలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు ఉన్నాయా అని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆరా తీశారు. అక్కడి నుంచి కూడా దొంగిలించిన ఆటోలను జాతీయ రహదారి మీదుగా విశాఖ వెళ్లినట్లు తేలింది. దాంతో సీసీ కెమెరా ఫుటేజీలో ఉన్న దొంగ కోసం గాలించగా నాగరాజుగా తేలింది. ఇతనిపై మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో గతంలో డీసీ షీట్ ఉండటంతో విచారణ వేగవంతం చేశారు. భీమవరం, ఆకివీడు, అమలాపురం, విశాఖ, మండవల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.17 లక్షల విలువైన 13 ఆటోలను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆటోలను ఓ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

అతని గురించి గాలిస్తుండగా ఇటీవల పెనుమంట్రలో ఆటో అపహరణ సమయంలో త్రుటిలో పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. జిల్లాలోనే ఉంటున్నాడని చరవాణి లొకేషన్ ఆధారంగా గాలించగా తాడేపల్లిగూడెంలోని ఓ లాడ్జిలో బస చేసినట్లు గుర్తించి పట్టుకున్నారు. వివాహానికి ముందు నుంచి దొంగతనాలకు అలవాటు పడిన నాగరాజుకు అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన పి.గణేష్ సహకరించడంతో అతన్ని కూడా అరెస్టు చేశారు.

కేసుల వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ భీమారావు

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: బడి ఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో నరవలోని జామియా ఇస్లామియా అష్రఫుల్ ఎడ్యుకేషన్ సొసైటీ, గవరపాలెం, గొరపల్లి ఎంపీపీ పాఠశాలల పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీల్లో చదువుకునే పిల్లల తల్లితండ్రులకు సూచించి 65 మందిని వివిధ పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌సీవో జి.శ్రీనివాసరావు, అదనపు ఏఎంవో జి.లక్ష్మి, సీఆర్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నరవలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ప్రతినిధులు

ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల స్థితిగతులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరా తీశారు. గురువారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టు పనులు, ఆలస్యానికి గల కారణాలపై అధికారులతో మాట్లాడారు. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టు పనులపై పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్.రవితో చర్చించారు. ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

ఫార్మాలో భద్రతకు మాక్‌డ్రిల్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్ ఫార్మా సంస్థ యూనిట్-3లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్.రావు, హెచ్ఆర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చావ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రొడక్షన్ బ్లాకులోని స్ప్రేడ్రయ్యర్ వద్ద పేలుడు సంభవిస్తే భద్రత తదితర సిబ్బంది ఏవిధంగా స్పందించాలి...ఎలా ప్రమాదాన్ని అదుపు చేయాలి.. సహాయక చర్యలు ఏవిధంగా చేపట్టాలి... గాయపడిన వారిని బయటికి తీసుకురావడం, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తరలించడం తదితర విన్యాసాలు ప్రదర్శించారు. హెచ్ఆర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడేపూడి రామకృష్ణ, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న శివశంకర్‌రెడ్డి తదితరులు

బాక్సింగ్‌లో 'రైల్వే మహిళల' ప్రతిభ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : అఖిల భారత మహిళల బాక్సింగ్ పోటీల్లో భారత రైల్వే బాక్సింగ్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన పోటీలు గురువారం ముగిశాయి. మహిళా బాక్సర్లు జ్యోతి, ఎన్‌బీ.చాను, ప్రచీ, శశిచోప్రా, లాషుయాదవ్, పాథన్, మంజురాణి, నేహా తదితరులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చూపిన వారిలో వివిధ రైల్వే జోన్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి

పరవాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. లంకెలపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అర్జున్, కోటేశ్వరరావు, రామారావు, మూర్తి పాల్గొన్నారు. 77వ వార్డులో జరిగి కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

లంకెలపాలెంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

సర్వర్ మొరాయింపుతో అవస్థలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : సర్వర్ మొరాయిస్తుండటంతో రేషన్ సరకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీంతో కార్డుదారులు గంటల కొద్దీ డిపోల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 610 డిపోల పరిధితో పాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల డిపోల్లో ఇంచుమించు ఒకే సమయంలో సరకుల పంపిణీ జరుగుతోంది. దీంతో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుత రద్దీకి అనుగుణంగా సర్వర్ల సామర్థ్యం పెంచకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువారం నగరంలోని పలు డిపోల వద్ద కార్డుదారుల సరకుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి... ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్డుదారులు కోరుతున్నారు.

పందిమెట్ట ప్రాంతంలోని డిపో వద్ద కార్డుదారులు

గొల్లపేటలో చేతిబోరు ప్రారంభం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం సమీపంలోని గొల్లపేట గ్రామంలో జీవీఎంసీ నిధులు వెచ్చించి చేతిబోరు ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

మూర్తి సేవలు నిరుపమానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెదేపా సీనియర్ నేత, మాజీ ఎంపీ, దివంగత ఎంవీవీఎస్. మూర్తి అందించిన సేవలు నిరుపమానమని విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. గురువారం నగర పార్టీ కార్యాలయంలో మూర్తి జయంతి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కేపీ.నాయుడు, పొలమరశెట్టి శ్రీనివాసరావు, కోరాడ రాజబాబు, సుజాత, ముత్యాలనాయుడు, గాయత్రీ ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ

పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్తివానిపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: సత్తివానిపాలెం ఎస్‌టీబీఎల్ సీతారామాగార్డెన్స్ కాలనీలోని రామాలయం ప్రాంగణంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వారాహి దేవికి సహస్ర దీపాలంకరణ, సామూహిక కుంకుమార్చనలు జరిపారు. శుక్రవారం చక్రార్చన, మూలమంత్ర హవనం, 5న తిరువీధి ఉత్సవం, అభిషేకం, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనాలతో వేడుకలు ముగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆధ్యాత్మికం

వారాహి అమ్మవారికి పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో కొలువైన వారాహి అమ్మవారి సన్నిధిలో గుప్త నవరాత్రులు సంప్రదాయంగా జరుగుతున్నాయి. అర్చకులు గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు.

6న మరిడిమాంబ పండగ

వరలక్ష్మీనగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: వరలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం మరిడిమాంబ(పశువులమ్మ) అమ్మవారి పండుగను ఈనెల 6న ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మూడు రోజుల పాటు జరిపే ఉత్సవాల్లో తొలిరోజు శుక్రవారం గణపతి పూజ, 108 కలశాలతో అభిషేకం, సాయంత్రం మంత్రపుష్ప నీరాజనం, 5న సహస్ర కుంకుమార్చన, సాయంత్రం దీపారాధన, 6న అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు, రాత్రి అనుపోత్సవం ఉంటుందన్నారు.

రామావతారంలో జగన్నాథుడు

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్‌: ఎఫ్‌1
రాములమ్మ: మారాన్‌
డ్రాగన్‌, తాతా : కుబేర
సప్తగిరి : కన్నప్ప

పరశురాముని అవతారంలో జగన్నాథుడు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: రథోత్సవాల్లో భాగంగా భీమిలిలోని జగన్నాథస్వామిని పరశురామునిగా గురువారం అలంకరించారు. భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు చేశారు. గతనెల 26న ప్రారంభమైన రథోత్సవాలు ఆరో తేదీ వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం శ్రీరామావతారం, శనివారం శ్రీకృష్ణావతారం, ఆదివారం రథోత్సవం ఉంటుందన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో గురువారం విజ్డమ్‌ ఫౌండేషన్‌ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ వ్యవస్థాపకులు తలశిల విజయమోహన్‌ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సంస్థ సేవకులు ఫణి, ఉప్పరయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: లక్ష్మీవానిపాలెం(పీఎంపాలెం) ఎస్‌బీఐ బ్యాంక్‌ దగ్గర రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. – పీఎం పాలెం వాసులు, ✓: త్వరలో తారురోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – కనకమహాలక్ష్మి, జోన్‌–2 కమిషనర్‌

?: ఆర్టీఓ లేఅవుట్‌(ముసలయ్యపాలెం)లో ఓ పార్కు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. – ముసలయ్యపాలెం వాసులు, ✓: పార్కు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. – కనకమహాలక్ష్మి, జోన్‌–2 కమిషనర్‌

?: గొల్లల ఎండాడలో పందుల సంచారంతో ఇబ్బంది పడుతున్నాం. – గొల్లల ఎండాడ వాసులు, ✓: పందులను నివారించేలా చూస్తాం. – కిశోర్‌, ఆరోగ్య అధికారి

?: రాజీవ్‌నగర్‌ (ఎండాడ) కొండవాలు ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటాక విద్యుత్‌ వెలుగులు నిలిచిపోతున్నాయి. – చంటి, ఎండాడ ✓: కొందరు ఆకతాయిలతో సమస్య ఏర్పడుతోంది. తక్షణ చర్యలు తీసుకుంటాం. – గాయత్రీ, విద్యుత్‌ ఏఈ

స్పందనకు వందన

గుంతలు పూడ్చారు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి ఎండాడ-రుషికొండ మార్గంలోని రోడ్డు గతుకులమయంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో జీవీఎంసీ యంత్రాంగం స్పందించి సంబంధిత నిధులతో మరమ్మతులు చేపట్టారు.

కదిలిన యంత్రాంగం

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు పరిధి గొల్లల ఎండాడ సమీప గెడ్డలో పశువుల కళేబరాలను గెడ్డలో పడేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సమస్యను 3న 'ఈనాడు'లో 'గెడ్డలో పశు కళేబరాలు.. దుర్వాసనతో ఇక్కట్లు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రవి స్పందించి జేసీబీ సహాయంతో సిబ్బంది కళేబరాలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

మెగా వేడుక.. విద్యా వేదిక
పీటీఎం సమావేశాలకు సమయాత్తం

కొమ్మాది, న్యూస్‌టుడే

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, విద్యాపరంగా సంపూర్ణ అభివృద్ధిని సాధించడానికి మెగా పీటీఎం-2.0 (పేరెంట్స్‌, టీచర్స్‌ మీటింగ్‌) కార్యక్రమాలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సమగ్ర శిక్షా అభియాన్‌ జులై 10వ తేదీన నియోజకవర్గం పరిధిలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాల పరిధిలో 'మెగా వేడుక'గా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది.

★ గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లోనే ఈ సమావేశాలను కొనసాగించారు. ఈ సారి జూనియర్‌ కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల్లోనూ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశంలో కమిటీ బృందం

★ **అవగాహన కల్పిస్తూ..:** జులై 10న తల్లిదండ్రులు, దాతలు, యాజమాన్య కమిటీ సభ్యులతో ఉపాధ్యాయులు, అధికారులు సమావేశం నిర్వహిస్తారు. విద్యార్థుల సమగ్ర పురోగతి నివేదిక, పాఠశాల ప్రగతి వివరాలతో పాటు పిల్లల ఆరోగ్య విషయాలను వివరిస్తారు. తల్లికి వందనం, మనబడి మ్యాగజైన్‌, విద్యా సంబంధిత అంశాలపై చర్చిస్తారు. తల్లులకు రంగవల్లులు, మ్యూజికల్‌ ఛైర్స్‌, తండ్రులకు టగ్‌ ఆఫ్‌ వార్‌ తదితర పోటీలు నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మాదకద్రవ్యాలపై అనర్థాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తారు. మధ్యాహ్నం శుభతిథి పేరిట సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేస్తారు. పండగలా ప్రతి పాఠశాలలో ఈ మెగా వేడుకను నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఆయా యాజమాన్య కమిటీలతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి ఏర్పాట్లపై సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

★ **సందడిగా నిర్వహించేలా..:** రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు కలిగిన చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గురువారం తల్లిదండ్రుల కమిటీతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు సారథ్యంలో ఛైర్మన్‌ అచ్యుత్‌రావు, కమిటీ సభ్యులు పలు అంశాలపై చర్చించారు. పీటీఎం వేడుకను పండగలా చేసేందుకు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులతో పలు కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు.

టూరిజం యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి

ఎండాడ, సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: విశాఖలో త్వరలోనే టూరిజం యూనివర్సిటీ నెలకొల్పడానికి చర్యలు చేపడతామని మంత్రి కందుల దుర్గేష్‌ పేర్కొన్నారు. పర్యాటక రంగానికి ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాగర్‌నగర్‌ సమీప సన్‌ ఇంటర్నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజం అండ్‌ మేనేజ్‌మెంట్‌ను మంత్రి దుర్గేష్‌, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి గురువారం సందర్శించారు. ఎమ్మెల్యే గంటా, సన్‌ సీఎండీ జాస్తి శ్రీకాంత్‌లతో కలిసి విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. టూరిజం రంగ ప్రాధాన్యత, ఉపాధి వంటి అంశాలపై చర్చించారు. సన్‌ విద్యా సంస్థల ప్రగతిని సంబంధిత ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ జాస్తి ఆశా వివరించారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్‌, ఎమ్మెల్యే గంటా తదితరులు

చినుకు పడితే చిత్తడే..

కొమ్మాది, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులున్న పాఠశాలల్లో చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఒకటి. అలాంటి చోట విద్యార్థులు ఆటలు ఆడేందుకు సరైన క్రీడా మైదానం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి మైదానమంతా బురదతో దర్శనమిస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లాలన్నా, ఇంటి బాట పట్టాలన్నా సాహసం చేయాల్సిందే. గతంలో ఇక్కడికి వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ ఈ పరిస్థితిని చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. అయినా ఎవరూ ఇంత వరకు కన్నెత్తి చూడలేదు. దీంతో వర్షం పడితే పాఠశాల వైపు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని, దుస్తులు సైతం బురదమయం అవుతున్నాయని, ఇంకెన్నాళ్లీ ఈ వేతన అంటూ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పూర్తిస్థాయిలో మైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

బురదమయంగా చంద్రంపాలెం క్రీడా మైదానం

ఆళ్వార్లు, దేవేరుల సమేతంగా ప్రత్యేక అలంకరణలో గోవిందరాజ స్వామి

సంప్రదాయబద్ధంగా తిరునక్షత్రం పూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో పెరియాళ్వార్‌ తిరునక్షత్రం పూజలు సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నాయి. అర్చకులు దేవేరులు, ఆళ్వారాచార్యులు సహితంగా స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్‌ నేతృత్వంలో పండితులు దివ్యప్రబంధ పారాయణం చేశారు. ధూపదీప సేవలు చేసి విశేష నివేదనలు సమర్పించారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి వేపగుంట దరి పైడిమాంబ కాలనీకి చెందిన వీర వెంకట శ్వేత, కార్తీక్‌ అమర్‌నాథ్‌ కుటుంబం గురువారం రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ప్రోటోకాల్‌ పర్యవేక్షకుడు విక్రమ్‌కు అందజేశారు. అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

దాతకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు విక్రమ్‌

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, దాడి వీరభద్రరావు ఆలయానికి విచ్చేశారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు ప్రసాదం అందజేశారు.

← కప్పస్తంభం వద్ద మాజీ మంత్రి ముత్తంశెట్టి దంపతులు

ఎంవీవీఎస్‌ మూర్తి సేవలు ఎనలేనివి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: గీతం విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ డాక్టర్‌ ఎంవీవీఎస్‌ మూర్తి జయంతి సందర్భంగా గురువారం ఎండాడ, రుషికొండ రోడ్డులోని ఆయన స్మృతివనం వద్ద జీవీఎంసీ 6, 8 వార్డులకు చెందిన తెదేపా నాయకులు నివాళులర్పించారు. మధురవాడ, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో తెదేపా అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని నాయకులు గుర్తు చేసుకున్నారు. నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, 6, 8 వార్డుల తెదేపా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్‌, చెట్టిపల్లి గోపి, గొల్లంగి ఆనందబాబు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఎండాడ, న్యూస్‌టుడే: క్రమశిక్షణకు మారుపేరు డాక్టర్‌ ఎంవీవీఎస్‌ మూర్తి అని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్‌ అన్నారు. ఎండాడలో గురువారం మూర్తి జయంతి సందర్భంగా ఆయన ఘాట్‌ వద్ద నివాళులర్పించారు.

రుషికొండ వద్ద ఎంవీవీఎస్‌ మూర్తి స్మృతివనం వద్ద నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు

'ఆడుదాం ఆంధ్రా'పై విజిలెన్స్‌ అధికారుల ఆరా

కొమ్మాది, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు యువత ఓట్ల కోసం రూ.కోట్లు ఖర్చు చేసి 'ఆడుదాం-ఆంధ్రా' పేరిట క్రీడలను తూతూమంత్రంగా నిర్వహించింది. ఇందులో ఐ-ప్యాక్‌ సంస్థకు రూ.కోట్లు ధారాదత్తం చేసిందని, పోటీల నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం జీవీఎంసీ జోన్‌-2 కార్యాలయంలో విజిలెన్స్‌ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 5 నుంచి 13 వార్డుల్లో 91 సచివాలయాల పరిధిలో ఉన్న అడ్మిన్‌ల నుంచి వివరాలు సేకరించారు. ఎంత మంది ఆడుదాం ఆంధ్రా యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు? ఏయే ప్రాంతాల్లో పోటీలు నిర్వహించారు? ఎంతమందికి కిట్లు అందించారు? ఎంత ఖర్చు చేశారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జోన్‌-2 కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్‌ అధికారులు

పెద్దిపాలెం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆనందపురం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమతూకంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం పెద్దిపాలెం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పని తీరుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు, సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పల్లిపేట, మచ్చవానిపాలెం గ్రామాలను కలుపుతూ రోడ్డు మార్గం నిర్మించాలని కోరారు. ఇళ్లు, రేషన్‌కార్డులు, విద్యుత్తు సమస్య, మురుగు కాలువలు వంటి సమస్యలను తెలిపారు. వెంటనే ఆయా అధికారులతో మాట్లాడారు. నిమ్మకాయల కుమారి తన ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం వచ్చిందని ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాత్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, బమ్మిడి ఉమ, కాకరపూడి శ్రీకాంత్‌ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌, ఎండాడ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గంటా పేర్కొన్నారు. రుషికొండలో 'సుపరిపాలన - తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్పొరేటర్‌ లొడగల అప్పారావు, 9, 8 వార్డుల తెదేపా అధ్యక్ష, ఉపాధ్యక్షులు అక్కరబోయిన రాంబాబు, సారిపిల్లి శ్రీనివాస్‌, బి.దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: రుషికొండలో గురువారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు స్వాగతం పలకడానికి విచ్చేసిన స్థానిక మహిళలు పసుపు రంగు బెలూన్లు చేతపట్టి ఆకర్షణీయంగా నిలిచారు.

రుషికొండలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికేందుకు పసుపు బెలూన్లతో మహిళలు

బెంగళూర్‌- నారంగి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్‌, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్‌ఎంవీ బెంగళూర్‌- నారంగి -ఎస్‌ఎంవీ బెంగళూర్‌ (06559- 06560) మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్‌ సీనియర్‌ డీసీఎం కె.సందీప్‌ తెలిపారు. జులై 8, 15 తేదీల్లో రాత్రి 11.40 గంటలకు ఎస్‌ఎంవీ బెంగళూర్‌లో బయలుదేరే రైలు మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ చేరుకొని, అక్కడ 6.20 గంటలకు బయలుదేరి వెళ్తుంది. ఈనెల 12, 19 తేదీల్లో ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయలుదేరే రైలు మర్నాడు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 3.10 గంటలకు బయలుదేరి వెళ్తుంది.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అడివివరం, న్యూస్‌టుడే: సింహగిరి ప్రదక్షిణ ఉత్సవం సందర్భంగా 11కేవీ ఆర్టీసీ, 11కేవీ ధారపాలెం, 11కేవీ పుష్కరిణి ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్‌-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాత గోశాల కూడలి, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్సు ప్రాంతం, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, ప్రియాగార్డెన్స్‌, సాయినగర్‌, పుష్కరిణి రహదారి, విజినిగిరిపాలెం, ధారపాలెం, కుమ్మరిదిబ్బ, అడివివరం కూడలి, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం విద్యుత్తు సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఏఈ మండల అప్పలనాయుడు వెల్లడించారు. వేములవలస, వెల్లంకి, భీమిలి క్రాస్‌ రోడ్డు, సత్య కల్యాణి అపార్టుమెంట్స్‌ పరిధిలో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

అనాటమీ మ్యూజియానికి గుర్తింపు

వన్‌టౌన్‌, న్యూస్‌టుడే : ఆంధ్ర వైద్యకళాశాల అనాటమీ విభాగం మ్యూజియానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్‌ ఇండియన్‌ సైన్స్‌ మ్యూజియమ్స్‌ అండ్‌ సైన్స్‌ సెంటర్‌ ఇన్‌ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది. మ్యూజియంలో ఉన్న స్పెసిమెన్లను ఇప్పటికే విదేశాలకు తీసుకెళ్లి, అవగాహన కార్యక్రమాలు ముగిసిన తర్వాత మళ్లీ వెనక్కి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని విభాగాధిపతి డాక్టర్‌ రవీంద్ర కిశోర్‌ తెలిపారు.

అధిక సెలవులు పెడితే కారణం తెలుసుకోండి

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో మూడు రోజులు దాటి విద్యార్థి సెలవు పెడితే తల్లిదండ్రులను సంప్రదించి కారణం తెలుసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్‌ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సాయంత్రం చంద్రంపాలెం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. ఇప్పటి వరకు హాజరుకాని విద్యార్థుల ఇంటికెళ్లి కారణాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు, ఏఎల్‌ఎస్‌సీవో జి.శ్రీనివాసరావు, అసిస్టెంట్‌ ఏఎంవో లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమకుమార్‌

కిక్‌ బాక్సింగ్‌ విజేతలకు సత్కారం

కె.నగరపాలెం (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: నగరంలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రొ కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో సత్తా చాటిన బీచ్‌రోడ్డులోని మంగమారిపేట, చేపలుప్పాడకు చెందిన మొకర మధు, సూరాడ ఘర్షణ్‌కుమార్‌, కోచ్‌ వాసుపల్లి శివకుమార్‌లను గురువారం సత్కరించారు. జేవీ అగ్రహారంలో జరిగిన కార్యక్రమానికి తెదేపా నాల్గో వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు హాజరై సత్కరించి జ్ఞాపిక అందించారు. 45, 50 కిలోల విభాగంలో స్వర్ణాలు సాధించడం గర్వకారణమన్నారు. తెదేపా నాయకులు పాసి త్రినాథ్‌కుమార్‌, దంతులూరి సిద్ధార్థ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలను సత్కరిస్తున్న నర్సింగరావు, తదితరులు

నేడు పాండ్రంగిలో అల్లూరి జయంతి

పద్మనాభం, న్యూస్‌టుడే: అల్లూరి జయంతి వేడుకలు పాండ్రంగి గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షుడు కె.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: పెండింగ్‌ బకాయిల చెల్లింపు కోసం జ్యూటుమిల్లు వద్ద ఏర్పాటు చేసిన కౌంటరులో కార్మికులు నుంచి రెండో రోజు గురువారం దరఖాస్తులను స్వీకరించారు. 70 మంది కార్మికులు తమకు రావాల్సిన పీఎఫ్‌, గ్రాట్యూటీ, పింఛన్లు, తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు.

అదుపు తప్పిన లారీ

ఆనందపురం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి ఆనందపురం వెల్లంకి సమీపంలో గురువారం ఉదయం ఓ లారీ అదుపు తప్పి డివైడర్‌ను దాటి కాలువలోకి దూసుకెళ్లింది. అయితే ఎక్స్‌ప్రెస్‌ హైవేలో ఇతర వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ దెబ్బతిన్న వాహనాలను బయటకు తీయాలి. పని చేస్తున్న ప్రాంతానికి కనీసం 100 మీటర్ల దూరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ పోలీసులను సంప్రదించకుండా లారీ యజమాని ఇష్టానుసారం రెండు క్రేన్లతో వాహనాన్ని బయటకు తీయడంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పొరపాటున రహదారిలో నిలిచిన వాహనాలను ఢీకొంటే మరో ప్రమాదం జరిగేదని పలువురు ఆందోళన చెందారు.

లారీని క్రేన్ల సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం శ్రీవెంకటరంగ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ మేరకు పలు చోట్ల మొక్కలను నాటారు. సంఘం సభ్యులు వెలుగు మహిళా మార్టులో ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ ఆనందపురం ఇన్‌ఛార్జి ఆర్‌.శ్రీనివాసరావు, ఆడిట్‌ డిపార్ట్‌మెంట్‌ ఆర్‌ఐ ఆదినారాయణ, జగదీశ్వరరావు, సీఈవో ఎస్‌.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు మహిళా మార్టులో ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సహకార సంఘం ఉద్యోగులు

మరిన్ని బ్లూఫ్లాగ్‌ బీచ్‌ల గుర్తింపునకు చర్యలు

సాగర్‌నగర్‌, ఎండాడ, న్యూస్‌టుడే: రుషికొండ తీరంలో బ్లూఫ్లాగ్‌ బీచ్‌ ప్రమాణాల స్థాయిని కొనసాగించడంతో పాటు బీచ్‌ సుందరీకరణకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అన్ని విభాగాల సమన్వయంతో మరిన్ని చర్యలు చేపడుతుందని మంత్రి కందుల దుర్గేష్‌ పేర్కొన్నారు. రుషికొండ బీచ్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్‌ హరేంధిరప్రసాద్‌, జీవీఎంసీ కమిషనర్‌ కేతన్‌గార్గ్‌లతో కలిసి మంత్రి గురువారం పర్యటించారు. బ్లూఫ్లాగ్‌ సర్టిఫికేట్‌ ఉన్న బీచ్‌లను విదేశీ పర్యాటకులు ఎక్కువగా సందర్శిస్తున్న దృష్ట్యా రాష్ట్రంలో మరిన్ని బీచ్‌లకు బ్లూఫ్లాగ్‌ గుర్తింపు వచ్చేలా దృష్టి సారిస్తున్నామన్నారు. అనంతరం డబుల్‌డెక్కర్‌ బస్సులను సందర్శించి అందులోని సౌకర్యాలను పరిశీలించారు. భీమిలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్‌, టూరిజం ఆర్డీ జగదీష్‌, డీటీవో మాధవి, శాఖరి శ్రీనివాస్‌, సారిపిల్లి శ్రీనివాస్‌, బి.దొరబాబు, సీహెచ్‌.సన్యాసిరావు, కార్పొరేటర్‌ ఎల్‌.అప్పారావు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జనాభా దినోత్సవ పోటీలు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7న ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని పాఠశాలలు విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందించాలని భీమిలిలోని జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్‌) ప్రధానాచార్యులు లండా సుధాకర్‌ తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాల/క్లస్టరు స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. భీమిలి డైట్‌లో ఈనెల 9న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందిస్తామన్నారు. చిత్రలేఖనానికి సంబంధించి పొగాకు మాదకద్రవ్యాల నివారణపై, వ్యాసరచన (తెలుగు/ఆంగ్లం) పోటీలకు సంబంధించి లింగ సమానత్వం, గౌరవం అనే అంశాలను ఇస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9704719772, 9885941559 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఏయూ, ఎన్‌ఎస్‌టీఎల్‌ సంయుక్త పరిశోధనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు పనిచేసే దిశగా ఎన్‌.ఎస్‌.టి.ఎల్‌. శాస్త్రవేత్తలు చర్చించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గురువారం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్‌, ఏయూ అధికారులతో ఎన్‌.ఎస్‌.టి.ఎల్‌. శాస్త్రవేత్తలు వి.ఎఫ్‌.సాజి, వి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాలరావు సమావేశమయ్యారు. ఏయూ మెరైన్‌ ఇంజినీరింగ్‌ విభాగంతోపాటు ఇంజినీరింగ్‌ కళాశాలలోని పలు విభాగాలతో సంయుక్తంగా కలిసి పనిచేయడంతోపాటు త్వరలో ఒక సాంకేతిక సమ్మేళనం (కాంక్లేవ్‌) నిర్వహించడంపై సమాలోచనలు జరిపారు. ఎంటెక్‌ నావెల్‌ ఆర్కిటెక్చర్‌(సాయంత్రం కోర్సులో) ఎన్‌ఎస్‌టీఎల్‌ శాస్త్రవేత్తలు, సిబ్బందికి భాగస్వామ్యం కల్పించాలని ప్రతిపాదించారు. రెక్టార్‌ ఆచార్య ఎన్‌.కిశోర్‌ బాబు, రిజిస్ట్రార్‌ ఆచార్య ఇ.ఎన్‌.ధనుంజయరావు, ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపల్‌ ఆచార్య జి.శశిభూషణరావు, ఔట్‌రీచ్‌ డీన్‌ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

తాటితూరు (తగరపువలస), న్యూస్‌టుడే: తాటితూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామంలో గురువారం సత్కరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలను ఎంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. టీఎస్వీ ప్రసాదరావు, వి.శ్రీనివాస్‌, కె.ప్రభావతి, కృష్ణవేణి, సునీత, విజయకుమారి, చంద్రశేఖర్‌, అప్పలనాయుడులకు సన్మానం చేశారు. బదిలీ ఉపాధ్యాయులంతా పాఠశాలకు ఓ బీరువాను వితరణగా ఇచ్చారు.

ఉపాధ్యాయులను సత్కరించిన నిర్వాహకులు

(c) eenadu

బెంగళూర్- నారంగి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూర్- నారంగి- ఎస్ఎంవీ బెంగళూర్ (06559- 06560) మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. జులై 8, 15 తేదీల్లో రాత్రి 11.40 గంటలకు ఎస్ఎంవీ బెంగళూర్‌లో బయలుదేరే రైలు మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ చేరుకొని, అక్కడ 6.20 గంటలకు బయలుదేరి వెళ్తుంది. ఈనెల 12, 19 తేదీల్లో ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయలుదేరే రైలు మర్నాడు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 3.10 గంటలకు బయలుదేరి వెళ్తుంది.

9న విశాఖలో ఆటోల బంద్

అల్లిపురం, న్యూస్‌టుడే : ఈనెల 9న విశాఖలో ఆటోల బంద్ నిర్వహిస్తామని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పేర్కొన్నారు. గురువారం రైల్వేస్టేషన్ సమీప పోస్టాఫీసు వద్ద ఆటోడ్రైవర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీని ఆయన మాట్లాడారు. ఆరోజు చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ఆటోల బంద్ పాటిస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్తిబాబు, చిన్న, రమేష్, రవికృష్ణ, వై.వెంకట్, గణేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎంవీపీ కాలనీ: 8008574768

మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు గణబాబునగర్‌లో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని పగలూ వెలుగుతున్నాయి. – కె.గోవిందరావు, గణబాబునగర్ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. –ఎం.రామకృష్ణ, సూపర్‌వైజర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: చినగదిలి సాయిబాబా ఆలయం వద్ద భూగర్భ మంచి నీటి పైపులైను వాల్వు నుంచి నీరు వృథాగా పోతోంది. – బుడ్డిగ సత్యనారాయణమూర్తి, ఆరిలోవ శ్రీకాంత్‌నగర్. ✓: ఆ విషయం మా పరిశీలనలో ఉంది. నీటి సరఫరా ఆపి పనులు చేయాల్సి ఉంది. త్వరలో మరమ్మతులు చేయిస్తాం. – శ్రీనివాస్, ఏఈ

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదోవార్డు రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి నుంచి కొండ చివర వరకు అంతర్గత రహదారులపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – వి. రామలింగం, రాజీవ్‌నగర్. ✓: నివేదిక తయారుచేసి అధికారులకు పంపించాం. అనుమతులు రాగానే రోడ్డు వేస్తాం.– వెంకటరావు, ఏఈ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: మానసిక ఆసుపత్రి మీదుగా చినవాల్తేరు వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోయింది. – సాయిబాబు, స్థానికులు ✓: వెంటనే సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం.– ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 22వ వార్డు కళాభారతి పార్కు సమీపంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధమొస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. – శివ, పిఠాపురం కాలనీ. ✓: తక్షణమే సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగిస్తాం. – శ్రీనివాస్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

ఎండిన కొమ్మలు తరలించారు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ భక్తకుమార రామాలయం తరువాత వీధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించి పోగులుగా వదిలేయడంతో వాటిలో విషపురుగులు సంచరిస్తున్నాయని బుధవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు స్పందించారు. సిబ్బందితో ఎండిన కొమ్మలను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు.

సివిల్స్‌కు దారిచూపే 'పొలిటికల్ సైన్స్'..!

ఏయూలోని విభాగానికి ఘన చరిత్ర

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల పండగ జరుపుకొంటోంది. మరో ఐదేళ్లలో ఏయూ ఆర్ట్స్ కళాశాల కూడా శత వసంతాలు పూర్తి చేసుకోనుంది. ఘన చరిత్ర కలిగి ఈ కళాశాలలో చదివిన ఎందరో పరిపాలకులుగా రాణించారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్‌లో 1931లో ఆర్ట్స్ కళాశాల ఏర్పాటు చేశారు. తొలుత చరిత్ర, అర్థశాస్త్రం, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కలిపి ఒక విభాగంగా ఏర్పాటు చేశారు. అప్పట్లో మామిడి వెంకటరంగయ్య ఈ విభాగానికి ప్రారంభ ఆచార్యులు కాగా అదే సమయంలో ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా కూడా వ్యవహరించారు. తర్వాత 1964 సంవత్సరంలో ఆచార్య ఆర్.వి.ఆర్.చంద్రశేఖర్ అర్థశాస్త్రం, చరిత్రలను విడదీసి పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టులను కలిపి ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం ఆధ్వర్యంలో 2013లో పొలిటికల్ సైన్స్‌గా రూపాంతరం చెందింది. ఎక్కడా లేని విధంగా కేవలం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనే పొలిటికల్ సైన్స్ ఉంది.

ఏయూ ఆర్ట్స్ కళాశాల

★ ఇక్కడ చదివిన వారిలో పది మంది ఐ.ఎ.ఎస్.లు కాగా, ఆరుగురు ఐపీఎస్‌లు అయ్యారు. వందల సంఖ్యలో గ్రూప్ 1, 2, 4, రైల్వే గ్రూప్ డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు, వార్డు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులుగా ఎంపికయ్యారు. ఈ విభాగం నుంచి జీఎంసీ బాలయోగి, పనబాక లక్ష్మి, పాలడుగు వెంకటరావు తదితర రాజకీయ నాయకులు తయారుకాగా, ఆర్.వి.ఆర్.చంద్రశేఖర్, రాఘవులు, రామనాథం, ఇ.ఎ.నారాయణ వివిధ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా పనిచేశారు.

★ ఎలా చేరాలంటే...: ఏపీ పీజీసెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి మాత్రమే ఇందులోకి ప్రవేశం ఉంటుంది. ఈ విభాగంలో 60సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ 25మంది పీహెచ్‌డీ చేస్తున్నారు. వీరిలో విదేశీ విద్యార్థులు 15మంది ఉండడం గమనార్హం. ఐదుగురు విద్యార్థులకు జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) వస్తోంది.

★ సివిల్స్‌పై దృష్టిపెడితే మేలు...: ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు బోధన జరుగుతోంది. ఉత్తరాంధ్రకు చెందిన విద్యార్థులు కేవలం గ్రూప్స్ పరీక్షలకు మాత్రమే పరిమితమవుతున్నారు. వారు సివిల్స్‌పై దృష్టి సారిస్తే మేలు. తద్వారా ఏయూ నుంచి మరింత మంది విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యే అవకాశం ఉంది.

– ఆచార్య పేటేటి ప్రేమానందం, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి

'చేనేత వస్త్రాలు మేలైనవి'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు పోలమాంబ ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో గురువారం సాయంత్రం చేనేత కార్మికుల ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరవాసులు చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. చేనేత వస్త్రాలు మేలైనవని, వాటిని ధరిస్తే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ప్రదర్శనలో సుమారు 160 రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. నిర్వాహకులు సురేష్, సింహాద్రి మాట్లాడుతూ ఈనెల 13 వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

అనాటమీ మ్యూజియానికి గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్ర వైద్యకళాశాల అనాటమీ విభాగం మ్యూజియానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్ మ్యూజియమ్స్ అండ్ సైన్స్ సెంటర్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది. మ్యూజియంలో ఉన్న స్పెసిమెన్లను ఇప్పటికే విదేశాలకు తీసుకెళ్లి, అవగాహన కార్యక్రమాలు ముగిసిన తర్వాత మళ్లీ వెనక్కి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్ తెలిపారు.

ఖడ్గమృగం పుర్రె

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మద్దిలపాలెం, ఆరిలోవ– న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం ఎంవీపీకాలనీ సెక్టార్-9లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, నాయకులు పోలారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీకాలనీ సెక్టార్-9లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

★ 22వ వార్డులో బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యకర్తలు మంగాపురంకాలనీ, శివాజీపాలెం ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, డొక్కరి శ్రీను, పోతు వెంకటప్రసాద్, కె.ఆనంద్, నాగూర్, బర్ల రాజు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

★ 12వ వార్డు గణబాబునగర్‌లో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు గాడి సత్యం, ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, కూటమి ప్రభుత్వ పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండీ తల్లికి వందనం లాంటి పథకాలు అందక పోతే ఆయా వివరాలు తీసుకుని 'మై తెదేపా' యాప్‌లో నమోదు చేశారు. నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, తాతారావు, కాగిత గోవిందరావు పాల్గొన్నారు. 13వ వార్డులో కార్పొరేటర్ కె.సునీత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

12వ వార్డులో ఒమ్మి సన్యాసిరావు తదితరులు..

'మై తెదేపా' యాప్‌లో వివరాలు పొందుపర్చాలి..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త 'మై తెదేపా' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాటిలో వివరాలు నమోదు చేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం ఎంవీపీకాలనీలోని వుడా కల్యాణమండపంలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమానికి సంబంధించి బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలరోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఇంటింటికి వెళ్లి 'మై తెదేపా యాప్'లో లబ్ధిదారుల అభిప్రాయాలను పొందుపర్చాలని సూచించారు. నాయకులు ఆళ్ల శ్రీనివాస్, బుడుమూరు గోవింద్ తదితరులు పాల్గొన్నారు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తొమ్మిదోవార్డు సింహగిరికాలనీలో వార్డు తెదేపా ఇన్‌ఛార్జి బుడుమూరి గోవింద్, నాయకులు గెడ్డవలన వెంకటరావు, బాదరు బాలరాజు.., పదోవార్డు ఎస్ఐజీనగర్, వివేకానందనగర్, ఇందిరానగర్‌లలో వార్డు తెదేపా అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ఇన్‌ఛార్జ్ రాజశేఖర్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అభిప్రాయాలు సేకరించారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

పుస్తకాలు అందజేస్తున్న పట్టాభిరామ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, గీతం వర్సిటీ అధినేత స్వర్గీయ ఎం.వి.వి.ఎస్.మూర్తి జయంతిని గురువారం పెదవాల్తేరు హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల సంస్థలో నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మానసిక దివ్యాంగుల నడుమ కేక్ కోశారు. అనంతరం చిన్నారులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పట్టాభిరామ్ మాట్లాడుతూ ఎంవీవీఎస్ మూర్తి తెదేపాకు అందించిన సేవలు మరువలేనివన్నారు. 20వ వార్డు అధ్యక్షులు బైరెడ్డి పోతన్నరెడ్డి, నాయకులు నరేంద్ర, మద్ది శ్రీనివాసరెడ్డి, వాసు, సంస్థ నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాధవ్‌కు అభినందనల వెల్లువ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పి.వి.ఎన్.మాధవ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భాజపా సీనియర్ నాయకులు కాశీవిశ్వనాథ్, గ్రామ, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఈర్ల శ్రీరామమూర్తి గురువారం సాయంత్రం లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను అభినందిస్తున్న కాశీవిశ్వనాథ్, ఈర్ల శ్రీరామమూర్తి

ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల స్థితిగతులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరా తీశారు. గురువారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టు పనులు, ఆలస్యానికి గల కారణాలపై అధికారులతో మాట్లాడారు. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టు పనులపై పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్.రవితో చర్చించారు. ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

కొండవాలులో.. ప్రమాదపుటంచుల్లో.. !

ఆరిలోవ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 12వ వార్డు గణబాబు నగర్ కొండవాలు ప్రాంతంలో నివాస గృహాలు ప్రమాదకరంగా మారాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి మెత్తబడి కొండపైనుంచి నిదానంగా జారుతోంది. భారీ వర్షం పడితే భారీగా మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడే అవకాశం ఉంది. గతంలో నియోజకవర్గంలోని పలు కొండవాలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో భారీ వర్షాలు పడిన ప్రతిసారి స్థానికులు బిక్కుబిక్కుమంటూ ఉండేవారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరగా పట్టించుకున్న వారు లేరు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్పందించారు. ఇటీవల ఆయన ఆధ్వర్యంలో విశాలాక్షినగర్, ఆరిలోవ ప్రాంతాల్లో రూ.కోట్ల వ్యయంతో రక్షణ గోడల నిర్మాణం చేపట్టారు. ఆయా పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కొండ ప్రాంతాలు కావడంతో నిర్మాణం నెమ్మదిగా సాగుతోంది. అవి పూర్తయితే తప్ప నివాసాలకు రక్షణ ఉండదని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా గణబాబునగర్‌లో కూడా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాల నుంచి నివాసితులను రక్షించాలని విన్నవిస్తున్నారు.

గణబాబునగర్ కొండవాలులో నిర్మించిన నివాసాలు

వర్షాకాలంలో పరిశుభ్రతపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రతపై దృష్టి సారించి, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఇదే అంశంపై గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశుభ్రత, పీ4 విధానం, ప్రజాభిప్రాయ సేకరణ, జీవనోపాధి, బాల సంజీవని, బయోగ్యాస్, సూర్యఘర్ పథకాల అమలు అంశాలపై సీఎస్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్.భవానీశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వేస్టేషన్ల మీదుగా మత్తు పదార్థాల అక్రమ రవాణాను నియంత్రించేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని విశాఖ సిటీ డీసీపీ-1 అజిత అన్నారు. గురువారం ఆమె రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేసేలా రైల్వే పోలీస్, సిటీ పోలీస్, ఈగల్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె తమ బృందాలతో పలు రైళ్లను తనిఖీ చేశారు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు, ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్యం కూడలి సమీపంలో గురువారం ఓ వ్యక్తి (45) మృతిచెంది పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం వద్ద పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. కొంతకాలంగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు గుర్తించారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి సహకారంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మురళీ మాట్లాడుతూ బంధువుల కోసం మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిపారు.

ముడసర్లోవ జలాశయంలో వ్యర్థాల తొలగింపు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ జలాశయంలో ఎట్టకేలకు వ్యర్థాలు తొలగించారు. జలాశయంలో మురుగు, ఇతర వ్యర్థాలు కలుస్తుండటంపై జులై 1న 'జలాశయం.. కాలుష్య కాసారం..' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి స్పందించారు. స్వయంగా జలాశయం వద్దకు వెళ్లి పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో మురుగు, వ్యర్థాలను తొలగించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎవరూ వ్యర్థాలు వేయకుండా శాశ్వతంగా ఫెన్సింగ్ వేయిస్తామని జెడ్సీ తెలిపారు.

రవీంద్రభారతి పాఠశాల జప్తు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ద్వారకానగర్ రవీంద్రభారతి పాఠశాలను గురువారం జప్తు చేసినట్లు కార్మిక రాజ్య బీమా సంస్థ రికవరీ అధికారి జి.వేణుమాధవ్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం తమ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో పాఠశాల భవనాన్ని అభిజిత్ కుమార్ తదితరులు జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సంస్థ తప్పకుండా తమ ఉద్యోగులకు చెల్లించాలని ఈఎస్ఐ బకాయిలు వెంటనే జమ చేయాలని సూచించారు.

చినుకు పడితే బురదే..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : మూడు రోజులుగా పడుతున్న జడివానకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు అందులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. క్రషర్ పొడి చల్లితే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పలువురు విద్యార్థులు బురదలో పరిగెత్తుతూ జారి పడిపోతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్పణం

గుంతల దారులతో అవస్థలు

సంజయ్‌గాంధీకాలనీ సేవామార్గంలో గుంత

ఫోకస్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తొమ్మిదో వార్డు పరిధి హనుమంతువాక నుంచి పెదగదిలి కూడలి వరకు రెండు కిలోమీటర్ల మేర బీఆర్‌టీఎస్ సేవా మార్గంలో గుంతలు పడ్డాయి. ముఖ్యంగా హనుమంతువాక, విజయదుర్గ కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, పెదగదిలి ప్రాంతాలలో గుంతలు ఎక్కువగా ఉండడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమృత్ పథకంలో భాగంగా గతంలో భూగర్భ పైపులైన్ల కోసం రహదారి పొడవునా గుంతలు తవ్వారు. తర్వాత వాటిని పూడ్చినప్పుడు నాణ్యత పాటించకపోవటంతో చాలా చోట్ల కుంగిపోయాయి. రాత్రుళ్లు ద్విచక్ర వాహనాలు వాటిల్లో పడి అదుపు తప్పుతున్నాయని, తక్షణం అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెదగదిలి ప్రాథమిక పాఠశాల రహదారిలో..

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: వెంకోజీపాలెం 11కేవీ విద్యుత్తు ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాతవెంకోజీపాలెం, కొత్త వెంకోజీపాలెం, ఎంవీవీ అపార్టుమెంట్స్, జేఆర్ నగర్, యల్లమాంబ ఆలయం ఏరియా, భూలోకమాత ఆలయం ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-1 ఇ.ఇ. సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

★ ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధి ఇందిరానగర్ 11కేవీ ఫీడర్‌లో మరమ్మతులతోపాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇందిరానగర్, రాజీవ్‌నగర్, వెటర్నరీకాలనీ, నేతాజీనగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, వివేకానందనగర్, ఎస్ఐజీనగర్, నాగేశ్వరరావు పేట, రవీంద్రనగర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి తీవ్ర హాని

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఒకసారి వినియోగించి విడిచిపెట్టే ప్లాస్టిక్ సంచులు పర్యావరణానికి తీవ్ర హానికరమని గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. గురువారం గ్రీన్ క్లైమేట్ బృందం, ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీలోని సమతా డిగ్రీ కళాశాల, శివాజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్లాస్టిక్ సంచుల రహిత రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన వస్త్ర సంచులు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం 16 రకాల పాలిథిన్ సంచులను నిషేధించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వస్త్ర సంచులను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సమతా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులతో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బాక్సింగ్‌లో 'రైల్వే మహిళల' ప్రతిభ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : అఖిల భారత మహిళల బాక్సింగ్ పోటీల్లో భారత రైల్వే బాక్సింగ్ జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన పోటీలు గురువారం ముగిశాయి. మహిళా బాక్సర్లు జ్యోతి, ఎన్‌బీ.చాను, ప్రచీ, శశిచోప్రా, లాషుయాదవ్, పాథన్, మంజురాణి, నేహా తదితరులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చూపిన వారిలో వివిధ రైల్వే జోన్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

గెలుపొందిన ట్రోఫీ, పతకాలతో క్రీడాకారులు

ఏయూ, ఎన్ఎస్‌టీఎల్ సంయుక్త పరిశోధనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు పనిచేసే దిశగా ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు చర్చించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గురువారం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, ఏయూ అధికారులతో ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు వి.ఎఫ్.సాజి, వి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాలరావు సమావేశమయ్యారు. ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగంతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలోని పలు విభాగాలతో సంయుక్తంగా కలిసి పనిచేయడంతోపాటు త్వరలో ఒక సాంకేతిక సమ్మేళనం (కాంక్లేవ్) నిర్వహించడంపై సమాలోచనలు జరిపారు. ఎంటెక్ నావెల్ ఆర్కిటెక్చర్(సాయంత్రం కోర్సులో) ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, సిబ్బందికి భాగస్వామ్యం కల్పించాలని ప్రతిపాదించారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఔట్‌రీచ్ డీన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, అధికారులతో ఎన్.ఎస్.టి.ఎల్. శాస్త్రవేత్తలు

(c) eenadu

అలంకరణలో స్వామివారు

జగన్నాథుడి తిరుగు రథయాత్ర రేపు

మురళీనగర్, న్యూస్‌టుడే: హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖ ఆధ్వర్యంలో జగన్నాథుని తిరుగు రథయాత్ర శనివారం నిర్వహించనున్నారు. అధ్యక్షుడు నిమ్మలపాటి భక్తదాస సారథ్యంలో ఎన్‌జీజీవోకాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సాయంత్రం 5 గంటలకు రథయాత్ర ప్రారంభమై వర్కుకాపుల్లెన్స్, ఇస్కాన్‌పార్క్, మురళీనగర్‌లోని పలు సెక్టార్ల మీదుగా సాగి మాధవధార వీఎంఆర్‌డీఏ కమ్యూనిటీ హాలు వద్ద ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

కూటమి పాలనలో బాలలకు మెరుగైన విద్య

విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దక్షిణం ఇంఛార్జి సుధాకర్

అల్లిపురం, న్యూస్‌టుడే: కూటమి పాలనలో బాలలకు మెరుగైన విద్య అందించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని దక్షిణం తెదేపా ఇంఛార్జి సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. గురువారం మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి జయంతి సందర్భంగా వెంకటేశ్వరమెట్ట సమీప సీపీఎం పాఠశాల, అల్లిపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విల్లూరి చిన్నతల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి, బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ విల్లూరి చక్రవర్తి, సభ్యులు తిరుమలరావు, బి.సూర్యనారాయణ, పి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 24వ వార్డు కొత్త ఎస్‌బీఐ ఉపసభి దిగువ మార్గం మీదుగా ప్రియదర్శిని కాలనీకి వెళ్లే రహదారి గతుకులమయంగా మారింది. రాకపోకలు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. – శ్రీను, స్థానికుడు ✓: పైపులైన్ పనులు పూర్తికాగానే రహదారి నిర్మాణ పనులు చేపడతాం. – శ్రీనివాసరావు, ఏఈ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 37వ వార్డు జబ్బార్‌తోటలో ఆరుబయట కుక్కల బెడద ఎక్కువైంది. పలువురు యువకులు రాత్రి సమయంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ, మల, మూత్ర విసర్జన చేస్తూ.. పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నారు. –వి.రమేష్, స్థానికుడు ✓: రాత్రి సమయంలో గస్తీని పెంచి, ఆరుబయట ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం. –జీడీ. బాబు, ఒకటో పట్టణ సీఐ

స్పందనకు వందనం

చెత్త తరలించారు

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార ప్రాంతంలోని బహుళ అంతస్తుల్లో నిల్వ ఉన్న చెత్త సమస్య ఎట్టకేలకు తీరింది. కొద్ది రోజులుగా ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు రాకపోవడంతో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ఇక్కడి సమస్యపై 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో ప్రచురించిన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రావు స్పందించి చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

–న్యూస్‌టుడే, జగదాంబకూడలి

★ జీవీఎంసీ 31వ వార్డు గొల్లలపాలెం రామాలయం వెనుక వీధిలో పేరుకుపోయిన వ్యర్థాల సమస్యపై 'ఈనాడు' ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి, శుభ్రత పనులు చేయించారు.

★ జీవీఎంసీ 29వ వార్డు ఆంథోనినగర్‌లో అనుసంధాన రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయన్న సమస్యపై 'ఈనాడు' ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మరమ్మతులకు ప్రతిపాదిస్తామని పేర్కొన్నారు.

'సెంట్రల్ పార్క్'లో సమస్యలు...!

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో వీఎంఆర్‌డీఏకు చెందిన ప్రతిష్ఠాత్మక సిటీ సెంట్రల్ పార్కులో కుక్కల బెడద ఎక్కువైంది. దీంతో సందర్శకులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని నగర నడిబొడ్డున ఉన్న పార్కులో నిత్యం సందర్శకుల రద్దీ ఉంటోంది. ఈ ఏడాది జనవరిలో పిల్లల ఆటవస్తువుల మరమ్మతులు చేయించారు. అయితే వాటి వద్ద కుక్కల బెడద ఎక్కువవడంతో చిన్నారులు భయపడి ఆటలు ఆడేందుకు వెళ్లడం లేదు. పార్కులో సుమారు 15 కుక్కలు తిరుగుతున్నాయని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని సందర్శకులు చెబుతున్నారు.

పిల్లలు ఆడుకునే ప్రదేశంలో కుక్కలు

ఒక్కచోట మాత్రమే అందుబాటులో ఉన్న తాగునీటి కేంద్రం

పరిష్కరించాలని పలువురి డిమాండ్

✦ సువిశాలంగా ఉన్న వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కులో ప్రవేశ మార్గం వద్ద మాత్రమే తాగునీటి సౌకర్యం ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడా గొంతు తడుపుకొనే వీల్లేకపోవడంతో... పార్కు సందర్శనకు వచ్చిన వారు దాహం వేస్తే తిరిగి ప్రధాన మార్గం వద్దకు రావాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో పార్కు వెనుక వైపు తాగునీటి సదుపాయం ఉండేది. ఆ తర్వాత సరైన నిర్వహణ లేక తొలగించేశారు.

✦ గతంలో నిర్వహణ లేక పాడైపోయిన యంత్ర పరికరాలను బాగు చేయించి... రోజూ రాత్రి 7 గంటలకు ఫౌంటెయిన్ లేజర్ షో ప్రదర్శిస్తుండడంతో... సందర్శకులు ఎక్కువ మంది వెళ్తున్నారు.

✦ ఇప్పటికైనా అధికారులు స్పందించి.. కుక్కల నియంత్రణతో పాటు, పార్కులో రెండు, మూడు ప్రాంతాల్లో తాగునీరు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం

గోకుల్‌నగర్ వద్ద గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బీశెట్టి నారాయణరావు, దాడి రమేష్ తదితరులు

అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన పి.వి.ఎన్.మాధవ్ మొదటిసారి గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్న సందర్భంగా ఉత్తరం నియోజకవర్గం నేతలు ఘన స్వాగతం పలికారు. జీవీఎంసీ 27వ వార్డు భాజపా కో కన్వీనర్ కారాల మహేశ్, భాజపా దక్షిణ నియోజకవర్గం కన్వీనర్ అర్జిలి శంకరరావు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బీశెట్టి నారాయణరావు, భాజపా వెస్ట్ కన్వీనర్ దాడి రమేష్ గోకుల్‌నగర్ వద్ద గజమాలతో ఘన స్వాగతం పలికారు. భాజపా సీనియర్ నాయకులు బీశెట్టి నూకేశ్వరరావు, మండల కన్వీనర్ యలమంచిలి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో కార్యకర్తల ఉత్సాహం...

ఎంవీవీఎస్ మూర్తి సేవలు చిరస్మరణీయం

నివాళి అర్పిస్తున్న గండిబాబ్జీ, కోరాడ రాజాబాబు, తదితరులు

గురుద్వారా, న్యూస్‌టుడే: విద్యారంగంలో ఎంవీవీఎస్ మూర్తి సేవలు చిరస్మరణీయమని భాజపా ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదేవిక పేర్కొన్నారు. ఎంవీవీఎస్ మూర్తి జయంతి సందర్భంగా సీతమ్మధార ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్సీగా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో సేవ చేశారని గుర్తు చేశారు.

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 51వ వార్డులో తెదేపా నాయకులు ఎంవీవీఎస్ మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమీప ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. నాయకులు మూల రామ్, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత, మాజీ ఎంపీ, దివంగత ఎంవీవీఎస్ మూర్తి అందించిన సేవలు నిరుపమానమని విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. గురువారం నగర పార్టీ కార్యాలయంలో మూర్తి జయంతి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కేఎస్.నాయుడు, పాలంరాజు శ్రీనివాసరావు, కోరాడ రాజబాబు, సుజాత, ముత్యాలనాయుడు, గాయత్రి పణికమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

అధికారులు చూడరు.. అవస్థలు తీరవు..

– న్యూస్‌టుడే, కంచరపాలెం

రోడ్డును తవ్వేయడంతో నిలిచిన మురుగు

ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి వెలువడే మురుగుతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. పాదచారులు, వాహనచోదకులు మురుగు నీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రధాన కాలువలో మురుగు నిలిచిపోవడంతో స్థానికులు రోడ్డును కొంత మేర తవ్వి నీరు ప్రవాహం చేశారు. దీంతో మురుగంతా 104 ఏరియాలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. ఎస్టేట్‌లో మౌలిక వసతులను చూసే ఏపీఐఐసీ, శానిటరీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

104 ఏరియా ప్రధాన రహదారిలో... కాలువలు శుభ్రం చేయకపోవడంతో పేరుకుపోయిన వ్యర్థాలు

● 9న బి.వి.పట్టాభిరామ్ సంతాప సభ

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలకుడిగా గుర్తింపు పొందిన దివంగత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ సంతాప సభ ఈనెల 9న విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు బాల వికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభిరామ్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

● 6న డిజిటల్ గ్రంథాలయం ప్రారంభం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: దివంగత బాదంగీర్ సాయి నిర్వహించిన గ్రంథాలయంలోని పదివేల నాటక పుస్తకాల్ని డిజిటలీకరణ చేసిన 'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం'ను ఈ నెల 6న విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రారంభించనున్నట్లు రైటర్స్ అకాడమీ ఒక ప్రకటనలో తెలిపింది. నాటక రచయిత దాడి వీరభద్రరావు అధ్యక్షతన సభ నిర్వహణ జరుగుతుందని, ముఖ్యఅతిథిగా డాక్టర్ మన్నం వెంకటరాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 'టామీ.. టామీ.. టామీ' అనే వీధి నాటికను ప్రదర్శించనున్నారన్నారు.

● పర్యావరణ పరిరక్షణకు వస్త్ర సంచులనే వాడాలి

మాధవధార, న్యూస్‌టుడే: వస్త్ర సంచులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని జోన్-6 వైద్యాధికారి కృష్ణంరాజు పిలుపునిచ్చారు. మాధవధార ల్యాన్‌సమ్ ప్రాంగణంలోని జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ సహకారంతో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం వస్త్ర సంచులను పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ సుమన్, పీఆర్‌ఓ కాళి, జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, ఉమాశంకర్, సభ్యులు పాల్గొన్నారు.

● కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు

గురుద్వారా, న్యూస్‌టుడే: చోడవరం ప్రాంతం నుంచి నగరానికి వచ్చి భిక్షాటన చేసుకుంటున్న ఓ వృద్ధురాలిని ద్వారకా పోలీసులు ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. సీఐ రమణ తెలిపిన వివరాలు ఇలా.. చోడవరం మండలం దుడ్డుపాలేనికి చెందిన పల్లా ఈశ్వరమ్మ(75) కొద్ది రోజుల కిందట నగరానికి వచ్చేసింది. అప్పటి నుంచి ద్వారకానగర్ బ్రిడ్జి సమీపంలో భిక్షాటన చేసుకుంటూ విభాగినిపై నిద్రిస్తోంది. గమనించిన పోలీసులు వృద్ధురాలి వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గురువారం వారికి అప్పగించారు.

● రవీంద్రభారతి పాఠశాల జప్తు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ద్వారకానగర్ రవీంద్రభారతి పాఠశాలను గురువారం జప్తు చేసినట్లు కార్మిక రాజ్య బీమా సంస్థ రికవరీ అధికారి జి.వేణుమాధవ్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం తమ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో పాఠశాల భవనాన్ని అభిజిత్ కుమార్ తదితరులు జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సంస్థ తప్పకుండా తమ ఉద్యోగులకు చెల్లించాలని ఈఎస్ఐ బకాయిలు వెంటనే జమ చేయాలని సూచించారు.

'మత్తు, ర్యాగింగ్ జోలికి పోవద్దు'

ర్యాలీలో మెడికోలు, వైద్య, పోలీసులు అధికారులు, సిబ్బంది

వన్‌టౌన్, న్యూస్‌టుడే : వైద్య విద్యార్థులు ప్రమాదకరమైన మత్తు పదార్థాలు, ర్యాగింగ్ జోలికి పోవద్దని వన్‌టౌన్ సీఐ జీడీ.బాబు సూచించారు. గురువారం ఆంధ్ర వైద్యకళాశాల ఆవరణలోని అనాటమీ విభాగంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్ జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని, మత్తు పదార్థాలు వినియోగిస్తే జీవితాలు నాశనమవుతాయన్నారు. అనంతరం కళాశాల పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. కళాశాల వివిధ విభాగాధిపతులు డాక్టర్ రవీంద్ర కిషోర్, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ భవానీ, బోధన, బోధనేతర సిబ్బంది, మెడికోలు పాల్గొన్నారు.

9న విశాఖలో ఆటోల బంద్

అల్లిపురం, న్యూస్‌టుడే : ఈనెల 9న విశాఖలో ఆటోల బంద్ నిర్వహిస్తామని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పేర్కొన్నారు. గురువారం రైల్వేస్టేషన్ సమీప పోస్టాఫీసు వద్ద ఆటోడ్రైవర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీని ఆయన మాట్లాడారు. ఆరోజు చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ఆటోల బంద్ పాటిస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్తిబాబు, చిన్న, రమేష్, రవికృష్ణ, వై.వెంకట్, గణేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో ఆటో యూనియన్ నాయకులు

సర్వర్ మొరాయింపుతో అవస్థలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : సర్వర్ మొరాయిస్తుండటంతో రేషన్ సరకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీంతో కార్డుదారులు గంటల కొద్దీ డిపోల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 610 డిపోల పరిధితో పాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల డిపోల్లో ఇంచుమించు ఒకే సమయంలో సరకుల పంపిణీ జరుగుతోంది. దీంతో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుత రద్దీకి అనుగుణంగా సర్వర్ల సామర్థ్యం పెంచకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువారం నగరంలోని పలు డిపోల వద్ద కార్డుదారుల సరకుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి... ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్డుదారులు కోరుతున్నారు.

పందిమెట్ట ప్రాంతంలోని డిపో వద్ద..

బాక్సింగ్‌లో 'రైల్వే మహిళల' ప్రతిభ

గెలుపొందిన ట్రోఫీ, పతకాలతో క్రీడాకారులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : అఖిల భారత మహిళల బాక్సింగ్ పోటీల్లో భారత రైల్వే బాక్సింగ్ జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన పోటీలు గురువారం ముగిశాయి. మహిళా బాక్సర్లు జ్యోతి, ఎన్‌బీ.చాను, ప్రచీ, శశిచోప్రా, లాషుయాదవ్, పాథన్, మంజు రాణి, నేహా తదితరులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చూపిన వారిలో వివిధ రైల్వే జోన్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

నేడు దుర్గాలయం వార్షికోత్సవం

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 24వ వార్డు పరిధి రేసపువానిపాలెంలో కొలువైన శాంతిస్వరూపిణి దుర్గాలయం 22 వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర కుంకుమపూజలు, శాంతిహోమం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, రాత్రి 108 క్షీర కలశాలు, సారె ఊరేగింపు జరపనున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : కేకేలైన్‌లో కొండచరియలు విరిగిపడి రైలు పట్టాలు దెబ్బతిన్న ప్రాంతంలో పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బోహ్రాతో పాటు రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్, ఇతర సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు.

బాబా విగ్రహానికి లక్ష పుష్పార్చన

గురుద్వారా, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి సందర్భంగా సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలోని బాబా విగ్రహానికి గురువారం లక్షపూలతో అర్చన జరిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అర్చకుల మంత్రోచ్ఛారణతో పౌర్ణమి ముందు రోజు వరకు తొమ్మిది రోజులు బాబాకి లక్షపూలతో అర్చన జరిపించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ప్రతిరోజూ ఒక్కో రకం పూలతో పూజ చేసి ప్రత్యేక హారతులు, నైవేద్యాలు సమర్పించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బెంగళూర్- నారంగి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూర్- నారంగి-ఎస్ఎంవీ బెంగళూర్ (06559- 06560) మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. జులై 8, 15 తేదీల్లో రాత్రి 11.40 గంటలకు ఎస్ఎంవీ బెంగళూర్‌లో బయలుదేరే రైలు మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ చేరుకొని, అక్కడ 6.20 గంటలకు బయలుదేరి వెళ్తుంది. ఈనెల 12, 19 తేదీల్లో ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయలుదేరే రైలు మర్నాడు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 3.10 గంటలకు బయలుదేరి వెళ్తుంది.

ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరా

అధికారులతో మాట్లాడుతున్న కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల స్థితిగతులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరా తీశారు. గురువారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టు పనులు, ఆలస్యానికి గల కారణాలపై అధికారులతో మాట్లాడారు. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టు పనులపై పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్.రవితో చర్చించారు. ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ అజిత

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వేస్టేషన్ల మీదుగా మత్తు పదార్థాల అక్రమ రవాణాను నియంత్రించేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని విశాఖ సిటీ డీసీపీ-1 అజిత అన్నారు. గురువారం ఆమె రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేసేలా రైల్వే పోలీస్, సిటీ పోలీస్, ఈగల్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె తమ బృందాలతో పలు రైళ్లను తనిఖీ చేశారు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు, ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

'హరిహర వీరమల్లు' అలరిస్తుంది

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పూర్ణమార్కెట్ సమీప శ్రీకాంతి థియేటర్‌లో ప్రదర్శించిన హరిహర వీరమల్లు సినిమా ట్రైలర్‌ను ఆయన వీక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని వైకాపా నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అర్హులైన పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించి, ఆయా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు ఇచ్చేలా నిబంధనలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షులు కేకే.రాజు, నాయకులు విజయకుమార్, శ్రీవత్సవ, రమణికుమారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: విశాఖలో త్వరలోనే టూరిజం యూనివర్సిటీ నెలకొల్పడానికి చర్యలు చేపడతామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటక రంగానికి ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాగర్‌నగర్ సమీప సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్‌ను మంత్రి దుర్గేష్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి గురువారం సందర్శించారు.

వర్షాకాలంలో పరిశుభ్రతపై దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రతపై దృష్టి సారించి, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఇదే అంశంపై గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశుభ్రత, పీ4 విధానం, ప్రజాభిప్రాయ సేకరణ, జీవనోపాధి, బాలసంజీవని, బయోగ్యాస్, సూర్యఘర్ పథకాల అమలు అంశాలపై సీఎస్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. కాలువలు, గెడ్డల్లో పూడికలు తొలగించాలని, పైపులైన్ల లీకులకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్.భవానీశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి పూజల కరపత్రాల ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, టి.రాంబాబు, నాగభూషణం దంపతులు, జనసేన నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నూకల శేషగిరిరావు, టి.రాంబాబు, కమిటీ సభ్యులు

పాతనగరంలో కమిషనర్ పర్యటన



నడక మార్గాన్ని ఆక్రమించిన వ్యాపారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : పాతనగరంలో గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పర్యటించారు. జగదాంబకూడలి నుంచి పాతపోస్టాఫీసు వరకు ఉన్న రహదారి విస్తరణ పనుల పరిశీలనతో పాటు, టీడీఆర్‌ల జారీపై బాధితులతో మాట్లాడారు. అనంతరం నడకమార్గాలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారాలతో మాట్లాడారు. సొంత స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరించారు. ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ఎ.ప్రభాకర్, డీసీపీ హరిదాసు, ఏసీపీ రూన్సీలక్ష్మీ, సర్వేయర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనాటమీ మ్యూజియానికి గుర్తింపు



ఖడ్గమృగం పుర్రె

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్ర వైద్యకళాశాల అనాటమీ విభాగం మ్యూజియానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్ మ్యూజియమ్స్ అండ్ సైన్స్ సెంటర్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది. మ్యూజియంలో ఉన్న స్పెసిమెన్లను ఇప్పటికే విదేశాలకు తీసుకెళ్లి, అవగాహన కార్యక్రమాలు ముగిసిన తర్వాత మళ్లీ వెనక్కి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్ తెలిపారు.

(c) eenadu

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

మాజీ ఎంపీ మూర్తికి నివాళులర్పిస్తున్న తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి, తదితరులు

మాజీ ఎంపీ మూర్తికి నివాళులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, గీతం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎంవీవీఎస్ మూర్తి జయంతిని పురస్కరించుకుని గాజువాక 75వ వార్డు తెదేపా కార్యాలయంలో గురువారం నాయకులు ఘన నివాళులర్పించారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ముద్దర్ల శ్రీరామ్మూర్తి, పల్లా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘విమల విద్యాలయం మూసివేతకు యత్నం’

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3)న్యూస్‌టుడే: ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయాన్ని శాశ్వతంగా మూసివేసేందుకు కుట్ర జరుగుతుందని కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. తమకు వి.ఆర్.ఎస్. ఇవ్వాలంటూ ఉక్కు యాజమాన్యానికి ఉపాధ్యాయుల్లో కొందరు స్థానిక ప్రజాప్రతినిధుల లేఖ రాయించినట్లు తనకు సమాచారం ఉందన్నారు. గత నెల 23న చర్చలు ఫలప్రదమై రెండు రోజుల్లో డీఈవోకు కూడా అనుమతుల కోసం దరఖాస్తు చేసే క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు వి.ఆర్.ఎస్. ప్రతిపాదన తెచ్చారన్నారు. ప్రజాప్రతినిధుల, ఉక్కు అధికారుల తీరుకు వ్యతిరేకంగా ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి శనివారం పెద్దఎత్తున ఉద్యమించనున్నట్టు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

దుకాణాలతో ఇబ్బందులు: గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ?: రాజీవ్‌నగర్‌లో చిల్లర దుకాణాల వల్ల ఉదయం ట్రాఫిక్ రద్దీగా ఉంటోంది. వీటి కార్యకలాపాలకు అనుమతులున్నాయా? – గణేశ్, గాజువాక ✓: అవసరమైన చర్యలు తీసుకుంటాం. – కోటేశ్వరరావు, సీఐ

దీపాలు వెలగడంలేదు: గోపాలపట్నం సమీప పెదమదక కొండప్రాంత కాలనీల్లో అక్కడక్కడ దీపాలు వెలుగుతున్నాయి. 74వ వార్డు దయాలనగర్‌లోని, పైడిమాంబకాలనీల్లోనూ ఇదే పరిస్థితి. –సూరిబాబు, అగనంపూడి ✓: ప్రస్తుత పరిస్థితి... –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: 89వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో రోడ్డు బురదమయంగా మారాయి. – సందీపరావు, భగత్‌సింగ్‌నగర్ ✓: పరిశీలిస్తున్నాం. సిబ్బందిని పంపిస్తాం. – రామకృష్ణ, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

రోడ్డు పనులకు శ్రీకారం : గాజువాక, న్యూస్‌టుడే: గత కుండపోతగా కురిసిన వర్షాలకు మంచి రోడ్లు వచ్చాయి. ‘ఈనాడు’లో ‘మేమున్నాం.. మీకు తోడుగా..’లో వచ్చిన పలు వార్తలకు అధికారులు స్పందించారు. 74, 75 వార్డుల్లో సుమారు రూ.3 లక్షలతో శివారు కాలనీల్లో సీసీరోడ్ల పనులను చేపట్టారు. దశలవారీగా మిగిలిన రోడ్లను పునరుద్ధరిస్తామని ఇంజినీరింగ్ అధికారులు స్పష్టం చేశారు.

మెగా వేడుక.. పాఠశాలే వేదిక..

10న పాఠశాలలు, కళాశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం

గోపాలపట్నం, న్యూస్‌టుడే

పాఠశాలల్లో సుహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఓ వేదికపై చేర్చేందుకు ఈనెల 10న ప్రాథమిక పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగులు (పీటీఎం) నిర్వహించాలని తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. పశ్చిమ, గాజువాక పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని వేడుకలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రైవేటు సంస్థల్లోనూ..: గతంలో విద్యాశాఖ సంబంధించిన కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకే పరిమితమయ్యేవి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహించబోయే రెండో సమావేశాన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అన్ని జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు ఇది వర్తించనుంది.

సమగ్ర వివరాలతో నివేదిక..: సమావేశం జరిగే రోజు పిల్లల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేస్తారు. కార్డులను సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ముద్రించనున్నారు. అందులో మార్కులు, హాజరు వివరాలతో పాటు ఆటలు, సాంస్కృతిక, ఇతరత్రా రంగాల్లో కనబరిచిన ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి వివరాలు పొందుపరుస్తారు. ★ పిల్లలు ఇళ్ల వద్ద సెల్‌ఫోన్, ట్యాబ్‌లు ఎక్కువగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా తల్లులకు రంగువల్లులు, తండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ★ ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులను సైతం వేడుకలకు ఆహ్వానిస్తారు. విద్యాహక్కు చట్టం, ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు అంశాలపై అవగాహన కల్పిస్తారు.

★ తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు నిర్వహించి కొత్త కార్యవర్గ పట్టిక ఈసారి పలు ప్రశ్నలను జోడించారు. ఎన్నడూ లేని విధంగా పిల్లల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులు కేటాయించారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బృంద చిత్రాలు తీసుకునేలా ఫొటో స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అమ్మ పేరిట మొక్కలు నాటడం, విజయగాథలు, పాఠశాల సాధించిన ప్రగతిని వేదికపై వెల్లడిస్తారు.

గోపాలపట్నం మండల పరిధిలో ఇలా..: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 4, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు 4, రెసిడెన్షియల్-1 ఉన్నాయి. మండల ప్రాథమిక పాఠశాలలు 28 కాగా ప్రైవేటు పాఠశాలలు 104 ఉన్నాయి. సుమారు 28వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పీటీఎం మీటింగ్ రోజున కూటమి ప్రభుత్వం సరఫరా చేసిన విద్యామిత్ర, యూనిఫారం ధరించుకోవాలి. తల్లిదండ్రుల్లో ఒకరు తప్పనిసరిగా హాజరయ్యేలా విద్యార్థులు చూసుకోవాలి.

ప్రజలకు అందుబాటులో రేషన్ సరకులు

అక్కిరెడ్డిపాలెం (బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : రామ్‌నగర్‌లోని చౌకధరల దుకాణం నుంచి గతంలో గిరిప్రసాద్ కాలనీ, రాజీవ్‌నగర్, కాళికానగర్ కాలనీలకు రేషన్ సరకులు పంపిణీ ఎండీయూ ద్వారా జరిగేవి. ఇప్పుడు ఎండీయూ విధానం తీసేయడంతో ఆ మూడు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష డీఎస్‌వో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నెలలో 15 రోజులు కాళికానగర్‌లో రేషన్ సరకులు అమ్మేలా గురువారం సర్కిల్-3 ఏఎస్‌వో కృష్ణ కొత్త కౌంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గుడివాడ లతీశ్, ఎస్.అనంతలక్ష్మీ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణం ప్రారంభిస్తున్న ఏఎస్‌వో కృష్ణ

తల్లి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

సింధియా, న్యూస్‌టుడే : కూరగాయలు తెస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటనపై గురువారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. క్రాంతినగర్‌లో నివాసం ఉంటున్న మహిళ ఈనెల 2న రాత్రి 8 గంటలకు కూరగాయాలు తెస్తానని గాజువాక వెళ్లారు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుమార్తె ఫిర్యాదుతో మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుని మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘సూర్యఘర్’తో విద్యుత్తు ఆదా

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇ.ఇ. నాయుడు, పక్కన కార్పొరేటర్ స్టాలిన్, తదితరులు

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే : విద్యుత్తు బిల్లుల భారం లేకుండా సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్తుతో ఎంతో ఉపయోగం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఇ.ఇ. బీకే నాయుడు అన్నారు. గురువారం చినగంట్యాడ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లో సోలార్ రూఫ్‌టాప్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, డీఈఈ పార్థసారథి, జెడ్పీ శేషాద్రి, చినగంట్యాడ ఏఈ రామకృష్ణ, కూటమి నాయకులు సిరసపల్లి నూకరాజు, పుచ్చా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం

గాజువాక, న్యూస్‌టుడే: అందివచ్చిన ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐల ఉపసంచాలకులు ఆర్‌వీ రమణ అన్నారు. గురువారం గాజువాక ప్రభుత్వ స్టీల్‌సిటీ ఐటీఐలో హ్యూందాయ్ ఇండియా మోటార్స్ సంస్థ ఆధ్వర్యంలో 22 మంది మోటార్ మెకానిక్ విద్యార్థులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 65వ వార్డు కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు, ప్రిన్సిపల్ కె.ఎస్.శ్రీనివాసరావు, సంస్థ రీజనల్ హెడ్ మనోజ్, ప్రతాప్, అక్రమ్, రాజమహేంద్రవరం, విశాఖ సర్వీస్ మేనేజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో ఐటీఐల ఉపసంచాలకుడు రమణ, కార్పొరేటర్ పాత్రుడు తదితరులు

జీతాల బకాయిలు చెల్లించాలని నిరసన

నిరసనలో పాల్గొన్న కార్మికులు

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలో చెత్త తరలించే క్లాప్ వాహనాల లోడర్లు, పొరుగుసేవల కార్మికులు గురువారం నిరసనకు దిగారు. జోనల్ కార్యాలయం యార్డు వద్ద జీతాల బకాయిలు చెల్లించాలని నిరసన తెలుపుతూ వాహనాలను కదలనివ్వలేదు. దీంతో ఒక వాహనం ముందుకు వెళ్లగా అడ్డుకునే ప్రయత్నంలో లక్ష్మి అనే కార్మికురాలు గాయపడింది. దీంతో ఆగ్రహించిన కార్మికులు ధర్నా నిర్వహించి గాజువాక పోలీసు స్టేషన్‌కు చేరుకుని నిరసన చేపట్టారు. 160 మంది లోడర్లు, 15మంది సూపర్‌వైజర్లకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని యూనియన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఐ పార్థసారథి ఇరువర్గాలతో చర్చించి శాంతింపజేశారు.

చినుకు పడింది... గొయ్యి పెద్దదైంది..

దర్పణం

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 58వ వార్డు కొత్తనక్కవానిపాలెం సేవా రహదారిలో పైపులైను కోసం తవ్విన గొయ్యి పెద్దదైంది. ఈ పైపులైను గొయ్యి కూడా దాదాపుగా రోడ్డు మధ్యలోంచి తవ్వడం వల్ల ఒక వాహనం వెళితే మరో వాహనం దాటివెళ్లడానికి ఆస్కారం ఉండటం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. తక్షణం పైపులైను పనులు పూర్తిచేసి తవ్విన గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

కొత్తనక్కవానిపాలెం రహదారి మధ్యలో గొయ్యి

భక్తిశ్రద్ధలతో కుసుమహరనాథ సప్తాహం

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే: దువ్వాడలోని ఆశ్రమంలో కుసుమహరనాథ సప్తాహం గురువారం ప్రారంభించారు. ఈనెల 10వ తేదీ వరకు ‘జయ హరనాథ జయ కుసుమ కుమారి జయ నామ’ సప్తాహం కొనసాగుతుందన్నారు. గురువారం మధ్యాహ్నం ఊయలోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బలరాముడిగా జగన్నాథుడు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలో శ్రీ జగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఇంద్రద్యుమ్న హాలులో కొలువుదీరిన స్వామి వారిని ప్రధాన అర్చకుడు గురు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉక్కు పునరావాస కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ బొర్రమాంబ, మరిడిమాంబ పారాయణ సమితిల ప్రతినిధులు విష్ణు సహస్రనామం చదివి వినిపించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన భజన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా పెద్దింటమ్మ అమ్మవారి పండగ

సింధియా (జవహర్‌నగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం నగరాల వీధిలో గురువారం పెద్దింటమ్మ పండగ నిర్వహించారు. ఏటా గోనాలమ్మ, పెద్దింటమ్మ వార్ల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే ఉదయం నుంచి భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చారు. కుంకుమ పూజలు, అభిషేకాల కోసం పరిసర ప్రాంత వాసులు కూడా అమ్మవార్లను సందర్శించారు. నిర్వాహకులు బి.నాగభూషణం, ఎం.సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గోపాలపట్నం, న్యూస్‌టుడే : మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నరసింహనగర్, వుడాకాలనీ, టైలర్స్‌కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, నాగేంద్రకాలనీ, సూర్యానగర్, సంతోష్‌నగర్, డీఏఆర్.నగర్, గోపాలపట్నం పెట్రోల్‌బంకు పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 డివిజనల్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

గోతులను పూడ్చండి..

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో గతంలో పైపులైను పనుల కోసం గోతులు తవ్వారు. తర్వాత పైపైన పూడ్చి వదిలేశారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో మళ్లీ గోతులు పడ్డాయి. డీమార్ట్ సమీపంలో రోడ్డు మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా మారడంతో కొంతమంది హెచ్చరికగా కొమ్మ పెట్టారు. ఈ గొయ్యిని పూడ్చాల్సిన అవసరం ఉంది.

గొయ్యిలో పెట్టిన కొమ్మ

సుపరిపాలనతో సమూల మార్పు

గాజువాక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సుపరిపాలన ద్వారా సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని తెదేపా రాష్ట్ర పరిశీలకుడు ఎంవీవీ చౌదరి అన్నారు. గురువారం గాజువాక కార్యాలయంలో సుపరిపాలన-తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రతి ఇంటికెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలన్నారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నగర మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మీ, జిల్లా టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు రతన్‌కాంత్, తెలుగుయువత అధ్యక్షుడు బలగా బాలునాయుడు, నాయకులు పల్లా రమణ, సింగూరి అనంత్ తదితరులు పాల్గొన్నారు. ★ గాజువాక 66వ వార్డులో సుపరిపాలన కరపత్రాలను వార్డు నాయకులు గోమాడ వాసు, ఎండీ రఫీ, రతన్‌కాంత్, మార్కెటింగ్ డైరెక్టర్ రాంబాయి, సత్యనారాయణ ఆవిష్కరించారు.

సమావేశంలో తెదేపా పరిశీలకుడు చౌదరి, తదితరులు

కొండవాలు.. బిక్కు బిక్కు

ప్రమాదకరంగా ఇళ్లు

కాకరలోవ కొండవాలులో రక్షణగోడకు వచ్చిన పగుళ్లు

మల్కాపురం, న్యూస్‌టుడే : ఏకధాటిగా వర్షాలు కురుస్తుంటే కొండవాలు ప్రాంతాల ప్రజలు భయం భయంతో గడుపుతుంటారు. ఏ కొండచరియ విరిగి పడుతుందో.. నిద్రలో ఉన్నప్పుడు ఏ గోడ కూలుతుందోనని భయపడుతూ కాలం గడుపుతుంటారు. వలస కూలీలు, రోజువారి పనిచేసుకునేవారు ఎక్కువమంది ఈ కొండవాలులోనే నివాసం ఉంటుంటారు. గతంలో వర్షాల సమయంలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడి, గోడలు, పైకప్పులు పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేకపోలేదు. పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల్లో సుమారు 80 శాతం నివాసాలు కొండవాలుపైనే ఉంటాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం 63వ వార్డు కాకరలోవ కొండవాలుపై మరుగుదొడ్లకు సంబంధించిన గోడ పగుళ్లిచ్చింది. రక్షణ గోడల నిర్మాణంతో కొంతవరకు ఈ సమస్యను నివారించవచ్చు.

6న ఉక్కు నిర్వాసితుల బహిరంగ సభ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కూడలిలో ఈనెల 6న నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు విందుల చిరురాజు, గల్లా రామకృష్ణలు కోరారు. ఈ మేరకు గురువారం పెదమడక కాలనీలో సభ గోడపత్రికను ఆవిష్కరించారు. నిర్వాసిత సంఘం నాయకులు ఎం.వెంకటేష్, చిన్నారావు, అప్పలరాజు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ మండల ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ డి.అప్పలనాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి అక్కడి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మీ, మాధవి, ప్రభాకరరావు, ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న అప్పలనాయుడు

రిఫైనరీ గేటు వద్ద రద్దీ

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం హెచ్‌పీసీఎల్‌కు చెందిన విశాఖ్ రిఫైనరీ గేట్ల వద్ద గురువారం ఉదయం ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. సేవా రహదారి వెంట ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులంతా లోనికి వెళ్లే మూడు గేట్ల వద్ద కూడా గంటన్నర సేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రద్దీ నియంత్రణకు అటు కంపెనీ.. ఇటు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన వాహనాలు

రాష్ట్ర భాజపా అధ్యక్షుడికి ఘన స్వాగతం

ఎన్‌ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర భాజపా అధ్యక్ష పదవి వరించాక పీవీఎన్ మాధవ్ గురువారం విశాఖకు రాగా.. విమానాశ్రయంలో ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పశ్చిమ కన్వీనర్ దాడి పురుషోత్తమరమేశ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కూడా పాల్గొన్నారు.

భాజపా శ్రేణుల ర్యాలీ: గాజువాక, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ విశాఖ విమానాశ్రయానికి వచ్చిన సందర్భంగా ఘన స్వాగతం పలకడానికి గాజువాక నుంచి పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నగర ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే: హిమాచల్‌నగర్, గాజువాకడిపో, శ్రీహరిపురానికి చెందిన పార్టీ ప్రతినిధులు కె.గురుమూర్తి, పి.శ్రీనివాసరావు, హరిత, భువనేశ్వరి, రామకృష్ణ, తదితరులు కూడా ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లి మాధవ్‌కు స్వాగతం పలికారు.

మాధవ్‌కి స్వాగతం పలుకుతున్న భాజపా నాయకులు

సాంకేతిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: న్యాక్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఎనర్జీ మీటర్ జూనియర్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణకు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ డైరెక్టర్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై, 18 నుంచి 48 ఏళ్ల వయసు గల వారికి 3 నెలల పాటు గాజువాక న్యాక్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అవకాశం వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్- 83090 03957కు సంప్రదించాలని కోరారు.

ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటాం: గణబాబు

57వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

కరాస, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 57వ వార్డులో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు ప్రారంభించారు. ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటామన్నారు. పాతఐటీఐ కూడలి నుంచి సుభాష్‌నగర్ వరకు పార్టీ జెండాలతో కూటమి నాయకులతో కలిసి పాదయాత్రగా వెళ్లారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు, వార్డు కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ, కూటమి నాయకులు కుట్టా కార్తీక్, కిల్లి శ్రీరామమూర్తి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 86వ వార్డు తెదేపా అధ్యక్షులు నల్లూరి సూర్యనారాయణ బూత్ కమిటీ సభ్యులతో మాతృశ్రీనగర్‌లో, 87వ వార్డులో కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు.

మల్కాపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 63వ వార్డు చింతలోవలో వార్డు తెదేపా అధ్యక్షులు జెర్రిపోతుల నర్సింగరావు పార్టీ శ్రేణులతో కలిసి తెదేపా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెదేపా నాయకులు పి.మౌర్య సింహ, కార్యకర్తలు పాల్గొన్నారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఇరుకు మార్గం విస్తరణ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 76వ వార్డు బర్మాకాలనీ దుర్గాగుడి నుంచి ఎస్టీకాలనీ మీదుగా స్వతంత్రనగర్ వెళ్లే రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. జీవీఎంసీ ప్రత్యేక నిధుల నుంచి సుమారు రూ.36లక్షలతో ప్రస్తుతం ఉన్న ఇరుకు మార్గాన్ని రెండువైపులా రెండేసి మీటర్ల చొప్పున ‘డ్రైన్ టు డ్రైన్’ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ వార్డులోని నడుపూరు, బర్మాకాలనీ, శీరంవానిపాలెం, గొల్లపేట, డైరీకాలనీ, హౌసింగ్‌బోర్డుకాలనీ వాసులు అటుగా వెళ్లాలంటే ఇరుకుదారిలో నానా ఇబ్బందులు పడేవారు. పనులను వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు.

కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

‘ఆడుదాం ఆంధ్రా’పై విజిలెన్స్ అధికారుల ఆరా

జోన్-2 కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు యువత ఓట్ల కోసం రూ.కోట్ల ఖర్చు చేసి ‘ఆడుదాం-ఆంధ్రా’ పేరిట క్రీడలను తూతూమంత్రంగా నిర్వహించింది. ఇందులో ఐ-ప్యాక్ సంస్థకు రూ.కోట్ల ధారాదత్తం చేసిందని, పోటీల నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 5 నుంచి 13 వార్డుల్లో 91 సచివాలయాల పరిధిలో ఉన్న అడ్మిన్‌ల నుంచి వివరాలు సేకరించారు. ఎంతమంది ఆడుదాం ఆంధ్రా యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు? ఏయే ప్రాంతాల్లో పోటీలు నిర్వహించారు? ఎంతమందికి కిట్లు అందించారు? ఎంత ఖర్చు చేశారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

భర్త కనిపించడంలేదని ఫిర్యాదు

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 58వ వార్డు ఏదురువానిపాలెంకు చెందిన లెక్కల బాబూరావు(38) కనిపించడం లేదని భార్య ఫిర్యాదుతో గురువారం గాజువాక పోలీసులు నమోదు చేశారు. గత నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాబూరావు ఇప్పటి వరకు ఇంటికి చేరలేదు. దీంతో భార్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ కేసుని సీఐ పార్థసారథి పర్యవేక్షణలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

అటెండెన్స్ ప్రోత్సాహకంపై హర్షం

సింధియా, న్యూస్‌టుడే: హిందుస్థాన్ షిప్‌యార్డులో ఎల్.సిరీస్ ఉద్యోగులకు అటెండెన్స్ ప్రోత్సాహకాన్ని యాజమాన్యం ప్రకటించింది. ఇప్పటి వరకు సంస్థలో కేవలం పర్మినెంటు ఉద్యోగులకు మాత్రమే ఇది వర్తించేది. ఎప్పటి నుంచో కార్మిక సంఘం ఎల్.సిరీస్ ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలని కోరుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యాజమాన్యం నెలలో మూడు సెలవులు వరకు మాత్రమే వినియోగించుకుని మిగతా పనిదినాల్లో హాజరైతే ఈ ప్రోత్సాహకం ఉపయోగపడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఆ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ వర్ధంతి
మంచికి మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మీరు మరణించి నేటికి 1 సం॥ గడిచినా మీ మధురస్మృతులు మరువలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ..
భర్త: S. శ్రీరామచంద్రమూర్తి
కుమారుడు: S. విశ్వనాగమోహన్
కోడలు: S. నాగపద్మప్రియ
మనుమరాళ్ళు: తేజశ్రీ, యశ్విత
కీ॥శే॥ శీమకుర్తి శ్రీలక్ష్మి గారు
జననం: 15-05-1953 మరణం: 04-07-2024

స్వర్ణాంధ్ర సాధనకు దీర్ఘకాలిక ప్రణాళిక

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ఈనాడు, విజయనగరం: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇందుకు దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047పై నియోజకవర్గాల వారీ తయారు చేసిన ప్రణాళికలు, పీ-4 కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. 2029 నాటికి వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధి సాధించాలని, సాగులో లేని భూములను గుర్తించి, ప్రత్యామ్నాయ, అంతర పంటల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పేలా క్షేత్ర స్థాయిలో ప్రణాళికలు కార్యాచరణలోకి తీసుకురావాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న మంత్రి అనిత, చిత్రంలో మంత్రి కొండపల్లి, ఎంపీ కలిశెట్టి, హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

శక్తి యాప్, వీడియో ఆవిష్కరణ

మహిళల రక్షణకు పోలీసు శాఖ రూపొందించిన శక్తి యాప్‌ను హోం మంత్రి ఆవిష్కరించారు. ప్రత్యేకంగా వీడియో రూపొందించిన ఎస్పీ వకుల్ జిందాల్, పోలీసు అధికారులను అభినందించారు. ఇప్పటికే 1.20 కోట్ల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు.

జగన్‌కు ఏ రకమైన భద్రత కావాలి!

'భద్రత ఇవ్వలేదు.. రోప్ పార్టీల్లేవు..' అంటూ వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని, అసలు ఏ రకమైన భద్రత కావాలో చెప్పాలని మంత్రి అనిత ప్రశ్నించారు. ఆయనకు జడ్ ప్లస్ భద్రత కల్పిస్తున్నామన్నారు. ఒక వ్యక్తి మృతిచెందితే వారింటికి వెళ్లి, కుటుంబ సభ్యులను ఓదార్చాలని.. వారినే ఇంటికి పిలిపించుకుని ఓదార్చడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. ఓదార్పు ఫ్రం హోంలా ఇది కనిపిస్తోందన్నారు.

మ్యాపింగ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

నిధులతో ప్రగతి పనులు: ఎంపీ

ఎంపీ ల్యాడ్స్‌తో డిజిటల్ ల్యాబ్, యోగా సెంటర్, రీడింగ్‌రూమ్ నిర్మిస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రకటించారు. ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, గాదె శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి, కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేధుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

264 కుటుంబాలను దత్తత తీసుకుంటా: మంత్రి శ్రీనివాస్

తన నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలున్నాయని, ఒక్కో కేంద్రం పరిధిలో ఒక్కో పేద కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ఉద్యాన పంటల సాగు, వాటి ఉత్పత్తుల పెంపునకు జిల్లాలో అవకాశం ఉందన్నారు. జిల్లాలో మ్యాంగో క్లస్టర్

మూడు రోజులు.. 3.30 లక్షల మందికి రేషన్

రాజాం: చౌక దుకాణాల ద్వారా తొలి మూడు రోజుల్లోనే 3.30 లక్షల మందికి రేషన్ పంపిణీ పూర్తి చేశారు. ఒకటో తేదీ నుంచి జిల్లాలోని దుకాణాల నుంచి రేషన్ తీసుకునేందుకు కార్డుదారులు వస్తున్నారు. సర్వర్ మొరాయిస్తుండడంతో కొంత ఇబ్బంది ఎదురవుతోంది. ఒకరి వేలి ముద్ర తీసుకునేందుకు చాలా సమయం పడుతోందని డీలర్లు చెబుతున్నారు. జిల్లాలో 1,249 దుకాణాల పరిధిలో 5,71,240 మందికి బియ్యం కార్డులు ఉండగా.. గురువారం సాయంత్రానికి 3,30,154 మందికి రేషన్ అందించారు. వృద్ధులు, దివ్యాంగులకు జూన్ 30లోపే ఇళ్లకు వెళ్లి డీలర్లు రేషన్ ఇచ్చారు.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు.

ఎవరైనా వేధిస్తున్నారా మీ దృష్టికొచ్చిందా..? కలెక్టర్

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు కుల పేరుతో వేధింపులపై కలెక్టర్ అంబేడ్కర్ ఆరా తీశారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో శాఖల వారీగా అధికారులతో మాట్లాడారు. మీ శాఖల్లో ఉద్యోగులను ఎవరైనా వేధిస్తున్నారా? మీ దృష్టికొచ్చిందా? అంటూ ప్రశ్నించారు. అలా లేదని సమాధానమిచ్చారు. ఈలోగా కలెక్టరే స్పందిస్తూ.. తానే ఒక బాధితుడినని నవ్వుతూ సమాధానమిచ్చారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం త్వరగా చేరాలన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో, పురపాలక కమిషనర్లకు సూచించారు. ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు పలుచోట్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు.

శానిటేషన్ సూపర్‌వైజర్లను కొనసాగించాలి

అంబేడ్కర్ గురుకులాల్లో ఇటీవల తొలగించిన శానిటేషన్ సూపర్‌వైజర్లను కొనసాగించాలని కమిటీ సభ్యుడు మజ్జి గణపతి డిమాండు చేశారు. గుత్తేదారుడు మారడంతో పాతవారిని తొలగించి, కొత్తవారిని నియమిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేధు మాధవన్, ఇన్‌ఛార్జి డీఆర్వో మురళి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎం.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

సూచనలిస్తున్న జేసీ సేధు మాధవన్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని జేసీ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. తన ఛాంబర్లో గురువారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడారు. రోడ్లు, కూడళ్లు, బ్లాక్ స్పాట్లు, పాఠశాలల వద్ద ఆక్రమణలు తొలగించాలని, జాతీయ రహదారుల సమీపంలోని గ్రామాల వద్ద గార్డ్ రైలింగ్, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. అనధికార పార్కింగ్ లేకుండా చూడాలని, వ్యతిరేక దిశలో వెళ్లేవారిపై కేసులు పెట్టాలన్నారు. ఆర్ అండ్ బీ, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలని చెప్పారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.కాంతిమతి, జిల్లా రవాణాశాఖాధికారి డి.మణికుమార్, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్ ఎప్.పి.పద్మశ్రీ రాణి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రయాణం.. అందుకే పురస్కారం

★ గంట్యాడ, రాజాం సమాఖ్యల స్ఫూర్తి
★ 'ఆత్మ సంఘటన్'లో మొదటి, మూడు స్థానాలు

అందరిలానే బ్యాంకుల నుంచి రుణాలు పొందిన సంఘాలవి.. తమ ప్రయాణం అంతటితో ఆపలేదు. ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ అదనపు రుణాలు తీసుకునేందుకు అర్హత పొందాయి. పొదుపు నియమాలు పాటిస్తూ ఆ సొమ్ముతో ఆదాయం ఆర్జిస్తున్నాయి. అత్యాధునిక యూనిట్లు పెట్టి ఔరా అనిపించి పురస్కారాలు పొందుతున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్(డీఏవై-ఎన్ఎల్ఆర్ఎం)... ఏటా మండల సమాఖ్యలకు ఆత్మనిర్భర్ సంఘటన్ పురస్కారాలు ఇస్తున్నాయి. 2024-25 ఏడాదికి సంబంధించి జిల్లాలోని గంట్యాడ, రాజాం సమాఖ్యలు... ప్రథమ, తృతీయ స్థానాలకు ఎంపికయ్యాయి. రూ.3 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు బహుమతులను అందుకోనున్నాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి, అర్బన్ గంట్యాడ, రాజాం

డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

పనితీరు భేష్..

రాజాం సమాఖ్య దీన్ దయాళ్ అంత్యోదయ యోజన- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(డీఏవై- ఎన్ఆర్ఎల్ఎం) లక్ష్యాలను సాధించడంలో అద్భుత పనితీరు కనబరుస్తోంది. ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సాధికారత తదితర అంశాల్లో రాష్ట్రంలోనే ఉత్తమంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం ద్వారా తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. అయిదేళ్లు పైబడిన కేటగిరీలో ఉత్తమ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్(సీఎల్ఎఫ్) విభాగంలో పురస్కారం పొందనుంది.

స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతి ప్రదానం

ఆగస్టు 15న దిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో ఈ రెండు సమాఖ్యలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందుకోనున్నాయి. సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది కృషితో ఈ పురస్కారాలు సాధించామని డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి ప్రకటించారు. ఆయన్ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దేవానంద్, కలెక్టర్ అంబేడ్కర్ అభినందించారు. ఈ విజయం ముఖ్యమంత్రిదేనని ఎంఎస్ఎంఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

ముచ్చటగా మూడోసారి

గంట్యాడ సమాఖ్యలో 1,707 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 1,240 గ్రూపులు ఏ-గ్రేడులో, మిగిలినవి బీ, సీల్లో కొనసాగుతున్నాయి. రుణాలు, చెల్లింపుల ఆధారంగా వీటికి కేటాయిస్తారు. ఏ గ్రేడు సాధించిన సంఘాలు ఈ మండలంలోనే అధికం. 2022, 2023లోనూ ఈ సమాఖ్య జాతీయ పురస్కారాలు కైవసం చేసుకుంది.

★ ఈ సమాఖ్య ఏటా రూ.2 కోట్ల మేర టర్నోవర్ చేస్తోంది. సంఘాల అంతర్గత అప్పులు, స్త్రీనిధిలో షేర్ క్యాపిటల్, పొదుపు నుంచి నెలకు సుమారు రూ.లక్ష ఆదాయం పొందుతోంది. బ్యాంకు లింకేజీ, ఉన్నతి, జీవనోపాధులు, స్త్రీనిధి, సామాజిక పెట్టుబడి, ఎస్వీఈపీ ద్వారా జీవనోపాధులను మెరుగు పర్చుకోవడంలో ముందంజలో ఉంది. ★ చెల్లింపులు, వసూళ్లలో వంద శాతంతో ముందుకెళుతోంది. ★ దస్త్రాల నిర్వహణ, మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా పారదర్శకత

గంట్యాడ మండల సమాఖ్య సమావేశం(పాతచిత్రం)

లావాదేవీలు చేపడుతోంది. సామాజిక చైతన్య కార్యక్రమాల్లో సభ్యులను భాగస్వామ్యం చేస్తోంది. సమాఖ్యలోని సభ్యుల్లో గత పంచాయతీ ఎన్నికల్లో 11 మంది సర్పంచులు, 105 మంది వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఒకరు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.

గతంలోనూ పలు అంశాల్లో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2016లో జిల్లాస్థాయి ఉత్తమ సమాఖ్యగా నిలిచింది. 2017లో గణతంత్ర దినోత్సవం, 2021లో స్వాతంత్ర్య దినోత్సవం, 2022లో గణతంత్ర వేడుకల్లో జిల్లా స్థాయి పురస్కారాలు పొందింది.

అంగన్‌వాడీల్లో ఇక తప్పనిసరి: పారదర్శక సేవలకు ముఖ హాజరు

ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

జిల్లాలో పరిస్థితి	
ప్రాజెక్టులు	11
కేంద్రాలు	2206
మిని	293

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సరికొత్త విధానాన్ని ప్రవేశపెడుతోంది. సరకుల పంపిణీ, ఇతర సేవలను అబ్ధిదారులకు పారదర్శకంగా అందించేందుకు ముఖ ఆధారిత గుర్తింపు విధానాన్ని అమలు చేయాలని సంకల్పించింది. దీని కోసం పోషణ్ ట్రాకర్ పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా వందశాతం అమలు ప్రారంభించారు. ఇప్పటికే 49,445 మంది లబ్ధిదారులకు గానూ 46,610 మంది హాజరును నమోదు చేశారు. అధికారులు, కార్యకర్తల సమన్వయంతో 94.27 శాతం ప్రక్రియ పూర్తయింది.

సరకులు పొందుతున్నవారు	
గర్భిణులు	7,050
బాలింతలు	5,590
మూడేళ్లలోపు బాలలు	37,070

రాష్ట్రంలో బాలసంజీవని..

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తున్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు, మూడు యాప్‌లలో లోపాలు ఉండటంతో చాలా వరకు సరకు పక్కదారి పట్టేది. కార్యకర్తల హాజరు సైతం అంతంత మాత్రంగానే ఉండేది. కూటమి రాకతో అందరికీ వర్తించేలా బాలసంజీవని యాప్ 2.0ను తీసుకొచ్చింది. సిబ్బందితో పాటు లబ్ధిదారులకు రోజూ ఉదయం, సాయంత్రం ముఖ హాజరు తప్పనిసరి చేసింది. ప్రక్రియ పక్కాగా సాగేలా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

చరవాణికి సందేశం..

కొత్తగా తీసుకొచ్చిన పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా అంగన్‌వాడీ సేవలను ఎప్పటికప్పుడు తెలుసుకోనున్నారు. సరకులు పొందిన వెంటనే లబ్ధిదారు చరవాణికి సందేశం సైతం వెళ్తుంది. తీసుకున్న పదార్థాల గురించి తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా పర్యవేక్షణ సైతం సులువు కానుందని, నకిలీలుంటే బయట పడతాయని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి తెలిపారు. లబ్ధిదారులంతా ముఖ హాజరును నమోదు చేసుకోవాలని కోరారు.

పురుషోత్తమం.. పుష్పశోభితం

విజయనగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామికి గురువారం నేత్రోత్సవం, పూలంగి సేవ జరిగింది. రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

రోగం ముసురుతోంది.. ఓపీ పెరుగుతోంది

జిల్లాలో నాలుగు రోజులుగా చిరు జల్లులు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రోగాలు ముసురుకుంటున్నాయి. దీంతో పెద్దఎత్తున ఆసుపత్రులకు వరస కడుతున్నారు. విజయనగరంలోని మహారాజా ప్రభుత్వాసుపత్రి గురువారం కిక్కిరిసింది. 1500లకు పైగా ఓపీ నమోదైనట్లు వైద్య వర్గాలు తెలిపాయి. అయితే కొందరికి చీటీలు దక్కినా వెళ్లేసరికే వైద్యులు భోజనాలు, ఇతర పనులపై బయటకు వెళ్లిపోయారు. దీంతో పలువురు నిరాశతో వెనుదిరిగారు.

– న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం

మేలో పోటు.. జూన్‌లో లోటు

ప్రస్తుత వర్షాలతో చిగురిస్తున్న రైతు ఆశలు

ఈనాడు, విజయనగరం

వ్యవసాయానికి జీవనాధారమైన నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందస్తుగా పలకరించాయి. చాలా ఏళ్ల తర్వాత మే నెల చివరి వారంలో నిప్పులు కురిసే మండు వేసవిలో వానలు దంచికొట్టాయి. సాధారణం కంటే అధికంగా కురిశాయి. ఖరీఫ్‌కు కలిసొచ్చే పరిస్థితులు కనిపించాయి. జూన్‌లో మాత్రం సాధారణ వర్షపాతంతో పోలిస్తే లోటు నమోదైంది. దీంతో పొలం పనుల జోరు తగ్గింది. తొలుత కురిసిన వర్షాలతో కాస్త కలిసొస్తుందని రైతులు భావిస్తున్నారు.

పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు

అల్పపీడన ప్రభావం వల్ల జులై ఒకటి నుంచి వానలు కురుస్తున్నాయి. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు కురిసిన వానలు జిల్లా అంతటా సమాంతరంగా లేకపోయినా పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో రైతులు వరి విత్తనాలు వెద జల్లుతున్నారు. వాతావరణం మార్పు వల్ల కురుస్తున్న వర్షాలు తగ్గితే నారుపోతలు ముమ్మరం చేస్తారు. జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 123.5 మి.మీ. కాగా 115.2 శాతం కురిసింది. అత్యధికంగా ఎల్.కోటలో 88 శాతం, వేపాడలో 58.2 శాతం, మెంటాడలో 56.5 శాతం అధికంగా నమోదైంది. బొబ్బిలి, రామభద్రపురంతోపాటు మరో అయిదు మండలాల్లో లోటు నమోదైంది. రబీలో కురిసిన వానలకు చాలా చోట్ల చెరువుల్లో నీరు చేరింది. తాజా వర్షాలకు అదనంగా చేరుతోంది. వీటి ఆయకట్టు భూముల్లో వరి, మొక్కజొన్న, అపరాలు, నువ్వులు సహా కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు.

40 శాతం నారుపోత పూర్తి

జిల్లాలో ఈ ఏడాది లక్ష హెక్టార్ల వరి సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 40 శాతం వరినారు పోత పూర్తయింది. రెండు వేల హెక్టార్లలో వెదజల్లారు. గతేడాది జులై ఒకటి నాటికి 2,951 హెక్టార్లలో విత్తనాలు చల్లగా, ఈ ఏడాది 4,500 హెక్టార్లలో చల్లారు. ఇప్పటి వరకు 46 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు సరఫరా చేశారు. మరో నాలుగు వేల క్వింటాళ్లు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేశారు.

జిల్లాలో జూన్ నెలలో నమోదైన వర్షపాతం (మి.మీ)

ఏడాది	సాధారణం	కురిసినది	వ్యత్యాసం (శాతం)
2022	123.5	171.4	38.8
2023	123.5	59.4	-51.9
2024	123.5	213.7	73
2025	123.5	115.2	-6.7

కాసులు ఇవ్వక.. కన్నీళ్లు ఆగక!

వైకాపా నిర్వాకంతో జైకా పనులు నిలుపుదల

న్యూస్‌టుడే, బొబ్బిలి

గత ప్రభుత్వం జైకా నిధులుండీ పనులు చేయలేకపోయింది. గుత్తేదారులు దాదాపు రూ.17 కోట్ల పనులు చేయగా పైసా చెల్లించలేదు. ఆయా నిధులను పక్కదారి పట్టించి, ఇతర అవసరాలకు వినియోగించేసింది. దీంతో రెండున్నరేళ్లుగా పనుల్లో పురోగతి లేదు. వీటిని ప్రారంభించి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు 30 శాతం కూడా కాలేదు. కూటమి హయాంలో నోటీసులు ఇచ్చినా గుత్తేదార్ల నుంచి స్పందన లేదు. ఫలితంగా 25 శాతం కంటే తక్కువ కావడంతో పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. పాత గుత్తేదార్లతో చేయించాలా? రీ టెండర్లు పిలవాలా? అన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం అమరావతిలో ఇంజినీర్లతో సమీక్షించారు.

కదల్లేదు జైకాలో వెంగళరాయ సాగర్ ఆధునికీకరణలో భాగంగా అక్విడక్టు పనులు, జలాశయం చుట్టూ రక్షణగోడ, రెగ్యులేటర్ లీకులు అరికట్టడం, విద్యుత్తు సౌకర్యం, తూములు, షట్టర్లు ఏర్పాటు వంటి పనులు జరగాలి. హెడ్‌వర్క్స్ పనులు మాత్రం చేపట్టారు. గోముఖి నదిపై అక్విడెక్టు పనులు ప్రారంభించాలి.

పడకేశాయి పెద్దగెడ్డ జలాశయం గేట్ల మరమ్మతులు, లైనింగ్ పనులు, మట్టికట్ట పటిష్ఠం వంటివి చేపట్టాలి. కొన్నిచోట్ల తూములకు షట్టర్లు అమర్చాలి. సైఫాన్లు నిర్మించాలి. కాలువ లోపాలు సవరించాలి. వట్టిగెడ్డలో లైనింగ్, సైఫాన్లు నిర్మించాలి. పెదంకలాం పనుల్లో ఆది నుంచి జాప్యం జరుగుతూనే ఉంది.

జలాశయం	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)	ఖర్చు చేసింది (రూ.కోట్లలో)
వెంగళరాయసాగర్	63.50	12
పెద్దగెడ్డ	28.18	2.50
వట్టిగెడ్డ	44.85	2
పెదంకలాం	17.30	0.50

వెంగళరాయ కుడి ప్రధాన కాలువ పరిధిలో సగంలో ఆగిపోయిన లైనింగ్ నిర్మాణం

ఉన్నతాధికారులకు నివేదించాం

జైకాలో 25 శాతం కంటే తక్కువ పనులు జరగడంతో తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతానికి పనులు నిలిచిపోయాయి. ఖరీఫ్‌లో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం.

– అప్పారావు, పర్యవేక్షక ఇంజినీరు, జలవనరుల శాఖ

వర్షం పడకపోతే నష్టమే

పెద్దగెడ్డ నుంచి మా గ్రామ పరిధిలోని 300 ఎకరాలకు చుక్కనీరు అందడం లేదు. వర్షం పడితేనే పొలం తడిచేది. గతేడాది పంట నష్టపోయా. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

– బి.సీతంనాయుడు, సోంపురం, రామభద్రపురం

పర్యాటక దారిలో ప్రమాదకారి

సోంపురం గెడ్డపై శిథిలస్థితికి చేరిన వంతెన
పెచ్చులూడి ప్రమాదకరంగా..

లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలోని గెడ్డపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఏళ్ల నాటి నిర్మాణం కావడంతో శిథిలస్థితికి చేరింది. ఎక్కడికక్కడే పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. విశాఖ నుంచి అరకు, అనంతగిరి, బొర్రా తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. దెబ్బతింటే రాకపోకలు నిలిచిపోతాయి. అయినప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని చోదకులు వాపోతున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో కొత్త వారధి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. నిధులు సైతం విడుదల చేశారు. ఈలోపు వైకాపా రావడంతో పనులు సాగలేదు. ఈ పరిస్థితిపై ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ అధికారి సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు జరిగే నాలుగు రోడ్ల నిర్మాణ పనుల్లో భాగంగా అక్కడ కొత్త వంతెన రానుందని చెప్పారు. ఇటీవల మట్టి పరీక్షలు చేపట్టామన్నారు. - న్యూస్‌టుడే, లక్కవరపుకోట

చినుకు పడితే మునకేయాల్సిందే!

బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జివలస రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన కింద వంతెనలో నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అందులో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. కొత్తపెంట, పనుకువలస గ్రామాలతో పాటు బాడంగి మండలం గొల్లాది గ్రామస్థులు కూడా ఈ మార్గం మీదుగా రాకపోకలకు సాగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు మీదుగా వెళ్లేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇందులోకి చేరిన నీరు బయటకు వెళ్లడానికి మార్గం లేదని స్థానికులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

ఇలా వదిలేయకండి సారూ..!!

ఈ మార్గం చూశారా.. ఎంత దారుణంగా ఉందో కదా.. సాలూరు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డిది. రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, ఖజానాశాఖ, ఎంఎల్‌ఎస్ పాయింటు తదితర విభాగాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. మరమ్మతులు లేకపోవడంతో ఎక్కడికక్కడే భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాటిల్లో నీరు చేరి, ఇలా బురదమయంగా మారింది. అధికారులు నిత్యం ఇటుగా వెళ్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్పందించి, బాగు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

తాటిపూడి నీటిని రైతుల ప్రయోజనాలకే వినియోగించాలి

శృంగవరపుకోట, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయం నీటిని రైతుల కోసమే వినియోగించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. ఈమేరకు గురువారం విజయనగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల నీటిని విడుదల చేసినందుకు గానూ అభినందనలు తెలిపిన ఆయన 2023 నాటి జీవోను సవరించాలని విన్నవించారు. అందులో జిందాల్ పరిశ్రమకు సైతం విడుదల చేయాలని పేర్కొన్నారని, అది తగదని చెప్పారు. ఇకనుంచి పూర్తిస్థాయిలో పొలాలకు అందించాలని కోరారు. ఈమేరకు ప్రభుత్వం, జలవనరులశాఖ మంత్రి, పరిశ్రమలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్/లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	92	154	164

న్యాయమూర్తి టీవీ.రాజేష్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

సీనియర్ సివిల్ జడ్జి టీవీ.రాజేష్ బదిలీ

న్యాయవార్తా విభాగం: విజయనగరంలోని జిల్లా న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జిగా, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేసిన టీవీ.రాజేష్ గుంటూరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, అదనపు న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, బి.అప్పలస్వామి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, కె.విజయ కళ్యాణి సత్కరించారు.

విజయనగరం ఏఎంసీ పాలకవర్గం ఖరారు

నర్సింగరావు, ఛైర్మన్

చంద్రనాయుడు, వైస్‌ఛైర్మన్

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల జాబితాను ప్రకటిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ గౌరవ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఛైర్మన్‌గా కర్రోతు వెంకట నర్సింగరావు, వైస్ ఛైర్మన్‌గా బొబ్బాది చంద్రనాయుడు(జనసేన) నియమితులయ్యారు. సభ్యులుగా ఆర్.అప్పలనాయుడు, వి.సంతోషి, ఎస్.సన్యాసప్పుడు, సీహెచ్.రమణ, వి.మణికుమారి, షేక్ హుస్సేన్, ఎం.దేవిశ్రీ, ఎన్.రమణమ్మ, సీహెచ్.రూపవాణి, ఎల్.గౌరి, యు.వెంకట అప్పారావు, ఎస్.సాయిరామ్, సీహెచ్.తాతయ్యతో పాటు గాజులరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు, నగరపాలక సంస్థ మేయర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి కొనసాగనున్నారు.

2,637 మంది బడి బయటే..!

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలో 2,637 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. 1-10 తరగతుల్లో చదువుతూ వేర్వేరు కారణాలతో వీరంతా చదువు మధ్యలో మానేశారు. వీరిని తిరిగి విద్యాలయాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోనున్నారు.

అంగన్‌వాడీల్లోని పిల్లలపై సర్వే చేస్తున్న అధికారులు

ఈ ప్రాంతాల్లో ఎక్కువ

మండలం	బడిబయట పిల్లలు
విజయనగరం	839
రాజాం	227
భోగాపురం	178
బొబ్బిలి	123
ఎస్.కోట	117
నెల్లిమర్ల	106

కారణాలివీ..

వలసలు, దీర్ఘకాలిక గైర్హాజరు, చదువు పట్ల ఆసక్తి లేకపోవడం తదితర కారణాలతో బాలలు దూరమవుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు గుర్తించి, పాఠశాలలు, వసతిగృహాలు, కేజీబీవీల్లో చేర్పిస్తారు. బడి రవాణా పథకం కింద ఏడాదికి రూ.6 వేలు చెల్లించనున్నారు. జిల్లాలోని 27 మండలాల్లోనూ ఇటువంటి వారున్నారు. విజయనగరం మండలంలో వీరి సంఖ్య అధికం. మరో ఆరు మండలాల్లో వందకు పైగా బడిబయట పిల్లలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు బట్టి తెలుస్తోంది.

5 ఏళ్లు నిండిన వారిపై సర్వే

ఆగస్టు 31 నాటికి అయిదేళ్లు పూర్తయిన వారిని బడిలో చేర్పిస్తారు. అంగన్వాడీల నుంచి ఒకటో తరగతిలో చేర్పించేందుకు ఏప్రిల్ నెలలో డ్రైవ్ నిర్వహించారు. మళ్లీ వీరి కోసం ఇంటింటి సర్వే చేపడుతున్నారు. పిల్లలు ప్రభుత్వ లేదా ప్రైవేటులో ఎక్కడ చేరారో తెలుసుకుంటారు. ఆయా వివరాలను విద్యాశాఖకు అందజేయాలని ఐసీడీఎస్ విభాగానికి కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు.

సార్వత్రిక విద్యాపీఠంలో..

పదోతరగతి తప్పినవారు, బడిమధ్యలో మానేసి 14 సంవత్సరాలు నిండిన వారికి సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాలు కల్పించనున్నారు. ఓపెన్‌స్కూల్ ద్వారా పదిలో ఉత్తీర్ణులైన వారిని ఇంటర్మీడియట్‌లో చేర్పిస్తారు. మహిళలు, ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధి వేతనదారులు కూడా చదువు కొనసాగించి, విద్యార్హతలు పొందేలా చర్యలు తీసుకున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.రామారావు తెలిపారు.

పురస్కారాలకు ఎంపిక.. హైదరాబాద్: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందికి '2023 ప్రతిభా పురస్కారాలు' ప్రకటించింది. ఎలనాగ(కవిత), డా.ప్రభల జానకి(విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి(చిత్రలేఖనం), సంపత్‌రెడ్డి(శిల్పం), పేరిణి రమేష్‌లాల్(నృత్యం), హరిప్రియ(సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి(పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ(నాటకం), కడకంచి పాపయ్య(జానపద కళారంగం) తదితరులను ఎంపిక చేసింది.

67 మందికి కారుణ్య నియామకాలు

నియామకపత్రం అందజేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి అనిత

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విధుల్లో ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధి నిర్వహణలో మృతిచెందిన వారి వారసులకు కారుణ్య నియామకాల కింద కలెక్టర్ ఛాంబర్లో గురువారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. రెవెన్యూ, ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ విభాగాల్లో స్థానాలు కల్పిస్తూ 67 మందికి అవకాశమిచ్చారు. వీరిలో 63 మందిని జూనియర్ సహాయకులు/టైపిస్టులుగా, నలుగురిని సబార్డినేట్లుగా నియమించారు. కలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, జేసీ సేధు మాధవన్ పాల్గొన్నారు.

ప్రశ్నించిన ప్రతిపక్షాన్ని బెదిరించడమేంటి: బొత్స

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విజయనగరం పట్టణం, అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అమలుకు నోచుకోని ఎన్నికల హామీలపై నేతలను ఎండగడుతూ 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తామని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మ్యానిఫెస్టో అమలు చేయమంటే తాట తీస్తాం.. తోలు తీస్తాం.. భూస్థాపితం చేస్తాం.. అనడం ఏంటని ప్రశ్నించారు. తాటాకు చప్పుళ్లకు బెదరమన్నారు. విజయనగరంలో గురువారం జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయాన్ని ఏప్రిల్, మే నెలల్లో ఇస్తామని శాసనమండలి సాక్షిగా చెప్పిన మంత్రి లోకేశ్ జులై వచ్చినా ఇవ్వలేదన్నారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ నైపుణ్యాభివృద్ధికి బదలాయించామని చెబుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు పథకంపై మాట మార్చారన్నారు. తమ పార్టీ మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా చూసిందన్నారు. రాష్ట్రంలో చంద్రన్న దగా, చంద్రన్న పగ.. ఈ రెండు తప్ప ఇంకేమీ లేవని వైకాపా ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వైకాపా సమావేశంలో గుర్తుతెలియని నాయకుడి చేతివాటం..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరంలో గురువారం జరిగిన వైకాపా జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన ఓ గుర్తుతెలియని నాయకుడు చేతివాటం ప్రదర్శించాడు. సమావేశం ముగిసిన తర్వాత ఎమ్మెల్సీ సురేష్‌బాబు బయటకు వెళ్తుండగా వెనుక నుంచి ప్యాంటు కుడి జేబులో ఉన్న రూ.70 వేలను దొంగిలించేందుకు ప్రయత్నించాడు. గుర్తించిన ఎమ్మెల్సీ అతని చేయి పట్టుకోగా డబ్బులు కింద పడేసి పరారయ్యాడు. అతడు ఎవరనేది గుర్తించలేదని ఆయన తెలిపారు.

VIGNAN's
INSTITUTE OF INFORMATION TECHNOLOGY (A)
INSTITUTE OF ENGINEERING FOR WOMEN (A)
DUVVADA, VISAKHAPATNAM-530049.
CAREER GUIDANCE AWARENESS PROGRAM
ARE YOU CONFUSED ABOUT ENGINEERING COURSES AND SELECTION ?
PARENTS & STUDENTS are invited to consult our Counselling Expert and clear doubts to fix Course and Goal
Date & Venue:
VIZIANAGARAM
Senate Hall, 4th Floor, SVN Lake Palace.
05th July 2025
SRIKAKULAM
Mythri Hall, Varam Residency, Day & Night Jn.
06th July 2025
COUNSELLING EXPERTS
Contact : 7989568554, 9849601031

ఆడపెయ్యల వృద్ధికి ప్రత్యేక చర్యలు

- రూ.150కి మేలు జాతి వీర్యం
- ఉచితంగా పిండ మార్పిడి

ఈనాడు, విజయనగరం, కొత్తవలస, రేగిడి, న్యూస్‌టుడే

లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన దూడ

కూటమి ప్రభుత్వం పాడి రైతులకు మేలు చేకూర్చే మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆడ పెయ్యల సంతతిని పెంచడానికి మేలు జాతి వీర్యాన్ని జులై 1 నుంచి రూ.150కి అందించనుంది. ఇంతవరకు రూ.500 వసూలు చేసేవారు. మరింత ఎక్కువ మంది లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ధరను భారీగా తగ్గించారు.

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంతో..

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఆడపెయ్యల శాతాన్ని వృద్ధి చేసి, పాల ఉత్పత్తి పెంచాలని భావిస్తోంది. దీనిలో భాగంగా నూతన సాంకేతికతతో పెయ్యిలను ఇవ్వగలిగే వీర్యాన్ని అభివృద్ధి చేసి అందిస్తోంది. ఏటా 15 శాతం పాల ఉత్పత్తిని పెంచాలని పశుసంవర్ధక శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో మేలు జాతి వీర్యంతో పాడి పశువులకు చూడి కట్టించడంపై ఆ శాఖ అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో సంతానోత్పత్తికి ఉపయోగపడే పాడి పశువులు 3.24 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. అన్ని పశువుల ఆసుపత్రుల్లో జులై 1 నుంచి మేలు జాతి వీర్యాన్ని అందజేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవీ.రమణ తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15 వేల ఇంజెక్షన్లు..

విజయనగరం జిల్లాలో 15 వేల ఇంజెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. మండల పశువైద్య కేంద్రాలు, ఆసుపత్రులు, పాలీక్లినిక్‌లు, ఆర్‌ఎస్‌కేల్లో అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 11 వేల ఇంజెక్షన్లు ఆయా కేంద్రాలకు సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అదనపు సౌకర్యాలు..

ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు ఇంకో సౌలభ్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. నేరుగా పశువులకు పిండమార్పిడి (ఎంబ్రో) చేయించుకునే అవకాశం కల్పించింది. రూ.5 వేల విలువైన ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితమని తెలిపారు. జిల్లాలో ఇద్దరు వైద్యులకు పిండమార్పిడిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జెర్సీ, ఒంగోలు లాంటి జాతుల లక్షణాలు పశువులకు శతశాతం రావాలంటే ఏడు తరాలు పడుతుందని, పిండ మార్పిడిలో అయితే ఒకసారికే కచ్చితమైన జాతి పశువులు పుడతాయని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ తెలిపారు. రైతులు నేరుగా రైతుసేవా కేంద్రాల్లో, పశువుల ఆసుపత్రుల్లో సంప్రదించొచ్చని తెలిపారు.

రైలులో 19 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఏఎస్పీ అంకితా సురాన ఆధ్వర్యంలో తనిఖీలు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా నియంత్రణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపడుతోందని ఏఎస్పీ అంకిత సురాన అన్నారు. గురువారం రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైల్లో నాకాబందీ చేపట్టారు. పార్వతీపురం టౌన్ స్టేషన్ నుంచి విజయనగరం వరకు పోలీసు జాగిలాలతో పరిశీలించారు. డొంకినవలస సమీపంలో ఇద్దరు ప్రయాణికుల వద్ద 4 కిలోలు, విజయనగరం సమీపంలో రిజర్వేషన్ బోగీలో ఇద్దరు మహిళల నుంచి 15 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పార్వతీపురం సీఐ, ఎస్సైలు, ఈగల్ బృందాలు, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో అర్హత

విజయనగరం క్రీడావిభాగం, న్యూస్‌టుడే: బీసీసీఐ ఆధ్వర్యంలో ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన అంపైర్ల ఎంపిక పరీక్షల్లో విజయనగరానికి చెందిన **తోట విజయ్** ఉత్తీర్ణత సాధించారు. ఈయన ఎక్కువ మ్యాచ్‌లకు స్కోరర్‌గా పనిచేశారు. త్వరలో దేశవాళీ, ఐపీఎల్, అంతర్రాష్ట్ర మ్యాచ్‌లకు అంపైరింగ్ చేసే అవకాశం దక్కనుందని 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

EENADU Classifieds

HEALTH & CARE

మత్తు వ్యసనాలు నిద్రలేమి అతి ఆలోచనలు డిప్రెషన్ SEX కుటుంబ సమస్యలకు పరిష్కారం
MIND POWER
విజయనగరం గంటస్తంభం పక్కన
888 55555 13

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ|| రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ||గ||లలో G-3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

PLOT FOR SALE

VZM- VSP నేషనల్ హైవే చెల్లూరు జం||కు ప్రక్కన VMRDA గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో గజం: 14,000/- రెడీ టు కన్‌స్ట్రక్షన్. ✆ 9492342274.

JOBS

బ్రాంచ్ మేనేజర్ & అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ (విజయనగరం & విశాఖపట్నం) కోసం 3 సం||లు బ్యాంకింగ్/ NBFC/ ఇన్సూరెన్స్/ చిట్ ఫండ్స్ మొ|| అనుభవం కలవారు కావలెను. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులకు అవకాశం కలదు. ఆకర్షణీయమైన జీతంతో పాటు ఇన్సెంటివ్స్ + PF + T.A., హెల్త్ ఇన్సూరెన్స్ కలవు. వర్చువల్ ఇంటర్వ్యూ (ZOOM) 4,5 & 6 జూలై 2025 ఉ|| 10 గం|| నుండి సా|| 5 గం|| వరకు. మీ Resume Whatsapp చేయగలరు. ఫోన్: 97057 09977.

Wanted Experienced Telecallers & Front Office Executive (F) for a Furniture & Interior Designing Factory, Near Raghu College. Best Salary+ Incentives. ✆ 8886336969.

Ephraim Enterprises పార్వతీపురంలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీంలీడర్స్, జిల్లా మేనేజర్స్‌గా కావలెను. జీతం 21వేలు నుండి 45వేలు లోపు. Cell: 9704107303, 9182630888, 9959166816.

SECURITY GUARDS

శ్రీ గణేష్ సెక్యూరిటీ విజయనగరం టౌన్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు - 11 మంది కావలెను. జీతం: 15000/-, PF & ESI. సంప్ర: 99893 70717.

సెక్యూరిటీ గార్డులు, నైట్ వాచ్‌మెన్ కావలెను. Q.f: 10th, డిగ్రీ, హిందీ మాట్లాడాలి. జీ|| 14 వేలు+ రూమ్+ PF+ ESI. గరివిడి, విజయనగరం జిల్లా. Ct: RSR, 77029-59468, 0891-3570630.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాలం చెల్లిన బస్సులను నిలిపివేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి భానుమూర్తి

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మహిళల ఉచిత ప్రయాణం పథకం విజయవంతం కావాలంటే ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను నిలిపివేసి, వాటి స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి పి.భానుమూర్తి కోరారు. గురువారం విజయనగరంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4, 5వ తేదీల్లో రాష్ట్రంలో అన్ని డిపోల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుంచి నేటి వరకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పొరుగు సేవల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. జిల్లా కార్యదర్శి రవికాంత్, డిపో అధ్యక్షుడు ఎన్.స్వామి, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏపీజేఏసీ సాధారణ ఉప కార్యదర్శిగా ఎన్నిక


రమణ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల ఐక్య కార్యాచరణ సమితి డిప్యూటీ జనరల్ కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేగల వెంకట రమణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కొత్తవలస సంఘం అధ్యక్షుడు జె.వి.ప్రసాదరావు తెలిపారు. విజయవాడలో గురువారం అన్ని శాఖల ప్రధాన ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు, ఏపీఎస్‌ఆర్టీసీ, పింఛనుదారులు వార్డు సచివాలయాలు, సీపీఎస్ రాష్ట్ర నాయకులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రమణకు కొత్తవలస తాలూకా ఎన్జీవో సంఘం అభినందనలు తెలిపింది.

బెట్టింగులకు బానిసై ఆత్మహత్య

డోల రాము (పాతచిత్రం)

విశాఖపట్నం(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసై చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బలిజిపేట మండలం గళావల్లికి చెందిన డి.రాము(35) ఏడేళ్ల క్రితం విశాఖకు వలస వెళ్లారు. రామాటాకీస్ ప్రాంతంలోని పాతవస్తువుల దుకాణంలో పనిచేసేవారు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని నెలలుగా బెట్టింగులు, మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో బంధువులు, స్నేహితులు హితబోధ చేసి ఎండాడ ప్రాంతంలో కాపురం పెట్టించారు. ఇటీవల మళ్లీ అప్పులు చేశాడు. దీంతో లావణ్య బుధవారం ఇద్దరు కుమారుల్ని తీసుకుని సొంతూరులో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. ఈక్రమంలో రాత్రి వేళ ఆయన పంకా హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం భార్య ఫోన్ చేయగా ఎంతకీ స్పందించకపోవడంతో మరిదిని ఇంటికి పంపించింది. అతను కిటికీలోంచి చూడగా వేలాడుతూ కనిపించాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

పిన్నిని హతమార్చిన యువకుడు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ, ఎస్సైలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని పెదచాకలి వీధి కూడలికి చెందిన మహిళ మృతి కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఆస్తి గొడవలతో కుమారుడి వరసయ్యే వ్యక్తి హత్య చేసినట్లు గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ సతీష్‌కుమార్ వెల్లడించారు. తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు శరీరంపై గాయాలు, ఇంటి పరిసరాల్లో రక్తం ఆధారంగా సమగ్ర దర్యాప్తు నిర్వహించి హత్యగా తేల్చారు. మృతురాలు కారగాని పద్మ(45) భర్త పైడిరాజు సోదరుడి కుమారుడు సంతోష్‌కుమార్. పక్కపక్క ఇళ్లలో ఉండే వీరికి అయిదేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఇటీవల సంతోష్‌కుమార్ భార్య పావని అనారోగ్యంతో మృతిచెందింది. కుమారుడు ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నాడు. దీనివల్ల ఆర్థికంగా చితికిపోయి మనస్తాపానికి గురయ్యాడు. కాగా రోజూ రాత్రిపూట దిష్టి తీసిన నిమ్మకాయను పద్మ తన ఇంటి ముందు పడేస్తోందన్నది సంతోష్‌కుమార్ అనుమానం. ఈ కారణంగానే కుటుంబ నాశనం అవుతోందని అనుకున్నాడు. దీంతో ఆమెను హతమార్చాలని ప్రణాళిక రచించాడు. బుధవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో వీధిలో ఎవరూ లేకపోవడం గమనించాడు. పద్మ ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి.. కత్తితో పొడిచి హతమార్చాడు. సంతోష్‌కుమార్ మాంసం విక్రయశాలను నిర్వహిస్తున్నాడు. ఆ కత్తితోనే హత్య చేశాడు. ఎస్ఐ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పాముకాటుకు గిరిజనుడి బలి

ఎన్.కిరణ్ (పాతచిత్రం)

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం పత్తికగూడకు చెందిన నిమ్మక కిరణ్(21) పాము కాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై అమ్మనరావు తెలిపారు. పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న అర్ధరాత్రి ఇంట్లో మంచంపై పడుకున్న సమయంలో పంకా పైనుంచి పాము జారి పడి కాటు వేసింది. ముఖమంతా వాపులు రావడంతో కలవరపడి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ అయిదు రోజులు వైద్యసేవలు పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రులు రమ, రాము కన్నీరుమున్నీరవుతున్నారు. పదోతరగతి వరకు చదివిన కిరణ్.. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ, ఇతర పనులు చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నాడు. బతికించుకునేందుకు ఆ తల్లిదండ్రులు ఎంత ప్రయత్నించినా విధి కన్నెర్ర జేసింది. యువకుడి మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

గురుకులానికి రూ.4.30 కోట్లు ఇవ్వండి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.4.30 కోట్లు నిధులివ్వాలని కోరుతూ ఎమ్మెల్యే బేబీనాయన గురువారం అమరావతిలో విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. డార్మిటరీలు, భోజనశాల, ప్రహరీ, మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు, సోలార్ సిస్టమ్, విద్యుదీకరణ వంటి పనులు చేయాల్సి ఉందని చెప్పారు. వందలాది మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, వసతులు కల్పించాలని కోరారు. పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ భరోసా ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మిగులు సీట్లలో ప్రవేశాలకు అవకాశం

రేగిడి: ఉంగరాడ మెట్ట అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపులో 27 సీట్లు, సీఈసీలో 23, ఐదో తరగతిలో 17 సీట్లు ఖాళీలలో మిగిలి ఉన్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు ధ్రువపత్రాలతో వచ్చి ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

?: పాలవలసలో కుళాయిలకు మూతలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. - స్థానికులు ❖ మూతలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. - వెంకటరమణ, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, రామభద్రపురం

?: చీపురుపల్లిలోని వెంకటేశ్వరనగర్‌లో వీధి కాలువలను శుభ్రం చేయకపోవడంతో చెత్త, పరిసరాల్లో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. -రాము, వెంకటేశ్వరనగర్, చీపురుపల్లి ❖ సిబ్బందిని పంపించి కాలువలను శుభ్రం చేయించి మొక్కలను తొలగిస్తాం. - జి.వేణుగోపాలరావు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్, మేజర్ పంచాయతీ - న్యూస్‌టుడే, చీపురుపల్లి

?: నీలావతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల చుట్టూ పొదలు పేరుకుపోయాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు ❖ తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

?: ఎస్.బూర్జవలస ప్రధాన వీధిలోని మురుగు కాలువలో పిచ్చిమొక్కలు నిండాయి. ఇళ్ల వాడుక నీరు పారడం లేదు. - స్థానికులు ❖ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - ఆర్.నీలిమ, పంచాయతీ విస్తరణాధికారిణి - న్యూస్‌టుడే, తెర్లాం

?: బోనంగి గ్రామ జిల్లా పరిషత్తు పాఠశాల ఆవరణలోని వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉంటోంది. విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు ❖ తగిన చర్యలు తీసుకుంటాం. - వెంకటరావు, ఎంఈవో-2 - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

పైపులైను ఏర్పాటుకు చర్యలు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మేజర్ పంచాయతీ రక్షిత నీటి పైపులైను లీకులను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి. ఢిల్లీశ్వరరావు, ఏఈ పవన్‌కుమార్ పరిశీలించారు. గ్రామంలో తాగునీటి ఇక్కట్లపై గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి స్పందించారు. పైపులైన్లు పాతవి కావడంతో సమస్య వస్తోందని, బాగు చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు. కొత్త పైపులైన్లు వేయడానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.

హామీలన్నీ అమలు చేస్తాం

బొండపల్లిలో మాట్లాడుతున్న మంత్రి అనిత

బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, బాడంగి, న్యూస్‌టుడే: వచ్చే ఆగస్టు నెలలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల పింఛన్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా దత్తిరాజేరు మండలం వి.కృష్ణాపురం, బంగారమ్మపేటలో గురువారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. చప్ప చంద్రశేఖర్, గోపాలరావు, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ❖ బొండపల్లి గ్రామంలో జరిగిన సభలో హోంశాఖ మంత్రి అనిత పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతి హామీ అమలు చేస్తుందని వివరించారు. మంత్రి కొండపల్లి, నాయకులు కోరాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సీతారాంపురం గ్రామంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు సంక్షేమ పథకాలను వివరించారు.

ప్రజల కళ్లలో ఆనందం.. రేగిడి: కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల కళ్లలో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. 'తొలి అడుగు' కార్యక్రమంలో మాట్లాడారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతా తెలుసుకున్నారు.. గరివిడి, గుర్ల: రాష్ట్రంలో వైకాపా పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకున్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలతో పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొండ్రు

ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళా

ఊర్లన్నారు.. ఊరవతల విసిరేశారు!

రోడ్లు లేక జగనన్న కాలనీ లబ్ధిదారుల అవస్థలు

నియోజకవర్గం	లేఅవుట్లు	ఇళ్ల మంజూరు	పూర్తయినవి
బొబ్బిలి	82	3,927	1,521
గజపతినగరం	36	2,842	1,387

గజపతినగరం మండలం ఎం.గుమడాం కాలనీకి వెళ్లే రహదారి ఇది. చినుకు పడితే నడవలేని పరిస్థితి. ఇక్కడ 14 ఇళ్లు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, గజపతినగరం, బొబ్బిలి, గ్రామీణం, తెర్లాం, రామభద్రపురం

ఇళ్లు కాదు.. ఊర్లే నిర్మిస్తామన్న గత వైకాపా ప్రభుత్వ చిత్తశుద్ధి లోపంతో పేదలు అగచాట్లు పడుతున్నారు. ఊరవతల బురదలో మగ్గేలా చేశారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించలేదు. రహదారులు, కాలువలు లేక, తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి.. అప్పు చేసి, ఇరుకు సమస్యలు తీరుతాయన్న ఆశతో నిర్మాణాలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వమైనా వసతులు కల్పించాలని కోరుతున్నారు.

గజపతినగరం కాలనీలోని మార్గం ఇది. చిన్న వర్షం పడినా రెండు రోజులపాటు నీరు నిల్వ ఉంటోంది. 320 స్థలాలకు 140 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. 80 కుటుంబాలు నివాసముంటున్నారు. ఇంట్లో నుంచి బయటకు వస్తే జారి పడిపోతున్నామని వాపోతున్నారు.

అడుగేస్తే జారిపోయేలా..

బొబ్బిలి పట్టణంలో మూడు లేఅవుట్లు, మండలం-26, బాడంగి-18, రామభద్రపురం-19, తెర్లాంలో 16 లేఅవుట్లు వేశారు. జిల్లాలోనే రెండో అతి పెద్ద లేఅవుట్ పట్టణంలోని రామన్నదొరవలస. సుమారు 3,200 మందికి పట్టాలు అందజేశారు. కొంతమంది ఇళ్లు పూర్తి చేసుకున్నా, సదుపాయాలు లేక నివాసం ఉండటం లేదు. ఐటీఐ కాలనీలో దాదాపు నిర్మాణాలు పూర్తయ్యాయి. మట్టి వర్షం నీరు, మురుగు, పిచ్చిమొక్కలు ఉన్నాయి. తెర్లాం మండలంలో 320 మందికి పట్టాలు ఇచ్చారు. తెర్లాం గ్రామ కాలనీలో 112కు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మోస్తరు వర్షానికే బాట బురదమయమై రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు ఉన్నాయని గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి డీఈ వేణు 'న్యూస్‌టుడే'కు చెప్పారు. గజపతినగరం నియోజకవర్గంలో ఇంకా 205 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. గజపతినగరం మండలంలోని పురిటిపెంట, గజపతినగరం, ఎం.గుమడాం, కొనిశ, గంగచోళ్లపెంట, కాలరాజుపేట గ్రామాల్లో కాలనీ వాసులు రహదారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల అభివృద్ధికి అంచనాలు తయారు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఈఈ సత్యనారాయణ తెలిపారు.

నెరవేరని హామీ.. తీరని అవస్థలు

కొండగండ్రేడు ఉన్నత పాఠశాల అసంపూర్తి భవనాలకు నిధులు మంజూరు చేస్తామని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇచ్చిన హామీ నెరవేరలేదు. 150 మంది విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. పాఠశాల నూతన భవనాల నిర్మాణానికి నాడు-నేడు కింద రూ.కోటి మంజూరయ్యాయి. కొన్ని భవనాలు నిర్మించినా.. నిధులు మంజూరు కాలేదు. సర్పంచి సారిక గోవింద్, పరిశుభ్రతలి ఎంపీటీసీ సభ్యుడు జోగినాయుడు మండల సమావేశంలో ప్రస్తావించారు. నిధులు మంజూరుకు జడ్పీ ఛైర్మన్ హామీ ఇచ్చారు. రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పంపించినా నిధులు విడుదల కాలేదు. ఈ విషయమై ఎంఈవో భానుప్రకాష్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా నిధులు మంజూరు కాలేదన్నారు. - న్యూస్‌టుడే, గుర్ల

ఇలాగైతే రోగాలు రావా?

బొండపల్లి మండలం దేవుపల్లిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు అంటున్నారు. గ్రామంలోని వీధుల్లో ఉన్న మురుగు కాలువలతోపాటు రహదారులు వర్షాలతో నిండి ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగాయని, రహదారులపైనే మురుగు పారుతోందని చెప్పారు. పరిశుభ్రత పనులు చేపట్టాలని కోరుతున్నారు. త్వరలో పరిశీలించి, కాలువలు శుభ్రం చేయిస్తామని ఎంపీడీవో జి.గిరిబాల 'న్యూస్‌టుడే'తో అన్నారు. - న్యూస్‌టుడే, బొండపల్లి

బీటలు వారింది.. భయపెడుతోంది

మగ్గూరు-2 అంగన్‌వాడీ కేంద్రం బీటలు వారి భయపెడుతోంది. చిన్నారులుండే చోట గోడలు పగుళ్లు వచ్చాయి. పైకప్పు నుంచి బీటలు ఉండటంతో భారీ వర్షాలు పడితే కుప్పకూలిపోతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రానికి మరుగుదొడ్డి సౌకర్యం, ప్రహరీ కూడా లేవు. ఈ విషయంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదుర్గ వద్ద ప్రస్తావించగా.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, వంగర

ఊపందుకున్న కాలువల పనులు

గజపతినగరం, న్యూస్‌టుడే: మెంటాడ చానల్ సిస్టం పరిధి కాలువల పనులను వేగవంతం చేశారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడటంతో వారం రోజులుగా కాలువల్లో పూడిక తొలగిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. రూ.30 లక్షలతో మెంటాడలోని ఆండ్ర సాగరం నుంచి గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాం, పాతబగ్గాం, మరుపల్లి తదితర గ్రామాలకు చెందిన కాలువ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. గత పదేళ్లుగా ఎలాంటి పనులు జరగక శివారు గ్రామాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రాజెక్టు కమిటీ చేస్తున్న పనులతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గండి పూడ్చివేత

సంతకవిటి, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీహరినాయుడుపేట వద్ద మడ్డువలస 24ఎల్ కాలువకు రెండేళ్ల కిందట పడిన గండిని పూడ్చలేదని ఈనెల 2న 'ఈనాడు'లో 'గండ్లు పూడ్చితేనే గండం తప్పేది' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రాజెక్టు డీఈఈ నాగేశ్వరరావు ఆదేశాలతో సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేశారు.

స్థానిక వనరుల్ని అభివృద్ధి చేసుకోవాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: హరియాణాలోని గురుగ్రామ్‌లో గురువారం జరిగిన జాతీయ స్థాయి సదస్సులో బొబ్బిలి పురపాలక అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు పాల్గొన్నారు. 'స్థానిక సంస్థల బలోపేతం' అనే అంశంపై సూచనలు, అభిప్రాయాలు పంచుకున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న చేయూతతో పాటు స్థానిక వనరులను అభివృద్ధి చేసుకుంటే పురోగతి సాధించొచ్చని పేర్కొన్నారు.

ప్రసంగిస్తున్న పుర అధ్యక్షుడు శరత్‌బాబు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

బొబ్బిలి, న్యూస్‌టుడే: టెక్ మహేంద్ర ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంబంధిత సీఈవో పి.మయూర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యునికేషన్-ఆంగ్లం, బేసిక్ అకౌంట్స్ తదితర అంశాలపై మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

'కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశా'

తెర్లాం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెర్లాం మండల శాఖ అధ్యక్షుడు పొందూరు రవీంద్రనాథ్ ప్రకటించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీలో గుర్తింపు లభించడం లేదని, తాను ఇమడలేక రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడికి పంపించినట్లు పేర్కొన్నారు.

12న పీఆర్ మినిస్టీరియల్ ఎన్నికలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి తాలుకా ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎన్నికలు ఈ నెల 12న నిర్వహించనున్నట్లు తాలుకా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా అల్తి రమణమూర్తి ఉంటారని చెప్పారు. నామినేషన్ల స్వీకరణ ఇతరత్రా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, జిల్లా కౌన్సిలర్లకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు.

ఎత్తిపోతలు.. అందని ఫలాలు

సంతకవిటి మండలం కొండగూడేం సమీపంలోని సాయన్నగెడ్డ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ఇది. గెడ్డలోని నీరు గ్రామంలోని భూషణవాణి చెరువుకు పైపులైన్లు ద్వారా తీసుకువెళ్లి దిగువన ఉన్న 150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడమే దీని లక్ష్యం. రూ.4 లక్షల ఎంపీ ల్యాడ్ నిధులతో మూడేళ్ల కిందట సాయన్నగెడ్డకు- భూషణవాణి చెరువుకు పైపులైన్లు వేశారు. విద్యుత్తు లైన్లు, నియంత్రిక ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరవడంతో లైన్లు పనులు పూర్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది పూర్తయితేనే ఈ పథకం ద్వారా నీరందేది. వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఎత్తిపోతల పథకానికి నియంత్రిక అమర్చేందుకు చర్యలు తీసుకుంటామని సంతకవిటి విద్యుత్తుశాఖ ఏఈ కె.వినయ్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. - న్యూస్‌టుడే, సంతకవిటి

చెత్త పోదు.. సంపద రాదు

వంగర, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త నుంచి ఎరువు తయారుచేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని 29 పంచాయతీల్లో 10 చెత్త సంపద కేంద్రాలు ఉన్నారు. వీటిలో తడి, పొడి చెత్త సేకరించి.. సంపద సమకూర్చాల్సిన పంచాయతీ సిబ్బంది పశువుల పేడను నిల్వ చేసి సేంద్రియ ఎరువు తయారుచేసినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. పంచాయతీల ఆదాయం పెంచడానికి తెదేపా ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వైకాపా ప్రభుత్వ పాలనలో ఇవి మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. నీలయ్యవలసలో చెత్త సంపద కేంద్రం పక్కనే సిబ్బంది చెత్త పడేస్తున్నారు. ఈ సంపద కేంద్రం బీరు సీసాలతో నిండిపోయింది. వంగరలో కేంద్రం లేకపోవడంతో రహదారి పక్కన చెత్తను కాల్చేస్తున్నారు. వంగర, మద్దివలస తదితర గ్రామాల్లో రహదారుల పక్కన చెత్త పడేయడంతో వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. గ్రామాలకు వాహనాలు సమకూర్చినా చెత్తసేకరణ సక్రమంగా జరగడం లేదు. పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించడంతో ఫలితం శూన్యమవుతోంది. ఈ విషయంపై ఎంపీడీవో రఘునాథాచారి వద్ద ప్రస్తావించగా.. చెత్త సంపద తయారీ కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చూస్తామని, చెత్తను కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

నీలయ్యవలసలో నిరుపయోగంగా కేంద్రం, అక్కడే చెత్త

గొర్రెలు, మేకల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

సూచనలిస్తున్న మక్కెన శ్రీను

గరివిడి, న్యూస్‌టుడే: శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకలు పెంపకంపై అవగాహన పెంచుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను అన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఎంపిక చేసిన ఎస్సీ మహిళా రైతులకు జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం స్థానిక పశుగణ క్షేత్రంలో ప్రారంభించారు. నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ ఎం.దామోదర్ సూచించారు. పశుగణ క్షేత్రం, పశు యాజమాన్యం, విభాగాధిపతులు అనిత, ఆనందరావు, సతీష్, దేవిక, సప్నానాథ్ తదితరులు మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. ❖ గరివిడి పశువైద్య కళాశాల వివరాలు, విజయాలను తెలియజేస్తూ 'వంశధార' పేరిట ముద్రించిన ప్రత్యేక పత్రికను అసోసియేట్ డీన్, పశు సంవర్ధక శాఖ డీడీ దామోదర్‌లు ఆవిష్కరించారు.

కార్మికుల వంటావార్పు

పురపాలక కార్యాలయం ఎదుట వంటలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: పురపాలక తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికులు కొన్ని రోజులుగా సమ్మెలో ఉన్న సంగతి తెలిసిందే. గురువారం పుర కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేసి, హెచ్‌ఆర్‌సీ పాలసీని అమలు చేయాలన్నారు. వంటలు వండి అక్కడే భోజనాలు చేశారు. సంఘ బాధ్యులు రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు, స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జేసీ రాజు

ప్లాస్టిక్‌తో అనర్థం

రామభద్రపురం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు పిలుపునిచ్చారు. గురువారం నాయుడువలస గ్రామంలో ప్రజలు, విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల వాతావరణం దెబ్బతింటుందని చెప్పారు. దీని వాడకం ఆరోగ్యానికి కూడా హాని చేస్తుందన్నారు.

క్షేత్ర సహాయకురాలిపై విచారణ

బొబ్బిలి గ్రామీణం: దిబ్బగుడివలస ఉపాధి క్షేత్ర సహాయకురాలిపై ఏపీడీ రమామణి బహిరంగ విచారణ చేపట్టారు. వేతనదారుల వద్ద అక్రమంగా వసూళ్లు చేశారని గతంలో కొంతమంది ఫిర్యాదు చేయగా.. విచారించి సస్పెండ్ చేశారు. తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆమె కలెక్టర్‌కు వినతిపత్రం అందశారు. దీంతో మరోసారి విచారణ చేశామని, నివేదికను కలెక్టరుకు అందిస్తానని ఏపీడీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రాజాం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండంపేటకు చెందిన డి.వెంకటరమణ ఈనెల 2న సాయంత్రం నుంచి కనిపించడం లేదని అతని భార్య మీనాకుమారి గురువారం ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని పేర్కొనగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చోరీ కేసులో జైలు శిక్ష

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఆరికతోటలోని ఓ ఇంట్లో 2023లో బంగారం దొంగతనం, 2024లో రామభద్రపురం ఎస్‌బీఐలో నగదు చోరీ కేసుల్లో మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన జి.భగవాన్‌కు సాలూరు న్యాయస్థానం జడ్జి హర్షవర్ధన్ గురువారం శిక్ష విధించినట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. 5 సంవత్సరాల 10 నెలల జైలు శిక్ష, రూ.8 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

ఏటీఎంలో గోవు మృతి

రాజాం, న్యూస్‌టుడే: పట్టణంలోని చీపురుపల్లి రహదారిలో గోవు మృతి చెందింది. ఏటీఎం వెనుక ఉన్న గదిలోకి వెళ్లిన ఆవును ఎవరూ గమనించలేదు. ఏటీఎం ముందు రహదారి తవ్వి ఉండడం, ఇతర కారణాలతో తిరిగి రాలేకపోయి ఉంటుందని చెబుతున్నారు. ఆవు ఎప్పుడు లోనికి వెళ్లిందనేది తెలియ రావడం లేదు. గురువారం మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు.

రాజాంలో ద్విచక్ర వాహన ర్యాలీ

రాజాం, న్యూస్‌టుడే: ప్రపంచ ద్విచక్రవాహన మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో గురువారం ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. బొబ్బిలి రహదారి నుంచి పాలకొండ కూడలి మీదుగా జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకు కొనసాగింది. అనంతరం ఒక కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి సీఐ కె.అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలం చెల్లిన వాహనాలను వాడొద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని మెకానిక్‌లను కోరారు. అనుమానిత వ్యక్తులు వాహనాలను తీసుకొస్తే సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. సీఐను వీరంతా సన్మానించారు.

సీఐ కె.అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న మెకానిక్ సంఘం ప్రతినిధులు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు సురేష్

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండల కేంద్రంలో గురువారం సత్యసాయి కన్వీనర్ బెవర అప్పలస్వామి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో 86 మందిని పరీక్షించారు. 55 మంది వృద్ధులకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించామని, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించి ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. శిబిరానికి వచ్చిన వారందరికీ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలు పెట్టారు. సభ్యులు వెంకటరమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపాలెం సమస్యలు పరిష్కరించండి

గరివిడి, న్యూస్‌టుడే: కొండపాలెంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు గురువారం జరిగిన గ్రామసభలో సర్పంచి పి.ప్రమీల, ఈవో నాగమణిలకు వినతిపత్రం అందజేశారు. ఇంటింటి కుళాయిలకు నీరు రావడం లేదని, రక్షిత పథకం ట్యాంకును స్థానికంగా ఏర్పాటు చేయాలని, ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు, శ్మశానవాటికకు రహదారి నిర్మాణం చేయాలని కోరారు. ఎమ్మెల్యే కళా వెంకటరావు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచి వారికి తెలిపారు.

ఆ భూమిలో మొక్కల నాటివేత అడ్డగింత

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని రామన్నదొరవలస వద్ద జగనన్న కాలనీకి గతంలో సేకరించిన డి.పట్టా భూములను అనుసరించి గురువారం కొంతమంది నీలగిరి మొక్కలు నాటారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు చేరుకుని, అడ్డుకున్నారు. వాస్తవ పట్టాదారులు అక్కడ లేకపోవడం, సంబంధంలేని వ్యక్తులు మొక్కలు నాటడంతో పనులు నిలిపివేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ పౌరుల బాధ్యత

ర్యాలీ చేపడుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

రాజాం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణను పౌరులు బాధ్యతగా తీసుకోవాలని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచి రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపల్ కళాశాల వద్ద ప్రారంభించారు. వస్త్రసంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే అనర్థాలను వివరించారు. అసోసియేట్ డీన్లు వి.రాంబాబు, డా.ఎంవీ నాగేశ్వరరావు, డా.కె.రవీంద్రనాథ్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, పెంకి చైతన్యకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డా.కేవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

వివరాలు పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఏడీ శ్యామ్‌సుందర్

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి ఏడీ శ్యామసుందరరావు హెచ్చరించారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. ఎంత ధరకు విక్రయిస్తున్నారు? దస్త్రాల నిర్వహణ సక్రమంగా ఉందా తదితర అంశాలను పరిశీలించారు. కొన్నిచోట్ల యూరియా అధిక ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు తనిఖీ చేశారు. డివిజన్‌లో 423 టన్నుల డీఏపీ, 345 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు చెప్పారు. ప్రైవేటు డీలర్లతోపాటు రైతు సేవా, పీఏసీఎస్‌ల్లో నిల్వ ఉంచామని పేర్కొన్నారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

కూరగాయల ధరలు

రైతుబజార్లలో ధరల వివరాలు (కిలో రూ.లలో) ★ వంకాయలు: (తెల్లవి) 45 ★ (రవివంగ) 35 ★ (నల్లవి) 28 ★ టమోటా: 34 ★ బెండ: 40 ★ కాకర: 40 ★ బీర: 35 ★ క్యాబేజీ: 30 ★ పొడవుచిక్కుడు: 45 ★ బరబాటీ: 50 ★ క్యారెట్: 50 ★ దొండ: 50 ★ బీట్‌రూట్: 35 ★ ఉల్లి: 23 ★ బంగాళదుంపలు: 19 ★ గోరుచిక్కుడు: 35 ★ క్యాప్సికమ్: 90 ★ పొటల్స్: 35 ★ బీన్స్: 90 ★ ఆగాకర: (హైబ్రిడ్) 90, (దేశవాళీ) 210 ★ పందిరిచిక్కుడు: 60, ★ పచ్చి బఠాణి: 75. – న్యూస్‌టుడే, విజయనగరం వ్యవసాయ విభాగం

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్: **కన్నప్ప** ★ శ్రీకృష్ణ: **8 వసంతాలు, ఎఫ్-1(తెలుగు డబ్బింగ్)** ★ లీలామహల్: **కుబేర** ★ రంజనీ స్క్రీన్-1: **తమ్ముడు** ★ శివరంజనీ స్క్రీన్-2: **కుబేర** ★ హిమగిరి: **మార్గన్** ★ సప్తగిరి: **కన్నప్ప** – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ సంచులు అమ్మితే చర్యలు తప్పవన్నారు. అనంతరం అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

(10 AM TO 1 PM)

?: రింగురోడ్డు దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. **- పద్మజ, స్థానికురాలు** ★ సిబ్బంది దిని పంపించి, కొత్తవి వేయిస్తాం. **- స్రవంతి, ఏఈ, నగరపాలక సంస్థ**

?: అయ్యప్పనగర్‌లో రోడ్లు బాగోలేవు. **- ఉదయ్ భాస్కర్, స్థానికుడు** ★ నిధుల లభ్యత మేరకు నిర్మిస్తాం. **- పి.నల్లనయ్య, కమిషనరు**

?: బొగ్గులదిబ్బలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. **- స్థానికులు** ★ అక్కడి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తాం. **- కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం**

దీపాలు వెలిగాయ్

విజయనగరం పట్టణం: నగరంలోని మర్రిచెన్నారెడ్డి కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. ఏఈ స్రవంతి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

చెత్త తొలగింది

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరంలోని 35వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై 'ఈనాడు'లో ఈనెల 3న ప్రచురితమైన కథనంపై నగరపాలిక అధికారులు స్పందించారు. స్థానిక వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు దారిలో వ్యర్థాలను తొలగించారు. అదే ప్రాంతంలో పలు చోట్ల వీధిదీపాలు వేశారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట

తాండ్రంగిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

జామి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన జామి మండలం తాండ్రంగి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులపై ప్రజలకు కరపత్రాలిచ్చి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం బటన్ నొక్కుడు కార్యక్రమం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గ్రామీణ ప్రజలకు పథకాలు, మౌలిక సదుపాయాలు అందుతున్నాయన్నారు. అంతకుముందు ఆయనను గ్రామస్థులు సన్మానించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, తాండ్రంగి-తానవరం మధ్య కాజ్‌వే నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, నాయకులు పి.స్వామినాయుడు, ఎల్.రవికుమార్, రమణ, పైడిరాజు పాల్గొన్నారు.

ఎల్.కోట, నెల్లిమర్ల: ఎల్.కోటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లలితకుమారి పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. సర్పంచి పార్వతి, వెంకటరమణమూర్తి, ఈశ్వరరావు, మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు. ★ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, నాయకుడు సువ్వాడ రవిశేఖర్ రామతీర్థంలో ఇంటింటా తిరిగి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్-6 అమలుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. నాయకులు జి.రాజారావు, టి.సత్యనారాయణ, బి.వెంకట రమణ, తిరుపతిరావు, అసిరినాయుడు పాల్గొన్నారు.

రామతీర్థంలో కరపత్రం అందిస్తున్న బంగార్రాజు, రవిశేఖర్

మురుగు కూపం.. ప్రధాన మార్గం!

★ అస్తవ్యస్త కాలువతో చెరువులా మారిన రోడ్డు
★ సమీప పాఠశాల చిన్నారులకు నిత్యనరకం

ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

పట్టణంలోని ప్రధాన రహదారి.. ఇరువైపులా దుకాణాలు.. పక్కనే ప్రభుత్వోన్నత పాఠశాల.. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గం మురుగు కూపంగా మారింది. కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో రోడ్డుపై చేరుతోంది. ఇక వర్షం పడితే చిన్నారులు పాఠశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. పట్టణవాసులు దారి దాటలేని దుస్థితి.

నీరెళ్లే దారేదీ..: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. బడి మైదానం నుంచి నీరు పోవడానికి ప్రహరీని ఆనుకుని కొన్నేళ్ల కిందట డ్రైనేజీ నిర్మించారు. వాడుక, వర్షం నీరు దీని ద్వారా కాలువ నుంచి రోడ్డుకు అవతలికి వెళ్లేంది. అక్కడి కాలువ ద్వారా బయటకు పోయేది. రోడ్డు పైన దుకాణాలు ఉన్నాయి. ఈ నీరు తమవైపు వస్తోందని ఏడాది క్రితం రహదారి వద్ద ఉన్న దుకాణదారులు కాలువను మూసేశారు. దీంతో మురుగు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీనికితోడు వ్యర్థాలను పాఠశాల ప్రహరీలోపల, కాలువల్లో వేస్తున్నారు. కాలువపై అడ్డంకులు పెట్టడంతో నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. వర్షాలు పడితే పాఠశాల ఆవరణలోకి వెళ్తోంది. చెరువును తలపిస్తోంది.

విద్యార్థుల అవస్థలు..: సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్న ఈ విద్యాలయం పరిసరాలు దుర్గంధంగా మారడంతో దోమలు పెరిగి, రోగాల బారిన పడుతున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల గేటు ఎదుట నిలిచిన బురద

వీడని అడ్డంకులు..: ఏడు నెలల కిందట ఇక్కడి సమస్యపై 'ఈనాడు'లో వెలువడిన కథనాలు, కలెక్టరుకు అందిన ఫిర్యాదుల మేరకు డీపీవో వచ్చి పరిస్థితి సమీక్షించారు. రోడ్డుకు రెండోవైపు కాలువ నిర్మించాలని ఉపాధి నిధులు రూ.30 లక్షలు మంజూరు చేశారు. పనులు జరగలేదు.

రూ.30 లక్షలతో కాలువ నిర్మాణం

కాలువ నిర్మాణానికి మంజూరైన రూ.30 లక్షలతో పనులు చేపడతాం. ఇంతలో మురుగు నిల్వ ఉండకుండా రోడ్డు పక్కన తాత్కాలిక కాలువ నిర్మిస్తాం.

– సతీష్, ఎంపీడీవో, అనురాధ, ఈవో

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్

కొత్తవలస: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1400 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేస్తున్నట్లు తహసీల్దారు అప్పలరాజు చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులతో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. తప్పులు సరిచేయాలని నాయకులు కోరారు. చింతలపాలెం, 202 కాలనీ, వీరభద్రపురం గ్రామాల్లో కొత్త కేంద్రాలు ఏర్పాటుచేయాలని నాయకులు విన్నవించారు.

జగన్నాథుడికి పూజలు

ఎల్.కోట, న్యూస్‌టుడే: తొమ్మిది రోజుల రథయాత్రలో భాగంగా ఎల్.కోటలోని జగన్నాథుడికి గురువారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

జామి: స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని శాసనపల్లి, భీమసింగి పంచాయతీల్లోని గ్రామాలు, సోమయాజులపాలెం, వెన్నె, వెంకటరాజుపాలెం, జన్నివలసల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈ సురేష్‌బాబు తెలిపారు.

పొంచిఉన్న ప్రమాదం

నగరంలో పలుచోట్ల కల్వర్టుల పలకలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏళ్ల నాటివి కావడంతో కృంగిపోతున్నాయి. సరైన పరిరక్షణలో ఏర్పాటు చేయక పోవడంతో కొన్ని నెలలకే దెబ్బతింటున్నాయి. బాలాజీనగర్, వైఎస్సార్ కాలనీ, గొడిపేట, కలెక్టరేట్ దారి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. స్థానిక వీటీ అగ్రహారం సంతోష్ నగర్ దారిలో పలకల వద్ద ఖాళీ ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటామని డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-102 ఎలక్ట్ గవర్నర్ ఎ.తిరుపతిరావు అన్నారు. అయ్యన్నపేటలోని నడక మైదానంలో గురువారం శ్రీసాయి కృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వస్త్రంతో తయారైన సంచులను అందించారు.

వస్త్రంతో తయారైన సంచులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

పారిశుద్ధ్య నిర్వహణతో రోగాలు దూరం

ఎరువు తయారీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

కొత్తవలస: వర్షాకాలం మొదలైనందున గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య, తాగునీటి నిర్వహణ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే ప్రజలు రోగాల బారిన పడరని జడ్పీ సీఈవో సత్యనారాయణ అన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆయన గురువారం మండలంలోని నిమ్మలపాలెం పంచాయతీలో పర్యటించారు. నీటి పథకం క్లోరినేషన్ తీరును తెలుసుకున్నారు. సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. సర్పంచి కె.నిర్మల సాయి, ఎంపీడీవో ఎస్.రమణయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గుర్తింపు కార్డులివ్వాలని వినతి

విజయనగరం అర్బన్: కార్మిక శాఖ ద్వారా తమకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని నగరంలోని మెకానిక్‌లు కోరారు. మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం టూవీలర్ మోటార్ గ్యారేజ్ మెకానిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతిపత్రం అందజేశారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, పనిముట్లను రాయితీపై అందజేయాలని, ఆరోగ్య బీమా సదుపాయం, జిల్లా కేంద్రంలో అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు.

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మెకానిక్‌లు

నిర్వాసితుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిందాల్ నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుబ్బలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. 20 రోజులుగా నిర్వాసితులు ఆందోళనలు చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేయదన్నారు. ఈ విషయంలో రాజకీయాలు చేయవద్దన్నారు. కొందరు దురుద్దేశంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీను, గోవింద, వెంకటరావు, సతీష్ పాల్గొన్నారు.

ఏఎంసీ భూములను పరిరక్షించండి

మంత్రికి ఫిర్యాదు చేస్తున్న కర్రోతు సత్యనారాయణ

భోగాపురం, న్యూస్‌టుడే: పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడిని తెదేపా భోగాపురం మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ కోరారు. గురువారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని మంత్రి స్వగృహంలో ఆయనను కలిసి ఫిర్యాదు చేశారు. డెంకాడ మండలంలోని మోదవలసలో మార్కెట్ కమిటీకి చెందిన 21 ఎకరాల భూమిని వైకాపా నాయకులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దీనిపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

గురుపౌర్ణమి వేడుకలకు వితరణ

పూసపాటిరేగ: మండలంలోని కందివలస సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా అన్నసమారాధన కార్యక్రమానికి కొవ్వాడ అగ్రహారం సర్పంచి కోట్ల రమణ రూ.70 వేల విలువైన బియ్యం, వంట నూనెను ఆలయ నిర్వాహకులు విజయరామయ్యకు గురువారం అందజేశారు.

నేటినుంచి ఆలయ వార్షికోత్సవ పూజలు

కంటోన్మెంట్: మయూరికూడలిలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు అర్చకుడు రమేష్‌తివారీ తెలిపారు. ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

చరవాణి అప్పగింత

అయ్యన్నపేట: అయ్యన్నపేటకు చెందిన శివ అనే యువకుడు విజయనగరం కాంప్లెక్స్‌లో చరవాణి పోగొట్టుకున్నాడు. సిబ్బంది సమాచారంతో స్టేషన్ ప్రబంధకుడు సత్యనారాయణ దానిని భద్రపరిచి, ప్రయాణికుడికి అప్పగించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

భోగాపురం: గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. గురువారం ఆమె తన స్వగృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. తాగునీరు, విద్యుత్తు, రోడ్ల సమస్యలు ఉన్న గ్రామాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

డెంకాడ: మండలంలోని అక్కివరంలో ఓ ప్రైవేటు లేఅవుట్‌లో గురువారం టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి దాడులు నిర్వహించి జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు. రూ.15,100 నగదు, రెండు ఆటోలు, నాలుగు బైకులు, 8 చరవాణీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

12న ఉద్యోగుల సంఘం ఎన్నిక

నెల్లిమర్ల: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నెల్లిమర్ల తాలూకా యూనిట్ ఎన్నికను ఈ నెల 12న నిర్వహిస్తారని అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నెల్లిమర్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు.

సదరానికి దరఖాస్తు చేసుకోండి

వేపాడ: మండలంలోని దివ్యాంగుల పింఛన్ల మంజూరుకు అవసరమైన సదరం స్లాట్లు ఈ నెల 5న ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతున్నాయని ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు.

పుస్తకాల పంపిణీ

కంటోన్మెంట్: ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకల్లో భాగంగా విజయనగరంలోని ఏసు ప్రేమాలయం నిర్వాహకులు పలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 100 మందికి రూ.30 వేల విలువైనవి ఇచ్చినట్లు పాస్టర్ రవికుమార్ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక

వైద్యవిభాగం: ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ బృందం గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని గవర్నర్ వారికి సూచించారు. ఉపకులపతి చంద్రశేఖర్‌తో పాటు కౌన్సిల్ సభ్యుడు డా.జి.నాయుడు పాల్గొన్నారు.

పారు. ఏపీ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్వరూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక కాలువ నిర్మాణం అడ్డగింత

ఎస్.కోట: పట్టణంలోని ఉన్నత పాఠశాల పక్కన జాతీయ రహదారిపై నిలిచిపోతున్న నీటిని బయటకు తరలించేందుకు పంచాయతీ ఈవో అనురాధ ఆధ్వర్యంలో తాత్కాలిక కాలువ నిర్మాణం చేపట్టగా స్థానిక దుకాణదారులు అడ్డుకున్నారు.

అన్నదాత సుఖీభవ వర్తింపజేయండి

జామి: జామిలోని అగ్రహారం రైతులకు భూములపై ఎలాంటి హక్కులు లేకపోవడంతో స్థానిక వీఆర్వో ధ్రువపత్రంతో అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలని గురువారం పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నగర పంచాయతీలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సంకల్ప రథం ద్వారా ఎస్సై బి.గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు బానిసైతే వచ్చే వ్యాధులు, అనారోగ్య సమస్యలను తెరపై ప్రదర్శన వేసి చూపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగు పెంకుటిళ్లు నేలమట్టం

భోగాపురం, జామి, న్యూస్‌టుడే: జిల్లాలో అయిదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భోగాపురం మండలం రామచంద్రపేట, జామి మండల కేంద్రంలో నాలుగు పెంకుటిళ్లు కూలిపోయాయి. ఎవరూ ఇళ్లలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. రామచంద్రపేటకు చెందిన మేడ పైడమ్మ, చోడిపల్లి మసేనమ్మలు పెంకుటిళ్లలో నివాసం ఉంటున్నారు. వర్షాలకు ఇంటి గోడలు నానడంతో భయంతో రెండ్రోజులుగా బంధువుల ఇళ్లలో ఉంటున్నారు. బుధవారం రాత్రి ఇంటి పైకప్పులు కూలిపోయాయి. జనసేన మండల నాయకులు పల్లంట్ల జగదీశ్, రాంబాబు బాధితులను గురువారం పరామర్శించి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ★ జామిలోని దిగువ వీధికి చెందిన రాజాన సీతబాబు కుటుంబంతో, వృద్ధురాలు సీరెడ్డి సింహాచలం ఒంటరిగా వేర్వేరు ఇళ్లలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం సీతబాబు కుటుంబం కూలి పనులకు వెళ్లారు. ఆ సమయంలో ఇల్లు కూలింది. వృద్ధురాలు ఇంటి దుస్థితి బట్టి వరండాలోనే అప్రమత్తంగా ఉంటున్నారు. మధ్యాహ్నం సమయంలో ఆమె ఇల్లు కూలిపోయింది. ఎవరికీ ఏం ప్రమాదం జరగలేదు.

రామచంద్రపేటలో ఇల్లు పరిశీలిస్తున్న జనసేన నాయకులు

'ఉపాధి'లో సామాజిక తనిఖీపై అవగాహన

మానవహారంగా ఏర్పడి వివరాలు తెలుసుకుంటున్న గొల్లలపాలెం గ్రామస్థులు

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేసిన పనులు, నగదు చెల్లింపులపై నిర్వహించే సామాజిక తనిఖీపై గొల్లలపాలెంలో గ్రామస్థులకు ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్(ఐఈసీ) బృందం గురువారం అవగాహన కల్పించింది. ఎస్సార్పీ ఎం.గోవింద్, డీఆర్పీలు ఎ.సురేష్, వై.శ్రీను, ఆర్.రమేష్ వివరించారు. అంతకుముందు సర్పంచి మంగమ్మ, వైస్ సర్పంచి రమణమ్మ, కార్యదర్శి షహనజ్, ఏపీవో జనార్దనరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

రహదారులు, కాలువలు నిర్మించండి

కొత్తవలస, న్యూస్‌టుడే: పట్టణంలో పలు చోట్ల రోడ్లు, కాలువలు నిర్మించాలని కొత్తవలస పంచాయతీ గ్రామసభలో పలువురు విన్నవించారు. సర్పంచి ఎం.ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన కార్యదర్శి శైలజ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. బలిఘట్టంలో గుడి దగ్గర రోడ్డు నిర్మించాలని, అయిదుచోట్ల మంచినీటి కుళాయిలు ఏర్పాటుచేయాలని మాజీ సర్పంచి అప్పారావు కోరారు. మూడుచోట్ల కాలువలు, ఒకచోట రోడ్డు నిర్మించాలని వార్డు సభ్యురాలు భర్త అప్పలస్వామి రాతపూర్వకంగా కోరారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీదేవి, పశుసంవర్ధకశాఖ ఏడీ డా.కన్నంనాయుడు, వార్డు సభ్యులు, నాయకులు చినరాము తదితరులు పాల్గొన్నారు. ముసిరాం, చినరావుపల్లి, దేశపాత్రునిపాలెం, గులివిందాడ, నిమ్మలపాలెం, సంతపాలెం, వీరభద్రపురం, వియ్యంపేట గ్రామ పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించారు.

కొత్తవలస గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి రామస్వామి

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన విజయనగరం జిల్లా, విజయనగరం మున్సిపాలిటి, విజయనగరం టౌన్, క్రిష్ణారాజపురం, ప్లాట్‌నెం.184,రు కాపురస్తులు, సాగి లక్ష్మీపతిరాజు గారి కుమారుడు సాగి శివ సీతారామరాజు గారికి విజయనగరం జిల్లా, విజయనగరం మున్సిపాలిటి, విజయనగరం టౌన్, బాబామెట్ట, ఉడాకాలనీ, ఫేజ్-1, ప్లాట్ నెం.ఎల్.ఐ.జి.-105,రు కాపురస్తులు, అడ్డాల లేటు బాపిరాజు గారి కుమారుడు అడ్డాల శ్రీనివాసు గారికి చెందిన ఈ క్రింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని వారి నుండి క్రయపురోషి పొందియున్నారు.

సదరు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని నాక్లయింట్లు క్రయము పొందుటకు, ఎవ్వరికైనను ఎట్టి అభ్యంతరములైనను యున్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 10 దినములలోగా ఈ ప్రకటనలోని నాయొక్క చిరునామాకు కానీ, నా క్లయింట్ల చిరునామాలకు గాని లిఖిత పూర్వకముగా తెలియపరచగలరు. లేని యెడల సదరు షెడ్యూల్ ఆస్తి నిర్వివాద ఆస్తి అని రూఢి పరచుకొని పైన వివరించిన విక్రయదారుల నుండి నా క్లయింట్లు క్రయము పొందగలరు. పిదప ఎవ్వరూ సదరు షెడ్యూల్ ఆస్తిపై నా క్లయింట్లకు గల హక్కును ప్రశ్నించజాలరని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్: విజయనగరం జిల్లా,విజయనగరం సబకా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్లో చేరిన విజయనగరం సెకండ్ బిట్ డోర్ నెం.27-14-1రు లేనులో గల బాబామెట్ట ఉడాకాలనీ, ఫేజ్-1లే-అవుట్లో యున్నటువంటిన్నీ సర్వే నెం.315రుకు చెందినటువంటిన్నీ PLOT No.LIG-105 రూ గల స్థిరాస్థు భాస్థలమునకు కొలతలు హద్దులు వివరం.

స్థలం కొలతలు : ఉత్తర దిశ : 31 అడుగులు (9.45మీ॥), దక్షిణ దిశ : 31 అడుగులు (9.45మీ॥), తూర్పు దిశ : 50 అడుగులు (15.25మీ॥), పశ్చిమదిశ : 50 అడుగులు (15.25 మీ॥), విస్తీర్ణం : 172.22 చర॥ (143.79 చామీ).

హద్దులు : తూర్పు : PLOT No.LIG-106రు,, దక్షిణం: PLOT No.LIG-122రు,, పడమర : PLOT No.LIG-104రు,, ఉత్తరం : 30 అడుగుల రోడ్డు.

పైన వివరించిన షెడ్యూల్ దాఖలా మొత్తం ఖాళీ స్థలములో అనిర్దిష్టపు,అవిభక్తపు (UN-DIVIDED AND UNSPECIFIED) 57.40చ॥గ విస్తీర్ణం కలిగినటువంటిని నిర్మాణము R.C.C.స్లాబ్ బిల్డింగ్ GROUND FLOOR 884 చ॥అ॥ల పరిమితి కలిగినటువంటిని GROUND FLOOR R.C.C.స్లాబ్ రెసిడెన్షియల్ పోర్షన్‌కు హద్దులు వివరం : తూర్పు : PLOT No.LIG-106రు, దక్షిణం: PLOT No.LIG-122రు, పడమర : PLOT No.LIG-104రు, ఉత్తరం: 30 అడుగుల రోడ్డు.

Sd/- PODUGU KUMARA SWAMY., Advocate
Vizianagaram. Cell No. 7330902789

(c) eenadu

నిర్ధారణ పేరు... దోపిడీ జోరు

రోగుల అనుమానమే కొందరికి రాబడి

వాతావరణంలోని మార్పు. **ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే**. చిన్నపాటి జ్వరమొచ్చినా వస్తున్న అనుమానాలు కొందరు ప్రైవేటు వైద్యులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రజల అనారోగ్య ఆందోళనే అదనుగా దోపిడీకి తెరదీస్తున్నారు. సాధారణ జ్వరానికి రూ.వేలల్లో ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు తల్లడిల్లుతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరిట దోచుకోవడం పరిపాటిగా మారింది.

నీరసానికి రూ.50వేలు తరచూ కళ్లు తిరుగుతున్నాయని తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వెళ్లగా ఎటువంటి పరీక్షలు చేయకుండానే ఐసీయూకి తరలించారని, తర్వాత పరీక్షలు, ఇతర చికిత్సల పేరుతో రూ.50 వేలు బిల్లు వేశారని తణుకుకు చెందిన ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు.

జ్వరానికి రూ.70వేలు జ్వరంగా ఉందని తాడేపల్లిగూడెం పట్టణం రామారావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా వివిధ పరీక్షలు చేశారు. మందులిస్తూనే అయిదు రోజులకు రూ.70వేలు బిల్లు వేశారని, ఇంకా పరీక్షలు చేయాలని అంటున్నారని, ఇంకా ఎంత ఖర్చవుతుందోననే భయం వెంటాడుతుందని సుబ్బారావుపేటకు చెందిన ఎన్.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

✸ జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, నర్సింగ్ హోంల పేరిట వెలిసిన ఆసుపత్రుల్లో పరీక్షల పేరుతో దోపిడీకి దిగుతున్నారు. డెంగీ నిర్ధారణకు ఎలీసా పరీక్షలు ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే నిర్ధారణ చేయాల్సి ఉండగా కొంతమంది వైద్యులు పరీక్షల పేరుతో దోచుకుంటున్నారు. ఇటీవల డెంగీ లేకుండానే వైద్యం చేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ఓ ఆసుపత్రి యాజమాన్యంపై కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ రుసుములు, ల్యాబ్, ఇతర అన్నింటి రుసుముల బోర్డుల ప్రదర్శన చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా కొంతమంది వైద్యుల తీరులో ఏ మాత్రం మార్పు రావడం లేదు.

ప్లేట్‌లెట్ల బూచిని చూపిస్తూ వాతావరణంలోని మార్పులతో కొంతమందికి దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు రాగానే సహజంగానే శరీరం వేడెక్కుతోంది. ప్రభుత్వాసుపత్రులున్నా చాలామంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో సాధారణ జ్వరమైనా డెంగీ అనుమానం వ్యక్తం చేసి, పరీక్షలు రాసేస్తున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గాయంటూ భయం రేపుతున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని ఒక్కో రోగి నుంచి ల్యాబ్, ఆసుపత్రి ఛార్జీలు, మందులు కలిపి కనిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నారు. 'ప్రజలు జ్వరంపై భయాన్ని వీడి ప్రభుత్వాసుపత్రుల సేవలను వినియోగించుకోవాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో రుసుముల ప్రదర్శనపై నూతన విధానాలు రూపొందించి ఆసుపత్రులకు పంపించాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం' అని డీఎంహెచ్‌వో గీతాబాయి తెలిపారు.

నేడు, రేపు మంచిలి రైల్వేగేటు మూత

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల కారణంగా అత్తిలి మండలం మంచిలి గ్రామంలోని రైల్వే గేటును శుక్రవారం ఉదయం 7 నుంచి శనివారం రాత్రి 7 గంటల వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తణుకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు.

ప్రాజెక్టు పనులపై మంత్రి ఆరా

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం మీదుగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పుష్కర ఎత్తిపోతల పథకం పంపుల ప్రారంభానికి బుధవారం సాయంత్రం వెళ్తూ మంత్రి నిమ్మల రామానాయుడు మార్గం మధ్యలో ఆగి పనులు పరిశీలించారు. బట్రస్ డ్యాం నిర్మాణం, డీ వాల్ పనుల గురించి ఎస్‌ఈ రామచంద్రరావుతో మాట్లాడారు. వరద పెరుగుతున్న దృష్ట్యా దిగువ కాఫర్ డ్యాం వద్ద నీటిని తోడేందుకు చేసిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. బట్రస్ డ్యాం పనులు చివరి దశకు చేరుకున్నాయని డీ వాల్ నిర్మాణానికి ఆటంకం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఈ వివరించారు.

అధికారులతో మాట్లాడుతున్న రామానాయుడు

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేపట్టిన రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీధర్, అకడమిక్ రిజిస్ట్రార్ లక్ష్మణరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

బాలికలే అధికం.. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండో రోజు జరిగిన కౌన్సెలింగ్‌లో బాలికలే అధిక సంఖ్యలో ప్రవేశాలు దక్కించుకున్నారు. గురువారం జరిగిన అడ్మిషన్ల ప్రక్రియకు అధికారులు 547 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. వీరిలో 429 మంది అడ్మిషన్లు పొందారు. వీరిలో బాలుర సంఖ్య 116 అయితే బాలికలు 313 మంది ప్రవేశాలు పొందడం విశేషం.

శ్రీకాకుళం క్యాంపస్‌లో టేబుళ్ల వద్ద విద్యార్థులు

చేనుకు చేవ.. రైతుకు రొక్కం..!

ఈనాడు డిజిటల్, భీమవరం: కాలువల్లో గుర్రపు డెక్క సమస్య.. రైతులకు నాణ్యమైన ఎరువు అందించేందుకు పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆలోచనతో ఒకేసారి పరిష్కారం లభించింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన గుర్రపుడెక్క నుంచి ఎరువు తయారీ సత్ఫలితాలిచ్చింది. వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆకివీడు మండలం సిద్దాపురంలోని సంపద తయారీ కేంద్రంలో గుంటల్లో గుర్రపుడెక్క నుంచి సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని ఏప్రిల్ నెలలో చేపట్టారు. అది విజయవంతం కావడంతో స్వయంగా రైతులే ఎరువు తయారు చేసుకునేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక చేస్తున్నారు.

ఆరు నెలల పాటు నిల్వ.. రసాయన ఎరువులు నాలుగైదు వారాలు నిల్వ ఉంచితే గుర్రపుడెక్కతో చేసిన ఎరువును ఆరు నెలల పాటు నిల్వ ఉంచుకోవచ్చు. రెండు నుంచి మూడు రెట్లు అధిక ఫలితాన్నిస్తుంది. గుర్రపుడెక్క కుళ్లడానికి తక్కువ సమయం పడుతోంది. నాలుగైదు రోజుల్లోనే ఎండుతుంది. పశువుల వ్యర్థాల కన్నా ఇందులో నత్రజని, భాస్వరం (పాస్ఫరస్), పొటాషియం, సేంద్రియ కర్బనం, బోరాన్, కాపర్, మాంగనీస్, నికెల్, జింక్, ఐరన్ ఎక్కువగా ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇలా చేశారు.. 3-9 గుంటలను తవ్వి అందులో కింద గడ్డిని పొరగా వేసి, ఆపైన ముక్కలుగా చేసిన గుర్రపు డెక్క, దానిపైన రెండు అంగుళాల మందంలో ఆవు పేడను ఏడు నుంచి ఎనిమిది పొరలుగా వేశారు. 21 రోజుల పాటు మగ్గించారు. ఆపై, మైక్రోబియల్ కల్చర్‌ను వాడి త్వరితగతిన కంపోస్టింగ్ పూర్తయ్యేలా చేశారు. ఏడు వారాలు పూర్తయిన తర్వాత నల్లని రంగులో మృదువైన గుళికలుగా తయారైంది.

గుర్రపు డెక్క నుంచి ఎరువుల తయారీ విధానాన్ని మహిళలకు వివరిస్తున్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, అధికారులు

రైతులకు శిక్షణ ఎరువు తయారీకి వాడే ప్రాంతం క్రిమికీటకాలకు ఆశ్రయం... ఇళ్లకు, గోదాములకు దూరంగా ఉండాలి. గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లో కంపోస్టు ఎరువును తయారు చేసేలా రైతులకు అవగాహన కల్పించనున్నారు. డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో స్థానిక రైతులను గ్రూపులుగా చేసి, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళిక చేస్తున్నారు.

ఈ ఫలితాలు మరిన్ని ప్రయోగాలు చేసేందుకు స్ఫూర్తినిచ్చాయి. పొలం మట్టిలో ఉంచాల్సిన దానికంటే ఎక్కువగానే ఫలితాలు వచ్చాయి. రైతులకు నాణ్యమైన సేంద్రియ ఎరువును తక్కువ ఖర్చుతో అందించడంతో పాటు నీటి వనరులను సక్రమంగా ఉపయోగించేలా ప్రణాళిక చేస్తాం. - **చదలవాడ నాగరాణి, కలెక్టర్**

ఇవీ ఫలితాలు: (శాతాల్లో)

ఉదజని సూచిక (పీహెచ్)	7.6
సేంద్రియ కర్బనం	2.25
నత్రజని	0.44
భాస్వరం	1.54
పొటాషియం	1.31
జింక్	0.5
కాపర్	0.03
సల్ఫర్	91 పీపీఎం

కొత్తగా రుణం.. ఉపాధికి ఊతం..!

ఎస్సీ కార్పొరేషన్‌కు ఊపిరి పోసే యత్నం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. ఆ శాఖ నుంచి ఎటువంటి సహాయం ఎస్సీ సామాజిక వర్గ యువత పొందలేదు. చివరకు ఉపాధి యూనిట్లను సైతం రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కార్పొరేషన్‌కు పునర్ వైభవం తెచ్చేందుకు యత్నిస్తోంది. అర్హులకు ఉపాధి రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ మొదలైంది. నిలిచిన కార్యకలాపాలు మళ్లీ మొదలయ్యాయి. ఈ క్రమంలో ఉపాధి రుణ బకాయిల వసూళ్లు చేపట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు బృందాలను ఏర్పాటు చేసి వసూళ్లు ప్రారంభించారు. ముందు నోటీసులు జారీ చేస్తున్నారు. వసూలైన మొత్తాలతో కొత్త వారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంది.

రుణం చెల్లించాలని కోరుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి

581 యూనిట్లు.. ఉమ్మడి జిల్లాలో 2017 నుంచి 2019 వరకు 581 మందికి వివిధ యూనిట్లను మూడు కేటగిరీలుగా రూ.23.65 కోట్లు ఉపాధి రుణాలుగా పొందారు. వీటిలో స్వయం ఉపాధి విభాగం ద్వారా బ్యూటీ పార్లర్, మెడికల్ స్టోర్, టెంట్ హౌస్ తదితర యూనిట్లు ఇచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ఇన్నోవా, ఇథియోస్ కార్లు ఇచ్చారు. ఇతర విభాగంలో ఆటోలు, ట్రక్ ఆటోలు, చిన్న కార్లు ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.15.36 కోట్లను లబ్ధిదారులు తిరిగి చెల్లించారు. ఇంకా రూ.8.29 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వీటికి రెండు నెలలు గడువు నిర్ణయించి ఈ లోగా వసూలు చేయాలన్న యోచనతో కార్యాచరణ చేపట్టినట్లు ఈడీ ముక్కంటి చెప్పారు.

నగదు ఇవ్వకండి.. ఈ బకాయిలకు సంబంధించి ఎవరికీ నగదు ఇవ్వవద్దని ఈడీ ముక్కంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎస్బీఐలో ఉన్న ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ ఖాతా నంబరు 62084455544లో జమ చేయాలన్నారు. లేకుంటే డీడీ తీసి ఏలూరులోని తమ కార్యాలయంలో అందజేయాలని ముక్కంటి లబ్ధిదారులకు సూచించారు.

డీఅండ్‌వో ట్రేడ్ బకాయిలు చెల్లించాలని మోసం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: హలో నేను భీమవరం కమిషనర్‌ని, డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సుల బకాయిలను వెంటనే చెల్లించాలంటూ అపరిచిత వ్యక్తి ఒకరు భీమవరం పట్టణంలోని వ్యాపారులను బురిడీ కొట్టించాడు. అతని మాటలు నమ్మి కొందరు డబ్బులు కట్టినట్లు తెలిసింది. ఈ వ్యవహారం గురువారం బహిర్గతం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 91210 97923 నంబరుతో మున్సిపల్ కమిషనర్ హరినారాయణ్, కార్పొరేషన్ ఆఫీసు పేరిట, మరికొన్ని ఇతర నంబర్ల నుంచి ఫోన్ చేస్తున్నారు. అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భీమవరం కమిషనర్ కె.రామచంద్రారెడ్డి కోరారు. సంబంధిత వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

నిర్ణీత సమయానికి హాజరుకావాలి : డీఈవో

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: నిర్ణీత సమయానికి ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రతి నెలా సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు త్వరలో హ్యాండ్ బుక్ అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో పాఠ్యాంశాలను నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎంఈవోలు వి.హనుమ, జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇదేమి కాలంరొయ్యో!

● ఆక్వాకు కలిసిరాని ప్రథమార్ధం ● నష్టాల బాట పట్టిన రైతు

కలిదిండి, మండవల్లి, న్యూస్‌టుడే: కలిదిండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కోలా రాజా 20 ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. గతేడాది ప్రథమార్థంలో ఖర్చులు పోను ఎకరాకు లక్ష రూపాయలు మిగిలాయి. ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

రొయ్య రైతులు కష్టాలకు ఎదురీదుతున్నారు. ఆక్వా రంగానికి ఈ ఏడాది ప్రథమార్ధం ఏ మాత్రం కలిసి రాలేదు. 2024తో పోల్చితే.. 2025లో తొలి ఆర్నెల్ల నష్టాలు చవిచూసింది. ఇందుకు ప్రధాన కారణం వాతావరణం.. వ్యాధుల బెడద.. ధరల పతనం. ఆరు నెలల్లో ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా 70 శాతం రైతులు నష్టపోయారు.

గతం ఘనం.. గత సంవత్సరం రొయ్యల రైతులకు స్వర్ణయుగంగా మారింది. సగటున ఏడాదిలో 260 రోజులు పొడి వాతావరణం ఉంది. 2023 నవంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు వేడితో కూడిన వాతావరణం ఉండటంతో ఆక్వా రంగానికి అనుకూలంగా మారింది. దీంతో పెద్దఎత్తున రైతులు నష్టాల నుంచి లాభాల వైపునకు అడుగులు వేశారు.

నాడు - నేడు (మే నెల ప్రాతిపదికన)

విషయం	2024	2025
వాతావరణం	అధిక ఉష్ణోగ్రతలు (42-46 డిగ్రీలు)	అధిక వర్షపాతం (13.7 సెం.మీ)
వ్యాధుల బెడద	30 శాతం	70 శాతం
ధరలు (100కౌంటు)	రూ.240-250	రూ.215-220
దిగుబడి	70శాతం	20 శాతం

మే నెలలో వర్షాలు.. 125 ఏళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ నివేదిక వెల్లడించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ వాతావరణం రైతులకు పూర్తిగా సహకరించలేదు. మే నెలలో ఎడతెరిపి లేని వర్షాలతో ప్రాణవాయువు సమస్య ఏర్పడి చేపలు, రొయ్యలు మృత్యువాతపడ్డాయి. దీంతోపాటు అధిక సాంద్రతలో సాగు చేపట్టడం, నీరు, మేత యాజమాన్యంపై సరైన అవగాహన లేకుండా సాగు చేయడం, రొయ్య పిల్లల ఎంపికలో అజాగ్రత్త వల్ల రొయ్యలు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేకపోయాయి.

యాజమాన్య పద్ధతులే రక్ష.. మండు వేసవిలోనూ ఆకస్మికంగా వాతావరణం చల్లబడిపోవడం, ఎడతెరిపి లేని వర్షాలు చేపలు, రొయ్యల సాగుకు ప్రతికూలంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో సరకును రక్షించుకోవడానికి అనువైన యాజమాన్య పద్ధతులపై సాగుదారులకు మరింత అవగాహన కల్పిస్తామని మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు.

చంపేస్తున్నారా.. చనిపోతున్నారా!

కాలువల్లో గుర్తు తెలియని మృతదేహాలు — పోలీసులకు సవాల్‌గా కేసులు

● రెండు నెలల కిందట గణపవరం మండలం పిప్పర వద్ద ఉండి కాలువలో 60 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. అతని వివరాలు తెలియరాలేదు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వృద్ధుడి ఆచూకీ తెలుసుకునేందుకు అదృశ్య కేసులు పరిశీలిస్తున్నారు.

● ఏలూరు నగర శివారు వెంకటాపురం- మాదేపల్లి రోడ్డులోని పంట బోదెలో 3 నెలల కిందట కుళ్లిన దశలోని సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆయన్ను ఎవరైనా హత్య చేశారా? ప్రమాదవశాత్తూ మృతి చెందారా? వివరాలు తెలియరాలేదు.

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆ కేసులు మిస్టరీగా మారాయి. ప్రమాదవశాత్తూ చనిపోయారా.. ఆత్మహత్య చేసుకున్నారా.. ఎవరైనా చంపేశారా.. అన్న విషయాలు తెలియక క్లిష్టమవుతున్నాయి. పంట బోదెలు, కాలువలు, నిర్మానుష్య ప్రాంతాల్లో గుర్తుతెలియని మృతుల కేసులు సత్వరం కొలిక్కి రాక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. మృతులు ఎక్కడివారో.. ఎలా చనిపోయారో తెలియక చిక్కుముళ్లు వీడటం లేదు.

కుంటుపడుతున్న పురోగతి.. ఉమ్మడి జిల్లాలో అనుమానాస్పద మృతి కేసులు పెరుగుతున్నాయి. ఊరు, పేరు తెలియని మృతదేహాల కేసుల పురోగతి కుంటుపడుతోంది. కాలువలు, పంట బోదెల్లో లభ్యమైన మృతదేహాల కేసులు ఛేదించడం క్లిష్టమవుతోంది. మృతదేహాలు కుళ్లిపోవడం, గుర్తుపట్టలేని విధంగా మారడంతో.. ఆచూకీ తెలుసుకోలేక పోతున్నారు. ఆయా పోలీసు స్టేషన్లలో అదృశ్యం కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అన్ని కోణాల్లో చేస్తేనే.. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తేనే నిజాలు బయటపడే అవకాశముంది. మృతదేహం లభ్యమైనప్పుడు ఊరు, పేరు తెలియనప్పుడు మొదట ఆ వ్యక్తి ఆచూకీ కనుగొనడమే సమస్యగా మారుతోంది. పని ఒత్తిడి కారణంగా ఆయా కేసులను పక్కన పెట్టడంతో అసలు నిజాలు తెలియడం లేదు. మరోవైపు తమ వారు ఏమయ్యారో తెలియక బాధిత కుటుంబాలు మదన పడుతున్నాయి. 'అదృశ్యం, అనుమానాస్పద మృతి కేసుల విషయంలో ఎక్కడా రాజీపడకుండా దర్యాప్తు చేస్తున్నాం. కేసుల పురోగతి, స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పోలీసు అధికారులకు సూచనలిస్తున్నాం' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

రైళ్లలో ఆకస్మిక తనిఖీలు

ఈనాడు డిజిటల్, భీమవరం: ఒడిశా నుంచి వచ్చే విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను భీమవరం రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి 11 గంటలకు జిల్లా పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ఈగల్ టీం ఐజీ రవికృష్ణ ఆదేశాల మేరకు ఏఎస్పీ భీమారావు ఆధ్వర్యంలో తణుకు నుంచి ఆకివీడు వరకు వివిధ స్టేషన్లలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఈగల్, డాగ్‌స్క్వాడ్, స్థానిక పోలీసులు తనిఖీలు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

భీమవరం రైల్వే స్టేషన్ వద్ద పోలీసు బృందం

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉత్తమ పంచాయతీల ఎంపికలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం నుంచి జిల్లాలో 25 పంచాయతీల్లో పర్యటించనుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బృంద ప్రతినిధులు గురువారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోకి వెళ్లి అక్కడ ప్రజలతో మాట్లాడి పల్లె పాలనపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, సచివాలయాలు, పాఠశాలల నిర్వహణ, ఇళ్ల నుంచి చెత్త సేకరణ ఎలా జరుగుతుంది తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రామ్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి సందీప్ పాల్గొన్నారు.

కలెక్టర్ నాగరాణికి పుష్పగుచ్ఛం అందజేత

పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపనకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. పరిశ్రమల శాఖ అధికారులు, పారిశ్రామికవేత్తలతో కలెక్టరేట్‌లో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి ఆర్థిక తోడ్పాటు అందించాలని అధికారులను ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్ 95523 00009 ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. మే 27 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 465 దరఖాస్తులు రాగా 458 ఆమోదించామని తెలిపారు. అసంఘటిత కార్మికులను పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాలల్లో నమోదు చేసేందుకు అధికారులు శ్రద్ధ చూపాలని సూచించారు. పరిశ్రమల శాఖ జిల్లా అధికారి గణపతిరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అతివలపై అఘాయిత్యాల నిరోధానికి చర్యలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళలపై దాడులు, అఘాయిత్యాలను నిరోధించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని వన్‌స్టాప్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేసుల రిజిస్టర్, వైద్యం తదితరాలను పరిశీలించారు. తితిదే కల్యాణ మండపం వద్దనున్న ఉద్యోగ మహిళల వసతి గృహాన్ని సందర్శించారు. శైలజ మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే అదే దోషులకు ఆఖరి రోజని హెచ్చరించారు. నిందితులకు శిక్షపడేలా పోలీసులకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఎవరైనా మహిళలపై అసభ్య పోస్టులు పెడితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

వన్‌స్టాప్ కేంద్రం దస్త్రాలు పరిశీలిస్తున్న శైలజ

చుక్‌చుక్.. ఇక పనులు చకచకా

కోటిపల్లి- నరసాపురం రైల్వే లైనుకు తొలగిన అడ్డంకులు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, అల్లవరం: కోనసీమ వాసుల చిరకాల స్వప్నం నెరవేరే పరిస్థితి కనిపిస్తోంది. కోటిపల్లి - నరసాపురం మధ్య రైలు కూత వినిపించేందుకు మార్గం సుగమం అయిందని రైల్వే అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు నెలకొన్న కొన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగాయని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ముందుకెళ్లడమే తరువాయని స్పష్టం చేస్తున్నారు. అలైన్‌మెంట్‌పై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా స్టే విధించడంతో ఆ మధ్య పనులు నిలిచిపోయాయి. తాజాగా ఆ స్టేను ఎత్తివేశారని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు. అయినవిల్లి మండలం శానిపల్లిలంక వద్ద గోదావరిపై వంతెన నిర్మించే ప్రాంతంలో సామగ్రి నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కలెక్టర్ మహేశ్‌కుమార్ చొరవ చూపి సమస్య పరిష్కరించారు. దీంతో వాటికి అడ్డంకులు తొలగాయి. ఇక రైల్వే లైను పనులు ఊపందుకోవడమే తరువాయి.

అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద కోటిపల్లి- నరసాపురం రైల్వే నిర్మాణ పనులు

రెండు ప్రాంతాల పరిధిలో.. రైల్వే లైన్ వల్ల అమలాపురం మండలం భట్నవిల్లి నుంచి పేరూరు వరకు, మలికిపురం మండలం గుడిమెల్లంక వద్ద విలువైన భూములు కోల్పోతున్నామని పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక 2003-04లో సేకరించిన వాటికి అప్పట్లో పరిహారం చెల్లించినా భూములు స్వాధీనం చేసుకోలేదు. ప్రాజెక్టు పట్టాలెక్కుతున్న నేపథ్యంలో తాజా భూసేకరణ ధరలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

భూసేకరణ ఇలా.. కోటిపల్లి - నరసాపురం రైల్వేలైన్‌లో కోటిపల్లి నుంచి అమలాపురం వరకు 12.07 కి.మీ., అమలాపురం - నరసాపురం మధ్య 45.17 కి.మీ మేర రైల్వే ట్రాక్ ఏర్పాటు (మొత్తం 57.21 కి.మీ) కానుంది. కోనసీమ జిల్లాలో 45.65 కి.మీ, పశ్చిమ గోదావరిలోకి 11.55 కి.మీ వస్తుంది. రైల్వే లైనుకు 26 గ్రామాల పరిధిలో 351.77 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటికి ఎనిమిది గ్రామాల పరిధిలో 112.86 హెక్టార్లు సేకరించి రైల్వే శాఖకు అప్పగించారు. పేరూరు, పాశర్లపూడి, గుడిమెల్లంక వద్ద మూడు వంతెనలకు 24.10 ఎకరాలు తీసుకున్నారు. 18 గ్రామాల పరిధిలో 238.91 హెక్టార్లు ఇంకా సేకరించాల్సి ఉంది. రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా 13 గ్రామాల పరిధిలో 161 హెక్టార్లలో సర్వే చేశారు. మరో అయిదు గ్రామాల పరిధిలోని 75.96 హెక్టార్లకు సంయుక్త సర్వే చేపట్టాల్సి ఉంది. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో వేగం పెరగనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

● "కోటిపల్లి- నరసాపురం మధ్య రైల్వే నిర్మాణ పనులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులు తొలగాయి. భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి మాకు స్వాధీనపరచగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం." అని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిద్ధయ్య తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

6న ఈత పోటీలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక విశ్వనాథ్ భర్తియా ఈత కొలనులో జిల్లా ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉమ్మడి జిల్లా స్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఔత్సాహికులు ఈ నెల 5లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 94403 37313 నంబరును సంప్రదించవచ్చని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.

సైబర్ బాధితురాలికి సొమ్ము అందజేత

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ మహిళను మోసగించారు. ఆర్థికంగా నష్టపోయిన బాధితురాలికి పోలీసులు సాంత్వన చేకూర్చారు. పోగొట్టుకున్న సొమ్మును తిరిగి ఆమెకు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు ఒకటో పట్టణానికి ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఇటీవల సైబర్ మోసానికి గురయ్యారు. సామాజిక మాధ్యమంలో వచ్చిన ప్రకటనలు నమ్మి ఓ గ్రూపులో ట్రేడింగ్, బిట్ కాయిన్, క్రిప్టో కరెన్సీ లావాదేవీల్లో ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టి రూ.2.56 లక్షలు నష్టపోయారు. తాను మోసపోయినట్లు గ్రహించిన ఆమె వెంటనే 1930కు ఫిర్యాదు చేశారు. జిల్లా సైబర్ సెల్ సహకారంతో రెండో పట్టణ సీఐ అశోక్‌కుమార్, ఎస్సై మధువెంకటరాజా సైబర్ మోసగాళ్లను గుర్తించారు. వారి వద్ద నుంచి సొమ్ము రాబట్టారు. ఆ మొత్తాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చేతులమీదుగా బాధితురాలికి రూ.2.56 లక్షలు అందజేశారు.

మీ బిడ్డల భవితకు.. మా పిల్లలతో హామీ

సర్కారు బడుల్లో చదివిస్తున్న ఉపాధ్యాయులు

పెనుగొండ, పోడూరు, జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వారంతా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు.. పెద్ద పెద్ద విద్యాసంస్థల్లో తమ పిల్లలను చదవించే స్తోమత వారిది... కానీ 'మీ పిల్లలను మా పాఠశాలల్లో చదివించండి' అంటూ ఇంటింటికీ తిరిగి అడిగిన మాటలు మనకూ వర్తిస్తాయనుకున్నారు.. మనం ఇతరులకు చెప్పి.. మన పిల్లలను ప్రైవేటులో చదవించడమేమిటని భావించారు. మార్పు మన నుంచే రావాలని.. తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించారు. వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేసి.. తమ పిల్లలనే ఒక ఉదాహరణగా చూపుతూ అందరిలో స్ఫూర్తి నింపుతున్నారు ఈ గురువులు.

ఒత్తిడి లేని విద్య..

బొంతు మధుబాబు పోడూరు మండలం జిన్నూరు జడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన ప్రభుత్వ బడిలో చదివి 2016 డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువు సాధించారు. అదే స్ఫూర్తితో తన పిల్లలు సైతం సర్కారు బడుల్లో చదివి తనకు మాదిరిగానే ఉన్నత శిఖరాలకు వెళ్లాలని భావించి.. ఆయన పనిచేస్తున్న అదే పాఠశాలలో వారిని చేర్చాడు. తన కుమార్తె కీర్తి జ్ఞాన వర్షిత ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో 557 మార్కులు సాధించి కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. కుమారుడు విజ్ఞాన్ నాగసత్య కార్తికేయ కూడా అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. 'ప్రభుత్వ పాఠశాల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడి లేని విద్య లభిస్తుంది. ప్రభుత్వాలు అనేక వసతులు కల్పిస్తున్నాయి. అందరూ సర్కారు బడుల్లోనే పిల్లలను చదివించాలి.' అని మధుబాబు తెలిపారు.

అత్యుత్తమ బోధన ఉంటుందనే..

జంగారెడ్డిగూడేనికి చెందిన బాబూ రాజేంద్రప్రసాద్ పంగిడిగూడెం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనకున్న ఒక్కగానొక్క కుమార్తె హెప్సీసుమ ప్రస్తుతను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రస్తుతం బాలిక జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. 'ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారు. అత్యుత్తమ బోధన ఉంటుంది. అందుకే నా కుమార్తెను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నా.' అని రాజేంద్రప్రసాద్ అంటున్నారు.

తన తోవలోనే.. పిల్లలను..

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు ఉన్నాయని, ఆహ్లాదకర వాతావరణంలో మెరుగైన బోధన ఉంటుందని అందరికీ చెప్పడంతో పాటు తన ఇద్దరు కుమారులను వడలి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు సోమరాజుచెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరవాసరపు బాలకరుణాకరరావు. పెద్ద కుమారుడు భాస్కరసత్య అన్వేష్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ద్వితీయ కుమారుడు రాకేష్ రిషి వడలి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. 'సర్కారు బడుల్లో చదవడంతోనే నేను ఇంతవాడిని అయ్యాను. అందుకే నా పిల్లలను సైతం ఇక్కడే చదివిస్తున్నా. అందరూ ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపితే.. వ్యవస్థలో కచ్చితంగా మార్పు వస్తుంది.' అని చెబుతున్నారు బాలకరుణాకరరావు.

'నన్నయ'లో అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో ఈ నెల 9, 10 తేదీల్లో తొలిసారిగా ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్, అనలిటికల్, ఫార్మాష్యూటికల్ డెవలప్మెంటు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.అశోక్ పేర్కొన్నారు. స్థానిక ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని భవిష్యత్తు లక్ష్యాల గురించి వివరించనున్నారని తెలిపారు. ఆచార్యులు టీవీ రామ్మోహన్, ఎస్.పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆచార్యులు

సీపీఐ జిల్లా మహాసభల విజయవంతానికి పిలుపు

తణుకు, న్యూస్‌టుడే: ఆగస్టు 6, 7 తేదీల్లో ఉండిలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వంకా సత్యనారాయణ సురాజ్య భవన్‌లో జరిగిన సీపీఐ తణుకు ఏరియా మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్తు భారాలు తొలగించాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలని, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 5న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు విజయవంతం చేయాలన్నారు. చంద్రు వెంకటరావు అధ్యక్షతవహించారు. తొలుత సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకుడు వాకలపూడి వీర రాఘవులు ఆవిష్కరించి, మహాసభ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.వెంకటరావు, పట్టణ కార్యదర్శి బి.నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారం ప్రసాద్, సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో సీపీఐ నాయకులు

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ నియామకాల ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ గుడికి సౌర కాంతులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడి ప్రాంగణంలో సౌరశక్తి విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేశారు. గుడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సౌరశక్తి పలకలను అమర్చారు. ఈ యూనిట్ ద్వారా ఆలయం వద్ద రేకుల పందిరి, పరిసరాల్లోని దీపాలు, పంకాలు, సీసీ కెమెరా, మంచినీళ్ల ట్యాంకు మోటారు తదితరాలకు కనెక్షన్ ఇస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పలకలు అమర్చుతున్న కార్మికులు

నేడు మహా సుదర్శన హోమం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం మావుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మహా సుదర్శన హోమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కళా వేదికపై సుదర్శన యంత్రం ప్రతిమ, భక్తులు తిలకించేందుకు పందిళ్లు వేసినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

కాటేసిన మృత్యువు

- కారు టైరుపేలి భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు
- స్వల్పంగా గాయపడిన మరో ఇద్దరు

రావులపాలెం పట్టణం, గ్రామీణం, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: వారిద్దరూ కష్టజీవులే.. కుటుంబ పోషణలో ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అనుకోని ప్రమాదంలో మృత్యువు వీరి బంధాన్ని విడదీసింది. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవ్వడంతో భర్త మృతిచెందగా భార్య తీవ్ర గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన బొండా వెంకటలక్ష్మీనరసింహగుప్తా(51) గ్రామంలోనే పరుపుల వ్యాపారం చేస్తుండగా ఆయన భార్య వీర వెంకటలక్ష్మి మగ్గంవర్కు చేస్తుంటారు. ఈమె చేస్తున్న మగ్గం వర్కుకు చెందిన మిషన్లు పాడవ్వడంతో మరమ్మతు చేయించుకునేందుకు గురువారం ఇద్దరూ కలిసి కారులో రాజమహేంద్రవరం బయలుదేరారు. రావులపాలెం సమీపంలోని ఈతకోట టోల్‌ప్లాజా దాటిన తరువాత ఒక్కసారిగా వాహనం టైరుపేలి డివైడర్‌పై నుంచి అవతల వైపునకు దూసుకుపోయింది. ముందుభాగం పూర్తిగా ధ్వంసం కావడంతో ఇద్దరూ అందులో ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి వెంకటలక్ష్మిని బయటకు తీశారు. డ్రైవింగ్ సీటులో ఉన్న గుప్తాను అతికష్టం మీద బయటకు తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలవ్వడంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌పై నుంచి దూసుకుపోవడంతో అదే మార్గంలో రాజమహేంద్రవరం నుంచి పెనుగొండ వెళుతున్న మరో కారుని ఢీకొంది. దీంతో ఆ కారులో ఉన్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, రాజమహేంద్రవరానికి చెందిన భార్యాభర్తలు కర్రి రామారెడ్డి, దివ్యజ్యోతిలకు గాయాలయ్యాయి. రావులపాలెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. వీరు పెనుగొండలోని ఓ శుభకార్యం నిమిత్తం వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. క్షతగాత్రులు కోలుకుంటున్నట్లు చెప్పారు.

నరసింహగుప్తా (పాత చిత్రం)

కారులో ఇరుక్కుపోయిన బాధితులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ గ్రామీణం, జరుగుమల్లి: జాతీయ రహదారి పక్కన ఆగి వున్న లారీని, మరో లారీ ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పెట్రోలు బంకు వద్ద ఓ చోదకుడు లారీని రోడ్డుపక్కన నిలిపి మూత్ర విసర్జనకు వెళ్లాడు. అదే సమయంలో రొయ్యల లోడుతో వస్తున్న మరో లారీ అదుపు తప్పి నిలిపివున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రొయ్యల లోడు లారీలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం తిల్లపూడికి చెందిన వ్యాపారులు నడపాన శ్రీను, సాయితో పాటు చోదకుడు చక్రధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్సై మహేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

24 ఏళ్లు.. 40 నేరాలు

- కరడుకట్టిన అంతర్ జిల్లా నేరస్థుడి పట్టివేత

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : బాల్యం నుంచే దొంగతనాలు మొదలెట్టాడు. 24 ఏళ్ల వయసుకే 40 నేరాలు చేశాడు. పలు జిల్లాల పోలీసులకు ఉరుకులు పెట్టించాడు. ఎవరికీ చిక్కకుండా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. చివరికి చిన్న క్లూతో పోలీసులకు దొరికిపోయాడు. అతడి నుంచి 60 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ఉయ్యాల రాజేష్ (24) కుటుంబం విజయవాడ, వాంబేకాలనీలో ఉంటోంది. అతడు 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పుడే దొంగతనాలు చేయడంతో మూడు సార్లు బాలుర పరిశీలనా గృహంలో ఉంచారు. బయటకు వచ్చినా తీరు మారలేదు. కూలి పనులు చేస్తూ.. చోరీలు చేసేవాడు. 2024, సెప్టెంబరులో మధురానగర్‌లో ఒక తమిళ కుటుంబం ఇంట్లో రూ.11 లక్షలు దోచాడు. జైలుకు వెళ్లి జనవరిలో బెయిలుపై బయటకు వచ్చాడు.

నడిచే వెళతాడు: రాజేష్‌కు బండి నడపడం రాదు. ఎంత దూరమైనా నడిచే వెళతాడు. రాత్రి వేళ బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, పుట్‌పాత్‌లపై పడుకుంటాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో లేచి నడుచుకుంటూ వెళతాడు. రైల్వే లైను వెంబడి, కాలువ గట్ల వెంట వెళతాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. పెద్ద పెద్ద గోడలను 5 సెకన్లలోనే ఎక్కేస్తాడు. ఇలా మధురానగర్‌లో 5 నేరాలు చేసి 94 గ్రాముల బంగారం చోరీ చేశాడు. పటమట, రాజోలు, నూజివీడు, నరసాపురం, నాయుడుపేటల్లో మొత్తం 12 నేరాలు చేశాడు. దోచిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస నేరాలు జరుగుతుండటంతో నిఘా పెంచారు. నేరస్థలంలో కొన్ని వేలిముద్రలు దొరికాయి. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. కేసు నమోదు చేసుకునే సమయంలో ఓ యువకుడు పారిపోయాడు. అతడే రాజేష్ అని తెలిసింది. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి విచారించారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఒక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. విజయవాడ పరిధిలోని 6 కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని ఏసీపీ దామోదర్ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దామోదర్, చిత్రంలో సీఐ శ్రీనివాస్, సిబ్బంది

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India

ప్రాంతీయ కార్యాలయం, భీమవరం, ప.గో.జిల్లా

బంగారు నగల వేలం ప్రకటన

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి మా బ్యాంకు శాఖల నుండి రుణం పొందారు. రుణ బకాయిలు తిరిగి చెల్లించాలంటూ పలుమార్లు నోటీసులు పంపినను రుణాలు తిరిగి చెల్లించలేదు. మా బ్యాంక్ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** మార్గదర్శకాల ప్రకారం **తేది:11-07-2025, శుక్రవారం** సాయంత్రం **04.00 గంటలకు** సంబంధిత బ్యాంకు శాఖల ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయించబడింది. రుణగ్రహీతల బంగారు ఆభరణాలు అమ్మకం తరువాత వేలం ద్వారా స్వీకరించబడిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కూడా బ్యాంకు యొక్క బకాయిలు బాకీ ఉన్నట్లయితే, మిగిలిన బకాయిలను రాబట్టుకొనుటకు రుణగ్రహీతపై అవసరమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించబడతాయి.దిగువ పేర్కొన్న రుణగ్రహీతలలో ఎవరైనా మరణించినట్లయితే, ఈ వేలం నోటీసు రుణగ్రహీతల చట్టపరమైన వారసులకు వర్తిస్తుంది. రుణగ్రహీతలకు నోటీసు అందకపోయినా లేదా నోటీసు తిరస్కరించిన వారికి ఈ పత్రికాప్రచురణ చివరి నోటీసుగా పరిగణించబడుతుంది.

వ.సం.	లోన్ అకౌంట్ నెం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	బకాయి మొత్తం (రూ.లక్షలలో)	స్థూల బరువు (గ్రాములలో)
		శృంగవృక్షం బ్రాంచ్		
1	051616630001072	**చింతపల్లి నాగేశ్వరరావు,** 3-153 శృంగవృక్షం పోస్ట్, పిపి రోడ్, శృంగవృక్షం - 534243	0.21 లక్షలు	10.00
		దగ్గులూరు బ్రాంచ్		
2	076916540003362	**మల్ల వెంకట నవీన్‌కుమార్, తండ్రి : హరిప్రసాద్,** ఇంటి నెం.1 99, గవరపేట, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఆం.ప్ర. దగ్గులూరు-534250	0.64 లక్షలు	14.00
3	076916540004141		1.79 లక్షలు	36.00
		మల్లవరం బ్రాంచ్		
4	089416630000227	**దాకే లక్ష్మణరావు,** 3 78 యస్‌సి ఏరియా, మల్లవరం, అంబేడ్కర్ విగ్రహం, చాగల్లు మండలం, మల్లవరం-534342	0.32 లక్షలు	11.00
		పెనుమంట్ర బ్రాంచ్		
5	043016540007499	**గుత్తుల సత్యవతి, భర్త : సత్యనారాయణ,** 11 73, బ్రాహ్మణచెరువు, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర-534124	1.06 లక్షలు	21.50
6	043016540007500		0.40 లక్షలు	8.20
7	043016540007190	**గోగడ దుర్గా మలేశ్వరి, భర్త : గోగడ ముత్యాలు,** ఇంటి నెం.153, వి వి పాలెం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర - 534124	0.54 లక్షలు	12.00
8	043016540007780		0.80 లక్షలు	18.00
9	043016540008211		1.16 లక్షలు	24.00
10	043016540008245		2.68 లక్షలు	56.00
		పాలకొల్లు యూబిఐ బ్రాంచ్		
11	498406540043770	**సింగంశెట్టి పెద్దింట్లు,** 26-5-1, ముచ్చర్ల వారి తోట, కొండాలమ్మ గుడి, పాలకొల్లు-534260	0.71 లక్షలు	12.60
12	498406540043649		1.60 లక్షలు	29.50
13	498406540043620	**భీమానందం ప్రభావతి, భర్త : నాగేశ్వరరావు,** డి.నెం.1 89, వద్దిలంక, ఎలమంచిలి మండలం, పాలకొల్లు-534266	1.75 లక్షలు	29.00
14	498406540044362	**నీలిమ శలా,** 6-3-13, వార్డు నెం.29, చింతలతోట, పాలకొల్లు-534260	0.61 లక్షలు	10.70
15	498406540044458	**మట్ల వినయ్‌కుమార్,** తండ్రి : వెంకట త్రినాథ ప్రసాద్, డి.నెం.21 10 1, రాజేంద్ర నగర్, పాలకొల్లు, పాలకొల్లు-534260	1.38 లక్షలు	29.00
16	498406540044045		0.30 లక్షలు	5.40
17	498406540044003		0.69 లక్షలు	12.20
18	498406540035890	**చిమట సురేష్, తండ్రి : చెన్నయ్య,** 5 168, బి, యస్‌సి కాలనీ, రామాలయం దగ్గర, ఇనుమెల్ల గుంటూరు, పశ్చిమ గోదావరి-522661	0.18 లక్షలు	5.50
19	498406540035948	**మాకా సువర్ణ రావు,** 7-40, విస్సపేట, పోడూరు మండలం, పెనుమదం, పోడూరు-534267	0.17 లక్షలు	4.90
		ఖండవల్లి బ్రాంచ్		
20	280016540008873	**రామిశెట్టి లక్ష్మి వెంకట నాగ సాయి ప్రసాద్, తండ్రి : రామిశెట్టి సూరిబాబు,** ఇంటి నెం.9 37, రాజుల రామాలయం వీధి, ఖండవల్లి-534330	1.58 లక్షలు	29.50
		కోపల్లె బ్రాంచ్		
21	029816540002578	**కొండేటి పుష్ప, భర్త : సామ్‌సను,** డి.నెం.2 27, చిన్నపేట, కోపల్లె పోస్టు, కోపల్లె గ్రామం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా, కాళ్ళ-534206	0.37 లక్షలు	7.50
22	029816540002412		0.50 లక్షలు	10.00
		భీమవరం యూబిఐ బ్రాంచ్		
23	496206540026353	**దొడ్డి మాణిక్యం, తండ్రి : డి.దావీదు,** డి.నెం.3 37 1, పెదపేట, పాలకోడేరు, పాలకోడేరు-534210	0.27 లక్షలు	5.00
		లజపతిరాయ్‌పేట బ్రాంచ్		
24	130316540004713	**అల్లపల్లి మోహిని దేవి, భర్త : లక్ష్మి నారాయణ,** 6ఎ-4-4, వీవర్స్ కాలనీ, వార్డు 29, పాలకొల్లు, పాలకొల్లు - 534260	0.53 లక్షలు	10.10
		తణుకు యన్‌హెచ్ రోడ్ బ్రాంచ్		
25	269116540003502	**దేశబత్తుల శ్రీనివాసు,** 14-13-36-1, మిషన్ స్కూలు వీధి, పాత టౌన్, తణుకు-534211	0.90 లక్షలు	18.00
26	269116540004450	**ఎలిపే సతీష్ కుమార్,** ఉండ్రాజవరం గ్రామం, ఉండ్రాజవరం-534216	0.70 లక్షలు	15.00
27	269116540004711		0.73 లక్షలు	15.00
28	269116630000994	**రొట్టె రవితేజ,** 3 1 5 , తండ్రి : రాములు, అంబటి వారి వీధి, పాత టౌన్, తణుకు	0.13 లక్షలు	3.0

షరతులు : 1) వేలంలో పాల్గొనే ఆసక్తిగల వ్యక్తులు తేది:11-07-2025, శుక్రవారం మధ్యాహ్నం 02.00 గంటలలోపు రూ.5,000/- (ఐదు వేల రూపాయలు మాత్రమే) మొత్తాన్ని E.M.D గా డిపాజిట్ చేయాలి. 2) వేలంలో విజయవంతమైన బిడ్డర్ E.M.D మినహా మిగిలిన బిడ్ మొత్తాన్ని వెంటనే చెల్లించాలి మరియు విజయవంతం కాని బిడ్డర్లు డిపాజిట్ చేసిన E.M.D వారికి తిరిగి చెల్లించబడుతుంది. 3) బిడ్ అంగీకారానికి సంబంధించి బ్యాంక్ నిర్ణయం అంతిమమైనది, దానికి కట్టుబడి ఉండవలెను మరియు ప్రశ్నించడానికి వీలుబడదు. 4) వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలను మార్చే హక్కు బ్యాంకుకు ఉంది. ఏ దశలోనైనా వేలాన్ని రద్దు చేసే హక్కు బ్యాంకుకు ఉంది. 5) వేలంలో పాల్గొనువారు ఆధార్ మరియు పాన్ కార్డు కాపీలను బ్యాంకుకు సమర్పించవలెను.

తేది.03.07.2025 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆటోలు, బ్యాటరీల దొంగల అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆటోలు, బ్యాటరీలు చోరీ చేస్తున్న దొంగలను అరెస్టు చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు తెలిపారు. భీమవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా పేరికిగూడెం గ్రామానికి చెందిన పి.నాగరాజు విశాఖపట్నంలో ఉంటున్నాడు. ఇతను భీమవరం రెండో పట్టణంలోని రెండు చోట్ల ఆటోలను అపహరించాడు. దీనిపై డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సీఐ జి.కాళీచరణ్ దర్యాప్తు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి జాతీయ రహదారిపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఇదే తరహాలో మిగిలిన జిల్లాల్లో ఎక్కడైనా ఆటోలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు ఉన్నాయా అని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆరా తీశారు. అక్కడి నుంచి కూడా దొంగిలించిన ఆటోలను జాతీయ రహదారి మీదుగా విశాఖ తీసుకెళ్లినట్లు తేలింది. దాంతో సీసీ కెమెరా ఫుటేజీలో ఉన్న దొంగ కోసం గాలించగా నాగరాజుగా తేలింది. ఇతనిపై మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో గతంలో డీసీ షీట్ ఉండటంతో విచారణ వేగవంతం చేశారు. భీమవరం, ఆకివీడు, అమలాపురం, విశాఖ, మండవల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.17 లక్షల విలువైన 13 ఆటోలను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆటోలను ఓ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

అతని గురించి గాలిస్తుండగా ఇటీవల పెనుమంట్రలో ఆటో అపహరణ సమయంలో త్రుటిలో పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. జిల్లాలోనే ఉంటున్నాడని చరవాణి లొకేషన్ ఆధారంగా గాలించగా తాడేపల్లిగూడెంలోని ఓ లాడ్జిలో బస చేసినట్లు గుర్తించి పట్టుకున్నారు. వివాహానికి ముందు నుంచి దొంగతనాలకు అలవాటు పడిన నాగరాజుకు విశాఖ జిల్లా సబ్బవరానికి చెందిన పి.గణేష్ సహకరించడంతో అతన్ని కూడా అరెస్టు చేశారు.

65 బ్యాటరీలు స్వాధీనం.. భీమవరం, కాళ్ల, ఆకివీడు, ఉండి, వీరవాసరం, పాలకోడేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 14 కేసుల్లో 65 బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసలైన ఉండిరోడ్డుకు చెందిన తీగల నరేంద్ర భవాని, సుంకరపద్దయ్య వీధికి చెందిన పైలా రాకేశ్ అనే సాయి, టిడ్కో గృహాల్లో ఉంటున్న యలగడ కోదండ సాయి వెంకట సత్యనారాయణను అరెస్టు చేశారు. సులువుగా డబ్బులు సంపాదించాలనుకుని ఆటోలు, లారీల్లోని బ్యాటరీలను అపహరించి విక్రయిస్తున్నారు. డీఎస్పీ ఆర్.జి.జయసూర్య, సీఐలు ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, ఎస్సైలు రెహమాన్, ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ పాల్గొన్నారు. కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ భీమారావు

నాణ్యత లోపిస్తే చర్యలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆహార పదార్థాల నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఆహార తనిఖీ సహాయాధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. స్థానిక కొత్త బస్టాండ్ ఎదుటనున్న ఓ రెస్టారెంట్‌లో గురువారం సాయంత్రం తనిఖీలు చేశారు. అక్కడి ఆహార పదార్థాలు పరిశీలించారు. నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపారు. ఆయన మాట్లాడుతూ.. రెస్టారెంట్లు, హోటళ్లు, ఫుడ్‌కోర్టుల్లో నిల్వ ఉంచిన మాంసం, ఆహార పదార్థాలు వినియోగించినా.. తయారీలో రంగులు కలిపినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. చాలా చోట్ల ఆహార పదార్థాలు నాసిరకంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయని.. రెస్టారెంట్, హోటళ్ల నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించాలని ఆయన ఆదేశించారు.

దౌర్జన్యంగా ఆభరణాలు లాక్కెళ్లిన నిందితులకు జైలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రయాణికుడిపై దౌర్జన్యానికి పాల్పడి అతని నుంచి బంగారు ఆభరణాలు, నగదు లాక్కెళ్లిన ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. పోలీసులు, న్యాయస్థాన సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లు గ్రామీణ మండలం శివదేవునిచిక్కాలకు చెందిన నెక్కంటి నాగవెంకట సత్యసాయిబాబు గతేడాది మే 22న విశాఖపట్నం నుంచి యలమంచిలి తన అత్తవారింటికి బయలుదేరారు. ఆ రోజు రాత్రి దిగమర్రు బైపాస్ వద్ద వాహనం కోసం ఎదురు చూస్తుండగా నరసాపురానికి చెందిన పొన్నాల దుర్గాప్రసాద్, జోశ్యుల సుబ్రహ్మణ్య విశ్వేశ్వర్, ఆలమూరుకు చెందిన వంకా ప్రభుదేవా ద్విచక్ర వాహనంపై అక్కడకు వచ్చారు. నాగవెంకట సత్యసాయిబాబును యలమంచిలిలో దింపుతామని నమ్మించి ద్విచక్ర వాహనంపై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఆయనపై దాడి చేసి చంపుతామని బెదిరించారు. ఆయన వద్ద ఉన్న ఏడు గ్రాముల బంగారు ఆభరణాలు, చరవాణి, రూ.600 నగదు లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితుడు పాలకొల్లు గ్రామీణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై డి.హరికృష్ణ కేసు నమోదు చేశారు. సీఐ జి.శ్రీనివాస్ దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అరుణ మాధురి వాదనలు వినిపించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో వారికి ఒక్కొక్కరికీ మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.వేయి చొప్పున అపరాధ రుసుము విధిస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేటు వీఎస్ఎన్ లక్ష్మీలావణ్య తీర్పు చెప్పారు. డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద, సీఐ జి.శ్రీనివాస్, ఎస్సై బి.సురేంద్ర సహకరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95 రిటైల్ ధర 117 చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, 110, 121 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

మద్యం తాగుతూ బ్లేడుతో దాడి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణంలోని బైపాస్ రోడ్డు దగ్గర ఓ వ్యక్తిని బ్లేడుతో గొంతు కోసిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకపేటకు చెందిన సీహెచ్ సాయిబాబు, ఎస్‌కే వినోద్ ఇద్దరూ మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో సరదాగా కబుర్లతో కోడిగుడ్లు విసురుకున్నారు. అంతలోనే వినోద్ కోపోద్రిక్తుడై బ్లేడుతో సాయిబాబు గొంతు కోసి పారిపోయాడు. బాధితుడు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఐ జి.కాళీచరణ్, పోలీసులు బృందాలుగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 6304901226

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు పేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

PLOT FOR SALE

భీమవరం మెంటేవారి తోటలో బైపాస్ రోడ్‌కు దగ్గర్లో 5 సెంట్లు చొప్పున 2 స్థలాలు అమ్మకం. కాంటాక్ట్: 98482 09906.

JOBS

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రముఖ SML ISUZU జయలక్ష్మి మోటర్స్ ఏలూరు నందు సర్వీస్ ఎడ్వైజర్స్, మెకానిక్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. ✆ 94405 80868.

SECURITY GUARDS

పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమడోలు, తణుకులలో సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గం॥ డ్యూటీ, వీక్లీ ఆఫ్, జీతం: 15,000/- PF + ESI. Ex. సర్వీస్ జీతం: 20,000/- , PF + ESI. ✆ 95818 58667.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

- For the Information of Trade & Industry
- గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.70 పైు॥

తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మెల్యే రామాంజనేయులుకు వినతిపత్రం అందజేత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ ఈ నెల 3 నుంచి 14 వరకు దశలవారీ ఆందోళనలు చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెల్లబోయిన రంగారావు, కిలారి మల్లేశ్వరరావు తెలిపారు. ఆందోళనల్లో భాగంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. 15న చలో విజయవాడకు పిలుపునిచ్చారు. నీలాపు చిత్తరంజన్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌తోనే నిస్వార్థ సేవ సాధ్యం

మాట్లాడుతున్న లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ సత్యనారాయణ

ఉండి, న్యూస్‌టుడే: నిస్వార్థమైన సేవ చేయడం లయన్స్‌తోనే సాధ్యపడుతుందని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ తెలిపారు. ఉండి లయన్స్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గాదిరాజు రంగరాజు, పెన్మెత్స రంగ ప్రసాదరాజు, ఉపాధ్యక్షులుగా ద్వారంపూడి నారాయణరెడ్డి, ముదునూరి శివరామరాజులతో పాటు కార్యవర్గం గురువారం రాత్రి ప్రమాణ స్వీకారం చేసింది. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఎంవీ సూర్యనారాయణరాజు, జిల్లా రెండో వైస్ గవర్నర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

ఉండి, న్యూస్‌టుడే: ? గ్రామంలోని బీసీ కాలనీ మూడో వీధిలో వర్షం కురిస్తే మురుగు నిలిచిపోతోంది. సమస్య నివారణకు కచ్చా డ్రెయిన్లు తవ్వించాలి. **- రామకృష్ణ, చిలుకూరు**

✔ వర్షాలతో దోమల బెడద తలెత్తకుండా, మురుగునీరు నిలిచిపోకుండా కచ్చా డ్రెయిన్లు తవ్వించి బ్లీచింగ్ చల్లిస్తాం. **- రవికుమార్ , గ్రామ కార్యదర్శి, చిలుకూరు**

వీరవాసరం, న్యూస్‌టుడే: ? వీరవాసరం 1వ వార్డు గాంధీ బొమ్మల వద్ద కల్వర్టు, రహదారి ప్రమాదకరంగా ఉంది. వర్షం కారణంగా రహదారి మొత్తం బురదమయం కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాస్, స్థానికుడు**

✔ ఆ ప్రాంతంలో కల్వర్టుకు అనుసంధానంగా రహదారి నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. తాత్కాలికంగా అక్కడ సమస్య పరిష్కరిస్తాం. **- లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి**

? నవుడూరులోని పొలమూరు డ్రెయినులో స్థానిక వ్యాపారులు వ్యర్థాలు వేస్తుండటంతో వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే మురుగు దిగువకు వెళ్లడం లేదు. దీంతో పంట చేలు ముంపునకు గురవుతున్నాయి. **- ఎం. సత్యనారాయణ, ఉత్తరపాలెం**

✔ పొలమూరు డ్రెయినులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాను. స్థానిక వ్యాపారులకు నోటీసులు అందజేస్తాం. **- ఫణికుమార్, పంచాయతీ విస్తరణ అధికారి**

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి బాలాజీరావుపేట, కొండ్రొతుపేటల్లో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించారు. మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనాడులో గురువారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ స్పందించారు. సీసీ రహదారులు, ఇతర మార్గాల్లోని అంచుల్లో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను ఉపాధి శ్రామికులు తొలగించారు.

గాలి వీస్తే గల్లంతే!

ప్రమాదకరస్థితిలో విద్యుత్తు స్తంభాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గంలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గట్టిగా గాలివీస్తే చాలు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పంట, మురుగు కాలువల గట్ల వెంబడి ఉన్న స్తంభాలతో స్థానికులు హడలిపోతున్నారు.

వాండ్రంలో ఒరిగిపోయిన స్తంభం

నల్లరేగడి మట్టి వల్లే

జిల్లాలో నల్లరేగడి మట్టి అధికశాతం విస్తరించి ఉంది. ఏటా వర్షాలకు జిగురుగా మారి అంతగా పట్టుత్వం ఉండదు. కాలువలు, డ్రెయిన్ల గట్ల వెంబడి విద్యుత్తు స్తంభాలు వేస్తున్న సమయంలో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు తీసుకోవాలి. గట్లు బలహీనపడిన

ఆకివీడు మండలంలోని పెదకాపవరం నుంచి ప్రారంభమై ఉండి మండలంలోని పాములపర్రు, ఉండి, వాండ్రం మీదుగా కాళ్ల మండలంలోని కోపల్లె, బొండాడ శివారు ప్రాంతాల వెంబడి బొండాడ మేజర్ డ్రెయిన్ ప్రవహిస్తోంది. దీని గట్లపై ఉండి మండల పరిధిలో పాములపర్రు, ఉండి, వాండ్రం వరకు పదుల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలు వివిధ చోట్ల ఒరిగిపోయి ప్రమాదకర స్థితిలో కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

చోట్ల ఆ ప్రవాహం స్తంభాలపై పడి అవి ఒరిగిపోయి ప్రమాదకర స్థితికి చేరుతున్నాయి. ఏమాత్రం గట్టిగా గాలి వీచినా తక్షణం సరఫరాను నిలిపివేస్తున్నారు. ఈ వేసవిలో సంభవించిన అకాల వర్షాలకు ఆకివీడు సబ్‌డివిజన్ పరిధిలోని ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల్లో సుమారు 20 వరకు స్తంభాలు నేలకొరిగాయి. కొన్ని పరివర్తకాలు, వివిధ చోట్ల లైన్లు దెబ్బతినడంతో ఆ శాఖకు రూ. 20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు అప్పట్లో

+ఉండిలో డ్రెయిన్ గట్టు వెంబడి ఇలా..

తెల్పారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినా గంటల తరబడి సరఫరాకు అంతరాయం తలెత్తింది. ప్రస్తుతం వర్షాకాలం. నవంబరు నెలాఖరు వరకు ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయి. ఈలోగా అధికారులు తక్షణం స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను గుర్తించి బలోపేతం చేయాలని కోరుతున్నారు. ఈ అంశంపై విద్యుత్తు శాఖ ఉండి ఏఈ శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆయా ప్రాంతాలను పరిశీలించి తక్షణం స్తంభాలను సరిచేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కోలమూరు, యండగండి (ఉండి), న్యూస్‌టుడే: కోలమూరు 33/11 కేవీ ఉప కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోలమూరు, పాములపర్రు, ఉప్పులూరు, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడులతో పాటు ఇండస్ట్రియల్ లైన్లకు, ఆక్వా చెరువులకు సరఫరా ఉండదని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. యండగండి విద్యుత్తు ఉప కేంద్రానికి వెళ్లే 33 కేవీ లైన్లపై ఉన్న చెట్లు, కొమ్మలు తొలగించేందుకు అదే సమయంలో యండగండి, ఉణుదుర్రు గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు సరఫరా ఉండదని చెప్పారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు విద్యుత్తు ఉప కేంద్ర పరిధిలో లైన్లపై వాలిన చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇండస్ట్రియల్, దర్భాపురం అగ్రహారం, దుంపగడప గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం ఎస్సీ జోన్ కాలనీ ఉప కేంద్రంలో 11 కేవీ నూతన లైన్ల ఏర్పాటు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జోను కాలనీ, కలవపూడి, మోడి, పెదపాలెం, ప్రాతాళ్ళ మెరక, మాలవానితిప్ప, గోగటిప్ప, మేకలదిబ్బ, ఆనందపురం, ఇసుక లంక, గూట్లపాడు పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం, రాయకుదురు, తోలేరు, పంజావేమవరం, నందమూరు గరువు, పెర్కిపాలెం, చింతలకోటిగరువు, నవుదూరు, అండలూరు, మత్స్యపురి, బొబ్బనపల్లి, వడ్డిగూడెం, ముదునూరుపాడు, నేలపోగుల గ్రామాల్లో, ఇండస్ట్రియల్ ఫీడర్లకు శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణం 8వ వార్డులో గురువారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికే వెళ్లి పింఛన్లు ఇవ్వడం పట్ల లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన సుబ్బారావు, మెరగాని నారాయణమ్మ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ యిందుకూరి రామలింగరాజు, బజ్జి కొబాబు, మాదాసు కనకదుర్గ పాల్గొన్నారు.

ర్యాలీగా వెళ్తున్న తోట సీతారామలక్ష్మి, నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. **ఆకివీడు, న్యూస్‌టుడే:** రాష్ట్ర అభివృద్ధి, ప్రజలు, రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కనుమూరు భరత్ అన్నారు. ఆకివీడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక సాలిపేట ప్రాంతంలోని వీవర్స్ సొసైటీ భవనంలో మహిళల కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెదేపా కార్యకర్త నేతల మైకేల్ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, గొంట్లా గణపతి, అల్లాడి బాలాజీ, ఎం. నాగమణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆకివీడులో పాల్గొన్న భరత్, నాయకులు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: తాడేరులో మండల అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, ప్రధాన కార్యదర్శి కోళ్ల సీతారాం ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరించారు.

రహదారి నిర్మాణానికి రూ.1.60 కోట్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: గుమ్ములూరు-అప్పారావుపేట రహదారి అభివృద్ధికి రూ.1.60 కోట్ల నిధులు మంజూరైనట్లు కనుమూరి భరత్ తెలిపారు. గురువారం ఆయన ఆకివీడులో తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో సాగునీరు, ముంపు సమస్య ఉత్పన్నం కాకుండా ఇప్పటికే పలు కాలువల పూడికతీత పనులు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రణాళికతో పూర్తి చేస్తున్నారని వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, పెన్మత్సరాజు శ్రీనివాసరాజు, మేడపాటి వీరభద్రరావు పాల్గొన్నారు.

మురుగు పారుదల ఉంటేనే అనుమతి

కాళ్ల, న్యూస్‌టుడే: మురుగు బోదెలు ఉండి చెరువులు తవ్వేందుకు అనుమతులు ఇస్తామని ఆక్వా జోన్లలో చేయనున్నట్లు మత్స్యశాఖాధికారి ఎం.ఇందిరాప్రియదర్శిని, డీఏఎం జి.జ్ఞానకుమార్ తెలిపారు. గురువారం కాళ్ల, జక్కరం సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు మాట్లాడారు. మురుగు పారుదల సదుపాయం ఉంటేనే తవ్వకానికి అనుమతులు ఇస్తామన్నారు. సంబంధిత సర్వే నంబర్ల జాబితాలు పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఉంటాయన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సర్పంచులు బి.విజయ, కె.పద్మావతి పాల్గొన్నారు.

అవగాహన సభలో డీఏఎం జ్ఞానకుమార్, ఇందిరా ప్రియదర్శిని

వారాహి అమ్మవారికి పూజలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పిల్లమర్రి అగ్రహారం వీధిలోని శివాలయంలో వారాహి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు, హోమాలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సన్మార్గంతో ఉన్నత స్థితి

ఆకివీడు, న్యూస్‌టుడే: సక్రమమైన మార్గాలను ఎంచుకోవడం ద్వారా ఉన్నత స్థితికి చేరుకోవచ్చని సెట్‌వెల్ సీఈవో కేవీఎస్ ప్రభాకరరావు సూచించారు. గురువారం ఆకివీడులోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సెట్‌వెల్ మేనేజర్ పువ్వాడ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎం.పారనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభాకరరావు

పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని 32, 33, 34 వార్డులను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని, పైపులైన్ల లీకేజీలకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. డ్రెయిన్లలో పూడిక తొలగించాలని ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు స్మృతివనం దగ్గర ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ కె.రాంబాబు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ యాత్ర

వీరవాసరం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ ప్రచారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ రెడ్డి చినసన్యాసిరావు అన్నారు. వీరవాసరం, బాలేపల్లి గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హిందూ ధర్మ పరిరక్షణ యాత్ర నిర్వహించారు.

కేకు కోస్తున్న అభిమానులు

మెగా అభిమానుల సందడి

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం ట్రైలర్ ప్రదర్శన సందర్భంగా భీమవరంలో ఏవీజీ, విజయలక్ష్మి థియేటర్ల వద్ద మెగా అభిమానులు సందడి చేశారు. మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్పుల మధ్య కేకు కోసి అభిమానులకు పంచారు. చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ట్రైలర్ ఎంతో బాగుందని, చిత్రం కుటుంబ సమేతంగా చూడాలని కోరారు.

అందుబాటులోకి అక్విడెక్టు

పుష్కర కాలం సమస్యకు విముక్తి

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి పాములపర్రు వెళ్లే మార్గంలో పూర్వం తెల్లికోడు-పాములపర్రు పంట కాలువలు కలిసే రామాపురం వద్ద అక్విడెక్టు నిర్మించారు. ఉండి, ఉప్పుగుంట, రామాపురం, పాములపర్రు తదితర ప్రాంతాల్లో సుమారు 5 వేల ఎకరాల్లోని మురుగు నీరంతా తెల్లికోడు ద్వారా బొండాడ మేజర్ డ్రెయిన్‌లో రామాపురం వద్ద దిగుతోంది. జల వనరుల శాఖ ఉండి సబ్ డివిజన్ కార్యాలయం నుంచి పాములపర్రు గ్రామ శివారునున్న మంచి నీటి చెరువులోకి తాగునీరు, పరిసర గ్రామాల్లోని భూములకు సాగునీరు ఈ అక్విడెక్టుపై నుంచి వెళ్తుంటాయి. నిర్వహణ లేమితో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పుష్కర కాలం కిందట ఇది కూలిపోయింది. దీంతో ఇక్కడ పంట, మురుగు కాలువల్లో నీరు ఏకమయ్యేవి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో తాత్కాలిక చర్యల్లో భాగంగా రెండు కాలువలను వేరు చేస్తూ సిమెంట్ తూరలు ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వం దీన్ని పూర్తిగా పట్టించుకోకపోవడంతో అధిక వర్షాలు, వరదల సమయాల్లో తాగునీటి కాలుష్యం తీవ్రంగా ఉండేది. ఇదే అంశాన్ని ఉపసభాపతి, ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. నూతన నిర్మాణ వ్యయం ఉండి సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మంతెన సాయిలచ్చిరాజు పెట్టేందుకు ముందుకొచ్చారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణంరాజు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి అక్విడెక్టును సాయిలచ్చిరాజు అందుబాటులోకి తెచ్చారు. పాములపర్రు కాలువకు నేడు పూర్తిస్థాయిలో నీరొదలడంతో అందరిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

రామాపురం వద్ద కొత్తగా నిర్మించిన అక్విడెక్టు

పంట కాలువకు ఏర్పాటు చేసిన తూరలు

ఇవీ రోడ్లేనా!

భారీ గుంతలతో అధ్వానంగా రహదారి

ఈ రోడ్లు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. కాళ్ల మండలం ప్రధాన రహదారికి సమీపాన ఉన్న లంకరోడ్డు ప్రారంభంలో భారీ గుంతలు, వర్షం కారణంగా కొలనుగా మారుతుంది. ఇదే మార్గంలో ఇటీవల కాలంలో సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన బీటీరోడ్డు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పలు చోట్ల గుంతలుగా మారింది. రహదారికి పక్కన చెరువులు ఉండడంతో పాడైందని, గుత్తేదారుని దృష్టికి తీసుకెళ్లి వర్షాలు తగ్గిన తర్వాత మరమ్మతులు చేయిస్తామన్నారు. లంక రోడ్డుకు రూ.50 లక్షలతో అంచనాలు వేశామని ఆర్‌బీ ఏఈ శ్రీహరిరాజు తెలిపారు. **- న్యూస్‌టుడే, కాళ్ల**

ఆకివీడు ఏడీఏగా ప్రతాప్ జీవన్

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ఏడీఏగా కె.ప్రతాప్ జీవన్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన రంపచోడవరం నుంచి బదిలీపై రాగా ఇక్కడ ఏడీఏ శ్రీనివాసరావు భీమవరం వెళ్లారు.

రవాణా చేస్తే కఠిన చర్యలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ప్రైవేటు రవాణా కార్యాలయాలు, గోదాములను అబ్కారీ శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మద్యం సీసాలు, స్పిరిట్ రవాణా పార్శిళ్లు, గంజాయి, మద్యం బాటిళ్ల రవాణాపై ఆరా తీశారు. సీఐ కె.బలరామరాజు, ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: లారీ, ఆక్వా ట్రాన్స్‌పోర్టర్లు, పార్శిల్ ఆఫీసుల వారు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, స్పిరిట్, మాదక ద్రవ్యాలు తీసుకురాకుండా చూడాలని ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చోరీపై కేసు

ఆకివీడు, న్యూస్‌టుడే: కుప్పనపూడిలో షేక్ అక్బర్ ఆలీ రొయ్యల చెరువుల వద్ద అద్దెకు ఇచ్చే జనరేటరును గత నెల 5న రాత్రి తన గ్రామంలో ఉంచారు. మరుసటి రోజు వచ్చి చూడగా నాలుగు బ్యాటరీలు చోరీకి గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	తమ్ముడు
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	కుబేర
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	తమ్ముడు
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	కన్నప్ప
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	జురాసిక్ వరల్డ్ 3డీ (తెలుగు)
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	ఎఫ్1 ది మూవీ (తెలుగు)
విజయలక్ష్మి స్క్రీన్	మార్గన్
కిశోర్ స్క్రీన్ 1	తమ్ముడు
కిశోర్ స్క్రీన్ 2	మార్గన్

విగ్రహానికి నివాళులర్పించిన సాహితీవేత్తలు, విద్యార్థులు

సరస్వతీ పుత్రులు వేంకటావధాని

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య గొప్పతనాన్ని ఆనాడే ప్రపంచానికి తెలియజేసిన సరస్వతీ పుత్రులు వేంకటావధాని అని వక్తలు కొనియాడారు. కళాప్రపూర్ణ, ఆచార్య దివాకర్ల వేంకటావధాని 113వ జయంతి వేడుకలను పురస్కరించుకుని యండగండిలో ఆయన విగ్రహానికి గురువారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దివాకర్ల సాహితీ సంస్థ అధ్యక్షుడు చెరుకువాడ అప్పలరామకృష్ణవర్మ అధ్యక్షతన జరిగిన సభలో సహస్రవధాని, ప్రముఖ కవి కోట వేంకటలక్ష్మి నరసింహం మాట్లాడుతూ జన్మభూమికి పేరుతెచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తెలుగు సాహిత్య రంగానికి విశేష కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన ఘనత వేంకటావధానికే దక్కుతుందని తెలిపారు. ఉప సర్పంచి పెన్మెత్స జగ్గరాజు మాట్లాడుతూ సాహిత్య రంగంలో పేరు ప్రఖ్యాతులు గడించిన తిరుపతి శాస్త్రి, వేంకటావధానులు తమ గ్రామంలో జన్మించడం మహాభాగ్యంగా భావిస్తున్నామని తెలిపారు. సహకార సంఘం కార్యదర్శి చెరుకువాడ రవికుమార్, మాజీ ఉపసర్పంచులు వేగేశ్న రామరాజు, కన్నా శివనారాయణ, దండు సూర్యనారాయణరాజు, యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పీవీఎస్ గోపాలకృష్ణంరాజు తదితరులు మాట్లాడారు. దివాకర్ల సాహితీ పురస్కారాన్ని సహస్రవధాని కోట వెంకటలక్ష్మీనరసింహంకు సంస్థ అధ్యక్షుడు అప్పలరామకృష్ణవర్మ, ప్రముఖులు అందజేశారు.

పీర్ల ఊరేగింపు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరంలో పీర్ల పంజా వద్ద ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆచారం ప్రకారం పీర్లు పట్టుకున్న బాలుడిని గుర్రంపై గ్రామంలో ఊరేగించారు. అనంతరం పీర్ల పంజా వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో వాటిని ప్రతిష్ఠించారు. ఈ నెల 7వ తేదీన పీర్ల పండుగ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండు

ఆకివీడు, న్యూస్‌టుడే: అజ్జమూరు కాలువ గట్టుపై నివాసముంటున్న కుటుంబాల ఇళ్లు తొలగించాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీపీఎం నాయకులు, బాధితులతో కలిసి ఆకివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సుమారు 50 ఏళ్లుగా ఉంటున్న తమకు ఇంటి స్థలం మంజూరు చేసి న్యాయం చేయాలని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, బొడ్డుపల్లి రాంబాబు, రామచంద్రమూర్తి, పానకాలరావు, సుబ్రహ్మణ్యం, రవణమ్మ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, బాధితులు

అల్లూరి యువతకు స్ఫూర్తి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తి అని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ అధ్యక్షతన భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు పోరాట మార్గమే సమస్యలకు పరిష్కారమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, ఆచార్య వాణిశ్రీ, శ్రీనివాసరాజు, కె.సూర్య, టి.ప్రసాద్, ఎస్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం దగ్గర విప్లవ జోహార్లు అర్పిస్తున్న నాయకులు

అవి ఇవి అన్నీ

వీఆర్వోలతో సమీక్ష.. **భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** ప్రభుత్వం అందించే గృహాల కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తులపై తహసీల్దార్ రాంబాబు గురువారం గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ నిర్వహించాలని, ఎంత మంది అర్హులు ఉన్నారో గుర్తించాలని ఆదేశించారు. అనంతరం నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.

నేడు నిరసన దీక్ష.. **భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** భీమవరం పాత బస్టాండ్ ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు పునఃనిర్మాణం కోరుతూ హాలు పునఃనిర్మాణ సాధన కమిటీ నాయకులు బి.బలరాం, జేఎన్‌వీ.గోపాలన్, బి.వాసుదేవరావులు ప్రకాశంచౌక్ కూడలి వద్ద శుక్రవారం నిరసన దీక్ష చేపట్టనున్నట్లు కమిటీ నాయకుడు ఎం.వైకుంఠరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని నినాదాలు.. **ఉండి, న్యూస్‌టుడే:** మెకానిక్కుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టూ వీలర్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొర్రా ఉమామహేశ్వరరావు, ఆరేపల్లి రాజు, ఉపాధ్యక్షుడు ఆకుల గోపాలకృష్ణ, కోశాధికారి ముంగండ శ్రీనివాసరావు తదితరులు ఆధ్వర్యంలో ఉండి ప్రధాన కూడలిలో నినాదాలు చేశారు.

గ్రామసభ.. **యనమదుర్రు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే:** తుందుర్రు, యనమదుర్రు, కొమరాడ గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేశారు. వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ప్రసాద్, ఉప తహసీల్దార్ నాగార్జున పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీ.. **భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** భీమవరంలోని రైతుబజారు సమీపంలో ఉన్న రేషన్ దుకాణాన్ని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రేషన్ పంపిణీ తీరుతెన్నులను పరిశీలించారు. పంపిణీలో ఎక్కడా లోపం లేకుండా చూసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ రావి రాంబాబు తనిఖీ చేశారు.

ప్లాస్టిక్ కాలుష్యంతో తీవ్ర నష్టం.. **దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే:** దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం' నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.సుజాత మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యం భయంకరమైన స్థాయికి చేరుకుందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ సంచుల వినియోగం ద్వారా అనేక నష్టాలు కలుగుతున్నాయని, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థులకు వివరించారు.

దుప్పట్ల పంపిణీ .. **ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడులో 'ప్రపంచ మెకానిక్స్ డే' సందర్భంగా సమతానగర్ ప్రాంతంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ ఆవరణలో కేకు కోశారు. సీనియర్ మెకానిక్‌లను సన్మానించారు. ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఆంజనేయులు, మెకానిక్ సంఘం అధ్యక్షుడు మరడాని సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

తాగునీటి డబ్బాలు అందజేత.. **వీరవాసరం, న్యూస్‌టుడే:** వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన 130 మంది విద్యార్థులకు పాఠశాల అధ్యాపకేతరుడు బోను దుర్గాప్రసాద్ తండ్రి యరయ్య 30వ వర్ధంతిని పురస్కరించుకుని తాగునీటి డబ్బాలను గురువారం అందజేశారు.

అనర్గళంగా 700 శ్లోకాల పఠనం

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: మైసూరు దత్త పీఠాధిపతి స్వామి సచ్చిదానంద పీఠంలో భగవద్గీత 700 శ్లోకాలు అనర్గళంగా పఠనం చేసిన యండగండికి చెందిన కంచర్ల రాధాదేవిని యండగండిలోని వాసవీ క్లబ్, దివాకర్ల సాహితీ సంస్థలు సత్కరించాయి. సహస్ర అవధాని బ్రహ్మశ్రీ కోట వెంకట లక్ష్మీనరసింహం మాట్లాడుతూ భగవద్గీత చదవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తోందని తెలిపారు. దివాకర్ల సాహితీ సంస్థ అధ్యక్షుడు చెరుకువాడ అప్పలరామకృష్ణవర్మ, ఉప సర్పంచి పి.జగ్గరాజు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ప్లాస్టిక్ వద్దు.. వస్త్ర సంచులు ముద్దు

ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దు.. వస్త్ర సంచులే ముద్దని వైఎన్ అధ్యాపకులు, విద్యార్థులు ప్రజలకు సూచించారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల రహిత దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో అవగాహన ప్రదర్శన చేశారు. ప్రజలకు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, అధ్యాపకులు ఎస్వీ రంగారావు, డీన్ గండం రామకృష్ణ, హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద సామగ్రిపై సమాచారం ఇవ్వండి

తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నరసాపురం, న్యూస్‌టుడే: పార్సిల్ వచ్చినపుడు అనుమానాస్పద వస్తువులు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎక్సైజ్ శాఖ ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ జయరామరాజు సూచించారు. పట్టణంలోని పలు పార్సిల్ వ్యాపారసంస్థల గోదాములను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐలు ఎస్.రాంబాబు, ఫణి కుమార్ పలువురు సిబ్బంది ఉన్నారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం:80085 74504
పాలకొల్లు :80085 74510
ఆచంట :91212 29087

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ? ఇలపర్రులో ఇళ్ల సమీపాన చెత్త వేస్తున్నారు. గాలికి చెత్త మీదకు వస్తోంది. - **శివకృష్ణ**
✔ పరిశీలించి శుభ్రం చేయిస్తా. - **శివరాం, కార్యదర్శి, ఇలపర్రు**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పాలకొల్లు మండలం దగ్గులూరు పల్లపువీధిలో వర్షపు నీరు రహదారి నిలిచిపోతుంది. రాత్రి సమయంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. - **శివరామ్**
✔ చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, పంచాయతీ కార్యదర్శి**

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలో కోడెల వీధిలో చెత్త పేరుకుపోయి పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది. - **కె.వాసు, నరసాపురం**
✔ పరిశీలించి చర్యలు చేపడతాను. - **వి.ప్రసాదు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
? మునసుబువారి వీధిలోని డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. మురుగు రహదారిపైకి చేరుతోంది. - **దుర్గాప్రసాదు**
✔ చర్యలు చేపడతా. - **ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్**

ఈ వంతెనలపై ప్రయాణం.. జర భద్రం..

నక్కల డ్రెయిన్‌పై ఇలా..

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు- మినిమించిలిపాడు రహదారిలో నక్కల డ్రెయిన్‌పై వంతెన పూర్తిగా శిథిలమయ్యింది. దీనికి ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. సుమారు 6 దశాబ్దాల పాటు ఈ వంతెన సేవలందించింది. ఈ ప్రాంతంలో కొబ్బరి రవాణా ఎక్కువగా జరుగుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో ఇసుక లారీలు కూడా ఎక్కువగా తిరుగుతాయి. ఇది కూలిపోతే ఆచంట, పోడూరు మండలాల్లోని సుమారు పదికి పైగా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఈ వారధికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని లేదా కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పాలకొల్లు ర.భ.శాఖ ఏఈ మార్తిని సంప్రదించగా ఆచంట నియోజకవర్గంలో శిథిలమైన వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం పరిధిలో అరుంధతి పేట నుంచి స్టేషన్ పేట, సరిపల్లి, లిఖితపూడి తదితర గ్రామాలకు వెళ్లే రహదారిలో మురుగు కాలువపై ఉన్న వంతెన శిథిలమై ప్రమాదకరంగా మారింది. దీన్ని నిర్మించి 3 దశాబ్దాలు దాటింది. రెండు వైపులా రక్షణ గోడలు లేక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, విద్యార్థులు, ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. రాత్రి సమయంలో ఆదమరిస్తే వాహనాలు కాలువలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంధకారంలో పట్టణం


రాయిపేటలో చీకట్లు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీనికితోడు పురపాలక ఇంజినీరింగ్ పొరుగు సేవల ఉద్యోగులు విధులు బహిష్కరించారు. దీంతో అంతర్గత వీధుల్లో వీధి దీపాలు వేసే నాథుడు కరవయ్యారు. ప్రధాన వీధుల్లో తప్ప మిగిలిన ప్రాంతాల్లో వెలగడం లేదు. రాత్రి సమయంతో అంధకారంగా మారి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

పగలూ విద్యుత్తు వెలుగులు

ఒకవైపు రాత్రి సమయంతో వీధి దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతుంటే మరో వైపు ప్రధాన వీధుల్లో వేసిన వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదు. ఫలితంగా విద్యుత్తు వృథా అవడంతో పాటు సంబంధిత శాఖపై బిల్లుల భారం పడుతోంది. దీపాలు మరమ్మతులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' పురపాలక కమిషనర్ ఎం. అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా దీపాలకు మరమ్మత్తులు చేయించి అన్నిచోట్ల వెలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పగటి పూట దీపాలు వెలగకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తామని తెలిపారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీతారామ్

త్యాగ ధనుడు అల్లూరి: మంతెన

మొగల్తూరు, న్యూస్‌టుడే: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగధనుడని, ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో చూపిన తెగువ, దేశభక్తి స్ఫూర్తిని అంది పుచ్చుకోవాలని సాంస్కృతిక ఉద్యమ నాయకుడు మంతెన సీతారామ్ విద్యార్థులకు సూచించారు. ఈ నెల 4న అల్లూరి జయంతి సందర్భంగా ఆరోగ్యవర్షిణి ట్రస్టు ఛైర్మన్ నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో ముత్యాలపల్లిలోని బండిముత్యాలమ్మ జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన జీవితచరిత్రపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ అల్లూరి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణలోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పెన్మత్స రామరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు చేపట్టిన ప్రచార యాత్ర గురువారం బ్రాహ్మణచెర్వు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు మేలు చేసే విధంగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపాలన్, నాయకులు అజయ్‌కుమారి, ప్రసాద్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత కూటమి ప్రభుత్వానిదే

మొగల్తూరు: ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న రామరాజు తదితరులు

మొగల్తూరు, పెనుగొండ, పోడూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గుత్తుల సాయి అన్నారు. 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా పార్టీ మండలశాఖ అధక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో మొగల్తూరులోని కడలివారిపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవి అర్హులకు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొల్ల చంటి, కలిదిండి కుమార్‌బాబు, కత్తిమండ ముత్యాలరావు, పాలా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. ★ నరసాపురంలోని నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

★ కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతుందని తెదేపా ఆచంట నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకట రామరాజు తెలిపారు. గురువారం పెనుగొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. స్థానిక పెచ్చెట్టి వారి వీధిలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలు, అమలు చేసిన పథకాలపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల కరపత్రాలు అందించారు. ★ జిన్నూరులో నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పెనుమదంలో నీటి సంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. సర్పంచి తానేటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: కరపత్రం అందిస్తున్న వెంకట్, వెంకట రామరాజు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

రుస్తుంబాదలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయకర్ తదితరులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. రుస్తుంబాదలో రూ.30 లక్షలతో చేపట్టే అంతర్గత రహదారుల అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, సర్పంచి బందెల భారతి, ఉప సర్పంచి యడ్లపల్లి కాశీ అన్నపూర్ణ, పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ వైవీఆర్ నాగేశ్వరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. **నరసాపురం, న్యూస్‌టుడే:** పురపాలక సంఘ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన దీక్షల్లో భాగంగా పురపాలకసంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడారు. తాగునీటికోసం ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, పథకం నిర్వహణ సిబ్బంది విధులకు హాజరు కావాలని సూచించారు. ★ దీక్షా శిబిరాన్ని కాంగ్రెసు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి బాబ్జి, జిల్లా ఉపాధ్యక్షుడు గాదిరెడ్డి వనమయ్య, కామన ధనుంజయ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దాసి రాజు తదితరులు

ఆర్డీవో సందర్శన

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని చినమామిడిపల్లిలో రైల్వే గేటు వద్ద పై వంతెన నిర్మించే ప్రాంతాన్ని గురువారం ఆర్డీవో దాసి రాజు సందర్శించారు. ఆయన వెంట తహసీల్దారు అయితం వీవీ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ ప్రసన్నబాబు, వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జి, గునిశెట్టి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

18న చదరంగం పోటీలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 18న పాలకొల్లు యూరోకిడ్స్ పాఠశాలలో పట్టణస్థాయి చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మద్దుల రాజేశ్ తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్, భీమవరం అనసూయ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆర్డీవో దాసి రాజు గురువారం ఆవిష్కరించారు.

నేడు 20వ వార్డులో మంత్రి పర్యటన

పాలకొల్లు, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడు పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం ఉదయం పర్యటించనున్నారు. అనంతరం కాస్మో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో పాల్గొంటారని మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

వారాహి అమ్మవారికి పంచామృతాభిషేకాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మల్లిపూడిలో వారాహి అమ్మవారి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు వారణాశి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. ఈ నెల 5న అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకుడు గుడిమెట్ల సాయిబాబారెడ్డి తెలిపారు.

పెద్దింట్లమ్మకు వెండి వస్తువుల కానుక

ఈవోకు వెండి వస్తువులను బహూకరిస్తున్న దాత శ్రీనివాసరమేష్

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ శివారు పెద్దింట్లమ్మ ఆలయంలో గురువారం వెంకట్రామపురం గ్రామానికి చెందిన వంకమామిడి శ్రీనివాసరమేష్ తన తండ్రి బాలసూర్యనారాయణ జ్ఞాపకార్థం పెద్దింట్లమ్మవారికి అలంకరణ నిమిత్తం రూ.3.15 లక్షల విలువైన 2 కిలోల 186 గ్రాముల వెండి వస్తువులను ఆలయ ఈవో డి.పుష్పభానుకు అందించారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వడలి ఈవో మన్నే శ్రీనివాస్, కూనపరెడ్డి సుధాకరరాజు తదితరులు పాల్గొన్నారు. దాత వంకమామిడి శ్రీనివాసరమేష్‌ను ఆలయ ఈవో డి.పుష్పభాను, గ్రామస్థులు అభినందించారు.

నిత్యావసరాల పంపిణీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఇటీవల పట్టణానికి చెందిన టి.సుబ్రహ్మణ్యం అనేవ్యక్తి కుడి కాలును కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయనకు నిత్యావసర సరకులు, మందులను గురువారం అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు ప్రారంభించాలి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఆపివేసిన వైద్య కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలుకులూరి అర్జునరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలకు మంజూరైన రూ.475 కోట్లను ప్రభుత్వం సద్వినియోగం చేయాలన్నారు. ప్రైవేటీకరణ చేయకూడదని సూచించారు. పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కౌరు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా అడ్డుగా

రహదార్లపై పశువుల సంచారం

పోలీసు స్టేషన్ సమీపంలో గుంపులుగా పశువులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణం, పరిసర ప్రాంతాల్లో పశువుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులు గుంపులు గుంపులుగా యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతుండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకట్లో వాటిని గుర్తించడం కూడా కష్టం అవుతుందని వాపోతున్నారు. వీటితో కలిగే ఇబ్బందులపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

★ స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద ఆరు నెలల క్రితం రెండు ఆంబోతులు పోట్లాడుకుంటూ ఆగి ఉన్న వ్యక్తిని ఎత్తి పడేశాయి. అతని తలకు బలమైన గాయం కావడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

★ ప్రధాన రహదారులైన మహాత్మాగాంధీ రోడ్డు, దేశాలమ్మవారి ఆలయం నుంచి పూలపల్లి వరకు ఆంబోతులు, ఆవులు తిష్ఠ వేసి వాహనాలకు అడ్డుగా ఉంటున్నాయి. దీంతో చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్రాంతాల్లో.. స్థానిక యడ్లబజార్, టాక్సీ స్టాండ్, లాకుల వద్ద, గాంధీబొమ్మల సెంటర్, రైల్వేగేటు, లాకుల సెంటరు, పూలపల్లి బైపాస్ రోడ్డు వంటి పలు ప్రాంతాల్లో పశువులు రోడ్డుపై కూర్చొని కదలడం లేదు. పట్టణంలో ఎక్కడ చూసినా అవే అడ్డుగా కనబడుతున్నాయి. ఇందులో కొన్నింటికి యజమానులు ఉన్నా వారు పట్టించుకోకుండా రహదారులపైనే వదిలేస్తున్నారు. వీటిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాని కోరుతున్నారు.

పశు వైద్యులతో సంప్రదిస్తాం.. పశువుల విషయంలో కూడా స్థానిక పశువైద్యులతో సంప్రదించి తగు చర్యలు చేపడతామన్నారు. - **బి.విజయసారథి, పురపాలక కమిషనర్**

నిరుపయోగంగా సామాజిక భవనాలు

ఘటాలదిబ్బలో నిరుపయోగంగా ఇలా..

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక భవనాలు అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు గతంలో సామాజిక భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో సంబంధిత గుత్తేదారులు పనులను మధ్యలో నిలిపివేశారు. చాలాకాలంగా అలా వదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. సిద్ధాంతం శివారు ఘటాలదిబ్బలో 2011లో రూ.3 లక్షల మండల పరిషత్తు నిధులతో సామాజిక భవనానికి పనులు ప్రారంభించారు. నిధులు చాలకపోవడంతో భవనం పనులు మధ్యలోనే వదిలేశారు. దీంతో అది పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరింది. మండలంలోని రామన్నపాలెం, నడిపూడి, తామరాడ. దేవ తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సామాజిక భవనాలు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: 33/11కేవీ విద్యుత్తు లైనుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు నరసాపురం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంతం, రాయపేట, మహిళా కళాశాల, అశ్విని ఆసుపత్రి, ఎన్టీఆర్ కొత్తకాలనీ, రాజా ఐస్‌ఫ్యాక్టరీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. మొగల్తూరు మండలం పేరుపాలెంనార్తు, పేరుపాలెంసౌత్, కేపీపాలెంనార్తు, కేపీపాలెం సౌత్ గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ మండల పరిధిలో పెనుగొండ, వెంకట్రామపురం గ్రామాల్లో చెట్లకొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తామని కె.మధుకుమార్ తెలిపారు.

ఆచంట, న్యూస్‌టుడే: వల్లూరు విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా వల్లూరు, కాంబొట్లపాలెం, నీరుల్లిపాలెం ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని మధుకుమార్ తెలిపారు.

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ జిన్నూరు, 11కేవీ వేడంగి రూరల్ విద్యుత్తు తీగలపై చెట్ల తొలగింపునకు, సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని మధుకుమార్ తెలిపారు. కవిటం, వేడంగి, మట్టపర్రు, వేడంగిపాలెం, అన్నపూర్ణమ్మ పేట, కవిటం లాకులు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట పరిసర ప్రాంతాల్లో చెట్లకొమ్మలు తొలగించే నిమిత్తం శ్రీరామ్‌పేట, కోడిగట్టు, కుళాయిచెరువుల గట్టు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

యలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని కాజతూర్పు, చించినాడ, ఊటాడ గ్రామాల్లో విద్యుత్తు లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఏఈ చండీకిరణ్ తెలిపారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల రీత్యా నత్తారామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంట గంట వరకు సరఫరా ఉండదని ఈఈ కె.మధుకుమార్ తెలిపారు.

ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్

అధ్వానంగా మారిన రహదారిని చూపుతున్న నాయకులు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ శివారు నగరేశ్వర కాలనీలో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టి ప్రజలు ఇబ్బందులను తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు నగరేశ్వర కాలనీలో పర్యటించి కాలనీవాసులతో పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు తాగునీరు, డ్రెయిన్లు, ప్రధాన రహదారి తదితర సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మర్రితిప్ప కాలనీవాసులకు గత ఎనిమిది నెలలుగా తాగునీరు సక్రమంగా అందకపోవడంపై గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటిని సక్రమంగా సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉన్నారని ఎద్దేవా చేశారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు గుబ్బల జయలక్ష్మి, నాగళ్ల వరలక్ష్మి, గుబ్బల లక్ష్మి, దాసరి పద్మ, గుబ్బల మౌనిక, గంగుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి రంగా

మాట్లాడుతున్న సుబ్బారాయుడు

నరసాపురం, న్యూస్‌టుడే: పేదలు, అణగారిన వర్గాలను ఆదుకునేందుకు అహర్నిశలు శ్రమించిన వంగవీటి మోహన్ రంగా యువతకు స్ఫూర్తి ప్రదాత అని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. వంగవీటి రంగా జయంతి సందర్భంగా పట్టణంలోని వైఎన్సీ వద్ద విద్యార్థులు ఏర్పాటు చేసిన కేకు ఆయన కోసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం సౌత్‌లో వంగవీటి మోహన రంగా 78వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి జానకిరామ్, బండారు మాధవనాయుడు సందర్శించి ప్రారంభించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. పాలకొల్లు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా మాధవనాయుడు, జానకిరామ్ మాట్లాడుతూ పేదల ఆశాజ్యోతి రంగా అని కొనియాడారు. రక్తదాన శిబిరంలో భాగస్వాములైన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు ధ్రువ పత్రాలు అందజేసి అభినందించారు.

జంతువుల నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: మనుష్యులకు కొత్తగా వస్తున్న వ్యాధులు జంతువుల నుంచే వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని పాలకొల్లు ప్రాంతీయ పశువైద్యుడు జి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంఎంకేఎన్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మనుషులకు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు'పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సుమారు 150 వ్యాధులను గుర్తించగా.. అందులో దాదాపు 75 శాతం అంటువ్యాధులు జంతువుల నుంచి సంక్రమిస్తున్నాయని తెలిపారు. ఏ జంతువు నుంచి ఏ వ్యాధి సంక్రమిస్తుందో ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఏవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7న ద్విచక్ర వాహన ర్యాలీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పాలకొల్లు నియోజకవర్గ స్థాయి చేనేత కులాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించే ద్విచక్ర వాహనాల ర్యాలీని విజయవంతం చేయాలని సంఘ అధ్యక్షుడు వట్టం గణేశ్ కోరారు. స్థానిక వీవర్స్ కాలనీ సామాజిక భవనంలో గురువారం ఆయన అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సభ్యులు నీలంశెట్టి సత్యప్రసాద్, బసవరాజు, శివాజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా దారి

సత్యవరం పంచాయతీ పరిధిలోని కుమ్మర సపుంత రహదారి దారుణంగా తయారైంది. సుమారు 25 ఏళ్ల ఈ ప్రాంతంలో కాలనీ ఏర్పడగా 50 కుటుంబాల వరకు ఇక్కడ నివసిస్తున్నాయి. అప్పట్లో కంకర మార్గం వేసి వదిలేశారు. నాటి నుంచి దీని గురించి పట్టించుకునే వారే కరవయ్యారు. దీంతో గుంతలతో బురదమయంగా మారిన మార్గంలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం కురిసినపుడు కాలు బయట పెట్టలేని పరిస్థితుల్లో నరకం చూస్తున్నామని వాపోతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. - **న్యూస్‌టుడే, మార్టేరు**

పాలనలో స్వతంత్రంగా వ్యవహరించండి

మాట్లాడుతున్న డీఎల్పీవో జ్యోతిర్మయి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా మహిళా సర్పంచులు ముందుకు సాగాలని డీఎల్పీవో ఐ. జ్యోతిర్మయి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు డివిజన్ స్థాయిలో నిర్వహించే మహిళా సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సర్పంచులు పాలనలో స్వతంత్రంగా వ్యవహరించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా వార్డు సభ్యులు, అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. శిక్షకులు పీవీ సత్యనారాయణ, కె.కె.విశ్వనాథం, వీఎన్ కల్యాణి, పి.సరళ, కె.సునీతాదేవి, మొగల్తూరు ఎంపీడీవో త్రిశూలణి తదితరులు మాట్లాడుతూ గ్రామ పాలనలో సర్పంచుల విధులు, గ్రామాల అభివృద్ధిలో వారికున్న బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీకే వీరభద్రరావు, ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమానికి డివిజన్‌లోని ఎనిమిది మండలాల నుంచి 80 మంది హాజరు కావాల్సి ఉండగా 50 మంది మాత్రమే హాజరయ్యారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం

•తాడేపల్లిగూడెం •తణుకు

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీసీ చెరువు, గ్యాస్ పంపు రోడ్డు, కోటిపొమ్ము కూడలి, ఎపీసీవీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ★ గూడెం మండలం మాదవరం, జగన్నాధపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తణుకు, న్యూస్‌టుడే: లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం తణుకు పట్టణంలోని జాతీయ రహదారి, పాతూరు, సజ్జాపురం, తేతలి, వేల్పూరు, ఇరగవరం, అత్తిలి విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సజ్జాపురం ఏరియా, రామకృష్ణ సొసైటీ రోడ్డు, రైల్వే స్టేషన్, పాతూరు, ఇరగవరం కాలనీ, శివాజీ నగర్, పాడిపైడ నగర్, రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్, మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, కొమ్మాయిచెరువుగట్టు, టి.వేమవరం, ఎన్జీవో కాలనీ, మహిళా కళాశాల, డి మార్ట్ ఏరియా, కొండలమ్మ పుంత, ఎన్టీఆర్ పార్కు, జాతీయ రహదారి, సాయి ఆసుపత్రి ప్రాంతాల్లో, తణుకు మండలంలోని తేతలి, పైడిపర్రు, వడ్లూరు, పసలపూడి, ఇండస్ట్రియల్ సర్వీసెస్, వేల్పూరు, కొమరవరం, వీరభద్రపురం, కావలిపురం, రేలంగి, ఇరగవరం మండలంలోని గోటేరు, గోపాలపురం, కావలిపురం, కత్తవారిపాలెం, కాకుల ఇల్లిందలపర్రు, అత్తిలి మండలంలోని అత్తిలి, ఆరవల్లి, దంతుపల్లి, స్కిన్నెరపురం, సీహెచ్ చెరువు, ఉరదాళ్లపాలెం, పాలూరు, మంచిలి గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

మోటారు సైకిల్ మెకానిక్‌ల ప్రదర్శన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మోటారు సైకిల్ మెకానిక్ ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మోటారు సైకిల్ మెకానిక్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ పాల్గొని మెకానిక్‌లను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం మెకానిక్‌లు ద్విచక్రవాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. సంఘ సభ్యులు కొమ్మిశెట్టి వెంకటరాజు, పసుపులేటి సత్యనారాయణ, పర్వతాలు పాపారావు, నల్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ

ఎన్టీఆర్ ఇళ్ల బిల్లులు రాక లబ్ధిదారుల ఇబ్బందులు

పెంటపాడు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో 2014-19 సంవత్సరంలోని బిల్లుల ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారు. చాలామంది సగం వరకు నిర్మించిన ఇళ్లను పూర్తి చేయడానికి అప్పులు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఈ బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించగా వారు నివేదిక సమర్పించారు. అయితే నేటికీ వారికి బిల్లులు అందకపోవడంతో కూటమి ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి.. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా 2014-19 మధ్యలో 2,658 ఇళ్లు నిర్మించారు. సుమారు రూ.3.64 కోట్ల మేర బిల్లులు ఇప్పటికీ అందలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ పథకాన్ని నీరుగార్చింది. దీంతో చేసిన అప్పులకు ఇంకా వడ్డీలు కడుతూనే ఉన్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గృహనిర్మాణశాఖ ఏఈలు ప్రశాంత్‌రెడ్డి, సీహెచ్ ప్రసాద్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్రభుత్వానికి నివేదించామన్నారు.

ప్రత్తిపాడులో సింహాచలం

అప్పులు చేసి కట్టాం.. నా పేరు పంతం అన్నపూర్ణ. మాది పెంటపాడు మండలం కస్పా పెంటపాడు. 2018లో ఇల్లు నిర్మించుకునేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.1.50 లక్షల రుణం మంజూరు చేయగా నిర్మాణం ప్రారంభించాం. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. వడ్డీ చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

ఖాతాలో ఒక్క రూపాయే జమ అయ్యింది.. నా పేరు సిరపరపు సింహాచలం. మాది పెంటపాడు మండలం ప్రత్తిపాడు. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వంలో ఇల్లు నిర్మాణం చేపట్టాం. ఒక్క రూపాయి మాత్రమే బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. సొమ్ములు పడతాయని అప్పు చేసి నిర్మించాం. గత వైకాపా ప్రభుత్వం ఉత్తి చేయి చూపింది. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

నియోజకవర్గంలో బకాయిలు ఇలా..

మండలం	మొత్తం ఇళ్లు	బకాయిలు
పెంటపాడు	978	రూ.89 లక్షలు
తాడేపల్లిగూడెం	1,680	రూ.2.75 కోట్లు

అల్లూరి యువతకు స్ఫూర్తి

చిత్రపటం దగ్గర విప్లవ జోహార్లు అర్పిస్తున్న నాయకులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తి అని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ అధ్యక్షతన భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పోరాట మార్గమే సమస్యలకు పరిష్కారమన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం : 79950 67078
పెంటపాడు : 79939 36123
తణుకు : 85558 50851
తణుకు గ్రామీణం : 63005 79402

పెంటపాడు, న్యూస్‌టుడే : ? పెంటపాడు మండలం దర్శిపర్రులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రహదారిపై మురుగు నిలిచిపోతోంది. - శ్రీను
✔ డ్రెయిన్లలో పూడిక తొలగిస్తాం. - కోలా శేషవేణి, సర్పంచి
? పెంటపాడు ఎస్సీకాలనీ, కనకసుందరం కాలనీల్లోని పలు వీధుల్లో వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నాం. - మహేష్
✔ మరమ్మతులు చేసి వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. - బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి

సమస్యలు పరిష్కరించండి

తణుకు, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించకుండా, సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా కూటమి నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. గురువారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతృత్వం చాటిన మానవత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదానికి గురై ఇంటికే పరిమితమైన వ్యక్తికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ బాసటగా నిలిచింది. భాగ్యలక్ష్మిపేటకు చెందిన కె.రామ్ చంద్రశేఖర్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. మానవత సభ్యులు గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి నెలకు కావాల్సిన నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పి.రాజేంద్ర కుమార్, కార్యదర్శి మిరియాల కిశోర్, పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి లక్ష్యం

కోరుమిల్లి గ్రామస్థులకు కరపత్రాలు అందజేస్తున్న బాబ్జీ

పెంటపాడు, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే సీఎం చంద్రబాబు నాయకత్వంలో సుపరిపాలన అందిస్తున్నట్లు భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. పెంటపాడు మండలం కోరుమిల్లిలో తెదేపా మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి పింఛన్ల పెంపు, మత్స్యకార భరోసా, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. దాసరి అప్పన్న, సర్పంచి గారపాటి భాస్కరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చుకల వెంకటేశ్వరరావు, వల్లూరి రమేష్, బొక్కా శ్రీనివాస్, పసలపూడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మొక్కలు సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఐటీ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు రోడ్డుకి ఇరువైపులా 250 మొక్కలు నాటారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతగా మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, కాళ్ల గోపీకృష్ణ, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

జయంతి వేడుకల్లో సేవా సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావుకు భారత రత్న ఇవ్వాలని పలువురు నాయకులు కోరారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కూడలి వద్ద ఎస్వీఆర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్వీఆర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు రంగారావు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఎస్వీఆర్ తన విలక్షణ నటనతో దేశ విదేశాల్లో అభిమానులను సంపాదించుకున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ నటుడుగా అవార్డు పొందారని తెలిపారు. అధ్యక్షుడు భోగిరెడ్డి రాము, రాగిరెడ్డి ప్రసాద్, పి.కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఎన్నికైన వారితో ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. గురవారం పట్టణంలోని 14, 16, 18, 32 వార్డులకు సంబంధించి నూతన కమిటీలను ఆయన ప్రకటించారు. 14వ వార్డు అధ్యక్షుడిగా దేవిశెట్టి వీరకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కట్టా రామకృష్ణ, 16వ వార్డు అధ్యక్షుడు గొల్తి నాగవెంకటకామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఇమ్మణ్ని శ్రీనివాసరాయుడు, 18వ వార్డు అధ్యక్షుడు నందా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొండేపూడి సూర్యనారాయణ, 32వ వార్డు అధ్యక్షుడు నల్లా వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉండ్రాజవరపు వేణుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారంతా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి కూటమి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

అబ్కారీ అధికారుల తనిఖీలు

పార్శిళ్లు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలతోపాటు ప్రైవేటు కొరియర్ సంస్థలు, ఆర్టీసీ కార్గో, రైల్వే పార్శిల్ సర్వీస్ తదితర కార్యాలయాలు, గోదాముల్లో గురువారం అబ్కారీ సీఐ ఎస్. మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం సీసాలు, స్పిరిట్, గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు సంబంధించి పార్శిల్ సర్వీస్ కార్యాలయాల్లో నిల్వ లేదా రవాణా అనుమతిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్శిల్ బుకింగ్, డెలివరి చేసే సందర్భంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి తెలిపారు.

ప్రజలకు చేరువగా సేవలు

ప్రదర్శనలో వస్తువులు పరిశీలిస్తున్న మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: విశాల సహకార సంఘం సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ఎస్. మురళీకృష్ణ పేర్కొన్నారు. గూడెం మండలం కొమ్ముగూడెం గ్రామంలోని సంఘం కార్యాలయంలో సహకార సంఘ ఉత్పత్తుల ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ బజార్ స్టాల్స్, వాటర్ ప్లాంట్స్, పశువుల దాణా తయారీ యంత్రాలను ప్రదర్శనలో ఉంచారు. చుట్టుపక్కల 20 సొసైటీలకు చెందిన సభ్యులు పాల్గొని ప్రదర్శనలో ఉంచిన వస్తువులను వీక్షించారు. అధికారులు కె.శ్రీనివాస్, శంకరనారాయణ, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

గోతులతో మంచిలి- కంచుమర్రు రహదారి

అధ్వాన దారుల్లో అవస్థల ప్రయాణం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలంలో ప్రధాన రహదారులు పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా మారాయి. వాటిపై ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. వైకాపా హయాంలో రహదారులను పట్టించుకోకపోవడంతో గోతులతో నిండిపోయాయి. వర్షం కురిసినప్పుడు వాటిలోకి వర్షపునీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. ప్రయాణం సాగించాలంటే ప్రయాణికులు, వాహన చోదకులు నానాయాతన పడుతున్నారు. ప్రధానంగా అత్తిలి నుంచి పాలూరు మీదుగా కొమ్మర, ఈడూరు, కోరుకొల్లు మీదుగా భీమవరం, అత్తిలి నుంచి మంచిలి మీదుగా కంచుమర్రు, స్కిన్నెరపురం, అత్తిలి నుంచి ఉరదాళ్లపాలెం, కోమర్రు, తిరుపతిపురం, వరిఘేడు, దువ్వ రహదారులు అధ్వానంగా మారడంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. దీనిపై ర.భ.శా డీఈ వరలక్ష్మిని సంప్రదించగా అత్తిలి నుంచి పాలూరు మీదుగా కోరుకొల్లు వరకు రహదారి నిర్మాణం జరుగుతోందని తెలిపారు. మండలంలో మిగిలిన రహదారుల నిర్మాణం త్వరలో చేపడతామని చెప్పారు.

అత్యవసరానికి ఆపద

తరచూ మొరాయిస్తున్న 108 వాహనాలు ☛ క్షతగాత్రులకు తప్పనితిప్పలు

తణుకు, న్యూస్‌టుడే: హలో సార్ ఉండ్రాజవరం కూడలి వద్ద లారీ కింద పడి ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు అంటూ మంగళవారం 108 వాహనం కాల్ సెంటర్‌కు ఫోన్ చేశారు స్థానికులు. అరగంటపైన వేచి చూసినా వాహనం రాలేదు. చేసేది లేక స్థానికులు క్షతగాత్రుడ్ని ట్రక్కు వ్యాన్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన దుస్థితి. తణుకు 108 వాహనం మొరాయించడంతో గత వారం రోజులుగా వివిధ ప్రమాదాల్లో బాధితులు నరక యాతన అనుభవించారు.

వారం రోజులుగా మరమ్మతులకు గురైన తణుకు 108

108 అంబులెన్స్‌.. నిర్వహణ లోపాలు, రహదారుల సమస్యలు, దీర్ఘకాల వినియోగం తదితర కారణాలతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కీలక సమయాల్లో ఎక్కడబడితే అక్కడ మొరాయిస్తుండడంతో రోగులు ప్రాణభయంతో అల్లాడిపోతున్నారు. అధికారులు పట్టించుకోక ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మరోవైపు రిఫర్ కేసుల్ని తీసుకెళ్లడంతో ఆ వాహనాలు 4 నుంచి 5 గంటలు ప్రయాణంలోనే ఉంటున్నాయి. నిత్యం ఏలూరు, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు తిరుగుతుండడంతో అందుబాటులో ఉండడంలేదు.

పాత వాహనాలతోనే సేవలు.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పశ్చిగోదావరి జాల్లాకు 20 వాహనాలు కేటాయించగా అందులో 10 పాతవే. నిర్వహణ లేక పాత వాహనాలను ఏళ్లతరబడి నడపడంతో అత్యవసర సమయాల్లో మొరాయిస్తున్నాయి.

ఇరగవరం తాడుతో కట్టిన తలుపు

ఫిటినెస్ తప్పనిసరి.. ఈ వాహనాలు చాలాచోట్ల తుప్పుపట్టి ఉన్నాయి. దీంతో పరీక్షలు చేయకుండానే తిప్పుతున్నారనే విమర్శలున్నాయి. సాధారణంగా 5 సంవత్సరాలు, 5లక్షల కిలోమీటర్లు తిరిగేలా అనుమతిస్తారు. ఇక్కడ మాత్రం ఇప్పటికే 5 లక్షల కిలోమీర్లపైనే తిరగడం వల్ల నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి.

తుప్పుపట్టిన వాహనం

రోజుకు 4 నుంచి 5 కాల్స్‌.. తణుకు 108 వాహనానికి రోజూ 5 వరకు కాల్స్ వస్తుంటాయి. ఇంజిన్లో మరమ్మతుల కారణంగా వారం రోజులుగా ఇరగవరం, పెనుగొండ, తూర్పు గోదావరి జిల్లాలోని ఉండ్రాజవరం వాహనాలకు కాల్స్ పంపిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి సమయానికి రాలేకపోవడంతో క్షతగాత్రులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వాటికి కూడా ఇదే తరహాలో కాల్స్ రావడంతో సేవలు అందించడంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. మరోవైపు 2016 మోడల్ వాహనం కావడంతో విడిభాగాలు లభించడం లేదు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక 9వ వార్డులోని ఎర్ర నారాయణస్వామి పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పవర్ మేక్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో పుస్తకాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అనిల్ పాల్గొని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేశారు. మండ బ్రహ్మాజీ, శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా నియామకం

తణుకు, న్యూస్‌టుడే: సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శిగా సికిలే పుష్పకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలో నిర్వహించిన మహాసభలో సీపీఐ తణుకు ఏరియా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వై.నాగలక్ష్మి, సావారపు దేవీ, మంగం పెంటయ్య, పంపన నరిసింహమూర్తి, కౌరు శ్రీను, పెదపాలు వెంటరావు, సబ్బితి బ్రహ్మయ్య, బొక్కా సత్యనారాయణ ఎన్నికయ్యారు.

వేడుకల్లో పాస్టర్లు

ఘనంగా క్రైస్తవ దినోత్సవం

తణుకు, న్యూస్‌టుడే: ఇండియన్ క్రిస్టియన్ డేను గురువారం తణుకులో ఘనంగా నిర్వహించారు. స్థానిక తణుకు లివింగ్ క్రాస్ చర్చి, కె.రాజేష్ ప్రార్థనా మందిరంలో బ్రదర్ కృపావరం అధ్యక్షతన తణుకు మండల పాస్టర్ల ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా బ్రదర్ ఏఆర్ పాల్సన్ విచ్చేసి ప్రేమ, సేవ తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రదర్ మనోజ్ బాబ్, బ్రెన్‌హాం, కె.బ్లెసింగ్స్ రాజు, కేఎస్.రాజు, కె.డేవిడ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం: కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న గోపాలన్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ కోరారు. ఈ నెల 9న నిర్వహించబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కర్రి నాగేశ్వరరావు, కె.రామకృష్ణ, జవ్వాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు, న్యూస్‌టుడే : జులై 9న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలం కోరారు. గురువారం పెంటపాడు గాంధీబొమ్మ కూడలిలో సీఐటీయూ నాయకులు ప్రచార జాత నిర్వహించారు. శ్యామలకుమారి, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, సిరపరపు రంగరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నుంచి బయలుదేరిన జీపు యాత్ర గురువారం తణుకు చేరుకున్న నేపథ్యంలో స్థానిక నరేంద్ర కూడలి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గోపాలన్ మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం బాధాకరమన్నారు. అనంతరం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించారు. జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, కె.నాగేశ్వరరావు, అజయకుమారి, గార రంగారావు, గుబ్బల గోపి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు తెలుసుకోవాలి

వర్మ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తణుకు, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండి, సమసమాజస్థాపన కోసం కృషి చేయాలని ప్రముఖ సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ సూచించారు. గురవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య దశ నుంచి విద్యార్థులు గొప్ప వ్యక్తుల జీవితాలు, వారి త్యాగాలు, సేవల గురించి తెలుసుకోవడానికి ఒక గొప్ప అవకాశమన్నారు. సామాజికవేత్త సంకు మనోరమ మాట్లాడుతూ ఆడపిల్లలు ఉన్నత విద్య అభ్యసించాలని, తల్లిదండ్రుల్ని వారే అక్షరాస్యులుగా మార్చాలన్నారు. ప్రతి కుటుంబం స్త్రీలకు విద్య, రాజకీయ అవకాశాలు కల్పించే దిశగా ఎదగాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా వర్మ దంపతులను ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు టి.రామకృష్ణ అధ్యక్షతవహించగా వి.సుబ్బారావు, శ్రీదేవి, రజియా, కుమారి, విమలాదేవి, శ్రీనివాసరావు, నాగముని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సమ్మె

తణుకు, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించబోమని తణుకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజుకు చేరుకుంది. తణుకు యూనియన్ అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను, ప్రధాన కార్యదర్శి గెల్లా విజయకుమార్, శెఖర్ బాబు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరుణ చూపండి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మాపై కరుణ చూపించి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 11 రోజులుగా సమ్మెలో పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. బండారు శ్రీను, లోకేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మె

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లాల సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక శేషమహల్ రోడ్డులో సమ్మెకు సంబంధించిన కర పత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాసిందన్నారు. శ్రామికుల శ్రమను దోచుకునే విధంగా చట్టాలు ఉన్నాయన్నారు. నాయకులు రాము, భాషా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరవల్లి బాధితులకు పరామర్శ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : ఆరవల్లి గ్రామంలో దాడికి గురైన బాధితులను గురువారం మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి దాడులు పునరావృతంకాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇరువర్గాల పెద్దలు చర్చించుకొని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. పైబోయిన సత్యనారాయణ, బుడితి సుజన్‌కుమార్, సబ్బితి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

సింగంశెట్టి స్టాలిన్ బాబు S/o పుల్లారావు, కుతుబుల్లాపూర్, ప్రశాంతి నగర్, హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్ర వాస్తవ్యులకు చెందిన దస్తావేజులు నెం: 3147/2018 రుగా రిజిస్ట్రీ కాబడిన ఒరిజినల్ దస్తావేజులు ది.10-6-2025 తేదీన పరిమెళ్ళ నుండి పెంటపాడునకు ఆటోలో వెళ్ళుచుండగా మార్గమధ్యలో (శ్రీ పెంటపాడు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో రిజిస్ట్రీ కాబడిన) జారిపడిపోయినది. తరువాత ఎంత వెదికిన దొరకలేదు. దొరికినవారు పై అడ్రస్‌కు లేదా క్రింది సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి అందజేయగలరు.

సెల్: 99592 33593

(c) eenadu

చట్టంతో మాకు పనేంటి!

◆ అనుమతులు పొందని వైకాపా కార్యాలయం
◆ కేఎంసీ ఆధీనంలోని భవనంలోనే సమావేశం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: చట్టంతో తమకు పని లేదనేలా వైకాపా నేతలు మరోసారి వ్యవహరించారు. అనుమతులు లేని కార్యాలయ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి తమ పెద ధోరణిని చెప్పకనే చెప్పారు. ఆ పార్టీ అధికారంలో ఉండగా కడప నగర శివారు రామాంజనేయపురంలో జిల్లా కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. నిర్మాణానికి గాను ఎలాంటి అనుమతులు పొందలేదు. ఈ విషయం గతేడాది జూన్‌లో వెలుగులోకి రావడంతో సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు. భవనాన్ని పరిశీలించి దాదాపు అయిదు ఆక్షేపణలు వ్యక్తం చేస్తూ భవన నిర్మాణానికి షార్ట్‌ఫాల్ నోటీసు జారీ చేశారు. అనంతరం ఆక్షేపణల పరిష్కారా

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న వైకాపా నాయకులు

నికి తగిన పత్రాలు అందజేసి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఆ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు.

● **వెల్లువెత్తుతున్న విమర్శలు:** అనుమతులు లేని సదరు భవనంలో వైకాపా నేతలు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, సుధ, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, రమేశ్ యాదవ్, మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాషా, రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితో పాటు అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇంకా ప్రారంభం కాని.. అనుమతులే లేని భవనంలో ఇంత పెద్ద సమావేశం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై నగర పాలక ప్రణాళికాధికారి రమణను వివరణ కోరగా.. సదరు భవనం నగర పాలక ప్రణాళిక విభాగం పరిధిలో ఉందన్నారు. గతంలో ఇచ్చిన షార్ట్

ప్రారంభానికి నోచని వైకాపా జిల్లా కార్యాలయం వద్ద నేతల వాహనాలు

ఫాల్ నోటీసులకు ఇప్పటి వరకు ఆ పార్టీ నాయకులు సమాధానం ఇవ్వకపోవడంతో ప్లాన్ అప్రూవ్ కాలేదన్నారు. ప్లాన్ అప్రూవల్ లేని నిర్మాణాలను వాటి యజమానులు వినియోగంలోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

పెన్నా లోయ పరిసర ప్రాంతాల్లో పవన్ కల్యాణ్‌పై చిత్రీకరించిన గుర్రపు స్వారీ దృశ్యం

వీరమల్లులో మన గండికోట

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ట్రైలర్ గురువారం విడుదలైంది. ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో చిత్రీకరించినట్లు అందులో చూపారు. స్థానిక మాధవ రాయస్వామి దేవాలయంలో శివాలయం గుడి సెట్టింగ్ ఏర్పాటు చేసి ప్రముఖ సినీ నటుడు సత్యరాజ్‌పై కొన్ని దృశ్యాలు చిత్రీకరించారు. పెన్నాలోయ పరిసర ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ గుర్రంపై స్వారీ చేస్తూ వెళ్తున్న దృశ్యాలు ప్రత్యేకంగా నిలిచాయి. పర్యాటక కేంద్రంలో సినిమాను చిత్రీకరించడంపై ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హరి హర వీరమల్లుకు క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించగా, మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటించగా ఎం.ఎం.కిరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం ఈ నెల 24న థియేటర్లలో విడుదల కానుంది.

మాధవ రాయస్వామి దేవాలయంలో చిత్రీకరించిన ఓ సన్నివేశంలో నటుడు సత్యరాజ్

బతుకంతా కుట్రపూరిత చరిత్ర

● యుక్తవయసులో ఉగ్రవాదం వైపు అడుగులు ● పతుల వెంట నడిచిన సతులు ● దశాబ్దాల తర్వాత దొరికిన నాగులు

రాయచోటి, న్యూస్‌టుడే: యుక్త వయస్సులో ఉగ్రవాద కార్యకలాపాలపై మక్కువ పెంచుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నడుస్తున్న ఐసీఎస్, అల్ ఉమా సంస్థలతో పరిచయాలు పెంచుకున్నారు. నూనూగు మీసాల దశలోనే వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఆ తర్వాత రాష్ట్రం కాని రాష్ట్రం వచ్చారు. అనామకుల్లా నటించారు. బతుకుదెరువు కోసం చిరు వ్యాపారం చేస్తున్న వారిలా ఊరూరా తిరిగారు. వేరేందే యువతులను వివాహమాడారు. వారూ తమ తప్పులకు సహకరించేలా మలుచుకున్నారు. ఆ తర్వాత తమ కార్యకలాపాలు కొనసాగించారు. దశాబ్దాల తర్వాత వారి పాపం పండింది. బతుకంతా కుట్రపూరితంగా నడిపే వివరికి పోలీసులకు దొరికిపోయారు. ఈ ఉదంతంతో ప్రశాంతతకు మారుపేరైన రాయచోటి పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. దేశంలో కొన్ని ప్రధాన నగరాల, దైవ మార్గాలను పేల్చి వేసేందుకు కుట్రలు పన్నిన ఉగ్రవాదులు తమ మధ్యనే ఉన్నారని తెలుసుకుని ఆందోళన చెందారు. ఉగ్ర నాగులను పోలీసులు పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

● అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీలది తమిళనాడు. వీరు కోయంబత్తూరు, ఎగ్మోర్, బెంగళూరు రామేశ్వరం ప్రాంతాల్లో వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. తమిళనాడులోని నాగూర్, మైలాపూర్, చెన్నై చింతాద్రిపేట, మదురై తిరుమంగళం, వేలూరు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. 1999లో చెన్నై ఎగ్మోర్‌లో చోటుచేసుకున్న బాంబు పేలుళ్ల, అదే ఏడాదిలో కేరళలో పేలుడు పదార్థాలను తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసుల విచారణ కొనసాగుతుండగానే రాయచోటి వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు.

అమ్మో

ఇంట్లోనే పేలి ఉంటేనో!: అబూబకర్ సిద్ధిఖీ పేలుడు పదార్థాల తయారీలో సిద్ధహస్తుడు. నిత్యం జన సంచారం ఉండే పాఠశాల ఎదుట గల రెండు అంతస్తుల భవనంలో ఆద్దెకు ఉంటున్నారు. ఇక్కడే భారీ ఎత్తున పేలుడు పదార్థాలను నిల్వ చేశారు. వాటితో బాంబులు తయారు చేసి దేశంలో ఉగ్ర సంస్థలకు అవసరమైన ప్రాంతాలకు చేరవేస్తూ వచ్చారు. పోలీసులు, ఐబీ అధికారుల తనిఖీ సమయంలో ఇంట్లోని వస్తువులు, సామగ్రి, అత్యాధునిక పరికరాలు లభించాయి. అతనికి సోదరుడిగా భావిస్తున్న మహ్మద్‌అలీ నివాసంలో పేలుడుకు ఉపయోగించే తీగలు, ఇతర సామగ్రి దొరికాయి. భారీగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు, తయారు చేసిన బకెట్, సూట్‌కేసు బాంబులు ఏదేని ప్రమాదంతో పేలి ఉంటే పట్టణంలో ఊహకు అందని విషాదమే నెలకొనేదని స్థానికులు ఇప్పుడు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్.. చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పోలీసు అధికారులు

● **నిర్వీర్యం చేసిన పోలీసులు..:** ఉగ్రవాదుల ఇళ్లలో లభించిన సూట్‌కేసు, బకెట్ బాంబులను డీఎస్పీ కార్యాలయానికి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో గురువారం ఉదయం నిర్వీర్యం చేశారు. లోతైన గొయ్యి తీసి అందులో సూట్‌కేసులు ఉంచి వైరాగంలో ఇసుక సంచులు పేర్చి పేల్చారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము ఎగిసి పడింది. ఈ ప్రక్రియనంతటినీ కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ రామనాథ్ హెగ్డే, డీఎస్పీలు కృష్ణమోహన్, మహేంద్ర పర్యవేక్షించారు.

● **ఆర్టికల్స్, చరవాణులు స్వాధీనం:** అబూబకర్ సిద్ధిఖీ ఇంట్లో గురువారం సాయంత్రం కూడా తనిఖీలు నిర్వహించారు. చరవాణులతో పాటు ఆర్టికల్స్ పేలుడు పదార్థాలను గుర్తించారు. వీటితో పాటు వాకీటాకీలు, రేడియోలు, రిమోట్‌లు వంటి పరికరాలతో పాటు పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు.

పాపం పసివాళ్లు..

ఉగ్రవాదులకు పెళ్లయ్యాక సంతానం కలుగుతున్నారు. వీరంతా లోకం పోకడ తెలియని చిన్నారులు. తమ తల్లిదండ్రుల ఉగ్ర కార్యకలాపాలతో వీరి పట్టవు. ఇతరులతో ఆటపాటలతో ఉండేవారు. కన్నవారి కార్యకలాపాలతో ఈ చిన్నారులు ఇప్పుడు వారికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం రాయచోటి కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకొచ్చిన తమ తల్లులను చూసేందుకు నలుగురు పిల్లలు తమ బంధువులతో కలిసి వచ్చారు. పోలీసు వాహనంలో తల్లులు.. దూరంగా చెన్నైలో తండ్రులు ఉండిపోయారు. పోలీసు వాహనంలో జైలుకు తరలి వెళ్తున్న తల్లులను చూస్తూ పిల్లలు రోడ్డు పైనే ఉండిపోయారు.

రాయచోటిలోని కోర్టు ఎదుట బంధువులతో చిన్నారులు

మహిళలను కడప జైలుకు తరలిస్తున్న పోలీసులు

కారాగారంలో ప్రత్యేక బ్యారక్..

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: రాయచోటిలో అరెస్టైన ఇద్దరు ఉగ్రవాదుల భార్యలను రిమాండ్ నిమిత్తం కడప ప్రత్యేక మహిళా కారాగారానికి కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య గురువారం సాయంత్రం తీసుకొచ్చారు. వీరిద్దరిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచారు. అక్కడ ఇద్దరి నాలుగు గంటల పాటు కట్టుదిట్టమైన నిఘా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఉగ్రవాదుల భార్యలను ప్రత్యేక మహిళా కారాగారంలో ఉంచడం ఇదే మొదటిసారి.

ఉద్యోగమిస్తే యజమానికి ప్రోత్సాహం

◆ ఉపాధి అవకాశాలు పెంచేలా ఈఎల్ఐ పథకం
◆ అమలుతో కార్మికులు, నిర్వాహకులకు ప్రయోజనం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్ఐ) పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఇటీవల ఆమోదం తెలిపిందని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో అమలు చేయనుందని భవిష్య నిధి(పీఎఫ్) కమిషనర్-1 రవితేజ కుమార్ రెడ్డి తెలిపారు. కడపలోని కార్యాలయంలో 'ఈనాడు- ఈటీవీ'తో ఆయన బుధవారం మాట్లాడారు. ఇవీ ముఖ్యాంశాలు...

● ఈఎల్ఐ పథకం ద్వారా మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి రూ. 15,000 వరకు రెండు విడతల్లో ప్రోత్సాహక రూపంలో అందుతుంది. ● నిరంతరం ఉపాధి కల్పించే ప్రాతిపదికన నియమించుకున్న యాజమాన్యాలకు ప్రతి అదనపు ఉద్యోగి కోసం రెండేళ్ల పాటు నెలకు రూ.3,000 వరకు ప్రోత్సాహకంగా జమ అవుతుంది. ● 2025 ఆగస్టు 1 నుంచి 2027 జులై 31 మధ్య కాలంలో చేరిన ఉద్యోగులకే వర్తిస్తుంది. ● ప్రోత్సాహకాలను ఉద్యోగుల ఖాతాల్లోనే నేరుగా కేంద్రం జమ చేస్తుంది. ● ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునేందుకు రాయలసీమ జిల్లాల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని కంపెనీలు తమ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్యను పెంచుకోవాలి. ● ఈఎల్ఐ పథకం అమలుతో అటు ఉద్యోగికి, ఇటు యాజమాన్యాలకు ప్రయోజనం ఉంటుంది. ● పూర్తిస్థాయి విధి విధానాలు త్వరలో వెలువడనున్నాయని.. ఆ తర్వాత ప్రైవేట్ కంపెనీల యాజమాన్యాలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

భవిష్య నిధి (పీఎఫ్) కమిషనర్-I రవితేజ కుమార్‌రెడ్డి

పెట్టెలు దాటని నీటి పరీక్షలు

వినియోగించకుండా మూలనే కిట్లు ◆ శుభ్రతకు నోచుకోని తాగునీటి ట్యాంకులు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: గ్రామస్థులకు రక్షిత తాగునీరు అందజేయాలనే సమున్నత లక్ష్యానికి నిర్లక్షపు చీడ పట్టింది. గ్రామ స్థాయిలో నీటి పరీక్ష కిట్‌లను వినియోగించి నాణ్యతను పరీక్షించాలనే ఉద్దేశాన్ని నీరు గారుస్తోంది. ఫలితంగా క్లోరినేషన్ రహిత తాగునీరే గొంతులకు దిక్కవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే వర్షాకాలంలో ప్రజారోగ్యం ప్రమాదంలో పడనుంది.

ఉప్పరపల్లెలో అట్టపెట్టెల్లోనే ఉంచిన నీటి పరీక్ష కిట్లు

● **ఆ గ్రామాలకు నేరుగా సరఫరా:** ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పట్టణం మినహాయిస్తే ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలున్నాయి. ఆ పరిధిలో 30 పంచాయతీలు, 36 సచివాలయాలు, 80 గ్రామాలున్నాయి. వీటిలో 1,80,950 మంది జనాభా నివసిస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పర్యవేక్షణలో 62 తాగునీటి పథకాలున్నాయి. ఉపరితల జలాశయాలు 42 వరకు ఉన్నాయి. వీటిలో ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని ప్రకాశ్‌నగర్, ఖాదర్‌బాద్, సోములవారిపల్లె పంచాయతీ కేంద్రంలోను, గోపవరం పంచాయతీలో లింగారెడ్డినగర్, యానాది కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, చౌడూరు, పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె, తాళ్లమాపురం, సగిలిగొడ్డుపల్లె, రాజుపాళెం మండలం కొర్రపాడు, తొండలదిన్నె, టంగుటూరు, చిన్నశెట్టిపల్లె, పొట్టిపాడుల్లోని తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. దీంతో ఆ గ్రామాలకు తాగునీరు నేరుగానే సరఫరా అవుతోంది.

● **కానరాని నిబంధనల అమలు:** క్లోరినేషన్ చేసిన నీటిని ప్రతి రోజూ సరఫరా చేయాల్సి ఉండగా ఆ ఊసే కనిపించడం లేదు. పదిహేను రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉన్నా.. కొన్నిచోట్ల ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఏడాదికి రెండు సార్లు సూక్ష్మజీవులు, లవణాల నిర్ధారణ కోసం నమూనాలు తీసి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటే ఎక్కడా చేయడం లేదు. నీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను కలపడం లేదు. చిన్నపంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపేందుకు సిబ్బంది కొరత, జీత భత్యాల సమస్య వేధిస్తోంది. నీటి పరీక్ష కిట్లు ప్రతి సచివాలయానికి ఇచ్చారు. అందులో తొమ్మిది రకాల కాలం చెల్లిన రసాయనాలు ఉండడంతో వినియోగించకుండా సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు వాటిని మూలకు చేర్చారు. ఈ సమస్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ భరత్ రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా. . నిధుల లేమితో చిన్న పంచాయతీల్లో క్లోరినేషన్ చేయడం లేదన్నారు. నిరుపయోగంగా ఉన్న ట్యాంకులకు నీరు నింపి, ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి పరీక్ష కిట్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అసంపూర్తిగా ఉన్న ఆలయ నిర్మాణ పనులు

అదిగో శ్రావణం.. ఏదీ నిజరూప దర్శనం!

నత్త నడకన ఆలయ పునర్నిర్మాణ పనులు

చక్రాయపేట, వేంపల్లె, న్యూస్‌టుడే: ఉమ్మడి కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో గండి క్షేత్రం ఒకటి. వీరాంజనేయస్వామి దర్శనానికి రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. మంగళ, శనివారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. శ్రావణ మాసంలో ఈ సంఖ్య మరింత ఎక్కువ. ఆలయానికి మరింత శోభ తీసుకొచ్చేందుకు గత వైకాపా హయాంలో 2020 డిసెంబర్‌లో పునర్నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరయ్యాయి. పనులను తమిళనాడుకు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. 2020 డిసెంబరు 24న అప్పటి సీఎం జగన్ ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. 2021 అక్టోబర్‌లో బాలాలయాన్ని నిర్మించి స్వామి దారువు విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా 130 రాతి స్తంభాలతో గర్భాలయం, తూర్పు, పడమర రాజగోపురాలు, ప్రాకారం, లోపల బండ పరుపు, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనుల పూర్తికి రెండేళ్ల గడువు విధించినా పనుల ప్రారంభం, బిల్లుల జాప్యంతో మందగించాయి. అధికారులు మరో ఏడాది గడువు పొడిగించినా ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. ఇంకా ప్రాకారం, ఫ్లోరింగ్, రాజగోపురం పనులు చేపట్టాల్సి ఉంది.

● **మరో ఏడాది ఆగాల్సిందేనా...:** ఈ నెల 24 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈలోపు పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. రాజగోపురంతో పాటు అసంపూర్తి పనులు పూర్తి కావాలంటే మరో ఏడాది సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో స్వామివారి నిజరూప దర్శనం లభించకపోవడంపై భక్తులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ ఏఈ వెంకట నిఖిల్‌ను వివరణ కోరగా.. ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పూర్తిస్థాయిలో రాజగోపురం, అన్ని పనులు పూర్తి కావాలంటే మరో ఏడాది సమయం పడుతుందన్నారు.

చెత్తంతా పొగై.. ప్రజారోగ్యానికి పొగై

కడప నగరంలో రోజువారీ సేకరించిన చెత్తనంతా గువ్వలచెరువు ఘాట్ రోడ్డు సమీపంలోని మద్దెమడుగు గ్రామం వద్ద పారబోస్తున్నారు. ఇక్కడ టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయింది. చెత్తను ప్రాసెసింగ్ చేసి పునర్వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చేపడుతున్న చర్యలు శూన్యం. పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తకు స్థానికులు కొందరు నిప్పు పెడుతుండటంతో నిత్యం మండుతూ ఆ ప్రాంతం అంతా పొగ కమ్ముకుని దుర్గంధం వెదజల్లుతుంటుంది. దీంతో పరిసరాల్లోని కాంపల్లె, సుగాళిబిడికి, ఎన్‌టీపీసీతో పాటు వెంకట్రాంపల్లి, ఇప్పపెంట, బోడెదెల్లుపల్లె, జమాల్‌పల్లె గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పొగ వస్తుంటే బతికేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను కాల్చకుండా చూడాలని కోరుతున్నారు. **- ఈనాడు, కడప**

విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

విశ్వవిద్యాలయం అంతా ఓ బూటకం

చెన్నూరు, న్యూస్‌టుడే: సీవోఏ నుంచి అనుమతులు లేకుండా బూటకపు విశ్వవిద్యాలయాన్ని నడిపి వైకాపా ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమాడిందని వైఎస్సార్ ఆర్కిటెక్ట్ యూనివర్సిటీ విద్యార్థులు విమర్శించారు. అధికారులు, పాలకుల తీరుకు నిరసనగా చెన్నూరు మండల పరిధిలోని యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ధర్నా చేశారు. అయిదేళ్ల క్రితం కోర్సులో చేరి పూర్తి చేసినప్పటికీ లైసెన్స్ పత్రాలు అందజేయడంలో విశ్వవిద్యాలయం విఫలమైందన్నారు. నిబంధనలు పాటించకుండా వైకాపా హయాంలో ఏర్పాటు చేయడంతో ఈ సమస్య తలెత్తిందని విమర్శించారు. యూనివర్సిటీ భవనాలకు ప్రభుత్వం అద్దె చెల్లింస్తోందని.. తమ నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని.. అయినా వీసీ, గుత్తేదారు మధ్య విబేధాలతో వసతులు కల్పించకపోవడంతో తాము నష్టపోతున్నట్లు వాపోయారు. అధ్యాపకులు లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా కొందరికి పాఠాలు బోధిస్తున్నారని దుయ్యబట్టారు. మరికొందరిని ఫీల్డ్ వర్క్ పేరిట ఇంటికి పంపేయడం బాధాకరమన్నారు. వీసీ విశ్వనాథ్ స్పందించి పక్షం రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

చల్లంగ చూడాలని బోనాలు

బోనాలతో ఆలయంలో భక్తులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: వర్షాలు సమృద్ధిగా కురవాలని.. పాడి పంటలు పండాలని.. అందరినీ చల్లంగా చూడాలని కోరుతూ తిమ్మసముద్రం కమ్మపల్లి, లగిశెట్టిపల్లి వాసులు ఏపూరమ్మకు గురువారం బోనాలు సమర్పించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షురాలు, ప్రధాన జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి వివాదాలు, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్ ఉంటుందని.. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ సూచించారు.

ఆరోగ్యానికి అభయం

◆ యాప్‌లో వివరాల నమోదు
◆ వేలిముద్రతో చికిత్స గుర్తింపు

కమలాపురం, న్యూస్‌టుడే: మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు అనేక రోగాలకు కారణమవుతున్నాయి. పలువురిని అనారోగ్యం బారిన పడేలా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనారోగ్య వివరాల నమోదుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నెలకొల్పి, 'అభ'(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) విధానాన్ని అమలు చేయనున్నాయి. ఇందుకుగాను ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపడుతున్నారు. ప్రతి వ్యక్తికి 'అభ' కార్డులు మంజూరు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రతి రోజూ ఐదు కుటుంబాలను ఎంపిక చేసి ఈ సర్వేలో వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కమలాపురం పట్టణ ఆరోగ్య కేంద్రం

పద్నాలుగు అంకెలు ప్రత్యేకం

వ్యక్తుల అనారోగ్య వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత 14 అంకెలు కలిగిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. జిల్లాలోని 30 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి వ్యక్తి వివరాలను ఆరోగ్య శాఖ ద్వారా డిజిటలైజేషన్ చేస్తున్నారు. సదరు వ్యక్తి ఆరోగ్య వివరాలన్నీ యాప్‌లో నిక్షిప్తమై ఉంటాయి.

చికిత్స చిట్టా ప్రత్యక్షం

వివరాలు యాప్‌లో సురక్షితంగా ఉంటాయి. ఎవరైనా వ్యక్తి అనుకోకుండా అపస్మారక స్థితిలోకి వెళితే అతని వేలిముద్ర ద్వారా ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఎంత కాలం నుంచి వైద్య సేవలు పొందుతున్నారు. ఎక్కడెక్కడ, ఎప్పుడు చికిత్స చేయించుకున్నారు అనే వివరాలూ ఒక్క వేలిముద్రతో తెలిసే వీలుంటుంది. ఈ విషయమై కమలాపురం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రియాంక మాట్లాడుతూ.. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో సర్వే వివరాల నమోదును వేగంగా చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 86 శాతం ప్రక్రియ పూర్తైందని తెలిపారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్.. చిత్రంలో జేసీ అదితిసింగ్

కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి అవసరం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్-2047పై జేసీ అదితిసింగ్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో కడప కలెక్టరేట్‌లో ఆయన గురువారం సమీక్షించారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం తదితర అంశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకెళ్లాలన్నారు. ఇప్పటికే సుమారు 78 వేల బంగారు కుటుంబాలను గుర్తించి లక్ష్యాలను నిర్దేశించినట్లు వివరించారు. కడపలో పరిశ్రమలు, నిర్మాణం, ఉత్పాదకం వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. సమావేశంలో సీపీవో హజరత్తయ్య, ఆర్డీవోలు ఇర్విన్, చంద్రమోహన్, సాయిశ్రీ, కమిషనర్ మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి సానుకూల స్పందన మరింత పెరిగేలా ప్రత్యేక చొరవచూపాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం జిల్లాలోని క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు.

(c) eenadu

గవర్నర్‌ను కలిసిన హెల్త్‌వర్సిటీ ఈసీ సభ్యుడు

గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన వారిలో వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్‌తోపాటు గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను గురువారం రాజ్‌భవన్‌లో కలిశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

టెండర్ నోటీస్

శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము, పాలతల

గంగనపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం, కడప జిల్లా

ఒక సంవత్సరం కాలం పాటు లడ్డు ప్రసాదము, అన్నదానము సరుకులు కొరకు

కడప జిల్లా, పెండ్లిమర్రి మండలం, గంగనపల్లి గ్రామంలో శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం, పాలతలకు సంబంధించిన తేదీ : 01.07.2025 నుండి 30.06.2026 వరకు అనగా ఒక సంవత్సరం కాలం పాటు లడ్డు ప్రసాదం సరుకులు, అన్నదానము ముడి సరుకులు సరఫరా చేయుటకు గాను టెండర్లు పిలవడం జరుగుచున్నది. ఆసక్తి కలిగిన వారు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, కడప టౌన్ బ్రాహ్మణ వీధి, డోర్ నెం : 5/202 నందు 04.07.2025 నుండి తేదీ : 06.07.2025 తేదీలోగా షెడ్యూల్ పొంది తేదీ : 08.07.2025 సాయంత్రం ఐదు గంటల లోపల కడప కార్యాలయంలో ఉంచిన టెండర్ బాక్స్ నందు సీల్డ్ కొటేషన్ వేయవలెను. అదే రోజు సాయంత్రం 5.30 గం॥ టెండర్‌దారుల సమక్షములో టెండర్ బాక్స్ తెరువబడును.

ఇట్లు : యం.కృష్ణ నాయక్, గ్రేడ్-I కార్యనిర్వహణాధికారి

శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము, పాలతల

గంగనపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం, కడప జిల్లా.

బహిరంగ వేలం ప్రకటన

సదరు దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింద తెలిపిన హక్కునకు తేదీ : 09-07-2025న బుధవారం ఉదయం 11 గంటలకు సదరు దేవస్థానం నందు ఇ-టెండర్ కం-సీల్డ్ కొటేషన్ కం-బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	నిలువ ఉంచిన కాలం	డిపాజిట్	
1.	సేకరించి నిలువ ఉంచిన తలనీలాలు పొందు హక్కునకు	10/2022 నుండి 01/2023 మరియు 11/2024 నుండి 31/2025 వరకు	1,00,000/-	ఇ-టెండర్ కం-సీల్డ్ కొటేషన్ కం-బహిరంగ వేలం

పాట పూర్తి అయిన వెంటనే హెచ్చు పాట మొత్తం చెల్లించవలెను. ఇతర షరతులు బహిరంగ వేలం నందు తెలుపబడును.

ఇట్లు : యం.కృష్ణ నాయక్, గ్రేడ్-I కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ

శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్,

కడప నగరం, కడప జిల్లా

ఖాళీ స్థలములు లీజు లైసెన్స్ హక్కునకు ఇ-టెండర్ మరియు సీల్డు టెండర్ (కం) బహిరంగ వేలం ప్రకటన

కడప నగరంలో నాగరాజుపల్లె (పాత బస్టాండ్ ప్రక్కన) వున్న శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప నగరంలో నాగరాజుపల్లె సర్వే నెంబరు 5లో గల 2 (రెండు) ప్లాట్స్ 1. ప్లాట్-A విస్తీర్ణం : (37.09 సెంట్స్ / 1,795 Sq.Yards), 2. ప్లాట్-B విస్తీర్ణం: (38.22 సెంట్స్ / 1,850 Sq.Yards). ఖాళీ స్థలములు 11 సంవత్సరముల కాలపరిమితి లీజు హక్కులను పొందుటకు షెడ్యూలు ప్రకారము ఇ-టెండరు, సీల్డు టెండరు (కం) బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ టెండర్ దాఖలు చేయుటకు ఆఖరు తేదీ: **17.07.2025 ఉదయం గం॥ 10.00లకు.** మరిన్ని వివరములకు **www.eprocurement.gov.in** ను సందర్శించగలరు. సీల్డు టెండర్లు సోమ. 14.07.2025 ఉదయం గం॥ 10.00 నుండి బుధ. 16.07.2025 సాయంత్రం గం॥ 5.00 లోపల ప్రతి షెడ్యూలుకు రూ.5,000.00 చెల్లించి శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ ఆఫీసు నందు 2 (రెండు) ప్లాట్స్‌కు వేరు వేరు దరఖాస్తు ఫారాలు పొందగలరు. పూర్తిచేసిన సీల్డు టెండరు గురు. 17.07.2025 ఉదయం గం॥ 10.00లకు సదరు ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము వద్ద టెండరు బాక్సు నందు వేయవలెను. బహిరంగ వేలము గురు. తేదీ: 17.07.2025 ఉదయం గం॥ 10.00లకు శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము నందు జరుగును. ఇతర వివరములకు సెల్ : +91 83318 90511 ను సంప్రదించగలరు.

వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు మరియు సెక్రటరీ

శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప.

ఆఫీస్ అడ్రసు : ఫ్లాట్ నెం. 301, 3rd ఫ్లోర్, డోర్ నెం. 20/999-9-3-5, జొన్నలగడ్డ హైట్స్, కో-ఆపరేటివ్ కాలనీ, Near ACB Office, కడప - 516001.

సమస్యలు గుర్తించాం... విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

ఈనాడు-మీతోడు ఫోన్‌ఇన్‌లో డీఈవో షంషుద్దీన్

ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్, పక్కన కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, డీఈవో కార్యాలయ ఏడీ (సర్వీసెస్) రామకృష్ణ, ఏడీ (స్కీమ్స్) అనిల్‌కుమార్

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో విద్యాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేలా త్వరలోనే సర్దుబాటు ప్రక్రియ చేపట్టామని, జిల్లా సమగ్రశిక్ష ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదనలతో పాఠశాలల్లో వసతుల కల్పన కృషి చేస్తున్నామన్నారు. కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం ఈనాడు మీతోడు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫోన్ ఇన్ ఆయన పాల్గొని విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

?: గౌస్‌నగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని తరగతులు ఒకే ఆవరణలో ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. అదనపు తరగతి గదుల కొరత వేధిస్తోంది.
- పఠాన్, ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, కడప

?: బద్వేలు గూడెం ఎంపీపీ పాఠశాలలో 38 మంది విద్యార్థులు ఉండగా ఒకే ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు.
- తిరుపాల్‌రెడ్డి, బద్వేలు

?: మోరగుడి, ఈడిగపేట ప్రాంతాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు లేరు.
- చౌడయ్య, జమ్మలమడుగు

?: ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం ప్రాథమిక పాఠశాలలో 159 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు.
- సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు

?: వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో 71 మంది విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఇటీవల ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించినా వారు రాలేదు. **- మునెయ్య**

✓: విద్యార్థుల సంఖ్య ఆధారంగా త్వరలోనే ఉపాధ్యాయుల కొరత తీర్చేలా చర్యలు తీసుకుంటాం.

?: ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేవు. అనుమతులు లేకపోయినా నిర్వహణ కొనసాగిస్తున్నారు.
- అంకన్న, కడప

✓: దీనిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నేను స్వయంగా పరిశీలన చేసిన సమయంలోనూ పలు సమస్యలను గుర్తించాను. ఈ సమస్యలపై విచారించి ఆయా పాఠశాలల అనుమతులు రద్దు చేస్తాం. ఎలాంటి చర్యలు తీసుకున్నామో ఫిర్యాదుదారుడికి తెలిసేలా జవాబిస్తాం.

?: కడప నగరంలోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో బదిలీలకు ముందు 19 మంది ఉపాధ్యాయులు ఉండగా ప్రస్తుతం 9 మంది వచ్చారు. నిర్వహణ కష్టతరమవుతోంది. దీంతో పనిభారం ఎక్కువవుతోంది. **- విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు**

✓: సమస్యను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తాం.

?: వీరపునాయునిపల్లె మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలగా ఉండేది. గతంలో ఏడో తరగతి వరకు ప్రాథమికోన్నత పాఠశాలగా ఉండేది. ప్రస్తుతం మరో పాఠశాలలో 1, 2 తరగతులు నిర్వహించేలా విభజించారు. ఆ రెండు పాఠశాలలను కలిపితే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. **- భార్గవ్**

✓: ఎంఈవోను పంపించి విచారణ చేయిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

?: దువ్వూరు మండలం పెద్దజొన్నవరం పాఠశాలలో 8వ తరగతి వరకు పాఠశాల ఉంది. 68 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో విద్యార్థులు టీసీ తీసుకుని వెళ్లిపోతున్నారు.
- రామచంద్రారెడ్డి, స్టాటిస్టికల్ విశ్రాంత అధికారి

✓: త్వరలోనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం.

?: బద్వేలు కన్యకాపరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాల స్థలం దాతలు మా పూర్వికులు. బైలాలో ఏ వివరాలు ఉన్నాయి, పాఠశాలలో కార్యక్రమాలు ఏం జరుగుతున్నాయి తదితర వివరాలు తెలియజేయగలరు **- సుబ్రమణ్యం, కడప** ✓: వివరాలు తెలియజేస్తాం.

?: కడప నగరంలోని పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. **- బేబీ, కడప**

✓: ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమిస్తాం. విద్యార్థులకు బోధన కల్పిస్తాం.

?: బద్వేలు మండలం కొత్తచెరువు హెచ్ డబ్ల్యూలో కొత్తగా మంజూరైన పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటపాత్రలు, పిల్లలకు ప్లేట్లు లేవు. క్రీడా పరికరాలు కూడా అందుబాటులో లేవు.

✓: మండల విద్యాశాఖాధికారిని పాఠశాల వద్దకు పంపిస్తాం. సమస్యలను గుర్తించి తగినవిధంగా పరిష్కారం చేస్తాం.

?: మైదుకూరు మండలం డాంకన్ పల్లిలోని పాఠశాలలో 59 మంది విద్యార్థులకు ఒక తరగతి గది మాత్రమే ఉంది. దీంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- నాగజ్యోతి, నసీమున్, బీబీ

✓: సమగ్రశిక్ష ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లి మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకుంటాం.

?: ప్రొద్దుటూరు మండల పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో పలువురు విద్యార్థులు పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్తున్న సమయంలో కుక్కలపై రాళ్లు వేస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. **- నారాయణశ్రీ**

✓: విద్యార్థులకు సామాజిక, నీతికథల అంశాలకు సంబంధించిన పాఠాలు బోధించేలా ఉపాధ్యాయులకు వివరిస్తాం.

?: విద్యాహక్కుచట్టం ప్రకారం ఎస్టీ కాలనీలోని విద్యార్థులకు ఓ ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ వచ్చింది. ప్రస్తుతం ఉన్న పాఠశాల నుంచి అక్కడ విద్యార్థిని చేర్పించేందుకు ఆన్‌లైన్‌లో వివరాలు ట్రాన్స్‌ఫర్ చేయడం లేదు. 14 రోజులు పాఠశాలకు వెళ్లినందుకు ఫీజులు అడుగుతున్నారు. ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదు.
- మేకల ఆంజనేయులు, అరుణకుమారి, జమ్మలమడుగు

✓: ఎంఈవో స్వయంగా పరిశీలించి విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు జరిగిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

మైలవరంలోని దొమ్మరనంద్యాలలో కరపత్రం అందించి పథకాలు వివరిసున్న తెదేపా నేత భూపేష్‌రెడ్డి

అట్లూరు కామసముద్రంలో కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బద్వేలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరులో 33వ వార్డులో ప్రజలతో చర్చిస్తున్న తెదేపా నేత రాఘవరెడ్డి, కౌన్సిలర్ శివజ్యోతి, కుతుబుద్దీన్ తదితరులు

సుపరిపాలనతో ప్రజలు సుభిక్షం

కూటమి ప్రభుత్వంపై ప్రజలకు సంతృప్తి, విశ్వాసం ఉన్నాయని ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లోని ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోని తేడాలను ప్రజలు గమనించారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించారన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణ, ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, తదితర అంశాలు అమలు చేశారన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చంద్రబాబు సమపాళ్లలో నడిపిస్తున్నారని ఆయన విజనరీతో రాష్ట్రం సుభిక్షంగా మారనుందని ప్రజలకు తెలిపారు. కాశినాయన మండలంలోని శంఖవరంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. **- న్యూస్‌టుడే బృందం**

డీటీగా రూపేష్ బాధ్యతల స్వీకరణ

మైలవరం, న్యూస్‌టుడే: మండల డిప్యూటీ తహసీల్దారు నూతన అధికారిగా రూపేష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన జమ్మలమడుగు ఆర్డీవో ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తూ డిప్యుటేషన్‌పై డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

జమ్మలమడుగులోని గూడుమస్తాన్ వలి దర్గా వద్ద చావిడిలో కొలువుదీరిన పీర్లు

దువ్వూరులో బంగారు పీరును ఊరేగిస్తున్న ప్రజలు

కొలువుదీరిన పీర్లు

మొహర్రం పండగ కాదు. ప్రజల కోసం, ప్రజాస్వామ్య పాలన కోసం ఇరాక్‌లోని కర్బల ప్రదేశంలో పది రోజులపాటు జరిగిన పవిత్ర యుద్ధంలో అమరులైన ఇమామ్ హసన్, ఇమామ్ హుసేన్ జ్ఞాపకార్థం స్మరించుకునే దుఃఖదినాలు. ఈ సందర్భంగా దర్గా చావిడిలో పీర్లు కొలువుదీరాయి. గురువారం సాయంత్రం పీర్లను ఆయా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఊరేగింపు చేశారు. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లను దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటున్నారు. **- న్యూస్‌టుడే బృందం**

ఇంజినీరింగ్ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం

రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడలు, వ్యాయామ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. రఘునాథరెడ్డికి రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయం నుంచి క్రీడలు, వ్యాయామ విభాగంలో 'ఎ స్టడీ ఆన్ స్పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఫెసిలిటీస్ ఇన్ సెలెక్టెడ్ నాన్ ప్రొఫెషనల్ కాలేజెస్ ఆఫ్ యోగివేమన విశ్వవిద్యాలయం' అనే అంశంపై డాక్టర్ ఎస్.గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, తదితర విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఆకట్టుకున్న మేలుకొలుపు నాటకం

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండలంలోని ముత్తులూరుపాడు గ్రామంలో గురువారం రాత్రి ఫ్యాక్షన్ కక్షలపై అవగాహన కల్పిస్తూ పోలీసులు మేలుకొలుపు నాటక ప్రదర్శన నిర్వహించారు. కళా బృందానికి నరసరామయ్య నేతృత్వం వహించారు. సీఐ మోహన్ మాట్లాడుతూ కత్తుల దారిన కాకుండ చట్టబద్ధంగా జీవించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

పాంచిన ప్రమాదం.. విద్యుత్తు సరఫరాకు అంతరాయం



కొక్కీలతో విద్యుత్తు తీగలకు ఇటుకరాళ్లు వేలాడదీత అకతాయిల పని అనుకుంటే పొరబడినట్లే ఖాజీపేట మండలం తువ్వ గ్రామం వద్ద పైభాగంలోని విద్యుత్తు తీగలు ఒకవైపు వెళ్తూ ఉండగా దిగువభాగంలోని తీగలు మరోవైపునకు వెళ్తున్నాయి. గాలులకు పైభాగంలోని తీగలు.. దిగువ తీగలు రాపిడికి గురికాకుండా.. అటుఇటూ ఊగకుండా తీగలకు కొక్కీలతో ఇటుకరాళ్లను వేలాడదీశారు. బలమైన గాలులకు ఇటుకరాయి కిందపడిపోతే బరువుతగ్గి తీగలు రాపిడికి గురై తెగిపోయే ప్రమాదం ఉంది. సరఫరాకు అంతరాయం కలగనుంది. సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. **- మైదుకూరు, న్యూస్‌టుడే**

ఎమ్మెల్యే వరద ఆరోగ్యంపై లోకేశ్ ఆరా

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వరదరాజులురెడ్డికి గుండె శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆసుపత్రి వైద్యులు, ఎమ్మెల్యే కుమారుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డితో చరవాణి ద్వారా మాట్లాడారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. కొండారెడ్డికి ధైర్యం చెప్పారు. ఐఏఎస్ అధికారిని ఆసుపత్రికి పంపి వైద్యసేవలపై తెలుసుకున్నారని కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే స్వగృహంలోకి వచ్చారని, ఆయన ఆరోగ్య పరిస్థితి బాగుందని చెప్పారు.

మహిళకు గాయాలు

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని లావనూరు గ్రామానికి కళావతి ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చొని తాడిపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రురాలిని తాడిపత్రిలోని ఆసుపత్రికి తరలించారు.

మైదుకూరులో పట్టపగలే చోరీ

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పట్టణం సర్వాయపల్లెరోడ్డులో గురువారం ఎం.జె.చిన్న సుబ్బారెడ్డికి చెందిన ఇంటిలో పట్టపగలే చోరీ జరిగింది. సుబ్బారెడ్డి పొలం వద్దకు వెళ్లగా ఆయన భార్య మునెమ్మ కూలీ పనులకు వెళ్లారు. రెండు గంటల వ్యవధిలో బీరువాలో దాచిన 15 తులాల బంగారం నగలు, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్లు యజమాని తెలిపారు. సీఐ కె.రమణారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెగ్‌మార్కింగ్ పరిధిలో నిర్మాణాలు చేపడితే చర్యలు

సమావేశంలో ఎర్రగుంట్ల తహసీల్దారు శోభన్‌బాబు, ఎన్‌హెచ్ ఏఈ విశ్వనాథ్

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే : కడప, ముద్దనూరు వయా ఎర్రగుంట్ల మీదుగా చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణానికి 380 ఎకరాలు భూసేకరణ చేస్తున్నట్లు ఎర్రగుంట్ల తహసీల్దారు శోభన్‌బాబు, ఎన్‌హెచ్ ఏఈ విశ్వనాథ్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. జాతీయ రహదారికి సంబంధించి ఎర్రగుంట్ల మండల పరిధిలో 195 ఎకరాలు భూసేకరిస్తున్నట్లు వివరించారు. భూసేకరణలో భాగంగా పెగ్ మార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కింగ్ ఏర్పాటు చేసిన ప్రాంతం అనధికారిక నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం ఎటువంటి నష్ట పరిహారం చెల్లించదని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.

పేదల బియ్యానికి ఎసరు / కార్డుదారుల ఇళ్ల వద్దే నేరుగా కొనుగోళ్లు

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

పేదల నోటికాడి బియ్యాన్ని మింగేందుకు గద్దలు నేరుగా ఇళ్ల వద్దకే వచ్చి వాలిపోతున్నాయి. బియ్యం కావాలంటే టోకన్ ఇస్తున్నారు. డబ్బులు కావాలంటే ఈ-పోస్‌లో అక్కడే వేలిముద్రలు తీసేసుకుంటున్నారు. ఈ దుస్థితి ప్రొద్దుటూరు పట్టణంలోని పలు వీధుల్లో గురువారం వెలుగుచూసింది. కేజీ రూ.11, రూ.13, రూ.17 లెక్కన పంపిణీ చేస్తున్నారు. కొందరు చౌకదుకాణాల డీలర్లు బియ్యంకు బదులు బహిరంగంగా డబ్బులను పంపిణీ చేస్తున్నారు. దస్తగిరిపేట, ఎల్ఐసి కార్యాలయం వెనుక ఉన్న కుబ్బామసీదు వీధి, హనుమాన్‌నగర్, ఇస్లాంపురంవీధి, పెన్నానగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న చౌకదుకాణాల పరిధిలోని వినియోగదారులకు నేరుగా డీలర్లు అనుయాయులను నియమించుకొని ఈ-పోస్‌మిషన్‌ను చేతపట్టుకొని వీధుల్లో తిరుగుతున్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యం బదులు డబ్బులు తీసుకోవాలని బహిరంగంగా చెబుతున్నారు. బియ్యం కావాలంటే టోకన్ ఇస్తామనడంతో వినియోగదారులు చౌకదుకాణం వద్దకు వెళితే బియ్యం ఇస్తారో లేదోనని కొందరు డబ్బులు తీసుకుంటున్నారు. కూలీనాలీ చేసుకునే పెన్నానగర్‌లో గత నెల బియ్యాన్ని పౌరసరఫరాలకు చెందిన అధికారులు పంపిణీ చేయక గదిలోనే మగ్గడంతో ఆ ప్రాంత వాసులకు చౌకబియ్యాన్ని కొనుగోలు చేయలేకపోయారు. ఈ నెలలో బియ్యానికి బదులు డబ్బులు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు చౌకదుకాణం వద్ద బియ్యం లేవని డబ్బులే తీసుకెళ్లాలని చెబుతున్నారు. కుబ్బామసీదు వీధిలో కిలో రూ.11 చొప్పున, దస్తగిరిపేటలో కిలో రూ.17ల చొప్పున ఇస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు గంగయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీని పంపించి చర్యలు తీసుకుంటానన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు ఫేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 83774 58888.

TO LET

COMMERCIAL

కడప పాతబస్టాండు YMB ఎన్‌క్లేవ్, Big C పైన, 1st ఫ్లోర్, 3000 చ॥అ॥ గల బిల్డింగ్ (స్ట్రాంగ్‌రూం) బ్యాంకులకు, హాస్పిటల్స్‌కు, ఆఫీసులకు బాడుగకు కలదు. Contact: 9701824212.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626, 8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్, కడప నందు పనిచేయుటకు X-RAY & C-ARM టెక్నీషియన్స్ కావలెను. Contact: 98490 40153.

SBI లైఫ్ కడప బ్రాంచ్ నందు అడ్వైజర్‌గా మరియు సేల్స్ ఆఫీసర్ ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆ పైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్ర: 9491111140.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

కమిషనర్‌తో 'వాక్-విత్ ఈనాడు' నేడు

కమిషనర్, శేషఫణి

ఎర్రగుంట్ల పురపాలక సంఘ కమిషనర్ శేషఫణి పట్టణంలోని 3వ వార్డు సుందరయ్య నగర్‌లో శుక్రవారం పర్యటించనున్నారు. పట్టణ సమస్యలపై 'న్యూస్‌టుడే' వార్డు పరిశీలనలో భాగంగా కమిషనర్ పర్యటించి ప్రజలతో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా మురుగు కాలువల్లో పూడికతీత పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వెలగకపోవడం, ఇంటింటి చెత్తసేకరణ, రోడ్లు తదితర సమస్యలను మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయవచ్చు. - న్యూస్‌టుడే, ఎర్రగుంట్ల

తేదీ : శుక్రవారం 04-07-2025 | సమయం : ఉదయం 7.00 గంటలకు ప్రారంభం

ఉద్యోగ మేళాకు అనూహ్య స్పందన

మేళాకు హాజరైన విద్యార్థులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన ఉద్యోగమేళాకు అనూహ్య స్పందన లభించిందని ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ తెలిపారు. గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు జమ్మలమడుగు, మైలవరం, తొండూరు, ఎర్రగుంట్ల ఐటీఐల నుంచి 250 మంది విద్యార్థులు హాజరుకాగా అందరికీ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో తొండూరు ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

ఎమ్మెల్యేను కలిసిన ఐటీడీపీ నాయకులు

ఖాజీపేట, న్యూస్‌టుడే: మైదుకూరు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడిగా ఖాజీపేట మండలం పాటిమీదపల్లెకు చెందిన తుట్టే రాము యాదవ్ నియమితులయ్యారు. ఖాజీపేట మండల అధ్యక్షుడిగా మిడుతూరు గ్రామానికి చెందిన చిత్రాల ఏసుపాదం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిశారు. పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లి టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని నేతలు తెలిపారు.

ప్రజల చెంతకు విజ్ఞాన శాస్త్ర ఫలాలు

ప్రసంగిస్తున్న జన విజ్ఞాన వేదిక జాతీయ సలహా మండలి ప్రతినిధి మహ్మద్‌మియా

మైదుకూరు, న్యూస్‌టుడే : సామాన్య ప్రజలకు శాస్త్ర విజ్ఞాన ఫలాలను చేర్చినపుడే మూఢనమ్మకాల నుంచి బయటపడతారని జన విజ్ఞాన వేదిక జాతీయ సలహా మండలి ప్రతినిధి మహ్మద్‌మియ్యా అన్నారు. గురువారం మైదుకూరు పట్టణం మేధా డిఫెన్స్ అకాడమీలో జనవిజ్ఞానవేదిక జిల్లా మహాసభకు జిల్లా అధ్యక్షురాలు బీఎల్ లక్ష్మీపార్వతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ మూఢనమ్మకాల బారినపడి ప్రజలు చాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, శాస్త్రీయ ధృక్పథం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు ఏవీ.రమణయ్య, బి.రామకృష్ణారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సాంబశివరావు, కర్నూలుకు చెందిన ప్రతినిధులు మంజూరుబాషా, ధనుంజయ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా విశ్రాంత ప్రిన్సిపల్ బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముత్తరాయపల్లె ఉపాధ్యాయుడు జీఆర్ మల్లేశ్వరరెడ్డిని ఎన్నుకున్నారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్యసేవలపై ఆరా

ఆసుపత్రి పరిశీలనకు వెళ్తున్న డీసీహెచ్ఎస్ హిమదేవి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిని గురువారం డీసీహెచ్ఎస్ హిమదేవి పరిశీలించారు. అత్యవసర విభాగం, ఓపీ, సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్, ఎక్స్-రే, ల్యాబ్ తదితర విభాగాలు పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై సిబ్బందితో చర్చించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మెరుగైన సేవలందేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమెతోపాటు ఆర్ఎంవో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.







(c) eenadu

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలోని కోటిరెడ్డి కూడలి వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయసు 40-45 ఏళ్ల మధ్యలో ఉంటాయన్నారు. అతిగా మద్యం తాగడంతో మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు ...

గంగరాజు (పాత చిత్రం)

వేంపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని తాళ్లపల్లె-దుగ్గన్నగారిపల్లె మధ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముసల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన బాసం గంగరాజు (50) మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వేముల మండలం దుగ్గన్నగారిపల్లెకు చెందిన శివానందరెడ్డి, ముసల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన గంగరాజు తాళ్లపల్లెలో పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా పులివెందుల నుంచి వెళ్తున్న ట్రాక్టర్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో గంగరాజు అక్కడికక్కడే మృతి చెందగా, శివానందరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను మెరుగైన వైద్యం కోసం కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వన రక్షకుడిపై ఎలుగుబంటి దాడి

గాయపడిన వెంకటయ్య

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని దాసర్ల దొడ్డి అటవీ బీటు జలరేవులకోన కాటమయ్య గుండం సమీపంలో విధులు నిర్వహిస్తున్న వన రక్షకుడు వెంకటయ్యపై గురువారం ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. పత్రపల్లికి చెందిన వెంకటయ్య అటవీ ప్రాంతంలోని బేస్‌క్యాంపులో పని చేస్తున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా గురువారం అడవిలో గాలింపు చేస్తుండగా ముళ్లపొదల నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి ఆయనపైకి దూసుకొచ్చి దాడి చేసింది. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో వన సంరక్షకులు అక్కడికి చేరుకొని ఎలుగుబంటిని అక్కడి నుంచి తరిమేశారు. క్షతగాత్రుడిని ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వెంకటయ్యను జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్, ఎఫ్ఆర్వో బాలసుబ్రహ్మణ్యం పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

సమస్యలు తెలుసుకున్నాం... విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో డీఈవో షంషుద్దీన్

ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్, పక్కన కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, డీఈవో కార్యాలయ ఏడీ (సర్వీసెస్) రామకృష్ణ, ఏడీ (స్కీమ్స్) అనిల్‌కుమార్

ఈనాడు మీతోడు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో విద్యాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేలా త్వరలోనే సర్దుబాటు ప్రక్రియ చేపడతామని, జిల్లా సమగ్రశిక్ష ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదనలతో పాఠశాలల్లో వసతుల కల్పనలో కృషి చేస్తున్నామన్నారు. కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం ఈనాడు మీతోడు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ఆయన పాల్గొని విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

?: గౌస్‌నగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని తరగతులు ఒకే ఆవరణలో ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. ఐదు తరగతి గదుల కొరత వేధిస్తోంది. **- పఠాన్, ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, కడప**

?: బద్వేలు గూడెం ఎంపీపీ పాఠశాలలో 38 మంది విద్యార్థులు ఉండగా ఒకే ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. **- తిరుపాల్‌రెడ్డి, బద్వేలు**

?: మోరగుడి, ఈడిగపేట ప్రాంతాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు లేరు. **- చౌడయ్య, జమ్మలమడుగు**

?: ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం ప్రాథమిక పాఠశాలలో 159 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. **- సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు**

?: వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో 71 మంది విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఇటీవల ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించినా వారు రాలేదు. **- మునెయ్య**

✓: విద్యార్థుల సంఖ్య ఆధారంగా త్వరలోనే ఉపాధ్యాయుల కొరత తీర్చేలా చర్యలు తీసుకుంటాం.

?: ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలను చిన్నచిన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేవు. అనుమతులు లేకపోయినా నిర్వహణ కొనసాగిస్తున్నారు. **- అంకయ్య, కడప**

✓: దీనిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నేను స్వయంగా పరిశీలన చేసిన సమయంలోనూ పలు సమస్యలను గుర్తించాను. ఈ సమస్యపై విచారించి ఆయా పాఠశాలల అనుమతులు రద్దు చేస్తాం. ఎలాంటి చర్యలు తీసుకున్నామో ఫిర్యాదుదారుడికి తెలిసేలా జవాబిస్తాం.

?: కడప నగరంలోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో బదిలీలకు ముందు 19 మంది ఉపాధ్యాయులు ఉండగా ప్రస్తుతం 9 మంది వచ్చారు. నిర్వహణ కష్టతరమవుతోంది. దీంతో పనిభారం ఎక్కువవుతోంది. **- విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు**

✓: సమస్యను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తాం.

?: వీరపునాయునిపల్లె మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలగా ఉంది. గతంలో ఏడో తరగతి వరకు ప్రాథమికోన్నత పాఠశాలగా ఉండేది. ప్రస్తుతం మరో పాఠశాలలో 1, 2 తరగతులను నిర్వహించేలా విభజించారు. ఆ రెండు పాఠశాలలను కలిపితే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. **- భార్గవ్**

✓: ఎంఈవోను పంపించి విచారణ చేయిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

?: దువ్వూరు మండలం పెద్దజొన్నవరం పాఠశాలలో 68 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. **- రామచంద్రారెడ్డి, విశ్రాంత అధికారి**

✓: త్వరలోనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం.

?: రాజంపేట మండల పరిధి శేషమాంబపురం పాఠశాలలో ఏకోపాధ్యాయునిగా విధులు నిర్వర్తించాను. ఇటీవల ఒంటిమిట్టకు బదిలీ అయ్యాను. రిలీవ్ కాకపోవడంతో మళ్లీ పాత పాఠశాలకే వచ్చాను. **- నాగప్రసన్న**

✓: వెంటనే రిలీవ్ అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

?: కడప నగరంలోని పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించలేదు. **- బేబీ, కడప**

✓: ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమిస్తాం.

?: పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, కాపలాదారులకు మార్చి నెల నుంచి జీతాలు చెల్లించలేదు. దీంతో కుటుంబ పోషణ జరగక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. **- బాదుల్లా, కడప**

✓: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు త్వరలోనే విడుదల చేసి జీతాలు చెల్లిస్తాం.

?: మైదుకూరు మండలం డాంకన్ పల్లిలోని పాఠశాలలో 59 మంది విద్యార్థులకు ఒక తరగతి గది మాత్రమే ఉంది. దీంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- నాగజ్యోతి, నసీమున్, బీబీ**

✓: సమగ్రశిక్ష ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లి మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకుంటాం.

?: ప్రొద్దుటూరు మండల పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో పలువురు విద్యార్థులు పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్తున్న సమయంలో కుక్కలపై రాళ్లు వేస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. **- నారాయణశ్రీ**

✓: విద్యార్థులకు సామాజిక, నీతికథల అంశాలకు సంబంధించిన పాఠాలు బోధించేలా ఉపాధ్యాయులకు వివరిస్తాం.

?: లింగాల మండలం ఇప్పట్ల ఎస్సీ కాలనీలో 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాల ఉండేది. ప్రస్తుతం 1, 2 తరగతులను విభజించారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- అమర్**

✓: పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తాం. క్షేత్రస్థాయిలో ఎంఈవోతో విచారణ జరిపిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

చెక్కులు చూపుతున్న లబ్ధిదారులు, చిత్రంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని తన నివాసంలో సీఎం సహాయ నిధి నుంచి కడప నియోజకవర్గానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మాధవితో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యల్లో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటేనే గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని డీపీవో గండికోట రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. కడప జడ్పీలోని డీపీఆర్‌సీ భవన్‌లో మహిళా సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్థానిక పాలనలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే స్థాయిలో మహిళలు నాయకత్వ లక్షణాలు బలపరచుకోవాలన్నారు. ఈ శిక్షణలో మహిళ ప్రజాప్రతినిధుల హక్కులు, బాధ్యతలపై అవగాహన, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, నాయకత్వ నైపుణ్యాల పెంపు తదితరాలపై శిక్షణ ఉంటుందన్నారు. కడప డీఎల్‌పీవో విజయభాస్కర్, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ రమణారెడ్డి, డీపీఆర్‌సీ పరిపాలనాధికారి నాగభూషణం, ఫ్యాకల్టీ సురేష్‌కుమార్, శిక్షకులు శివారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, గంగులయ్య, నరసింహులు, సుబ్బరాయుడు, విజయ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

టెండర్ నోటీస్
శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము, పాలతల
గంగనపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం, కడప జిల్లా

ఒక సంవత్సరం కాలం పాటు లడ్డు ప్రసాదము, అన్నదానము సరుకులు కొరకు

కడప జిల్లా, పెండ్లిమర్రి మండలం, గంగనపల్లి గ్రామంలో శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం, పాలతలకు సంబంధించిన తేదీ : 01.07.2025 నుండి 30.06.2026 వరకు అనగా ఒక సంవత్సరం కాలం పాటు లడ్డు ప్రసాదం సరుకులు, అన్నదానము ముడి సరుకులు సరఫరా చేయుటకు గాను టెండర్లు పిలవడం జరుగుచున్నది. ఆసక్తి కలిగిన వారు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, కడప టౌన్ బ్రాహ్మణ వీధి, డోర్ నెం : 5/202 నందు 04.07.2025 నుండి తేదీ : 06.07.2025 తేదీలోగా షెడ్యూల్ పొంది తేదీ : 08.07.2025 సాయంత్రం ఐదు గంటల లోపల కడప కార్యాలయంలో ఉంచిన టెండర్ బాక్స్ నందు సీల్డ్ కొటేషన్ వేయవలెను. అదే రోజు సాయంత్రం 5.30 గం॥ టెండర్‌దారుల సమక్షములో టెండర్ బాక్స్ తెరువబడును.

ఇట్లు : **యం.కృష్ణ నాయక్,** గ్రేడ్-I కార్యనిర్వహణాధికారి

శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము, పాలతల
గంగనపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం, కడప జిల్లా.

బహిరంగ వేలం ప్రకటన

సదరు దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింద తెలిపిన హక్కునకు తేదీ : 09-07-2025న బుధవారం ఉదయం 11 గంటలకు సదరు దేవస్థానం నందు ఇ-టెండర్ కం-సీల్డ్ కొటేషన్ కం-బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	నిలువ ఉంచిన కాలం	డిపాజిట్	
1.	సేకరించి నిలువ ఉంచిన తలనీలాలు పొందు హక్కునకు	10/2022 నుండి 01/2023 మరియు 11/2024 నుండి 31/2025 వరకు	1,00,000/-	ఇ-టెండర్ కం-సీల్డ్ కొటేషన్ కం-బహిరంగ వేలం

పాట పూర్తి అయిన వెంటనే హెచ్చు పాట మొత్తం చెల్లించవలెను. ఇతర షరతులు బహిరంగ వేలం నందు తెలుపబడును.

ఇట్లు : **యం.కృష్ణ నాయక్,** గ్రేడ్-I కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్,
కడప నగరం, కడప జిల్లా

ఖాళీ స్థలములు లీజు లైసెన్స్ హక్కునకు ఇ-టెండర్ మరియు సీల్డు టెండర్ (కం) బహిరంగ వేలం ప్రకటన

కడప నగరంలో నాగరాజుపల్లె (పాత బస్టాండ్ ప్రక్కన) వున్న శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప నగరంలో నాగరాజుపల్లె సర్వే నెంబరు 5లో గల 2 (రెండు) ప్లాట్స్ 1. ప్లాట్-A విస్తీర్ణం : (37.09 సెంట్స్ / 1,795 Sq.Yards), 2. ప్లాట్-B విస్తీర్ణం: (38.22 సెంట్స్ / 1,850 Sq.Yards). ఖాళీ స్థలములు 11 సంవత్సరముల కాలపరిమితి లీజు హక్కులను పొందుటకు షెడ్యూలు ప్రకారము ఇ-టెండరు, సీల్డు టెండరు (కం) బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ టెండర్ దాఖలు చేయుటకు ఆఖరు తేదీ: **17.07.2025 ఉదయం గం॥ 10.00లకు.** మరిన్ని వివరములకు **www.eprocurement.gov.in** ను సందర్శించగలరు. సీల్డు టెండర్లు సోమ. 14.07.2025 ఉదయం గం॥ 10.00 నుండి బుధ. 16.07.2025 సాయంత్రం గం॥ 5.00 లోపల ప్రతి షెడ్యూలుకు రూ.5,000.00 చెల్లించి శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ ఆఫీసు నందు 2 (రెండు) ప్లాట్స్‌కు వేరు వేరు దరఖాస్తు ఫారాలు పొందగలరు. పూర్తిచేసిన సీల్డు టెండరు గురు. 17.07.2025 ఉదయం గం॥ 10.00లకు సదరు ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము వద్ద టెండరు బాక్సు నందు వేయవలెను. బహిరంగ వేలము గురు. తేదీ: 17.07.2025 ఉదయం గం॥ 10.00లకు శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము నందు జరుగును. ఇతర వివరములకు సెల్ : +91 83318 90511 ను సంప్రదించగలరు.

వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు మరియు సెక్రటరీ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప.
ఆఫీస్ అడ్రసు : ఫ్లాట్ నెం. 301, 3rd ఫ్లోర్, డోర్ నెం. 20/999-9-3-5, జొన్నలగడ్డ హైట్స్, కో-ఆపరేటివ్ కాలనీ, Near ACB Office, కడప - 516001.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు వినతి

కలెక్టరు శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూల నాగరాజు, చిత్రంలో ఈడీ చంద్రశేఖర్

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి పిల్లలకు కారుణ్య నియామకాలు ద్వారా ఉద్యోగాలు కల్పించాలని కడప ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు గురువారం కలెక్టరు శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం కంత్రీలకు కళ్లెం

✦ భూముల స్వాధీనానికి చర్యలు

స్పందనకు వందనం

ఈనాడు, కడప : కమలాపురం కంత్రీలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మండలంలోని తురకపల్లె, ఎర్రంగుంట్ల మండలం టి.సుంకేశుల రెవెన్యూ గ్రామ పరిధిలోని కొండగుట్ట భూములను గురువారం పరిశీలించారు. వైకాపా నేత లింగాల రాజశేఖర్‌రెడ్డి, ఆయన సోదరుడు బాల గంగిరెడ్డి కలిసి ఆక్రమించి ఉద్యాన పంటలు సాగు చేస్తున్న భూములను సర్వే చేశారు. ఈ మేరకు 'ఈనాడు'లో బుధవారం 'కమలాపురంలో కంత్రీలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై కమలాపురం తహసీల్దార్ శివరామిరెడ్డి స్పందించి క్షేత్ర పరిశీలన చేశారు. ఆక్రమిత భూములు ప్రభుత్వానికి చెందినవిగా సర్వేలో తేలడంతో శుక్రవారం భూముల్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

డీఈవోను బదిలీ చేయొద్దని డిమాండ్

మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌ను బదిలీ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమర్థవంతమైన పాలనతో విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాలను పాఠశాల స్థాయిలో అమలుపరిచే సమర్థవంతమైన అధికారిని బదిలీ చేస్తున్నారనే వార్తలు రావడం శోచనీయమన్నారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, నాయకులు నంద్యాల రాజగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆలమూరు ప్రసాద్, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

చేనేత విద్యలో ప్రవేశానికి దరఖాస్తులు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ విద్యలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి పిచ్చేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య స్మారక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ విద్యాసంస్థలో విద్యనభ్యసించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మార్కుల ఆధారంగా, ఇంటర్‌లో ఎంపీసీ, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతం

శ్రీకాకుళం క్యాంపస్ ప్రవేశాల కోసం టేబుళ్ల వద్ద విద్యార్థులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే : ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరేందుకు రెండో రోజు ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, ఎవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జులై 4, 5 తేదీల్లో నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌ల ప్రవేశాల ప్రక్రియను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ పేర్కొన్నారు.

రసాయన రహిత సాగు లాభదాయకం

చింతరాజుపల్లెలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : రసాయన రహిత సాగు విధానాలు అనుసరిస్తే మంచి లాభాలు పొందొచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, శిల్పకళ పేర్కొన్నారు. మండలంలోని చింతరాజుపల్లె రైతు సేవా కేంద్రంలో కేవీకే ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. భూమిలో సారం పెరగాలంటే సేంద్రియ, జీవన, వానపాములతో తయారు చేసిన ఎరువులను వాడాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్ల సాగు చేసుకోవాలని వివరించారు. బొప్పాయి, నిమ్మ పంటలను పరిశీలించి అన్నదాతలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. శాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా

శిశు గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప న్యాయవిభాగం : కడప నగరం కొండాయపల్లెలోని శిశు గృహాన్ని సీనియర్ జడ్జి బాబా ఫకృద్దీన్ గురువారం తనిఖీ చేశారు. శిశుగృహంలోని పిల్లల వివరాలతో పాటు వారికి అందుతున్న సదుపాయాలను ఆరా తీశారు. పిల్లల ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. 2024లో బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయసేవల పథకం అమలులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : ధరలు లేక తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి కాయలు కొనేవారు లేక గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇదేనా సుపరిపాలన అని ప్రశ్నించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందని, సుపరిపాలనకు తొలి అడుగు అంటూ ప్రచారం చేసుకుంటోందని ప్రశ్నించారు.

ఒరిగింది... కూలిందో అంతే!

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లె మండలంలోని టి.వెలమవారిపల్లె పొలాల్లో విద్యుత్తు స్తంభం ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉండడంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి అవసరాల కోసం విద్యుత్తు శాఖ అధికారులు చాలా ఏళ్ల కిందట విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. అందులో ఓ విద్యుత్తు స్తంభం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏడీఈ నాగేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా విద్యుత్తు స్తంభానికి మరమ్మతులు చేయిస్తామన్నారు.

తొలగిన గుర్రపు డెక్క... ఇక సాగు పక్కా!

కేసీ కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క (పాతచిత్రం)

స్పందనకు వందనం

సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరందించే కేసీ కాలువలో పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో నీరు సక్రమంగా ప్రవహించేది కాదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ అంశంపై ఇటీవల ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో కిరణ్‌మోహన్ కాలువ పొడవునా కిలోమీటర్ల మేర ఉన్న గుర్రపుడెక్కను తొలగించేందుకు ఉపాధి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో కూలీలు కాలువను శుభ్రం చేశారు. **- న్యూస్‌టుడే, చెన్నూరు**

పిచ్చి మొక్కలు తొలగించిన తర్వాత ఇలా..

కేసీ కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను అధికారులు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కేసీ ఉప కాలువ నుంచి చెన్నూరు మీదుగా ఓబులంపల్లె, గుర్రంపాడు, చెన్నూరు, ముండ్లపల్లె, తదితర గ్రామాల్లోని

7న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 7 నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి సమాచారం అందింది. ఈ నెల 7న మధ్యాహ్నం 12.35కు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి పార్టీ జిల్లా కార్యాలయానికి వచ్చి సాయంత్రం ఇడుపులపాయకు చేరుకుంటారు. 8న వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తారని పీసీసీ పరిపాలన, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కడప చెస్ క్రీడాకారుడికి ఫిడే రేటింగ్

మహమ్మద్ రిహాన్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరానికి చెందిన మహమ్మద్ రిహాన్‌కు అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ లభించింది. జూన్‌లో బెంగళూరులో జరిగిన ఫిడే ర్యాపిడ్ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో 2 రేటెడ్ పాయింట్లు ఇతను సాధించాడు. రేటెడ్ ప్లేయర్స్‌తో ఒక గేమ్ గెలిచి, మరో రెండు గేమ్స్‌ను డ్రా చేసుకోవడంతో 1,500 ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారు.

వైవీయూ అధికారుల తీరుపై అసంతృప్తి

కడప విద్య, న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయం (యోవేవి) పరిధిలో తరగతులు నిర్వహించకున్నా బీఈడ్, లా పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ ఆరోపించారు. స్థానిక ఆర్ఎస్ఎఫ్ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యోవేవి అధికారులు హైపవర్ కమిటీతో బీఈడ్, లా పరీక్షలు పర్యవేక్షిస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొన్ని బీఈడ్, లా కళాశాలలు విశ్వవిద్యాలయ రికార్డుల్లో మాత్రమే ఉన్నాయని, మరికొన్నింటికి ఎలాంటి వసతులు లేకుండా నిర్వహణ సాగిస్తున్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు సిద్దిక్, సల్మాన్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

పులివెందుల, న్యూస్‌టుడే : సదరం స్లాట్ బుకింగ్‌ను శుక్రవారం ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అర్హులైన దివ్యాంగులు మీ సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో దివ్యాంగ ధ్రువీకరణ పత్రం కోసం సదరం స్లాట్‌లను విడుదల చేస్తుండడంతో అర్హులైన వారు ఆయా కార్యాలయాల్లో అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి సూచించారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయవాడ గన్నవరం దగ్గర NH-16 హైవేని ఆనుకుని 60 అ॥ రోడ్డు తూర్పు పేసింగ్ ఒక్కొక్క ఫ్లోరు 2000 Sq.Ft.తో 466 చ॥గ॥లలో G+3 Triplex బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 88774 58888.

TO LET

COMMERCIAL

కడప పాతబస్టాండు YMB ఎన్‌క్లేవ్, Big C పైన, 1st ఫ్లోర్, 3000 చ॥అ॥ గల బిల్డింగ్ (స్ట్రాంగ్‌రూం) బ్యాంకులకు, హాస్పిటల్స్‌కు, ఆఫీసులకు బాడుగకు కలదు. Contact: 9701824212.

JOBS

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్, కడప నందు పనిచేయుటకు X-RAY & C-ARM టెక్నీషియన్స్ కావలెను. Contact: 98490 40153.

SBI లైఫ్ కడప బ్రాంచ్ నందు అడ్వైజర్‌గా మరియు సేల్స్ ఆఫీసర్ ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆ పైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్ర: 9491111140.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వినతి

కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ముస్లిం ఐకాస నాయకులు

జిల్లా సచివాలయం: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వక్ఫ్ పరిరక్షణ ఐకాస కన్వీనర్ బాబుబాయ్ డిమాండ్ చేశారు. గురువారం కడప ముస్లిం ఐకాస నాయకులు కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్‌కు వినతి పత్రం అందజేసి పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేందుకు ఆలిండియా ముస్లిం లా బోర్డు దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమైందన్నారు. నగర అధ్యక్షుడు మౌలానా జాకీర్‌హుసేన్, ఐకాస నాయకులు సలావుద్దీన్, షబ్బీర్, అన్వర్, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం

పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కమలాపురం, న్యూస్‌టుడే : మండలంలోని కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, పెద్ద చెప్పలి, చిన్నచెప్పలి తదితర గ్రామాల్లో గురువారం మొహరంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074741832
పులివెందుల: 8008573466
కమలాపురం: 8008573475

?: పులివెందులలోని యర్రగుడిపల్లెకు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగక అంధకారం అలముకుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - **వీరయ్య, స్థానికుడు**

✓: సిబ్బందిని పంపించి వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తాం. - **రాముడు, పురపాలక కమిషనర్, పులివెందుల**

?: వేంపల్లె బొమ్మరాజువీధి సర్కిల్, తిరుమల థియేటర్ శుద్ధి నీటికేంద్రం పక్కనే చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **సుబ్బరాయుడు, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య సిబ్బందితో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **మాధవరెడ్డి, వేంపల్లె గ్రామపంచాయతీ ఈవో**

?: వేంపల్లె గండిరోడ్డులోని మసీదు కేంద్రం వద్ద కాలువ పొంగి మురుగు రోడ్డుపైకి వచ్చింది. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - **బాలాజీ, గ్రామస్థుడు**

✓: కార్మికులతో రోడ్డుపై ప్రవహించే మురుగునీటికి అడ్డుకట్ట వేయిస్తాం. - **మాధవరెడ్డి, వేంపల్లె గ్రామపంచాయతీ ఈవో**

- న్యూస్‌టుడే, వేంపల్లె

సమస్యలు చూశారు... పరిష్కరించారు

వాక్ విత్ ఈనాడులో పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు

బోలెవార్డులో నిలిచిన నీటిని కమిషనర్ రాముడుకు చూపుతున్న స్థానికులు

పులివెందుల, న్యూస్‌టుడే : 'మీ వార్డులో నీటి సరఫరా బాగా జరుగుతోందా.. చెత్తను ఎప్పుడెప్పుడు శుభ్రం చేస్తున్నారు.. ఇందులో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. కాలువల్లో మురుగు సక్రమంగా వెళుతోందా' అంటూ పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు పులివెందులలోని 12వ వార్డు సచివాలయ ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గురువారం 'వాక్ విత్ ఈనాడు' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ రాముడు 12వ వార్డు సచివాలయం పరిధిలోని అంకాళమ్మపేట, సాయినగర్, గంటమస్తాన్ వీధి, బోలెవార్డు, మారుతీ థియేటర్ రోడ్డు, శ్రీరామ థియేటర్ కూడలి ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి వీధికి వెళ్లి అక్కడి పరిసరాలను పరిశీలిస్తూ పలు సమస్యలను గుర్తించారు. వెంటనే పురపాలక, సచివాలయ సిబ్బందికి తెలియజేస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

ఈనాడు తోడు

వార్డుల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన 'వాక్ విత్ ఈనాడు' కార్యక్రమంలో పాల్గొన్నానని కమిషనర్ తెలిపారు. దోమల నివారణ, పరిసరాల శుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పురపాలక మేనేజరు మునికుమార్, అంకాళమ్మపేట సచివాలయ సిబ్బంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, నీటి సరఫరా సిబ్బంది, విద్యుత్తు లైన్‌మెన్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

★ గంట మస్తాన్ వీధిలో అంజలి అనే మహిళ మురుగు నీరు సక్రమంగా వెళ్లడం లేదని, ఛాంబర్‌లు జామ్ అయ్యాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పనులు చేయించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు.

★ అంకాళమ్మపేటలో వర్షం కురిస్తే మురుగు నీరు ఇళ్లల్లోకి వస్తోందని స్థానికులు దస్తగిరమ్మ, అల్లాబకాష్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతంలో ఛాంబర్లు సరిగ్గా లేనిచోట కొత్త ఛాంబర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

★ నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని, సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆయనకు తెలపగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

★ సాయినగర్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు ఆయనకు చెప్పడంతో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని వివరించారు.

★ బోలె వార్డులోని రోడ్డుపై తరచూ నీరు నిలుస్తోందని మురళీ అనే వ్యక్తి తెలపగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ జావెద్ సూచించారు. నగరంలోని చైతన్య జూనియర్ కళాశాల, గాంధీనగర్ మున్సిపల్ కళాశాలలో గురువారం రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపడంతోనే ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని సూచించారు.

మంత్రి ఆదేశాలతో విద్యార్థులకు బస్సు సౌకర్యం

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లోని జడ్పీ పాఠశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని కడప డిపో మేనేజరు దిలేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతిరోజు 20 మందికి తక్కువ లేకుండా విద్యార్థులు ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. సిద్దవటం మండలంలోని నేకనాపురం మార్గాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు నేకనాపురం గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు కడప నుంచి బస్సు బయలుదేరి భాకరాపేట మీదుగా నేకనాపురం చేరుతుందని వివరించారు. రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లకంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉందని వివరించారు.

కోవరగుంటపల్లె... సమస్యల ముల్లే

అధ్వానంగా చెత్త నిల్వ తొట్టెలు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : మండల పరిధి కోవరగుంటపల్లె సమస్యలకు నిలయంగా మారింది. చెత్తసేకరణ సక్రమంగా జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తసేకరణ కేంద్రం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయి అధ్వానంగా మారింది. ప్రధాన దారుల్లో ముళ్లపొదలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇదే మార్గంలో మురుగు చేరడంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని కొన్ని ప్రాంతాలకు సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదు. జడ్పీ, ప్రాథమిక పాఠశాలలో శుద్ధిజలం అందించడం లేదు. ఈ సమస్యలపై ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సిబ్బందిని పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

6న వేంపల్లెలో ఉద్యోగ మేళా

మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రామమునిరెడ్డి

వేంపల్లె, న్యూస్‌టుడే : గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సింగారెడ్డి రామమునిరెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6న వేంపల్లెలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 6న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముఖాముఖి ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులై 19 నుంచి 32 ఏళ్ల లోపు వారు మేళాలో పాల్గొనవచ్చన్నారు. తెదేపా మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్, డక్కా రమేష్, తెదేపా నాయకులు నామా వేమకుమార్, మడకా శ్రీనివాసులు, ఇడుపులపాయ చంద్రాయుడు, శివ, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

లింగాల, న్యూస్‌టుడే : ఇప్పట్ల ప్రతిభ బాలయోగి జూనియర్ కళాశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా యల్లనూరు మండలం దంతలపల్లెకు చెందిన లోక్‌నాథ్ తీవ్రంగా గాయపడ్డారు. పులివెందులలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్న లోక్‌నాథ్ స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై పులివెందులకు వెళుతుండగా ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ తరలించామని పోలీసులు తెలిపారు.

44 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు, న్యూస్‌టుడే : మండల పరిధి గోపవరం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 44 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెండ్లిమర్రికి చెందిన ఓ మహిళ చెన్నూరు, తదితర ప్రాంతాల్లో స్థానికుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి గోపవరం వద్ద నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి రేషన్ బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. ఓంశాంతినగర్‌కు చెందిన విద్యార్థి ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఈ నెల 1న కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పదమూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కమలాపురం, న్యూస్‌టుడే : మండల పరిధి చెన్నంపల్లె సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

కొండపేటలో జూదరుల అరెస్టు

చెన్నూరు, న్యూస్‌టుడే : కొండపేట సమీపంలోని వంతెన వద్ద గురువారం జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు దాడులు నిర్వహించిన నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

కంచెకు నిప్పు పెట్టారని ఫిర్యాదు

ఒంటిమిట్ట: రాచగుడిపల్లె బీసీ కాలనీలో తమ అనుభవంలో ఉన్న భూమిలో మామిడి మొక్కలు నాటుకున్నామని, పంటకు రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న కంచెకు ప్రత్యర్థులు నిప్పు పెట్టి కాల్చేశారని ముద్దిన స్వరూప అనే మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేడి కారణంగా మామిడి మొక్కలు ఎండిపోయాయని పేర్కొన్నారు. విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బస్టాండ్‌కెళ్లే దారేది?

అనధికారికంగా రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

బస్టాండులోకి వెళ్లే మార్గంలో రహదారిపై నిలిచిన మురుగు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండులో అసౌకర్యాలు తిష్ట వేశాయి. అడుగడుగునా ప్రయాణికులు అవస్థలు పడుతూనే ఉన్నారు. జిల్లా స్థాయి, డిపో స్థాయి అధికారులున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. బస్టాండు ప్రాంగణంలో అనధికారికంగా ప్రతి రోజూ కొన్ని వందల సంఖ్యలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వీటిలో చాలా మంది వాహనాలను పార్కింగ్ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అక్కడ రెండు పార్కింగ్ స్థలాలున్నప్పటికీ బస్టాండు ప్రాంగణంలోనే పార్కింగ్ చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే రూ.15 నుంచి రూ.20 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చాలా మంది తమ వాహనాలను ప్రాంగణంలోనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్యగా మారుతోంది.

★ బస్టాండులోకి వెళ్లే దారిలోకి మురుగునీరు చేరుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు ఉండడంతో ఓ పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్నారు. అక్కడే ఉన్న హోటల్ మురుగునీరు ఆటో పార్కింగ్ స్థలం వద్దకు చేరుతోంది. మురుగు కారణంగా దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్థల ఆక్రమణలపై చర్యలకు వినతి

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని ఉప్పరపల్లెలో స్థల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని తహసీల్దారు తిరుమలబాబును ఉప్పరపల్లెకు చెందిన తెదేపా రాజంపేట నియోజకవర్గం బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ కోరారు. సిద్దవటంలోని రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. శేఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం ఉప్పరపల్లెలో సర్వే సంఖ్య 424/1, 424/2లోని ప్రభుత్వ భూమిలో కొందరు బినామీ పేర్లతో నకిలీ పత్రాలు తయారు చేయించుకుని స్థల ఆక్రమణలు కొనసాగిస్తున్నారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్టలోని మారెమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ భూమిని తహసీల్దారు దామోదర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఓ వర్గం ఫిర్యాదు చేయగా, మరో వర్గం వారు ఆలయ స్థలమంటూ కంచె ఏర్పాటు చేశారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయి. ఆర్ఎస్ఆర్ రికార్డుల ప్రకారం సర్వే సంఖ్య 1509లో 98 సెంట్లు ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. అందులోనే ఆలయాన్ని నిర్మించారు. ఈ విషయమై వారం రోజుల కిందట సర్వే చేయించారు. ప్రభుత్వ స్థలంలో కొంతమేర కంచె వేసినట్లు గుర్తించారు. కొందరు సొంత ఆస్తిలా భవనాలు నిర్మించినట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో నిజాలు తేల్చేందుకు తహసీల్దారు ప్రభుత్వ భూమి వద్దకు వచ్చి పరిశీలించారు. ఇరు వర్గాలతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

డెంగీ నివారణపై అవగాహన

సిద్దవటం, న్యూస్‌టుడే : డెంగీ నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు సూచించారు. సిద్దవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం డెంగీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీహరి, వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవోల సస్పెన్షన్‌కు డిమాండ్

డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ ప్లేస్కూల్స్, ప్రాథమిక పాఠశాలల అనుమతి, నిర్వహణలో ప్రైవేట్ యాజమాన్యాల నుంచి రూ.లక్షలు వసూలు చేసి అనుమతులు లేకపోయినా పాఠశాలలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మహేష్, కార్తీక్, యశ్వంత్, జోసెఫ్, ఆకాష్‌కుమార్, అబూబకర్ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

గువ్వల చెరువు ఘాట్‌రోడ్డులో శాంతి హోమం

ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : కడప-రాయచోటి రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌రోడ్డు అభయ హస్త ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో శాంతి హోమం నిర్వహించారు. ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుకున్నారు. మృత్యుంజయ హోమం, సుదర్శన హోమం, కాలభైరవ హోమాలు నిర్వహించారు. రాయచోటి తహసీల్దారు నరసింహకుమార్, బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ, వారణాసి శ్రీధర్‌శర్మ, జగదీష్, సుబ్బరాజు, భాస్కర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం

వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

అరవిందనగర్ (కడప): నగరంలోని కృపాకాలనీలో భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కృపాకాలనీలోని న్యూనేటివ్‌కృపా మందిరంలో పాస్టర్ మహేశ్, సిస్టర్ శాంతమ్మ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ మహేశ్ మాట్లాడుతూ.. మతస్వేచ్ఛకు భంగం కలగకుండా పాలకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బుడగజంగం నాయకులు శ్రీరాములు, రాజు, క్రైస్తవ సంఘం ప్రతినిధులు రవితేజ, శాంతిరాజు, నరసయ్య, సరళ, సుగుణమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామచంద్రాపురంలో పర్యటిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. గురువారం కడప నియోజకవర్గంలోని రామచంద్రాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు వైకాపా నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత వైకాపా పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించారు.

చెన్నూరు: తెదేపాతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రామనపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కేసీ కాలువ ఛైర్మన్ తాడిగొట్ల సుబ్బారెడ్డి నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి, వేల్పుల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పులివెందుల: గత వైకాపా పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెదేపా పులివెందుల నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పులివెందులలోని నగరిగుట్టలోని రామాలయం వీధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో అమలు చేసిన పనులను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు పులివెందులలోని తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్‌బాషా, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలో బీటెక్ రవికి సమస్యలు వివరిస్తున్న మహిళలు

వేముల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. నాయకులు శేషారెడ్డి, సత్యమారెడ్డి, ఓబులరెడ్డియాదవ్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు

తొండూరు, న్యూస్‌టుడే : తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రతిపాదికన బోటనీ బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మురళీధర్‌రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న వారు ఈ నెల 5న పూర్తి వివరాలను కళాశాలలో అందజేయాలన్నారు.

రామిరెడ్డి ఫార్మసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

కళాశాల ఆవరణలో కేకు కోస్తున్న ఛైర్మన్ ఈశ్వర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సీకే దిన్నె మండలం ఊటుకూరు సమీపంలోని రామిరెడ్డి ఫార్మసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి వచ్చినట్లు కళాశాల ఛైర్మన్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేకు కోసి అధ్యాపకులు, విద్యార్థులకు అందించారు. తమ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడం మరింత బాధ్యతలను పెంచిందని పేర్కొన్నారు. కరస్పాండెంట్ గౌతమ్, కార్యదర్శి జయసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ నెల్సన్ పాల్గొన్నారు.

ఒరిజినల్ SSC MARKS LIST పోయినది

బత్తిన నాగమల్లారెడ్డి, తండ్రి బత్తిన వీరారెడ్డి, వయస్సు 40 సం॥లు, డోర్ నెం : 1/34, పెండ్లిమర్రి గ్రామం, పెండ్లిమర్రి పోస్ట్, పెండ్లిమర్రి మం., వై.యస్.ఆర్. కడప జిల్లా. ఒకచోట నుండి ఇంకొక చోటికి ఇల్లు మారుతుండగా SSC మార్క్స్‌లిస్ట్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

CELL : 7702070678

DOCUMENT MISSING

I hereby given upon a notice to the public my client **B. GEETHALAKSHMI,** W/o BIYYAPU RAJASEKHAR has lost her original documents for the property bearing **an Extent 1438 Sq.yards in Swarnamukhi Towers** in Tiruchanoor Revenue Village, Thanapalle Road, Tirupati Rural Mandal bearing Document No.**7629/2011** registered on **dt.12.12.2011.** while documents were hanged in a cover to her scooty at Meda Function Hall outside. If there is objections regarding this property the claimants shall approach within 7 days from the date of this Notice to the below mentioned contact number: **Cell No.91778 20534.**

In the Court of the Honourable Principal Senior Civil Judge, Kadapa
E.P.No. 52/2021/ O.S.No. 8/2008

Chittari Hariraja, S/o Late Narasimhulu, Hindu, aged 62 years, residing at D.No. 2/624-3, Nehru Nagar, Kadapa City.
..Petitioner

Vs

K. Bhopal Singh, S/o Karan Singh, Hindu, aged 47 Years, Proprietor : Raj Kamal Ready Mades, Residing at D.No. 13/595, Y.V.Street, Kadapa City.
..Respondent

నోటీసు

పై పిటీషన్‌లో పిటీషనర్/డిక్రీ హోల్డర్, రెస్పాండెంట్ అయిన మీపైన రాజ్‌కమల్ రెడీమేడ్ షోరూంలో గల చరాస్తులను వేలం వేయమని పై పిటీషన్ ఆర్డర్ 21 రూలు 64 సి.పి.సి. కింద దాఖలు చేసి ఉన్నారు. సదరు చరాస్తులు గోడమండల అశోక్‌కుమార్ వారి ఆధీనములో ఉన్నవి. సదరు చరాస్తులను వేలం వేయుటలో రెస్పాండెంట్ అయిన మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల 7/7/2025 తేదీన పై కోర్టు నందు ఉదయం 10.30 గంటలకు హాజరు అయి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.

//By Order of the Court//
V.Rama Mohan, K.Rama Mohan, B.Akbar Ali Khan,
Advocates, Kadapa.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu